UNIVERSAL LIBRARY
OU_206170
UNIVERSAL LIBRARY

OUP—902—26-3-70—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No 294.592 .V46S   Accession No P.G. T3293

Author వేంకటసుబ్రహ్మణ్యశర్మ, జనమంచి

Title శ్రీమదాంధ్రవచనము దేవీభాగవతము.

This book should be returned on or before the date last marked below

శ్రీ

మహాభాగవతము

(దేవీపురాణము)

Post Graduate Library
College of Arts & Commerce, O. U.

అనువాదకుఁడు

కావ్య-పురాణ తీర్థ, విద్వాన్

జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మ

ప్రకాశకులు

రాయలు అండ్ కో.,

విద్యావిషయక ప్రచారకులు

కడప ::: మద్రాసు-1

కాపీరైటు రిజిష్టర్డు] [వెల రూ. 10-00

శ్రీమత్త్రిపురసుందర్యై నమః.

అవతరణిక

సుధాసిన్ధోర్మధ్యే సురవిటపి వాటీ పరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే,
శివాకారే మంచే పరమశివ పర్యంకనిలయాం
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీమ్.

ఆస్తికవరేణ్యుల కోకమనవి మహానుభావులారా! ఆనందములెన్నియేనిగలవు. అందు మానసానందమొకటి. అది యనేకవిధములుగా నుండును మనస్సునకు నిర్వృతి కలుగుటకు మార్గములన్నియు నొకగమ్యమును బొందించును. ఒక్కొక్కవ్యక్తి ఒక్కొక్కవిధముగ మానసంబునకు సంతృప్తిని గల్గించుకొని చొక్కుచుండును. "రుచీనాం వైచిత్ర్యా దృజుకుటిల నానాపథజుషాం నృణామేకో గమ్యస్త్వమసి పయసామర్ణవ ఇవ" యను పెద్దల సూక్తి ననుసరించి యొక్కొక్కరీతిగ నొక్కొక్కఁడు తన యనుభవమున వ్యవహరించుచు నానందించుచుండును. అన్నియు నొక్కటే యనుట తాత్పర్యార్థము "కొన్నిజీవులు మొఱపరాగ్గాతికి బ్రతుకు, కొన్ని నెలపోఁగవెన్నెలల్ గ్రోలి బ్రతుకు"-అన్నట్లు జీవనమున ఒక్కొక్కరి కొక్కొక్క విధముగ సంతృప్తికల్గుచుండును కుడ కాహ్లాదము సమానమే. ఈ రుచిభేదములలోఁ గొందఱకుఁ బురాణపఠనము పురాణరచనము. కవిత, తద్రసపానము సైతము ప్రధానముగఁ గనఁబడును. అయినను తనకు దేని నానందము, సంతృప్తి కలుగుచున్నదో యెల్లరును నట్టి విధముగనే యానందింతు రనుకొనుటయుఁ దగినభావముకాదు. తన భావముననుసరించి యితరు లానందింపఁ గూడదాయని యనుకొనుటయుఁ దగనిదే. తాను తన యూహననుసరించియుఁ దనయభిరుచి ననుసరించియు నానందమును బొందుచు, నితరులు తనమార్గమును దనయానందమునుగూర్చి పరిహసించుచున్నవా రనుకొనుటయుఁ దగనిదే. ఎవరేవిధముగఁ బరిహసించినను, దనకుఁగల్గుచుండు నానందపుఁద్రోవను దానువదలఁడు. తనయానందమే తనకు సంతృప్తి నొసఁగుచుండ నితరుల సంప్రదింపులలోను, నితరుల యపోహలలోను బనిలేదను కొనుట స్వభావసిద్ధము. ఏవ్యక్తికైనను నేయానందమును లేక మనఁజాలఁ డనుట నిర్వివాదాంశము లోకములో నానంద ప్రదములగు విషయము లనేకము లున్నను వారివారి ప్రారబ్ధవశమున నొక్కొక్కటి వారివారి కాదృతి నిచ్చుచుండును. అపుడు వార లిదనుభూతిఁ జొక్కి విహరించుచు మైమఱచుచుందురు. తాఁగావించుపని తనకెంతయు మధురముగను దోషరహితముగను గనఁబడుచుండును. "తాను మునిఁగినది గంగ, తాను వలఁచినది రంభ" యనునట్లు తాఁజేసిన యేకార్యమేనియుఁ దృప్తినిచ్చుచుండు ననుట యెల్లరకుఁ దెల్లమే. కవితయును నానందముకూడ "సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్" అన్న సూక్తిననుసరించి రాజ్యభోగము ననుభవించుచున్నట్లు తోఁచును.

" విబుధలోకంబు కవితైవవిద్య యనుచుఁ జదువువచనార్థముననుసంశయముగలదె?
విద్యలకు నెల్ల నుత్తమవిద్య కవిత, దానిఁ దెలియుట విశ్వమంతయును గనుట."

" జననాథాగ్రణి యాత్మరాజ్యమున నిచ్చల్ పూజ్యుఁ, డాసీమఁ ద్రా
సినఁ దా గవ్వయుఁ జేయఁ, డన్నికడలన్ శ్లాఘ్యుండు విద్వాంసుఁ; డా

యనకన్నం గవి మేటియా, "సుకవితా యద్యస్తి రాజ్యేన కిం"
మ్మను వాక్యంబు నిజంబు, దీనిఁ గని కావ్యంబుల్ రచింపం దగున్"

అను అప్పకవి సూక్తిననుసరించి లోకమునఁ గవి రచన కుపక్రమించి యానందమును బొందుచుండును.

ఈ కావ్యరచనమునను గొందఱు స్వతంత్రరచనలుచేసి యానందింతురు. కొందఱు పురాణాదుల వేఱొక భాషనుండి యనువదించి సంతృప్తినందుచుందురు. కొందఱు ఖండకావ్యములను వ్రాసియుఁ, గొందఱు మహాకావ్యములను రచించియుఁ, గొందఱు భావకవిత యని స్వేచ్ఛచేఁ గొన్ని రచనలు చేసియుఁ, గొందఱు పలువిధము లయినరీతుల భాషాసేవచేయుచును మనస్సునకు సంతృప్తిని గల్గించుకొనుచు నానందించుచుందురు. 'కాకిపిల్ల కాకికిముద్దు' అనునట్లు తనకృతిని తానుగాంచి సంతుష్టు లగుచుండుట కొందఱకుఁగల స్వభావము. తనరచనలోని లోపములను గుర్తింపక యదియే యుత్తమమని భావించుటయు నైజమే. ఈ స్వాభావిక పరిస్థితి ననుసరించి యేనును, కవితాచమత్కృతి లేక యున్నను, నేదియేని పద్యము వ్రాయుచు నానందించుచుందును. ఇట్లు మెలఁగుటలోఁ క్రమక్రమముగ నొకగ్రంథము వ్రాసిన బాగుగా నుండునేమో, లోకమున భాషాసేవచేసినవాఁడ నగుదునేమో యను భ్రాంతి కలవాఁడనై తలంచుచు, దీన నాకొక యుచ్ఛస్థితి మర్యాద కల్గుననియు నజ్ఞానమున భావించితి. ఈభావనాపరంపరలలోఁ బడి కొండొక రచనలు చేసితి. కాని యొక పురాణానువాదముచేసినఁ జతుర్విధపురుషార్థములలోఁ జతుర్థపురుషార్థ మబ్బునను నమ్మకము నాకుఁగలిగెను. పురాణములే యేల, యితరములేల చేయరాదను ప్రశ్న కలుగకమానదు. పురాణార్థపరిజ్ఞానకొఱకుఁ బ్రయత్నించి యందు తీర్ణుఁడనయి పురాణార్థయను బిరుదము కలకత్తాసంస్కృత సమితిచేఁ బొందియుండుటచే నందు నభిరుచి యెక్కువయని మాత్రము తెలుపఁగలను. మహాపురాణములలోఁ గొన్నిటిని మావిద్యాగురువులగు కీ. శే. అభినవాంధ్ర వాల్మీకి వ్యాస కళాప్రపూర్ణ బిరుద విభూషితులగు శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారనువదించి యుండుటయు గురూపదేశ ప్రాబల్యమునఁ బురాణములపై నెక్కువ మక్కువ యుదయించినది.

పురాణములు పదునెనిమిది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్
అనాపలింగ కూస్కాని పురాణాని పృథక్పృథక్.

అనఁగా మత్స్యమార్కండేయములు, భాగవతభవిష్యపురాణములు, బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్తములు, వామన, వాయు, వారాహ, విష్ణుపురాణములు, అగ్ని, నారద, పద్మ, లింగ, గారుడ, కూర్మ, స్కాందములు అనునవి పదునెనిమిది. ఇవిగాక సనత్కుమారము, నారసింహము, నారదీయము, శైవము, దౌర్వాసము, కాపిలము, మానవము, ఔశనసము, వారుణము, కాళికము, సాంబము, సౌరము, ఆదిత్యము, మాహేశ్వరము, భాగవతము, వాసిష్ఠము, బ్రహ్మాండము, గాణాపత్యము అనునవి పదునెనిమిది ఉపపురాణములని గణింతురు.

ఈ పదునెనిమిది సంఖ్యయం దొక మహిమ యున్నది. శ్రీ వేదవ్యాసమునీంద్రుఁడు దీనికి జయ మను పేరిడెను. సాంఖ్యశాస్త్రము ననుసరించి జయయనఁ బదునెనిమిది సంఖ్యయగును. జ ౮ య ౧ = ౧౮. ఈ రెండింటిని కూర్పఁగాఁ దొమ్మిదియగును. ఇది సంఖ్యలోఁ బరమావధియగును. ఏయంకెతో నేదియైనఁ జేర్పఁబడి యుండును.

ఈ తొమ్మిదవ సంఖ్యకుఁ బ్రాశస్త్యము ఋగ్వేదమున

"నవానాం నవతీనాం విషస్య రోపుషీణాం। సర్వాసా మగ్రభం, నామారే అస్య యోజనం హరిష్ఠా మధుత్వా మధులా చకార"

అని గలదు. ఇఁక వ్యాసాదుల పదునెనిమిది సంఖ్యాభిరుచి. పురాణములు పదునెనిమిది. ఉపపురాణములును బదునెనిమిదియే. స్మృతులును నంతియే భారతమునఁ బదునెనిమిది పర్వములు. భగవద్గీత పదునెనిమిది యధ్యాయములు. భారతసైన్యము పదునెనిమిది యక్షౌహిణులు. భారతయుద్ధము పదునెనిమిది దినములు. దేవగణము లష్టాదశ; విద్యలు పదునెన్మిది. సూత్రములు పదునెన్మిది. పరిశిష్టలు పదునెనిమిది ద్వీపములు పదునెనిమిది. ప్రబంధమునందుండఁదగిన వర్ణనలు పదునెన్మిది. శక్తిపీఠములును పదునెన్మిదియే. బంధకవిత్వ మష్టాదశవిధము. ఈ విధముగాఁ బదునెనిమిది సంఖ్య యెంతయుఁ బ్రాముఖ్యమునందినది

పురాణములలో భాగవతము అష్టాదశపురాణసంఖ్యలోను, ఉపపురాణసంఖ్యలోను గలదు. పెద్దల సమితులలో భాగవతనిర్ణయమున దేవీభాగవతమా, శ్రీభాగవతమా పురాణ సంఖ్యలోఁ జేరిన దను చర్చ పూర్ణముగ సాగినది. కాని యానిర్ణయ మింతదనుకఁ దేలలేదు. అభిరుచినిబట్టి రెండింటియందొక్కదానిని బురాణసంఖ్యాంతర్గతముగాఁ జేర్కొని వ్యవహారము సాగుచున్నది.

దేవీభాగవతము మహాపురాణాంతర్గతమని శ్రీ ములుగు పాపయారాధ్యులుగారును, శ్రీ త్రిపురాన తమ్మయ దొరగారును, శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవులును, శ్రీదాసు శ్రీరాములు పంతులుగారును, గొంతభాగము శ్రీపురాణము సూర్యనారాయణ తీర్థులుగారును పద్యరూపమున ననువదించిరి. వచనరూపమున శ్రీ నోరి నరసింహశాస్త్రులుగారును, శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ గారును, శ్రీ విద్వాన్ సరిపల్లె విశ్వనాథశాస్త్రులుగారును అనువదించిరి

శ్రీ భాగవతమును సహజపాండిత్య బమ్మెరపోతనామాత్య కవీంద్రులు తెనిఁగించిరి. దొడ్ల భాగవత మనుపేరున దొడ్లవారు తెనుఁగుగావించిరి. మా గురువులుఁ కీర్తిశేషులు కళాప్రపూర్ణులు జనమంచి శేషాద్రిశర్మగారు దశమస్కంధము నాంధ్రీకరించిరి

ఈ మహాభాగవతము పురాణముగా శ్రీ వేదవ్యాసమహామునీంద్రుఁడు పేర్కొనియున్నాఁడు. ఇది యే తెగకుఁ జేరునా యన్న చర్చకుఁ బోవుట యేల? వ్యాసకృతము. భగవతీచరితము. ఇంత మాత్రమే నామనస్సున నిల్చినది.

కాలము మారినది. అభిరుచులు అస్తవ్యస్తములయినవి ఇపు డీరచన యేల? పైగాఁ బురాణ కథ లెవ రాదరింతురు? ఎవరు చదువుదురు? ఇందలికథలన్నియు నపహాస్యజనకములు, కేవల కల్పితములు, సత్యేతరములు అనువారు నూటికిఁ దొంబదితొమ్మిదిమంది గలరే? ఏల యీ గ్రంథ నిర్మితి? దీనఁ గాలము వ్యర్థపుచ్చుట, ధనవ్యయము మున్నగు దోషములు కల వని యందురు. నూటి కొక్కవ్యక్తియైనఁ జదువక యుండునా? అట్టివ్యక్తికే యీరచన యుపకరించునుగాక! అవ్యక్తి యానందమే నాకును నానంద సంధాయకమగునుగాక యను సంకల్పమే పరమేశ్వరి నామదిని గల్పించి వ్రాయించినది.

పురాణమనఁగ పురాపీయతే యనియు, పురాపి నవా యనియు వ్యుత్పత్తి పెద్దలు చెప్పిరి. ప్రాఁతదైనను గ్రొత్తదివలెనుండి పలుమఱు చదువునట్లును మననముచేయునట్లును చేయుట పురాణమునఁగల ప్రభావము. ప్రాచీన గ్రంథములను జదివినఁ గలుగు లాభము లనుభవజ్ఞులకే

తెలియును. పురాణములు చప్పిడి గ్రంథము లనువారును వీనిని జదివి వీనిలోఁగల విశేషముల నరసి యానందించుచుందురు వీనియందుఁ జెప్పంబడిన శాస్త్రీయములగు నంశములను భౌతికములు, రాసాయనికములు మున్నగువానిని గన్గొని విమర్శించి యానందించువారును గలరు. ఇట్టివి యే ప్రయోగశాలలు లేకయే దివ్యదృష్టితోఁ బెద్దలు కరతలామలకములుగఁ బురాణముల యందు నిర్వచించియున్నారు ప్రపంచ చరిత్రలు తెలియవలసినఁ బురాణములే యాధారములుగ నెఱుంగవలయును. ఈ పురాణములను జక్కఁగఁ జదివి యందుఁ బరిశ్రమించినచో నద్భుతాంశములు సుస్పష్టముగఁ దెలియవచ్చును. కేవలము గడచిన విషయముల నేకాక రాఁబోవు పరిస్థితులను బురాణములు విశదీకరించుచున్నవి. త్రికాల వేత్తలు కావలయునన్నఁ బురాణపఠన మత్యావశ్యకము కావున మనుష్యులగు వారు పురాణముల నెఱుంగవలయును. పురాణములు చేయు నుపకృతి మఱే యేవియు మర్త్యులకుఁ జేయఁజాల వనుట నిర్వివాదాంశము. ఇందుఁగల కథలన్నియు నీతిబోధకములు భక్తి జ్ఞాన వైరాగ్యముల నుపదేశించుటకు గురువులే పాపకృత్యముల నడంచుట కియ్యవి యే సాధనములు "అఘమువలన మరల్చు, హితార్థకలితుఁ జేయు, గోప్యంబు డాచుఁ, బోషించు గుణము, విడువఁ డాపన్ను, లేవడి వేళ నిచ్చు, మిత్రుఁడీలక్షణంబుల మెలఁగుచుండు" నను భర్తృహరి సూక్తిసార్థకమగునట్లు మిత్రునివలె నీపురాణములు సకల విధములఁ దోడ్పడఁగల వనుటలో సంశయము లేదు ఒక్కొక్క విషయమును లక్ష్యలక్షణముగ వివరించుటలోఁ బురాణములకంటె వేఱొకటి లేదనవలయును. వీనియందుఁగల యుపాఖ్యానములలోఁ జక్కని నీతి, దుష్ప్రవృత్తివలనఁ గలుగు దోషములు విస్తరింపఁబడియుండును సమాజశిక్షకు వీనికంటె నెయ్యవియు సహకారులు కాఁజాల వనవలయును ఇప్పటి యుబుసుపోక నవల లను గ్రంథములవలెఁ గాక పురాణములు స్థిరమయి మఱిమఱి పఠింపఁదగినవి చదువుకొలఁది క్రొత్త క్రొత్త విషయముల గోచరింపఁజేయుచుండును. విసుగును బుట్టింపవు. కేవల కాలక్షేప కరములుగావు తత్త్వదృష్టి నవలోకించినచో వీనఁగల మహిమ యమేయ మనిమాత్రము చెప్పవలయును. కావున సాధునికులయూహలో పురాణములు వ్యర్థము లనుట వ్యర్థము

ప్రకృత మనువదించిన యీమహాభాగవత పురాణము పంచలక్షణ సమన్వితమయి మహాపురాణ లక్షణములు పట్టకయున్నను శ్రీవేదవ్యాస మహర్షి ప్రణీతమనియు, దేవీమహిమ ప్రతిపాదకమనియు సంకల్పముచేఁ దెనిఁగింపఁబూనుకొంటిని. యథామతి దోషరహితముగ సులభ బోధకముగ వ్రాయుట నాసంకల్పము. ఇందలి దోషములను గమనించి నాకుఁ దెల్పుటయు దిద్దుటయు విజ్ఞుల భారము క్షమించుట యంతకంటె బాధ్యత యయియున్నది.

ఈ భాగవతము ఎనుబదియొక్క యధ్యాయములు గల్గియున్నది వ్యాసముని సంకల్పనిష్ఠ ననుసరించి సాంఖ్యగీతి వ్యత్యయముగ నెన్నినఁ బదునెన్మిది యగునుగదా? లేదా రెండంకెలు కూడినఁ దొమ్మిది యగును. ఆహా! యేమి యామునీంద్రుని సంకల్పము! తొమ్మిదవ యంకెపైఁగల మక్కువ! ఇందుఁగల కథాభాగము లతివిచిత్రములు పాఠకమహాశయులకుఁ బ్రత్యేకముగ మున్ముందుఁ దెలుపనేల? విషయసూచిక యున్నది కథాభాగము కన్గొనుటకు. అక్కారణమున నింగుఁ గథాసంగ్రహము వ్రాయఁబడలేదు. కవితాచమత్కృతిగల కవులరచన నేరగింపవచ్చు స్వతంత్ర రచన కాదనియుఁ, గేవలము మక్కీకి మక్కీయనియు వ్రాయవచ్చును. అభిరుచి చూపకపోవచ్చును. సరళముగ విషయము లోకమున వెల్లడింపఁజేయవలయునను నూహతో నున్న విషయము తెలుఁగుబాసను వ్రాసినాఁడ. అందును వచనముగాఁ గాక పద్యము అల్లినాఁడను. ఛందోవ్యాకరణాది దోషములు పెక్కులుండనోపు. 'ప్రమాదో ధీమతా మపి' యను సూక్తి మఱని

నుంచుకొన్నచో "విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం, నహి వంధ్యా విజానాతి గుర్వీం ప్రసవవేదనామ్" అనునట్లుగ నీయనువాదమునఁగల శ్రమ అనువాద రచయితల కెఱుకయే. యథామూలముగఁ దెలిఁగించితిని. ఇందు నాస్వాతంత్ర్యము సున్న దేవీకరుణయే మూలము.

నామనస్సున నీమహాభాగవతమును గూర్చి "భగవత్యాశ్చ దుర్గాయాః చరితం యత్ర విద్యతే, తత్తు భాగవతం ప్రోక్తం నతు దేవీ పురాణకమ్. ముఖ్యదేవతా సంబంధః - తతశ్చ దుర్గాచరితం యత్రవర్తతే తద్భాగవత మిత్యర్థః" అనియు, "హరిర్ద్వాభ్యాం రవిర్ద్వాభ్యాం ద్వాభ్యాం చండీ వినాయకౌ, ద్వాభ్యాం బ్రహ్మ సమాఖ్యాతః శేషేషు భగవాఞ్ఛివః" అన్న ప్రామాణ్యమును బట్టియు నీపురాణము మహా పురాణ మని తలంచి తెలుఁగు సేయ నుపక్రమించితి.

విశ్రాంతి యించుకయయిన లేని యుద్యోగముననుండి ప్రతిదిన మొకటి రెండు పద్యములుగాను, గొంత విశ్రాంతి యలవడిన నాఁడు పది పద్యము లించుమించుగను వ్రాసి ముగింపఁగల్గితి

'గచ్ఛత్పిపీలికాపంక్తిః సముద్రమపి గచ్ఛతి' యనురీతి గాఁ బూర్తియయ్యెను. పదిదినములలో నీగ్రంథము వ్రాసితి, నెలలో వ్రాసితి నను పెద్దలవలెఁ గాక యీగ్రంథము 18571 శ్లోకములను గలిగియున్నను. 1933 వ వత్సర మారంభించి నడుమ నడుమఁ గొన్ని యాటంకములచే రచన నిలిచిపోవుచున్నను, శ్రీమ గంగాయాత్రవలె మూఁడువేలు నాలునూట పందొమ్మిది పద్యములలోఁ బూర్తిచేయఁగల్గితి అందందు వచ్చిన స్తోత్రములు సహస్రనామములు పద్యములుగాఁ గాక వచన రూపమున వ్రాసి (కేవలము తెలుఁగు ప్రత్యయములతో నింపి) మూలమునుగూడఁ గ్రిందిభాగమునఁ జేర్పఁగల్గితి ఆస్తికులకు నీస్తోత్రములు పరనార్థముగ నుండుననుటయే నాయుద్దేశము

పీఠిక రెండువందల తొంబది తొమ్మిది పద్యములు గలదు అందు నాజీవితముఁ గొంతవఱకు విశదపఱచితిని. నాయనంతరము ప్రదేశ నిర్ణయమునఁ దగవులు, చర్చలు కలుగకయుండునట్లు నివాసాదికము స్పష్టపఱచితిని.

గ్రంథ రచన పందొమ్మిది వందల నలుబదవ వత్సరమున ముగిసినది. అనఁగా ప్రమాథి వత్సర పౌషకృష్ణ తృతీయా భార్గవవాసరము కాని యీగ్రంథ మేరీతిగ లోకమునఁ బ్రవేశింపఁ గలదు, నాకృషి యెట్లు సార్థకము కాఁగల దన్న యూహ మనస్సును గలఁతపెట్టినది. ఒక్కొక్కరి ప్రాక్తన పుణ్యవిశేషమున వ్రాసిన రచన లోకములోనికి వెంటనే రాఁగలదు ఒక్కొక్కరి రచన యెంత యత్నించినను రాక పాతాళమునఁ బడియుండును దీనికంతయు వారి వారి యదృష్టము ననుకొనవలయును గాని, చింతించి లాభము లేదనుకొంటిని కొంతకాలము జరగను.

బ్రహ్మవైవర్తమునందలి బ్రహ్మఖండమును యథామూల మాంధ్రీకరింపఁ బ్రారంభించితిని. అదియును బదునాలువందలు ఇరువదియొక్క శ్లోకములు సంస్కృతమునఁ గలదు. దానిని బదునాలువందలు ఏఁబదిరెండు పద్యములుగా వ్రాసితి ఆ గ్రంథముకూడ వ్రాఁతలోనే యున్నయది. ఈ రెండును గేవలము దిక్కులేని దీనస్థితినొంది మూలఁబడియెనే యను చింతతోఁ మరలఁ బద్యరచనకుఁ గడంగనైతిని

మిత్రు లెందఱో గలరు. ధనవంతులును నున్నారు కాని, యాచించు స్వభావముగాని నా పరిస్థితిని దెలుపుకొను స్వభావముగాని లేని నా యీ కృతు లెట్లు పైకివచ్చుట ? - ఇది పొసఁగని పని యనుకొంటిని నిస్పృహుఁడనైతిని.

ఇంచుమించుగ నే నీ గ్రంథ మారంభింపకముందే వణిగ్రత్నము, వైశ్యకులాలంకారులగు శ్రీ జక్కా సుబ్బరాయలు శ్రేష్ఠిగారు కడపలో గృహ సరస్వతీ బుక్ డిపో యను పేరున నొక సంస్థ నుంచి, ఆంగ్లభాషలో అడ్రసులు మున్నగువానిని గురువుల తోడ్పా టక్కఱలేక

యుండవలయుటకై "కృష్ణా సరస్వతి" యను పేరున నొక గ్రంథమును జేబులో నిముడఁదగిన దానినిగ ముద్రింపించి ప్రకటించి, ప్రజలలో బాగుగఁ బ్రచారములోనుండిన గ్రామఫోను పాటలు, పండరికీర్తనలు మున్నగువానిని ముద్రింపించి విక్రయించుచుండిరి. అప్పుడే పుష్పగిరి మాహాత్మ్యము అను గ్రంథమును వచన రూపముగ వ్రాసియిచ్చితి దానిని ముద్రించిరి. అది పాఠశాలలకుఁ బఠనీయముగా దొరతనమువారి యంగీకృతి నందినది శతకములు మున్నగు నవి తప్పుల తడకలుగను చదువుటకు వీలులేనివిగను నుండుటవలన వానిని సంస్కరించి చక్కని యచ్చునఁ గూర్పించి జనబాహుళ్యమున కందించి యాంధ్రభాషా సేవచేయవలయునను సంకల్పము వారికిఁ గల్గినది. నాతో నీవిషయము ప్రస్తావింపఁగా ఈకార్య ముత్తమోత్తమ మనియుఁ దప్పక చేయఁదగిన దనియు సలహానిచ్చితిని ఈ కార్యమున నన్ను సాయము చేయఁగోరిరి. మంచిదని తెలుఁగు లోకమునఁ బ్రచారమునఁ గల శతకములను జక్కగ సంస్కరించి విరామ చిహ్నములు మున్నగునవి జతపఱచి గ్రంథకర్తలఁగూర్చి కొలఁది మాటలు ప్రతి శతకమునకును వ్రాసి యిచ్చుచు వచ్చితి తర్వాత శతకములకు టీక లున్న బాగుగనుండు నను సంకల్ప ముదయించినది. అమరము ప్రథమకాండము మొదలు శ్రీ సుబ్బరాయలుగారి ప్రచురణము లగు శతకములకు టీకలు వ్రాసియిచ్చితి. వారు అన్నియు సుస్పష్టముగఁ జక్కని యక్షర ములతోఁ బ్రజల కాదృతి గల్గు రీతి ముద్రింపించి ప్రచారముఁ గావించి మెప్పును పొందిరి శతకములు లోకమునఁ జక్కని వ్యాప్తినిఁ గాంచుచువచ్చెను

ఆంధ్రభాషా పోషకుఁడు శ్రీ కృష్ణదేవ రాయలు వసతి రాయలసీమ పేరు సుబ్బరాయలు కాఁబట్టి తన పుస్తకాలయమును "రాయలు అండ్ కో" యని మార్చుట బాగుగనుండునని మార్చిరి. అప్పటినుండియుఁ బాఠశాలలకై 'రాయల వాచకము' ల ప్రచురణ మారంభమయ్యెను. ప్రచురణ కర్తలలోఁ జక్కని సేవచేయుచుఁ బెద్దల మన్ననలను బొంది సుప్రసిద్ధులయిరి. కేవలము ధనార్జనమే వృత్తిగానుంచుకొనక రాయలసీమ కవులలో నేగాక సకలాంధ్రదేశమునఁగల కవుల తోడను, పండితులతోడను, ఉపాధ్యాయులతోడను గ్రంథముల వ్రాయించి 'రాయల అండుకో' కీర్తి వ్యాపింపఁజేయుచు భాషాసేవ చేయుచుండుట యెల్ల రెఱింగిన విషయమే.

నాకత్యంత మిత్రులును, నా నూతన కైకొనియే యే గ్రంథమునైనఁ బ్రచురింపఁ బట్టుదల గల్గినవారును నగు శ్రీ జక్కా సుబ్బరాయలుశ్రేష్ఠిగారితో సందర్భవశమున నా మహా భాగవతపురాణ రచననుగూర్చి తెల్పితి కాగితముల కఱవుకాల మగుట వారేమియుఁ బ్రత్యుత్తరముగాని యా విషయమునుగూర్చిన యభిప్రాయమునుగాని తెలుపరైరి ఇట్లు కొంతకాలము జరిగెను

పరదేవి ప్రేరణమే యనవలయును. ఉన్నట్లుండి యొక్కనాఁడు మీ పుస్తకమును ముద్రించు మాట యనలేదేయని దేశకాల పాత్రముల యోచించి మీకుఁగల పనుల తొందరలలోఁ బ్రస్తావింపలేదంటిని మఱియు నా, మీ జీవితకాలములోనే యీ గ్రంథము లోకమున కందించుట నా కానందదాయకము, మీకు శ్రేయోదాయకముగా నుండునని తెల్పినాఁడను. మంచిదని సత్వరమ మొసఁగి గ్రంథమును మదరాసునకుఁ గొంపోయిరి. తొల్లి ఒక్క పర్యాయము మద్దులేటి నరసింహశతక మను చిన్ని శతకమును వ్రాసిపంపఁగా వెంటనే ముద్రింపించి యిచ్చిరి. ఈ గ్రంథమును ముద్రింతు రన్న సంతసము నాకుఁ గల్గినది.

ఈ గ్రంథమా పెద్దది. వ్యయప్రయాసలు పడవలసినదే. ధనవ్యయము మిక్కుటముగ నుండునే యెట్లో యని నా మనస్సునఁ దలంచుచునేయుండఁగా మొదటిభాగ మారంభించి నా యంగీకృతిఁ బంపిరి. ఆనాఁటి యానందము నా జీవితమున నేనెన్నఁడు ననుభవించియుండ

జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మ — శ్రీ మహాభాగవతము - గ్రంథకర్త

జక్కా సుబ్బరాయలుశ్రేష్ఠి — రాయలు అండ్ కో. వ్యవస్థాపకుడు

వని చెప్పఁగలను. బాగుగానున్నదని నా యంగీకారమును తెల్పితిని. 'నిందుబంధీ శేష బరువా'యన్నట్లు నైగాని అటువంటి ఘోరముల గ్రంథమును సంపూర్ణముగఁ జక్కని యచ్చున రాయల్ సైజున ముద్రింపించి ప్రకటించిరి ప్రూఫుల దిద్దుపని యయిన నాకుఁ గల్గింపక సర్వవిధములగు కార్యములు నిర్వహించుట చూడఁగా నాయందుఁగల నిర్వ్యాజప్రేమ యెంత యని పొగడఁగలను? వీరు చేసిన యీ భాషాసేవ మఱువరానిది. ఉద్గ్రంథములను ముద్రింపించి ప్రకటించుటలో వీరికిఁ గల యుత్సాహమును, ఓపికయు, శ్రద్ధయు ఆంధ్ర భాగవతమును సలక్షణముగాఁ జక్కని యచ్చున విరామ చిహ్నములతో సచిత్రముగఁ జదువుకొనుట కనువుగ ముద్రింపించి 16-4-1954 వత్సరమున బమ్మెరపోతనామాత్యుని యిష్టదైవమగు ఒంటిమిట్టయందలి శ్రీకోదండరామస్వామిసాన్నిధ్యమున గొప్ప పండితసభ జరిపి పండిత బహూకృతులఁ గావించి శ్రీకోదండరామస్వామి పాదారవిందముల సమర్పించుటయు, మఱియు ఉత్తరరామాయణము, రంగనాథరామాయణము, అమరకోశము త్రికాండము సటీకము మున్నగునవి లోకమున వెలువరించుటయును సాక్ష్యములుగాఁ దెలుపుచున్నవి భాషకొఱకుఁ బలుశ్రమలకు లోనయి సర్వదా సర్వథా యత్నించుచున్న శ్రీ రాయలు అండ్ కో యజమానులగు శ్రీ జక్కా సుబ్బరాయలు శ్రేష్ఠిగారు మిగుల నుదారభావములోను, నాయందలి గౌరవములోను సందర్భవశమునఁ బలికిన నామాటను పాటించి గ్రంథముద్రణము చేయించి ప్రకటించుట యెంతయుఁ గొనియాడఁదగిన విషయము గ్రంథమా చిన్నదికాదు పెద్దది ఇంతటి కార్యక్రమమునకుఁ బూనుకొనిన రాయలు అండ్ కో యజమానుల కెంతయుఁ గృతజ్ఞుఁడను. ఇట్లే మున్ముందును నావంటి నిరాశ్రయులగు వారి గ్రంథముల లోకములోనికిఁ దెత్తురుగాక! భగవంతుఁడు సర్వేశ్వరుఁడు శ్రీ జక్కా సుబ్బరాయలు శ్రేష్ఠిగారికిఁ జిరాయురారోగ్యభాగ్యముల నొసంగి సంరక్షించుఁగాత మని సర్వేశ్వరిని ప్రార్థించుచున్నాను. ఇదియే నాకృతజ్ఞత. తెలుఁగు ప్రజలెల్లరు రాయలు అండ్ కో వారి ప్రచురణములను, ఉద్యమములను గాంచి, పండితులను కవులను గారవించుచు భాషాపోషణమునకుఁ దోడ్పడుదురని మఱి మఱి భాషాప్రియులను ప్రార్థించుచున్నాను

నాయందుఁగల సంపూర్ణవాత్సల్యముచే మైత్రిచే గారవముచే మన్మిత్రులు బ్రహ్మశ్రీ కావ్యతీర్థ విద్వద్విరుదాంకితులు కవితాసామ్రాజ్యము నేలు శ్రీ మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రులుగారు గ్రంథమును మూలానుసరణముగఁ జదివి పరిచయవాక్యములను వ్రాసి నాకుఁ బ్రోత్సాహము గల్గించిరి శ్రీ శాస్త్రులుగారికి సత్సంతాన సౌభాగ్యముల నిచ్చి సర్వదా నావంటివారి కృతుల నుద్ధరింపఁ బరమేశ్వరి తోడునీడయై సంపూర్ణాయుస్సంపదల నొసంగుఁగాత మని ప్రార్థించుచుఁ గృతజ్ఞతఁ దెలుపుచున్నవాఁడను

మహాశయులారా! ఈ రచనమునఁ బెక్కు దోసఁగు లుండవచ్చును దయయుంచి మన్నించి క్షీరనీరన్యాయమున గుణమును గ్రహింతురనియుఁ బ్రోత్సహింతురనియు మరల మనవిచేయుచున్నాను.

కిం వా ప్రార్థనయా౽ పరోపకృతిషు స్వాభావిక స్సద్గుణః, నిందతు నందతు వాసన్నసూయు రనసూయు రత్ర కిం తేన, యత్సన్మానసగమనాయై వేదం మమతు పాథేయమ్.

శ్రీ లలితావిలాసము,
కడప, హేమలంబవత్సరాది
శాలివాహన శకము 1879

ఇట్లు
విన్నవించు పండిత పాదకమల రేణువు,
జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మ.

కూడ దానికిఁ దగినట్లుగనే పరిమితముగ నుండియుండునని తలఁపరాదు. అన్నివిధములైన యనేకసౌకర్యము లేర్పడి యీనాఁ డింతవాఙ్మయము సృష్టింపఁబడినను నేఁటిపాఠకలోక మీనాఁ డనుభవించు నానందముకంటెను, పొందెడి శాంతికంటెను నెన్నిమడుంగులో ఆనాఁ డొక్క వేదవాఙ్మయములోనే వా రనుభవించి రని చెప్పవచ్చును. దుఃఖనివృత్తియే సుఖప్రాప్తి గనుక ఆనాఁటి ప్రజానీకమున కశాంతికరమైన వాతావరణ మిప్పు డున్నంత అప్పు డుండదు. ప్రకృతి, ప్రపంచము నాఁ డెంతో నేఁ డంతే. అవే పంచభూతములు, అదే సూర్యుఁడు, అదే చంద్రుఁడు. కాని నాఁటి జనసత్త్వములు నేఁడు జారిపోయినవి. ఈనాఁడు సౌఖ్య సంపాదన కెన్ని యవకాశము లున్నవో దుఃఖసంపాదనమునకును అన్ని యున్నవి. ఈద్వంద్వ సృష్టిలో వాతావరణము కశ్మలమై యొడుదొడుకులతో అశాంతిజనకముగనున్నది; కాని ఆనందమయముగ లేదు. కనుకనే ఆశించిన యానందము నధిగమించుటకై యేకాలమునకుఁ దగినట్టు లా కాలమున నయ్యైప్రయత్నములు జరుగుచువచ్చినవి. అందులో సారస్వత రంగమున నడచిన ప్రయత్నము లాక కొన్ని

ద్వాపరాంతమువఱకు అఖండముగా నున్న వేదమును ధారణచేయఁగల మేధాసంపన్నులు మున్ముం దుండ రని వేదములను, వైదికకర్మలను ఉద్ధరించునిమిత్తమై ద్వాపరాంతమున వ్యాసభగవానుఁ డవతరించి ఆ యఖండవేదమును నాల్గు విభాగములు చేసి, అందులోను కాండములు, ప్రపాఠకములు, అనువాకములు నని విభజించి శిష్యప్రశిష్యులచేఁ బ్రచారము చేయించెను. అంతటిలో నూరకొనక మఱియు మందప్రజ్ఞులకొఱకై వేదార్థోపబృంహణముగా పురాణములు వ్రాసి చివరకు పంచమవేద మను పేరిట భారతసంహితను సంతరించెను. ఈపాటిరచనలతో నేఁటి కలియుగములోఁ గూడఁ గొంతకాలము గడచినమీఁదట నివియు నవగాహనము చేసికొనఁజాలని పరిస్థితి రానుండఁగా వీనికి మాతృభాషానువాదములు ప్రారంభ మయ్యెను. అవియు నారంభములోఁ బద్యకావ్యములుగా వెలసెను. అవి కొన్నిశతాబ్దములకాల మొకవెల్గు వెల్గినవి. తరువాత ఆపద్యకావ్యము లర్థము గాని దశలో వానికి టీకలు బయలుదేఱినవి. అట్టివి గూడ కొఱుకుడు పడని కాలము రానుండఁగానే గద్యరచనలు సాగినవి. ఆనాఁటి గద్యరచనలు ప్రౌఢము లనిపించిన సూచన లగుపడుసరికి తాత్కాలిక ప్రజల బుద్ధివృత్తుల ననుసరించి యింకను గొంత సర్ళ్యబాటునకు వచ్చి అందులోను కఱకుఁదన మున్న దని మఱికొంత దిగజాఱినది. ఈ జాఱుపాటునకు నిలుకడ యెక్కడనో! ఎట్టి పరిణామములో నిలువఁగలదో! పతనశీలమైన ప్రకృతిలో నిది యొక క్రొత్తవింత కాదు. ఇప్పటికైన యీ పరిణతిక్రమము వైజయంతీవిలాసములోని యీ పద్యమును స్ఫురణకుఁ దెచ్చుచున్నది.

శా॥ ఆవిప్రోత్తము వజ్రపంజరనిభంబై నిశ్చలంబైన స
ద్భావం బంగనసాహచర్యగుణసంపర్కంబునన్ లోహమై
గ్రావంబై దృఢదారువై తరుణవృక్షంబై ఫలప్రాయమై
పూవై తన్మకరందమై కరఁగెఁ బోఁబో నీళ్ళకున్ బల్చనై.

ఇదంతయుఁ బ్రజలలో నేర్పడిన నిర్వీర్యతకు స్ఫోరక మని యొప్పుకొనక తప్పదు. ఇది కలికాలము గనుక కలికాలపరిస్థితులను దలపోసి యేనాఁడో దూరదర్శియగు భావుక కవిశేఖరుఁ డొకఁడు వా యెత్తి యి ట్లాలపించియున్నాఁడో గమనింపఁదగును.

శ్రీ మేధాదక్షిణామూర్తయే నమః.

పరిచయ వాక్యములు

అభిరూపశేఖరులారా!

కో జానాతి జనో జనార్దనమనోవృత్తిః కదా కీదృశీ?

భగవంతుని చిత్తవృత్తి యెప్పు డేవిధముగా నుండునో యెవ రెఱుఁగుదురు? అని భగవత్సంకల్పపు లోఁతుపాఁతులను గూర్చి యొక భావుక కవి శ్రీకృష్ణుని చర్యల నుదాహరణముగాఁ దీసికొని యిట్లని సమర్థించుచున్నాఁడు.

శ్రీకృష్ణుఁడు గోపికల చీర లపహరించుకొని పోయినాఁ డని యందురే గాని యది యెందులకో ఆరహస్యమును గుర్తించినవా రున్నారా?

వాసాంసి వ్రజచారి వారిజదృశాం హృత్వా హఠా దుచ్చకై
ర్యః ప్రా గ్న్వారుహ మారురోహ

ఆనాఁడు గోపికల కట్టుకోకలను హఠాత్తుగ నెత్తుకొనిపోయి చెట్టెక్కి కూర్చుండిన ఆమహానుభావుఁడే

స పున ర్వస్త్రాణి విస్తారయ౯

తా నెత్తుకొని పోయిన చీరల కన్నరెట్లో అధికముగ వానిని పెంచి

"వ్రీడాభార మపాచకార సహసా పాంచాలజాయా స్స్వయం"

కురుసభలో ద్రౌపదికి మానభంగము కలుగనుండఁగా అక్షయవస్త్రములిచ్చి యా మానవతిసిగ్గు కాపాడినాఁడుగదా! కనుక భగవత్సంకల్పములో నేది యెందులకుఁ జేయఁబడుచుండునో యాసంగతి యెఱిఁగినవా రెవ్వ? రని

కో జానాతి జనో జనార్దనమనోవృత్తిః కదా కీదృశీ?

అని యచింత్యమహిముఁ డగు నాభగవానుని యద్భుతశక్తి నభివర్ణించియున్నాఁడు కావున నెప్పు డెప్పు డేదేది జరుగుచుండునో దాని ప్రయోజన మెప్పటికో యుండఁగలదని యూహింపనగును

ఈ దృష్టిలో కావ్యజగత్తును బరిశీలించి చూచినచో ఆదికావ్యమగు రామాయణముకంటె ముందు కావ్యనిర్మాణము లేదనియే చెప్పవలయును. వ్యాసప్రోక్తములైన యితిహాస పురాణాదులకుఁ బూర్వ మవి లేవనియే చెప్పక తప్పదు. అటుతరువాత ఆ కావ్యేతిహాస పురాణాదుల నుండి బయలుదేఱిన నానావిధార్వాచీన సంస్కృతాంధ్ర వాఙ్మయ మంతయు నించుమించు రెండు మూఁడు వేల సంవత్సరముల కావలకుఁ బోదుగదా! ఆనాఁటి ప్రపంచమునకు కావ్యానంద మేస్వరూపములో నుండియుండెనో! అట్టి సారస్వతానందానుభూతి కాలంబన మేది యుండెడిదో! కాని అనాదిసిద్ధమును, అపౌరుషేయమును నగు వేదవాఙ్మయము కావలసినంత యుండనే యున్నదిగదా! అనాఁటివారి కదియే ఆనందసంధాయకమై యుండవచ్చును అందులో లేని దేమున్నది? అనాఁ డింతవాఙ్మయము లేదు గనుకఁ దత్సంపాద్యమగు వాఙ్మదము

శ్లో॥ నిర్వీర్యా పృథివీ నిరోషధిరసా, నీచా మహత్త్వం గతాః,
భూపాలా నిజకర్మ ధర్మరహితాః, విప్రాః కుమార్గే రతాః,
భార్యా భర్తృవిరోధినీ పరరతా, పుత్రాః పితృద్వేషిణః
హా! కష్టం ఖలు వర్తతే కలియుగే, ధన్యా నరా యే మృతాః.

ఈ ధర్మములు కలియుగమున కంతటికిని వర్తింపఁదగినవి గాన 4 లక్షల 32 వేల సంవత్సరముల కలిప్రమాణములో 5 వేల 58 సంవత్సరములు మాత్రమే గడచిన యీ నాఁటికి (శా.శ 1879 క్రీ.శ 1957) మన మేఘట్టములో నున్నారమో యనుభవములో నిర్ణయించు కొనవలసిన విషయమిది. ఇందులో అనుభవసిద్ధము లైన కొన్ని ధర్మములనుబట్టి తక్కినవి గూడ జరిగితీఱవలయు ననుట సంశయాస్పదము గాదు. ఈ శ్లోకనిర్మాణమునాఁటికే నిర్వేదము నొందిన ఆకవి కంఠ ప్రాణము విసిగినదో 'ధన్యా నరా యేమృతాః' అని (గతించినవా రెంత ధన్యాత్ములా! యని)చనిపోయినవారినిగూర్చి శ్లాఘించినాఁడు

ఇట్లు నిమ్నాభిముఖమై నిర్వీర్యమై పోవుచున్న కలికాలగర్భములో పతిష్ఠమైన పద్యప్రబంధము లర్థముగాక ఛందోబద్ధములు గాకున్నను పటుత్వము సడలని గద్యరచనముగూడ కటువై కంఠము పట్టుకొన్న కాలమురాఁగా వర్తమానకాలమున సారస్వతరంగమునందలి పోకడలు భావికాలపుఁ బాఠకలోకమున కుపయుక్తములు కావలసినవిగా నేర్పడినవి వెనుకటి చారిత్రమును సింహావలోకనముచేసి చూచినచో భవిష్యచ్చరిత్రము గోచరింపకపోదు నీరాజన మద్దుకొని పరిమితికి మించిన యుష్ణోగ్రతను, తరువాత తీర్థము పుచ్చుకొని పరిమితికిఁదగ్గిన శైత్యప్రకోపమును బొంది ఆయింతలోనే తబ్బిబ్బులుచేయు సుకుమారప్రకృతిగల నేఁటికాలపుఁ బ్రజానీకమున కతిగ్నముచేయని వాఙ్మయప్రపంచమునకు దిగివచ్చినాము. ఇట్టివాఙ్మయమును సృష్టింపవలసిన బాధ్యత కవితాకళోపాసకులగు కవులను బ్రబోధించినది. అట్టిరచనలను సాగించినది. అట్లు సాగిన రచనలలోనిదే యీ శ్రీభాగవతము.

భాగవతప్రశంస రాఁగానే రెండుభాగవతములు స్ఫురణకు వచ్చుచుండును. ఒకటి విష్ణుభాగవతము. రెండవది దేవీభాగవతము ఏనిలో నొకటి మహాపురాణాంతర్గతముగాను, ఒకటి ఉపపురాణాంతర్గతముగాను చేర్కొనఁబడుచున్నవి మహాపురాణోపపురాణములలోని గణనను బట్టి యొకటొకటైనవు డింకొకటి మఱొకటిగా నెన్నఁబడుచున్నది. వారివారి యభిమానమును బట్టియు, లభించిన యుపపత్తులసమన్వయమును బట్టియు దేనికది మహాపురాణముగానే లెక్కింపఁబడుచున్నది 'ఔను, కాదు' అనుటకు వీలుపడని విప్రతిపత్తు లనేకము లుండును. అపారమైన యార్షగ్రంథములలో విసంవాదములైన యంశము లుండనేయుండును. అందుల కొక్కటే సమాధానము.

శ్లో॥ శ్రుతిర్విభిన్నాః, స్మృతయ శ్చ భిన్నాః–ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం,
మహామునీనాం మతయ శ్చ భిన్నాః,–మహాజనో యేన గత స్స పంథాః.

* విష్ణుభక్తులు విష్ణుభాగవతమే అష్టాదశమహాపురాణములలోనిదని, శాక్తేయులు దేవీభాగవతమే అష్టాదశమహాపురాణాంతర్గత మని తమతమవాదములను బలపఱచుకొను నుపపత్తులను గనఁబఱచుచున్నారు. ఈ విషయ మాయాయి సంస్కృతభాగవత గ్రంథములలో మున్మందు సువిమర్శముగ విమర్శించిన విమర్శనలు విరివిగా నున్నవి. అందుఁ జూడఁగలరు.

ప్రస్తుతము శ్రీభాగవత మనునది మూఁడవదిగా వినఁబడుచున్నది ఇది అష్టాదశమహాపురాణములలోఁ జేరినదా యను ప్రశ్నయే దీనినిగుఱించి లేదు. వ్యాసభట్టారకుఁ డష్టాదశపురాణములను వ్రాసినతరువాతనే దేవీమాహాత్మ్యమును వర్ణింపఁదలఁచుకొని యీ శ్రీభాగవతమును వ్రాసినట్లుగా నారంభములోనే యిట్లు గలదు.

సూతః. మహర్షి ర్భగవాన్ వ్యాస స్సర్వవేదవిదాం వరః,
అశేషం ధర్మశాస్త్రాణాం వక్తా జ్ఞానీ మహామతిః. ౧-౧౪

కృత్వా త్వష్టాదశైతాని పురాణాని మహామునిః,
న తృప్తి మభిలేభే స కథంచి దపి ధర్మవిత్. ౧౫

మహాపురాణం పరమం యత్పరం నాస్తి భూతలే,
భగవత్యాః పరం తత్త్వం మాహాత్మ్యం యత్ర విస్తృతమ్. ౧౬

తత్కథం వర్ణయిష్యేఽహ మితి చింతాపరాయణః,
దేవ్యా స్తత్త్వ మవిజ్ఞాయ క్షుబ్ధచిత్తో బభూవ సః. ౧౭

కావున నిది ప్రత్యేకము దేవీమాహాత్మ్యప్రతిపాదకముగా రచింపఁబడినది. కాన సర్గ ప్రతిసర్గ వంశ వంశానుచరిత మన్వంతరవర్ణనలతో పంచలక్షణలక్షితమైన పురాణముగాఁ బ్రతిజ్ఞాతముగాదు. ఇందు దేవీమాహాత్మ్యస్ఫోరకముగా దక్షయజ్ఞధ్వంసము, పార్వతీజననము, గౌరీకళ్యాణము, తారకాసురవధ, గజాననజననము ఇత్యాదికథ లమరియున్నవి రామాయణగాథయు, భారతకథయు నిం దభివర్ణితములై యున్నవి. ఈ చరిత్ర లితరగ్రంథములలోవలెఁ గాక పరదేవీప్రమేయముతోడనే నడచినవిగా నిందు వర్ణింపఁబడినవి ఇట్లే యింద్రునికి బ్రహ్మహత్యాపాతకము, తన్నివృత్తి, గంగావతరణము, తులసీమాహాత్మ్యము, రుద్రాక్షమాహాత్మ్యము మున్నగునవి కలవు ఈ పురాణము కేవలము శాక్తేయులకే గాక ఆస్తికుల కెల్లరకును అత్యంతాస్తిక్యభావమును నెలకొల్పునదిగానున్నది. ఇట్టి యుత్తమగ్రంథము ననువదించి యాంధ్రలోకమున కందిచ్చినవారు

బ్రహ్మశ్రీ విద్వాన్, కావ్య-పురాణతీర్థ జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మగారు.

వీరు ప్రస్తుతము విద్యాసంస్థాపిత పరమావధికిఁ గూడ మించి కడపపురపాలక సంఘోన్నత పాఠశాలలో ఆంధ్రోపాధ్యాయులుగా నభిమానింపఁబడుచున్నవారు. సుప్రసిద్ధ పండితులు పండితకుటుంబములో జన్మించినవారు. పూజ్యపాదులును కళాప్రపూర్ణులును స్వర్గీయులునగు శ్రీజనమంచి శేషాద్రిశర్మగారికి దూరపుజ్ఞాతులు- మఱియు తోడియల్లురు. నియమ వ్రతశీల సంపన్నులు పాదుకాంత దీక్షాపరులు. వైదిక లౌకికముల రెండింటను సవ్యసాచిత్వమును సంపాదించుకొన్న కృతహస్తులు పూజ్యపాద గురుశ్రీ శేషాద్రిశర్మగారి యడుగుజాడలలో నడచి వారి యాదర్శజీవితచర్యల ననుగమించి భ్రమరకీటన్యాయమున వారు వీరైనవారు. చక్కని సాహిత్యమును మేల్పంతిగ దిద్దుకొన్నవారు, దిద్దఁబెట్టినవారుగూడ. చతుర్వ్యాపసంస్కారము గలవారు.

వీరికి సంస్కృతాంధ్రములు గురుకులవాసక్లేశోపార్జితములు హిందీ, ఆంగ్లములు సాహచర్యసంపాదితములు. జ్యోతిశ్శాస్త్రమునందు త్రిస్కంధములలోను దైవజ్ఞమూర్తులు. ఉభయశాఖలలోను యాజ్ఞికభాగమున పూర్వాపరములు పూర్తిచేసినవారు. కలకత్తాలో ప్రచలితమగు 'కావ్యతీర్థ' 'పురాణతీర్థ' పరీక్షలలోను, మదరాసు విశ్వవిద్యాలయమువారి 'విద్వాన్' పరీక్షలోను పట్టభద్రులు విద్యాతపస్సులో వేడుకగా జీవితమును జీర్ణింపఁజేసికొనుటయేగాక విద్యార్థుల కక్షరదానముచేసిన విజ్ఞానదాతలు. కవితారంగమున గజ్జెగట్టి ఆధునికకాలమున కనుగుణముగ విద్యార్థులు మొదలు విద్వాంసులవఱకును ఉపయోగించెడి గద్యపద్యాత్మకములైన గ్రంథములను పెక్కింటిని సంతరించినవారు శాస్త్రముగూడ సాధింపలేని సాధుత్వమును సత్ప్రవర్తనచే ఇంటిపేరునకు సార్థక్యముగ సాధించుకొన్నవారు శ్రీ శేషాద్రిశర్మగారను ప్రతీతియుండఁగా వారితమ్ముళ్లే వీరైనారు. వేయేల? మొత్తముమీఁద పండితకవి కుండవలసిన ప్రధానలక్షణము లన్నియు వీరియందు సార్థక్యమును సంపాదించుకొన్నవి పెద్దలు చెప్పిన ఆలక్షణములివి -

శ్లో॥ సత్కులీన శ్శుచి ర్దక్ష శ్ఛందోవ్యాకరణాదివిత్,
ప్రశాంత సుభగాకారో దైవజ్ఞ శ్చ కవి ర్భవేత్.

వీరికి రామశబ్దమును మొదలుపెట్టిన వారేగాక మంత్రవిద్యాగురువులై పాదుకాంతదీక్షను ప్రసాదించినవారు గూడ శ్రీ శేషాద్రిశర్మగారే మఱియు గార్హస్థ్యజీవితము మొదలు గౌరవజీవనమువఱకును గల శ్రేయోమార్గమునకు ప్రాపకులును వారే కనుకనే శ్రీసుబ్రహ్మణ్యశర్మగారు తమ హృదయకుహరములో నిముడని కృతజ్ఞతకు గురుస్తవములో సీసమును పోసి బిగించుకొన్నారు.

సీ. రామశబ్దము మున్నుగా మహాకావ్యంబు
లెంతయు నను నభ్యసింపఁజేసె
విద్యాభివృద్ధికై ప్రీతి మిత్రుల చొద్దఁ
జదివించె శాస్త్రముల్ శ్రద్ధఁ బూని
నాపురోవృద్ధి సంతతముఁ గాంక్షించుచుఁ
బండితుఁడను ఖ్యాతి నిలల నిలిపె
శాంభవీదీక్షా విశారదునిం జేసి
మంత్ర తంత్రంబుల మహిమఁ దెలిపె
తే. ఆగమంబులఁ గవనంబు నధిగమింపఁ
జేసి వ్యుత్పత్తి మొనఁగూర్చె స్థిరతరముగ
నట్టి మద్గురువర్యు శేషాద్రిశర్మ
పాదపద్మంబు లెదలోనఁ బ్రస్తుతింతు. పీఠిక. ౧౭

ఏతద్గ్రంథారంభమున నున్న పీఠికాభాగమును జదివిన పాఠకులకు వీరినిగుఱించి ప్రత్యేకముగఁ జెప్పవలసిన దేదియులేదు న్యూనాతిరిక్తదోషరహితముగ స్వభావోక్తిలో వీరు తమజీవిత విశేషములను పీఠికాముఖమున సంగ్రహించియున్నారు. ప్రాణిలోకమునకుఁ గల్గు దశాపరిణామములలోని మంచియు, మఱొకటియు ఓతప్రోతముగా ననుభూతములయ్యెడి ఘట్టములు వీరిజీవిత చరిత్రములోఁ బీఠికాముఖమునఁ దెలియనగును.

వీ రీగ్రంథమును 17 సంవత్సరములకు (1957 నాఁటికి) పూర్వమే యనువదించియున్నారు. అజ్ఞాతవాసము దాఁటి బాహ్యప్రపంచములో బయటఁబడుటకు దీని కింతకాలము పట్టిన దనఁగా నేమనుకొనవలె? కోడలున్నచోట అత్తకు పొత్తు కుదురక పోవుటయేకదా!

గ్రంథరచనోద్దేశము మూలగ్రంథకర్తకును అనువాదకర్తకును ఒక్కటే యైనది

'భగవత్యాః పరం తత్త్వం మాహాత్మ్యం యత్ర విస్తృతమ్,
తత్కథం వర్ణయిష్యేఽహం' (౧-౧౬)

అని చింతాపరాయణుఁ డైనాఁడు వ్యాసభగవానుఁడు.

ఆ. ప్రకృతి యాదిశక్తి భావింపఁగా నేర
రెవ్వరును దమంత, నెట్టు లామ
హేశ్వరీప్రభావ మెఱుఁగంగనగు నాకు? పీఠిక. ౭౨

అని జిజ్ఞాసపడినాఁ డనువాదకర్త. ఉభయుల జిజ్ఞాసయు గ్రంథసంపాదనమునకుఁ గారణమైనది.

'ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకమ్' అన్నట్లు పెద్దలకుఁ గలుగు చింతకూడ లోకోపకారకమే యైనది ఆనాఁడు సంస్కృతములో గ్రంథము లభింపఁగా ఈనాఁడాంధ్రములో లభించినది. వారిచింత యెట్లున్నను లోకమునకు గ్రంథలాభములో సంతోషమేకదా!

వ్యాసమునీంద్రునకు పరదేవియే నిజతత్త్వము నెఱుఁగుమార్గము నెఱిఁగింపఁగా (౧వ అ. ౧౭ ప) శ్రీ శర్మగారికి 'గురుఁడెఱిఁగించెఁ దన్మహిమ' (పీఠిక ౪౩), వ్యాసమూర్తికి చతుర్వేదములు పరదేవిని ప్రత్యక్షము చేయింపఁగా శర్మగారికి ఈ శ్రీభాగవతము పేరున్న కాకితము నొకబాలుఁ డిచ్చి దీనిని స్మృతిప్రత్యక్షము చేసెను కలిసివచ్చుకాలమున కన్ని సంఘటనలును అట్లు కలిసి వచ్చును! ఒకరు సంస్కృతములో రచన సాగింపఁగా నింకొకరు తెలుఁగులో సాగించినారు. ఉభయులు కృతకృత్యులైనారు

సర్వజనసామాన్యముగ నుండవలెనని సరళశైలిలో సంతరించిన వ్యాసభగవానుని రచన కనుగుణముగానే శర్మగారును శైలి నలవఱచుకొని యనువదించి మూలగ్రంథకర్త యుద్దేశమును అక్షరాల నెఱవేర్చియున్నారు. అనువాదములో కొన్నిరకము లగపడుచున్నవి ౧ బింబ ప్రతిబింబానువాదము. ౨ ఛాయానువాదము ౩ స్వేచ్ఛానువాదము. బింబ ప్రతిబింబానువాదములో మూలములో నున్నట్లుగా మక్కికి మక్కి వ్రాయుట ఛాయానువాదములో మూలములోని భావమును దీసికొని భాషాసంప్రదాయము ననుసరించి పోలికలు చెడకుండ పట్టుకొనివచ్చుట. స్వేచ్ఛానువాదములో మూలమును దీసికొని, అది యేదారిఁబట్టినను ఇమిడింపఁగలిగినంత యిమిడించి యిష్టము వచ్చినట్లు వ్రాయుట అన్నిరకములైన యీ యనువాదములలోను తఱుగు మెఱుఁగు లుండనేయుండును అవి రచయితనుబట్టి యుండును. పిండికొలఁది రొట్టె! కాని మెఱుఁగుమాట దేవుఁ డెఱుఁగుఁగాని తఱుగు చేయకుండుట మాత్రము మూలకర్తను గౌరవించినట్లే. ఉదాహరణమున కొక్క విషయము

శ్లో॥ వికీర్ణ సప్తర్షి బలిప్రహాసిభి స్తథా న గాంగై స్సలిలై ర్దివ శ్చ్యుతైః
యథా త్వదీయై శ్చరితై రనావిలై ర్మహీధర। పావిత ఏష సాన్వయః।

ఇది కుమారసంభవము పంచమసర్గలోని శ్లోకము. మాయాబ్రహ్మచారివేషముతో వచ్చిన పరమశివుఁడు తపస్సు చేసికొనుచున్న పార్వతికడకు వచ్చి యామెను ప్రశంసించుచున్న ఘట్టమిది. ఈ శ్లోకమునకు లభించిన యనువాదములివి. వీనిలోని తరగతి విభాగమును పాఠకులే నిర్ణయించుకొందురుగాక.

తే. అభ్రవీథీపరిచ్యుతం బైనయట్టి - యమరతటినీ జలప్రవాహమ్ముకంటె
ధరణిధరరాజు నీచరిత్రంబుకతనఁ - బరమపావనుఁ డయ్యె నోపద్మనయన!

తే. వెలఁది! సప్తర్షిబలిహాసి విష్ణుపదవి - నిర్గతామల మందాకినీ జలంబు
వలనిపావనతను మించు పావనతను - బడసె గిరిరాజు నీనడవడికకతన.

మ. తలఁపన్ విష్ణుపదచ్యుతంబులయి సప్తర్షి వ్యర్చనాపుష్పహా
సులునౌ గాంగజలాలచే నయిన మంచుంగొండ తేఁ జీతఁ డ
గ్గలమౌ నీదువనావిలాఖిల జగత్కళ్యాణ దీవ్యచ్చరి
త్రలచేతంబలె సాన్వయుం డగుచు శాలా! పావిత్రుం డయ్యెనే!

శర్మగారి యనువాదమును గూర్చి యొక్కమాటలోఁ జెప్పవలెనన్నచో 'కానిపించు స్వభావోక్తి కవితవోలె' మూలమునకు తెలుగు గాకుండ, వ్యాసభట్టారకుని హృదయమును వెల్లడింపవలె నను నదియే వారిలక్ష్యము కనుకనే

క. సలలితభావను దెలుఁగున - నలవఱచిన నెల్లవారి కనగసొముగు ని
య్యల నను చుఁ బూనితిం గృతి - కలనకు శ్రీదేవి పనుప (పీఠిక ౭౯)

అని వ్రాసికొనియున్నారు అట్టే ఆసాంతము నిర్వహించినా రన్నమాటయే సంతరించిన శైలి సరళము. సాగించిన భాష సలక్షణము స్థాలీపులాక న్యాయమున ఆద్యంతములనుండి రెండుదాహరణములు

ప్రథమాధ్యాయమునుండి

మూలము

శ్లో. మహాపురాణాం పరమం యస్సారం నాస్తి భూతలే,
భగవత్యాః పరం తత్త్వం మాహాత్మ్యం యత్ర విస్తృతమ్. ౧౬
తత్కథం వర్ణయిష్యేఽహ మితి చింతాపరాయణః,
దేవ్యా స్తత్త్వ మవిజ్ఞాయ క్షుబ్ధచిత్తో బభూవ సః. ౧౭

అనువాదము.

చ. పరమమహాపురాణ మయి భాసిలు నెయ్యది? దేని మించి యీ
ధరణిఁ బురాణ మొందు విశదంబుగ నుండఁగఁ జాల? దెందు సు

స్థిరముగ నారయఁ భగవతీమహిమం బతివిస్తృతంబునై
పరగునొ? తత్పురాణమును వర్ణన యేక్రియఁ జేయఁగల్గుదున్? ౧౩

క॥ దేవీతత్త్వం బెఱుఁగక – యేవిధమున వర్ణనంబు నేఁ జేయుదు? నం
చావిల చిత్తుం డయి, మది – నావేదవ్యాసమౌని యంతఁ దలంచెన్. ౧౪

అంతిమాధ్యాయము (౮౧) నుండి

శ్లో. భవిష్యతి సతాం హాని రసతా మున్నతి స్సదా. ౮
ఏవం ఘోరకలౌ చాపి నరాణాం పాపచేతసామ్,
ముక్తిప్రదం మహాదేవపూజనం మునిసత్తమ।

అనువాదము :

చ. కలియుగమందు నీచులకుఁ గల్గును నున్నతి, సజ్జనాళికిన్
గలుగును హాని, యీవిధముగాఁ గలుషాత్ములు మర్త్యులౌదు, ర
త్యలఘుభయంకరం బయిన యాసమయంబున ముక్తిఁ బొందఁ దా
వలమయి పొల్చు శంకరుని పాదయుగార్చనమే మహామునీ! ౩౬౧౨

అనువాదకర్తలు, తమకై మిగిలియుండిన అదృష్టమున కిట్లని యానందపడినారు

ఉ. పెద్దలు నన్నయాదిసుకవిప్రవరుల్ సుకృతుల్ కృతుల్ జగం
బద్దిర యంచు మెచ్చుకొన నన్నిపురాణములం దెలుంగుగా
నొద్దికతో రచించిరి, మదున్నతపుణ్యము భాగ్యవంతమై
తద్దయుఁ బర్వ నీకృతిని దల్పఁగలేదు తెలుంగుసేయఁగాన్. పీఠిక ౨౮౨

అని. ఇదే గదా పోతనమహాకవియుఁ దలంచినది!

మ. "ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీయుర్విన్ బురాణావళిం
దెనుఁగుం జేయుచు మత్పురాకృతశుభాధిక్యంబు దా నెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్, దీనిం దెనింగించి మ
జ్జననంబున్ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్."

అని అనన్యసామాన్యమైన యదృష్ట మబ్బినప్పు డిట్లేగదా తలఁచునది! పరదేవీప్రసాదితమైన యిట్టి యదృష్టములో 'పరమేశ్వరి పలికించిన సరణిఁ బలుకువాఁడ' (పీ. ౮౧) ననియు, 'మూలమునందు నుండుపదముల్ మదిఁ దోఁచినయంతవట్టు నాశ్రీలలితాంబ సత్కృప స్మరించుచుఁ

పద్దెము వల్లినాఁడ (౬౫ వ ఏట) ననియు రచన సాగించిన శ్రీశర్మగారి యీ శ్రీ భాగవతమునుండి యొకటి రెండు పద్యములు —

మ. నరజన్మం బతిదుర్లభం, బదియుఁ బ్రైనన్ నూఱుజన్మంబులన్
వరుసన్ దాఁటినఁ గాని వచ్చు నని లో భావింపఁగా రాదు, త
ద్వరదేహంబును బొంది వీనులను దివ్యంబైన శ్రీదేవి స
చ్చరితంబున్ విననట్టివాని బ్రతుకే చర్చింపఁగా వ్యర్థమౌ. ౬౩

ఉ. నీయెడ భక్తియున్, మఱియు నీయెడఁ బ్రీతియు, శ్రద్ధయున్ వసిం
బాయక యుండు నెవ్వరికి, వారల మృత్యువు చేరఁజాల దెం,
దేయెడ దుర్దశల్ గలుగ, వించుకమైన భయంబు, దుఃఖమున్
జాయకు రావు నీదగుప్రసాదముచేతనె, గంగ! ప్రముక్తిదా. ౩౨౦౦

శ్రీశర్మగారు నాకుఁ జిరపరిచితులు. పూజ్య శ్రీ శేషాద్రిశర్మ గురుపాదుల గురుకులావాసము చిన్నకాలములో మాకు సతీర్థ్యత్వము సంపాదించినది. ఈ సంబంధముచే నొకరి కంటె మిక్కిలిగ సంతోషించుచు నేను మాశర్మగారిట్టి కింకే గ్రంథములు కనుపెట్టుకొని యున్నవో వ్రాయుకొనియుండవలసినదని కోరుచు వారి ప్రార్థననే పాఠకలోకమునకుఁ బరిచయము చేయుచున్నాను.

క. క్షమియింపుఁడు దోసంబులు,
తమితోడఁ బరిగ్రహింపఁదగు గుణవితతుల్,
విమలాత్ములార! కోరిక
తమకుఁ దెలుపుచున్నవాఁడ, దయఁ గనుఁగొనుఁడీ! (పీఠిక ౭౩)

కవితాసామ్రాజ్యము
నంద్యాల.
హేమలంబ వత్సరాది
1-4-1957.

ఇట్లు
భాషోపాసకుఁడు
విద్వాన్, కావ్యతీర్థ
మద్దులపల్లి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి.
ప్రధానాంధ్ర పండితుఁడు
మునిసిపల్ హైస్కూలు, నంద్యాల

*

విషయసూచిక

అధ్యాయ సంఖ్య		పుట
	పీఠిక	౧
	— ప్రథమాంశము —	
౧	కథాప్రారంభము	౩౩
	మహాభాగవతప్రకాశనము	౩౩
	పరమేశ్వరి వ్యాసునకు బ్రహ్మలోకమున కరిగి శ్రుతులఁ దత్త్వ మడుగుమనుట	౩౫
	వ్యాసునకుఁ బరమేశ్వరి ప్రత్యక్షమగుట	౩౭
	దేవి వ్యాసుని సందియంబు దీర్చుట	౩౮
౨	వ్యాసుని కడకు జైమినిముని వచ్చి త్రయోపాస్యదేవతా మహిమలను వినఁగోరుట	౩౯
	శంకరుని సన్నిధికి నారదుఁడు వచ్చుట	౪౧
	వ్యాసుఁడు హరిహరుల నుతించుట	౪౨
౩	శివుఁడు నారదునకు స్వోపాస్యదైవమును దెలుపుట	౪౪
	ప్రకృతి త్రిమూర్తులఁ బరీక్షించుట	౪౮
	బ్రహ్మ సృష్టి చేయఁబూనుట	౪౯
	దక్షాదిసంతతి	౫౧
౪	ప్రకృతి దక్షుని పుత్రికయగుట - వివాహము	౫౨
	దక్షుఁడు తపంబు చేయుట	౫౩
	దాక్షాయణీ స్వయంవరము	౫౬
	— ద్వితీయాంశము —	
౫	దక్షప్రజాపతి విషాదము	౫౯
	దక్షుని దధీచి యూఱడించుట	౬౧
౬	నందికేశ్వర ప్రమథాధిపతిత్వవర్ణనము	౬౪
౭	సతీశివుల విహారము	౬౭
	నారదుఁడు దక్షుని కడకు వచ్చుట	౬౮
	దక్షుఁడు తన మంత్రులతో యోజించి యజ్ఞంబు చేయఁబూనుట	౬౯
	దక్ష దధీచి సంవాదము	౭౧
	దధీచి క్రతు సభామధ్యమున నుండి వెడలుట	౭౩

అధ్యాయ సంఖ్య		పుట
	పరమేశ్వరి దక్షుని గురించి తాఁ జేయఁదగిన కార్యము నుద్దేశించుట	౭౪
	నారదమహర్షి కైలాసమునకు వచ్చుట	౭౫
౮	సతీదేవి యజ్ఞమునకుఁ బోవ శంకరు నడుగుట	౭౬
	దేవి శంకరునకుఁ దన మహిమఁ గనఁబఱచుట	౮౦
	సతి దక్షుని యజ్ఞముఁ గాంచ వెడలుట	౮౪
౯	సతీదేవి తల్లి దగ్గఱకుఁ బోవుట - ప్రసూతి తన స్వప్న వృత్తాంతముఁ దెల్పుట	౮౬
	సతి దేహత్యాగ మొనరించుట	౮౭
	దక్షుఁడు కాళికారూపంబుఁ గనుట	౮౯
	ఛాయాసతి యగ్నిప్రవేశము చేయుట	౯౧
౧౦	దక్షయజ్ఞ విధ్వంసనము	౯౪
	బ్రహ్మదేవుఁడు కైలాసమున కరిగి శంకరునిఁ బ్రార్థించి యజ్ఞము నెఱవేర్చుట	౧౦౦
	దక్షకృత శివస్తోత్రము	౧౦౨
౧౧	ఛాయాసతీదగ్ధనము	౧౦౪
	దేవి బ్రహ్మవిష్ణ్వీశులకుఁ బ్రత్యక్షమగుట	౧౦౬
	శివుఁడు సతీదేహంబును వెదకి దానిని ధరించి నాట్యమాడుట	౧౦౭
	విష్ణువు ఛాయాసతీదేహమును ఖండఖండములు చేయుట	౧౧౦
	అష్టాదశ పీఠకారణము	,,
	నారదుఁడు శివుని శాంతింపఁ జేయుట	౧౧౧
	శంకరుఁడు విష్ణువునకు శాపమొసంగుట	౧౧౩
౧౨	నారదుఁడు విష్ణ్వాదులకు శివుని భావంబుఁ దెలుపుట	౧౧౪
	కామరూప పీఠమహిమ	౧౧౬

— తృతీయాంశము —

౧౩	గంగాజననము	౧౧౯
	బ్రహ్మ నారదునిచే దేవతలఁ బిల్వఁబంపుట	౧౨౨
	దేవతలు హిమవంతునిఁ బ్రోత్సహించుట	౧౨౫
౧౪	బ్రహ్మ స్వర్గపురమున కరుగుట .	౧౨౬
౧౫	హైమవతీ ప్రాదుర్భావము	౧౩౦
	హైమవతి తండ్రికి నిజరూపముం జూపుట ...	౧౩౧
	హిమాచల కృత దేవీస్తోత్రము .	౧౩౩
	పరమేశ్వరి హిమవంతునకు యోగసారముపదేశించుట .	౧౩౫
౧౬	బ్రహ్మవిద్యోపదేశము ..	౧౩౬

అధ్యాయ సంఖ్య		పుట
౧౭	బ్రహ్మయోగోపదేశము, జంతూత్పత్తి	౧౪౧
	గర్భస్థజీవుని యాతనము	౧౪౩
౧౮	హిమవంతుఁడు పరదేవిని ముక్తికిఁ దగిన యుపాయ మడుగుట	౧౪౫
	ధ్యాన విధానము	౧౪౭
౧౯	హిమవంతునకుఁ బార్వతి యోగసార మహిమఁ దెలుపుట	౧౪౯
	పార్వతీ గీతా ఫలశ్రుతి	,,
౨౦	పార్వతి బాల్యము	౧౫౦
	నారదుఁడు పార్వతిం జూడవచ్చుట	౧౫౧
	నారదుఁ డీశ్వరుని తపశ్చర్యావిధముఁ దెల్పుట	౧౫౩
౨౧	ఈశ్వరుఁడు తపస్సు చేయుట	౧౫౪
	హిమవంతుఁడు శాసనము చేయుట	౧౫౬
	పార్వతి తపంబు చేయఁగోరుట	౧౫౭
౨౨	హిమవంతుఁడు పార్వతిని శంకరుని సేవకై యుంచుట	౧౬౦
	శివతపోభంగము - దేవతల ప్రయత్నములు	,,
	బ్రహ్మదేవుఁడు దేవతలకుఁ దారకాసుర వధోపాయమును దెలుపుట	౧౬౧
	బ్రహ్మదేవుఁడు తారకాసురునకు హితముపదేశించుట	౧౬౨
	ఇంద్రుఁడు బృహస్పతిని శివతపోభంగమున కుపాయ మడుగుట	౧౬౩
	బృహస్పతి యింద్రునకు శివతపోభంగోపాయమును దెలుపుట	,,
	మన్మథ దేవేంద్ర సంభాషణము	౧౬౪
	మదనుఁడు తన పూర్వశాపంబును స్మరించుట	౧౬౬
	మన్మథుఁడు శివుని తపోవనంబున కరుగుట	,,
	మదనుఁడు శంకరునిపై బాణప్రయోగంబు చేయఁబూని విఫలుఁ డగుట	౧౬౮
	పార్వతి శివుని సన్నిధానంబునకు వచ్చుట	,,
	మదనుఁడు మరల శివునిపై బాణప్రయోగముఁ జేయుట	,,
	శివుని కంటిమంట మదనుండు భస్మమగుట	౧౭౦
౨౩	పార్వతి పరమేశ్వరుని మన్మథుని దహనముం గూర్చి ప్రశ్నించుట	,,
	శివుని ప్రత్యుత్తరము	౧౭౧
	పరమేశ్వరి స్వస్వరూపంబుఁ జూపుట	,,
	పరమేశ్వరకృత కాళీ (లలితా) సహస్రనామస్తుతి	౧౭౩
౨౪	పార్వతీ వివాహోద్యమము	౧౮౫
౨౫	పార్వతీ వివాహాహ్వానము	౧౯౦
౨౬	పార్వతీ పరమేశ్వరుల వివాహమునకు దేవతలు వచ్చుట	౧౯౩
౨౭	రతీదేవి తన భర్తయగు మదనుని శంకరు ననుగ్రహంబునఁ బడయుట	౧౯౬
	శంకరుఁడు పెండ్లికొడు కగుట	౧౯౮

అధ్యాయ సంఖ్య		పుట
౨౮	గిరిజాకల్యాణము ..	౧౯౯
	పర్వతరాజునకు శంకరుఁ డధ్వరభాగంబు నేర్పఱచుట	౨౦౧
౨౯	శంకరుఁడు పార్వతీదేవితోఁ గ్రీడించుట .	౨౦౨
	భూదేవి యుమాశంకరుల క్రీడల వహింప లేక సూర్యునితో విన్నవించుట	౨౦౩
	సూర్యుఁడు భూదేవి బాధల సురలతోఁ దెల్పి యెల్లరు బ్రహ్మకడ కేగుట	౨౦౪
	దేవతలు భూదేవికిఁ గల్గిన యాపదను బ్రహ్మదేవునకు విన్నవించుట	౨౦౪
	బ్రహ్మ దేవతలకుఁ గావించిన హితోపదేశము	౨౦౫
	బ్రహ్మదేవుఁడు దేవతలతో నుమామహేశ్వరుల క్రీడాస్థలంబున కరుగుట	౨౦౬
౩౦	దేవతలు లజ్జారూపిణి యగు భగవతిని నుతించుట	,,
	షణ్ముఖ జననక్రమము . .	౨౦౮
౩౧	తారకాసురునిపైకిఁ గుమారస్వామి దండు వెడలుట	౨౧౧
౩౨	కుమారతారకాసుర సంగ్రామము	౨౧౫
౩౩	కుమారస్వామి తారకాసురుని వధించుట	౨౧౭
౩౪	కుమారస్వామి తలిదండ్రుల కడ కరుగుట ..	౨౧౯
౩౫	గణపతి జన్మవృత్తాంతము ...	౨౨౧
	శంకరుఁడు గణపతిపై శూలంబుఁ బ్రయోగించుట	౨౨౩
	గణపతి గజవక్త్రం బగుట	౨౨౪
	— చతుర్థాంశము —	
౩౬	భగవతీ నారాయణ సంవాదము - మహాపూజావిధానము .	౨౨౯
	శ్రీరాముఁడు దేవీపూజ చేసిన విధముఁ బ్రశ్నించుట ...	,,
	సురలు బ్రహ్మను బ్రార్థించుట	౨౩౧
	బ్రహ్మ సురలతోఁ గూడి విష్ణుదేవుని వినుతించుట ...	,,
	బ్రహ్మయు విష్ణుమూర్తియు దేవీనివాసంబున కరిగి వినుతించుట	౨౩౪
	పరదేవి రావణవధోపాయమును దెలుపుట	౨౩౫
౩౭	శ్రీరామచరిత్రము - దేవతలు వానరులుగా జనించుట .	౨౩౯
౩౮	విశ్వామిత్రుఁడు శ్రీరామున కస్త్రము లొసఁగుట .	౨౪౨
	సీతాకల్యాణము	౨౪౩
	శ్రీరామవనవాసము .	౨౪౪
	భరతుఁడు శ్రీరామ పాదుకలం గొనివచ్చుట	౨౪౫
	విరాధాదివధ, శూర్పణఖ రావణునకుఁ దన భంగపాటుఁ దెల్పుట	౨౪౬
	సీతాపహరణము	౨౪౭
౩౯	సీతాన్వేషణము ...	౨౪౮
	హనుమ లంక కరుగుట .	౨౪౯
	హనుమంతుఁడు లంకలోఁ బరదేవిం గాంచి నుతించుట .	౨౫౦
	పరదేవి హనుమంతునకుఁ దన భావంబుఁ దెలుపుట ..	౨౫౧

అధ్యాయ సంఖ్య			పుట

అధ్యాయ సంఖ్య			పుట
౪౦	శ్రీరామ విభీషణ సమాగమము, సేతుబంధనము	..	౨౫౩
	యుద్ధారంభము	..	౨౫౫
	రామ రావణ యుద్ధము	. .	౨౫౭
౪౧	రావణుఁడు కుంభకర్ణుని నిద్రలేపి యుద్ధమున కంపుట	..	౨౫౮
	బ్రహ్మ రామునకుఁ బూర్వవృత్తాంతంబుఁ దెల్పి, దేవి మహిమ నెఱిఁగించుట	..	౨౫౯
౪౨	శ్రీరామచంద్రునకు బ్రహ్మ పూర్వవృత్తాంతమును నివేదించుట		౨౬౦
	దుర్వృత్తి ప్రాయశ్చిత్తము - బ్రహ్మ చతురాననుఁ డగుట .		౨౬౩
	దేవీ స్తోత్రము (త్రిమూర్తి కృతము)		౨౬౫
౪౩	దుర్గాలోక వర్ణనము		౨౬౮
	దేవీ నివాస వర్ణనము		౨౭౨
౪౪	శ్రీమహాదుర్గా స్తుతి (శ్రీరామ కృతము)		౨౭౭
	శ్రీరామునకు దేవి యభయ మొసఁగుట		౨౭౮
౪౫	బ్రహ్మ పరమేశ్వరినిఁ బూజించుట	..	౨౮౦
	శ్రీదేవీ వరదానము, త్రిరాత్రవ్రతము		౨౮౩
౪౬	దేవీపూజా మహిమము	...	౨౮౫
	త్రివిధపూజలు		౨౮౬
౪౭	రావణ కుంభకర్ణ యుద్ధము	..	౨౮౮
	రావణుఁడు రణరంగము విడిచి పురిలోనికరుగుట		౨౯౩
	రావణుఁడు కుమారుఁడు చచ్చెనని తానే యుద్ధమునకు వచ్చుట		,,
	రామరావణయుద్ధము		౨౯౫
	రావణవధ, విభీషణుని దుఃఖము	.	౨౯౬
౪౮	శ్రీదేవ్యుద్వాసనము	.	౨౯౭
	శరన్మహోత్సవమహిమము		౨౯౮

— పంచమాంశము —

౪౯	శ్రీ పరాంబ శ్రీకృష్ణావతారమును ధరించుట	..	౩౦౧
	శివపార్వతులు రాధాకృష్ణులుగ నవతరించుట	..	౩౦౨
	ఇంద్రాదులు పాండవధార్తరాష్ట్రులుగ నవతరించుట	..	౩౦౬
	శ్రీదేవి బ్రహ్మను విష్ణుమూర్తికడకుఁబంపుట		౩౦౭
౫౦	శ్రీదేవి కృష్ణమూర్తిగా నవతరించుట	..	౩౦౮
	కంసుఁడాకాశవాణిని వినుట	.	౩౧౦
	కంసుఁడు దేవకి బిడ్డలఁ జంపుట	...	౩౧౧
	శ్రీకృష్ణజననము	...	౩౧౪
	దేవకిచింత	...	౩౧౫
	శ్రీదేవిని వసుదేవుఁడు నుతించుట.	..	౩౧౬

అధ్యాయ సంఖ్య		పుట
	వసుదేవునకు శ్రీదేవి చేసిన యుపదేశము	౩౧౮
	వసుదేవుఁడు శ్రీకృష్ణుని గోకులమునకుఁ దీసికొనిపోవుట	౩౧౯
	కంసుఁడు దేవకీపుత్త్రికను జంపఁబూనుట	౩౨౦
౫౧	కంసుఁడు పూతనను ద్రేపల్లెకుఁ బంపుట	౩౨౧
	పూతనవధ	౩౨౨
	తృణావర్తవధ	౩౨౩
	శంభుఁడు రాధయగుట	౩౨౪
౫౨	శ్రీకృష్ణుఁడు యశోదానందులకుఁ బుత్త్రుఁడయిన విధము	౩౨౫
౫౩	శ్రీకృష్ణలీలలు	౩౨౭
	శరద్రాత్రియందు శ్రీకృష్ణుఁడు వేణుగానముఁ జేయుట	౩౨౯
౫౪	శ్రీకృష్ణుఁడు మధురాపురంబున కరుగుట	౩౩౩
	కువలయాపీడవధ	౩౩౬
	చాణూరముష్టికులవధ, కంసవధ	౩౩౭
	దేవకీ వసుదేవుల విముక్తి	౩౩౮
౫౫	శిశుపాలవధ - పాండవపరాజయము	౩౪౦
	రుక్మిణీ వివాహయత్నము	౩౪౨
	శ్రీకృష్ణుఁడు రుక్మిణిం గొనిపోవుట	౩౪౩
	ధర్మజరాజసూయము	౩౪౪
	ధర్మజుఁడు జూదమాడి యోడుట	౩౪౫
౫౬	పాండవుల యరణ్యవాసము	౩౪౬
	యుధిష్ఠిరుఁడు శ్రీదేవిని స్తుతించుట	౩౪౮
	పాండవుల యజ్ఞాతవాసము	౩౪౯
	కీచకవధ	౩౫౦
	ద్రౌపది మహాకాళిని నుతించుట	౩౫౩
	ఉత్తరగోగ్రహణము	౩౫౬
	కురుపాండవ యుద్ధము	౩౫౭
౫౭	పాండవకృత దేవీస్తుతి	౩౫౮
	యుద్ధప్రారంభము	౩౬౦
౫౮	శ్రీకృష్ణావతార సమాప్తికథ	౩౬౨
	ద్రౌపది మొదలగువారు తమ దేహములఁ ద్యజించుట	౩౬౬
	— షష్ఠాంశము —	
౫౯	బ్రహ్మమయీ మహాకాళీ స్థానవర్ణనము	౩౬౯
౬౦	ఇంద్రునకు బ్రహ్మహత్యాప్రాప్తి	౩౭౨
	ఇంద్రుఁడు దధీచిని యాచించుట	౩౭౩
	దధీచిప్రత్యుత్తరము	౩౭౫

అధ్యాయ సంఖ్య		పుట
౬౧	ఇంద్రుఁడు బ్రహ్మహత్యను బోఁగొట్టుకొనుటకుఁ గావించిన యత్నము	౩౭౬
	ఇంద్రుఁడు గౌతముని యాశ్రమమున కరుగుట	౩౭౮
	గౌతముఁడు పురుహూతున కుపాయముఁ దెల్పుట ...	౩౭౯
	బ్రహ్మేంద్రులు వైకుంఠమున కరుగుట .	౩౮౨
౬౨	ఇంద్రాదులు భగవతీస్థానమున కరుగుట	౩౮౩
౬౩	యోగినులు ఇంద్రాదులకు శ్రీదేవిని దర్శించు నుపాయ మెఱింగించుట	౩౮౭
	గణపతి శ్రీదేవి యనుజ్ఞను త్రిమూర్తులకుఁ దెల్పుట	౩౮౯
	త్రిమూర్తులు శ్రీదేవి పురముఁ బ్రవేశించుట ...	౩౯౦
	బ్రహ్మవిష్ణులు శ్రీదేవిని వినుతించుట ..	౩౯౧
	ఈశ్వరుఁడు తమ రాకను శ్రీదేవికిఁ దెల్పుట	౩౯౨
	శంకరుఁ డింద్రుని శ్రీదేవీసాన్నిధ్యమునకుఁ దోడ్కొని వచ్చుట	,,
౬౪	గంగావతరణ కథ	౩౯౩
	గంగ ద్రవరూపమును బొందుట	౩౯౪
౬౫	వామనచరిత్రము	౩౯౬
	బలి పాతాళ యాత్ర ...	౪౦౦
౬౬	భగీరథుఁడు గంగను దేఁ బ్రయత్నించుట	౪౦౧
	భగీరథకృత విష్ణుస్తుతి ..	౪౦౨
	భగీరథుఁడు గంగను గూర్చి తపంబు గావించుట ...	౪౦౪
	గంగ భగీరథునితో శివుని నారాధింపు మనుట .	,,
	భగీరథుఁడు శివునిఁ గూర్చి తపంబు సలుపుట .	౪౦౫
౬౭	భగీరథ కృత శివసహస్రనామస్తోత్రము	౪౦౬
	శివుఁడు భగీరథునకు వరం బిచ్చుట	౪౧౬
	శివసహస్రనామ ఫలస్తుతి	౪౧౮
౬౮	గంగానిర్గమనము	౪౨౦
	భూదేవీకృత గంగాస్తుతి	౪౨౨
	గంగ నాలుగు ధారలుగాఁ బ్రవహించుట ...	౪౨౩
	ఇంద్రుఁడు భగీరథునితో మాటలాడుట .	౪౨౪
	గంగ మందాకిని నా స్వర్గమునఁ బ్రవహించుట .	౪౨౫
౬౯	గంగ పుడమిమీఁదఁ బ్రవహించినవిధము .	౪౨౬
	శంకరుఁడు గంగను దన శిరంబున నిలుపుట .	౪౨౭
	శంకరుఁడు గంగను భగీరథునికోర్కెఁ దీర్ప వదలుట .	౪౨౮
౭౦	గంగామార్గవర్ణనము ...	౪౩౦
	గంగను గాలభైరవుఁడు సమ్మానించుట	౪౩౧
	గంగ కామరూపమునకుఁ దరలి జహ్నువుచే నాకర్షింపఁ బడుట	౪౩౨

అధ్యాయ సంఖ్య		పుట
	గంగ జహ్నుజానువునుండి నిర్గమించుట - జహ్నుకృత గంగాస్తోత్రము .	౪౩౩
	గంగాసాగరసంగమము .	౪౩౬
౧౧	కపిలమునీంద్ర దర్శనము	౪౩౭
	గంగావతారకథాఫలము .	౪౩౮
౧౨	గంగామహిమము	౪౩౯
	గంగాదర్శన మహిమము ..	౪౪౨
	యముఁడు దూతలకు గంగాప్రభావంబుఁ దెలుపుట .	౪౪౩
౧౩	గంగామాహాత్మ్యము	౪౪౪
౧౪	,, ధనాధిపము !	౪౪౯
౧౫	గంగాష్టోత్తరశతనామములు . .	౪౫౩
౧౬	కామరూప తీర్థమాహాత్మ్యము	౪౫౬
౧౭	విద్యాదశకము - శ్రీవిద్యోపాసనము	౪౬౦
	మహాకామాఖ్యాకవచము ..	౪౬౨
౧౮	యోనిపీఠ మాహాత్మ్యము	౪౬౫
౧౯	తులసీ, బిల్వపత్ర ప్రభావము	౪౬౭
౨౦	రుద్రాక్ష ప్రభావము .	౪౭౨
౨౧	పార్థివ పూజావిధానము - భస్మప్రభావము ..	౪౭౪
	గ్రంథఫలస్తుతి	౪౭౮

గమనిక

పుట	పద్యము	ఉన్నది	సవరణ
32	299	మనీషీ	మనీషా
37	33	జ్యోతిరూపిణి యాదేవి మాక	దీప్తిరూపిణి యాదేవి తెలియ
214	1551	కండ్లనుండి	కన్నులందు
478	3594	ప్రాశస్త్య	ప్రఖ్యాత



వ్యాసమహర్షికి దేవి ప్రత్యక్షమగుట (పుట 37)

శ్రీమత్త్రిపురసుందర్యై నమః

శ్రీ మహా భాగవతము

పీఠిక

ఇష్టదేవతాస్తుతి

శా. శ్రీమద్దివ్యమునీశ్వరప్రకర సంసేవ్యంబు, మూర్తిత్రయో
ద్దామప్రాభవదాయకంబు, శ్రిత చిత్త ప్రీతిదం, బవ్యయ
స్థేమం, బద్భుతశక్తియుక్త, మఖిలక్షేమప్రదం, బున్నత
శ్రీమాన్యంబు పదంబు సంతత మోదం జింతింతు భద్రాప్తికై. ౧

శా. శ్రీమద్దివ్యమునీంద్రవంద్యము, జగత్సృష్టిక్రియా ద్యద్భుతో
ద్దామప్రాభవ, మబ్జజాది విబుధధ్యానాస్పదం, బవ్యయ
స్థేమం, బాశ్రితవాంఛితార్థదము, సంసేవ్యంబు, సత్యంబు, సు
క్షేమప్రాపకమై వెలుంగు పదమున్ సేవింతు నిత్యం బెదన్. ౨

మ. సకలామ్నాయములుం, బురాణములు, శాస్త్రంబుల్ విమర్శించి యే
యకలంకంబగు తత్త్వముం దెలుపలే రబ్జాసనాదుల్ మహో
త్సుకతన్ లోకములందు నిండి యెది యెచ్చోఁ జూడఁగారానిదై,
యొకటన్ వెల్గుఁ, దదచ్ఛతత్త్వమును నే నుల్లంబునం గొల్చెదన్. ౩

శా. ఏ దివ్యంబగు తత్త్వముం గలిసి యయ్యీశుండు లోకంబులం
బ్రాదుర్భావము నొందఁజేయుఁ, గదలున్, బ్రహ్మము లేతత్త్వమున్
మోదంబుం గని సంస్తుతింత్రు, కలుషాత్ముల్ గాంచఁగానేర రే
శ్రీదంబౌ పరతత్త్వమున్, మదిని దచ్చిచ్ఛక్తి సేవించెదన్. ౪

మ. బిసతంతుక్రియఁ గుండలిన్యభిధయై పేర్మిన్ భుజంగాకృతిన్
లసదాధారము మధ్యనుండి కడఁకన్గదంబుఁ గాటంచి, నే
ర్పెసఁగన్ వక్త్రమునందుఁ బుచ్ఛమిడి యెంతే బ్రహ్మరంధ్రంబునన్
దసమానప్రభ వెల్గు శక్తి మది నత్యంతంబు భావించెదన్. ౫

చ. జిగి దులకించు చంద్రకళ శీర్షమునన్ విలసిల్ల, నంకమం
దగవరు కూర్మిపుత్త్రి తనయద్వయసేవితయై వెలుంగఁ, జె
న్నగు నగుమోముతోడ, ఫణిహారము లొప్పఁగ శంకరుండు సొం
పుగఁ గనుపట్టుఁగాక కను మూసినయప్పుడు, విచ్చినప్పుడున్. ౬

మ. భువనంబుల్ ప్రమదంబు నొంద నఖిలంబుం బ్రీతి వీక్షించుచున్,
దివిజుల్, దైత్యులు, సిద్ధసాధ్యులును నెంతే గొల్వ, నిష్టార్థముల్
మివ్వులన్ దీర్చుచు, వెండికొండపయిఁ బేర్మిం బార్వతిం గూడి లో
కవినోదం బొనరించు శంకరునకుం గావింతు భక్తిన్ నతుల్. ౭

మ. హిమవత్పుత్రికయై జనించి, యఖిలాభీష్టంబులన్ భక్తసం
ఘము నిత్యంబును నొందఁజేయుచు, మదిం గారుణ్య మొప్పార లో
కములం బ్రోచుచు నున్న తల్లిని, జగత్కల్యాణదన్, శంకర
ప్రమదోత్సాహదఁ బార్వతిం గొలుతు మత్స్వాంతంబునం దెంతయున్. ౮

సీ. అఖిలలోకపవిత్ర మైన మందాకిని ప్రభవించె నేవిభు పదములందు,
భువనసృష్టికిఁ బరిపూర్ణుఁడైన విధాత పుట్టె నేదేవుని బొడ్డుఁదమ్మి,
సకలసంపదలకు జనయిత్రియగు లక్ష్మి యింపొందు నేదేవు హృదయసీమ,
జగముల వికసింపఁ జతురులౌ రవిచంద్రు లలరుదు రేప్రభు నక్షులందు,
తే. అట్టి పరమపవిత్రు, నత్యంతపూర్ణు,-నమితవైభవయుక్తు, నహార్యతేజు,
నాదినారాయణుని మదీయాంతరంగ-మునను భజియింతు మత్కృతి పొదలురీతి.

చ. కలుములఁ గన్నతల్లి, శ్రితకల్పకవల్లి, కృపాప్రపూర్ణ, ని
స్తులవరదానదివ్యగుణ, తోయధి కూరిమిఁ గన్నబిడ్డ, చె
ల్వుల హరివక్షమందుఁ బరిపూర్ణమనోరథయై చెలంగు స
త్ఫలదను లక్ష్మినిం గొలుతు భక్తి సతంబుఁ గృతార్థుఁ జేయఁగన్. ౧౦

చ. సకలచరాచరప్రతతిఁ జక్కని నేర్పున సృష్టిచేసి, పా
యక తన నాల్గుమోముల మహామతి వేదములన్ జగంబులం
దకలుషరీతిఁ దెల్పి, యమరావళి గొల్వ వెలుంగు బ్రహ్మపా
దకమలయుగ్మముం గొలుతు ధన్యత మత్కృతి మించ నాత్మలోన్. ౧౧

మ. వరపద్మాసనయై, యహర్నిశము శుభ్రస్ఫాటికంబైన గా
త్రరమన్ వెల్గుచు, స్వచ్ఛవస్త్రములతో, భ్రాజత్సుభూషాళితోఁ
బరమప్రీతిని భక్తులన్ నిఖిలవిద్వత్పూర్ణులంగా వసుం
ధర వాగీశ్వరియై యొనర్చు జగదంతర్వాణిఁ గీర్తించెదన్. ౧౨

సీ. ఏదేవిమంత్రమై యొసఁగు వాక్కామపరాఖ్యబీజంబు లత్యంతమహిమ,
నేదేవివీణానినాదంబు లయి వెల్గు నాదబిందుకళ ల్ప్రమోదమొసఁగ,
నేదేవిసుప్రసన్నేక్షణంబులు శ్రితకామితదంబులై ఘనత వెలయు,
నేదేవిసంకల్ప మెల్లవేళల జగత్సృష్టిసంస్థితిలయ క్రియలఁ గాంచు,
తే. నట్టి వాగ్దేవి సతము మదంతరంగ
సీమ నెలకొని సూక్తుల స్థిరతరదయ

నొసఁగుఁగావుతమని భక్తియుతుఁడ నగుచుఁ
తత్పదాంబుజములను నిత్యంబుఁ గొలుతు. ౧౩

మ. తొలుతం బూజల నందుచున్ విబుధులందున్, సర్వవిఘ్నంబులన్
దొలఁగంజేయుచు, వేడ్కతో జగములందున్ భక్తులం బ్రోచు న
త్యలఘుప్రాభవుఁడౌ గజాననుఁడు నిత్యం బంతరాయవ్రజం
బులఁ బోఁద్రోచి కృతిం గృతార్థత దయన్ బోషింప సేవించెదన్. ౧౪

మ. దివిషత్సైన్యవిభుండు, పార్వతికి నెంతే కూర్చు పుత్త్రుండు, శా
స్త్రవినోదంబుల సంతసించు బుధుఁ, డార్తత్రాణపారీణుఁ, డా
హవనిష్ణాత, శ్రితాఖిలప్రదుఁడు నిత్యంబుం గృపం జూచి మ
త్కవితం బ్రోచును గాత! సూక్తు లిడి సద్భావంబు సంధించుచున్. ౧౫

ఉ. వ్యాకరణంబు లన్నియు మహామతి భాస్కరునొద్ద నేర్చి, య
ప్రాకృతధీసమేతుఁడయి, రామపదాంబుజభక్తి మిన్నయై
పీక నమానుషప్రతిభ వెల్గు మహాత్ముని నాంజనేయు సు
శ్లోకుని గొల్తు నామదిని జోతలొనర్చుచు భక్తి నెప్పుడున్. ౧౬

గురుస్తుతి

సీ. రామశబ్దము మున్నుగా మహాకావ్యంబు లెంతయు నను నభ్యసింపఁజేసె,
విద్యాభివృద్ధికై ప్రీతి మిత్రులయొద్దఁ జదివించె శాస్త్రముల్ శ్రద్ధఁబూని,
నాపురోవృద్ధి సంతతముఁ గాంక్షించుచుఁ బండితుఁ డను ఖ్యాతి వఱల నిలిపె,
శాంభవీదీక్షావిశారదునిం జేసి మంత్రతంత్రంబుల మహిమఁ దెలిపె,
తే. నాగమంబులఁ గవనంబు నధిగమింపఁ–జేసి వ్యక్తిత్వమునఁ గూర్చె స్థిరతరముగ,
నట్టి మద్గురువర్య శేషాద్రిశర్మ–పాదపద్మంబు లెదలోనఁ బ్రస్తుతింతు. ౧౭

మ. సతతం బాశ్రితులం గనుంగొనుటయే సద్ధర్మమై మించఁగా,
హితముం గోరుచు నెల్లవారలకు, నెంతే ప్రీతిఁ గాంక్షల్ మహా
మతితోఁ దీర్చుచు, గ్రంథరత్నముల నిర్మాణంబె యోజించు ధీ
యుతు శేషాద్రిగురున్ భజింతు సతతం బుల్లంబునం దెంతయున్. ౧౮

సీ. జనమంచివంశాబ్ధిచంద్రుండు, శ్రితజన వాంఛితార్థప్రదవరగుణుండు,
సకలాగమామ్నాయ శాస్త్రనిస్తులపాండితీధనాఢ్యుండు, సుధీవినుతుఁడు,
సతతశిష్యప్రశిష్యజనపరీవృతభవనభూషణుఁడు, సదవనరతుఁడు,
శ్రీలలితాంబికాంఘ్రిసరోజచింతనాంచితచిత్తకమలుండు, తతయశుండు,
తే. సకలసద్గ్రంథనిర్మాణచతురుఁ, డఖిల–పండితస్తుత్యుఁ, డభినవవ్యాసుఁ డనఁగ
వెలయు మద్గురు శేషాద్రివిబుధుపాద–సరసిజము లాశ్రయింతు నే సంతతంబు.

తే భాస్కరుని, శీతకిరణుని, భౌము, బుధుని,
సురగురుఁ, భార్గవుని, రవిసూను, రాహు
కేతువుల నవగ్రహములఁ గేలుమోడ్తు
సతము శుభదృష్టి రక్షింపఁ గృతిని, నన్ను. ౨౦

తే సురవరు, ధనంజయుని, ధర్మధరునిఁ, గోణ-నాథవరుణజగత్ప్రాణనవనిధీశ్వ
రులను, ఈశుని దిక్పాలకుల నుతింతు-మత్కృతిని పాలన మొనర్ప మది సతంబు.

సంస్కృత కవీంద్ర వినుతి

ఉ. రామకథాసుధారసముఁ ద్రావుచు నెల్లరు సన్మనాత్ములై
కామితము ల్భజించి, యొడికంబున ముక్తిసుఖాభిరాములై
యేమహనీయు 'నాదికవి యియ్యల' నంచు నుతించుచుంద్రు హృ
త్సీమల, నట్టి వాల్మికిని జిత్తమునందునఁ జేర్చి మ్రొక్కెదన్. ౨౨

ఉ. ప్రాకటరీతి సత్కవిత రాఘవదివ్యకథామృతంబు సు
శ్లోకులు తృప్తిపొందఁ గణుఁబోద్యముగా రచియించి, కీర్తి న
స్తోకమనీష 'నాదికవి క్షోణి' ననంగను వన్నెకెక్కు వా
ల్మీకిపదారవిందముల మించిన భక్తి నెదన్ భజించెదన్. ౨౩

ఉ. వేదములన్ మదిం దెలిసి, విశ్రుతరీతి నఖండయోగ్యతా
పాదకుఁడై విభాగముల బాగుగఁ జేసి, హితంబు మీఱ న
ష్టాదశసంఖ్యఁ బొల్చు శ్రుతిసారపురాణముల న్రచించె నా
శ్రీదయితాంశుఁడైన మునిసేవితు వ్యాసమునీంద్రుఁ గొల్చెదన్. ౨౪

చ. సతతము కాళికాంఘ్రియుగసారసముల్ మదిఁ బూని, తత్కృపా
యుతి వరకావ్యనాటకము లుర్విఁ బుధుల్ నుతియింప వ్రాసి, యు
న్నతిఁ గని, భోజరాజసభ "నాకును నీకును లేదు భేద మీ
క్షితి" నని కాళిచేఁ బలుకఁ జేసిన సత్కవిఁ గొల్తు భక్తితోన్. ౨౫

మ. కవులున్, భూపతులున్, మహామతులు పొంగన్ భావవైశద్య మే
కవి కీయుర్వి నటంచుఁ జిత్తముల సత్కారార్హతం గూర్ప స
త్కవి యాదండి నిజంబుగా ననుచుఁ దాఁ గాళీమహాదేవిచే
మివులం గీర్తిని గొన్న దండికవి సంసేవింతు నెల్లప్పుడున్. ౨౬

చ. ఎవని కృతిం జగానఁ బరియించినచో నవసర్గముల్ గనన్
మివులదు శ్రోత్రశబ్దమని మెత్తురు వాఙ్మయమందుఁ బండితుల్
నవరసయుక్త మంచుఁ గననంబును నమ్మహనీయు మాఘస
త్కవిని దలంతు నిత్యము నెదన్ గడుభక్తిని నిల్పి మ్రొక్కుచున్. ౨౭

చ. పదముల నర్థగౌరవము భాసిలుచుండఁగ భావసౌష్ఠవం
బెదిరెది యంచు నూహల ననేకవిధంబులఁ బండితోత్తముల్
వదలక చర్చచేయునటు భాసురకావ్యము వ్రాసినట్టి కో
విదు, బుధవంద్యు, భారవికవిప్రవరున్ నుతియింతు నాత్మలోన్. ౨౯

సీ. విద్వదౌషధ మను విపులకావ్యము వ్రాసి విశ్వోన్నత స్తుతి వెలసె నెవఁడు?
క్షితి 'నాటకేషు విశిష్యతే' యను ఖ్యాతిఁ గవిపండితుల మెప్పు గనె నెవండు?
క్రమత 'నుచ్ఛిష్టం జగత్సర్వ'మని మెచ్చ గద్యంబు వ్రాసిన కవి యెవండు?
సారస్వతంబున సారంబు నెఱిఁగి నూతనపథం బరసిన ఘనుఁ డెవండు?
తే. సతము వందనశతముల సలిపి, భక్తి-నఖిలు నెంతును నట్టి శ్రీహర్షసుకవి
రాజభవభూతిబాణమురారికవుల-సుకృతులను, వాఙ్మయామృతశుద్ధమతుల.

చ. సరసకవిత్వసంపదను సంస్కృతవాఙ్మయమందుఁ గాంచి యి
ద్ధరణిని గావ్యరత్నము లుదారత లోకము మెచ్చ నిచ్చి బం
ధురగుణులై యశోవిభవపూర్వమహాత్ములై వెలుఁగొందు సత్కవీ
శ్వరుల పదంబు లాత్మనిడి ప్రస్తుతిచేసెద వాగ్విశుద్ధికై. ౩౦

తెలుఁగుకవుల నుతి

ఉ. భారతసంహితన్ దెలుఁగుబాసను దొల్దొలుతన్ రచింపఁగా
నేరుపుఁ జూపి, వ్యాకృతిని నిర్మితిఁ జేసి, యఖండకీర్తి నే
పారుచు, నెందు నాదికవియన్న నుతిం గనినట్టి నన్నయన్
జేరిచి మ్రొక్కెదన్ హృదయసీమఁ గఱంగుచు భక్తి నెంతయున్. ౩౧

ఉ. పన్నుగ నన్నయార్యుఁడు ధ్రువంబుగఁ జూపిన త్రోవ భారతం
బెన్ని తెలుంగుబాసఁ గడు హృద్యపదంబులతోడ పొందికన్
బిన్నలుఁ, బెద్దలున్ బొగడ నేర్పున వ్రాసిన తిక్కనార్యు న
త్యున్నతపాండితీఘనుని నుల్లమునందుఁ దలంచి మ్రొక్కెదన్. ౩౨

చ. కొఱవడె భారతంబునకుఁ గూడదు, నన్నయతిక్కనార్యులే
మది నిటు నిల్పిరో యని సమంబుగఁ దత్పథ మూది, పూర్ణతం
బొదలఁ దెలుంగుచేసి, పటుబుద్ధియుతిన్ హరివంశమున్ బుధుల్
హృదిఁ గణింప వ్రాసిన కవీశ్వరు నెఱ్ఱన భక్తి మ్రొక్కెదన్. ౩౩

మ. సరవిన్ నైషధకావ్యమున్ దెలుఁగుబాసన్ దద్రసాలంకృతుల్
సరణిన్ దప్పక వ్రాసి, బాల్యము మొద ల్సత్కావ్యనిర్మాతయై
బిరుదంబున్ గవిసార్వభౌముఁ డనఁగా విద్వాంసులున్, రాజులున్
గరిమన్ సన్నుతిచేయఁగా వెలుఁగు శ్రీనాథున్ బ్రశంసించెదన్. ౩౪

సీ. నిప్పచ్చరంబను నీరధి మున్గియు నన్యాశ్రయముఁ గోరనట్టి ఘనుఁడు,
జన్మంబు మొదలుగా సహజపాండిత్యబిరుదముఁ గాంచినయట్టి విదితయశుఁడు,
పసితనంబున యోగివరసచ్చిదానందభవ్యకృపం గన్న దివ్యతనుఁడు,
భాగవతంబు నాబాలగోపాలముదావహంబుగ వ్రాసినట్టి సుకవి,
తే. ఒంటిమిట్టను వసియించి, యుల్లమందు-రామపదసేవయే తన కామితమని
నమ్మి, యంకిత మొసఁగి గ్రంథంబు ధన్యుఁ-డైన బమ్మెరపోతన నభినుతింతు.

చ. సరసకవిత్వతత్త్వమును సత్కవివర్యులు సన్నుతింప, ను
త్తరహరివంశకావ్యమును ధన్యత నొందఁగ వ్రాసి, వాసి శ్రీ
హరిహరనాథదేవునకు నంకితమిచ్చిన నాచనాన్వయున్,
వరకవి, సోమనాథు నతిభక్తి నుతింతును భావశుద్ధికై. ౩౬

తే. ద్విపదకావ్యంబునకుఁ గల తేలికనుడి-కల్ల యనఁగ రామాయణకావ్యవిరచ
నంబుఁ గావించి, కీర్తి జగంబు నించి-నట్టి శ్రీరంగనాథుని నభినుతింతు ౩౭

తే. తెల్గుబాస రామాయణదివ్యకావ్య-మును రచించి యశంబును బుడమి వెలయఁ
జేసినట్టి భాస్కరులను జిత్తమందుఁ-దలఁచి వినుతింతు నిస్తుల తత్త్వఘనుల. ౩౮

మ. కలమున్, ఖడ్గముఁ జేతఁబట్టి వరుసన్ గావ్యక్రియల్, యుద్ధకా
శలముల్ గెల్చుచు నాంధ్రభోజుఁ డన శస్తంబైన కీర్తిన్ గవీం
ద్రుల, సామంతుల మన్ననం దనుపు ధీరున్, వీరు, శ్రీకృష్ణరా
యల సద్వాగ్విభవంబుఁ గొల్చెద సతం బాత్మం గడుం భక్తితోన్. ౩౯

సీ. ఆంధ్రభోజాస్థాన మలరించి యష్టదిగ్గజముల ముఖ్యుఁడై ఘనుఁ డెవండు,
మనుచరిత్రము వ్రాసి మాన్యతఁ గవితాపితామహబిరుదంబుఁ దాల్చె నెవఁడు,
సార్వభౌముఁడె తాను జరణంబునం గండపెండేర మర్పింప వెలసె నెవఁడు,
పద్యాంకుశం బంపి పరిపంథిగజపతి ముట్టడి మాన్పిన దిట్ట యెవఁడు,
తే. కోకటాద్యగ్రహారము లొక్కరి కాన్క-గాఁగ సంప్రీతిఁ బడసిన ఘనుఁ డెవండు
అట్టి శ్రీయల్లసానిపెద్దన్నపదము-లధికభక్తి మనంబున నభినుతింతు. ౪౦

మ. కవివర్యుల్ మది మెచ్చఁ, బండితులు వేడ్కన్ శబ్దసారస్యమున్
మివులన్ విస్మయులై నుతింపఁగను నిర్మించెం బ్రబంధంబు శ్లే
షవిహారంబును ద్వ్యర్థికావ్యమును దోషజ్ఞప్రథన్ వెల్గి యే
కవి యప్పాజ్యుని భట్టుమూర్తి వినుతిం గావింతు నిత్యం బెదన్. ౪౧

తే. రాజసభలఁ గీర్తి రాజిల్ల రాయల-సీమ బిరుద మంది రామరాజ
భూషణుం డనంగఁ బొగడొందు కవిచంద్రు-భట్టుమూర్తిఁ దలఁతు భక్తితోడ.

చ. తెలుఁగున సత్ప్రబంధము సుధీవరు లెన్నఁగ వ్రాసి, రాట్సదం
బుల మొగి ముక్కుతిమ్మనయె ముద్దుల పల్కులఁ బల్కువాఁ డనన్
విలసిలి, కృష్ణరాయ లెదఁ బెద్దనకుంబలె సత్కరింప సు
స్తులమతి నందివంశపరిశోభితుఁ దిమ్మనఁ బ్రస్తుతించెదన్. ౪౩

ఉ. అయ్యల నొంటిమిట్ట వసియించి, జగత్పతి రామభద్రునిన్
నెయ్యము మీఱఁ గొల్చుచు, మనీషులు మెచ్చఁగ రామసత్కథన్
దియ్యని పల్కులన్ వరకృతిన్ రచియించిన రామభద్రు నా
యయ్యలరాజవంశమణి నాత్మఁ దలంచి సతంబు మ్రొక్కెదన్. ౪౪

చ. పలుకుల సౌష్ఠవంబునకు, భక్తికిఁ గావ్యవినిర్మితిన్ గవీం
ద్రులు మది మెచ్చు టబ్బురము దోఁప దదేరికిఁ, గాని ధూర్జటిన్
సలలితకావ్యభక్తి నెద సంతసమొందఁగఁ జేసినట్టి స
త్కులజుని ధూర్జటిన్ గొలుతుఁ గోరిక మత్కృతికీర్తి భాసిలన్. ౪౫

చ. ధరణిఁ దెనాలివంశమునఁ దా జనియించి, కవిత్వసంపదన్
బరమయశంబు నింపి, వరభక్తులు మెచ్చఁగఁ బాండురంగభూ
వరు చరితంబుఁ గావ్యముగ వ్రాసిన సత్కవి రామకృష్ణు ను
ద్ధురగుణశోభితుం దలఁతుఁ దోరపుభక్తిని గేలు మోడ్చుచున్. ౪౬

ఉ. ఉల్లములందుఁ బండితు లహో యని మెచ్చఁగ సత్సభాస్థలిన్
బల్లిదుఁడై, కవిత్వమున 'వాణియె నాదగు రాణి' యన్న శ్రీ
పిల్లలమఱ్ఱివంశ్యుఁ, గవివిశ్రుతునిన్, బినవీరభద్రునిన్
సల్లలితాత్ముఁ, బ్రౌఢమతి, జైమినిభారతకర్తఁ గొల్చెదన్. ౪౭

చ. సరవిఁ బ్రబంధరత్నముల సానలుదీర్చినవాఁ డుగుక్కుటే
శ్వరున కలంకరించి, బుధవర్యుల సన్నుతిఁ గాంచి, సత్కవీ
శ్వరుఁ డనఁ గూచిమంచికుల వార్ధికళానిధియైన తిమ్మనన్
గురుతరభక్తి నెమ్మదిని గొల్తు సతంబు కవిత్వసిద్ధికై. ౪౮

ఉ. పొంగఁగ సత్కవీంద్రులును, భూపతులున్ గవితాచమత్కృతిన్
రంగుగ ద్వ్యర్థికావ్యమును వ్రాయుటె కాక ప్రబంధము ల్సభా
రంగములన్ నుతింగనఁగ వ్రాసిన రాయలసీమవాసు శ్రీ
పింగళిసూరనార్యకవిఁ బ్రీతిఁ దలంతు సతంబు భక్తితోన్. ౪౯

ఉ. శ్రీరఘునాథరాయసభఁ జేరి, ప్రబంధముల న్రచించి, శృం
గారరసాంబురాశి మునుఁగంగ సదస్యుల మెప్పు, రాజస
త్కారముఁ గొన్నయట్టి వనితామణులన్ గవయిత్రులన్ మదిన్
బేరిమి నెంతు ముద్దుపళనిన్ దమిఁ దత్కవితాప్రశస్తికై. ౫౦

ఉ. రామచరిత్ర శ్రోత్రమధురంబుగఁ గావ్యము వ్రాసి యంకితం
బీమహి నీలకంఠునకు నిచ్చి, కులాలకులంబునందు ను
ద్దామయశంబుఁ గాంచి వనితాతతిఁ బూజ్యతఁ గొన్న మొల్లమన్
వేమఱు సంస్మరింతు బుధవిశ్రుతసత్కవయిత్రియం చెదన్. ౫౧

చ. అనువుగ వేంకటాచల మహత్త్వము కావ్యము వ్రాసి, పెద్దలె
ల్లను బొగడంగ శాస్త్రతతులన్ గల తత్త్వము నెల్ల నేర్పునన్
జనులకుఁ దెల్పఁగా ద్విపదశైలిని వ్రాసిన శ్రీనివాసభ
క్తినిరత వేంగమాంబిక మదిం గొనియాడుదు భక్తితోడుతన్. ౫౨

శా. బాలవ్యాకరణంబునాఁ దెలుఁగునన్ భాషాభివృద్ధిక్రియా
శీలుండై రచియించి, పాండితిని నిస్సీమత్వమున్ గద్యకా
వ్యాళిం గీర్తిని గొన్న సత్కృతిని, శ్రీశాంఘ్ర్యర్చనాయత్తవా
గ్జాలుం జిన్నయసూరినిం గొలుతు మత్స్వాంతంబునం దెంతయున్. ౫౩

మ. అమితోత్సాహము సంఘసంస్కృతిని విద్యావ్యాప్తినిన్ దేశభ
క్తిమహత్త్వంబున నెన్నఁగాఁ గృతుల లెక్కింపంగ లేనట్లు వ్రా
సి, మనీషన్ బిరుదంబు లంది, కృతికై చెల్వొందు శ్రీమాన్యునిన్,
విమలున్ గొల్తును గందుకూరికులజున్ వీరేశలింగాఖ్యునిన్. ౫౪

ఉ. వేదమువంశ మర్థయుతి వెల్గఁగ నాగమవేత్తయై, బుధా
పాదితకీర్తి గ్రంథము లపారముగాఁగ రచించి, వ్యాఖ్య లా
ర్యాదృతినొంద వ్రాసి బిరుదాళి నెసంగు కళాప్రపూర్ణ, ని
త్యోదయకీర్తిసాంద్రు మది నుంతును వేంకటరాయశాస్త్రినిన్. ౫౫

శా. కొక్కొండాన్వయుఁడై తెలుంగుఁగవితం క్రొంగ్రొత్తత్రోవన్ బుధుల్
మ్రొక్కంజాలు తెఱంగునన్ నడిపి సంపూజ్యప్రథం దాల్చి పెం
పెక్కన్ వేంకటరత్నమన్ విబుధుఁ డెంతేఁ, దత్పదాంభోజముల్
చక్కన్ నామదిఁ జేర్చి కొల్తు నెపుడున్ జ్ఞానంబు దీపింపఁగన్. ౫౬

చ. నిరుపమకావ్యనిర్మితికి నిచ్చలు మెచ్చఁగ రాజపూజ్యుఁడై
గరిమ శతావధానము లఖండమనీష బుధుల్ నుతింప ను
ర్వర నొనరించి, సద్యశము భాసిల దిక్కుల మించినట్టి శ్రీ
తిరుపతిసత్కవీంద్రుని మదిన్ వినుతింతును భక్తి మ్రొక్కుచున్. ౫౭

సీ. నాగపూడికులంబునన్ జననంబంది, న్యాయవాదిపదంబునం జెలంగి,
ద్రవిడాంగ్లేయాంధ్రదైవతభాషల నిరుపమానప్రజ్ఞ నెఱయ నెగడి,
కావ్యము ల్రచియించి కావ్యవిమర్శకాగ్రేసరబిరుదంబు వాసి నంది,
క్షీరాధిపతులు సంప్రీతి సమ్మానింప ధన్యుఁడై కీర్తి నిత్యముగ నిలిపి,

తే. తిరుపతిపురాన వసియించి పరమభక్తి
కలితుఁడై శిష్యజనమోద కలన వెలసి
నట్టి గురుని కుప్పుస్వామి నార్యుఁ గొలుతు
సంతతము భక్తిసంయుక్తి స్వాంతమందు. ౧౮

సీ. శ్రీపాదవంశసుస్థిరయశోవిభవుండు, సర్వాగమామ్నాయ శాస్త్రగురుఁడు,
కవిసార్వభౌమవిఖ్యాత మహామహోపాధ్యాయబిరుద విభ్రాజితుండు,
భారతసంహితఁ బరిపూర్ణముగఁ దెనుంగునఁ బూర్వశైలి వ్రాసిన మనీషి,
రమ్యశతాధికగ్రంథనిబంధనచతురుండు, బుధవరసన్నుతుండు,
తే శిష్యజనవత్సలుండు, విశిష్టశీలుఁ, డాశ్రితావనగుణాఢ్యుఁడు, మహానుభావుఁ
డైన శ్రీకృష్ణమూర్తిశాస్త్ర్యాఖ్యకవుల-ముల నెదం దాల్చి భక్తితో మ్రొక్కులిడుదు.

చ. వరుస శతావధానము లవారిగ సల్పి, జగంబునందు శ్రీ
తిరుపతికిం బ్రియుండగుచు గిట్టపుఁగైతఁ జెలంగు కబ్బముల్
సరవి రచించి మించిన విశాలయశస్కునిఁ, జెళ్ళపిళ్ళన
ద్వరకులు వేంకటేశ్వరబుధప్రవరు న్వినుతింతు నిత్యమున్. ౨౦

చ. తెనుఁగున, సంస్కృతంబున మదిన్ బుధులెన్నఁగఁ గబ్బముల్ జగ
ద్వినుతముగాఁగఁ గూరిచి, సుధీనిధులై, సభలందు మేటి కీ
ర్తిని జెలువొందు సత్కవులఁ బ్రీతిఁ దిరంబుగ నిల్పి నెమ్మనం
బున వినుతింతు జోతలిడి పూర్ణకృపాయుతి నన్నుఁ బ్రోవఁగన్ ౨౧

చ. తమ కవితాధనంబు వివృతంబుగ నెల్లరుఁ దృప్తినొందఁ బే
ర్మిమిఁగొనఁ జూఱలిచ్చి మదిఁ బ్రీతిని బొందుటయే ఫలంబుగాఁ
దమ జని కంచు నెంచు కవితల్లజులన్ గడుభక్తి మ్రొక్కి నే
మమునను బ్రస్తుతింతు బుధమాన్యచరిత్రులఁ గీర్తిపాత్రులన్. ౨౨

ఉ పూర్వకవీంద్రులన్ భువనపూజ్యుల నెల్లర భక్తి మ్రొక్కి, యీ
యుర్వరఁ గీర్తితో వెలయుచున్న మహాత్ముల వర్తమానులన్
సర్వకళావిశారదుల, సాధుగుణాఢ్యుల, సత్కవిత్వవా
గ్ధార్వహులన్ మదిం దలఁచి దోసిలి యొగ్గి నుతింతు నెంతయున్. ౨౩

చ. ఇది యొక క్రొత్తత్రోవ యని యెంతయుఁ జాటుచుఁ బూర్వరీతులే
పదిలముగా గ్రహించుచును భావకవిత్వపుఁ బక్కి యిట్టిదం
చుదితకుతూహలంబున మహోన్నతి కెక్కఁ జరించుచుండు కో
విదుల, మహానుభావులను వేమఱు నామది సంస్తుతించెదన్. ౨౪

ఉ. నవ్యకవిత్వ మంచు, నిది నాగెపుజాడ యటంచు, నెల్లరున్
గావ్యము లిట్లు వ్రాయవలెఁగా యని పేర్మి నుపన్యసించుచున్

శ్రావ్యముగాఁగ నూత్నమగు సాహితిఫక్కి మెలంగఁజేయు సం
భావ్యులఁ, బూర్వశాస్త్రగుణభావుల నాత్మఁ దలంచి మ్రొక్కెదన్. ౬౫

మ. యతియుఁ, బ్రాసము, లక్షణంబు లవి యేలా, యన్నులౌ భావసం
తతులన్ దెల్పుట కంచు నిచ్చఁగల పంథన్బూని, యా పూర్వు లే
గతిఁ బద్దెంబుల వ్రాసి రాక్రియలనే కావ్యంబులన్ వ్రాయు స
త్కృతులన్ భావకవీంద్రులన్ గొలుతు నెంతే భక్తియుక్తుండనై. ౬౬

క. ఒక్కరి కబ్బములందున-దక్కక తప్పులనె పట్టు తాత్పర్యముతో
నొక్కమొగి మెలఁగు మాన్యుల-యక్కజమగు శక్తియుక్తి నభినందింతున్.

చ. యతియును బ్రాసమున్ బదము లర్థము భావము నేర్చి కూర్చి దు
ర్మతిఁ దమ కీర్తి యెల్లెడలఁ బ్రాఁకఁగ నెంచు మహామహుల్ జనా
దృతి నెటు గాంతురో యనెయు దిట్టతనంబె యటంచు వారిఁ జే
రి, తగ నమస్కృతుల్ సలిపి, ప్రీతి నొసర్తు హితోపదేశమున్. ౬౭

సీ. ఈవిధంబున నిష్టదేవతాస్తుతియును, గురువరచరణతామరసనుతియు,
గీర్వాణకవివరకీర్తనప్రతతియుఁ, దెలుఁగుఁగైసరులను గొలుచుటయును,
ప్రాచీనకవిపాదపద్మసద్భజనంబు, నాధునికకవిసంప్రార్థనంబు,
వర్తమానకవీంద్రపదసంస్తవంబును, భావకవీంద్రుల ప్రస్తుతియును,

తే. నవ్యసాహిత్యపరులకు నతులిడుటయుఁ,
గుకవులను గూర్చి హిత మెదఁ గోరుటయును
సలిపి, సద్గ్రంథనిర్మాణసరణి జన్మ
సఫలతం గాంచ నెంచితి స్వాంతమందు. ౬౮

తే. కోరిక తలంపఁ బెద్దది, నేరుపు మెయి-సేతలం పేక్రియను దీర్చు, టేది గ్రంథ
రచనకున్ వస్తువో యని ప్రశ్నవితతి-కలుగుచుండంగ నొకనాఁడు కలిగె నూహ.

చ. సకల చరాచరంబునకు శాశ్వతమై తగు కారణం బదే
దో కనుఁగొనంగనౌ ననుచుఁ దోఁచుటయున్, వెస నంతరాత్మ పా
యక ప్రకృతిస్వరూపయగు నాద్యయె యంచని బోధచేసె, న
య్యకలుషబుద్ధికిం గత మహా తెలియంగనుజాల రెవ్వరున్. ౭౧

తే. ప్రకృతి యాదిశక్తి భావింపఁగా నేర-రెవ్వరును దమంత, నెట్టు లామ
హేశ్వరీప్రభావ మెఱుఁగంగనగు నాకుఁ!-దద్విచిత్రలీలఁ దఱమె యెఱుఁగ! ౭౨

చ. గురుఁ డెఱిఁగించెఁ దన్మహిమఁ, గోరిక మీఱఁగ దాని నూఁది సం
బరమున నాత్మలోపలను బ్రత్యహమున్ మననంబుచేయుచున్
గరము తదుక్తరీతి సవికారతఁ జర్చ యొనర్చుచుండినన్
దిరముగ నిల్వదయ్యెను మదిం బరమార్థవిచార మేలొకో! ౭౩

తే. తెలియఁజాలక తల్లీల, ధృతి వహించి
పరనమొనరించి గ్రంథము ల్పదిలముగను,
శక్తి యున్నంత గ్రహియించి, సర్వశక్తి
మహిమ గ్రంథంబు నిర్మింప మదిఁ దలఁచితి. ౨౪

క. ఏనాఁ డిటు లెంచితినో-యానాఁ డుదయమున బాలుఁ డరుదెంచి వడిన్
జేనిడె సూచీపత్రికఁ-దానిచ్చెను బత్రవహుఁడు తగ నిపు డనుచున్. ౨౫

తే. పత్రికను విప్పఁగా మహాభాగవతము
పేరు కనఁబడె దానిపై, గౌరవంబు
మదికిఁ గల్గెను, నీయూహమహిమ యేమొ
యెఱుఁగఁజాలను, జిచ్ఛక్తిహితమె యగును. ౨౬

తే. అపుడె వ్రాసితి బొంబాయి కాయమేయ-భాగవతమును బంపఁగా, జాగులేక
వచ్చె నాదివ్యకోశంబు, వైళమ కొని-కొంతఁ జదివితి, నామదిఁ గొంకు తొలఁగ.

సీ. చదివినాఁడను మున్నె సంపూర్ణముగను దేవీభాగవతమును విషయ మెఱుఁగ,
శ్రీభాగవతమును బ్రీతితోడఁ బఠించినాఁడఁ బరీక్షకై జాడఁదెలియ,
నీపురాణములలో నెందును గనఁబడనట్టి యాప్రకృతిమహామహిమము
కనఁబడుచున్నది కడువిశదంబుగా నీ భాగవతమున నెంచిచూడ

తే. ననుచు నీనిని దెనిఁగించియఖిలజనము-లకును శ్రీదేవిమహిమంబుఁబ్రకటరీతిఁ
దెలుపనగు నంచు మదినెంచి దేవిదివ్య-పాదపద్మంబు లెదనుంచి ప్రస్తుతించి.

క. సలలితభాషను దెనుఁగున-నలనఱచిన నెల్లవారి కవగతమగు ని
య్యెల ననుచుఁ బూనితిం గృతి-కలనకు శ్రీదేవి పనుపఁ, గడు ముద మొదవన్.

క. శ్రీదేవీప్రేరణమున-శ్రీదేవీమహిమఁ దెలుపు కృతి రచియింపన్
వే దొరకొనె, నీ సత్కృతి-మేదిని విబుధాదరంబు మేకొనుఁగాతన్. ౩౦

క. పరమేశ్వరి పలికించిన-సరణిఁ బలుకువాఁడఁ గాని చతురకవిత్వ
స్ఫురణము నాయెడఁ గలదే?-పరిపూర్ణకృపం దలంపవలయు నను బుధుల్.

ఉ. మూలమునందు నుండు పదముల్ మదిఁ దోఁచినయంతవట్టు నా
శ్రీలలితాంబసత్కృప స్మరించుచుఁ బద్దెము లల్లినాఁడ, నేఁ
జాలుదునే పరాప్రకృతి శక్తమహామహిమంబు దెల్పఁగా,
మూలమునందు భావముల మూల మెఱింగి రచింప గ్రంథమున్ ! ౩౨

క. క్షమియింపుఁడు దోసంబులు,-దమితోడఁ బరిగ్రహింపఁ దగు గుణవితతుల్,
విమలాత్ములార ! కోరిక-తమకుఁ దెలుపుచున్నవాఁడ, దయఁ గనుఁగొనుఁడీ.

చ. క్షితిపయి నాదు పాండితి విశేషముగాఁ దెలుపంగఁగోరి యీ
కృతి రచియింప యత్నము నొగిన్ జలుపన్, బరమేశ్వరీదయన్
మతి నిడి వ్రాసినాఁడ, నిట మాన్యులు దోసము లున్న దిద్ది స
త్కృతి నొనరింపుఁ డంచు మదిఁ గీర్తనచేయుదు భక్తితోడుతన్. ౫౩

తే. నాదుచరితంబు నింపుక నతులొనర్చి-మనవి చేయుచునున్నాఁడ, మనమునందు
విసుగుఁ బూనక వినుఁడు, జీవితము ధన్య-మగువిధంబున దీవింపుఁ డాత్మలందు.

చ. కలదు త్రిలింగ దేశ మనఁగా భరతావనిభూషణంబుగాఁ,
దెలుఁగునుడుల్ జనంబుల హృదిం గడుఁ బ్రీతిని గూర్చ, నందు రా
యల పరిపాలనంబున శుభాకృతి రాయలసీమ నాఁగ ని
మ్ముల దాగడొంగు భాగి మది పూర్ణముడం బడు గొల్చు నున్నతిన్. ౫౪

తే. అం దనంతపురం బనునట్టి మండ-లం బొకం డున్నయది, దాన నొప్పుచుండు
వర పినాకినినది, దాని పరిసరమున-ననికిఁగాంచఁ బురంబులు, జనపదములు.

ఉ. దివ్యపినాకినీవరనదీతటమందునఁ దాడిపత్రినా
భవ్యపురం బుమాపతికి, భార్గవిభర్తకుఁ గాఁపురంబునై,
సేవ్యసుతీర్థమై వెలయు క్షేమదమై, యుపమండలంబునై,
నవ్యవిలాసవైభవజనప్రకరాన్వితమై వెలుంగుచున్. ౫౫

తే. కొంతకాలంబు బళ్లారిఁ, గొంతకాల-మాపురము కడపమండలంబునఁ జేరి
యుండెఁ, దుది ననంతపుర ఖ్యండలమున-స్థిరత దీపించె నికటసంస్థితి నెసంగి.

తే. ఆపురికి యామ్యభాగంబునందు నెలయు-గ్రామ మొక్కటి చిన్నదై, గాండ్లపాడు
దాని కభిధానమగు, నాదు తండ్రితాత-లకు నివాసంబుగాఁగఁ జెలంగుచుండు.

ఆ. గాండ్లవారిచేతఁ గట్టింపఁబడుటచే-గాండ్లపాడునాఁగ గణుతికెక్కఁ
బేరు, మున్ను ద్విజులు పెక్కు రుండిరనుచు-దెలుపుఁ జరిత మరయఁ దెల్లముగను.

ఆ. ఇపుడు చిన్నగ్రామమేయైన, సద్దాని-స్థితిని దలఁచిచూడ దేవమాన్య
ములును, ద్విజుల మాన్యములు పెక్కులెక్కల-లోనఁ దెలియఁబడు ననూనరీతి.

క. ఏనుఁగుల తొట్టి కల, దది-యేనుఁగులకు నీరు ద్రావ నేర్పఱచినటుల్
పూనిక గ్రామము పొంతనె-యేనుంగుల యునికి పూర్వమెఱిఁగించు ధృతిన్.

తే. ఆపురంబునఁ గల కాపు లంకలు ద్విజ-దైవభక్తిపరాయణుల్, తత్త్వవిదులు,
పూర్వచరితప్రియుల్ జనముఖ్యు లధిక-సద్గుణాఢ్యులు, నిర్మలస్వాంతయుతులు.

తే. కరణములు, రెడ్లు పండితవరులమీఁదఁ-బక్షపాతము గలుటవలనఁ బెక్కు
భూముల బహూకరించి పెంపుగను నిలుప-నిలిచినారలు శ్రోత్రియుల్ కలిమిబలిమి.

సీ. మాయూరి తూర్పు తిమ్మాపురం, బాగ్నేయమునను గూడూరు, శమనుని దిశను
పోతిరెడ్డిపల్లియుఁ, బొసఁగ నైఋతిని బుట్లూరు, పశ్చిమమున నొగి వెలయును
వేంగన్నపల్లె, యుత్తరాని వాయుదిశను చిప్పారెడ్డిపల్లె, కుబేరదిశను
దాడిపత్రిపురంబు, తగు నీశు దిశను జల్లావారిపల్లె యలరుచునుండు,

తే. నన్నియును రైతులకుఁ దగినట్టి యూళ్లు,–నల్లరేఁగడినేలపెం పుల్లసిల్లుఁ,
బాడిపంటల కిరవయి భద్ర మొసఁగుఁ,–దాడిపత్రితాలూక సత్యమున కిరవు.

తే. గాండ్లపాటికిఁ బడమటఁ గలదు పల్లె–కమ్మవారికి వసతి వేంగన్నపల్లె,
యందుఁ గలవార లాత్మీయులట్లు మాకు–సాయ మొనరించుచుందురు సంతతంబు.

తే. గాండ్లపాటికిఁ బ్రక్కను గలదు పోతి–రెడ్డిపల్లెయనంగ, సంప్రీతి నందు
మేటికమ్మవారును, బాకనాటిరెడ్లు–కలరు ద్విజభక్తియుతులు, సత్కార్యరతులు.

తే. గాండ్లపాడు గ్రామంబు కుగ్రామమయినఁ
దెలిసి, తృణకాష్ఠజలసమృద్ధికిఁ గఱవని
ప్రజల యాదృతిని వసింపవలయు నంచుఁ
దలఁచి నిల్చిరి విప్రులు ధర్మబుద్ధి. ౯౯

సీ. ఆ విప్రసమితిలో నగ్రగణ్యులనంగ మాన్యులై యిట జనమంచివారు,
తెలుఁగునాడనఁబడు తెలగాణ్యవైదిక బృందంబు మిగుల కీర్తిని జెలంగి
యాజుషశాఖవేదాభ్యాసకులును, నాపస్తంబసూత్రులై వఱలువారు,
కర్మనిష్ఠులు, శాస్త్రమర్మవిధిజ్ఞులు, సతతసదాచారనిరతయశులు,

తే కాశ్యపసగోత్రు లగుచు విఖ్యాతి గాంచి–ప్రజలకును ధర్మశాస్త్రాదిపద్ధతులను
సలలితంబుగఁ దెలుపుచు నెలమి గాండ్లపాటి సత్కీర్తి మించఁగా వఱలుచుంద్రు.

ఉ మా జనమంచివంశమున మాన్యగుణాఢ్యులు, వేదశాస్త్రవి
భ్రాజితు, లూర్జితుల్, బుధవరప్రవరుల్ జనియించి, గ్రామమా
తేజము మీఱ శిష్యులకుఁ దెల్పుచు విద్యల సార్వకాలమం
దోజ వెలుంగుచుండిరి మహోపకృతిన్ స్తవనీయకర్తులై ౧౦౧

క. ఏనినాఁడు మా పితామహుఁ–డనుజకు సాహాయ్య మొసఁగి నరుదెంచె దయన్
దనరైన కడపమండల–మును వదలి కుటుంబయుక్తముగ నిట కనుచున్. ౧౦౨

సీ. కడపమండలమునఁ గ్రాలు బద్వేలునా నుపమండలం బొండు నున్నతిఁగని,
వేముకుంట యనంగ గ్రామంబు తత్సీమఁ గలదు, మా జనమంచికులమువార
లందు నావాసంబు నలవరించుకొని శాస్త్రవిహితకర్మలఁ దప్పరులయి,
జనసమూహంబులు సన్నుతిచేయఁగా నాగరించుచునుండి రర్థ్వరాదు

తే. లనుచు నొప్పెఁగినవాఁడు మదన్వయమ్మును–సరసి, మావంశమందునఁ బరఁగుచుండు
నాద్యుఁడై నరసంభట్టు విద్యలందుఁ–బూజ్యతముఁ డన లబ్ధసమ్మానియగుచు.

క. ఆ నరసంభట్టునకును-సూనులు నల్వురు జనించి క్షోణి వెలసి వి
జ్ఞానమునఁ జతుర్వేదము-లాననఁగా నుండి రెలమి నార్యులు పొగడన్.

సీ. అం దగ్రజుండు విఖ్యాతుఁడై నరసింహసోమయాజి యనంగ క్షోణి వెలసెఁ,
బెద్దపుల్లంభట్టు, నొద్దికతో మల్లుభట్టాఖ్యుఁడు, ననంతభట్టుబిరుదుఁ
డనఁబడు సోదరు లఖిలశాస్త్రాభిజ్ఞులై యశంబున మించి యలరుచుండ్రు,
వారలు జనమంచివంశదీపకులయి ప్రతిభఁ గాంచిరి జనాదృతి గడించి,

తే. యందు మల్లుభట్టాఖ్యున కధిక యశులు-సుతులు నరసభట్టును, మఱి సూరిభట్టు,
చెన్నభట్టను నాఖ్యల నున్నతులయి-సుతులు పుట్టిరి యసదృశమతు లనంగ.

ఉ. వారలలోఁ గనిష్ఠుఁడు ప్రభావయుతుండయి చెన్నభట్టిలన్
గారవమొప్ప వేదములు, కావ్యములుం బఠియించి, నిస్తులో
దారత నెల్లవారలకుఁ దా నుపదేష్ట యనంగఁ గీర్తితో
ధారుణిఁ గీర్తిగాంచెఁ బరతత్త్వవిశారదుఁడై సుశీలుఁడై. ౧౦౬

తే. ఆ మనీషికి నందనుండై చెలంగె-మల్లుభట్టు మహామతి, మంత్రతంత్ర
వేత్త, యసదృశవిజ్ఞాన విభవుఁడు, విబుధ-వర్యుఁడై జనములు తన్నుఁ బ్రస్తుతింప.

సీ. కాశీపురమునకుఁ గడు భక్తి మీఱఁగఁ గాల్నడకతోఁ బోయి, యనంతమహిమ
నొప్పారు జాహ్నవి నుదుతీర్థసముదయములఁ గ్రుంకులిడి, దైవములకు మ్రొక్కి,
విశ్వనాథునిఁ గొల్చి, శాశ్వత పుణ్యంబు లొసఁగు హరిద్వార ముత్సుకుఁడయి
చేరి, భాగీరథి సేవించి తత్తీరమున నవగాహనంబును నొనర్చి,

తే. సిద్ధసంశ్రితబదరికా సీమ కరిగి-యందు నారాయణునిఁ గని, యభినుతించి,
వసుమోక్షదాయకసత్పుణ్యములను భ-జించి మించెను జనులు నుతించుచుండ.

తే. తీర్థయాత్రలఁ గావించి, దేవదేవు-నాత్మఁ దలఁచుచుఁ, గావడియందుఁ బుణ్య
తీర్థజలమును గొనివచ్చి దివ్యమహిమ-నాశ్రితులఁ బుణ్యవంతు లౌన ట్లొనర్చె.

క. ఆ మల్లుభట్టు తనదగు-సీమ విడిచి యనుజఁ బ్రోవఁ జెలఁగుచు మదిలోఁ
బ్రేమమున గాండ్లపాటిని-ధామముగా నెంచి వచ్చె ధర్మజ్ఞుండై. ౧౧౦

ఆ. అపుడు తాడిపత్రియుపమండలంబు బ-ళ్లారిమండలమునఁ జేరియుండె,
గాండ్లపాటిజనులు కడుభక్తితో మల్లు-భట్టు ప్రోచుచుండ వఱలుచుండె. ౧౧౧

తే. అంత నామల్లుభట్టు విఖ్యాతకీర్తి,-శాస్త్రపరిచయమును విని జనులు గాండ్ల
పాటియందే వసింపఁగాఁ బ్రార్థనంబు-సలుప వదలక యందుండెఁ జతురుఁడగుచు.

ఉ. ఆ యసమానధీయుతుఁ, డహార్యగుణుం డొగిఁ బెండ్లియయ్యెఁ దే
జోయుతఁ గృష్ణవేణమ విశుద్ధచరిత్రను, భక్తియుక్త, న
త్యాయతభర్తృపాదయుగతామరసాశ్రయధన్యచిత్త, సు
జ్ఞేయచరిత్ర, దైవగురుశిష్టసమూహసమర్చనారతన్. ౧౧౩

సీ. ఆ మహాసాధ్వియం దావిర్భవించిరి సుతు లిర్వు, రొకసుత, సుబ్బయార్యుఁ
డం దగ్రజుండు, రామాంబ యామహాసీయు సోదరి, యయ్యెను సోదరుండు
నరసార్యుఁ డనఁగ ననంతవిఖ్యాతితో, మువ్వురు ప్రియము సమ్మదము వెలయ
నభివృద్ధినందిరి, యందులో సుబ్బయార్యుఁడు పెండ్లియాడెఁ బూజ్యు లెదమెచ్చ
తే. మిగులఁ బ్రేమంబుతోడ మామిళ్లపల్లె-వంశజాత సీతమ్మనా వఱలు సుగుణ
గణ్య, భర్తృశుశ్రూషణ కలితహృదయ,-వారి కేను జనించినవాఁడఁ బ్రీతి.

ఆ. నాకుఁ జిన్నతండ్రి నరసింహశాస్త్రి య-ద్బాల్యమున ననంతవత్సలత్వ
మొనరఁ బెంచుచుండి చనె దివంబును జేర-శోకవార్ధి ముంచి సోదరులను.

సీ. పలువురు పుత్త్రు లుత్పత్తినందిరి నాదు తలిదండ్రుల, కదేమి దైవమాయ
యగునో మఱుంగ,నయ్యందఱిలోన వేంకటరామయ యన నొక్కఁడె మిగిలెను
నాకు సోదరుఁడయి, ప్రాకటంబుగ వాని మాజనకుఁడు దుగుమట్ల గ్రామ
పాలకవర్యుండు పాలవాదికులాబ్ధిచంద్రముఁడయిన శేషయ్య కొసఁగె
తే. దత్తపుత్త్రునిగా, వారు దయ దలిర్పఁ-బెంచుకొనుచుండి, రంతటఁ బ్రీతి నాదు
తల్లిదండ్రులు ముద్దులతనయుఁ డంచు-నన్నుఁ బోషించుచుండి రత్యున్నతముగ.

క. తరువాత సుతులు సుతలును-వరుసగ మజ్జనకులకును బ్రభవించిరి, వా
రరిగిరి బాల్యంబందున-సురపురికిం బితరు లెదను శోకింపంగన్. ౧౧౭

తే. పదునొకండు వత్సరముల ప్రాయమందు-నాదు జనకుఁడు దివికేగ నన్ను వీడి,
దుఃఖవారిధి మున్గి నాదు జనయిత్రి-బాలు నన్బట్టుకొని భువి వనరుచుండె.

తే. ఇట్టి విషమపరిస్థితు లెసఁగుచుండఁ
గూఁతుపై, మనుమనిపయిఁ గూర్మి వెలయ
నాదు మాతామహుండు సన్మతి నుపకృతిఁ
శేయఁగా వచ్చెఁ దలఁచి యమేయకరుణ. ౧౧౯

తే మాకు నాధారమయి నిల్చి మమత వెలయఁ-దండ్రి లేని కొఱంతను దలఁపనట్టు
లెల్లవిధములఁ బోషించు చుల్లమునకు-హాయి గలిగించుచుండె నమేయరీతి.

క. జనకుం డుపరతుఁడైనన్-మనమున శోకించు మమ్ము మాగ్రామమునన్
ఘనమతులగు జనములు ప్రే-మను గని యోదార్చి రపుడు మహితోక్తులచేన్.

తే. వేడ్కతో శిష్యతతిఁ గూర్చి ప్రియము నెఱపి
పాఠశాలను నింటిలోపలనె నిలిపి
యక్షరాభ్యాస మొనరించి యనువు మెఱయ
నాదు జనకుండె చదివించె నన్ను మొదట. ౧౨౨

తే. అమ్మనేనివంశ్యుఁ డైన వేంకటసుబ్బ-యాఖ్యకమ్మకులుఁ డహార్యరీతి
నాదు తండ్రి శిష్యుఁ డై దయ నను గాంచి-చదువుచెప్పె వ్రాయఁ జదువునట్లు.

సీ. మాకుటుంబమునకు మమత నేలోపంబుఁ గలుగకయుండఁగా గాండ్లపాటి
యందు మాతండ్రికి నాత్మబంధులరీతి నుండిన రైతు లభ్యున్నతముగ
సాయంబు చేయుచు, స్థానంబు వదలక యందె వసింపఁగా డెందమునకు
నిబ్బరంబును గూర్చ దుబ్బరామయయు, బోదనపాటి కోశన్నయును, దదీయ
తే. వంశ్యుఁడైన సుబ్బయ్యయుఁ బరమకరుణ-నెల్లవారలు గూడి మాతల్లి నధిక
గౌరవంబునఁ గాంచుచుఁ, గష్టకాల-మునను బ్రోచిరి మమ్ము సంపూర్ణకరుణ.
క. మాతామహుండు మాకుం-బ్రీతిం గూర్చుచును నిలిచి, విసువక, దుఃఖా
పేతుల నార్తిం బాపెను,-నాతిథ్యాత్ముని చరిత్ర మభివర్ణింతున్. ౧౨౯
తే. తాడిపర్తికిఁ గ్రోసెఁడు దవ్వునందు-నీనుతిశఁ బెన్నయొడ్డున నెసఁగు రంగ
నాథునకు నిమ్యవసతి, పుణ్యముల కిక్క-యగుచు నాలూరనంగ విఖ్యాతికెక్కె.
సీ. ఆలూరు మాయూరి కాయ క్రోశద్వయదూరమునం దుండు, నాయూరి నుండ్రు
తెలగాణ్యవిప్రులు నిత్యసదాచారవంతులు మామిన్నపల్లెవంశ్యు,
లవ్వారిలో మహిమాఢ్యుఁడు నాదు మాతామహుం డొప్పారు ధన్యజీవి
ధరణిఁ బేర్వడసి సీతారామయ యనంగ నుపకారపరుఁడగు కృపను వెలసి,
తే. తానె మార్గముఁ జూపించి కోనయందు-మంటపంబును నిర్మించె, మఱియు గరుడ
వాహనము రంగనికి సమర్పణము సుత్స-వార్థవిగ్రహములతోడ భక్తిఁ జేసె.
క. ఆ సీతారామార్యుఁడు-చేసిన సత్కార్యవితతి క్షితిఁ బెంపెసఁగున్,
దోసముల పొంతఁ బోవని-యా సుగుణాఢ్యుడు తాత మాకు నయ్యె విధికృపన్.
తే. ఆ మహాత్మునకు గ్రభార్యయగు సుబ్బ-మకు జనించెను మాతల్లి మాన్యచరిత,
యవల రెండవభార్యయై యలరె నాదు-జనకు సోదరి రామమ్మ శాంతిమూర్తి.
తే. అధికపతిభక్త నాదు మేనత్త సతము
కూర్మి నాదు మాతామహు కోర్కెకనువు
గాఁగ మెలఁగుచు సుతను గోక్కర్త, సుతుల
నిర్వురను గాంచె సుగుణాల, హృద్యతనుల. ౧౩౦
సీ. తనయ రంగమ యనఁ దనరు, నాతల్లికిఁ జెల్లెలా నామెను క్షితిసురాన్వ
వాయుఁడౌ శ్రీపాలవాదివంశ్యునకు శ్రీరాములునామసుప్రథితమతికి
నొసఁగి పెండిలిచేసి, యుతుగరలను నిచ్చి, కరణాలు మండలఖ్యాతిఁ దెలుపు
పేరుసోముల యను నూర నుండిన యత్తవారింటి కంపెను వైభవముల,
తే.నంత మాతామహుండు కార్యాంతరముల-మునిఁగి యల్లాడుపల్లెనాఁ జను జనపద
పరిసరంబున రైతుల వరుసఁ జేర్చి-గ్రామమొక్కటి నిర్మించె ఘనత మెఱసి.
క. పొలములఁ గొని కర్షకులకు-బలువిధములఁ దోడుపడుచు వర్తింపఁగ నా
కులత గలిగె విధివశమున,-నిల నెవ్వారలును గలరె యెదిరింప విధిన్ ? ౧౩౨

తే. ఆసమయమందె మాతండ్రి యరిగె దివికి,
నపుడె మా తాతయును స్వీయమైన గ్రామ
మును వదలి వేఱుచో నుండి పూర్ణకష్ట
ములను బడయంగ నేర్పడె ఖలనియతిని. ౧౩౩

క. మాయూర నొక్కవత్సర-మా యుత్తమచరితుఁ డుండి యనువుగ మాకున్
సాయంబు చేసి మదికి న-మేయాశ్వాసన మొనర్చె నపరిమితకృపన్. ౧౩౪

క. తనయుల నిర్వుర,మాయ-త్తను దోడ్కొని కడపపురము దాఁ జేరెను నా
కును గాయత్ర్యుపదేశం-బును మద్గృహమందె చేసి పూర్ణమగు కృపన్

క. ఉపనీతుఁడనై మా గ్రా-మపరిసరంబందు విద్య మాన్యులయొద్దన్
గృపఁ బడయఁ జిన్నపొలమడ-కపు నరిగితిఁ జనువఁగొని, యనువుగ నచటన్.

తే. పదునొకండవ వర్షమా ప్రాయమందుఁ
దండ్రియాధారమును లేక తల్లిప్రాపు
వదలి యొండొక్క గ్రామానఁ బరులయింట
నుండుట మఱింత వ్యసనంబు నొందఁజేసె ౧౩౭

క. ఆయూర మూఁడుమాసము-లాయాసముపడిన విద్య యలవడదయ్యెన్
గాయము గాసిలుటొకటె,-వేయివిధంబులను గలిగె విసుగటమీఁదన్. ౧౩౮

తే. కడపనుండి మా మేనత్త గాండ్లపాటి
కరయ మాసేమమును దన యంతరంగ
మునఁ దలఁచి వచ్చి పిలిపించి నను గొని చనెఁ
గడపపురికి మాతామహు కడకుఁ బ్రీతి. ౧౩౯

తే. తనదు తనయులకై నడి మనుమని ననుఁ
గనుఁగొనుచుఁ బెంచె మాతాత కరుణతోడఁ,
గడపపురమున విద్యార్థి నడవడిఁ గొని
చదువుకొన్నాఁడ వినయంబు కుదురుగాఁగ ౧౪౦

సీ. అభ్యసించినవాఁడ నాశ్వలాయనశాఖయందు నాపస్తంబ మనెడు శాఖ
యందు షోడశకర్మ లనువుగాఁ జేయింపఁదగిన మంత్రములెల్లఁ దడవుకొనక
యనుములవంశ్యుఁడై యలరెడు వేంకటసుబ్బావధానివిశుద్ధకరుణఁ
దత్పదపరిచర్యఁ దద్దయుఁ గావించి కృతకృత్యతను బొంది హితవెఱిఁగితిఁ,
తే. జదువుకొనునప్డు భుక్తిని జరపెఁ బుత్త్రి-వత్సలతఁ బేర్మి నక్కలపాటి వంశ
రత్నమైన సంజీవప్ప ప్రథితయశుఁడు-మొదట నాదు మాతామహు ముదలనొంది.

సీ. అటుమీఁదఁ గొమరగిర్యగ్రహారాయసుధాబ్ధిశీతాంశుఁ, డాశ్రితప్రీతియుతుఁడు,
నిత్యాన్నదానవినిందితచరితుఁడు, నిత్యాగ్నిహోత్రి, నిర్ణిద్రగుణుఁడు,
దంపతీపూజావిధానదక్షుఁడు, సదాచారయుక్తుఁడు, ధన్యసత్యరతుఁడు,
సతతశ్రీమద్రామచరితపారాయణతత్పరుం, డత్యంతక్షమాహితుఁడు,

తే. శ్రీకరుండును సంవత్సరీక నంబ్యా-ర్యైన శ్రీశేషయార్యుఁ డత్యంతవత్స
లత్వమునఁ బిల్చి యర్హాసనలను గొసంగి-పోషణము నొనర్చుచుండె సపూర్ణకరుణ.

తే. నామమాత్రానుగుణముగ నేకనాఁడు పరి-తాపగ్రస్తి యనంగఁ జెలఁగు శేషాద్రిశర్మ
దర్శనమునకు నరుగ, సందర్శనశాలి-దన మఱఁదలి పెండ్లిచేయుటను దెలుపఁగ.

సీ. "మనసుమంచిది [illegible], సంపాదకాపరిత్రుఁడు, స్మార్తవిద్య
నభ్యాసమును జేయు [illegible] యసమున్నాఁడ, నేవ్వాని కన్యాకన్య
[illegible] పెండ్లి [illegible], [illegible], [illegible]
[illegible] యనుచుఁ [illegible] యసక్తుఁడు విన్న శేషాద్రిశర్మ

తే. విబుధసంఘ సమ్మతిఁ, బెండ్లి యుత్స-వాలశింపక చేసి యత్యంతమోద
మునను బెండ్లిగావించె [illegible]-భావివృద్ధికి గను యత్నపడుచు నుండె.

క. తన సన్నిధిని ప్రియముగ-నను [illegible] సంస్కృతమును నిపుణమతిఁ
బోనరింపఁదలఁపుఁగొని నే-ర్పునఁ గఱపెఁ గావ్యశబ్దమును మొదలిడుచున్.

తే. తాను [illegible] దపను నున్న
తమను పాఠశాలను బంపఁతపడవి [illegible]
యుంటఁ [illegible] శాలశాలకు వెంటఁ గొనుచు
నరిగి సంస్కృతమును నేర్ప నీముదము. ౧౪౬

క. చదివితి రఘువంశాదుల-నొవలికి నసఁగా దానముఖ్యకృతుల, న
య్యావనుఁ [illegible]-బోధ [illegible], జదువుచుచు నూహయుఁ గలిగెన్

తే. గురువరుం డొకఁడె విద్యఁ గుడుపుగాఁగఁ
జదువవలయును నే నను మదిఁ గలాఁడు,
తల్లియును దాతయును నట్టితఱిని సంస్కృ
తిని నడుపఁ గోరుకు [illegible] కేమి తెరువు గలద ? ౧౪౭

తే. గురుఁడు శేషాద్రిశర్మ నాకును గడంక-సాయమును జేయ నరిగితిఁ జదువుకొఱకుఁ
జెన్నపురి,కటు దన్మిత్రుఁ డన్నికఁ గను-వేంకటేశ్వరశాస్త్రి న ప్రీతిఁ గాంచి.

తే. విజయనగరం [illegible] న విశ్వసలగు-మిత్రులకు లేఖలను వ్రాసి మెలపుమీఱఁ
బంపెఁ దమిఁ గళాశాలలోపలఁ బఠింప-ననువు నెఱిఁగించి, వెళ్లితి నచటఁ జేర.

క. కాంచితి విజ్ఞులనెల్ల, స-మంచితగతి నందు నాకు నలపడదయ్యెన్,
మించెను బ్రవేశకాల మ-టంచుం దెల్పి కాకినాడ కనిపిరి శాస్త్రుల్. ౧౫౧

సీ. కాకినాడను జేరి కావ్యపారములను బఠియింపఁ బూనితిఁ బట్టుపట్టి,
యంతలో మాతామహప్రేషితంబగు కమ్మ యొక్కటి వచ్చెఁ గదలివచ్చు
చున్నవారి మటంచుం, జూచితి నాలేఖ, సంతి నామముఁ గల్గ "సంతిరాయ
మింకఁ జదువునకు, నల్లు సమాప్తింపు విద్య" యనుచును [illegible]త, నెఱిలితి వడిఁ
తే. గానికాపురి, కచ్చటఁ గనక మిత్ర-గృహమునందుండ నసి యూని, కీర్తి నెసఁగు
పండితుల కడఁ జదివితిఁ గావ్యనాయ-మాధికి భక్తిని పుత్రుహము లాదరించి. ౧౫౨

తే. రాగకాంచికులాబ్ధిచంద్రముఁడు మిత్ర
నహ్యఁ [illegible] శాస్త్రి మూవాస మొసఁగ
యాదృతిం [illegible] చ్చట నంతిరాయ
ములను [illegible] చదివితి [illegible] ధులయొద్ద. ౧౫౩

క. చింతామణి [illegible] శాస్త్రి [illegible] నుండెలిసి విశిష్టవిద్య [illegible]
త్యంతముదంబునఁ బొదలుచు-నంతఁ జదువుచుండె వేఁకి యడరె నధికమై.

క. మాతామహుఁడు, మాతయుఁ-బ్రీతిఁ గలిసి కమ్మ వ్రాయ విశ్వేశ్వరవి
ఖ్యాతినసి [illegible], వే-వే తరలితిఁ గడపపురిఁ బ్రవేశింపంగన్. ౧౫౫

క. తల్లిని, మాతామహుఁ గని-యుల్లము [illegible] సంతసించి యున్నా [illegible]
మొల్లముగ [illegible] నే-ర్చిన విద్యలను వా [illegible] యుచున్. ౧౫౬

క. చదువఁగఁ గుతూహలము [illegible]-కొ [illegible] పే [illegible] జవి యుల [illegible]
న్నితరసంబు లభ్యసించితి-నా [illegible] పాఠవిశ్రాంతి [illegible]. ౧౫౭

సీ. వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి సత్కృప నలులుగా నుత్సాహసన్న
మయిన వేంకటనృసింహాచార్యసన్నిధి జనిపించె [illegible] నా సత్త్రియం,
పదపడఁ గడపకు వచ్చి గురూజ్ఞను విజయనగరము నగ్రపీఠి జేరి,
యందుఁ గీర్వాణమహాకళాశాలయం దమిఁ [illegible] విద్యల నభ్యసింపఁ
తే. దలఁచి ప్రాచ్యవిద్యాపరీక్షల [illegible]-నంచి చదువుచు నుండి, హితమనిషు
లెల్ల బోధింపఁ గడచె నం [illegible] నార్థ-వత్సరం బంత, శ్రీగురుపాదమకరుణ.

ఆ. కడపమండలమునఁ గ్రాలు బద్వేలునూ-ధ్యమికపాఠశాలయందుఁ బంచె
తపద మబ్బెనట్లు ధన్యాత్ముఁ [illegible] గురుం-డనిపె నాకు లేఖ నతిముదమున.

తే. విజయనగరంబునం గురుండుపాధ్యాయవరుల-యనుమతిని, మిత్రులాద్యులెనుపఁ దరలి
వచ్చి స్వగ్రామమును జేరి భార్యతోడఁ-గడపగురునకు మ్రొక్కి మొక్కుడగు భక్తి

సీ. మాతామహులకును, మఱియుఁ బెద్దలకును వందనంబు లొనర్చి వారి దీవ
నలఁ బొంది గురుకరుణను ననుమతి నొంది బద్వేలుపురిఁ జేరి పాఠశాల
యందుఁ బండితుఁడనై యతిముదంబును జెంది జీవయాత్రను సమంచితముగాఁగఁ
గడపుచునుండఁగాఁ గడచెను నొకయేఁడు; పదపడి కడపలోఁ బాఠశాల

తే. యందు రెండవ పండితుఁడనసముగ-నుండవలె నంచు నధికారు లుచితరీతి
నేర్పఱచుచుండ మద్గురుండెంతయు దయ-నాకుఁ దల్పెదవినిగూర్చె గ్రాకటముగ.

క. కడపపురి వచ్చి చేరితిఁ-గడుముదమున గురుని సమ్ముఖంబునఁ బ్రీతిన్
గడపుచు బాంధవమైత్రిన్-గడుసుఖముల నందుచుంటి గానివమొప్పన్. ౧౬౩

తే. ఏపరీక్షల నియ్యక యెట్టి బిరుద-మొందకయె యున్న నుద్యోగ మొప్ప దనుచుఁ
దెలిసి వయసుచాలక పరీక్షలఁ బ్రవేశ-మొదవవనియు నెట్టిగ నొన్ని యేండ్లుగితబుద్ధి.

సీ. వంగదేశంబునఁ బ్రభువు స్థాపించబడిన సంస్కృతసభయనువునఁ గల
కత్తాపురంబునఁ గావించునట్టి పరీక్షల కరిగితిఁ బ్రీతి వెలయఁ,
గావ్యతీర్థ యనంగ, ఖ్యాతిఁ బురాణతీర్థ యనంగ గురుబిరుదంబు లంది
నాఁడె మద్రాసులోనం బ్రాచ్యభాషపరీక్షకుఁ జని యందుఁ గేర్చి వెలయ

తే. ధన్యమైన విద్వద్బిరుదంబుఁ దెలుఁగు-భాషయందుఁ బడసితి, బ్రదుకుఁదెరువు
నకును నది తోడ్పడుచునుండఁ బ్రకటితాగతి-జీవయాత్రను సాగించుదేవ గలిగె.

చ. గురువరు సన్నిధానమునఁ గోర్కెమెయిన్ నివసించి విద్యలన్
బరువడి నభ్యసించుటకు భాగ్యము గల్గెను, నాదు జన్మమే
యటులయఁగ ధన్యమైన దని యాత్మ ముదంబును బొందుచున్, బరా
త్పరుని దలంచుచున్ బుధమతంబుల నాయుచుండు నప్పుడున్. ౧౬౪

ఉ. జీవికకై గురుండు దయఁ జేర్చిన యొజ్జతనంబు శ్రద్ధమై,
నేవిధమైన లోపమును నేర్పడనట్టులు నిర్వహించుచున్
జీవిత, మాత్మసంతసము చేకుఱఁ బెద్దల త్రోవ తప్ప కెం
తే వినయంబుతో గురు మభీప్సితదాతఁ దలంచుచుండుచున్. ౧౬౬

తే. ఇతరవృత్తుల జీవిక కెప్పుడేని-మదిని గోసక తృప్తితోఁ బదిలముగను
దొరకినట్టి యుపాధ్యాయవరపదంబు-దేవతాసేవ యని యెంచితిని ధ్రువముగ.

క. జీవికకై యాచింపఁగఁ-బోవుటకంటె నహితంబు పుడమిని లేమిన్
దేవీకటాక్షమున గురు-సేవ నుపాధ్యాయవృత్తి చేకుఱె నాకున్. ౧౬౭

ఉ. కొందఱు విద్య నమ్మకొనఁగూడ దటంచును బల్కుచుందు, రా
చందము నిక్కమే, యటులనఁ జక్కనొనర్పఁగఁ బూర్వపద్ధతిన్
బొందికఁ గన్న యొజ్జతనమున్ భువి నింద్యము గా దటంచు నే
నందియమంద కీసరణి నల్పథ మంచుఁ జరింపఁబూనితిన్. ౧౬౮

తే. గురుఁ డుపాధ్యాయవృత్తితోఁ బరఁగుచుండె,
నదియె జీవిక కర్హమా యనుచుఁ దెలిపి
నన్నుఁ దత్పదమున నిల్పె సన్నుతగతి,
నింక లోపంబు గలుగునే యెంచిచూడ? ౧౭౦

ఉ. ఉన్నత పాఠశాలకు మహోన్నతరీతి గురుండు, నేను న
భ్యున్నతిఁ దెల్గుభాసకును నొజ్జలమై, బుధు లెన్న శిష్యులన్
జిన్నలఁ బెద్దలన్ గని విశిష్టపథంబున విద్య నేర్పుచున్
గ్రన్నన జీవయాత్రఁ దమిఁ గాంచుచు నుందు మఖండతృప్తితోన్. ౧౭౧

తే. నాకుఁ జేదోడువాదోడు ప్రాకటముగ-గురుఁడెయగువృద్ధిచేసెనన్నార్తి వెలయఁ,
దద్దయున్ దత్కృపాదృష్టి నొద్దికఁ దను-యాత్రజరగుచునుండుసత్యముగ సతము

క. తనుయాత్రకుఁ బండితపద-విని నూఁతగఁ గొని పరాంబ విశ్రుతకరుణన్
గొనియూడుకు సంతృప్తి-జని ధన్యంబయ్యె ననుచు సంతస మొదవెన్. ౧౭౩

క. క్రమమున నొజ్జతనంబుఁ బ్ర-విమలగతిన్ నెఱపుచును, బ్రవీణులకడ ను
త్తమ విద్యఁ గొనుచు, నభ్యా-సమునం బరిదేవిసేవ జరపుచు నుందున్. ౧౭౪

ఉ. కాలము వ్యర్థపుచ్చక, యకల్మషరీతిని నింటియొద్ద గ్రీ
శాలులఁ జేయనెంచి మన సంస్కృత భాషయుఁ, దెల్గు భాసయున్
బాలురఁ జేరఁదీసి తమిఁ బాఠము లెంతయుఁ జెప్పుచుంటిమున్
మేలుగఁ గొన్న విద్యకు సమీచీన సదానను భాష మెప్పుగన్. ౧౭౫

క చదివించుచు శిష్యుల, నేఁ-జనివితి వ్యాకరణము, గణిత శాస్త్రసరణి, నే
ర్పొదవం బంచాంగము నె-మ్మది గూఢయుంటను గురూత్తమప్రథితదయన్.

క. బాల్యమునుండి కవితా-లౌల్యము చిత్తంబు నిశ్చలంబుగ నెసఁగన్
నైల్యం బొలయక త్రిజగ-త్కల్యాణముఁ గూర్చు కవితతత్త్వంబగుటన్. ౧౭౭

క. తమి నాత్మ నెంచుచును ని-త్యమితావృత్తి గద్యపద్యతతిఁ గూర్చుట లో
కమునకు సేవగదా ని-క్కముగా నని కృతిరచనకుఁ గడఁగితి భక్తిన్. ౧౭౮

క మదిలో శ్రీలలితాంబా-పదపద్మములం దలంచి ప్రారంభమునన్
గుదురుగ శతకము వ్రాసితి-నొదవెన్ ధన్యత్వ మెంతయును మజ్జనికిన్. ౧౭౯

సీ. ప్రతివత్సరంబు శరన్నవరాత్రదీక్షను బూని శ్రీదేవిచరణకమల
ముల హృత్కమలసీమఁ జలనంబు నొందక నిలిపి జపంబును సలుపు నియమ
మున నేకభుక్తంబుఁ బూని దశమ్యంతముగ గురువరుని సంపూర్ణకరుణ
జరిపుచు విజయదశమినాఁడు శ్రీదేవిపాదపద్మంబులఁ బ్రథమశతక

తే. పుష్ప మర్పించు వాంఛను మొదట నూని-యర్పణ మొనర్చితిని లలితాంబపేర
వెలయు శతకంబు కందపద్యలసితంబు-భక్తిసంయుక్తిఁ గవిత ప్రశస్తి నొంద.

క. ప్రతి విజయదశమిఁ బూజకు-నతిభక్తిని పుష్పశతక మర్పించుచు స
న్మతి నైదుశతకముల వ్రా-సితి శ్రీ లలితాంబ కరుణచేఁ బ్రథితముగన్. ౧౮౧

సీ. శ్రీదేవిఁ దలఁచుచు శివకామసుందరీ శతకంబు, మూకియును శ్యామలాంబ
శతకంబు మీనాక్షి శతకంబు, చాముండ్యశతకంబు ననున్నైదు శతకములుగ
నర్పించినాఁడను, నాలోన నే పదసంగ్రహములు వ్రాసినాఁడ నరుస
సీమంతిని చరిత్ర, శ్రీనాథుని పశ్చాత్తాపములను, శాలత్తిక జ్ఞాన
తే. దము పురాణకథాసారమును, బాల-నీతికథలను వ్రాసితి, నిగమవినుత
మగు పురాణంబుఁ దెలిగింపఁ దలఁచి-బ్రహ్మవైవర్తముఁ బఠించి వరుసతోడ.

తే. పద్యకావ్యముగా నందు బ్రహ్మఖండ-మును దెలుఁగు జేసి వ్రాసితిఁ బూర్ణభక్తి,
ధ్రువుని దివ్యచరిత్రంబు నాపముని-వ్రాసినాఁడను బ్రకటింప వసతి లేదు. ౧౮౩

క. కాలుజారిన దెబ్బయుట్లు-తేలికయగు రీతి వ్రాసితిని నొకట సమా
సాలంకారచ్ఛందము-శోభిత దివ్య సుమాంజలి నొక గ్రంథంబున్ ౧౮౪

క. పరమేశ్వరి దాక్షాయణి-విరచించితి భాగవతము వేదవినుత మీ
శ్వరి మహిమ సుపురాణము-గురునామ సమ్మోహనమ్ము నెలయఁ, గుశలత మిగులన్

తే. గ్రంథసంపాదనము బూర్ణముగాఁగఁ దెలుఁగు-జేసి నొసఁగెంచితిని, నిధినసుధ నెల్ల
వ్యాప్తమొనరింపఁగలరంచు నొకఁ డా సుజ్ఞ-దలఁచుచుండెఁ గనంగ నా దరి నొసఁగెదమ.

క. నెలలో నాలుగు దినము, లా-సలలో దానిమ్మవలె జనఘన విడి కే
చలనంబు లేక నొలఁగెడి-కలనతితో వ్యాధిమొదవెఁ గూరుకొనిదగుచున్. ౧౮౬

సీ. పెండ్లియాడినదాన వెండి పిన్నయమ్మయున్ నన్ను సంప్రీతిఁ జూచిన నన్ను తాంగి,
గృహము చేడుట మొదల్ కీర్తితో ధర్మార్థకామాల నడిపిన క్రమశీల,
సహభాగిని యటన్న సన్నల మెలఁగి సన్ననుసరించినయట్టి యతివమిన్న,
సతతంబు మది నుంచి హితమె నా కొసఁగించు చలరించి మించిన కులవధూటి,
తే. పెద్దలనిఁ గనుంగడు వినయమునను-నొద్దికను సేవ యొనరించు ముద్దరాలు,
మాయమైపోయెఁగవి చిత్తాన మసలునట్టి-మానవతి కట్టిననుయాన మసలె నెలలు.

తే. కర్మ మది యెట్టిదో కాని కాంచనగునే?-కనిన కాన్పులు నాలుగుఁ గడచె నడవిఁ
గాచినట్టి వెన్నెలరీతిఁ, గనదు సుఖము-నింతయేనియు బిడ్డలఁ జెంతఁదీసి. ౧౮౯

క. కాన్పులు నాలుగు సుఖముగఁ-గన్పడినను బూణ మదే మొకడుఁ బ్రేముడిఁ దాఁ
బాన్పున బిడ్డను బ్రక్కనఁ-బెన్పు నునిచికొనఁగ లేదు, విధియేమందున్? ౧౯౦

ఆ. రెండుమూఁడు నెలలు నిండినయంత నే-పుట్టినట్టి పట్టు లట్టె చెట్ట
విధికి వశ్యులగుచు వెన్వెంట వెన్వెంట-మరణమొందె, నెట్టి మాయయగునొ?

తే. "పూర్వజన్మకృతంబగు పుణ్య మెంతొ-యంతియే కాని మించి యొావంతయేని
యనుభవింపముసుఖ"మంచునను గఁదాను-మూఁ డెండుమదిదుఃఖమాఱుకున్న.

క. కడుపునఁ బెనువంతను దా-బడసి మికుకుచుండె గర్భవతియయ్యును, బె
క్కుడుమల నాధివ్యాధుల-తొడుకునఁ బడి కృశితనొందె దుర్వ్యాధిబలిమిన్ ౯౩

మ. నవమాసంబులు నిండఁ, బుత్త్రిఁ గనియెన్, శస్త్రాస్త్ర మైనట్టులే
యవలీలం బ్రసవించె నించుకయు నాయాసంబుఁ దాఁ గాంచకే,
మిపులన్ దృష్టిని, గార్భ్యయయ్యు సుతతో మేల్మిం బ్రియంబారఁ జూ
చి వినోదించెను, నామకర్మమును జేసెం గూర్మి నాకొగుంతన్. ౯౪

క. శిలిబిలి పలుకుల బాలిక-పలుకుల ముద్దుటలఁ జేయుఁ, బలుకకయున్నన్
దలయూఁచి నగుచు సంతస-మొలుకఁగ లాలించు బాలు నుల్లాసమునన్

ఆ. మూఁడు నెలలు గడచె ముచ్చటలెన్ సంత-వచ్చె శ్రావణంపు వ్రతనిలయము,
బాలుఁ డంకపీఠి వఱల లక్ష్మీదేవి-వ్రతము జేయఁ దలఁచె వాంఛలొదవ. ౯౬

ఆ. తనువు, మనసు శుచిత దనర లక్ష్మీవ్రతం-బాసతోడ జరపె, సంత భోజ
నము నొనర్పఁ బోవ నమితమౌ చలి పుట్టి-జ్వరము వచ్చె, నదియు వదలదయ్యె.

ఆ. నాల్గు నాళ్లు జ్వరము నాకులలో శక్తి-యణఁగునట్లు గాచె, నవల లేవఁ
జాలదయ్యెఁ, బడక శరణమయ్యెను, బాలుఁ-బలుకరించునట్టి పటిమ సడలె.

క. అనుదినము వ్యాధి బలమై-కొనియెను దేహమున శక్తిఁ, గూర్చుండుటకై
నను, మాటాడుటకైనను-తనువు పనికిపోయె, వ్యాధి యతిశక్తిఁ జేసెన్ ౯౭

క. క్షయ యని వైద్యులు పలుకన్-భయమొదవెను, సూదిమందు వలనుగ నాడీ
చయమున దేహంబున నెం-తయు నెక్కిరి, ఫలము శూన్యతను బొందెఁగదా?

తే నవయుచుండెను దేహంబు నాఁడునాఁట,-కెడఁదఁ జూడంగ సాధ్వసం బెసఁగుచుండె,
నాల్గుమాసాలు గడవఁగా నన్నుఁ గాంచి-'బ్రదుకుదునె' యంచుఁ బ్రశ్నించె వనితభీతి

తే. దేహమా చిక్కె, లేదయ్యె దిట వాకింత,-మాటలాడెడు శక్తియే మందమయ్యె,
"నాదు గండానఁ బుట్టెను నందనుఁ" డని-వగవఁగా సాగెఁ దుదలేని వంతతోడ.

తే. ఎవరు తను జూడవచ్చిన నెంతొ యాస-నడుగు 'బ్రదికింతునే' యని యాదరమున,
వారలూరటఁబలుకఁగా వంతయుడుగు,-నాసఁగననిచ్చునేదైవమని యెఱుఁగదు.

తే. బ్రదుకుపై నాసమునకుండవచ్చుఁగాని-బ్రహ్మ తలఁచునె మనకోర్కె- స్వాంతమందు?
నెట్టు లిఖియించె నాక్రియ నెట్టుఁగాని-కనునె కరుణామయుండయి మనవి నెంచి?

తే. మార్గశీర్ష మాసంబు నమవసనాఁడు-కలుగఁజేసెను దొందరఁ, గాని యేను
శయ్యకడఁ గూరుచుండి విశ్వజనయిత్రిఁ-బ్రార్థన మొనర్చుచుంటిని బరమభక్తి.

క. అమవస మృత్యుప్రద మని,-యమవస దాఁటిన నొకింత యడఁగు భయం బం
చమితాస నొందితిమి, రే-యి మదికి నూఱటయె లేక యేఁగె భయదమై.

ఆ. పౌషమాస శుక్లపక్షంపుఁ బాడ్యమి-యరుగుదెంచె, నింక నాత్మ భయము
వీడుమనుచుఁ దెల్ప విశ్రాంతితో నుండి-మాటలాడుచుండె మగువ తృప్తి.

క. బాలకునిం గనుఁగొను మని-లాలింపు మటన్న నే "వలదు వల దిఁక నీ
బాలుఁడు, సుఖమున్నం గదు-మే, లిదియే కోర్కి" యనుచు మెల్లనఁ బలికెన్.

క. ఇచ్చితి మాపథమును, గను-విచ్చి పలుకుచుండె; మదిని భీతి నూనినయ
ట్లిచ్చోఁ గనఁబడదయ్యె మ-హోచ్ఛ్రితి నారోగ్య మొదవె నొగి ననిరి జనుల్.

తే. అంత మధ్యాహ్న సమయాన నాత్మ భయము
గలిగి యఱచెను, "మరణంబు గలుగు నాకుఁ,
జచ్చితిని జచ్చితి" నటంచుఁ జావుకేక
వేసె, నొక నిముసమునకే విడిచెఁ దనువు ౨౧౦

ఆ. మందుఁ గొను మనంగ మంచినీళ్లయినను-ద్రావకుండునట్టి తన్వి ప్రాణ
కాంక్షఁ జేసి త్రావెఁ గద యెన్నిమందులో-విసుగు లేక, తుదకు విడిచెఁ దనువు.

క. ఏమందు, లేచికిత్సలుఁ-గామినికిం జీవనంబుఁ గల్గింపవు, నా
ప్రేమాస్పద విడి చనియెను-భూమిని, నను ముంచి దుఃఖపూర్ణజలనిధిన్. ౨౧౨

ఆ. ఔర్ధ్వదైహికముల నడలుచు నొనరించి-తత్ప్రతికృతిగాఁగఁ దలఁచి బాలుఁ
బెంచు చూఱడిలుచు వెళ్లఁబుచ్చితిఁ గాల-మంత నైదు నెలలు కొంతతమిని.

క. తారణ వైశాఖంబున-నోరువరానంత వేఁకి యొందెను బాలున్,
ధీరత సడలఁగ నదియే-కారణముగ నాటలమ్మ కనుపించె వడిన్. ౨౧౪

తే. జ్వరము తగ్గుచు వచ్చెను, శాంతి యొదవె-ననుచు బాలునకును నీళ్ల నపుడుపోసి,
పుట్టిపాటుగ వేఁకువ నొకట గుఱ్ఱు-పుట్టెఁ, గంఠంబు వాయుసంపూర్తియయ్యె.

క. పిలిచినఁ బలుకఁడు, కన్నులఁ-జలనము కనఁబడదు, ముగిసె శ్వాసము, దేహం
బాలసెన్ శీతంబున, నసు-వుల వీడెన్ బాలుఁ, డార్తిఁ బూర్తిగ ముంచెన్

క. నాతల్లి దుఃఖ మింతని-యేతీరున దెలుపఁగల? నిఁకేమి గతి యటం
చాతురుల మగుచు దుఃఖం-బీతటి నెటు తీఱు నని మహిం బడితి మెదన్.

తే. బాలునకు సంస్కృతి యొనర్చి, పరమదుఃఖ-వార్ధిమగ్నమానసులమై వనరుచుంటి,
మెవరు దరిఁ జేర్పఁగలవార లింక ననుచుఁ,-జెల్లెఁ గాలంబు కొన్నినా ళ్లెల్ల వరుస.

తే. నాకుఁ బుట్టినట్టి నందనుల్ మరణించి-రనుచు నాదు భార్య యరిగె దివికి
ననుచు నాదుతమ్ముఁ డనఁగముగ్గురుసతుల్-దివికిఁ జనఁగ వనట మిన్నులెననుచు.

ఆ. తాను బెంచినట్టి తనయుని కూఁతురు-కాఁపురమున కేఁగి కడచె భూమి
ననుచు నాదు తల్లి యారాటపడుచుండెఁ-గనుల నీరు వెడలి కాల్వఁ గట్ట.

క. అనవరతదుఃఖములే-యనుభవమునఁ దగులుచుండ నకటా! యని తా
మనమును నిలుపక యెపుడుఁ-బనవుచు విశ్రాంతిగానదు, వాపోవు వడిఁ.

ఆ. ఇంటఁ దల్లి చెవిని నిల్లుగట్టుకొని నఁ-గాంచి, "యెవరు నీకు గతి గలారు?
కాళ్లుసాఁచియుంటిఁ గాఁటికి నాయనా!-యింకఁ బెండ్లియాడు, హితవువినుము.

తే. చేతిమీఁద నీ శ్లివ్వరు ప్రీతిఁ జల్లు
వార లున్నారు? వైరాగ్య భావ మేల
పూనుదువు? నాకు నాయువు పోవు నెపుడొ!
పెండ్లియాడు" మటంచుఁ దెల్పెను బ్రియమున. ౨౨౩

చ. ఇరువదియైదు వత్సరము లేమియు లోపము లేకయుండ సం
బరమున భార్యతో సుఖము బాగుగ నందితి, నింకఁ బెండ్లియై
తిరమగు భోగయుక్తిఁ గొని ధీపరమార్థమునుండి త్రిప్పఁగా
నురవగునే యటంచు మది నూహయొనర్చితిఁ గోర్కెలూడఁగఁ. ౨౨౪

మ. నొసటన్ వ్రాసిన వ్రాఁతలం దెలియ, మున్ముం దేమి రానున్నదో
వెస నూహింపఁగలార లేరు గల రే వెంటం గనుంగొన్నఁ? దై
వసమానే విధి? దాని దాఁటఁగలరే భావించి యేవార లీ
వసుధంగాని మతేభువంబునను విద్వాంసు ల్సరవ్రాతముల్? ౨౨౫

సీ. తల్లిపల్కులకు నా యుల్లంబునం గల నిశ్చలభావంబు నిలువదయ్యె,
నెదిరించి దీక్షతో నిది గాదనుచుఁ బల్కఁజాలనియట్టి చాంచల్య మొదవె,
బడి వీడి గృహమునఁ బదమిడినంతనే దిక్కుదోఁచని గతి తీవ్రమయ్యె,
నిఁక నేది తెరువని యెదను దలంపఁగాఁ బదిలంబు కొంతయుఁ గుదురదయ్యె,
తే. నకట! దుఃఖంప నగునె యం చాత్మలోన-నరసి ప్రాపంచికస్థితి, నంత వంత
వదలి పరమేశ్వరీపద పద్మములను-గతి యటంచును దలఁచుచుఁ గడపుచుంటి.

క. తలవని తలంపుగాఁ బెం-డిలి జతనం బొదవె, దాని డింకుపఱుప నా
యలవియె కాదయ్యెను, ని-శ్చలముగ దా కర్మశక్తి చర్చయొనరుపఁ! ౨౨౬

తే. మంచి దంటిని గురునాజ్ఞ నెంచి, పెండ్లి-తారణ శ్రావణంబునఁ దనరు విదియ
తగుముహూర్తంబనుచునిశ్చితంబుఁ జేసి-రపుడుగురుదంపతులురుగ్ణులయ్యుమిగుల.

ఆ. దిక్కులే రటంచు ధృతి యోజన మొనర్చి-తరలివచ్చి పెండ్లి జరపి రపుడు
వేడ్కతోడఁ బెండ్లి పీఁటలపయి గురు-దంపతులె వసించి దయ దలిర్ప. ౨౨౭

ఆ. ఆ వివాహమునకు సభ్యత్ముఁడగుచు జం-ధ్యాల చలమయార్యుఁ డచటఁ గన్య
మేనకోడలగుట మిగుల సంప్రీతితో-గారవించి జరపెఁ గార్యమెల్ల. ౨౩౦

తే. పెండిలియు వేడ్కఁ గర్నూలు మండలమునఁ-గలుగు ద్రోణాచలము తాలుకను బ్రసిద్ధి
గన్న రంగాపురంబునఁ గన్నెయింటి-వారలే యొనరించిరి వైభవమున. ౨౩౧

క. నిడిగంటి వంశ విప్రులఁ-గడు సుచరితు డనఁగఁ బేరుగన్న పుల్లయా
ఖ్యుఁడు గన్నకూఁతు భార్యగఁ-బడసితి భాగ్యమున మంగళభగవతికృప చేన్. ౨౩౨

క. రంగాపురమునఁ బెండిలిఁ-బొందుచు మూన్నాళ్లు గడపి ముదమున సతితోఁ
డం గడపన్ స్వగృహంబున-కుం గదలి ప్రవేశమునకుఁ గోరిక యలరన్. ౨౩౩

తే. వచ్చితిమి బంధుగులఁ గూడి, వైభవమున
నింటఁ జేరితి, మానాఁ డదేమి వింత
యో తెలుపఁజాల, నూతల్లియును జ్వరార్త
యగుచు మంచానఁ బడియెఁ దా ననువు వదలి. ౨౩౪

తే. కోడలిని జూచి ముదమంది, "కోర్కె నిండె"-ననుచుఁ దన సంతసంబును జనులకెల్లఁ
దెలిపె "యిఁక నాకుఁ దక్కునగల దేహాలు-నిల్లు నిలిచెను, సంబరంబిదియె" యనియె.

తే. "రెండవ కుమారునకుఁ గూడఁ బెండిలియయి
భార్యతోడుత నిలుఁ జేరెఁ, బరమముదముఁ
గంటి నిరువురు కోడండ్రఁ గాంచి యింకఁ,
దక్కువేమియుఁ గలుగ దీతఁడని" యనియె. ౨౩౫

తే. కోడలిని, నన్ను దగ్గఱఁ గూరుచుండఁ-బెట్టుకొని హితమును దెల్పి "ప్రీతి గలిగె,
నింక జీవింపఁజాల, నా కేర్పడపుము-తగిన సెజ్జను బరలోకసుగతి" కనియె. ౨౩౬

తే. నామదిని దల్లడిల్లితి, నేమి యందు-నట్టిమాటకు? "నక్కటా! యమ్మ! యిట్టు
లేల పల్కెదు? కోడలి కెల్ల హితముఁ-దెలుపుమా" యని వేఁడితి దీనుఁడనయి.

ఆ. లేవలేక యున్న లేచి లోపలఁ జేరి-కోడలిని దనంతఁ గోర్కె మీఱ
హితవుఁ గఱపి బంధుహితులకు మర్యాద-సలుపఁ దెలిపి నెడలె శయ్యకడకు. ౨౩౭

తే. అంత మూఁడవనాఁడు మా యమ్మ పుడమి-పయిని నాసను విడనాడెఁ, బరముఁ జేరు
ననుచు నామదిఁ గనుపట్టె, నపుడు బంధు-గులను బంపితి నూళ్లకుఁ గొదువలేక.

తే. శ్రావణాసితనవమిని సంజవేళఁ-బరమపద మొందె మా తల్లి పరమతృప్తి
సుతులు నిర్వురుఁ, గోడండ్ర జతయు సేవ-చేయుచుండఁగఁ, జుట్టాలు చెంతనిలువ.

తే. అంత జరపితి శ్రద్ధతో నౌర్ధ్వదైహి-కక్రియల సాంగముగ శక్తి గలిగినంత
కొదువ గలుగక యుండున ట్లుదిత భక్తి-తోడఁ బదుమూఁడునాళ్ళు నిర్దుష్టరీతి.

తే. మాతృయజ్ఞంబు నెఱవేఱె, మద్గృహమున-కరుగుదెంచిన బాంధవు లరిగి రెల్ల;
నింట నొంటరిపాటున నుంట గలిగెఁ-గాల మీక్రియఁ దార్కాణగా ఘటిల్లె.

తే. మిడుకుచుండంగ నెల కంత మేనమామ-దివికిఁ జనెనంచు లేఖచేఁ దెలిసె, నౌర!
దైవవిలసిత మిట్టిది! దాఁటఁగలరె-బ్రహ్మరుద్రాదులైన నీవసుధయందు? ౨౪౪

తే. దుఃఖములమీఁద దుఃఖాలు తోడుతోడ-వచ్చి కన్నీళ్ల నెల్లను వసుధ నడఁపెఁ,
గుములుచుంటిని లోలోనఁ గువిధిఁ దలఁచి-యింకనైనను విశ్రాంతి నిమ్మటంచు.

తే. చదువుకొనునట్టి తొల్లింటి ఛాత్రు లేరు-లేరు మాటాడ, సందడి లేదు, గాని
ప్రొద్దుపోవుట కష్టమై పోవుచుండెఁ,-గాంత నూత్నాగత తనంతఁ గడపెఁ బనుల.

క. గురుదంపతులు క్రమంబున-శరీర మారోగ్య మొందఁ జనుదెంచిరి సు
స్థిరులై గృహమున, కంతటఁ బరమముదం బావహిల్లె భావంబునకున్. ౨౪౭

క. ఇది నా చరితము, దురితం-బొదవని యీ చరిత మెదను నున్నతగతి న
భ్యుదయద మంచును గైకొని-సదయుల సేవల నుతింతు సతతంబు దమిన్.

ఆ. తెనుఁగుబాసఁ గవిత మొనసి చెప్పఁగఁజాలు
కవులు మున్ను యశముఁ గాంచఁజాలు
వార లగుచు ఖ్యాతి వైభవంబుల మించి
రెంచ మనిరి లోకహితముఁ దలఁచి ౨౪౯

క. మును కబ్బము లోకంబున-కనువగు మెప్పు గలిగింప నతిదుష్కరమై
చనుచుండె, నిపుడు సుకరత-నొనఁగూడెం, గారణమును నూహింపఁదగున్.

ఉ. నన్నయముఖ్యులైన కవినాథులు చూపిన త్రోవఁ బోక, నే
మున్నది భావముం దెలుపఁ బోలుఁ గవిత్వమునందు నంచు న
భ్యున్నతి వ్యాకృతిన్ స్వవిజయోద్యమపద్ధతిఁ గాఁగ నెంచి ని
ష్ఠ న్నతి నొందఁజేయు గుణసత్త్వుల భావ మదెట్టి దౌనొకో! ౨౫౧

శా. భావంబుం బ్రకటింప నడ్డమని సంభాషించుచున్ వ్యాకృతిన్
బోవం ద్రోయుచు, ఛందము న్నడఁకతోఁ బోనాడుచున్, స్వేచ్ఛ నే
త్రోవం బోవునొ యద్ది శాస్త్రమని వాదు ల్సల్పి, సాహిత్యస
ద్భావం బెంతయుఁ గ్రుంగఁజేసిరి మదిం ధన్యత్వమాసించుచున్. ౨౫౨

తే. "క్రొత్త యొకవింత ప్రాఁతయే రోఁత" యనెడు
రీతిఁ గ్రొంగ్రొత్త పద్ధతుల్ చేతమునకు
నచ్చుచుండుఁ దత్త్వంబును మెచ్చునట్టి
యుద్ధతుల కెల్ల, నిది నిజం బూహసేయ. ౨౫౩

మ. సులభం బెయ్యది దాని నూఁతగొని యెచ్చో మెచ్చ రెవ్వారు పూ
ర్వుల నేమంబులు సత్పథంబులయినన్, బూజ్యత్వముం బొందినన్,
జలమే గైకొని వానిఁ ద్రొక్కఁగ వెసన్ సంబద్ధమే లేని వా
క్కులఁ బేర్కొందురు తప్పుత్రోవలని పెక్కు ల్దోసము ల్చూపుచున్. ౨౫౪

చ. ఘటములఁ గొట్టియైన, మఱి కాదన కొక్కటఁ బోవువారి దు
ష్పటములఁ జించియైన నెటొ బల్మిని పేరు జగంబునందు వి
స్ఫుటముగ నెల్లవారలకుఁ జోద్యముగా నెఱుఁగంగఁ జేసి యు
ద్భటత వహింత్రు ధూర్తులయి భవ్యయశంబు లభించునం చెదన్. ౨౫౫

చ. పరమపవిత్రమౌ తెలుఁగుబాసకె వచ్చెను ముప్పు, లోకమం
దరయఁగ భాష లెన్నొగల, వవ్వి యొకింతయు నెట్టి కీడునుం
బొరయక సుస్థిరత్వమున నున్నవి సన్నుతికెక్కి, దిక్కులన్
బరమయశంబు నించుచుఁ, బ్రభావము నెంతయు వెల్గఁ జేయుచున్. ౨౫౬

ఉ. వ్యాకరణంబు చాల దనువారును, నున్నది దోషపూరితం
బై కడు నీచపద్ధతిని హాస్యముచేయఁగ నర్హమైనదై
ప్రాకటశాస్త్రసమ్మతిని భాసిలదం చనువారు నంతటన్
లోకమునందుఁ దెల్లునకు లోలతఁ గూర్చ నెసంగి రొక్కటన్. ౨౫౭

ఉ. నన్నయభట్టుశాసనమునం దెనుఁ గంతెయు రాజపూజ్యతం
గొన్నదిగాదె? యాపయిని గోవిదు లెందఱు తెల్గులక్షణా
లెన్ని రచింప రన్నియును నెంచరు త్రోవకు నడ్డమంచు, న
భ్యున్నతి భావపుంగవిత నూది వచింతురు తారె ధీరులై. ౨౫౮

చ. "తెనుఁగునకున్న వ్యాకరణ దీపము చిన్నది" యన్నవారుఁ బే
ర్మిని భువనప్రశస్తిఁ గనగే యసదైన తదీయకాంతిఁ బెం
పున? నటు చూచినన్ బుధులు పాండికఁ గాంచరె దాని తోడుపా
టున? వడి లోపముం గని యెటు ల్ప్రచరింతురొ యిట్టివాక్కులన్? ౨౫౯

ఉ. ఉన్నది యున్నయట్టులు మహోన్నతిఁ దెల్పుట భావ మందు, రం
దున్నది నైజమైన కళ, యూర్జితమై భువనప్రశస్తికిన్
గన్నది మార్గ మయ్యదియెగా యని యూహుదు రద్భుతంబుగా
నెన్ని తలంపుఁ దియ్యది మహిన్ బుధు లెవ్వరు మెత్తురం చెదన్. ౨౬౦

చ. భువిఁగల సర్వశాస్త్రములు పూర్ణనిబంధన మొప్పియుండఁగా
మివులఁ బ్రమాణము ల్దలఁప మించెను నెల్లెడ, నెద్దియేనియున్
మివులకు వస్తు వెచ్చటను మించి నిబంధన దాఁటి, చూడుఁడీ
ప్రవిమలబుద్ధిశక్తిఁ గొని భావమునం బరికించి బాగుగన్. ౨౬౧

ఉ. ఛంద మదేల, వ్యాకరణశాస్త్రము శాసన మేటి, కిచ్చుఁ బెం
పొందెడు భావముం దెలుపఁ బోలునె యడ్డుగ నిల్చుఁగాని యే
యంకము నిచ్చుఁ గైత కని హాస్యము భావకవు ల్పొనర్తు, రా
ఛందమునందునం గలుగు సారము నారయుఁడీ మహాశయుల్. ౨౬౨

ఉ. నన్నయతిక్కనాది కవినాథులు భావము లేని పద్యముల్
గొన్ని రచించినార లని కొంకక తెల్పెడువార లెవ్వరే
నున్నటు లెందునుం గణన యొక్కట సల్పఁగలారు లేరు భా
వోన్నతి మించినట్టి కవు లుర్వి ననంగ విచిత్రమున్నదే! ౨౬౩

ఉ. కొందఱు సుస్థితిం జగతిఁ గోవిదులై యితరోక్తులందు ని
ష్పందత దోషము ల్వెదుక సాగుచుఁ దత్కృతులం బహిష్కరిం
పందగు వాక్యము ల్సభలఁ బల్కుచు నుందురు స్వీయదోషముల్
మ్రందు నటించు, నియ్యదియె మార్గము కీర్తి కటంచు నెప్పుడున్. ౨౬౪

శా. అందం దొక్కొక నూత్నశబ్దమును నిత్యాభ్యాసముం జేసి, యే
సందేహంబును బొందక చ్ఛటచటన్ సంభాషణల్ స్వేచ్ఛతన్
బొందం జేయుచుఁ, బండితావళిని సంపూర్ణప్రథన్ దిట్టుటల్
క్రిందైయున్నది లోకమందు స్వయశః ప్రాగల్భ్యముం గూర్పఁగన్. ౨౬౫

ఉ. పెద్దలు కూర్చినట్టి నుడివిత్తముఁ గొండొక చేర్చి, దానితో
నొద్దిక సత్సభాస్థలుల నొయ్యన నాఢ్యులరీతిఁ గుల్కుచున్
దద్దయుఁ దప్పుత్రోవల జనంబుల మోసముఁ జేసి, కల్పనల్
విద్దెల మేలిమిం దెలుపు విశ్రుతులం గొనియాడు టెట్లగున్? ౨౬౬

చ ఒరులను దప్పుపట్టుటయె యుద్యమ, మయ్యదియే నిజప్రథన్
వరుసగఁ బెంచు నంచు మది వారిక యూది చెలంగువారి లె
వ్వరుసను బండితాదృతిని బల్మఱుఁ బొందఁగఁజాల రంచు ను
ర్వరఁ దెలియంగనౌ విబుధవర్యులు చిత్తములందు నెప్పుడున్. ౨౬౭

ఉ. భాసలలోఁ దెలుంగు కడు భాసిలు రూపమునందు మిన్నయై,
దోసము లేని బాసయె బుధుల్ గణుతింతురు సర్వరీతులన్,
వేసరునట్టు లెల్లరును పీటిడులై స్వమతంబు నిల్పనా
యాసముఁ బొందరా దనుచు నాత్మ నెఱుంగుట మేలు ధీయుతుల్. ౨౬౮

ఉ. పెద్దలు చన్న త్రోవయె ప్రవేశముచేసి చరింపనౌ, జగం
బద్దియె మెచ్చు, నిత్యయశ మంతటఁ బ్రాఁకఁగఁ జేయు నద్దియే,
యొద్దియొ మాఱుత్రోవను బ్రకృష్టగుణాస్పద మంచుఁ బూనుటే
యొద్దిక యౌనె? భావమున నూహయొనర్పఁగఁ బోలుఁ బండితుల్. ౨౬౯

ఉ. భావము భాన మంచు వడిఁ బాఱుచు స్వేచ్ఛ వహింప ముఖ్యస
ద్భాన మడంగు నాత్మ, వ్యథ పాడుకొనున్, స్వయశంబు డిందు, ని
చ్ఛావిధి నెల్లవారలు వెసన్ మది నింద యొనర్తు, రట్టి దు
ర్భావము నేల గైకొనఁగఁ బల్కెడువారలో నూత్నసత్కవుల్! ౨౭౦

ఉ. చిత్తమునందుఁ దత్తఱముఁ జెందక, పెద్దల పద్ధతిన్ మహో
దాత్తత నెంచి, పూజ్యమని తత్త్వము బుద్ధిని నిల్పి, సత్కవుల్
ప్రోత్తల మాని, పూర్వకవికోటినమస్కుల గారవించి, యు
త్యుత్తమకీర్తిఁ గాంచుటకు నొక్కట యత్నముచేయ మేలగున్. ౨౭౧

మ. కవితాకన్యను బోషగా నొనరుపం గాంక్షింప, కత్యంతసం
స్తవనీయంబగు కీర్తి నెల్లునెడ లిచ్చున్ జెంపఁగాఁ బూనఁగా
నెవఁ డాత్మం దలఁచున్ సతిం, బతిఁడు భాగ్యైకాస్పదుండై ప్రకా
శవిశేషోన్నతి నొందుఁ, గాన మది నెంచంబోలు నీపద్ధతిన్. ౨౭౨

ఉ. చక్కని మార్గ మెప్పుడును సద్గురుబోధ నెసంగుచుండుఁ, ద
త్పక్కి గురూపదిష్టుఁడగువాఁ డెద నిల్పి భజించుఁ; గాని, పె
న్మక్కువ దుష్టమార్గముల మాటికిమాటికి నాదృతింగొనన్
జక్కఁగ సాహసించు వివశత్వమునన్ ఖలుఁ డెన్నిరీతులన్. ౨౭౩

ఉ ఉన్నవిధంబుఁ బోనడఁచి, యొక్కట స్వేచ్ఛను గ్రొత్తతెన్నునన్
జన్న జగంబునన్ యశము శాశ్వతమై యరుదెంచు నంచు న
భ్యున్నతి మార్పులం దవిలి యుద్ధతులౌట స్వనాశహేతువం
చెన్నఁగనొప్పు ధీనిధి యశీలపత నాత్మల నెల్లవేళలన్. ౨౭౪

చ. తగు నిది యంచు నూహ పరతత్త్వముఁగూర్చి తలంచి, యాపయిన్
దెగువను బోనడంచి, జగతిన్ బుధులెల్లరు సత్పథంబు నూఁ
తగఁ గాని తత్క్రియం బగునె సతంబు చరింపఁగ నౌనటంచుఁ దె
ల్పి గురువులైరి సుస్థిరత, పీడఁగ నయ్యది రాదు సుంతయున్. ౨౭౫

మ. ఇది సత్యం బని యెంచి సత్కృతిని నెంతే పూన్కి ప్రాచీనమా
పదవిన్ వ్రాసినఁ గీర్తనీయనుగుఁగా, భాషామహాదేవికిన్
బాదలున్ సంతస మంచు భాగవతమున్ బూర్ణంబుగాఁ దెల్పునన్
మది దేవీపదముల్ దలంచుచు రచింపంబూనితిన్ భక్తితోన్. ౨౭౬

శా. లోపంబు ల్గనుపట్టినన్ రచనలో లోఁ దిట్టఁగాఁబోక, హృ
త్తాపం బేమియుఁ బొంద, కాదృతిని నా తాత్పర్య మూహించి మీ
రాపద్బాంధవులై దయం దెలిపి నా కానందముం గూర్పఁగా
మీపాదంబులు మ్రొక్కి వేఁడుదును; నెమ్మిం జూడుఁడీ విద్వరుల్. ౨౭౭

చ. ఒరులను దప్పుపట్టుటయె యుద్యమమై తగియున్నవారి ని
బ్బరము వహించి, కైతఁ గల పద్ధతి నించుక యోజసేసి, సం
బరమును బొందుఁ డంచు వడిఁ బ్రార్థనసేయుదు నెల్లవేళలన్,
దిరమగు తాల్మి యూనుఁడని ధీరతఁ దెల్పుదుఁ బూజచేయుచున్. ౨౭౮

తే. ప్రాజ్ఞవరులార ! యెంచి నా ప్రార్థనంబు—తప్పులను దిద్ది గైకొనుఁ డొప్పులెల్లఁ,
గృతిసముద్రంబు నీఁదఁగ నెట్టులోర్చు—నెవ్వఁడే దయ్యు కేరీతి హితవెతింగి ?

ఉ. నన్నయ తిక్కనాది కవినాయకులే జగమందు లోపసం
పన్నత నొందినార, లసమగ్రవివేకము గల్గియున్న నే
నెన్నివిధంబులం దలఁప నేక్రియ లోపములేని కైత నే
ర్పున్న దటంచు వ్రాయుదును ? బుద్ధిఁ దలంపుఁడు పండితోత్తముల్. ౨౮౦

మ. పరదేవీ మహిమంబె యీ రచనకుం బ్రాపంచు నూహింపుఁ,డీ
సరణిన్ మెచ్చుఁడు, భావమందు నిజభాషాసేవకుం దోడ్పడుం,
డురవౌ సత్కృతి గారవింపుఁ డనుచున్ యుష్మత్పదాంభోజముల్
వరుసన్ మ్రొక్కెదు, సత్కవీశ్వరుల సంప్రార్థింతు నెల్లప్పుడున్ ౨౮౧

ఉ. పెద్దలు నన్నయాదిసుకవిప్రవరుల్ సుకృతుల్ కృతుల్ జగం
బద్దిర యంచు మెచ్చుకొన నన్నిపురాణములం దెనుంగుగా
నొద్దికతో రచించిరి, మదున్నతపుణ్యము భాగ్యవంతమై
తద్దయుఁ బర్వ నీకృతిని దల్పఁగ లేదు తెలుంగు సేయఁగాన్. ౨౮౨

మ. పరదేవీ మహిమంబె తెల్గునను వ్యాఖ్యింపఁగాఁబూనె, నె
వ్వరికిం గానఁగరాకయుండునటు లీభవ్యప్రబంధంబు ను
ర్వర గూఢంబుగ నుంచె నంచుఁ దలఁతున్ భావంబునన్, లేనిచో
నరయన్ భాగవతంబు తెల్గునకు వ్రాయన్ జాలరే నైంధుల్ ! ౨౮౩

ఉ. వ్రాసినవాఁడ నాత్రిపురవైభవదివ్యపదారవిందముల్
భాసిల నామనంబునను భవ్యము భాగవతంబు తెల్గునన్ ;
దోసము లున్న నాపయిని ద్రోయక, దీవెనలిందు మక్కువన్
జేసి శిశూక్తు లంచు మదిఁ జింతనసేయుచుఁ బండితావళుల్. ౨౮౪

ఉ. పిల్లల కెన్నఁ దల్లియె యభీష్టదయా, నుడులెల్ల నేర్పు, ని
త్యోల్లసితక్రియ న్నడపు, నున్నతుఁ జేయును, సంతసించుఁ, ద
త్సల్లలితాద్భుతిన్ జరుగు సర్వముఁ, గావునఁ దల్లిచాటునన్
బిల్లఁడురీతి నున్న నను వీక్షణసేయుఁడు గాంచి మత్కృతిన్. ౨౮౫

చ. నుడువులఁ జక్కదిద్దకయె నోరు మెదల్చిన యంత నాత్మలో
బుడుతని గాంచి తల్లి ముదమొందు, నదేక్రియ మత్కృతంబునై
పుడమిని నీ పురాణము ప్రపూర్ణత నొందినయట్లు లెంచి న
న్గడు దయఁ జూడుఁడీ విబుధకాండములార ! నమస్కరించెదన్. ౨౮౬

చ. మొదలితి వ్రాసితిన్ జతనమున్ గణియింపుఁడు, లోకసేవయే
యిది యని యెంచుఁ, డెంతయు నహీనగుణాస్పదులై గుణంబులే
కొదుకక కైకొనుండు; కడుఁగూర్మి వహింపుఁడు, బోధసేయు; డి
య్యది యగు విన్నపంబు విబుధావళికిన్ వినుతిప్రపూర్వమై. ౨౮౭

ఉ. భద్రద మీ పురాణగణభవ్యము భాగవతంబు తెల్గునన్
మద్రచితంబు లోకమున మాన్యతఁ గాంచునుగాత మంచు న
త్యుద్రత నెంచినాఁడఁ గవికోటికి సంతస మిచ్చు నంచు స
మ్ముద్రితమై యొసంగు భువిఁబూర్ణత నారవితారకంబునై. ౨౮౮

మ. ఇవి నాయూహలు, లోకపూజ్యతను నెంతే యిచ్చు నం చెంచి భా
గవతంబున్ విరచించినాఁడను జగత్కల్యాణముం గోరుచున్;
మివులన్ శ్రీపరదేవతాచరణముల్ నిత్యంబు హృత్సీమలోఁ
దవులన్ శ్రద్ధయఁ బల్కితిన్, గనుఁడు, నన్ ధన్యాత్ముఁ గావింపుఁడీ. ౨౮౯

చ. తెలివిని గూర్చి యాదృతినిఁ దేటతెనుంగున, సంస్కృతిన్ గవీం
ద్రుల వరపద్ధతిన్ రచన తీరపుఁబ్రీతిని వ్రాయునట్టు లి
మ్ముల నడిపించె దేవగణపూజితదివ్యపదాంఘ్రిపద్మ శ్రీ
లలితయె; కావునన్ గృతి నలంకృతిఁ జేయఁగఁ బూనితిన్ మదిన్. ౨౯౦

క. సాకార యనుచు మఱియు ని-రాకార యటంచు విబుధు లాత్మలఁ గొల్వన్
జేకొని యాదృతి శుభములఁ-బ్రాకటముగ నిచ్చు దేవిఁ బ్రార్థింతు మదిన్.

తే. ఏ మహాదేవి సంప్రీతి నీమహాపు-రాణవర్యముఁ దెనిఁగింపఁ బ్రథితశక్తి
సూక్తుల నొసంగె, నాదివ్యశక్తి పాద-పద్మముల కంకిత మొనర్తు భక్తితోడ.

తే. మానసంబున కందఁగా రాని ప్రతిభ-వెలుఁగు జగదంబికాపద సలిలజయుగ
మాత్మ ధ్యానించి యీరీతి ననవరతము-నిష్కళంకత్వమునఁ గృతి నిశ్చయించి.

క. ధ్యాన ధ్యాతృధ్యేయా-నూన ప్రతిభా విశేషసత్యచరణకున్,
మానీంద్ర సురేంద్రాది-జ్ఞానాస్పద నిత్యపూతచరిత కరుణకున్. ౨౯౪

క. కరుణాభరణకు, విశదా-భరణాయిత భక్తవిసర వాంఛోద్ధరణ
స్మరణ ప్రవణకు, సురగణ-వరసతతాదృతివిధాన భరితకరణకున్. ౨౯౫

క. కరణాగమ్యకు, నిస్తుల-వరప్రదకు, సంశ్రితార్తివారణకు, మహే
శ్వరసంస్తుత గుణగణ ని-ర్భర పరిపూత ప్రపంచ పరివర్తనకున్. ౨౯౬

క. నిత్యానందాత్మిక, కౌ-న్నత్య ప్రతిభావిశేష నర్తిత లోక
స్థిత్యనుపమ చరితకుఁ, గృత-కృత్యాశ్రిత జనవరేణ్య కీర్తిప్రదకున్. ౨౯౭

క. నిగమాగమ సన్నుత, క-త్యగణిత ధృతియుత, కభీప్సితార్థప్రదకున్
జగదాది స్థిత్యంత-ప్రగతికృతకు, నిరవధికవిభవసంయుతకున్. ౨౯౮

క. సర్వైశ్వర్యదమహిమా-ఖర్వప్రభ, కఖిలయోగ గమ్యాభకు, ని
ర్గర్వస్వాంతమనీషీ-ధూర్వహ, శానతజనౌఘ తుష్ట్యావహకున్. ౨౯౯

తే. పరమభక్తి సమర్పింప వరుసతోడ-వ్రాయఁబూను మహాభాగవతమునకును
నిదియె ప్రారంభమగు; దయహృదయసీమ-వెలయఁగా నవధరింపుమో విశ్వజనని

శ్రీమత్పరదేవతాయై నమః

శ్రీ మహాభాగవతము.

కథాప్రారంభము

ప్రథమాంశము

మొదటి అధ్యాయము

తే. శ్రీసురాధిపమాళిభూషిత మనోజ్ఞ-పారిజాత మరంద కణారుణములు,
భవతనయపాదపద్మరేణువులు విఘ్న-బృందముల సంతతము నివారించుఁగాక ! ౧

క. నారాయణు, నరవరు, నరు-భారతి దేవీమతల్లి, వ్యాసమునీంద్రున్
భూరినమస్కృతు లొనరిచి-తీరుగఁ బిమ్మట జయంబు దెల్పంగఁదగున్. ౨

సీ. ఏ దేవిఁ బూజించి యీజగత్సృష్టిఁ గావింప నేర్పు గడించె విశ్వకర్త,
యే దేవిఁ బూజించి యీ జగత్పాలకత్వమున దక్షుండయ్యె దానవారి,
యే దేవిఁ బూజించి యీ జగత్సంహార మొనరింపఁ దగు శక్తి నొందె శూలి,
యే దేవి తత్త్వార్థ మెఱిఁగిన మును లెల్లఁ బరమప్రకృతి గాఁగఁ బలుకుచుందు,
తే. రే మహాదేవి ధ్యేయమై యొసఁగు యోగి-జనములకు నెల్ల సంతతంబును మనముల,
నట్టి స్వర్గాపవర్గద కఖిల విశ్వ-జననికి నమస్కరింతు నా స్వాంతమందు. ౩

సీ. ఏ దేవి యీ విశ్వ మెల్లను స్వేచ్ఛచే సృజియించి జన్మంబుఁ జెంద శంభు
నర్ధాంగలక్ష్మియై యత్యంతసంతోషమున విలసిల్లు నీ భువనమందు,
నే దేవి నీశ్వరుం డెంతయు ఘోరతపంబుల మెప్పించి పత్నిగాఁగఁ
బడసి యాత్మీయ హృత్పద్మంబునందు నివాసంబు నొసఁగెను భాసురముగ,
తే. నట్టి లోకైకమాత, నిత్యానవద్య-భక్తజన వాంఛిత విధాత్రి, భవ్యగాత్రి,
శీతగిరిపుత్త్రి భక్తిసంశ్రితమనీషు-లైన మి మ్మోముఁగావుత మనవరతము. ౪

మహాభాగవత ప్రకాశనము

తే. నైమిశం బను పుణ్యావనంబునందు-శౌనకాదు లా తాపససత్తములు మ
హర్షిశార్దూలు, వేదవిదాఢ్యు, సూతుఁ-గాంచి మున్నొకనాఁడు ప్రశ్నించిరిట్లు. ౫

సీ. "స్వర్గాపవర్గ శివప్రదంబును, నుత్తమంబు దేవీమహిమంబు విస్తృ
తంబుగ నే పురాణంబున వెలయునో దాని నిప్పుడు మాకు దయదలిర్ప

నెఱిఁగింపవే సూత! యీభువి నరులు దివ్యజ్ఞానవిరహితు లయ్యుఁ, దొమ్మి
దివిధంబులైన భక్తిని వారు పొందుదు రేపురాణము విని రేని నియతి,

తే. నోమహామతి!" యని వేఁడ నురుదయాస
ముద్రుఁడగు సూతుఁడప్పుడు మునులఁగాంచి
పలికె నిట్లు "మహాభాగవతపురాణ
మనఁగఁ బరమరహస్య మయ్యది వినుండు. ౬

తే. మున్ను నారదమునికి శంభుండు తెలిపె-దీని, భగవంతుఁడౌ వ్యాసమౌని భక్తి
శాలియగు జైమినికి బోధసల్పె, నాపు-రాణమే మీకుఁ దెల్పెద, శ్రద్ధవినుఁడు. ౭

తే. తాపసోత్తములార! మీ రీపురాణ-రత్నమును వెల్లడింపంగ రా దెపుడును,
గోప్య మియ్యది కావున గోపనీయ-మగును గుణజితసంయుత నార్యులార! ౮

సీ. ఈ పురాణంబును నేపురుషుండైన వినినను, జదివినఁ గను సుకృతము,
వచియింప నా మహేశ్వరుఁడు వత్సరసహస్రములనైనను దా నశక్తుఁ డగును,
గావున మునులార! గణన కశక్యమౌ తత్ఫలంబును దెల్పఁ దగిన శక్తి
గలవాఁడ నౌదునే కడఁక" నటంచు సూతమునీంద్రుఁ డాడినఁ దాపసేంద్రు

తే. లంత నాశ్చర్య సంభరితాతిహర్ష-తాత్ములై వేదవిద్వరు, లార్య సూతుఁ
గాంచి వినుతించి యత్యంత క్రమభాషి-తముల నిట్లని యడిగిరి తమి దలిర్ప. ౯

ఆ. "ఈ పురాణరత్న మేరీతి భువియందు-వెలసె, దీని నెల్ల విస్తరించి
యెఱుకపఱుపుఁడిప్పు డెంతయుఁ గరుణతో-సూత! ధీసమేత! సుకృతచరిత!" ౧౦

క. అని వినయంబునఁ బ్రార్థన-మును జేయఁగ సూతమౌని పుంగవుఁడు దయన్
వినిపింపఁ దొడఁగె నమ్ముని-జననాథులకును బురాణసంహిత వరుసన్ ౧౧

సీ. "సకల వేదంబులఁ జదివినవారిలోపల నగ్రగణ్యుండుఁ, బరమమునియు,
ధర్మశాస్త్రములెల్లఁ దగురీతి విరచించినట్టివాఁడును, జ్ఞాని యైనవాఁడు,
వరమహాశయుఁడును, భగవంతుఁడును నైన వ్యాసమునీంద్రుండు పదునెనిమిది
యగు పురాణంబుల నత్యంత కృపతోడఁ గావించి సంతృప్తిఁ గాంచఁడయ్యె,

తే. ధర్మసముదాయముల ముఖ్యతత్త్వ మెఱిఁగి-నట్టి సర్వజ్ఞుఁడయ్యుఁ దా నంతరంగ
మందునించుక యేనియు నార్యులార!-యొక్క సమయంబునందిట్టులూహ చేసె. ౧౨

చ. "పరమమహాపురాణమయి భాసిలు నెయ్యది? దేని మించి యీ
ధరణిఁ బురాణ మొండు విశదంబుగ నుండఁగఁజాల? దెందు సు
స్థిరముగ నారయన్ భగవతీమహిమం బతివిస్తృతంబునై
పరఁగునొ? తత్పురాణమును వర్ణన యేక్రియఁ జేయఁగల్గుదున్? ౧౩

క. దేవీతత్త్వం బెఱుఁగక-యేవిధమున వర్ణనంబు నేఁ జేయుదు నం"
చావిలచిత్తుండయి మది-నా వేదవ్యాసమౌని యంతఁ దలంచెన్. ౧౪

తే. "పరమసుజ్ఞానియౌ మహేశ్వరుఁడె యెఱుఁగఁ-జాలఁడే దేవితత్త్వంబు, జగతి నేమ
హాజనని తత్త్వమును దెలియంగ నునతి-దుష్కరంబయి మిగుల నుద్ద్యోతమగును." ౧౫
క. వరమతియగు వ్యాసుం డిటు-లరసి తుహినశైలమునకు నరిగి తపంబున్
జిరకాలము దుర్గాభ-క్తిరతుండయి చేసెఁ గఠిన దీక్షానియతిన్. ౧౬
తే. భక్తవత్సల యయిన శర్వాణి తత్త-పమున కతితుష్టయై యాకసమున నిలిచి
పలికె నీరీతి వ్యాసుఁ దాపసవరుఁ గని-"వినుము నామాట శ్రద్ధతోడ సుమునీంద్ర!

పరమేశ్వరి వ్యాసునకు బ్రహ్మలోకమున కరిగి శ్రుతులఁ దత్త్వ మడుగుమనుట

చ. మునివర! బ్రహ్మలోకమును ముందుగఁ జేరఁగఁబొమ్ము నీవు, వే
దనివహమెల్ల నచ్చట సతంబు వసించుచు నుండు, నిష్కలం
బును గడు నున్నతంబగుచుఁ బొల్చెడు మత్పరతత్త్వ మంతయున్
గనుఁగొను దండు, నే శ్రుతిగణస్తుతి నొందుదు సుప్రసన్నతన్. ౧౮
తే. వ్యాసమునిచంద్ర! భవదీయవాంఛితంబు-నంతయును బ్రహ్మలోకంబునందు దీర్త"
నని యదృష్టస్వరూపంబునను వచింప-సత్యలోకంబునకు నంతఁ జని యతండు. ౧౯
క. శ్రుతులకు సాష్టాంగనమ-స్కృతు లొనరిచి పలికెఁ "గరుణఁ జెప్పుఁ, డవ్యయమై
స్తుతికెక్కు బ్రహ్మపద మే-వితమునఁ జెలువారు? నెఱుఁగ వేఁడెద భక్తిన్." ౨౦
క. వినయంబున నవనతుఁడౌ-ముని ప్రార్థన నాలకించి మొగిఁ బ్రత్యేకం
బున శ్రుతులెల్లను దత్క్షణ-మునఁ బల్కెను వ్యాసవరమునిపుంగవుతోడన్. ౨౧
తే "సర్వభూతంబు లెందుండు, సకల మెచట-నుండి వర్తించుఁ, బరమమై యుండు నేది
యది యెతత్త్వము భగవతియగు స్వయముగ"-ననుచుఁ బల్కెను ఋగ్వేదమధిక భక్తి.
తే "ఏది సకలయజ్ఞంబుల నీసుచే య-జింపఁబడును, బ్రమాణతఁ జెంది యేము
దేని నుండుము, భగవతీదివ్యతత్త్వ-మది యెస్వయముగ" నని యజుస్సుపుడు పలికె.
తే. సామవేదంబు వచియించె "సంయము లెది-తలఁతు, రేది ప్రపంచంబుఁ దగ ధరించు,
వెలయు నెద్దానిచేత నీ విశ్వమెల్ల-నదియె దుర్గ జగన్మయి యనఁగ నొకటి" ౨౪
తే. "పరమభక్తి ననుగ్రహవంతు లెంతు-రాత్మ దేవేశిగా దేని, నదియె యంద్రు
పరమపురుషుఁడు బ్రహ్మంబు భగవతియగు-దుర్గ" యంచు నథర్వంబు తోడ రిపలికె."
క. మునివరుఁడగు సూతుఁడు పలి-కెను ఋషులం గాంచి "శ్రుతులు కీర్తింపఁగ ని
య్యనువున సత్యవతీనం-దనుఁడగు వ్యాసుండు విని మోదం దలపోసెన్. ౨౬
క. "కనుఁగొంటిఁ బరబ్రహ్మం-బనఁగా, మది నిశ్చయింప నయ్యెను జగమం
దున, భగవతియగు దుర్గయె-యని తెలిసితి" ననుచుఁ బొంగె నత్యంతంబున్. ౨౭
క. అంతట నా శ్రుతిసంతతు-లెంతయు నమ్మానివర్యు నీక్షించి "మునీ!
యంతయుఁ బ్రత్యక్షముగా-వింతుము తెల్పినది నీకు వివిధవిధములన్." ౨౮

తే. వేదములు పల్కఁ యాక్రియ వినుతిచేయఁ-బూని సచ్చిదానంద సంపూర్ణ విగ్ర
హయును, శుద్ధయు,సర్వదేవాత్మికయును-నయినపరమేశ్వరిని భక్తియతిశయిల్ల.

సీ. "విశ్వమయీ! పరమేశ్వరి! యోదుర్గ! నీస్వేచ్ఛచేతనే నిర్మితులయి,
వరుస బ్రహ్మాదులౌ పురుషత్రయంబు సృష్ట్యాది కార్యత్రితయంబునందు
స్వీయగుణాళిఁ గల్పితులయి వెలసిరి;నీకు సమాను లీలోకమందు
నెవ్వార లున్నార లెచ్చోట వెదకిన? నతిదుర్గమంబు లైనట్టి నీదు
తే. దివ్యగుణసంఘముల మదిఁ దెలిసి యెవఁడు-సంస్తుతియొనర్పఁగాఁ దగు శక్తి గలిగి
నట్టివాఁ డున్నవాఁడు మాయమ్మ సృష్టి-దృష్టిలోపల నోమహాదేవి! తల్లి! ౩౦

చ. హరి నినుఁ గొల్చి దుర్జయుల నాసురులన్ వధియించి యాజి సం
బరమున మూఁడులోకములఁ బాలనసేయుచు నున్నవాఁడు, త్వ
ద్వరచరణంబు వక్షమునఁ దాలిచి శంభుఁడు లోకనాశ భీ
కరమగు కాలకూటము నికామశుభంబుగఁ ద్రావెనంబికా! ౩౧

తే. తల్లి! యీ మూఁడు జగములఁ దావకీన
దివ్యమహిమాతిశయముఁ గీర్తింపఁ గలమె?
ముజ్జగంబుల రక్షింప మూలమయిన
యంబికవు, త్వచ్చరిత మెన్ననగునె మాకు? ౩౨

సీ. ఏదేవి స్వీయగుణాదుల మాయచేఁ బరమపూరుషుఁడయి పరఁగు దేహ
ధారికి దేహాఖ్య తా వెలుంగుఁ జడాత్మికయుఁ బరిస్పందాదికయును బరమ
శక్తియు నాఁగ విశ్వంబునయందు, నేదేవిని ద్వన్మాయఁ దెలియఁజాల
నట్టివారై, మోహితాత్ములై దేహధారులు విభేదజ్ఞాన విలసితులయి
తే. పరమపురుషుఁడుగాఁగ విభ్రాంతి దేహ
సంస్థితనుగా వచింత్రు విశ్వమయివైన
నిన్ను మాయమ్మ! యంబికా! నీకు మ్రొక్కు
లిడుచునున్నార మోతల్లి! యెపుడు భక్తి. ౩౩

సీ. స్త్రీపుంస్త్వముఖములై తేజరిల్లు నుపాధిసముదయంబులచేత శక్తియుక్తిఁ
దక్కవయయి యున్నతాఁబరబ్రహ్మంబు మొదట నీవలననే భువనసృష్టి
యిచ్ఛను బొందెను; సృష్టియం దాత్మీయమయి తనంతట వెల్గునట్టి శక్తి
పరమమై భాసిలు నిరవుగఁ, దచ్ఛక్తి మూలకారణము ద్విమూర్తులకును
తే. నయ్యెఁ, గావున బ్రహ్మమే యాదిహేతు-వగు భవన్మాయయే కాననగుచునుండు,
తల్లి! శక్త్యాత్మకమె పరతత్త్వమయిన-బ్రహ్మమనఁబడుచుండును బ్రథితముగను.

సీ. జలములయందుండి సంభవించిన వడగండ్లు మున్నగునవి కనుఁగొనంగ
జలధర్మవస్తుత్వ సమనిశ్చయ జ్ఞాన మభిమత మయి మదికగుచునుండు

నేరీతి, ధ్రువముగా నారీతి బ్రహ్మసంభవమైన సర్వంబు పరిగణింప
శక్తిస్వరూపమై స్వాంతంబునకుఁ దోఁచు, నద్దానఁ బురుషుని దైన ప్రజ్ఞ

తే. విశదరీతిని వెలుఁగొంది వెలయుచున్న
యాపరబ్రహ్మమందు శక్త్యాత్మకత్వ
మునను దృఢనిశ్చయజ్ఞానమునఁ బరమయి
యుండున దెలించఁబడుచుండు నురుతరముగ. ౩౭

సీ. ప్రాణుల షట్చక్రపంక్తుల విలసిల్లు బ్రహ్మాదిషట్శివు ల్పరమశక్తి
భవదాశ్రయంబునఁ బరఁగుచుఁ బ్రేతలై పరమేశభావంబు పరఁగఁ బొందు
చున్నార లాశివు లోచ్ఛేద్యంబుగా; శివునం దీశ్వరత్వమే యరయ లేదు,
మంగళరూపిణి! పొంగును నీయందె జగదంబికా! యీశశక్తి! యట్టి

తే. కారణంబున దేవి! దుర్గ! గతి మాకు-ముజ్జగంబులవారిచే మ్రొక్కులఁ గొను
పదములం గల తల్లి కృపాప్రపూర్ణ-వయి ప్రసన్నవు గమ్ము విశ్వైక వినుత!"

వ్యాసునకుఁ బరమేశ్వరి ప్రత్యక్ష మగుట

తే. శ్రుతులు శ్రుతివాక్యములచేత స్తుతియొనర్ప
నిట్లు, లోకవిసరమున కెల్లఁ దల్లి
యా సనాతని దేవి ప్రత్యక్షమయ్యె"
ననుచు సూతుండు మఱియుఁ జెప్పను దొడంగె. ౩౮

తే "జ్యోతిరూపిణి యా దేవి చూడ సకల-ప్రాణులందున వసియించు భవ్యయగుట
వ్యాసముని సంశయంబును శాపఁబూనె-నప్పుడు స్వతంత్రరూపంబు నవధరించి.

సీ. వెలుఁగుచుండినయట్టి వేయిసూర్యుల తేజమునఁ, జంద్రకోటితుల్య నిజకాంతి
విలసిల్ల, నయ్యంబ వేయిచేతులతోడ దివ్యాస్త్రజాలముల్ భవ్యరీతి
ధరియించి, దివ్యవస్త్ర విభూషణాఢ్యయై దివ్యగంధము లలందిన శరీర
మత్యంతసురభిళం బగుచుండ, సింహంబుపైన నారూఢయై ప్రౌఢి మించి,

ఆ. కానఁబడుచు నొక్కకతతి శవంబును-వాహనంబుగాఁగ వఱలు, నొక్క
చక్కి నాల్గుచేతు లక్కజంబుగఁ దాల్చి-దేవి వ్యాసమునికి దృశ్యయయ్యె. ౩౯

సీ. నూతనమేఘంబురీతి కాంతి వెలుంగ రెండు భుజములతో నుండు, నాల్గు
చేతులతోడుతఁ జెలఁగు నాకణమందె, దశభుజాఢ్యయు నయి తనరుచుండుఁ;
బదియునెన్మిది భుజపంక్తులతో నుండు, నప్పుడె శతసంఖ్య నలరు భుజము
లను దాల్చి దీపించుఁ, గనుఁగొనుచుండ ననంతభుజాఢ్యయై వింతఁజూపు,

తే. దివ్యరూపంబుధరియించి తేటపడఁగఁ-గానఁబడు, విష్ణురూపంబుఁ గడఁకఁ దాల్చు;
నంత శ్రీవిష్ణువామాంగమందె సంగు-శ్రీమహాలక్ష్మి రూపంబుఁ బ్రీతిఁ బొందు. ౪౦

క. చూచుచునుండఁగ వ్యాసున-కాచక్కని రాధయయ్యె నాకస్మికరీతిన్,
దోఁచెను శ్రీకృష్ణాకృతి-వే చతురవిలాసములను వెలయఁగ నపుడే. ౪౧

క. ఒకమాఱు బ్రహ్మరూపం-బొకపరి వాణీస్వరూప మొప్పారఁగఁ, బా
యక యాకమలాసను వా-మక్రమ దేహార్ధమందు మహిమ వెలుంగున్. ౪౨

తే. శివుని యాకృతి ధరియించి చెలఁగె నొక్క
సమయమున, హరవామాంగ సంస్థితయగు
పార్వతీరూపమునఁ బొల్చె సర్వశక్తి
యైన యాజగదీశ్వరి మౌనియెదుట. ౪౩

తే. ఈ విధంబున సర్వమయియగు నాది-దేవి తా బహురూపముల్ దివ్యశక్తి
వెలయధరియించిబ్రహ్మరూపిణియగుటను-వ్యాసముని సంశయంబును బాపెనపుడు.''

దేవి వ్యాసమునిసందియంబు తీర్చుట

క. అని పలికి సూతుఁ డిట్లని-మునివర్యుల కెల్లఁ దెలుపఁబూనె ''మునీంద్రుల్!
వినుఁ డంతి వ్యాససంయమి-గనుఁగొని తద్రూపములను గాంచి ముదంబున్. ౪౫

తే. సకలజగములకును దల్లి శక్తియనుచు
మనమునఁ దలంచె, నా దేవిమహిమ వ్యాస
మౌని తాఁ బరమబ్రహ్మ నుహితతత్త్వ
మరసి యపుడు జీవన్ముక్తుఁ డయ్యె నంత. ౪౬

క. పర దేవి యయిన భగవతి-కరుణం బరికించి వ్యాసకాంక్షితమును న
త్తరుణమున నాత్మపదతల-మిరవుకొనిన సరసిజంబు నేర్పడఁజూపెన్. ౪౭

తే. వ్యాసముని యాసరసిజంబునందుఁ గల్గు-వేయిరేకులలోపల వెలయు పరమ
వర్ణసహిత మహాభాగవతపురాణ-మంతయునువింతతోఁ గాంచె నంతయుఁ దమి.

చ. మునివరులార! వ్యాసమునిముఖ్యుఁడు దేవిని బెక్కురీతులన్
మనమున సంస్తుతించుచు నమస్కృతి మూర్ధముతోడ నాదరం
బున రచియించి, యంత శ్రమమున్ వడిఁ బాసినయట్లు ధన్యతన్
గని, తన యాశ్రమస్థలమునన్ వసియింపఁగఁబోయె నొయ్యనన్. ౪౮

తే. వ్యాసుఁ డాపద్మమునఁ బరమాక్షరముల-వెలయునట్టి పురాణ మేవిధిని గాంచె
ధర మహాభాగవత పుష్పవరము నట్టి-విధమునను బూన్కి విరచించి వెలయఁజేసె.

తే. స్నేహమున నాపురాణంబుఁ జెప్పెనాకు-వ్యాసముని భాగవతమును వరుసతోడ,
విన్నవాఁడను, దెలిసితి విశదరీతి-మునిజనశ్రేష్ఠులార! యేనును నిజముగ. ౫౧

క. మునులార! మీకు స్నేహం-బునను మహాభాగవతముఁ బూన్కి దెలిపెదన్,
వినుఁ,డద్దానిని జతనం-బున రక్షింపుఁడు రహస్యముగ మీ మదులన్. ౫౨

తే. ఇమ్మహాభాగవతమునం దెన్న షోడ-శాంశభాగంబుతోఁ దుల నశ్వమేధ
యాగములువేయివాజపేయములుశతము-నైననుసమానములుగావుమానవులార.

తే. భువనముల నెల్ల పావనంబులుగఁ జేయు-టకు, మహాపాతకులకుఁ బాతక మడంప
నీవిధంబున వ్యాసమానీంద్రుచేత-వసుధ వెలుఁగొందె నీమహాభాగవతము.'' ౫౪

రెండవ అధ్యాయము

వ్యాసునిదగ్గఱకు జైమినిమునివచ్చి వ్రతోపాస్య దేవతామహిమలను వినఁగోరుట

క. మునులకు సూతుఁడు దెలుపం-గను దొడఁగెఁ ''జైమిని యనఁగాఁ బ్రథితుండౌ
మునిపుంగవుఁడు పురాణము-లనవరతముఁ బెక్కులువిని యాదృతితోడన్. ౫౫

ఆ. వ్యాసమానిఁ గాంచి యప్పుడు సాష్టాంగ-ముగ నమస్కరించి, ''జగతి సకల
వేదవిద్వరిష్ఠ! వినుతి నీకు నొనర్తు-మునిజనాగ్రగణ్య! బుధవరేణ్య! ౫౬

క. నీకంటె నధికు లెవ్వరు-లోకంబున లేరు వక్తలు కనుంగొనఁగా
నో కృష్ణద్వైపాయన!-నీకరుణ న్వింటి నిఖిల నిగమార్థములన్. ౫౭

తే. పుణ్యతమములౌ కథల నగణ్యములుగ
నీవు వచియింప వినినాఁడ, భావమలరె,
మహిఁ గృతార్థుఁడ నైతి ముమ్మాటికి భవ
దీయదయ, సంశయము లేదు దివ్యహృదయ! ౫౮

క. మునిజననాయక! నాదగు-మనమున వాంఛితము గలదు మఱియొకటి చిరం
తనమైనది, భవదీయకృ-పను సఫలతఁ జెందు గాని భక్తిఁ దెలిపెదన్. ౫౯

సీ. ఏదేవి దుర్గంబులౌ దుఃఖముల నెల్ల నణఁపంగఁ జాలినయట్టి దుర్గ,
యేదేవి భువనజాలేశ్వరియై జగంబులకును నాదియై వెలయుచుండు,
నేదేవి నిత్యయై యెసఁగు ముల్లోకంబులకు జనయిత్రినాఁ బ్రకటరీతి,
నేదేవిరూపంబు నీక్షింప సచ్చిదానందమయం బయి యొందు వెలుఁగు,
తే. నేమహాదేవిపదయుగ తామరసము-లలరు దుర్లభములయి బ్రహ్మాదులకును,
నేమహాదేవిపద యుగ్మ మామహేశ్వ-రుండు ధరియించె హృదిశవరూపమునను.

తే. ఆమహాదేవిమహిమ మత్యద్భుతంబు-సంగ్రహంబుగ నోవ్యాస సంయమీంద్ర!
తెలిపినాఁడవు దానిచేఁ దృప్తిఁ గొంచె-మయినఁ గలుగదు నాహృదయంబునందు.

క. మునినాథా! వందనముల-నొనరించెద దేవిమహిమ మొప్పుగ నాకున్
వినిపింపు మఖిలచరితం-బును సంపూర్ణముగఁ దృప్తి పొందెదు రీతిన్. ౬౨

మ. నరజన్మం బతిదుర్లభం; బదియుఁ బైనన్ నూఱుజన్మంబులన్
వరుసన్ దాఁటినఁగాని వచ్చునని లో భావింపఁగారాదు, త
ద్వరదేహంబును బొంది వీనులను దివ్యంబైన శ్రీదేవిస
చ్చరితంబున్ విననట్టి వాని బ్రదుకు కోఁ జర్చింపఁగా వ్యర్థమే." ౬౩

చ. అని వినయంబుతోఁ బలుకు నార్యుని జైమినిమౌనిపుంగవున్
గని మది మెచ్చి సత్యవతిగాదిలిపుత్త్రుఁడు వ్యాసుఁ డాదరం
బునను దదీయప్రార్థనముఁ బూనికఁ దీర్పఁగ నెంచి సంబరం
బునఁ బలుకందొడంగెఁ బరిపూతములై తగు వాక్యసంతతిన్. ౬౪

తే. "ఓ మహామతి! వత్స! యో జైమినిముని!-నీదుప్రశ్నంబు శుభదంబు, నిఖిలలోక
హితము, భక్తుఁడవు, జ్ఞానయుతుఁడవున-వెలసితి వటంచు నిప్పుడు తెలిసినాఁడ.

తే. భక్తిధర్మంబులను లేక పరమపాపు-లయిన మనుజులు సహిత మీ యద్భుతమహి
మంబు విని నంతమాత్రాన మరల మహిని-దల్లిగర్భంబుఁ జేర రేతరుణమునను.

తే. ఏమహిమ విన్న బ్రహ్మహత్యాముఖంబు-లైన యఘములు గల పాపియేని ముక్తుఁ
డగునో, దానిని వినుట కీ వభిలషించి-నాఁడ, వద్దాన నయితి సుజ్ఞాననిధివి. ౬౭

తే. బ్రహ్మహత్యాది సర్వపాపములు తొలఁగఁ, జాల వెవ్వానికినినైన శ్రవణపథము
నందు నేమహిమము విన్నయంతదనుక-నది యెదుర్గాచరితమునా నలరుచుండు.

తే. పాపములు నూఱు గావించి పాపియైన-మానవుండును నీమహిమంబు విని మె
నేని యమరాజు దండంబు నిలను వైచి-తత్పదంబుల కెరఁగు భూస్థలిని వ్రాలి.

క. ఆదేవిమహిమ మెన్న మ-హాదేవుం డైదునోళ్ల నలరి నుతింపం
గాదనియుండఁగ, నెవఁ డీ-మేదినిఁ దెలుపంగఁగలఁడు మేటి నని మునీ! ౭౦

ఉ. శంకరుఁ డాశ్రితావళివశంకరుఁడై యుపదేశమిచ్చు ని
శ్శంకత మోక్షమందఁగను స్వాంతమునందుఁ దలంచువారికిన్
సంకటము ల్దొలంగ గురుసత్తముచే నుపదేశమైన దు
ర్గాంకిత తారకంబును మహామహిమంబునఁ గాశికాపురిన్. ౭౧

తే. సరభసంబున నవసాన సమయమందుఁ
జేసి యుపదేశమును జెవిచెంతఁ జేరి
నరుల నిర్వాణపదమునాఁ బరఁగు మోక్ష
పదముఁ బొందించుచున్నాఁడు పరమహాని! ౭౨

తే. మంత్రరాజంబులం దెల్ల మాన్యమోక్ష-దంబు, నిర్వాణసంప్రాప్తిదంబు జైమి
నీమునిసత్తమ! తెలియుము నిక్కువముగ-మదిని దుర్గాఖ్యతారక మంత్రమియుని.

ఉ. వేదములెల్ల నొక్కమొగి విస్తృతరీతిని సంస్తుతించుచున్
మేదిని నుండు మంత్రముల మేటి యనం జెలువొంది ముక్తిసం
పాదకమై యనంత విభవంబున దుర్గయె మూలశక్తినా
భేదము లేదులే దనును వేయివిధంబుల నోమహామతీ! ౭౪

సీ. వారాణసీ పురవరమందు దేవదేవుండైన యాశంకరుండు కరుణ
శశకమశకముఖ సకలజీవులను భూస్థలినున్నవానిని దలఁచి మోక్ష
పదమును జేర్పంగ భావించి మదిని దుర్గామంత్ర మనెడి తారకము కర్ణ
మున నుపదేశించు బుధనుత! యద్దాని వినిపింతు నవధానమునను వినుము
తే. నిస్తులమును, మహాపాప నిరసనంబు-దుర్గమహిమంబు విశదమై తోఁచునట్లు
మున్ను శివునకు, నారదమునికి జరగి-నట్టిసంభాషణంబు సుమ్మది!మునీంద్ర! ౭౫

శంకరుని సన్నిధికి నారదుఁడు వచ్చుట

తే. సకల దేవతలును, మునిసముదయంబు-సర్వగంధర్వులును దమ సరస రాఁగ,
మందరము నాఁగ విలసిల్లు ధ్మాధరవర-శిఖరమునొక్కసమయానఁ జేరి రెలమి.

చ. వివిధనగాధివాసమయి విస్తృతదివ్యసుగంధిపుష్పసం
భవరమణీయసౌరభసువాసితసర్వదిగంతరాళమై
ప్రవిమలమైన యాగిరివరంబున నింపగు శృంగసీమ నై
భవమునఁ గొల్వుదీరిన కపర్దినిఁ గొల్చుచు నుండి రెల్లరున్. ౭౭

తే. అట్టిసమయంబునందుఁ గృష్ణాఖ్య నున్న-యమ్మహాదేవుఁ గని వినయంబుతోడ
నంజలింబట్టి మునినాథుఁడై యొసంగు-నారదుం డిట్టు లొక్క ప్రశ్నము నొనర్చె.

సీ. "మూఁడులోకములందు ప్రొక్కులుగొను దేవదేవ! భక్తాళికి దివ్యవరము
లొసఁగునట్టి మహేశ! యుల్లంబునందునఁ దలఁచి చూడఁగ శుద్ధ తనుఁడ వీవె,
బ్రహ్మనామంబునఁ బరఁగువాఁడవు నీవె, సకలవస్తువులలోఁ బ్రకటితమగు
తత్త్వంబు నీవె, డెందంబునఁ దెలియఁగా విన్నాణివై యెందు వన్నెకెక్కు
తే. చున్నవాఁడవు పరమేశ! యొరులు వలఁతు-లెవ్వరును లేరు దేవతాబృందమందుఁ
గాని, మునినాయకులయందుఁగాని వెదకి-వెదకి చూచిన జగదీశ! విశ్వనాథ!

క. శిరమున ధరియించితి వా-దరమున ముల్లోకములను దన వరమహిమన్
బరిపూత మొనర్పందగు-తరంగిణిని గంగ నతిముదంబున నభవా! ౮౦

క. శిరమున నాభరణంబుగఁ-బరఁగు ననుచు నెంచి రమ్యభావంబున సుం
దరుఁడగు శశభూషణునిన్-ధరియింపవె మూర్ధమున నుదారత గిరిశా! ౮౧

తే. సకల మెఱిఁగినవాఁడవో శంభుమూర్తి!-యేను ప్రార్థించు నర్థంబు నెల్లఁ గరుణఁ
దెలుపవే, త్వదుపాస్యమై వెలయునట్టి-దైవతం బేయది మహేశ! తపసునందు!

క. భగవంతుఁడైన విష్ణువు,-జగదీశుండైన యాప్రజాపతియును, నె
న్నఁగ నీవును భజియించు జ-నగణంబున కొసఁగుదురు ఘనంబగు వాంఛల్.

క. భవదీయానుగ్రహసం-భవఫల మీక్రియ నటంచుఁ బలికెదువా రీ
భువి నెవరు లేరు, మీ ది-వ్యవైభవము నెన్న నెట్టు లగును మహేశా! ౭౪

చ. అతులితవైభవోన్నతుల నంది వెలుంగుచు నున్న మీకు నే
వితమున నిట్టి ప్రాభవము వెల్గుచు నున్నదొ? మీ యుపాస్యదై
వత మది యేదొ? సత్కరుణ భావమునం దిడి నాకుఁ దెల్పవే,
క్షితితలమందు మూర్ధమును జేర్చి నమస్కృతు లే నొనర్చెదన్." ౭౫

ఉ. వ్యాసమునీంద్రుఁ డిట్టులని పల్కెను జైమినితోడ, "నారదుం
డాస దొలంక శంకరు మహావినయంబున వేఁడ, శంభుఁ డ
భ్యాసముచేతఁ గాంచి తన స్వాంతమునందున మాటిమాటి కా
యాసము లేక యిట్లనియె నమ్మునిపుంగవుతోడ నిమ్ముగన్ ౭౬

తే. "నారదా! భవదీయమనోరథంబు
మదికి నవగతమయ్యె, నయ్యది రహస్య
తమము, ప్రకటింపరాదు వత్స! యిఁకనేమి
చేయఁగలవాఁడ నీకఁ దెల్పవే" యనంగ. ౭౭

క. వెండియు జైమినితో వ్యా-సుం డిట్లని చెప్పఁదొడఁగె "శుభకరుఁడగు నీ
శుం డిట్లు పలుకఁ బదపడి-యొండుఁ దలంపకయ యుండి యొయ్యన నంతన్.

క. నారదముని ప్రాంజలియై-నారాయణు నచటఁ గాంచి "నా యభిమతమున్
గారుణికోత్తమ! తీర్పవె-శ్రీరమణా!" యంచు వినుతిఁ జేయుచుఁ బలికెన్.

తే. "భక్తులను గరుణించు నీశ్వరుఁడు దేవ-దేవుఁ డేలొకొ వారెడఁ దృప్తిలేక
తా నుపాసించుచున్నట్టి దైవతమును-గృపణాతం బూని తెలుపఁ డీక్రియ రమేశ!

క. వినయమున వందనముల్గొ-దని పెకు సంశ్రితుల వాంఛితము నొసఁగెదు నీ
వనయముఁ ద్వదుపాస్యంబై-తనరెడి దైవతముఁ దెల్పి దయఁజూడు హరీ!"

వ్యాసుఁడు హరిహరుల నుతించుట

క. అని వినయంబున వేఁడిన-మునియగు నారదునిఁ గాంచి పురుషోత్తముఁ డొ
య్యనఁ బల్కె "నారదా! దా-న నేమిపని నీకు, వినుము నామాట యిఁకన్.

తే. దైవతముమాట నీ కేల, తగిన కోర్కు-లిచ్చుటకు దైవతములమై యెపుడు మీకు
నేము సిద్ధముగా నుండ, హృదిని మామ-కీనదైవంబుఁ దెలియంగఁ బూని తిపుదు.

క. మమ్ముం గొలిచినఁ బరమము-దమ్ముం దయతోడ నొసఁగెదము తృప్తులమై,
నెమ్మదిని వేఱుచింతల-కిమ్ముగ మదిఁ జేయవలవ దింక మునీంద్రా!" ౮౪

ఉ. అంతట వ్యాసుఁ డిట్లనియె ''నప్పుడు నారదమౌని స్వాంతమం
దెంతయు నెంచి శ్రీధవుఁడు నీశుని కీర్తి వచించె నంచు సం
భ్రాంతిని వీడి భక్తిమెయిఁ బ్రాంజలియై నుతియించె నీక్రియన్
జింతితకార్యసత్ఫలదచిత్తుల శంకరవాసుదేవులన్. ౯౪

సీ. ''దేవదేవ! మహానుభావ! మహేశ్వర! కరుణఁ బ్రసన్నతఁ గనుము నన్ను,
వాసుదేవ! జగన్నివాస! నారాయణా! కరుణఁ బ్రసన్నతఁ గనుము నన్ను,
శేషభూషణ! విభాసితమనోహరదేహ! కరుణఁ బ్రసన్నతఁ గనుము నన్ను,
కౌస్తుభాలంకారకలితభాస్వత్కాయ! కరుణఁ బ్రసన్నతఁ గనుము నన్ను,
తే. శరణు గంగాధర! శరణ్య! కరుణఁ గనుము,
శరణు చక్రాయుధ! వరేణ్య! కరుణఁ గనుము,
శరణు దిగ్వాస! విశ్వేశ! కరుణఁ గనుము,
శరణు కౌమోదకీధర! కరుణఁ గనుము. ౯౫

సీ. వందనంబులు దివ్యపంచముఖా! నీకు, వందనంబులు నీకు వారిజాక్ష!
వందనంబులు వృషవాహనరత! నీకు, వందనంబులు నీకుఁ బక్షివాహ!
వందనంబులు నీకు, వరత్రిపురవినాశ! వందనంబులు కంసవధవినోద!
వందనంబు లఘాస్రపవిదారణోన్నత! వందనంబులు తృణావర్తదమన!
తే. వందనముల నొనర్తు నవ్యారిగాఁగ-సంతతము మీపదాంబుజ సన్నిధాన
మందు, నాకుఁ బ్రసన్నులరయి యభీష్ట-ముల నొసంగుఁడు శివకేశవులగు మీరు.''

మ. 'విను మో జైమిని!' యంచు వ్యాసముని తా విస్పింపఁగాఁ బూనె గా
థను ''నా నారదమౌని యీక్రియ నుతిం దాత్పర్య మేపార శం.
భుని, నారాయణుఁ గూర్చి చేయఁగ దయాపూర్ణాత్ముఁడై శ్రీశుఁ డ
మ్మునినాథుం గని యమ్మహేశ్వరునితో మోదంబు దీపింపఁగాన్. ౯౭

క. వినయమునఁ బలికె ''శంకర!-వినీతుఁ డీతండు, భక్తబృందాగ్రణియై
తనరును, బ్రహ్మకుఁ గూరిమి-తనయుండై వెలయు, జ్ఞానధనుఁడగు నభవా! ౯౯
తే. భక్తవాత్సల్యమున నీవుపరఁగుకతన-నీమహాముని నారదుఁ డెసఁగు నీయ
నుగ్రహంబున''కని తెల్పె''ననుచు వ్యాస-మౌని వెండియు జైమినితో నిటులను.
క. ''నారాయణు వాక్యములను-గారవమున విని భవుండు కరుణాకరుఁడై,
శ్రీరమణుఁడు భక్తజనా-పారానుగ్రహతఁ దెలిపె వరవాక్యములన్. ౧౦౧
క. అవహితుఁడనైతి శుభదము-లవు వాక్యము లివ్వి యనుచు స్వాంతమున సదా
శివుఁ డెంచుచుండ నప్పుడు-సవినయుఁడై నారదుండు సాధుమనీషన్. ౧౦౨
తే. మరల నిట్లు మహాదేవు, నిరుపమకరు-ణాసముద్రుని నిర్మలధీసమేతుఁ
డై, మహాజ్ఞానవంతుఁడై యడిగె నిట్టు-లాత్మ సాష్టాంగవందన మాచరించి.

మ. "పరమేశా! నిను, శ్రీరమాధిపతి, నాపద్మోద్భవుం గొల్చి ని
ర్జరనాథాదులు లోకపాలు రుదితప్రావీణ్యులై దివ్యభా
గ్యరమాయుక్తపదంబు నొందిరిగదా! కారుణ్యసీమా! యదే
కరణిన్ మీరలు వారి కట్టిపదముం గల్పించు సామర్థ్యమున్. ౧౦౪

క. సతతంబుఁ గలిగియుండుట-కతిశయతప మేది, యెవరి నర్థించి, యదే
గతిఁ జేసినారలో? దై-వత మెద్ది యుపాస్యమో? ప్రభావప్రదమై. ౧౦౫

తే. అవ్యయంబయి పూర్ణమై యలరునట్టి-దైవతం బేది త్వదుపాస్యమై వెలయునో?
కరుణ నాయందుఁ గలిగిన నకుసతోడఁ-దెలుప వే సాంబశివ! దేవదేవ! యీశ!

క. ఈదృశమగు నైశ్వర్యం-బే దేవతదివ్యకరుణ నెసఁగెనొ మీకున్?
భేదంబు లేక తెలుపవె-యో దేవ! యనుగ్రహంబె యుండిన నాపై." ౧౦౭

క. అని వినుతి చేసి వేఁడెను-ముని నారదుఁ," డంత వ్యాసముని జైమినికిన్
వినిపింపఁబూనె నవ్వల-నెనసిన వృత్తాంత మిట్టు లెంతయుఁ బ్రీతిన్. ౧౦౮

ఉ. "నారదవాని ప్రశ్నము మనంబున బాగుగ నామహేశ్వరుం
డారసి, యాత్మనిశ్చలత నంది,సతంబును యోగిమానసా
ధారునిఁ గూర్చి యాదృతిని దత్పరుఁడై కడు భక్తితోడ నే
పారుచు యోగికైవడిని భద్రపరంపర లిచ్చు కోరికన్. ౧౦౯

శా. శ్రీదుర్గాచరణారవిందయుగమున్ జిత్తంబునన్ భక్తితో
భేదం బేమియు లేక సంతతము సద్వృత్తి న్విచారించి, యే
వాదంబుం గన కాత్మ నిర్మలపరబ్రహ్మంబునుం గూర్చి యా
మోదం బొప్పఁగ శంకరుండు దెలుపం బూనెన్ గృపాసాంద్రుఁడై ౧౧౦

మూఁడవ అధ్యాయము

మహేశ్వరవరదానవర్ణనము-శివుఁడు నారదునకు స్వోపాస్యదైవమును దెలుపుట

తే. "ఏమహాదేవి జగదంబ యెసఁగు శుద్ధ
యనియు,మూలప్రకృతి సనాతనియు ననఁగ
నగుఁ బరబ్రహ్మ మాదేవి యస్మదీయ
దైవతంబుసుమా నారదమునిచంద్ర! ౧౧౧

తే. సృష్టి యొనరించు బ్రహ్మ,కా సృష్టిఁ బెంచు-విష్ణుదేవునకును,సృష్టివిలయకార్య
కర్తనైన మహేశ్వరాఖ్య గల నాకు-సంతత ముపాస్యయగు నాదిశక్తి యొకతె.

తే. వివిధభువననివాసులై వెలయు కోటి-కీటములకెల్ల నాదేవి మేటిశక్తి,
సృష్టి యొనరింపఁ బెంప సంహృతినొనర్ప-నామహేశ్వరియే దక్ష యగునుమూని!

క. ఆకారరహితయయ్యును-సాకారత వెలయు నామహాదేవి మునీ!
యీకువలయము సృజించు, మ-హాకరుణను నేలు లీల నాతల్లి తమిన్. ౧౧౮

తే. అమ్మహాతల్లి జగమును నంతకాల-మున వినాశంబుఁ గావించు మునివరేణ్య!
భువనములనెల్ల నిజమాయ మోహమందు-నట్లుగను జేయుచుండు నాయంబ లీల.

సీ. తన విలాసములచే దక్షుని తనయయై జననంబునొందె నాశక్తి తొల్లి,
పార్వతి యనుపేరఁ బర్వతరాజైన హిమవంతునకుఁ బుట్టె నెలమితోడ,
నారీతి లక్ష్మియై యవతరించెను సరస్వతి యని పిలువంగఁబడుచు నొకటఁ,
దన యంశమున నొక్క-తటి శ్రీమహావిష్ణుదేవున కయ్యెను దేవి గాఁగ,

తే. నవ్విధంబున సావిత్రి యను నభిఖ్య-బ్రహ్మదేవునకును బ్రియభార్య యయ్యె"
ననుచు శంకరుఁ డాదేవిఘనమహిమముఁ-దెలుప, నారదుఁ డిట్లని పలికె నపుడు.

శా. "దేవా! నాపయి సుప్రసన్నత యెదం దీపించునే, నుత్తమం
బౌ వాత్సల్యము గల్గియుండిన మదీయాభ్యర్థనం బెంతయున్
గావింపందగు, దేవి యాప్రకృతి పూర్ణత్వంబునన్ వెల్గు. నె
ట్లావిర్భావమునొందె దక్షసుతయై యత్యంత ముత్సాహతన్. ౧౧౯

తే. శంకరుం డేవిధమున నాసర్వదేవి-యయిన బ్రహ్మస్వరూపిణి యాత్మపత్ని
గాఁగ విలసిల్లు భాగ్యంబుఁ గాంచె వేడ్క-నంతయును దెల్పవే కరుణాంతరంగ!

తే. మరల నాదేవి తుహినభూధరవరు గృహ-మునను బుత్రికయై యెట్లు జననమొందె?
మరల నేక్రియ నాదేవిఁ బరిణయమయి-వెలసె ముక్కంటి! తెలుపవే విస్తృతముగ.

తే. బలమునఁ బరాక్రమంబునఁ జెలఁగు షణ్ము
ఖుని, గజాననుఁ, గార్తికేయుని, గణేశు
నేవిధంబున సుతుల నాదేవి గాంచెఁ
దెల్పు"మని నారదుఁడు మహాదేవు నడిగె. ౧౨౦

క. అని వినయంబునఁ బ్రార్థన-మును జేయుచు నారదమునిపుంగవుఁ డడుగన్,
వినుమని వచింపఁదొడఁగెను-ఘనమహిమాస్పదము దేవిగాథను వరుసన్. ౧౨౧

సీ. "నారదా! యీజగం బారయఁ బూర్వము చంద్రసూర్యులును, నక్షత్రములును,
బగలును, రాత్రియు, వహ్నియు, దిఙ్ముఖంబులును, శబ్దస్పర్శములు మొదలగు
నవియును లేనిదై, యన్యకాంతులు లేకయుండె, నావిశ్వమం దొక్క నిగమ
వితతులయందెల్ల వినుతికెక్కినయట్టి బ్రహ్మసంజ్ఞకముగ భాసమాన

తే. మైన యయ్యాది ప్రకృతినా నలరు దివ్య-సచ్చిదానందరూపిణి, సత్యశుద్ధ
వాగతీత, సునిష్కల, స్వచ్ఛగుణ, వి-భావ్యవిజ్ఞానరూపిణి, భద్ర యుండె. ౧౨౨

తే. మఱియు నాదేవి యోగుల మదికినైన-నెఱుఁగ శక్యంబు గానిదై యొసఁగు, సర్వ
మందు విలసిల్లు వ్యాపించియనఘ! యేయు-పద్రవము లేనిదయి తానుబరఁగుచుండు.

సీ. ఆదేవి మఱియు నిత్యానందరూపిణియగుచుండు, సూక్ష్మయై యలరుమిగుల,
గురుగుణాభావసంభరితవస్తువులచేఁ బరిహ్రుతయై యెందుఁ బరఁగుచుండు,
నట్టి యాదేవికి నానందమున మది సృష్టిచేయఁగఁ బుట్టె నిచ్ఛ; యపుడె
యా పరాశక్తి తా రూపంబు లేనిదైనను రూప మొక్కటి యనువుమీఱ

తే. స్వేచ్ఛచేతను ధరియించె సృష్టికార్య
మును మదిని నెంచి ప్రకృతియయ్యును మునీంద్ర!
వినుము వచియింతు నారూపమును విశదము
గాఁగ నావధానుఁడవయి కడఁక నిపుడు. ౧౨౭

తే. సుందరంబయి వికసించి సొబగుమీఱు-పుండరీకంబుఁ బోలిన ముఖముతోడ,
రమ్యమైన భిన్నాంజనప్రభ నెలుంగు-దేహకాంతులతోడ నాదేవి వెలయు.

చ. అరుణములైన నేత్రములు, హారిచతుర్భుజముల్ దగం దిగం
బరయును, ముక్తకేశియు, సమంచితపీనకుచోన్నతాంగియై
పరఁగుచు, సింహవాహనముపై నివసించి నితాంతరమ్యభా
స్వరవరరూపయై వఱలె సంతస మొప్పఁగ దేవి నారదా! ౧౨౮

ఆ. అంత దేవి సృష్టి నాత్మేచ్ఛఁ జేసె రా-జసము సత్త్వమును దమసు ననఁబడు
చుండు తన గుణముల నొక్కనిఁ జైతన్య-విరహితుండు నైన పురుషు నపుడె.

క. ఆదేవి చూచి యాస-త్త్వాదిగుణాత్మకునిఁ బురుషు, నాతనియందా
త్మోదితవాంఛను సృష్టికి-నై దొరకొని యాక్రమించె నప్పుడె యతనిన్.

ఆ. అంత శక్తిమంతుఁడైన యప్పురుషుఁడు-మూఁడు గుణములందు మొనసి బ్రహ్మ
విష్ణుశివులునాఁగ విలసిల్లు పురుషులు-ముగ్గురగను దోఁచె మునివరేణ్య! ౧౨౯

తే. పురుషులను ముగ్గురను జూచి, పొసఁగ దిట్లు
సృష్టియం చెంచి యాదేవి చిత్తమందుఁ,
బురుషు ద్వివిధంబుగను జేసె వరుస జీవుఁ
డనఁగఁ, బరముఁడనంగ నా యదనునందె. ౧౩౦

క. తన యిచ్ఛఁ బ్రకృతి త్రివిధము-లను దా ధరియించె నతివిలాసముమీఱన్
మునివర! మాయయు విద్యయు-ననఁగాఁ బరమయు ననంగ నాఖ్యలతోడన్.

క. పూరుషులను సంసారవి-హారులఁగా నడిపి మాయ యలవడఁ జేయన్
భూరిమహిమతో నెల్లర-నారయ మోహితులుగాఁగ ననవరతంబున్. ౧౩౧

క. పరమపరిస్పందితయై-పురుషులకును వెలయు,విద్యఁ బుట్టించును ద
త్పరయై తత్త్వజ్ఞానము,-విరమింపఁగఁ జేయు భవము వెస మునిచంద్రా! ౧౩౩

క. జీవుఁడు మాయాకల్పితుఁ-డై విడిచెను జూడ మాయ నంతటఁ బురుషుల్
వావిరి మాయారూపము-లౌ వానిని విషయపరత నవలంబింపన్. ౧౩౪

తే. బ్రహ్మవిష్ణుశివాఖ్యలఁ బరఁగు వారు-మత్తులై మునిపుంగవా! మాయవలని
మహిమ విలసిల్లుచుండిరి, మఱియుఁ బ్రకృతి-చర్యలెల్లను దెలిపెద సరవి వినుము.

తే. మూఁడవదియౌ పరావిద్య మునివరేణ్య!
తాను బంచవిధంబులై తనరె గంగ
యనఁగ,దుర్గయు సావిత్రియును సరస్వ
తియును లక్ష్మియు ననఁగ విస్తృతినిఁ గాంచి. ౧౩౬

తే. అంతఁ బూర్ణస్వరూపిణి యై సమస్త-భువనసంధాత్రియైనట్టి పూజ్యప్రకృతి
బ్రహ్మవిష్ణ్వాదులను గాంచి పలికె నిట్లు-తాను బ్రత్యక్షమై సృష్టి నూని యపుడు.

తే. "సృష్టికార్యంబుఁ దీర్ప వేర్వేఱ మిమ్ముఁ
బూన్పఁగాఁ గోరి స్వేచ్ఛచేఁ బూర్వమందు
నుద్భవింపఁగఁ జేసితి, నాగిని మీర
లభిమతంబును దలఁపుఁడీ యాత్మలందు. ౧౩౭

క. నాయిష్టముచొప్పున మీ-రాయారీతులను బూని యత్నంబున న
త్యాయతశక్తిని సృష్టిని-జేయుఁడు, తెల్పెదను దాని స్థితిని గ్రమముగన్. ౧౩౮

ఉ స్థావరజంగమంబులగు జంతుసమూహములన్ సృజింపఁగా
నౌ,వివిధంబులై యొసఁగి యద్భుతరీతి ననంతసంఖ్యలన్
వావిరి బ్రహ్మ,యెల్లపుడు వానిని బ్రోచునుగాక శ్రద్ధసం
భావనచే మహామహుఁడు పంకజనేత్రుఁడు విష్ణుఁడెంతయున్. ౧౪౦

క. బలవద్వీరుఁడగు శివుఁ డ-త్యలఘుగతిన్ జగములెల్ల నాకులతఁ గనన్
మెలఁగు ఖలుల నెల్లప్పుడు-విలయముగావించుఁగాక వేడుకతోడన్. ౧౪౧

ఉ. ఎప్పుడు నాకు నిచ్ఛ జనియించును నాశముచేయనౌనటం,
చప్పుడె యాక్రమించి శివుఁ డద్భుతరీతి తమోగుణంబు నే
యొప్పును జూడ కంతటను నుద్ధతుఁడై జగమెల్ల మ్రింగుఁగా!
కిప్పనులెల్ల ముగ్గురకు నేర్పడియున్నవి నిశ్చయంబుగన్. ౧౪౨

ఉ. ఈవిధి మీరు మువ్వు రొగి సృష్టిముఖాఖిలకార్యజాలముల్
వావిరిఁదీర్ప సాయము నవారితశక్తినిఁ జేయవౌను, సం
భావితరీతి రూపములఁ బంచవిధంబులుగాఁగఁ బూని లో
కావళిసృష్టికార్యమున యత్నమొనర్తు, వినుండు తెల్పెదన్. ౧౪౩

క. సావిత్రీప్రముఖస్త్రీ-భావంబులఁ దాల్చి మీకు భార్యనుగా స
ద్భావంబున విహరింతును-నే వైభవ మొప్పఁగను నిజేచ్ఛ చెలంగన్. ౧౪౪

తే. సకలజంతువిసరముల శంభుఁడట్లు-వనితలను గూడి విహరించి వైభవమున,
మామకేచ్ఛానుసారివై మమతతోడ-సృష్టికార్యంబు సతతంబుఁ జేయుఁగాక।

చ. వివిధములైన ప్రాణులను విశ్వమునందు నిజేచ్ఛ నేనె సం
భవమును నొందఁజేసెదను, బ్రహ్మ! మదాజ్ఞను బూని నీవు మా
నవులను సృష్టిచేయుము, మనంబున నన్యము సృష్టిచేయఁగా
నవు ననుచుం దలంపకు, మనంతమగున్ జుమి! యుద్దియే వెసన్." ౧౪౬

సీ. ఈవిధంబునఁ బరమేశ్వరియగు మహావిద్య పరాత్పర విశదరీతి
వచియించి యప్పు డాబ్రహ్మవిష్ణుమహేశ్వరులకు బాగుగను వారు గనుచుండ
నద్భుతంబు జనింప నచట నంతర్ధానమును బొందె, నాదేవి పూజ్యవాక్య
ములయందు విశ్వాసమును బూని నెమ్మది విశ్వసృష్టి యొనర్ప విధి దొరకొనెఁ,

తే. బూర్ణయగు ప్రకృతినిఁ దన బుద్ధి నిలిపి
భార్యగాఁ బొందు కోర్కెతో భక్తిసంయు
తాత్ముఁడై ప్రకృతినిఁగూర్చి యపుడు తపము
సలుపఁగాఁ బూనె నా మహేశ్వరుఁడు శివుఁడు. ౧౪౭

ప్రకృతి త్రిమూర్తులఁ బరీక్షించుట

ఉ. శంకరుఁడున్ దపంబు నిటుసల్పుచునుండుట విష్ణుమూర్తి తాఁ
బొంకము మీఱఁగాఁ బరమపూరుషుఁ డంతయు జ్ఞానదృష్టిచే
శంక యొకింత లేక తన స్వాంతమునందు నెఱింగి, దేవినిన్
స్వాంకనివాసఁ జేసికొన నప్పుడె పూనెఁ దపం బొనర్పఁగన్. ౧౪౮

మ. భగవంతుండగు బ్రహ్మదేవుఁ డెదలో భావించి విష్ణ్వీశచి
త్రగతిన్ సృష్టినొనర్ప మాని ప్రకృతిన్ దా భార్యగా నొందఁగాఁ
దగు నంచుం దదభీష్టసిద్ధికయి యత్యంతస్థిరుండై తపం
బాగిఁ జేయం గడు నిష్ఠఁ బూనె నపు డత్యుత్సాహ మేపారఁగన్. ౧౪౯

ఆ. ముగురు మూర్తు లిట్లు పూనిక నారాధ-నంబుచేయఁ, బ్రకృతియైన దేవి
వారి తప మదెట్టి వైఖరి నున్నదో-యని పరీక్షచేయ నభిలషించి. ౧౫౦

తే. వారి చెంతకు బ్రహ్మాండవారభయద-మైన భీషణరూపంబు నవధరించి
ప్రకృతి వెఱపించుచును బోయె, బ్రహ్మదేవుఁ-డట్టియాకారమును గాంచి యధికభీతి.

క. వణఁకుచు విముఖుం డగుచున్-గణియించి మఱొక్కమాఱు కనఁబడె నతిభీ
షణరూపములోఁ బ్రకృతియు-నణుమాత్రంబైన స్థిరత నందక యజుఁడున్. ౧౫౧

ఆ. మరల విముఖుఁడయ్యె, మాయామహాదేవి-నాల్గుదిశలనుండి నలువకడకుఁ
బోయి భయదరూపమును జూపఁగాఁ జతు-ర్వక్త్రుఁ డధికభీతి వదలి తపము.

ఆ. శాంతి గనఁగలేక చాలించి సాధ్వసం-బునను నాసమయముననె కడుఁద్వర
నచట నుండి దాఁటి యరుగఁ బలాయన-తత్పరత్వమాత్మఁ దాల్చె నంత. ౧౪౩

క. త్వరితగతిఁ బ్రకృతి యతిభీ-కరయై యావిష్ణుమూర్తి కడకుఁ దపంబున్
నిరతి నొనర్చు స్థలంబున-కరిగి పరమపురుషుఁ గాంచి యచ్చట నిలువన్. ౧౪౪

ఆ. విష్ణుమూర్తి ప్రకృతిభీకరరూపంబుఁ-గాంచి యతిభయమునఁ గడు వడంకి
వేయిశీర్షములను, వేయికన్నుల, వేయి-పాదములను దాల్చి త్వరితగతిని. ౧౪౫

చ. కనులను మూసి సుస్థితిని గానక నిష్ఠఁ దపంబు మాని నె
మ్మనమున దక్కు-ద్రోఁపమి సమర్థత లేక మహాబ్ధిలోపలన్
మునిఁగె జలంబులందు మునిపుంగవ! బ్రహ్మయు, విష్ణు వీక్రియన్
గనఁగఁ దపంబు భగ్నతను, గానఁగఁ బోయెను దేవి శంకరున్. ౧౪౬

తే. భీమరూపంబుతోడ దేవి శివునెదుట
నిలిచియుఁ దకీయధ్యానంబు నిలుప శక్తి
చాలనిదియయ్యె నెప్పుడు స్వయముగాఁ బ్ర
యత్నమొనరించియును నించుకైన, నంత. ౧౪౭

చ. హరుఁడు సమాధినిష్ఠుఁడయి యారసి తా నొగి దివ్యదృష్టి భీ
కరతను వొప్ప నాప్రకృతి గాఢతపంబుఁ బరీక్షచేయఁగా
నురుతరరీతి వచ్చెనని యుల్లమునందుఁ దలంచి, యంత సు
స్థిరుఁడయి భక్తితోఁ దపముఁ జేయుచునుండెను నిర్వికారతన్. ౧౪౮

తే. ఆ మహాదేవు నిష్ఠకు నాత్మ మెచ్చి-ప్రకృతి యత్యుత్తమ వరించెఁ బరముఁ గిరిశుఁ
డానె గంగాస్వరూపిణియై నితాంత-మహిమ స్వర్గమున వెలుఁగు మాన్యచరిత!

క తన యంశను సావిత్రీ-తనువున విలసిల్లి, ముందుఁ దాఁ గొనిన బలం
బున దేవి బ్రహ్మదేవున-కును బత్నిత్వంబు నొందెఁ గూర్మిని మానీ! ౧౫౧

తే. ప్రకృతి యారీతిగనె సరస్వతియు,లక్ష్మి-యును ననఁగస్వాంశములచేత నెనసివిష్ణు
దేవుఁబతిగాగ్రహించె,నా దేవిమహిమ-యోమహామతి!యెఱుఁగంగనద్భుతంబు.

బ్రహ్మ సృష్టి చేయఁబూనుట

తే. అంత భగ్నసమాధియైనట్టి బ్రహ్మ-సకలలోకపితామహుండు కడుఁ బూన్కి
సృష్టిచేయంగఁబూనిసృజించెపృథివి-మొదలయిన భూతతత్త్వసముదయమును!

సీ. పదుగురు మానసభవులను సృజియించె, వారి నామంబులు వరుస విను, మ
రీచి ప్రథముఁడు,నత్రియు ద్వితీయుఁడు,పులహుఁడుతృతీయుఁడు,క్రతువొప్పనాలు

గవవాఁడు, నంగిర స్సవు నైదవ తనూజుఁ, డవుఁ బ్రచేతసుఁడు నాఱవ సుతుండు,
ముని! వసిష్ఠుఁడు సప్తముఁడు, నారదుఁడు నెన్మిదవవాఁడగు, భృగుండు నవమపుత్త్రుఁ,

తే. డగుఁ బులస్త్యుండు పదియవ యాత్మజుండు-వీరు పదుగురుతుల్యులై వెలయుపుత్త్ర
లంత మునినాథ! బ్రహ్మ దక్షాదులగు బ్ర-జాపతుల సృష్టిగావించె జతనమునను.

క. మనువులఁ బుట్టించెను విధి-మనమున సంధ్యయనుదాని, మఱియు మనంబం
దునఁ గాముఁడనఁగ వెలసిన-మనోభవుని సృష్టిచేసె మకల న్మౌనీ! ౧౬౫

చ. మనసిజుఁడైన మన్మథుఁడె మానవలోకమునందు, స్వర్గమం
దునను, రసాతలంబునను దుస్సహమైన విమోహ ముద్భవిం
ప నతిసమర్థుఁడం చెఱిఁగి భామినులందును బూరుషావళిన్
ఘనమతిఁ గామరూపు నవికారుచిఁ బంచెను దాని వేడుకన్. ౧౬౬

తే. పుష్పమయబాణపంచకమును బ్రసూన-కార్ముకంబును సర్వలోకము విమోహి
తంబుఁగాఁ జేయుటకు నిచ్చె సంబరమున-మనసిజోద్భవునకు బ్రహ్మ మౌనినాథ!

ఉ. అంతట బ్రహ్మ దివ్యమయినట్టి స్వదేహము రెండుగాఁగ న
త్యంతము సృష్టిచేయుటకునై యొనరింప మనోహరాంగియౌ
కాంత యొకర్తు వామమగు గాత్రమునన్ శతరూపనాఁగ బ
ల్వింతగఁ బుట్టె, నప్పు డొగి వే కుడిభాగమునుండి బ్రహ్మకున్. ౧౬౭

క. స్వాయంభువుఁ డనఁగను న-త్యాయతగుణరూపవంతుఁ డత్యద్భుత తే
జోయుతుఁడై పుట్టెను, న-ట్లాయుగ్మము పుట్టి యప్పు డధికప్రీతిన్. ౧౬౮

ఆ. పంచశరుని పుష్పబాణపంచకము చే-నుప్పతిలిన మోహ మొప్ప, రమ్య
హాసయయి మనోహరాంగియౌ శతరూపఁ-గని పరిగ్రహించె మనువు సతిగ.

క. శతరూపయందుఁ బుత్త్ర-ద్వితయము, పుత్త్రికల ముగుర వెసఁ గాంచెను స
మ్మతి స్వాయంభువమను వపు-డతులితగుణవంతులను మహాత్మా! యంతన్.

సీ. ఆపుత్త్రికలెసుమీ యాకూతి యన, దేవహూతి యనంగఁ, బ్రసూతి యనఁగ
వెలయుచుండుదురు, కుమారులు ప్రియవ్రతుఁడు, నుత్తానపాదుం డనఁ దనరువారు,
దేవర్షిసత్తముఁడై విలసిల్లు నాస్వాయంభువుఁడు రుచిసంజ్ఞఁ బరఁగు
మునికి నాకూతినాఁ జను కన్యఁ, గర్దమునకు దేవహూతి యనంగ రెండ

తే. వ సుత, దక్షునకును మూఁడవ తనుజాత-యై తగి మనోహరాకృతి నలరు నా ప్ర
సూతి నొసఁగెను మను వతిప్రీతితోడ-నారదమునీంద్ర! యంత నవ్వారు వరుస.

తే. కర్దముఁడు దేవహూతికిఁ గామితములఁ-దృప్తిగావించి కాంచెఁ బుత్త్రికల, వార
లే యరుంధతిమున్నుగా నెసఁగునట్టి-వారలు వసిష్ఠకాంతాదులైరి సుమ్ము.

దక్షాది సంతతి

సీ. దక్షునకును సముద్భవమందిరి ప్రసూతి
యందునఁ బదునల్వు రాత్మజాత,
1 అదితియునుం, 2 దితియు, 3 దనువునుం, 4 గాష్ఠ
యు, 5 నరిష్టయును, 6 సురయును, 7 దిమియును,
8 మనువుఁ, 9 క్రోధవశయు, 10 మత్తితామ్రయు, 11 వినత
యును, 12 కద్రువయు, 13 స్వాహాయుఁ, దుది 14 భాను
మఱియు ననంగ నామములచేఁ బ్రథితలై
వెలయుదు రవ్వారు విమలచిత్త!

తే. యందు నగ్నికిఁ బరిణయమాడ నొసఁగె-స్వాహ యను కన్య,నంతఁగశ్యపునకిచ్చె
మిగిలియున్నట్టి పదుమువ్వురగు సుతలను-సృష్టివిస్తృతి దక్షుండు చేయనెంచి.

క. ఈవిధిఁ గశ్యపుఁ డా పదు-మూవురఁ బెండ్లియయి ప్రమదమున నంతట నా
నావిధసంతానంబుల-వావిరి నెలయించె మిగుల వారలయందున్. ౧౭౭

తే. కశ్యపుని సంతతియె యెల్లకడల జగము-నందు సంపూర్ణముగ నిండె, నఖిల మిట్లు
బ్రహ్మదేవుండు తా సృష్టిపరమకార్య-మును నొనర్చెనువినుము సద్బుద్ధిమహిత!

తే. అంత నాయాదిదేవి స్వీయాంశచేత-వెలసి సావిత్రినా భువి ద్విజులచేత
మూఁడుసంధ్యలయందునుమ్రొక్కులుఁగొను-నాకృతినిబ్రహ్మనువరించె నవలవినుము.

క. తన యంశచేత లక్ష్మియు-ననఁగ సరస్వతియు ననఁగ నాఖ్యల జననం
బును గొని త్రిజగత్పాలన-మునొనర్చెడి విష్ణుఁ బతిగఁ బొందె స్వలీలన్ ౧౭౮

క. ఇరువురును బ్రహ్మవిష్ణువు-లిరవొందఁగ నిట్లు సతుల నిచ్ఛానుకృతిన్
బరితృప్తి విషయములఁ ద-త్పరులై యుండిరి మునీంద్ర! పరమశివుండున్. ౧౭౯

క. పరమంబైన తపంబున-స్థిరమగు యోగమునఁ బ్రకృతి సిద్ధాకృతితో
నిరవుగను నుంచి నిరతిని-బరికించుచునుండెఁ బూర్ణ ధ్యానములోడన్. ౧౮౦

క. తన సతిగా నొనరిచికొనఁ-గను దేవర్షి వరుఁడగుచుఁ గనఁబడుచుండెన్,
మనమునఁ బూర్ణప్రకృతిని,-ముని!యున్నతయైన ప్రకృతి ముద మొంది దయన్. -

తే. ఎదుట సాక్షాత్కరించి మహేశుఁ గాంచి-పలికె జగదంబ "నీదు తపంబునకును
సంతసముఁబొందితిని,నిం బెంతయునిఁక-నేడివలయునొ కోరుమీశ్వర!"యనంగ.

క. "మును శుద్ధమైన ప్రకృతివి-వనితల నైదుగుర సంభవముచేసితి, వం
దున బ్రహ్మవిష్ణుశంకరు-లనఁబడు మముఁ బొంది తధికమైన కరుణచేన్. ౧౮౩

క. సావిత్రి యను నిజాంశను-నావిధిఁ బొందితివి విష్ణు నల్లి పతిగ సం
భావించి లక్ష్మి యనఁగా-దేవి సరస్వతి యనంగ దివ్యాకృతులన్. ౧౮౪

మ. వినుమా నాయభిలాష నెమ్మనమునన్ స్త్రీయాకృతిం బూర్ణనై
యనయంబుం బ్రకృతిస్వరూపమున నత్యంతోచ్ఛ్రియం బొందు స
త్తనువున్ వేడుకతోడ నెందయిన నుత్పత్తిం దయం గాంచి న
న్ననుమోదంబునఁ బత్నినై నెఱపు మిచ్ఛావాప్తి నో యీశ్వరీ!'' ౧౮౫

మ. అనుచున్ శంభుఁడు వేఁడ, నాప్రకృతి దివ్యంబైన వాక్యంబు నీ
శునితోఁ బల్కె ''మహేశ్వరా! వినుము సంశుద్ధుండ వీవైతి, నీ
కును బత్నీత్వముఁ బూర్ణరూపమున నీకోర్కెన్ జనింగాంతు మా
యను దివ్యాకృతిఁ దాల్చి దక్షు సుతనై యాత్మాభిలాషోన్నతిన్. ౧౮౬

సీ. నీయందు నాయందు నేయెడ గురుభావముంచక దక్షుండు చంచలాత్మ
తను, స్వాభిమానంబునను నిరాదరణంబు నెఱపునో యప్పుడే నియతి నతని
నామాయఁ జూపి విజ్ఞానవిరహితునిఁగాఁ జేసి భ్రాంతిని గప్పి నే స్వ
కీయాంశచేతనే పాయుదు, నంత స్వస్థానంబుఁ జేరుదు, సత్య మిద్ది,

తే. యోమహేశ్వర! యప్పుడే యొదవు నీకు-నాకు విచ్ఛేద, మత్తరి నన్ను వీడి
యొక్కచోనైననుండలే వుభయులకును-బరమమగుప్రీతియీరీతిఁ బరఁగుచుండు.''

క. మునినాథా! నారద! యి-య్యనువున హరుతోడఁ బల్కి యంతర్ధానం
బును బొందెను బరమేశ్వరి,-మనమున శంకరుఁడు తృప్తిమహితుం డయ్యెన్.

నాలుగవ అధ్యాయము

ప్రకృతి దక్షుని పుత్త్రిక యగుట - వివాహము

తే అని మహాదేవుఁడు వచించియంత నార-మునకునిట్లని చెప్పంగఁదొడఁగె ''వినుము,
సంయమీ! సృష్టికర్త దక్షప్రజాప-తిని బిలిచి ప్రీతితోఁ బుత నని యెనిట్లు. ౧౮౯

సీ. ''వినుము కుమార! నెమ్మనమునఁ గడు శ్రద్ధనునిచి మదీయహితోక్తి నిపుడు,
పరమయై పూర్ణయై భాసిలు ప్రకృతి శంకరుఁడు గావించిన వరతపంబు
నకు మెచ్చి యాదేవునకుఁ బత్నియగునట్లువరమిచ్చెఁ దద్వాంఛ నరసి మున్ను,
తన మాటఁ దీర్పంగఁదలఁచి యెచ్చోనైన నామహేశ్వరి జన్మమంది హరుని

తే. వల్లభునిగాఁగఁ గైకొని యుల్లసిల్లఁ-గలదు, నా కింపు లేదు శంక యొకయింత
యైన నో దక్ష! సుపుత్త్రి యయి హరునకుఁ-బత్ని గాఁగల దటుగాన భవ్యనియతి.

క. ఒనరింపుము తపమును నీ-వనుపమమగు భక్తితోడ నాదేవిని నె
మ్మనమున నిడి సంతృప్తిని-గనున ట్లోపుత్త్ర! దక్ష! కడు యత్నమునన్. ౧౯౧

చ. వినుము కుమార! నామతము, విశ్వమునందు నదృష్టకారణం
బున జననంబుఁ గాంచుఁ దమిఁ బుత్త్రికయై జగదంబ, యెన్నఁ ద

జ్జనకుల జన్మమేకద సుజన్మము, జీవితమే సుజీవితం
బనఁదగుఁగాదె, ధన్యతము లౌదురు వారలె నిక్కువమ్ముగన్. ౧౯౨

ఉ. ఆ జగదీశ్వరిన్ బ్రకృతి నంతట వెల్గుచునున్న మాయ సం
పూజితగా నొనర్ప దయఁ బుత్త్రికగా జనియించు, నీవుఁ ద
త్తేజము నాత్మలో నిలిపి తేఁకువ ఘోరతపంబుఁ జేయుమా!
నీజని సార్థకంబగును, నిక్కము ధన్యుఁడ వౌదు పుత్త్రకా!" ౧౯౩

ఉ. నావుడు దక్షుఁ డిట్లనియె "నాయన! యత్నమొనర్తు నిప్పుడే,
తావకశాసనంబుఁ దలఁదాలిచి యాప్రకృతిన్ మదీయస
త్సేవను సంతసించునటు చేసి కుమార్తెగఁ బుట్టునట్లుగా
నేవిధి యర్హ్వమా నటుల నేను నిజంబుగ" నంచు నారదా! ౧౯౪

దక్షుఁడు తపంబు చేయుట

క. అని తండ్రియైన బ్రహ్మకు-వినయముగానఁ బల్కి యంత వేగమ దక్షుం
డును నియమముతోడఁ దపం-బును జేయఁగఁ బాలసంద్రమునకును జనియెన్.

క. ఆరాధించెను నచ్చట-ఘోరంబగు నియతిఁ బూని కోరికతో ని
ట్టోరిమిని మూఁడువే లో-నారద! దివ్యాబ్దములు చనంగను మౌనీ! ౧౯౬

క. ఉపవాసంబులు మున్నగు-తపమునకును ముఖ్యమగుచుఁ దనరెడి విధులం
దపరిమితశ్రద్ధతోడుతఁ-దప మొనరిచె నిశ్చలుఁడయి దక్షుం డంతన్. ౧౯౭

సీ. స్నిగ్ధదివ్యాంజననిభశరీరముతోడ, ఖడ్గపద్మాభయకరమనోజ్ఞ
కరచతుష్టయముతోఁ, గ్రూరదంతములతో, నీలోత్పలదళాభనేత్రయుగము
తో, ముండమాలికాస్తుత్యహారముతోడ, మణిగణరచితభూషణసమూహ
ములతోడ దేవి విముక్తకేశియును, దిగ్వాసయు నై సింహవాహనంబు

తే. నెక్కి మధ్యాహ్నకాలమం దక్కజముగ-వెలుఁగుచున్న సహస్రాంశువిపులదీప్తి
నతిశయించిన ప్రభతోడ నంబ ప్రకృతి-దక్షునకు నిందువేడ్కఁ బ్రత్యక్షమయ్యె.

క. నిరతిశయనిష్ఠతోఁ దప-మిరవుగఁ గావించు దక్షు నీక్షించి, మనో
హరములగు వాక్కులను సం-బరము గలుగ నపుడు దేవి పలికెన్ గరుణన్.

క. "ఓవత్సా! యేకోరిక-భావంబున నుంచి నన్నుఁ బ్రార్థించెదవో
నీ వది వేఁడు మొసంగద-నే వే దక్షప్రజాపతీ! సంతృప్తిన్". ౨౦౦

చ. అని కృపతోడఁ బల్కుటయు, నప్పుడు దేవినిఁ గాంచి దక్షుఁ "డో
జనని! త్వదీయదాసుని నిజంబుగ నర్దయఁ జూచెదేని నా
తనయవుగా జనించి కడు ధన్యునిఁ జేయుము, నాగృహంబు పా
వన మగునట్టు లీవరమె వాంఛితమౌ నొగిఁ దీర్ప వేఁడెదన్." ౨౦౧

తే. అనుచు దక్షప్రజాపతి యడుగ లోక-మాత శ్రీదేవి పల్కె సంబరము మీఱ
"మున్ను భార్యార్థియగుచు శంభుండు నన్ను-బ్రార్థనము చేసియున్నాఁడు భక్తితోడ.

తే. ఆ హరుని వాంఛ దీర్పఁగా నవని నెచట-నైన జన్మింపవలె నంచు నాత్మ నెంచి
సమ్మతిం దెల్పియుంటి నే నమ్మహాత్ము-తోడ, నయ్యది యే సమకూడె నిపుడు.

ఉ. మెచ్చితి నీతపంబునకు; మేలొనఁగూర్చెద నీకుఁ బుత్త్రినై,
సచ్చరితాత్మ! నీదు వరసద్మమునందు జనింతు; శంకరున్
ముచ్చటఁ బెండ్లియాడుఁ; బరిపూర్ణనిజాకృతిఁ బ్రీతితోడ నీ
కిచ్చినయట్టి కోరికల నెంతయుఁ దీర్చెద, విశ్వసింపుమా! ౨౦౭

సీ. దక్షప్రజాపతీ! త్వత్పుత్త్రి నౌదు, లసద్భర్మగౌరవహా చారుదేహ
మున సౌమ్యరూపంబునను నుండు; నీతపం బెందాఁక క్షీణత్వ మందకుండు,
నందాఁక సుస్థిరనై, తావకతపోజనితసుకృతంబు క్షీణతను గాంచి,
యాదరం బించుకమైన నాయం దుంచ కెప్పుడు నీ వుందు వప్పుడె నిను,

తే. నీవలననైన దేహంబుఁ బోవిడిచి మ-దీయనిజరూపమును బొంది దివ్యమైన
యాత్మధామంబు నొందుదునట్టినీవు-నోద్యమును బొందిమదినన్నుఁ జూచుచుండ.

క. స్థావరమును, జంగమమును-నై వెలయు సమస్తలోక మాశ్చర్యమునన్
భావింపలేక మన్మా-యావైభవమునను భ్రమము నంద నెనర్తున్." ౨౦౮

తే. శ్రీమహాదేవుఁ డిట్లని చెప్పఁదొడఁగె-"నారదా! యిట్టు లాదేవి సారసహిత
మైన వాక్యములను బల్కి యాదరమున-దక్షునకు వాంఛల నొసంగి తత్క్షణంబ.

క. సర్వోత్తమమగు ప్రకృతియ-నిర్వచనీయమగు శక్తి నిఖిలజనని య
పూర్వి నంతర్ధాన మఖర్వగతిం-జూచుచుండెఁగా నయ్యె మునీ! ౨౦౯

తే. తన పురమునకుఁ జని యంత దక్షుఁడు జగ-దంబ ప్రీతి యొసంగినయట్టి దివ్య
వరముఁ దెల్పెను బ్రహ్మకుఁ బరమముదము-తోడ సంపూర్ణముగఁ దృప్తితోడ నప్డు.

ఉ. అంతటఁ బూర్ణయా ప్రకృతి యాద్య సనాతని తాను నిర్మల
స్వాంతయు దక్షు పత్నియును సర్వగుణాలయ యా నటంచు న
త్యంతశుభాకరంబయిన యాసతిగర్భమునందుఁ జేరి స
త్కాంతులతోఁ బ్రసూతి యను కాంతకు నున్నతి మించె నారదా! ౨౧౦

క. అంతఁ గ్రమంబున దక్షుని-కాంత ప్రసూతియు నితాంతకాంతి వెలయఁగా
నెంతయు శుభవాసరమున-సంతసమునఁ గనియె నొక్క చక్కనికన్యన్. ౨౧౧

సీ. ఆకన్య సంపూర్ణమైనట్టి ప్రకృతియే, వినుము నారద! రూపవిలసనంబు,
గౌరవర్ణశరీరకలితయు, నుత్ఫుల్లకువలయాయతనయనవిలసితయు,

చంద్రకోటిసమానచారుప్రభయు నయి, యష్టబాహువులతో నలరి, రమ్య
శోదన మొప్పారఁగా వైభవోజ్జ్వలయయి రాజిల్లుచుండె విభ్రమములొప్ప;

తే. నా మహాదేవి పుట్టినయపుడు కురిసెఁ-బూలవాన; దివిన్ దుందుభులు మొరసెను;
మిక్కుటంబగు కాంతితో దిక్కులెల్లఁ-జెలఁగె నత్యంతనిర్మలంబులయి మాని।

క. విని మంగళకరతనయా-జననంబును దెలుపు వార్త సంభ్రమమునఁ దాఁ
గని దక్షుఁ డుత్సవంబుల-ననుపమముగఁ జేసె నాత్మ హర్షము నిండన్. ౨౧౩

క. పురుడు పదిదినము లరుగఁగఁ-బరమంబగు సంతసమున బందుగులెల్లన్
బరివేష్టింపఁగ దక్షుం-డిరవుగ 'సతి' యనుచుఁ బేరు నిడె బాలికకున్ ౨౧౪

ఆ. అనుదినంబు వృద్ధినందె నా కన్యక-నిర్మలత్వమునను నిత్యవృద్ధి
శారదసమయమునఁ జంద్రప్రభనుబోలి-వానకాలమందు స్వర్ణదివలె. ౨౧౫

క. క్రమమున వివాహమంగళ-సముచితమగు వయసు నంది చారువదనయై
కమనీయాకృతి గల తన- కొమరితఁ గని దక్షుఁ డాత్మఁ గూరిన వేడ్కన్. ౨౧౬

ఉ. "బాలిక పెండ్లియాడునను భాసిలుచున్నది, యోగ్యుఁ డౌ వరుం
బోలఁగఁ జూడనో, బరమపూజితయా ప్రకృతిస్వరూప యీ
బాల యటంచు నీసతిప్రభావముఁ దద్వరు దివ్యనామ మా
శూలి యటంచు నాఁడు విని చోద్యముఁ బొందితిఁ గాదె యెంతయున్. ౨౧౭

ఉ. ఉల్లమునందు నే నొగి బహూద్యమ మెంత యొనర్చినన్ ఫలం
బెల్లను నాకు వ్యర్థమగు నించుకయేని ఫలింప దంచు నే
నెల్లవిధంబులన్ దెలిసి యిప్పుడు చింతిల నేల! శూలి కీ
నొల్ల, నొనర్తు కార్య మొకఁ డొక్కటఁ జూచెదఁగాక! యెట్లనన్. ౨౧౮

తే. రుద్రులెల్లను బుట్టి రా రుద్రువలన
వారలో నాడు నాజ్ఞకు వశులగుటను,
రుద్రుఁ బిలిపించి యీదివ్యరూప నెట్లు
లొసఁగఁగలవాఁడ! నిదిచూడఁ బొసఁగఁగలదె? ౨౧౯

క. సురవరులను గంధర్వా-సురముఖులను బిలిచియె శివశూన్యముగా నే
జరపెద నొక పరిష, త్తా-హరుని బిలువ" ననుచు దక్షుఁ డంతట మదిలోన్.

తే. "యాగ మొక్కటి శివుఁడు లేనట్లు చేయు-దనుస్వయంవరముదమునకును నతిప్ర
యత్నమున నెట్టులయిన నే, నందు జరగుఁ-గాక! విధిమానసస్థితి కలకొలంది.

క. అగునది యగుఁగాక! వగం-బొగిలినఁ దప్పంగ నెదియుఁ బోవదు; మదికిం
దగినట్లు నడచుటయె నా-కగు కర్జం" బనుచు నిశ్చయము చేసి వడిన్. ౨౨౨

దాక్షాయణీ స్వయంవరము

తే. అంత దక్షుండు తన కూఁతు రైన సతి స్వ-యంవరముఁ జూడఁ బిలిపించె నఖిలనిర్జ
రులఁ, దదీశులను,గిన్నరులను, నసుర-వరులు మున్నగువారలఁ దమి వెలయఁగ.

క. పరమేశ్వరుఁడై విలసిలు-హరు నొక్కనిఁ బిలువ కప్పుడాసభ దక్షుం
డిరవొందఁ జేసె నద్భుత-కరముగను సురాదులకును గామిత మనుచున్. ౨౨౪

క. సుత్రామాదిసురలును, బ-విత్రమునులు, దైత్యవరులు వెలుఁగుచు నుండన్
జిత్రమయమై కనంగ వి-చిత్రితమై రమ్యమగుచుఁ జెలువున నెసఁగెన్. ౨౨౫

తే. ఆమహాసభ తేజంబునందు వేయి-కిరణముల నొప్పు సూర్యుని సరి యనఁదగుఁ,
గాంతివైభవమున నది కనుఁగొనంగఁ-బూర్ణచంద్రునితో సరిపోల్పనగును. ౨౨౬

ఉ. నారదమౌని! యాసభ ననంతమహోత్సవ మొప్ప దేవతా
వారపతు ల్సుమాల్యవరవస్త్రధరుల్ బహురత్నకీలితో
దారకిరీటభర్మవితతప్రభులై విలసిల్లుచుండి, రిం
పారఁగఁ జూడ వేడుకగు భవ్యసుభాభరణోజ్జ్వలాంగులై. ౨౨౭

ఉ. వారి రథంబులున్ మఱియు వాహనముల్ గజసంతతుల్ మహో
దారతరంబులౌ మణివితానములున్ వర హేమనూత్నశృం
గారపరిష్కృతంబుల నికామమనోహరచిత్రకాంతివి
స్తారపతాకలన్ బహువిధంబుల వెల్గుచు నుండె నారదా! ౨౨౮

క. అంతటను ధ్వజము లద్భుత-కాంతులతో వెలయుచుండఁగా దక్షపురం
బెంతయు నలంకృతంబై-వింతగొలుపుచుండె నిఖిలవిబుధావళికిన్. ౨౨౯

సీ. భేరీమృదంగాదిభూరివాద్యంబు లేపున మాటిమాటికి మ్రోయుచుండఁగ,
నారవం బత్యంతమై భూనభోంతరభాగ మెల్లను నిండి పరిఢవిల్ల,
గంధర్వులెల్లరు క్రమగీతంబుల దృంబుమీఱఁగను గానంబుసేయ,
వేవేలుగా వచ్చి వేలుపుటింతు లానందంబుతో డుత నాట్యమాడ,

తే. నాసభాభవనంబు దివ్యమయియుండె,-నపుడు దక్షప్రజాపతి యెద నెఱింగి
సుతను బిలిపించెఁ ద్రైలోక్యసుందరాంగి-నాస్వయంవరసభకు నత్యాదరమున.

క. నారదమునిశార్దూల! య-పారముదంబునను నటకు వచ్చె సతి యలం
కారమున వెలసి కడుశృం-గారప్రతిమయె యనంగఁ గమనీయగతిన్. ౨౩౦

చ. సకలచరాచరంబులఁ బ్రశస్తముగా వెలుఁగొందు శంకరుం
డొక రమణీయరూపమున నొప్పు మహోక్షముమీఁద నెక్కి, సే
వకపరివేష్టితుండయి, నభంబున నాసభఁ గాంచుచుండెఁ బా
యక సకలంబుఁ గన్గొనుచు, నంతఁ బ్రజాపతియైన దక్షుఁడున్, ౨౩౧

తే. సభను గలయుంగఁ జూచి, నిశ్శంక శంక-రుండు లేఁడని మదిఁ దమి నిండుకొనఁగఁ,
బరమసుందరియై స్వయంవరవిభూషి-తాంగి యగు ప్రియతనయతో ననియె నిట్లు.

సీ. ''ఓసతీ! మాయమ్మ! యురుముదంబునఁ గాంచు మీసభాభవనంబు, నిండఁ జేరి
యాసీనులై యున్నయట్టి సురాసురగణములఁ, దాపసగణముల నొగి,
వీర లెల్లరుఁ గడువిశ్రుతచరితులు, సద్గుణాకరులు, ప్రశస్తమతులు,
వరియింపుమా స్వయంవరసమాగతులైన వీరియం దుస్నితో దారగుణుని,

తే. సర్వ శుభలక్షణోపేతు, సకలలోక-సుందరశరీరు, సంప్రీతి నొంది సీదు
మదికి నింపైన వరుఁ బుష్పమాలికఁ గొని-కంఠమున నలంకరింపుము కాంతునకును''

క. అని ప్రియము మీఱ దక్షుఁడు-తనయను గని పలుక, నపుడు తాఁ బ్రకృతి మహా
జనని సతి మాలికను గర-మునఁ గొని యీశ్వరుని నుల్లమున మ్రొక్కి వెసన్.

తే. శంకరునకును వందనసమితి యనుచుఁ-బల్కి సుమమాలికను భూమిపైన నిడియె,
నాక్షణంబున శివుఁడు ప్రత్యక్షమాయె శి-రంబుచే నటఁ బుష్పహారంబుఁ దాల్చి

సీ. దివ్యరత్నావళీదేదీప్యమానమై దేహంబు మిక్కిలి తేజరిల్ల,
షోడశకళలచే సొబగుఁగు చంద్రుడు పూర్ణశశికోటిసమకాంతి దిశల వెలయ,
దివ్యమాల్యంబులు, దివ్యాంబరంబులు ధరియించి, దివ్యగంధములఁ బూసి,
ఫుల్లారవిందనిభోల్లసద్వీక్షణత్రితయంబు రంజిల్లఁ బ్రీతి మెఱసి,

తే భవ్యరూపధరుండయి భవహరుండు-హరుఁ డవతరించి యాసతీహస్తదత్త
పుష్పమాలిక ధరియించి,ముదము నొంది-య చటనంతర్హితుండయ్యె నందఱుఁ గన.

క. తన తనయయైన సతి శం-భుని కంఠమునందుఁ బ్రీతిఁ బూవందను దాఁ
గనుచుండ సమర్పించెనె-యని దక్షుఁడు తృప్తిలేక యప్పుడు మౌనీ! ౨౩౯

తే. తనయపై నించుకంత యాదరము తగ్గి-నట్టివాఁడయియుండెను, నంత దక్షు
సకలలోకప్రజాపతి నకలుష మతి-బ్రహ్మదేవుండు గనుఁగొనె వరమునీంద్ర!

క. మానససంభవులగు తన-సూనులును, మరీచిముఖ్యశుద్ధమునీంద్రుల్
పూని తనకుఁ దోడ్పాటయి-వే నిలువఁగ నిట్లు పలికె విశ్రుతభణితిన్. ౨౪౦

చ. ''వినుము కుమార! నీతనయ ప్రీతిచెలంగఁగ దేవదేవు శం
భుని వరియించె నెంతయు స్వబుద్ధిఁ దలంచి, మహాత్ముఁడైన యా
యనఘునిఁ బిల్వఁబంచి కడు యత్నమునన్ విధిపూర్వకంబుగా
ననుపమరీతి నిమ్ము సుత నాత్మఁ గళంకము మాని వే''యనన్. ౨౪౧

తే. దక్షుఁ డా బ్రహ్మవాక్యము ల్దలఁచి,ప్రకృతి-భాషితంబులస్మరియించి భావమందు,
నామహేశుని బిలిపించి, యర్హరీతి-ధారవోసెను ముద్దులతనయ నపుడు. ౨౪౨

క. పరమేశ్వరుఁ డాకన్యక-వరమంగళరూపసతిని పాణిగ్రహణం
బిరవుగ శాస్త్రోక్తముగాఁ-గర మనురాగమునఁ బొందెఁ గడు హర్షమునన్.

ఉ. అప్పుడు బ్రహ్మయున్, హరియు, నాద్యమహర్షులు నారదాదు లి
ట్లొప్పిన యాసతీశివుల నుల్లములందున భక్తిపూర్ణులై,
రెప్పగిదిన్ ముదంబు వహియింతురొ యట్లొనరించి సేవలన్
మెప్పు జనింపఁగా శ్రుతిసమీహితరీతి నుతించి రంతయున్. ౨౬౬

క. కురియించిరి సుమవర్షము-లురుదారఁగ సకలవిబుధు లతిమోదమునన్,
విరివిగ దుందుభిరవములు-నిరవధికముగాఁగఁ జెలఁగె నిచ్చలు తుష్టిన్. ౨౬౭

తే. దేవగంధర్వకిన్నరాదిసకలసుర-వార మానందభరితమై వఱలె, దక్షుఁ
డాజటాభస్మభూషణుం డౌ హరు,సుత-యైన సతిఁ గని యున్మత్తుఁ డయ్యెనపుడు.

తే. నిఖిలలోకైకసుందరి నిజసతిఁ దన-వెంటఁ గొని యామహేశుండు స్వీయరమ్య
శోభననివాసమౌ హిమక్షోణీధరము-నందుఁ గల నెత్తమును జేరె నరిగ నంత.

క. మునినాయక! సతి శ్రీశం-భుని వెంటను జనఁగ షండమున దక్షునకున్
ఘనమగు దివ్యజ్ఞానం-బెనయఁగ లోపించె నప్పు డేపున శోకటన్." ౨౬౮

వ. అని విశదీకరించి, ౨౬౯

క. తతధర్మకార్యదీక్షా!-ధృతసకల సురాసురైక తృప్తినిరీక్షా!
శతమఖముఖసాపేక్షా!-శ్రితహిత రక్షాక్రియావిశిష్టాధ్యక్షా! ౨౭౦

గద్యము

ఇది శ్రీలలితాత్రిపురసుందరీ కరుణాకటాక్షవీక్షణ సమాసాదితోభయ భాషాకవితావిభవ, జనమంచి వంశప్రభవ, కాశ్యపసగోత్రోద్భవ, సుబ్బయార్యతనూభవ కావ్యపురాణతీర్థ విద్వద్బిరుదవైభవ వేంకటసుబ్రహ్మణ్యశర్మ విరచితకృతులయందు శ్రీమహాభాగవత మహాపురాణమునందుఁ బ్రథమాంశము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీ మహా భాగవతము

ద్వితీయాంశము

అయిదవ అధ్యాయము

క. శ్రీమత్త్రిపురేశానీ! - కామితతతసకలవిభవఘనశర్వాణీ!
భామహితమృదులవేణీ!-క్షేమద్విమునిసుపదాబ్జధృతగీర్వాణీ! ౨౫౧

తే. శ్రీమహాదేవుఁ డిట్లని చెప్పఁదొడఁగె- "నారదా! విను దక్షుఁ డంత హరు, సతిని
నిందఁ జేసినవాఁడయి డెందమందు-బుణ్యము నశింప రోదనమును నొనర్చె.

మ. అతిదుఃఖాక్రాంతుఁడై దక్షుని మునీ! యత్యంతవిజ్ఞానియై
క్షితిఁ బేరొందినయట్టివాఁడును, శివాంఘ్రిస్తోత్రనిష్ఠుండు, స
న్మతిమంతుండు దధీచినాఁ బరఁగు ప్రజ్ఞాశాలి ప్రీతిన్ సమం
చితతృప్తిం గొనఁ బల్కె నూఱడిలఁగాఁ జేయంగ నూహించుచున్. ౨౫౩

ఉ "ఏటికి వెఱ్ఱివానిగతి నేడ్చెదు దక్ష! మనంబునందునన్
గాటపు భ్రాంతితో సతిని గానవు శంకరు నట్లె, నీకిలన్
సాటి యెవారు లేరు, సతి జన్మము నందెఁ ద్వదీయసద్మమం,
దోటమి యేల? భాగ్యము మహోన్నతమం చెఱుఁగంగఁజాలవే? ౨౫౪

క. సతిఁ గను మాద్య యటంచుఁ బ్ర-కృతియును నశరీరయు నని హృదయంబున స
న్మతి శివుఁడు పరమపురుషుఁడె-సతీధవుఁడు తెలియు మిది యసంశయ మనఘా!

సీ. నిరుపమానంబులై నెగడు ఘోరతపంబు లారణ్యసీమలయందుఁ జేసి,
బ్రహ్మాసురేంద్రనిర్జరదైత్యసంఘముల్ కనుఁగొనలేనట్టి ఘనప్రకృతిని
దక్షప్రజాపతీ! తనయగాఁ బడసితి, సఫలమయ్యెను నీదు జన్మ మరయ
నాదేవిమహిమ నీ వంతరంగంబునఁ దెలియంగఁజాల కావిలమతివయి,

తే సతిని నిందించుచున్నాఁడ, వతులితమగు-నామహామోహరూపిణి యప్రతర్క్య
మాయ చేవంచితుఁడవైతివో యియనఘ!- తెలియుమిఁక నైన" ననుచు దధీచి నుడువ.

తే. అపుడు దక్షుండు ప్రశ్నించె నా దధీచిఁ
గాంచి "యో యార్య! శంభుండు కనఁగఁ బరమ
పురుషుఁడు, ననాదిజగదధీశ్వరుఁడు నంచుఁ
దెలిపినాఁడవు, నిజమె యీపలుకులెల్ల? ౨౫౭

ఉ. సత్యమె యయ్యె నేని మఱి శంభుఁడు చూడఁ ద్రిలోచనుండునై
నిత్యముఁ బ్రేతభూమిఁ దమినిన్ వసియింపఁగఁ గోరు భిక్షువై,
యత్యధికంబుగాఁ దనువునందున బూడిదపూఁతఁ బూసి తా
స్తుత్యముగాని కార్యములఁ జొక్కును? దెల్పుము విస్తృతంబుగన్'' ౨౫౮

క. అనవుడు దధీచి దక్షున-కును వినిపింపంగఁ దొడఁగెఁ ''గోర్కెని వినుమా,
యనఘా! యీశుని మహిమం-బును దెలిపెద సావధానమున నతిభక్తిన్. ౨౫౯

తే. శంకరుఁడు సకలేశ్వరేశ్వరుఁడు, పూర్ణుఁ,
డచ్యుతానందమయుఁ డసు మ్మామహేశు
చరణముల నాశ్రయించు రెవ్వరు ధరిత్రిఁ
బొందఁజాలరు దుఃఖ మెప్పుడును దక్ష! ౨౬౦

తే. అసదృశాత్మీయమహిమచే నలరునట్టి-యీశ్వరుని భిక్షుకుఁ డటంచు నెట్లు పలుకఁ
గలిగితివి నీవు? దుర్బుద్ధి గలిగె నేమి-కతమునను నీకు మదిని నద్భుతముగాఁగ!

తే. బ్రహ్మ మొదలగు నిర్జరులు,మునులుఁ,-దత్త్వదర్శనులగు యోగితతులు మదిని
నేశివుని దివ్యరూపంబు నేర్పఱింపఁ-జాలరో యట్టి శంభుని స్థానమెఱుఁగు. ౨౬౧

చ. తెలియఁగఁజాల కీవు కుమతిం గొని జ్ఞానము లేక యిట్టి నిం
దలను వినూపుఁ డంచును వినందగనట్లుగఁ బల్కు-వాఁడ వే
స్థలమునకైనఁ బోవును సదాశివుఁ డెన్న సమత్వబుద్ధితో,
వెలయును సర్వభాగముల విశ్రుతరీతి మహానుభావుఁడై. ౨౬౩

తే. దక్ష! వినుమభిరామమై తనరు పట్ట-ణంబునందైన, మఱి శ్మశానంబునందు
నైన నా దేవదేవుని మాత్మకు సను-మానుగాని విశేష మెయ్యదియు లేదు.

సీ. బ్రహ్మవిష్ణులకు దుర్లభమై, యపూర్వమై శివలోక మొగి విలసిల్లుచుండు,
బ్రహ్మలోకంబుకు, వైకుంఠమును దాని షోడశాంశంబైన నిడుగావు,
స్వర్గంబునందు దేవతలకునైన దుర్లభమగుచుండుఁ గైలాసపురము,
సంతానకవనాదిసంవృతంబై నిఖిలామరాకీర్ణమై యలరు నింద్రు

తే. పట్టణం బమరావతి భవుని లోక-మునకు షోడశభాగమైనను సమంబు
చేయఁగాఁజాల దో దక్ష! చిత్తమందుఁ-దెలియవిను మింక శంకరు దివ్యమహిమ.

తే. మర్త్యలోకంబునందు రమ్యమయి యుత్త-మంబగుచుఁ వెల్గుఁగాశీపురంబుమిగుల
ముక్తిదాయకమగు క్షేత్రము లయకాల-మందును నశింపనిది శంకరాలయంబు.

సీ. బ్రహ్మాది దేవతావళులును మృత్యువునందంగఁగలవార లగుచునుండ
మర్త్యుల విషయమై మది నెంచఁగ నేల! పరమాత్ముఁడైన శంకరుని దివ్య
భవనము ల్మఱియు నివాసంబు లవినాశములుగా నెఱుంగుము బుద్ధియందు,
నా దేవునకు శ్మశానాంతరమగు నివాసము లేదనెడునట్టి కుమతి నీకుఁ

తే. గలిగ నేటికి దక్ష! లోకత్రయేశుఁ-డై సదాశివుఁడయి వెల్గు ననుచుఁ దెలియ
వలయు,నిది సత్యమగు,భ్రాంతివలన నింద-జేయరా దెప్పుడైనను శివుని వినుము.

క. తావకభాగ్యవశంబున-నీ వేశ్మమునందుఁ బుట్టి నీకుం బుత్రీ
భావమున వెలయుచుండిన-దేవి పరబ్రహ్మరూప, తెలియవు మదిలోన్. ౨౬౮

ఆ. నాకుమార్తె యనుచు లోఁకువగాఁ జూచు-చున్నవాఁడ, వెంతొ చోద్యమయ్యె,
సతి యనంగ వెలయు సాక్షాన్మహేశ్వరి-యగును, నిందసేయఁ దగదు దక్ష!"

తే. శ్రీమహాదేవుఁ డిట్లని చెప్పఁదొడఁగె-నారదునితోడ "నిరీతి జ్ఞానవర్యుఁ
డౌ దధీచి మునీశ్వరుం డావృతి బహు-విధములను బోధచేసిన వినక మదిని.

ఉ. నారద! మాటిమాటికి వినష్టమనస్కుఁడు దక్షుఁ డాజగ
త్కారణకారిణిన్, విభు, సదాశివు, నిర్మలశిష్టసమ్మతా
చారుని తత్త్వముం దెలియఁజాలక పెక్కువిధంబులం దిర
స్కారము చేయుచుం బలికె గర్హితవాక్యము లెంతయుం గ్రుధన్. ౨౭౧

క. తన పుత్రికయగు సతిని-మ్మనమున స్మరియించి గుణాభిమానుండై యే
మనఁజాలక యేడ్చెను హా-యనుచున్ గట్టిగఁ 'కుమారికా! సతి!' యనుచున్.

ఆ. "ప్రాణతుల్యవగుచు భావింప నాకీవు-నన్ను విడిచి యెందుఁ జన్నదాన?
యిపుడు శోకజలధి నీరీతి నను ద్రోసి-పోయి తెటకు నాకు ముద్దుకూన! ౨౭౩

మ. రమణీయోజ్జ్వలహారికర్యలను నిద్రంబోవు నీ వేక్రియం
గమనీయాంగి! పరేతభూమి విశ్రాంతాకారిన్, విహారాత్మను, భీ
మమహావిగ్రహు, నాత్మవల్లభుని సర్మారిన్ బ్రియంబొప్ప నే
మముతోఁ గూడి వసింతువో యెఱుఁగ నమ్మా! దిక్కు నాకేదికన్?" ౨౭౪

దక్షుని దధీచి యూఱడించుట

తే. దక్షుఁ డీరీతి శోకింపఁ దా దధీచి-మౌనివరుఁ డంతయును విని మాన్యరీతి
నూఱడింపఁగఁ బూని ప్రియోక్తులఁగర-ముచ్చఁగనుంగవఁ దుడుచుచు ననియెనిట్లు.

మ. "అకటా! జ్ఞానుల కెల్లఁ బెద్దవయి యిట్లల్పజ్ఞుఁడౌ మూర్ఖుపో
లిక శోకించెద వో ప్రజాపతి! మహాలీలాత్ము నిశ్శంకతన్
సకలాధీశునిగా నెఱింగియును నీస్వాంతంబునం దేటికీ
వికలత్వంబు జనించె? నియ్యది కనన్ వే తోఁచెడిన్ జిత్రమై. ౨౭౬

తే. భువి జలంబున నాకసమున రసాత-లంబున వసించునట్టి స్త్రీలం బురుషులఁ
దెలియుము సతీశివుల రూపవిలసితులుగ-దక్ష! వినుమిది నిర్మలతరమతివయి.

చ. పరశివుఁడౌ మహేశ్వరుని భావమునందుఁ బరార్థతత్త్వబం
ధురత ననాదిపూరుషుఁడు, నుత్యుఁ డటంచు నెఱుంగు దీవె, య

ప్పరశివు రాణియైన సతి భావనసేయు చిదాత్మరూపయై
వరత్రిగుణాత్మయౌ ప్రకృతిసంజ్ఞ పరాత్పర యంచు నమ్మిరే. ౨౭౮

సీ. దక్షప్రజాపతీ! తావక భాగ్యంబునన పరాత్పరసతి యనఁగఁగూఁతు
రయ్యె విశ్వేశ్వరుఁ డాసతిఁ బెండిలియయి పతిభావంబు నందె, దీని
నెమ్మనమ్మునయందు నిరుపమసౌభాగ్యమని యెంచఁగాఁ, నేమనఁగఁగలను?
వంచింపఁబడినాఁడ వంచితుండగుచు విధిచేత సంతతి స్తుతి నాతలముగ

తే. నందుచున్నాఁడ, విపుడు సత్యమును వినుము,
ప్రకృతిపురుషులఁగా సతీపరమశివుల
నెఱుఁగుమా శ్రేయములఁ బొంద నెంచితేని
దుఃఖవారిధి మునిఁగి యార్తుఁడవుగాక!'' ౨౭౯

చ. అనవుడు దక్షుఁ డిట్లనియె నమ్మునితోడ, ''మునీంద్ర! నీవు ప
ల్కినయది సత్యమే యగును గాత్రిగుణాత్మయు లేదు భావమం
దునఁ బ్రకృతిస్వరూపయగు సూక్ష్మ మదాత్మజ, యా సదాశివుం
డెటు త్రిలోకనాథుఁడు పరేశుఁడు నైతిరుఁ డన్న వాక్యములే. ౨౮౦

చ. వినియును నాకు నచ్చెనని విస్మృతి నొందెదను మహేశ్వరుండు లో
కనిచయకర్త గానవుచుఁ గాంచఁగఁజాలను హేతు వేదొకో?
మునివర! సత్యవాక్యము లగు పూజ్యులు పల్కుచు పల్కుచున్న నా
మనము సదాశివుం బరము మాన్యునిగా గణింప దేటికో? ౨౮౧

క. మునినాయకి! విను పూర్వ-భువిఁ గూర్చి నా కసూయ పొడముటను శో
ర్కొనెడు దగనట్టి కారణ-మును మా జనకుండు బ్రహ్మ పూర్వము ప్రజలన్.

తే సృష్టి గావించె నప్పుడా సృష్టిబంధ-కంపముగురు రుద్రులు జనించి కడుఁ జెలిఁగి
రందఱును సమదేహులై యతిభయంక-రాకృతుల భీమశూరులై సలువు మెఱసి

సీ ఆ రుద్రులెల్ల మహాత్ములై క్రోధరక్తారుణనేత్రులై యతివ్యాఘ్ర
చర్మాంబరధరులై జటిలోడ్ వెలుంగు శీర్షములను దాల్చి సృష్టికర్త
చేసిన సృష్టి నశింపఁజేయఁగఁబూని, రది గాంచి బ్రహ్మ తా నాత్మయందు
'వీరలు సృష్టిని వెస నాశమొనరింపఁబూనినవా'రని పొసఁగఁదలఁచి,

తే. వారలను దన యాజ్ఞచే వరుస శాంతి-నంది వసియింప నగిరి యనియె ''వీర
లెల్లు శాంతి గాంచుటకో, యెట్టి హితవా-యట్టులొనరింపుమా త్వరనను వ్విమాఱ.

తే. భీమరూపులు నంజీయును భీమకర్ము-లగుదు, రటుగాన వీరల నాత్మవశులఁ
గాఁగ నొనరుపఁదగు దీవెరాన నాదు-పంపున'' నటంచు ననుఁబంచెఁబద్మభవుఁడు.

తే. బ్రహ్మదేవుని యాజ్ఞచే బహుళవిక్ర-మాఢ్యులగు రుద్రులెల్లరు నతిభయమున
మద్వశంగతులయి విక్రమంబుఁ దక్కి-ప్రశ్రయము లేనివారయి పరఁగి రపుడ.

క. అకృతమున నాకు మునీ!-నికృతనె ద్వేషంబు శంభునిపయిఁ మిగులన్;
దకృవపడ దది మదిలో-నకాలమునుండి యాగ్రహంబు సుదృఢమై. ౨౮౮

ఆ. రుద్రులెల్ల నీశ్వరుని యంశజనితులు-మద్విశంగతులయి మలయువారు,
నగుట శంభుఁ డెట్టులగు నాకుఁ దెలుప నే-యున్నతుఁడు మునీంద్ర! యెన్నిచూడ?

క. నాసుతయగు సతి గుణముల-నోసంయమి! రూపమున మహోన్నత యగుచున్
భాసిల్లుఁగాదె? తెలియవా-కో సామ్యము లేని దనుచు నుల్లమునందున్? ౨౮౯

ఉ. ఏవిధి భర్తృయోగ్యుఁ డగు నించుక యోజ సేయు మాత్మ? సం
భావితుఁడౌనె యాసతికి భర్తుఁడు మద్వశుఁ డెంచి చూడఁగా?
నీవియుఁ గాత్రభూతునకె యిచ్చినఁ బుణ్యకరంబునై, యశః
శ్రీవిభవాభిరామమయి చెల్వు వహించును సన్మునీశ్వరా! ౨౯౦

క. కావున సత్పాత్రంబును-భావించియె కన్య నియ్యవలయును బుధసం
సేవితుఁ డగు వాఁ డిలలో-నీవిధి సేవ్యంబు మునిగణేశ్వర! వినవే? ౨౯౧

తే. కులము రూపంబు శీలంబు గుణముఁ గాంచి
బంధువులతోడఁ జర్చించి పాత్రుఁడైన
వరునకును గన్యకను గూర్పవలయుఁ బ్రాజ్ఞుఁ
డయినవాఁడు, మునీశ్వరా! యంద్రు బుధులు. ౨౯౨

ఉ. ఈ విధమెల్ల నామదిని నెంచియె కాదె సతీస్వయంవరం
బే విరచించునట్టితఱి నేఁ బిలిపింపఁగనైతి శంకరున్,
సేనకుఁడై సువంశగుణశీలవివర్జితుఁ డంచు, సత్య, మీ
భావముఁ దెల్పినాఁడ, మునివర్య! దృఢంబుగ నమ్ము మింతియున్. ౨౯౩

సీ. ముని! యీమహారుద్ర ముఖ్యులు మద్విశంగతులయి వర్తించుకతన, మఱియు
శివుని యంశజులయి చెలఁగుచుండుకతంబునను, శివుతోఁ గూడి యనయముఁ జరి
యించుటకతమున నెసఁగుచుండును నాకు నీర్ష్య యీతనిపయి, నిది నిజంబు,
శంభుండు తా రుద్రసమితికంటెను నున్నతఫలంబుఁ గూర్పఁగా దక్షుఁడైన

తే. యపుడె పూజింప నర్హుఁడై యలరు నాకు,-నీప్రతిజ్ఞ దృఢంబని యెన్నవలయు"
నని దధీచికి దక్షుండు తన మనమునఁ-గల విధంబును నారదా! తెలిపె వినుము."

వ. అని మహాదేవుండు నారదునితో వెండియు నిట్లని చెప్పందొడంగె. ౨౯౪

ఆ. "ఆ దధీచిమౌని యంత దక్షుని వాక్య-జాలములను శ్రద్ధ నాలకించి,
తనదు స్వాంతమందు ఘనమగు చింతతోఁ-దలఁచె నప్పు "డౌర! దక్షుఁ డిట్లు.

తే. తాఁ బ్రజాపతి యయ్యు నాత్మ నిసుమంత-యేని ప్రజ్ఞయు లేక యయ్యాశువలన,
సతివలన మోహితుండయ్యె మతిచెడివడి,-నహహా! బడుఁడగు దక్షునకర్హ మెదియొ!

ఉ. ఆరయ బుద్ధిమంతుఁ డగునట్టి జనుం డొక దుష్టబుద్ధికిన్
గూరిమి మంచిబుద్ధి నొడఁగూర్చుప శక్తుఁడు గాఁడు, భూమి నా
పూరుషుఁ డెన్న భక్తి మదిఁ బొందక దుర్దశ నంది దుర్గతిన్
జేరఁగఁబోవు, మోక్షమును జెందఁడు నిక్కముగాఁగ నెత్తఱిన్." ౨౯౮

ఉ. ఈకరణిన్ మనంబున మునీశ్వరుఁడైన దధీచి యెంచి, య
త్యాకులుఁడై మతేమనక స్వాశ్రమసీమకు నేఁగ నప్పుడే,
యా కుటిలుండు దక్షుఁడు నిజాలయముఁ గదిసి జేరెఁ జింత వ
న్నాకులపెట్ట నుస్సురని యంతట నారదమౌనిచంద్రమా! ౨౯౯

౩౮వ అధ్యాయము

నందికేశ్వర ప్రమథాధిపతిత్వ వర్ణనము

తే. సకలలోకోత్తరతుషారశైలశిఖర-మునకు సతితోడ మహాదేవమూర్తి యంతఁ
జేరె నంతట దేవతల్, సిద్ధవరులు,- దేవపత్నులు, మునిపతులును జేరె ౩౦౧

తే. వరమహర్షులు, గంధర్వవరులు, కిన్న-రులును వేలకు వేలుగాఁ గొలఁదిమీఱి,
వచ్చిచేరిరి యత్యంతవైభవమున-నామహోత్సవమునకు నధికభక్తి. ౩౦౨

తే. మేరుపుత్రిక తుహినభూమిధరపత్ని-మేనకాదేవి సఖులతో మిగుల మోద
మున నచటఁ జేరఁజనుదెంచె మునివరా సక-లెల్లరునువచ్చి చేరిరిహృష్టులగుచు.

తే. కుసుమవర్షంబు దేవతల్ గురిసిరి సుము-దమునఁ బచ్చరులాడిరి యమిత చెలంగి
గీతములను గంధర్వులు ప్రీతిఁ బాడి-రావేదవృందము సతిగూడ నచటఁ జేర. ౩౦౪

తే. ఉవిదలెల్లను నాచారయుక్తముగను-దివ్యమహమును జేసిరి, దివ్యులైన
యాసతీశివులకు మ్రొక్కి, రపుడు ప్రమథు-లెల్లరును భక్తితోడఁ బ్రహృష్టులగుచు.

క. కరతాళంబులు చెలఁగన్-సురవరు లెల్లరును దృష్టి శోభిల్లఁగ నా
సిరి తూర్యధ్వను లెసఁగఁగ-సరవిన్ గానంబు చేసి సంతోషమునన్. ౩౦౬

ఉ. అంత సతీమహేశ్వరుల నంజలిగూర్చి నమస్కరించి య
త్యంతము, వారిచే సెలవు నంది యమర్త్యవరుల్ స్వకీయసు
ధ్రాంతముఁ జేరఁబోయిరి, నితాంతముదంబునఁ బొంగి యెల్లవా
రెంతయు నాత్మసద్మముల కేగిరి కూర్మి చెలంగ నారదా! ౩౦౭

తే. మేన మొదలగుస్త్రీలునుమిగులవేడ్కఁ-జనిరిస్వగృహమ్ములకుసంతసముననిండి
పరమసౌందర్యవతియగు భవునిభార్య-సతిని గని, మేన తలపోసె స్వాంతమందు.

ఉ. "ఈసతిఁ గన్న తల్లియె మునీశ్వర! ధన్య యనంగఁ జెల్లు సా
ధ్వీసమితిన్, ధ్రువంబుగ సతిస్థిరభక్తి మనోహరాననన్

నా సుతగాఁగ నే ననుదినంబును భావమునందు నెంచుచుఁ
జేసెదఁ బూజనం బిటుఁ జేరి'' యటంచుఁ దలంచె నెంతయున్. ౩౦౮

సీ. గిరిరాజసద్ధర్మవరసతి మేన యీరీతి మనంబునఁ బ్రీతి సతిని
మూఁడులోకములకుఁ బూజ్యయౌ జనయిత్రిగా నెంచి పూజింపఁగాఁదలంచి,
యెవ్వేళ విస్మృతి నించుకేనియుఁ బొందక కాయీశ్వరుని పత్నియగు సతికడ
కరుదెంచి భక్తితో నర్చించుచుండెఁ దత్కరుణాభివృద్ధియౌ కరణి, నంత

తే. నొక్కతఱి దక్షు ననుచరుం డూర్జితమతి,–శంభుభక్తిపరుండు,సత్స్వాంతవరుఁడు
నంది యరుదెంచి సాష్టాంగవందనముల–శంకరునకును గావించి సవినయముగ.

తే. పలికె నీరీతి ''దేవదేవ! విభు! యుష్మ–దీయమహిమావిదుఁడగు దధీచివిప్ర
సన్మునీంద్రశిష్యుండ, దక్షప్రజాప–తికిని గూర్చు భృత్యుండ నోదివ్యవిభవ!

క. శరణన్న వారి మిక్కిలి–కరుణను, వాత్సల్యమునను గాచు మహేశా!
పరిమోహితు నొనరింపక–పరిపాలింపుము త్రిలోకపతి! న న్నెపుడున్. ౩౧౧

సీ. పరమపూరుషునిగాఁ బరమాత్మగాఁగఁ బ్రత్యక్షముగా నిన్ను నాత్మయందుఁ
గనుఁగొనినాఁడ నిక్కంబుగ, నోదేవ! జగములఁ బుట్టింప, నొగిని బెంప,
సంహార మొనరింప సామర్థ్యము గల్గి మూలప్రకృతియయి పొలుచు ననుచు,
సతిని నెఱింగితి స్వాంతంబులోపల''నని పల్కి శంకరు నాశ్రితౌఘు

తే. వాంఛితార్థప్రదాయకుఁ బరమభక్తి–వెలయ గద్గదవాక్కుల విస్తృతముగ
నంది సన్నుతిఁ గావించె వందనములఁ–జేసి యీరీతి నారదా! సిద్ధమానీ! ౩౧౨

తే. ''లోకములకెల్ల నాదివి, లోకజాల–ములను బుట్టింతు, వవ్వాని పోషణంబుఁ
జేయుదువు, వానినెల్ల నోశివ! మహేశ!–సంహరింతువు నీవె విశ్వస్వరూప!

తే. సకలసంపదలను బొంది జగములందు
నీవె వెలుఁగుదు, యువకుఁడ వీవె, వృద్ధుఁ
డవును నగుదువు, బ్రహ్మవై యద్వితీయుఁ
డ వయియుందువు వరద! యో భవ! సురేజ్య! ౩౧౪

సీ. జితచంద్రకోటిరుచిప్రచయంబయి వరతుషారప్రభ వఱలుచుండి
యర్ధచంద్రునిచేత నాభాసితంబగు సుందరముఖపంచకేందులలిత
మయి, కాంతి విలసిల్లునట్టి శిరోభాగ మొప్పార దివ్యసరోజ్జ్వలమణి
భుజగభూషణములఁ బొలుపారుచున్నదై బ్రహ్మాదిసురవరప్రణుతదివ్య

తే. పదసరోజయుగంబయి ప్రథితమయి య–చింత్యమై వెల్గుచున్న నీ సిద్ధరూప
మును మనంబున నునిచి వినయమునను–వందనంబులఁ గావింతు భక్తినభవ!

సీ. ఎవ్వారు నిను భక్తి నీభువిఁ బూజనంబును జేయువారలో పుణ్యచరిత!
ఎవ్వారు నీనామ మేపారు ముదమున గానంబొనర్తురో గరళకంఠ!
యెవ్వారు భక్తితోనేని యభక్తిచేనైన జపింత్రు నీ యమలమంత్ర,
మవ్వారలెల్లరు నపవర్గమును జేరి యానంద మెప్పుడు ననుభవింత్రు

తే. త్వత్పదంబును బొంది యంతట, మహాను-భావ! ప్రభువర! పశుపతీ! యీ వసుమతి
దీనులకు నీవుతప్ప నేదిక్కు గలదు-ఓ జగద్రక్ష! రక్షింప నురుకరుణను!" ౩౧౬

క. ఈవిధమున నంది నుతిం-గావింపఁగ శంకరుండు కరుణించి మునీ!
"నీ వభిలషింతు వెయ్యది-భావంబున, నంది! యిత్తుఁ బ్రార్థింపఁదగున్." ౩౧౭

చ. అని దయతోడఁ బల్కఁ దమి నంది మనంబున నంది, "దేవ నే
ననయముఁ ద్వత్సమీపమున నాదృతి దాస్య మొనర్చువాఁడనై
యునికియుఁ, దావకీనపదయుగ్మముఁ గాంచుచుఁ బ్రీతి నుక్కియున్
ఘనమతిఁ గోరువాఁడఁ, గృప నామెడ నుంచి యనుగ్రహింపవే." ౩౧౮

చ. అని కొనియాడ నంది, విభుఁడైన మహేశుఁడు "వత్స! నీవు కో
రిన వరవాంఛితంబుఁ గడు దృప్తి నొసంగెద, నింకమీఁద న
త్యనుపమమై సురాదులకు నందఁగరాని మదీయసన్నిధిన్
గనుము నివాస మెప్పుడును గారవమొప్పఁగ నందికేశ్వరా! ౩౧౯

క. భవదీయమయిన స్తోత్రము-భువి నేమానవులు పఠనమును భక్తిమెయిన్
దవిలి పఠింతురు, వారికి-భువనత్రయమున నశుభము పొసఁగదు లవమున్.

తే. స్తవము నిద్దానినిఁ బఠించు సాధుజనులు-మర్త్యలోకంబునందు నెమ్మది వసించి
శుభములనుబొందియంతసంస్తుతమనీషు-లయి సుఖంతురు మోక్షమునంది తుదిని.

చ. ప్రమథులయందు శ్రేష్ఠుఁడవు, ప్రజ్ఞ యనంతము నీకుఁ, గావునన్
సుమతి! మదీయలోకమున సూనృత! మామకసన్నిధిన్ వసిం
పుము, ప్రమథాధిపత్యమును బూనుము, భక్తుఁడవైతి నాకు, నే
మమునఁ బ్రియుండవై యిచట మాన్యత నంది సతంబు నెమ్మదిన్." ౩౨౨

తే. ప్రమథులకు నాథుఁడై నంది పరమశివుని-వరమహిమచేత నిట్లు తపస్వివర్య!
నారదా! వెలుఁగొందెఁ దా గారవమున,-వినుము శంకరు చరితంబు విస్తరింతు."

వ. వెండియు నమ్మహాదేవుండు నారదునితో నిట్లు చెప్పందొడంగె. ౩౨౪

ఏడవ అధ్యాయము

సతీశివుల విహారము

సీ. ''అంత మహేశ్వరుం డత్యంతకామప్రపీడితుండై సతిఁ బ్రీతిఁ జేరి
ప్రమథులఁ గడు బలవంతుఁడౌ నందిని గని యానతిచ్చె ''నోగణములార!
నాయాజ్ఞఁ బూని మీ రీమెడకును దూరమున నివాసంబును ననువుమీఱఁ
గావించుకొనుఁడు, శీఘ్రమున నందు వసింపుఁ, డెప్పుడు తలఁతు మి మ్మేను, నపుడె
తే. రండు నాసన్నిధికిని గరంబు వేడ్క,-వినుఁడు, నాయాజ్ఞ లేక యేరును మదీయ
నిలయమును జేరఁగూడదు నిశ్చయముగ,-నెట్టితఁడైన నియ్యది హితవుగాదు.''

చ. అని శివుఁ డానతిచ్చుటయు నా ప్రమథావళి శంకరాజ్ఞ భ
క్తిని శిరమందుఁ బూని, వసతిం గడువేగమ యీశ్వరాలయం
బునకును గొంతదూరమునఁ బూన్కి రచించి, నివాస మాస్థలం
బును విడి చేరి రెంతయుఁ బ్రమోదము మీఱఁగ, నంత నారదా! ౩౨౮

తే. విజనమైనట్టి యచ్చోటఁ బ్రియము మీఱ-శంకరుఁడు కోర్కితీఱంగ సతిని గూడి
పగలు రాత్రియు ననక సంబరముతోడఁ-గ్రీడఁ గావించుచుండె సంప్రీతి మాని!

తే. ఒక్కతఱివన్యపుష్పంబులక్కజముగఁ-దెచ్చి రమ్యహారమాలికఁ గ్రుచ్చి ప్రియము
వెలయఁగాఁ గౌతుకమ్మునఁ బ్రియసతికిని-శంకరుం డిచ్చి తమిఁ జూపు సౌష్ఠవంబు.

తే. ఒక్కసమయాన నీశ్వరుండొప్పుఁగులుకు-వికసితసరోజమునుబోలి వెలయు నాత్మ
సుందరీముఖమును బ్రేమఁ జొక్కి మిగుల-నాదరంబున స్పృశియించు నతివ మెచ్చ.

ఉత్సాహ. ఒక్కతఱిని గహ్వరముల నుత్సవంబుతోడ నిం
కొక్కతఱిని బుష్పవాటికోల్లసద్వనాళి నొం
డొక్కతఱి సరస్తటముల నుల్ల ముల్లసిల్లఁగా
నక్కజముగ సతినిఁ గూడి హాయి నొందు శివుఁ డొగిన్. ౩౩౦

ధ్రువకోకిల. శివుఁడు చూపును ద్రిప్పఁ డించుక సేపుఁ బ్రేయసి యా సతిన్
దవిలి యుండునుగాని యన్యముఁ దాఁ గనం డొకయింతయున్,
శివునిఁ గాంచునుగాని దృష్టిని జెందనీయదు వేఱువ
స్తువుఁ గనన్ సతి యించుకైనను జొక్కి మోహము పెంపునన్. ౩౩౧

సీ. సతితోడఁ గూడి యా శంభుండు కైలాసమున కేగు నొకతఱి ముదముతోడ,
నొక్కసమయమున నుర్వీధరవరంబునం దెచ్చటికో పోవు నతిప్రియమున,
హిమశైలమందుఁ బ్రస్థమున సతీయుతుండయి విహరించుచు ననువుమీఱ
భోగంబులెల్లను బొందుచు నిచ్ఛమై వెలయ నుండెను బదివేలయేండ్లు,

తే. పగలు రాత్రియు నిది యని భావమందు-గణన సేయఁడు, నారదా! కామవశత
నొంది యత్యంతహృష్టుఁడై యుత్సుకతను-గ్రీడ లొనరించుచుండె సంప్రీతితోడ.

చ. సతియుఁ ద్రిలోకమోహిని తుషారశిలోచ్చయశృంగమందు స
మ్మతిఁ బ్రియుఁడైన శంకరు స్వమాయను మోహితుఁ జేసి, క్రీడలం
దతులితరీతిఁ దోడ్పడి ప్రియంబునఁ దృప్తి వహించుచుండె న
ద్భుతమగు భంగులం బ్రియుని బుద్ధిఁ దలంచి మెలంగి నారదా! ౩౩౩

మేనాదేవి సతిని గొలుచుట

తే. సమయము నెఱింగి మేనకాసతి సతీప-దాబ్జసన్నిధి కనుదినం బరిగి ప్రార్థ
నంబుఁ జేయుచునుండెఁ గరంబు భక్తిఁ-బుత్రికాభావమున సతంబును మునీంద్ర!

సీ. మేనకాదేవి తా మిగుల భక్తిని శంకరార్ధశరీరిణి నర్చనంబుఁ
గావించె, నుపవాసకలిత యాచు మహాష్టమిని వ్రతారంభంబు నొనరఁ జేసి
యొక్క వత్సరకాల ముపవాసమున నుండి మరల మహాష్టమి సురుచిరముగఁ
బూజించి వ్రతము సంపూర్ణంబుగ నొనర్చె, నావ్రతంబునఁ దృప్తి నంది దేవి
తే. శంకరప్రియపత్ని ప్రసన్న యయ్యె
భూధరేంద్రుని సతి మది పొంగునట్లు,
వర మొసఁగెఁ "బుత్రినై యుద్భవంబు నొందఁ
గలను నీయందు నిక్కంబుగను" నటంచు. ౩౩౪

క. సతి యొసఁగిన వరమున క-ద్భుతముగ సంతసము నొంది భూధరనిలయ
స్థిత యయి యహర్నిశం బా-సతి నంబను గొలుచుచుండె సంధ్యలయందున్.

క. నారదమునీంద్ర! దక్షుం-డారయఁగా లేక శంభు ననుదినమును దా
నూరక నిందయొనర్చుచు-గారవమును గోలుపోయెఁ గడు మోహితుఁడై. ౩౩౫

క. నిందించును దక్షుఁడు తా-సందేహము లేక యెపుడు, శంభుఁడు డెందం
బందు నతని మాన్యునిగాఁ-గం దలఁపక కడపుచుండెఁ గడునప్రీతిన్. ౩౩౬

తే. ఉభయులకు నిట్లు మనములం దుద్భవిల్లె-నద్భుతంబగు వైర, మయ్యది తలంప
నలవికానిది నారదా! యార్యులయిన-వారలయ్యుఁ బరస్పర వర్తనవిధి. ౩౩౭

నారదుఁడు దక్షుని కడకు వచ్చుట

తే. అంత నొకనాఁడు బ్రహ్మకు నాత్మజుఁడగు
నారదుఁడు వచ్చి యోమునినాథ! యిట్లు
హితము వెలయఁగఁ బల్కె సమ్మతిఁ బ్రజాప
తియగు దక్షునితోడఁ దృప్తిఁగనుకీతి. ౩౪౦

మ. "వినుమా! దక్ష! ప్రజాపతీ! శివుని వేవే నిందఁగావింతు వే
దినమంతైనను, దానఁ గ్రుద్ధుఁడయి యా దేవాదిదేవుండు నీ
కనుమానంబును లేక చేయును గదుం గష్టక్రియ, ల్లాని నా
యస్యన నేఁ దెల్పెదఁ జిత్తగింపు, మటుపై నాత్మేచ్ఛ వర్తింపనా. ౩౮౧

తే. భూతగణములతోడ శంభుండు నీదు-పురిఁ బ్రవేశించి నిన్ను, నీపురముఁ, గులము
భస్మమొనరిచ్చు భస్మాస్థి వర్షణమున,-స్నేహమునఁ దెల్పినాఁడను, సిద్ధ మిద్ది.

మ. ఎఱుఁగం జెప్పితి నెల్లవృత్తమును, నీ వెట్లోపుదో తత్ప్రభర్,
బెఱుసుల్గాని మహేశు కృత్య మెటులన్ వే శాంతి చేకూఱునో,
వెఱఁగుం బొందక, మంత్రిసత్తములతో విశ్రాంతి యోజించి యే
కొఱ రాకుండుటకై ప్రయత్నము లొగిన్ గూర్పంగనౌ దక్షతన్." ౩౮౩

క. అని హితవు మీఱ నారద-ముని దక్షునిఁ గూర్చి పలికి మురమర్దనునిన్
వినుతించి నభోమార్గం-బునఁ జనెఁ దన నిలయమునకు మునిజననాథా! ౩౮౪

దక్షుఁడు తన మంత్రులతో యోజించి యజ్ఞంబు చేయఁబూనుట

సీ. దక్షుం డమాత్యసత్తముల నెల్లను గూర్మిఁ బిలిపించి కొలువుండి లలితభణితి
వచియించె "నో మంత్రివరులార! మీరలు సతతంబు హితచింత సలుపునట్టి
వారలయ్యు మదీయవైరిచేష్టితమును దెలియంగలేకున్కి కలిగె నకట!
నారదముని వచ్చి నాకు వృత్తాంతంబుఁ దెల్పినాఁ డిట్లు విస్తృతముగాఁగ,
తే. భూతగణములతోడ శంభుండు మన పు
రంబునకు వచ్చి భస్మరక్తంబులఁ గురి
యించునఁట, సంశయంబు లేదింతుకయిన,
నాదృతిం జూపఁ డఁట క్రూరుఁడై కడంక. ౩౮౫

ఆ. మంత్రులార! మీరు మదిని యోజించి యీ
విషయ మెల్ల నిపుడు విశదముగను,
నేది చేయఁదగునొ, హిత మెయ్యదియొ దానిఁ
జెప్పుఁ డెల్లవారు నొప్పుగనఁగ." ౩౮౬

క. దక్షుని వాక్యంబులను న-నుక్షణమే మంత్రులెల్లను న్విని మౌనీ!
యక్షీణభయాకులురై-దక్షునితోఁ బల్కి రిట్లు తాత్పర్యమునన్. ౩౮౭

చ. "అవినయ మేదియుం గలుగ దాత్మలయందున మాకుఁ జూడఁగా,
సువిశదబుద్ధిమంతుఁడవు, శుద్ధిమదగ్రణి వీవు సర్వశా
స్త్రవితతవిద్వరిష్ఠుఁడవు, శంకరుఁ డీసుఁడు దేవదేవుఁ డే
మి వితగఁ దా నమంగళము మించి యొనర్చునె నిర్దయాత్ముఁడై! ౩౮౮

క. ఏవిధమునఁ జరియింపక-శ్రీవిభవము లందఁగలమొ చిత్తంబున సం
భావించి యానతీఁదగు-నోవిభు! రచియింతు మదియె యుక్తమటంచున్."

క. అని మంత్రు లెల్ల వినయం-బునఁ బల్కఁగ దక్షుఁ డాత్మబుద్ధిఁ దలఁచి యి
ట్లనియెను వారలఁ గనుఁగొని "వినుఁ డో మంత్రివరులార! వివరింతు నిఁకన్.

సీ. యజ్ఞంబుఁ గావింతు, సకలనిర్జరుల నాహ్వానంబుఁ జేయుదు వరుస, భూత
చయనాయకు శ్మశానసంవాసియౌ శివుఁ బిలువను, యజ్ఞేశు విష్ణుదేవు
సకలాంతరాయవారకుఁగాఁగ యజ్ఞరక్షణకునై ప్రార్థించి కడఁక మఖము
సాగింతు, నీరీతి సవనపుణ్యక్రియా ప్రారంభమున నుండఁ బరమపుణ్య
తే. కర్మసంయుతమగు నా నగరము నెట్టు-లదరి భూతాధినాథుఁడౌ నాదిశివుఁడు
చేరరాఁగలవాఁడో నిశ్చింతి "ననుచుఁ-బల్కఁగా మంత్రు లవ్వాక్యపద్ధతి విని.

క. "రాజవరేణ్యా! మీమది-యోజించినయట్టి భావ మొప్పఁగ భద్రం
బై జగమునందు మిక్కిలి-రాజితమగు" ననిరి ప్రియము రంజిల్లంగన్. ౩౫౨

సీ. అంతట దక్షుండు యజ్ఞసంరక్షకై పాలసముద్రంపుఁ బారమునకు
నరిగి యందు వసించు యజ్ఞక్రియాభిసంరక్షణాకారుఁను, దక్షు విష్ణు
భక్తిపూర్వంబుగాఁ బ్రార్థించె, నప్పుడు భగవంతుఁడైన యా పరమపురుషుఁ
డాతని ప్రార్థన మాలించి యాదృతిఁ దా సుప్రసన్నుఁడై తఱలి తన్మ
తే. ఖంబు రక్షింపఁగా మానసంబునందు-నెంచి తత్పురమునకు వెన్వెంటఁ జేరెఁ,
బిదప నింద్రాదులైనట్టి త్రిదశవరులఁ-బిలువఁబంచెను దక్షుఁడు వేడ్కమీఱ.

తే. బ్రహ్మదేవుఁడు, దేవర్షివరులు, విప్ర-గరుడగంధర్వకిన్నరవరులు, దైత్య
పర్వతేంద్రులు, బ్రహ్మర్షివరులు మున్ను-గల్గువారలఁ బిల్చెఁ దత్క్రతువునకును.

క. మది ద్వేషాతిశయంబునఁ-బాదల సతీశివులఁ బిల్వఁబూనక, మఖసం
పదఁ గనవచ్చిన త్రిదశస-ముదయముతోఁ బల్కె వేడ్కఁ బొంగుచు నంతన్.

క. "ఈ యజ్ఞమహోత్సవమున-కాయీశ్వరు, నతని సతిని నాహ్వానము నేఁ
జేయఁగలే, దిట భాగముఁ-బడయఁగ నెవ్వారు రారొ వారలు వరుసన్. ౩౫౬

క. భాగబహిష్కృతు లగుదురు,-యాగంబున నాదిపురుషుఁడగు హరి రక్షో
ద్యోగమున నుండె, నిర్భయు-లై గుములుగ రండు చూడ యజ్ఞమహంబున్."

ఉ. దక్షుఁడు పల్కు పల్కుల నుదారత నిర్జరముఖ్యు లెల్ల సం
ప్రేక్షకులయ్యు స్వాంతముల భీతిలి, యా శివశూన్యమౌ సభన్,
రక్షకుఁడై జనార్దనుఁడు రాజిలు నిచ్చట నంచుఁ జూచి ప్ర
త్యక్షముగాఁగఁ జేరిరి భయంబుల వీడి సకౌతుకాత్ములై. ౩౫౮

ఆ. శంకరుండు తప్ప సకలసురాసుర-వరులు వచ్చి రటకు, వరుస నదితి
బిడ్డ లెల్లవారుఁ బ్రీతి విచ్చేసిరి-సతి యొకర్తు తప్ప సంభ్రమమున. ౩౫౯

తే. అదితిబిడ్డల నెల్లర నాదరించి-దక్షుఁ డిచ్చకు మెచ్చిన తగిన వస్త్ర
భూషణసమూహముల నిచ్చి పొసఁగ సంత-సంబు గలుగంగఁ జేసె బల్సంబరమున.

క. కులపర్వతసదృశంబై-విలసిలె నన్నంబు, మౌని! విను మట క్షీరం
బులు పెరుగులు నేతులు పెం-పొలయ మహానదులమాడ్కిఁ బూర్ణత వెలసెన్

చ. క్రతువునకైన వస్తుతతి కల్పితమై నెలుఁగొందెఁ, జూడఁగా
నతిశయమై రసాదులు మహాబ్ధులపోలిక, నన్యవస్తువుల్
క్షితిధరతుల్యతం బరఁగి చిత్తములందుఁ గొఱంత లేక యా
తతముగ యజ్ఞశాలఁ బ్రథితంబయి చూడఁగనొప్పె నత్తఱిన్ ౩౬౨

మ. మునినాథా! విను మంత దక్షుఁడు మఖంబున్ జేయఁగాఁబూనె, మే
దిని దా వేదికయై చెలంగె, నపు డెంతే వైభవం బొప్పఁగా
ననలుం డంతట హోమకుండమున నత్యచ్ఛంబులై యూర్ధ్వభా
గనితాంతప్రసరార్చులన్ బొదలె నిష్కంపప్రభావంతుఁడై. ౩౬౩

తే. వేదపారనియుక్తులై వెలయునట్టి-వార లెల్లరు వచ్చిరి వరుసతోడ,
యజ్ఞ మామఖవేదిపై నరుగుదెంచి-తానె విలసిల్లె నారదా! ధీనిధివర! ౩౬౪

దక్షదధీచిసంవాదము

తే. ధీనిధిప్రవరుండు దధీచి మౌని-యచటఁ బరమేశు శంభుని నరసి లేని
జాడ మది నెంచి దక్షుని చాయఁ జూచి-పలికె నిట్టులు గంభీరభణితి మిగుల.

క. "ఓదక్ష! బుద్ధిమద్వర!-నీదగు యజ్ఞంపుఁబెంపు నెగడె నపూర్వం
బై దివ్యమై, మఱెప్పుడు-లే దెంమును, నింకమీఁద లేదని తలఁతున్. ౩౬౬

క. సకలామరులు తమంతటఁ-బ్రకటితగతి వచ్చి యజ్ఞభాగంబుల ను
త్సుకతఁ గొని సక్రమంబుగ-నకలంకత సంతసింతు రౌనని యిచటన్. ౩౬౭

తే. లోకమందునఁ గల ప్రాణిలోక మెల్ల-దక్ష! నీయజ్ఞమును జూడఁ దరలివచ్చి
చేరియున్నది తృప్తి పెంపారుచుండ,-నయిన నొక్కటి ప్రశ్నింతు నవధరింపు.

క. త్రిదశులకును బ్రభువై, సం-పదలకు నాథారుఁ డగుచు భాసిలు శివుఁ డీ
సదమునఁ గనఁబడఁడేలొకో!-మదిఁ దెలియఁగఁ దెల్పుదక్ష! మహితగుణాఢ్యా!"

చ. అనవుడు దక్షుఁ డిట్లనియె నమ్మునితోడ "దధీచి! యమ్మహే
శునిఁ బిలువంగనైతిని విశుద్ధగుణక్రియ మంగళంబునై
తనరెడు నీమఖంబుఁ గనఁ దాను సమర్థుఁడు గాఁ డటంచుఁ బెం
పున మది నెంచి చూచి మునిపుంగవ!" యన్న దధీచి యిట్లనున్. ౩౭౦

చ. ''వివిధములైన రత్నములఁ బెట్టి యలంకరణంబు చేసినన్
భువిని నజీవమౌ తనువు భూషితమై వెలుఁగొంద దే క్రియన్
సువిశదమౌచు, నట్లె శివశూన్యత వర్తిలు యజ్ఞ మారయన్
శవములతోడ నిండిన శ్మశానముగాఁగఁ బ్రజాపతీ! యగున్." ౩౨౧

కం. అనుచు దధీచి మునీశ్వరుఁ-డనఁగా దక్షుండు కనలి యమ్మునినాథున్
గని పరుషభాషణంబుల-ననె నీవిధముగను నప్పు డతిసంభ్రముఁడై. ౩౨౨

కం. ''నినుఁ బిలువనంపి రెవ్వరు?-చనుదెంచితి విటకు నెట్లు? చనునే దుష్టా!
పనివడి నిన్నెవరడిగిరి?-యనయంబున నిట్లు వాగ, దర్హమె విప్రా!'' ౩౨౩

కం. అని దక్షుఁడు పలుకంగా-మునివరుఁడు దధీచి యంతఁ బూన్కి వచింపం
గను హితవాక్యంబుల ద-క్షునిఁ గని విను మనుచుఁ బూనె శుద్ధమనీషన్.

కం. ''పిలిచినను బిలువకున్నను-నలుసుగ నెంచినను దుష్ట! యజ్ఞంబున కి
మ్ముల వచ్చినాఁడ, నీకున్-దెలిపెద, వినెదేని, నాదు దివ్యహితంబున్. ౩౨౫

కం. శంకరునిఁ బిలువనంపుము-శంక మనమునందు లేక సత్త్వాంచితుఁడవై,
యింక మదీయహితోక్తుల-బింకంబును వదలి నెఱపు ప్రీతియుతుఁడవై. ౩౨౬

కం. ఎందైనను నిష్ఫలతన్-బొందును శంకరుఁడు లేని పూర్ణమఖం, బే
సందియము లేదు వేదం-బుం దెలియని విప్రుభంగి భువి నోదక్షా! ౩౨౭

సీ. శంకరరహితమౌ సవనంబు చూడఁగా నర్థంబు లేని వాక్యంబుపోల్కి,
త్రిపథగ లేనట్టి దేశంబుభాతిని, పతిహీనమైనట్టి భామినివలె,
సుతులు లేని గృహస్థుగతితో సమంబయి, ధనవిహీను మనోరథంబుపోల్కి,
దర్భ లేనట్టి సంధ్యావందనముచాయ, తిలలు లేని నివాపసలిలముఁబలె,
తే. హవిసు లేనట్టి హోమతుల్యంబు నగుచు-నిష్ఫలంబయి నశియించు నిజము దక్ష!
హరియె శివుఁడగు శంభుఁడే హరియగునని-యాత్మ నెఱుఁగంగఁ జాలవే యమలచిత్త!

కం. హరికిని శివునకు భేదం-బరయంగాఁ గలదె యెందునైనను, నెవఁడే
బరుసములు వల్కు భేదత-నిరవుగ నిందార్హుఁడగు నహీనచరిత్రా! ౩౨౯

తే. హరిని నుతియించి శివుని నిందార్హవాక్య-సమితిఁ దిట్టిన, శంకరు సంస్తుతించి
హరిని నిందింప, నిర్వురందర యనర్క-రయినఁ గరుణింపఁగాఁ జాలరతిముదమున.

చ. శివునిఁ బరాభవింపఁగను జిత్తమునందుఁ దలంచి యజ్ఞమున్
దవిలి యొనర్చుచున్న నిను దప్పక శంభుఁడు క్రోధమూర్తియై,
భువనములెల్ల నాకులతఁ బొందఁగ నీసవనంబు నాశనం
బవు నెటు లట్లు చేయు, నిజమంచుఁ దలంపుము నాదువాక్యముల్.'' ౩౩౧

చ. అనుచు దధీచి పల్కఁగనె యాగ్రహ మొప్పఁగ దక్షుఁ డమ్మునిం
గని "యిటు లేల పల్కెదు? మఖంబును రక్షణసేయువాఁడు లో
కనిచయరక్షకుండు హరి, కన్గొను, ప్రేతధరిత్రి నుండు శం
భునివగు నష్టచేష్ట లెటు పోలును? నా యెడ సంయమీశ్వరా! ౩౮౨

తే. ప్రేతభూమిప్రియుండగు భూతనాథుఁ-డొక్కఁ డో నామఖముఁ జేరి యుక్కమీఱ
నేని హరి చక్రముం గాని యేపడంపఁ-గలఁడు నీ శివు, నేమనంగఁగల వింక?"

క. అనఁగా దధీచి దక్షునిఁ-గని "భగవంతుఁడగు శివుఁడు కన నవ్యయుఁడౌ
ననుమాన మేల? నీవలె-ననుకొంటివె మూఢుఁ డని యనర్థక! మదిలోన్?

మ. క్రతుసంరక్షను జేయు దేక్రియ జగత్కల్యాణు భావింప? కు
ధ్వలితో యుద్ధ మొనర్తు వా శివునితోఁ దానే జగంబెల్ల మో
హితుఁ గాఁ జేయుఁ ద్వదీయహేతువున నిల్లెల్లన్ నిజంబంచుఁ ద్వ
న్మతి నూహింతువు, నీదు కన్నులనె గానన్వచ్చు శీఘ్రంబునన్." ౩౮౫

తే. అనుచు దక్షునితోడ నమ్ముని దధీచి-పలికె, నంతట నారదా! వరతపస్వి!
వినుము తర్వాతివృత్తాంతమును" నటంచు-నమ్మహాదేవుఁడు వచించె నవ్విధమున.

క. "ముని పల్కిన పల్కులు ద-క్షునకును వినరాని వగుడుఁ గ్రోధారుణలో
చనుఁడై దక్షుఁడు తనవా-రిని గని "యెడఁగలుగ విప్రవృద్ధుని నిపుడే. ౩౮౭

తే. తఱుమ నగు"నని తెల్ప, నత్తాపసవరుఁ-డగు దధీచి దక్షుని గాంచి యనియె నిట్లు
"లోవిమూఢ! దూరంబున నుండురీతి-నన్నుఁ బంపుదె? తెలియవే మన్ను మిన్ను?

క. దూరుఁడవైతివి శుభముల-కారయ, శివకోపజనితమై తగు దండం
బే రద్దపడినఁ బడఁగల-దోరి! వడిన్ నీతలన్ మహోద్ధతిఁ గుమతీ! ౩౮౯

దధీచి క్రతుసభామధ్యమునుండి వెడలుట

తే. సంశయింపఁగఁ బనిలేదు స్వాంతమున" న
టంచు ముని కోపమునఁ గన్ను లరుణరూప
మునను మధ్యాహ్నరవికాంతి నెనయఁ బల్క
యాసభామధ్యమున నుండి యరిగె నపుడె. ౩౯౦

తే. ఆమహాముని వెన్వెంటఁ జ్యవనవామ-దేవగౌతమదుర్వాసులౌ వరముని
ముఖ్యు లీశ్వరతత్త్వసంపూర్ణవిదులు-సభను విడి లేచిపోయి రాశ్చర్యముగను.

చ. మునివరు లెల్లవారు మఖముం గననొల్లక లేచిపోవ, బం
ధునిచయసూక్తిరీతిని గ్రతుప్రవరంబును జేయ దక్షుఁడున్
దన మది నిశ్చయించి ద్విగుణంబగు దక్షిణ లిచ్చి శిష్ట వి
ప్రనివహముం దమిం దనిపి భ్రాంతినొనర్చె నుపక్రమింపఁగన్. ౩౯౨

తే. నారదమునీంద్ర! యజ్ఞంబు నారయుటకు
బంధుజనమెల్ల నరుదెంచి ప్రబలియుండెఁ,
గాని సుతయైన సతిని దాఁ గ్రతువునకును
బిలుచుకొనిరాఁడు దక్షుండు ప్రియము మెఱయ. ౩౯౩

తే. క్షీణపుణ్యుం డగుటచేతఁ జిత్తమందుఁ
బరమశక్తియు నాత్మయౌ ప్రకృతిమహిమ
మెన్నఁజాలక దక్షుండు భిన్నబుద్ధిఁ
గలిగి యవమాన మొనరించెఁ గడఁక, నపుడె. ౩౯౪

క. మాయాస్వరూపయయి య-త్యాయతశక్తిని వెలుంగునట్టి ప్రకృతియున్
స్వాయత్తమయిన మాయ న-మేయక్రియ మోసపుచ్చె మిగులఁగ దక్షున్

వ. అంత. ౩౯౬

పరమేశ్వరి దక్షునిగుఱించి తాఁజేయఁదగిన కార్యము నుద్దేశించుట

తే. హరవసతియైన కైలాసగిరి వసించి-సకలము నెఱుంగు జగదంబ స్వాంతమందు
దక్షువర్తన మెల్లను దాఁ గని తల-పోసె శివపార్శ్వసీమను బూన్కి నిలిచి.

సీ. "గిరిరాజవరపత్ని సురుచిరభక్తితోఁ బ్రార్థించె మును బ్రీతి రాజిల నను
బుత్రికాభావంబు బొలుపార వినయంబునను, నట్టితతిని యేనును గరంబు
సంతృప్తినంది నిశ్చయముగా జన్మంబు గాంతును సుత నయి, కౌతుకంబుఁ
గలిగింతునని మేనకకు వరం బిచ్చితి, దక్షుండుఁ దొల్లి తాఁ దపముచేసి,

తే. తనకుఁ బుత్రికగాఁ బుట్టఁగను వరంబుఁ-గోరె,నపు"డీవు తృప్తితోఁ గోర్కె తీఱ
సంశయముఁ బూన కేను నిశ్చయము గల్గి-జనన మందుదుఁగాని నీ స్వాంతమందు.

ఉ. నాపయి నాదృతిం గలిగి నన్నుఁ గనుంగొనుదాఁక నుందు నీ
పాపగ, నంతమీఁదఁ గృతపాపుఁడవై తగు నిన్ను మాయచే
వ్యాపితుఁ జేసి నీతనువుఁ బాయుదు, నిక్క" మటంచుఁ దెల్పితిన్.
బ్రాపయి వచ్చెఁ గాల మది భావనసేయఁగ నిప్పు డెంతయున్. ౩౯౯

క. దక్షుఁడు మందాదరుఁడై-ప్రక్షీణంబైన పుణ్యవశమున నన్నున్
వీక్షించె నహంభావుం-డై క్షేమము నొందలేక యభిమానముచేన్. ౪౦౦

క. నిజలీలన్ దత్తనువును-ద్యజియించి హిమాద్రిగేహమందుఁ దమింగాం
చి జనిం బ్రాపైక ప్రభు-త్రిజగత్పతి పత్ని నగుదు స్థిరవిభవమునన్." ౪౦౧

క. అనుచు మహేశ్వరి దక్షుని-తనయ తలఁచి యొక్కక్షణము తాను బ్రతీక్షిం
చెను దక్షయజ్ఞనాశన-మును గూర్చి మనమునందుఁ బూనికతోడన్. ౪౦౨

నారదమహర్షి కైలాసమునకు వచ్చుట

తే. అట్టి సమయంబునందు దక్షాలయంబు-నందునుండి శివుం డున్న యచలమునకు
బ్రహ్మసుతుఁ డగు నారదవరతపస్వి-యరుగుదెంచె మహేశ్వరు నరయువేడ్క.

తే. దేవదేవుని ముక్కంటి దివ్యభక్తి-తోడ ముమ్మాఱు వలఁగొని, ''దురితదూర!
దక్షుని మఖంబుఁ జూడఁగాఁ దరలివచ్చి-రెల్లవారుఁ దదాహ్వాన మెంచి ప్రీతి.

తే. సురలు, మనుజులు, గంధర్వవరులు, కిన్న-రోరగులుఁ, బర్వతంబులు వారువీ ర
నంగ నేల? లోకత్రయసంగతమగు-ప్రాణిసముదాయ మెల్లను వచ్చె నటకు

సీ. దక్షుఁ డందఱఁ బిల్చెఁ దన సప్తతంతువుఁ గనుఁగొన రమ్మని కరము ప్రీతి,
మిముఁ బిల్వఁడయ్యెను, మీరలు లేనట్టి యాప్రజాపతిపురం బారసి, కడు
దుఃఖంబుతోడ నుత్సుకతను బోనాడి యాపట్టణము వీడి యపుడె కదలి
వచ్చినాఁడను మీ నివాసంబునకు దేవ! మీ రచటికిఁ బోవ మిగులఁ దగును,

తే. నాలసింపకుఁ'' డన, శంభుఁ డనియె ''మాకు-నా మఖంబునఁ బనియేమి? యతని కెట్టు
లాత్మ కింపగు నారీతి యజ్ఞకార్య-మంతయును దీర్పఁగాక! యా చింత వలదు.''

తే. అనుచు శంభుండు పలుకఁగా నంత నార-దమునిచంద్రుండు ''శంకరా! దక్షుఁ డధ్వ
రంబు నీయవమానంబె సంబరమునఁ-గోరి చేయఁగఁ గావించుఁ గుటిలుఁ డగుచు.

క. లోకములకెల్ల నప్పని-ప్రాకటమగునట్టి పరిభవంబుగ నెసఁగున్,
నీకయిన భంగ మెంచఁగ-లోకమునకుఁ గాదె చూడ లోకాధిపతీ! ౪౦౮

చ. త్రిదశపతీ! త్వదీయమతిఁ దీవ్రముగాఁ గని యజ్ఞభాగముం
గొదువ యొకింత లేనటులఁ గోరక మీఱి గ్రహింపనౌను, నీ
కది రుచియింపదేని వెస నచ్చట విఘ్నము లుప్పతిల్లున
ట్లదయతఁ జేయు, మవ్వలను నయ్యెడి దే యగుఁగాక యీశ్వరా!'' ౪౦౯

ఉ. నావుడు శంకరుం డపుడు నారదుతో ననె ''దక్షుఁ డేల సం
భావనచేయుఁ దన్మఖపు భాగములం దమి మాకు నిచ్చి? నేఁ
బోవఁగనొల్ల, నాప్రియయుఁ బోవదు చూడఁ దదధ్వరం, బిఁకే
త్రోవ తదీయచిత్తమునఁ దోఁచు, నదే క్రియఁ బోవనౌ'' ననన్. ౪౧౦

తే. నారదుఁడు శంకరుని వాక్యవారము విని-యంతఁ దత్పత్నియగు సతీకాంతపాద
పద్మములకును బ్రణమిల్లి పలికె నిట్టు-''లంబ! నీతండ్రియింట యజ్ఞంబు జరుగ.

క. పోవఁగ నుచిత మటంచును-భావింపఁగరాదె తల్లి! భావంబున నె
ట్లీ వూరకున్నదానవొ-కో! వాంఛల వదలి విరహితోత్సుకమతివై. ౪౧౨

క. కన్నియ తండ్రిగృహంబున-జన్నము జరుగంగ వినుచుఁ జనక యచటి కె
ట్లున్నతధైర్యముఁ గొని తా-నున్నె పతిభవనమందె యుచితరీతిన్? ౪౧౩

సీ. నీసోదరీమణు లనుపమానందంబుతోడ నెల్లరు వచ్చి కూడియున్న
వార లాయజ్ఞంబు నారయు వేడుక, నపరిమితంబులైనట్టి భూష
ణావలిచే వారి భావంబులకు సంతసంబును గల్గించె సంబరమున
నమ్మ! నీజనకుండు, సమ్మతి నిను బిల్వనంపక నాదృతి నమితగర్వ
తే. మునఁ జెలంగుచునున్నాఁడు మనమునందు,-నీవు కనుఁగొని తద్దర్ప మెల్ల నాశ
నంబుఁగావింపవలె జగదంబ! యేది-తగిన కృత్యమొ దానినిఁ దలఁచి యిపుడె.

ఆ. శివుఁడు పరమయోగి, చిత్తంబునం బూజ-నంబు, నవమతియు సమంబుగాఁగఁ
దలఁచు,యజ్ఞమునకుఁ దలఁపఁడు,తద్విఘ్న-మాచరింపఁదలఁపఁడాత్మయందు."
తే. అని సతీదేవితోఁ బల్కి యంత నారదముని శంకరు పాదపద్మంబులకును
వందనముల నొనర్చి తద్వసతినుండి-వెడలిచనె దక్షమఖశాల నరయు కోర్కె.

ఎనిమిదవ అధ్యాయము

సతీదేవి యజ్ఞమునకుఁ బోవ శంకరు నడుగుట

ఉ. నారదమౌనిపల్కుల వినంగనె దక్షుని పుత్త్రి నెమ్మదిన్
గోరిక లుప్పతిల్ల జనకుం డొనరించు మహాధ్వరంబుఁ దా
నారయు వేడ్కతో నటకు నప్పుడె వెళ్లఁగ నెంచి, శంకరుం
జేరి, ముదంబు మీఱఁగను జెంతనె నిల్చి ప్రియోక్తి నిట్లనెన్. ౪౧౭

సీ. "దేవదేవ! మహేశ! దివ్యచిత్తంబున నవధరింపుఁడు నాదు ప్రార్థనంబు,
జనకుఁడౌ దక్షప్రజాపతి యపరిమితంబైన వస్తుసంతతులఁ గూర్చి,
కడు వేడ్కతోడ సత్క్రతువు చేయుచునున్నవాఁడఁట, యద్దాని వాంఛతోడఁ
గనుఁగొన నిర్వురమును మన మచ్చోటి కరుగుట న్యాయ్యమై పరఁగు ననుచు
తే. నామదికిఁ దోఁచుచున్న దోనాథ! యజ్ఞ
శాల విలసిల్లు మనకు సుసంభ్రమమునఁ
దగిన సమ్మాన మొనరించు మిగుల" ననుచు
సతి వినయమునఁ దెల్పఁగా శంకరుండు. ౪౧౮

ఉ. "ఓరమణీ! సతీ! యిటుల నుల్లమునందుఁ దలంపరాదు సు
మ్మారయఁ బిల్పు లేక యెటకైనను బోవుట చావుకున్ సమం
బౌ, రహితోఁ బరాభవము నాతఁ డొనర్చును దర్ప మొప్పఁగా,
గారవ ముంపఁ, డెంతయును గానఁ డెదన్ మనలన్ బ్రియంబునన్. ౪౧౯

తే. యక్షవిద్యాధరకులంబునందు దీటు-లేనివాఁడ నటం చెన్ని లీలతోడ
మెలఁగుఁ, గావున దక్షుని నిలయమునకు-బోవరాదెప్పుడైన నో పువ్వుబోణి!

మ. తరుణీ! నన్నుఁ బరాభవించు మతితో దక్షుండు యజ్ఞంబు సం
బర మొప్పంగను జేయువాఁ, డచటికిన్ వాంఛన్ గనంబోవరా
దారిమన్ నేనును, నీవు, వెళ్లినను నం దొక్కమ్మడిన్ జేయు దు
ర్భరమైనట్టి యవజ్ఞ నీజనకుఁడే, భావింపు ముద్యన్మతిన్. ౪౨౧

తే. శ్వశురభవనంబునకుఁ బోవవచ్చు, నచట-గౌరవము గల్లు నట్లైనఁ గాంత! మేలు,
గౌరవములేనిచో నందుఁ జేరఁజనుట-మరణమునకంటె మిన్నయౌ మదికిఁగనుము.

తే. మామగృహమున నల్లుండు మదిని గోరు-నెంతయు సమాదరంబును సంతసమున,
మామయును నల్లునింగాంచి ప్రేమ వెలయఁ-దనసదనమున మర్యాదఁదనుపవలయు.

ఆ. ధర్మహాని యగును తరుణి! యల్లుని మామ-తగిన గౌరవమునఁ దనుపఁడేని,
నిక్కమని తలంచి నిచ్చలు నల్లుని-యం దవజ్ఞ విడువనగును మామ. ౪౨౪

సీ. అల్లునిపై మామ యాగ్రహంబును బూనఁ గడు ఘోరపాతక మడరి పొందుఁ,
గావున ద్వేషంబుఁ గడఁకఁ వర్జింపనౌ నల్లునిపై విజ్ఞుఁ డయిన మామ,
యల్లుండు మామకు నప్రియం బెప్పుడుఁ జేయంగరా, దొగిఁ జేసెనేని
బహుజన్మసాహస్రపర్యంతమును నిరయంబునందునఁ బడి యడఁగు మిగులఁ,
తే. బోవఁగాఁదగ దవమతిఁ బొంది యల్లుఁ-డెప్పుడయినను శ్వశురుని యింటికి, విను
ముత్సవముతఱిఁ బోవఁగానొప్పు నెటులు?-తెలియఁజాలవె ప్రియసతీ! దివ్యభక్తి.

క. ఎచ్చోటికైనఁ బోవన్-వచ్చునె పిలువకయె? మరణవైఖరి యది యౌ,
నిచ్చఁ దెలిపితిని, దగునే-ముచ్చటతో శ్వశురిసద్మమునకుం జనఁగా? ౪౨౬

ఆ దక్షుఁ డెపుడు నన్నుఁ దా గౌరవంబునఁ-గనఁడు దానఁ దద్భవనమునకును
బోవనొల్ల, నిపుడు పోయిన నాకగుఁ-బరిభవంబు, నిజము పలుకు లేల? ౪౨౭

సీ. అల్లుని మామ సమాదృతి నెంచిన ధర్మప్రజాపతితతి చెలంగు,
నప్రీతితోఁ జూడ నల్లున కెప్పుడు హానియే కలుగు నత్యంతతముగఁ,
గావున నీతండ్రి గావించు క్రతువర్యమునకుఁ బోవఁగఁజాల, ముదిత! సతము
దుఃఖాత్ముఁడని, దరిద్రుఁడని నిందించును దక్షుండు గుఱుతను దలఁపక మదిఁ,
తే. బిలువకయె యజ్ఞమున కేను బ్రీతి నరుగ
నెట్టియవమతి కలుగునో యెఱుఁగలేవె?
పిలువకుండుట, యామీఁదఁ బలుపలుకులఁ
బడుటయును మామయింట నోర్వంగనగునె? ౪౨౮

ఉ. అల్లుని రాకఁ గాంచి కడు హర్షము పొంగఁగ మామ యాతనిన్
సల్లలితోక్తులం దనిపి శక్తికి మీఱని రీతి గౌరవం
బుల్లసిలన్ సమర్చనముఁ బూనిక నొనర్చుట ధర్మహాని గా
దెల్లెడ, నిట్టి ధర్మము విధించిరి పెద్దలు లోకమందునన్. ౪౨౯

క. సురపూజిత! పరమేశ్వరి!-యరుగున యే బుద్ధిమంతుఁడైన నవజ్ఞన్
విరచించునట్టి యజ్ఞము-నరయంగాఁ జనుటకును బ్రయత్నముతోడన్? ౪౩౦

తే. అట్టు లగుఁగాన నీతండ్రియజ్ఞమునకు-మనము పిలువకయే పోవ నను వుగాదు,
మనమునందున విపరీతమును దలంప-కాత్మ క్షమియింపఁగోరెద నతివ! నిన్ను."

క. అని శంకరుండు పల్కఁగ-విని సతి "సత్యంబు నాథ! విహితార్చనమున్
మనకుం గావించును గ్రతు-వున కరిగిన నామతండ్రి పూజ్యత" ననఁగాన్.

సీ. శంకరుం డనియె "నో సతి! నీదు తండ్రి యంతటివాఁడు గానోపఁ, డటకు మనము
పిలువకయే పోవఁ బ్రియమున మనలను గనుఁగొని సంప్రీతి గారవంబు
సలుపంగఁజాలఁడు, సాధ్వి! సభామధ్యమున నెన్నఁడైనను మనకుఁ బూజ
గావించునే తృప్తి గలిగినవాఁడయి? నాపేరు విన్నంత నోపిక మది

తే. లేక కనలుచు నిందించుఁ బ్రాకటగతిఁ-దాను రేయింబవల్లు దుర్మాని యగుచు,
నేవిధంబున నెన్నితి వీవు తరుణి!-యతఁడు పూజించు నని స్వాంతమందుఁ జేర్చి?"

క. అని శంభుఁడు సత్యంబును-ఘనముగఁ దెలుపంగ, సతి ముఖంబును గనువాం
ఛను శంకరుఁ గని వినయం-బున నిట్లని పలుకఁదొడఁగెఁ బూనికమీఱన్.

ఉ. "దేవ! మహేశ! నీమదికిఁ దృప్తివహించినఁ బొమ్ము లేనిచోఁ
బావనయజ్ఞముం గనెడు భావము మానుము నీదు చిత్తమే
యేవిధి మాన్య మంచుఁ గను నేర్పడఁ జేయుము, నా కనుజ్ఞ సం
భావనతోడ నిమ్ము, నినుఁ బ్రార్థనచేయుదు భక్తితోడుతన్. ౪౩౫

తే జనకభవనంబునను మహోత్సవన మధిక-వైభవంబున జరుగఁగాఁ బ్రాభవంబుఁ
దక్కఁ యేరీతిఁ బుత్త్రిక ధైర్యమూని-నిలువఁజాలును దన భర్తృనిలయమందు?

క. పూజింపఁదగనివారలు-పూజలుగొనఁ బిల్వునంది పూజార్హ యదే
యోజను ధైర్యముఁగొని తా-నీజగతి న్వేడ్కతోడ నింట వసించున్? ౪౩౭

తే. పిలువకయె పోవరా దంచుఁ దలఁపవలయు
నితరుల గృహంబులకు నోమహేశ! యెపుడు,
మనమునందున నాహ్వానమును దలఁపక
తండ్రియింటికిఁ బోవఁగాఁ దగును బిడ్డ. ౪౩౮

తే. శంకరా! ప్రాణవల్లభా! చనవుమీఱఁ-జేయు నా ప్రార్థనంబును జిత్తగించి
యనుమతింపుఁడు తండ్రిగృహంబునందు-యజ్ఞమును జూడఁబోవఁ గృపార్ద్రదృష్టి.

చ. ప్రియముగ నాదురాకఁ దనివిం గని నన్ను సమాదృతిన్ సభా
లయమున గారవించు, బహుళంబుగ నప్పుడె నాదు తండ్రికిన్
నయముగఁ దెల్పి యామఖమునన్ భవదర్థముగాఁగ హవ్యసం
చయమును గారవంబుగ నొసంగెదు రీతి నొనర్తు వల్లభా! ౪౪౦

క. మతిచెడి నాయెదుట నినుఁ-గృత మెఱుఁగక నిందచేసెనేని తదీయా
ద్భుతసత్త్వతంతునాశన-మతులితగతిఁ జేయుదాన నపుడె నిజముగన్." ౨౨౧

క. సతి యీక్రియఁ బల్కఁగ శివుఁ-"డతివా! యెప్పుడైన నటకు నరుగఁదగదు, నీ
పిత సమ్మానముచేయఁడు,-మతి సత్యం బనుచు నాదు మాటఁ దలఁపవే! ౨౨౨

క. వినరాని పల్కులన్ నీ-జనకుఁడు దూషింప నన్ను సహియింపక యీ
య్యనఁ బ్రాణంబుల వదలుదు,-వనుమానము లేదు, సత్య మతివా! యిందున్."

తే. శివుని వాక్యములన్ విని చింత లేక-"యోమహాదేవ! నీ వాజ్ఞ నొసఁగినను నా
సంగకున్ననుజనుదునాజనకునిగృహ-మునకు,యజ్ఞంబుఁ జూడఁగా"ననిన నంత.

వ. శంకరుండు వెండియు దాక్షాయణితో నిట్లు పలుకందొడంగె. ౨౨౩

సీ. "నావాక్యమును మీఱి నను మాటిమాటికి జనకుఁడు సేయు యజ్ఞమును జూడఁ
దద్గృహంబునకు నెంతయుఁ జను వేడ్కతో నన్నుఁ బ్రశ్నించుదానవు ప్రియసతి!
సత్యంబుగాఁ బ్రయోజన మేది యటఁ గల దెఱిఁగింపు, ముత్తరం బిత్తు నిపుడె,
యవమతిఁ గోరు దురాత్ములె యచటికిఁ జనుదు రపూజ్యత గనుట కలరి,

తే. సతి! యపూజకుఁ డొనరించు సత్క్రియఁ దలఁ
పఁగ నసత్క్రియ యగు నను పలుకు వినవె?
మాన్యులగువా రపూజకమందిరమున
కరుగ రెప్పుడుఁ దత్కృతం బరసి మిగుల. ౨౨౪

చ. నను గడు నిందసేయు వచనంబులు పుట్టఁగ నందు నీకు నె
ట్లనువుపడున్ వినంగఁ? దమి నచ్చటి కేక్రియఁ బోవుకోరికన్
మనమునఁ దాల్చి తివు? బుధమాన్యుఁడె దక్షుఁడు చూడఁ? దన్నికే
తనమున కేల పోయెదవు తన్వి!" యనంగను నార్య యిట్లనెన్. ౨౨౫

తే "శంకరా! భవదీయదూషణము చెవుల
యందుఁ బడునట్టి ప్రాప్తిలే, దయిన నాకు
నట్టి యిచ్ఛయు లేదు, దేవా! మఖంబుఁ
గనఁగఁ గోరికఁ జనుదు యజ్ఞంబునకును. ౨౨౬

సీ. అఖిలదేవతల నాహ్వానించి నినుఁ బిల్వకయె మహాయజ్ఞంబు ఘనతతోడ
జరపుట యేరీతి సమ్మాన మనఁజను, నద్దాన నవమతి యయ్యె నీకు,
గర్వంబుతోడ యజ్ఞంబును నాతండ్రి గావించినను బ్రజ గను నదెట్లు!
యజ్ఞభాగంబుల నవనియందిఁక నెట్లు శ్రద్ధతో నొసఁగు నే జనుఁడయినను!

తే. మదిని నీకారణంబెల్లఁ బదిలపఱచి
యజ్ఞవాటంబునను ద్వదీయానుమతి

నైనఁ బని యజ్ఞభాగంబు నందుము, నటు
గానిచో ధ్వంసము నొనర్తుఁ గ్రతువునెల్ల." ౪౪౯

క. అని సతి పలికిన శంకరుఁ-డనువునఁ దద్యత్నమెల్ల నపుడె నిలుపఁగా
మనమునఁ దలంచి కరినో-క్తిని హితవుగఁ బల్కె వడి సుధీజను లెన్నన్.

తే. "ఓమహాదేవి! నామాట నొక్క-యింత-యేని వినవు, యత్నంబును బూని విడువ,
వార్య! దుర్బుద్ధి తోలుత నకార్యము వడిఁ-జేసి, నిందలఁ దాఁ బొంది చింతలబడు.

క. నామాట యేల! నీమది-కేమాడ్కి రుచించు నట్లు లేగుము, నిన్నున్
నామాట మీఱుదానిని-గా మనమున దక్షకన్యకా! గనినాఁడన్." ౪౫౨

వ. నారదునితో మహాదేవుండు నెండియు నిట్లు చెప్పందొడంగె ౪౫౩

తే. "శంకరుం డిట్లు పలుకఁగా సతి మనమునఁ
గ్రోధమును బొంది కన్నులు క్రూరతరము
లగుచు నెఱ్ఱగఁ గనఁబడ నంత నొక్క
క్షణము యోజించి యీశ్వరు చరిత మెల్ల. ౪౫౪

తే. "పత్నివై యుండు మని నన్ను బ్రార్థనంబు
సలిపి మును నన్నుఁ బొందెఁ దా సతిని గాఁగ
నిపు డధిక్షేపమును జేయు నెంత యడిగి
కొన్నఁ జూపింతు మత్ప్రభావోన్నతి నిఁక." ౪౫౫

దేవి శంకరునకుఁ దన మహిమఁ గనఁబఱచుట

తే. ఇట్టు లనుకొనుచుండఁగా నీశ్వరుండు
క్రోధసంపూర్ణవిస్ఫురితాధర, లయ
దహనసమనేత్ర దేవిని దాఁ గనుగొని
కన్నులను మూసికొనియె నాక్షణమునందె. ౪౫౬

తే. భయదదంష్ట్రాస్య యగుచు సాధ్వసము హరున
కపుడు గల్గంగ దేవి తా నట్టహాస
మును నొనర్చ మహేశుండు ముగ్ధునివలె
నతిభయాకులతను బొందె నంతమీఁద. ౪౫౭

తే. నయనముల విప్పి కష్టంబునను శివుండు
దేవిఁ జూడంగ భయదస్వభావ యగుచుఁ
గనఁబడియె, నారదా! యట్టె కనుచునుండ
నాక్షణమునందె యాదేవి యాగ్రహమున. ౪౫౮

వ. బంగారుపట్టంబును వదలి వృద్ధావస్థయం దొప్పుచున్నదయి, దిగంబరయు, నసమకాంతివిరాజితయు, విలసత్కేశపాశయు, లలజ్జిహ్వికయుఁ, జతుర్భుజయుతయుఁ, బ్రళయకాలానలజాజ్వల్యమాన దేహయు, స్వేదసంమిళిత తనూరుహయు, ఘోరరూపయు, భయంకరసంరావయు, ముండమాలికావిభూషితయు, నుదయార్కశతకోటిప్రభాయుతయు, నవతంసితార్ధచంద్రమకుటయుఁ, గిరీటదీప్తిశోభితమస్తకయుఁ దన శరీరకాంతులచేఁ బ్రకాశితంబగు నతిభయంకరాకారంబుతోడ శివుని యెదుటఁ బొడకట్టి, భూనభోంతరంబులు భేదిల్లునట్లు మహాట్టహాసంబుఁ గావించి పైకి దుముక నున్నదియో యనునట్లు వెలుంగుచుండ ౪౫౯

మ. మనమందున్ ధృతి వీడి శంకరుఁడు తన్మాహాత్మ్యముం గానలే
క నితాంతాద్భుతకార్యసంవలితయా కాంతన్ విలోకించి యే
యనువున్ యోజనచేయఁజాల కపు డత్యంతంబు భీతాత్ముఁడై
తనకున్ దిక్కెవ రంచు దిక్కుల విముగ్ధత్వంబునం బాఱఁగన్. ౪౬౦

సీ. దాక్షాయణి మహేశు తత్త్వంబు మది నెంచి
తద్భయం బెడుపఁగాఁ దలఁచి యపుడు
సాట్టహాసంబుగా సాధ్వసంబు జనించు
నట్టులు గొంతెత్తి యధికరవము
తోడుత "శంకరా! కూడదు పర్వెత్త,
భయమును వదలుము, భ్రాంతి యేల?"
యనుటయు నాస్వన మత్యంతభీతిని
శంభుండు విని యందు క్షణము నిల్వఁ

తే. బాలిక దిగంతముల కేగ స్వాంతమందుఁ
దలఁచి వేగంబుతోఁ బాఱెఁ గలఁతపడుచు,
నంతయును గాంచి తన పతియందుఁ గరుణ
గలిగి సతి తద్భయముఁ దీర్పఁ దలఁచి మదిని. ౪౬౧

తే. అధికవేగంబుతోఁ బాఱునట్టి భర్త
యెదుట సాక్షాత్కరించి మహేశి యంత
నేదిశకుఁ బాఱుఁ దన పతి యాదిశ వడిఁ
గనఁబడఁగ నెంచి దశరూపకలిత యగుచు. ౪౬౨

చ. భయదను గాంచి యేదిశకుఁ బాఱును శంకరుఁ డాదిశన్ బరే
శియు నతిభీప్రదాకృతిగఁ జేరి కనంబడె, నొండు దిక్కు భీ
తియుతము గాని లేదుఁ గన దృష్టి కగోచరమౌట నేత్రముల్
భయమున మూసి యచ్చటఁ బ్రభావము డీల్పడ నిల్చె నంతటన్. ౪౬౩

సీ. తన యగ్రభాగంబునను శ్యామవర్ణయు, స్ఫురదబ్జసంకాశముఖవిరాజి
తయు, మందహాసాంచితయుఁ, బీనసుస్తనద్వయయు, దిగ్వాసయుఁ, దతభయప్ర
దాయతనయనయు, నతిముక్తకేశియు, నర్కకోటిసమప్రభాంచితయును,
దక్షిణాభిముఖస్థితయు నయి నాల్గుభుజములఁ గానఁగనయ్యె చాన, యంత
ఆ. శంకరుండు చూచి సాధ్వసం బుప్పొంగ-''నెవతె వీవు తెలుపు మిపుడు శ్యామ
లాంగి! నామనోవిహారిణి సతి యెందుఁ-జనియెఁ, దత్త్వమెల్ల శాంతి''సనిన.

సీ. ''ఓమహాదేవ! నీ వాగిఁ గాంచఁజాలవే? నీ యెదుటనె సతి నిలిచియున్న
దానను, నను భవత్స్వాంతంబునందున మఱచితే? నేనె యీమాడ్కి భువిని
గాళియుఁ, దారయుఁ, గమలయు, లోకేశి, భువనేశ్వరియు, మఱి పూజ్యయయిన
ఛిన్నమస్తయు, షోడశియు, సుందరియునాఁగ ధూమావతియు, బగళాముఖియును,
తే. వరుస మాతంగి యనియును బహువిధములఁ
బరఁగు నామంబులను భువిఁ బ్రథిత నగుదు''
ననఁగ శంకరుఁ డాదేవిఁ గని భయమును
వదలి పల్కెను నప్పుడు పదిలముగను. ౪౬౫

తే. ''ఓజగద్ధాత్రి! నాపయి నురుదయాఢ్య
వైనచో నట్టి నామంబు లవని నెట్టు
లొందితివొ విస్తృతముగాఁగ డెందమునకుఁ
దెలియ నానతి యి''మ్మన దేవి పలికె. ౪౬౬

సీ. ''నీసమ్ముఖమునందు నిలిచి కృష్ణశరీరయై, భీమనయనయై యలరుఁ గాళి,
యూర్ధ్వంబునందు శ్యామోరుశరీర మహాకాళిరూపిణి యనెడు తార,
వామేతరంబున భీమభయప్రద శీర్షవిరహితయా ఛిన్నమస్త,
వామభాగంబున వఱలి యత్యంతంబు హృష్టయై తగు భువనేశ్వరి శివ!
తే నీ వెనుకభాగమున శత్రునికరసూది-నీమహాశక్తి తగు బగళాముఖి యగు,
నగ్నికోణమునఁ వివిధాకృతి గల-దేవి యమ్మహావిద్య ధూమావతిగద! ౪౬౭

సీ. నీకు నైరృతియందు నెలకొన్న దేవియే త్రిపురసుందరి యనఁ దేజరిల్లుఁ,
ద్వర్వాయుకోణవిభాసిత యగు విద్య మాతంగకన్యక మాననీయ,
యీశాన్యభాగమం దెసఁగు మహావిద్యయగును షోడశి యనునట్టి దేవి,
యేను భయంకరాకృతితో వెలింగెడు భైరవి యనుదాన, భయము విడుము,
తే. శంకరా! వీర లుత్కృష్టశక్తియుక్త-లై బహువిధాకృతులతోడ నలరుచుందు,
రధికభక్తిని భజియించునట్టివారి-కఖిలపురుషార్థములఁ గూర్తు రనవరతము.

తే. సమధికంబగు నిష్ఠతో స్వాంతమందు-భజనగావించు సాధకప్రకరమునకు
మదిఁగలుగు కోర్కెలెల్ల నెమ్మది నొసంగు-వార లగుదురు శంకర! వామదేవ!

తే. మారణోచ్చాటనములు, స్తంభనము, క్షోభ
ణంబు, విద్వేషణము, ద్రావణంబు, మోహ
నంబు, వశ్యంబు మున్నగుచుం బరఁగెడు
నిష్టముల నెల్లఁ గూర్తురు హృష్టలగుచు ౪౭౦

తే. గోపనీయంబులగు నివి కొసరి యెప్పు-డైనను బ్రకాశన మొనర్ప ననువుపడవు,
వీని మంత్రంబులను హోమవిధుల యంత్ర-కవచపూజా స్తవాదుల క్రమములెల్ల.

సీ. ఆచారముల, వాని కనువగు నియమంబులను, బురశ్చర్యాదు లగు విధాన
ములను సాధకబృందములకును నీవెగా దెలుప శక్తుఁడ, వింక ధృతి మఱెవరు
వచియింపఁగాఁగలవారలు గలరు? మహాదేవ! తావకంబైన వాక్య-
యాగమంబయి లోకమందు ఖ్యాతిని గాంచు, నాగమంబును వేదమును మదీయ
తే. బాహుయుగమయి భాసిలుఁ బ్రమథనాథ!-సకలమయినట్టి స్థావరజంగమాత్మ
కంబగు జగంబు నెల్ల నాగమనిగమము-లే వహించును, సత్యమా నిది మహేశ!

ఆ. ఎవఁడు మూఢబుద్ధి నీరెండిటిని మీఱు-నెప్పుడైన భ్రాంతి నెనసి, వాఁడు
హస్తములు దొలంగి యట్టె క్రిందను బడు,-వాఁడు నిజముగా నవారితుఁడగు.

క. నిగమాగమములె హేతువు-లగు శ్రేయంబులకుఁ జూడ నతిదుర్ఘటతన్
దగి, యూహింప నశక్యము-లగు దుర్జ్ఞేయములు బుధజనావళికైనన్. ౪౭౪

తే. అంతమే లేని నిగమంబు నాగమంబు-మీఱి చరియించువాఁడు న న్నిగుల సేవ
చేసినను లేదు వాని రక్షించునట్టి-శక్తి నాకు, నిజం బిది శంభుమూర్తి! ౪౭౫

క. మదిఁ జర్చించి విభేదం-బాదవ దనుచు నిశ్చయించి యొగిఁ దద్ధర్మం
బుదితప్రజ్ఞఁ దొనర్చు న-విదితుండయి భ్రాంతిఁ గనఁడు భేదం బెపుడున్. ౪౭౬

క. ఎవ్వరు సాధకు లగుదురొ-యవ్వారే వైష్ణవులని యఖిలసభలలో
నివ్వటిలి, మదర్పితమతి-నివ్వసుధ సమాహితులయి యెసఁగుదు రభవా! ౪౭౭

తే. గురు వొసంగిన మంత్రంబు వరకవచము-యంత్రమును బ్రకటింపంగ ననువుగాదు,
కరము యత్నంబుతోడ రక్షణము చేయఁ-దగును శివ! సాధకుం డెట్టితఱినయినను.

చ. అరయ గురూపదిష్టమయినట్టి మహామనుముఖ్యమున్ మదిన్
దిరముగ నిల్పఁగావలయుఁ, దెల్విని వీడి యెవండు బుద్ధిను
ర్వరఁ బ్రకటించు, వాని కశుభంబగు, సిద్ధిని బొందఁ డెన్నఁడున్,
సరవిని మంత్రరక్షణము సల్పఁగనౌ మది నెంచి శంకరా! ౪౭౯

క. ఈ తార్క్ష్యం బోశంకర!-నీకుఁ దెలుపఁబడియెఁ, బూజనీయమనీషా!
నీకుం బ్రియతమ నగుదును,-నాకు నతిప్రియుఁడవైన నాథుఁడ వీవున్. ౪౮౦

తే. చనుదు నాతండ్రియైన దక్షప్రజాప-తికిని గర్వంబు నడఁపఁగాఁ దివిరి యిపుడె,
యీవు చనకున్నచో నాకు నిమ్మనుజ్ఞ-ప్రాణనాయక! తడయక పరమకరుణ.

క. ఇది నాయిష్టము, దీనికి-మది ననుమతిఁ జూపవలయు, మానినచో నే
వదలక జనకుని యజ్ఞము-మొదలంట నశింపఁజేయఁబూని యరిగెదఁ." ౮౮౨

తే. వినుము నారద! యీమాఁది వృత్తమెల్లఁ
దెలియఁబలుకుదు" నని మహాదేవుఁ డిట్లు
చెప్పఁదొడఁగెను "సతి యిట్లు శివునిఁ జూచి
పలుకఁగా, విని శంకరుం డులుకుఁ జెంది. ౮౮౩

క. ఘోరనయనయగు కాళిని-నారసి, తా భీతిభీతితోఁ బ్రైడై యిట్లనియెఁ
"గారవమున నిను నిఖిలా-ధారను నాద్యయగు విద్యఁ దలఁతు శక్తియుతఁ. ౮౮౪

తే. సకలమునకింటెఁ బరయగు శక్తిగాఁగఁ-దెలిసినాఁడ, స్వతంత్రత వెలయు నీకు
విధినిషేధంబు లెవ్వఁడు విపులమగు మ-నంబుతోఁ జేయఁగలవాఁడు శంకరి!

తే. దక్షుఁ డొనరించు యజ్ఞంబు నీక్షణమున-ధ్వంస మొనరింప నరుగంగఁ దలఁచితేని,
వలదనుచు నిన్ను వారింపఁగలదె నాకు-శక్తి, యీవిషయమునందుఁ జర్చసేయ?

మ. పతిభావంబున నిన్నుఁ గాంచి యటులం బల్కంగి నేఁ బూనితిఁ,
మతి నీ కప్రియ మించుకే పొసఁగినఁ, మన్నింపఁగానౌను, స
మ్మతితో నో మహనీయమూర్తి! యెది సంభావింతువో చిత్తమం
దితరంబుం ద్యజియించి చేయు మది నో యిష్టంబుగా నీశ్వరీ!" ౮౮౭

చ. పరశివుఁ డీక్రియం బలుక భావమునందుఁ బ్రియంబు నంది సం
బరమున మందహాసము విభాసిల నానన సీమయందు శాం
కరి జగదంబ శంభుఁ గని క్రమవచస్సులఁ దెల్పె నిట్లు "శ్రీ
శ్వర! చెలువొందఁగాఁ బ్రమథవారముఁ గూడి వసింపు మిచ్చటఁ. ౮౮౮

సతి దక్షుని యజ్ఞముఁ గాంచ వెడలుట

తే. ఇపుడు నాతండ్రిగృహమున కేను బోదు-యజ్ఞమును జూడఁగా" నను నంతలోన
నూర్ధ్వవిలసితతారనా నొప్పు దేవి-యాజగద్ధాత్రియందు నైక్యమును బొందె.

తే. అష్టదిశలందు వెల్గు మూర్త్యష్టకంబు
హరుఁడు గనుఁగొనుచుండఁగా నా పరాంబ
యందుఁ జేరి యంతర్హిత లైరి, క్రతువుఁ
జూడఁ జనఁగోరు నీశ్వరిఁ జూచి శివుఁడు. ౮౯౦

చ. ప్రమథులతోడ నిట్టులని పల్కె "సురోత్తములార! దివ్యసిం
హము లయుతంబుఁ బూన్చి బహుహారిమణిద్యుతిరాజితంబు, భ

వ్యమగు రథోత్తమంబుఁ గాని వైళము రండు, పరాంబ దక్షయ
జ్ఞమును గనుంగొనంగఁ జను సన్మతిఁ బూనె" ననంగ నప్పుడే. ౪౯౧

చ. ప్రమథులకెల్ల ముఖ్యుఁడగువాఁడు వశీ బదివేల సింహవ
ర్యములను బూన్చినట్టి వరరత్నమహారథ మట్టె తాను సి
ద్ధముగ నొనర్చి తెచ్చెఁ, దమి దానిని గాంచి పరాంబ "యద్రితు
ల్యము, బహురత్నవారసువిలాసిత మియ్యది చూడ నెంతయున్. ౪౯౨

తే. బహువిధపతాకముల చేత భాసమాన-మగుచు సమలంకృతంబయి యఖిలదిశల
వెలుఁగు, నియ్యది మారుతవేగవస్తు-గాయుతవిరాజమానమై కడు సొబ"గని.

తే. కనుఁగొనుచు నుండఁ, బ్రమథులకును నధిపతి
యయిన నందీశ్వరుఁడు దేవి నపుడు రథము
మీఁదఁ గూర్చుండఁ బ్రార్థింప మిగుల దయఁ బ
రాంబ యరదంబుమీఁదఁ దా నధివసించె. ౪౯౪

చ. అరదముమీఁద నెక్క జగమంతయు భీతినిఁ బొందునట్లు భీ
కరమగు రూప మొప్పఁగను గాళి వెలుంగుచు నుండె, మేరుభూ
ధరశిఖరోత్తమంబుపయిఁ దార్కొనియున్న ఘనాఘనంబునాఁ
బరఁగి, యుగాంతమందునఁ బ్రపంచము ద్రింగెడురీతి నంతటన్. ౪౯౫

క. మతిమంతుఁడు నందీశ్వరుఁ-డతులితగతి రథము నడపె, నప్పుడు శివ్రుఁ డ
ద్భుతశోకక్లేశార్తిని-గతి గోపక గోదనంబు గావించె మునీ! ౪౯౬

తే. అతిభయంకరరూపయై యరదముపయి
నరుగుచున్నట్టి క్రోధరక్తాంబకముల
వెలుఁగు కాళికఁ గాంచి యీ విశ్వమందుఁ
గల సకలదేహులును భీతిచలితు లయిరి ౪౯౭

చ. భయమునఁ జండరశ్మి ధరపైఁ బడు భీతి నటంచు నబ్ధు లెం
తయును గలంగె, వ్యాకులతఁ దాల్చెను దిక్కులు, సప్తవాయుసం
చయము రవిప్రవిష్టమయి క్ష్మాస్థలి వీచెను దుస్సహత్వరన్,
లయ సమయంబురీతి ననలక్షణముల్ పొడకట్టె నత్తఱిన్. ౪౯౮

క. ఉల్కలు వేల కొలందిగ-నిల్కడ లే కిలను బడియె నిష్ఠురగతితో,
నల్కఁగొని దేవి యరుగఁగ-నూల్కొను విధ మడఁగి రథమునన్ నంది వడిన్.

తే. నడపఁగ క్షణార్ధమునఁ జేరెఁ గడు భయంబుఁ
గలుగఁ జేయుచు దక్షుని నిలయమునకు,
భీకరాకృతి సతిఁ గాంచి భీతులయిరి
దక్షువసతిని గలవార లాక్షణంబ. ౫౦౦

తొమ్మిదవ అధ్యాయము

సతీదేవి తల్లిదగ్గఱకుఁబోవుట - ప్రసూతి తన స్వప్నవృత్తాంతముఁ దెలుపుట

తే. అంత దాక్షాయణీదేవి యరదము డిగి-తల్లిసన్నిధికిని బోవఁ దడయ కపుడె,
సుస్తనియు, ముక్తకేశియు, సుతయు నగు స-తీమతల్లిని గని యతిప్రేమతోడ.

మ. చిరకాలంబున కాత్మగేహమునకుం జేరంగ దా పుత్రి యం
చురుమోదంబుఁ బ్రసూతి దక్షుసతి తా నుల్లంబునం బొంది సం
బర మొప్పంగను గూర్మిపట్టి నొడిలో మాన్యాత్మయై యుంచి త
త్సరసీజాభముఖంబు నంబరముచేతన్ బ్రీతి నొత్తెం దమిన్. ౯౦౨

క. ముద్దులఁ గొనుచుఁ బ్రియంబునఁ-దద్దయు విలపించు చాత్మతనయను గనుచున్,
ముద్దియ ప్రసూతి సుతతో-నొద్దికమీఱంగఁ బల్కె నుల్లాసమునన్. ౯౦౩

శా. "తల్లీ! నీవు సమస్తదేవవిభుఁడౌ తత్త్వాఖ్యునిన్ శంభునిన్
హృల్లీలాస్పదుఁడైన వల్లభునిగాఁ బ్రీతాత్మవై పొంది యే
యిల్లా లందఁగరాని సౌఖ్యముల నెంతే కాంచి తోయమ్మ! మ
మ్మెల్లన్ శోకమహాబ్ధిలో నునిచి యామ్నేనుం దమిం గూడుచున్. ౯౦౪

తే. ఆద్యవయిన పరాశక్తి వమ్మ! ముజ్జ-గంబులకుఁ దల్లి వయితివి, కలిగె నాకు
సంతసము, నా యుదరమందు జననమంది-నట్టి మద్భాగ్య మెన్న మహత్తరంబు.

మ. మదిలో నున్న వియోగతాప మిపు డోమాయమ్మ! నిక్కంబుగా
వదలం గంటిని దూరమందుఁ, గను సంభావింపఁగాఁ గంటి మ
త్సదనంబందునఁ జెక్కునాళ్ల కిచటన్, ధన్యాత్మ నైతిం గదా!
ముద మొప్పారఁగ నీదు రాకవలనం బూజార్హ! యత్యున్నతిన్. ౯౦౬

చ. తెలివి యొకింత లేక భవదీయగురుండగు దక్షుఁ డాత్మలోఁ
దెలియఁగ లేక శంకరుని దివ్యవహామహిమాఢ్యు గాఁగ, వి
హ్వలతను దద్విరోధమున యజ్ఞముఁ జేయుచునున్నవాఁడు ని
శ్చలతను వీడి చిత్తమున జాడ్యము నొంది కుమారికామణీ! ౯౦౭

తే. విజ్ఞులైనట్టి మును లేము వేవిధములఁ
దెలిపినప్పటికిని మిమ్ముఁ బిలువనంపఁ
డాయె యజ్ఞంబుఁజూడఁగా నమ్మ! యేమి
యనఁగఁగలదాన" నన సతి యంతఁ బలికె. ౯౦౮

సీ. "అఖిలదేవతలకు నాదిదైవతమయి యజ్ఞేశ్వరుండయి యలరు శివుని,
దేవదేవుని ననాదృతిఁ బిల్వకయ సర్వదివిషదులను బిల్చి ధృతి మఖంబుఁ

జేయుచునున్నాఁ డమేయగర్వంబున, స్వాంతంబునం జూడ నంతరాయ
విరహితంబుగ నిది పరిసమాప్తినిఁ బొందఁగల దంచు నెన్నంగ నలవి కాదు,

తే. తల్లి! నాబుద్ధి కీక్రియ యెల్లవిధము-లను గనంబడు, నెవఁడైనఁ గను నిదేవి
ధంబుగా''నని పల్కఁ దదంబయగు ప్ర-సూతి పుత్రికతోఁ బల్కె నీతి మెఱయ.

క. ''విను మతిఘోరము, సాధ్వస-జనకము, నతిపులకితంబుఁ జర్చింపఁగ నె
మ్మనమునకు నలవికానిది-తనయా! కలఁగంటి రాత్రి, దానిఁ దెలిపెదఁ గాన ౫౧౦

సీ. నీతండ్రి దక్షుండు నిఖలదేవగణంబుతోడ యజ్ఞము చేయఁ గూడియుంట
నచటికి నొక్క మహాదేవి యీశ్వరి యభ్రవర్ణద్యుతి శ్యామయయి ది
గంబరాకృతిని ముక్తశిరోరుహాఢ్యయై యట్టహాసంబును నట్టె చేయు
చును జ్వలన్నయన విశోభిత యగుచు నాల్గు భుజంబు లొప్పార ఘోరమయిన

తే. యట్టహాసంబు చేయుచు నరుగుదెంచు
టయును,నీజనకుఁడు దేవి! భయము నొంది
కాంచి మిక్కిలివినయంబుఁ గనఁబఱచుచు
నపుడు ప్రశ్నించెనిట్టు''లోయంబ! నీవు. ౫౧౧

క. ఎవ్వతె? వెవ్వని పత్నివి?-యెవ్విధి నిచ్చటికి వచ్చి తెఱఁగింపుము'' నా
నవ్వనిత ''నీకు సుతనై-నివ్వటిలుదు సతి యనంగ నిచ్చలు నెందుఁ.'' ౫౧౨

సతి దేహత్యాగ మొనరించుట

తే. అపుడు దక్షుఁడు శంభుని ననఁగరాని-మాటలను నిందఁ జేయంగ మానివి సతి
క్రోధపరవశయై యజ్ఞకుండవహ్ని-యందుఁ జొచ్చుటయును వడి నంతమీఁద.

క. భీమాకారులు నత్యు-ద్దామక్రియులైన ప్రమథతల్లజు లటకుఁ
స్థేమంబునఁ జేరిరి స-ద్ధాములు తత్క్షణమునందె తడయక యొకటఁ. ౫౧౪

క. అతిభీమరూపుఁ డత్యు-ద్ధతలయకాలాంతకుండు తతసాధ్వసదా
ప్రతిమక్రియుఁడగు పురుషుం-డతులితగతి నటకు వచ్చి యద్భుతరీతిఁ. ౫౧౫

సీ. ప్రమథులతోఁ గూడి, క్రతురక్షణము సేయు విష్ణుప్రముఖదేవవిసరము వడిఁ
బాఱఁగా నోడించి, వరయజ్ఞమెల్లను ధ్వంసంబుఁగావించి, దక్షు శిరముఁ
గ్రూరుఁడై తా నఱకుటయు, దక్షప్రజాపతి శిరోహీనుఁడై క్రతుమహాగ్ని
కుండతటంబునఁ గూర్చుండియుండుటయును, మహోగ్రాకారులును, త్రిశూల

తే. పాశధరులు, విభూతిలిప్తనిఖిలాంగు-లును, జటాముకుటాఢ్యులు, ఘనశరీరు
లయినకౌపీనధారులుభయదులతని-దినఁగనుంకించుటయునుధృతియుతులగుచు.

తే. ప్రమథులెల్లరుఁ జెలరేగి రక్తపాన-మును నొనర్చుచు నవ్వుచుఁ బూన్కి నృత్య
మును దమిం జేయుచుండి, రాపురమునఁగల-వార లెల్లరు వ్యాకులస్వాంతులగుచు,

క. దిక్కులు తెలియక యేడ్చుచు-నొక్కట హాహారవంబు లొనరింపఁగ, లో
నక్కటికము మొసఁగ బ్రహ్మయుఁ-గ్రక్కునఁ బరమేశు శివునిఁ గనుఁగొని భక్తిన్.

తే. ప్రార్థనంబును గావించి పరమశివుని
దాను దోడ్తెచ్చి "దేవేశ! దక్షునకును
బ్రాణమొసఁగుము, యజ్ఞంబుఁ బరిసమాప్తిఁ
గరుణఁ గావింపుము ప్రసాదకలన" ననఁగ. ౧౧౯

సీ. పరమేష్ఠి చేసిన ప్రార్థనంబును మదిభావించి శివుని మర్యాద లాశ
నట్టి దక్షునకును బెట్టుటయును మేఁకతల, నటుపిమ్మట దయను జీవ
నం బొసంగుటయు నరంగ స్వప్నంబునఁ గనినదానను, రాత్రిగడచునట్టి
జామునందే తల్లి! శ్యామలవర్ణవు, కలయందుఁదోఁచినకరణి నుండు

తే. దాన వరుతెంచితివిగద మా నగరము-నకును, నీకమీఁదను గలలోనఁ గనినట్లు
దక్షునకుఁ గాఁగల దటంచుఁ దలఁచుదానఁ-గలను గనినటు నిన్ను నేఁ గనుటఁ జేసి.

తే. తల్లి! కలయందుఁ గన్నది తప్పు నెట్లు?
దక్షుఁ డేరీతి శంభునిందను నొనర్చి
తత్ఫలము నందకయె పోవఁదలఁచు నింకఁ,
దెలుపుమా యెప్పుడయినను గలదె వికృతి? ౧౨౧

క. నా విభుఁడు దక్షుఁడుం ద్వర-మీవిద్వేషంబు వదలు మీరలె కనఁగా,
జీవింపుము చిరకాలం-బోవత్స! యెంకు హాని యొదవదు నీకున్. ౧౨౨

క. మాకు వియోగము గలుగుట-ప్రాకటముగఁ గలదు, మరలఁ బరఁగుఁ ద్వదీయం
బా కరుణ, జీవితంబును-జేకుఱుఁ, గలఁదోఁచె యోగసిద్ధియు ధ్రువమై. ౧౨౩

ఆ. ఎవని నీవు దయ నిరీక్షింతువో వాఁడ-శోచ్యుఁ, డతఁడె ధనియు, శుభగుఁడుండుఁ,
దల్లి నగుదు నీకుఁ, దృజియింపవలదు న-న్నెప్పుడయిన నెం దుపేక్షఁ జేసి"

ఉ. నారద! యీవిధంబున ఘనంబగు సత్క్రియఁ బొంది తల్లి చే
గారవ మొప్ప సమ్మతిని గాంచి మహేశ్వరి తండ్రిసన్నిధిన్
జేరఁగఁబోయె వేగ నిజచిత్తమునందలి కోర్కె మీఱఁగా,
నారసి యాసతిన్ బురజనావళి గుంపులుగూడి యొక్కటన్. ౧౨౪

ఉ. ఒక్కరిలోడ నొక్క రిటు లూహలఁ బల్కిరి "దక్షుపుత్రి తా
నక్కజమైన రూపమున నక్కట! తోఁచుచునున్న దేలొకో
యిక్కడ; స్వర్ణగౌరయయి యెంతయుఁ దొల్లి మనోహరాంగియై
చక్కని చుక్కరీతిని బ్రశస్తత నుండెఁగదా కనుంగొనన్! ౧౨౫

సీ. ఇపు డేమికతమొకో యిట్లు నూతనజలధరవర్ణవిభ్రాజితయు, విముక్త
నీలకేశియు, నతినిష్ఠురదీప్తేక్షణయు, భీమదంష్ట్రాయుతయు, నిరుపమ
శార్దూలచర్మవసనయు, భయంకరవరచతుర్బాహుసంవళితయు నయి
కననయ్యె'' నన గొంద, ''అనఘమహా నీయజ్ఞమండలి నిర్జరబృందసభకు

ఆ. నేమికారణమున నేతెంచినదియొ? క్ష-ణార్ధమందె జగము నంతయును మ
హాగ్రహమున మ్రింగ నట్లైవచ్చినయది''-యనుచు గొందఱన నద్భుతముగ.

క. ''గతి దక్షున కెయ్యది? యన-మతి శంభునకును నొనర్చి మాన్యత సురసం
తతిఁ గూరిచి యుద్ధతిఁ దా-గ్రవ్వును గావించుచుండెఁ, గనఁడే ఫలముల్?''

తే. అనుచుఁ గొందఱు పలుకఁగా, ''నవమతి కగు
ఫలము నొసఁగంగవచ్చె నీ భయదరూప
క్రోధమును బూని యీ క్రియ యాఢి'' ననుచు
గుజగుజలువోయి రప్పుడు కొంద ఱచట. ౨౯

మ. ''లయకాలంబున లోకసంతతుల నెల్లన్, బ్రహ్మదేవున్, హరిన్
లయమొందింపఁగ శక్తి గల్గిన జగన్మాత్రాకృతిన్ వెల్గు దే
వియె యీ నీసతి దక్షయజ్ఞమును దా విధ్వంసముం జేయు, ని
శ్చయ, మీవిష్ణు విఁకేమి చేయఁగలఁడో సంరక్షకై చూడనౌ.'' ౩౦

మ. అనుచుం గొందఱు పల్కుచుండఁగను, నయ్యాశ్యామహాదేవి యీ
శుని విద్వేషముచేత హృష్టుఁడగు దక్షుం గాంచె నాయజ్ఞశా
లను సంరంభముతోడఁ జొచ్చి, భయలీల ల్వాచి భీతిల్లి న
మ్మనము ధైర్యము వీడఁ బ్రేపికల కున్మాదంబు సంధించుచున్ ౩౧

ఆ. హవ్యభోక్తలైనయట్టి దేవతలును,-నఖిలమునిజనము, బృహస్పతియును
దేవి భయదదృష్టిఁ దిలకించి యాత్మలు-కంపమొంద నణఁకి రింపుదక్క. ౩౨

తే. దేవతలు త్యక్తకార్యులై దేవిఁ గాంచు-చును నిలిచి రందు నిశ్చలాక్షులయి చిత్ర
పటమునందున విలిఖింపఁబడినయట్టి-యాకృతులఁ బోలి యతిభీతి నంది యపుడు.

తే. దక్షుని భయంబుచేత వందనమొనర్చ-కతివిక్రమతి నుండి సురలెల్ల నాత్మలందు
సకలసంహారకర్త్రికి, సర్వశక్తి-యుతకుఁ గాళిక మ్రొక్కిరి శతవిధముల. ౩౪

దక్షుఁడు కాళికారూపంబుఁ గనుట

ఉ. అంతట దక్షుఁ డెల్ల సురు లద్భుతమొంది విచేష్టులై పనుల్
సుంతయుఁ దీర్ప కట్టె యొగి చూచుచునుండఁగ వారిఁ గాంచి, యా
వంతయు వంత లే దనుచు నాత్మఁ దలంచుచు దిక్కులెల్ల న
త్యంతవినిద్రతన్ గనఁగ నప్పుడె యొప్పుగ సమ్ముఖమ్మునన్. ౩౫

తే. కనుఁగొనెను ధూమకజ్జలఘనవినీల-కాంతిసంకలితను, క్రోధకలితరూక్ష
నయనను, విముక్తకేశిని, భయదరూపఁ,-దృక్తవస్త్రను గాళిని దక్షుఁడంత.

క. "ఎవ్వరి పుత్త్రిక వగుదువొ!-యెవ్వరి సతి వీవు! సిగ్గొకించుకయును లే
కివ్విధి వచ్చితి విచటికి,-నివ్వటిలు సతీస్వరూపనియతి కనంగన్. ౧౩౭

క. శివుని రజతాద్రియందలి-భవనంబును వీడి యిటకు వచ్చితివే! పు
త్త్రివిగాఁ గనఁబడుచున్నా,-వెవతుకవో తెలుపు" మనఁగ నిట్లనె సతియున్.

చ. "జనక! యిదేమి చిత్రము? నిజప్రియపుత్త్రికనైన యీసతిన్
మనమున విస్మరించితివె మాన్యుఁడవై యిటు లీవు? నీకు నేఁ
దనయను, నాకు నీవు మఱి తండ్రివిగావె? తలంచిచూడు, వం
దనములఁ జేయుదానను, సుతన్ గ్రహియింపుము తండ్రి! ప్రేమతోన్."

క. అని సతి ఘనమగు వినయం-బునఁ బల్కఁగ దక్షుఁ డపుడు పుత్త్రిం గని యి
ట్లనువునఁ బ్రశ్నించెను జ-య్యన నద్భుతభంగి నారదా! విను మెల్లన్. ౧౪౦

మ. "విలసత్కాంచనగౌరదేహవు, శరద్విభ్రాజమానేందుని
ర్మలసత్కాంతివి, దివ్యవస్త్రసుమశుంభద్భూషవై తొల్లి నా
నిలయంబందున నుంటి, విప్పు డిటు లీనీలాంజనాభాంగివై
వెలుఁగొందం గత మేమి తల్లి! యకటా! వే చెప్పవే యంతయున్. ౧౪౧

తే. విగతవసనవుగా నిట్లు తగునె సభకు-రాఁగ? నేఁ డిట్టి భీమనేత్రములు దాల్చి
నట్టిదానవు, హేతు వెయ్యది? విముక్త-కేశివై యుండఁగా నేల? కృతమతిసతి!

చ. తనయ! యనర్హుఁడైన పతిఁ దద్దయుఁ బొందుటఁ జేసి యీ యశో
భనమగు దుర్దశం గని ప్రభావముఁ గోల్పడినట్టిదానవే?
మనసిడి యజ్ఞముంగనఁగ మాన్యతఁ బిల్వకయున్న కారణం
బును వినవే వచించెదను, బుద్ధిఁ దలంపుము నిక్క మంతయున్. ౧౪౩

క. హరునకు సతివగుటను ని-న్నరమనురాగమునఁ బిలువఁగాలేదు సతీ!
నిరుపమమగు వాత్సల్యము-పరఁగును నీపైన నాకు, భావింపు సతీ! ౧౪౪

చ. పిలువకయుండినన్ గరము ప్రీతిని వచ్చుటచే సతీ! శుభం
బులు సమకూరె నీకు, భవదర్హము భూషలు, దివ్యవస్త్రము
ఖ్యలసితవస్తువు ల్ప్రియముగా నవె యుంచినవాఁడ, నెంతయున్
సలలితరీతిఁ గైకొనుము స్వాంతమునన్ ముదమొంది పుత్త్రికా! ౧౪౫

చ. అరయఁ ద్రిలోకసుందరివి, ప్రాణసమంబుగ నున్నదానవై,
కరము ప్రియంబు నాకు మదిఁ గల్గఁగఁ జేయుచు నుంటి, వక్కటా!

హరునకు సర్వచిత్తునకు నంగనవై కడు నింద్యవైతి, వే
కరణిఁ దలంచి చూచినను గారవ మొందఁగఁజాల వోసుతా!’’ ౧౪౬

క. ఈవిధమున దక్షుఁడు సం-భావింపక నిందసేయఁ బతియైన మహా
దేవునిఁ, దద్వాక్యంబులఁ-దా విని కోపాగ్ని పొంగ దక్షాత్మజయున్. ౧౪౭

ఉ. స్వాంతమునందుఁ దాఁ దలఁచె ‘‘శంకరు నిందయొనర్చు దక్షు న
త్యంతము మత్క్రుధాగ్నికిని నాహుతిగా నిడి వ్రేల్మిడిన్ మఖం
బంతము నొందఁజేయుదు, సురావళితోఁ బితృహత్యఁ జేయ దు
ర్దాంతమహాఘ మబ్బు నని తద్దయు మానెదఁ దద్భయంబునన్. ౧౪౮

క. దేవతలతోడ దక్షుని-నావిభవముఁ జూపి భ్రాంతి నందెదు రీతిన్
వే వెలిపింతును, నింతియు-కావలయు’’ నటంచు నెంచి క్షణమున నచటన్.

ఛాయాసతి యగ్నిప్రవేశము చేయుట

క. తనతోఁ దుల్యాకృతిగాఁ-గను ఛాయాసతిని సృష్టిగావించి, ముదం
బునఁ బలికె దానితో నొ-య్యన నావచనమును వినుమటంచును బూన్కిన్.

సీ. ‘‘నీవు నాకార్యంబు వావిరి దీర్పుము, సప్తతంతువును నాశన మొనర్చు
మతివరో! తండ్రి దుర్మతి నాదు శంకరనిందఁ దెల్పెడు వాక్యనిచయ మెల్ల
వినినదానను, నింకఁ గనరాదు దయ వానిఁ, గ్రోధంబుచేతను గూడి యజ్ఞ
కుండంబులోపల మండుచుండెడు నగ్నిలోనఁ బ్రవేశింపనా, నితండు

తే. సుతను నేనంచు గర్వించి మతిఁ దలంచు-చున్నవాఁ, డీను నిందించుచున్నవాఁడు,
వీని గర్వంబు పోవంగ వెస క్షమింప-కపుడె కావింపు మంతయు నింతి! యంత.

తే. జ్వలితవిగ్రహ వయి యిట్లు వహ్నిలోఁ బ్ర-వేశమును జేసినట్టి యావిధము నాది
దేవుఁడగు శంకరుఁడు విని భావమందు-శోకసంతప్తుఁడయివచ్చు సుదతి! యటకు.

ఉ. వచ్చినవెంటనే శివుఁడు వైరము దీర్పఁగ దేవతావళిన్
జెచ్చెర గెల్చి యజ్ఞమును నిశ్చలతన్ బరిరక్షచేయు, నా
పచ్చని యంబరంబు గల పద్మదళాక్షునిఁ బాఱఁద్రోలి వే
యచ్చెరువొందఁగాఁ గ్రతువు నంత మొనర్చి వధింపు దక్షునిన్.’’ ౧౫౩

తే. అని మహాకాళి దరహాస మాననమున-నెసఁగ ఛాయాసతిని గాంచి యిట్లు పలికి
యంత నచటఁ దిరోధానయై గగనము-నందు నిలిచెను నారదా! యద్భుతముగ.

క. భేరీమృదంగరవములు-బోరుకలగెఁ, దూర్యములు సమున్నతి చెలఁగెన్,
భూరిసుమవృష్టి కురిసె న-పారంబుగ, నపుడు మానివర! యుత్సుకతన్. ౧౫౫

తే. ఆమహాదేవికి సమీపమందు నున్న-సురలు,మునులును దన్నాయఁ జొక్కి యుంచు
కేనియును గాంచ లేరైరియిద్ధచరిత!-యంత ఛాయాసతియుఁ గ్రోధమాత్మఁబూని.

తే. దక్షుఁ గనుఁగొని పలికె "నోదక్ష! దేవ-దేవు శంకరుఁ దెలియవే భావమందు!
సతి నెఱుంగవె? యేటి కీగతిని దిట్టు-చున్నవాఁడవు బ్రహ్మవై యున్నతిఁగని!

ఉ. భద్రము లందఁ గోర్కి నిజభావమునందున నుండనేని యే
ఛిద్రము లంటనీక నడి జిహ్వను నిల్పుము వాగ్విశుద్ధికై,
భద్రకు శంకరుం బరుషభాషణము ల్వచియించు జిహ్వను
న్నిద్రతిఁ గోసివేయుదును, నిశ్చలతం గను దింక దుర్మతీ! ౧౧౮

చ. సురసభయందు శంభు మదిఁ జూడక యెప్పుడు నిందసేయు నీ
కరువుగిఁ దల్పలం బిపుడె యొప్పడఁగల్గె నటంచుఁ గాంతు, వీ
ధరణి సమస్తహేతువయి తా వెలుఁగొందు మహేశు నెవ్వఁడేఁ
బరుషములాడు వాని తలఁ బట్టి పరేశుఁడు కోయు నుద్ధతిన్." ౧౧౯

క. అని ఛాయాసతి యనఁగా-విని దక్షుఁడు క్రోధమూని వెస రోసమునో
డను బల్కె "విమతి! బాలిక!-యనరా దిఁక నట్టి వాక్కు లబలా! మఱలన్.

సీ. ప్రేతభూమినివాసు, నాతతదుశ్శీలు నెఱుఁగుదు బాగుగా నెపుడు శివుని,
నా భూతగణపతి నాత్మేశుగా నివె కోరి పొందితివి నీకోర్కి దీఱ,
నీకు యోగ్యుఁడు వాఁడు నీనె తత్ఫలమును ననుభవింపుము, చాలు నల్పబుద్ధి!
యేను బ్రజాపతి నైన దక్షుండను, దెలియవే యుత్తమదేవదేవు
తే. లకును గనఁబడువాఁడను వికలహృదయ!-నాసముఖమున శంకరు నాసతోడఁ
బొగడఁగూడదు,పొగడినఁబొగడెడంతు-నోర్వఁజాల గ్రహింపుమీవుల్లమందు."

క. ఛాయాసతి దక్షుని నుడిఁ-బాయక విని పల్కె "దక్ష! పలుమరు తెలుపన్
ని యవివేకము మానవు-శ్రీయుక్తిని గోరదేని చెప్పెద వినుమా! ౧౨౦

మ. వరభద్రంబులఁ గోరుదేని శివునిం భావింపు ముద్యన్మతిన్,
బరుషంబు ల్వచియింపఁబోకు మిఁకఁ, బాపం బబ్బు, నీ దుర్మతిన్
గర ముద్యుక్తుఁడవై త్యజింపుము, జగత్కల్యాణుఁడైనట్టి శం
కరునిం భక్తి భజింపు, మియ్యదిసుమీ కాంక్షింప సన్మార్గమా. ౧౨౩

క. పరమాత్ముఁడైన శంకర-గురునింద విమోహివగుచుఁ గొనకొని చేయన్
దొరకొనిన శివుఁడు నిను, నీ-వరయజ్ఞము నడఁగఁజేయు వడిఁ దలఁపు మెదన్."

క. అనుటయు ఛాయాసతి యి-య్యనువున దక్షుఁడు క్రుధాగ్ని యాత్మ దహింపం
గను "దుశ్చరితా! బాలిక!-వినవా నామాట"యనుచు వెస నిట్లనియెన్. ౧౨౧

క. "తొలఁగు మిటనుండి, నా క-న్నులకును గనఁబడఁగవలదు, నొప్పిగలుగు; నీ
వలనాఁడు శివుని సతివై-యలర మృతినిఁ బొంది తంచు నాత్మఁ దలఁచితిన్.

ఉ. మాటికిమాటి కీవు కడు మన్ననచేయుచు నీవిభున్ శివున్
నోటికిఁ దోఁచినట్లుగ వినూత్నమహత్త్వము సన్నుతింతు, వీ
బూటకము త్యజింపుము, కుబుద్ధి తపాగ్నివలెన్ మనంబు నె
ప్పాటునఁ గాల్చుచున్నయది, పల్కులు చెప్పఁగ నేల పూనికన్ ? ౫౬౭

తే. విమతిమైనట్టి రుద్రుని విభునిగాఁగఁ-బొందితివిగాదె దుర్బుద్ధి! పుత్త్రి! నిన్ను
గనుఁగొనిన శోకవహ్నిచేఁ గాలుచున్న-దకట! నా దేహ,మింక నీవవలఁజనుము.

క. త్వరితముగఁ బొమ్ము క్రతుపరి-సరమును ద్యజియించి, నాదు సముఖమ్మున ము
ష్కరుఁడగు నీవిభు గుణముల-మరల నుతింపకయ బుద్ధిమాలి కుపుత్త్రీ!" ౫౬౯

సీ. ఈవిధంబున దక్షుఁ డేపున శివనిందఁ గావింపఁగాఁ గడుఁ గలుషితయయి,
యాదేవి ఛాయామహాకాళి యప్పుడే జ్వలితనేత్త్రత్రయాకలితయును, సు
విస్తృతాననయును, వికృతోడులోక సంపరిస్ఫురితవర శిరోధరయుఁ, బాద
పర్యంతసంవ్యాప్తబహుళలంబివిముక్తకచవిరాజితయు, నక్కజముఁ గొలుపు

తే. గగనమండలమధ్యభాగమున వెలుఁగు-భాస్కరసహస్రతుల్యవిభాసమాన
యును, నిరుపమానలయకాలఘనవినీల-గాత్త్రయునునయ్యెనతిభయంకరముగాఁగ.

క. దక్షా! నే మూరింబు త్వ-దక్షులకే కాదు, భవదసర్వాశరీరా
పేక్షితగాత్త్రంబునకును-నీక్షణమే దూరమగుదు నిదె యిటఁ గనుమా!" ౫౭౧

మ. అని క్రోధంబున నేత్త్రము ల్మెఱయఁగా నా దేవి యాశ్చర్యయు
క్తి నిరీక్షింపఁగ సర్వనిర్జరులు సందీప్తంబునౌ హోమవ
హ్నినిఁ జొచ్చెన్, వడి దిద్దిరన్ దిరిగె క్షోణీచక్ర మల్లాడుచున్,
ఘనసంరంభముతోడ వీచెఁ బవమానస్తోమ ముద్ధతిన్. ౫౭౨

సీ. సూర్యుని భేదించి క్షోణీతలంబునఁ బడియె నుల్కలు పెక్కు భయదగతిని,
దెల్విని విడనాడి దిక్కులెల్లను క్షోభమొందెను జాంచల్య మొంది మిగుల,
వారివాహంబు లవ్వారిగాఁగను శోణితంబును వర్షించె ధరణియందు,
సకలబర్హిర్ముఖసమితి కాంతిని వీడి దిక్కులఁ జూచుచు దీనులయిరి,

తే. యజ్ఞవాటికయందలి యగ్నికుండ-మందు దహనుని దీధితి మందమయ్యె,
హవ్యములనెల్ల మఖశాలయందు నేచి-నక్కలును గుక్కలును బ్రీతి మెక్కసాగె.

క. ఒక్క క్షణార్ధమునందునఁ-జక్కని క్రతుశాలయును శ్మశానముతీరున్
దిక్కెదియుఁ దెలియనిదై-చిక్కుపడియె, దక్షుఁ డంతఁ జింతాత్మకుఁడై. ౫౭౪

క. వదనంబు వాడ నెంతయు-ముద మించుకయైన లేక మొగి నిట్టూర్పుల్
వదలంగఁ దొడఁగె, విప్రస-ముదయము యజ్ఞంబుఁ జేయఁ బూనిరి కడఁకన్.

చ. హరుని భయంబునన్ సురవరాగ్రణులెల్లరు భీతులై పర
స్పరము మహర్షులం గనుచుఁ బల్కఁగ సాగిరి "వ్రేల్మిడిన్ శుభే
తరమగు వార్త దాఁటు, నిఁకఁ దా విను నేఁడె శివుండు పత్ని భీ
కరగతి వహ్నిలోఁ బడి స్వగాత్రము వీడుట యంతయున్ వెసన్. ౫౭౬

తే. సకలలోకసంహారకారకుఁడు దేవ-దేవుఁ డెవరికి నేమి తా భావమందు
సలుపఁగలవాఁడొ? సృష్టిని సంహరించునో? తెలియ నెవ్వరికి నగు నూహ చేయ?"

చ. అనుకొనుచుండ నిట్లు లపు డద్భుతరీతిని మౌనిపుంగవుం
డనఘుఁడు నారదుండు నడి నచ్చెరువొంద నతర్కితాగమం
బును నొనరించుచున్ సభను బూన్కిని వీడి మరుత్పథంబునన్
జనియెను రాజతాద్రిఁ గల శంకరమందిరభాగ్యసీమకున్. ౫౭౭

పదియవ అధ్యాయము

దక్షయజ్ఞ విధ్వంసనము

చ. మునివరుఁడైన పద్మజుని పుత్త్రుఁడు నారదుఁ డంత రాజతా
ద్రిని గల శంకరాలయము ప్రీతిని జేరి సదాశివున్ ద్రిలో
చను ఘనబాష్పపూరితునిఁ జయ్యనఁ గాంచి "మహేశ! నేను వం
దనములఁ జేయువాఁడను, విధాత్రసుతుండను నారదాఖ్యుఁడన్. ౫౭౮

సీ. దక్షాలయమునందు వీక్షింపఁగారానియట్టుల జరిగిన యశుభవార్త
విన్నవాఁడవు గావు, వినుము మహాదేవ! యజ్ఞంబు గనుఁగొన నరుగుదెంచి,
పరదేవి త్వత్ప్రాణవల్లభ సతి దక్షుఁడొనరించు నిందను విని సహింపఁ
జాలక యతికోపసంవృతదేహయై హోమకుండాగ్నిని నురవడి తన

తే. గాత్ర మాహుతిగాఁ జేసి కడఁకఁ జనియె,-నపుడు దక్షుండు సతిసతి యనుచుమాటి
మాటి కాక్షేపమొనరించి మరల యజ్ఞ-మును నొనర్చుచు నున్నాఁడు మనసునిలిపి.

క. సురవరులు హవిర్భాగము-లరుదుగఁ గొనుచున్నవార లక్కట! శంభూ!
తరమె వచింపఁగ నాకుఁ-బరమాత్మా! యింక నెదియుఁ బలుకఁగఁజాలన్."

ఉ. నారదమౌని యీక్రియ వినంగను శక్యముగాని వార్త దు
ర్వారతఁ దెల్ప శంకరుఁడు భవ్యగుణుండు త్రిలోచనుండు సం
హారివలెన్ వెసన్ విని ప్రశాంతముఁ బొందక శోక మొంది హా
హారవ మొప్ప రోదనము నప్పు డొనర్చెను మోహితాత్ముఁడై. ౫౭౯



యోగాగ్నిచే సతీదేవి దేహత్యాగము - దక్షయజ్ఞ విధ్వంసనము [పుట 94]

తే. "అక్కటా! సతి! నన్ను శోకాబ్ధి ముంచి-యరిగితే యెందు దయ యించుకైన లేక,
ప్రాణముల నెట్లు ధరియింతుఁ బడఁతి! నిన్ను-వదలి నే నింక సుస్థితిఁ బడయఁగలనె?

క. జనకుని గృహంబునకుఁ జను-నిను బహువిధములుగ నేను నిలుపఁగ, దానన్
ఘనకోప మూని న న్నో-వనిత! వదలి చనితి వకట! వనట మునుఁగఁగన్."

చ. సతిని దలంచి యీకరణి శంకరుఁ డప్పుడు పెక్కుభంగు లా
తతముగ శోకయుక్తుఁడయి తాను విలాప మొనర్చి యంత న
ద్భుతగతి రోషమూనె మునిపుంగవ! యా శివు నేత్రముల్ ముఖం
బతులితరక్తవర్ణయుతమై వెలుఁగొందెను దారుణాకృతిన్. ౫౬

మ. అతిరౌద్రుండగు రుద్రుఁ గ్రోధయుతు భూతౌఘంబు వీక్షింపఁగా
మతిలోనన్ భయమందె, లోకతతి హాహాకారముల్ చేయు చ
ద్భుతరీతిన్ గలఁతంబడెన్, బుడమి పెంపుం బాసి యొక్కుమ్మడిన్
స్థితిఁ దాఁ బొందక దిద్దిరం దిరిగె నుద్యద్భీతి సంధిల్లఁగాన్. ౫౭

తే. అపుడు శంభుని మూఁడవ యక్షినుండి
యగ్ని యుదయించె నద్భుతం బయిన దీప్తి,
నా దహనునుండి యతివిస్మయంబు దోఁపఁ
బరమపూరుషుఁ డొక్కఁ డుత్పత్తియయ్యె. ౫౮

సీ. ప్రళయకాలాంతకు భాతి నత్యంతమహాదేహము ధరించి యంకదీప్త
వహ్నిస్ఫులింగవిభాసితలోచనత్రయ మతిభీతిప్రదంబు గాఁగ,
భసితసంలిప్తసర్వశరీరుఁడై, యర్ధచంద్రుని మౌళిభూషణముగ నిడి,
మధ్యాహ్నకోటిద్యుమణిసన్నిభజటాసమూహమండిత శీర్షమును వెలుంగ,

ఆ. దుర్నిరీక్ష్యుఁ డౌచుఁ దోడనె శంకరు-నాదిదేవు శివు మహానుభావుఁ
ద్రిప్రదక్షిణముగ ధృతిఁ బ్రణమిల్లి కృ-తాంజలి యయి పలికె నధికభక్తి.

క. "జనకా! యిప్పుడు చేయఁగఁ-బని యెయ్యది? తావకాజ్ఞఁ బడసి క్షణార్ధం
బున సచరాచరలోకం-బును బూర్ణముగాఁగ నాశన మొనర్తుఁగదా? ౫౯

మ. జనకా! యానతి యిత్తువేని యిదె కేశవ్రాతమం దింద్రము
ఖ్యనిలింపావళి గట్టి తెచ్చి వడి నీ యగ్రస్థితి న్నిల్తు వే
కనుమా మృత్యువు భీతిదున్ యముని, నిక్కం బద్ది యో దేవ! యే
యనుమానంబును లేదు నాప్రతినయం దంచున్ మొగిన్ దెల్పెదన్. ౬౦

చ. ఎవని శమింపఁగోరుదువొ యిప్పుడె యానతియిమ్ము చెచ్చెరన్,
దవిలి యతండు దేవవిభుతం దగి యింద్రుఁడె యైన నాదు శ
క్తి వడి శమింపఁజేయుదును గేశవుఁ డెత్తఱిఁ దోడుచూపినన్,
మివులఁ దదస్త్రముం జెడనమేయత నే నొనరింతుఁ ద్వత్కృపన్." ౬౧

క. అని పల్కఁగ భవనేత్రా-గ్నిని బుట్టిన పురుషుఁ, డంతఁ గృపతో శంభుం
డని "నోయి! వీరభద్రుఁడ-వను నాఖ్యను నీవు భూమి నలరుదు పుత్రా! ౧౯౨

తే. ప్రమథులకు నధిపతివయి భాసిలుదువు-దక్షపురమునకుం బోయి తన్మఖంబు
నెల్ల ధ్వంసంబొనర్పుమా యిప్పు డేగి-మామకానుజ్ఞఁ గొని నీవు మహిమతోడ.

ఆ. తత్సహాయు లగుచుఁ, ద్యజియించి నను, నటఁ-జేరినట్టి యమరవారమునకు
నా యనుజ్ఞఁ బూని చేయుము తగు శిక్ష,-లేరు నీకు నెదురు వీరభద్ర! ౧౯౪

మ. అతిగర్వంబున విఱ్ఱవీఁగి నను నత్యంతంబు దక్షప్రజా
పతి నిందించుచు నుండు, నీవు కరుణం బాటింప కుద్యత్క్రుధా
మతివై యాతని శీర్షముం దునిమి రమ్మా పుత్ర! శీఘ్రంబె, దు
ర్మతియౌ నాతఁడు, జాగుసేయకుము, భద్రం బౌత! నీకెప్పుడున్." ౧౯౫

తే. వీరభద్రున కీరీతి విశదముగను
గార్యమంతయుఁ దెలిపి, శంకరుఁడు కోప
మునను నిట్టూర్పు పుచ్చె, దానను జనించి
రయుతసంఖ్యాకగణము లత్యద్భుతముగ ౧౯౬

చ. సమరవిశారదు ల్బహుళసాధ్వసదాయకకర్మ్ములున్ గదా
సిముసలశూలకుంతముఖచిత్రశరాఢ్యులు గూడిరాఁగ సం
భ్రమమున వీరభద్రుఁడు నమస్కృతిఁ జేసి ప్రదక్షిణత్రయం
బు మహితభక్తి శంభునకుఁ బూనికతోఁ జనె దక్షుమీఁదికిన్. ౧౯౭

తే. ప్రమథగణములు సింహనాదములు చేయ
చదలు విడి యొక్కక్షణమున నవని యద్రువ
దక్షుఁ డొనరించు సవనసద్మంబు గలుగు
దక్షపురిఁ జేరి రతిభయదముగ నడరి. ౧౯౮

క. క్రుద్ధుఁడయి వీరభద్రుం-డుద్ధతి గణములకుఁ దెలిపె "నొక్కుమ్మడి మీ
రిద్ధాత్రి యజ్ఞసమ్య-క్సద్ధతి నాశనముఁ జేయఁ గడఁగుఁడు పెలుచన్. ౧౯౯

క. సురలను బరుగెత్తింపుఁడు-కరుణ నొకింతుకయుఁ జూపకయ మది" నన న
త్తరుణమున వారు దక్షుని-వరయజ్ఞముఁ జెఱిచి రేచి వడి బెడిదముగన్.

ఉ. కొందఱు యజ్ఞకుండమును గొబ్బున నార్పిరి, హవ్యమెల్లనున్
గొందఱు మెక్కసాగి రొగిఁ, గోపవిఘూర్ణితలోచనద్యుతుల్
గొందఱు దేవసంఘములఁ గొట్టిరి దిక్కులకు పాఱునట్లుగాఁ,
జిందఱవందఱౌనటులఁ జేసిరి యజ్ఞము నాశనంబుగాన్. ౨౦౦

తే. భీమరూపులు ప్రమథులు భీతిగొలిపి
యజ్ఞవిధ్వంసనంబుఁ జేయంగ, విష్ణు
వచటి కరుదెంచి ప్రమథాళి నరసి యిట్లు
పలికె హితవాక్యములర "నో ప్రమథులార! ౬౦౨

ఉ. దేవతలెల్ల భీతిఁగొని దిక్కులకుం బడిఁ బాఱునట్టు లి
చ్చావిధి నేల చేసితిరి? సత్క్రతువర్యము నాశనంబుగా
వావిరిఁ జేయు టేకతము? వారక యెవ్వని యాజ్ఞఁ బూని? యో
పావనులార! మీరెవరు? బాగుగఁ దెల్పుఁడు శీఘ్రమే" యనన్. ౬౦౩

చ. ప్రమథులు పల్కి రంత "ప్రభువర్య! మహేశ్వరునాజ్ఞఁ బూని యు
త్తమగతి వచ్చినట్టి ప్రమథవ్రజ మంచు నెఱుంగవే మమున్?
భ్రమఁగొని శంకరావమతిఁ బర్వెడు యజ్ఞమునెల్లఁ బూన్కి ధ్వం
సముగ నొనర్చువారము విశంకత" నంచన, నప్పు డుద్ధతిన్. ౬౦౪

మ. "శివవిద్వేషపరాయణుండగు, గడు దుశ్శీలుండు దక్షుండు, వా
ని వడిన్ బట్టుఁడు, తెండు నాకడకు నిర్నిద్రప్రభావంతులై
దవులం బోవఁగనీక మీరు ప్రమథుల్ ధైర్యంబుతో" నంచుఁ గ్రో
ధవశుండై వెస వీరభద్రుఁడు ఘనధ్వానంబునన్ బిల్చుచున్. ౬౦౫

మత్త. "పట్టితెం డిట హవ్యభోక్తల బల్విడిన్ దయఁ జూపకే
గట్టిమచ్చర మొప్ప మీరలు గాసిఁ బెట్టుచు, నిప్పుడే
మట్టుపెట్టెద నెల్లవారల మందబుద్ధుల" నం చనన్,
దిట్టమైన తదాజ్ఞను న్విని తేఁకువన్ బ్రమథోత్తముల్. ౬౦౬

మ. అతిరోషంబున నెల్లదిక్కుల వెసన్ వ్యాపించి బ్రహ్మర్షిముఖ
ప్రతతిన్ బల్మిని బట్టి కొట్టి రొగి దుర్వారప్రభావంతు ను
ద్ధతు సప్తాస్యుని సూర్యుఁ బట్టుకొని, దంతస్తోమమున్ జూర్ణ ము
ద్యతులై చేసిరి కొందఱా ప్రమథబృందంబందు నొక్కుమ్మడిన్. ౬౦౭

సీ. ఒక్కఁడు దహనుని జిక్కంగఁ బట్టి నిశితహేతితోడఁ దజ్జిహ్వఁ దఱిగె,
నొక్కఁడు యజ్ఞుని దిక్కుఱి మృగరూపమునఁ గాఱు శిరమును మొనసి నఱికె,
నొక్కఁడు భారతి ముక్కును దెగఁగోసె, నొక్కఁ డర్యమ్ము బాహువులఁ దునిమె,
నొకఁ డంగిరసుని భవ్యోష్ఠంబులను గోల్చె, నొక్కఁడు శమనుని నొడిసిపట్టె,
తే. నొకఁడు నిరృతిని బంధించి యుక్కడంచె,
నొకఁడు వరుణుని దర్పంబు నుర్విఁ గలిపెఁ,
బ్రమథగణ మిట్లు చెలరేఁగి పలువిధముల
భంగపఱుపఁగ, బ్రాహ్మణుల్ భయము చెంది, ౬౦౮

చ. వడవడఁ గంపమొంద, ద్విజవారముఁ గాంచి వినమ్రులౌచు ''మీ
యెడఁద భయంబు వోవిడిచి స్వేచ్ఛగ వెళ్లుఁడు వెళ్లుఁ''డంచు లో
దుడుకుతనంబు మాని ప్రమథుల్ పలుకంగనె సంభ్రమంబునన్
గడు ముదమంది బ్రాహ్మణజనంబులు దక్షుని యజ్ఞవాటికన్. ౬౦౯

తే. వదలి యందఱు యజ్ఞసంపాదితంబు-లైన వస్త్రములను భూషణాదులను గ్ర
హించి భద్రంబుగను దమ గృహములకును-బోయి చేరిరి నిర్భయంబుగను వేడ్క.

చ. ఉరుతరబుద్ధి యింద్రుఁడు మయూరశరీరముఁ దాల్చి యప్పు డు
ప్పరమునకున్ వడిన్ నెగసి పర్వతసీమను జేరి ఛన్నుఁడై
యరయుచునుండె దక్షుని మహాక్రతుభంగము నెల్లఁ దాను ని
బ్బరమును మానసంబునను బర్వుచు నుండఁగఁ గౌతుకంబునన్. ౬౧౧

క. సురపుంగవు లీవిధమునఁ-బరువులిడన్ జూచి, ప్రమథవర్యుల చేష్టల్
హరినారాయణముని గని-యీవగ యోజింపఁ దొడఁగె నెంతయు మదిలోన్.

తే. ''శివుని నిందించుచును మూఢచిత్తుఁడైన
దక్షుఁ డొనరించుచున్నాఁడు తాఁ గ్రతువును,
దగిన ఫల మాతఁ డందక మిగిలెనేని
వేదవాక్కులు చూడంగ వితలుగావె! ౬౧౩

క. శివవిద్వేషముచే శా-త్రవుఁడను నే నైతి, నిద్ది తథ్యం బరయన్,
శివుఁడను నే, విష్ణుండే-శివుఁ డగు, భేదంబు లేదు స్థిరముగ మాకున్. ౬౧౪

తే. ప్రార్థనమొనర్చె విష్ణురూపమున నున్న-నన్ను దక్షుఁడు భక్తితో నున్నతముగ,
నిందచేసెను శివరూప మొందియున్న-నన్నె యాతండు దుర్బుద్ధి నెన్ని వికృతి.

క. భావించెఁ గర్మమున మఱి-భావంబున ద్వివిధముగఁ బ్రభావ మెఱుఁగ, శా
ద్వైవిధ్యమునకుఁ దగు ఫల-మేవిధమున నైనఁ దెలియ నిపు డొనరింతున్. ౬౧౬

సీ. విష్ణురూపంబున విడువక రక్షింతు, శివుఁడనై లోఁగొందు సృష్టి నెల్లఁ,
గావున స్నేహసంకలితుండనై యుద్ధ మొనరించి యపజయంబుఁ గొని, యందు
రుద్రరూపముచేత రౌద్రుఁడనై దక్షు శాంతినొందింతు నిస్సంశయముగ,
నంత యజ్ఞంబు సురావళితోఁ గూర్తు, సంపూర్తిఁ జేయుదుఁ బెంపుతోడ,

తే. విష్ణుదేవునిఁ బూజింప విదితముగను
గలుగు ఫల మింతయే యని గనెదుఁగాత! ''
మనుచు మది నిశ్చయించి యా హరి ముకుందుఁ
డాదినారాయణుండు మర్యాద నపుడు. ౬౧౭

క. కరములను శంఖచక్రము-లురుగదయును దాల్చి మించి యుగ్రప్రమథో
త్కరమును వారించెను దు-ర్ధరసింహనినాదయుక్తి వరవిక్రముఁడై. ౬౧౮

తే. వీరభద్రుండు క్రుద్ధుఁడై విష్ణుదేవుఁ-బరమపూరుషుఁ గనుఁగొని పలికె నిట్లు
"నీవు యజ్ఞపూరుషుఁడవై కావఁబూని-నాఁడవు మఖంబు నని వినినాఁడనుగద!

క. శివనిందాతత్పరుఁడగు-నవినీతియుతుండు దక్షుఁ, డతఁ డేఁడీ? వే
దవిలి హరీ! పట్టియొసఁగుము-ప్రవిమలమతిఁ, గాక యున్న బవరము నాతో. ౬౨౦

క. ఒనరింపుము, శివభక్తుల-కును నీ వగ్గఁడవి సుమ్ము, కుదురుగ శివశ
త్రునికరమునకు హితంబును-నొనర్ప నిలిచితివి, చూడ యుక్తంబగునే!" ౬౨౧

చ. అనుటయు వీరభద్రుఁ, డపు డాహరి తాఁ జిఱునవ్వు నవ్వి యి
ట్లనియెను "వీరభద్ర! యిపు డాజి యొనర్పఁగ రమ్ము, నన్ దురం
బునను జయించి దక్షుఁ గొనిపొమ్ము, మహామి భయంబు లేదు, నీ
ఘనబలముం గనుంగొనెదఁ గాక" యటంచును విష్ణుఁ డంతటన్. ౬౨౨

క. కోదండం బెక్కిడి జ్యా-నాదము గావించి శాతనారాచతతిన్
ప్రోదిగఁ బఱపఁగఁ, దనువులు-భేదిల్లఁగఁ బ్రమథవరులు బెగడిరి త్రుటిలోన్.

క. క్రక్కిరి రక్తము పెక్కురు-దిక్కరి మూర్ఛిల్లిపడిరి తెలివి వదలి పెం
పెక్కిన ప్రమథులనేకులు-చిక్కుటఁ గని యుక్కుఁదక్కి చెందిన క్రుధచేన్.

తే. వీరభద్రుండు గదఁ గొని విపులశక్తి-విష్ణుదేవునిపై వడి విసరివైచె,
నదియుఁ దద్దేహమును దాఁకియపుడె నూఱు-ముక్కలగుచును చెదరెనల్దిక్కులందు.

తే. అతిరుషాన్వితుఁడై విష్ణు నంత గదను-దాల్చి వీరభద్రునిఁ గొట్టఁ, దద్దయు నది
తచ్ఛరీరంబుఁ దాఁకి వింతయగు రీతి-మొక్కనోయిన దయి నూఱు వ్రక్కలయ్యె.

క. ఘనమగు క్రోధంబున లో-చనము లరుణములుగఁ జేసి శార్ఙ్గి క్షణములో
ఘనమయి పర్వతబలమున-మొనసిన యొండొక్కగదను బూనెఁ గడిమిమై.

క. బెడిదముగ వీరభద్రుం-డడరి గదాధరునిఁ గొట్టె ఖట్వాంగమునన్,
వడి బాహుదండ మదరఁగఁ-బుడమింబడ గదయు నపుడు పూనికమీఱన్.

ఉ. ఆగ్రహ మొంది విష్ణువు నిజామితతేజములోఁగ మండు న
త్యుగ్రసుదర్శనంబుఁ గొని యుద్ధతి వ్రేసెను వీరభద్రుపై,
విగ్రహ మత్యుదగ్రముగ వెల్గుచుఁ జక్రము రాఁ దలంచె న
వ్యగ్రత శంభుఁ, దద్గళమునం దది యొప్పెను తారహారమై. ౬౨౫

శా. చక్రం బాగతి వ్యర్థమై చనుటయున్ శాంతంబు పోవీడి ని
ర్వక్రంబై రవికోటికాంతినిభమై రాజిల్లు ఖడ్గంబుచే

నాక్రూరాత్ముని వీరభద్రుని రణంబందు న్వాడిన్ జంపఁగా
శక్రాదు ల్వెఱఁగంద వానిపయికిన్ జంచద్గతిన్ మార్కొనెన్. ౬౩౦

ఉ. అంతఁ బ్రతాపవంతుఁడు మహాభుజుఁడై తగు వీరభద్రుఁ డ
త్యంతరుషన్ ఖరాసిఁ గొని యద్భుతకీర్తిని వచ్చు విష్ణువి
క్రాంతినిఁ గాంచి హుంకృతిఁ దిరస్కృతుఁ జేసి తదీయబాహువుల్
వింతగ నిల్చిపోవునటు వే నిజశక్తి నొనర్చె నంతయున్. ౬౩౧

తే. అంత నారీతి భుజము లాహరికి స్తంభి-తంబు లగుటయు, నత్యంతదారుణక్రుధ
నడరి శూలముద్గరముల హరినిఁ జంప-వచ్చుచుండెను నావీరభద్రుఁ గాంచి. ౬౩౨

క. ఆకాశవాణి పల్కెను-బ్రాకటగతి "వీరభద్ర! వలదు తెగువ నీ
కీకరణి, విస్మరించితి-వే కోపంబూని స్థిరత నీటు రణమందున్? ౬౩౩

తే. విష్ణువే శివుఁడు, శివుండె విష్ణు వనుచు-నెఱుఁగుమా వీరభద్ర! నీహృదయమందు,
నీయుభయులందు భేద మొక్కించుకేని-యెందు లేదని తెలియవే యెప్పుడయిన!"

క. అను గగనవాణి పల్కులు-విని వినయముతోడ మ్రొక్కి విష్ణునకును జ
య్యన వీరభద్రుఁ డాత్మను-గని శంకరునాత్మగాఁగఁ గ్రక్కున నంతన్. ౬౩౪

సీ. దక్షుని సిగఁ బట్టి శిక్షింపఁగా నెంచి యమ్మహామతి యప్పు డనియె "నోరి!
పరమపూరుషుని శంకరు దేవదేవుని నేముఖంబునఁ గడు నిష్టముగను
నిందించినాఁడవో సందియంబును లేక యావక్త్రమును జీల్తు" ననుచుఁ గ్రూరుఁ
డయి క్రోధదీప్తరక్తాంబకములఁ జూచి, దక్షుని వక్త్రంబుఁ దన ఖరాసిఁ

తే. గొట్టికొట్టి నఖంబులఁ గ్రుచ్చిక్రుచ్చి-శిరము తెగిపడ నఱకె, శంకరుని నింద
విని ప్రహర్షితులగువారి వికువ కపుడె-నాల్కలను జెవులను గోసె నల్క మెఱసి.

బ్రహ్మదేవుఁడు కైలాసంబునకరిగి శంకరునిఁ బ్రార్థించి యజ్ఞము నెఱవేర్చుట

తే. ప్రమథనాయకుఁ డగు వీరభద్రుఁ డజరి-క్రతువు నాశన మొనరింపఁ, గమలభవుఁడు
శివుని దర్శింపఁ గైలాసశిఖరమునకుఁ-జని వినుతిచేసి విధిలోపమును వచించె.

సీ. "ఆలకింపుము దేవ! యజ్ఞసంరక్షకా! నావిన్నపంబు నో దేవదేవ!
యీరీతి యజ్ఞంబు నెల్ల విధ్వంసంబు గావింపఁ బాడియే గరళకంఠ!
బ్రహ్మస్వరూపిణి వరజగద్ధాత్రి యా సతి నిత్యమై వెల్గు జగతియందు,
నా దేవి దేహంబు నవధరించుట చూడ భ్రాంతంబు మఱి విడంబనము గాదె!

తే. యా మహామాయ దక్షుని యంతరంగ
మును విమోహింపఁ దన మాయఁ గొని క్రతువున
యజ్ఞకుండంబుపొంత ఛాయాసతి యను
దాని నునిచెను, నదియె తద్వహ్నిఁ జొచ్చె. ౬౩౫

క. దక్షప్రజాపతియు మది-లో క్షోభంబంద వహ్నిలో ఛాయయె సా
పేక్ష బ్రాకృతసతి ప్ర-త్యక్షంబుగ గగనమందె యలరె మహేశా! ౬౩౯

క. ఇది యంతయు నెఱుఁగవె నీ-మది? క్రతువిధ్వంసనంబు మానక చేయన్
బొదలుచునున్నాఁడవు, ని-కది పాడియె దేవదేవ! కృపఁ గనుఁగొనుమా!

ఉ. రమ్ము పరేశ! భక్తనికర మ్మొనరించు నమస్కృతు ల్దయన్
సమ్మతితోడఁ గైకొని ప్రసన్నతఁ బూనుము, ధర్మరక్షక
త్వమ్మున నుండు నీ వెయిటు ధర్మవిరుద్ధముగాఁగ యజ్ఞలో
పమ్మును జేయఁబూనినఁ బ్రపంచగతు ల్కొనసాగు నేవిధిన్? ౬౪౧

సీ. యజ్ఞంబు పరిపూర్తియగునట్లు చేయు, మంతట నెల్లరముఁ గూడి దైవవంద్య
యగు పరదేవినిఁ బ్రార్థింప నాదేవి దర్శనం బొసఁగు సత్యముగ నీకు,
నిది తగు కార్యంబు, ముదమున దక్షుని భవనంబునకు రమ్ము, ప్రస్తుతించు
నన్ను మన్నింపుము, నాథ! యనుగ్రహవీక్షణంబున మది వేఱుచేయ
తే. వల''దనుచు వేఁడఁగా బ్రహ్మవాంఛఁ దీర్ప-శివుఁడు దక్షప్రజాపతిసవనవాటిఁ
జేరఁబోయెను, నచ్చట వీరభద్రుఁ-డాగతుండైన జనకున కపుడు మ్రొక్కె.

చ. హరుని విరించి తా మరల నర్మిలి వందనమాచరించి సం
బరమున ''నోమహేశ! క్రతువర్యము విఘ్నములేక సాగున
ట్లురవడి నాజ్ఞయి''మ్మనుచు నొయ్యన వేఁడఁగ, శంకరుం డెదన్
గరము ముదంబు నంది కుతుకంబున వెగ్గెడు వీరభద్రునిన్. ౬౪౩

క. కనుఁగొని ''మదిలో రోషం-బును వదలుము వీరభద్ర! పూన్పుము యజ్ఞం
బును సంపూర్ణ మొనర్పం-గను దగు కార్యములనెల్లఁ గడువడి'' ననఁగన్.

తే. వీరభద్రుఁడు శివుని యాజ్ఞాకరుఁడయి-యాదితేయుల నెల్లను నపుడు వదలెఁ;
గ్రతువు మున్నున్నరీతి విరాజిలంగఁ-దగిన యత్నంబు గావించెఁ దత్క్షణంబ.

ఉ. అంత విరించియు స్మజల నా హరుఁ ద్ర్యంబకుఁ గాంచి వేఁడె న
త్యంతము భక్తి ''దేవ! దయ నారసి దక్షు సజీవుఁ జేయఁగా
నెంతయు నాజ్ఞయిచ్చి క్రతు విప్పుడు పూర్ణముచేయనౌ'' ననన్
స్వాంతమునందు బ్రహ్మనుడి చక్కఁగఁ దా విని పల్కె నీక్రియన్. ౬౪౬

క. ''ఓ వీరభద్ర! దక్షుని-జీవింపఁగఁ జేయు''మనఁగ 'జిత్తం'బని స
ద్భావుఁ డగు నతఁడు చెచ్చెఱ-దేవోత్తము వాక్యములను దీర్పఁగఁ గడఁకన్.

ఆ. మేఁకతలను దెచ్చి మొలపున దక్షుని-కంఠసీమ నతుకు కలిపి జీవ
మొసఁగె, దక్షుఁ డపుడు వెసఁ జేతనత్వంబు-గలిగి చెలఁగె యజ్ఞనిలయమందు.

తే. శివుని నిందించువారెల్ల భువిని మూఁగ-లైన పశువులు కాఁగల రనుచుఁ దెలియ
భాగముండంబు నొసఁగె దక్షప్రజాప-తికిని నటు వీరభద్రుండు దివ్యమాని!

తే. బ్రహ్మచేతను బ్రార్థింపఁబడి మహేశు-కరుణ నెల్లరు యజ్ఞభాగములఁ గొనఁగ
వచ్చి రచటికి, దక్షుండుఁ బరమశివున-కాహుతి నొసంగి క్రతువు సమాప్తిఁ జేసె.

సీ. బ్రహ్మయు, విష్ణువుఁ బలి, రి దక్షునిఁ గని "దక్ష! నీవు నెమ్మనమునందు
భక్తిపూర్ణుండవై పరమేశ్వరుండగు శివుని నాదృతిని సంసేవచేసి,
పూజింపు మిఁక బహుపూజ్యస్తుతులచేత, నలరింపు మా దేవు నధికముగను,
నిందించి పాపంబు నెటె సమార్జించితి, నాపాపము నశింప సర్వరీతిఁ

తే. గోరిక గలట్టివాఁడవై భూరిమహిముఁ-డై సనాతనుఁడైన యా హరుని వినుతిఁ
జేయు,మాలస్యమునొనర్పఁ జెకుచు, విద్ధి-నిజముముమ్మాటికనిజూడనిజమునిజము.

తే. శివుఁడు శీఘ్రముగాఁ దృప్తిఁ జెందు దేవుఁ,-డిలరు శివుఁ డని పల్కిన యంతలోనె,
యిదిస్వభావంబు,నినుగూర్చియించుకయును-నుంపఁ డెప్పుడు వైరస్యముల్లమందు."

తే. బ్రహ్మయును విష్ణు వీరీతిఁ బలుక దక్షుఁ-డాదృతిని విని కడుభక్తియాత్మఁ గలుగ
నవ్యయుఁ బరేశుఁడగుశివునంఘ్రిపద్మ-ముల కెరఁగిస్తోత్రమును జేయఁబూనెనపుడు!

దక్షకృత శివస్తోత్రము

సీ. "యోగవిదుత్తమ! యోగిముఖ్య! పరేశ! నారాయణుండును నళినభవుఁడు
నిన్నెఱుంగఁగలేరు నే నెట్లెఱుంగఁగా నోపుదుఁ గుమతిని నురుతరముగఁ!
బొంద శక్యముగాని పూర్ణమౌ నిస్స్వరూపముఁ గాంచు యోగ్యత యమరఁ గలదె!
సకలజీవములకుఁ బ్రకటితంబగు బుద్ధి నీవె కా కన్యు లింకేరు గలరు?

తే. లోకములు త్వన్మతివశములుగద! యదియె
హేతువుగఁ ద్వద్వశమతినై యొసఁగు నాకు
నిన్ను నిందింప నేతప్పు నిలువఁగలదు
భావమందునఁ దలఁపవే దేవదేవ! ౬౭౮

సీ. నీవు శుద్ధుండవు, నిరుపమానుండవు, పరముఁడవును, బరాత్పరుఁడ వగుదు,
బ్రహ్మాదిదేవతావరసమర్చితుఁడవు, నీచరిత్రంబును నేను బాగడఁ
గలవాఁడనే దేవ! కమనీయమయి యుత్తమంబగు నీదు రూపంబుఁ దెలియ
నోపుదునే! బహుపాపుఁడ, వేఱొక్కగతి లేదు త్వత్పదకమలయుగము

తే. తప్ప, శరణుఁజొచ్చితి శంభు! తప్పులెల్ల-నీ నిజగుణాళిచేత మన్నించి నన్నుఁ
బాపసాగరముననుండి పరమకరుణ-నుద్ధరింపుము, రక్షింపు మురుదయాత్మ!

సీ. నీవె దేవుండవై నెగడువాఁడవు, నీవె పరమేశ్వరుండవు వరద! జగతి
దీను లుత్తములును దెలియంగ నీమూర్తులగుదురు పశుపతీ! యక్కృతమున
విశ్వరూపుఁడవయి విలసిల్లుచున్నాఁడ, వేను నీవిశ్వమందే వసించు
నట్టివాఁడనుగాదె యనఘాత్మ! నిను నిందఁ గావింపఁగల్గిన కలుష మెట్టు
తే. లొందఁగిల, దేను దీనుఁడ, సందియంబు-లేదు, శరణాగతుఁడను నీ పాదములకుఁ;
గరము సంప్రీతి ననుఁగాంచి పరమకరుణ-వెలయ విశ్వేశ! రక్షింపవలయు నెపుడు.

ఉ. నీపదముల్ శిరంబునను నిల్పి విరించియు, విష్ణుమూర్తియుఁ
బ్రాపయి దేవ! పూజ్యపదభాసుర లైరి, పరేశ! నిన్నునే
నీపగిదిఁ సభాగతుని నెంతయుఁ గన్గొనునట్టి భాగ్యముఁ
మా పితృకోటి చేసె నది మానసమందు నటంచు నెంచెదఁ. ౬౫౮

తే. సకలజీవులకును నెందు సాధువౌవి,-కునుతివియు నివె యగుదువు, కోసరి వంద
నీయుఁడవు, నిగ్రహ్యుఁడవు నీవె, నిన్నుఁ దిట్టి-నట్టి దోషంబు నాకెట్టు లమరునభవ!''
తే. ఇక్కరణిదక్షుఁ డనుతింప నెంతయుశివుఁ-డాశుసంతుష్టుఁడగుటఁ గృపాబ్ధియపుడు
స్వీయహస్తాంబుజంబులఁ జేరఁదీసి-యుద్ధరించెను దక్షుని నురుకరుణను. ౬౫౯

ఉ. శంకరుఁ డట్లు గాత్రమును స్పర్శము చేయఁగ దక్షుఁ డెంతయుఁ
శంక మనంబునం దొరఁగి జన్మము ముక్తిని గాంచినట్లు లే
యంకిలి లేక ధన్యతను నందినకైవడి భాగ్యసంపదఁ
బింకముఁ జూపువాఁ డగు పృథ్వి నటంచును నెంచె నంతటఁ. ౬౬౦

తే. ఒనర మనోవాక్కాయము-లనఁబడు త్రికరణములందు నతిశయభక్తిఁ
గాని బహువిధోపచారము-లను శంకరుఁ దృప్తిఁ బూజలను గావించెఁ. ౬౬౧

సీ. అంత విరించి మహాదేవుఁ గనుఁగొని భక్తితో వచియించెఁ ''బరమపూజ్య!
భక్తుల దయతోడఁ బాలించు భగవంతుఁ డెవ్వ సదాశివుఁడ వీ వపుడు వెపుడు,
పరమేశ్వరా! నాదు వాక్యంబు చిత్తంబునం దనుగ్రహమున నవధరింపు,
దక్షప్రజాపతి రక్షితుండయ్యె నేస్థితినుండి యిప్పుడు హితముమీఱ,
తే. శంకరా! యింకమీఁద నిర్జరులు నిన్ను-వదలి యజ్ఞంబునందలి భాగముల గ్ర
హింపఁబోయిన వో నట్టి హీనగతియె-నొందుదురుగాక! తక్షణంబందె యెందు.

తే. మనుజు లెవ్వారు నిను వీడి మఖములందు-నితర దేవతలను గొల్తు రెప్పుడయిన,
వార లెల్లరు నధములై బహుళ పాపు-లగుదురు హాతక్రతువులయి యనవరతము''.

పదునొకండవ అధ్యాయము

ఛాయాసతీ వర్ణనము

తే. శివుఁడు యజ్ఞసమాప్తిని జేసె నిట్లు-కొదువ లేకయె దక్షునకును మఖఫల
మబ్బె, నంతటఁ బ్రాకృతునట్లు సతిని-యోగమున దగ్ధయైన హరుఁ డుల్లమందు.

క. రోదనము చేయఁదొడఁగెను-వేదన మతిశయముగాఁగ విడువక యట, వా
గీదయితుఁడు, శ్రీదయితుఁడు-ఖేదము పోఁ బల్కి రిట్లు ఖిన్నత దొలఁగన్.

తే. "ఓ మహాజ్ఞాని! భ్రాంతుని యొప్పిదమున-మోహితుఁడవయి మదిని నుత్సాహశక్తిఁ
దక్కి విలపింపఁ బాడియే, తత్త్వవేత్త-వయినవాఁడవు శంకరా! యఖిలరూప!

సీ. పరిపూర్ణమయినట్టి బ్రహ్మస్వరూపయు, నిఖిలజగజ్జననియు, సనాత
నియు, మహావిద్యయు, నిగమాంతవేద్యయు, విశ్వచైతన్యరూపిణియు, విశ్వ
కర్త్రియు నాదేవి క్రమత వెలయును నాయం మాయచే ననవరతము
స్వాధీనతను బొంది చరియించుచున్నారు మే మెల్లరము దేవ! యామహేశి

తే. దేహము త్యజించు ననుచుఁ జింతింతు వెట్లు?
లే మహాదేవి కరుణచే నో మహేశ!
యీవు మృత్యుంజయుండవై యెసఁగి, తల్లి
జనని తనుమోక్షణంబు వాస్తవమె? భ్రమయె. ౬౬౭

తే. ముగురము మనము తద్దేవి మూర్తులము మ-దిం దలంచిన, భవదీయనింద గాదు,
పరమహేశ్వరినిందయే వాస్తవముగఁ -దెలియు నీ కెల్లవిషయంబు దివ్యవిభవ!

క. పరమేశ్వర! త్వన్నిందయె-పరమాఘకరంబుసుమ్ము, భావింపఁగ నె
వ్వరు నిందింతురొ దేవిని-పరిత్యజించు వెస వారిఁ బాపాత్ములుగాన్. ౬౬౮

క. ధర్మాత్ములను త్యజింప, న-ధర్ముల వశిఁ ద్రోసివైచుఁ దా దేవిసుమీ!
నిర్మలమతిఁ బిత్రాదులు-శర్మమొసఁగఁదగు నటంచుఁ జర్చింప దొగిన్. ౬౭౦

తే. ధర్మసంబంధమే మదిఁ దలఁచుఁగాని
తలఁప దాదేవి లౌక్యపద్ధతిని నెపుడు,
ధర్మమొనరించువాఁడె యామె దనకుఁ దండ్రి
తల్లియును బాంధవుం డని తలఁచుచుండు. ౬౭౧

ఉ. పాడి దొలంగునట్టిఁడు స్వబాంధవుఁడైన విరోధి దేవికిన్,
జూడఁగ దక్షుఁ డక్కరణిఁ జొప్పడె నిందయొనర్చుటన్ శివా!
పోడిమిఁ దూలఁ బాపియును బూజ్యుఁడు గాఁడని త్రోసివైచెఁ దా
నోడక పుత్రియయ్యు దయ యుల్లమునందుఁ దలంప కెంతయున్. ౬౭౨

తే. ఏవిధంబున దుర్దముండై వివేక-రహితు దక్షప్రజాపతిని హితుఁగాఁగ
నెంచి ధర్మక్రియాఫల మిచ్చు తల్లి-తా క్షమింపఁగ నోపు నద్దాన నపుడె. ౬౭౩

ఆ. అమితపాపి యయిన యాదక్షుని త్యజించి-స్వీయపదమునకును జేరఁబోయె,
క్షణములోన నతనిఁ జంపంగఁదగిన సా-మర్థ్య మాత్మ లేదె? మానితగుణ!

తే. ధర్మబోధ యొనర్చు నాతల్లి దేని-వలన నగును నుపేక్ష, తా భావమందు
నెంచి యెల్లలోకముల శిక్షించుచుండు,-దానఁ జూపక విడిచెను దండ్రి నపుడు.

సీ. ఒకవేళఁ జంపిన సకలలోకంబులు తండ్రిని గూర్చి సంతతము ధైర్య
మేరీతి నిలుపును, హృదయంబునందు నీ కారణంబును నెన్ని కడఁక నిత్య
మైన యాపరమమహాదేవి దక్షప్రజాపతి మోహితస్వాంతుఁ జేసి,
మాయఁ బొందిత తిరోహితాత్మయై గగనంబునందున నిల్చెను, సందియంబు

తే. వలదు వలదు మహాదేవ! వహ్నియందుఁ
దాఁ బ్రవేశింపలేదు, సత్యముగ శోక
మేల? ఛాయాసతియె చొచ్చె, నింక సుస్థి
రత్వమును బూను, మాత్మ ధైర్యంబుఁ గనుము." ౬౭౬

తే. అనుచు బ్రహ్మయు విష్ణుండు వినయమునను-దెలుప వారలఁ గని దేవదేవుఁడయిన
యాశివుం డిట్లు ప్రశ్నించె "నార్యులార!-సత్యమేని భవద్వాక్యసమితి యింక.

సీ. మత్సతీమణి బ్రహ్మమయి నిత్యప్రకృతి పరాభిధ నిత్య దేహముఁ ద్యజించెఁ,
దా నెందుఁ బోయెనో నే నెఱుంగఁగఁజాల, మత్ప్రాణవల్లభ మాననీయఁ
బరమేశ్వరిని జూచి పడయుదు సంతృప్తి, మనమున శాంతింబుఁ గనుదు" ననుడు
బ్రహ్మవిష్ణులు "శివా! పరమజగద్ధాత్రి, సకలలోకైక సంస్తవ్య, వంద్య

తే. భక్తి నుతియింపుదము, మది బహుళతుష్టి
నంది మన కొగిఁ దన దివ్యమయిన రూపుఁ
గనఁబఱచు శంక లేక తాఁ గరుణ" ననుచుఁ
బలికి రత్యంత వినయసంకలితు లగుచు." ౬౭౮

వ. వెండియు నారదుఁడు మహాదేవునితో నిట్లు చెప్పందొడంగె. ౬౭౯

తే. "ఇట్లు శంభునితోఁగూడ సృష్టికర్త
యైన బ్రహ్మయు విష్ణుండు నంతరంగ
మందునను నిశ్చయించి బ్రహ్మస్వరూపఁ
బొగడఁదొడఁగిరి భక్తితో మునివరేణ్య! ౬౮౦

క. "నీవే నిత్యవు, విద్యవు,-నీవే చేతనవు, జగతి నీవే పరమ
ప్రావీణ్యవుఁ, బూర్ణవు, నో-దేవీ! బ్రహ్మమయి, విచ్ఛధృతవిగ్రహవు. ౬౮౧

సీ. వేదాగమముల విభిన్నతఁ బొరయక యుండు, నద్వైతంబె యుకుతరమగు;
నీదు రూపంబగు నిత్యంబు, గోప్యమై విజ్ఞానగమ్యమై వెలయు, బ్రహ్మ
మునకు నమస్కారములఁ జేయువారము, సృష్టి చేయుటకు శరీరధార
ణంబును గావింతు వంబ! నీవె ప్రధాన పురుషస్వరూపవై పొలుతు, వట్టి
తే. కారణమున శ్రుతుల్ ద్వైతకలన నిన్నుఁ
గూర్చి పలుకుచునుందును గొనరె దేవి!
యీవు లేకున్న పురుషుండు చూవె శవము
తోడను సమానుఁ డయియుండువాఁడు, నిజము. ౬౮౩

తే. ఎల్లదేవతలందు నీ వెన్నఁబడుదు-వాద్యయుఁ బ్రధానవును నని యఖిలవిధము
లుగను నోతల్లి! నిజముగా జగతి సతత-మార్యపూజిత!యో దేవి! యర్హ్వాచరిత!

చ. తలఁప నచింత్యమైన చరితంబును రూపముఁ గల్గు నిన్ను ని
స్తులమహిమాఢ్య నేపగిది స్తోత్రము చేయఁగనేర్తు మంబ! చం
చలులము, సన్బుద్ధులము, శంకరి! స్వేచ్ఛ మమున్ సృజించి తీ
వె, లయమొనర్తు వీవె, మది నెట్లు సమర్థుల మౌదు మెన్నమా! ౬౮౪

క. నీమాయచేత మోహితు-లై మానవులట్లు జ్ఞాను లందఱు నుండం
గా మా కోపరమేశ్వరి!-నీమహిమ నుతింపఁ గలదె నేర్పు మనమునన్! ౬౮౫

సీ. నీవె మాకెల్లను నిత్యచేతనవు. బుద్ధివి, సర్వశక్తివి, వివిధఫలద,
నీవు లేకుండిన నేమెల్ల శవములయ్యెదువార మోయమ్మ! నిన్ను
స్తుతియింపఁజాలు దక్షత మాకుఁ గలదె? గుణత్రయంబునను బంధనమొనర్చి,
నిజమాయచేత నీ వఖిలంబు భ్రమ ముంచి యజ్ఞానులను జేయు దమ్మ! యెవ్వి
తే. ధమున నీదృశులగు నేము తావకీన
మహిమఁ బొగడంగ నేర్తుము? నుతి వినయము
తోడ విజ్ఞప్తిచేయు నుత్సుకత మాకుఁ
గలదె సర్వజగద్ధాత్రి! సర్వశక్తి! ౬౮౬

మత్త. ఏము దక్షగృహంబునందున నెట్టిరూపముఁ గంటిమో
యా మహోత్తమ రూపమున్ దయ నవ్విధంబున మాపయిన్
ప్రేమతోడుతఁ జూపు మిప్పుడు నిశ్చలంబుగ నున్న మా
కో మహేశ్వరి! ధన్యతం గన నుల్లమందున నెంతయున్. ౬౮౭

తే. ఓ జగద్ధాత్రి! పరమేశ్వరి! జగంబు
నందు నేమెల్లరము వివర్ణాస్యులమయి
యున్నవారము శవముల యొప్పిదమున,
నిన్నుఁ బొడఁగందు మనువులఁ గన్నకరణి." ౬౮౮

దేవి బ్రహ్మవిష్ణ్వీశులకుఁ బ్రత్యక్షమగుట

తే. బ్రహ్మవిష్ణ్వీశు లీరీతిఁ బ్రస్తుతింప-వారి దైన్యంబుఁ బొడఁగని వ్యాకులాత్ముఁ
డౌ శివునిఁ దేర్పఁగా నెంచి యాకసమున-దర్శనంబిచ్చె దేవి సంతసముతోడ.

చ. తొలుతను దక్షయజ్ఞమునఁ దోఁచి యతర్క జ్వలనప్రవేశ మే
విలసితరూపునన్ ప్రకృతి వేడుక మాయను బొంది చేసెనో,
చలనము లేని నేత్రము లెసంగఁగ బ్రహ్మయు విష్ణుశంకరుల్
సలలితరీతిఁ గన్గొనిరి ఛాయను గాళికనుం బరాత్పరన్. ౬౯౦

ఆ. అపుడు శివునిఁ గాంచి యనియె నాయంబిక-కరుణ మదిని వెలయ గారవించి,
''దేవదేవ! నీవు దిగులు నెమ్మనమున-వదలు, మింక స్థిరతఁ బొదలుము శివ!

ఉ. మేనకకున్ హిమాద్రికిని మెప్పు జనింపఁగఁ గూఁతునై ప్రియం
బూని త్వదీయపత్ని నయి పూర్ణమనోరథయుక్తుఁ జేసెదన్,
మానసమందు సత్యమని మాటికి మాటికి నెన్నుచుండుమా
యీనుడి నిన్ను వీడనని యెప్పుడు నెందయునన్ మహేశ్వరా! ౬౯౨

క. భవదీయ హృదయదేశమె-యవును మహాకాళికాశ్రయంబుగఁ బ్రియమై,
శివ! నీవు మహాకాళుఁడ-వవుదువు లయకారకుండ వై జగమునకున్. ౬౯౩

క. నీవు ప్రభుత్వాహంకృతి-తో వచియించితివి నన్నుఁ దొల్లి, తదపరా
ధావిర్భూతిని బత్నీ-భావంబునఁ గొంతతడవు వదలినదానన్. ౬౯౪

తే. అచిరకాలములోనఁ ద్వదంతికమునఁ
జేరఁగలదానఁ, గడు శాంతచిత్తుఁడ వయి
యుండుము, మహేశ! నీ కిదే యొక్క-యుక్తి
తెలుపుచున్నాను వినుము సుస్థితిని బూని. ౬౯౫

క. ఆయుక్తి ననుసరించియె-చేయుము జతనంబు నిదు చిత్తంబున క
త్యాయత మోదము గలుగ న-మేయాకృతితో లభింతు మెచ్చుకొన శివా! ౬౯౬

క. పూర్వాకృతికంటె న-పూర్వశరీరంబుఁ దాల్చి, పొగడఁగ నన్ని
యుర్వి మనోహరనై, దృ-క్పర్వం బొనరింతు నీకుఁ బరిమోత్కర్షన్. ౬౯౭

సీ. ఆయుపాయం బేది యందువో వినుము దక్షమఖంబునందుఁ గృశానుఁ జొచ్చి
నట్టి మదీయఛాయాకృతి శిరమున ధరియించి, నన్ను సంస్తవమొనర్చు
చీయుర్వియంతయు నేపునఁ దిరుగు, మా దేహంబు బహువిధదివ్యఖండ
ములుగాఁగ నిద్ధరాతలమునఁ బడిపోవు నాస్థలంబెల్లను నధికసుకృత
తే. యుతమహాపీఠ మగుచుండు, యోని యొందుఁ
బడు నచటు పీఠవర్యమై పరఁగు, నందు

నీవు వసతిగ నిల్చి సద్భావమునను
దపమొనర్చినఁ గైకొందు నపుడె శర్వ!''   ౧౯౮

క. మునినాథ! యీవిధంబున-ననువగు యుక్తిని వచించి యనునయమును వే
డ్కను మాటిమాటి కొనరిచి-కనియెఁ దిరోధానమును జగద్ధాత్రి వెసన్. ౧౯౯

క. పరమేష్ఠిప్రముఖామర-వరు లరిగిరి స్వగృహములకుఁ, బరశివుఁ డంతన్
మరలి మరల దక్షుని మం-దిరమునకుం జనియె మిగుల దీనత మానీ!   ౨౦౦

శివుఁడు సతీదేహంబును వెదకి దానిని ధరించి నాట్యమాడుట

తే. 'ఓ ప్రియసతీ! సతీ!' యని యొక్కొ మొగిని
బ్రాకృతుఁడుపోలెఁ బలవించె భ్రాంతుఁడగుచు,
యజ్ఞశాలను జొచ్చి ఛాయాసతివర
గాత్రమును దాను వెదకుచు నాత్రమునను.   ౨౦౧

తే. ధరణియందునఁ బడియున్నదాని, ముద్రి-తంబులగు నయనములతోఁ దనరుదాని,
దీప్యమానంబగుచునున్న దేహలసిత-నందు ఛాయాసతిని హరుఁ డార్తిఁ గనియె.

తే. సహజమగు నిద్ర గూరిన చాన పోల్కి-చెక్కుచెదరని ఛాయను నక్కజముగఁ
గాంచి, శోకాగ్నిసంతప్తగాత్రుఁడగుచుఁ-బలికె నీరీతి నారదా! పరమశివుఁడు.

క. ''ఓసతి! నీకుఁ బ్రియుండను,-నీసరసకు వచ్చినాఁడ నే, లెమ్ము ప్రియా!
వే సంతసమున నాతో-నాసఁ బలుకవేల తొంటియట్టుల తరుణీ!   ౨౦౪

ఉ. తెప్పున నొనర్చినట్టి నను దక్షుని శోకసముద్రమందు లో
నిప్పుడు ముంచి యెచ్చటికి నేగితివో వడి మాయమై భ్రమన్
గప్పఁగఁ జేసి, నే వదలఁ గాంతరో! ని న్నెపుడైన, నెమ్మదిన్
మెప్పు వహింపఁబూని పుడమిన్ జరియింతును గొంతకాలమున్.''   ౨౦౫

క. ఈవిధమున శోకము మది-నావహిలన్ బహుముఖముల నాలాపంబుల్
గావించి ప్రాకృతునివలె-నావనితను గౌఁగిలించి హస్తయుగమునన్.   ౨౦౬

క. మునివర! యా ఛాయాసతిఁ-దన శిరమునఁ దాల్చి శివుఁడు తద్దయు మోహం
బున, సమ్మోదము మీఱఁగ-ఘననాట్యము సల్పె నపుడు కౌమ్రతలమందున్.

క. సురవరులగు బ్రహ్మాదులు-పరమాశ్చర్యంబుతోడ బలసి దివిఁ బురం
దరు మున్నిడుకొని యద్భుత-వరరథముల వచ్చి రభ్రపథమునఁ ద్వరగన్. ౨౦౮

క. కురిసెం బువ్వులవానలు-శిరమున జడలెల్ల వెలుఁగఁ, జిత్తామోదం
బిరవొందఁగ ముఖవాద్యము-ల రచించుచు నాడి రాటలన్ బ్రమథవరుల్.

సీ. శిరమునఁ గొండొకసేపు ధరించియుఁ, గుడిచేతియందునఁ గొంతతడవు,
వామహ స్తంబునఁ బ్రేమ నించుక కాల, మంసదేశంబునయందుఁ గొంత
వడి, భ్రూమధ్యమీఁదను బరమముదంబునఁ గొంతకాలం బుంచికొని సదాశి
వుండు నృత్యంబును నిండువేడుకతోడఁ గావించెఁ, జరణవిఘట్టనహతి
తే. నవని కంపించె, నారీతి నాడుచుండఁ-జంద్రలోకంబునందుండు చంద్రుఁ డపుడు
శంకరుని ఫాలభాగంపుఁ జక్కిఁ దిలక-ముగఁ బ్రకాశించె నారదమునివరేణ్య!

తే. వెలుఁగుచున్నట్టి జడలలో లలితభణితిఁ
దారల సమూహమెల్ల నుద్భాసమాన
ములుగఁ జెలువొందె, రవిలోకమునను నెగడ
రవియుఁ గంఠభూషణతను బ్రాలె నపుడు ౨౧౧

క. ధరణీభారముఁ బూనిన-యురగపతియుఁ, గూర్మరాజు నురుబాధితులై
హరనృత్యపు వడిఁ గదలికఁ-బొరసి తలల వంచి విసువఁబూనిరి పుడమిన్. ౨౧౨

క. శివనాట్యవేగవృద్ధం-బవు పవనంబునఁ గులాచలాళి వడంకెన్
భువిని సుమేర్వాదులు చె-ల్లనై ఖరిని నాత్మశక్తులను వీడి మునీ! ౨౧౩

తే. అఖిలభూతంబులును క్షోభమంద నాట్య-మాడి ఛాయాసతీవిగ్రహమును శిరము
నందు ధరియించి సకలావనిం దిరుగఁగ-బయలువెడలె దక్షక్రతువాటినుండి.

మ. పరమామోదముతోడ శంకరుఁ డెదన్ భావించె''నో ప్రేయసీ!
ధరణిన్ సిగ్గు త్యజించి ఛాయవగు నిన్ ధ్యానించుచున్ మూర్ధమం
దు రహిందాల్చి చరించువాఁడ మనమందున్ సంతసంబొప్ప, నే
వరభాగ్యంబు నొనర్చినాఁడనొ గదే పల్కాణు'' లం చాత్మలోన్. ౨౧౪

తే. పరమశివుఁడీవిధమున స్వభాగ్యగరిమ-వర్ణనము చేయుచును మదిఁ బ్రమద మెసఁగ
మరల నాట్యంబు గావించెఁ బరవశుఁడయి-నారదమునీంద్ర! యప్పుడ వారితముగ.

క. జగమంతయు క్షోభించెను,-ఖగములు చేష్టలను దక్కి క్ష్మాస్థలిఁ బడియెన్,
దిగులొంది యకాలప్రళ-యగతిన్ భూతతతి యొంచె నాత్మలయందున్. ౨౧౫

క. పరమేష్ఠియాద్య ఋషులున్-సరవిని గావించి రపుడు స్వస్త్యయనం, బా
తురులయి దేవత లెల్లరుఁ-బరమాశ్చర్యంబుతోడ భావమునందున్. ౨౧౬

క. ''ఇది యేమి విలయ మిత్తఱి-నొదవెను? జగమెల్లఁ గలఁగె, నుల్లములను నీ
యదనున కేయుక్తియుఁ దోఁ-పదు, లోకం బెట్లు నిలుచు భద్రస్థితిలోన్!

సీ. దక్షుండు మమ్మెల్ల ధ్వంసంబు గావింప, నీలోకము నశింప నెంచి శంక
రునకు విద్వేషంబు జనియింప హేతువైనట్టి కుయజ్ఞంబు యత్నమునను

గావింపఁబూనెనో ! కనుఁగొనఁజాలను, శంభుఁడు కడు సంతసంబునందు
మునిఁగి విఘూర్ణనయనుఁడయి లోకంబులకుఁ గల్గిన విపత్తు నకట ! తలఁపఁ,
ఆ. డేమి చేయువార, మేరీతి లోకసం-హారకారకుఁడు మహానుభావుఁ
డాదిదేవుఁ డెట్లు లందును శాంతంబు?-మదిని జింతసేయఁ ద్రిదశులిట్లు. ౭౨౦

విష్ణువు ఛాయాసతీదేహమును ఖండఖండములు చేయుట

క. ఘనగంభీరస్వానము-నను బల్కెను "త్రిదశులార ! నా వాక్యము నె
మ్మనమున నిడి తద్యుక్తిని-నొనరింపుఁ" డటంచు దేవి యొయ్యనఁ బలికెన్. ౭౨౧
సీ. "జతనంబులోఁ దుత సల్పుఁ డిపుడె ఛాయ విగ్రహం బీభువి వివిధఖండ
ములుగాఁగఁ బడు సత్యముగ, నెందుఁ దత్ఖండ మాశ్రయించునో యదియధికపుణ్య
సంభృతక్షేత్రమౌ, శక్తిమహాపీఠ మనఁబడి నుతికెక్కు నమరులార !
యేను పల్కినది సత్యేతరం బెప్పుడుఁ గానోపఁజాలదు, కనుఁడు మీర,
తే. లట్టి ఛాయాసతీవిగ్రహము ధరాత-లంబునందునఁ గడు సాహసంబుతోడ
సృష్టినెల్లను రక్షింపఁ జిత్తమునను-నెంచి కావింతుఁ దోడ్పాటు నెట్టులనిన. ౭౨౨
మ. పరమానంద నిమగ్నుఁడౌ హరుశిరోభాగంబునం దీప్తమౌ
వరఛాయాతనువున్ సుదర్శనమునన్ బల్పొప్పనిక్కి ఖండంబులై
ధరమీఁదన్ బడునట్లొనర్తును జగద్రక్షార్థమై వేగ, శం
కరుఁ డాత్మన్ దెలియంగ ముగ్ధుఁడయి యాకార్యంబు నేఁ జేసినన్. ౭౨౩
తే. శివుని కోపంబునుండి రక్షింతు"నంచు-బ్రహ్మమయి యగు నాదేవి పరమకరుణ
విష్ణుఁ గని యనె "నోహరీ! వేగ నివె-తిచ్ఛరీరంబు నటుకంగఁదగును విపుడు."
సీ. అంత జగన్నాథుఁడైన మహాబాహుఁ డాదినారాయణుం డాత్మచక్ర
మగు సుదర్శనము చే నంది ఛాయాసతీదేహంబు ముక్కలై తెగి పడునటు
ఖండించివైవ, శంకరు భయంబున మహాభీతుని కైవడిఁ, బృథివిమీఁద
నానందమగ్న నిజాంతరంగుం డగు శివుని శిరంబుపైఁ జెలఁగుచున్న
తే. యట్టిపరమేశ్వరీదేహమప్పుడునటుకఁ-జక్రమునువైచె నాట్యంబునసలుపుచుశివుఁ
డంఘ్రికమలంబు నెత్తి తా నవనినుంచి-నట్టి యవసరమునయందు యత్నమునను.

అష్టాదశ పీఠకారణము

తే. నారదా ! విష్ణుని సుదర్శనమున ఖండ-ములయి వేర్వేఱఁ దద్దేహమునఁ గలయవ
యవము లవనిపయిం బడె వ్యాప్తిఁ జెంది,-వినుము తన్మహిమంబును విస్తరింతు.
క. ఎందెందుఁ దచ్ఛకలములు-పొందుగఁ బడె నట్టిచోట్లు ముక్తిప్రదముల్,
బృందారకదుర్లభములు-మందగతిన్ సిద్ధిపీఠ మహిమాఢ్యంబుల్. ౭౨౪

క. అవియె మహాక్షేత్రంబులు-భువి నాక్షేత్రములె సుమ్ము మునిజనపూజ్యా!
ప్రవిమల పుణ్యప్రదములు-సువిశదదీప్తియుతములు విశుద్ధమనీషా! ౭౨౮

సీ. ఆతీర్థముల దేవి నాత్మలో ధ్యానించి హోమపూజాదుల నేమమునను
నొనరించువానికి నొనఁగూడుఁ గోటిగుణితమగు ఫలము సంతతము మాని!
యందు మహాదేవి నత్యంతభక్తితో జపియింప దేవి సాక్షాత్కరించు,
బ్రహ్మహత్యాదిదుష్పాపంబు లొందిన పాపి యందు విముక్తిఁ బడయఁగలఁడు,
తే. సర్వలోకహితార్థ మీయుర్విఁ బడిన-యట్టి ఛాయాసతీమణియంగశకల
సమితి యెల్లను శిలలయ్యె క్షణములోన-నద్భుతంపడ లోకంబునందు సురలు.

తే. బ్రహ్మవిష్ణు మహేశ్వరుల్ పాకశాస-నాదిసురు లరుదెంచి సేవార్థ మీశ్వ
రిని నుతించిరి, తీర్థంబులను జెలంగి-రపుడు పరమేశ్వరిని గొల్చు చమితభక్తి.

ఆ. చక్రపాణి యిట్లు ఛాయాసతీగాత్ర-మును సుదర్శనమున మొనసి నఱుక
శివుఁడు బరువులేని శిర్షంబును నెఱింగి-యాత్మయందు ధైర్య మంది మిగుల.

తే. జంగమస్థావరంబగు జగతియెల్ల
వ్యాకులముఁ బొందియుండుట నాత్మ నెఱిఁగి
చక్కఁగాఁ జూచె, నంతలోఁ జక్రపాణి
యంతయును గాంచి యోజించి యతిశయముగ. ౭౩౨

నారదుఁడు శివుని శాంతింపఁజేయుట

తే. బ్రహ్మపుత్త్రుఁడైనట్టి నారదునిఁ గాంచి-"దేవదేవుని సముఖంబు నీవు చేరి
సాంత్వనోక్తులఁ దగఁ బల్కి- శాంతికలుగు-నట్లొనర్పుము, భద్రంబు లమరు నీకు.

క. నీవే నేర్పరి వగుదువు-భావింపఁగ బ్రహ్మపుత్త్ర! బహుచతురమతి
ప్రావీణ్యుఁడ, వదనెఱిఁగి సు-సేవాదృతి నెఱపవలయు శివునకు మిగులన్.

ధ్రువకోకిల. సతివియోగము చేత నిప్పుడు సంతసంబును దక్కి తా
మతిని దుఃఖముఁ బూని శంభుఁడు మానకేక్రియ నెట్టు లే
గతిఁ దలంచునొ? లోకజాలముఁ గాల్చునో? యెఱుఁగంగ నే
వితమొ? నారద! లోకనాథుని వృత్తముం గనఁబోలునే? ౭౩౫

ఉ. శాంతముఁ బూనియుండుటకు శంభున కెయ్యది తృప్తియిచ్చునో,
యెంతయు శ్రద్ధతోఁ దెలియ నీవె సమర్థుఁడ వౌదు నారదా!
శాంతునిఁ జేయు పల్కులను సాంత్వనరీతి నొనర్పనౌఁ, గ్రియా
వంతుఁడ వీ" వటంచుఁ బనుపన్ హరి, నారదుఁ డేగె, నంతటన్. ౭౩౬

తే. దేవదేవుని సన్నిధి దివ్యభక్తి-నంజలినిబట్టి నారదుం డట్టె నిలిచె,
నాట్యమొనరించుచునుమునినాథుఁ బ్రాంజ-లియుతుఁగనిశంకరుండుపలికెనునిట్లు.

క. "మునినాథ! తెలుపవే దయ-ననువున మత్ప్రాణకాంతయగు సతి యెటకుఁ
జనెనో, యాసాధ్వీమణి-యునికిని ద్వరితముగ మదికి నుత్సుకత గనఁ."

క. అని శంకరుఁ డడుగఁగ న-మ్మునిచంద్రుఁడు నారదుండు "బుధజననుత! నే
వినిపింతు వినుము శాంతం-బును బూని మనంబునందుఁ బూనిక వెలయఁ.

క. శంకర! సర్వవిధంబుల-శంకింపఁగవలవ, దింక సతి నీసరసఁ
బొంకముగఁ జేరఁగల, దే-ణాంకధరా! నిత్య యెందు నలరుట వినవే? ౭౪౦

మ. పరమేశా! భవదీయపత్ని సతి యభ్రంబందుఁ దా వెల్గుచుఁ
బరమామోదముతో వెసం జనుట సంభ్రాంతిఁ విలోకించి యే
వెరవుఁ గాననియట్లు ప్రత్యయ మెదఁ విన్నాణివై పొంద, ఏ
కరణిఁ జూడకు, మింక సుస్థిరుఁడవై కల్యాణముం గోరుమా! ౭౪౧

క. జగములకునెల్లఁ బ్రళయం-బగువిధమును బూనవలదు, హర్షముతో ని
మ్మగనుండం బ్రార్థింతును-ద్రిగుణాత్మక!" యనఁగ మునిపతిని గని శివుఁడుఁ.

ఉ. "నారద! మీకు నే వికృతి నావలనఁ గలుగంగనోపు నెం?
దారయ నేమి చేయఁగల? నంతయు నిట్లు వచింతు వేల ని
ష్కారణతఁ? మహాప్రళయచర్య యదెట్టిది చేసినాఁడ దు
ర్వారముగాఁ బ్రపంచము విరామముఁ బొందఁగ? నిప్డు తెల్పుమా. ౭౪౩

క. ఏను సతీవిరహంబున-మానస మతిదుఃఖమునను మ్రందఁగ ఛాయా
మానశరీరము శిరమునఁ-బూని మఱచియుండ దుఃఖమును బరవశతఁ ౭౪౪

తే. కుమతి యెవ్వఁడో తచ్ఛరీరమును నపహ-రించె నాశీర్షముననుండి వంచనమున."
ననఁగ నారదముని శివునధిక భక్తి-వినయములఁ గాంచి "శంకరా! వినుము మనవి.

తే. శాంతచిత్తుఁడ వగుము, నే నంతయు విశ-దీకరించుచునున్నాఁడ, దివ్యచిత్త
మున నవధరింపుము ప్రసన్నతను మహేశ!-మమ్ము మన్నింపుమో దేవ! సమ్ముదమున.

క. లయజనకంబగు నృత్యము-భయదము వదలుము మహేశ! వసుమతి యాప
న్నయయి గతిలేక యున్నది-దయఁదలఁపుము పుడమిపయి సదాశివ! మిగులఁ.

క. గిరులు చలించెను, నిర్జర-వరు లమరావతిని వడిగ వదలిరి దేవా!
సురమానవయుతలోకం-బురవడి నాశంబుఁ బొందుచున్నది దేవా! ౭౪౫

క. అకటా! స్వకృతం బగు నీ-ప్రకటితలోకక్షయంబు భావింపవు పా
యక నృత్యచ్ఛలమున జగ-తికి నాశముఁ గూర్చె దేల? దేవ! శరణ్యా!

తే. ఈవిధమున స్వకార్యార్థ మీశ! సర్వ-జగమును వినాశనముఁ జేయఁ జనునె? దీని
నంతయుఁ ద్రిలోకరక్షకుఁ డైన విష్ణుఁ-డచ్చెరువుతోడఁ గనుఁగొనియాత్మఁదలఁచె.

చ. హరి నిను నూఱడించుటకునై మొదనెంచి సుదర్శనంబుఁ దాఁ
గరమునఁ దాల్చి మెల్లఁగను ఖండములౌనటు ఛాయకాయముం
గరము వడిం బొనర్చెఁ గడికండలుగా, నవి యెచ్చటం బడెం
బరఁగను క్షేత్రమై యచటఁ బ్రాజ్యసుపీఠము నై మహాప్రభూ! ౭౫౧

తే. కామరూపాదులగు పీఠగణము లవియె,-నీవు ప్రార్థింపఁగాఁ దొల్లి దేవి తాన
యానతియొసంగెఁగద! పరమాదృతిని బ్ర-సిద్ధిఁగవఁగ మహాపీఠసేవ్యయగుచు.

క. ఆకారణమును మది నిడి-శ్రీకాంతుఁడు చక్రి భువికిఁ జింతల నెల్లం
బోకార్పఁగ ఛాయాసతి-దా కాయము సఱకెఁ జక్రహతి నో దేవా!'' ౭౫౩

శంకరుఁడు విష్ణువునకు శాప మొసంగుట

క. అని నారదముని తెలుపఁగ-విని శంభుఁడు నర్తనంబు వేగ నిలిపి వెం
టనె నిట్టూర్పులఁ బుచ్చి హ-రిని గూరిచి శాప మొసఁగె హృదయావిలతన్.

ఉ. ''భూతలమందు మానుషతఁ బుట్టునుగావుత! త్రేత భాస్కర
ఖ్యాతమహాన్వయంబున జగత్పతి విష్ణుఁడు నిశ్చితంబుగా,
సీతతి నాదు శాపమున నెంతయు నాయవతారమందు వి
ఖ్యాతమనోహరాంగియగు నాతనికిం బ్రియకాంత నారదా! ౭౫౫

సీ. నాప్రాణవల్లభ నను విడనాడి ఛాయాసతి నునిచి మాయావిమోహి
తాత్ముగా నొనరించి యరిగె న దేక్రియ హరిసతీమణియును నట్టివిధము
న నె మాయతో ఛాయనునిచి వెళ్లఁగఁగల,దాహరి మదినిఁ బ్రమోహితుఁడయి,
యానందమగ్నచిత్తాబ్జుఁడై దూరంబుగా వియోగము చేతఁ బోవఁగలఁడు,
తే. ప్రాణకాంతావియోగసంభరితుఁడ నగు-నన్నతఁడు క్రూరరాక్షససన్నిభుఁడయి
కష్టపెట్టినరీతి రాక్షసునివలనఁ-దా ననుభవించుఁగాక! సత్యముగ భువిని.

తే. సతివియోగముచే శోకహతహృదయయు
నిని మహాసురకృత బాధ నెనయుఁగలఁడు,
నేను దుఃఖించునట్లుగాఁ దాను దుఃఖ
మందుఁగాక! నారద! సంతియంబు లేక.'' ౭౫౭

క. ఈవిధమున శాపంబిడి-యావిష్ణువునకును శంభుఁ డంతెను శాంతం,
బావల నేత్రత్రయమును-దా విప్పి జగత్త్రయంబుఁ దత్పరతఁ గనెన్. ౭౫౮

తే. కామరూపమునను యోనిఁగాంచిగిరిశుఁ-డపుడు రోమాంచితశరీరుఁడయి నికామ
కామసంక్షుభితాత్ముఁడై కరముప్రీతి-మదిఁగడలొ్కన నాత్సుక్యమగ్నుఁడగుచు.

చ. కనుఁగొనినంతలోపలనె తత్స్థలి వ్రీలఁగఁజేసి యోని యొ
య్యన నహిలోకముం జనెడునట్టుల నుండ, శివుండు స్వాంశచే
ననువునఁ బర్వతాకృతిని నప్పుడె పూని ధరించి దానిఁ బే
ర్కొనుచు స్వకీయభాగ్యమును గోరిక మీఱఁగ నెమ్మనంబునన్. ౭౬౦

తే. కామరూపాదులైన యాతత్స్థలిఁ గల
సర్వపీఠంబులందుఁ బాషాణలింగ
రూపమును దాల్చి శివుఁడు సేవాపరాయ
ణాత్ముఁడయి నిల్చె నారదా! యతిముదమున. ౭౬౧

తే. యోనిపీఠమునం దపోయుక్తుఁడయి మ-హేశ్వరినిఁ బొందిమరలఁ దా నెదఁ దలంచెఁ
దొల్లి దేవి వచించిన యెల్లనుడుల-యోజన మొనర్చి మునినాథ! యుత్సుకమున.

క. అంతట శాంతుండయి శివుఁ-డెంతయు యోగైకనిరతి నెసఁగెను మునియున్
సంతసమంది స్వకీయని-శాంతమునకు గగనమునను జనియె మునీంద్రా! ౭౬౩

పంద్రెండవ అధ్యాయము

నారదుఁడు విష్ణ్వాదులకు శివుని భావంబు దెలుపుట

క. అంతట నారదముని య-త్యంతశుభంబయిన విష్ణునంతికమును దా
సంతసమునఁ జేరి శివుని-వింతచెయిదములను దెలియ వినిపించె వెసన్. ౭౬౪

సీ. ఆకులీభూతుఁడౌ హరుననభిశాపాదికములెల్ల విని శంభుఁ గాంచఁగోరి
బ్రహ్మయు విష్ణువుఁ బరమాద్భుతిని గామరూపంబుల ధరించి రుద్రు నశ్రు
ధారాభిసంసిక్తతనుని దుఃఖక్షుభితాంతరంగు మహేశు ననునయింపఁ
దత్సమ్ముఖమునకుఁ దరలి చేరిరి, శంభుఁడును వారిఁ గని తన వనిత వివిధ
తే. ములుగ నాక్షేపణ మొనర్చి బుద్ధిలేని-ప్రాకృతుఁడువోలె వనరఁగా బ్రహ్మవిష్ణు
వులు ప్రియంబును దీపింపఁ బలుకఁదొడఁగి-రపుడు శాంతుని జేయ విప్రవరచంద్ర!

ఆ. "దేవదేవనాథ! ధృతిఁ దూలి శంకరా!-వగవ నేల వ్యర్థముగను సతిని
గాంచియును సమస్తకార్యంబు లెఱిఁగియు-మూఢుపగిది మాయ మునిఁగి యిట్లు?"

సీ. బ్రహ్మవిష్ణులు తన్నుఁ బ్రశ్నింపఁగా నిట్లు శివుఁడు వారలఁ గాంచి చెప్పఁదొడఁగెఁ
"ప్రకృతిరూపిణిఁ బరబ్రహ్మాత్మికను సృష్టిసంస్థితిలయముల జరపు శక్తి
గల పరదేవి గాఁగను నిత్యశుద్ధగాఁ దెలియుదు, నిజము మీ పలుకు, దక్ష
యజ్ఞంబు విధ్వంసమైన యనంతరం బాసతిఁ గాంచియు నాత్మఁ బూర్వ
తే. రీతిఁ బత్నిస్వభావముచేతఁ గానఁ-బడకయున్నది, హేతు వేర్పడదు చూడ,
నిపుడునాకుగ్రహంబునం దెంతయువ్యథ-గలుగుచున్నది, మదికడుఁగలఁతఁజెందె.

తే. బ్రహ్మవిష్ణులార! పరమేశ్వరిని బూర్వ-రీతి భార్యగాఁగఁ బ్రీతి మరల
నెట్లు పొందఁగలనో యెఱిఁగింపుఁడీ యుపా-యంబుఁ దగినయట్లు లరసి మీరు."

ఉ. నా విని బ్రహ్మవిష్ణులు సనాతనుఁడైన మహేశుఁ గాంచి "యో
దేవ! ప్రశాంతిఁ బొంది పరదేవిని మానసమందు నుంచి సం
భావనతోడఁ జేయుము తపంబును, నిచ్చటు పీఠరాజమా
దేవిఁ గామరూప మను దివ్యనివాస మభీష్టదం బగున్. ౨౬౯

ఉ సాధకులైనవారికిఁ బ్రశస్తఫలంబుల నిచ్చుచోటు, ని
ర్బాధకమైన తా విధి, ప్రభావములోఁ దగు,నిందు దేవి స
త్సాధనయుక్తిఁ దానె వరదానము చేయును, నిక్క-, మిందు నా
రాధనముం బొనర్పుము,పరాత్పర మెచ్చుచు నిచ్చుఁ గోరికల్. ౨౭౦

తే. ఈమహాపీఠమాహాత్మ్య మెవ్వరేని- తెలుపఁజాలరు, సర్వజ్ఞ! తెలియు దీవె,
సర్వము నెఱుంగుదువు,చిత్తశాంతిఁబొందు,-మేము తెలుపఁగ నేర్తుమేయీశ! నీకు!"

ఆ. బ్రహ్మవిష్ణులిట్లు పలుకఁగా శంకరుఁ-డనియె వారితోడ నర్థనియతి
"నుగ్రతప మొనర్పనున్నాఁడ నింక, మీ-యుక్తి లెస్సయగుచు నాదనెనాకు"

చ. అనుచు విరించికిన్, హరికి నాదృతిఁ జెల్పి తపంబుఁ జేయఁ బూ
నెను సుసమాహితుండగుచు నిర్మలమై తగు కామరూపమన్
ఘనమహిమాఢ్యపీఠమునఁ గామితదన్ బరమేశ్వరిన్ మనం
బున నొగి నుంచి, ధ్యానమును బూనికతోడుత నాచరించుచున్. ౨౭౧

తే. బ్రహ్మయును, విష్ణు వాపీఠవరమునందె-నిలిచియుండిరి,భక్తితో సలుపఁ దపముఁ
దీవ్రముగ శంకరుండిట్టు దృఢమనస్కుఁ-డగుచు బహుకాల మరిగెసంయమివరేణ్య!

తే. అంతఁ త్రైలోక్యమోహినియైన లోక-జనని తత్తపమున కాత్మ సంతసంబు
నొంది,ప్రత్యక్షమయి "యుల్లమందు నేమి-యభిలషించితిరో తెల్పుఁ"డనఁగ శివుఁడు.

మ. "దయ పెంపారఁగ నాపయిన్ మునుపు మద్భార్యాత్వముం బొంది యే
క్రియ నాకుం గడుఁ గూర్చుచుంటివో లసత్ప్రేమాఢ్యవై, యిప్పుడున్
దయ నాపైఁ బ్రసరింపఁ జేయుచుఁ గళత్రత్వంబుఁ జేకొమ్ము మ
త్ప్రియవాంఛాప్రదవేసి లోకజనయిత్రీ!" యంచుఁ బ్రార్థించినన్. ౨౭౨

సీ. ఆప్రార్థనంబు నత్యాదరంబున విని జగదంబ పలికె "నో జగదధీశ!
యతిశీఘ్రముగను నే నవతరించెద హిమాద్రికిఁ బుత్త్రికను నయి ద్వివిధముగను,
నిక్క- మియ్యది,నీవు నృత్యంబుఁ దమి సల్పినాఁడవు శిరమున నన్నిడుకొని,
దాన గంగ యనంగఁ దనరుచు జలరూపమున నీకుఁ బత్నినై మూర్ధమందు

తే. వెలయుదానను, మఱియొక విధము వినుము
పార్వతి యనంగఁ బరఁగుచుఁ బత్నినగుదు,
నీదు గేహంబునందున నిలిచి పూర్ణ
ముగను నీయందె పత్నీత్వమును వహింతు." ౭౭౭

తే. అనుచు శివునకు వరమిచ్చి యజుని హరిని-గాంచి తద్వాంఛ లొసఁగి యక్కజముగలుగ
మాయమయ్యెను నారదా! మహితగుణ వి-శారదా! జగదంబికాశక్తి వినుము.

చ. ద్వివిధములైన రూపముల దేవి హిమాద్రిని జేరి మేనకన్
బ్రవిమలగా మదిం గని ప్రభావము మీఱఁగ నామె గర్భమం
దు విశదరీతిఁ జొచ్చి భువి దుర్గ యనంగ వెలింగె, గంగ నాఁ
గ వెలసెఁ బెద్ద, పార్వతి జగంబునఁ జిన్నయునై శుభాకృతిన్. ౭౭౯

క. పరిపూర్ణచిత్తుఁడై శం-కరుఁ డా కామాఖ్యపీఠిఁ గరము నియతితో
నురుభక్తిఁ దపము చేయుచు-నురలన్ నివసించె దేవి మహిమ కలరుచున్.

తే. అమ్మహాపీఠమహిమచే నంబ తాను-శంకరునకును బ్రీతి సాక్షాత్కరించి
హృష్టయయి యిచ్చె వరముల నెల్లనపుడె-కరముత్తృప్తిని నారదవరమునీంద్ర!

తే. ఎవ్వఁడేనియుఁ గామాఖ్య నెసఁగునట్టి-దివ్యపీఠమునందు భక్తియుతుఁడగుచు
దేవిని గుఱించి ధ్యానించు దివ్యశక్తి-వాంఛ లొసఁగును వానికిఁ బరమమహాని!" ౭౮౨

క. అనుచు మహాదేవుఁడు స-న్మునిని నారదుఁ గాంచి తెల్ప, మునినాథుఁడు వం
దన మొనరిచి "దేవా! నే-వినఁగోరితిఁ దెలియఁబలుకవే విశదముగాన్. ౭౮౩

తే. కామరూపపీఠంబునఁ గల మహిమము-చెలఁగు నేరీతిఁ? బ్రత్యక్షఫలము లిచ్చుఁ
దానె భగవతి యచ్చోటఁ దను భజించు-వారి కందఱు, నిక్కమే వామదేవ!

క. ఇలఁగల పీఠంబులలో-పల నుత్తమ మనుచు వింటిఁ బరమేశ్వర! స
త్ఫలసిద్ధి నొందితివి, ము-న్నలిపి తపము దేవిఁ గూర్చి సంయుతమతివై." ౭౮౫

తే. నారదముని ప్రశ్నముల విని గారవమునఁ-దెల్పఁదొడఁగెను నమ్మహాదేవుఁ డిట్లు
"దేవివగు దివ్యపీఠంబు లీవసుధను-నారదా! యేఁబదొక్కటి నాఁగ వెలయు.

తే. ఎందు ఛాయాసతీదేహమందు వెలయు
నంగములును బ్రత్యంగము లవని నవిసి
పడియె నవి పీఠములనంగఁ బరఁగె, నందుఁ
గామరూప ముత్తమమయి భూమి నెసఁగె. ౭౮౭

తే. తాన భగవతి నివసించుఁ దమిని గామ
రూపపీఠోత్తమమున విశ్రుతమనీష,

నందు లౌహిత్యసలిలంబులందుఁ గ్రుంక
ముక్తుఁడగును బ్రహ్మఘ్నుండు పూని కనపుడె. ౭౮౮

క. ద్రవరూపమున జనార్దనుఁ-డు వసించును బ్రహ్మపుత్త్రుఁడును నా హ్రదమం
దవగాహనంబుఁ జేసినఁ-బ్రవిముక్తుండగును బాపసంక్తులవలనన్. ౭౮౯

తే. శాస్త్రవిహితరీతి స్నానంబుగావించి-భక్తియుక్తుఁడగుచు వార్చి పితరు
లనుగుణించి శ్రద్ధగను దర్పణంబొన-ర్చిన నరుండు సిద్ధిఁ జెందు నందు. ౭౯౦

"కామేశ్వరీంచ కామాఖ్యాం కామరూపనివాసినీం,
తప్తకాంచనసంకాశాం తాం నమామి సురేశ్వరీం."

క. ఈమంత్రముతో భక్తుఁడు-కామేశ్వరి మదిని నిలిపి కడుభక్తిని బల్
నీమమున నమస్కృతులను-గామితములఁ దలఁచి చేయఁగాఁదగు వహాసీ! ౭౯౧

తే. అంత మానసకుండంబుపొంత కరిగి
మజ్జనాదులఁ గావించి మహితనియతి
కామరూపాఖ్యపీఠంబుఁ గాంచునతఁడు
ముక్తుఁడగు, వేఱువిధమున ముక్తిఁగనఁడు ౭౯౨

క. పరమేశ్వరి సంపూజన-ము రచించి జపంబు హోమమును దంత్రవిధిన్
జరపిన నరుఁ డొందు ఫలం-బుకులెర మగుఁ, దెలుపఁజాల నోమునినాథా! ౭౯౩

క మునివర! యాక్షేత్రంబున-జనుఁ డెవ్వఁడు మృతిని బొందుఁ, జయ్యన వాఁ డొం
దును ముక్తి త్రిసత్యంబుగ,-ననుమానము లే దొకించుకైనను నిందున్. ౭౯౪

ఉ. చెప్పఁగనేల? వేవిధుల క్షేత్రము పావన మిద్ది, దేవతల్
తప్పక కోరుచుంద్రు మృతిఁ దారు మహాఫలదం బటంచు నిం
దెప్పుడు, మానవాదుల మహేచ్ఛ వచింపఁగ నేల నారదా!
చెప్పితి సంగ్రహంబుగ, విచిత్రతరం బగు నెందు నెంతయున్. ౭౯౫

తే. కామరూపమాహాత్మ్యంబు కల దురితము-లెల్లఁ బోఁగొట్టఁజాలు మహీసురర్వ!
శంకరుం డందు నివసించి స్తవమొనర్చి-తపము గావించుచుండె నెంతయును భక్తి.

చ. సతియును రెండురూపులఁ బ్రసన్నతఁ జేరె హిమాద్రిగేహమున్,
ధృతి మును దానె యాప్రకృతి నిల్చెను దక్షుని యింటఁ బుట్టి స
మ్మతి మహనీయకీర్తులను మ్మాస్థలి లోకముల్లెల్ల రక్షణం
బతులితరీతిఁ జేయఁదగు నంచును నెంచి కడింది కోరికన్. ౭౯౭

తే. మేనకాగర్భమును జొచ్చె మౌనినాథ!-తచ్చరిత్రంబు సర్వపాతకహరంబు
పరమభక్తిని వినువాఁడు భవుని దివ్య-భావమును బొందు దేవీప్రభావమునను.

సీ. ఎవ్వఁడు విను భక్తి నిద్దేవిచరితంబు వానికి నరులు, గీర్వాణవరులు,
యక్షరాక్షసులు, సిద్ధౌఘంబు, గంధర్వు లెప్పుడు వశులయి యొసఁగుచుండ్రు,
సతత మెచ్చటనైన సర్వజీవులు వాని యాజ్ఞకు లోఁబడి యణఁగియుండు,
దుష్కరంబును నతిదుర్గమంబును నగు కార్యముల్ సరళతఁ గ్రాలుచుండు,

తే జన్మజన్మార్జితములైన సకలపాప
ములు నశించును త్రుటిలోనఁ, గులము మిగుల
వృద్ధిఁ బెంపొందు, రిపుతతి వెఱచి యడఁగు,
నింత నిక్కువ మోసంయమీంద్ర! మఱియు. ౭౯౯

చ. జననము నొంది యీజగతి సంస్కృతి నెవ్వఁడు కామరూపమం
దునఁ గలయట్టి సన్మహిమఁ దోరపుభక్తి వినండొ, వానిదౌ
జనిగనమర్త్యలోకమున సంయమినాయక! వ్యర్థమంచు నె
మ్మనమున నెంచఁగాఁదగును మాటికిమాటి కసంశయంబుగన్. ౮౦౦

తే. అపరిమితపాపమును జేసినట్టివాఁడు-నాక్షణంబ జీవన్ముక్తి నందఁగలఁడు
సంస్కృతివ్యాధిహరభేషజంబు దేవి-చరితమును భక్తి విన్నచో సన్మునీంద్ర!"

వ. అని చెప్పిన ననంతరకథాశ్రవణలాలసుఁడై యడిగిన నారదునకు మహాదేవుండు.

సకలనిగమవేద్యా! సన్నుతానంత విద్యా!
ప్రకటిత పరమార్థా! బ్రహ్మవిద్యామహార్థా!
సుకవి వినుతపాదా! సూరిచిత్తప్రమోదా!
యకలుషవరశీలా! యద్భుతాత్మైకలీలా! ౮౦౩

గద్యము

ఇది శ్రీలలితాత్రిపురసుందరీ కరుణాకటాక్షవీక్షణ సమాసాదితోభయభాషాకవితావిభవ,
జనమంచి వంశప్రభవ, కాశ్యపసగోత్రోద్భవ, సుబ్బయార్యతనూభవ, కావ్యపురాణతీర్థ
విద్వద్బిరుదవైభవ వేంకటసుబ్రహ్మణ్యశర్మ విరచితంబగు శ్రీమహాభాగవతంబునందు
ద్వితీయాంశము

శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ

*

శ్రీ మహా భాగవతము

తృతీయాంశము

పదుమూఁడవ అధ్యాయము

క. శ్రీనాథాదిగురుత్రయ-మానిత పాదాబ్జయుగళ మహితైశ్వర్యా!
నానాచరాచరాత్మా-ధీనస్వార్థ ప్రకాశదృఢహితచర్యా! ౧౦౪

గంగాజననము

చ. వినుము కుమార! చెప్పెదను విస్తృతి దేవిచరిత్ర మెల్లఁ, దా
ననువున రెండురూపముల వంది హిమాచలపత్ని మేనకా
వనితకుఁ బుట్టి తొల్దొలుతఁ బర్వతరాజతనూజయై ద్రవా
త్మను హరు శీర్షమందు మహిమన్ దన యంశముచే సితప్రభన్. ౧౦౫

క. నివసింపఁబూనెఁ బూర్ణం-బవు రూపముతోడ నంత హరు సామేనన్
దవిలి ప్రియంబున విశదం-బవు కీర్తిని నెగడె భార్యయయి గౌరి యనన్.

తే. గంగనా దేవి యేరీతిగా జనించె-నాచరిత్రంబు వచియింతు ననఘ! వినుము
బ్రహ్మహత్యామహాపాపపతితుఁడైన-వినియెనేనియు శుద్ధుఁడై వెలయు దీని.

సీ. మేరుపుత్త్రికయయి మేదినీధరపత్నియయిన మేనకగర్భమందుఁ బుట్టె
సతి నిజాంశంబున సర్వాంగసుందరి మంజులాననయయి మహితరీతి
వైశాఖమునఁ గృష్ణపక్షతృతీయాదినార్ధభాగమునందు నమలినమగు
శుక్లవర్ణాంగియై శోభిల్లుచుఁ ద్రినేత్రములతో నసితవర్ణముల వెలుంగు

తే. భవ్యనేత్రాంతములతోడ భాసమాన-యగుచునుండఁగ నద్రీంద్రుఁ డమితహర్ష
యుక్తుఁడయివినితామంగళోత్సవంబు-సలిపిబహుదానములొసంగె సజ్జనులకు.

తే. వానకాలమున నదివలె వారిచేతఁ-జంద్రకళవలె శుక్లపక్షంబునందు
జనకుఁడైనట్టి హిమశైలసద్మమందు-నంద మొప్పార నభివృద్ధి నొందుచుండె.

హిమవంతునికడకు నారదుఁడు వచ్చుట

సీ. ఒకనాఁడు హిమవంతుఁ డోడియుండుఁ బ్రియపుత్త్రినాసీనఁ గావించి యతిముదమున
నంతిపురంబందు నానందమును జెందుచుండఁగా బ్రహ్మపుత్త్రుండు ప్రాజ్ఞుఁ
డగు నారదుఁడు విజయముచేసెఁ, గామరూపమునందు శివుని తపంబుచేత
నారాధ్యయగు దేవి యవతరించెనుగదా స్వాంశచే నని తన స్వాంతమందు

ఆ. ననువుఁ దెలిసి యెంతయును, గిరినాథుండు-మునిపదాబ్జములకు మ్రొక్కి-యపుడు
పాదములను గడిగి భక్తి నాచమనంబు-నిచ్చి వినయమునను నిట్టులనియె. ౧౧౦

క. "మునినాథ! భాగ్యవశమున-ఘనమగు మీదర్శనంబు గలుగును భువిలోఁ,
గనుఁగొన్న వాఁడ,నిపుడే-మినిమిత్తమొ తెల్పుఁడయ్య మీరాక" యనన్. ౧౧౧

క. "భువనములయందుఁ దావక-భవనంబున సుందరాంగి వరకన్య యొక
ర్తవతారమొందెనని విని-యవలోకింపఁగ గిరీంద్ర! యరుదెంచితి" నాన్. ౧౧౨

క. మునిపల్కుల విని "యాహా!-ఘనభాగ్యము గలిగె నాకుఁ గన్యకఁ జూడన్
జనుదెంచిన సురదుర్లభు-లను మిము గనుఁగొనుట నియ్యెలన్ మునినాథా!"

క. అని హిమగిరి పల్కఁగ న-మ్ముని "సురదుర్లభ జనించెఁ బుత్రికవై, నీ
కును సాటి యెవరు? ధన్యతఁ-గనినాఁడవు సర్వభాగ్య కలితసుకృతివై." ౧౧౪

సీ. ఈరీతి నారదుఁ డెంతయు వచియించి పరమకౌతుకమున భాగ్యరాశి
యయిన యాకన్యక నాదృతి నద్రినాథాంకంబునం దుండి యనువుమీఱఁ
దన యంకమున నుంచికొని భువనత్రయపావని గంగను భాగ్యవంతుఁ
డను ధన్యుఁడ నటంచుఁ దనువు గగుర్పాటు గలుగఁగననియె వాక్యమును,మఱియుఁ

తే. బర్వతేంద్రుని గనుఁగొనిపలికెఁ "బర్వ-తాధిపతి! సుతఁ దెలియుదే"యనఁగ గిరివ
రుండు "శుభలక్షణనుగాఁగ రుచిర దేహఁ-గా నెఱుంగుదునొండెఱుంగ నుమునీంద్ర!

తే. నాకుఁ దెలిసిన దింతియే నారదముని!-యేవిశేషంబు లెఱుఁగ నింకేవిధమున"
ననుచుఁ బలుకంగ నారదుం డాదృతిఁ దెలు-పందొడంగెను గన్యకావర చరితము.

సీ. "ఓహిమవంత! మహోన్నతభావ! మున్నే దేవి మూలప్రకృతి సుసూక్ష్మ
దక్షుని గృహమందుఁ దా జన్మమందెను సతి యనుపేరున స్వాంశచేత,
నిపుడు మహేశ్వరు హృదయంబునం బతిఁగాఁ బొందుటకు నీయగారమందు
నవతరించినయది,యఖిలపాపవినాశకరమగు గంగనాఁ బరఁగు పేర,

తే. సకలలోకంబులకును లక్షణమొనర్చు-శక్తి గలిగి విరాజిల్లు, సర్వపాప
పరిహారంబును గావించు,భవ్యరూప-యగునని తలంపు,తలఁపునఁ దగనిలుపుము.

క. గిరివర! నిశ్చితమయ్యెను-వరుఁ డీకన్యకకు మున్నె భవుఁ డనియును, సం
బరమున స్వర్గపురంబున-జరగు వివాహం బటంచు శాస్త్రోక్తముగన్. ౧౧౮

క. పరమేష్ఠి తాను యిచటికి-నరుదెంచుఁ ద్వితీయసుతను నమరావతికిన్
వరయత్నంబునఁ దోడ్కొని-యరుగుటకై, నిన్ను మిగుల నభ్యర్థించున్. ౧౧౯

క. అప్పుడు నీవు ప్రియంబునఁ-దప్పక యాచారురూప ధాత కొసంగన్
మెప్పు గలుగఁగలదుసుమీ!-యప్పా! గిరిరాజచంద్రమా! విను మవలన్. ౧౨౦

తే. సుందరానన యైన నీసుతను స్రష్ట-తోడుకొనిపోయి, స్వర్గమందున మహేశు
సాదరంబునఁ బిలిపించిసంతసమున-నొసఁగుఁగల్యాణమందె,యా" ననఁగవిని.

తే. "భూతభవ్యాదులయినట్టి భూరివిషయ-ముల నెఱుంగుదు రీరు సంపూర్ణదృష్టి,
నంతరంగంబునందుఁ బ్రత్యక్షమెల్ల-యింగితంబులు, సత్య మియ్యది మునీంద్ర!

తే. దైవ మెద్దానిని విధించుఁ దలఁప నద్ది-జరగు తప్పక యెందైన సంయమీంద్ర!
వ్యర్థ మెన్నఁడుఁ బొందదు పరశివేచ్ఛ,-యేమి చేయంగ నోపుదు నింక నేను?"

చ. అని గిరిరాజు పల్కఁగ మహాముని నారదుఁ డాలకించి చ
య్యనఁ జనె సర్వలోకగురుఁడైన పితామహుఁ పాలి, కంత వం
దనములఁ జేసి తండ్రికి విధాతకు భక్తినిఁ బల్కె సంతసం
బునఁ గడుఁ బూజ్యుఁడైన మునిపుంగవుఁ "డో జనకా! మహాప్రభూ! ౮౨౪

మ. జనకా! దేవవరేణ్య! యోప్రభు! పునర్జన్మంబునన్ స్వాంశచే
తను శీతాద్రిగృహంబునందుఁ బడసెన్ దా గంగ నా రమ్యమా
తను వాప్పార మనోజ్ఞరూపమున, నిత్యంబైన పూర్ణాకృతిన్
జనియించెన్ సతి గౌరినా నచట విశ్వఖ్యాతనామంబునన్." ౮౨౫

చ. తనయుఁడు తెల్పఁగా నిటుల ధాత మహాధృతి నాలకించి "నా
కును దెలియున్, నిజాంశమునఁ గోరిక మీఱ హిమాద్రిపుత్రియై
జననము నొందె గంగయన, సత్యము, లోకపవిత్ర మున్న శం
భుని సతి తానె పెండ్లియయి పొందును శంభుని వేడ్క నందనా! ౮౨౬

తే. శివుఁడు గంగను బెండ్లియై చిత్తమందు-నూఱడిల్లుచు సంతృప్తి నొందు మిగుల,
వినుము తెల్పెదఁ గారణంబును,మును హరుఁ-డాచరించిన విధము నత్యంతభక్తి.

క. ఛాయాసతిదేహంబు న-మేయాధృతి శిరమునందు మెలపున నిడి య
త్యాయతమోదంబున శివుఁ-డీయుర్విని నర్తనంబు నెంతయుఁ జేసెన్. ౮౨౭

తే. లోకసంరక్షణార్థమై శ్రీకళత్రుఁ-డామహాదేవియాజ్ఞచే హరు శిరమున
నుండు ఛాయాసతీతను వుర్వి ముక్క-లయి పడ సుదర్శనంబుచే నపుడు నఱకె.

క. మాయందుఁ గలిగెఁ గోపం-బాయపరాధమున శివున కత్యంతంబై,
డాయఁగ నోడుదు, మభవుం-డేయనువునఁ దమిఁ జెలంగు, నెఱుఁగుము పుత్త్రా!

ఆ. ఏమి చేయవలయు, నేరీతి సంతుష్టి-పఱుపవలయుఁ దెలియఁబడదు నాకు."
ననఁగఁ దండ్రియైన యజుఁ గాంచి నారదుం-డనియెఁ దెల్పువాఁడ వినుమటంచు.

క. "గిరినాథుఁడు శ్రీమంతుఁడు-పరిధర్మజ్ఞుండు దాత, వడి నింద్రముఖా
మరు లెల్లఁ గొలువఁ దత్పురి-సరమునకును నరుగవలయు జనకా! మఱియున్,

క. హిమవంతునిఁ బ్రార్థింపుఁడు-కొమరిత దయచేయు మనుచుఁ గూరిమితోడన్,
బ్రముదితులై గంగను నిక్క-ముగను నొసఁగంగఁగలఁడు గ్రక్కునఁ దండ్రీ!

ఉ. సంతసమొప్ప నంత వడి స్వర్గపురంబును జేర్చి గంగ, న
త్యంతమహోత్సవంబునను నాద్యుని శంభుని బిల్వఁబంచి మీ
రెంతయు యత్నమున్ సలిపి యీశ్వరు నర్చితుఁ జేసి గంగ నా
వంతయు శంక లేక మది నర్పణసేయుఁడు, మేలు గల్గెడున్. ౧౩౪

క. ఏవిధమున ఛాయాసతి-తా నెలసెను హరు శిరమునఁ దద్విధమున గం
గావనితయు ద్రవరూపము-తో వసియింపఁగల, దిదియు ధ్రువమగుఁ దండ్రీ!

ఆ. అట్టి దివ్యసమయమందు మహాదేవుఁ-డంతరంగమునను నధికతృప్తి
నంది మిమ్ముఁ గరుణ నానందమగ్నుఁడై-యాదరించు జనక!" యనఁగ నంత.

బ్రహ్మ నారదునిచే దేవతలఁ బిల్వఁబంపుట

ఆ. బ్రహ్మ పుత్త్రుఁ గాంచి పరమహర్షంబునఁ-"బుత్త్ర! తగిన వెరవుఁ బూజ్యరీతిఁ
దెలిపినాఁడ వీవు, స్థిరమనీషను జిరం-జీవి వగుచు మనుము క్షితితలమున. ౧౩౫

ఆ. వినుము నాదు వాక్కు, విశ్వేశ్వరుం డిట్లు-ముదము నొంది మమ్ముఁ బూర్వరీతిఁ
గరుణఁగనుట నిజముగాఁ దలంతువయేని-సలుపు మిపుడె నాదు పలుకును విని.

చ. హరిహయముఖ్యు లుండు నెల వాత్మజ! వేగమ పోయి చేరి సం
బరమున వృత్త మెల్లరకు బాగుగఁ దెల్పి సమస్తదేవతా
వరులు మహేంద్రుతోడుతను వచ్చి మదీయనివాసమందు స
త్వరముగఁ గూడునట్లొనరుపందగు, నీవును వేగ రావలెన్." ౧౩౬

చ. అని జనకుండు బ్రహ్మ తన యాత్మజుతోడను దెల్ప, నప్పుడో
మునివర! హృష్టుఁడై యతఁడు పోయె, మహాత్ములు నింద్రముఖ్యదే
వనిచయ మున్న తావునకు వైళమ, యింద్రుని గాంచి "మేఘవా
హన! యరుదెంచినాఁడఁ గమలాసను సన్నిధినుండి యిప్పుడే. ౧౪౦

క. పరమేష్ఠి మిమ్ము నెల్లర-సరగునఁ దత్సన్నిధికిని జనుదేరఁగ నన్
ద్వరితముగఁ బిల్వఁ బంచెను,-దరలుఁడు మఱియెద్ది యేని తలఁపక మదిలోన్.

క. నరలోకంబున హిమగిరి-వరమందిరమునను స్వాంశవలన జనించెన్
బరదేవి పుత్త్రియై తాఁ-బరిశుద్ధాత్మిక ప్రపంచవారంబులలోన్. ౧౪౨

చ. త్వరితముగాఁగ రండు సురతల్లజులార! విరించి తా వసుం
ధరకును బోయి గంగఁ గొని దైవపురంబును జేర్పనున్నవాఁ
డురుతరశీఘ్రయానమున నొందు డలంపక యుల్లమందు నా
సరసిజసూతి సన్నిధికి సంతసమొప్ప" నటన్న వారలున్. ౧౪౩

క. "మునినాథా! జనలోకం-బునఁ బుట్టెనె తాను సతి? శివుండు తదుత్ప
త్తిని నేరివలననైనన్-వినెనా? మఱి లేద? తెలుపవే దయ"ననఁగాన్. ౨౪౪

తే. "విబుధవరులార! గంగను వేగ స్వర్గ-పురమునకుఁ దోడి తేనగుఁ, దరలుఁ డిపుడె,
బ్రహ్మసన్నిధిఁ జేరుఁడు, వాంఛ నంతఁ-జనెద శంకరుఁగనఁగఁ దత్సదనమునకు."

ఉ. నారదుఁ డిట్లు తెల్ప సురనాయకు లెల్లరు హృష్టచిత్తులై
తారు ముసన్ముఖాబ్జులయి తద్దయు సమ్మతి నింద్రుఁ గూడి య
వ్వారిజగర్భు లోకపతి బ్రహ్మను జూడఁ దదీయలోకముం
జేరి పితామహాంఘ్రులకుఁ జేసిరి వందనము ల్విధేయులై. ౨౪౬

తే. అంజలి ఘటించి భక్తియుక్తాత్ములగుచు-నిట్లు పల్కిరి "దేవ! మా కేమి సెలవు?
సిద్ధముగ నున్నవారము చేయుటకును-నెద్దియైనను" నన బ్రహ్మ యిట్టులనియె.

క. "సురలారా! గంగయనన్-ధరణిన్ సతి యా మహేశి తా నర్ధాంశన్
ధరియించి తుహినగిరిమం-దిరమున జనియించి మించె దివ్యాకృతితోన్. ౨౪౮

క. పరిపూర్ణాంశంబునఁ ద-ద్గిరినాథుని యింటఁ బుట్టెఁ గృతకృత్య, యుమా
వరసతి యిఁక, నిప్పుడు మన-కరయఁ గలదు కార్య మొకటి, యది యేది యనన్.

క. త్వరితముగ రండు మీరలు,-వరసతియగు గంగ నిపుడె స్వర్గమునకు ను
ద్ధురయత్నములోఁ దేఁదగు,-నరుగవలయు మనము గృహములందుండి వెసన్.

క. నా వెంటను రాఁదగును సు-ధీవరుఁడగు నారదుండు, దేవేంద్రుండున్,
శ్రీవిలసితుఁడు కుబేరుఁడుఁ,-బావనులగు జ్వలనవరుణపవనులు వరుసన్." ౨౫౧

తే. బ్రహ్మదేవుని యాజ్ఞకుఁ బాకశాస-నాదిసురలెల్ల వల్లె యం చాదరించి
తరలిపోయిరి వెన్వెంట ధాతఁ గూడి-ధరణిఁ గల హిమవంతుని ధామమునకు.

క. మునివరు నారదుఁ దన వెం-టను గొని యామంచుమలకడకుఁ జనె గంగా
వనితను యాచించుటకై-తిన మది సంసిద్ధుఁడయి శతానందుఁ, డటన్. ౨౫౩

సీ. దేవత ల్గావించు దివ్యకృత్యములను మదిలోపల నెఱింగి మానసీయ
గుణగణ యగు గంగ కుధరాధిపతి కాదినంబున నర్ధరాత్రంబునందు
గలలోన దివ్యమంగళవేష యయి, శుక్లవర్ణయై, మకరసువాహనయయి,
నయనత్రయంబుతో నవ్యరూపముఁ దాల్చి ప్రత్యక్షమయ్యె, నారాత్రి శేష

తే. మునను హిమగిరి యద్భుతంబునను మునుఁగ-సమ్ముఖంబున నిలిచి ప్రశాంతమూర్తి
యగుచుఁ బలికెను "నేను నీయాత్మజన్మ-నగుదుఁ దెలిపెద నంతయు" ననుచు నిట్లు.

ఆ. "ఏను ప్రకృతి నాద్య, నెఱుఁగుదువే? దక్షు-పుత్త్రి సతి యనంగఁ బుట్టియుంటిఁ;
దండ్రియజ్ఞమందు ధవుఁడగు శంకరు-వదలియున్నదాన, నది మొదలుగ. ౨౫౫

ఆ. నాఁటఁగోలె శివుఁడు నామీఁద, దేవతా-వరులమీఁదఁ గ్రోధవర్తనుఁడయి
యున్నవాఁడు సతివియోగాగ్నిఁ గ్రాలుచు,-నేమిచెప్పఁగలము హిమగిరీంద్ర!

క. ఆదాక్షాయణి యిప్పుడు-నీదగు గృహమున జనించె నిశ్చయముగ గం
గా దేవి యనఁగ, జగముల-నాదృతిఁ బావనముచేయు నాత్మజ యగుచున్.

తే. మున్ను శంకరపత్నియై యున్నదగుట-నీమహాదేవి శంకరునే వరింపఁ
గలదు భూధరనాయకా! కరుణతోడ-వినుము మాయభివాంఛితంబును వచింతు.

ఉ. మాపయిఁ గ్రోధమూని తన మానసమందు శివుండు ప్రేముడిన్
జూపకయున్నవాఁడు, పరిశుద్ధమనీష నొసంగితేని నీ
పాపను మాకు, నంతఁ దమి స్వర్గపురంబున కేము వైభవో
ద్దీపితవృత్తిఁ దోడుకొని దేవనికాయము సంతసింపఁగన్. ౧౭౯

తే. చేరి, శంకరుఁ గొనియాడి చిత్తతృప్తి-నంద నీకన్యకను నిచ్చితైన మిగుల
నిర్వృతిం గాంచఁగలము మనీషివర్య!-సురహితార్థమునించుక యరయుము మది.

క. తన పూర్ణ తేజమునఁ దా-జనియించును బుత్రియగుచు జగదంబయె నీ
కును మరల, నీవె యొసఁగుదు-ఘనగౌరవమునను బ్రీతి గలుగ హరునకున్.

తే. ఇపుడు మామాట లాలించి యీమనోహ
రాంగియగు నీదు కన్యక నతిముదమున
నొసఁగు మాశంభునకు, నేముఁ బొసఁగు వేడ్క
శివున కర్పింతు" మని పల్కె సృష్టికర్త. ౧౮౨

క. శతధృతివాక్యముల న్విని-మతి నూహయొనర్చి పల్కె మతిమంతుండౌ
క్షితిధరవరుఁ డిట్లని సుర-పతి మొదలగువారిఁ జూచి పరమప్రీతిన్. ౧౮౩

తే. "కన్య సతతము తండ్రియగారమందె-నిలిచియుండదు సురలార! నిశ్చయముగఁ,
గన్య పరకీయయేయగుఁ గాని తలఁప-నెప్పుడయిన స్వకీయగా నెన్నఁబడదు.

చ. మనమున నిట్టి దంచు ననుమానము లేక సమస్తరీతులన్
గనుఁగొనినాఁడ నే, నయిన గంగను నాత్మతనూజ వీడి యే
యనువున నుందుఁ? దద్విరహ మగ్గలమైన వ్యథన్ జనింపఁజే
యున, నెటు లోర్చువాఁడను సురోత్తములార!"యటంచుఁ దెల్పు ౧౮౪

తే. పర్వతేంద్రుండుకన్నుల బాష్పచయము-గ్రమ్ముచుండఁగ,సుతయైన గంగఁ బ్రీతి
నంకమునఁ జేర్చి పలకించె నాపరాని-తద్వియోగముచేత సంతప్తుఁడగుచు.

చ. జనకునిఁ గాంచి, గంగ "బుధసత్తమ! తండ్రి! మదర్థ మేల నె
మ్మనమున శోకమందెదవు? మానుము నెవ్వగ, నింక బ్రహ్మకున్

వినయముతోడ నన్నొసఁగు, వే సెలవి, మ్మమరావతీపురం
బునకును బోయెదన్ మదినిఁ బొంగు చమర్త్యులవెంట నిప్పుడే. ౮౮౭

క. నీదగ్గఱ నేనుందును,-నాదగ్గఱ నీవు నుందు, నాకును నీకున్
లే దించుకేని దూరము,-నే దూరస్థితను గాను, నిజ మోజనకా! ౮౮౮

తే. నీవు నాభక్తవరుఁడవు, నేను నీకు-భక్తిగమ్యను నగుదు నాసక్తితోడ,
నెల్లవేళలయందు నీ వుల్లసిల్ల-నీసమీపంబునం దుందు నిజము తండ్రి!'' ౮౮౯

తే. గంగ యీరీతి గిరిరాజు పొంగఁ బల్కి-వందనంబు నొనర్చి యా బ్రహ్మసన్ని
ధానమును జేరె సకలభూతపతి శివునిఁ-బెండ్లియగుటకుఁ దలఁచి సంప్రీతి మెఱయ.

పదునాల్గవ అధ్యాయము

బ్రహ్మ స్వర్గపురమున కరుగుట

ఆ. అంత బ్రహ్మ స్వీయమహా కమండలువున-గంగ నుంచుకొని చెలంగ ముదము
పర్వతేంద్రునాజ్ఞ స్వర్గపురమునకు-నరిగెఁ దాపసేంద్ర! యతిరయమున. ౮౯౧

తే. అపుడు మేనక తన భర్తయైన పర్వ-తాధిపతి సన్నిధికి వచ్చి యాత్మజాత
యయిన గంగను గానక యంత భూధ-రాధినాయకుఁ గాంచి యిట్లనె మునీంద్ర!

ఆ. ''ఎందు బోయె నాదునందనయగు గంగ?-ప్రభువరేణ్య! నాకుఁ బ్రాణతుల్య,
నీదు నంకమందు నివసించియుండెఁ,దో-డ్కొనుచుఁ బోయి రెవరుకూఁతుఁ జెపుమ.''

ఆ. మేన యిట్టు లడుగ మేదినీధరపతి-యశ్రుపూరితాక్షుఁ డగుచుఁ గాంత
తోడ బ్రహ్మ సుతను దోడ్కొని పోవఁడు-టయును,దివికిఁ బోవుటయును దెలిపె.

క. మునినాయక! యామాటను-వినినంత సుతావియోగపీడిత యయి రో
దన మొనరిచె మిక్కుటముగఁ-దనయఁ దలఁచి మేన తాఁ బరవశతన్. ౮౯౫

తే. గంగ గావించినట్టి ప్రసంగమెల్లఁ-దెలిపి,ప్రాజ్ఞవరుండు ధాత్రీధరుండు
మేనకాదేవి కొనరించె మిగులఁ బ్రియము-వెలయ సాంత్వన మెంతయు విశదరీతి.

ఉ. అంత గిరీంద్రపత్ని తన యాత్మజ యించుకయేని తెల్పక
త్యంతముదంబుతో దివికిఁ దానరిగెన్ సురరాజివెంట నం
చెంతయుఁ గోపమూని శపియించెను బ్రాణసమానఁ బుత్రికన్,
వింతయె! రోష మెవ్వరిని వీడదు,చూడదు మంచిచెడ్డలన్. ౮౯౭

ఆ. ''తల్లియయిన నన్నుఁ దలఁపక తెలుపక-యమరపురికి నేఁగినట్టి గంగ
వచ్చుఁగాక! మరల వసుధాతలమునకు-ద్రవమయాత్మ యగుచుఁ దరలుఁగాక!''

ఆ. అనుచు శాపమిచ్చి యద్రివరాంగన-యైన మేన యాగ్రహంబుతోడ
భవనమునకుఁ బోయెఁ,బర్వతేంద్రుండును-గృహముఁ జేరె నంత ఋషివరేణ్య

క. దేవతలు సముత్సుకలయి-దేవపురికి గంగఁ గొనుచుఁ దేఁకువఁ జని,స
ద్భావమున నామె కచ్చట-వైవాహికమంగళంబు వడిఁజేసి రొగిన్. ౨౦౦

క. పరమేష్ఠి హృష్టుఁడయి ముని-వరు నారదు నాదరమునఁ బంపెను బిల్వన్
హరుఁ గామరూపమున ను-ర్వర నుత్తమపీఠమునకు వైళమ మౌనీ! ౨౦౧

సీ. అంత నారదముని యరిగి పీఠోత్తమమగు కామరూపమం దమలనియతి
యోగచింతాసక్తు, నురుతపస్సంయుక్తు, ధ్యాననివిష్టు, సంయతగరిష్ఠు,
విస్ఫురచ్చంద్రసువిశదనేత్రుని, యోగివరచిత్తచింతిత పరమగాత్రు,
మధ్యాహ్నసమయ సమ్యగ్భాసమాన సహస్రాంశుసన్నిభహారితేజు,
తే. నీశ్వరేశ్వరు, శంకరు, నిద్ధచరితుఁ-గాంచి, తద్దివ్యయోగభంగంబు నెంచి
భయముచే నందెనిలిచి తా భావమందు-నిట్లుతలపోయఁదొడఁగెమహేశుఁగూర్చి.

క. "హిమవంతుని గృహమున జ-న్మము నొందెను సతి యటంచు మర్యాదను ని
క్కముగాఁ దెల్పినచో ధ్యా-నము భంగంబగును శంభునకుఁ జిత్తమునన్. ౨౦౩

క. ఒకవేళ శంకరున కేఁ-బ్రకటితముగఁ జెప్పనేని ప్రకృతిజననమున్,
వికలప్రతిజ్ఞుఁడను నై-సకల జగంబునను నింద్యచరితుఁడ నగుదున్. ౨౦౪

మ. సతిజన్మంబును శంకరుండు విని తా స్వాంతంబునం బొంగి, య
ద్భుతమోదంబున నాపయిం బ్రియము నింపున్ సంతతం" బంచు నా
తతరీతిన్ దలపోసి, మెల్లఁగను దత్త్వధ్యానసంయుక్తుఁడై
తతయోగాంచితచిత్తుఁడైన హరుచెంతం జేరి పల్కెన్ దమిన్. ౨౦౫

క. "దేవాదిదేవ! శంకర!-నా వందనముల గ్రహించి నాపయి దయ సం
భావింపుము లోకేశ్వర!-దేవ! ప్రసన్నుఁడవు గమ్ము దేవశరణ్యా! ౨౦౬

తే. నీసమీపంబునం దుండి నిరుపమాన-యత్నమునఁ ద్వత్సతీమణి నరసి తోడి
తెచ్చుటకుఁ బోయియున్న నే వచ్చినాఁడ-వినుముశంకర! యోగసంవిద్వరేణ్య!

చ. నినుఁ బతిగా వరింప మది నిశ్చలయత్నముతోఁ ద్వదీయ భా
మిని మరలన్ జనించినది మేదినియందున,నింక యోగచిం
తను వెస మాని,నావినుతిఁ దత్పరతన్ విని రమ్ము దేవ! త
న్వినిఁ సతినిం బరిగ్రహము విశ్రుతరీతి నొనర్పు మీశ్వరా!" ౨౦౭

క. మునిపతి నారదుఁ డీక్రియ-వినయముతోఁ బల్క శివుఁడు వెసఁ దన ధ్యానం
బును విడిచి యపుడె సంయమిఁ-గని ప్రశ్నమొనర్చె వాంఛ గడలుకొనంగన్,

సీ. "ఎచ్చట నాసతి యొసఁగును మునినాథ! యెఱిఁగింపు మిప్పుడే యిద్ధచరిత!"
యనుచు శంకరుఁ డట్టి యవనీతలంబున నిలిచియుండెను, ముని పలికె నంత
"దేవదేవా! ధరిత్రిని దుహినాద్రికి స్వాంశచే గంగనా నలరు నామ
మున దేవి సతి జన్మమును బొందియున్నది చారులోచనయయి, సరసిజభవుఁ

తే. డావిధంబును దెలిసి తా నంతరంగ-మందు దేవతలను గూడి యద్రినాథు
భవనమున కేఁగి ప్రార్థించి స్వర్గపురికి-యత్నమునఁ దోడి తెచ్చె మహానుభావ!

ఆ. ప్రభువరేణ్య! మిమ్ముఁ బ్రార్థించియా దేవి-నొసఁగఁ దలఁచి బ్రహ్మ యుడుముదమున
నన్ను బంపినాఁడు నావెంటఁ దోడ్కొని-రమ్మటంచు దేవ! రమ్ము కరుణ. ౯౧౧

తే. దివ్యసుందరరూపిణి దేవిఁ బ్రేమఁ
బత్నిగ గ్రహింపు" మని వేడఁ బరమశివుఁడు
మునివరేణ్యునితో స్వర్గమునకు వచ్చె,
నపుడు బ్రహ్మయు ముదమంది యాత్మయందు. ౯౧౨

తే. తన కమండలువున నున్న యనుపమాన-రూపిణిని శివభామిని నాపరాత్ప
రునకుఁ ద్రైలోక్యపావని యనఁగ నంశ-మునఁ జెలంగెడు సతి నిచ్చె మునివరేణ్య!

చ. పరమశివుండు మోదమున భామినిఁ దాను బరిగ్రహించి లోఁ
గరము ప్రసన్నుఁడై గణనికాయముఁ గూడి స్వకీయధామమై
పరఁగెడు రాజతాద్రికిని బైనమొనర్చెను మానినాయకా!
హరు పురిఁ జేరి గంగయు ద్రవాత్మికయై భువి కేఁగె మాయయై. ౯౧౪

సీ. స్వర్గంబునందుండి బ్రహ్మనదీస్వరూపిణియయి వేడుకఁ బృథివిఁ జేరి,
సగరనిర్మితమగు జలనిధిలోఁ జొచ్చి సగరవంశంబును సుగతిఁ గాంచి
యుద్ధరించి, మహాసముద్రతితోడ రసాతలంబును జేరె సతి మునీంద్ర!
భువనరక్షణమును బూని యీక్రియఁ దన యంశచే హిమగిరి కాత్మజయయి,

తే. శంకరుని దేవదేవుని సంతసమునఁ-బతిగ వరియించె జగదంబ పరమకరుణ,
సుప్రసన్నాత్మయైమించె క్షోణియందుఁ-దాపసోత్తమ! ప్రకృతిచిత్రమునువినుము.

తే. పూర్ణరూపంబులో దేవి భూధరేంద్రు-పుత్రి యయి పుట్టి మరల శంభుని వరించెఁ
దాన నారద! తమినాత్మధవునిఁగాఁగ"-ననుచుఁ దెల్ప మహాదేవుఁ డాదరమున.

పదునైదవ అధ్యాయము

హైమవతీ ప్రాదుర్భావము

తే. ఆ మహాదేవుఁ గని వినయమున నారద-మునిచంద్రుండు ప్రశ్నించె నమితభక్తి
"దేవదేవ! మహాదేవ! దీనవరద!-తెలుపవే దయతోడ నా దేవిమహిమ.

తే. మేనకాగర్భమున దేవి తాను బుట్టెఁ
బూర్ణరూపములో నని మున్ను వింటిఁ
బార్వతి హిమాద్రి కించును బహుపురాణ
ములు దెలుపఁగా మహాదేవ! సలలితముగ. ౯౧౮

ఉ. చిత్తము తృప్తినొందదు, ప్రసిద్ధములైన తదీయజన్మసం
పత్తియుఁ, గార్యజాతములు బాగుగఁ దెల్పుము, తత్త్వమెల్ల లో
కోత్తరరీతి నీకుఁ దెలియుం, జగదీశ! కృపాప్రపూర్ణమా
చిత్తము నాపయిం బఱపి సిద్ధిద! దేవిచరిత్ర మంతయుం. ౯౧౯

సీ. బ్రహ్మస్వరూపిణి పరదేవి త్రైలోక్యజననియా దుర్గ తా శైలరాజ
దంపతు లగుభక్తిఁ దపమును గావించి ప్రార్థింపఁ బుత్రికాభావ మొందె,
సతివియోగము చేత శంకరుం డాత్మ దుఃఖితుఁడయి భక్తిని నుతియొనర్ప,
నామహాదేవుని నలరింపఁబూని మేనాదేవిగర్భంబునను వసించెఁ

తే. బూర్ణభావంబులో బ్రహ్మమూర్తి భువన-జనని, శుభదినమందున సరసిజాన
నంబు చెలువార మేనక సంబరమున-సుప్రభాంచితఁ గనె లోకశుభద, నపుడు.

తే. పుష్పవర్షంబు గురిసెను, పుణ్యగంధ-యుతముగా గాలి వీచె సముత్సుకముగ,
నిర్మలములయి దిక్కులు నెగడె దేవి-పుట్టినప్పుడు మేనకు నృపవరేణ్య!

సీ. తరుణార్కకోటిదీప్తయుఁ, ద్రినేత్రయు, దివ్యగాత్రయు, రమ్యముఖప్రకాశ
శాలినియును, వరచంద్రార్ధముకుటయు, రమ్యాష్టహస్తవిరాజితయును,
కమ్రాయతాక్షియు, ఘనమహిమాఢ్యయునగు సూక్ష్మ యాద్య తా నవతరించె
నాత్మవిలాసాప్తి ననుచును మదిలోనఁ దలఁచి యా గిరిరాజు తమి చెలంగ,

తే. విప్రులకు గోవులను వేనవేలుగాఁగ-ధనము కోరిన రీతి వస్త్రముల వాంఛ
మించునట్లుగ నర్పించి మిగుల వేడ్క-సుతఁ గనుంగొన వచ్చె బంధుతతిఁ గూడి.

సీ. అంత మేనాదేవి కాంతుఁడౌ హిమవంతునాగమనము విని యపుడు పలికె
"నా మనోనాయక! నందన యిదె చూడు, మత్యంతరుచిర పద్మాయతాక్షి,
మన తపఃఫలమయి మహి సర్వభూతహితార్థమై జనియించె నాదిజనని"
యనవుడు హిమగిరి యాత్మజఁ గనుఁగొని జగదంబగాఁ దన స్వాంతమందుఁ

తే. తెలిసి, యాఁదల వంచి భక్తిని నమస్క-రించి, దోసిలి యొగ్గి, ధరిత్రి నిలిచి,
గద్గదస్వరమున నిట్లు కడు వినమ్రుఁ-డగుచు వచియించె దేవితో నార్యవర్య!

తే. "చిత్రరూపిణివై సులక్షితవిశాల-నేత్రముల వెల్గు తల్లిరో! నీవు కరుణఁ
దెల్పు మెవ్వతవగుదువో, తెలియఁజాల-నమ్మ! నామదిఁ దెలియునట్లింతయు" నన.

ఉ. దేవి వచించె భూరిదయ "దివ్యధరాధరవర్య! యమ్మహా
దేవుని నాశ్రయించు పరదేవతనై వెలుఁగొందుదాన, సం
భావనచే నిరంతరసుభాగ్యవివేకమనోజ్ఞరూపనై
యీ వివిధప్రపంచమును నెల్లపుడు న్నడిపించుచుండెదన్. ౯ ౨౫

తే. బ్రహ్మవిష్ణుమహేశ్వరప్రముఖులకును-జనని నగుదు, సమస్తమోహకదను నేను,
సృష్టిసంస్థితిలయములఁ జేయు లోక-మాత నని మదిఁ దలఁపు మోక్ష్మాధరేంద్ర!

తే. సర్వభూతాంతరస్థనై సంసృతిజల-నిధివిమగ్నుల దరిఁ జేర్ప నెగడుదాన,
సంతతానందమయరూపశక్తి నగుదు,-బ్రహ్మరూపిణి నిత్యనాఁ బరఁగుచుందు.

తే. తండ్రి! సర్వేశ్వరిని, భవత్తపమునకును-బొంగి పుత్రీత్వమును లీలఁ బొందుకొఱ-
నీదుబహుపుణ్యవశమున నే జనించి-నట్టిదానఁ ద్వదీయగృహంబునందు."

ఆ. అనుచుఁ బరమకరుణ నద్రినాథునితోడఁ-బలుకుటయును దేవి పర్వతేంద్రుఁ
డపుడు వినయమునను నంబికఁ గనుఁగొని-పలికె నిట్లు మానితిలక! భక్తి.

హైమవతి తండ్రికి నిజరూపముం జూపుట

సీ. "అమ్మరో! నీవు నాయందుఁ గృపంజేసి నిత్యవయ్యును నాదు నిలయమందు
జననమందితివిగావున మదీయంబైన బహుజన్మసంచితపరమపుణ్య
మైన నాభాగ్యంబు నతిశయఫలద మం చెంచుచునున్నాఁడ నంచితముగ,
నేఁ బరాత్పర! శివా! నీదివ్యరూపంబుఁ గనుఁగొన్న వాఁడ, నో జనని! యిపుడు

తే. పరమకరుణను నామీఁదఁ బఱపి వేగ-తృప్తితోడుత మాహేశ్వరీస్వరూప
మెంతయును జూపవే, నీకు నేనొనర్తు-భక్తితోడుత బహుశతవందనములు."

క. జనకుని నుతి దయమీఱఁగ-విని యప్పుడె లోకజనని విశ్రుతరీతిన్
గని, "తండ్రీ! యైశ్వరమగు-తనువుం గనుఁగొనుము దివ్యతత్త్వం బనుచున్.

తే. దివ్యదృష్టి నొసంగెద, భవ్యమైన-నాస్వరూపంబుఁ గనుము, మనంబునందు
సర్వదేవాత్మకం బని సంశయముల-నెల్లఁ జెండాడు మింక మహీధ్రవర్య!"

తే. అనుచు గిరిరాజుతోఁ దెల్పి, యఖిలజనని-యుత్తమంబగు జ్ఞానంబు నొసఁగి ప్రీతి,
దివ్యమాహేశ్వరంబగు భవ్యరూప-మపుడు చూపెను నారదా! యద్భుతముగ.

సీ. చంద్రాయుతసహస్రసమకాంతిసహితంబు, స్థిరరమ్యశశికలాశేఖరంబు,
మహితజటాశోభిమస్తకయుక్తంబు, వరత్రిశూలాంచితకరయుతంబు,
కాలానలసహస్ర ఘనకాంతియుతము, భయానకం, బతిఘోరతానకంబు,
త్రినయనరుచిరంబు, దివ్యనాగోపవీతాక్తంబు, ముఖపంచకాతిదీప్త,
తే. మహివర సుభూషితంబు, మహాకరీంద్ర-చర్మపరిధానరుచిరమై సకలదిశల
వెల్గుజగదంబరూపంబువిస్మితుఁడయి-కాంచి, హిమగిరిమరలఁబల్కంగఁదొడఁగె.

తే. "జనని! నామీఁద దయయుంచి దయ్యన మఱి
యొక్క రూపంబు చూపు నా మ్రొక్కులు గొని"
యనఁగ, నారద! జగదంబ యపుడె తుహిన
గిరికిఁ గనఁబడె నొండొక్క సరణి నెదుట. ౮౩౫

సీ. శరదిందు సుందరవరకాంతితోడ, రమ్యకిరీట శోభితమౌళితోడ,
శంఖచక్రగదాబ్జసహితహస్తములతో, నతిరమ్యనేత్రత్రయంబుతోడ,
దివ్యమాల్యాంబర ధృతశరీరముతోడ, పరిమళగంధలేపనముతోడ,
నత్యంతదర్శనీయాకృతితోడ, విభ్రాజిత భూషణ రాజితోడ,
తే. యోగిజనవంద్యచరణాబ్జ యుగముతోడ,-నఖిలదిక్కుల వెలుఁగొందునట్టి పాణి
పాదనయనశిరోముఖ పటలితోడ-నాహిమాద్రికి దేవి ప్రత్యక్షమయ్యె. ౮౩౬

క. పరదేవీ రూపంబును-బరమాద్భుత వికసితాక్షిపద్మయుతుండై
పరికించి, తుహినగిరి సుతఁ-గరము నతులొనర్చి పలికెఁ గడఁకన్ మరలన్.

క. "పరమైశ్వర్యయుతంబయి-కర మత్యున్నతము నగుచుఁ గనఁబడు నీ రూ
పరసితి, నచ్చెరు వొందితిఁ,-బరికించెద నొండురూపు, వడిఁ జూపు మికన్. ౮౩౭

క. ఎవ్వనికిఁ బత్ని వగుదువొ-యివ్వసుధన్ వాఁ డశోచ్యుఁ, డెంతయు ధన్యుం
డవ్వా! కరుణింపుము దయ-నవ్వారిగ నీకు మ్రొక్కు లర్పింతు నెదన్." ౮౩౮

తే. తండ్రియైన హిమాద్రి ప్రార్థనముచేసి-పల్కఁగా నిట్టు లాదేవి పరమకరుణ
నపుడెయారూపమునువీడి యద్భుతముగ-నిలిచె నొండొక్కయాకృతిలలిధరించి.

తే. శంఖచక్రగదాపద్మసహిత యగుచు-నాల్గుభుజములు వెలుఁగంగ నళినదళవి
నీల సుశ్యామయై వనమాలికాభి-శోభమానాంగి యగుచుఁ దోఁచుటయు నెదుట.

తే. శైలరాజామహారూపలీలఁ గాంచి-యంజలి ఘటించి నిలిచి తా హర్షమునను
బ్రహ్మవిష్ణుశివాత్మికఁ బ్రకృతి సర్వ-దేవమయి నాద్యను నుతించె నీవిధమున.

క. జగదంబికను మనంబున-నగవరుఁ డీస్తోత్రమునను బ్రార్థించెను ని
మ్మగ భక్తియుక్తుఁడై దే-వగణార్చితపాదపద్మ వరమునిచంద్రా! ౮౪౩

హిమాచలకృత దేవీస్తోత్రము

సీ. "విశ్వసంశ్రయ! సర్వవిశ్వాధికారిణి! తల్లి! సర్వాత్మికా! దయఁ బ్రసన్న
భావంబుఁ బొందుము,పరమ! లోకంబున నీకంటె నితరమై నెగడు తత్త్వ
మెయ్యదియును లే దొకించుకేనియుఁ జూడ,నీవె సర్వంబును, నీవె హరివి,
నీవె శంకరుఁడవు,నీవె సృష్టిక్రియా సంధాతయయినట్టి స్రష్టవగుదు,
తే. నీవె పరశక్తి వగుదు, వింకెట్లు వర్ణ-నంబొనర్పంగఁగల జగదంబ! యో య
చింత్యచరిత! బ్రహ్మాదులచే నగమ్య-మయిన నీచరితంబు మాయమ్మ! నేను.

సీ. సర్వనిర్జరమనస్సంతోషకారిణి! సకలలోకేశ్వరి! స్వాహ వీవె,
దివ్యప్రభావ చిద్దీప్తుఁడౌ దేవదేవుని స్వరూపంబవై పొసఁగు దీవె,
దేవతలకుఁ బితృదేవతలకుఁ దృప్తినందించు హవ్యకవ్యములు నీవె,
నిగమంబులందున నియమంబ వీవె, యజ్ఞంబును మఱియుఁ దపంబు నీవె,
తే. క్షితిసురులఁ దృప్తిపఱచు దక్షిణవు నీవె,-యీవె స్వర్గాదిఫలరూప,మెల్ల నీవె,
సకలఫలదమహేశ్వరీ! సంతతంబు-నీకు మ్రొక్కెద భక్తితో నిఖిలజనని! ౨౮౫

సీ. ఆత్మవిజ్ఞానంబునందలి మహిమచే యోగివర్యులు నిన్ను నొగిని సూక్ష్మ
తమమై పరాత్పరతను శుద్ధమై పరబ్రహ్మమయంబునాఁ బలుకుచుంద్రు,
తల్లి! సుదృప్తమై తనరును నీరూపు, వాక్కులకు నగమ్యవస్తు వగును,
మనసున కందదు, మఱియు నోశుభనామ! త్రైలోక్యబీజమై తగ వెలుంగు,
తే. సకలవరదా! మహాదేవి! సర్వలోక-నాయికా! శ్రితసంరక్షణప్రవీణ!
తల్లి! నను బ్రోవవమ్మ వాత్సల్యమునను,-భక్తితోడుత నొనరింతుఁ బ్రణతితతులు

సీ. నిజలీలచేత నా నిలయంబునందున జననంబునొందిన సర్వశక్తి!
మంగళరూపిణి! మహితాష్టభుజయుత! మార్తండకోటి సమప్రభాఢ్య!
బాలశశాంక విభ్రాజితకోటీర! శతకోటి శశికాంతి చారునయన!
రమ్యత్రినేత్ర విరాజన్ముఖాంబుజ! వాసవముఖ సురవందితపద!
తే. యోపరాత్పర! నిను భక్తి నుల్లమందు-నిలిపి మ్రొక్కెద సతత మోనిగమవినుత!
సర్వవిశ్వైకజనని! శశ్వత్కృపాంచి-తాంతరంగంబునఁ బ్రసన్న వగుము తల్లి!

సీ. రజతాద్రికాంతి నిర్మలతమంబును, దివ్య భుజగేంద్రభూషణ భూషితంబు,
నతిభయంకరము, భీమాకృతియుతభవ్య నేత్రత్రయయుతంబు, నిగమనుతము,
పంచముఖాంబుజ ప్రద్యోతమానంబు, ధృతజటాజూట విస్తృతశిరంబు,
రమ్యశశాంకార్ధ రాజత్కిరీటంబు, సిద్ధగంధర్వాది సేవితంబు,
తే. నీదు దివ్యస్వరూపంబు నెగడుచుండు-సర్వలోకైకజనని! సంశ్రయవరేణ్యా!
భక్తిసంయుక్తి మ్రొక్కెద భావమందుఁ-గరుణ నాకుఁ బ్రసన్నవు గమ్ము తల్లి!

సీ. శారదచంద్రికా శతలక్షతుల్యంబు, రమ్యాంబరద్యుతిరాజితంబు,
దివ్యభూషణరాజిదీప్తివిలసితంబు, శోభనం, బత్యంతశుభకరంబు,
భువనమోహనకాంతిపూర్ణంబు, విశదంబు, బాహుచతుష్టయ భాసితంబు
నీస్వరూపంబయి నెగడును బ్రహ్మాది సకలదేవస్తుత్య చారుచరిత!
తే. పరమశుభదంబు లైన నీ పాదకమల
ములను మది నిల్పి భజియింతు, మ్రొక్కు లిడుదు,
నన్ను బ్రోవుము దయ సుప్రసన్న వగుచు
సకలలోకైక జనయిత్రి! సంతసమున. ౬౪౯

సీ. నవ్యఘనప్రభాభవ్యప్రకాశంబు, వికసితాబ్జాక్షిసంవిలసితంబు,
భువనవిమోహనపూర్ణకాంతియుతంబు, మందహాసాంచిత మధురముఖము,
వరరత్నకలిత భాస్వన్మనోజ్ఞాంగద భూషణానిచయ సుభూషితంబు,
మంజుస్ఫురద్వనమాలా విరాజిత వక్షస్థలం బతివైభవంబు,
తే. దుర్గ! సకలప్రపంచాపవర్గ! తల్లి!–నీదు రూపంబు భాసిల్లు నిఖిలలోక
తారకంబయి, భక్తి వందనము లిడుదు–గరుణతోడ బ్రసన్నవు గమ్ము దేవి!

సీ. విశ్వస్వరూపమై వెలయుచు నున్నట్టి నీ రూపగుణతతి నిక్కువముగ
గనుగొనఁ బహుగుణ కలితుఁడైనట్టి యే మానవుండైనను మహితశక్తి
యుతదేవుఁడైనఁ దా రోగి సమర్థులు గారు, నిరుపమానములయి నెగడుఁగాన,
నే నల్పబుద్ధిని, నిర్ణయించంతు న దెట్లు విశ్వేశ్వరీ! దేవి! విస్తృతమగు
తే. తావకీనగుణావళిఁ దనరు దివ్య
మాయ మోహితుగాఁ జేయ మానుము, మదిఁ
గరుణ విలసిల్లఁగా నన్నుఁ గనుము తల్లి!
యనుచు నీకును మ్రొక్కెద ననవరతము. ౬౫౦

తే. సఫలమయ్యెను నేఁడు నా జన్మమెల్ల,–సఫలమయ్యెను నా తపశ్చర్య నేఁడు,
ముజ్జగములకుఁ దల్లివై భూరికరుణ–నాకుఁ బుత్రిక వయి జననంబుఁగనుట.

తే. నిత్యవై యెల్లజగముల నిండి స్వీయ–లీలచే నాగృహంబున బాలికవయి
నీవు జనియించుటం జేసి దేవి! ధన్య–తను, గృతార్థత్వమును గంటిఁ దల్లి! సతము.

తే. భువనములకెల్లఁ దల్లివై పొదలు నీకుఁ–దల్లియయి మేన వెలయంగఁ దా నదెట్టి
భాగ్యమునుబొందెనో తొల్లి! బహువిధముల–జన్మశతములఁ దెల్పఁగాఁజాల నేను."

ఉ. ఈ కరణిన్ గిరీంద్రుఁడు మహేశ్వరియైన సుతన్ నుతింపఁగాఁ
బ్రాకటమై వెలుంగు నిజభవ్యమనోహరరూప మప్పుడే
చేకొని దేవి తాఁ జెలఁగ,శీతమహీధ్రుని పత్ని మేన లోఁ
బైకొన విస్మయం బపుడు భక్తిని జేరఁగ వచ్చి పుత్రికన్. ౬౫౫

తే. అంతయును గాంచి, పుత్త్రి బ్రహ్మమయి యనుచుఁ
దన మది నెఱింగి, కరము గద్గదికతోడ
వెలయు వాక్కులఁ బలికె నుర్వీసుపర్వ
మౌళిరత్నమ! నారదమౌనిచంద్ర! ౧౫౬

క. "జనని! యెఱుంగను సంస్తుతి-నొనరింపఁగ, భక్తి నెఱుఁగ నోజగదంబా!
నను నీనిజగుణములచే-ననుగ్రహింపంగవలయు నని ప్రార్థింతున్. ౧౫౭

చ. జననముఁ బొందె నీవలన సర్వజగంబులు లోకమాత! యీ
కనఁబడునట్టి వస్తుతతిఁ గాంచిన నెమ్మది నీస్వరూపమై
యెనయు, ఫలప్రదాయినివి, యెల్లజగంబుల కాలవాలమై
తనరుదు, వంతటన్ వెలసి తత్త్వమవై వసియింతు వెంతయున్." ౧౫౮

తే. ఈ విధంబున మేనకాదేవి వినుతి-చేయఁ బరదేవి సంతృప్తిఁ జెంది తల్లిఁ
గాంచి పలికెను నప్పుడు కరుణ మదిని-వెలయుచుండఁగ మాయమ్మ! వినుమటంచు.

క. "జననీ! నీవును, నాదగు-జనకుండును ఘోరతపము సల్పితి రెదఁ బు
త్త్రినిగా జనింపఁ గోరిక-నెనసి, పరాత్పరను నన్ను నెంచి ప్రియమునన్. ౧౬౦

తే. మీర లిద్దరు చేసిన మేటితపము-సఫల మగునట్లు లీలచే జన్మమంది
నట్టిదానను నిత్యనై యలరు నే హి-మాద్రిచే నీదు గర్భంబునందుఁ జేరి."

చ. మునివర! దేవి యిక్కరణి భూరిముదంబునఁ బల్క, భక్తి వం
దనముల మాటిమాటికిని దా నొనరించి, హిమాద్రి లోకమా
తను గని, బ్రహ్మతత్త్వము నెదం దెలియంగను గోరి నమ్రుఁడై
యనువున దోసిలొగ్గి యపు డాపరదేవిగుఱించి యిట్లనెన్. ౧౬౧

పరమేశ్వరి హిమవంతునకు యోగసార ముపదేశించుట

సీ. "బ్రహ్మప్రముఖసుపర్వగణంబులకునైన దుర్లభవైనట్టి దుర్గ వీవు,
పరమయోగులు మది భావించి చూచిన దుర్గమ్య వయియుందు దుర్గ వీవు,
నిజవిలాసంబున నిరుపమంబగు నుకీయాపరిమేయభాగ్యంబువలన
మన్మందిరంబున మాననీయాకృతి నవతార మొత్తితి వమ్మ! కరుణఁ,
తే. దావకీనపదాంబుజధ్యానరతుఁడ-నోమహేశ్వరి! భవవార్ధి నుత్తరించు
తెరు వదెట్టిదొ వేగమే తెలిపి సుప్ర-సన్నవై బ్రోవవమ్మ! మహోన్నతముగ.

తే. కాలమునకుఁ గాలంబవై గ్రాలుకతన
లీల విలసిల్లుదువు మహాకాళి యనఁగ,
దల్లి! పరమోత్తమబ్రహ్మతత్త్వ మెల్లఁ
దెలిపి దయతోడఁ బ్రోవవే లలితహృదయ!" ౧౬౪

క. గిరివరనాయకుఁ డీక్రియఁ-బరమేశ్వరి వినుతిసేయ భక్తియుతుండై,
కరుణాభరణాంచిత భూ-ధరవరుతోఁ బలికె నిట్లు దయ యొప్పారన్. ౯౬౧

తే. "ఓమహామతి! నాతండ్రి! యోగసార-మును వచింతును, వినుము, నెమ్మనమునందు
దేనిఁ దెలిసినమాత్రాన దేహి బ్రహ్మ-మయుత వెలయుచునుండునో మహిమతోడ.

సీ. సద్గురువును జేరి శ్రద్ధాప్రపూర్ణుఁడై నామంత్రములను గొనంగవలయు,
సుసమాహితాత్మత నెసఁగి దేహముచేత మనముచే వాక్కుచే నను సమాశ్ర
యింపంగవలయును, హృత్కమలంబున నన్నె ధ్యానింపనౌ నన్నుతముగ,
మద్గతప్రాణుఁడై మామకనామంబు జపియింపవలయును సంతతంబు

తే. నస్మదీయప్రసంగిమై యాత్మ, నన్నుఁ
గూర్చియే మాటలాడుచుఁ గోర్కి నాదు
గుణములను విను నిచ్చతోఁ గూడియుండ
వలయు, మఱియును దెల్పెద మహితనియతి. ౯౬౨

క. గిరివర! మదీయసేవా-నిరతుండయి నాదు పూజ నిత్యము చేయన్
బరమాదృతి గల సాధక-వరుఁడు ముముక్షుఁడగు సుమ్మవార్యగుణముల౯.

సీ. పర్వతరాజేంద్ర! భక్తిసంయుక్తుఁడై నాపయి, నాయర్చనంబు సేయు
నభిలాష గలిగినయట్టి సాధకవరుం డగును మోక్షముఁ గోరునట్టివాఁడు,
శాస్త్రోక్తరీతి పూజాయజ్ఞముఖముల, స్వీయవర్ణాశ్రమాంచితపథముల,
స్మృతులును శ్రుతులును జెప్పినకై వడిఁ గావింపనగు నధికమగు ప్రీతి,

తే. సకలయజ్ఞంబులును, దపశ్చర్యలును, గి
రీంద్ర! దానంబులును నన్నె హృదయమందు
నిలిపి, ననుగూర్చి చేయంగవలయుసుమ్ము,
దానఁ గలుగును నిజముగా జ్ఞానపటిమ. ౯౬౯

క. జ్ఞానమున ముక్తి గలుగును,-జ్ఞానమునకు భక్తి కారణం బోతండ్రీ!
దానికి హేతువు ధర్మము,-పూనిక ధర్మంబు యజ్ఞముఖమయి వెలయున్.

తే. ఈవిధంబును మదియందు నెఱిఁగి భక్తుఁ-డర్థి ధర్మస్వరూపమై యలరునట్టి
యీమదీయస్వరూపంబు హితవుమీఱ-నాశ్రయింపంగఁదగుఁ దుహినాద్రినాథ!

తే. సచ్చిదానందవిగ్రహ! సకలరూప-సహిత! నే నొక్కదాననే జగతిఁ దండ్రి!
యమరు లెల్లరు నాయంశ నలరునట్టి-వారలే యగుదురు సుమ్ము పర్వతేంద్ర!

మ. మతిమంతుండు సమస్తకర్మముల సంభావించి నన్గూర్చి శా
స్త్రతతిం జెప్పినరీతి నిశ్చలతఁ బ్రజ్ఞావంతుఁడై నన్నె స
మ్మతిఁ బూజించి యజింపఁగావలయుఁ, దా మర్యాదఁ బోనాడి యే
తతభేదంబును బూనఁగాఁ జనదు, తత్త్వం బెంచనౌ నెమ్మదిన్. ౯౨౩

తే. ఈవిధంబునఁ గర్మంబు లెల్ల నిర్మ-లాత్ముఁడై యొనరింపఁగా నగును, విమల
మానసుం డయి యాత్మ విజ్ఞానయుక్తి-నందును ముముక్షుపదము వాఁ డనవరతము.

సీ. పుత్త్రమిత్త్రకళత్త్రముఖవస్తువులయందుఁ గారుణ్యమును మదిఁ గడఁక వీడి,
విశదవేదాంతాదివిహితశాస్త్రములందు నిలుపంగవలయును నియతి మిగుల,
సకలకామంబులఁ జక్కఁగ వదలి, హింసాకార్యములనెల్ల సరవి విడచి,
సాధుమార్గమునందుఁ జరియించు నెవ్వండు నట్టి పుణ్యాత్ముఁడే యధికమహిమ
తే. వెలయునట్టి పరావిద్య నాత్మయందుఁ-దెలియఁగలవాఁ డగును సుమ్ము విలసితగతి,
నిందు సంశయ మొక్కించు కేని లేదు,-సత్యమిది భూధరేంద్ర! ప్రశాంతహృదయ!

తే. ఓ మహారాజ! యెపుడు తా నుల్లమందు-ననుభవించును నాత్మఁ బ్రత్యక్షముగను,
నపు డెకల్గునుముక్తి సత్యముగఁ దండ్రి!-సత్యముగఁ దెల్పుచున్నా నసంశయముగ.

మ. జనకా! నాపయి భక్తి లేని విముఖు ల్పర్చింపఁగా లోకమం
దున విజ్ఞానముఁ బొందఁజాలరు, ననుఁ దుశ్చింతఁ బోనాడి భ
క్తిని సేవింపఁగ నో ముముక్షుతతి యెంతే యత్న ముప్పొంగ, నె
మ్మనమం దియ్యది హేతువై వెలయు సంభావించి యోజించినన్. ౯౭౭

తే. తండ్రి! యీక్రియ నీవు యత్నమున సతము
భక్తితో నను భజియింపఁ బరఁగు సుఖము,
భవసముత్థంబులగు దుఃఖపంక్తు లెల్ల
నార్య! నిన్ను బాధింపలే వరయ నెపుడు.'' ౯౭౮

పదునాఱవ అధ్యాయము

బ్రహ్మవిద్యోపదేశము

తే. అంత హిమవంతుఁడు వచించె ''నమ్మ! యాత్మ
యనఁగ నేరూపమునను దా నలరుచుండు?
విద్య యన నేది? మోక్ష మేవిధము చేతఁ
గలుగునో! నాకుఁ దెలుపుము కరుణతోడ.'' ౯౭౯

వ. పరదేవి యిట్లనియె. ౯౮౦

తే. ''జనక! వినుము మహామతీ! సంసృతి విని-వర్తకముఁ జేయఁగల శక్తివఱలు విద్య
యును, దదీయస్వరూపంబులను వచింతు-సంగ్రహముగాఁగ నిప్పుడు శ్రద్ధతోడ,

సీ. బుద్ధికంటెను, బ్రాణమునకంటె, దేహేంద్రియాహంకృతులకంటె, నదియుఁగాక
మానసంబునకంటె జానుగ వేఱయి యద్వితీయంబయి యతివిశుద్ధ
మయి చిదాత్మకమయి యలరెడి తన్ను నిశ్చయముగఁ గనునట్టి జ్ఞాన మెట్లు
కలుగుఁ, దద్ధ్యానంబె విలసితంబగు విద్య యనఁబడునది యో మహానుభావ!

తే. జన్మలయములు లేక విశదమగుచు ని
రామయంబయి బుద్ధ్యాద్యుపాధిరహిత
మగు చిదానందరూపమే యాత్మ యనఁగఁ
బరఁగుచుండును దుహినభూధర! సతంబు. ౯౮౨

సీ. ఆనందమయి పూర్ణమై సుప్రకాశసత్యజ్ఞానముఖలక్షితమయి వెలుఁగు
చద్వితీయంబయి యఖిలదేహగతంబు నయి పరంబయి యేకమయిన దగుచుఁ,
దనప్రభావంబుచేతను శరీరాదుల విలసిల్లఁజేయుచు విశ్రుతముగ,
సుసమాస్థితంబయి శోభిల్లునట్టిదే యాత్మ, తద్రూపంబుఁ దగినరీతి

తే. నీకుఁ దెలిపినదాన మనీషివర్య!-నిత్య మిద్దాని సత్క్రియ నిలిపి మదిని
జింతనముఁ జేయఁగానగు స్థిరమతియయి-బుద్ధిమంతుఁడు గిరిరాజ! పూన్కితోడ.

తే. ఆత్మగాని శరీరాదులందు నాత్మ-బుద్ధి నిలుపంగరా, దది పొసఁగ హేతు
బీజ మగుచుండు రాగవిద్వేషముఖము-లయిన దోషంబులకు నెల్ల నద్రినాథ!

క. రాగాదిదోషములచే-వేగ సదోషమగు కర్మవిధి పుట్టును, ద
ద్యోగమునను సంసారం-బాగక వర్తిల్లు, వదలనగు నద్దానిన్." ౯౮౩

వ. హిమాచలేంద్రుం డిట్లనియె. ౯౮౪

క. "జనకములై యశుభములకు-ననయము రాగాదు లుండు, నగపడ వెందున్,
మనుజులు వానిఁ ద్యజింపఁగ-ననువు వచించుటకు నీవె యర్హవు తల్లీ! ౯౮౫

క. అపకృతిఁ జేయు శరీరులఁ-గృప నేగతి నోర్చు జనుఁడు కీర్తింపఁగ వాఁ
డపగతుఁడగు రాగద్వే-షపరీతుఁడు కాక, తెలుప శక్తవు నీవే." ౯౮౬

వ. పార్వతి యిట్లనియె. ౯౮౭

తే. "ఎవని కపకృతి గలిగెనో హృదయమందు-వాఁడు దాని విచారింపవలయు వేగ,
చక్కఁగాఁ జేయ మదిని విచారణంబుఁ-బుట్ట దెప్పుడు ద్వేష మాపురుషునకును.

సీ. పాంచభౌతికమయి పరఁగు దేహము, ముక్తుఁడయి జీవుఁ డుండుఁ దా ననవరతము,
వహ్నిచేతను గాల్పఁబడినను, నక్కలు మొదలగునవి తిన్నఁ గొదువ లేదు,
కావున నిది చక్కఁగాఁ దెలిసినయెడ నపకార మెందుండి యతని కౌదవు?
నేమిటఁ జిక్కక యెందుఁ బ్రకాశించుచుండును దులలేక ఖండరీతి,

తే. నాత్మ శుద్ధంబు పూర్ణమై యలరుఁ దానె,-సచ్చిదానందరూపంబు జన్మలయము
లందఁజాలదు,నిర్లిప్తమగును, దుఃఖ-మరయఁ బొందదు మఱియు నోయద్రినాథ!

తే. కలుగ దపకృతి దేహంబు విలయమయిన
జీవునకు, నెట్టులన గేహ మావిలమగు
నంటఁ గాలఁగ గృహమందు మలయు నాకా
సమునకు మఱొక్క టగపడు సరణిఁ దండ్రి! ౧౧౨

ఆ. చంపునట్టివాఁడు చంపంగఁదలఁచును,
హతుఁడు చంపఁబడినయట్లు తలఁచు,
నిరువురును భ్రమాత్తహృదయులే యగుదురు,
లేఁడు చంపువాఁడు, లేఁడు హతుఁడు. ౧౧౩

చ. తనదు స్వరూప మాపగిదిఁ దాను మదిం దలపోసి ద్వేషముం
గనక చరించువాఁ డెపుడుఁ గాంచు సుఖంబును, ద్వేషమూలమై
తనరును జిత్తతాపము, ప్రధానము ద్వేషము సంసృతిక్షయం
బునకును, నంతరాయ మది ముక్తికిఁ, గావున దాని వీడనా.'' ౧౧౪

సీ. హిమవంతుఁ డనియె మహేశ్వరితో ''నంబ! యా పరాత్ముఁడు జీవుఁ డనుభవింపఁ
డపకృతి యనియు, దేహంబునకును గల్గ దపకార మనియు నీ విపుడు నాకుఁ
దెల్పితి, వద్దాన దేవి! లే దపకారమనునది యెచ్చట నరసిచూడ,
నీ దేహమున జీవుఁ డెప్పుడు దుఃఖంబుఁ బొందక యుండుట బోధపడియెఁ,
తే. గలుగు నెవనికి దుఃఖంబు? కాంచు నెవఁడు
దాని? నున్నాఁడె యన్యుండు దానిఁ బొందఁ?
గరుణ నాయందు నీకును గలిగెనేని
దీనిఁ దెలుపుము నాకు విస్తృతి''ననంగ. ౧౧౫

క. ''ఏతాదృశుఁడయి మోహితుఁ-డై తనరి మకీయమాయ నభిమానము వి
ఖ్యాతిం బొందును సుఖనని-చేతంబున దుఃఖ ననుచుఁ జింతాకులుఁడై. ౧౧౬

సీ. సకలజగంబులఁ జయ్యన మోహింపఁజేయంగఁగల శక్త్యమేయమాయ,
యదియే యనాద్యవిద్య యనం బ్రకాశించుఁ బుట్టుకతోడనే పొదివి ప్రాణి,
జనక! యద్దానిచే జన్మంబు గలుగును, రాగవిద్వేషాదియోగమునను
సంక్షుబ్ధుఁ డగుచును సంసారి తా నుండు నాత్మస్వలింగమై యలరు మనసు
తే. నో మహామతి! గ్రహియించి యుండు నెందు
నిమిడి వాసన యట్టిదై మెసఁగు భవము,

నందుఁ బరతంత్రమయి సర్వ మనుభవించు
చుండు నోయద్రినాథ! మహోన్నతముగ. ౯౯౭

సీ. నిర్మలంబై కాంతి నెగడు సుస్ఫటికంబు దగ్గఱనున్న రక్తప్రసూన
సంగతి నెఱ్ఱని రంగున దీపించుఁ, గాని నిజంబుగాఁ గలదె రంగు
స్ఫటికంబునకు? నట్లె వఱలు బుద్ధీంద్రియముఖసన్నిధానతఁ బూని తాను
వర్తిల్లుచుండును వాసనాబలమున నరయంగ సంబంధసరణి లేదు
తే. లలి మనోబుద్ధ్యహంకారములు సతతము
జీవునకుఁ జేయుఁ దోడ్పాటు సిద్ధముగను,
దండ్రి! కర్మవశంబునఁ దనరు ఫలము
లనుభవించును నవియెసు మ్మనఘచరిత! ౯౯౮

తే. విషయసంబంధ మగుచును వెలయు సకల
దుఃఖమయినను సుఖమైనఁ దొడరి మనము
బుద్ధ్యహంకారములె పొందుఁ, బొందఁ డెపుడు
నాత్మ నిర్లిప్తుఁడగు ప్రభుం డవ్యయుండు. ౯౯౯

తే. సృష్టికాలంబునందుఁ దా జీవుఁ డఖిల-పూర్వవాసనావాసితములను గూడి,
జన్మమందును,మరల నీసరణి భూత-సంక్షయం బగువఱకుండు శైలరాజ! ౧౦౦౦

క. ఈవిధమును బండితుఁ డెద-భావించి, విమోహబుద్ధి వదలి సతము సం
సేవన నిష్టానిష్టము-లౌ వస్తువులందు సుసుఖమై యుండఁనగుఁ. ౧౦౦౧

సీ. శైలరాజా! మనస్తాపంబునకు దేహమే కారణంబగు నెంచిచూడ,
దేహంబు సంసృతిస్థితికి మూలంబగుఁ, గర్మసంజనితంబు కాయమగును,
ద్వివిధంబుగాఁ గర్మ విలసిల్లుఁ బుణ్యంబుఁ బాపంబు ననఁగ నో ప్రభువరేణ్య!
యాపుణ్యపాపసమాంశానుసారత సుఖదుఃఖముల దేహి సాక్కుచుండు,
తే. పవలు రేయియుఁ బోలె నయ్యవి యతిక్ర-మింపరానివి దేహికి, మిగులఁ బుణ్య
కర్మమును జేసి స్వర్గాదికామి యగుచు-శాస్త్రవిహితంబుగా దేహి స్వర్గమందు.

ఉ. ప్రేరితుఁడై స్వకర్మమున వేగమె స్వర్గమునుండి భూమిపైఁ
జేరును దేహి, యాగతిని జిత్తమునందుఁ దలంచి సాధుసం
వారముఁ గూడి విద్యలను శ్రద్ధగ నభ్యసనం బొనర్చి వి
స్తారసుఖైషి కావలయు సంగము వీడి బుధుండు శాంతుఁడై. ౧౦౦౩

పదునేడవ అధ్యాయము

బ్రహ్మయోగోపదేశము

వ. హిమాచలేంద్రుండు పరదేవిని వినయంబున నిట్లు ప్రశ్నించె. ౧౦౦౪

సీ. "పరదేవి! దేహంబు పంచభూతాత్మకంబయి దుఃఖకారణం బగునుగాన,
దేహంబు నెడఁబాసి దేహి దుఃఖములచే నేల తిరస్కృతుం డెపుడు గాఁడు!
జననీ! మహేశ్వరి! జననంబు గాంచును దేహం బదేరీతిఁ దెలుపవమ్మ!
యెవని సేవించి మహేచ్ఛ సుకృతముతో కామంబులను స్వర్గగతినిఁ బడయు
తే. జీవుఁ డేరీతిఁ బుణ్యాంశ క్షీణమగుచుఁ-బుడమియందున మరలఁ దాఁ బుట్టునెట్లు
విస్తృతంబుగఁ దెలుపుము వేగ నాకుఁ-గరుణ నాపయి నీకును గల్గెనేని!"

వ. జనకుం డడుగఁ దనయయగు పరదేవి యిట్లనియె. ౧౦౦౫

సీ. "క్షితియు జలంబును ద్యుతియును వాయువు నంబరంబును నాఁగ నైదుభూత
ములచేత బద్ధమై యలరు దేహము, దానఁ బాంచభౌతికమునాఁ బరఁగుచుండుఁ,
బృథివి ప్రధానమై వెలయు దేహమునకుఁ గడమ నాల్గును సహకారు లగును,
నా దేహము చతుర్విధాకృతులను నుండు, నవ్వానిఁ దెలిపెద, నండజములు
తే. స్వేదజజరాయుజములు నుద్భిజ్జము లను-నామములతోడ విలసిల్లు నో మహీధ
రేంద్ర! తద్విధ మెల్లను నిపుడె నీకు-విశదపఱచెద శ్రద్ధతో వినుము జనక!

జంతూత్పత్తి

తే. అండజము లనఁ బక్షిసర్పాదులెల్ల,
స్వేదజంబు లనఁగ మశకాదులెల్ల,
నుద్భిదములు తరులతాదు, లొగి జరాయు
జంబులౌ మానవులుఁ, బశుసముదయములు. ౧౦౦౮

క. గిరివర! జరాయుజంబుల-శరీర మగు శుక్రరక్తసంభవ మగుచున్,
బురుషస్త్రీక్లీబములనఁ-బరఁగు శరీరంబు త్రివిధపరిణతి మగుచున్. ౧౦౦౯

క. పురుషుఁడు శుక్రాధికతన్,-దరుణియు రక్తాధికతను దంద్రీ! రెండున్
సరిగా శుక్రార్తవములు-పరఁగినఁ గ్లీబుఁడు జనించుఁ బర్వతరాజా! ౧౦౧౦

సీ. తన కర్మవశమునఁ దనరి జీవుఁడు హిమకళచేతఁ గూడి యీ క్ష్మాస్థలిఁ బడి,
వ్రీహిమధ్యమునఁ బ్రవేశించు, నంతట నటనుండి చిరకాల మారగించి
పురుషులచేతను భుజియింపఁబడు, నంతఁ దద్గుహ్యమును జేరుఁ దాఁ బెరుగును,
రేతస్స్వరూపుఁడై రేతోగతుండగు, నామీఁద ఋతుకాలమందుఁ బ్రీతిఁ

తే. గాంతతోఁ బురుషుఁడు గూడఁగానె యామె-గర్భమందుఁ బ్రవేశించుఁ గడువడిగను,
బురుషరేతస్సుతోడుత సరవిఁ గూడి-జీవుఁ డివ్విధి గర్భంబుఁ జెందుఁ దండ్రి!

తే. తరుణి ఋతుమతియైన యాతరుణము మొద
లుకొని నాల్గవదినమందుఁ బ్రకటితముగ
స్నాన మొనరించి, తా ఋతుస్నాత యనఁగఁ
జేర్కొనంబడు గిరిరాజ! వినుము మఱియు. ౧౦౧౨

క. ముదితకు ఋతుకాలమునాఁ-బదునాఱుదినములవఱకుఁ బరఁగు సమయ, మ
య్యదనునఁ బురుషుని కూడిక-కొదవిన యది యనుచుఁ దెలియనొప్పు మునీంద్రా!

ఆ. బేసిదినములందుఁ బ్రియుతోడఁ గూడిన-యతివకును జనించు నాఁడుబిడ్డ,
సమదినంబులందు సంయోగ మొదవినఁ-గనును బురుషశిశువుఁ గాంత నిజము.

తే. విను ఋతుస్నాతయైనట్టి వనిత యెవనిఁ-గాంక్షతోఁ జూచు, నట్టి యాకారముగల
సంతతింగాంచుఁ గావున సంతసమున-భర్తృముఖమును జూడఁగవలయు మొదట.

సీ. సతియును బురుషుండు సంగమించినయప్పు డొదవిన రేతస్సు యోనియందుఁ
బడి, యందు రక్తసంబంధంబుఁ బొంది, జరాయువు వేష్టింప నా యమేయ
శుక్లంబు కలలమై చూడంగ నొకదిన మందుండు, నంతట నైదుదినము
లయినచో నది బుద్బుదాకృతి ధరియించు, నద్రినాథ! జరాయు వనఁగ సూక్ష్మ
తే. మగుచుఁ జర్మాకృతిని నుండు, నందు శుక్ల
రక్తయోగంబుచేత గర్భ ముదయించు,
నందుఁ బుట్ట జరాయుజం బనఁగ నెగడు,
వినుము గిరిరాజ! జన్మంబు విశదముగను. ౧౦౧౬

క. జనకా! బుద్బుదరూపం-బెనయును బేసి యనుపేర నెదుగుచు రక్తం
బునఁ బదునైదుదినము లొయ్యనఁ దడియుచునుండు, నవల నద్రివరేణ్యా!

సీ. ఇరువదిరాత్రంబు లిరవుగఁ గడచిన నంకురంబు జనించు నంతమీఁద
నొక్కమాసంబున కుదరంబు స్కంధముల్ శిరముఁ బృష్ఠంబు నుదరము ననెడు
పంచవిధాంగము ల్ప్రభవించు, సరవి రెండవమాసమందున హస్తపాద
ములు మొదలైనవి పుట్టును, మూఁడవనెల నెల్ల నంగసంధులు జనించు,
తే. వ్రేళ్లు నాల్గవనెలయందు నెలయు, నపుడె-జీవునకు వ్యక్తి యొదవును, స్థిరత మాని
జననిజఠరంబునందున సంచరించు-గర్భ మంతట నటు నిటుఁ గడఁకఁ దండ్రి!

సీ. ఐదవ నెలయందు నఖులు శ్రవణముల్ ముఖము నాసిక గుహ్యమును బిఱుదులు
పాయువు మేఢ్రం బుపస్థయుఁ గర్ణరంధ్రద్వయంబు జనించుఁ బ్రకటితగతి,

నాఱవనెల నాభి యావిర్భవించును మనుజులకెల్ల నోజనక! స ప్త
మంబగు నెలను గేశంబులు, రోమాదు లావిర్భవించును, నష్టమమగు
తే. నెల సమస్తావయవములు వెలయు శ్మశ్రు-దంతములు తప్ప నన్నియుఁ దగినయట్టు,
లన్యజన్మంబుఁ బొందినయట్టికార-ణమున గర్భంబు మధ్యోదరమున నుండు.
క. జనకా! సకలాంగము లే-పునఁ జెలఁగఁ జీవుఁ డొందుఁ బూర్ణంబగు చే
తనతను, దల్లి భుజించిన-యనువునఁ దాఁ బెరుగు గర్భమందు వెలయుచుఁగన్.

గర్భస్థజీవుని యావేదనము

సీ. తన కర్మవశమున ధరియించి దేహంబు, భయదమౌ యాతనఁ బ్రాలుమాలి,
జీవుండు తొలిజనిఁ జేసిన కర్మంబు లన్నింటి నెన్నుచు నాత్మయందుఁ
దా నిట్లు పలుకును "ధరణిని నే నిట్టి దుఃఖంబులను బొంది దుష్కరమగు
నీజన్మ మొందంగ నిప్పు డున్నాఁడ, న-న్యాయము గాఁగ నే నధికధనము
తే. సేకరించి కుటుంబంబు స్థిరమనుచును-నెంచి పోషించినాఁడ నేయించుకేని
పుణ్యకార్యంబుఁ జేయఁగాఁబోలు! నింక-నెట్టు లీగర్భనరకాబ్ధి నీఁదువాఁడ?
తే. దుర్గతివినాశకారిణి దుర్గ యనుచుఁ-దలఁచి భజియింపనైతి సుంతయును మదిని
గర్భమునుండి నిష్కృతి గల్గుటకును,-నొండుజన్మంబు నొందకయుండుటకును.
క. మది విషయసేవనంబే-ముదమునఁ దవిలితిని గాని మునుకొని దుర్గా
పదపద్మంబుల సేవను-వదలితి, నిటు గర్భనరక వార్ధిం బడితిన్. ౧౦౨౩
తే. సతత మాపరమేశ్వరీ చరణకమల
ములను భక్తిని మదియందు నిలిపి భజన
సేయువాఁడను, నీకుఁ బూజసేయువాఁడ,
భవసముద్రంబుఁ దరియింపఁ బాటుపడుదు. ౧౦౨౪
సీ. పుత్రమిత్రకళత్రముఖములతో వాసనల్ వడి లోఁగొనంగఁ దద్వశుఁడ నగుచుఁ
బెక్కుమారులు మోహపీడితమతినయి వ్యర్థంబుగా భవంబందు నిరతిఁ
గొనియుండి యాత్మకుఁ గూర్చు హితంబులఁ గావించితిని గదుఁ గలవరపడి,
దానికి నిప్పుడు తగిన ఫలం బతిదుర్లంఘ్యమగు గర్భదుఃఖవార్ధి
తే. మునిఁగినాఁడను, నీకమీఁద నెనయఁబోను-దేవి! నేనెప్డు సంసార సేవనంబు
నిరుపయోగంబుగాఁగనుమరల" ననుచు-బహువిధంబులఁజింతించు, బడలుచుండు.
చ. తనదగు కర్మ గర్భమునఁ దా వసియించి భుజించి, జీవుఁ డి
య్యనువున నస్థియంత్రముల నత్తతి నొత్తిడిఁ జెంది, యోనివ
ర్త్మను జనుదెంచు సూత్యనిలరాజి రయంబునఁ ద్రోయ, భూమిపై
కిని నరకంబుఁ బాతకి ప్రకృష్టత వీడినరీతి దోఁషఁగన్. ౧౦౨౫

సీ. రక్తంబు మేదస్సు ప్రకటితగతి సకలావయవంబుల నలమి ముంప,
మావి చుట్టుకొనంగ మసలుచు జీవుండు దేహగతుండయి తివిరి నాదు
మాయచే ముగ్ధుఁడై మది గర్భదుఃఖవిస్మృతుఁ డయియుండు; నేమియు నొకింత
యేనియుఁ జేయంగ లేనివాఁడయి, మాంసపిండంబు పోలిక నుండు శ్లేష్మ
తే. మున సుషుమ్నానాడి మూయంగఁబడినంత-కాల మించుకైనఁ గడఁగి విశద
మయినరీతి నొక్కటయిన మాటను బల్కఁ-జాలకుండు నతఁడు శైలరాజ!

క. నడువంగ లేఁడు, బంధువు-లడుగక రక్షింప నెదుగు, నురుతరగతిఁ దా
గడి దేరియుండుఁ, గుక్కుర-బిడాలముఖదంష్ట్రితతికి భీతిల్లఁ డెదన్. ౧౦౨౪

క. కాలవశంబున మాటల-నాలించును దూర దేశమందుండియుఁ బె
క్కాలాపంబుల నల్పును - బాలత్వము తొలఁగ నంతఁ బర్వతరాజా! ౧౦౨౫

తే. యౌవనమదంబుచేతఁ గామాదులైన-వాని నత్యాదృతిని బొంది వరుస వివిధ
పాపపుణ్యాత్మకంబులై ప్రబలు కర్మ-ములను గావించి దేహి తా ముగ్ధుఁడగును.

తే. తన శరీరభోగము నెదఁ దలఁచి కర్మ
తంత్రములఁ జేయుచుండును దా శరీర
మగును బురుషునకును భిన్న, మట్టులగుటఁ
బురుషుఁ డెద్దానిని భుజింపఁబోవఁ డార్య! ౧౦౩౧

తే. కదలుచున్నట్టి యాకునఁ గల సలిలము-పోలికఁ బ్రతిక్షణమునందుఁ బోవుచుండు
క్షరమగుచునాయువటుగానస్వప్నతుల్య-మగువిషయసుఖమెల్లనోయగవరేణ్య!

తే. ఇట్టులయ్యును హాని లేదించుకైన-దేహధారుల యభిమానదివ్యపదవి
కెపుడుఁ దలఁపఁడుమదినిదమిత్థమనుచు-దేహినామాయచేతను మోహితుఁడయి.

ఉ. మాయను బొంది భోగముల మానసమందు స్థిరంబు లంచు న
త్యాయతవృత్తిఁ గాంచు, నొగి నంతఁ దటాలున మ్రింగుఁ గాలుఁ డా
యాయువు పూర్ణమైనతఱి, నంతికమందున నుండు భేకముం
బాయక మ్రింగు పన్నగముభాతి క్షణంబునఁ బర్వతాధిపా! ౧౦౩౪

తే. జన్మ మియ్యది సఫలమై చనియె నకట! -యిట్టులే యన్యజన్మంబు లేఁగఁగలవు,
తలఁచిచూచిన నిష్కృతి కలుగ దేమొ-విషయసుఖముల సేవించు వెఱ్ఱులకును.

క. కావున నాత్మవిచారముఁ-గావింపఁగవలయు మదినిఁ గడుఁబూనికతోఁ,
దా విషయసుఖములను సం-సేవనమును విడువవలయు క్షితిధరనాథా! ౧౦౩౬

చ. స్థిరమయినట్టి సంపదను జిత్తమునందునఁ గోరువాఁడు న
న్నురుతరరీతిఁ బూజనము నొయ్యనఁ జేయును, నప్పుడేశ దా!

సరవి జనించు భక్తి, యది శాశ్వతమై తగు బ్రహ్మమందు, ని
ష్కారణ నెఱుంగనా జనుఁడు శ్రద్ధమెసంగ మహీధరేశ్వరా! ౧౦౩౮

తే. వినుము దేహాదులెల్ల వేర్వేఱ నిర్ణ-యించి యాత్మను నాత్మచే నెఱిఁగి బుధుఁడు
స్వాంతమందుమిథ్యాజ్ఞానసంభవమయి-వెలయు దేహాదిమమతనువిడువవలయు.

మ. జనకా! సంసృతిదుఃఖముల్ వదలఁగా స్వాంతంబునం దెంచినన్
నను బ్రహ్మాత్మికగాఁ దలంచి స్థిరతన్ ధ్యానించి యర్చింపు, మీ
ఘనమార్గంబె సుమీ విముక్తికిఁ దగున్ గల్యాణసంధాయకం
బని నిష్కల్మషవృత్తితో మెలఁగుమా యద్రీంద్ర! సంతోషివై." ౧౦౩౯

పదునెనిమిదవ అధ్యాయము

హిమవంతుఁడు పరదేవిని ముక్తికిఁదగిన యుపాయ మడుగుట

క. జగదంబ యిట్లు పలుకఁగ-నగరా జతిభక్తియుక్తి నవ్యమృదూక్తిన్
జగదీశ్వరితోఁ బలికెను-"సుగుణాంచిత మహితశక్తిశోభిత! దేవీ! ౧౦౪౦

సీ. తల్లి! నీ దివ్యపాదము లాశ్రయింపనివారు ముక్తిని బొందలే రటంచుఁ
బలికినదాన, వీ పలుకు నిక్కమెయైన నిన్నాశ్రయింప నేనియతి వలయుఁ,
గరుణతోఁ దెల్పుము పరమేశ్వరీ! త్వదీయాకృతి నెద్దాని నాత్మయందు
నిలిపి ధ్యానింపఁగావలయును మోక్షంబుఁ బొందఁగోరినవార లందఱుఁ దమి?
తే. దేహబంధంబు వదలింప ధృతిఁ గడంగు-వార లత్యంతభక్తితో వఱలవలయు,
భక్తిలేకున్న మోక్షసత్పదము సున్న"-యనఁగ దేవివచించెఁబ్రియంబు మెఱయ.

క. "వేయింటి కొకఁడు జతనముఁ-జేయును మర్త్యులతియందు సిద్ధికొఱకు, నా
వేయింట నొకఁడు కన్గొను-నాయుక్తిని దత్త్వయుక్తి నగచరనాథా! ౧౦౪౨

సీ. వినుము నారూపంబు వివరింతు నోతండ్రి! వాగతీతంబయి వఱలుచుండు,
నిష్కలంకం, బతినిర్మలం, బతిసూక్ష్మమును, నిర్గుణముఁ, బరంబును, విశేష
తేజోమయంబు, విస్తృతము, సర్వంబున వ్యాప్తిఁజెందఁగ ముఖ్యమైన హేతు
వును, నిరాధారంబు, గన నిర్వికల్పంబు నా నుండు, సచ్చిదానందవిగ్ర
తే. హంబు మోక్షార్థులగువార లాత్మయందు
నిలిపి, దేహబంధంబులఁ దొలఁగుటకును
ధ్యానమును జేయఁదగియుండుఁ దతమనీష,
మఱియు నారూప మెఱుఁగు మో మహితచరిత! ౧౦౪౩

క. మఱిమంతులలో సుమతిని,-తీఱిని సుగంధమును, వారి శ్రేష్ఠరసముఁ, బ
ర్వతరాజ! చంద్రునకు నే-నతిశయకాంతి నయియుండు ననవరతంబుల్.

తే. తపము నొనరించువారికిఁ దపము నగుదుఁ,-జండకిరణున కేను దేజంబు నగుదు,
బలము గలవారిలోపలఁ బ్రబలు కామ-రాగవిరహితబలమునై రహి వెలుఁగుదు.

తే. ధర్మచారిత్ర! నే సర్వకర్మలందుఁ-బుణ్యాయుతమగు కర్మనై పొసఁగియుందు,
ఛందములలోన గాయత్రిసకలబీజ-ములను బ్రణవంబునయి వేడ్కఁ జెలఁగుచుందు.

తే. తండ్రి! గిరిరాజ! సర్వభూతములయందు-ధర్మమునకు విరుద్ధమై తనరు కామ
మనఁగ వెలయుదు, నీక్రియఁ గనఁగ సకల-మందుఁ దద్భావరూపంబునం దియుందు.

తే. సాత్త్వికంబులు, మఱియు రాజసము, లవలఁ-దామసంబులు నా భావగతులు జన్మ
మందెనాయందు, మదధీనమందెయుండు-నెల్ల నవి, యేను లోఁబడ నెప్పుడయిన.

తే. ఎల్లవస్తువులందు నే నివ్విధమున-నవ్యయంబయి పరమమై యలరు రూప
మునను నద్వైతముగ నుండనను దెలియరు-జనులు నామాయముగ్ధులై క్ష్మాధినాథ!

క. నను భక్తి భజించినవా-రనయం బీమాయ దాఁట నర్హులు తండ్రీ!
కనలేవు బుక్కు మొదలగు-ఘనశ్రుతులు నాదు భాగ్యగరిమంబు నెరల్.

క. నగవర! సృష్ట్యర్థము నా-దగు రూపము స్వేచ్ఛచేతఁ దనరు ద్వివిధమై,
మగవాఁడును స్త్రీ యను భే-దగతిన్ విభజించినట్టిదానను దండ్రీ! ౧౦౭౧

సీ. శివుఁడే ప్రధానుఁడై చెలఁగును బురుషుండు, పరశివయే శక్తి పరఁగుఁగాన,
యోగులు తత్త్వంబు నొగి నెఱింగినవారు, శివశక్తిరూపమే యవును బ్రహ్మ
మని యాత్మలందునఁ గని పల్కుచుందురు న న్నోమహారాజ! యెన్న నిదియె
పరతరంబగు తత్త్వసరణి, చరాచరంబగు నీ విశాలమా జగము నెల్ల

తే. సృష్టిగావించుచున్నాను స్రష్టృరూప-మున, ని జేచ్ఛ మహారుద్రఘనశరీర
మొంది కల్పాంత కాలంబునందు సంహ-రించుచున్నాను బూన్కి మై సృష్టి నొకట.

క. చెనునడవడి నడఁచుటకై-కడువడి విష్ణువనఁ జెలఁగి కాపాడుదు నీ
పుడమి సమస్తముఁ దండ్రీ!-యిడుమలు పోఁద్రోలి శుభము లిచ్చుచు నుందున్.

క. రామాదిరూపములతో-నే మహిపై నవతరించి, నియతిని దనుజ
స్తోమంబు సంహరించి, ద-యామతి రక్షించుచుందు నవనిన్ సతమున్. ౧౦౭౪

క. జనకా! శక్త్యాత్మకమయి-యనయము భాసిలుఁ బ్రధానమై నారూపం
బని విశదమయ్యె జగమం-దునఁ, దత్కారణము వినుము తుహినగిరీంద్రా!

క. పురుషుండే కార్యంబును-జరుపంగాలేఁడు శక్తిసాయము లేకే
సరణినయిన నని నమ్ముము-స్థిరముగ నీ వాత్మయందు శీతాద్రివరా! ౧౦౭౬

సీ. కాల్యాదికములయి గ్రాలు రూపంబులనెల్లను రాజేంద్ర! యిట్టి వనుచు
నెఱుఁగుము, స్థూలంబు లివి, సూక్ష్మములఁ దొల్లి తెలిపినదాన నీ కలఘుచరిత!
పర్వతోత్తమ! మది బాగుగ నాస్థూలమైన నారూపంబు నాత్మయందు
నెఱుఁగక, సూక్ష్మమై యెసఁగురూపంబును గని, యెట్లుమోక్షంబుఁగాంచనగును?

తే. మోక్షకాముకులగువారు మొదట స్థూల
మయిన రూపంబు స్థిరముగా నాశ్రయింప
వలయు నని యిక్కతంబునఁ దెలియఁబోలు,
వినుము తద్విధమును నీవు విస్తృతముగ. ౧౦౫౮

చ. వరుసఁ గ్రియాని యోగమున బాగుగ స్థూలములైన రూపముల్
సరవినిఁ గాంచి, పూజనము సల్పి స్థిరంబగు భక్తిఁ, బిమ్మటన్
బరమయి సూక్ష్మరూపమున భాసిలు నాకృతి నాత్మలోపలన్
స్థిరముగ నిల్పి ధ్యానమును జేయనగున్ సతతంబు శ్రద్ధతోన్." ౧౦౫౯

ఆ. దేవి యిట్లు పలుక గ్రావాధినాధుండు-సంతసమును బొంది స్వాంతమందు
భక్తితోడ నిట్లు పలికె దేవినిగూర్చి-'వినుము కరుణ నాదు మనవి' యనుచు.

ధ్యానవిధానము

ఉ. "అమ్మ! మహేశ్వరీ! బహువిధాకృతులన్ విలసిల్లు దీవు, ని
క్కమ్ముగ రూప మేది మదిఁ గైకొని ధ్యానము సేయనౌనొ, మో
క్షమ్మును వేగ పొందుటకుఁ జాలునొ, తెల్పు మనుగ్రహమ్ము స్వాం
తమ్మున నీకు నాపయిని దథ్యముగాఁగను గల్గియుండినన్. ౧౦౬౦

తే. దాసుఁడను నేను, భక్తవత్సలవు నివు,-నన్ను గరుణింపు మోయమ్మ! యెన్నరాని
భవమహాబంధముననుండి వదలునట్టి-త్రోవ నెఱిఁగింపవే జగత్పూజ్యచరిత!"

వ. నా విని పార్వతి హిమవంతునితో నిట్లు చెప్పందొడంగె. ౧౦౬౨

చ. "గిరివర! విశ్వమంతటఁ బ్రకృష్టతమంబుగ వ్యాప్తిఁజెంది నేఁ
బరఁగుదు స్థూలరూపమునఁ, బాయక యచ్చట నట్టిరూపమే
స్థిరముగ నెంచి పూజనముచేయనగున్ గడుభక్తి, నప్పరా
త్పర త్వరితంబుగా నొసఁగు భవ్యపదంబగు ముక్తి నెంతయున్. ౧౦౬౩

తే. ఆ మహావిద్య వెలయు మహామతీ! య-నేకవిధముల విశ్వమందెల్లఁ దండ్రి!
ముక్తిదాయకయగు దేవి ముఖ్యనామ-ములను దెలిపెదవినుముసంపూర్ణముగను.

వ. ఆ దేవి మహాకాళియుఁ, దారయు, షోడశియు, భువనేశ్వరియు, భైరవియు,
బగళయు, ఛిన్నమస్తయు, మహాత్రిపురసుందరియు, ధూమావతియు, నరులకు
మోక్షఫలప్రదయగు మాతంగియు నను నామములతో వెలయుచుండు. ౧౦౬౪

క. ఇవి స్థూలరూపము లనన్-ప్రవిమలమతి నుండు, వీని భజియించిన మా
నవు లధికభక్తి మోక్షము-సువిశదగతిఁ బొందఁగలరు సుమ్ము నిజముగన్.

చ. మనమును, బుద్ధియు న్నిలిపి మామక దివ్యపదారవిందమం
దుననె క్రియాయుతిన్ నియతితోడ భజింపుము తండ్రి! యిందు నే
ఘనమగునట్టి రూపమును గాని సునిశ్చలభక్తి, నంత నీ
వనుపమమైన నాపదమె యందుదు వెంతయు నిశ్చయంబుగన్. ౧౦౬౭

తే. వసుధ దుఃఖాలయం బశాశ్వతము నైన-యొందుపుట్టువు బొందక యుందునన్ను
భజన మొనరించు భక్తసంవారమునకు-నెప్పుడయినను బర్వతాధీశ! నిజము.

చ. ఉరుతరభక్తియుక్తులగు యోగు లనన్యమనస్కులై నిరం
తరము ననున్ దలంతు, రిది తథ్యము, వారికిఁ గల్గు భక్తి నే
నరసి కృపాకటాక్షముల నభ్యధికంబగు మోక్ష మిత్తు సం
బరమునఁ దండ్రి! యో తుహినపర్వతరాణ్మణి! పూర్ణచిత్తనై. ౧౦౬౯

క. నను భక్తిఁ దలఁచి యంతం-బునఁ బ్రాణము నెవఁడు విడుచు భూధరవర! వా
నిని భవదుఃఖవ్రజములు-చెనకఁగ లే వెప్పుడయినఁ జేరి గిరీంద్రా! ౧౦౭౦

తే. ఓమహామతి! యెవ్వార లుల్లమందు-నితరచింతలు మాని నన్నే భజింతు,
రట్టివారికి నపవర్గ మనవరతము-నొసఁగుచుందును బ్రియమున నెసఁగి నేను.

క. శక్త్యాత్మకమగు రూపము-ముక్తిద మవలీల ననుచు బుద్ధి నెఱిఁగి, సం
యుక్తుఁడవై నను గొల్వుము-భక్తిని, నపవర్గ మొదవుఁ బర్వతరాజా! ౧౦౭౨

చ. సతతము మానసంబునఁ బ్రశస్తతమంబగు శ్రద్ధ నన్యదే
వతలను గొల్తు రెవ్వ రొగిఁ బర్వతవల్లభ! వార లెల్ల న
న్నతులితభక్తిఁ గొల్తురని యాత్మ నెఱుంగుము, నిశ్చయంబుగా
నితరము లేదు లోకముల నిందును శంక యొకించుకేనియున్. ౧౦౭౩

తే. సర్వరూపంబులను బొల్తు, సర్వయజ్ఞ-ఫలముల నొసంగుదాననై చెలఁగుచుందు;
నయిన నన్యభక్తుల కెల్ల నరయ ముక్తి-మిగుల దుర్లభ మటుగాన నగవరేణ్య!

క. శరణొందుము నన్నే మది,-శరీరబంధముల వదలు స్వాంతంబున, నీ
వురునియతిఁ బూను, మంతట-సరవిని ననుఁ జేరఁగలవు సత్యము తండ్రీ!

ఆ. ఏది చేయుదువొ, మఱేది భుజింతువో,-యేది వేల్తు, విత్తు వేది, దాని
నాకు నెల్ల నొసఁగ నీకర్మబంధముల్-పాయుఁ, గలుగు మోక్షపదము నీకు.

తే. ఎవరు నను భజియింతురో, యెవరునాప-యిని గడుం భక్తి నుందురో, యేను వారి
యందు నుందును, లేరు నాకప్రియులును-బ్రియులు నగువార లేరును విద్వరేణ్య!

తే. అతిదురాచారుఁడయ్యు ననన్యశరణుఁ-డయి నను భజించునట్టివాఁ డఖిలపాప
ముక్తుఁడయి భవబంధనములను వదలి-త్వరితముగను ధర్మాత్ముఁడై భవముదాఁటు.

క. గిరిరాజా! మద్భక్తుల-కరయఁగ ముక్తి కడు సులభమగుఁ, గావున నీ
వరికించి నీవు మదిలోఁ- బరమంబగు భక్తి వేగ భజియింపు మొగిన్. ౧౦౭౯

తే. నిన్ను భవసాగరమునుండి నిశ్చయముగ-నుద్ధరింతును గిరివర! యుల్లమందు
నన్నె తలఁచుచునుండుము, నన్నె యజన-మునునొనర్పుముసంతతమునుదృఢముగ.

క. సతతము మదిలో నేనే-గతి యని వందనము లిడుము, గ్రావాధిప! సం
సృతిదుఃఖము లందక స-మ్మతి నను బొందంగఁగలవు మహనీయగుణా!''

పందొమ్మిదవ అధ్యాయము

హిమవంతునకుఁ బార్వతి యోగసారమహిమను దెలుపుట

తే. శ్రీమహాదేవుఁ డంత మహామునీంద్రుఁ-డైన నారదుఁ గని యిట్టులనియె ''మౌని!
యీవిధంబునఁ బార్వతి తా వచించి-నట్టిదా యోగసారంబు నగవరుండు.

క. విని జీవన్ముక్తుండై-ఘనుఁడయ్యెన్, యోగసార క్రమసరణి ని
ట్లనుపమముగ మాహేశ్వరి-జనకునకుం దెలియఁజెప్పి చయ్యన నంతన్. ౧౦౮౩

ఉ. బాలికయై విలాసమునఁ బర్వతపుత్త్రిక తల్లి చెంగటన్
బాలను ద్రావుచుండె, గిరివర్యుఁడు చేసె మహోత్సవంబులన్
మేలగు నుత్సుకత్వమున మేదిని నెందు వినంగరానివై
పోలగ నెవ్వరుం గనని భూరివిధంబుల వైభవోన్నతిన్. ౧౦౮౪

తే. త్మాధరేంద్రుఁ డాజననాఁడు షష్ఠియనఁగఁ-జెలఁగు దేవిని విధినిఁబూజించి, పురుడు
పదవనాఁ డన్వయక్రమపద్ధతి శిశు-వునకుఁ బార్వతి యనెడు పే రునిచె మౌని!

తే. మేనకాగర్భమునఁ బుట్టి మిగులఁ బర్వ-తాధిపతియింట వసియించె నఖిలలోక
జనని యుత్తమప్రగ్భృతి శాశ్వతమునీంద్ర!-యీవిధంబున లీలచే హితవుమీఱ.

పార్వతీగీతఫలశ్రుతి

ఉ. ఉత్తమమైన యోగము మహోన్నతరీతి వచించె దేవి లో
కోత్తరుఁడైన శీతగిరి కుత్సుకతన్ మునినాథ! దాని స
చ్చిత్తముతోఁ బఠించినను శీఘ్రముగాఁగ నరుండు పొందు న
త్యుత్తమముక్తి నారద! మహోన్నతదివ్యగుణైకభూషణా! ౧౦౮౭

తే. సతతమంగళకారిణి శర్వ రాణి-సంతతము తృప్తినొందు నిశ్చయముగాను,
యోగవర్యముఁ జదివిన నుకుతరమగు-భక్తి పార్వతియందునఁ బరఁగఁ గలుగు.

తే. ఎవఁడు శ్రీపార్వతీగీత మిద్ధభక్తి-తత్పరత నష్టమిని జతుర్దశిని నవమిఁ
బఠనమును జేయునో, వాఁడు పడయు నిత్య-సత్యమయిన జీవన్ముక్తి సంయమీంద్ర!

సీ. శారదవేళను సద్భక్తితో మహాష్టమినాఁ డుపవసించి సాధునియతి
నీమహోత్తమయోగ మేమహనీయుండు పఠియించి శ్రద్ధ లోఁబరఁగ రాత్రి
జాగరణము సల్పు, నాగుణగణ్యున కయ్యేడు పుణ్యంబు నలవియగునె
వచియింప నారదా! వాఁడు సమస్తదేవతలకుఁ బూజ్యుఁడై వఱలు, మఱియు
తే. సకలజగదంబ యగు దుర్గ కకలుషమతి-భక్తుఁ డగు, నింద్రముఖ్యులై పరిధవిల్లు
నట్టి దిక్పాలకులు వాని యాజ్ఞయందు-మెలఁగువారలు సుమ్ము నిర్మలమనీష.

సీ. దేవ్యనుగ్రహమున దేవిసంబంధమౌ కళఁ బొందుఁ దాను నిక్కముగఁ బార్వ
తీగీతముఁ బఠించు యోగవంతుఁడు, వాని బ్రహ్మహత్యాదిపాపతతియైనఁ
బూర్తిగా నశియించు, మునినాథ! నారదా! సకలసద్గుణములఁ బ్రకటితుఁడగు
పుత్త్రుండు జనియించుఁ బూర్ణదీర్ఘాయువుగలిగినవాఁడు, ధీవిలసితుండు,
తే. నతని శత్రువు లెల్లరు నడఁగియుందు,-రట్టివానికి శుభము లత్యంతముగను
గోరికలుమీఱఁ బ్రియమునఁ జేరుచుండు,-సంతతంబును వాఁ డుండు సంతసమున.

తే. ఎవఁ డమావాస్య రాఁగఁ దా నిద్ధభక్తి-యుక్తుఁడయి పార్వతీగీత మొగిఁ బఠించుఁ,
బాపనిర్ముక్తుఁడయి వాఁడు పరద దుర్గ-తో సమానత్వమును బొందు ధీసమేత!

సీ. అర్ధరాత్రమునందు నతిభక్తి మాలూరవృక్షసన్నిధియందు విశదభక్తి
శ్రీపార్వతీగీత నేపునఁ బఠియించునట్టివానికి దుర్గ యతిశయదయఁ
బ్రత్యక్షమగు, నింక బహువిధంబులఁ జెప్పఁగా నేల? నారదా! కడఁక వినుము
పరమతాత్పర్యంబుఁ, బార్వతీగీతాపఠనతుల్యసుకృతంబుఁ గనఁగ ధరణి
తే. యందు లేదు, తపోదానయజ్ఞముఖము-లందుఁ గల ఫల మెన్నఁగా నిందుఁ గల్గు
ఫలముతోడ సమం బన వలనుపడక-యున్నతంబయి వెలుఁగు మహోన్నతగుణ!

తే. నిత్యయయ్యును బరదేవి నిరుపమాన-లీలతోడ జనించె హిమాలయసతి
కనుచు నెల్లను దెలిపితి నార్య! యింక-నేది వినఁగోరితివొ తెల్పు మిపుడు వేడ్క."

ఇరువదియవ అధ్యాయము

తే. అని మహాదేవుఁ డాదరంబునను నడుగ-నారదమునీంద్రుఁ డెద భక్తిగౌరవములు
చెలఁగఁ బలికెను ''దేవ! నిస్తులవిలాస-యై పరాశక్తి హిమవంతునాలయమున.

పార్వతీ బాల్యము

క. నివసించి మహాయోగ-ప్రవిశదతత్పరుని నెట్లు భర్తనుగాఁ దా
ను వరించెను? దయఁ దెల్పుము-సువిస్తృతిని దేవదేవ! శుద్ధవిభావా! ౧౦౬౨

క. దారాపరిగ్రహంబున-నేరీతి మనంబు నిలిపె నీశుఁడు? తమి సం
సారవిముఖుఁడు మహాయో-గారంభము నెట్లు వదలె నాత్మఁ? దెలుపవే. ౧౦౯౭

క. ఏరీతిని స్మరరిపుని శ-రీరార్ధముఁ బొందె దేవి ప్రీతి వెలయ? వి
స్తారంబుగ వివరింపు మ-పారకృపన్ దేవదేవ! భద్రద! నాకున్." ౧౦౯౮

క. "మునివర! సమస్తవిశ్వం-బును దన దివ్యమగు మాయ ముంచిన యాదే
వ్యనుపమమాయను దెలుపఁగ-ననువుపడునె యేరికైన నతివిశదముగన్? ౧౦౯౯

సీ. ఏమాయ జగముల నెల్లను బుట్టింప, సంరక్షణ మొనర్ప, సమయమునను
విలయంబు నొందింప వితతశక్త్యన్వితయయి యొప్పుచుండునో యనఘచరిత!
యామాయ హిమవంతు ధామంబునం దతిబాల్యంబుతోడుతఁ బరఁగుచుండె,
ననుదినంబును వృద్ధి నందుచునుండె వర్షాకాలమందు స్వర్ణదినిబోలి,
తే. రమ్యగుణమును దాల్చి శరద్విభాస-మానమైనట్టి వెన్నెలవాఁడ్క, మిగులఁ
జెలుల గుమిఁ గూడి యాడుచుఁ జిత్రగతిని-నిజవిలాసంబుతో నుండె నిర్మలాత్మ!

చ. తన సుగుణావళిన్ జనకుఁ దన్పుచుఁ బార్వతి వేడ్కఁ జేయు, నా
య్యన గిరిరాజు, మేనయును నా ప్రియపుత్త్రిముఖంబుఁ బ్రీతిఁ గ
న్గొనుచును మాటిమాటికిని గూరిమి మించఁగ నొందువస్తువుల్
గన మదిఁ గోరకుండి రిటు గాదిలిపట్టిని మెంచి యెంతయున్. ౧౧౦౧

క. మునిజనపుంగవ! తపమున-కేనయుంగ నసాధ్యమైన దెదియుం గలదే?
కనుఁగొనఁ దపంబుచేఁ బడ-యని ఫల మన లేదటంచు నాత్మ నెఱుఁగనా.

సీ. ఏ దేవిదర్శనం బెంచఁగా దుర్లభమగును బ్రహ్మాదిదేవాళికెల్ల,
అద్దేవి నాఁడి నుంచి యద్రినాథుఁడు, మేనయును బుత్త్రికాభావమునను బ్రీతి
రేయుంబవళ్లు నిరీక్షించుచుండిరి, భవతారిణిని మదిఁ బరమభక్తి
నెవ్వారు భజియింతు, రెంతయు వారికె నిష్టవరంబుల నిచ్చుఁ దల్లి
తే. మునిజనోత్తమ! సురపూజ్య! యనఘ లోక-జననిదుర్గ మ్మయయ్యు నిచ్చలు భజించు
వారికెల్లను సులభమై వఱలుచుండు-ననుచుఁ దెలియుము మదిలోన, వినుము భక్తి.

నారదుఁడు పార్వతిం జూడవచ్చుట

సీ. మునినాథ! యీరీతి ముదమున భగవతి గిరిరాజగృహమునఁ బరఁగుచుండి,
తల్లిదండ్రులకు సంతసమును గూర్చుచు సంతృప్తిఁ జేయుఁ దా సంతతంబు,
నిటులుండ నొక్కనాఁ డెంతయుఁ బ్రీతితో హిమగిరీంద్రుఁడు పరమేశ్వరియగు
నాదేవిఁ దన కూఁతు నంకంబునం దుంచుకొనియుండె నౌత్సుక్యమునఁ జెలంగి,
ఆ. యట్టి సమయమున మహామునిపుంగవుం-డైన నారదుం డమానభక్తి
నామహేశ్వరిని మహాదేవిఁ గనుఁగొను-వాంఛ గగనవీథి వచ్చె నటకు.

తే. రమ్యమైన శరత్కాలరాత్రియందు-వెలుఁగుచున్నట్టి చంద్రుని వెన్నెలవలె
స్వచ్ఛయయి గిరిరాజాంకభాసమాన-యయిన గౌరిని నారదుఁ డపుడు గాంచె.

తే. తన గృహమునకు వచ్చిన మునినిఁ గాంచి-దివ్యబుద్ధియుతుండయి తేజరిల్లు
నద్రిరా జతిభక్తితో నర్ఘ్యపాద్య-ములను బూజించి మ్రొక్కి నంజలి ఘటించి.

క. అంత మునీంద్రుఁడు దమి హిమ-వంతుని సంతోషపఱచి వరవాక్కుల న
త్యంతాదృతిఁ బల్కెను "ధీ-మంతా! గిరిరాజ! విను సమంచితచరితా!

చ. మును నేఁ బల్కినరీతి నాద్య యగుచుం బొల్పారుచున్నట్టి దే
వనికాయోత్తమవంద్యయా ప్రకృతి నీవంశంబునం బుట్టెఁ ద్వ
త్తనయారూపమునం జెలంగుచును, సత్యం బంచు నావాక్యముల్
మనమం దెంచినవాఁడవే సుమతి! సంభావించి యత్యంతముఁ? ౧౧౦౪

క. ఈదేవియె నిక్కముగ మ-హాదేవునిఁ బెండ్లియాడి యర్ధాంగమునన్
మోదము మీఱఁగ భాసిలు,-భేదం బించుకయు లేక ప్రియముం జేయున్.

సీ. ఆ దేవదేవుండు నన్యకాంతను బెండ్లియాడండు నిజముగా నద్రిరాజ!
నీ ప్రియపుత్త్రికనే పెండ్లియగు, దాన నర్ధనారీశ్వరుం డగుచు వెలయుఁ,
గావున నీవు నాదేవునకే కూఁతునియ్యంగఁదగుఁ గడు నెయ్యమునను,
నీదేవి పూర్వమం దీశుని సతి యయి పరఁగె దక్షుని యింటఁ బ్రభవమంది,

తే. యోమహామతి! వినుము, మహోన్నతమయి
వఱలు వారల ప్రేమ, యెవ్వారియందుఁ
గనుఁగొనఁగ లేదు పూర్వంబుఁ, గలుగ దింక,
నిక్క మీమాట, నమ్ము మో నిశ్చలాత్మ! ౧౧౧౦

తే. హిమగిరీంద్ర! యీపార్వతి యెసఁగియపరి-మితములగు దేవతాకార్యతతులవరుసఁ
జేయఁ బూనికతో నుండుఁ జిత్తమందు,-వినుము తెలిపెద నీపుత్త్రి విధము మఱియు.

క. కొడుకును గను నీపుత్త్రిక-కడిమి మిగులునట్టివాని క్ష్మాధరవర! యే
యెడ జోడు లేఁడు వానికిఁ-బుడమిం బలశౌర్యములను, బుట్టఁడు మీఁదన్.

క. కావున నీసుత నితరుల-కీవలదు, మహేశ్వరునకె యీయఁదగుఁజుమీ!
భావమున నెంచి" యని ముని-యీవిధమునఁ దెలుపఁ బర్వతేంద్రుఁడు తృప్తిన్.

సీ. మునినాథు వాక్యము ల్విని గిరినాథుండు పల్కె "నారదమునీ! పరమశివుఁడు
నిశ్చలుండై కడు నియతిఁ బరబ్రహ్మమును నాత్మయందునఁ గనుచునున్న
వాఁడు, సంగంబును వదలి యత్యుగ్రమై దేవతావరులకుఁ దేరిచూడ
ననువుగానట్టి యత్యధికతపంబును గావించుచున్నాఁడు కడఁక నితర

తే. చింతల న్వీడి, బాహ్య మీాక్షింపఁ డెపుడు,-నిర్మలబ్రహ్మ మాత్మను నిలిపినాఁడు,
దిట్టమైనట్టి దీక్ష చేపట్టినట్టి-వాని నెవ్వఁడు కదలింపఁబూనఁగలఁడు? ౧౧౧౪

క. ఈవిధి శివుఁ డున్నాఁడని-నే వింటిని, నాదు పుత్త్రి నేక్రియఁ బ్రీతిఁ
దా వరియించును భార్యగ,-నేవెర వికఁ గలదు తెలుపు మిద్ధగుణాఢ్యా!"

నారదుఁడు ఈశ్వరుని తపశ్చర్యావిధముఁ దెల్పుట

చ. అనవుడు నారదుం డనియె "నద్రివరా! మది చింత యేల యా
పనికయి నీకుఁ? దత్తపము భంగముగాఁగల దింకమీాఁదటన్,
వినుము తదీయహేతువును విస్తృతరీతిని దెల్పువాఁడ, దే
వనికర మాపదం దవిలి వచ్చు మహేశుని పాలి, కెట్లనన్. ౧౧౧౫

సీ. తారకుం డనెడు నక్తంచరుండు తపోమదంబు పెంపున దేవతావరులను,
వారి బాంధవులను వజ్రముఖ్యుల గెల్చి దేవలోకంబును దివిరి యాక్ర
మించి, యంతటఁ బోక మిగుల నుద్ధతితోడఁ దక్కిన దేవతాతతిపదవులఁ
గొని యేడు లోకంబులను దాను బాలించు నధికారమును బొంది యబ్జభవుని

తే. వరముచేతను భాసిల్లువాఁడు, మఱియు-నమితతేజస్వియైన శివాత్మజన్ము
వలన మృత్యువు గనునట్లు బ్రహ్మ యద్ది-రాత్మునకు నిర్ణయించె సత్యముగ దాన.

క. పరమేష్ఠిశాసనంబున-వరయత్నముఁ జేయనున్న వారలు సుర లె
ల్లరు నింద్రుఁ గూడి యొగి శం-కరు మోహితుఁ జేయు కోరికం గిరినాథా!

తే. పర్వతాధిప! లోకసంబంధమయిన
యీావిధానంబు మదియందు నెఱుఁగవలయుఁ
దథ్యముగను నిమిత్తమాత్రంబె యనుచు,
వినుము తత్త్వంబు వచియింతు విశదముగను. ౧౧౧౮

సీ. ఈ నీ కుమారికయే హరు మోహితు నొనరింపఁగలదుసు మ్మోనగిరీంద్ర!
సకలజగన్మోహసంధానకారిణి యగు మహామాయ యి ట్లవతరించె,
విలసిల్లు శ్రీలక్ష్మి విష్ణుసమ్మోహిని పోలుపొందు శివ హరు మోహినియగు,
నా మహాకాళుఁడే హరుఁడు, స్వకీయాంతరంగనివాసియై రమణ వెలుఁగు,

తే. నీమహాకాళి యోగమం దెసఁగి మిగుల-వరసమాధిస్థుఁడై మది నరయుచున్న
వాఁడు, నిశ్చలచిత్తుఁడై వఱలు, నీమె-కయి తపంబును గావించు నధికనిష్ఠ.

తే. పెండ్లియై నీదు సుతను సంప్రీతితోడ
మరల యోగంబు హరుఁడు దా మానఁగలఁడు,
ధ్యానయోగంబుచే భావమందు నెల్ల
దెలియఁగలఁడు శీఘ్రంబుగాఁ గలవిధంబు. ౧౧౨౧

క. గిరిరాజా! త్వద్గృహమునఁ-బరమేశ్వరి జన్మమంది భాసిలు నని తా
హరుఁ జెఱిఁగి, నీదు చెలియకు-నరుదెంచును దపము నిశ్చయంబుగఁ జేయన్."

క. ముని నారదుఁ డీవిధమున-ననువుగ వచియించి ప్రీతి నరిగె, నథమునం
దున మధ్యాహ్నార్క-ప్రభ-నెనయుచుఁ గడుమహిమతోడ నెంతయు వడిగాన్.

ఇరువదియొకటవ అధ్యాయము

ఈశ్వరుఁడు తపస్సుచేయుట

క. మునివరుఁ డరిగినపిమ్మటఁ-దన సతియగు మేనతోడ ధరణీధ్రవరుం
డనువుగఁ బార్వతి భవగే-హిని యని నిశ్చయము చేసె నెంతయు, మరలన్.

క. మునినాథ! యపుడు శంభుఁడు-తన పూర్వాశ్రమము వదలి తప మొనరింపం
గను హిమగిరిసానువునకుఁ-జనియెన్ గడు నిష్ఠ మదిని గడలుకొనంగన్.

ఉ. ఎచ్చట గంగ దాఁ బుడమి కెంతయు వేడుక నిర్గమించె న
త్యుచ్చపదంబు బ్రహ్మభువ మొప్పుగ వీడి యనర్గళంబుగా,
నచ్చట శంకరుండు పరమాత్ముని ధ్యానము చేయు పూన్కితో
నొచ్చెము లేక పూర్ణుఁడయియుండె సముత్సుకుఁడై ముదంబునన్. ౧౧౨౮

సీ. ఇందుకళాధరుం డీశ్వరుం డీరీతి ధ్యానంబుఁ గడు శ్రద్ధఁ బూనియుండఁ,
బ్రమథులు ధ్యానతత్పరులయి కొందఱు, సేవల నొనరించు చిత్తములను
గొందఱు, సహచరు ల్గొంద ఱెంచుక దూరమున నుండువారును, బుష్పఫలము
లను దెచ్చువా ర్గొందఱును, గీతనృత్తపరాయణు లొందఱై, యాయెడఁ గల
తే. గైరికాదులతోఁ దృప్తిఁ గ్రీడసలుపు-చుండి రొకకొంద, ఱిట్టియ నుండఁ గిన్న
రులును, గంధర్వులును నందు లలితరీతిఁ-జెలఁగి రత్యంతసంతోషకలితు లగుచు.

హిమవంతుఁడు శంకరునిఁ జూడవచ్చుట

మ. ఒకనాఁ డీశ్వరుఁ జూచువేడ్క గిరిరా జుల్లంబునం బూని యో
పికతోఁ రాఁ, బ్రమథవ్రజంబులు కడుం బ్రీతిన్ విలోకించి మ
చ్చికమీఱంగను దాపుఁ జేరి యచలశ్రేష్ఠున్ మహాత్మున్ సము
త్సుకులై పల్కిరి "యోగికేంద్ర! విను మిచ్చో శ్రద్ధతో మా నుడుల్.

తే. శంకరుఁడు తావకీనమౌ సానువునకుఁ-దపము చేయంగఁ బ్రమథసంతతులతోడ
నరుగుదెంచెను, బ్రస్థపురాంతికమునఁ-జేరియున్నాఁడు దపస్సున స్థిరతఁ దాను.

ఆ. చంద్రశేఖరుండు జటిలుండు యోగియై-యున్నవాఁడు, ప్రమథు లున్నవారు
పెక్కు రామహాత్ము మ్రొక్కి సేవించుచుఁ-దత్సమీపమునను ధ్యానమూని.

క. కొందఱు సేవింతురు, మఱి-కొందఱు దూరంబునందుఁ గోట్లకొలఁదిగా
డెందంబున నానందము-పొందుచు నద్దేవుఁ గాంచు పూన్కి జెలంగన్.

తే. ఆడుచున్నారు, పాటలఁ బాడుచున్న-వారు, నృత్తంబుఁ జేయుచు వాంఛమీఱ
వఱలుచున్నారు కొంద అంబరము వీడి-ప్రమథు లోగిరినాయకా! ప్రమదమునను.

క. కొందఱు పులిచర్మంబుల-నందంబుగఁ గట్టి భూతి నలఁది వెలయువా,
రందఱు జడలను శిరముల-యందుఁ బెనచి చుట్టినార లక్కజ మొదవన్.

చ. గిరివరనాథ! యీశ్వరుని క్రీడలు సంపద లద్భుతంబులై
పరఁగుచునుండు, నీవు కడు వాంఛ దలిర్పఁగ నెప్పుడైన నా
పరమశివున్ మహావినయవంతుఁడవై కనుఁగొమ్ము, నీకు సం
బరమగుసుమ్ము, పొ''మ్మనుచుఁ బల్కఁగఁ బర్వతరాజు వేడుకన్. ౧౧౩౪

చ. విని ప్రమథాళివాక్యముల విస్తృతరీతి మదిం దలంచి యొ
య్యన జగదీశ్వరుండయిన యా పరమాత్ముఁడు శంకరుండు పా
వనమును దుష్కరంబగు తపం బొనరించు మహాపవిత్రభూ
మినిఁ గనఁబోయె, నుత్సుకత మించుచునుండఁగ సంతసంబునన్. ౧౧౩౫

ఆ. భక్తియుక్తుఁ డగుచుఁ బరమేశుఁ బూజించె-గిరివరుండు, మదినిఁ గరము ముదము
నొంది శంకరుండు డెందంబునను బూజ-లందె సాదరమున నపుడు మౌని!

ఉ. అంత గిరీంద్రుఁ గాంచి భువనాధిపుఁడౌ పరమేశ్వరుండు తా
నెంతయు సంబరంబునను హృష్టునిఁ జేయుచు నా గిరీంద్రుతో
వింత దలిర్పఁ బల్కెను "పవిత్రతమంబగు త్వత్పురోత్తమ
ప్రాంతమునన్ వసింపఁగఁ దపం బొనరింపఁగఁ గోరి వచ్చితిన్. ౧౧౩౬

సీ. తప మొనరింపఁగాఁ దగి నిర్జనంబయి పుణ్యప్రదంబయి పొలుచుచుండు
నీపర్వతముసుమ్ము, నిర్మలంబగు, దాని సానువునందు నే సర్వగణము
లను గూడి వసియింతు ననఘ! నీ రాజ్యమా నిదిగాన నామాట యించుక విను,
మీయెడకును జేర నెవ్వరు రాకుండఁ గట్టడి యొనరింపఁగాఁ దగు నిఁక,

తే. సంగమునఁ దపోహాని సంభవించు,-దాన సంగంబు వదలఁగాఁ దలఁచినాఁడ,
యోగులెల్లరు విజనమై యొప్పుచోట-వాసమును జేయుచుందు రన్వార్థ వినవె!

తే. యక్షులకుఁ గిన్నరులకును రాక్షసులకు-దేవతలకును మునులకు ద్విజుల కెపుడు
నీవె యాశ్రయమయి యుందు, వెల్లవారి-వృత్తములఁ గాంచినాఁడవు విద్వరేణ్య!

ఉ. ఎక్కువగాఁగఁ జెప్పఁగల దెయ్యది నీకు గిరీంద్ర! ధర్మమం
దెక్కుడు జ్ఞానివై వెలయు, దెయ్యెడ నీసరి లే'' రటంచుఁ బెం

పెక్కు వచించి యాక్రియ మహేశ్వరుఁ డూరకయుండ, నద్రిరా
జక్కమనీయవాక్యముల కాత్మఁ దలంచి చెలంగి నమ్రతన్. ౧౧౪౦

చ. పలికె ''మహానుభావ! సురవందిత! యో జగదీశ! నీవు పెం
పలరఁగ నిందు వచ్చుట మహాసుకృతాత్ముఁడ నైతి దేవ! యి
య్యిలను మదీయభాగ్యమున కెన్నఁగ దీటగువార లో ప్రభూ!
గలరె? ఫలించె నా కలిమి, కామితము ల్వెసఁ దీఱె శంకరా! ౧౧౪౧

తే. బ్రహ్మ మున్నగువారికిఁ బరమదుర్ల-భుండవగు నీవు తపమును బూన్కిఁ జేయు
వాంఛ నాప్రస్థమునకును వచ్చు టరయఁ-బుణ్యవంతుఁడ నైతిని బూజ్యపాద!

సీ. విజనమైనట్టి యీ పృథివీధరమునకు భువనాధిపతివయి పొసఁగు నీవు
స్వేచ్ఛ వచ్చితివి మహేశ! యింద్రుండైన నాతోడ సముఁడౌనె ఖ్యాతిమిగిలి?
కామమోహితుఁడవై గణములతోఁ గూడి యిటకు నీరాకచే నెసఁగె శుభము,
నాకంటె నెవ్వండు లోకంబునందుఁ బుణ్యాత్ముండు గలఁడె మహానుభావ!

తే. ధన్యుఁడను, గృతకృత్యుండఁ, దప మొనర్పు-మిచట, నిప్రస్థమందున నీశ! నీవు
తపము సల్పెడునట్టి యత్తరుణమందు-నేరు నీసన్నిధికిఁ జేర రారు, నిజము.

ఉ. శంకర! యీరహస్యమగు సానువునందు యథేప్సితంబుగా
శంక యొకించుకేనియును స్వాంతములోపల నుంపఁబోక యే
ణాంకధరా! తపంబును మహామతి సల్పు'' మటంచుఁ బల్కి తాఁ
బొంకముగాఁగఁ జేరె గృహముం గడువేడుకతోడ నంతటన్. ౧౧౪౪

హిమవంతుఁడు శాసనము చేయుట

సీ. శైలనాథుఁడు తన జనపదంబులయందుఁ గలవారి నాత్మీయకులమువారి
నాహ్వానమొనరించి యాజ్ఞగావించె ''నో హితులార! జనులార! యెప్పుడైన
నెవ్వరైనను మీర లేకార్యమునకేని గంగావతరణంబుకడకుఁ బోవ
రాదు, సదాశివుం డాదిదేవుఁడు తపంబొనరించుచున్నాఁడు పూన్కి మిగిలి,

తే. అది మహేశ్వరు వసతి, నా ముదల లేక-చేరఁగూడదు, నా యాజ్ఞ నేరు మీఱు
వారలగుదురో దండ్యులు, వధ్యు లగుదు-రట్టివారలు, నిస్సంశయంబు సుండు.''

చ. గిరివరుఁ డిట్లు శాసన మొగిన్ బ్రకటింపఁగ భీతులౌచుఁ గిం
పురుషులుఁ గిన్నరుల్ సురలు భూతగణంబులు మానవుల్ నిశా
చరులును సర్వజంతువులు స్వాంతములందు భయంబుఁ జెంది, శం
కరుఁడు తపంబొనర్చు వరకాననమెవ్వరుఁ జేర రోమునీ! ౧౧౪౫

తే. చంద్రశేఖరుఁ డిట్లు నిర్జనహిమాద్రి-సానువున ఘోరతపమును సలుపుచుండె
వరమహాయోగియై; గిరివరుని యింటఁ-బార్వతియు దినదినవృద్ధిఁ బరఁగుచుండె.

చ. అతిరుచిరాంగియై, సువిశదాననయై, కమనీయరూపశో
భితయయి పార్వతీరమణి పెండిలియీడున నొప్పుచుండె, నా
క్షితిధరవల్లభుండుఁ దన చిత్తమునందున నారదోక్తి యే
హితవని పెండ్లియత్న మొకయించుకయైన నొనర్పఁ డయ్యెఁ దాన్. ౧౧౪౮

పార్వతి తపంబుఁ జేయఁగోరుట

ఉ. అంతట నొక్కనాఁడు తుహినాచలనందన తాను తండ్రితో
నెంతయు వేడ్కతోడ వచియించెఁ "దపంబొనరింపఁ బోదు న
త్యంతమనోహరంబగు శివాంతికమందున భక్తి మీఱ, ని
శ్చింత వహించి నాకు దయచేయుము తండ్రి! యనుజ్ఞ నిప్పుడే. ౧౧౪౯

సీ. పరమరహస్యమై పరఁగు తత్కారణంబంతయు విను తండ్రి! యాదరమున,
మును బ్రహ్మ తనపుత్రికను సంధ్యయను దానిఁ గామమోహితుఁడయి కవయఁగోరె,
నాసమయంబునం దాకసమున శివుండున్నవాఁడయి బ్రహ్మ నుద్ధతిమెయి
ధర్షింపఁగాఁ బూని తిడయక నిందించె లోకకర్తను విధిఁ బ్రాకటముగ,
తే. నపుడు తన్నిందచే సిగ్గు నంది వికృతిఁ-బొందఁగా వదనంబు తా డెందమందు
భువనమోహినియగు నన్నుఁ బూన్కి నిలిపి-తపము చేత నారాధించె విపులముగను.

తే. మంగళప్రద నగు నేను మదిని సంత
సంబునను బొంగి విధికిఁ బ్రసన్ననైతి,
నపుడు ననుఁ గూర్చి యాత్మలో నలరి వినయ
మునను వరమును గోరె నవ్వనజభవుఁడు. ౧౧౫౧

మ. "జననీ! దివ్యమనోహరాంగి వగుచున్ సంసారసంబంధ మా
త్మను వర్జించి తపం బొనర్చు శివు నీమాయన్ వశుం జేసికో,
మ్మనఘుం డా ప్రభు లోఁ గొనందగిన రమ్యాకార లెవ్వారలున్
గన లే, రీవె సమర్థవై వెలయు దాకర్షంబు గావింపఁగన్. ౧౧౫౨

క. మనమున నాపై దయ నీ-వునిచి దృఢంబుగను జన్మ మొందుము ధరపై
జనని! హరమోహినివయి-విని నా ప్రార్థనము మిగులఁ బ్రీతి దలిర్పన్.

చ. మది వనితేచ్ఛ నొక్కనినమాత్రమునన్ ననుఁ గాంచి శంకరుం
డదయత నిందఁ జేసె, నహహా! కడు సిగ్గును బొందినాఁడ, నీ
పదములె దిక్కు నా కనుచు భావములోపల నమ్మినాఁడ, నన్
సదయతఁ బ్రోవవే జనని! స్వాంతమునం గల వంత దీర్పవే! ౧౧౫౪

క. నాయం దనుగ్రహింపు, మ-మేయమహిము దేవదేవు మృత్యుంజయుఁ ద్వ
న్మాయామోహితుఁ జేయఁగ-నేయనువున నైనఁ జూడ హితవగుఁ దల్లీ! ౧౧౫౫

సీ. త్యక్తసంగుం డయి యాయాశ్వరుం డెప్డు విజనమహాచోటఁ దా వెలయుచుండు,
నప్పు డో దేవి! నీ వచ్చటఁ గామరూపాన్వితవై చేరి యనఘు హరుని
మోహమగ్నుఁగావింపఁబూను,మియ్యదినాకుఁగలకోర్కి" యని వేఁడెఁ గమలభవుఁడు,
మంచి దటంచు సమ్మతిఁ జెల్పితిని మున్ను బ్రహ్మ తపంబుచేఁ బరమతృప్తి,
తే. దానఁ బుట్టితి దక్షసద్మంబునందు,-మోహితు నొనర్తుఁ బ్రాకృతపురుషు నెట్లు
ప్రాకృతాంగనలోఁగొనుఁబరమనియతి-హరుని నొండొక్కసమయంబు నరసినేను.

తే. ఇంతలోపల క్షీణమై యొసఁగె దక్షు-పుణ్య, మాసమయంబునఁ బూజ్యులయిన
మీరు నను గొల్చినారలు, మీనిలయము-నందుఁ బుట్టితి దక్షు గృహంబు వీడి.

క. హరునిఁ మోహితుఁ జేయఁగఁ-బరిపూర్ణంబైనయట్టి భావముతో నీ
వరసదనంబున జననము-నిరవుగఁ బొందితిని, నిక్క మిది గిరిరాజా! ౧౧౫౮

చ. సతి నెడఁబాసి దుఃఖయుతు స్వాంతము నిల్కడఁ బొంద కెంతయున్
జతనముతోఁ దపంబును నొనర్పఁగ నన్ను వరించుకోరికన్
క్షితిధరరాజ! యిచ్చటికిఁ జేరెను శంకరుఁ డేను మున్న స
మ్మతిని నొసంగితిన్ జనక! మాన్యత నవ్విభు వాంఛఁ దీర్పఁగన్. ౧౧౫౯

తే. పతిగ వరియింతు శంకరుఁ బ్రమథనాథు-మరల నోతండ్రి! యాడిన మాటపేర్మి,
ననుమతింపుము నన్ను మహానుభావుఁ-డయిన శంకరుఁ గనఁబోవ నమితకరుణ.

చ. అతిశయభక్తితోఁ బ్రమథు లందఱుఁ గొల్వఁ దపంబుఁ జేయు సు
స్థితమతియై మహేశ్వరుఁడు చిన్మయరూపుఁడు నిర్జనంబు నై
హితవుగ నెందు, నచ్చటికి నేఁ జనెదన్, నను బంపవయ్య! స
మ్మతి మెయి తండ్రి! నామనవి మాన్యత నెంచుము నెమ్మనంబునన్. ౧౧౬౧

చ. ప్రియసతికై మదిం దలఁచి వెంటనె యోగము మాని నన్ను ని
శ్చయముగ భార్యగాఁ గొనుట చక్కని మార్గముగా నెఱుంగనే,
నయమగు రీతి శంకరు ననంతము నై తగు స్వీయమాయలో
నయి చరియించునట్లు జనకా! యొనరింతును జూడు మెంతయున్." ౧౧౬౨

చ. కొమరిత యిట్లు పల్క మదిఁ గూరిమి మీఱఁగ నాలకించి, యా
హిమగిరి మున్ను నారదమునీంద్రుఁడు తెల్పినయట్టి వాక్యముల్
సుమహితరీతి నెంచి, శివుఁ జూడఁగఁ దత్సముఖమ్ముఁ జేరఁగన్
క్రమ మని నిశ్చయించి, తన గాదిలిపుత్త్రికిఁ జెల్పె సమ్మతిన్. ౧౧౬౩

తే. అమ్మహామతి తన పుత్త్రికాభిమతము-మంచి దని నిశ్చయించె సమంచితగతి,
మేన విని యావిధానంబు దా నయనము-లశ్రువుల నిండ సుత నోడియందుఁ జేర్చె.

క. ఎలుగెత్తి యేడ్చి, యిట్లని-పలికెన్ సుతఁ గూర్చి "మానివంద్యచరిత్రా!
తలఁపవె సుగాత్రి! ప్రాణం-బులకు సమానవయి నీవు పొల్చుట పుత్రీ!

క. అమ్మా! నను వదలి సుతా!-యిమ్మెయి నీ వడవి కేల యేగెదు! శీఘ్రం
బిమ్మెగఁ దలంపు, మీక్రియ-సమ్మతియే నీకు" ననఁగ జననిం గనుచున్.

క. కమనీయహస్తముల నయ-నములం గల జలముఁ దుడిచి నయవాక్యల నా
యమ నూఱడించి పెక్కువి-ధములను నిట్లనుచుఁ బల్కె దయ యుప్పొంగన్.

క. "శోకింపవలదు తల్లీ!-నాకొఱకై నీవు నెమ్మనమున, వివేక
ప్రాకటమతివయి తెలియుము-నీకూఁతు రశోచ్య యగుట నిజముగ జననీ!

సీ. ఏదేవి నిత్యసమ్మోదాత్మిక యనంగఁ బ్రకృతి యాద్యయి నాఁగఁ బరిఢవిల్లు,
నేదేవి యటవియం దేనియు నింటియం దేని దుఃఖము లేక మెసఁగుచుండు,
నేదేవి వసియించు నెపుడు శ్మశానమునందుఁ గాళికయుఁ బ్రేతాసన యన,
నేదేవి నిర్జనంబై దుర్గమంబయిన స్థలమున నిర్భీతి సంచరించు,
తే. నమ్మహాదేవి నగుదు నే నమ్మ! నీవు
ధైర్యమును బూను, భయము సుంతయును వలదు,
దేవదేవుని మోహితభావుఁ జేసి
వత్తు నిచటికి నిజముగా వైభవమున. ౧౧౫

తే. జనని! మానసమున వేడ్క శంభుఁ బతిగఁ-బొందఁగాఁ గోరి, శివుని సమ్ముఖముఁ జేరఁ
బోవనెంచితి" యని పల్కె భూధరేంద్రు-పుత్రి పార్వతి సంతుష్టి పొదలునట్లు.

తే. అతిభయంకరముగ సుత యాడినట్టి-వాక్యమును విని 'యుమ'యని పల్కె మేన
యచ్చెరువు దోఁప నద్దాన నద్రిపుత్రి-'యుమ'యనెడు పేర విలసిల్లె నుర్వియందు.

తే. అంతఁ గాంతునితో మేన యనియె "నాథ!
నా తనయ హరు సముఖంబునకును బోవు
నేని యీ చెలులను బంపు మెలమి నామె
వెంట, దయతోడ విని నా దువిన్నపంబు. ౧౧౬

క. చెలులగు వీరలు సుతకై-వలసిన పుష్పాదికములు వాంఛారీతిన్
జెలఁగి ముదంబునఁ గూర్చుచు-నలరింతురు తోడుపడుచు నటఁ బ్రాణేశా!"

క. అని వినయంబునఁ బ్రార్థన-మును గావించుటయు మేన, ముదితుండయి కూఁ
తునకున్ సాహాయ్య మొన-ర్పను ననువగు ననుచుఁ దలఁచె నద్రీంద్రుండున్.

సీ. శీతాద్రినాథుండు చెలఁగుచు నిజపుత్రిఁ బార్వతిఁ దోడ్కొని బయలుదేరఁ
జెలికత్తె లిద్దఱు సలలితగతి వెంటవచ్చుచునుండఁగఁ, బరమహర్ష

యుక్తుఁడై సద్భక్తి నొప్పారి శ్రీవిశ్వనాథు నివాసంబునకు ముదమున
నరిగెడు నాసమయంబున దేవతాగణములు సంతోషకలితు లగుచు

తే. నీచరిత్రంబు నంతయుఁ జూచి పుష్ప-వృష్టిఁ గురియించి రాసర్వవిభు నివాస
మగు హిమాచలసానువునందు వేడ్క-నారదమునీంద్ర! యత్యంతగౌరవమున.

ఇరువదిరెండవ అధ్యాయము

హిమవంతుఁడు పార్వతిని శంకరుని సేవకై యుంచుట

తే. నారదమునీంద్ర! యీరీతి నగవరుండు-శ్రీమహాదేవు సన్నిధిఁ జేరి, వినయ
మునఁ బ్రణతిసేసి సమ్ముఖంబునను నిలిచి-విన్నపమొనర్చె నప్పుడు విశదముగను.

సీ. "దేవదేవ! మహానుభావ! నాపుత్త్రిక యుష్మత్పదాబ్జసరోజయుగము నెదుట
నిలిచియున్నది తన చెలులతోఁ గూడి నీశుశ్రూష చేయ నుత్సుకయయి మది,
నీ మనోభీష్టంబు నిచ్చలు గ్రహియించి కార్యంబు లొనరించుఁ, గ్రమభక్తి
ఫలముల మఱియుఁ బుష్పంబులఁ గమనీయజలము మున్నగువాని సమయమెఱిఁగి

తే. తెచ్చియిచ్చు"ననంగఁ దా దివ్యభావుఁ-డగు మహాయోగి శంభుఁ డాయద్రిరాజుఁ
గాంచి, లోపలి దృష్టిచే నెంచి, మంచి-దనుచు సంతసమును దెల్పె నపుడు మౌని!

ఉ. శంకరు సన్నిధానమున సంతస మాత్మను బొంగుచుండ ని
శ్శంకతఁ గూఁతు నుంచి తన సద్మముఁ జేర్చి గిరీంద్రుఁ డంత నే
శాంకధరుండు యోగివరుఁడై తగు శర్వాని సేవివిధంబులన్
బొంకముగా నుతించుచును బోయెను దాపసవర్య! నారదా! ౧౧౭౮

తే. భక్తుల ననుగ్రహింపఁ దాఁ బరమముదము-వెలయఁగా నిట్లు శివునిచే వేఁడికోలు
వడసి, తపమును సల్పుచు నడవియందు-వాసమును సల్పెఁ బరదేవి వాంఛమీఱ.

తే. పరమశివుఁ డాత్మ నా దేవి పరమతృప్తి-తోడ ధ్యానముచేసె, నుత్సుకత మీఱ
నామహేశ్వరి భార్యగా నపుడె కైకొ-నంగఁబూనకయుండె నోనారదముని!

క. శంకరు మోహితుఁ జేయఁగ-సంకల్పం బుదయమయ్యె సకలేశ్వరి, తా
పొంక మెఱిఁగి పూనికె ని-శ్శంకఁ బ్రయత్నములు సేయ నరగున సురలున్.

శివతపోభంగమునకు దేవతల ప్రయత్నములు

సీ. వినుము నారదమునీ! వినిపింతు సురలు చేసిన యత్నముల నెల్ల ననువు మెఱయ,
నాసమయంబున నవనిఁ దారకుఁ డను రాక్షసుం డొక్కండు దక్షుఁడగుచు
బాధించుచుండెఁ, నా బాధకు నోర్వంగఁజాలక నిర్జరసముదయములు
బ్రహ్మసన్నిధి కేఁగి ప్రణతులఁ గావించి జగదీశ్వరునితోడ మిగుల భక్తి

తే. వినయములు మీఱ నిట్లని విన్నవించి–"ఓత్రిలోకేశ! పరమేష్ఠి! రాత్రిచరగ
ణాధిపుఁడు తారకుండు మ మ్మాజియందు–గెలిచి తా నింద్రపదవిని నిలిచినాఁడు.

క. జగదీశ! భవద్దత్తం–బగు వరమును బొంది గర్వమంది త్రిదశులన్
దిగు లొక్కించుక లేక యె–వగఁ గుందించుచును నున్నవాఁ డోదేవా!

తే. భ్రష్టరాజ్యులఁ గావించి ప్రబలుఁడగుచు–భ్రష్టభార్యుల నొనరించె బ్రహ్మదేవ!
సురలనెల్లను వెన్నాడి కరుణలేక–కష్టములఁ బెట్టుచున్నాఁడు ఘనత మిగిలి.

సీ. ముల్లోకముల నేలు పురుహూతుఁ, జంద్రుని, జలములకును నధీశ్వరుని వరుణు,
సమవర్తియయి ప్రాణిసమితిని శిక్షించు యమధర్మరాజును, నగ్నిదేవు,
సకలజీవులకు నిశ్చయజీవనప్రదుఁడగు వాయుదేవుని, నట్లి నిర్ఋతి,
ధననాయకునిఁ గుబేరుని, మఱి దిక్పాలవరులను లోఁగొని వరుసఁ బనులు

ఆ. గొనుచు నున్నవాఁడు, వనజాసనా! యెందుఁ–బోవ నేము నంమఁ గావరమున
వాఁడు వచ్చుచుండుఁ, బాతాళమున నుండు–ప్రజలకెల్ల నసురబాధ లొదవె.

మ. బలవంతుండగు తారకాసురుఁడు మాపై వచ్చి ముల్లోకముల్
కలఁగన్ జేకొని కష్టసంతతు లోఁగన్ గావించుచున్నాఁడు, మా
కిల దిక్కెవ్వరు నీవుతప్ప పరమేష్ఠీ! యుక్తి లేకద్దియున్,
దలఁపం బోలము వాని ధాటి కిఁక మీఁదన్, గావవే మమ్మొగిన్. ౧౧౫౬

చ. తలఁపుము వానిఁ జంపఁగ విధానము నొక్కటి, లేనిచో మమున్
నిలుపఁగఁబూను మెందయిన నిశ్చలమైన స్థలంబునందు నో
యలఘుతరప్రభావ! యెది యాత్మకు మంచి దటంచుఁ దోఁచు నీ,
కలది నదే యొనర్పు, జగదీశుఁడ, వాధ్యుఁడ వీవు గావునన్." ౧౧౫౭

బ్రహ్మదేవుఁడు దేవతలకుఁ దారకాసురవధోపాయమును దెలుపుట

తే. అనుచు వినుతింప దేవత, లబ్జభవుఁడు–మనమునం దెంచి సర్వంబు ననువు వెలయ
భావికార్యంబు దలఁచి గీర్వాణవరుల–కానతిచ్చెను సత్కృపాకలితుఁడగుచు.

మ. "పరమంబౌ భవదీయవాంఛితము నా భావంబునం దోఁచె, నా
సురుఁ డస్మద్వరభాగ్యపోషితుఁ డగున్, జూడంగ నే వానికిన్
మరణంబుం బొనరింపఁబోలదు సుమీ! మర్యాదయుం గా, దదే
వరుసం బూనఁగ నోప, నింక వినుఁడీవాక్యంబు శ్రద్ధాయుతిన్. ౧౧౫౯

చ. తప మొనరించి తారకుఁడు ధన్యత నొందినవాఁడుసుమ్ము, నే
నపరిమితాత్మతృప్తిఁ గని యాతనికిన్ వరమిచ్చినాఁడ, నిం
కపకృతిఁ జేయఁజాలను, మహత్త్వము మీఱఁగ మీరె చేయుఁడీ
కృత మదిఁ జూప తాయసురుఁ గీటడఁగించు ప్రయత్న మంతయున్. ౧౧౬౦

సీ. ఉపదేశమునుమాత్ర మొనరింతు సురవరులార! మీరలు శ్రద్ధ నాలకింపుఁ;
డాహరియైనను, హరుఁడైన, నేనైన, మీరలైననుగాని తారకాసు
రుని వధింపఁగఁజాలరు, మహేశ్వరుని పుత్త్రుఁడొక్కఁడుతప్ప నీ యుర్వియందు
వానినిఁ జంపఁగాఁ బూనెడువాఁడు లేఁ, డియ్యది నిక్క మోయయ్యలార!
తే. త్వరితముగ నామహాదేవు ధ్యాననిష్ఠ-వీడి, దారపరిగ్రహావితతచిత్తుఁ
గాఁగ యత్నంబు చేయంగఁ గడఁగుఁ, డింక-నాలసింపకుఁ, డద్దాన నలరు సుఖము.

క. సురవరులార! హిమాద్రికి-వరసుతయై జన్మమందెఁ బ్రకృతియె తా సం
బరమున, నిపు డున్నది శం-కరపరిసరమున వనమునఁ గడు సంప్రీతిన్.

మ. హరుఁ డాదేవినిఁ బెండ్లియాడ నిజముగా నావశ్యకం బంచు నో
సురలారా! తగు యత్నముల్ సలుపుఁ డచ్చోఁ జేరి బల్మావిన్ శం
కరునిం ధ్యానమునుండి త్రిప్పఁగల దేకర్జంబో యూహించి యా
హరునిన్ భ్రాంతునిఁ జేయఁబూనుఁ డెదలో నత్యుత్సుకత్వంబునన్." ౧౯౩

తే. బ్రహ్మ యారీతిఁ దెల్పిన వాక్యములను-శ్రద్ధతోడుత నింద్రాదిసకలసురలు
నిలుకడగ విని తమతమ నిలయములకు-నరిగి, రంతట సమ్మోద మాత్మఁ బొదల.

బ్రహ్మదేవుఁడు తారకాసురునకు హితముపదేశించుట

క. మునివర! సురలకు నీక్రియ-ననువగు కార్యంబుఁ దెలిపి యబ్జాసనుఁ డా
య్యనఁ దారకనిలయంబున-కును జని వానికిని హితము గూర్పఁగఁ బలికెన్.

తే. "తారకాసుర! ఘోరమౌ తపము సల్పి-సకలభువనంబులను నేలు శక్తిఁ బొంది
వెలసితివి, లోకములకెల్ల విభుఁడ వయితి,-నావరం బట్టిదే దైత్యనాథ నాథ!

ఉ. నీవు తపంబు చేయుతఱి నెమ్మదిఁ గోరవు స్వర్గవాసముల్
గావలె నంచు నన్ను నోరిఁ, గాంక్షితమౌనని యెంచి యేను నీ
కావర మియ్యలేదుగద! యాత్మఁ దలంపుము, వీడు మిప్పుడే
దేవనివాస మియ్యెడ, క్షితిన్ వసియింపుము లోక మేలఁగన్. ౧౯౭

క. నాయాజ్ఞను బాలింపు మ-మేయగుణా! నాదు పల్కు మెలపున మృషగాఁ
జేయకుము, సకలరాజ్యము-శ్రీయుక్తుఁడ వయి యొనర్చి చెందుము శుభముల్."

ఆ. ఈవిధమున బ్రహ్మ యిచ్చిన యుపదేశ-మాదరించి తారకాసురుండు
దేవకంటకుండు దృఢబలుం డయ్యుఁ దాఁ-జేరె క్షితికి దేవసీమ వదలి. ౧౯౯

చ. మునివర! తారకాసురుఁడు భూతలమందు వసించియుండినన్
గనుఁగొనఁ బ్రత్యహంబుఁ దగు కాన్కలఁ గైకొని యింద్రముఖ్యదే
వనిచయ మాత్మ భీతిలి, ప్రభావము దక్కి, తదీయబాధచే
నణువుగ వచ్చి యిచ్చి దయ నందుచుఁ బోవుచు నుండు నారదా! ౨౦౦

తే. ఈగతిని క్షితి నుండియు నెల్లసురలఁ-దాప మొనరించుచుండె దుర్ధర్ష బలప
రాక్రమాన్వితుఁడయి రాక్షసాధినాథుఁ-డసమానదర్పమున నెంతయును జెలంగి.

ఇంద్రుఁడు బృహస్పతిని శివతపోభంగమున కుపాయమడుగుట

ఉ. అంత నమర్త్యు లెల్లరును యత్నముతో గుమిగాఁగఁ గూడి యే
కాంతమునందు "శంభుని మహాతప మేక్రియ భంగ మొందఁ గా
వింతుము, నిర్వికారుని వివేకము నాశ మొనర్తు" మం చొగిన్
స్వాంతమునందు యోజనము సల్ప, దివస్పతి నమ్రమూర్తియై. ౧౨౦౩

తే. కార్యకుశలుండు ప్రాజ్ఞుండు ఘనుఁడు రాజ-నీతిమంతుఁడు నా గురుఁ బ్రీతిఁ బిలిచి
దేవసభయందు గంభీరదివ్యభాష-ణములఁ బల్కెను, లోకమోదమును దలఁచి.

తే "గురువరోత్తమ! భగవంత! కుటిలరూపుఁ-డయిన తారకాసురునకు నబ్జభవుఁడు
శ్రీమహాదేవునాత్మజుచేతఁ జచ్చు-నట్లు కల్పించినాఁడు మహానుభావ! ౧౨౦౪

తే. ఆమహాదేవుఁ డిప్పు డత్యంతయోగ
నిరతి సంసారవిముఖుఁడై నిశ్చలతను
బూనియున్నాఁడు, ధైర్యంబు నూని యెవఁడు
'దేవ! పెండ్లాడు' మనుచును దెలుపఁగలఁడు? ౧౨౦౫

చ. కమలభవుండు మమ్ము ననుకంపఁ గనుంగొని తెల్పినాఁడు య
త్నమును నొనర్పుఁ డంచుఁ గడు నమ్రత వేఁడఁగ, దేవదేవు చి
త్తమును మరల్పఁగా వెరవు ధన్యత నొందఁగఁ దోఁప, దెవ్వఁ డీ
సమయమునందు శంకరుని స్వాంతము ద్రిప్పఁగ నోపుఁ, దెల్పవే." ౧౨౦౬

క. సురపతి పల్కిన పల్కులు-గురుఁ డాదృతి విని ప్రియంబు గూర్పఁదలఁచి, యో
సురముని! యిట్లని పల్కెను-బరమముదము గలుగునట్టి వాక్యము లలరన్.

బృహస్పతి యింద్రునకు శివతపోభంగోపాయమును దెలుపుట

చ. "బలరిపు! దేవనాయక! కృపన్ వినవయ్య! మదీయవాక్యముల్,
కల దొక యుక్తి శంకరుని గాఢతపోనియతిన్ మరల్పఁగా,
సులభముసుమ్ము, ధ్యానమునఁ జొక్కిన యీశుని భంగ మెన్న ని
మ్ముల నతిశీఘ్రకాలమునఁ బొల్చును, దెల్పెద నద్ది యిప్పుడే. ౧౨౦౭

సీ. దక్షుని పుత్త్రియై ధర జన్మమును బొంది యమ్మహేశునిఁ బెండ్లియాడెఁ దొల్లి
యేపరాశక్తి తా, నిపుడు తుషారాద్రి భవనంబునందుఁ దద్భార్యయైన
మేనకాగర్భంబుఁ బూనికతోఁ జొచ్చి జన్మించియున్నది చిన్మయాంగి,
యాదేవి దివ్యమైనట్టి రూపంబును దలఁచుచు శంకరుం డలఘుగతిని

తే. దపము సల్పుచునున్నాఁడు తనకు భార్య-గాఁ బరాశక్తిఁ గైకొనఁగాఁ దగునని;
తెలియుమీకార్యమెల్లఁ ద్వదీయచిత్త-మందుమహనీయభావ! యోయమరనాథ!

ఉ. అన్నివిధంబులం గెలుపు నంది మనంబును, యోగిపుంగవుల్
సన్నుతిసేయఁగాఁ దగు నచంచలశీలుఁడు దేవదేవుఁ డా
పన్నశరణ్యుఁ డేటికిఁ దపంబొనరింపఁగ భీమనిష్ఠుఁడై!
యెన్నుము, తానె యెన్నఁబడు నెల్లెడల న్దగఁ బాకశాసనా! ౧౨౧౦

చ. మనమునఁ దృప్తినొంది పరమంబగు శంకరు ధ్యాననిష్ఠకున్
జనవునఁ దత్సమీపముఁ బ్రసన్నతఁ జేరి వసించుచున్న దా
యనుపమదివ్యభోగమహిమాన్వితరూప స్వభక్తవత్సల
త్వనియతి యేర్పడం గరము తా నవిశంకతి నోసురేశ్వరా! ౧౨౧౧

చ. అవిరతయోగనిష్ఠుఁడయి యా హరుఁ డొప్పుచునుండఁ గామముల్
దవులఁగనోడె, నిశ్చలతఁ దా నలరారుచు నున్నవాఁడు, లో
కవినుతుఁడై మహేశ్వరుఁడు గైకొనఁ డాపరదేవిఁ, బ్రేముడిన్
మివులఁగఁ జూడఁ డించుకయు, నిచ్చలు ధ్యానముసేయు నాత్మలోన్.

సీ. ఇక్కారణంబున నిప్పుడె సురనాథ! భువనవిమోహనప్రవణుఁడయిన
సుమశరుఁ బిల్వనంపుము, వానిఁ బంపు శంకరు దివ్యయోగభంగం బొనర్పఁ,
దత్సూనబాణముల్ తనువు సోఁకినయంతఁ గామాదివర్గసంకలితుఁ డగుచు
దేవదేవుఁడు పరదేవిని పార్వతి వాంఛతో మరలఁ దా వైభవమునఁ

తే. బెండ్లియగు యోగవిముఖుఁడై ప్రీతిఁ దవిలి''
యనుచు యుక్తిని దెలుపఁగా నమరగురుఁడు,
పరమముదమునఁ బిలిపించి స్మరుని దేవ
నాయకుఁడు పల్కెఁ బ్రియమున నారదముని! ౧౨౧౩

మన్మథ దేవేంద్ర సంభాషణము

క. ''సురదనుజయక్షరాక్షస-గరుడోరగకింపురుషనికాయంబుల కీ
ధరఁ గల నరులకు జంతూ-త్కరములకుం బ్రీతినిచ్చు దాతవు మదనా! ౧౨౧౪

తే. మూఁడులోకంబులకునుసమ్మోదమునిచ్చు-నొక మహాకార్యమును జేసిసకలజగము
లనువుమీఱంగ రక్షింపు మనవరతము-నస్మదాజ్ఞను బూని లోకైకవీర!''

తే. అనుచునింద్రుండుమన్మథునతిశయమగు-నాదృతింబల్కె,నుప్పొంగియాత్మభవుఁడు
కరముముదమున వచియించెఁ గ్రమభణితిఁ-బాకశాసనుఁ ద్రైలోక్యపలినిఁగాంచి.

తే. ''దేవతాధీశ! యేమెల్లఁ దావకాజ్ఞ-నొదలలఁ దాల్చి చేయంగ ననవరతము
నున్నవారము, ఘోరమై యున్న కార్య-మేది, సెలవిం,డొనర్తు సమృద్ధి వెలయ.

ఆ. శౌరిసుదర్శనంబు నశనియు నడరి యె-వ్వాని వక్షసీమఁ బగిలిపోవు,
నట్టివానిఁ జీల్చు నైదుపూములుక్కు-లు-దారుణంబు లగుచుఁ దక్షణమున.

క. సార్థకములయిన విపె ప్ర-త్యర్థుల లోఁగొను శరంబు లయిదు సుమము, ల
వ్యర్థంబు పువ్వుధనువు, కృ-తార్థతఁ గను నిద్ది భువన మాక్రోశింపన్. ౧౨౯

సీ. మంత్రి వసంతుండు,మలయానిలుఁడు యంతి, మిత్రుండు విధుఁడుఁ,గళత్ర మొన్నఁ
ద్రిభువనమోహనాకృతి రతి యగు నాకు, వీరు సహాయులై వెలయుచుండ
నే నెట్టి దుర్ఘటంబైన కార్యమునైన నొనరింపఁజాలుదు ననఁగ నేల?
ధ్యానయోగాభ్యాసతత్పరుం డయి విజితేంద్రియుండైన విశ్వేశునైన

తే. నీవు నెమ్మదిఁ గోరిన నీక్షణార్థ-మందె సమ్మోహితునిఁ జేసి యడరి యోగ
విముఖుఁ గావింతు,నిఁక నేల వేయిపలుకు?-లానతిమ్మది చేయంగ నగునొ దేవ!"

క. "ఏపనికిఁ బిల్చినాఁడనొ-యాపని తెల్పితివి నీవె, యర్హులు ప్రాజ్ఞుల్
చేపట్టఁ బూన రెద వచ-నాపేక్ష యొకప్పుడైన నరయఁగ మదనా! ౧౩౦

తే. సురల బాధించుచున్నాఁ డసురుఁడు తార-కాఖ్యుఁడనువాఁడుబల్మినహర్నిశంబు,
నీ వెఱుంగుదు వంతయు, నేల చెప్ప-వలయు మన్మథ! యా ఖలు వర్తనంబు.

తే. శ్రీమహాదేవు పుత్త్రునిచేఁ దెగునటు-వానికి విధించె మృత్యువు వనజభవుఁడు,
భవతనయుఁడొక్కఁడే తప్పవానిఁజంప-నొరులువలఁతులుగారుసుమ్మోయిమదన!

క. హిమవంతము సానువునం-దమలాత్ముఁడు యోగ మూని యా శంకరుఁ డు
ద్యమమున సంసారముపై-విముఖుండయి తపము సల్పు విధి నవిరతమున్.

సీ. వినుము మనోభవా! మును దక్షునకుఁ బుట్టినట్టి సనాతని యాదిశక్తి
యమ్మహేశ్వరు భార్య యై యుండె, నా దేవి యీ హిమాచలుపుత్త్రియై హిమగిరికిని
బుట్టియున్నది, యిప్డు భూతనాథుని సన్నిధానమందునను దత్సానువునను
వసియించుచున్నది, వరయౌవనంబున నందంబునందుఁ బెంపొంది మిగుల,

తే. నంగనారత్నములలోన నగ్రగణ్య-యగుచు వఱలుచునున్న, దాయభవుఁ డాత్మ
వలఁపుగొనఁడా మెఁగాంచి,నాపంపుఁబూని-యోగివర్యునివడిఁద్రిప్పు భోగిగాఁగ.

తే. ఆమహాదేవుఁ డెటు సతియందుఁ బ్రీతి-ననుభవించెను భోగంబు లనవరతముఁ,
దద్విధంబునఁ బార్వతిఁ దవిలి యోగ-మును వదలి రమియింపఁగానొనరుపఁదగు.

సీ. భువనహితంబును బూని యీ కార్యంబుఁ గావింపవయ్య! యో కామదేవ!
నీప్రసాదంబున నీప్రపంచంబునఁ గల దేవతల కెల్లఁ దొలఁగుఁ గాక
మది నుండు కలఁతలు, పొదలునుగాక విస్తృతచరాచరలోకసమితి కరయ
సుస్థితి సతతంబు, సుమబాణ! వేగంబ తరలుము, పొందుము తతయశంబు"

తే. ననుచు దేవేంద్రుఁ డాడినయట్టి వాక్య
ములను విని పుష్పధన్వుండు మున్ను బ్రహ్మ
యిడిన దారుణశాపంబు హృదయమందుఁ
దలఁచె విస్మృతిమగుదానిఁ దడయ కపుడె. ౧౨౨౮

మదనుఁడు తన పూర్వశాపంబును స్మరించుట

క. "సరగున సంధ్యను గూర్చి-పరుగులిడెడు విధిని గాంచి బాణపరీక్షం
గరమరయు వేడ్క సుమశర-వరముల నేసితిని దొల్లి పద్మజుమీఁదన్. ౧౨౨౯

క. మది నలిగి శాపమిడె న-య్యదనున నా "కీవు మదన! యభవునిపయి నీ
ప్రదరముల దేవకార్యం-బొదవింపఁగఁ బఱపి యపుడె యుగ్రాకృతియా.

క. హరు నేత్రవహ్నిదగ్ధుఁడు-నరవిం గాఁగల" వటంచు, శాపసమయ మి
ట్లురుదెంచె, నివారింపఁగ-నుర వెద్దియు లేదు నాకు నోగి యోజింపన్. ౧౨౩౦

ఉ. దైవము చేయు కార్యముల దాఁటఁగనోపునె యెవ్వఁడైనఁ దా
భావమునం" దటంచు మదిఁ బల్మఱు నెంచి విషాద మొందియున్
భావజుఁ డింద్రునాజ్ఞఁ దగఁ బాలనసేయఁగఁ బూని పల్కె "నో
దేవపతీ! యొనర్తు భవదీయసదుక్తి" నటంచు-నారదా! ౧౨౩౧

తే. "దేవకార్యంబుఁ దీర్చెద, దేవు శివుని
యోగవిముఖునిఁ గావింతు, నుగ్రుఁ డతఁడు
చంపఁజూచిన నన్ను నిలింపనాథ!
దేవతలఁ గూడి బ్రతికింపఁ దివురు" మనియె. ౧౨౩౨

తే. మదనుఁ డీరీతి విన్నవింపఁగను నింద్రుఁ
డతని నోదార్చి, పలుమాఱు లాదరించి,
"యోయి! సురగణములఁ గూడి యుష్మదర్థ
మేను జతనంబొనర్తు" నం చానతిచ్చె. ౧౨౩౩

మన్మథుఁడు శివుని తపోవనంబున కరుగుట

చ. సురపతియాజ్ఞ మన్మథుఁడు సుందరి యా రతియున్, వసంతుఁడున్
సరవిని వెంటరాఁ గదలి శంభు తపోవనసీమఁ జేరె ను
ద్ధురగతి, దేవతాగణములోఁ ద్రిదశేంద్రుఁడు తెల్పె నాజ్ఞ "యీ
రరుగుఁడు వాని వెంటఁ దగు యత్నములోడుతఁ దోడుసూపఁగన్. ౧౨౩౪

సీ. సురలార! యతిఘోరతరమగు శంకరసమ్మోహనంబును సలుపఁదలఁచి
నాయాజ్ఞఁ బోవుచున్నాఁ డస్మదీయకార్యంబును దలఁదాల్చి యత్నమునను;

మీరెల్లరును గూడి మారుఁ డెచ్చటి కేగు, నచటికిఁ బోవగు నయ్యలార!
తోడ్పాటొనర్పుఁడు, తోడరి మహారాజసుకుఁడైన మహాదుద్రు నాత్మపుప్వ
తే. శరమునను మోహితు నొనర్ప స్మరుఁడు పూను
నెపుడు, తెలుపుఁడు నాయొద్ద హితవుమీఱ,
నాక్షణంబున నే నట కరుగుదెంచి
వాని సంరక్షసేయంగవలయుఁ జూండు.'' ౧౨౩౫

క. సురపతి యీాక్రియఁ దెలుపఁగ-సురలెల్లఁ దదాజ్ఞఁ బూని సుమశరరక్షా
పరులయి యనుసరణ మొన-ర్చిరి సుసమాహితమనీషచే నుత్సుకులై. ౧౨౩౬

క. మదనుండు మాధవుఁడుఁ దన-ముదితయుఁ దనతోడ నుండఁ బురహరునకు మో
దదమగు తపోవనము నె-మ్మదిఁ జేరి వసించెఁ దా సమయమును గనుచున్.

చ. సకలజగంబు మోహఘనసాగరమందున ముంపఁజాలు పూ
నిక గల మన్మథుండు హరు నిశ్చలయోగముఁ గాంచి యందు నిం
చుక యవకాశమేనియును జొప్పడకుండుట యెంచుచుండె, నో
పికఁ గొని మాధవుం డచటఁ జేర్మిఁ జెలంగను దోడుసూపఁగన్. ౧౨౩౮

వసంత విజృంభణము

తే. మునివరోత్తమ! కింశుకముఖ్యతరువు-లెల్లఁ బుష్పించె నానంద మెసఁగునట్లు,
మల్లికామాలతీజాతు లెల్ల నుల్ల-ముల్లసిల్లఁగఁ బువ్వుల వెల్లివిరిసె. ౧౨౩౯

క. ఎంతయు వసంతు మహిమను-వింతలువింతలుగఁ బుష్పవిసరము లలరెన్,
కాంతములై పద్మంబు ల-నంతములుగ నెగడె సరసికాంతరములలోన్. ౧౨౪౦

క. ప్రమదమున మధురరవముల-భ్రమరంబులు ఝుంకృతులను బంచశరాజ్ఞన్
సుమముల విహరించుచుఁ బ్రే-మమునఁ బరస్పరము చెలఁగె మహి నల్లెడలన్.

క. చల్లని మెల్లని వాయువు-లుల్లంబులు పల్లవింప నురుసౌరభసం
పల్లలితము లయి వీచె మ-హోల్లాసంబుగను మన్మథోద్దీపకతన్. ౧౨౪౨

క. హిమకరుఁ డతిశీతలుఁడై-ప్రమోదమును గూర్చునట్టి ప్రభతోడ విలా
సముఁగూర్పఁ బ్రాణికోటికి-విమలత నులసిల్లె మిగుల వేడుక మీఱన్. ౧౨౪౩

క. భువిఁ గల ప్రాణిసమూహము-లవిరతసంతోషయుక్తి నలరెను, మదనుం
డు వసంతుఁడుఁ దెంపొందుచు-భువిని విజృంభింప శివతపోవనసీమన్. ౧౨౪౪

తే. తపముఁగావించుసిద్ధులెంతయును గామ-మోహితస్వాంతులయి,రాతపోవనమున
నల్లె శృంగారభావంబు నాత్మలందు-నొలయఁగాఁ గిన్నరాదులు కలఁగి రపుడు.

క. వరముని! శివుని తపోవన-పరిసరమున నున్న యెల్లప్రాణులు మదనున్
స్మరమోహితంబులయి ని-ర్భరపరితాపంబు నొందెఁ, బల్కులు లేఁకన్. ౧౨౪౬

ఆ. అమ్మహాత్ముఁడైన యాదిదేవుని ముఖ్య-గణములెల్ల వికృతిఁ గాంచెఁగాని
ధ్యానయోగమందుఁ దనరు శంభున కిసు-మంతయైన భంగ మడరదయ్యె.

మదనుఁడు శంకరునిపై బాణప్రయోగంబు చేయఁబూని విఫలుఁడగుట

చ. నిరుపమయోగనిష్ఠుఁడయి నిశ్చలుఁడై తపమూనియున్న శం
కరుఁ బరికించి మన్మథుఁడు గాఢవిషాదము నొంది చాపమున్
గరమునఁదాల్చి యాహరుని కట్టెదుట న్నడువేడ్కఁ జేరె, ని
బ్బరమున నారతీరమణి వద్దని నిల్పిన నిల్వ కద్ధటిన్. ౧౨౪౮

తే. ప్రళయకాలాగ్నిదీప్తుని, భానుకోటి-సన్నిభునిఁ, బ్రభు, యోగసంపన్ను, నిశ్చ
లాత్మవిద్యాపరుని దేవు నవని నెవరు-చెనకఁగలవారు దక్షులై మునివరేణ్య!

క. వాసవుని వాక్కులను దా-నాసక్తిని విని, యనంత నంగీకృతి వే
చేసె నిటు, తలఁచి నారద!-దోసంబగు నంచు నెఱిఁగి తుందుడు కొప్పన్.

క. వరసమ్మోహనశరమును-శరాసనమునందుఁ గూర్చి శంభునెదుటికిన్
బిరబిరఁ జని కని రుద్రుని-మరలె, మరల భీతి నాత్మ మల్లడిగొనఁగన్. ౧౨౫౧

క. కంతుఁడు శివసమ్మోహన-మెంతయుఁ జేయంగలేక యిటు భంగపడన్
స్వాంతమున నెంచి యప్పుడ-నంతమహిమ నెసఁగు నామహాదేవి వెసన్.

పార్వతి శివుని సన్నిధానంబునకు వచ్చుట

తే. తనదు మాయనులోకసంతానమోహ-మునునుముంపంగఁజాలిన ఘనగుణాఢ్య
మందహాసంబుఁ గావించి, మదనునకును-దాను కోడ్పడు వాంఛను బూనివచ్చె.

ఆ. చెలులు వెంటరాఁగ శివు సన్నిధానంబుఁ-జేరె, నపుడు శివుఁడు స్థిరతరమగు
ధ్యాననిష్ఠ వదలి తన రమ్యనయనముల్-విప్పి యచటఁ గాంచె విశదరీతి.

చ. అతిరుచిరంబులైన నయనాబ్జము లుల్లసిలంగ, నాననం
బతులమనోహరంబగుచు నాత్మకు నింపొనరింప శైలరా
ట్సుతఁ గని, నిశ్చలాత్ముఁడయి సుందరిపైఁ బ్రియ ముప్పతిల్ల శా
శ్వతమగు తృప్తిఁ దా నెనసె శంభుఁడు తత్క్షణమందె యెంతయున్. ౧౨౫౫

మదనుఁడు మరల శివునిపై బాణప్రయోగముఁ జేయుట

తే. ఇట్టి సమయంబునందు మహేశుఁ జూచి
పుష్పధన్వుండు తన దివ్యపుష్పబాణ

మును గరంబునఁ దాల్చి యయ్యనఘుఁ గూర్చి
పయనమయ్యె మహేంద్రుని పనుపు నెఱప. ౧౨౫౬

క. సురపతి నిర్జరతతిచే-స్మరు కార్యక్రమముఁ దెలిసి చయ్యనఁ ద్రిదశో
త్కరము వెనుదవిలిరా నం-బరమున నచ్చోట నిలిచె వరరథమందున్.

క. మదనుఁడు శంకరు వక్షముఁ-బదిలంబుగ హర్షణ మను బాణంబున ని
య్యది తగు నదనని తన నె-మ్మదిఁ గని గాఢంగనేసె మానివతంసా! ౧౨౫౮

క. హరుఁ డెంతయుఁ దన మది సం-బరము కరము వెలయఁ జూచెఁ బార్వతిఁ బ్రీతిన్,
స్మరునకుఁ దోడ్పడు కోరికఁ-గరువలి పొంగుచును వీచెఁ గమ్మని గాడ్పుల్.

క. మెల్లని చల్లని వాయువు-లుల్లాసం బొదవ వీవ నుల్లంబులకున్
మొల్లంబై శృంగారం-బెల్లెడ వ్యాపింపఁ జేసె నెంతయు వేడ్కన్. ౧౨౬౦

తే. అంత సమ్మోహన మనంగ నలరు నలరు-గములఁ గ్రాఁ జేసినట్టి బాణమును మరలఁ
బుష్పధనువున సంధించెఁ బూన్కితోడ-మన్మథుం డాత్మ నింద్రుని మాట నెంచి.

సీ. తనదు దక్షిణభాగమున సమ్మదంబునఁ బరమసుందరి రతి భాసిలంగ,
వామభాగంబున రామాలలామంబు ప్రీతి యెంతయును సంప్రీతి వెలయ,
వెనుకనుత్సాహసంజనకుఁడై ప్రియమిత్రుఁడగు వసంతుఁడు వేడ్కనునువు మెఱయ,
నానందమునఁ బొంగి యఖిలనిర్జరవరు లాకసంబున నిల్చి యరయుచుండ,

తే. లోకసంరక్షకై సర్వలోకమోహ-కారణంబగు బాణంబు నారిఁ గూర్చి
యింద్రునాజ్ఞను మదనుండు హితవు నెంచి-యామహేశ్వరు నెద నాటునట్లు లేసె.

తే. భువనమోహనకరమైన పుష్పబాణ-మెదఁ బ్రవేశింపఁగానె జితేంద్రియుఁడును
నిర్వికారుండునగు శివునిహృదయంబు-సంగమోన్ముఖమయ్యె, నుత్సాహమడరె.

తే. కలదె ముల్లోకములయందుఁ గామునకు న
సాధ్యమగు పనియంచు నిర్జరులు మిగుల
మాటిమాటికిఁ బొగడిరి మదను నపుడు
కార్యసాఫల్యమగు నంచుఁ గను ముదమున. ౧౨౬౪

క. హరుఁ డింద్రియనిగ్రహ మీ-కరణిఁ జెడుట కాత్మ నేని కారణమని తాఁ
బరికింపఁ దొడఁగె విశ్వగతి-సరియగు కార్యంబు, నపుడు చతురాననుఁడున్.

చ. వడి భువి కేగి మన్మథుని ప్రాణముతోఁ గుసుమాంబకంబు ల
య్యెడఁ గల పుష్పచాపమును నిద్ధతిమంబగు వాని శక్తియున్
గడు జలనంబునన్ నిలిచి కైకొని యట్టె వసంతు నుత్కటున్
గడకఁ గలంచి యాత్మసదనంబును జేరె మునీంద్ర! యంతటన్. ౧౨౬౬

శివుని కంటిమంట మదనుండు భస్మంబగుట

క. హరుఁ డాత్మ నిశ్చయించెను-స్మరుఁ డేటికి నన్ను మీఱఁజాలె ననుచు ను
ద్ధురతరకోపానలవి-స్ఫురితేక్షణుఁ డయ్యె నపుడు మునిగణనాథా! ౧౨౬౭

సీ. అతిశయంబగు క్రోధ మాత్మ నుద్దీపింప హరుని మూఁడవనేత్రమందునుండి
లోకసమూహంబు వీఁకఁ గాల్పఁగఁజాలు తీక్ష్ణాగ్ని జనియించెఁ దీవ్రమగుచు,
సురవరులెల్లరుఁ జూచి యావహ్నిని భయమున వణఁకుచుఁ బంచశరుని
రక్షింపఁగాఁబూని "ప్రభువర! యోశివ! యోలోకనాయక! యోశరణ్య!
తే. స్మరుని రక్షింపు రక్షింపు, శాంతిఁబూను,
మతఁకు కావించె మాయాజ్ఞ ననుసరించి,
దేవదేవా! ప్రసన్నత భావమందుఁ
బొందుమా, హితకరుఁ బ్రోవు మాదిదేవ!" ౧౨౬౮

తే. ఇట్లు పల్కుచునుండ సురేంద్రముఖ్యు-లైన సురలెల్ల, హరనయనానలంబు
చుట్టుకొని మన్మథునిఁగాల్చెఁజూడఁగా న-శక్యమైభూతియగునట్లుసంయమీంద్ర!

ఇరువది మూఁడవ అధ్యాయము

క. హరనేత్రసముద్భవమై-స్మరునిం గాల్చిన మహాగ్ని సంయమివర! యీ
శ్వరుని మరలఁ జేరుటకై-యరుగంగా నోప దెప్పుడైనను బూనిక్. ౧౨౭౦

క. బడబారూపంబున నీ-పుడమిని నాయగ్ని నెగడి భూలోకంబున్
గడువడిఁ దపింపఁజేయఁగఁ-దొడఁగుడు, నరుదెంచె బ్రహ్మ తూర్ణమె ధరకున్.

ఉ. వచ్చి విరించి, యా బడబవైఖరిఁ గాంచి, యుపాయ మేర్పడన్
జెచ్చెర సింధుతీరమును జేర్చి, సరిత్పతిఁ గోర్కె వేఁడి, తా
నిచ్చఁ దలంచి, తజ్జలధి నెంతయు నిల్వఁగ దాని నుంచి, యా
పచ్చయ మెల్ల మాన్పె భువి, కంతట నారద! దేవతోత్తముల్. ౧౨౭౨

క. మదనునకై శోకంబున-మదిలం బొగులుచును నాత్మమందిరములకున్
గదలిరి, "రతి! నీవిభుఁ డిం-పొదవ మరల బ్రతుకు"ననుచు నూరార్చి వెసన్.

పార్వతి పరమేశ్వరుని మన్మథుని దహనముంగూర్చి ప్రశ్నించుట

తే. విజనమై యున్నయట్టి యా విపినసీమ-విశ్వనాథునిఁ గనుఁగొని విశ్వజనని
చిఱునగవు రుచిరాననసీమఁ జెలఁగు-చుండఁగా నిట్లు పల్కె నో యుత్తమముని!

క. "మనమున నను బ్రకృతిన్ భా-ర్యనుగాఁ బడయంగ నెంచి యతిశయతపమున్
బొనరించుచు నేలొకొ చం-పినవాఁడవు మదను నిపుడు విశ్వశరణ్యా! ౧౨౭౫

తే. కాముఁడు నశింపఁగా నింకఁ గాంతతోడ
నేప్రయోజనమున్నది? యెఱుఁగఁబలుకు,
మిట్టి ధర్మంబు యోగుల కెసఁగుఁగాని
కాముకుల కెట్లు చెల్లఁగాఁగలదు దేవ!" ౧౨౭౬

తే. ఇట్లు శ్రీదేవి పల్క మహేశ్వరుండు
చకితుఁడై యప్పు డాత్మలో సర్వశక్తి
యుతప్రకృతి యాద్య పర్వతసుత యటంచుఁ
దెలిసి ధ్యానంబు గావించె ధృతి మునీంద్ర! ౧౨౭౭

క. నయనముల విప్పి మది యెం-తయుఁ బొంగఁగ హర్షపులకితశరీరుండై
ప్రియమునను లోకసుందరి-దయ నొందఁగఁ బలికె నిట్లు తాపసివర్యా! ౧౨౭౮

శివుని ప్రత్యుత్తరము

సీ. "నిన్ను నే నెఱుఁగుదు నిత్యప్రపూర్ణవుఁ బ్రకృతి వటంచును భావమందు
నిజలీలతో ధరణిని వెలసితి వంచు నిక్కంబుగా దేవి! నిగమవినుత!
నిన్నుఁ బొందఁగఁగోరి నిశ్చలధ్యానంబునం దున్నవాఁడ నీయడవిఁ జిరము,
సాక్షాత్పరాత్పర! జన్మసాఫల్యంబుఁ బొందంగ నీదినంబందుఁ గంటి,
తే. దర్శనీయస్వరూప వోతన్వి! నాకుఁ-బ్రియముఁ గలిగించు సతిపోల్కి వెలయుచున్న
దాన, వేఁ గృతకృత్యుఁడ, ధన్యతముఁడ"-నని శివుఁడు పల్క శ్రీదేవియని యెనంత.

పరమేశ్వరి స్వస్వరూపంబుఁ జూపుట

ఉ. "తావకవాంఛితంబు మదిఁ దన్పఁగఁ గోరిక మీఱఁ దృప్తనై
యీవసుధన్ హిమాద్రికని నెంతయుఁ గూర్చు కుమార్తెనై జనిన్
భావనరీతిఁ బొంది, నిను భర్తనుగాఁగ వరింప వచ్చితిన్
దేవ! త్వదీయసన్నిధికి దివ్యశరీరముతోడ నిద్యోదన్. ౧౨౮౦

ఆ. భక్తితోడ నెట్లు ప్రార్థింతురో భక్తు-లట్టిభావమునను నవతరించి
వారి కోరికల నవారితగతిఁ దీర్చి-తృప్తిపఱతు నెపుడు దేవదేవ! ౧౨౮౧

తే. శంకరా! యేను దక్షాత్మజయగు సతి న-టంచు నమ్ముము, దక్షుని యధ్వరమున
నిను వదలినట్టిదానను, నిత్య, కాళి-త్రిభువనవిమోహశీలగాఁ దెలియు నన్ను."

చ. అనవుడు శంభుఁ డిట్టు లనె నా గిరిరాట్సుతతోడ "దేవి! నీ
వనినటు చారులోచనవు నాసతివైనను ప్రాణతుల్యవై
యనయము నాకుఁ బ్రీతివవె యైనను దక్షుని యజ్ఞమందు నిన్
గనుఁగొనరాని రూపమునఁ గ్రాలుచు నుంటివె భీమరూపిణీ! ౧౨౮౩

తే. ఉరుతరఘనప్రభలతోడ నొప్పి దక్ష-యజ్ఞనాశన మొనరించునపుడు కాళి
యన దిగంబరవై యుంటి, వట్టి నీస్వ-రూప మిప్పుడు నాకును జూపు దేవి!"

క. మునినాథ! యిట్లు హరుఁ డా-య్యనఁ బల్కన్ హిమాచలేంద్రునాత్మజ శివు నె
మ్మనమునఁ గల వాంఛను దీ-ర్పను బూర్వపురూపు వింత వఱలఁగఁ దాల్చెన్.

వ. నారదమునీంద్రా! యాదేవిదివ్యస్వరూపంబు న్వినుము. కట్టంబైన కాటుక వంటి కాంతి గలిగి, దిగంబరయై, తురిద్రక్తయు, నతిఘోరవిశాలనయనయు, నత్యంతపీవరోన్నతస్తనద్వంద్వవిభ్రాజితవక్షస్స్థలయు, నాపాదవిలంబికేశపాశయుఁ, బ్రేతకభయంకరయు, లలజ్జిహ్వికయు, నతిభయంకరంబులగు దంతంబులును నఖంబులును భాసిల్లుచుండ, నాకసంబున నుదయించిన చంద్రసముదయంబులచే విరాజిల్లు మేఘనిచయంబుపోల్కిఁ జూపట్టుచు, నాజానులంబమానాత్యంతవిశాలముండమాలిక యమిత వెలయుచుండ, మెఱుపుఁదీఁగలతోఁగూడిన ఘనాఘనంబురీతిఁ గనఁబడుచుఁ, జతుర్భుజయు, నతివిచిత్రతమరత్ననిచయవిభ్రాజమానకిరీటంబు మూర్ధంబునందు మెఱుంగులం దుఱంగలించుచు వెలయుచుండ నతిబీభత్సరూపంబున శివుని కట్టెదుటఁ బ్రత్యక్షమై నిలిచిన. ౧౨౮౬

చ. కనుఁగొని శంకరుండు పలుకంగఁదొడంగెను గద్గదస్వరం
బున మది నుత్సుకుండగుచుఁ బొంగుచు గాత్రము రోమహర్షణం
బున నలరారుచుండఁగను "పూజ్య! కరంబు మదాత్మ దగ్ధమ
య్యెను నిను వీడియుండుట మహేశ్వరి! తద్దయుఁ బెద్దకాలమున్. ౧౨౮౭

సీ. నివె యంతర్యామినివగు శక్తివి మహేశ్వరి హృదయస్థవై పరఁగుచుందు,
వట్టి త్వదీయపాదాంభోజయుగ్మంబు లారాధన మొనర్చి యధికభక్త
హృదయపద్మంబునఁ బదిలంబుగాఁ దాల్చి త్వద్విరహంబునఁ దప్తమయిన
నాయాత్మ చల్లంగనై యూఱడిలఁజేయువాఁడ" నంచని భక్తిపరవశుఁడయి
తే. యా మహాదేవుఁ డత్యంతమైన యోగ
మూని శయనించి యపుడు మహోన్నతమహి
మాస్పదములైన తచ్చరణాంబుజముల
హృదయమందున ధరియించె ముదితుఁడగుచు. ౧౨౮౮

క. ధ్యానానందంబునఁ దన-మేను మఱచి శవముపోల్కిఁ మిగుల వెలయుచున్,
దాను విఘూర్ణనయనుఁడై-పూనిక నాదృతి వహించి పొడఁగనె దేవిన్.

తే. స్వాంశచేఁ బంచవక్త్రుఁడై యంజలిఘటి-యించి యా పరదేవికి నెదుట నిల్చి,
యమితభక్తి సహస్రనామములఁ గాళి-కను స్తుతించెను నిశ్చలతను భజించి.

✓ పరమేశ్వరకృత కాళీ(లలితా)సహస్రనామస్తుతి

అనాద్యయుఁ, బరమయు, విద్యయుఁ, బ్రధానయుఁ, బ్రకృతియుఁ, బరయుఁ, బ్రధానపురుషారాధ్యయుఁ, బ్రధానపురుషేశ్వరియుఁ, బ్రాణాత్మికయుఁ, బ్రాణశక్తియు, సర్వప్రాణహితైషిణియు, నుమయు, నుత్తమకేశినియు, నుత్తమయు, నున్మత్తభైరవియు, నూర్వశియు, నున్నతయు, నుగ్రయు, మహోగ్రయు, నున్నతస్తనియు, నుగ్రచండయు, నుగ్రనయనయు, మహోగ్రదైత్యనాశినియు, నుగ్రప్రభావతియు, నుగ్రవేగయు, నుగ్రప్రమర్దినియు, నుగ్రతారోగ్రనయనయు, నూర్ధ్వస్థాననివాసినియు, నున్మత్తనయనయు, నత్యుగ్రదంతయు, నుత్తుంగస్థలాలయయు, నుల్లాసినియు, నుల్లసచ్చిత్తయు, నుత్ఫుల్లనయనోజ్జ్వలయు, నుత్ఫుల్లకమలారూఢయుఁ, గమలయు, గామినీకళయుఁ, గాళియుఁ, గరాళవదనయుఁ, గామినీముఖకామినియుఁ, గోమలాంగియుఁ, గృశాంగియుఁ, గైటభాసురమర్దినియుఁ, గాళిందియుఁ, గమలస్థయుఁ, గాంతియుఁ, గాననవాసినియుఁ, గులీనయు, నిష్కళయుఁ, గృష్ణయుఁ, గాళరాత్రిస్వరూపిణియుఁ, గుమారియుఁ, గామరూపయుఁ, గామినియుఁ, గృష్ణపింగళియుఁ, గపిలయు, శాంతిదయు, శుద్ధయు, శంకరార్ధశరీరిణియుఁ, గౌమారియుఁ, గార్తికయు, దుర్గయుఁ, గౌశికయుఁ, గుండలోజ్జ్వలయుఁ, గుళేశ్వరియుఁ, గులశ్రేష్ఠయుఁ, గుంతలోజ్జ్వలమస్తకయుఁ, భవానియు, భావినియు, వాణియు, శివయు, శివమోహినియు, శివప్రియయు, శివారాధ్యయు, శివప్రాణైకవల్లభయు, శివపత్నియు, శివస్తుత్యయు, శివానందప్రదాయినియు, నిత్యానందమయియు, నిత్యయు, సచ్చిదానందవిగ్రహయు, త్రైలోక్యజననియు, శంభుహృదయస్థయు, సనాతనియు, సదయయు, నిర్దయయు, మాయయు, శివయుఁ, త్రైలోక్య

✓ "అనాద్యా పరమా విద్యా ప్రధానా ప్రకృతిః పరా । ప్రధానపురుషారాధ్యా ప్రధానపురుషేశ్వరీ ॥౧॥ ప్రాణాత్మికా ప్రాణశక్తిః సర్వప్రాణహితైషిణీ । ఉమా చోత్తమకేశీ న్యుత్తమా చోన్మత్తభైరవీ ॥౩౦-౨॥ ఊర్వశీ చోన్నతా చోగ్రా మహోగ్రా చోన్నతస్తనీ । ఉగ్రచండోగ్రనయనా మహోగ్రదైత్యనాశినీ ॥ ౩౧-౩ ॥ ఉగ్రప్రభావతీ చోగ్రవేగానుగ్ర ప్రమర్దినీ । ఉగ్రతారోగ్ర నయనా చోర్ధ్వస్థాననివాసినీ ॥ ౩౨-౪ ॥ ఉన్మత్తనయనాత్యుగ్రదంతోత్తుంగస్థలాలయా । ఉల్లాసిన్యుల్లసచ్చిత్తా చోత్ఫుల్లనయనోజ్జ్వలా ॥ ౩౩-౫ ॥ ఉత్ఫుల్లకమలారూఢా కమలా కామినీ కలా । కాళీ కరాళవదనా కామినీముఖకామినీ ॥౩౪-౬॥ కోమలాంగీ కృశాంగీ చ కైటభాసురమర్దినీ ॥ కాళిందీ కమలస్థా చ కాంతా కాననవాసినీ ॥ ౩౫-౭ ॥ కులీనా నిష్కలా కృష్ణా కాళరాత్రిస్వరూపిణీ । కుమారీ కామరూపా చ కామినీ కృష్ణపింగళా ॥ ౩౬-౮ ॥ కపిలా శాంతిదా శుద్ధా శంకరార్ధశరీరిణీ । కౌమారీ కార్తికే దుర్గా కౌశికీ కుండలోజ్జ్వలా॥౩౭-౯॥ కుళేశ్వరీ కుళశ్రేష్ఠా కుంతలోజ్జ్వలమస్తకా ॥ భవానీ భావినీ వాణీ శివా చ శివమోహినీ ॥ ౩౮-౧౦ ॥ శివప్రియా శివారాధ్యా శివప్రాణైకవల్లభా । శివపత్నీ శివస్తుత్యా శివానందప్రదాయినీ ॥ ౩౯-౧౧ ॥ నిత్యానందమయీ నిత్యా సచ్చిదానందవిగ్రహా । త్రైలోక్యజననీ శంభుహృదయస్థా సనాతనీ ॥ ౪౦-౧౨ ॥ సదయా నిర్దయా మాయా శివా త్రైలోక్యమోహినీ ।

మోహినియు, బ్రహ్మాదిత్రిదశారాధ్యయు, సర్వాభీష్టప్రదాయినియు, బ్రహ్మాణియు, బ్రహ్మగాయత్రియు, సావిత్రియు, బ్రహ్మసంస్తుతయు, బ్రహ్మోపాస్యయు, బ్రహ్మశక్తియు, బ్రహ్మసృష్టివిధాయినియుఁ, గమండలుకరయుఁ, సృష్టికర్త్రియు, బ్రహ్మస్వరూపిణియుఁ, జతుర్భుజాత్మికయు, యజ్ఞసూత్రరూపయు, దృఢవ్రతయు, హంసారూఢయుఁ, జతుర్వక్త్రయుఁ, జతుర్వేదాభిసంస్తుతయు, వైష్ణవియుఁ, బాలనకరియు, మహాలక్ష్మియు, హరిప్రియయు, శంఖచక్రధరయు, విష్ణుశక్తియు, విష్ణుస్వరూపిణియు, విష్ణుప్రియయు, విష్ణుమాయయు, విష్ణుప్రాణైకవల్లభయు, యోగనిద్రయు, నక్షరయు, విష్ణుమోహినియు, విష్ణుసంస్తుతయు, విష్ణుసమ్మోహనకరియుఁ, త్రైలోక్యపరిపాలినియు, శంఖినియుఁ, జక్రిణియుఁ, బద్మయుఁ, బద్మినియు, ముసలాయుధయుఁ, బద్మాలయయుఁ, బద్మహస్తయుఁ, బద్మమాలావిభూషితయు, గరుడస్థయుఁ, జారురూపయు, సంపద్రూపయు, సరస్వతియు, విష్ణుపార్శ్వస్థితయు, విష్ణుపరమాహ్లాదదాయినియు, సంపత్తియు, సంపదాధారయు, సర్వసంపత్ప్రదాయినియు, శ్రీవిద్యయు, సుఖదయు, సౌఖ్యదాయినియు, దుఃఖనాశినియు, దుఃఖహన్త్రియు, సుఖకరియు, సుఖాసీనయు, సుఖప్రదయు, సుఖప్రసన్నవదనయు, నారాయణ మనోరమయు, నారాయణియు, జగద్ధాత్రియు నారాయణవిమోహనియు, నారాయణ శరీరస్థయు, వనమాలావిభూషితయు, దైత్యఘ్నియుఁ, బీతవసనయు, సర్వదైత్యప్రమర్దినియు, వారాహియు, నారసింహియు, రామచంద్రస్వరూపిణియు, రక్షోఘ్నియుఁ, గాననావాసయు, నహల్యాశాపమోచనియు, సేతుబంధకరియు, సర్వరక్షఃకులవినాశినియు, సీతయుఁ, బతివ్రతయు, సాధ్వియు, రామప్రాణైక

బ్రహ్మాదిత్రిదశారాధ్యా సర్వాభీష్టప్రదాయినీ ॥ ౪౧ ॥ బ్రహ్మాణీ బ్రహ్మగాయత్రీ సావిత్రీ బ్రహ్మసంస్తుతా । బ్రహ్మోపాస్యా బ్రహ్మశక్తి ర్బ్రహ్మసృష్టివిధాయినీ ॥ ౪౨ ॥ కమండలుకరా సృష్టికర్త్రీ బ్రహ్మస్వరూపిణీ । చతుర్భుజాత్మికా యజ్ఞసూత్రరూపా దృఢవ్రతా ॥ ౪౩ ॥ హంసారూఢా చతుర్వక్త్రా చతుర్వేదాభిసంస్తుతా । వైష్ణవీ పాలనకరీ మహాలక్ష్మీ ర్హరిప్రియా ॥ ౪౪ ॥ శంఖచక్రధరా విష్ణుశక్తి ర్విష్ణుస్వరూపిణీ । విష్ణుప్రియా విష్ణుమాయా విష్ణుప్రాణైకవల్లభా ॥ ౪౫ ॥ యోగనిద్రాత్మరా విష్ణుమోహినీ విష్ణుసంస్తుతా । విష్ణుసంమోహనకరీ త్రైలోక్యపరిపాలినీ ॥ ౪౬ ॥ శంఖినీ చక్రిణీ పద్మా పద్మినీ ముసలాయుధా । పద్మాలయా మహాపద్మా పద్మమాలావిభూషితా ॥ ౪౭ ॥ గరుడస్థా చారురూపా సంపద్రూపా సరస్వతీ। విష్ణుపార్శ్వస్థితా విష్ణుపరమాహ్లాదదాయినీ॥ ౪౮ ॥ సంపత్తిః సంపదాధారా సర్వసంపత్ప్రదాయినీ । శ్రీవిద్యా సుఖదా సౌఖ్యదాయినీ దుఃఖనాశినీ ॥ ౪౯ । దుఃఖహన్త్రీ సుఖకరీ సుఖాసీనా సుఖప్రదా । సుఖప్రసన్నవదనా నారాయణ మనోరమా ॥ ౫౦ ॥ నారాయణీ జగద్ధాత్రీ నారాయణవిమోహినీ । నారాయణ శరీరస్థా వనమాలావిభూషితా ॥ ౫౧ ॥ దైత్యఘ్నీ పీతవసనా సర్వదైత్యప్రమర్దినీ। వారాహీ నారసింహీ చ రామచంద్రస్వరూపిణీ ॥౫౨॥ రక్షోఘ్నీ కాననావాసా చాహల్యా శాపమోచనీ । సేతుబంధకరీ సర్వరక్షఃకులవినాశినీ ॥౫౩॥ సీతా పతివ్రతా సాధ్వీ రామప్రాణైకవల్లభా । అశోకకాననావాసా లంకేశ్వరవినాశినీ ॥ ౫౪ ॥ నీతిః సునీతిః సుకృతిః కీర్తి ర్మేధా వసుంధరా । దివ్యమాల్యధరా

వల్లభయు, నశోకకాననావాసయు, లంకేశ్వరవినాశినియు, నీతియు, సునీతియు, సుకృతియుఁ, గీర్తియు, మేధయు, వసుంధరయు, దివ్యమాల్యధరయు, దివ్యయు, దివ్యగంధానులేపనయు, దివ్యవస్త్రపరీధానయు, దివ్యస్థాననివాసినియు, మాహేశ్వరియుఁ, బ్రేతసంస్థయుఁ, బ్రేతభూమి నివాసినియు, నిర్జనస్థయు, స్మశానస్థయు, భైరవియు, భీమలోచనయు, సుఘోరనయనయు, ఘోరయు, ఘోరరూపయు, ఘనప్రభయు, ఘనస్తనియు, వరయు, శ్యామయుఁ, బ్రేతభూమికృతాలయయు, ఖట్వాంగధారిణియు, ద్వీపిచర్మాంబరసుశోభనయు, మహాకాళియుఁ, జండవక్త్రయుఁ, జండముండ వినాశినియు, నుద్యానకాననావాసయుఁ, బుష్పోద్యానవనప్రియయు, బలిప్రియయు, మాంసభక్ష్యయు, రుధిరాసవభక్షిణియు, భీమరావయు, సాట్టహాసయు, రణనృత్యపరాయణయు, నసురాసృక్ప్రియయుఁ, దుష్టయు, దైత్యదానవమర్దినియు, దైత్యవిద్రావిణియు, దైత్యమథనియు, దైత్యసూదనియు, దైత్యఘ్నియు, దైత్యహంత్రియు, మహిషాసురమర్దినియు, రక్తబీజనిహంత్రియు, శుంభాసురవినాశినియు, నిశుంభహంత్రియు, ధూమ్రాక్షమర్దినియు, దుర్గహారిణియు, దుర్గాసురనిహంత్రియు, శివదూతియు, మహాబలయు, మహాబలవతియుఁ, జిత్రవస్త్రయు, రక్తాంబరయు, నమలయు, విమలయు, లలితయుఁ, జారుహాసయుఁ, జారుత్రిలోచనయు, నజేయయు, జయదయు, జ్యేష్ఠయు, జయశీలయుఁ, బరాజితయు, విజయయు, జాహ్నవియు, దుష్టజృంభిణియు, జయదాయినియు, జగద్రక్షాకరియు, సర్వజగచ్చైతన్యకారిణియు, జయయు, జయన్తియు, జననియు, జనభక్షణతత్పరియు, జలరూపయు, జలస్థయు, జప్యజాపకవత్సలయు, జాజ్వల్యమానయు, యజ్ఞాశయు, జన్మనాశవివర్జితయు, జరాతీతయు, జగన్మాతయు, జగద్రూపయు, జగన్మయియు, జంగమయు, జ్వాలినియు, జృంభాస్తంభినియు,

---

దివ్యా దివ్యగంధానులేపనా ॥ ౫౫ ॥ దివ్యవస్త్రపరీధానా దివ్యస్థాన నివాసినీ । మాహేశ్వరీ ప్రేతసంస్థా ప్రేతభూమినివాసినీ ॥ ౫౬ ॥ నిర్జనస్థా స్మశానస్థా భైరవీ భీమలోచనా । సుఘోరనయనా ఘోరా ఘోరరూపా ఘనప్రభా ॥ ౫౭ ॥ ఘనస్తనీ వరా శ్యామా ప్రేతభూమికృతాలయా । ఖట్వాంగధారిణీ ద్వీపచర్మాంబర సుశోభనా ॥ ౫౮ ॥ మహాకాలీ చండవక్త్రా చండముండవినాశినీ । ఉద్యానకాననావాసా పుష్పోద్యానవనప్రియా ॥ ౫౯ ॥ బలిప్రియా మాంసభక్ష్యా రుధిరాసవభక్షిణీ ॥ భీమరావా సాట్టహాసా రణనృత్యపరాయణా ॥ ౬౦ ॥ అసురాసృక్ప్రియా తుష్టా దైత్యదానవమర్దినీ । దైత్యవిద్రావిణీ దైత్యమథనీ దైత్యసూదనీ ॥ ౬౧ ॥ దైత్యఘ్నీ దైత్యహంత్రీచ మహిషాసురమర్దినీ । రక్తబీజనిహంత్రీచ శుంభాసురవినాశినీ ॥ ౬౨ ॥ నిశుంభహంత్రీ ధూమ్రాక్షమర్దినీ దుర్గహారిణీ ॥ దుర్గాసురనిహంత్రీచ శివదూతీ మహాబలా ॥ ౬౩ ॥ మహాబలవతీ చిత్రవస్త్రా రక్తాంబరామలా । విమలా లలితా చారుహాసా చారుత్రిలోచనా ॥ ౬౪ ॥ అజేయా జయదా జ్యేష్ఠా జయశీలా పరాజితా । విజయా జాహ్నవీ దుష్టజృంభిణీ జయదాయినీ ॥ ౬౫ ॥ జగద్రక్షాకరీ సర్వజగచ్చైతన్యకారిణీ । జయా జయంతీ జననీ జనభక్షణతత్పరా ॥ ౬౬ ॥ జలరూపా జలస్థాచ జప్యజాపకవత్సలా । జాజ్వల్యమానా యజ్ఞాశా జన్మనాశవివర్జితా ॥ ౬౭ ॥ జరాతీతా జగన్మాతా జగద్రూపా జగన్మయీ । జంగమా జ్వాలినీ జృంభాస్తంభినీ దుష్టతాపినీ ॥

దుష్టతాపినియుఁ, త్రిపురఘ్నియుఁ, త్రినయనయు, మహాత్రిపురతాపినియుఁ, తృష్ణా జాతియుఁ, పిపాసయు, బుభుక్షయుఁ, త్రిపురప్రభయుఁ, త్వరితయుఁ, త్రిపుటయుఁ, త్ర్యక్షయుఁ, తన్వియుఁ, తాపవివర్జితయుఁ, త్రిలోకేశియుఁ, తీవ్రవేగయుఁ, తీవ్రయు, తీవ్రబలాలయయు, నిశ్శంకయు, నిర్మలాభయు, నిరాతంకయు, నమల ప్రభయు, వినీతయు, వినయాభిజ్ఞయు, విశేషజ్ఞయు, విలక్షణయు, వరదయు, వల్లభయు, విద్యుత్ప్రభయు, వినయశాలినియు, బింబోష్ఠియు, విధువక్త్రయు, వివస్త్రయు, వినయప్రభయు, విశ్వేశపత్నియు, విశ్వాత్మయు, విశ్వరూపయు, బలోత్కటయు, విశ్వేశియు, విశ్వవనితయు, విశ్వమాతయు, విచక్షణయు, విదుషియు, విశ్వవిదితయు, విశ్వమోహనకారిణియు, విశ్వమూర్తియు, విశ్వ ధరయు, విశ్వేశపరిపాలినియు, విశ్వకర్త్రియు, విశ్వహర్త్రియు, విశ్వపాలనతత్ప రయు, విశ్వేశహృదయావాసయు, విశ్వేశ్వరమనోరమయు, విశ్వహయు, విశ్వ నిలయయు, విశ్వమాయయు, విభూతిదయు, విశ్వయు, విశ్వోపకారయు, విశ్వ ప్రాణాత్మికయు, విశ్వప్రియయు, విశ్వమయియు, విశ్వదుష్టవినాశినియు, దాక్షా యణియు, దక్షకన్యయు, దక్షయజ్ఞవినాశినియు, విశ్వంభరియు, వసుమతియు, వసుధయు, విశ్వపావనియు, సర్వాతిశాయినియు, సర్వదుఃఖదారిద్ర్యహారిణియు, మహావిభూతియు, నవ్యక్తయు, శాశ్వతియు, సర్వసిద్ధిదయు, నచింత్యయు, నచింత్యరూపయుఁ, కేవలయుఁ, పరమాత్మికయు, సర్వజ్ఞయు, సర్వవిషయయు, సర్వోపరిపరాయణయు, సర్వస్వాహారయు, సర్వమంగళయు, మంగళప్రదయు, మంగళార్హయు, మహాదేవియు, సర్వమంగళదాయికయు, సర్వాంతరస్థయు, సర్వార్థరూపిణియు, నిరంజనయుఁ, చిచ్ఛక్తయుఁ, చిన్మయియు, సర్వవిద్యయు, సర్వవిధాయినియు, శాంతియు, శాంతికరియు, సౌమ్యయు, సర్వసర్వప్రదా

౹౹ త్రిపురఘ్నీ త్రినయనా మహాత్రిపురతాపినీ । తృష్ణాజాతిః పిపాసాచ బుభుక్షా త్రిపుర ప్రభా ॥ ౬౯ ॥ త్వరితా త్రిపుటా త్ర్యక్షా తన్వీ తాపవివర్జితా । త్రిలోకేశీ తీవ్రవేగా తీవ్రా తీవ్రబలాలయా ॥ ౭౦ ॥ నిఃశంకా నిర్మలాభాచ నిరాతంకామలప్రభా । వినీతా వినయాభిజ్ఞా విశేషజ్ఞా విలక్షణా ॥ ౭౧ ॥ వరదా వల్లభా విద్యుత్ప్రభా వినయశాలినీ । బింబోష్ఠీ విధువక్త్రాచ వివస్త్రా వినయప్రభా ॥ ౭౨ ॥ విశ్వేశపత్నీ విశ్వాత్మా విశ్వరూపా బలోత్కటా । విశ్వేశీ విశ్వ వనితా విశ్వమాతా విచక్షణా ॥ ౭౩ ॥ విదుషీ విశ్వవిదితా విశ్వమోహనకారిణీ । విశ్వమూర్తి ర్విశ్వధరా విశ్వేశపరిపాలినీ ॥ ౭౪ ॥ విశ్వకర్త్రీ విశ్వహర్త్రీ విశ్వపాలన తత్పరా । విశ్వేశహృదయా వాసా విశ్వేశ్వరమనోరమా ॥ ౭౫ ॥ విశ్వహా విశ్వనిలయా విశ్వమాయా విభూతిదా । విశ్వా విశ్వోపకారాచ విశ్వప్రాణాత్మికాపిచ ॥ ౭౬ ॥ విశ్వప్రియా విశ్వమయీ విశ్వదుష్టవినాశినీ । దాక్షాయణీ దక్షకన్యా దక్షయజ్ఞవినాశినీ ॥ ౭౭ ॥ విశ్వంభరీ వసుమతీ వసుధా విశ్వపావనీ । సర్వాతిశాయినీ సర్వదుఃఖదారిద్ర్యహారిణీ ॥ ౭౮ ॥ మహావిభూతి రవ్యక్తా శాశ్వతీ సర్వసిద్ధిదా । అచిన్త్యా ౽ చింత్యరూపాచ కేవలా పరమాత్మికా ॥ ౭౯ ॥ సర్వజ్ఞా సర్వవిషయా సర్వోపరిపరా యణా । సర్వస్వాహా సర్వమంగళా మంగళప్రదా ॥ ౮౦ ॥ మంగళార్హా మహాదేవీ సర్వ మంగళదాయికా । సర్వాంతరస్థా సర్వార్థరూపిణీచ నిరంజనా ॥ ౮౧ ॥ చిచ్ఛక్తి శ్చిన్మయీ సర్వవిద్యా సర్వవిధాయినీ । శాంతిః శాంతికరీ సౌమ్యా సర్వసర్వప్రదాయినీ ॥ ౮౨ ॥

యనియు, శాంతియు, క్షమయు, క్షేమకరియు, క్షేత్రజ్ఞయు, క్షేత్రవాసినియు, క్షణాత్మికయు, క్షీణతనువును, క్షీణాంగియును, క్షీణమధ్యమయును, క్షిప్రగయును, క్షేమదయు, క్షిప్తయు, క్షణదయు, క్షణవాసినియు, వృత్తియు, నివృత్తియు, భూతానాంప్రవృత్తియు, వృత్తలోచనయు, వ్యోమమూర్తియు, వ్యోమసంఖ్యయు, వ్యోమాలయకృతాశ్రయయు, చంద్రాననయు, చంద్రకాంతియు, చంద్రార్ధాంకితమస్తకయు, చంద్రప్రభయు, చంద్రకళయు, శరచ్చంద్రనిభాననయు, చంద్రాత్మికయు, చంద్రముఖియు, చంద్రశేఖరవల్లభయు, చంద్రశేఖరవక్షఃస్థయు, చంద్రలోకనివాసినియు, చంద్రశేఖరశైలస్థయు, చంచలయు, చంచలేక్షణయు, ఛిన్నమస్తయు, ఛాగమాంసప్రియయు, ఛాగబలిప్రియయు, జ్యోత్స్నయు, జ్యోతిర్మయియు, సర్వజ్యాయసియు, జీవనాత్మికయు, సర్వకార్యనియంత్రియు, సర్వభూతహితైషిణియు, గుణాతీతయు, గుణమయియు, త్రిగుణయు, గుణశాలినియు, గుణైకనిలయయు, గౌరియు, గుహ్యగోపకులోద్భవయు, గరీయసియు, గురుతరయు, గుహ్యస్థాననివాసినియు, గుణజ్ఞయు, నిర్గుణయు, సర్వగుణార్హయు, గుహ్యకాంబికయు, గళజ్జటయు, గళత్కేశయు, గళద్రుధిరచర్చితయు, గజేంద్రగమనయు, గంత్రియు, గీతనృత్యపరాయణయు, గమనస్థయు, గయాధ్యక్షయు, గణేశజననియు, గానప్రియయు, గానరతయు, గృహస్థయు, గృహిణియు, పరయు, గజసంస్థయు, గజారూఢయు, గ్రసంతియు, గరుడాసనయు, యోగస్థయు, యోగినీగమ్యయు, యోగచింతాపరాయణయు, యోగిధ్యేయయు, యోగివంద్యయు, యోగలభ్యయు, యుగాత్మికయు, యోగిజ్ఞేయయు, యోగయుక్తయు, మహాయోగేశ్వరేశ్వరియు, యోగానురక్తయు, యుగదయు, యుగాంతజలదప్రభయు,

---

శాంతిః క్షమా క్షేమకరీ క్షేత్రజ్ఞా క్షేత్రవాసినీ । క్షణాత్మికా క్షీణతనుః క్షీణాంగీ క్షీణ
మధ్యమా ॥ ౮౩ ॥ క్షిప్రగా క్షేమదా క్షిప్తా క్షణదా క్షణవాసినీ । వృత్తి ర్నివృత్తి
ర్భూతానాం ప్రవృత్తి ర్వృత్తలోచనా ॥ ౮౪ ॥ వ్యోమమూర్తి ర్వ్యోమసంఖ్యా వ్యోమాలయ
కృతాశ్రయా । చంద్రాననా చంద్రకాంతి శ్చంద్రార్ధాంకితమస్తకా ॥ ౮౫ ॥ చంద్రప్రభా
చంద్రకలా శరచ్చంద్రనిభాననా । చంద్రాత్మికా చంద్రముఖీ చంద్రశేఖరవల్లభా ॥ ౮౬ ॥
చంద్రశేఖరవక్షఃస్థా చంద్రలోకనివాసినీ । చంద్రశేఖరశైలస్థా చంచలా చంచలేక్షణా ॥ ౮౭ ॥
ఛిన్నమస్తా ఛాగమాంసప్రియా ఛాగబలిప్రియా । జ్యోత్స్నా జ్యోతిర్మయీ సర్వజ్యాయసీ జీవ
నాత్మికా ॥ ౮౮ ॥ సర్వకార్యనియంత్రీ చ సర్వభూతహితైషిణీ । గుణాతీతా గుణమయీ
త్రిగుణా గుణశాలినీ ॥ ౮౯ ॥ గుణైకనిలయా గౌరీ గుహ్యగోపకులోద్భవా । గరీయసీ గురుతరా
గుహ్యస్థాననివాసినీ ॥ ౯౦ ॥ గుణజ్ఞా నిర్గుణా సర్వగుణార్హా గుహ్యకాంబికా । గళజ్జటా గళ
త్కేశీ గళద్రుధిరచర్చితా ॥ ౯౧ ॥ గజేంద్రగమనా గంత్రీ గీతనృత్యపరాయణా । గమనస్థా
గయాధ్యక్షా గణేశజననీ తథా ॥ ౯౨ ॥ గానప్రియా గానరతా గృహస్థా గృహిణీ పరా ।
గజసంస్థా గజారూఢా గ్రసంతీ గరుడాసనా ॥ ౯౩ ॥ యోగస్థా యోగినీ గమ్యా యోగచింతాపరా
యణా । యోగిధ్యేయా యోగివంద్యా యోగలభ్యా యుగాత్మికా ॥ ౯౪ ॥ యోగిజ్ఞేయా యోగ
యుక్తా మహాయోగేశ్వరేశ్వరీ । యోగానురక్తా యుగదా యుగాంతజలదప్రభా ॥ ౯౫ ॥

యుగానుకారిణియు, యజ్ఞరూపయు, సూర్యసమప్రభయు, యుగాంతానిలవేగయు, సర్వయజ్ఞఫలప్రదయు, సంసారయోనియు, సంసారవ్యాపినియు, సకలాస్పదయు, సంసారతరునిస్సేవ్యయు, సంసారార్ణవతారిణియు, సర్వార్థసాధికయు, సర్వయు, సంసారఖ్యాపినియు, సంసారబంధకర్త్రియు, సంసారపరివర్జితయు, దుర్నిరీక్ష్యయు, సుదుష్ప్రాప్యయు, భూతియు, భూతిమతియు, నత్యంతవిభవారూపయు, మహావిభవరూపిణియు, శబ్దబ్రహ్మస్వరూపయు, శబ్దయోనియుఁ, బరాత్పరయు, భూతిదయు, భూతిమాతయు, భూతి స్తంద్రియు, విభూతిదయు, భూతాంతరస్థయుఁ, గూటస్థయు, భూతనాథప్రియాంగనయు, భూతమాతయు, భూతనాథయు, భూతాలయనివాసినియు, భూతనృత్యప్రియయు, భూతసంగినియు, భూతలాశ్రయయు, జన్మమృత్యుజరాతీతయు, మహాపురుషసంగతయు, భుజగయుఁ, దామసియు, వ్యక్తయుఁ, దమోగుణవతియుఁ, త్రితత్త్వతత్త్వరూపయుఁ, దత్త్వజ్ఞయుఁ, దత్త్వకప్రియయుఁ, త్ర్యంబకియుఁ, త్ర్యంబకరతయు, శుక్లయుఁ, త్ర్యంబకరూపిణియుఁ, త్రికాలజ్ఞయు జన్మహీనయు, [illegible], జ్ఞానరూపిణియు, నకార్యయుఁ, గార్యజననియు, బ్రహ్మాఖ్యయు బ్రహ్మసంస్థితయు, వైరాగ్యయుక్తయు, విజ్ఞానగమ్యయు, ధర్మస్వరూపిణియు, సర్వధర్మవిధానజ్ఞయు, ధర్మిష్ఠయు, ధర్మతత్పరయు, ధర్మిష్ఠపాలనకరియు, ధర్మశాస్త్రపరాయణయు, ధర్మాధర్మవిహీనయు, ధర్మజన్యఫలప్రదయు, ధర్మిణియు, ధర్మనిరతయు, ధర్మిణామిష్టదాయినియు, ధన్యయు, ధీయు, ధారణయు, ధీరయు, ధన్వినియు, ధనదాయినియు, ధనుష్మతియు, ధరాసంస్థయు, ధరణిస్థితికారిణియు, సర్వయోనియు, విశ్వయోనియు, నపాంయోనియు, నయోనిజయు, రుద్రాణియు, రుద్రవనితయు, రుద్రైకాదశరూపిణియు, రుద్రాక్షి

యుగానుకారిణీ యజ్ఞరూపా సూర్యసమప్రభా । యుగాంతానిలవేగాచ సర్వయజ్ఞఫలప్రదా॥ ౯౬॥
సంసారయోనిః సంసారవ్యాపినీ సకలాస్పదా । సంసారతరునిస్సేవ్యా సంసారార్ణవతారిణీ ॥ ౯౭ ॥
సర్వార్థసాధికా సర్వా సంసారఖ్యాపినీ తథా । సంసారబంధకర్త్రీచ సంసారపరివర్జితా ॥ ౯౮ ॥
దుర్నిరీక్ష్యా సుదుష్ప్రాప్యా భూతి ర్భూతిమతీత్యపి । అత్యంతవిభవారూపా మహావిభవరూపిణీ ॥ ౯౯ ॥ శబ్దబ్రహ్మస్వరూపాచ శబ్దయోనిః పరాత్పరా । భూతిదా భూతిమాతాచ భూతి స్తంద్రీ విభూతిదా ॥ ౧౦౦ ॥ భూతాంతరస్థా కూటస్థా భూతనాథప్రియాంగనా । భూతమాతా భూతనాథా భూతాలయనివాసినీ ॥ ౧౦౧ ॥ భూతనృత్యప్రియా భూతసంగినీ భూతలాశ్రయా । జన్మమృత్యుజరాతీతా మహాపురుషసంగతా ॥౧౦౨॥ భుజగా తామసీ వ్యక్తా తమోగుణవతీ తథా । త్రితత్త్వ తత్త్వరూపాచ తత్త్వజ్ఞా తత్త్వకప్రియా ॥ ౧౦౩ ॥ త్ర్యంబకా త్ర్యంబకరతా శుక్లా త్ర్యంబకరూపిణీ । త్రికాలజ్ఞా జన్మహీనా రక్తాంగీ జ్ఞానరూపిణీ ॥ ౧౦౪ ॥ అకార్యా కార్యజననీ బ్రహ్మాఖ్యా బ్రహ్మసంస్థితా । వైరాగ్యయుక్తా విజ్ఞానగమ్యా ధర్మస్వరూపిణీ ॥ ౧౦౫ ॥
సర్వధర్మవిధానజ్ఞా ధర్మిష్ఠా ధర్మతత్పరా । ధర్మిష్ఠపాలనకరీ ధర్మశాస్త్రపరాయణా ॥ ౧౦౬ ॥
ధర్మాధర్మవిహీనాచ ధర్మజన్యఫలప్రదా । ధర్మిణీ ధర్మనిరతా ధర్మిణామిష్టదాయినీ ॥ ౧౦౭ ॥
ధన్యా ధీ ర్ధారణా ధీరా ధన్వినీ ధనదాయినీ। ధనుష్మతీ ధరాసంస్థా ధరణిస్థితికారిణీ ॥ ౧౦౮ ॥
సర్వయోని ర్విశ్వయోని రపాంయోని రయోనిజా । రుద్రాణీ రుద్రవనితా రుద్రైకాదశరూపిణీ॥ ౧౦౯॥

మాలినియు, రౌద్రియు, భుక్తిముక్తిఫలప్రదయు, బ్రహ్మోపేంద్రప్రవంద్యయు, నిత్యంముదితమానసయు, నింద్రాణియు, వాసవియు, నైంద్రియు, విచిత్రయు, నైరావతస్థితయు, సహస్రనేత్రయు, దివ్యాంగయు, దివ్యకేశవిలాసినియు, దివ్యాంగనయు, దివ్యనేత్రయు, దివ్యచందనచర్చితయు, దివ్యాలంకరణయు, దివ్యశ్వేతచామరవీజితయు, దివ్యహారయు, దివ్యపదయు, దివ్యనూపురశోభితయు, కేయూరశోభితయు, హృష్టయు, హృష్టచిత్తప్రహర్షిణియు, సంప్రహృష్టమనయు, హర్షప్రసన్నవదనయు, దేవేంద్రవంద్యపాదాబ్జయు, దేవేంద్రపరిపూజితయు, రజసారక్తనయనయు, సదారక్తపుష్పప్రియయు, రక్తాంగియు, రక్తనేత్రయు, రక్తోత్పలవిలోచనయు, రక్తాభయు, రక్తవస్త్రయు, రక్తచందనచర్చితయు, రక్తేక్షణయు, రక్తభక్ష్యయు, రక్తమత్తోరగాశ్రయయు, రక్తదంతయు, రక్తజిహ్వయు, రక్తభక్షణాతత్పరయు, రక్తప్రియయు, రక్తతుష్టయు, రక్తపానసుతత్పరయు, బంధూకకుసుమాభయు, రక్తమాల్యానులేపనయు, స్ఫురద్రక్తాంచితతనువును, స్ఫురత్సూర్యశతప్రభయు, స్ఫురన్నేత్రియు, పింగజటయు, పింగళయు, పింగళేక్షణయు, బగళయు, పీతవస్త్రయు, పీతపుష్పప్రియయు, పీతాంబరయు, పిబద్రక్తయు, పీతపుష్పోపశోభితయు, శత్రుఘ్నియు, శత్రుసమ్మోహజననియు, శత్రుతాపినియు, శత్రుప్రమర్దినియు, శత్రువాక్స్తంభనకారిణియు, నుచ్చాటనకరియు, సర్వదుష్టోత్సారణకారిణియు, శత్రువిద్రావిణియు, శత్రుసమ్మోహనకరియు, విపక్షమర్దనకరియు, శత్రుపక్షక్షయంకరియు, సర్వదుష్టఘాతినియు, సర్వదుష్టవినాశినియు, ద్విభుజయు, శూలహస్తయు, త్రిశూలవరధారిణియు, దుష్టసంతాపజననియు,

---

రుద్రాక్షమాలినీ రౌద్రీ భుక్తిముక్తి ఫలప్రదా । బ్రహ్మోపేంద్రప్రవంద్యాచ నిత్యం ముదిత మానసా ॥ ౧౧౦ ॥ ఇంద్రాణీ వాసవీ హ్యైంద్రీ విచిత్రైరావతస్థితా । సహస్రనేత్రా దివ్యాంగా దివ్యకేశవిలాసినీ ॥ ౧౧౧ ॥ దివ్యాంగనా దివ్యనేత్రా దివ్యచందనచర్చితా । దివ్యాలంకరణా దివ్యశ్వేతచామరవీజతా ॥ ౧౧౨ ॥ దివ్యహారా దివ్యపదా దివ్యనూపురశోభితా । కేయూరశోభితా హృష్టా హృష్టచిత్తప్రహర్షిణీ ॥ ౧౧౩ ॥ సంప్రహృష్టమనా హర్షప్రసన్నవదనా తథా । దేవేంద్రవంద్యపాదాబ్జా దేవేంద్రపరిపూజితా ॥ ౧౧౪ ॥ రజసా రక్తనయనా రక్తపుష్పప్రియా సదా । రక్తాంగీ రక్తనేత్రాచ రక్తోత్పలవిలోచనా ॥ ౧౧౫ ॥ రక్తాభా రక్తవస్త్రాచ రక్తచందనచర్చితా । రక్తేక్షణా రక్తభక్ష్యా రక్తమత్తోరగాశ్రయా ॥ ౧౧౬ ॥ రక్తదంతా రక్తజిహ్వా రక్తభక్షణతత్పరా । రక్తప్రియా రక్తతుష్టా రక్తపానసుతత్పరా ॥ ౧౧౭ ॥ బంధూకకుసుమాభా చ రక్తమాల్యానులేపనా । స్ఫురద్రక్తాంచితతనుః స్ఫురత్సూర్యశతప్రభా ॥ ౧౧౮ ॥ స్ఫురన్నేత్రా పింగజటా పింగళా పింగళేక్షణా । బగళా పీతవస్త్రాచ పీతపుష్పప్రియా సదా ॥ ౧౧౯ ॥ పీతాంబరా పిబద్రక్తా పీతపుష్పోపశోభితా । శత్రుఘ్నీ శత్రుసంమోహజననీ శత్రుతాపినీ ॥ ౧౨౦ ॥ శత్రుప్రమర్దినీ శత్రువాక్స్తంభనకారిణీ । ఉచ్చాటనకరీ సర్వదుష్టోత్సారణకారిణీ ॥ ౧౨౧ ॥ శత్రువిద్రావిణీ శత్రుసమ్మోహనకరీ తథా । విపక్షమర్దనకరీ శత్రుపక్షక్షయంకరీ ॥ ౧౨౨ సర్వదుష్టఘాతినీచ సర్వదుష్టవినాశినీ । ద్విభుజా శూలహస్తాచ త్రిశూల వరధారిణీ ॥ ౧౨౩

దుష్టక్షోభప్రవర్ధినియు, దుష్టానాంక్షోభసంబద్ధయు, భక్తక్షోభనివారిణియు, దుష్టసంతాపినియు, దుష్టసంతాపపరిమర్దినియు, సంతాపరహితయు, భక్తసంతాపపరినాశినియు, నద్వైతయు, ద్వైతరహితయు, నిష్కళయు, బ్రహ్మరూపిణియుఁ, త్రిదశేశియుఁ, త్రిలోకేశియు, సర్వేశియు, జగదీశ్వరియు, బ్రహ్మేశసేవితపదయు, సర్వవంద్యపదాంబుజయు, నచింత్యరూపచరితయు, నచింత్యబలవిక్రమయు, సర్వాచింత్యప్రభావయు, స్వప్రభావప్రదర్శినియు, నచింత్యమహిమయు, నచింత్యరూపసౌందర్యశాలినియు, నచింత్యవేషశోభయు, లోకాచింత్యగుణాన్వితయు, నచింత్యశక్తియు, దుశ్చింత్యప్రభావయుఁ, జింత్యరూపిణియు, యోగిచింత్యయు, మహాచింతానాశినియుఁ, జేతనాత్మికయు, గిరిజయు, దక్షజయు, విశ్వజనయిత్రియు, జగత్ప్రసువయు, సన్నమ్యయుఁ, బ్రణతయు, సర్వప్రణతార్తిహరయుఁ, బ్రణతైశ్వర్యదయు, సర్వప్రణతాశుభనాశినియుఁ, బ్రణతాపన్నాశకరియుఁ, బ్రణతాశుభమోచనియు, సిద్ధేశ్వరియు, సిద్ధసేవ్యయు, సిద్ధచారణసేవితయు, సిద్ధిప్రదయు, సిద్ధికరియు, సర్వసిద్ధిగణేశ్వరియు, నష్టసిద్ధిప్రదయు, సిద్ధగణసేవ్యపదాంబుజయుఁ, గాత్యాయనియు, స్వధయు, స్వాహాయు, వషడ్వౌషట్స్వరూపిణియుఁ, బితౄణాం తృప్తిజననియుఁ, గవ్యరూపయు. సురేశ్వరియు, హవ్యభోక్త్రియు, హవ్యతుష్టయుఁ, బితృరూపయు, నసితప్రియయుఁ, గృష్ణపక్షప్రపూజ్యయుఁ, బ్రేతపక్షసమర్పితయు. నష్టహస్తయు, దశభుజయు నష్టాదశభుజాన్వితయుఁ, జతుర్దశభుజయు, నసంఖ్యభుజవల్లీవిరాజితయు, సింహపృష్ఠసమారూఢయు, సహస్రభుజరాజితయు, భువనేశియు, నన్నపూర్ణయు, మహాత్రిపురసుందరియుఁ, ద్రిపురయు,

---

దుష్టసంతాపజననీ దుష్టక్షోభప్రవర్ధనీ । దుష్టానాం క్షోభసంబద్ధా భక్తక్షోభనివారిణీ ॥ ౧౨౪ ॥
దుష్టసంతాపినీ దుష్టసంతాపపరిమర్దినీ । సంతాపరహితా భక్తసంతాపపరినాశినీ ॥ ౧౨౫ ॥
అద్వైతా ద్వైతరహితా నిష్కలా బ్రహ్మరూపిణీ । త్రిదశేశీ త్రిలోకేశీ సర్వేశీ జగదీశ్వరీ
॥ ౧౨౬ ॥ బ్రహ్మేశసేవితపదా సర్వవంద్యపదాంబుజా । అచింత్యరూపచరితా చాచింత్యబల
విక్రమా ॥ ౧౨౭ ॥ సర్వాచింత్యప్రభావా చ స్వప్రభావప్రదర్శినీ । అచింత్యమహిమా చింత్య
రూపసౌందర్యశాలినీ ॥ ౧౨౮ ॥ అచింత్యవేశశోభా చ లోకాచింత్యగుణాన్వితా । అచింత్యశక్తి
ర్దుశ్చింత్యప్రభావా చింత్యరూపిణీ ॥ ౧౨౯ ॥ యోగిచింత్యా మహాచింతానాశినీ చేతనాత్మికా ।
గిరిజా దక్షజా విశ్వజనయిత్రీ జగత్ప్రసూః ॥ ౧౩౦ ॥ సన్నమ్యా ప్రణతా సర్వప్రణతార్తిహరా
తథా । ప్రణతైశ్వర్యదా సర్వప్రణతాశుభనాశినీ ॥ ౧౩౧ ॥ ప్రణతాపన్నాశకరీ ప్రణతాశుభ
మోచనీ । సిద్ధేశ్వరీ సిద్ధసేవ్యా సిద్ధచారణసేవితా ॥ ౧౩౨ ॥ సిద్ధిప్రదా సిద్ధికరీ సర్వసిద్ధ
గణేశ్వరీ । అష్టసిద్ధిప్రదా సిద్ధగణసేవ్యపదాంబుజా ॥ ౧౩౩ ॥ కాత్యాయనీ స్వధా స్వాహా
వషడ్వౌషట్స్వరూపిణీ । పితౄణాం తృప్తిజననీ కవ్యరూపా సురేశ్వరీ ॥ ౧౩౪ ॥
హవ్యభోక్త్రీ హవ్యతుష్టా పితృరూపాసితప్రియా । కృష్ణపక్షప్రపూజ్యా చ ప్రేతపక్షసమర్పితా ॥
౧౩౫ ॥ అష్టహస్తా దశభుజా చాష్టాదశభుజాన్వితా । చతుర్దశభుజాసంఖ్యభుజవల్లీవిరాజితా ॥
౧౩౬ ॥ సింహపృష్ఠసమారూఢా సహస్రభుజరాజితా । భువనేశీ చాన్నపూర్ణా మహాత్రిపురసుందరీ
॥ ౧౩౭ ॥ త్రిపురా సుందరీ సౌమ్యముఖీ సుందరలోచనా । సుందరాస్యా శుభదంష్ట్రా సుభ్రూః

సుందరియు, సౌమ్యముఖియు, సుందరలోచనయు, సుందరాస్యయు, శుభదంష్ట్రయు, సుభ్రువును, పర్వతనందినియు, నీలోత్పలదళశ్యామయు, స్మేరోత్ఫుల్లముఖాంబుజయు, సత్యసంధయుఁ, పద్మవక్త్రయు, భ్రూకుటీకుటిలాననయు, విద్యాధరియు, వరారోహయు, మహాసంధ్యాస్వరూపిణియు, నరుంధతియు, హిరణ్యాక్షియు, సుధూమ్రాక్షియు, శుభేక్షణయు, శ్రుతియు, స్మృతియుఁ, కృతియు, యోగమాయయుఁ, పుణ్యయుఁ, పురాతనియు, వాగ్దేవతయు, వేదవిద్యయు, బ్రహ్మవిద్యాస్వరూపిణియు, వేదశక్తియు, వేదమాతయు, వేదాద్యయుఁ, పరమయు, గతియు, నన్వీక్షకియుఁ, తర్కవిద్యయు, యోగశాస్త్రప్రకాశినియు, ధూమావతియు, వియన్మూర్తియు, విద్యున్మాలావిలాసినియు, మహావ్రతయు, సదానందనందినియు, నగనందినియు, సునందయు, యమునయుఁ, చండియు, రుద్రచండియుఁ, ప్రభావతియుఁ, పారిజాతవనావాసయుఁ, పారిజాతవనప్రియయు, సుపుష్పగంధసంతుష్టయు, దివ్యపుష్పపశోభితయుఁ, పుష్పకాననసద్వాసయుఁ, పుష్పమాలావిలాసినియుఁ, పుష్పమాల్యధరయుఁ పుష్పగుచ్ఛాలంకృతదేహికయుఁ, ప్రతప్తకాంచనాభాసయు, శుద్ధకాంచనమండితయు, సువర్ణకుండలవతియు, స్వర్ణపుష్పప్రియయు, నర్మదాసింధునిలయయు, సముద్రతనయయు, షోడశియు, షోడశభుజయు, మహాభుజగమండితయుఁ, పాతాళవాసియు, నాగియు, నాగేంద్రకృతభూషణయు, నాగినియు, నాగకన్యయు, నాగమాతయు, నగాలయయు, దుర్గయు, నాపత్తారిణియు, దుర్గదుష్టగ్రహనివారిణియు, నభయాపన్నిహంత్రియు, సర్వాపత్పరినాశినియు, బ్రహ్మణ్యయు, శ్రుతిశాస్త్రజ్ఞయు, జగతాం కారణాత్మికయు, నిష్కారణయు, జన్మహీనయు, మృత్యుంజయమనోరమయు,

---

పర్వతనందినీ ॥ ౧౩౭ ॥ నీలోత్పలదళశ్యామా స్మేరోత్ఫుల్లముఖాంబుజా । సత్యసంధా పద్మవక్త్రా భ్రూకుటీకుటిలాననా ॥ ౧౩౮ ॥ విద్యాధరీ వరారోహా మహాసంధ్యాస్వరూపిణీ । అరుంధతీ హిరణ్యాక్షీ సుధూమ్రాక్షీ సులోచనా ॥ ౧౪౦ । శ్రుతిః స్మృతిః కృతి ర్యోగమాయా పుణ్యా పురాతనీ । వాగ్దేవతా మహావిద్యా బ్రహ్మవిద్యాస్వరూపిణీ ॥ ౧౪౧ ॥ వేదశక్తి ర్వేదమాతా వేదాద్యా పరమా గతిః । అన్వీక్షకీ తర్కవిద్యా యోగశాస్త్రప్రకాశినీ ॥ ౧౪౨ ॥ ధూమావతీ వియన్మూర్తి ర్విద్యున్మాలావిలాసినీ । మహావ్రతా సదానందనందినీ నగనందినీ ॥ ౧౪౩ ॥ సునందా యమునా చండీ రుద్రచండీ ప్రభావతీ । పారిజాతవనావాసా పారిజాత వనప్రియా ॥ ౧౪౪ ॥ సుపుష్పగంధసంతుష్టా దివ్యపుష్పపశోభితా । పుష్పకాననసద్వాసా పుష్పమాలావిలాసినీ ॥ ౧౪౫ ॥ పుష్పమాల్యధరా పుష్పగుచ్ఛాలంకృతదేహికా । ప్రతప్తకాంచనాభాసా శుద్ధకాంచనమండితా ॥ ౧౪౬ ॥ సువర్ణకుండలవతీ స్వర్ణపుష్పప్రియా సదా । నిర్మదా సింధునిలయా సముద్రతనయా తథా ॥ ౧౪౭ ॥ షోడశీ షోడశభుజా మహాభుజగమండితా । పాతాళవాసినీ నాగీ నాగేంద్రకృతభూషణా ॥ ౧౪౮ ॥ నాగినీ నాగకన్యాచ నాగమాతా నగాలయా । దుర్గాపత్తారిణీ దుర్గ దుష్టగ్రహనివారిణీ ॥ ౧౪౯ ॥ అభయాపన్నిహంత్రీచ సర్వాపత్పరినాశినీ । బ్రహ్మణ్యా శ్రుతిశాస్త్రజ్ఞా జగతాం కారణాత్మికా ॥౧౫౦॥ నిష్కారణా జన్మహీనా మృత్యుం

మృత్యుంజయహృదావాసయు, మూలాధారనివాసినియు, షట్చక్రసంస్థయు, మహతియు, మహోత్సవవిలాసినియు, రోహిణియు, సుందరముఖియు, సర్వవిద్యావిశారదయు, సదసద్వస్తురూపయు, నిష్కామయుఁ, గామపీడితయుఁ, గామాతురయుఁ, గామమత్తయుఁ, గామమానసస్తనువును, గామరూపయుఁ, గాళిందియుఁ, గచాలంబితవిగ్రహయు, నశోకకుసుమాభాసయు, సింహపృష్ఠనిషేదుషియు, యువతియు, యౌవనోద్రిక్తయు, యౌవనోద్రిక్తమానసయు, నదితియు, దేవజననియుఁ, ద్రిదశార్తివినాశినియు, దక్షిణయు, నపూర్వవసనయుఁ, బూర్వకాలవివర్జితయు, నశోకయు, శోకరహితయు, సర్వశోకనివారిణియు, నశోకకుసుమాభాసయు, శోకదుఃఖక్షయంకరియు, సర్వయోషిత్స్వరూపయు, సర్వప్రాణిమనోరమయు, మహాశ్చర్యయు, మదాశ్చర్యయు, మహామోహస్వరూపిణియు, మహామోక్షకరియు, మోహకారిణియు, మోహదాయినియు, నశోచ్యయుఁ, బూర్ణకామయుఁ, బూర్ణయుఁ, బూర్ణమనోరథయుఁ, బూర్ణాభిలషితయుఁ, బూర్ణనిశానాథసమాననయు, ద్వాదశార్కస్వరూపయు, సహస్రార్కసమప్రభయుఁ, దేజస్వినియు, సిద్ధమాతయుఁ, జంద్రయు, నయనరక్షణయు, నపరయు, నపారమాహాత్మ్యయు, నిత్యవిజ్ఞానశాలినియు, వివస్వతియు, హవ్యవాహయు, జాతవేదస్స్వరూపిణియు, స్వైరిణియు, స్వేచ్ఛవిహారయు, నిర్బీజయు, బీజరూపిణియు, ననంతవర్ణయు, ననంతాఖ్యయు, ననంతసంస్థయు, మహోదరియు, దుష్టభూతాపహంత్రియు, సద్వృత్తపరిపాలికయుఁ, గపాలినియుఁ, బానమత్తయు, మత్తవారణగామినియు, వింధ్యస్థయు, వింధ్యనిలయయు, వింధ్యపర్వతవాసినియు,

---

జయమనోరమా। మృత్యుంజయహృదావాసా మూలాధారనివాసినీ ॥౧౫౧॥ షట్చక్రసంస్థా మహతీ మహోత్సవవిలాసినీ। రోహిణీ సుందరముఖీ సర్వవిద్యావిశారదా ॥ ౧౫౨ ॥ సదసద్వస్తురూపాచ నిష్కామా కామపీడితా। కామాతురా కామమత్తా కామమానసస్తనుః ॥౧౫౩॥ కామరూపాచ కాళిందీ కచాలంబితవిగ్రహా। అశోకకుసుమాభాసా సింహపృష్ఠనిషేదుషీ ॥ ౧౫౪ ॥ యువతీ యౌవనోద్రిక్తా యౌవనోద్రిక్తమానసా అదితి ర్దేవజననీ త్రిదశార్తివినాశినీ ॥ ౧౫౫ ॥ దక్షిణా ఽపూర్వవసనా పూర్వకాలవివర్జితా। అశోకా శోకరహితా సర్వశోకనివారిణీ ॥ ౧౫౬ ॥ అశోకకుసుమాభాసా శోకదుఃఖక్షయంకరీ। సర్వయోషిత్స్వరూపాచ సర్వప్రాణిమనోరమా ॥ ౧౫౭ ॥ మహాశ్చర్యా మదాశ్చర్యా మహామోహస్వరూపిణీ। మహామోక్షకరీ మోహకారిణీ మోహదాయినీ ॥ ౧౫౮ ॥ అశోచ్యా పూర్ణకామాచ పూర్ణా పూర్ణమనోరథా। పూర్ణాభిలషితా పూర్ణనిశానాథసమాననా ॥ ౧౫౯ ॥ ద్వాదశార్కస్వరూపాచ సహస్రార్కసమప్రభా। తేజస్వినీ సిద్ధమాత్రా చంద్రా నయనరక్షణా ॥ ౧౬౦ ॥ అపరాపారమాహాత్మ్యా నిత్యవిజ్ఞానశాలినీ। వివస్వతీ హవ్యవాహా జాతవేదః స్వరూపిణీ ॥ ౧౬౧ ॥ స్వైరిణీ స్వేచ్ఛవిహారా నిర్బీజా బీజరూపిణీ। అనంతవర్ణానంతాఖ్యాఽనంతసంఖ్యామహోదరీ ॥ ౧౬౨ ॥ దుష్టభూతాపహంత్రీచ సద్వృత్తపరిపాలికా। కపాలినీ పానమత్తా మత్తవారణగామినీ ॥౧౬౩॥ వింధ్యస్థా వింధ్యనిలయా వింధ్యపర్వతవాసినీ। బంధుప్రియా జగద్బంధుః పవిత్రా సపవిత్రిణీ ॥

బంధుప్రియయు, జగద్బంధువును, పవిత్రయు, సపవిత్రిణియు, పరామృతయు, నమృతకళయు, నపమృత్యువినాశినియు, మహారజతసంకాశయు, రజతాద్రినివాసినియు, కాశీవిలాసినియు, కాశీక్షేత్రరక్షణతత్పరయు, యోనిరూపయు, యోనిపీఠస్థితయు, యోనిస్వరూపిణియు, కామాలసితచార్వంగియు, కటాక్షక్షేపమోహినియు, కటాక్షక్షేపనిరతయు, కల్పవృక్షస్వరూపిణియు, పాశాంకుశధరయు, శక్తియు, ధారిణియు, ఖేటకాయుధయు, బాణాయుధయు, నమోఘశస్త్రయు, దివ్యశస్త్రాస్త్రవర్షిణియు, మహాస్త్రజాలవిక్షేపవిపక్షక్షయకారిణియు, ఘంటినియు, పాశినియు, పాశహస్తయు, పాశాంకుశాయుధయు, చిత్రసింహాసనగతయు, మహాసింహాసనస్థితయు, మంత్రాత్మికయు, మంత్రబీజయు, మంత్రాధిష్ఠాతృదేవతయు, సురూపయు, ననేకరూపయు, విరూపయు, బహురూపిణియు, విరూపాక్షప్రియతమయు, విరూపాక్షమనోరమయు, విరూపాక్షయు, కోటరాక్షియు, కూటస్థయు, కూటరూపిణియు, కరాళాస్యయు, విశాలాస్యయు, ధర్మశాస్త్రార్థపారగయు, నధ్యాత్మవిద్యయు, శాస్త్రార్థకుశలయు, శైలనందినియు, నగాధిరాజపుత్రియు, నగపుత్రియు, నగోద్భవయు, గిరీంద్రబాలయు, గిరీశప్రాణతుల్యయు, మనోరమయు, ప్రసన్నయు, చారువదనయు, ప్రసన్నాస్యయు, ప్రసన్నదయు, శివప్రాణయు, పతిప్రాణయు, పతిసమ్మోహకారిణియు, మృగాక్షియు, చంచలాపాంగియు, సుదృష్టియు, హంసగామినియు, నిత్యంకుతూహలపరయు, నిత్యానందాభినందితయు, సత్యవిజ్ఞానరూపయు, తత్త్వజ్ఞానైకకారిణియు, త్రైలోక్యసాక్షిణియు, లోకధర్మాధర్మప్రదర్శినియు, ధర్మాధర్మవిధాత్రియు, శంభుప్రాణాత్మికయు, [illegible]యు, మేనకాగర్భసంభూతయు, మైనాకభగినియు,

౧౬౪ ॥ పరామృతాఽమృతకలా చాపమృత్యువినాశినీ । మహారజతసంకాశా రజతాద్రినివాసినీ ॥
౧౬౫ ॥ కాశీవిలాసినీ కాశీక్షేత్రరక్షణతత్పరా । యోనిరూపా యోనిపీఠస్థితా యోనిస్వరూపిణీ ॥
౧౬౬ ॥ కామాలసితచార్వంగీ కటాక్షక్షేపమోహినీ । కటాక్షక్షేపనిరతా కల్పవృక్షస్వరూపిణీ ॥
౧౬౭ ॥ పాశాంకుశధరా శక్తిః ధారిణీ ఖేటకాయుధా । బాణాయుధాఽమోఘశస్త్రా దివ్యశస్త్రాస్త్రవర్షిణీ ॥
౧౬౮ ॥ మహాస్త్రజాలవిక్షేపవిపక్షక్షయకారిణీ । ఘంటినీ పాశినీ పాశహస్తా పాశాంకుశాయుధా ॥
౧౬౯ ॥ చిత్రసింహాసనగతా మహాసింహాసనస్థితా । మంత్రాత్మికా మంత్రబీజా మంత్రాధిష్ఠాతృదేవతా ॥
౧౭౦ ॥ సురూపానేకరూపాచ విరూపా బహురూపిణీ । విరూపాక్షప్రియతమా విరూపాక్షమనోరమా ॥
౧౭౧ ॥ విరూపాక్షా కోటరాక్షీ కూటస్థా కూటరూపిణీ । కరాళాస్యా విశాలాస్యా ధర్మశాస్త్రార్థపారగా ॥
౧౭౨ ॥ అధ్యాత్మవిద్యా శాస్త్రార్థకుశలా శైలనందినీ । నగాధిరాజపుత్రీచ నగపుత్రీ నగోద్భవా ॥
౧౭౩ ॥ గిరీంద్రబాలా గిరిశప్రాణతుల్యా మనోరమా । ప్రసన్నా చారువదనా ప్రసన్నాస్యా ప్రసన్నదా ॥
౧౭౪ ॥ శివప్రాణా పతిప్రాణా పతిసమ్మోహకారిణీ । మృగాక్షీ చంచలాపాంగీ సుదృష్టిర్హంసగామినీ ॥
౧౭౫ ॥ నిత్యంకుతూహలపరా నిత్యానందాభినందితా । సత్యవిజ్ఞానరూపాచ తత్త్వజ్ఞానైకకారిణీ ॥
౧౭౬ ॥ త్రైలోక్యసాక్షిణీ లోకధర్మాధర్మప్రదర్శినీ । ధర్మాధర్మవిధాత్రీచ శంభుప్రాణాత్మికా పరా ॥
౧౭౭ ॥ మేనకాగర్భసంభూతా మైనాకభగినీ తథా । శ్రీకంఠకంఠహారాచ శ్రీకంఠహృదయ

శ్రీకంఠకంఠహారయు, శ్రీకంఠహృదయస్థితయు, శ్రీకంఠకంఠజప్యయు, నీలకంఠమనో
రమయుఁ, గాలకూటాత్మికయుఁ, గాలకూటభక్షణకారిణియు, మహాకాళప్రియయుఁ,
గాలకలనైకవిధాయినియు, నక్షోభ్యపత్నియు, సంక్షోభనాశినియు నగు నీకు
నమస్కారములు. ౧౨౯౧

క. మునివర! నామసహస్రం-బున నీక్రియ శంకరుండు భూధరపుత్రిన్
వినుతించిన సంతృప్తిని-గని పత్నిను దివ్యజనని కడు మోదమునన్. ౧౨౯౨

చ. "పరమశివా! త్వదర్థమునఁ బర్వతినాథున కేను గూఁతునై
ధరణి జనించితిన్, వినుము, ధన్యుల మిర్వుర మైతి, మీవె నా
కరయఁగఁ బ్రాణతుల్యపతివై విలసిల్లెద వేను నిన్ను సా
దరమునఁ గోరితిన్, మఱి త్వదన్యను గా నని నమ్ము మెప్పుడున్. ౧౨౯౩

ఉ. స్వాంతమునందు నన్ను నిజసాధ్విగఁ బడయంగఁ గోరి నీ
వెంతయు దుష్కరంబయిన యుట్టి తపం బొనరించినాఁడ, వ
త్యాంతతపఃప్రవృత్తి మది సంతస మందెదనాఁడ నేను, న
త్యంతముదంబుతోడుతను నాత్మవిభున్ నినుఁ గూడి యుండెదన్." ౧౨౯౪

సీ. "నీవె సమారాధనీయువు సకలజగన్నాథ వగుదువు, కనఁగఁ బ్రకృతి,
వన్నింటికంటె నత్యంతంబుఁ బరవయి చెలఁగుచుందువుగాన విలసితముగ
నీకు నారాధింప లోకంబులం దెట్టివాఁడును గనఁబడఁ డెడనేని,
నిజగుణంబులచేత నీ కనుగ్రాహ్యుండ నే నో మహేశ్వరి! పూని నాకు
తే. వరము నిమ్ము నిన్ను వాంఛింతు, నిను నుతి-సేయ నన్ను నుతిని చేసినట్లె
యగు నటంచు, మాలు నఖిలలోకేశ్వరి!-కరుణ వెలయ నన్నుఁ గాంచి వేడ్క.

సీ. ఈ కాళికారూప మెంతెంత వెలుఁగొందు నట్టి మాహేశ్వరంబైన రూపు
శివరూపమున విలసిల్లు నాహృదయమందునందె వసింపవా నక్కాలమున
భవదీయనామంబు శివవాహన యటంచుఁ బ్రఖ్యాత మగుఁగాక! భద్రకాళి!
జగదంబ! లోకవిశదకీర్తి" యని నుతియించి వరముఁ గోరె నీశ్వరుండు
తే. కాలమేఘసమప్రభ కాళి శివుని-గరుణతోఁ గని తత్ప్రియవరము నొసఁగి,
మరల గౌరీస్వరూపంబు పరఁగ నొందె-బార్వతీరీతిని నారదా! పూజ్యచరిత!
తే. పరమశివకీర్తితంబయి పరఁగునట్టి-యీ సహస్రనామంబును నెవఁడు భక్తి
తోడఁ బఠియించు నాతండు పోడిమిఁ గను-దేవితోడ సమత్వంబు దేవమౌని!

ప్రియా ॥ ౧౭౮ ॥ శ్రీకంఠకంఠజప్యాచ నీలకంఠమనోరమా । కాలకూటాత్మికా కాలకూటభక్షణ
కారిణీ ॥ ౧౭౯ ॥ మహాకాళప్రియా కాలకలనైకవిధాయినీ । అక్షోభ్యపత్నీ సంక్షోభనాశినీ తే
నమో నమః ॥ ౧౮౦ ॥ ✓

తే. గంధపుష్పధూపంబులఁ గ్రమదీప-మాలికలతోడఁ బూజించి మనుజుఁ డెవఁడు
పఠన మొనరించు నీనామవరసహస్ర-ములఁ బరమపద మొందు నాపుణ్యగుణుఁడు.

ఉ. ఈ మహనీయమైన నుతి నెవ్వఁ డనన్యమనస్కుఁడై నిజో
ద్దామపు భక్తిచే సలుపుఁ దప్పక యాతఁడు సర్వసిద్ధులన్
గామితరీతి నొందు, భువి క్ష్మాపతు లెల్లను వశ్యులౌదు, రే
భూమిని శత్రువుల్ పొదలఁ బోలరు వానికి సర్వమంగళా! ౧౨౯౯

ఉ. నామసహస్రవర్యపఠనం బొనరించిన వాని దర్శనం
బే మహిఁ గేసరిప్రముఖభీతిదజంతువు లెల్ల దస్యులున్
సీమము వీడి దూరమున నిల్వఁగఁజాలక పాఱిపోవఁగాఁ
దామస మింత చూపకయె తా నొనరించు మహాద్భుతంబుగన్. ౧౩౦౦

ఉ. ఏకడఁ జూచినన్ జయమె యిచ్చును నామసహస్రవర్యమున్
బ్రాకటభక్తితోడ మది భావనచేసి పఠించువానికిన్,
జోకఁ దదాజ్ఞ నెల్లరు విశుద్ధమనీష నొనర్తు, రంతియే
కాక తుదన్ దదీయస్మృతిఁ గాంచి తదీయకలాత్వ మొందెదున్. ౧౩౦౧

ఇరువదినాల్గవ అధ్యాయము

పార్వతీ వివాహోద్యమము

క. విను మోనారదసంయమి-జననాయక! శంభుఁ డంత స్మరదేహజమై
తనరెడు భస్మముఁ గైకొని-తన గాత్రమునిండఁ నలఁది తత్పరతఁ దగన్.

ఉ. భూమిధరాగ్రమందుఁ దన భూతగణంబులతోడఁ జేరి యు
ద్దామతపం బొనర్పఁగను దా మరలం గడు నిష్ఠఁ బూనె, నా
భూమిధరాత్మజాతయును బూన్కిఁ దపంబును జేయు వేడ్కఁ ద
ద్భూమిధరేంద్రమందె యొకపొంత వసించెను నిశ్చలాత్మయై. ౧౩౦౩

తే. పార్వతీదేవి శంకరు భావమందు-నిలిపి తపమును గావించె నిష్ఠతోడ,
శంభుఁడును బార్వతిని దన స్వాంతమందు-నిలిపి తపమును గావించె నిష్ఠతోడ.

క. చలనము లేని మనంబులు-వెలయంగను ధ్యాననిష్ఠ వేర్వేఱుగఁ బెం
పలరుచునుండఁగ నబ్దం-బులు గడచెన్ మూఁడువేలు పూర్ణంబులుగాన్.

ఆ. భస్మరూపుఁడయిన పంచశరునిచేలి-నంత శంభుఁ డాత్మయందుఁ గుంద
నొంది పర్వతేంద్రు నందనసన్నిధి-కరిగి పలికెఁ దాఁ గృతాంజలి యయి.

క. "పరమేశ్వరి! చాలింపుము-కర మరుదగు నీతపంబు కడు మానమునన్
నిరతిశయమైన ధ్యాన-స్ఫురితం బయి వెలసె, దానఁ బూన్కి చెలంగన్.

క. ననుఁ గొంటివి, నే దాసుఁడ,-నను బనిఁగొ మ్మింక, నేది న్యాయ్యంబగు నీ
యనుపమమగు స్వాంతంబున-కనుమానము వలదు దేవి! యర్హుఁడ నెపుడున్.

సీ. తావకదివ్యగాత్రసుమార్జనమునకో, రమణీయహారధారణమునకునొ,
కేయూరపరిధానక్రియ జరపుటకునో, తావకాలంకారసేవకొఱకొ,
ప్రియమైన లాక్షానిపయలేపనమునకో యాదరంబున నన్ను భేదమెంచ
కాత్మఁ బర్వతపుత్త్రి! యాజ్ఞ సేయుము సుప్రసన్నవై నన్ను నత్యున్నతముగ
తే. మన్ననమొనర్పఁదలఁచిన,మఱియువినుము-భస్మరూపుఁడు కాముఁడు బాధపెట్టు
చున్నవాఁడు, దగ్ధుండ, నన్నుద్ధరింప-వే మదనునుండి శ్రీదేవి! హిత మెఱింగి.

చ. నిరుపమమైన భక్తి నిను నిచ్చలు నెమ్మదియందు నిల్పి త్వ
త్పరిసరమందుఁ జేరితిని, భక్తుఁడ, రిక్తుఁడ, దుర్గ! నన్ను నీ
కరుణకుఁ బాత్రుగాఁ దలఁచి కామమహాజలరాశినుండి యు
ద్ధరణ మొనర్చి రక్షణవిధానము నెంచి బిరానఁ గావుమా! ౧౩౧౦

క. భవసాగరమగ్నుల కీ-భువి మోక్షం బిచ్చి కరుణఁ బ్రోతు వటంట్రో,
విపుల దయ నభవు వార్ధిని-దవిలిన నన్నుద్ధరింపు దయ శ్రీదేవీ!" ౧౩౧౧

చ. పరశివుఁ డిట్లు భక్తిమెయిఁ బ్రార్థనసేయఁగ నాలకించి సం
బరమునఁ బిన్ననవ్వు ముఖపద్మమునందునఁ దాండవింప భూ
ధరవరపుత్త్రి లజ్జమెయిఁ దాఁ దలవంచి చెలింగుఱించిమే
సరవి వచించు రీతిగను శంభునితోడుతఁ బల్కె నారదా! ౧౩౧౨

మ. "జనకుం డిచ్చినఁగాదె యీ వరుని పజ్జం జేరఁగానౌను నా
ట్యౌన సందేహము లేక యోచెలి! యిఁకే యత్నాంతరం బేల! మ
జ్జనకుం డాజ్ఞ యొసంగెనేని యవలన్ సంతోష ముప్పొంగ శం
భుని శాస్త్రోక్తముగా వరింపు మనుమా పూర్ణోత్సుకత్వంబునన్. ౧౩౧౩

ఉ. ఈమహనీయుఁ డౌ శివుఁడు హృత్కమలంబున నున్న భావమున్
ప్రేమ దలిర్పఁ దెల్పుటకుఁ బెండిలిఁగూర్చి వివేకవంతు, ను
ద్దాముఁ, గ్రియైకశీలు, వడిఁ దా నొగి మత్పితయౌ గిరీశ్వరున్
నేమముతోఁ గనుంగొని స్వనిశ్చయ మెల్లను నేర్పరింపనౌ." ౧౩౧౪

క. మునినాయక! యీవిధమున-ననువగు పద్ధతులఁ జెలికి నంబిక తెలుపం
గనె, తగిన దనుచు నీపథ-మును గాముకుఁ డగుచు శివుఁడు బుద్ధిని దలఁచెన్.

ఉ. అంత గిరీంద్రనందన నిజాత్మఁ బ్రహర్షము పొంగుచుండ న
త్యంతవికాసితంబయిన యాననపద్మముతోడఁ దండ్రిశు
ద్ధాంతముఁ జేరఁబోయె విశదప్రభలై చెలు లెల్ల వెంటరా
నెంతయు వేడ్క మీఱుచు, మహీధరవర్యుఁడు సంతసింపఁగన్. ౧౩౧౯

క. తన పుత్త్రి పురికి వచ్చిన-దని విని సంభ్రమముతోడ నద్రివరేణ్యుం
డును నెదురువోయి తోడ్తె-చ్చెను నిజభవనమున కపుడు చెలఁగుచునుండన్.

తే. ప్రియసుతను నంకమందు సంప్రీతితోడఁ-జేర్చియుపలాలన మొనర్చె క్షితిధరుండు,
మేనకాదేవియును సుతఁ గానవచ్చి-కౌఁగిలించెను హస్తయుగ్మంబుతోడ.

తే. కనుల నానందబాష్పము ల్గ్రమ్ముకొనఁగ-నతులితాదరమునఁ బుత్త్రికాననంబు
ముద్దుగొనుచును బలికె సంపూర్ణకరుణ-పార్వతీదేవితోడ నా పర్వతసతి.

ఉ. "నీవు మదీయప్రాణమవు, నిక్కము సుమ్మిది పుత్త్రికామణీ!
భావమునందు నం దలఁచి పాయకయుండుము, నాకు సంతసం
బావహిలంగ నుండి, జగదంబవుగాదె! దయాప్రపూర్ణ! మ
జ్జీవితమున్ సుజీవితముఁ జేయుము, నాదగు కోర్కె యిద్దియే." ౧౩౨౦

క. మునివర! మేనక యీక్రియఁ-దన పుత్త్రికతోడఁ బల్కెఁ, దద్బంధుగణం
బును, సోదరసమితియు ముద-మునఁ బొదలిరి యుమను గాంచి పూర్ణోత్సుకులై.

ఉ. అప్పుడు పార్వతీసఖులు హర్షము మీఱ గిరీంద్రు సన్నిధిన్
జెప్పిరి శంభు రాకయుఁ, బ్రసిద్ధములైన యుమాప్రవృత్తులున్
దప్పక యొప్పుగాఁ, దమిని దా విని భూధరనాథుఁ డాత్మలో
మెప్పు జనింప, సంతసము మేకొన, నెంతయు నుత్సుకంబునన్. ౧౩౨౧

క. గిరివరుఁడు పొంగుచును శం-కరు రాకకు వేచియుండెఁ గడు వేడ్క, సుతా
పరిణయమునకై మదిలోఁ-బరిపూర్ణాకాంక్ష మిగులఁ బరమమునీంద్రా!

క. పరశివుఁ డాభూధరసుం-దరశిఖరమునందుఁ బ్రమథతతి వేష్టింపన్
గరము ముదంబున నుండెను-బరిణయకృతనిశ్చయుఁడయి స్వాంతంబందున్.

చ. తన మది నుండు భావమును దద్గిరివర్యుఁ డెఱుంగఁ జేయఁగా
నను వెది యంచు నెంచి శివుఁ డప్డు మరీచిముఖర్షిసంఘమున్
బనివడి యాత్మలోఁ దలఁచె, బ్రాహ్మణపుంగవులైన వారు చ
య్యన నరుదెంచి రీశ్వరుని యంతికసీమకుఁ గోర్కె లుబ్బఁగన్. ౧౩౨౨

ఉ. మారుతనీయమానఘనమండలిపోలికఁ గోరినంతనే
చేరిన యమ్మరీచిముఖసిద్ధమునీంద్రగణంబు భక్తి పెం

పారఁగ నామహేశ్వరుని యంఘ్రిసరోజములందు వ్రాలి సం
సారమహార్ణవోత్తరణు సంస్తుతిచేసి వచించి రోమునీ! ౧౩౨౬

తే. "దేవ! దేవాదిదేవ! మీ దివ్యచిత్త-మందు మమ్మేల తలఁచితి? రాజ్ఞ యేమి
యొసఁగనున్నారలో, తెల్పుఁడురుదయాలి-రంగితాంతఃకరణులయిరమ్యధిషణ!"

చ. మునివరు లిట్లు తన్నుఁగడి మోదముతోడుతఁ బ్రశ్నసేయ నా
ఘనగుణుఁడైన శంభుఁ డురుకృపకటాక్షము లొప్పఁ జూచి త
న్మునుల మరీచిముఖ్యులను బూర్ణగుణాఢ్యుల వేఱువేఱ నా
య్యన వచియింపఁబూనెను, నిజాత్మ దహింపఁగఁ గాముఁ డుద్ధతిన్. ౧౩౨౮

క. "లోకమునకు హితకరమై-ప్రాకటసంతానవృద్ధిభాజనమయి సు
శ్లోకవరులార! పెండిలి-కై కోరిక కలిగె నాకు నాత్మన్ మిగులన్. ౧౩౨౯

చ. మునివరులార! నన్ను సతి మున్ను త్యజించి స్వకీయమాయచేఁ
జనుట యెఱింగినారుకద! స్వాంతమునందు సతిం దలంచి య
త్యనుపమమైనయట్టి తప మాదృతి నప్పటినుండి చేయఁగా
మనమునఁ దృప్తిఁజెంది దయ మాన్య నొనర్ప దలంపు మీఱఁగన్. ౧౩౩౦

క. హిమగిరిపుత్త్రిక యయి తా-నుమ యను నామంబు వెలయ నుద్భవమయ్యెన్,
గమనీయరూప మొప్పఁగ-సుమహితయై పతిగఁ గోరె సుందరి నన్నున్.

సీ. ధరణీధరేంద్రుఁ డాతన్వికిఁ దండ్రియౌఁ, గావునఁ దన సుత గారవమున
నను బిలిపించి యొయ్యన వివాహంబును జేయు నాయుమ నిచ్చి స్థిరమనీష,
నప్పు డాసుందరి యర్ధాంగియగు నాకు మునులార! వినుఁ డొక ముఖ్యకార్య
మున్నది, భస్మమై చన్నట్టి మదనుండు తివిరి దహించు రాత్రిందివంబు,

తే. శైలవరపుత్త్రి లేక నే శాంతిఁబొందఁ-జాల, నటుగాన నా ప్రాణసఖుని గూర్ప
మీరు తోడ్పడవలయు సంప్రీతి నాకు,-సుస్థిరతఁ గందు దాన నోసుహృదులార!"

మ. "పరమేశా! భవదాజ్ఞ యేక్రియ నొనర్పన్ బోధగావించు న
వ్వరధర్మంబును నాచరించుటయె సాఫల్యంబు మాకెంచు సం
బర మొప్పారఁగ వచ్చినారము, భవత్పాదారవిందంబులన్
సరవిం గొల్వఁగ వేచినారము త్వదాజ్ఞన్ బూని మూర్ధంబులన్. ౧౩౩౩

సీ. పూర్ణప్రకృతియయి పొలుపొందు నాపరదేవి యాద్యయె విద్య దేవదేవ!
త్వత్పూర్వపత్నియే ధరణీధరేంద్రునకాత్మజయై పుట్టె నాదిదేవ!
తప్పక హిమగిరి తనయను సాదరంబున నొసంగును మీకు ముదితుఁడగుచు,
నేము నిమిత్తంబె యీవిషయంబున నగుదుము సుమ్ము మహానుభావ!"

తే. యనుచుమునివర్యులెల్లరత్యంతవినయ-మునఁ బలికిశంకరునితోడ మోదమునను,
బయలువెడలిరి గిరివరు పట్టణమున-కాత్మ నౌత్సుక్య ముప్పొంగ నపుడె మౌని!

క. హరునకు నంబికఁ గూర్పఁగఁ-బరిణయకార్యంబుఁ బూని పరమమునీంద్రుల్
సరవిం జనుదేరఁగ గిరి-వరుఁడు యథావిధిగ సల్పె భక్తిని బూజల్. ౧౩౩౫

క. మునివరుల దివ్యపీఠము-లను నుపవిష్టుల నొనర్చి లలితోక్తులఁ బూ
జనమును గావింపఁగఁ, గాని-మును లెల్లను నాత్మతృప్తిఁ బొందలఁగ నంతన్.

క. గిరినాథుని గనుఁగొని ముని-వరు లెల్లరుఁ బ్రీతి వెలయఁ బలికిరి "గోత్రే
శ్వర! హితమగు నీ కాశం-కరుఁ డేర్పడఁ బలికినట్టి క్రమోక్తు లొగిన్.

క. మును దక్షుపుత్త్రియయి యీ-శునకున్ సతియైన సతియె క్షోణీధరా! నీ
తనయ యయి యిపుడు పార్వతి-యన నవతారమును గాంచినది భాగ్యమునన్.

ఉ. ఆ పరమాత్ముఁడౌ శివుఁడె యర్థిగఁ గోరెను నీదు పుత్త్రికన్,
ప్రాపగు సర్వసంపదలు, పార్వతి నిమ్ము ధరాధరేంద్ర! నీ
వేపున, నింతకంటెఁ గలదే యొక కార్యము? శంకరుండు తా
నోపికతో సుఖించు భవదుత్తమమైన యనుగ్రహంబునన్. ౧౩౩౬

తే. దేవదేవుండయిన శంభు దివ్యమహిమ-మెఱుఁగవే? నీకుఁ గ్రొత్తయే హిమగిరీంద్ర!
త్వత్ప్రియాత్మజ నొసఁగుము పరమశివున-కాదరంబున, ధన్యత నందు మెపుడు."

క. నారదమునీంద్రుఁ డప్పు డ-పారంబగు ప్రీతి వెలయఁ బర్వతవిభునిన్
గారవముగ సస్మితుఁడై-కోరికఁ బల్కెన్ త్రికాలకోవిదుఁ డగుటన్. ౧౩౪౧

మ. "మును నేఁ దెల్పినవాఁడ నంతయును సంపూర్ణంబుగా నీకుఁ బూ
ర్ణ ననాదిప్రభుసత్తమున్ బరముఁ గోర్కుల్ మీఱ రావించి, నీ
తనయన్ బూజ్యను నాద్య నిమ్మనుచు, నిత్యప్రీతియుక్తుండవై
మనుటే భాగ్యవరం బటంచు మది సంభావింపు మావాక్యముల్." ౧౩౪౨

తే. వరమరీచిముఖర్షులుఁ, బరమమౌని-యైన నారదమునియును నద్రిరాజు
తోడ నీరీతిఁ బల్కి-సంతుష్టచిత్తుఁ-డయి, మునులఁ గూర్చి వచియించె నగవరుండు.

సీ. "మునివరులార! నాజననంబు ఫలియించెఁ, బరమపావనత నా కరయఁగలిగెఁ;
ద్వత్సమాగమముచేతను గృతకృత్యుఁడనై చెలంగినవాఁడ నార్యులార!
సకలసృష్టిక్రియాసంభరణంబులఁ బాలనంబునయందుఁ బ్రభుత మీఱుఁ
జంద్రశేఖరుఁ డంచు సర్వులు నుతియింతు, రా దేవదేవున కాత్మతనయఁ

తే. బ్రీతితో నియ్యఁగలవాఁడఁ, జేతమునను-నేకొఱఁత లేదు నాకు, నుమాకళత్త్రుఁ
డగునుగావుత! శంకరుం, డతని నిచ్చఁ-దవిలినాఁడ సర్వం బీసుఁ దవిలినట్లు.

క. ఆ దేవదేవు వాంఛయె-నాదగు వాంఛితె మటంచు నమ్ముఁడు మీరల్,
భేద మిసుమంత లేదని-మోదంబునఁ జెప్పుఁ డీరు మునివరులారా! ౧౩౪౫

తే. ఎపుడు పరమేశ్వరుని బుద్ధి నిచ్ఛగలిగె,
నపుడె యుదయించె నిచ్ఛ నా కనుచుఁ దెలుపుఁ
డెల్లవృత్తాంతమును శంభునంతికమునఁ
బూర్ణకరుణాంతరంగులై పోయి వేగ. ౧౩౪౬

చ. తగు సమయంబు పెండిలికిఁ దా నొగి నిచ్చ వినిశ్చయించి, యె
ప్పగను నుదంతమున్ శివుఁడె పూన్కినిఁ బంపఁగ నేను జుండి, యె
ప్పు గులుక శక్తికిం దగిన భూషణముల్ ప్రియమారఁ నిచ్చి నా
దగు భవనంబునన్ సుతను దప్పక యీశున కిత్తు వేడ్కతోన్." ౧౩౪౭

ఇరువదియైదవ అధ్యాయము

పార్వతీ వివాహాహ్వానము

క. మును లాత్మలందుఁ బొంగుచు-విని గిరినాయకుని వాక్యవిధమును నపుడే
చనిరి మహేశ్వరు సన్నిధి-కిని సంతోషంబు మీఱఁ గృతనిశ్చయులై. ౧౩౪౮

క. ఆ మునివర్యుల రాకను-దా మది భయమూనినట్లు త్వరతో శంభుం
"డో మునులారా! హిమగిరి-యేమనెనో పల్కుఁ డిప్పుడే విశదముగన్.

చ. తన సుత నిత్తు నంచు విశదంబుగఁ దానయి పల్కినాఁడె? లే
దని వచియించెనా? తెలుపుఁ డంతయు నెంతయు వృత్తమెల్ల, నా
మనమున కూఱటం గనెదుమాడ్కి నొనర్పుఁడు మానులార! యం
దనువునఁ గాంచినట్టి విధ మాద్యతి నాపయి నుంచి" నావుడున్. ౧౩౫౦

ఉ. "ఇచ్చెద నాదు పుత్త్రి నని స్వేచ్ఛగ భక్తి దలిర్ప నీపయిన్
జెచ్చెరఁ బల్కె భూధ్రపతి, చింతను దక్కుము, సుస్థిరుండవై
యిచ్చఁ జెలంగుచుండుము మహేశ్వర! యించుకయేని లోప మెం
దచ్చటఁ గల్గ, దింక విను మార్యసుపూజితపాదపంకజా! ౧౩౫౧

క. నగవరుఁడు పల్కె నీక్రియఁ-దగిన ముహూర్తంబుఁ జూచి తడయక తెలుపం
దగు ననుచు, నుదంతంబును-సుగమంబుగ శంభుఁ డాత్మఁ జూచి యటంచున్."

సీ. మును లిట్లు పల్కఁగా ముదమున శంకరుం డామునీంద్రులఁ జూచి "యార్యులార!
యేదోషములు లేక యెసఁగునట్టి ముహూర్తమును జూచి పెండ్లికి ననువుమీఱు
సమయంబుఁ దెల్పుఁడు, సత్వరంబుగ దాని మహనీయుఁడైన యత్తుహినగిరికిఁ
దెలుపంగవలయును దివ్యచిత్తంబున" ననుటయు నామరీచ్యాదిమునులు

తే. మంచి లగ్నంబు నాత్మ భావించి, యున్న-దంచు వైశాఖమున శుక్లపంచమిగురు
వాసరము సర్వదోషవివర్జితంబు-సంతతిప్రద ముద్వాహసన్నుతంబు. ౧౩౫౩

క. తగిన సమయంబు పెండిలి-యగుటకుఁ, దెలుపంగఁదగు నహార్యవరున కీ
యగణితశుభదముహూర్తముఁ—దగ''ననుటయుశంభుఁడాత్మఁదమియుప్పొంగన్.

క. ''మునినాథులార! యిప్పుడె-చని హిమధామంబునకు సుసమయం బెఱిఁగిం
చిన మంచిది, మీరే పే-ర్కొనఁదగుదు రదంత మిద్ది కూరిమిలోడన్.

తే. ఆ శుభముహూర్తమునవె త్వదాత్మజాత
నొసఁగఁదగు శాస్త్రమర్యాద నూని యనుచుఁ
దెలుపుఁ, డింతియెకాదు నే నల ముహూర్త
మునకు సిద్ధముగా నుందు ననుఁడు, మఱియు. ౧౩౫౬

చ. సురగణసంయుతుండ నయి సొంపగు వైభవయుక్తి వత్తు న
త్తరుణమునందు నచ్చటికిఁ దప్పక యంచును దెల్పనౌ'' నన౯
వరమును లామహేశ్వరుని వాక్యముల౯ విని శీతశైలసుం
దరవరపత్తనంబునకుఁ దా రొగిఁ బోయిరి సంతసంబున౯. ౧౩౫౭

క. గిరిరాజుం గని మరల౯-హరు వాక్యము లెల్లఁ దెలుప, నానందమున౯
ధరణీధరవరుఁ డప్పుడు—'సరి, మంచి' దటంచుఁ బలికి, సంయమివరుల౯.

ఆ. శాస్త్రవిహితరీతి సంపూజనము చేసి-పంప వారు మరల వచ్చి శివుని
దర్శనంబు చేసి ధరణీధరేంద్రుని-సమ్మతంబుఁ దెలుప, శంకరుండు. ౧౩౫౯

క. ''మీరలు గిరివరు పురికి౯-జేర౯ నను గూడి యరుగ స్థిరమతులై యిం
పార శుభసమయమునకు౯-గోరికతో రావలయును గోవిదులారా!'' ౧౩౬౦

ఆ. అనుచు శంకరుండు హర్షంబుతో మరీ-చ్యాదిమునులఁ గాంచి యర్హరీతిఁ
బలికి,నారదమునివరుఁ గాంచి పల్కె ''నొం-డొక్క కార్య మున్న దొగినివినుము,

ఉ. చెప్పెద నిప్పు డయ్యది యశేషబుధస్తుతధీవిభూషణా!
యొప్పుగ బ్రహ్మవిష్ణుపురుహూతముఖామరరాజికెల్లను౯
దప్పక నావివాహపునుదంతము నేర్పడ వేఱువేఱుగం
జెప్పుము సమ్మదంబు మదిఁ జెందఁగ నేను వచించినట్టుల౯. ౧౩౬౨

క. మునివర! నే నాహ్వానం-బును జేసినవాఁడ ననుచుఁ బొసఁగఁ బలికి యొ
య్యన సకలసురలఁ దోడ్కొని-యనువున శోభనము జరుప నగునని వేడ్క౯.

క. సురగరుడసిద్ధకిన్నర-వరులను దోడ్కొనుచు వచ్చి వైవాహికము౯
జరుపంగఁదగును మీరలె-నిరతి ననుచుఁ దెలుపవలయు నిత్యప్రీతి౯.''

చ. పరశివుఁ డిట్లు తెల్ప, మునివర్యుఁడు నారదుఁ డాత్మ నెంతొ సం
బరము చెలంగఁ బల్కె "సురవందితపాద! త్వదాజ్ఞ యెట్టులో
సరవి నొనర్పువాఁడ, మది సందియ మందక యాజ్ఞ సేయుఁడీ,
కరము వసుంధ, నుత్తరువు గ్రక్కునఁ జేయుఁడు కోర్కె మీఱఁగన్." ౧౩౬౫

ఉ. అంత మరీచిముఖ్యమును లాత్మల సంతసమొప్ప మ్రొక్కి తా
రెంతయు భక్తి శంకరుని నిట్లు నుతించిరి "దేవ! యేము సు
స్వాంతములోడ వత్తుము వివాహమునాఁటికి దేవతాళితో,
నింతట నాజ్ఞయింక దయ నిండ్లకుఁ బోవఁగ మాకు నం"చనన్. ౧౩౬౬

సీ. అశ్రుపూరితనేత్రుఁడై మహాదేవుండు మునినాయకులఁ గాంచి యనియె నిట్లు,
"సతివిరహంబుచే మతిఁ గడు మన్మథుబాధ నందుచునున్నవాఁడఁ, గనుఁడు,
పర్వతాధిపపుత్త్రిఁ బ్రాణైకవల్లభఁ బరిణయంబగునంతవఱకు నాకు
నెమ్మది గలుగదు నిజముగ మునులార! యత్యంతకష్టమై యమరు నాకు,
తే. జీవనం బెట్టులో పూని యీవిధముగఁ-గడపువాఁడను, గామదగ్ధతనుఁడ నయి
వేఁగుచున్నాఁడ ధ్రువ మిది, విశదముగను-దెల్పినాఁడను మీసన్నిధిని సకలము.

తే. ప్రాణవల్లభయైన పార్వతిని బరిణ-యం బగుదు నే క్షణంబున నాక్షణంబ
సేవచేయంగఁ బూనుదు స్థిరమనీష-సంయమివరేణ్యులార! నిశ్చయముగాఁగ.

ఉ. చేయను విప్రియం బెపుడు చిత్తమునం బరిమోహితుండనై,
పాయక కూడియుండెదను పార్వతి నెప్పుడు దేవి యెందుఁ దాఁ
జేయును బోవ యత్నమొగిఁ, జేరఁగఁబోవుదు నేను వెంటనే,
ధీయుతులార! యొక్కత్రుటి దేవిని వీడక యుందు నిచ్చలున్. ౧౩౬౯

ఉ. ఇప్పుడు మీగృహంబులకు నెంతయు వేడుకలోడఁ బొండు, నే
నిప్పగిదిన్ వసించెదను నిచ్చటఁ గాననమందు, నాత్మలో
నెప్పుడు నిల్పి పార్వతిని యెంచుచు, నోమునులార! పెండ్లికిన్
దప్పక మీరు రావలయు ధన్యతఁ గూర్ప వివాహవేళకున్." ౧౩౭౦

తే. ఈవిధంబునఁ బల్కి మహేశ్వరుండు-మునులఁ బంపె మరీచ్యాదులను, ముదమున
వారు మ్రొక్కుచుఁ బోయిరివరుసనిజగృ-హములఁ జేరంగ, నంత సంయమివరేణ్య!

క. నారదముని కడువడిఁ జని-వారిజగర్భునకు శివు వివాహపు వార్తన్
గూరిమిఁ దెలిపెను, నతఁడు నటె-వారిజనాభునకుఁ దెలిపె వైకుంఠమునన్.

ఆ. సరసిజాసనుండు, సరసిజాక్షుండును-హరుని పెండ్లిమాట నాలకించి
యాత్మలందుఁ బొంగి యా నారదమునీంద్రుఁ-గాంచి పల్కి రిట్లు కౌతుకమున.

క. "మునినాయక! శివు పరిణయ-మును గన్గొన వత్తుము కడుముదమునఁ బరివా
రనిచయసహితులమై, నీ-వనువున మాటాడఁ బూని యమరావతికిన్. ౧౩౬౪

తే. ద్రుతగమనమునఁ బోయి యింద్రునకు శివుని
పెండిలియుదంతమును దెల్పు, వేగ సిద్ధ
గరుడగంధర్వకిన్నరవరులఁ గూడి
వచ్చుఁ దోడ్పడ హరుని వివాహమునకు." ౧౩౬౫

క. సరసిజభవుఁడును, విష్ణుం-డిరవుగ నిటు పల్క నంత ఋషివర్యుఁడు వే
యరిగి యమరావతికి నా-పురుహూతునితోడ నెల్ల ముదమునఁ బలికెన్.

ఉ. వాసవుఁ డాదిదేవుని వివాహమహోత్సవవార్తయున్, సరో
జాసనవిష్ణరశ్రవుల శస్తతమంబగు భాషణంబుఁ దా
నాస నెఱింగి నారదుని యర్హవచస్సుల హర్షితాత్ముఁడై
చేసెను నిశ్చయంబు నిఁక సిద్ధము తారకుఁ డీల్గు నంచెదన్. ౧౩౬౬

తే. పరమశివుని కల్యాణంబు జరుపఁగోరి
యత్నమును జేయఁగాఁబూనె నమరవిభుఁడు,
నారదుం డింద్రుపూజల గారవమున
నొంది తన గృహమున కేగె నురుముదమున. ౧౩౬౭

ఇరువదియాఱవ అధ్యాయము

పార్వతీపరమేశ్వరుల వివాహమునకు దేవతలు వచ్చుట

చ. జగములకెల్ల హర్షమును సల్పఁగ నెంతయుఁ బెంపుమీఱు న
య్యగవరుపుత్త్రి పెండిలి మహావిభవాస్పద మాచు వేడ్క సే
యఁగ, నగరాజపట్టణమునందుఁ బ్రయత్నములెల్ల మిక్కుటం
బుగ మునినాథ! చేయఁగనుబూనిరి యెల్లరు సంతసంబునన్. ౧౩౬౮

క. భేరీమృదంగపణవము-ఖారవములు తూర్యములును నభ్రము నిండన్
బోరుకలంగెను భువిఁ బెం-పారఁగ నానందకందమై యెల్లరకున్. ౧౩౭౦

క. మంగళమగు గానంబులఁ-బొంగుచు గంధర్వవరులు ముదమునఁ జేయన్,
సంగీతానుసరణమున-రంగుగ నాట్యంబు నచ్చరలు సల్పంగాన్. ౧౩౭౧

ఉ. వచ్చిరి దేవకన్యకలు వైభవ మొప్ప, గిరీంద్రకన్యకల్
వచ్చిరి పర్వతాత్మజవివాహమహోత్సవదర్శనార్థమై
హెచ్చయి మించు భూషణము లెంతయుఁ దాలిచి, సంపదాళి వి
ద్వచ్ఛ్రయసన్నుతాత్ముఁడయి భాసిలు భూధరరాజువీటికిన్. ౧౩౭౨

క. మునినాథ! వివిధవస్త్రము-లను, భూషణసముదయంబులను నొసఁగి ముదం
బున గారవించె వారిని-దన పుత్త్రిక పెండ్లియందు ధరణీధరుఁడున్. ౧౩౮౩

క. గిరిపురమున నీరీతిగ-జరిగెను శుభయత్నములు ప్రశస్తముగాఁగన్,
బరిమళమిళితసుఖావహ-మరుదంకురములు చెలంగ మందగతులతోన్.

క. అక్కజమగు తమి నగవరు-పక్కణమునఁ జెలఁగుచుండెఁ బ్రాణిచయంబుల్,
దిక్కులు విశదములయి పెం-పెక్కెను, సుస్థితిని బొంది పృథ్వి చెలంగెన్.

మ. పురుహూతుండు సమస్తదేవగణముల్ మోదంబునన్ వెంటరాఁ
గర ముప్పొంగుచుఁ బర్వతేంద్రు నగరిన్ గల్యాణముం జూడ శం
కరు సాన్నిధ్యముఁ జేరఁగాఁ బయనముం గావించె, గంధర్వులున్
గరుడుల్ గిన్నరు లాత్మ నుబ్బుచును నానందంబుతో నాడఁగన్. ౧౩౮౬

ఉ. అత్తతి మీనకేతనుని యాఁగనమొదకుఁ బోయి నారదుం
డుత్తమలక్షణాఢ్యుఁడు, రతి నొక్కెడఁ గాంచి వచించె "నమ్మ! లో
కోత్తరుఁడౌ మహేశ్వరున కుర్వినగేంద్రుని పుత్త్రి నిచ్చి, వి
ద్వత్తతి సన్నుతింపఁగ వివాహమహోత్సవ మొప్ప వేసుకన్." ౧౩౮౭

ఆ. అనుచు శివుని పరిణయోదంతమును దెల్పి-మరలఁ బలికె నిట్లు మదను పత్నిఁ
గాంచి నారదుండు కరుణ నెమ్మదిఁ బొంగ-"నమ్మ! యుక్తిఁ దెలియ నవధరింపు.

ఉ. స్వాంతమునందు నీకుఁ వివాహమహోత్సవహర్షమగ్నుఁడై
యొంతయుఁ బొంగుచుండ సురలెల్లరు నీపతిజీవితంబు యా
చింతురు శంకరుండు ఫలసిద్ధి యొనర్చు నటంచుఁ గోరికన్,
జెంతను నీవు నుండిన నె జీవితనాథునిఁ గూర్చు నిచ్చలున్." ౧౩౮౯

ఆ. అనుచుఁ దెలియఁబలికి యరిగె నారదముని-గగనమార్గమునను గౌతుకమున
సకలదేవనికరసన్నుతచరణార-విందుఁడైన ప్రమథవిభుని కడకు. ౧౩౯౦

ఆ. కామపత్నియయిన కామినీమణి రతి-భర్తృజీవితంబె పరమవాంఛ
గాఁగ మరిని యత్నకలితయై శంకరు-పెండిలికిని బోవ నుండ వేడ్క. ౧౩౯౧

ఉ. వచ్చిన నారదుం గని యపారముదంబునఁ బొంగి శంకరుం
డచ్చపుఁ గూర్మి స్వాగతము నప్పుడు తెల్పుచుఁ బల్కె "మౌని! యిం
కిచ్చట నేమి చేయఁదగు, నేకరణిం" జెపు మన్న నారదుం
డచ్చుపడంగఁ దాఁ దెలిపె నంతట బల్వినయంబు మీఱఁగన్. ౧౩౯౨

సీ. "దేవమహాదేవ! దివ్యచిత్తంబున నవధరింపుఁడు కార్యవివరణంబు,
గరుడగంధర్వకిన్నరయక్షదేవతల్ వచ్చుచున్నారు వివాహమునకు,

నీరాత్రి గడచిన నెల్లి సులగ్నంబునందు దేవాళితో నరుగవలయు
వైభవంబున గిరివరు పురంబునకు, నం దతిమోదమున వివాహంబు జరుగు''

ఆ. ననుచు విన్నవించునంతలో దేవేంద్రుఁ-డఖిలసురలతోడ నరుగుదెంచె
సంతసంబు మీఱ శంకరపదసార-సముల కడకు భక్తిసహితుఁ డగుచు.

తే. సకలలోకకారణుఁడైన శంకరునకుఁ
బ్రణతి గావించి దేవతల్ భక్తితోడఁ
బలికి ''రో దేవ! మా కాజ్ఞఁ దెలుపుఁ డిప్పు
డేమి సేయంగవలయునో యీశ!'' యనిన. ౧౩౯౭

ఆ. శంకరుండు దేవసమితిని వీక్షించి-పలికె ''నమరులార! సలుపవలయు
మద్వివాహదివ్యమంగళోత్సవముఁ-కనువు మెఱయఁ జేయ నయిన దెల్ల.''

ఆ. పరమశివవివాహవరమహోత్సవ మంతి-న త్తపోవనమున నలరె మిగుల
వేడ్కతోడ, దేవవిభుఁడు సంప్రీతుఁడై-జరపెఁ గార్యభారసరణిఁ బూని.

సీ. వివిధమంగళతూర్యనివహముల్ మ్రోసెను దశదిశలందు శబ్దంబు నిండ,
శ్రవణమహోత్సవప్రవణగంధర్వసంగీతనాదంబులు కెరలువాఱెచె,
గగనవీథులనుండి కడు సంతసంబునఁ గురిపించి రమరులు కుసుమవృష్టి,
యప్సరోగణము లత్యానందమునఁ బొంగి నాట్యంబు సల్పిరి నానెముగను,

తే. తరువులెల్లను బరిఫుల్లసురభిపుష్ప-తతులతోడుత విలసిల్లె వితతముగను,
దివ్యమహిమాస్పదుండగు దేవదేవుఁ-డెనయఁ దప మొనరించు నవ్వనమునందు.

తే. కోర్కెలూరించు కోకిలకూజితములు,
నతిమనోహరబంభరతతిరవములు,
మందమలయానిలంబు లానందముగను
వఱలెను మహేశ్వరుని తపోవనమునందు. ౧౩౯౮

చ. జగముల కెల్లఁ దాతయగు సారసగర్భుఁడు బ్రహ్మ వచ్చెఁ జెం
పుగఁ దన మానసోద్భవులఁ బుత్త్రులఁ గూడి వసిష్ఠముఖ్యులన్,
నిగమనుతుండు శ్రీశుఁడును నిత్య యనందగు లక్ష్మి వెంటరా
నొగి నరుదెంచె, వాణియును నుత్సుకతన్ శివుపెండ్లి జూడఁగన్. ౧౩౯౯

తే. ఈవిధంబున వచ్చిన యెల్లసురల-బ్రహ్మవిష్ణుముఖాదులఁ బరఁగఁ గాంచి
సుప్రసన్నముఖాంభోజశోభితుఁడయి-శంకరుం డెంతయును మది సంతసించె.

ఇరువదియేడవ అధ్యాయము

రతీదేవి తన భర్తయగు మదనుని శంకరుననుగ్రహంబునఁ బడయుట

చ. అతిశయమైన దుఃఖమున నార్తిఁ గృశించుచు నేత్రయుగ్మ మా
తతగతి బాష్పపూర్ణమయి యాత్మఁ దలంకుచుఁ గామపత్ని యం
చితసకలాంగసుందరి శచీవిభు సన్నిధిఁ జేరి ఖిన్నయై,
మతి గరఁగంగఁ బల్కె నిటు మానిని యెంతయుఁ గోర్కెలూరఁగన్. ౧౪౦౧

మ. "సురనాథా! మును దానవాజ్ఞ నెఱపన్ సూనాస్త్రుఁ డస్మత్ప్రియుం
డురుమోదంబునఁ బోయి శంభుపయిఁ దా నుద్యన్మహాస్త్రంబుఁ జే
చ్చెర వైవంగఁ దదీయకోపశిఖి భస్మీభూతుఁడై పోయె న
చ్చెరువొందం భువిఁ దత్క్షణంబున నె నాచిత్తంబు క్షోభింపఁగన్. ౧౪౦౨

మ. అతిదుఃఖంబునఁ బ్రాణనాథు మది నత్యంతార్తిఁ జింతించుచున్
గతి లే కేడ్చుచునుండ నన్నుఁ గని "దుఃఖం బేల నీ వేడ్వఁగా
దతివా! జీవితుఁ డౌను నీదయితుఁ" డం చారాటముం బాపి స
మ్మతి నూరార్చితి వీవు దేవపతి! యామాటల్ స్మృతింబాయుదే! ౧౪౦౩

చ. తలఁపుము దేవరాజ! మదిఁ దప్పక యప్పుడు నన్నుఁ జూచి పెం
పలరఁగ "నీమనోహరుని యస్త్రముచే హరుఁ డాత్మ ముగ్ధుఁడై
లలనఁ బరిగ్రహించు, సకలత్రిదివేశులమైన మాకు వాం
ఛలు ఫలియించె" నంటి వది స్వాంతమునం దొగి నిర్జరాధిపా! ౧౪౦౪

తే. భస్మమైపోయె నాఁడె నాప్రాణనాథుఁ,-డఖిలము నెఱింగితిరి మీర, లాత్మలందుఁ
దలఁప రించుకయైన నాప్రాణపతిసు-జీవితముఁ ద్రిప్పఁ గార్యంబుఁ జేయుటకును"

ఉ. పంచశరాత్మపత్ని యిటు పల్కుచు నింద్రవిరించిసన్నిధిన్
మించిన దుఃఖవేగమున మేను వడంక, వియోగ మాత్మ భా
వించుచు నేడ్వసాగ, నది వీనుల కెంతయు దుస్సహంబుగా
నెంచిరి యింద్రపద్మజులు హెచ్చిన జాలిని దత్క్షణంబునన్. ౧౪౦౫

తే భక్తియుక్తు లగుచుఁ బరిణయోత్సుకచిత్తుఁ-డయిన దేవదేవునంఘ్రిసన్ని
ధానమందుఁ జేరి తా రొగి వినతులై-పల్కి రిట్లు లలితభణితి నపుడు. ౧౪౦౬

సీ. "ప్రణతకృపాకర! పరమేశ్వరా! ప్రభూ! దేవకార్యం బొందుఁ దీర్పవలయు
మాప్రార్థనములను మన్నించి యాత్మలోఁ, దెల్పువారము దాని ధృతిని, దొల్లి
మా యాజ్ఞఁ బూని మన్మథుఁడు నీపై బాణమును బ్రయోగింపఁగాఁ బోవుచుండి
యింద్రాదులను జూచి యిట్లుయాచించె "నోపురుహూతముఖులార! పురహరుండు

తే. కోపమున నన్నుఁ జంపినఁ గూర్మి మీర
లెల్లఁ దగినట్లు యత్నంబు హితవు మీఱఁ
జేయఁగావలె నా ప్రాణసిద్ధికొఱకు''
ననుచు వేఁడిన సురవరు లనుమతించి. ౧౪౦౮

ఉ. మంచి దటంచుఁ బల్కుటయు, మన్మథుఁ డంత సుపర్వకార్యమే
యెంచి సుమాస్త్ర మేసి జగదీశ! త్వదీయమహాక్రుధోత్థమై
మించిన వహ్ని దగ్ధుఁడయి మేదిని బూడిదయయ్యె, నిప్పు డే
తెంచెఁ దదీయపత్ని యతిదీర్ఘమనోవ్యథఁ గర్శితాంగియై. ౧౪౦౯

తే. పతిని యాచించుచున్న దారతి మహేశ!-తావకపదాబ్జదివ్యసందర్శనమునఁ,
గరుణ బ్రతికించి మదనుని సురవరులను-సత్యవచనులఁ జేయవే సర్వవిభవ!

క. సురవరనాయక! తావక-కరుణామృతవృష్టిఁ బఱపి కందర్పసతిన్
నిరుపమలోకవిమోహన-చరితునితోఁ గూర్చి సంతసముఁ బెంపు విభూ!''

క. పరమేష్ఠి వినయ మొప్పఁగ-సురవరహిత మెదను దలఁచి స్తోత్రింపఁగ సం
బరమునఁ బ్రణతదయాకరుఁ-డురుతరముగ నాత్మ మెచ్చి యుద్యత్కృపతోన్.

తే. మదనున కొసంగె దేహంబు మరల, దివ్య
గాత్రమును బొంది భక్తి శంకరుని పాద
ములకు వందన మొనరించి పుష్పధన్వుఁ
డమరులకు మ్రొక్కి రతిపార్శ్వమందుఁ జేరె. ౧౪౧౩

చ మదిఁ గడు సంతసంబు పొడమం బరిపూర్ణమనోరథంబు పెం
పొదవఁగ భర్తఁ గూడి రతి యుండుటఁ గాంచి, సుపర్వులెల్ల స
మ్మదమున నుల్లసిల్లిరి, ప్రమోదయుతోత్సవముం బొనర్చి, ర
య్యదనునఁ గాంతియుక్తుఁడయి యాకసమందు వెలింగెఁ జంద్రుఁడున్ ౧౪౧౪

ఉ. ఆసమయంబునందుఁ బరమాద్భుతపింగజటాసమూహసం
భాసితమౌళిశోభితుని, భస్మవిలేపవిభూషణాంగు, ను
ల్లాసిఁ, జతుర్భుజున్, శివుని లాలితవాక్యులతోడఁ బల్కె న
జ్జాసనుఁ డెంతయున్ మదిని హర్షము పొంగుచునుండ నారదా! ౧౪౧౫

సీ. ''దేవాదిదేవ! నీ దివ్యరూపంబు దుర్లభము, సురావళిప్రార్థితంబు,
యోగీంద్రదివ్యచిత్తోత్సాహకలితంబు, సకలజగత్ప్రీతిజనక మగును,
నారూప మిప్పు డోయమరవందితపాద! వదలి సౌమ్యంబయి వఱలు రూప
మొగి ధరింపుము,మామయుత్సాహవంతుఁడౌ,నత్తయామేనయునాత్మఁజెలఁగు,

తే. నీదు సౌందర్యమును గాంచి నిర్భరమగు-ముదముతో గిరిరాజాత్మఁ బొంగి తనదు
పుత్త్రి సర్వాంగసుందరిఁ బూర్ణకరుణ-నీ కొసంగును బ్రియుఁడయి నిగమవినుత!

తే. భీమరూపుని నినుఁ గాంచి భీతి మదినిఁ-బొంద కేవారలైనను ముకమునొందు
నట్టి ద్విభుజాత్మకంబగు నధికసుంద-రాకృతి ధరింపు మిపుడు శుభావహముగ.

క. పరమేశ్వర! సకలమనో-హరమగు నత్యంతసుందరాకారము సం
బరమగునటు మా కెల్లను-ధరియింపుము, పెండ్లికొడుకు తగు ననఁగ బుధుల్."

చ. సరసిజసంభవుం డిటులు సన్నుతిచేసి హితంబుఁ దెల్పఁగాఁ
బరమకృపాంతరంగుఁడయి భాసిలు శంకరుఁ డాత్మఁ బొంగి సం
బరమునఁ దా ధరించె, మహిమన్ సురకోటికిఁ జూప నప్డు సుం
దరతమమైన రూపమును దాపసిసంచయవంద్య! నారదా! ౧౪౧౯

శంకరుఁడు పెండ్లికొడుకగుట

సీ. భయదంబులౌ చతుర్బాహువు లద్భుతంబుగ ద్విభుజంబులై పొలుపుమీఱెఁ,
బంచవక్త్రంబులు పరమహర్షస్ఫూర్తినెనయు నేకముఖమై యెసఁగుచుండె,
నెఱ్ఱని జడలెల్ల నెంతేయుఁ బాగడొందు చారుకిరీటంబుచాయ వెలిఁగె,
ఫాలలోచనమందు భాసిల్లు జ్వాలనుండు తిలకరూపంబయి తేజరిల్లె,

తే. దేహమందలి భసితంబు దివ్యపరిమ
ళాస్పదంబగు చందనంబై చెలంగె,
సర్పములు స్వర్ణరత్నభూషణము లయ్యె
శంకరుఁడు పెండ్లికొడుకైన సమయమందు. ౧౪౨౦

క. సురగరుడోరగకిన్నర-వరు లాత్రిదశేశ్వరుని శుభప్రదసమయం
బరసి సమీపించి నిరం-తరసంతోషంబు మీఱఁ దతమర్యాదన్. ౧౪౨౧

తే. నవ్యకాంతుల వెలుఁగొందు నందివాహ
నంబు నెక్కించి తగువైభవంబు మెఱయ,
గిరివరపురంబునకుఁ బోవఁ గృతమతులయి
యుండి రోమునినాథ! యత్యూర్జితముగ. ౧౪౨౨

ఉత్సాహవృత్తము. దేవదేవుఁ డద్రిరాజు దివ్యపట్టణమునకున్
బోవఁ బయనమైనయపుడు పుష్పవృష్టి గురిసె, స
ద్భావ మొప్ప దుందుభులు ముదంబు నింపె నద్భుతా
రావములు దిగంతముల విరాజిలంగ నోమునీ! ౧౪౨౩

ధ్రువకోకిల. సురభిశీతలమందమారుతశోభితంబయి యింపునన్
బరఁగె భూతల మెల్ల, మెల్లగఁ బక్షులెల్లఁ గలధ్వనిన్
గరము నెమ్మదిఁ బల్కుచుండె, నితామహర్షితులై గణో
త్కరము లెంతయుఁ బొంగి యార్చిరి కాంతసుస్వన మొప్పఁగన్. ౧౪౨౪

ఉ. అప్పుడు శంకరుండు త్రిదశావళి, మౌనిగణంబు వెంటఁ బెం
పొప్పఁగఁ గొల్చిరాఁగఁ గడు నుబ్బుచుఁ గిన్నరపాళితోడుతన్
మెప్పుచెలంగఁ జేరె ధరణీధరవర్యుని పత్తనం బొగిన్
గొప్ప మహోత్సవంబునను గూడి సురల్ వినుతించుచుండఁగాన్. ౧౪౨౫

ఇరువదియెనిమిదవ అధ్యాయము

గిరిజాకల్యాణము

ఉ. అంత మహేశు రాక విని యద్రివరుం డెమరేఁగి హృష్టుఁడై
యెంతయు నాత్మఁ బొంగి, కడు నింపగు వేడుక శాస్త్రరీతి న
త్యంతము పూజచేసి శివు నాత్మపురంబును జేర్చె, భక్తిస
త్స్వాంతుల బ్రహ్మవిష్ణుసురవర్యుల సత్క్రియ లొప్ప నారదా! ౧౪౨౬

క. గిరిరాజు మరీచ్యాదులఁ-బరమమునులఁ బూజచేసె భక్తియుతుండై,
పరమాదృతితోఁ దన పుర-వరమునకున్ దనకుఁ దగిన వైభవ మెసఁగన్.

సీ. శాంతు మనోహరస్వాంతుని సురుచిరవదనారవిందవిభాసితు హరు
ద్విభుజు సన్మణిభూషు దివ్యహేమకిరీటుఁ జంద్రలేఖాంకితశస్తశీర్షు
శతసూర్యనిభకాంతియుతుఁ బార్వతీప్రియుఁ గనుఁగొని మేనకానాథధరేంద్రు
లఖిలబాంధవులు నమ్మహోత్సవసమాగతులైన దేవతాగణములెల్ల
తే. నాత్మలందున నుప్పొంగి యన్యవస్తు-వులను జూడఁగ శంకరసులలితవర
దేహసౌభాగ్యగరిమంబె తృప్తిగొనఁగ-నొండొరులతోడ భాషించి రొగిని నిట్లు.

క. "రమణీయరూపమున నీ-యుమ వెలయుచునున్న దెంతయును దగి, యట్లే
కమనీయుఁడై జగత్పతి-యమరె మహాదేవుఁడు విభుఁ డనురూపుండై."

తే. సంతసంబున నీరీతి యింతులెల్ల-స్వాంతముల నెంతయును వేడ్క వఱలుచుండఁ
బల్కుచుండిరి, పురుషులుఁ బరమముదముఁ-జెంది వారలఁ బొగడిరి సిద్ధమౌని!

సీ. అంతట గిరివరుం డెంతయు సంతోషకలితుఁడై సర్వలక్షణయుతమగు
శుభముహూర్తము రాఁగ విభవంబుతోడుత దేవదేవునకు నొద్దిక చెలంగఁ
బార్వతి నొసఁగెఁ దాఁ, బరమహర్షంబునఁ బరమేశ్వరుఁడు శాస్త్రసరణి సకల
సృష్టిస్థితిలయకారిణియగు తుహినాద్రికన్యకఁ దాఁ బరిగ్రహమొనర్చె,
తే. నప్పుడు గిరీంద్రపురమున నధికవైభ-వంబునను నయ్యెను మహోత్సవం, బదెందు
ననుపమానం బపూర్వంబు నద్భుతం బ-భావ్యమై విలసిల్లె నోపరమమౌని!

సీ. పార్వతీదేవిని భార్యగా గ్రహియించి హరుఁడు చెలంగ నయ్యవసరమున
సకలదేవతలును సంపూర్ణవాంఛాయుతాత్ములై రతిశయహర్షమునను,
నమ్మహాదేవు మోహావిష్టుఁ గావించినట్టి కాముని చర్య కద్భుతంబు
నొంది ప్రశంసించి రుకుతరంబుగ, నంతఁ బార్వతీసహితుఁడౌ పరమశివునిఁ

తే. గాంచి యచ్చటముచ్చట మించుచుండ,
నొండొరులతోడ నాదితేయోత్తములును
గరుడగంధర్వులును మునివరులు యక్షు
లాదిగాఁగలవార లత్యాదరమున. ౧౮౩౨

సీ. "సర్వలోకేశ్వరి జగదంబయగు దేవి కన్యయై పుట్టె నేఘనుని యింట,
స్వేచ్ఛచే విశ్వసంసృష్టి గావించు నాపరదేవి పుట్టె నేప్రభుని యింట,
నట్టి యాధీమంతుఁడగు భూధరాధీశు భాగ్యంబె భాగ్యంబు బహుతరముగ,
నిట్టి సత్ఫలమును నెట్టి తపంబును గావించినను గల్గఁగలదె యెందు!

తే. నెట్టి తపమును సల్పెనో యీ గిరిపుఁ
డతిశయంబగు నియమంబు లాత్మ నుంచి,
మించిన ప్రభావమును బొందె, మేటి యీతఁడు,
భువనముల లేదు సాటి యీ భూధరునకు. ౧౮౩౩

తే. భువనములకెల్ల మాతయై పొలుపుమీఱు-నట్టి శ్రీదేవికిని మాత యయి చెలంగ,
మేనకాదేవి పూర్వజన్మాన నెట్టి-భాగ్యమును జేసెనో గణింపంగఁ దరమె!

సీ. పరమేశ్వరుని ప్రభావంబును వర్ణింప నెవరు సమర్థు లీభువనములను!
రూపంబు విభవంబు రూపింప ననుపమంబగు వాగతీతమై, యాత్మశక్తి
కైన నగోచరంబగుచున్నది" యటంచు నొండొరు ల్బలుకుచు నుండి రచట,
సర్వసుపర్వగంధర్వసమూహంబు లప్పుడు రూపశోభాంచితులగు

తే. పార్వతీపరమేశ్వరప్రథితమైన-దివ్యమహిమంబుఁ బొడగాంచి ధృతిఁ జెలంగి
పరమసంతోషకలితులై "నిరుపమాన-మీవిభవ"మంచు సంస్తుతియించి రార్య!

తే పరమకౌతుకవంతుఁడై పార్వతీస-మేతుఁడై శాంతుఁడై యుండు నీశుఁగూర్చి
పలికి రప్పుడు బ్రహ్మయుఁ బద్మనాభుఁ-డయిన భగవంతుఁ డావిష్ణువతిముదమున.

క. "దేవా! యేసతి మును నిను-భావమున వియోగతాపపరితప్తుఁగాఁ
గావించె, నేసతీమణి-కై విశ్రుతతపము సేయఁగాఁ బూనితివో. ౧౮౩౪

క. ఆసతి యీపార్వతియే,-యీసుందరి నీదు గృహిణి, యీదేవియె సు
మ్మాసర్వజగత్కారిణి-యీ సకలాద్య యని నమ్ము మీ భగవతిగన్.

క. అంతట హిమవంతుఁడు సు-స్వాంతుండయి, దివ్యభక్తిసంయుతుఁడై తా
నెంతయుఁ బరమేశ్వరు భగ-వంతు శివుని దేవదేవుఁ బ్రస్తుతిచేసెన్. ౧౪౩౯

తే. "దేవదేవ! మహాదేవ! సేవకజన
వత్సలా! శంకరా! నీదు పాదపద్మ
ములకుఁ గావింతుఁ గేలుమోడ్పులు సతంబుఁ,
గైకొనుము నన్ను క్షమియించి కరుణవెలయ. ౧౪౪౦

క. భువనములకు నాథుఁడవై-భువనజననితోడఁ గూడి పొదలెడు నిన్నున్
దవిలి కనుఁగొంటి, జన్మము-పవిత్రమై వెలసె, బ్రదుకు భాగ్యముగాంచెన్."

పర్వతరాజునకు శంకరుఁ డధ్వరభాగంబు నేర్పఱచుట

తే. ఓ మహాముని! సద్భక్తి యుక్తుఁ డగుచుఁ
బ్రస్తుతి యొనర్చు పర్వతరాజుఁ బ్రీతిఁ
దనదు వాక్కుల సంతృప్తి నొనరుప మదిఁ
దలఁచి శంకరుఁ డీరీతిఁ బలికె నపుడు. ౧౪౪౨

సీ. "ఓ పర్వతాధిప! యురుతరప్రాజ్ఞుఁడ వౌదు, మదీయ రూపాంతరంబ
వయి వెలుంగుదు, నిర్జరావళులకు నైన నత్యంత పూజ్యుఁడ వైతి వార్య!
భాగ్యవంతుఁడ వయి భాసిల్లుచున్నాఁడ వెంతయు నందితస్వాంతుఁడ వయి,
యేను గల్పించెద నీనాఁడు మొదలుగ నధ్వరభాగంబు నర్హరీతి,

తే. మర్త్యలోకంబునందు ని న్నాని యజ్ఞ
కార్యములు చేయఁజాలరు, క్రతుమహోత్స
వంబులందెల్ల సుర లెట్లు సంబరమున
హవ్యములఁ గొందు, ర ట్లీవు నందఁగలవు. ౧౪౪౩

తే. యజ్ఞభోక్త వగుచు నత్యంత సంతోష-మునను మర్త్యలోకమున సురాళిఁ
గూడి చెలఁగఁగలవు కులధరవర! యింక"-ననుచుఁ బలుక శంభుఁ, డాదృతిమెయి.

ఉ. శీతగిరీంద్రుఁ డిట్లనియెఁ "జిన్మయరూప! జగద్గురూ! విభూ!
చేతమునం గృతార్థతను జెందినవాఁడ భవద్వరంబుచే,
నీతతి నిన్ను వేఁడఁ దగి హృద్గతమయ్యె మహోత్క కోర్కె, దే
వా! తడవేల, తెల్పెద శివా! వరదా! కరుణాసరిత్పతీ! ౧౪౪౫

క. శరణాగత కరుణాలయ!-సురగణ వందిత పదాబ్జ! శుభకర! నా యీ
వరగిరిఁ బార్వతితోడుతఁ-జరియింపు, రమింపు, నన్ను సల్పుము సుకృతిన్".

క. గిరివరు ప్రార్థనమును శం-కరుఁ డాదృతి విని వచించె "గ్రావాధిప! నీ
పురి పరిసర శిఖరంబునఁ-బరితృప్తిని దేవిఁ గూడి వసియింతుఁ దమిన్. ౧౪౪౭

క. తావక గిరి పరిసరమున-నే వాసము చేయువాఁడ, నెల్లరు నన్నుం
భావించి గిరిశుఁ డని సం-సేవించుచుఁ బిలుతు రెపుడు శ్రీశిఖరమాలీ!" ౧౪౪౭

చ. మునివర! యీవిధంబునఁ బ్రసన్నాదితమానసుఁడై మహేశ్వరుం
డనువునఁ దెల్పి శీతగిరియందు మహోత్తమ మా ప్రదేశమం
దున రమణీయమౌ పురిని దోరపువేడుకతో సృజించి, య
త్యనుపమలీలలం దవిలి యద్రిజతోడ వసించెఁ బ్రీతుఁడై. ౧౪౪౮

తే. అంతఁ గమలాసనుం డాదియైన సకల-సురవరులు సంతసము మీఱ నరిగిరి తమ
తమ నివాసంబులకును నుత్సవముతోడ-నారదమునీంద్రచంద్ర! యపారభక్తి.

ఆ. పార్వతీవివాహవర్ణితాధ్యాయంబు-దీని వినును, జదువు నే నరుండు,
వాఁడు దేవిదివ్యవైభవోపేతుఁడై-తత్పదంబుఁ జెందు ధన్యుఁడగుచు. ౧౪౫౧

సీ. ఒకమాఱు వినిన నీయురుతరాఖ్యానంబు శత్రుభయంబులు సమసిపోవు,
రాజభయంబెల్ల రహిఁ దొలంగును, మనోభీష్టముల్ చేకూరు విస్తృతముగ,
దేవీప్రసాదంబుచే వివిధాఘముల్ వదలిపోవును, మదిఁ బొదలు ముదము,
మునినాథ! దక్షుని తనయయై తొల్లి సతీనామమునను ఖ్యాతిని గడించి

ఆ. నట్టి ప్రకృతి పూర్ణ నాద్యను దేవదే-వుండు మరలఁ బ్రీతిఁ బొందినట్టి
కథను దెల్పినాఁడఁ గడు విశదంబుగా-నీదు కోర్కి యొసఁగ నియతితోడ.

క. విను మింకఁ దారకాసుర-హననం బొగిఁ జేసినట్టి హరసూనుని శో
భనచరితంబును దెల్పెద-విను మవధానమున నిపుడు వేడుక మౌనీ! ౧౪౫౩

క. దేవతలకు రక్షకుఁడై-పావనుఁడై కార్తికేయభవ్యాహ్వయుఁడై
దేవ మెఱసి నిస్తులుఁడై-యీవసుధఁ గుమారుఁ డెసఁగె నిద్ధగుణుండై.

క. మునినాథ! లోకమున నే-ఘనుఁ డస్త్రపరిశ్రమమునఁ గనుఁగొనఁగా నెం
దును లేఁడు ముజ్జగంబుల-నను మహిమం గాంచె హరుని యాత్మజుఁ డనఘా!

ఇరువదితొమ్మిదవ అధ్యాయము

శంకరుఁడు పార్వతీదేవితోఁ గ్రీడించుట

చ. తన మదియందు రేఁబగలు ధన్యత నెన్నుచుఁ బార్వతీసతీ
ఘనఫలసిద్ధికారణముగాఁ దగు నాత్మతపఃప్రవృత్తి సం
జనితమహాశ్రమంబును బ్రసన్నముఖుండయి ప్రీతిసేయుచుం
గనుఁగొనుచుండెఁ బ్రీతిమెయి క్ష్మాధరపుత్త్రిని నెల్లవేళలన్. ౧౪౫౬

చ. క్షితిధరపుత్రిమంజులవిశిష్టవచస్తతి నాలకింపఁగా
శ్రుతులఁ దదీయకమ్రతరరూపముఁ గన్గొన [illegible]మ్ములన్,
సతతము తన్మనఃప్రియము సల్పుటయుండె మనంబు నుంచి తా
నతిశయరాగవంతుఁడయి యాశివుఁ డార్య కొనర్చెఁ బ్రీతినిన్. ౧౮౫౭

సీ. ఆ మహేశ్వరుఁ డిట్టు లనవరతంబును బార్వతీవశమనఃపద్ముఁ డగుచు,
నొకనాఁడు వనసీమ నుద్భవంబయినట్టి సురభిపుష్పంబుల నరసి తెచ్చి,
కమనీయమగు మాలికను గూర్చి, యగురుకర్పూరసౌరభములఁ బూసి, ప్రేమ
మతిశయిల్లఁగ మదనాతురుండయి ప్రియాకంఠంబునం దుంచి కడుముదమున

ఆ. మానసము చెలంగ సూను నుత్పాదింప–నాస పొడలుచుండ నపుడు తనదు
పరమభక్తుఁడైన నిరుపము నందిని–గాంచి పలికె నిట్లు కమ్రభణితి. ౧౮౫౮

ఉ. "పట్టణమార్గమందుఁ గడు భద్రతతోఁ బ్రమథాళి గొల్వఁగాఁ
బట్టుదలన్ వహించి సురవందితు దేవవరేణ్యునైన నే
పట్టునఁ జేరనియ్యకుము, ద్వారమునందునఁ గాచియుండు మీ
విట్టటుఁ బోక, నాపనుపు నేర్పడఁ జేయుము నందికేశ్వరా!" ౧౮౫౯

చ. అనవుడు నందికేశ్వరుఁ డహార్యబలుండు మహేశునాజ్ఞ భ
క్తిని శిరసావహించి, నియతిన్, బ్రమథావళి గొల్వ, ద్వారసీ
మను వసియించి, నిశ్చలత మానస మొప్పఁగఁ గాచుచుండె ని
య్యానువున జాగరూకుఁడయి యా హిమశైలమునందు నారదా! ౧౮౬౦

ఉ. ఇయ్యది రాత్రి యంచు, మది నిద్దిదివం బని యెంచ కెప్పుడున్
దియ్యనివిల్లుదాల్పు వడిఁ ద్రిప్పులఁ బెట్టుచు నుండ మోహితై
యయ్యగజాతఁ గూడి పదునైదు శరత్తులు ప్రేమపూర్ణుఁడై
యొయ్యనఁ దా రహస్యమున నుండి రమించె మహోత్సవంబునన్. ౧౮౬౧

తే. ఇట్లు రమియించుచుండఁగా నెప్పుడేని
శుక్లపాతంబు గాదయ్యె సుందరాంగుఁ
డగు మహేశున, కద్దాన నలరఁడయ్యె,
నించుకంతయు శాంతియు నెఱుఁగఁడయ్యె. ౧౮౬౨

భూదేవి యుమాశంకరుల క్రీడల వహింపలేక సూర్యునితో విన్నవించుట

ఉ. శంకరు పాదఘాతముల సంతతబాధల స్రుక్కి, భూమి 'యే
నిం కెటు లోర్తు' నంచు వడి నేగి, దినేశుని పజ్జ గోస్వరూ
పాంకితయై, యుదంతమును నంతయు నశ్రువిలోలనేత్రయై
కొంకుచుఁ దెల్పె నప్పు డతికుంఠితమానసయై మునీశ్వరా! ౧౮౬౩

మ. "దిననాథా! తుహినాద్రిప్రస్థమున నుద్రిక్తాత్మభూచేష్టుఁడై,
యనయం బాభగవంతుఁడైన హరుఁ డార్యాయుక్తుఁడై, యెంతయున్
దనివిం జెందక, క్రీడసేయుచును నున్నాఁ, డేను దాళంగఁజా
లను దేవా! శివశక్తిభారమును దాల్పంగా నశక్తాత్మనై. ౧౪౬౪

క. శివశక్తి ద్వితయపు-టవిరత రతిభారమున మహార్తిం బడి, నే
మివులఁ దపించుచునున్నా,-నవికలమగు నెరవుఁ జూపు మార్యా! త్వరగన్.

చ. పరమశివుండు తాఁ దవిలి పార్వతిఁ గామవిలోలచిత్తుఁడై,
నిరుపమమోద మొప్ప రమణీవశగాత్రుఁడు నై పవల్, నిశల్
సరవి నెఱుంగఁజాలఁడు, ప్రశాంతి నొకింతయు లేదు, స్తంభితో
ద్ధురవరవీర్యుఁడై నెగడుఁ దోరపువేడుకతో రమించుచున్." ౧౪౬౬

తే. ఈవిధంబున భూదేవి దేవదేవుఁ-డగజతోఁ గూడి రమియించు ననువుఁ దెలిపి,
తనకుఁ గల్గిన బాధను దయఁ దలంగఁ-జేయుమని వేఁడె సూర్యు నమేయగుణుని.

సూర్యుఁడు భూదేవిబాధలను సురలతోఁ దెల్పి యెల్లరు బ్రహ్మకడ కేఁగుట

సీ. గోరూపధారిణి క్షోణి పల్కిన పల్కు-లాదరంబున విని యర్కుఁ డంత
నింద్రాదు లున్నట్టి యెడకు నామెను గొనిచని, వారలకుఁ జెప్పెఁ దనవుమీఱ
శంకరు వృత్తంబు సర్వంబు భూదేవి చెప్పినరీతిగా స్థిరమనీష,
సురవరు లెల్లరు సూర్యుని వాక్యంబు లాలించి సూర్యుతో నపుడె కదలి
ఆ. భూమి వెంట రాఁగఁ బోయిరి పరమేష్ఠి-సన్నిధికిని గడు విపన్నులగుచు,
సరసిజాసనునకు సన్నుతు లావించి-వసుధ నిలిపి యెదుటఁ బలికి రిట్లు. ౧౪౬౮

దేవతలు భూదేవికిఁ గల్గిన యాపదను బ్రహ్మదేవునకు విన్నవించుట

ఉ. "ఓ చతురాననా! విను మహోన్నతవైభవ! భూతధాత్రియా
నా చలిగట్టుపట్టిఁ బ్రియమారఁగఁ గూడి, హరుండు క్రీడలన్
దోఁచినరీతిఁ దేలుచును దోరపువేడుకతో, హిమాద్రియం
దే చెలువారు సానువున నెంతయు మోదముతో వసించుఁ దాన్. ౧౪౬౯

క. రమణ రమించుచు నున్నాఁ-డమితోత్సుకుఁ డగుచుఁ, గడచె నబ్దంబులు వే
గముగాఁ బదునై, దైనను-శమ మిసుమంతయుఁ గనండు స్ఖలనరహితుఁడై.

క. వీర్యస్ఖలనముఁ బొందక-వార్యగతిం గామకేళి వదలఁడు, దేవా!
ధైర్యంబైనను బూనఁడు,-కార్యము లారయఁడు సు మ్మొకపుడు విధాతా!

క. వినలే దీవిధమగు రతి-కనలే దేకాలమునసుగాని, యెవరికే
మనమునఁ దలఁప నలీలం-బనఁదగియున్నది మహేశు నద్భుతరీతుల్. ౧౪౭౨

క. శివశక్తుల రతిభారం-బు వసుంధర పూనలేక పోడిమిచెడి, తా
మిపులం బీడితయై తే-యనలంబన మరయలేక యతివిహ్వలయై. ౧౪౭౩

క. పాతాళంబున కేఁగఁగఁ-జేశంబున నిశ్చయించి చెచ్చెర మమ్ముం
బ్రీతస్పృహ యయి చేరి యిఁ-కే తెరువని యడుగుచున్న దిప్పు డిలేశా!

క. ఏమెల్లరము మనంబుల-భూమికిఁ దగు నెవ్వఁ దెల్ప బుద్ధి కుదుర కో
తామరసజన్మ! త్వత్పద-తామరసము లాశ్రయింపఁ దరలితిమి విభూ! ౧౪౭౫

క. ఇయ్యది కార్యము, మీమతి-కెయ్యది కార్యం బటంచు నేర్పడు, దానిం
జయ్యనఁ దెలుపుఁడు, తద్విధి-నొయ్యన జరుపఁగలవార మోపరమేష్ఠీ!''

బ్రహ్మ దేవతలకుఁ గావించిన హితోపదేశము

చ. త్రిదశులు చేయు విన్నపముఁ బ్రీతిమెయి న్విని బ్రహ్మదేవుఁడుం
గుదురుగ నూఱడించి సురకోటిని మాటికిమాటి కొయ్యనం
ముదముఁ జెలంగఁ బల్కెఁ బరిపూర్ణకటాక్షము లొప్పఁ గాంచుచుం
బొదల నకుంఠితోత్సుకత భావిఫలంబుల నెంచి యాత్మలోం. ౧౪౭౭

సీ. ''సురలార! శంకరుం డరసి దేవహితంబుఁ దత్కార్యసిద్ధికై తా హిమాద్రి
తనయను బెండ్లాడి తమి మీఱ భోగించుచున్నాఁడు దేవకార్యోత్సుకుఁడయి,
శంభుని వీర్యంబు స్ఖలనమైనను నందు జనియించు పురుషుఁడే సకలలోక
వంద్యుండు, సర్వసుపర్వసేనాధీశుఁ, డాతఁడే తారకు నణఁచువాఁడు,
తే. శంకరునకును, దుహినాద్రిసంభవయగు-లోకమాతకు జనియించు నేకుమారుఁ,
డాతఁడే దేవదానవాద్యఖిలశాస-కుం డనంగను బరఁగుఁ, బ్రచండుఁ డగును.

చ. పరమపరాక్రమంబునను భాసిలు పుత్త్రుఁడు పుట్టు, నిక్క మో
సురవరులార! యీహరుని శుక్లము భూమి భరింపలేదు, మీ
రరిగి తదీయవీర్యము మహాద్భుతమౌనని యెంచి యొక్కచో
నరసి ప్రయత్నముం సలుపనౌ స్థలనంబగువేళఁ గాంచుచుం. ౧౪౭౯

శా. ఆలస్యంబును జేయరాదు జతనం, బత్యంతయత్నంబునం
గోలుండై యెట శంకరుండు గిరిజం గోర్కెం రతిక్రీడలం
దేలుం, వేగమ పోయి చేరనగు నా దేశంబు, నా యానతిం
మేలౌ, నే నరుదెంతు నయ్యెడ కొగిం మీతోడ, లెం డిప్పుడే. ౧౪౮౦

తే. త్వరితముగఁ బోయి హిమగిరి హరుఁడు వెలయు
నెడను బార్వతినిం గూర్చి హృద్యరీతి
సన్నుతింతము సంగమశాంతికొఱకుఁ
బార్వతీదేవిదివ్యాంఘ్రిపంకజముల.'' ౧౪౮౧

బ్రహ్మదేవుఁడు దేవతలతో నుమామహేశ్వరుల క్రీడాస్థలంబున కరుగుట

క. ఈరీతిఁ బలికి ద్రుహిణుఁడు-కోరిక మీఱంగఁ ద్రిదశకోటులతోడన్
నారద! పయనంబయి వే-చేరె హరుం డుమను గూడి చెలఁగు వనంబున్.

తే. పార్వతీపరమేశ్వరుల్ ప్రమదమునను-గామతంత్రంబులఁ జెలంగు సీమయందు
బ్రహ్మదేవుని వెంట సుపర్వసమితి-యరిగి కాంచిరి తల్లీల లద్భుతముగ.

ఉ. కాముకుఁడై శివుండు మదిఁ గన్గొనఁడయ్యెను ముగ్ధుఁడౌట సు
త్రామముఖామరేశ్వరపితామహముఖ్యులు చూడవచ్చినన్
గామకళావినోదరతికార్యము వీడఁడు, సిగ్గు నొందఁ, డు
ద్దామముదంబునం దవిలి తన్నెఱుఁగండు మహామునీశ్వరా! ౧౪౮౪

చ. సతతము నామహేశ్వరుని సంగమలీలలఁ దేలు చాత్మ నా
తతమగు హర్షముం గనుచుఁ దా గిరినాథుని పుత్త్రి పార్వతీ
సతియు సురాదులం గనదు, శంకను వీడదు, లజ్జఁ గొంద, దే
కతమ రమించుఁగాని, యటఁ గాంచ దొకింతయు దేవకోటులన్. ౧౪౮౫

ముప్పదియవ అధ్యాయము

దేవతలు లజ్జారూపిణియగు భగవతిని వినుతించుట

మ. మునినాథా! విను మంత నిర్జరులు సంపూర్ణాద్భుతస్వాంతులై
యనఘప్రక్రియఁ బల్కి రొండొరులతో నత్యంతభక్తిన్ జగ
జ్జననిన్ లోకవిమోహకారిణిని లజ్జారూపిణిన్ మోదముం
గనురీతిన్ వినుతింపఁగా నగును తెంక లగ్గాన కిచ్ఛాప్తికై. ౧౪౮౬

సీ. "ఎల్లలోకములకుఁ దల్లివి నీ వౌదు వంబ! మహాదేవుఁ డగును దండ్రి,
యేమెల్లరము దేవి! యెఱుఁగని బాలురమగుదుము మాయమ్మ! యనవరతము,
శిశుభావమున నుండు సిద్ధసాధ్యామరసంఘంబు, గావున సంభ్రమంబు
నీకే కలదు సుమ్ము, లోకత్రయమునకు లజ్జాస్వరూపవై లలితభణితి,

తే. వెలయు శివసుందరీ! నీవె గెలుతు వెందు,-జనని! మా యెడ దయసుప్రసన్న వగుము,
గౌరి! శ్రితజనరక్షణకార్యదీక్ష-యింపుతో డుత క్షితిని రక్షింపవమ్మ! ౧౪౮౭

సీ. నీవె యాత్మవు దేవి! నీవే గుణత్రయరహితవు బ్రహ్మవు విహితమతివి,
లోకైకమాతవై ప్రాకటస్త్రీపురుషవిషయాత్మికవయి జగతి నుందు,
వోయంబ! నీవు మహోల్లాసమున నిజగుణములలోనయి కోర్కి మీఱు
నిట్టిక్రీడలయందు నేపునఁ గ్రీడించుచున్నదానవు తల్లి! యుల్లసిల్ల,

ఆ. సకలజనని! నిన్ను స్మరహరవరుఁ డగు-శంకరునకుఁ గూర్చు సతి వటంచు
నెల్లలోకములును నెల్లకాలములందు-వినుతిచేసి పలుకు విశ్రుతముగ. ౧౪౮౮

సీ. మూఁడులోకముల సమ్మోహంబు నొందించు తల్లి! నీవెవ్వేళఁ దలఁతు వాత్మ,
స్వీయవాంఛావశస్థితవయి యంశచే శంభుని సృష్టించి శక్తి మెఱసి,
శివ యనుపేరున స్త్రీరూపమును దాల్చి విహరించుచుందు వీ వహరహంబు,
నిజలీలచేతను నీవే యొకప్పుడు శంభునే కృష్ణుఁడై సంభవంబు
తే. నొందునట్టులఁ గావించి యుత్సుకతను
దత్కుటుంబిని రాధవై తగిన రీతి
నెనసి క్రీడించుచుందువు హృద్యముగను
దేవి! యంబిక! నీవేడ్క తెలియఁగలమె? ౧౪౮౯

తే. సకలలోకైకరక్షణాప్రకటకార్య-కారిణీ! మమ్ముఁ జూడుము కరుణతోడ,
రత్నగర్భను రక్షించు యత్న మాత్మ-దలఁచి చాలింపు మిపుడు కందర్పలీల."

చ. త్రిదశవరేణ్యు లిట్టులు నుతింపఁగఁ బర్వతనాథు పుత్రియై
పొదలు పరాంబ సిగ్గు మదిఁ బొంది మహేశ్వరు సంగ మప్పుడే
వదలి వసుంధరారమణి వాంఛను గూర్పఁగఁ బూని లేచె, న
య్యదనున దేవివీర్యభవుఁడై జనియించె నొకండు నారదా! ౧౪౯౧

తే. బలపరాక్రమసంపన్నుఁ డలఘుతనుఁడు-భీమసేనుండు భైరవనాముఁ డతఁడు,
వానిఁ గని భగవతి దేవి వాంఛమీఱఁ-బలికెను మునీంద్ర! సంతోషకలితయగుచు.

క. "నివసింపుము మత్పురి నీ-వవిరళగతి ద్వారసీమయందు మదాజ్ఞన్,
దవిలి పురరక్ష సేయుము,-ప్రవిమలగుణ! బలము మిగుల భాసిలుచుండన్."

క. త్రిజగజ్జనని స్వకీయా-త్మజునకు సెలవిచ్చి యిట్లు మానసమున హ్రీ
విజితయయి యవల సిగ్గున-గజిబిజిఁ గని స్వగృహమునకుఁ గడువడి నరిగెన్.

మ. రమణీయంబయి దివ్యరత్నమయవప్రప్రాభవోపేతమై
విమలానర్ఘ్యసుతోరణాంచితము నై వెల్గొందుచున్నట్టి స
ద్మముఁ జేరం జనఁగా జగజ్జనని, యంతన్ శంకరుం డాత్మ భూ
రమణీదైన్యము మాన్ప, దేవహితముం బ్రాపింపఁగా నెంచుచున్. ౧౪౯౨

తే. భువనముల మేలు గోరి శంభుఁడు స్వవీర్య
మును వదలఁబూనె నపుడు తా మనమునందు,
దానిఁ గని బ్రహ్మ దేవహితంబు నెంచి
వాయుదేవునితోడుతఁ బల్కె నిట్లు. ౧౪౯౩

షణ్ముఖ జననక్రమము

ఉ. "ఓ పవమాన! తారకవధోద్యమ మాత్మను బూని నీవు లో
కోపకృతిం ఘటించు నొక యుత్తమకార్యముఁ జేయఁగావలెన్,
శ్రీపయి యీ సురావళికి భద్రముఁ గూర్ప జనింప నున్న సే
నాపతి దేవదేవవరనందనజన్మముఁ గూర్చి నేర్పునన్. ౧౪౯౭

చ. వినుము ప్రభంజనా! శివుఁడు వీర్య మమేయగుణాన్వితంబు భూ
మిని ద్యజియించునో యెపుడు, మెల్లఁ దానిని నబ్జకామినీ
జనముల యోనిఁ జేర్పు మలసత్వముఁ బొందక సత్వరుండవై
యనఘ" యటన్న నబ్జభవుఁ, డప్పుడు గంధవహుండు పెంపునన్. ౧౪౯౮

తే. వేగవంతులలో నెల్ల విదితయశుఁడు-గాన నతివేగయుక్తమై కలఁత గలుగు
నట్లు వీచెను భువనభయంకరముగఁ-బ్రాభవంబున, నంత నారదమునీంద్ర!

ఉ. శంకరుఁ డాత్మవీర్యముఁ గృశానుని మూర్ధమునందు నాత్మలోఁ
గొంకఁ ద్యజించి తా వదలె, గొబ్బున రాజతశైలమో యనన్
బొంకముగాఁ గనంబడుచుఁ బూనఁగ సాధ్యముగాక యుండుటన్
బింకము మాని యగ్నియును వే విడిచెన్ శరకాననస్థలిన్. ౧౫౦౦

క. అనలుండు దేవదేవుని-ఘనతేజోరాశిరూపుఁ గాంచిన వీర్యం
బును దన్నివాసమగు శర-వణమున విడువంగ దాని వాయువు వడిగన్. ౧౫౦౧

తే. సగము భాగించి యగణితమగు తన బల
మునను వేర్వేఱుగాఁ జేసి పూన్కితోడఁ
జేర్చె షట్కృత్తికాయోనిసీమలకును
తెలుపు మీఱంగ, నదియును వెలసె మిగుల. ౧౫౦౨

తే. వాయునీతంబు లైన యోనివక్త్రమార్గ-మునను జేరిన శివువీర్యము వెస వారి
జఠరముల శోణితంబును జక్కఁబొంది-మునివరోత్తమ! యత్యంతమును వెలింగె.

చ. అనలునియందుఁ బడ్డ శివునద్భుతవీర్యము స్వర్ణరూపమై
యనుపమకాంతిలో వెలసె, నప్పుడె వహ్ని శరాటవిం ద్యజిం
చిన ఘనవీర్య మిప్పుడుఁ బ్రసిద్ధతమం బయి యెల్లవారికిన్
గనఁబడుచున్న దెంతయును గామితదాయకమై మునీశ్వరా! ౧౫౦౪

ఆ. వాయునీతమయిన వరశివవీర్యభా-గములు మోయలేక, కడు బరువుగఁ
గానఁబడుచు బాధ గల్పింపఁ గృత్తికా-సమితి వదలె నిట్లు సంయమీంద్ర!

మ. విను మాకృత్తికలెల్ల నొక్కటను దద్వీర్యంబు రక్తోక్షితం
బును నై వెల్గుచునున్నదాని వదలన్ బుద్ధిన్ విచారించి గం

గను జేరంజని, కాష్ఠకోశమున శంకర్వీడి వే యుంచి దా
నిని గంగానదియందుఁ బోవిడిచి రున్న్రద్రక్రియాచిత్తులై. ౧౫౦౬

తే. కాష్ఠకోశంబునందు శంకరుని వీర్య-మంతయును గృత్తికాపట్క మప్పు డుంచి
గంగలో వదలుచు నుంటఁ గాంచి బ్రహ్మ-దేవుఁ డా కాష్ఠకోశంబుఁ దెచ్చి వేగ.

చ. అతిశయమోదయుక్తుఁ డయి యాత్మనివేశముఁ జేరి, నిర్మలాం
చితహృదయారవిందుఁడయి, చేకుఱ నిర్జరకార్య మంచు సు
స్థితుఁ డయియుండఁ, గాష్ఠవరకోశమునం దుదయించె నొక్క య
ద్భుతమహిమాస్పదుం డగు న పూరుషుఁ డప్పుడు మానినాయకా! ౧౫౦౭

సీ. పండ్రెండు బాహువు ల్పండ్రెండు నయనంబు లాఱుముఖంబులు నతివిశదము
లై సుప్రసన్నమై భాసిల్లు ముఖపంకజమున నొప్పారెడు చారుమూర్తి
కనకగౌరతనుండు కమనీయనీలోత్పలదళేక్షణుండు సువిలాసయుతుఁడు
నుద్యచ్ఛశాంకసమానప్రకాశుండు మహితప్రభావుండు విహితగుణుఁడు
తే. నైన యాదివ్యపురుషుని నఖిలలోక
సృష్టికర్త గనుంగొని స్పష్టముగను
"నితఁడె దేవికిఁ బుత్త్రుఁడౌ నితఁడె కాష్ఠ
కోశమునఁ బుట్టె" ననుచుఁ దల్లోకేశ మపుడు. ౧౫౦౯

క. భేదించి మునిజనోత్తమ!-యా దేవీసుతుని యద్భుతాకృతిఁ గని వే
యీదగ్రాపూర్ణిమస-మ్మోదంబున శంభునకును బుత్త్రుఁడు పుట్టెన్. ౧౫౧౦

క. నాలోకమందు శంకర-బాలుండు మహాబలుండు ప్రథితయశుఁడు స
చ్ఛీలుఁడు తారకదైత్యో-న్మూలుఁ డౌదవె ననుచు మదిని ముదితుం డగుచున్.

క. అత్యంతవైభవంబున-సత్యభువననాథుఁడైన స్రష్టయు శర్వా
పత్యంబుఁ గాంచి, పెంపున-నిత్యమహోత్సవము సలిపె నిర్జరమానీ! ౧౫౧౨

మ. బలవంతుండు మహాప్రతాపనిధి శర్వాణీసుతుం డుద్భవిం
ప లలిన్ దారకు మూర్ధమందు మిగులన్ భాసిల్లు సత్కుండలో
జ్జ్వలమా రమ్యకిరీట మప్డు ధరణీభాగంబుమీఁదన్ బడెన్
బలసం బొందఁగఁ దన్మహాసురుని చంచత్కాయ మత్యార్తిచేన్. ౧౫౧౩

క. కమలాసను పురమందున-హిమగిరిపుత్త్రికి జనించె సిద్ధగుణుండౌ
కొమరుం డని ముదమందిరి-తమ మదులను సురలు, దిశలు తగ వెలుఁగొందెన్.

ఉ. బాలకుఁ జూచువేడ్క సురపాలుఁడు మున్నుగఁ గల్గు దేవతా
జాలము లంతరంగముల సంతస మెంతయుఁ బొంగఁ బోయి, రు

ద్వేలమహోత్సవంబునను విష్ణుఁడుఁ జూడఁగఁ బోయెఁ బార్వతీ
బాలుని రూపసంపదల భాసిలుచుండెడువాని యున్నతిన్. ౧౯౧౯

తే. పార్వతీదేవిపుత్త్రునిఁ బరమముదము-తోడఁ జూడంగ వేడుకఁ గూడి, యాత్మ
సకలమునినాయకులు వేగ చనిరి సత్య-లోకమున కాసమయమున లోకవిభుఁడు.

మ. మునినాథా! సురలన్ మహామునుల సమ్మోదంబునం గాంచి, యి
ట్లనియెన్ నిర్మలసుప్రసన్నమతియై "యార్యామహాదేవికిం
దనయుం డీ వరబాలకుం, డితనికిం దాత్పర్యయుక్తంబునౌ
ఘననామంబుల మీకుసన్నిధిని నాకాంక్షింతు నేఁ జేర్పఁగన్ ౧౯౧౮

సీ వరకృత్తికాగర్భభవుఁ డౌట నీతండు కార్తికేయుం డన గణనకెక్కు,
సకలలోకములందు శాశ్వతబలుఁడయి శంకరు సుతుఁడు నిశ్శంకుఁ డగుచుఁ
గృత్తికాదులసంఖ్యఁ గీర్తింపఁగాఁ షట్కముగఁ బ్రథితంబయి జగములందు,
నాకారణంబున నలరు నీబాలుం డే షాణ్మాతురుం డను సంజ్ఞతోడ,

తే. శుక్లమును గృత్తికల యొక్క-చోట స్కంది-తంబు గావింప దాన నితండు పుట్టె,
నాకతంబున నీతండు ప్రాకటముగ-స్కందుఁ డనుపేర వెల్గొందు సకలజగతి."

తే. ఈవిధంబున నామంబు లెల్లఁ దెలిపి-సకలదేవతలను గూడి సర్వలోక
వంద్యుఁడగు ధాతమిక్కిలివై భవమున-సత్యలోకంబుననుమహోత్సవము సలిపె.

క. అంతట నమరసమూహం-బెంతయుఁ దమ కష్టవితతి నెఱుకపఱచి, యా
ద్యంతము స్వకార్యసిద్ధిని-జింతించుచుఁ దారకకృతచేష్టాతురులై. ౧౯-౨౦

సీ. పరమేష్ఠిఁ గనుఁగొని పల్కిరి నారదా! త్రిదశు లెల్లరు "దేవ! సృష్టికర్త!
ముల్లోకముల నేలు పూజ్య! యీశంకరతనయుఁ దాహవమునఁ దారకాసు
రునిఁ జంపక యమున్న జననీజనకులకుఁ బరిచయంబును సల్పవలయు, నట్లు
సలుపక యుండిన సరవి శతానంద! నెయ్యంబు మెయి భవానియు భవుండు

తే. తారు భగవంతులగుట స్వాత్మజుని యుద్ధ
మునకుఁ బంపక యనుమతింపని యెడ నిఁక
నేది గతి మాకుఁ జేయంగ, నిపుడె తార
కాఖ్యు రణమునఁ జంపఁగా నగు నితండు. ౧౯-౨౧

క. ఆవల నుమామహేశుల-భావంబున కెఱుకపఱుపవలయు ముదమునన్
బావనమగు నీతని ది-వ్యావిర్భావమును గూర్చినట్టి విషయమున్." ౧౯-౨౨

ఆ. అనుచు బ్రహ్మదేవు నంఘ్రిపద్మంబుల-సన్నిధానమునను విన్నవించి,
రీవిధమునఁ బుట్టె దేవికి జ్యేష్ఠుఁడౌ-నాత్మజుండు నాషడాననుండు." ౧౯-౨౩

క. అని మరలఁ దెల్పఁబూనెను-మునివరుఁడగు నారదునకు ముదమున నపు డా
ఘనుఁడు మహాదేవుం "గో-మునినాయక! బ్రహ్మదేవ పురవరమందున్. ౧౯౨౪

క. పరదేవి పెద్దకొమరుఁడు-నిరతిన్ వసియించె, నపుడు నిర్జరగణముల్
సరసిజసంభవు వీడ్కొని-యరిగిరి స్వస్థానములకు నతిమోదమునన్. ౧౯౨౫

ఉ. తారకదైత్యనాశకుఁ డుదారగుణాఢ్యుఁడు మహాభుజుండు పెం
పారఁగ నీవిధంబునఁ బ్రభావముతోడుత నుద్భవించె వి
స్తారుఁడు కార్తికేయుఁడనఁ దా నుతి గాంచి, సమస్తనిర్జరుల్
గోరిక లూరె నంచు మది కుందుఁ దలంగఁగ నప్డు నారదా! ౧౯౨౬

సీ. పార్వతీపుత్త్రుని వరజన్మకథనంబుఁ దెలుపు నియధ్యాయ మిల నెవారు
పఠియింతురో, భక్తిఁ బఠనంబుఁ జేయింతురో, విందురో, వారి కేవిధమగు
పాపభయంబేని పంచబంగాళమై తొలఁగిపోవును మునితిలక! వినుము
సంతానకాంక్షులౌ జనులు సమాహితులగుచు దీని విన్నచో నతిశయగుణ

తే. కలితులైనట్టి పుత్త్రులు కలుగఁగలరు
పార్వతీసుతుఁ బోలినవారు నిజము,
మౌనినాయక! యిమ్మాట మదిఁ దలంప
వలయును బ్రదిసత్య మనుచు నిశ్చలముగాను." ౧౯౨౭

ముప్పదియొకటవ అధ్యాయము

తారకాసురునిపైకిఁ గుమారస్వామి దండు వెడలుట

ఉ. భావమునందు నారదుఁ డపారముదంబునఁ బొంగి, యమ్మహా
దేవునిఁ గాంచి, భక్తిమెయి "దేవ! దయామయ! పార్వతీసుతుం
డేవిధి సంగరంబున సమిద్ధబలున్, సురసంఘువైరి, దు
ర్భావునిఁ దారకాసురుని బల్మినిఁ జంపె నెఱుంగఁ జెప్పవే. ౧౯౨౮

క. జననీజనకుల నేయను-వునఁ గన్గొని పరిచయంబుఁ బొందెను, శంభుం
డును దేవియు నాత్మజుఁ గనుఁ-గొని యేమియొనర్చి రెఱుఁగఁ గోరెదఁ జెపుమా."

క. అని వినయంబునఁ బ్రార్థన-మును జేయఁగ నారదుఁ గని ముదమున శివుఁ డా
ఘనుఁడు మహాదేవుం డి-ట్లని చెప్పందొడఁగె "నారదా! విను వత్సా! ౧౯౩౦

చ. హిమగిరిరాజపుత్త్రిసుతుఁ డెట్టులఁ దారకదైత్యు యుద్ధరం
గమునను గూల్చి, నిర్జరులఁ గాచినయట్టి చరిత్ర మెల్ల, మో
దము చెలువారఁ దాను దలిదండ్రులఁ గూర్మినిఁ జేరినట్టి వృ
త్తమును వచించువాఁడ, నవధానమునన్ విను తత్త్వ మంతయున్. ౧౯౩౧

ఉ. తారకరాక్షసుండు బెడిదంబగు బాధ నొనర్ప, యాతనా
వారము సైఁపఁజాలక ప్రభావము దక్కి విరించి చెంతకుం
జేరి ప్రణామము ల్సలిపి చిన్నయి నాపరమేష్ఠిఁ గాంచి, బృం
దారకసంఘ మాత్మపరితాపముఁ దెల్పిరి మానినాయకా! ౧౫౩౨

చ. "సతతము మాపయిం బడి విశంకతఁ దారకరాక్షసుండు పె
న్వెతలను ముంచుచుండినను విశ్వవిధాతవు నై యొకింతయున్
మతి మము నెంచ కీక్రియ శమంబును బూని యెఱుంగకుండుటల్
శతధృతి! న్యాయమి తెల్పుదుము సర్వశరణ్య! త్వదీయసన్నిధిన్ ? ౧౫౩౩

ఉ. ఇప్పుడు శంకరాత్మజు నసీనపరాక్రముఁ గార్తికేయునిన్
దప్పక పంపి, యుద్ధమునఁ దారకదైత్యు వధింపఁ జేసి మా
ముప్పుఁ దొలంగఁ జేయుము, ప్రమోదముఁ గూర్పుము మాకు, దేవ! మీ
రిప్పని పూనకున్న సురలెల్లఁ గృశింతురు నిక్కువంబుగన్." ౧౫౩౪

ఉ. నారద! యీక్రియన్ సురలనాథులకై వడి మ్రొక్కి వేఁడఁగా
వారిజసంభవుండు మునివంద్యుఁడు లోకపితామహుండు వి
స్తారకృపాన్వితుం డగుచు సర్వసుపర్వులు చూచుచుండఁగాఁ
దారకుఁ జంపు యత్నమునఁ దా నిటు పల్కెను గార్తికేయుతోన్. ౧౫౩౫

ఉ. "ఓ పరమేశ్వరాత్మజ! మహోత్తమవిక్రమ! విశ్వశాంతి సం
స్థాపనతత్పరుండవు, ప్రశస్తదయాగుణశాలి వౌదు, నీ
ప్రాపున లోకజాలములు రక్షితమై యలరారుఁ, గాన నే
యాపద లొందకుండ దివిజావళిఁ గావుము తున్మి తారకున్ ౧౫౩౬

ఉ. తారకదైత్యబాధల సతంబును బీడితులై మనంబునం
దారయలేక యూఱట మహార్తిఁ గృశించుచునున్న దేవతా
వారము నిన్నుఁ బ్రాపుగొని బాధలఁ బొందకయుండ్రు గాత! మా
తారకదైత్యు దేవసముదాయవిరోధిని గెల్వు మిప్పుడే." ౧౫౩౭

ఆ. అనుచు బ్రహ్మ తెల్ప నా కార్తికేయుండు-పలికె, వినుము మానివర! తెలిపెద,
నిర్జరాగ్రసీమ నిల్చి స్నిగ్ధగభీర-వాక్కులను బలికెను బ్రహ్మతోడ. ౧౫౩౮

మ. "పరమేష్ఠీ! యిదె ఘోరవిక్రముని దేవద్వేషు రక్షోవిభున్
బొరిగొందున్ సమరాంగణంబున బలస్ఫూర్తిన్ వెసన్ జూపి, నా
కిరవౌ వాహన మిప్పు డొక్కటి వడిన్ సృష్టించియి, మ్మార్య! స
త్కరుణానీరధి! యాలసింపకుము, తాత్పర్యంబు నూహింపుమా." ౧౫౩౯

తే. అనఁగ భగవంతుఁడా బ్రహ్మ యపుడ కడఁగి
యా మహాదేవతనయున కతిముదమున
వాయువేగాత్మకము శిఖివాహనంబు
నొసఁగె సురవరు లరయుచు నుండ మౌని! ౧౯౪౦

ఉ. తారకదైత్యుఁ జంపఁగఁ బ్రధానతమంబయి, కోటిసూర్యవి
స్ఫారమహాప్రభన్ సునిశితంబయి, స్వర్ణపరిష్కృతంబు నా
సారతరప్రభావయుతశక్తి నొసంగెను, నట్టి శక్తి యెం
దారసినన్ గనంబడద యద్భుతమై తులలేక నారదా! ౧౯౪౧

తే. అట్టి మహనీయమౌ శక్తి దిట్టతనము
తోడ ధరియించి, శంభుపుత్త్రుండు శక్తి
ధరుఁడు నా లోకములయందుఁ బరఁగు శాశ్వ
తంబయిన నామమునను నో తాపసేంద్ర! ౧౯౪౨

ఉ. అంతఁ బితామహుండు హరునాత్మజు సర్వసుపర్వసేన క
త్యంతము రక్షణార్థముగ నాదృతితోడ నొనర్చి, సంగరం
బెంతయుఁ జేయఁ బంపె, నపు డీశ్వరపుత్త్రుఁడు మ్రొక్కి బ్రహ్మకున్
స్వాంతము పొంగుచుండ శిఖివాహనవర్యము నెక్కి వేడుకన్. ౧౯౪౩

ఉ. భీమపరాక్రమాన్వితుఁడు విశ్రుతతేజుఁడు శంభుపుత్త్రుఁ డు
ద్దామగుణాఢ్యుఁడు శత్రుసముదాయభయంకరమై విరించిచేఁ
బ్రేమ ననుగ్రహింపఁబడి వెల్గుచు నెల్లెడ దీప్తమంతమౌ
నా మహనీయశక్తి తన హస్తమునందు ధరించె నుగ్రుఁడై. ౧౯౪౪

ఆ. అంతఁ ద్రిదశవర్యు లా పార్వతీపుత్త్రు-నగ్రభాగమందు హర్షయుక్తు
లగుచుఁ గొనుచు వెంట నరిగిరి తారకు-పురికి యుద్ధదీక్షఁ బూని నియతి.

ఉ. అట్టి భయదస్వనంబున సురావళు లుద్ధతి యుద్ధదీక్షమై
జతనముతోడ వచ్చుట నిశాచరనాయకుఁడైన తారకుం
డతులితరోషుఁడై విని, మహాబలవంతుల రాక్షసేంద్రసం
తతులను గూడి యత్నమునఁ దా నెసఁగెన్ సమరాభికాంక్షతోన్. ౧౯౪౫

తే. లెక్కపెట్టంగ రానట్టి యుక్కు మిగులు
హయములును గాలరులును గజచయసహస్ర
ములుఁ గొలువ యుద్ధదుర్ధర్షమూర్తి యగుచు,
యుద్ధమునకును సిద్ధమై యుండె నెలమి. ౧౯౪౬

ఉత్సాహ. వరమయూరవాహనంబుపైన నెక్కి యతిభయం
కరమునైన శక్తిఁ బూని కడువడిం గుమారుఁ డు
ద్ధురత సర్వనిర్జరాళితోడఁ గూడిరాఁగ నా
శరవరుండు తారకుండు చక్కఁ జూచె నుక్కునన్. ౧౫౮

సీ. శుద్ధసువర్ణసంశోభితంబును, భీమపంచాస్యవాహావిభాసితంబు,
వివిధవర్ణపతాక నివహభూషితము నౌ రథవర్యమును నెక్కి రాక్షసవరుఁ
డైన తారకుఁడు నేమ్యానంబు కరంబు ఘోరంబగుచు నుండ క్షోణి కదల
సంగరరంగ విశాలస్థలమునకు బయలుదేఱెను నప్డు పరమదారు
తే. ణంబు లయినట్టి దుశ్శకునంబు లంత-నంతఁ దోఁచుచునుండంగ నధికదర్ప
యుక్తుఁడై వాఁడు నిలువక యొక్క-మొగిని-మిన్ను మన్ను నెఱుంగక మేటిగతిని

క. మునివర! యా యుత్పాతము-లను దెల్పెద విను, నభఃస్థలంబున రవిభే
దన మొనరిచి యుల్కలు భూ-మిని వద్రథనికటమున భ్రమింపఁగఁ బడియెన్.

మ. హయరత్నంబుల కండ్లనుండి వడి బాష్పంబుప్రపూరంబు సం
భయదంబై ప్రవహించె యోధగణముల్ భ్రాంతస్థితిం జిత్తమం
తయు నుల్లాసము దక్కఁగా, మలినయుక్తంబైనదై మోద మిం
తయు లేనట్లు నిరుత్సుకత్వమును జెందం గాననయ్యెన్ మునీ! ౧౬౧

క. అతిభయదనిస్వనంబుల-నతిశయముగఁ జేయుచును మహాద్భుతముగ నా
క్షితిపైఁ బడఁజొచ్చెను ఖగ-తతి యోమని చెప్పనగును దారుణరీతిన్. ౧౬౨

చ. భయమును దెల్పు దుశ్శకునవారము నెల్లను దారకుండు గాం
చియు నిటులించుకేనియును జిత్తమునందుఁ దలంక కుద్ధతిన్,
జయమును గోరుచున్ విపులచాపముఁ దాలిచి యుగ్రమూర్తియై,
రయమున శంభుపుత్త్రు, సురరాజుని నొంపఁగఁబోయె నాజికిన్. ౧౬౩

సీ. ఎవ్వాని తల్లి తా నెల్లలోకములకు భగవతియై గిరివర్యపుత్త్రి
నా జననం బంది యతిభయంకరసంగరములందు దైత్యావారమును లీల
నిర్మూలనము చేయు నిశ్చలసామర్థ్యమున నొప్పుచుండు, నెవ్వని తండ్రి
జగములనెల్లను సమయింప వలఁతియై గిరిశుఁ డన్ పేరునఁ గీర్తితుఁడయి
ఆ. వెలయు, నట్టివారి కెలమి పుత్త్రుండయి-శక్తియుక్తుఁడయిన స్కందు నెవఁడు
జగతియందుఁ జెనకి జయము నొందఁగలాఁడు-ధైర్యయుక్తుఁడగుచుఁ దాపసేంద్ర!

ముప్పదిరెండవ అధ్యాయము

కుమార తారకాసుర సంగ్రామము

సీ. వినుము నారదమునీ! భేరీపణవముఖతూర్యనాదంబు లవార్యముగను
నుభయసేనలయందు నురుతరసింహనాదంబులు చెలరేఁగె డంబుమీఱ,
రథచక్రనేమిఘోరరవంబులు నభోంతరాళమునను నిష్ఠురంబులగుచు
నిండె, భూతలమెల్ల నిలువక కంపించె నమ్మహాసంగ్రామయత్నమునను,
తే. నంత యుద్ధము ప్రారంభమయ్యె, నంత-లోన దేవర్షిసంఘంబులు గొలువంగ
నాకసమునందు నద్భుతంబగు రథంబు-నెక్కి విధి యుద్ధమును జూడ నేగుదెంచె

క. అమరులకును దానవులకు-నమితతుములమైన యుద్ధ మతిఘోరంబై
యమరుటఁ గనుఁగొనవచ్చెను-గమలాసనుఁ డటకు మౌనిగణజనవినుతా!

లయగ్రాహి. ఒండొరులఁ జెండుచును భండనము దేవతలు
దండితన మొప్పఁగను జంకులయి రక్షో
మండలముపైఁ గవియ మెండుకొను క్రోధమునఁ
బెండుగొని రాక్షసు లఖండరుషతోడన్
గండు మిగులంగ సురకాండమును నుద్ధతిని
బెండిపడునట్లుగను మెండుకొని ప్రేయన్,
దుండగము మీఱఁగను గొండనుచుఁ గేకలిడు
చుండిరి పరస్పరము బెండువడఁ జేయన్. ౧౧౭

ఉత్సాహ. పాకశాసనుండు ఘోరవజ్రమునను దైత్యులన్
వీఁకఁ జంపఁదొడఁగె నొక్కవ్రేటునకును బెక్కురన్,
దాఁకి బలపరాక్రమాతిదారుణారివీరులన్
బ్రాకటముగ నాజియందు బహుళశక్తియుక్తుఁడై. ౧౧౮

క. ఆవిధముగ వరుణుండును-జేవ మెఱసి పాశమునఁ బ్రసిద్ధభటుల ర
క్షోవీరులఁ గట్టి చంపె మ-హావీరుం డగుచుఁ దనదు నస్త్రముచేతన్. ౧౧౯

తే. త్రిదశవరు లెల్ల రణమునఁ దీవ్రబాణ-ముల ననేకంబులను గొని పూన్కి దనుజ
వీర సైనికనిచయంబు ఘోరముగను-గొట్టి పడవేయసాగిరి క్షోణియందు. ౧౨౦

మత్తకోకిల. కార్తికేయుఁడు యుద్ధరంగ ముఖంబునందున నిల్చి వి
స్ఫూర్తిఁ దారకుతో నెదుర్కొని పోరుచున్ బలవిస్ఫుర
న్మూర్తియై కడు నుక్కుమీఱిన ముఖ్యదైత్యచయంబు న
త్యార్తి మున్గఁగఁ జంపుచుండె మహాద్భుతోత్సుకయుక్తుఁడై. ౧౨౧

ఉ. దేవత లేయు బాణముల తీవ్రత కోడి పరాక్రమాఢ్యు ర
క్షోవరులెల్లఁ ద్రెళ్లి వడిఁ గుప్పలు కుప్పలుగాఁగఁ గూలి రా
రావము చేయుచున్, దొటుగ రక్తము తారకరాజు చెంత నే
రావరమెల్లఁ దీఱుకొను గన్గొన దుర్ఘటమైనరీతిగన్. ౧౫౬౨

ఉ. తేరులు సైంధవంబులు మదించిన యేనుఁగులున్ సురాస్త్ర వి
స్తారహతిన్ వడిన్ గెడసి సంగరరంగమునందు నిండి, దో
స్సారము వీడి త్రెళ్లిన నిశాచరవర్గక[illegible]లన్
జేరి యగమ్యమయ్యెఁ గడు నిష్ఠురమై భువియెల్ల నారదా! ౧౫౬౩

క. మునినాథా! హతులగు దై-త్యనిచయరక్తములు గడు భయంకరరూపం
బున రెండుసేనలకు నడు-మను బ్రవహించెఁ గనరాని మహిమ నెనయుచున్

ఉ. ఈవిధి సైన్యమెల్ల నశియింపఁగఁ దారకరాక్షసుండు దు
ర్భావముతోడ శంకరుని పట్టిని బెల్లుగఁ జుట్టుముట్టి దే
వావళి యాత్మ భీతిలఁగ నత్తఱి నెక్కటి కయ్యముద్ధతిన్
జేవదలిర్పఁ బూని వడిఁ జేయఁగ నారదమౌనిచంద్రమా! ౧౫౬౫

ఉ. వేనకువేలు బాణములు భీతి జనింపఁగఁ దారకుండు బ
ల్పూనికతోడ నేయ హరుపుత్త్రుఁడు నవ్వుచు వానినెల్ల లీ
లానిహతాస్త్రసాధనములన్ ధరఁ దుత్తుమురౌచు రాలఁగా
దానవభర్త గన్గొనఁగఁ దా నొనరించి వెసన్ సరోషుఁడై. ౧౫౬౬

క. గౌరీసుతుఁడు వేసె న-వారితగతి చండబాణపంక్తుల, వడి నా
తారకుఁడు నుగ్గుచేసెను-దా రక్షోగణము పొంగఁ దన నేర్పునకున్. ౧౫౬౭

తే. ఇట్లు లొండొరులును శరవృష్టి మున్ను-చును బ్రతిక్రియ నొనరించుచును వెలింగె,
దేవకిన్నరగణములు ధృతిఁ గలంగి-విస్మయముఁ బొంది రాయుద్ధవిధముఁ గాంచి.

తే. కాలదండనిభంబు బంగారుపుంఖ-ముల విరాజిల్లు నతిఘోరములగు బాణ
నిచయములఁ గ్రోధదీప్తుఁడై నిష్ఠురముగ-నేసి తారకుఁ డాస్కందు గాసిపెట్టె.

చ. కడువడిఁ గార్తికేయుఁడు నికామబలంబున నారిఁ గూర్చి య
ప్పుడ యొక యర్ధచంద్రశరమున్ బరఁగించి నిశాచరాస్త్రముల్
పొడియగునట్లు గొట్టి, కడుఁ బొంగుచు వంగిన గన్బులుండి వే
ర్వడిన దశాంబకంబులను రాక్షసవర్యులపైన వేసినన్. ౧౫౭౦

శా. ఆ బాణాహతిఁ దారకాసురుఁడు మూర్ఛాయత్తుఁడై మిక్కుటం
బౌ బాధం భరియింపఁజాలక, రథంబందున్ వెసన్ దొఁగి య

చేష్టాబద్ధుండయినట్టు లుండి, క్షణ మేచొప్పుం గనఁ లేక మూ
ర్ఛాబాహుళ్యము వీడఁ, దెల్విఁ గని హార్యట్టధ్వనిం జేయుచున్. ౧౫౭౧

తే. లేచి మాటికిమాటికి నేచి సింహ-నాద మొనరించుచును శాంత మేది క్రూర
మై మహౌజస్సు గలయట్టి యాత్మశక్తి-వైచె స్కందునిపై ననివార్యుఁడగుచు.

క. దనుజుని శూలము మెఱయుచు-ఘనబలుఁ డౌ కార్తికేయు కరశూలముచే
తను భస్మంబయి యడఁగెను-మునివర! యద్భుతము చిత్తమున వెస గలుగన్.

ఆ. దానఁ గ్రుద్ధుఁడగుచుఁ దారకాసురుఁడు సె-లవుల దీటుచును బలంబు మెఱసి
యుక్కు గదను బూని యురుగతి స్కందుని-వేసె సురగణంబు బెగడువడఁగ.

శా. భీమంబైన గదాయుధంబు దనపై వేగంబుతో రాఁగ ను
ద్దామంబైన స్వకీయమౌ గదను హస్తంబందునన్ దాల్చి సు
స్థేమం బొప్పఁగఁ గొట్టె స్కందుఁడు, తదియున్ దేజంబుతో ముక్కలై
భూమిం దాఁ బడె, నంతఁ జేతఁ జఱచెన్ బొల్పారి చూర్ణంబుగాన్. ౧౫౭౫

తే. అంత నతిరోషమునఁ దారకాసురుండు-సింహనాదంబు చేయుచుఁ జే మఱొండు
గదను నుద్ధతిఁ బూని యా కార్తికేయు-పైకి నుఱికెను నార్చుచు భయదరీతి.

మ. గద చేతిం గొని మీఁదికిం దుముకు వాక్పారుష్యయుక్తిన్ భయా
స్పదుఁ డౌ తారకరాక్షసాధిపుని చేష్టల్ గాంచి స్కందుండు తా
నదయుండై కడఁకన్ క్షురప్రమున నుద్యద్రీతి నా తారకున్
హృదయంబేదన పుట్టఁ గొట్టెను సురల్ హేలాగతిన్ జూడఁగన్. ౧౫౭౭

తే. ఆ క్షురప్రప్రతాడితుండై మహాసు-రుండు యుద్ధరంగంబున గండుమిగిలి,
ప్రళయకాలంబునందలి జలదము క్రియ-బెట్టుగా నార్చె సురవరుల్ భీతి నొంద.

ముప్పదిమూఁడవ అధ్యాయము

కుమారస్వామి తారకాసురుని వధించుట

తే. అంత యమదండనిభములైనట్టి ఘోర-బాణములు గొని పార్వతీవరతనయుఁడు,
ధ్యాన మొనరించునా ఘోర దానవపతి-బెట్టుగాఁ గొట్టె నసువులు వీడునట్లు.

తే. వాడికోలల వేఁడిమి కోడుగఱచి-రత్నదండముచే భీకరం బగు దృఢ
శక్తి చేనంది వేసెను స్కందుమీఁద-బెట్టిదంబుగఁ గ్రుద్ధుఁడై మిట్టిపడుచు.

క. దేవతలకేని దుస్సహ-మై వెలుఁగుచు శక్తి కడు భయంకరముగ రా
భావంబునందు భీతిలి-దేవత లెల్లరును మూర్ఛఁ దెల్లిరి మౌనీ! ౧౫౮౧

చ. కమలభవుండు స్వస్త్యయనకార్యము దివ్యమహర్షియుక్తుఁడై
సమరమునందు దైత్యకృతశక్తి మహాపదఁ బొందకుండు న
ట్లమలినభక్తితోడ గిరిజాత్మజు రక్షణకై యొనర్చె, హా
సము నొనరించి షణ్ముఖుఁడు స్వప్రథితోత్తమశక్తిఁ బూనికన్. ౧౫౨

చ. కరమునఁ బట్టి, తారకునిఁ గన్గొని, యాతని శక్తిఁ గొట్టన
చ్చెరువుగ భస్మమై సమసెఁ జెచ్చెర నెల్లరుఁ జూడ, స్కందుపై
పరమముదంబుతో నమరవర్యులు వ్యోమమునుండి పొంగుచున్
వరుసగఁ బూలవర్షమనివారితులై కురియించి రెంతయున్. ౧౫౩

సీ. కార్తికేయుని పరాక్రమమును గని సిద్ధగంధర్వు లద్భుతకలితులైరి,
బ్రహ్మదేవుఁడు మదిఁ బరమసంతోషియై షాణ్మాతురుని శక్తి సన్నుతించె,
మునినాథ! తారకు మనమునఁ గ్రోధంబు పెక్కుమడుంగులు వృద్ధిఁబొందె,
నపుడు ఘోరంబగునట్టి చాప ✓ వేగమే కైకొని విపులముగను
తే. సమరదుర్జయుఁడయిన యా స్కందుమీఁద-శరవర్షము గురియించి వరుసఁ గప్పి
తన్మయూరంబు నతిపీడితముగఁ జేసెఁ-దారకుఁడు నారదా! తతదర్పుఁ డగుచు.

సీ. శంభుసుతుండు నిశ్శంకఁ దారకుఁ జేసినట్టి బాణంబుల కన్నిటికి స్వ
కీయబాణంబుల గీటడఁగించి సన్మునిజనసత్తమా! యినసహస్ర
శతసమప్రభుఁడయి యతిశయంబుగ వెల్గుచుండె, నాలోన నాఖండలుండు
రాక్షసశ్రేష్ఠుల నక్షీణబలమున సమయించి స్కందుని సన్నిధికిని
తే. నరుగుదెంచెను, నారదా! యపుడు పార్వ-తీసుతుఁడు చిత్రమైనట్టి దివ్యపర్వ
తోపమంబైన భవ్యమయూరవాహ-నంబుపైనుండి విలసిల్లె దంబుమీఁఆ.

క. మునినాయక! యింద్రుండును-ఘనమగు నైరావతాఖ్యగజముపయిన్ భీ
తిని గొల్పుచు నసురులకున్-గనిపించెను, సమరభూమిఁ గనుఁగొని వారిన్.

ఆ. భీమవిక్రమమున భీకరాకారుఁడై-బాణవర్షమునను బరమశివుని
తనయు నింద్రుఁ గప్పి తపియింపఁ దచ్ఛర-పంక్తిఁ జెండి రథికబలము వెలయ.

క. ఉరుతరవిక్రమవంతులు-సురేశశక్తిధరు లవని క్షోభింపఁగ ను
ద్ధురసింహనాదముల నా-శరవరుఁ దారకునిఁ గలఁచి చయ్యనఁ గడిమిన్.

ఉ. ఘోరతరంబులై వెలయు కోలలఁ దారకుమీఁద నేసి దో
స్సారముఁ ద్రుంగఁజేసి రవిశంకత, నింద్రుఁడు గండుమీఁటి యా
తారకరాక్షసుం గదిసి తా భిదురంబును వైవ ముక్కలై
ధారుణిపైఁ బడెన్ దితిజు దారుణవక్షము దాఁకి యద్దియున్. ౧౫౯

ఉ. అంత ననంతమైన రుష నాశరవర్యుఁడు కన్ను లెఱ్ఱఁగా
నెంతయు మండి ఖడ్గవర మెత్తి కుమారుని [illegible]
డ్చాక్రింతిని బొందున ట్లుఱికెఁ, దక్షణమే కడుఁ గ్రోధయుక్తుఁడై
స్వాంతమునందు శంకరుని పట్టి నితాంతము భీకరాకృతిన్. ౧౯౦

మ. భగవంతుం డగు పార్వతీసుతుఁడు కోపప్రోజ్జ్వలుండై యనం
తగతిన్ గోలి మయూరమాశరునిపైఁ దాఁ ద్రుంచెఁ దక్షఖడ్గయు
క్తకరుప్రోజ్జ్వలహస్తమున్ వడిని, నాదైత్యుండు సవ్యేతరం
బగు హస్తంబున ఘోరమౌ పరిఘ నుద్యద్దీతి శోభిల్లఁగాన్. ౧౯౧

క. సేనానిపైకి దుముకం-గా నప్పుడు బ్రహ్మదత్తఘనశక్తిని బ
ల్మానిక స్కందుఁగు తారక-దానవుపై వైచె నాజి దారుణరీతిన్. ౧౯౨

మ. అతిఘోరంబగు శక్తి నీలగిరితుల్యాకారుఁడౌ తారకు
న్వితతప్రక్రియఁ దాఁక యెంతయును నిర్భిద్రప్రభావంబులో
క్షితి గంపింపఁగఁ జంపె, వాఁ డొరిఁగె సంక్షీణాత్ముఁడై భూమిపై
దితిజుల్ దిక్కులఁ బాఱ మానసము లెంతే భీతిలన్ నారదా! ౧౯౩

ఉత్సాహ. తారకాసురుండు తనదు తనువు వీడ దేవతా
వారమెల్ల నాత్మలందు బహుళమోద మందుచున్
గోరికలు చెలంగఁ బొంగి కూడి యాడి రెంతయున్
నారదా! దిశల్ వెలింగె నవ్యకాంతియుతములై. ౧౯౪

క. దినకరుఁడు విశదతేజం-బున వెలిఁగెను సకలజగము పూర్ణామోదం
బున సుస్థిరమయి వెలసెను-దనుజుఁడు భువిఁ బడినయపుడె తాపసవర్యా!

ముప్పదినాలుగవ అధ్యాయము

కుమారస్వామి తలిదండ్రులకడ కరుగుట

తే. నారదా! విను మంత బృందారకసము-దాయ మద్రిజాపుత్రు నితాంతతృప్తుఁ
గాఁగఁ బూజంచి రప్పుడు గంధపుష్ప-ధూపదీపాదివివిధసంస్తుతులతోడ.

చ. ప్రజలకు నీశ్వరుండయిన బ్రహ్మ ప్రమోదము నంది యాత్మలో
నిజవరహంసవాహన మనిందితదివ్యవిమాన మెక్కి, దై
త్యజయిఁ గుమారు షణ్ముఖునిఁ దద్దయు వేడుక వెంటఁగొంచుఁ దా
ను జనె మహేశు సన్నిధికి నుత్తమునా రజతాద్రిసీమకున్. ౧౯౫

క. శంకరు సమ్ముఖమునకుం-బంకజభవుఁ డపుడు చేరి పరమముదమునన్
గొంకక స్కందునిఁ దోడ్కొని-పొంకంబుగ మాటలాడఁ బూనె మునీంద్రా!

చ. "జగములకెల్లఁ దల్లియయి సర్వసుపర్వగణార్చితాంఘ్రియై
జగముల సన్నుతింగనిన శంభుని రాణి పరాంబ దేవి యీ
సుగుణగణాఢ్య నీజననిసుమ్ము, జగద్విదితుండు శంకరుం
డగు జనకుండు, వీరికిఁ బ్రియాత్మజుఁడై తగు నీవు షణ్ముఖా! ౧౮౯౯

క. చేయుము భక్తినమస్కృతు-లీయుమకు మహేశ్వరునకు, నిటనుండి జగం
బాయతిఁ బాలింపుము ప్రజ్ఞాయుతుఁడవునై జనకుల సన్నిధి స్కందా!"

క. నారద! విను మీరీతిగ-సారసభవుఁ డాగుహునకు జనకులఁ దెల్పం
గోరిక నుమామహేశ్వరు-లారసి మదిఁ దెలిసి రప్పుడాత్మజునిఁ దమిన్.

చ. జనకులకుం బ్రణామములు సల్పెఁ గుమారుఁడు భక్తియుక్తుఁడై,
మనమున దేవి పార్వతి యమందముదన్వితయై వెసన్ దనూ
జునిఁ దన యంకసీమ నిడి, శోభిలుచున్న తదీయరూపమున్
గని, కడు వత్సలత్వమునఁ గాంచెను సంతస మొప్పఁగా మునీ! ౧౯౦౨

చ. మదిఁ గడు సంతసించుచుఁ గుమారుని రాకకుఁ బొంగి యప్పుడే
త్రిదశసమూహముం బిలిచి ప్రీతి దలిర్ప మహోత్సవంబు న
భ్యుదయపు వాంఛఁ జేసె, నట నుత్సుకుఁడై భగవంతుఁడౌ రమా
హృదయవిభుండు శ్రీహరియు నెంతయు వేడుక వచ్చె నారదా! ౧౯౦౩

చ. కనుఁగొనె విష్ణుమూర్తి తమిఁ గ్రమశరీరునిఁ గార్తికేయు దే
వ్యనుపమవత్సలత్వమున కాశ్రయమై వెలుఁగొందువాని శో
భననిఖిలాంగసంయుతునిఁ బార్వతికిం గడుఁగూర్చువాని నో
య్యన మునివర్య! భావమున నాహరి కోరిక మించ నంచెఁ దాన్. ౧౯౦౪

ఉ. ఈ వరబాలకుండు గణియింపఁగరాని సుభాగ్యసంపదన్
దేవికిఁ గూర్చువాఁ డగుచుఁ దేజముమీఱఁ బరాంబయంకమున్
వావిరిఁ జేరి సంతస మపారముగాఁ గనుచున్నవాఁడు, నా
కీవరభాగ్య మెప్డు ఫలియించునో దేవియమోఘసత్కృపన్. ౧౯౦౫

సీ. "ఈ పరదేవికి నేఁ బుత్త్రతను గాంచి స్థిరతరంబైనట్టి పరమముదము
నంతరంగంబున నందుచు దేవిదివ్యాంక మారోహించి యనుపమాన
మైన తదీయభవ్య స్తన్యసుధను నాప్యాయనంబుగఁ గ్రోలునట్టి భాగ్య
మెన్నఁడు కలుగునో, యిష్టార్థసంపూర్తి యెపుడగునో దేవికృప" నటంచుఁ

ఆ. పరమపూరుషుండు భగవంతుఁడగు హరి-తలఁచి తలఁచి వేడ్కఁ దనువు మఱచి
దేవిపాదసన్నిధిని దృఢభక్తి సాష్టాంగవందనముల నాచరించె. ౧౯౦౬

ఉ. భావమునం బరాంబ హరివాంఛ నెఱింగి యపారమౌ కృపన్
దేవవరేణ్యు విష్ణుఁ గని "దైత్యనిషూదన! నీమనోరథం
బే వినినట్టిదానను, దదిచ్ఛ మెయిన్ జనియింతు నీవు వే
నావరపుత్త్రరూపమున, నమ్ము" మటంచును బల్కె నారదా! ౧౬౦౭

ఉ. అంత ముకుందుఁ డీశ్వరుల యాజ్ఞను బొంది స్వకీయమైన శు
ద్ధాంతముఁ జేరఁబోయెఁ, బరమాదృతితోడ నుమామహేశులన్
స్వాంతమునందు నిల్పి కడు సన్నుతిచేసి నమస్కరించి య
త్యంతముదంబు నిండఁగ నిజాలయసీమల కేగి రెల్లరున్. ౧౬౦౮

చ. సమరమునందు బల్మి దివిజవ్రజకంటకుఁడై యఖండవి
క్రమమున మించు తారకుని క్ష్మాస్థలిఁ ద్రెళ్ళఁగ నేసి భీమరూ
పమునను రాక్షసాళివిభవం బడఁగించిన కార్తికేయు న
త్యమిత శుభావహం బయినయట్టి చరిత్రము వేడ్కఁ దెల్పితిన్. ౧౬౦౯

క. తలిదండ్రుల పరిచయముం–గలుగుట షాణ్మాతురునకుఁ గడు విశదముగాఁ
దెలిపినవాఁడనుగద! ని–శ్చలమతి విను మింక మీఁద సంయమిచంద్రా! ౧౬౧౦

చ. జగదధినేతయైన హరి శాంభవికిం బ్రియపుత్త్రుఁడై యనం
తగుణవరిష్ఠుఁడై జగతిఁ దా గణనాథుఁ డటన్న యాఖ్యచే
నెగడి కరీంద్రవక్త్రుఁడయి నిచ్చలు దేవనరప్రపూజ్యతన్
దగి విలసిల్లినట్టి చరితన్, వినిపింతును విన్ము నారదా! ౧౬౧౧

ముప్పది యయిదవ అధ్యాయము

గణపతి జన్మవృత్తాంతము

మ. మునినాథా! యొకనాఁడు శీతగిరిసంభూతం దనుం గూడి శో
భనమౌ భూతలమందునన్ దిరుగఁగా భావించి సద్మంబునం
దున షాణ్మాతురు నుంచి వే యరిగి సంతోషంబునం గాంచె నొ
య్యన రమ్యంబగు కాననంబు బహువృక్షాకీర్ణ మత్యున్నతిన్. ౧౬౧౨

మ. రమణీయంబగు మందిరం బచట నిర్మాణంబుఁ గావించి య
య్యుమతోఁ గూడి వసించె శంకరుఁడు నిత్యోత్సాహియై, మానిస
త్తమ! యిట్లుండఁగ నొక్కనాఁడు నిజసద్మంబందు లోకేశ్వరిన్
రమణిన్ నిల్పి సదాశివుండు ప్రమథవ్రాతంబు సేవింపఁగన్. ౧౬౧౩

క. వనసంభవకుసుమంబుల–ఘనసంతోషంబుతోడఁ గైకొనిరా నే
ర్పనయఁగ నరిగెను, నచ్చటఁ–దన సేవకతతిని గూడి తలిరుల మిగులన్.

తే. సంగ్రహించుచునుండి యచ్చటనె సమయ
మధికముగ దాఁటిపోవుట యంతరంగ
మందుఁ దలఁపఁడు శంకరుఁ డామనోహ
రంబయిన కాననముఁ జూచు సంభ్రమమున. ౧౬౧౫

ఉ. స్నానము చేయు వేడుకఁ దుషారగిరీంద్రతనూజ గౌరి యిం
పైన హరిద్రమున్ మదికి హాయిగ దేహమునిండఁ బూసి యా
లోనఁ దలంచె నెంతయును లోకములం బరిరక్షచేయు నే
ర్పూనిన దేవి స్వీయగృహ మొప్పుగ నెవ్వరు కాతు రంచెదన్. ౧౬౧౬

మ. హరిసంప్రార్థనముం దలంచి యపు డా యద్రీంద్రు సత్పుత్త్రి భా
సురరమ్యస్వశరీరసక్త యగుచున్ శోభిల్లు నాలేపమున్
గర ముప్పొంగుచు హస్తపద్మముల శృంగారంబుగా రాచి యా
పరమైశ్వర్యసమేత పుత్త్రుని జనింపం జేసెఁ జిత్రంబుగన్. ౧౬౧౭

ఆ. పసపుముద్దచేతఁ బార్వతి యతిమహి-మాఢ్య సృష్టిచేసినట్టి పుత్త్రు
రూప మేర్పడంగఁ దాపసినాయకా!-వినుము తెలుపువాఁడ విస్తృతముగ.

మ. విమలుండై యరుణప్రభాకలితుఁడై వెల్గొందుచున్ దివ్యరూ
పము మధ్యందినభానుసన్నిభము నై భాసిల్లఁగా రమ్యవ
క్త్రముతో దీర్ఘబలిష్ఠబాహువులతో రాజిల్లి యత్యంత ది
వ్యమునాఁ బార్వతిపుత్త్రు తేజ మమరెన్ వర్ణ్యంబునై నారదా! ౧౬౧౯

క. పుత్త్రుఁడు లంబోదరుఁడై-నేత్రత్రయయుక్తుఁ డగుచు నెగడుట హిమవ
త్పుత్త్రి మదిని విష్ణుం డీ-చిత్రశరీరుం డటంచుఁ జెలఁగుచు నంతన్. ౧౬౨౦

చ. సకలగణేశ్వరుం డనుచు సంతస మొప్పఁగ నందనున్ మహో
త్సుక యయి యంకమం గనిచి శుద్ధదరస్మితవక్త్రయై యనం
తకరుణతోడ స్తన్యమును దా నొగి నిచ్చి యనంతరూపయై
యకలుషయైన దేవి పరమాంబిక పుత్త్రునిఁ జూచి యిట్లనెన్. ౧౬౨౧

మ. "తనయా! స్నానము చేసివచ్చెదను, స్వాంతంబందునన్ ధైర్యమున్
గొని యంతఃపురరక్షణంబు సలుపన్ బోలున్ గడున్ దక్షతన్,
వినునీ విప్పని చేయఁగావలయు, నే వేగంబ యిచ్చోటికిన్
జనుదెంతున్, నిలు మిందు నాపురమునన్ శ్రద్ధాయుతిన్ సుస్థితిన్." ౧౬౨౨

చ. కొమరున కిట్టు లాజ్ఞ యిడి గోత్రవరాత్మజ దేవి వేడ్కఁ స్నా
నమునకు నింటిలోనికిఁ జనంగ నటన్ బురరక్షసేయుచున్
సుమహితచిత్తుఁడై భువననుత్యుఁడు విష్ణుఁడు పార్వతీసుతుం
డమితబలుండు ద్వారపథమందు వసించెను జాగరూకతన్. ౧౬౨౩

క. ఆసమయంబున శంకరుఁ-డాసక్తిని దివ్యకుసుమహస్తుఁడయి మహో
ల్లాసత వనప్రదేశముఁ-బాసి పురికి వచ్చెఁ, జూచె బాలకు నచటన్. ౧౬౨౪

క. ఈపురరమ్యద్వారం-బేపున రక్షించుచుండు నీబాలుం డే
ప్రాపున విలసిల్లునో యని-లోపలి కడుగిడఁగ నాత్మలో శివుఁ డెంచెన్. ౧౬౨౫

క. శూలంబు నెత్తి దేవీ-బాలుం డాదేవదేవు భవనముఁ జొరఁగాఁ
బోల దనుచు వారించెఁ ద్రి-శూలాయుధపాణి నధికశూరత వెలయన్ ౧౬౨౬

మ. కడునుత్సాహముతోడ దేవిని గనంగా నెంచి పుష్పాళి నే
ర్పడ నేర్పొప్పఁగ సంగ్రహించి భవనద్వార ప్రవేశంబుఁ జె
న్నడిఁ గావించు మహోద్యమంబును వెసన్ వారించు నాబాలు దుం
దుడుకుల్ స్వాత్మను నెంచి మూఁడుకనులం దోరంబుగాఁ గాంచుచున్. ౧౬౨౭

శంకరుఁడు గణపతిపై శూలంబుఁ బ్రయోగించుట

క. దేవీసుతుం డటంచును-భావంబునఁ దెలియలేక పరమశివుఁడు కో
పావిష్టుండయి బాలుని-పై వడి శూలంబు వైచెఁ బటుబల మొప్పన్. ౧౬౨౮

క. శూలం బతిఘోరంబై-చాల వెలుంగుచును బోయి సత్వరమ యుమా
బాలకుని శిరము నిలపైఁ-గూలిచి భస్మంబొనర్చెఁ గొంకక యంతన్. ౧౬౨౯

తే. ప్రాణములఁ బాయఁడయ్యెను పార్వతీకు
మారుఁడు విశీర్షుఁడయ్యును, మన్మథరిపుఁ
డా మహేశ్వరు శూలంబు నాకుమారు
నసువులను హరియింపని దయ్యె నపుడు. ౧౬౩౦

చ. ఇది యిటు లుండఁగాఁ ద్రిభువనేశ్వరి పార్వతి మజ్జనక్రియల్
కొదుకక సల్పి, నెచ్చెలులు కూర్మిమెయిం దను గూడి రాఁగ స
మ్మదమున వచ్చె నచ్చటికిఁ బుత్త్రునిఁ జూడఁగ వేడ్కతోడ, న
య్యదనున శీర్షహీనుఁడయి యాత్మజుఁ డుండుటఁ గాంచె వింతగన్. ౧౬౩౧

చ. మునివర! ద్వారసీమను బ్రమోదముఁ దక్కి శిరోవిహీనుఁడౌ
తనయుని రీతిఁ గాంచి, మదిఁ దాఁ గడు భీతిని బూని, వెంటనే
కనుఁగొని యాదిదేవు నటఁ, గారణ మారయు వేడ్క ప్రశ్నమున్
వినయముతోడఁ జేసె విను, విశ్రుతదివ్యగుణాఢ్య శంభునిన్. ౧౬౩౨

క. "త్రిదశవరోత్తమ! దేవా!-కొదుకక నాసుతుని తలను గొనకొని యిటు బా
డిదగా నొనరించిరొ లో-నదయత నీద్వారసీమయం దెవ రీశా!" ౧౬౩౩

క. అనవుడు శివుండు "పర్వత-తనయా! దేవీ! యెఱుంగఁ దనయుండని నీ
కును వీని, మార్గరోధకుఁ-గను నెంచి శరంబు బాదిగావించితి నే." ౧౬౩౪

శా. అంతం బార్వతి యంతరంగమునఁ గోపావిష్టయై శంభు న
త్యంతక్రోధముతోడఁ జూచి యనియెన్ "ధర్మజ్ఞ! శీఘ్రంబ నా
వంతం దీర్పఁగ మత్కుమారుని తలన్ భద్రంబుగా నిమ్ము, నే
స్వాంతంబందున నోర్వఁజాల" నని విభ్రాంతాత్మయై పల్కఁగన్. ౧౬౩౫

గణపతి గజవక్త్రుం డగుట

సీ. భగవంతుఁడగు శంభుఁ డంబుజ పల్కిన వాక్యమామ్నాయ మాలించి యాక్షణంబ
బయలు దేఱెను దయఁ బ్రియతనూజునకును శిరమును వెదకి తెచ్చి యొసఁగంగ,
నధికమౌ వాంఛతో నవని నన్వేషింప నొక్క కాననసీమ నుత్తరదిశఁ
దలయంపిగా నుంచి తప్పక శయనించు నురుబలాఢ్యం బగు నొక్క కరిని

తే. గాంచి యా దేవదేవుండు కరిశిరంబు
నలుక దోషంబు రా దంచు, న్యాయ్యమంచుఁ
దలఁచి దానిని ఖండించి తలను దెచ్చి,
పుత్రదేహంబునకుఁ బెట్టె ముదితసత్యా! ౧౬౩౬

మ. పరదేవీవరపుత్రుఁ డీతఁడు తగన్ బ్రఖ్యాతుఁడౌ నెప్పుడున్
గరివక్త్రుండు గణేశ్వరుం డన లసత్కల్యాణసంధాయియై
ధర నంచున్ వచియించి శంకరుఁడు తత్తాత్పర్య మూహించి యా
హరియే యంచుఁ దలంచి బాలకుని నత్యంతప్రమోదాత్ముఁడై. ౧౬౩౭

ఉ. అంకమునం గజాననుని నాదృతి నుంచి మహేశ్వరుండు తా
నంకిలి లేని కూర్మి వెలయంగను లాలన మాచరించుచున్
బొంకముతోడఁ బుత్త్రుఁడయి పొల్పెసలారెడు విష్ణు నాత్మలో
శంకగలట్టివాఁడు వలె శాంతమృదూక్తులఁ దృప్తిచేయుచున్. ౧౬౩౮

మ. అపరాధం బొనరించినట్టులు శివుం డాత్మన్ విచారించి ని
ష్కపటత్వంబున మార్దవంబులగు వాక్యప్రక్రియ న్బాపుచున్,
ద్విపవక్త్రుం దనియించి, "నీదు శిరము న్వేత్రుంచి శూలంబుచే
నపరాధిత్వము నొందినాఁడను ప్రియసత్యం బిద్ది నారాయణా! ౧౬౩౯

శా. దేవా! ద్వాపరశేషమందున ధరిత్రిన్ దేవకీగర్భమం
దీవున్ శ్రీవసుదేవసద్మమున నెంతేలీల మూర్త్యంతరం
బావేళన్ ధరియించి పుట్టఁగల, వే నవ్వేళ నీతోడుతన్
గావింపంగలవాఁడ శోణితపురిం గయ్యంబు నారాయణా! ౧౬౪౦

మ. అతిఘోరంబగు సంగరం బొదవు సత్యం బో జగన్నాథ! య
ద్భుత మంచున్ భువనాళి నెల్లరు గనన్ దోడ్తోడ భీమాహవ

క్షితి నీచేత సశూలహస్తుఁడను నై చేష్టావిహీనస్థితిన్
మతిసంభ్రాంతిని స్తంభితుండ నగుదున్ మన్నింపు నారాయణా! ౧౬౪౧

క. సత్యము సత్యం బియ్యది-కృత్యంబగు'' నంచు శివుఁడు గిరిరాజసుతా
పత్యంబగు శ్రీహరి మది-కత్యంతామోద మెసఁగ ననియె మునీంద్రా! ౧౬౪౨

ఉ. అంతట సర్వలోకవిభుఁడైన మహేశ్వరుఁ డావనంబునం
దెంతయు సంతసంబున మహేశ్వరిఁ బార్వతిఁ గూడి తృప్తి న
త్యంతము గొన్నిమాసములు తా వసియించి సుఖస్థితిన్ ఘన
స్వాంతముతోడ జ్యేష్ఠసుతు స్కందునిఁ గాంచఁగఁబోయె నారదా! ౧౬౪౩

తే. తారకాసూదనుండు కుమారుఁ డుండు
పురికిఁ బార్వతితో గజముఖునితోడఁ
జేరి సంప్రీతహృదయుఁడై శివుఁడు ముదము
నను వసించె సుతద్వయమును నరయుచు. ౧౬౪౪

సీ. బ్రహ్మస్వరూపిణి పరమేశ్వరి మహేశుఁ గనుఁగొని పలికె ''నాక్కతతి మనము
కైలాసమునయందుఁ గాశీపురంబున వాసంబుచేయుద మాసతోడ,
నింతియకాక యింకెందు మనోహరస్థలములు గలవొ, యా స్థలములందు
నిచ్ఛావిహారంబు లెంతయుఁ గావించి వత్తము మరల నిప్పట్టణమున''
తే. కనుచుఁ బల్కుచు నా దేవి యాదిదేవు
తోడ, నిర్వురు పుత్రులతోడఁ గదలి
ప్రమథగణములు వెంటరాఁ బ్రమదమునను
గోర్కె దీఱంగ విహరించె క్షోణియందు. ౧౬౪౫

క. లీలావినోదములలోఁ-దేలుచు శంకరునిఁ గూడి ధృతి హిమగిరిపై
కైలాసంబున నెంతయు-నా లోకేశ్వరి వసించె నతిహర్షమునన్. ౧౬౪౬

చ. మునివర! నారదా! మదికి మోదముఁ గూర్పఁగ నీవు ప్రశ్నచే
సిన విషయంబు నంతయు నశేషముగా వినిపించినాఁడ, నా
య్యన జగదాద్యయౌ ప్రకృతి యా శివుఁ బెండిలియాట యాదిగాఁ
గను భువనప్రశస్తమగు గాథ ప్రపంచశుభంబుఁ గోరుచున్. ౧౬౪౭

ఉ. ఈ మహనీయమౌ చరిత నెవ్వఁడు భక్తిఁ బఠించు వానికిన్
గామితము ల్మహేశ్వరి యఖండదయన్ ఘటియించు, బ్రహ్మరు
ద్రామరముఖ్యులైనఁ గననట్టి యనుగ్రహ మొంది యెల్లెడన్
దా మహిమం జెలంగు మునితల్లజ! యియ్యది సత్య మెంతయున్. ౧౬౪౮

ఆ. ఈచరిత్రంబుఁ బఠియించు నిల నెవండు-వానికిని యుద్ధమందునఁ బ్రబలులైన సు
దుర్జయులు నైనయట్టి శత్రువులుగూడ-వరుస నశియింపఁగలరు తాపసవరేణ్య!

ఉత్సాహ. పరమభక్తిసహితుఁ డగుచుఁ బార్థివుండు రాముఁ డీ
శ్వరి నసమయమందు నిరతి వార్షికప్రపూజనం
బిరవుమీఱ నాచరించె హృదయమందు రాక్షసే
శ్వరుని రావణుని వధింపఁ బరమమానిచంద్రమా! ౧౬౦

సీ. కృష్ణపక్షాష్టమి నీశ్వరి శ్రద్ధ నెమ్మది నిల్పి యీగాథ నుదితభక్తిఁ
బ్రారంభ మొనరించి వరుసతోడ మహానవమి వచ్చుదాఁక దినముదినంబుఁ
బఠియించువానికి బహుకష్టసాధ్యంబులైన కార్యములెల్ల నాదిదేవి
తన యనుగ్రహముచేతను ఘటింపఁగఁ జేయు, సత్యమిమ్మాట యోసంయమీంద్ర!
తే. యాత్మలో నెంచి యీరీతి నాచరించి-సంగరాంగణమున లోకశత్రుఁ డగుచు,
దేవదుర్జయుఁ డయినట్టి రావణాసు-రుని జయించెను శ్రీరామజనవిభుండు.

క. కావున నేవాఁడేనియు-నీవిభవాస్పదచరిత్ర మెవ్వఁడు భక్తిం
గావించుఁ బఠన, మాతఁడు-భావింపుము సత్యముగను వైరుల గెలుచున్.

సీ. ఈచరిత్రము పఠియించినవా రశ్వమేధఫలం బంది మిగుల సంత
సంబున దేవలోకంబున సుఖముగా వసియింపఁగలవారు వరమునీంద్ర!
భక్తితో దేవీప్రభావయుక్తంబగు నీచరిత్రము విను నెవఁడు, వాని
కగు ఫలంబు వచింతు, నతిశయపుణ్యంబుఁ గీర్తియు వెలయఁగా క్షితిఁ జెలంగు,
తే. వానిఁ జేరంగఁ జాలక పఱచు సింహ
పుండరీకాదిభీకరములగు జంతు
సంతతులు దూరముననుండి సాధ్వసమునఁ
గనుఁగొని చూడలేకయే మునివరేణ్య! ౧౬౩

తే. వినుము దేవీచరిత్రంబు వినినవాఁడు-పుత్రపౌత్రాదులను గూడి భువిఁ జిరంబు
భద్రములఁ బొంది తుది నపవర్గసుఖము-నందు దేవీసమీపంబునందు వేడ్క.

క. చెప్పంగ నేల పలుమా?-త్రిప్పావనచరిత వినిన నెవ్వఁగల కోర్కుల్
తప్పక ఫలించు, నిజ మిది,-తప్పదు, దేవీవరంబె తాపసముఖ్యా! ౧౬౪

సీ. దేవీమహిమఁ దెల్పు దివ్యచరిత్రంబుఁ బఠియించువారికి, వరుస వినిన
వారికి నీశ్వరి ప్రత్యక్షమగు, దేవి సుప్రసన్నాత్మయై యప్రమేయ
ఫలము నొసంగఁగాఁగలదు, దానిఁ దలంప నలవియే కల్పకోటులు శతంబు
లైన నా కోముని! యభివర్ణనముసేయ?-సత్య మియ్యది సుమ్ము, శంక వలదు,

తే. పరమవైభవయుక్తమై పరఁగు నాప
రేశ్వరీదివ్యచరితంబు హృదయమున ర
హస్యముగ నుంపఁదగియున్న దనుచుఁ దెలిసి,
యిది ప్రచారంబు చేయరా దెందయినను. ౧౬౫౬

క. మునినాథా! యీచరితం-బును సామాన్యునకుఁ దెల్పఁ బోలదు, లోకం
బున దివ్యభక్తికలితున-కును నుపదేశింపవలయుఁ గోరికమీఱన్. ౧౬౫౭

చ. నిరుపమభక్తియుక్తుఁడవు నీవు, పరాత్పరపాదచింతనో
ద్ధురమతి, వౌట నీచరితఁ దోరపుఁగూర్మిని దెల్పినాఁడ, ని
ర్జరవరపూజ్యపాద! మునిసత్తమ! యియ్యది భక్తిహీనులౌ
నరులకు నేనియున్, సురగణంబులకేనియుఁ దెల్పకుండుమా! ౧౬౫౮

శా. లోకారాధ్యచరిత్ర! నారదమునీ! లుబ్ధక్రియాదూర! య
స్తోకప్రాభవ! నిర్మలాత్మ! సురసంస్తుత్యార్హ! సత్యవ్రతా!
నీకుం దెల్పఁగరాని విద్య యొకఁడేనిన్ లేదు లోకంబునన్,
బ్రాకట్యంబుగ నెద్ది కోరినను జెప్పంబూనితిన్ గోరవే." ౧౬౫౯

వ. వ్యాసుండు శౌనకాదుల కిట్లనియె. ౧౬౬౦

చ. "త్రిదశవరేణ్యుఁడై యెసఁగు దేవుఁడు శంకరుఁ డిట్టు లాత్మలోఁ
బొదలఁగ సంతసంబు మునిపూజ్యుని నారదుఁ గాంచి పల్కఁగా
మదిఁ గడుభక్తితోఁ ద్రిదశమాన్యపదాంబుజుఁ బంచవక్త్రు నా
రదముని మ్రొక్కి యాక్రియఁ దిరంబగు కౌతుకముబ్బుచుండఁగన్. ౧౬౬౧

మ. పరదేవీచరితంబు నెంతయును దా భావించి యాలింపఁగాఁ
గర ముత్కంఠఁ బూని యప్పుడు జగత్కల్యాణసంధాత్రియౌ
పరదేవీవరపూజనం బఖిలసంప్రార్థ్యంబు నత్యున్నతం
బరయన్ వేడుక యయ్యెడున్ వినఁగ" నం చాదేవదేవుం దమిన్. ౧౬౬౨

సీ. సురవరసముదయక్షోభకుండగు రావణాసురు బాంధవామాత్యపుత్ర
సహితంబుగాఁగను సమరభూమిని జంపె శ్రీరాముఁడే పూజ చేసి భక్తి,
భూలోకమున మానవులు స్వర్గపురమున దేవగణంబులు దేవతాధి
పతులు, బ్రహ్మాదులు, పరమమునీంద్రులు నేపూజ గావించి యెపుడు నియతి

తే. వాంఛితంబులఁ బొందుచు భావమందు
నమితసంతోషమున నుండు, రట్టిపూజ
నమును విస్తృతముగఁ దెల్పు మమితకరుణా''
నని మహాదేవు నర్థించె వినయమునను. ౧౬౬౩

సకలలోక విశాల యశస్వినీ!-ప్రకటితామర భాగ్యమనస్వినీ!
చకితరాక్షస సంఘ తరస్వినీ!-సుకృత సంశ్రిత శుద్ధపయస్వినీ! ౧౬౬౪

గద్యము

ఇది శ్రీలలితాత్రిపురసుందరీ కరుణాకటాక్షవీక్షణ సమాసాదితోభయభాషాకవితావిభవ, జనమంచి వంశప్రభవ, కాశ్యపసగోత్రోద్భవ, సుబ్బయార్యతనూభవ, కావ్యపురాణతీర్థ విద్వద్బిరుదవైభవ వేంకటసుబ్రహ్మణ్యశర్మ విరచితకృతులయందు శ్రీమహాభాగవత పురాణమునఁ దృతీయాంశము

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీ మహా భాగవతము

చతుర్థాంశము

ముప్పదియాఱవ అధ్యాయము

క. శ్రీగురువాంఛాపూర్ణా!-సారసజన్మాది దివిజచయ సంపూర్ణా!
కారుణ్యగుణసుపూర్ణా!-తారాధిప విమలకీర్తి ధామోదీర్ణా! ౧౬౬౫

భగవతీ నారాయణ సంవాదము-మహాపూజావిధానము

ఉ. నారదమౌని శంకరు ననన్యగుణాకరుఁ గాంచి యిట్లనెన్
గోరికమీఱ "దేవ! కడుఁ గూర్మిని దేవి కతిప్రియంబు వి
స్తారగుణాకరంబు శుభసంతతిదాయక మిష్టకామ్యదం
బౌరయ శారదీయమగునట్టి పరాత్పరపూజ యం చెదన్. ౧౬౬౬

శ్రీరాముఁడు దేవీపూజ చేసిన విధము ప్రశ్నించుట

తే. మున్ను దెల్పితి వామహాపూజ వార్షి
కం బనుచు, నా మహాపూజఁ గరము భక్తి
రఘుకులాన్వయచంద్రుఁడు రామభద్రుఁ
డాచరించె నటంచు మహానుభావ! ౧౬౬౭

క. రావణునిఁ జంప రాముఁడు-దేవీపూజనము సల్పెఁ దిరమగు భక్తిన్
భూవలయమున నటంచును-దేవా! తెల్పితది, యెవ్విధినిఁ జేయఁబడెన్?

క. సర్వజ్ఞ! విస్తృతంబుగ-సర్వము దయతోడఁ దెలిపి సంతసమును నో
యుర్వీశ! కలుగఁజేయు మ-ఖర్వగతిన్ దేవదేవ! కరుణాసాంద్రా! ౧౬౬౯

శా. దేవా! యాభగవంతుఁ డేక్రియ భువిన్ దివ్యాకృతిన్ మాని స
ద్భావం బొప్పఁగ మానవాకృతిని జేపట్టెన్ త్రిలోకేశ్వరిన్,
సేవించెన్ దమిఁ బూజనాదివిధులన్, సిద్ధింప వాంఛాతతుల్
ప్రావీణ్యంబున విస్తృతంబుగను దెల్పం గోరుదున్ భక్తితోన్. ౧౬౭౦

క. నిను శరణాఁజొచ్చినాఁడను,-గనుమా సేవకుని నన్నుఁ, గరుణింపుము, పా
వనునిగ నొనర్పు మభవా!-వినయంబున నతులొనర్చి వేఁడుదు దేవా!

క. లోకత్రితయమునందున-నీకు సమానులు గలారె నెమకిన శ్రితవాం
ఛాకలితులయిన భక్తులు-ప్రాకటముగ ననుచుఁ గొలుచువాఁడ మహేశా!"

క. అనుచు వినయంబుతోఁ దుత-మునివరుఁడగు నారదుండు పూన్కి నడుగ నె
మ్మనమున సంతృప్తుండై-ఘనుఁడు మహాదేవుఁడు పలుకంగఁ దొడంగెన్.

ఉ. "నారద! తొల్లి దేవిచరణంబులఁ బ్రార్థన మాచరించి వి
స్తార పరాక్రమాతిశయతన్ దశకంధరుఁడైన రావణుం
డేరికిఁ బొందరాని దగు నీ భువనత్రయ రాజ్యసంపదన్
గోరికమీఱఁ బొందెను నకుంఠితమా తదనుగ్రహంబునన్. ౧౬౨౪

ఉ. రావణు దివ్యభక్తికి, నిరంతరసేవకు మెచ్చి యిచ్చలో
దేవి గడుం బ్రసన్నయయి దివ్యమహాద్భుతశక్తి నిచ్చి సం
భావనచేసి తత్పురనివాసము చేసెను వేడ్కతోడ, వాం
ఛావళిఁ గూర్చుచున్ సతత మాదనుజేంద్రున కెల్లభంగులన్. ౧౬౨౫

ఉ. సంతత తృప్తితోడుతను శాంభవి, యోగినులెల్ల వెంట న
త్యంతముదంబునన్ వెలయ నా దనుజేంద్రుని పట్టణంబునం
దంతయు నుండి, తా జయము నిచ్చుచుఁ దత్కృత దివ్యపుణ్యకా
లాంతముదాఁక నిత్యమును నన్నివిధంబుల వేడ్కమీఱఁగన్ ౧౬౨౬

చ. పరమమునీంద్ర! రావణుఁడు భవ్యతపఃఫలమైన పుణ్య మీ
ధరను నశింప లోకములఁ దా వడి బాధలఁ బెట్టసాగె, నా
సరణియె కారణంబుగఁ బ్రచండతరాకృతిఁ జండికాఖ్యవి
స్ఫురణముతోఁ దదీయపురముం ద్యజియించి పరాంబ యెంతయున్. ౧౬౨౭

క. శ్రీరామచంద్రపూజిత-యై యపు రావణుని బాంధవామాత్యయుతున్
ఘోరవిధిఁ జంపి తన పరి-వారముతో దేవి రజత వరగిరిఁ జేరెన్. ౧౬౨౮

చ. వినుము మునీంద్ర! రావణుఁడు విక్రమ మొప్పఁగ మున్ను నాత్మ దు
ర్వినయము మీఱ లోకముల విశ్రుతరీతిని నాక్రమించి దృ
ప్తిని సురసంఘమున్ గెలిచి తేఁకువ విశ్వవిభున్ హరిన్ మనం
బున నొక లెక్కసేయకయ ముజ్జగముల్ దపియింపఁ జేయుడున్. ౧౬౨౯

ఉ. వాని భయంబునన్ సురలు వైభవహీనత యజ్ఞభాగముల్
గానక మానినాయక! యఖండమనోవ్యథఁ గుందుచుండి, రె
చ్చో నరయంగ యజ్ఞములు చూడ్కికినిం గఱవయ్యె, మానులున్
దీనతఁ జేయ మాని రొగి దివ్యతపఃక్రతు దేవపూజలన్. ౧౬౩౦

సీ. రాక్షసరాజైన రావణాసురుని భయంబున మునులెల్ల నదరుచుండి,
రనుదినంబును దద్భయాకులుండయి నిర్జరేశుండు కానుకల నిచ్చి వాని
సదనుగ్రహమునకై సమ్ముఖంబున నిల్చి సేవించుచుండు ఋషిప్రపూజ్య!
దిక్పాలకులు తక్కు దేవతాగణములు చంద్రసూర్యులు సాధ్యసముదయములు
తే. వాని యాజ్ఞకు లోఁబడి ద్వారసీమ-నిలిచి యా క్రూరదానవనేత చెప్పి
నట్లు చేయుచుఁ దత్ప్రసాదాభిలాషు-లగుచు నుండిరి, విను మంత నార్యవర్య!

సురలు బ్రహ్మను బ్రార్థించుట

ఉ. అంతట రావణాసురుని యత్యధికంబగు బాధ మున్ని యొ
క్కొంతయు సంతసంబుఁ గన కెల్లసురల్ దమ నాయకుల్ మహీ
కాంతయు వెంట రా నొకటఁ గాంచనగర్భుని సన్నిధాన మ
త్యంతభయార్తులై దఱిసి ప్రాంజలులై నుతియించి రోమునీ! ౧౬౧౨

తే. "లోకనాయక! దేవ! త్రిలోకపూజ్య!
సృష్టికార్యజ్ఞ! విను మీ యశేషజగతి
బలపరాక్రమ గర్వితుఁడై బాధచేయు
చున్నవాఁడు పౌలస్త్యుని సుతుఁడు ఘనుఁడు. ౧౬౧౩

సీ. ఆ రావణుని బాధ లంతరంగంబున సహియింపఁజాలము సరసిజభవ!
వాని భారము భూమి భరియింపఁజాలక భవదంతికమునకు వచ్చియున్న,
దాదురాత్ముని రావణాసురు వధియింపఁ దగు నుపాయంబును దలఁపవయ్య!
యార్తులమగు మమ్ము నరసి రక్షింపుము, భూదేవిఁ గాపాడఁ బూను మాత్మ"
తే. ననుచుఁ ద్రిదశులు నుతియింప నబ్జజుండు
బ్రహ్మదేవుండు భూదేవిఁ బరమకృపను
నూఱడించి, తా వైకుంఠంబు నొగినిఁ జేరి,
విష్ణుదేవునిఁ గని యిట్లు విన్నవించె. ౧౬౧౪

బ్రహ్మ సురలతోఁ గూడి విష్ణుదేవుని వినుతించుట

ఉ. "దేవ! త్రిలోకనాథ! జగతీపరిపాలన తత్పరా! ప్రభూ!
రావణనామ దైత్యుఁడు పరాక్రమధుర్యుఁడు లంకలోపలన్
దేవ వెలుంగఁ బుట్టి దశశీర్షము లొప్పఁగ లోకవారమున్
వావిరి బాధచేయుచు నవారితుఁడై మెసలాడు నెంతయున్. ౧౬౧౫

ఉ. వానిని జంపి లోకము లభంగురతన్ నిలుపంగ నీ వొగిన్
మానవదేహముం గొని యమానుష విక్రమ మొప్పఁ జంపఁగాఁ
బూనుము తత్సుతప్రకరమున్ వడి బంధుయుతంబుగా హరీ!
మానుగ సంహరింపు మతిమానుషచర్య వెలుంగ నెంతయున్. ౧౬౧౬

తే. విశ్వనాయక! పతితలల్ వెలయు దుష్ట
దైత్యు నతిదుష్టుఁ బుత్త్రబాంధవయుతముగఁ
జంపి మముఁ గావవయ్య! విశ్రాంతి నొసఁగి
దేవకంటకుఁ గ్రూరాత్ము దేవవినుత!" ౧౬౮౭

క. మునివర! యీ విధముగఁ బ్రా-ర్థనము సురగావింప నజుఁడు దయమీఱఁ జెడు చూ
డ్కిని గాంచి విష్ణుదేవుం-డనూనమతియైన సరసిజాసను, మఱియున్. ౧౬౮౮

క. రావణరాక్షసబాధితు-లౌ విబుధుల నెల్ల నతిశయప్రీతిని సం
భావించి యూఱడించుచుఁ-బ్రావీణ్యము మెఱయఁ బల్కెఁ బరమమునీంద్రా!

ఉ. "దేవతలార! యో శతధృతీ! భవదీయ మనోరథంబు పెం
పావహిలంగ నే దశరథావనినాథునకున్ సుతుండనై
భూవలయంబునం జననమున్ దమిఁ బొంది, సపుత్త్రబాంధవున్
రావణు దుష్టుఁ జంపెదను, రంజిలుఁడీ మదులందు నెంతయున్. ౧౬౯౦

మ. వినుఁడీ తెల్పెద మీర లెల్ల విబుధు! విశ్వంభరా భారమో
చనముం జేయ జనింపఁగానగును విశ్వంబందు సాహాయ్య మే
పునఁ జేయంగను ఋక్షవానరముఖంబు లొప్పని, బల్పొనికన్
గనుఁడీ, యియ్యది ముఖ్యకార్యము, వినం గాంక్షింతు యత్నంబునన్. ౧౬౯౧

చ. సరసిజసంభవా! వినుము చక్కని యోజన చేసి చేయఁగా
నురవగునట్టి కార్య మొక డున్నది, దుష్కరమైన దద్ది, నీ
వరయుము దాని నేర్పున మహాసురు రావణు దుష్టచిత్తు సం
గరమునఁ జంపఁబూనుటకుఁగా నెది యుక్తమొ నెమ్మనంబునన్. ౧౬౯౨

సీ. ఆ దురాత్ముండైన యసురవరేణ్యుండు రావణుం డతిభక్తిభావముననను
బూజించుచున్నాఁడు భువనత్రయములకుఁ దల్లియౌ పరదేవి ధ్యాననియతి,
నాజగన్మాత కాత్యాయనీ దేవియు వాని పూజల మెచ్చి మానసమున
సతతంబు జయము బ్రసాదించుచున్నదై లంకాపురమున నిశ్శంకతోడ
తే. యోగినీగణములఁ గూడి యురుముదమున
వాసమును జేయుచున్నది బ్రహ్మదేవ!
యపరిమితతృప్తి నొందుచు నాపరాంబ,
వాని సద్భక్తి నెన్నఁగా వశమె నాకు? ౧౬౯౩

ఉ. ఆ పరదేవి యీశ్వరి శుభావహయై యెపు డెంతయుం గృపన్
నాపయి సుప్రసన్నత మనంబున నుంపఁగఁ గోర్కెఁ బూని లం
కాపురమున్ ద్యజించునొ, నికామసమర్థత నష్టు లోకసం
తాపకు రావణుం దునిమెదన్, నిజ మియ్యది పంకజాసనా! ౧౬౯౪

తే. దేవి నాయెడఁ గరుణార్ద్ర దృష్టిఁ జూడ-దేని, లంకానివాసంబు మాన దేని
రావణు వధింప దక్షత నేవిధమునఁ-బొందఁ జాలను, యోజింపు భువనకర్త!

ఆ. ఏది చేయనగునో యెఱిఁగి, దానిని గూర్ప-వలయు నీవె దీన వారిజభవ!
దేవి సుప్రసన్న భావంబుఁ బొందక-శత్రు గెలువ నాకు శక్తి లేదు. ౧౯౬

సీ. అల్పబలుం డయ్యు నతిపరాక్రమవంతుఁడై మహిమాఢ్యుఁడై యతిశయిల్లె,
నాజగన్మాత నిత్యానుకూలత నుండునట్టి కాలంబు కాఁబట్టి వాఁడు,
జగముల నెల్లను సమయించినను నిప్పుడే ప్రతిక్రియ చేయ నే సమర్థుఁ
డను గాను విశ్వపాలన కార్యదక్షత గలవాఁడ నయ్యు నో కమలజన్మ!
తే. వాని నెప్పుడు దేవి కోపమునఁ గాంచి
తత్పురంబును త్యజియించుఁ దగిన సమయ
మురవడింపఁగ మన కంచు నుల్లమందుఁ
దెలిసి కృత్యంబు నెఱవేర్పఁ దలఁపవలయు ౧౯౭

చ. జగముల నెల్ల నేలఁగల శక్తని గల్గియు నాకు దేవిసత్కృపా
భిగమము లేకయున్న బలవీర్యము లెల్లను నిష్ఫలంబులై
తగినవి కాకయుండు, శుభదాయిని దేవియె నానుకూలయై
మొగి విలసిల్లునేని బలముల్ పెనుపొందును వారిజోద్భవా!" ౧౯౮

చ. అనవుడు బ్రహ్మ యిట్లనియె "నౌ, నది సత్యము లోకనాథ! యె
వ్వని హృది నంబికాచరణ పద్మము లెంతయు భక్తి నిల్చునో,
కన ఖలుఁడైన వాఁడు త్రిజగంబుల నే సమయంబునందు నై
నను వధియింపఁగాఁబడఁడు, నాశన మెన్నఁడు లేదు వానికిన్. ౧౯౯

క. కాలమున సృష్టిచేయును,-గాలముననె పాలనంబుఁ గావించు జగ
త్పాలక! దేవికి మదిని న-కాలమున లయేచ్ఛ పుట్టఁగాఁబోదు హరీ! ౨౦౦

క. నీవు, మహేశుఁడు చూడం-గా వాస్తవమున నిమిత్తకలితులె దేవా!
దేవియె సృష్టిస్థితి లయ-భావములకుఁ గారణంబు పరమాత్మ! హరీ! ౨౦౧

క. మన మెల్లరమును విబుధులు-విన మూర్త్యంతరముల మఱు వెలయుదుము జనా
ర్దన! ద్వేషించిన మనలను-గని యెప్పుడు దేవి కరుణఁ గాపాడ దొగిన్."

క. ఈవిధమునఁ గమలాసనుఁ-డావనజ దళాయతాక్షు నంఘ్రియుగ సమీ
పావస్థితుఁడై పలుకఁగ-శ్రీవిభుఁడును బ్రహ్మ కిట్లు చెప్పె మునీంద్రా! ౨౦౩

క. "పరమేష్ఠీ! రజతాచల-వర శిఖరంబునకుఁ బోయి వడి నీవును శాం
బరమేశ్వరి దుష్టాత్ముని-బరిమార్పఁగ వినుతిచేయువాఁడను భక్తిన్. ౨౦౪

క. పౌలస్త్యసుతుఁ డా రావణుఁ - డాలిఁ ద్రిభువనప్రచండుఁ డాహవమున నా
ర్లీల వధియింప శాంకరి - నోలిన్ భజియించువాఁడ నో పరమేష్ఠీ!" ౧౭౦౬

క. విను మవ్వలి వృత్తాంతం" - బనుచు మహాదేవుఁ డధిక హర్షంబున న
మ్మునివరుఁ డగు నారదునకు - వినిపింపందొడఁగె, "నంత విష్ణుఁడు విధియున్.

బ్రహ్మయు, విష్ణుమూర్తియు దేవీనివాసంబున కరిగి వినుతించుట

చ. స్థిరమగు సంతసంబునను శీతగిరీంద్రుని పుత్త్రి దేవియున్
సురవరపూజ్యపాదుఁడయి శోభిలు శంకరుఁడున్ వసింతు రే
యిరవున లోకవందిత మహేశ్వరి యుండు నో యట్టిదా మనో
హర రజతాద్రికిం జనిరి యాత్మలఁ బొంగుచు సత్వరంబునన్. ౧౭౦౭

ఉ. వారల రాకఁ గాంచి, సురవంద్యపదాంబుజుఁడైన శంభుఁ డిం
పారఁగ గారవించుచును నర్ఘ్యముఁ బాద్యము నిచ్చి యవ్వలన్
గోరిక మీఱ సంతసము గొల్పఁగ నారలు వచ్చినట్టిదా
కారణముం దమిం దెలుపఁగా నగు నం చడిగెన్ మునీశ్వరా! ౧౭౦౮

చ. హరియు విరించియున్ భవుని యాదృతి కెంతయుఁ బొంగి యాత్మలన్
ద్వరితముగాఁగ శంకరుని వాక్యము విన్న యనుక్షణంబ, యా
శరవర చేష్టితంబులను సత్క్రియయున్ దగ విన్నవించి రా
తురు లగుచున్ మహేశ్వరునితో సకలంబును తాపసోత్తమా! ౧౭౦౯

ఉ. అంతట శంకరుండు, హరి, యంబుజగర్భుఁడుఁ గూడి వేడ్కన
త్యంతముదావహాత్ములయి యా హిమవద్గిరిరాజపుత్త్రి శు
ద్ధాంతముఁ గూర్చి వే వెడలి ధన్యతమంబగు విశ్వరక్షణ
స్వాంతగృహంబుఁ జేరిరి, శుభప్రదఁ బార్వతిఁ గాంచి రో మునీ! ౧౭౧౦

తే. సుప్రసన్నముఖాబ్జయై శోభిలు పర - దేవిసన్నిధి భక్తితోఁ ద్రిదశవరులు,
బ్రహ్మవిష్ణుమహేశ్వరుల్ వరుస దండ - వత్ప్రణామ మొనర్చిరి వసుధ ననఘ!

సీ. అష్టాదశమహాభుజాఢ్యయు, రమణీయహారవిరాజత్కుచాభిరామ,
పూర్ణేందుసుందరముఖవికాసాన్విత, ధృతచంద్రఖండశోభితకిరీట,
కుందమందస్మితసుందరానన, త్రిలోచనకమనీయదశన, సుగాత్రి,
పరదేవి యంబిక వరరత్నసింహాసనాసీన యగుచు బ్రహ్మాదిసురవ

తే. రేణ్యులను గాంచి, యాత్మలోఁ బ్రీతి వెలయఁ,
గొంత తడ వూరకయ యుండ క్షోణిమీఁద
నుండి భగవంతుఁడైన విష్ణుండు లేచి
భక్తిపులకితతనుఁడయి ప్రాంజలియయి. ౧౭౧౨

క. జగదంబను బరమేశ్వరి-నగణితగుణాగణ్య నప్పు డభినుతియించెన్
''నిగమాంత వేద్య! శ్రితజన-సుగమనిజపదాబ్జయుగ్మశోభిత! దేవీ! ౧౭౧౩

తే. జనని! పౌలస్త్యతనయుండు దనుజనాథుఁ-డైన రావణుఁ డుద్ధతి నఖిలభువన
ములనుబాధించుచున్నాఁడుపూర్ణమగుత్వ-దీయదివ్యప్రసాదాతిదృప్తుఁ డగుచు.

చ. ఖలుఁడగు రావణాసురుఁడు కాఱియ పెట్టఁగ నోర్వలేక యీ
సలిలజజన్ము సన్నిధికి సర్వసుపర్వులు పోయి రక్షణం
బలవడఁజేయు మంచు శరణార్థులు నై నుతియింప, బ్రహ్మయు
మ్ముల నసురేన్ వధింప నను బ్రోపరి యంచును జేరె నంబరో! ౧౭౧౪

ఉ. కోరికతోడ నన్నుఁ బురికొల్పుచు స్రష్ట ''మహానుభావ! యీ
ధారణి మానవాకృతిని దాల్చి జనింపుము, వాని నొంచి భూ
భారముఁ దీర్పుమా'' యనుచుఁ బల్మఱు వేఁడఁగ, మంచిదంచు నా
సారసగర్భుతోఁ బలికి సాంత్వన మే నొనరించితిన్ వడిన్. ౧౭౧౫

సీ. ఆమాట దక్కింప నవని దాశరథి నై యవతరించి దురాత్ముఁ డైన రావ
ణాసురు వధియింప యత్నింతు నోయంబ! యొక విన్నపము దయ నుల్లమందు
నవధరింపుము, వాఁ డహర్నిశంబును నిన్నుఁ బూజించుచున్నాఁడు భూరిభక్తి,
సేవించుచున్నాఁడు స్థిరతరంబగు శ్రద్ధ భగవంతుఁ బరమాత్ముఁ బరమశివుని,

తే. దల్లి! నీవును నత్యంతదయను వాని-రక్షణము చేయునట్టి కారణముఁ బూని,
సకలలోకైకవంచితా! సంతతంబు-దత్పురి వసించుచున్నావు తమి చెలంగ.

ఉ. నీవు, మహేశ్వరుండు ఖలునిన్ దనుజేశ్వరు రావణున్ బ్రియం
బావహిలంగ రక్షణము నాదృతిఁ జేయుచు నుండ, నేను యు
ద్ధావని లోకకంటకు వధార్థము యత్న మొనర్తు నెట్లు? వాఁ
డేవిధిఁ జచ్చు నమ్మ! త్రిదశేశ్వరి! తెల్పుము నా శరంబులన్. ౧౭౧౮

క. నీవే లంకేశ్వరివై-రావణుఁ గాపాడుచుండ రణమున నే నే
భావంబుఁ బూనవలయును-వే వర మిమ్మమ్మ! నిన్ను వేఁడెద భక్తిన్.

తే. సకలజగముల రక్షింప సంతతంబు
నీవె యాధారమవు మాకు, నెదఁ దలంప
వమ్మ! తెలుపుము కృత్యంబు నంతెయును, ద్వ
దంఘ్రులకు మ్రొక్కువాఁడ నోయంబ! భక్తి.'' ౧౭౨౦

పరదేవి రావణవధోపాయమును తెల్పుట

క. అని వినయంబునఁ బల్కఁగ-విని మాహేశ్వరి వచించె ''విష్ణూ! మధుసూ
దన! రావణాసురుఁడు భక్తిని ననుఁ బూజించె, దానఁ దృప్తిని గనుచున్.

చ. మఱి గడుఁ బొంగి వానికిఁ బ్రమాదము గల్గకయుండ రక్షగాం
బొదవఁగ లంకలోననె మహోత్సుకతన్ నివసించుచుండ, న
భ్యుదయముఁ గోరి రావణుఁడు పూజల నన్నిటు తృప్తిచేసె న
మ్మదిఁ, నటు పూజసేసె శివు మానస మెంతయు సంతసింపఁగన్. ౧౭౨౨

చ. అతిశయభక్తితోడ నను, నా పరమేశ్వరుఁ దృప్తిచేసి యం
చితమగు సంపదం గని యశేషజగంబుల మేటి యయ్యె, నే
వితమునఁ జూడ వానికి నభీప్సితవస్తువు దుర్లభంబునా
వెతకినవైన లేదు పృథివీస్థలి నెచ్చటనైన శ్రీహరీ! ౧౭౨౩

క. నిండినవి కోర్కె లన్నియు,-నిండెఁ దపఃఫలము పూర్ణనియతిని, వాఁడున్
మెండగు సంతోషంబున, నఖండజయంబును నెసంగెఁగాఁ గడు వెలయున్.

ఉ. ఇప్పుడు వాఁడు చిత్తమున నెంతయు శూరత గర్వియై నెసన్
ముప్పును బొందఁగోరి జగముల్ సచరాచరము ల్వడంక బ
ల్రిప్పులఁ బెట్టుచున్ బలము తెంపును జూపుచు నున్నవాఁ, డికన్
దప్పక స్వాత్మనాశనము దానవనాథుఁడు గాంచు శ్రీపతీ! ౧౭౨౪

ఉ. వాని వినాశమున్ మదిని భావనచేయుచు నున్నదాన, నే
దేని నిమిత్త మబ్బినపుడే మొగి వాని వధింతుఁగాని, నే
నే నిఖలప్రయత్నముల నేర్పడఁ జేసి ఖలున్ వధింపఁగా
నూనుట కాత్మ యొప్పదు, సదుద్యమ మయ్యది గాదు చూడఁగన్. ౧౭౨౫

తే. బ్రహ్మదేవుండు ప్రియముతోఁ బలికినట్టి
యుక్తి యెంతయు సూక్తమై యొప్పుఁగాన,
వాని వధియింపఁ బుట్టుము మానవతను
ధారివై, యేను దోడ్పడుదాన నీకు. ౧౭౨౬

ఉ. భూతలమందు మానుషతఁ బొంది జనింపఁగ నీవు వేడ్క న
త్యాతతశక్తి నాదయిన యంశమునం దగు లక్ష్మియున్ భవ
త్ప్రీతిగ మానుషంబయిన దేహముఁ దాల్చి జనించు, రావణుం
డాతనుమధ్య లోభమున నారసి వే కొనిపోవు దుర్మతిన్. ౧౭౨౭

మ. బలనంతంబునఁ గామమోహితుఁడునై పద్మాక్షి నాయంశచే
నిల జన్మించిన శ్రీసతీమణిని దా నెంతే మనోజక్రియా
కులుఁడై వేగమె లంకఁ జేర్చు, మదిఁ గోర్కెన్ దేవదేవాజ్ఞ నా
ఖలునిం ద్రుంపఁగ లంక నే వదలుదున్ గంజాక్ష! నిక్కంబుగన్. ౧౭౨౮

క. నామూర్త్యంతరమును లక్ష్మీమానిని బరభవించు చిత్తంబెపు డా
కాముకుఁడు తలఁచు నాక్రుధచే మహి నశియించువాఁడు, స్థిర మిద్ది హరీ!

సీ. పరమదుష్టాత్ము రావణుని వధింపంగ మానసంబున నెంచి నేను వాని
లంకాపురంబు నిశ్శంకతో నదలుదు మధుసూదనా! వాఁడు భ్రమందు నిజము,
ధర సూర్యవంశమందు రఘుకులంబున మానుషత్వంబును బూని యవత
రించిన బ్రహ్మకుఁ బ్రియసుతుండు వసిష్ఠమౌని సంప్రీతిని మంత్రవరము
తే. నీకు నుపదేశ మొనరించు నిక్కముగ, సు
గోప్యమగు దానిఁ దలఁపుము కోర్కె సంగ
రాంగణంబున నాత్మరక్షార్థమునను,
రావణు వధార్థమునను నీ భావమందు. ౧౭౩౧

ఉ. ఆ మహనీయమంత్రవరి మాత్మఁ దలంచినయంతఁ దచ్ఛర
స్తోమ మదెంత దారుణతఁ దోఁచిననేని, యొకప్పుడేని నీ
కేమియు బాధ లేదు, నిజ మియ్యది, నమ్ముము నెమ్మనంబునం
దో మధుసూదనా! తలఁపు ముల్లమునందున భక్తితో ననున్. ౧౭౩౨

చ. శరములు రావణుం డడరి సాధ్వస మందఁగ వేగుచుండ నా
స్మరణ మొనర్పు మీ వపుకు మానసమందున, నను గెల్పు సు
స్థిరముగఁ గల్గు, దుష్టజనశిక్షకుఁ బూనిన నేను క్రూరసం
హరణము చేయుదాన నని యాత్మ నెఱుంగవె శ్రీరమాపతీ! ౧౭౩౩

తే. దాఁటఁగారాని సంద్రంబు దాఁటి లీల-వానరసమూహమును గూడి దానవపుర
మైన లంకాపురము నిశ్చయంబుగాను-జేరుదువు మత్ప్రసాదంబుచే ముకుంద!

సీ. బ్రహ్మోపదేశంబుఁ బాటించి శాస్త్రోక్తసరణి శరదృతుసమయమునను
సాగరతీరభూస్థలి మృణ్మయంబగుప్రతిమను గావించి భద్రముగను
వేదోక్తరీతి సద్విధియుక్తముగ నన్ను బూజచేయుము దృఢబుద్ధితోడ,
స్వర్ణపరిష్కృతిస్యందనంబున నుండి దుర్ధర్షుఁడైన యా దుష్ట రావ
తే. ణాసురునిఁ గ్రిందఁ బడఁద్రోసి యసువు లూడ్చి-వాని పుత్త్రులఁ బౌత్త్రుల బాంధవులను
జంపి లంకావిజయి వను సద్యశంబుఁ-గాంచఁజాలుదు నా యనుగ్రహముకలిమి.

ఉ నీమదిఁ గోర్కె నింక ధరణిన్ జనియించి మనుష్యదేహివై
యీమహి సత్వరంబున నహీనపరాక్రమశాలివై హరీ!
యో మధుసూదనా! ఖలుని నద్ధతు రాక్షసరాజు రావణున్
నేమముతో వధించుటకు నిశ్చలతన్ గను" మంచుఁ దెల్పఁగన్. ౧౭౩౬

వ. పరదేవితో భగవంతుఁడగు హరి యిట్లనియె. ౧౭౩౭

క. "జననీ! నీయెడ వానికి-ననుపమ దృఢభక్తి యున్న, దాతఁడు నిన్నున్
మనమునఁ గడు నిష్ఠను దలఁ-చును సతత మచంచలతను జొక్కి పరాంబా!

క. కరుణాస్వరూప వనఁగను-వరయశమున భువనమందుఁ బరఁగిన నీ వే
కరణిఁ ద్యజింతువు లంకా-పురమును? నా కిపుడు తెలుపుము జగజ్జననీ!

క. అతిసంకటసమయమునం-దతులితదుర్ధర్షుఁడైన యారావణుఁ డం
చితభక్తిఁ దలఁచు నిను, నే-వితమున వధియింతు వాని? వే తెలుపఁదగున్.

ఉ. ఎవ్వరు లోకమందు స్మరియింతురు నిన్నద, వారి నెంతయున్
మవ్వపు వత్సలత్వమున మాత! శివుండును నేను ధర్ముఁడున్
గవ్వుచు నున్న యాపదల గాటపు బాణములన్ ధరించి దా
దవ్వులఁ బోవఁ ద్రోలి సతతంబును బ్రోచుచు నుందు మమ్మరో! ౧౭౪౧

ఉ. దేవి! నిరంతరంబును మతిన్ గడుభక్తి స్మరించువాని నె
ట్లీవు రణోర్వియందు వధియింతువు రావణుఁ? దెల్పవమ్మ! నే
నేవిధి నీదు భక్తవరు నెంతయు రక్షణపాత్రుఁగాఁగ మ
ద్భావమునందు నెంచకయ పట్టి వధింపఁగ నేర్తు నీశ్వరీ!'' ౧౭౪౨

చ. హరి యిటు ప్రశ్నచేయ వినయంబునఁ బార్వతి యాలకించి సా
దరమధురోక్తులం బలికె దైత్యవినాశకు విష్ణుఁ గాంచి ''యో
వరభుజ! సత్య మెంతయును బల్కితి, రావణుఁ డాజి నాత్మ నన్
స్మరణముచేయునట్లయినఁ జావు న దేక్రియ నొందుఁ దెల్పెదన్. ౧౭౪౩

చ. విను మతిభక్తి సర్వమగు విశ్వము నాయది, నేను విశ్వరూ
పనని యెఱుంగు దివు, ఖలభావుఁడు రావణుఁ, డాత్మ నెంచ కే
ఘనవిధి విశ్వమంతయును గాఱియపెట్టుచునున్నవాఁడు, గా
వున నను గాసిపెట్టినటు బుద్ధిఁ దలంతును శ్రీరమాపతీ! ౧౭౪౪

చ. జగముల బాధపెట్టుచును స్వాంతమునందు నన్ స్మరించినన్
మొగిఁ గడు భక్తిఁ, గష్టముల మున్గిన కాలమునందునైన వాఁ
డగడుపడున్ సుఖంబుఁ గనఁ డైహికమందునఁ, బారలౌకికం
బగు సుఖసంతతు ల్పడయ నర్హుఁడె యౌను ముకుంద! కేశవా! ౧౭౪౫

ఉ. భావమునందు నించుకయు బాధ యొనర్పక లోకజాలమున్
సేవయొనర్చి బ్రోచుచును జిత్తమునందు ననుం దలంచినన్
వావిరి వాని నెయ్యెడలఁ బాలనసేయుదు నిందు నందు సం
భావన కర్హుఁ జేతుఁ దమి వారిజనాభ! శుభంబు లిచ్చెదన్. ౧౭౪౬

ఉ. మీరును నట్టివానికి నమిత్రులుగాక సతంబు రక్షణం
బారసి చేయఁబూనవలె, నట్టిఁడు సర్వశుభంబు లొంది యీ
ధారణి నిష్టభోగములఁ దత్పరతన్ సుఖియించి యంత ని
చ్ఛారతి దుర్లభంబయిన శాశ్వతమోక్షము నొందు శ్రీహరీ! ౧౭౪౭

ఉ. రావణుఁ డీప్రపంచమును రంజిల నేలక బాధపెట్టెడిన్
గావర మెత్తి, వాఁడు భయకంపితుఁడై నను సంస్మరించినన్
-జేవ యడంగ యుద్ధభువిఁ జెందుఁజుమీ విపరీతమౌ ఫలం,
బేవిధినైన మోక్షమునె యెంతయుఁ బొందు ననంతకాలమున్. ౧౬౪౮

క. ఇంతకు మించిన దేది యొ-కింతయయినఁ గానరాదు హృది దేహుల, క
త్యంతఫలప్రదమగునది-చింతించిన నెట్టి నియతిఁ జెందినయేనిన్. ౧౬౪౯

చ. పరమదురాత్ముఁడున్ భువనపాతకి రావణుఁ డేను లంకలో
నిరవుగ నున్నకాలమున హీనతనుండయి మృత్యువక్త్రగ
హ్వరమున కేఁగఁజాలఁ, డిది సత్యము, సత్యము, గాన వేగ త
త్పురముఁ ద్యజించుదాన సురపూజ్య! శుభస్థితి నెంచి శ్రీధరా! ౧౬౫౦

మ. సమరక్షోణిని వానిఁ గాచుటకు నే స్వాంతంబునం బూన, వి
శ్వముఁ బీడించుచు నున్నవాఁ డనుచు మెచ్చ న్వాని కృత్యంబు, శ్రీ
రమణీనాథ! మహేశ్వరాంఘ్రులను సంప్రార్థించి భూరక్షణం
బె మదిం గోరుచుఁ బొమ్ము పుట్టుటకునై యాక్షోణి మర్త్యాకృతిన్." ౧౬౫౧

ముప్పదియేడవ అధ్యాయము

శ్రీరామచరిత్రము

వ. మహాదేవుండు నారదున కిట్లని చెప్పందొడంగె. ౧౬౫౨

ఉ. "నారద! దేవి యీవిధమునం దెలుపంగ నుపాయ మాదృతిన్
శ్రీరమణీవిభుండు విని చిత్తమునం దతిభక్తి పూర్ణవి
స్ఫారితలోచనాబ్జుఁ డయి సాగిలి మ్రొక్కుచు మాటిమాటికిన్
గారవ మొప్ప శంకరునిఁ, గంజజుఁ గాంచి వచించె నెమ్మితోన్. ౧౬౫౩

తే. "దేవదేవ! జగన్నాథ! దేవి పల్కి-
నట్టి వాక్కులఁ దమి మీర లాలకించి
యున్నవారలు, సన్నిధి నుండి విశద
మునను సంపూర్ణముగ నంతయును బ్రియమున. ౧౬౫౪

శా. దేవా! యీశ్వర! రావణాసురుని నుద్దీప్తావలేపున్ మృతిన్
గావింపంగను నాకుఁ దోడ్పడుట కేకార్యంబు నూహించితో
వే విశ్వేశ్వర! తెల్పు మియ్యెడ మదిం బ్రీతిన్ వహింపంగ స
ద్భావం బొప్పఁ గృపామయాత్మ! వినఁగన్ బ్రార్థింతు సద్భక్తితోన్." ౧౬౫౫

ఉ. నావుడు శంభుఁ డిట్లనె "జనార్దన! వానరరూపుఁ బూని నే
నావసుధన్ సమీరునకు నర్మిలిపుత్త్రుఁడనై జనించి దు
ర్భావుని రావణుం దునుమ బాసటనై తగురీతి నుండు, నో
శ్రీవనితామనోరమణ! చిత్తమునందున విశ్వసింపుమా! ౧౭౫౬

మ. అతిఘోరంబగు నబ్ధి దాఁటి భవదీయప్రేయసిం జూచి వ
చ్చి, తమిన్ నీమది నుల్లసిల్లునటు లే శీఘ్రంబ కావింతు న
ద్భుతరీతిన్ మధుసూదనా! సతము పెంపున్ శక్తి దీపింప, స
మ్మతితో నిమ్మెడ నాలకింపు, మిఁక సంభావింపు నీకార్యమున్. ౧౭౫౭

క. భువనత్రయమున సృష్టి మయి-మివులం దారుణాయు నయిన మేటిజతన మొం
డవలీల జరపుమను నీ-కవిరతసంతోష మొసఁగ నార్యా! వినుమా! ౧౭౫౮

క. అతిసూక్ష్మమైన కీశా-కృతితోనే లంకఁ జేరఁ గృత మెఱిఁగి మహా
మతి లంకేశ్వరి లంకను-జతనముతో వదలిపెట్టు సత్యముగ హరీ! ౧౭౫౯

ఆ. ఇంతకంటె గొప్ప దేది కార్యంబున్న?-దే నొనర్చ నాయ మెఱుకపఱచి
నాఁడ బ్రహ్మదేవునకు, నీకుఁ బ్రీతిగాఁ-జేయుచున్న పనివి శ్రీరమేశ!" ౧౭౬౦

చ. మునివర! నారదా! శివుఁడు పూర్ణముదంబునఁ జెల్పినట్టి య
య్యనువగు వాక్యజాలమును నాదృతి మీఱఁగ నాలకించి, యొ
య్యనఁ జతురాననున్ మదిని హర్షము మీఱఁగఁ జూచె శ్రీనికే
తనుఁడు, తదీయభావమును దా నెద నెంచి విరించి యిట్లనెన్. ౧౭౬౧

శా. "ఓనారాయణ! యోనిరామయ! నిజాంశోత్పత్తి భల్లూకవం
శానం గాంచితిఁ దొల్లి బల్మియును దక్షత్వంబును న్మించఁగా
నే నీ కెప్పుడు ముఖ్యమంత్రినయి యెంతే భద్రము ల్గూర్చి స
మ్మానంబుం బ్రియమారఁ జేయుదును, సంభావింపు నా వాక్యముల్. ౧౭౬౨

మ. దురితాత్ముండగు రావణాసురునకుం దోఁబుట్టువై ధర్ముఁడున్
స్థిరధర్మావనయత్న మొప్పఁగ మదిం జింతించి లంకాపురిన్
గరుణాభూషణభూషితుం డగుచు జన్మంబెత్తియున్నాఁడు, వాఁ
డురుసాహాయ్య మొనర్పఁగాఁగలఁడు సుమ్మా శ్రీహరీ! యచ్చటన్. ౧౭౬౩

క. స్థావరజంగమయుతమగు-నీవిశ్వంబును భరింప నెడసేయక యో
దేవా! మానవతను సం-భావింపుము, బ్రోవఁ బొమ్ము వరయత్నమునన్."

క. నారద! యీవిధమున నా-శారీరమగుండు, మఱియుఁ గమలాసనుఁడున్
శ్రీరమణీప్రియునకుఁ బ్రియ-మారఁగ బాసటగ నిలువ ననుమతి యొసఁగన్.

క. భగవంతుఁడైన శ్రీహరి-యగణితమహిమాఢ్య దేవి నతిశయభక్తిన్
మొగి వినుతించి దయాత్తం-బగు తత్సమ్మతిని గాంచి యధికముదమునన్.

ఉ. భూతలమందు సూర్యకులభూషణుఁడై వరభక్తుఁడై శ్రిత
త్రాణయు నైన యా దశరథక్షితిపాలకునింటఁ బుట్టి వి
ఖ్యాతి చెలంగ నొక్కఁడయి యంతట నిండిన శ్రీరమేశ్వరుం
డాతతి నాల్గురూపముల నజ్జననాథుఁడు పొంగుమండఁగన్. ౧౭౬౭

మ. అనఘా! రాముఁడు లక్ష్మణుండు భరతుం డామీఁద శత్రుఘ్నుఁడన్
ఘననామంబులతోడ శ్రీహరి జగత్కల్యాణముం గోరి శో
భనసౌందర్యసురూపము ల్పొసఁగ శశ్వత్ప్రీతియుక్తాత్ముఁడై
మనుజాకారములన్ భజించె భువి సమ్మానింపఁగా నిచ్చలున్. ౧౭౬౮

క. బలవంతులు దూర్వాశ్యా-మలకోమలవర్ణు లగుచు మహి వెలసిరి వా
రలలోన రామలక్ష్మణు-లలఘుమహిమఁ జెలఁగువార లగుచు మునీంద్రా!

క. వినుము పదార్వన్నియ మిం-చిన కనకముఁ బోలు వన్నెఁ జెలఁగుచు భరతుం
డును శత్రుఘ్నుండును నో-మునివర! యసమానవిక్రములు నై రెందున్.

తే. బాల్యముననుండి శ్రీరామభద్రుతోడ
లక్షణాన్వితుఁడైనట్టి లక్ష్మణుండు
జతగఁ జరియించు భరతుని జతయగుచును
గూడి శత్రుఘ్నుఁడు చరించుఁ గూర్మి మెఱయ. ౧౭౭౧

మ. జనకక్ష్మాపతిదివ్యమందిరమునన్ జన్మించె శ్రీకాంత శో
భనమా రూపముతోడఁ గన్యయయి సంభావింప శృంగారరే
ఖను భూలోకమునందుఁ దద్విమలసత్కాంతిం బ్రశంసింపఁగా
మనుజు ల్దేవతలున్ సతంబు త్రిజగన్మాత్రాఖ్యయై యెంతయున్. ౧౭౭౨

క. ధరణిన్ జాంబవతుం డనఁ-బరఁగుచు జన్మించె బుద్ధిబలసంయుతుఁడై
పరమేష్ఠియుఁ దాఁ జెప్పిన-కరణిని దనయంశ భల్లుకపుఁబుట్టువునన్. ౧౭౭౩

మ. తన యంశంబున శంకరుండును మరుత్సంజాతుఁడై ధాత్రిపై
ఘనుఁడై విక్రమసంపదన్ మెఱయుచున్ గంభీరుఁడై ఋశ్యమూ
కనగంబందున నుండెఁ గీశపతికిన్ గార్యంబుల న్మంత్రియై
హనుమంతుం డనుపేర వెల్గుచు జగత్ఖ్యాతిన్ బలప్రౌఢుఁడై. ౧౭౭౪

క. ఈవిధమునఁ బుట్టెను ద్రిద-శావళి భల్లూకవానరాకృతుల భువిన్,
వావిరి విష్ణ్వాగమమును-భావించుచుఁ గాననముల వసియించె నొగిన్. ౧౭౭౫

ముప్పదియెనిమిదవ అధ్యాయము

విశ్వామిత్రుడు శ్రీరామున కస్త్రము లొసఁగుట

క. వినుమా నారద! రాముని-కును లక్ష్మణునకును భరతునకు నతిశౌర్యం
బున వెలయునట్టి శత్రు-ఘ్నునకు వసిష్ఠమునివిభుఁడు కోవిదుఁ డెలమిన్.

శా. దేవీమంత్రము సక్రమంబుగను నాదేశించి దీక్షాయుతు
ల్గా విద్యాభ్యసనం బొనర్ప, నవలీలన్ సర్వశాస్త్రంబులం
బ్రావీణ్యంబును బొంది వారలు జగత్ప్రఖ్యాతులై పొల్చి రెం
తే విజ్ఞానము మీఱఁగా దశరథుం డిచ్ఛన్ ముదం బందఁగన్. ౧౨౨౨

తే. అంత నొకనాఁడు కౌశికుం డటకు వచ్చి-మఖము రక్షింప రామలక్ష్మణుల దశర
థావనీశునిఁ బ్రార్థించి, యాదృతిమెయి-వెంటఁ దోడ్కొనిపోయె నా వీరవరుల.

ఉ. వార లరణ్యమందు ననివారితగాత్రతఁ జనుచుండ విక్రమో
దారత ఘోరరూపయగు తాటకి యుద్ధమురాఁగ దానినిన్
గ్రూరశరాహతిం దునిమెఁ గో యని భూస్థలిఁ గూల రాముఁ, డిం
పారఁగ మౌని మోదమునఁ బల్మఱు మెచ్చఁగ నిచ్చనిచ్చలున్. ౧౨౨౪

క. రాముని వరశౌర్యము వి-శ్వామిత్రుఁడు చూచి మెచ్చి సకలాస్త్రములన్
బ్రేమమున నొసఁగె, వానిని-రాముండు గ్రహించెఁ దమిఁ గరంబు వినతుఁడై.

చ. మునివర! రామచంద్రుఁ డతిపూర్ణముదంబున మౌనివెంట నా
ఘనవిపినంబునందుఁ జని, కౌశికు నాశ్రమసీమఁ జేరి, యొ
య్యన మఖవిఘ్నముల్ సలుపునట్టి నిశాచరు సుబాహునామకున్
దనుజుని నొక్కబాణమునఁ దా వడిఁ గూల్చె మహాబలాఢ్యుఁడై. ౧౨౫౧

తే. సమరదుర్ధర్షు మారీచు సాగరమునఁ
బడునటులు కొట్టెను మఱొక్క బాణమునను,
రామభద్రుండు తనదు శౌర్యంబు మెఱయ
మునివరుఁడు సంతసింప నమ్మఖమునందు. ౧౨౫౨

ఉ. అంతటఁ గౌశికుండు దన యజ్ఞము పూర్తిగఁ జేసె సంతసం
బెంతయు నంతరంగమున హెచ్చఁగ, లక్ష్మణుఁ గూడి రాఘవుం
డంత మునీంద్రుతోడఁ జనె నమ్మిథిలానగరంబుఁ గూర్చి య
త్యంతకుతూహలంబునను నారయు వేడుకతోడ నారదా! ౧౨౫౩

క. శతధృతిపుత్త్రియు, గౌతము-సతియును నై తగు నహల్యశాపముఁ దీర్పన్
మతిఁ బూని రాఘవుఁడు సం-తతమోద మహల్యమదికిఁ దగ నొనరించెన్.

ఉ. ఆవల మైథిలీశు పురి కారఘురాముఁడు చేరఁబోయి, స
ద్భావుఁడు, దోర్బలాఢ్యుఁడు ప్రభావము మీఱ విదేహభూపసం
భావనఁ బొందుచున్న పరభర్గశరాసన మత్యుదగ్రమున్
జేవ వెలుంగ భంజనము చేసెను నారదమౌనిసత్తమా! ౧౭౮౫

సీతాకల్యాణము

ఉ. రాముని శౌర్యమున్ జనకరాజు గనుంగొని తృప్తిఁబొంది యెం
తే మది వృద్ధుఁడౌ దశరథేశు సపుత్త్రకు గారవంబునన్
బ్రేముడిఁ బిల్వనంపి, తగురీతి మహోత్సవ మాచరించి, యు
ద్దామపరాక్రమాన్వితులఁ దత్సుతులం గని యింపు పెంపునన్. ౧౭౮౬

సీ. శ్రీరామునకు నిచ్చె సీతను, లక్ష్మణునకు నూర్మిళ నొసంగెఁ, బ్రకటితముగఁ
బ్రమదంబు నిండాగ భరతునకును మాండవి యను కన్యకఁ గూర్చె విశదరీతి,
శౌర్యసమేతుఁడౌ శత్రుఘ్నునకుఁ బ్రీతి శ్రుతకీర్తి యను వరసుత నొసంగె,
మునినాథ! యియ్యనువునను నల్వురఁ బుత్త్రికల దశరథుని పుత్త్రులకు సంత
తే సంబునను పెండ్లి గావించి జనకరాజు-తగిన మర్యాద నొనరించె దశరథునకుఁ
బెంపు మీఱంగ జనులెల్ల వితతమోద-మందుచుండ మహాభ్యుదయమున ననఘ!

తే. వారిలో సీత ప్రఖ్యాతివైభవాఢ్య-యజ్ఞభూమిని దున్నంగ నందు దొరకి
నట్టి మహనీయ వరసుగుణాభిరామ-రామునకుఁ బత్నియై యొప్పె నోమునీంద్ర!

క. తన యౌరససుత యూర్మిళ-యను కన్యక, దనదు సోదరాత్మజలగు త
క్కిన యిరువురు మాండవియును-ననఘా! శ్రుతకీర్తి యను సమాఖ్యలు వినుమా!

చ. నలువురు సోదరుల్ ప్రియమునం జనకావనినాథునింట వే
డ్కలు చెలఁగంగఁ బెండ్లియయి కాంతలఁ దోడ్కొని తండ్రివెంట ని
స్తులమహిమన్ వెలుంగఁ బరితుష్టి నయోధ్యకుఁ బైనమైరి య
త్యలఘుగుణాకరుల్ భగవదంశసముద్భవు, లంత సోదరా! ౧౭౯౦

మ. బలదర్పంబున భార్గవుండు వెసఁ ద్రోవన్ గ్రూరుఁడై వచ్చి తాఁ
జలనం బించుక లేక యా దశరథక్ష్మాపాలపుత్త్రున్, మహో
జ్జ్వలు, శ్రీరాముని నిల్వరింపఁగనె, దోస్సారంబు దీపింపఁ ద
ద్బలముం గైకొని రామభద్రుఁడు కృపం బంపెం దపశ్చర్యకున్. ౧౭౯౧

మ. పురముం జేరి రనంతవైభవములోఁ బొంగం బ్రజాసంతతుల్,
ధరణీశుండు ప్రయత్నముల్ తగ నమాత్యవ్రాతసంయుక్తుఁడై
ధరణీభారము రామచంద్రునకు నత్యంతాదృతిం గూర్పఁగాఁ
గర ముప్పొంగుచు సల్పె, నంత విను ముత్కంఠ న్మునీంద్రోత్తమా! ౧౭౯౨

క. ఈ కార్యమునకు విఘ్నము-ప్రాకటముగఁ గలుగఁజేయఁ బాల్పడిరి సురా
నీక, మదెట్లనఁగా నా-కైకేయి స్వపుత్త్రుకొఱకుఁగా రాజ్యంబున్. ౧౭౯౩

శ్రీరామ వనవాసము

క. వనవాసంబును రామున-కును బదునాల్గేండ్లుగాఁగఁ గోరె దశరథా
వనిపాలు, సత్యసంధుఁడు-వనితామణివాంఛ వెలయ వరము నొసంగెన్.

చ. తన జనకాజ్ఞ సల్పఁగను దమ్ముఁడు ధీరుఁడు లక్ష్మణుండు, నొ
య్యనఁ దనపత్ని సీతయును నాదృతితోడుత వెంటరాఁగ స
త్యనిరతుఁడైన రాఘవుఁడు తాను బ్రయాణము చేసె దండకం
బను ఘనకాననంబునకు నప్పుడె సంయమినాయకోత్తమా! ౧౭౯౪

క. జనకులకు, గురువసిష్ఠున-కును సత్యపరాక్రముండు గురుతరభక్తిన్
వినతుల నొనర్చి, ధ్యానిం-చెను దేవిని వందనములఁ జేయుచు వరుసన్

క. మునినాథా! యాశ్వయుజం-బున సితపక్షమున దశమిఁ బొందుగ రఘునం
దనుఁడగు రాముఁడు రావణు-నని జంపఁగ యాత్ర వెడలె నతిహర్షమునన్.

ఆ. ఎలుఁగు రాలుపడఁగ నేడ్చుచు దశరథుం-డాత్మజుని వియోగ మాత్మ నెరియఁ
జేయుచుండ నుండె. స్థిరబుద్ధి రాముఁడు-వెడలె వనికిఁ దండ్రినుడివిని దీర్ప.

క. తన తమ్ముఁడు లక్ష్మణుఁడున్-వనితామణి సీతయును నవారితులై రాఁ
గను వెంట సుమంత్రుఁడు దె-చ్చిన యరదం బెక్కి నగరసీమను దాఁటెన్.

క. మనములఁ బరితాపంబును-ఘనముగ నలముకొనఁ బౌరగణములు వెనువెం
టను వచ్చుచుండ, వారిని-బనిచెఁ బ్రియంబునను రామభద్రుఁడు మునీ!

ఉ. అంతట శృంగిబేరపుర మారఘురాముఁడు చేరి, ప్రీతి య
త్యంతము నాత్మఁ బొంగఁగఁ బ్రియంబున మంత్రివరున్ సుమంత్రు సు
స్వాంతునిఁ బంపెఁ దాఁ బురికిఁ జయ్యన డిగ్గి రథంబునుండి భూ
కాంతుని జూడ నారయ నికామదయాయుతుఁడై మునీశ్వరా! ౧౮౦౧

ఉ. అచ్చట రామచంద్రుఁడు ప్రియానుజుతోడ జడ ల్ధరించి తా
నొచ్చెము లేని చిత్తమున నొయ్యన భూమిజ వెంటరాఁగఁ, బు
ణ్యోచ్చయహేతువై మిగుల నుర్విఁ జెలంగెడు గంగ నావచే
నచ్చికమీఱ దాఁటె జననాయకుఁ డావలితీరమందునన్. ౧౮౦౨

ఆ. మానితాత్ముఁడైన మానిచంద్రుఁడు భర-ద్వాజుఁ డున్నయట్టి వసతిఁ జేరి
యంతఁ జిత్రకూట మను పర్వతంబున-కరిగె రామభద్రుఁ డార్యవర్య!

చ. వినుము సుమంత్రుఁ డంత రఘువీరుని వృత్తముఁ దా నయోధ్యకుం
దనరఁగ నేఁగి యాదశరథక్షితిపాలున కేర్పడంగఁ దె
ల్పిన విని, రామచంద్రు నటవీస్థితి యంతయు నాత్మ నెంచి, పె
న్వనట మునింగి, డాన నసువారము భూపతి వీడె నారదా! ౧౮౦౪

తే. త్వరితముగ మేనమామపత్తనమునుండి-భరతుఁ డరుదెంచి దశరథధరణిపాలు
మృతికి శోకించి, జనకు సద్గతికి నౌర్ధ్వ-దైహికంబులఁ గావించె దాపసేంద్ర!

భరతుఁడు శ్రీరామపాదుకలం గొనివచ్చుట

క. తన తల్లియైన కేకయ-జనపతిసుత చేసినట్టి చర్యల కెదలోఁ
గనలుచుఁ, దల్లిని గసరుచు-మనమున భరతుఁడు వసిష్ఠమౌనియు సచివుల్.

క. అనుజుఁడు శత్రుఘ్నుండును-జనములుఁ దనవెంట రాఁగఁ జనె, వని శ్రీరా
ముని లక్ష్మణునిఁ సీతను-గనుఁగొన మది వాంఛ మిగులఁ గడలుకొనంగన్.

తే. యత్నమొనరించి రాముని నడవినుండి
పురమునకు రాఁగ భరతుండు పూనె, నపుడు
రామచంద్రుండు దేవకార్యంబుఁ దీర్ప
నరిగెను నిరాకరించి తత్ప్రార్థనంబు. ౧౮౦౮

చ. "పురమును జేరరా నిపుడు, పూనితిఁ దండ్రియనుజ్ఞ, నిప్పు డే
నరిగెద దండకాటవికి, నాత్మను నొండుఁ దలంప కిప్పుడే
సరగునఁ బోయి రాజ్యము ప్రశస్తముగాఁ బరికించుచుండు మో
భరత!" యటంచు సాంత్వనపు వాక్యము లారఘురాముఁ డాదృతిన్.

తే. పలికి శ్రీరాముఁ డత్యంతభయదమైన-దండకాటవికిం బోయెఁ, దమ్ముఁడైన
భరతుఁడును మాటిమాటికిఁ గరుణ వెలయ-నన్న తెల్పిన మాటల నాలకించి.

చ. తదనుమతిన్ శిరంబునను దాల్చి యరణ్యమునుండి యప్పుడే
కదలె, నమాత్యులున్ జననికాయముఁ దల్లులు సోదరుండు రా
సదయుఁడు తన్మృదూక్తులను స్వాంతమునం దలపోయుచున్ శుభా
స్పదవర రామపాదజలజంబులు భక్తినిఁ జింతచేయుచున్. ౧౮౧౧

క. భరతుఁడు శత్రుఘ్నునితోఁ-బరిజనవృతుఁ డగుచు రామభక్తియుతుండై
నిరతిని నందిగ్రామమె-శరణము గాఁగను వసించె సంయమినాథా! ౧౮౧౨

తే. జడల ధరియించి, భరతుఁడు పుడమి పడక
గాఁగ శయనించుచును, రాజ్యకలితభోగ
ములను విడనాడి మది రామసలలితపద
కమలములఁ దలఁచుచును సంతతము భక్తి. ౧౮౧౩

క. పదునాల్గు వత్సరములుఁ-మది రామాగమనవాంఛ మానివరా! యె
య్యెదనున నగునా యని తా-నుదితంబగు భక్తి భరతుఁ డుండె నియతుఁడై.

విరాధాదివధ

ఉ. రాముఁడు దండకాటవి విరాధుని ఘోరశరీరుఁ జంపి యు
ద్దామపరాక్రమంబునను దా వసియించెను, దైత్యనాశముఁ
నీమములోడఁ జేయుటకు నెమ్మది దీక్ష వహించి నిర్జర
స్తోమముఁ బ్రోవఁగాఁ దలఁచి క్షోణిభరం బుడుపంగ నారదా! ౧౮౧౫

తే. దశరథక్షితిపాలకతనయుఁడైన-రాముఁ డాపంచవటియందు రమణితోడ,
సోదరునితోడ నివసించె మోదమునను-బర్ణశాలను నిర్మించి పరమమాని!

తే. అచ్చటికి శూర్పణఖ యను నసురకాంత-కామరూపిణి యరుదెంచి రామచంద్రుఁ
బతిగఁ గోరెస్మరార్దితస్వాంత యగుచు-నారదమునీంద్రచంద్ర! సంతసమువీఱ.

చ. మునివర! దుష్టచిత్తయయి మోసముచేయఁగఁ గామరూపముం
గాని యట నున్న శూర్పణఖ క్రో యని యార్వఁగ లక్ష్మణుండు ఖ
డ్గనిశితధార నాసికయుఁ గర్ణములన్ వడిఁ గోసివైచెఁ బెం
పునఁ దన యన్నయాజ్ఞ మదిఁ బూని తలంకక సుస్థిరాత్ముఁడై. ౧౮౧౮

శూర్పణఖ రావణునకుఁ దన భంగపాటుఁ దెల్పుట

ఉ. అంత ననంతకోపమున నయ్యసురాంగన భీమరూప త
త్ప్రాంతమహాటవిన్ నిజనివాసముగా వసియించియున్న కా
లాంతకసన్నిభాకృతుల నన్నల నా ఖరదూషణాదులన్
భ్రాంతిఁ గలంగఁ జేరి తన వార్తను దెల్పుచు నేడ్చెఁ బెల్లుగన్. ౧౮౧౯

సీ. "అన్నలారా! యయోధ్యాధినాథుఁడు రాముఁడనువాఁడుదూర్వాదళాభగాత్రుఁ,
డతిరుచిరశ్యాముఁ డనుజునితోఁ, దన ప్రియకాంతతోఁ గూడి భీకరమగు
దండకాటవిఁ జేరెఁ, దత్ప్రియసతి రూపసౌందర్యశాలిని, జగతి దీటు
దానికి నెవ్వరుఁ దలఁపఁగఁ గనరారు త్రిభువనములయందుఁ దివిరి యరయ,
ఆ. నింతవఱకుఁ గాంత లెందఱనో చూచి-నట్టిదాన, దాని యంద మెందు
నశ్రుతం బదృష్టమని చెప్పఁగాఁ దగు,-నిక్క మిద్ది, కనుఁడు నెమ్మనమున.

ఉ. దానిని మీకుఁ గూర్పఁగ నెదం దలపోసి తదాశ్రమస్థలం
బేను గడుం బ్రయత్నమున నెంతయుఁ జేరఁగ రాము నానతిన్
బూనిక లక్ష్మణుండు క్షురముం గొని ముక్కుచెవు ల్విలంబమున్
మానిని యంచుఁ జేయక ప్రమాదము పొందక కోసె నీగతిన్. ౧౮౨౧

ఆ. ముక్కు-చెవులు కోసె నక్కటా! యీభంగి-మును ద్వితీయనికటమునను దెలుప
వచ్చినట్టిదాన, నిచ్చ మీ కెయ్యది-యట్టు చేయుఁ డేది యను వనుజులు!''

క. ఖరదూషణు లప్పుడు సో-దరిమాటల నెల్ల విని క్రుధం దమ వెంటన్
నిరుపమబలాఢ్యులగు నా-శరులు చతుర్దశసహస్రసంఖ్యలు గొలువన్. ౧౮౨౩

క. కడువడి రఘునందనుఁ డు-న్నెడ కరిగి యెదుర్కొనంగ, నినవంశభవుం
డడరి పదునాల్గువేవురఁ-బొడిచెను దాశరథి బాణపుంజంబులచేన్. ౧౮౨౪

క. అంతట శూర్పణఖయుఁ దా-వంత మనంబునను గదుర వాపోవుచు ను
ద్భ్రాంత యయి యేగి రావణు-చెంతకుఁ దన వృత్తమెల్లఁ జెప్పెను మౌనీ!

క. రావణుఁ డమ్మాటలు విని-భావంబున సీతసొగసు భావించుచుఁ గా
మావిలుఁడై విధిచే సీ-తావనితను నపహరింపఁదలఁచె మునీంద్రా! ౧౮౨౬

సీతాపహరణము

ఉ. అంతట రావణుండు తన యాప్తుని దాటకపుత్త్రుఁ దోడుగా
నెంతయు వెంటఁబెట్టుకొని యేఁగె మహాటవిదారిఁ బట్టి, భూ
కాంత హరించుకోర్కి మదిఁ గైకొని శూర్పణఖోక్తి నెన్ని సం
భ్రాంతియుతాత్ముఁడై త్రిదశవందిత! నారద మౌనిచంద్రమా! ౧౮౨౭

క. మారీచుఁడు శ్రీరాముని-ఘోరాస్త్రంబులను బ్రాణకోటి విడుతు నం
చారిమిఁ దలంచి నిశ్చయ-మారీతి యటంచుఁ గనకమృగరూపమునన్.

తే. దండకాటవిఁ జొచ్చి యుద్దండవృత్తి
రాము మోహింపఁజేసి దూరంబు వెంటఁ
దన్నునగమింప జతనంబుఁ దా నొనరిచె,
రాముఁ డారక్కసు నిశితాస్త్రమునఁ గొట్టె ౧౮౨౯

క. మునినాథా! మారీచుం-డినవంశ్యుని బాణహతిని నేపడఁగి మహా
ఘనరవమున 'లక్ష్మణ!' యని-తన యసువుల వదలె నపుడు ధరఁ బడి పెలుచన్.

చ. జనకజ యాత్మఁ దద్వచనశైలి నిజేశుని దంచు నెంచి యో
జన యొనరింపఁజాలక విచారము మీఱ మజంది లక్ష్మణున్
బనిచెను రామచంద్రుని శుభంబునఁ దోడ్కొనిరాఁగ, నంతలో
దనుజుఁగు పంక్తికంఠుఁడు ముదంబున వచ్చెను బర్ణశాలకున్. ౧౮౩౧

క. లక్ష్మికిమూర్త్యంతరయా-నా త్మ్యాపుత్త్రికను యుక్తి యచ్చుపడంగన్
లక్ష్మరహితుఁడు హరించెన్-సూక్ష్మజ్ఞుఁడు గాక సీత సుకృతసమేతన్. ౧౮౩౨

ఉ. ఆ పరదేవి భూసుతయు నప్పుడె రావణు బాదిచేయఁగా
నోపియుఁ జేయదయ్యె, విను, ముల్లమునందున వాఁడు భక్తిఁ ద

చ్ఛ్రీపదపద్మము ల్సతము చింతనచేయుచుఁ గొల్చుచుండుటల్,
దాపసివర్య! యియ్యదియె తత్త్వమటంచును నాత్మ నెంచుమా! ౧౮౩౩

ఉ. రాముని పత్ని సీతఁ గొని రావణుఁ డేఁగుచునుండ మార్గమం
దామహనీయచిత్తను సమాదృతి రక్షణసేయఁబూని యు
ద్దామబలుండు పక్షిసముదాయవిభుండు జటాయు నంతఁ దా
వ్యోమపథంబునందు వడి నుద్ధతిఁ దాఁకె దురాత్ము రావణున్. ౧౮౩౪

చ. తన బల మెల్లఁ గన్పడఁగ దానవపుంగవుఁడైన రావణుం
డనయము మీఱఁ బక్షముల నాక్షణమందునఁ ద్రుంచి పక్షినా
థుని ఘను నజ్జటాయువును ద్రోచి మహిన్, వడి సీతఁ గొంచు లం
కను నిశిఁ జేరఁబోయెఁ గడఁకన్ సురమానివరేణ్య! యంతటన్. ౧౮౩౫

తే. అతిమనోహరమైనట్టి యయ్యశోక-వనమునం దాసతిని నుంచె, మనమునందు
నేని ధర్షింపఁగా శక్తి యించుకేని-లేనివాఁడయ్యె జ్వాలదగ్నిగాను దలఁచి.

క. ఈవిధమున జరుగఁగఁ బర-దేవి శుభప్రదయు నయ్యెఁ బరమదురితునా
భావించుచు లంకేశ్వరి-యావేళఁ దిరోహితంబు నందఁగ నెంచెన్. ౧౮౩౬

ముప్పదితొమ్మిదవ అధ్యాయము

సీతాన్వేషణము

క. శ్రీరాముఁడు మారీచుని-ఘోరాస్త్రంబున వధించి, కూరిమితమ్మున్
దారిఁ గని యతనితోడ మ-హారయమునఁ బర్ణశాల కరుదెంచి మునీ!

క. జానకి నచ్చటఁ గానక-మానసమున సీతఁ దలఁచి మానని చింతన్
గాననమునందుఁ దిరుగుచు-మానినికై వ్యథితుఁడయ్యె మానీ! యంతన్.

క. శ్రీరాముఁడు లక్ష్మణుఁడును-ఘోరారణ్యంబునందు క్షోణీసుతకై
వారక వెదకుచుఁ దిరుగుచు-సూరులు వగఁ జెంది యొక్కచో విస్మయులై.

క. కనుఁగొని రాయటవీస్థల-మున ఱెక్కలు తెగిన విహగపుంగవు నొకచోన్,
జనవిభులు రామలక్ష్మణు-లనఘులు సీతాపహారి యగు నిది యంచున్. ౧౮౪౧

చ. మదిఁ దలపోసి, రంత మునిమాన్యుఁడు రాముఁడు దానిఁ జంపఁగా
నెదను దలంచి దగ్గఱకు నేఁగి కనుంగొని తండ్రినేస్తమై
పొదలెడు నాజటాయు వని బుద్ధి నెఱింగి శరంబు వేయున
య్యదనున శాంతుఁడై నిలిచె, నంత జటాయువు రామమూర్తితోన్. ౧౮౪౨

తే. "రావణుఁడు సీతఁ గొనిపోయెఁ గావరమున"
నంచు నెఱిఁగించి వృత్తాంత మంతయు, నపు
డాత్మదేహంబు వదలి సురాలయమున
కరిగె శ్రీరాముఁ డచ్చట నరయుచుండ. ౧౨౪౩

ఉ. అంతట నాజటాయువున కాదృతి రాముఁడు వహ్నినిచ్చి, య
త్యంతమహార్ధ్వదైహికము లైన విధు ల్నెఱవేర్చెఁ గానలో
స్వాంతము సత్కృపం జెలఁగ, సంయమినాథ! కబంధుఁ జంపి తా
నంతయు ఋశ్యమూకమున కేఁగెను భూమిజజాడఁ జూచుచున్. ౧౨౪౪

సీ. ఆ ఋశ్యమూకంబునందు సుగ్రీవుండు భ్రాతయా వాలిపరాక్రమమున
కాత్మ భయంబంది, యంజనాతనయుండు మున్నగు తన మంత్రిముఖ్యులు నలు
వురు తన్ను గొలువంగ నురుతరభీతితో వసియించుచుండె, నప్పర్వతంబుఁ
జేరి శ్రీరాముఁడు స్నేహంబు గావించి సూర్యనందనుతో నవార్యరీతి,
తే. యుద్ధమునయందు నతివిక్రమోద్ధతుఁ డగు-వాలిని వధించి, ప్రేమతో వనచరవర
రాజ్యమునకును సుగ్రీవుఁ బూజ్యరీతి-నిలిపెఁ బట్టాభిషేకంబు సలిపి మౌని!

క. మునివర! వర్షాకాలం-బును గడపెను మాల్యవంతమునఁ దమ్మునితో
డను నుండి రామవిభుఁ డో-య్యన, నవ్వల వినుము దశరథాత్మజు మహిమల్.

ఉ. వానరసైన్యముం బిలువఁబంచి ధరాత్మజఁ జూడఁగా భువిన్
మానవనేత రాఘవుఁడు మర్కటవర్యుల నాల్గుదిక్కులం
దూనిన వేడ్కతోఁ బనిచె నొయ్యన రాఁదగు నంచు, వారలున్
బూనిక మీఱఁగాఁ జనిరి భూతనయన్ వెదుకంగ శ్రద్ధమై. ౧౨౪౫

హనుమ లంక కరుగుట

సీ. వారలలో బలవంతులౌ హనుమంతుఁ డంగదజాంబవదాదులైన
యతిపరాక్రమవంతు లతివీర్యవంతులు ధరణిజ వెదుకంగ దక్షిణాదిశ
కరిగిరి, మార్గంబునందు సంపాతిచే భూమిజచరితంబుఁ బూర్ణముగను
విని సాగరంబును వేగ దాఁటఁగ నెవ్వ రోపుదు రని తమ యుల్లములను
తే. జింతచేయుచుఁ గూర్చుండి సింధుతీర-మందు నాలోచన మొనర్చి, రంత జాంబ
వంతు వాక్యానుసారము వలనుమీఱ-నెల్లవారలు సమ్మతి నొడఁదఁ గనిరి.

క. శతయోజనవిస్తృతమయి-యతిఘోరంబయిన యుదధి నప్పుడు వీరో
ద్ధతుఁడు హనుమంతుఁ డద్భుత-గతి లంఘించెను మునీంద్ర! కౌతుక మెసఁగన్.

ఉ. అంతట రాత్రికాలమున నాహనుమంతుఁడు సీతఁ జూడఁగా
స్వాంతమునందు నెంచి వరుసన్ వడి లంకను జొచ్చి తత్పురా

భ్యంతరసీమ నెల్లెడల నారసి యారసి రాత్రి సప్తకం
బింతయు శ్రాంతి లేక యట నెందును సీతను గాన కోమునీ! ౧౮౭౦

చ. తిరుగుచు నం దశోకవని దివ్యశుభానన దేవిఁ గాంచె సం
బరమున, నంతఁ దా నెదను భావని యిట్లు తలంచె "నేను దు
ష్కరమగు కార్యముం జరుపఁగానగు, దానికి నేత్రమంబు పెం
పరయఁగఁ బోలునా" యనుచు నాశలు పైకొన నుండె నారదా! ౧౮౭౧

క. పరదేవి తొల్లి యద్భుత-సరణిం గావించినట్టి సమరంబును ద
ద్గురుమహిమంబును మదిలో-నిరవుగఁ దాఁ దలఁచి హనుమయొక్క ద్రుమంబున్.

హనుమంతుఁడు లంకలోఁ బరదేవిం గాంచి నుతించుట

మ. వినవయ్యా! హనుమంతుఁ డాత్మఁ బరదేవీదివ్యహర్మ్యంబు వే
డ్కను జూడంగను వాంఛఁ బూని మునిలోకగ్రామణీ! దిక్కులం
దన నేత్రంబులఁ ద్రిప్పి యారయుచు నంతం గాంచె నీశాన్యది
క్కున నత్యద్భుతమైన మందిరము రక్షోనాథసంపూజ్యమున్. ౧౮౭౩

క. సుమనోహరంబు భవ్యం-బమలమణిప్రకరరచిత మత్యచ్ఛసువ
ర్ణమహాలంకృతమును ప్రే-క్ష్యము నై యొప్పారు దివ్యసద్మ మది మునీ!

ఆ. పవననందనుండు పరికించి తన్మంది-రాగ్రభాగమునను నలరు సింహ
కేతనంబు, మదిని కృతనిశ్చయుండయ్యె-దేవిసదన మిదియె ధృతి నటంచు.

ఉ. అంత ననంతసమ్మదము స్వాంతమునందునఁ బొంగ నంజనీ
కాంతసుతుండు తద్భవనకమ్రకవాటము దాయఁబోయి య
త్యంతముదంబులో నచట నాడుచుఁ బాడుచు నున్న యోగినీ
కాంతల గుంపులో నెసఁగు కామితదాయిని దేవిఁ గన్గొనెన్. ౧౮౭౬

చ. కనుఁగొని భక్తిపూర్వకముగాఁగఁ బ్రదక్షిణ మాచరించి యొ
య్యనఁ బ్రణమిల్లి ముజ్జగములందున వెల్గెడు జీవకోటికిన్
జనని యటన్న ఖ్యాతిఁ గని సర్వముఁ బ్రోచు పరేశ్వరిన్ నిజా
త్మను నెలకొల్పి సంస్తుతుల మౌనివిభూ! యొనరించె భక్తితోన్. ౧౮౭౭

సీ. "దేవి! విశ్వేశ్వరి! దివ్యచిత్తంబున నవధరింపుము మదభ్యర్థనంబు,
నేను రాముని దూత, నీలంక రామపత్న్యన్వేషణమునకై యరుగుదెంచి
నాఁడను; గరుణింపు, నారాయణుఁడు భవదాజ్ఞానువర్తియై యవని మనుజ
దేహంబు ధరియించి దితిజనాథుని రావణాసురు ఖలుఁ ద్రుంప నవతరించె,

తే. శివుఁడ నే వానరుఁడ నయి క్షితినిఁ బుట్టి
భవదనుజ్ఞను బూని, రాఘవుని కార్య



హనుమంతుఁడు లంకలో అశోకవనియందు పరదేవినిగాంచి నుతించుట

"తిరుగుచు నం దశోకవని దివ్యశుభానన దేవిఁ గాంచె సం
బరమున; నంతఁ దాఁగెదను బావని యిట్లు తలంచె."

[పుట 250]

మునకుఁ దగినట్టి సాహాయ్యమును నొనర్ప
వచ్చితిఁ దలంపు మంబ! పూర్వవర మాత్మ ౧౫౮

క. ఎప్పుడు లంకను జొత్తునొ-యప్పుడు లంకాపురమున నావాసంబుల్
దప్పక విడుతు నటంచును-జెప్పితి, వాత్మభవనంబుఁ జేరుదు ననుచున్. ౧౫౯

క. అమ్మా! నెమ్మది నెంచి పు-రమ్మును వదలుము, దురాత్ము రావణుఁ ద్రుంపన్
బొమ్ము, మహాదేవీ! క్షే-మమ్మున మనుపుము జగంబు మరువక తల్లీ!"

చ. అని నుతియింపఁగా హనుమ, యప్పుడు దేవి వచించె రామచం
ద్రుని వరభృత్యుఁ గాంచి కడుఁ దోరపుఁగూర్మిని "వానరర్షభా!
విను, జనకాత్మజాతయగు విశ్రుతసద్గుణ సీత తాను పొం
దిన యవమానముం గని మదిం గ్రుధ లంకను వీడ నెంచితిన్. ౧౬౧

ఉ. నీవచనంబునన్ వినఁగ నే వసియించినదాన లంకలో
రావణునాలయంబున, వరంబు నెఱుంగుదు, నీపురంబునన్
దావకసూక్తి నెంచి కపితల్లజ! వీడుచునున్నదాన సం
భావనచేసి నీనుడుల, భద్రము గల్గునుగాక! నీ కిటన్." ౧౬౨

తే. నారదా! "విను మంచును గారవమున-నమ్మహాదేవుఁడు వచించె "నార్య! యిట్టు
లామహాదేవి సెలవిచ్చి యనిలజునకు-లంకను త్యజించి యపుడె నిశ్శంకతోడ.

క. మునివర! యంతర్ధానం-బును బొందెను, నంత హనుమ యతిశయకోపం
బునఁ బొంగి రావణాసుర-ఘనవిక్రమపోషితమయి క్రాలు వనంబున్. ౧౬౪

క. వెస విఱువఁబూనె, ద్రుమములఁ-గసిమసఁగి ముగించి యందుఁ గానఁబడు నశో
కసముదయ మూచముట్టుగఁ-బసయడఁగించెను మునీంద్ర! వాయుజుఁ డంతన్.

క. రావణుఁడు మదిని నతికో-పావిష్టుండయి యశోక మను వననాశం
బీవానరుఁ డొనరించుటఁ-దా విని రాక్షసులఁ బిలిచి తడయక యపుడే. ౧౬౬

క. తన సుతు నక్షాహ్వాయునిం-దనుజులకును దోడుచేసి తాపసివర్యా!
వనచరు పోడ వడఁగింపఁగఁ-బనుచుటయును హనుమ నెగడెఁబటుశౌర్యమునన్.

చ. అతిశయశౌర్యవంతుఁడు మహాభుజుఁడై తగు నాంజనేయుఁ డు
ద్ధతి రణమందు వృక్షసముదాయముఁ దా వడిఁ బెల్లగించి, య
ద్భుతగతి నక్షుఁ గొట్టఁగనె భూమిపయిం బడి యీల్గె వాఁడు, నీ
గతి యసురేశ్వరుండు విని గాఢుపుపట్టిని బట్టి బల్మితోన్. ౧౬౮

చ. మదిని విచారపుఁ జేయుటయె మంచి దటంచును నెంచి రావణుం
డదయత మారుతాత్మజుని యత్యధికాయత వాలమం దాగిన్

గోడువ యొకింత లేనియటు గోకలు జుట్టఁగఁ జేసి మంటలన్
బాదలెడునట్టు లగ్నియిడి పోవిడిచెన్ వడిఁ గాలునట్లుగన్. ౧౮౯

ఉ. అంగదముఖ్యు లుండిన మహార్ణవతీరమునందుఁ జేరఁగా
సంగములందు సంతసము నందుచు జాంబవదాదులెల్ల ను
ప్పొంగుచుఁ బావనిం దడిసి పూర్ణమనోరథ మబ్బినట్టుగాఁ
జెంగున గంతులన్ వయిచి చెచ్చెర నచ్చటనుండి వేడుకన్. ౧౯౦

తే. పయనమయి యెల్ల వానరవరులు మధువ-నంబునకుఁ జేరి, మధువునుసంబరమునఁ
ద్రావి, శ్రీరామసత్సన్నిధానమునకుఁ-బోయి రెంతయు హర్షంబు పొదల మదుల.

ఉ. దూరమునుండి యాకపులఁ దోరపు వేడుక రామచంద్రుఁ డిం
పారఁగఁ గాంచి, "సీతకును భద్రమె?" యం చడిగెం దపోధనా!
కోరికమీఱ నాహనుమ గొబ్బునఁ దాఁ గనినట్టి వృత్తమున్
సారపుఁబల్కులం బలికె సంతసమందఁగ రామమూర్తితోన్. ౧౯౨

చ. ఇనకులుఁడైన రాఘవుఁ డహీనపరాక్రముఁ డంత నర్కజుం
డనువున సర్వవానరుల నాదృతిఁ దోడ్కొనిరాఁగ లంకకుం
జనఁ బయనంబొనర్చె నొగి, శ్రావణశుక్లమునం జయంబుఁ బెం
పున నిడునట్టిదా ననుచుఁ బూర్ణతిథి న్మునినాథ! నారదా! ౧౯౩

తే. వానరబలంబు లెంతయు వైభవమునఁ
గొలుచుచుండఁగఁ దనవెంటఁ గొలువమరుచు
రాక్షసేంద్రుని రావణు రణమునందుఁ
జంపఁగా నుండె శ్రీరామచంద్రుఁ డార్య! ౧౯౪

క. రావణుఁ డాసమయంబునఁ-దా విభవం బెసఁగ సచివతల్లజులను వే
రావించి కొలువునకుఁ ద-ద్భావము నెఱుఁగంగఁ గోర్కెఁ బ్రార్థించె మునీ!

ఉ. ఆసభయందు మంత్రివిదులందున నగ్రణియై సుబుద్ధియై
వేసటఁ బొంద కిట్లనె విభీషణుఁ డప్పుడు యుద్ధమాపఁగా
నాస మనంబునం బొదల నాదనుజేశు దశాస్యుఁ గాంచి యు
ద్భాసితధీయుతుం డగుచుఁ దాపసనాయక! నిశ్చయాత్ముఁడై. ౧౯౫

క. పలుమఱు రామపరాక్రమ-ములఁ దుల లే దనుచుఁ జెప్పి యిప్పుడె సీతా
లలనను రామున కిచ్చిన నెలమిఁ గనుదు మంచుఁ దెలిపె హితవుగ మౌనీ!

తే. ఆవిభీషణు వాక్యంబు లాగ్రహమున-విని కడుం గ్రోధమును బూని మనమునందుఁ
దమ్ముఁడం చెన్నకయ, హితతత్పరుఁ డని-చూడకయు కాలితోఁ దన్నె సోదరునట.

ఉ. అంతట ధర్మరూపుఁడయినట్టి విభీషణుఁ డాత్మఁ గ్రుద్ధుఁడై
యెంతయు, నుండరా దిచట నింక నటం చని యెంచుచున్ వడిన్
జెంతకు నాత్మమంత్రులను జేకొని నల్వుర రామచంద్రు పా
దాంతికసీమకున్ శరణ మంచును జేరఁగఁబోయె సన్మునీ! ౧౮౭౯

నలువదియవ అధ్యాయము

శ్రీరామ విభీషణ సమాగమము

చ. తన మదియందు రాఘవుఁడు తర్క మొనర్చి వినిశ్చయించి య
ద్దనుజు విభీషణుం దన పదంబుల నాశ్రయణంబుఁ జేయఁగా
మనమునఁ గోరి వచ్చెనని మాన్యతతోఁ గని యాదరించి, యొ
య్యనఁ జెలికారమున్ సలిపి యచ్చట లంకకుఁ గట్టెఁ బట్టమున్. ౧౮౮౦

చ. బలమును విక్రమంబును బ్రభావమునుం దెలియంగ నెంచుచున్
జలనిధి దాఁటఁగావలయుఁ జయ్యన నంచు వచించె నర్కజుం
బిలిచి రఘూద్వహుం, డపుడు ప్రీతిని వానరరాజు రామచం
ద్రలలితసూక్తుల న్విని ముదంబున నిట్లని పల్కె భక్తితోన్. ౧౮౮౧

సేతుబంధనము

ఆ. "చింత సేయవలదు శ్రీరామచంద్ర! యీ-యంబురాశి శోషణంబుఁ జేయఁ
గలను, జెట్లఁ బెటికి కట్టను గట్టెద,-దాన నబ్ధి లీల దాఁటఁగలవు." ౧౮౮౨

క. అత్యంతహృష్టుఁ డయ్యెను-సత్యపరాక్రముఁడు రామజనపతి యపు డా
దిత్యసుతుని మాటల కెద-నుత్యంబని యెంచి తాని నూల్కొల్పి వెసన్.

క. బంధింపవలయు నని యాకంధిన్ దా నందు నిలిచి కట్టించె విప
ద్బంధుండగు సుగ్రీవుని-సంధాతగ నిలిపె, రవిజు శాసనములచేన్. ౧౮౮౪

చ. మయసుతుఁ డౌ నలుండు వడి మర్కటవీరులు భూధరంబులన్
నియతిని బెల్లగించి రహిని్ గొని తెచ్చుచు నిచ్చుచుండ నే
మియును గొంత రానియటు మెల్పున సేతువుఁ గట్టె నబ్ధిపై
బ్రయతగుణుండు సంతసము పైకొన నెల్లరు సన్నుతింపఁగన్. ౧౮౮౫

తే. మునివరా! శ్రావణంబునఁ బూర్ణిమాది-నంబునందు నారంభించి యంబుధికిని
వానరర్షభుఁ డౌ నలుం డౌననంగ-సేతువును రెండు జాలకుఁ బ్రీతిఁ గట్టె.

తే. సకలలోకాద్భుతంబు దుష్కరము నైన-యబ్ధిపై నిర్మాణ మాత్మ నెఱిఁగి
రావణుం డప్డు భీతి సంభ్రాంతుఁడగుచు-ముగ్ధుఁడయిమాటిమాటికో ముని! వడంకె.

ఉ. అవల నాత్మలోపల ముదన్వితుఁడై శతకోటిలక్షతా
పావని మున్నుగాఁగలుగు వానరసేనలు భూరిసత్త్వ లెం
తే వడి వెంటరాఁ గదలి తేఁకువఁ దమ్మునితోడ లంకకున్
శ్రావణకృష్ణపక్షమున రాముఁడు చేరెఁ ద్రయోదశిన్ మునీ! ౧౮౮౮

సీ. జలము గలట్టి చోటుల స్థలంబులయందుఁ బ్రాకారముల వృక్షవాటికలను
భవనమధ్యంబుల వనముల నుపవనములయందుఁ జత్వరంబులను గోపు
రములందు సకలస్థలములందు వానరుల్ నిండియుండిరి చూడ మెండుగాను,
వానరశూన్యమౌ వసతి యొందును జూడఁ గనఁబడ దోమునిజనవరేణ్య!

తే. అంత భగవంతుఁడైన భూకాంతుఁ డంత
రంగమున నెంతయును బూన్కి రణముసేయ
వలయు నంచును యోజించె సలలితముగ,
బరమముని! నారదా! విను భక్తిమీఱ. ౧౮౮౯

సీ. "లంకాపురంబు నిశ్శంక జయింపఁగా భగవతీపూజను భక్తితోడఁ
బూజింపఁదలఁచితి బుద్ధిలోపల నేను, నిదియుసమయమునా నెన్నఁబడును
బరదేవిపూజకు భావింప, నట్లైనఁ బూజఁగావించెదఁ బూర్ణముగను,
దక్షిణాయన మిప్డు, తాఁ ద్రిజగన్మాత నిద్రించుచుండును నిశ్చయముగ"

తే. ననుచు యోజించి భగవంతుఁడైన రామ
చంద్రుఁ డవ్వ్యయుఁడగు హరి స్వాంతమందు
నాగ నాతన్విఁ జిత్రరూప నర్చనంబుఁ
జేయ మది నిశ్చయించెను సిద్ధమౌని! ౧౮౯౦

తే. ఆమహామాయ పరదేవి యార్య మౌని-నాయకా! చిత్రరూపిణియై యొసంగుఁ
గావున యజింతు సద్భక్తికలితుఁడ నయి-యనుచు శ్రీరామమూర్తి మదిని దలంచి.

సీ. "అపరపక్షంబును నారంభమయ్యెను, బాడ్యమియును నేఁడు వఱలుచున్న,
దటుగాన యీనాఁడె యారంభమును జేసి యామహాదేవి జయప్రదగుణఁ
జిత్రరూపఁ బారణ్యావిధి నమావాస్యవఱకు ననుదినము నవికలభక్తి
నర్చించి యొయ్యన నాజిరంగంబున శత్రుసంహారంబు సలుపఁగలుగు

తే. వాఁడ" నని రామచంద్రుండు భావమందు-నిశ్చయంబు నొనర్చి నిర్నిద్రుఁడగుచు
లంకయందు దాదరంబున శంకలేక-పలికె వానరరాజితోఁ బరమమౌని! ౧౮౯౧

తే. పార్వణశ్రాద్ధమును గడుభక్తి నీది-నమున నపరాహ్ణమునఁ జేయుదు, మఱి సంగ
రోర్విని రాక్షసాధ్యక్షు నొగి నెదిర్చి-రణము నొనరింతు నని పల్కె రామమూర్తి.

శా. ఆ పల్కుల్విని వానరప్రవరు "లౌ, నౌ, నిద్ది యోగ్యంబు సు,
వ్యాప్తపుణ్యాత్మక! రామచంద్ర! వరభక్త్యుత్సాహము ల్మీఱ దే

వీపూజాక్రియ లాచరింపుము, పితృప్రీతిం దగం జేయు, మీ
వే పూర్ణంబగు కార్యవేత్తవుగదా! విశ్వంబునన్ శ్రీపతీ! ౧౮౯౪

క. పితరుల యజింపనా స-న్మతి శ్రీరామా! విధిజ్ఞ! మాన్యుఁడ వగు నీ
కితరులు తెల్పఁగ నేలా-క్షితి? సమరమునందు జయము చేకురు దానన్."

చ. అని వినయంబునం దెలుప నంతట సత్యపరాక్రముండు పెం
పునఁ దగినట్టి కాలమున బుద్ధిని దేవిని జేర్చి భక్తితో,
ననుపమరీతిఁ బార్వణమునై తగు శ్రాద్ధము నాచరించె నో
మునిజననాథ! యుద్ధమున భూరిజయంబును గోరి యత్తఱిన్. ౧౮౯౬

యుద్ధారంభము

తే. ఆదినంబున భాస్కరుం డస్తమించి-నట్టి సమయానఁ బశ్చిమంబయిన దిక్కు-
నందు ముట్టడివేసె, దైత్యాళితోడ-యుద్ధమారంభమయ్యె సముద్ధతముగ.

క. సమరమున రామచంద్రుఁడు-నమరరిపుండైన రావణాసురుఁడును జే
యు మహోద్యోగము లెందు న-సమములు, కన వినఁగ లేవు సకలభువమునన్.

చ. మొదటి దినంబునందు రణముం బొనరింపఁగ రావణుండు దు
ర్మదుని నకంపనాఖ్యుఁ జతురంగబలాన్వితు వీరవర్యునిం
గదనమునందుఁ గ్రూరగతి గాటపుశౌర్యము మీఱ రాఘవుం
జిదుము మటంచుఁ బంపెఁ, దగు సేనలతోఁ జనె వాఁడు సోద్ధతిన్. ౧౮౯౯

క. కోపము దీపింపఁగ న-ప్పాపాత్ము నకంపనాఖ్యుఁ బావని రణమం
దేపున యమనిలయమునకు-నోపికతోఁ జేరఁబంపె నురుశౌర్యమునన్. ౧౯౦౦

తే. రాఘవుం డిట్లు భక్తితో శ్రాద్ధకార్య-మును బరాంబను గూరిచి మనమునందు
జరపుచును దృప్తిగావించి దురమునందుఁ-గొట్టుచుండెను రాక్షసకోటి నంత.

తే. దురమున నకంపనుఁడు తెగ ధూమ్రనయనుఁ
డసురరాజేంద్రుఁడగు రావణాజ్ఞ సైన్య
యుతుఁడగుచు యుద్ధభువికి సముద్ధతిఁ జని
యద్భుతంబగు యుద్ధంబు నపు డొనర్చె. ౧౯౦౨

క. రెండవ దినంబునందు న-ఖండపరాక్రముఁడు కలన ఖండించెను దో
ర్దండుఁ డగుచు ధూమ్రాక్షుఁ బ్ర-చండబలుని నుక్కడంగ సంయమివర్యా!

ఆ. ఈవిధమున నితరు లెందఱో రాక్షస-వీరు లాహవమున ఘోరరామ
సాయకక్షతులను జచ్చిరి, రాక్షసా-ధ్యక్షు మాతులుఁడు ప్రహస్తుఁ డంత,

చ. సమరము చేయఁగోరి కడు శౌర్యము మీఱఁగ సంగరాంగణం
బమితబలావృతుం డగుచు నప్పుడె వచ్చి కలంచెఁ గీశబృం
దమును బ్రతాప మొప్పఁగ ముదంబునఁ బొంగుచు, వానితోడి జ
న్యము నిశివేళలో జరగె నద్భుతరీతిని మౌనినాయకా! ౧౯౦౭

క. నరులకును సురలకును నా-సురవరులకు దైత్యతతికి క్షోభప్రదమై
కరము భయంకరమగుచును-దుర మది యొనఁగూడె మిగుల దుష్ప్రేక్ష్యంబై.

క. ఘోరముగ సింహనాదం-బా రాక్షసుఁ డొనరుపంగ నఖిలసురేశుల్
దూరముగ రణముఁ గనుఁగొను-కోరిక విడనాడి దిశలకును జేరి రొగిన్.

మ. అతిదుర్ధర్షత దోర్బలాఢ్యుఁడయి జన్యంబున్ వెసం జేయు దు
ర్మతి నత్యుగ్రుఁ బ్రహస్తు రాత్రిఁ గడుఘోరంబైన యాయోధన
క్షితిపైఁ ద్రెళ్ళఁగ వేఁగుజామునను ద్రుంచెన్ భూరిబాహాబలో
ద్ధతుఁడౌ రాముఁడు పూర్ణశక్తి కరుణాతాత్పర్య మేపారఁగన్. ౧౯౦౮

ఉ. రావణుఁ డాప్రహస్తుఁడు దురంబున నీల్గిన వార్త దుఃఖియై
తా విని యెంతయున్ వగచి తల్లడమందఁగ, నింద్రజిత్తు చిం
తావశుఁడై తపించు తన తండ్రిని నూఱట నొందఁజేసి క్రో
ధావిలమానసుం డగుచు గొబ్బున శత్రుల నేఁచ నెంచుచున్. ౧౯౦౯

మ. పరమంబైన ప్రతాప మొప్పఁగను దా భావంబునం దెంతొ కా
వరముం బూని రఘూద్వహప్రకటవిస్ఫారప్రభం గాన కు
ద్ధురుఁడై యా నిశియందె సంగరభువిన్ దోర్గర్వ మేపార నం
బరమందుం దగ నిల్చి బాణతతులన్ వర్షించు చొక్కుమ్మడిన్. ౧౯౧౦

చ. అమితపరాక్రమంబు సుర లద్భుత మందఁగఁ జూపి నాగపా
శములను రామలక్ష్మణుల, సర్వవనౌకసవీరరాజి, ఋ
క్షములను గట్టివైచెఁ గడు సాధ్వసవృత్తి, స్వకీయమాయ భీ
మముగను జూపు, రావణసమానుఁడు వాఁడు తలంప నారదా! ౧౯౧౧

ఉ. అంత విభీషణుండు వడి నాక్షణమందున వచ్చి రామభూ
కాంతుఁ బ్రబోధచేసెఁ గడఁకన్ నిశియందె, మునీంద్ర! యప్పుడే
వింతగఁ దెల్వి నొంది రఘువీరుఁడు భీతిని భక్తిపూర్ణుఁడై
స్వాంతమునం దలంచెఁ బరసాధ్వసమోచని దేవి శాంభవిన్. ౧౯౧౨

క. పరదేవికరుణ గరుడుఁడు-సరగున నట కరుగుదెంచి సంయమివర! యు
ద్ధురనాగపాశములఁ దన-యురుతరచంచువులఁ జీల్చి యుక్కు మిగులఁగన్.

ఆ. రాఘవులను, వానరబలంబులను, భల్లూకముల నాగపాశకృతబంధ
నములనుండి మోచనముఁ జేసి వాని భక్షించి యలుకమీఱ సిద్ధమౌని!

రామరావణయుద్ధము

క. అంతఁ బ్రభాతము కాఁగా-నంతయు నాలించి రావణాసురుఁ డాభూ
కాంతుని నెదుర్కొనఁగఁ దా-నెంతయు దర్పమున వచ్చె నిల యద్రువంగన్.

ఆ. వచ్చి సర్వలోకభయదమౌ తుములయు-ద్ధంబుఁ జేయసాగెఁ, దతపరాక్ర
మాన్వితుఁడయి యప్పు డందఱ మార్కొ-నె-యుద్ధరంగమున సముద్ధతుఁడయి.

ఆ. ప్రళయకాలయముని భంగి భాసిల్లుచు-భయదరూపుఁడైన పంక్తికంఠుఁ
గాంచి వణఁకె నంతఁ జంచలమతి నాజి-వానరాళి మిగుల భ్రాంతినంది.

ఉ. రాముఁడు రావణుండును దురం బొనరింపఁగ సాగి, రప్పు డా
భూమిని రావణాసురుఁడు పూన్కి ననేకసహస్రకోటులన్
భీమపరాక్రమంబునను బిట్టుచెలంగి శరాళిఁ ద్రుంచె, ను
ద్దామభుజుండు రాఘవుఁడు తాఁ గని యంత సరోషహుంకృతిన్. ౧౯౧౮

చ. శరముల నాకసంబున దిశావలయంబునఁ గ్రమ్మఁ జేసి, ని
ర్జరు లరుదందఁ గప్పె, నిటు జన్యము సాగుచునుండెఁ, బూన్కి వా
నరులు గిరీంద్రశృంగము లనర్గళరీతిని దెచ్చి రాక్షసో
త్కరములపైని, రావణు రథంబుపయిన్ వడి వేసి రుద్ధతిన్. ౧౯౧౯

సీ. ఆంజనేయుండును నంగదుండును మొదలయిన వానరవరు లతిబలాఢ్యు
లెల్లను రావణునరదంబుపయి, రాక్షసాళిపైఁ గవిసి యత్యంతముగను,
సాలవృక్షములఁ బ్రియాళువృక్షంబులఁ దాళద్రుమముల నత్తఱి ననేక
వనజంబులైన వృక్షనిచయములఁ గొని కొట్టుచుండఁగ రణక్షోణియందు
తే. విరథుఁడయి పంక్తికంఠుండు దుర మొనర్ప
భ్రాంతినొందఁగఁ జంద్రసూర్యప్రతిములు
వీరులౌ రామలక్ష్మణుల్ భూరిహాస
మును నొనర్చుచు జన్యభూమిని మునీంద్ర! ౧౯౨౦

మ. ధను వత్యంతరయంబునం గుణముచేతం గూర్చి భీమంబులై
యనయంబున్ ఘనకాలదండనిభఘోరాకార బాణంబు లా
జిని నాదుర్మరు రావణాసురుపయిం జిత్రంబుగాఁ గప్పి రో
య్యన నాకాలమునందె వానరులు విఖ్యాతప్రమోదాత్ములై. ౧౯౨౧

తే. కిలకిలారావములఁ బుట్టు కలకలములు-కార్ముకజ్యాసమాకృష్టఘనరవములు
రాక్షసుల ఘోరశబ్దము ప్రథసముదయ-నేమినినదంబులును రణభూమియందు,

క. కరిబృంహితములు తురగని-కరహేషితము ల్చెలంగి కడు భయదములై
ధరణి నకాలప్రళయం-బరుదెంచినయట్టు లుండెఁ బ్రాణుల హృదికిన్. ౧౯-౨౩

చ. సమరమునందు రావణుఁడు శాతశరంబులఁ బర్వతంబులన్
ద్రుమములఁ గప్పఁగాఁబడి, విరోధులు మించినవా రటంచు సం
భ్రమమున భీతుఁడై వడి దురంబును మాని పురంబుఁ జేర గా
త్రము క్షతవిక్షతంబగుడు తాఁ జనె నారద! తాపసోత్తమా! ౧౯-౨౪

నలువదియొకటవ అధ్యాయము

రావణుఁడు కుంభకర్ణుని నిద్రలేపి యుద్ధమున కంపుట

ఉ. రాక్షసనాయకుం డయిన రావణుఁ డీవిధి యుద్ధభూమిలో
రక్షతఁ గోలుపోయి పురిఁ దా వడిఁ జొచ్చి మహాబలాఢ్యు శ
త్రుక్షయబద్ధదీక్షుఁ బటుదోర్బలశాలిని గుంభకర్ణు ని
ద్రాక్షితి మేలుకొల్పె సమరం బొనరింపఁగఁ బంపు వాంఛతోన్. ౧౯-౨౫

ఆ. కుంభకర్ణుఁ డంతఁ గ్రోధంబు దీపింపఁ-బంచలక్షకోటి బలయుతుఁడయి,
బాహుదర్ప మొప్పఁ బ్రబలసంగ్రామంబుఁ-జేయ యుద్ధభూమిఁ జేర వెడలె.

సీ. ఇంతలో దేవతలెల్ల భీతాత్ములై, రప్పుడు నారదా! యఖిలలోక
విభుఁడైన శతధృతి విబుధబృందముతోడ నాలోచనమొనర్చ నాజిభూమి
కవతరించెను, సకలామరవరులతోవచ్చిన బ్రహ్మను బరమభక్తిఁ
బూజించి పల్కెను బురుషోత్తముఁడు భగవంతుఁ డవ్యయుఁడైన పంక్తిరథుని
తే. తనయుఁడౌ రామచంద్రుండు వినయమునను
"దేవ! సురపూజ్య! గెలుతు నే నేవిధమున
యుద్ధదుర్జయులయిన దర్పోద్ధతాసు
రాళులను రావణాదివీరావళులను? ౧౯-౨౬

మ. వినవయ్యా! సురవంద్య! భీతి యొదవెన్, విఖ్యాతశూరుండు లో
కనికాయోరుభయప్రదుండు భువనాక్రాంతోరువిక్రాంతుఁడౌ
దనుజేంద్రుండగు రావణాసురు నెటుల్ దాకంగ నోర్తున్, జయం
బును గొందున్, దయమీఱఁగాఁ దెలుపవే పూతాత్మ! ధాతా! వెసన్.

క. లోకోపప్లవకారణ-మాకులితుఁడ నగుచు మిగుల ననుభూతుఁడనై
చేకొంటి, నిట్టి దేరికి-లోకత్రయమునను లేదు లోకస్తుత్యా! ౧౯-౨౭

చ. వివిధవిధంబులన్ భువనవిప్లవకారణ మేను జక్కఁగాఁ
దవిలినవాఁడ, లోకములఁ దద్దయు శ్రద్ధను బూని చూడఁగా

నెవఁడును దుల్యుఁడైన జనుఁ డెయ్యెడ లేఁడని యెంచువాఁడ నో
దివిజవరేణ్యపూజ్య! యిటు తేలెను స్వానుభవప్రధానతన్. ౧౯౩౦

మ. అది యట్లుండునుగాక! యుద్ధమును జేయంగోరి యత్యద్భుతా
స్పదుఁడౌ రాక్షసరాజుతమ్ముఁ డతిదుష్టప్రక్రియావంతుఁ డి
య్యెదనన్ వచ్చును గుంభకర్ణుఁ డనువాఁ డంచున్ భయంబొప్ప నె
మ్మది విన్నాఁడను బద్మసంభవ! యిఁకేమాడ్కిన్ జయం బబ్బెడిన్? ౧౯౩౧

తే. పదులక్షల కోటుల యతిబలాఢ్యు-లైన రాక్షసవీరు లాయసురవరుని
తోడఁ జనుదేర నాతోడదుర మొనర్ప-నున్నవాఁ డన్నకు సహాయ మెన్నిమదిని.

ఉ. వాని పరాక్రమంబుఁ దెగువన్ దగఁ జెప్పె విభీషణుండు, నా
మానస మెంతయున్ భయము మైకొనియున్నది, లోకసృష్టిసం
ధాన! వచింపు మీవు, విబుధస్తుతిపాత్ర! పితామహా! యిఁకే
పూనిక దానవుం గెలిచి పూర్ణజయంబును గొందు నాజిలోన్?'' ౧౯౩౩

ఉ. దేవత లెల్లఁ జూడఁగ విధిన్ భయవిహ్వలుఁ డౌచు రాఘవుం
డీవిధిఁ బల్క, నయ్యజుఁడు హృష్టునిఁ జేయుచు రామచంద్రునిన్
బావనసాంత్వనోక్తులను బల్కె ''జగత్పతి! శ్రీమనోహరా!
యీ వెఱఁగంగరాని దొక యింతయు లేదుగదా! మహాప్రభూ! ౧౯౩౪

బ్రహ్మ రామునకుఁ బూర్వవృత్తాంతంబుఁ దెల్పుట - దేవీమహిమ నెఱిఁగించుట

చ. అడుగుచు నున్నవాఁడ వని యాత్మకుఁ దోఁచినరీతిఁ దెల్పెఁగాఁ
దొడఁగినవాఁడఁ, గాన, విను తోరపువేడుక, నమ్మహాసురున్
గడిమి వధింపఁగాఁ దగిన గట్టి యుపాయ మదొక్కటే కనం
బడుచును నున్న, దద్ది విని భక్తిని జేయఁగఁబూను మెంతయున్. ౧౯౩౫

సీ. త్రైలోక్యమాతయై దేవి సనాతని బ్రహ్మరూపాత్మిక ప్రబలభయము
వారింప దక్షయా, వసుధఁ గాత్యాయని విజయప్రద యటంచు విశ్రుతిఁ గను,
సర్వలోకములకు జయమును సమకూర్చు నపరాజితాఖ్యనా నతిశయిల్లు,
నాదివ్యమహిమాస్పదాంఘ్రియుగ్మంబును సేవింపఁగాఁ గోర్కె సిద్ధినొందు,
తే. సంశయము లేదొకింతయు, స్వాంతమందు-భక్తితో నిల్పి సకలదుర్భరవిపత్ప్ర
తారిణిని సర్వదుష్టసంహారిణిని భ-జింపు, మిఁక నెయ్యదియును యోజింపవలదు.

తే. ఆదిదేవి ప్రసన్నయై యరయ దేని-యుద్ధమున ఘోరవీర్యసముద్ధతిఁ గని
యరినిషూదన! రావణాద్యఖిలయుద్ధ-వీరులను గెల్వఁగాఁజాల, వారయు మిది.

సీ. ఏదేవినామంబు నెదలోనను స్మరించి యత్యంతభయదమైనట్టి భూరి
హాలాహలంబును నాని మృత్యువు గెల్చి మృత్యుంజయుం డను మేటిపేర

లోకంబుల శివుండు ప్రాకట్యమును గాంచె, నా దేవి సంతృప్తినందఁ జేసి,
లంకాపురంబు నిశ్శంక జయింపుము మహనీయభావ! నిర్మలగుణాఢ్య!
తే. యిపుడు దుష్టప్రణాశిని నపరిమితజ-యప్రదాయిని యయిన దేవప్రధాన
సభనుస్మరియింపవలయుఁబూజన మొనర్ప-వలయుజయలాభమునుగోరిభక్తితోడ.

క. సమరవిజయంబుఁ గాంక్షిం-పుము, లోకావనము చేయఁబూనుము, దేవీ
విమలపదసరసిజంబుల-నమరింపుము హృదయసీమ నతిశయభక్తిన్. ౧౯౩౯

తే. రావణుఁడు చండికాభక్తిరతుఁడు మిగుల-నతని గెల్వంగ నేరికి నలవియగును!
లోకజనయిత్రిసత్కృపాలోకనంబు-లేకయుండిన నెపుడు సుశ్లోకవంద్య!
క. మును దేవియె నీ కాజ్ఞ-ప్తిని నొసఁగె నిదంతయును నభీష్టద మని శం
భుని యెదుటను నాయెదుటను-గనవే, యది మఱచినావె త్మానాథ! విభూ!

చ. తెలియుదు వంతయున్ మదిని దివ్యగుణాన్విత! నన్నుఁ బ్రశ్నముల్
సలిపినవాఁడ విప్పుడు ప్రసన్నమనీష! వచింతు నీకు, ని
శ్చలమతివై వినందగును, సంగరసీమ రిపూత్కరంబులం
గెలుచు నుపాయ మంతయును గీర్తివిభూషణ! భక్తతోషణా!" ౧౯౪౨

నలువదిరెండవ అధ్యాయము

శ్రీరామచంద్రునకు బ్రహ్మ పూర్వవృత్తాంతమును నివేదించుట

తే. శ్రీమహాదేవుఁ డిట్లని చెప్పఁదొడఁగె
నారదమునీంద్ర! "విను మంత సారసభవుఁ
డారఘూద్వహునకు సంగ్రహంబుగాఁగఁ
బూర్వవృత్తాంతమును దెల్పఁబూనె నిట్లు. ౧౯౪౩

మ. "భగవంతా! ఖలు రావణాసురుని జంప న్మానవత్వంబునం
దగు జన్మింపఁగ నీ వటంచు మును నే ధన్యాత్మ! ప్రార్థింపఁగా
నాఁగి దేవా! పరిరక్షచేయుటకునై యుల్లంబునం దీశ్వరిన్
దగఁ బ్రార్థింపఁగ వెండికొండకు వెస న్గార్యార్థివై పోవాకో! ౧౯౪౪

ఆ. ఏను శంకరుండు నెంతయుఁ దన్మాయ-మోహితులము నగుచు మొనసి వెంట
వచ్చినార మంతఁ ద్వదనుగ్రహార్థమై-యసురవరునిఁ జంపునాశయమున.

ఆ. అపుడు నీవు దేవ! యాదేవిపదముల-కెరఁగి మాటిమాటి కిద్ధభక్తి
'నంబ! సుప్రసన్న వగుము నాయెడ' నను-పలుకు పలికినావు పరమపురుష!

చ. ''త్రిదశవరేణ్యు లెల్లరు విరించియు మిక్కిలి భక్తితోడ నా
సదనముఁ జేరవచ్చి నను సంస్తుతిచేసిరి మానవత్వ మీ
యదనున నొంది, లోకనిచయావనముం బచరింపు మంచు, నే
సదయత సమ్మతించితిని జన్మము నెత్తఁగ భూతలంబునన్. ౧౯౪౮

ఆ. దేవి! నీవు ప్రీతి రావణునకు సుప్రసన్న వైతి వెపుడు, నిన్ను వాఁడు
పరమభక్తిఁ గొల్చుఁ బరదేవి! బల్లిదుఁడైన వాని నాజి నగునె గెలువ?''

క. అనుచుఁ బరదేవిఁ బ్రార్థించినవాఁడవు పలువిధములఁ జేయుచు నుతులన్,
విని దేవి త్వదభ్యర్థనమును బలికెను వినుము క్లుప్తముగ వచియింతున్. ౧౯౪౯

సీ. ''మాయామనుష్యుఁడ వై యిల జనియించి యెపుడు లంకేశుతో నెసఁగు పూన్కి
యుద్ధంబు జేయఁగా నుద్ధతి జతనంబు సల్పంగ నుందువో స్వాంతమందు
నారాయణా! నీవు నన్ను స్మరింపుమా సతతంబు సంగ్రామసమయమందు
ఘోరతరంబులౌ నారాచములునైన నిన్ను బాధింపవు నిక్కముగను,

తే. వారల పరాక్రమంబు నీ వారసి భయ
మందఁజాల వొకించుకయైన దేవ!
నమ్ము మీమాట, భద్రంబు నిన్నుఁ జెందు''
ననుచు వరమిచ్చి దేవి తా ననియె మఱియు. ౧౯౫౦

చ. ''కదనమునం దకాలమున గాటపుభక్తిని బూజచేసి న
న్విదితవిధానయుక్తముగ వీరవరేణ్యా! యరిం జయించి స
మ్మదమును బొందుమా సతము పూర్ణముగా మదనుగ్రహంబునన్
బొదలుచు'' నంచు దేవి వరముం దయసేయదె మున్న రాఘవా! ౧౯౫౧

ఉ. కావున నోమహాశయ! యఖండబలాఢ్య! రఘూద్వహా! వడిన్
రావణుఁ జంపఁగోరినఁ బరాత్పరి సర్వజయప్రదాయినిన్
భావములోపలం దలఁచి భక్తి నొనర్పుము యుద్ధ మిత్తఱిన్,
నీవు జయింతు, వీపలుకు నిక్కమటంచును నిశ్చయింపుమా! ౧౯౫౨

క. మునివరుఁడు వసిష్ఠుఁడు నాతనయుఁడు, నీకును గురుండు దయనొసఁగిన దే
వ్యనుపమమంత్రంబును నెమ్మనమున స్మరియింపు దేవ! మఱి రణభూమిన్.

తే. రాక్షసేంద్రునితో సంగరంబు చేయ
వయ్య! శ్రీరామచంద్ర! సురారియైన
రావణుని బంధుయుతముగఁ జేవ మెఱయ
గెలువు మోరాఘవా! శంక వలదుసుమ్ము. ౧౯౫౪

తే. రామ! రఘునందనా! భక్తిరతుఁడవయి ప
రాంబఁ బూజింప యత్నింపనగును నీవు,
తత్ప్రసాదంబు లేక యుద్ధభువియందు
నెంతగాఁ బూనుకొన్న జయింపలేవు. ౧౮౫౫

తే. శుక్లపక్షంబు వచ్చినచో సురేశ్వ-రీపదంబులఁ బూజించుఁ బ్రీతి రావ
ణాసురుఁడు, రాన వానికి నరయ మృత్యు-వొదవదించుకనైన, నియ్యదనునండె.

క. మనమున నకాలమని నీ-వనుకొనక పరాంబఁ బూజ నలరింపుము, చ
య్యన దుష్టరాక్షసులఁ జం-పను బూనుము రామభద్ర! భద్రం బగుతన్."

చ. అని వచియింపఁగా సరసిజాసనుఁ డంతయు శ్రద్ధఁ బెంపునన్
విని రఘురాముఁ డిట్లనియె విద్వరుఁడయ్యును దాను, సర్వము
న్మనమునఁ దోఁచియున్ భువనమాన్యత లోకముమేలుకోరి యి
య్యనువున బ్రహ్మతోడ విబుధాధిపవంద్య! మహాత్మ! నారదా! ౧౮౫౬

సీ. "నీవు చెప్పినదెల్ల నిజము ప్రజాపతీ! యాదేవి జయమిచ్చునట్టి తల్లి,
ప్రత్యక్షముగను బరాత్పర యగుఁజుమ్ము, సంగ్రామసీమల జయముఁగోరు
నట్టివారలకుఁ బూజార్హ యా స్మరియింపఁదగియున్న దగు నంచుఁ దలఁచినాఁడ,
నైనను దేవార్చనాదివిధానము జరుపఁగా నియ్య దసమయమగును,
తే. నిర్జరేశ్వరి యిప్పుడు నిద్రితయగు,-శుక్లపక్షంబు గా దిది, చూడఁ గృష్ణ
పక్ష మగును విశేషించి, భక్తిఁ బూజ-నెట్లు గావింతు నిద్రించు నెడ విరించి!"

చ. అనవుడు బ్రహ్మ యిట్లనియె "నచ్యుత! యుద్ధమునన్ జయంబు ని
న్ననయువిధంబునన్ దితిసుతేశ్వరు దుష్టు నమంగళున్ దురా
త్ముని దశకంఠు నేపడఁప బుద్ధిఁ దలంచి పరాత్పరన్ ప్రబో
ధనమును జేయువాఁడను, విధానము మీఱఁగ నిష్టి రాఘవా! ౧౮౬౦

తే. తగిన కాలంబు గాదని తలఁపవలదు-పూజ చేయుము రాఘవా! భూరిభక్తి
నా మహాదేవి నిపుడు, సంగ్రామసీమ-గెలుతు వరులను, జింతింపవలదు మదిని."

చ. శతధృతి యిట్లు పల్క విని శౌర్యధనుండగు రాఘవుండు స
మ్మతిఁ బరమేష్ఠితోఁ బలికె "మాన్య! చతుర్ముఖ! తావకోక్తి న
మ్మితి, భవదీయపుత్త్రుఁ డెడ మేలుదలంచు గురుండు నాకగున్
సతము వసిష్ఠుఁ, డట్లగుట సర్గవిధాయక! పద్మసంభవా! ౧౮౬౨

క. భువనంబులకుఁ బితామహుఁ-డవు, మద్గురునకును జనకుఁడవు నయితివి, గా
రవమున నీవు గురుండవు,-తవిలి భజించెదను దేవిఁ దగు నర్చనలన్. ౧౮౬౩

క. దుర మొనరింప నశక్తుఁడ,-నరిది జయోత్సాహశక్తి యమరదు నాకున్,
బరదేవికరుణ రావణుఁ-బరిమార్పఁగ నుత్సహింతు భయరహితుఁడనై. ౧౯౬౪

ఉ. రావణుఁడున్ సురేశ్వరిఁ బరాత్పర సీక్రియ శుక్లపక్షమం
దే వరభక్తిఁ బూజలను దృప్తియొనర్పఁగఁ జేసినంతటన్
భావమునందు మెచ్చి కడు భద్రములైన వరంబు లిచ్చినన్
జీవ చెలంగు వాని, కెటు చెందుదు యుద్ధమునం బితామహా!" ౧౯౬౫

ఉ. నావుడు బ్రహ్మ పల్కె "రఘునాథ! పరాంబ వచించెఁ బూర్వమే
పావనమైన యుక్తి, యది బాగుగ లోనఁ దలంపవయ్య! యా
రావణుఁ డీల్గుఁ దావకశరంబున సంగరసీమయం, దిఁకే
భావముఁ బొందఁబోకుము, ధ్రువం బిది, శంకయె లేదు దీనికిన్. ౧౯౬౬

ఉ. భావమునందు దేవిపదపద్మములన్ స్థిరభక్తి నిల్పి సం
సేవ యొనర్పుమా మరలఁ, జిత్తమునందున మెచ్చి యిచ్చు శ్రీ
దేవి వరం, బదేకరుణ దివ్యబలాఢ్యుఁడవై దురంబునం
దీవె జయంబుఁ బొందుదు వహీనపరాక్రమ! రామ! శ్రీపతీ! ౧౯౬౭

సీ. పాపాత్ముఁడైన రావణుఁడు దుర్బుద్ధియై పరమపతివ్రత వరసుశీలఁ
బ్రత్యక్షలక్ష్మియై పరఁగు స్వామూర్త్యంతరయును నా సీతను భయ మొకించు
కయు లేక రమియింపఁగా నెంచి బలవంతమునఁ దెచ్చినప్పుడే కనలి యాత్మ
నాదుష్టరాక్షసు హరియింపఁగా మృత్యురూపంబుతోడ లంకాపురంబుఁ
తే. దానె చేరినయది, యెందు ధర్మబుద్ధి-శాంతియు వసించు సిరియును గాంతి యనఁగ
నుండు నం,దెందు ధర్మంబె యుండు, నందు-దేవి యాపత్స్వరూపిణిగా వసించు.

తే. ఎవఁ డహంకారమున ధర్మహేళనంబుఁ-జేయు, నవ్వాని దర్పంబు పాయునట్లు
రామచంద్రా! యడంచుఁ బరాత్పరయగు-దేవి తా దర్పశమని నాఁ దేజరిల్లి.

దుర్వృత్తిప్రాయశ్చిత్తము

క. దీనికిఁ దగు నితిహాసం-బేను వచించెదను విను, మహేశియె మును దాఁ
బూనికఁ బలికెను, నత్తతి-యే నంటిని, వింటి దేవిహితవచనములన్. ౧౯౭౦

ఉ. శ్రీరఘురామ! యేను మును శ్రీగళుపోలికఁ బంచవక్త్రముల్
గారవ మొప్పఁ దాలిచి జగంబున నుంటి, మఱొక్కనాఁ డహం
కారము మీఱ శంకరునిఁ గన్నులఁ గానక పల్కినాఁడ ని
ష్కారణరోషపూరితవచస్సుల నెంచక మంచిచెడ్డలన్. ౧౯౭౧

ఉ. అక్షణమందె శంకరుఁ డహా! మఱి యేమని చెప్పువాఁడ, రూ
క్షేక్షణ మొప్ప సంక్షుభితచిత్తముతోడుత నాశిరంబు తా

దక్షతఁ ద్రెంచివైచె మదిఁ దాల్మి యొకించుకయేని లేక ప్ర
త్యక్షముగాఁ గనుంగొనఁగ దాశరథీ! విను నాఁటనుండియున్. ౧౯౭౨

సీ. చతురాననుఁడనయి జగమునఁ బ్రఖ్యాతినందితి, నొక్కనాఁ డమరవంద్య
యగు దేవిఁ గొలువంగ నరిగితి శ్రీవిష్ణుదేవునితోడఁ దద్దివ్యసన్ని
ధానంబునకు, నట కానిమేషంబున నామహాదుర్గ నత్యధికభక్తి
నర్చించు కోర్కె మహారుద్రదేవుండు వచ్చె, నీవిధమున బ్రహ్మనయిన
తే. యేను, వాసుదేవుండు, మహేశ్వరుండు-నామహాదుర్గసన్నిధియందుఁ గూడి
నార, మప్పుడు విను మేను గౌరవమున-వారి సమ్ముఖమున నయభయము లొప్ప.

క. త్రిదశేశ్వరి యగు దేవీ-పదములకు నమస్కరించి భక్తి వెలయ నె
మ్మది శంభుఁడు వినఁ బల్కితిఁ-గుదురుగ నాహరుని సరసఁ గూర్చుండి విభూ!

సీ. "భవదనుగ్రహదర్పభావంబు దీపింప జనయిత్రి! నాదు పంచమశిరంబు
సురవరసభలోనఁ జూడఁగా నెల్లరు ఖండించె నాఁడు నిష్కారణముగ,
నేయపరాధంబు నేఁ జేసియెఱుఁగను, శిర మేల ఖండించె శివుఁడు దేవి!
త్రిదశవరేణ్యావందితపాదసరసిజ!" యని విన్నప మొనర్ప నఖిలలోక
ఆ. జనని సుప్రసన్నచారుముఖాబ్జయై-నన్నుఁ గాంచి పలికె "సన్నుతాత్మ!
యుల్లమందు నుండు నురుసంశయంబును-దొలఁచుదాన వినుము సలిలజభవ!

సీ. తనయా! శుభంబులఁ గనఁజేయు కర్మంబు, లశుభయోగంబుల నందఁజేయు
కర్మంబులను బాగుగను నెఱుంగుదు నేను, బ్రహ్మదేవ! శుభాశుభము లగు పను
లకు నెల్ల ఫలములఁ బ్రకటంబుగా నిచ్చునట్టిదానను నేనె, యఖిలభువన
ముల స్వతంత్రను సుమ్ము,ముఖ్యులు లేరు నాకంటె నెవ్వరు, నెందుఁగనిన నెపుడు,
తే. శుభమొ యశుభంబొ యెవఁ డెట్లు సొరిదిఁ జేయు,
నట్టివాఁ డొందు దానికి నర్హమయిన
ఫలము, వేఱువిధంబగు ఫలముఁ బొందఁ
జాలఁ డెందును నిజముగా సారసభవ! ౧౯౭౬

క. ప్రియుఁడని యప్రియుఁడని యా-రయ భేదము లేదు, తనదు ప్రారబ్ధఫలో
చ్చయమును దాఁ బొందును, ని-శ్చయ మియ్యది,సందియము పొసంగదు దీనన్.

సీ. కామంబుచేత ముగ్ధత నొంది యాత్మలో స్వాత్మజయైన సంధ్యను గనుఁగొని,
రమియింపఁగాఁ గడుఁ దమి నొందినాఁడవు పంకజాసన! దాని ఫలమె సుమ్ము
పొందినాఁడవు నీవు పూర్ణంబుగా, హేతువియ్యదియే యని యెఱుఁగు మిపుడు,
శంకరకోపసంజనితంబుగాని, యే యితరమైననుగాని హేతుమాత్ర
తే. మే యగును నిశ్చయంబుగ నెంచిచూడఁ-దత్త్వము స్వకర్మసదృశమైతగుఫలంబె
యనుభవింపంగఁదగు నంచు మనమునందుఁ-దలఁపవలె, నీకు నట్టులే కలిగె వత్స!

క. తన తనయను గామంబున-నెనయఁగ మదిఁ గాంక్షసేయు నెవఁ, డాత్మజమం
దునసె మదిచ్ఛావశతం-గను వాఁడు విరించి! శిరము ఖండితమగుటన్. ౧౯౭౯

తే. ధర్మ మిదిగాన నీతల తఱుగఁబడియె-జగదధిష్ఠాత్రి యనఁబడు సర్వశక్తి
నయిన నాచేత, శంకరునందు దోష-మేమి యున్నది? శూలాని కేమి తెలియు?

క. వరధర్మాధర్మములకు-విరోధ మొనరించువారి విధ మిది ధ్రువమై
పరఁగును, నియంత్రి నేనే-యరయ జగమునన్, మదన్యుఁడు గలఁడే? ౧౯౮౧

క. కమలాసన! తావకపం-చమమగు వక్త్రంబు గాఁగ జ్వాలనుఁడు వెలయుం
జుమి, దానహుతములగు హ-వ్యములు సురల కొసఁగుఁ దృప్తి ననవరతంబున్."

దేవీస్తోత్రము

మ. అని యీరీతిగ దేవి తెల్ప మదులం దానందముం బొంది గొ
య్యన భక్త్యన్వితచిత్తవంతులము నై యా లోకసంధాత్రికిన్
వినయం బొప్పఁగ దండవత్ప్రణతులన్ వేవేలు గావించి త
ద్వినుతిం జేసితి మిట్లు మువ్వురము దేవీదివ్యమాహాత్మ్యమున్. ౧౯౮౩

సీ. "బ్రహ్మయు శివుఁడు నారాయణుఁ డనునట్టి మువ్వురు పురుషులమును జనించి
నారము నీకు నందనులమై, యటులయ్యుఁ దావకంబగు సనాతనమహాద్భు
తయుతమహామహత్వము నించుకేనియు నెఱుఁగంగఁజాల మోయీశ్వరి! యిఁక
నీ యచింత్యములగు నిద్ధరూపమహిమైశ్వర్యాదిగుణముల వదలఁబడిన

తే. వార మే రీతి నుతియింప నేరుపుగల-వార మగుదుము, జగదంబ! వరకరుణను
మమ్ముఁ గనుఁగొని బ్రోవవే సమ్ముదమున-సతము మా యెడ దేవి! ప్రసన్నవగుము."

వ. శివుం డిట్లు వినుతించె ౧౯౮౫

సీ. "సురవరేశ్వరి! భవచ్చరణరేణువులను ధరియింపఁగా వాంఛ దవిలి భక్తి
యెంతమాత్రం బని యెంచుచు దివ్యమందాకినీవారిని దగ మునింగి
నాఁడ నో దేవి! త్వన్మహితపాదాంబుజ వరరేణుమహిమంబు నరయు శక్తి
నాకుఁ గల్గఁగ లేదు, లోకమాతవును, సాలోక్యసంధానవిశారదవును

తే. నయిన యద్భుతశక్తి వీ, వరయ నేను-మద్గుణంబులచే నిన్ను మదిని దెలిసి
పొగడఁజాలుదునే సర్వభూతధాత్రి! సతత మంబిక! నాకుఁ బ్రసన్నవగుము.

సీ. ఓ దేవి! భవదీయపాదపంకజముల నెమ్మనంబునఁ దాల్చి నియతభక్తి
సకలలోకములకు సాధ్వసంబును గూర్చు కాలకూటవిషంబుఁ గడఁకమీఱ
మృత్యువును జయించి మ్రింగినవాఁడను నవనీతపానంబునకు సమముగ,
నయ్యది చూడంగ నలరారుచున్నది యిప్పటికినిగూడ, నిదిగో కంఠ

తే. నీమయందున దీప్తమై చెలఁగు నల్ల-నేరెడుఫలంబురీతిగా భూరికాంతి,
యోసకలలోకధాత్రి! నీవురుకరుణను-సతత మంబిక! నాకుఁ బ్రసన్నవగుము."

వ. విష్ణుమూర్తి యిట్లు నుతించె ౧౯౮౮

సీ. "ఓ పరదేవి! మహోదధియందు శేషాహీంద్రు శిరమున ననవరతము
శయనించుచున్నాఁడ, జనయిత్రి! తనుఘటస్యందైకబిందుసంజాతుఁడ నయి,
శ్రీదేవియును వాణి చెలఁగి సమ్మోదంబు నొందింప వెలయుచు నుకుముదమున,
నట్టివాఁడను నయ్యు నంతరంగంబున నించుకేనియు నిన్ను నెఱుఁగఁజాల
తే. కున్నవాఁడఁ బ్రయత్నించి యెన్నఁడైన,-నట్టి యే నెట్లు నాదు గుణాళిచేత
సన్నుతింపఁగఁ గలవాఁడ? నన్ను బ్రోవు-సతత మంబిక! నాకుఁ బ్రసన్నవగుము.

సీ. ఓదేవి! నీవు సర్వోన్నతప్రకృతివి, కడు సూక్ష్మరూపవు, కనఁ బరాత్ప
రవు, ప్రపంచైకహేతువు నయి వెలయుదు, వోమంగళాకార! నా మదిఁ గన
వలఁతియే సకల భువనములను సృజించు శక్తిచేతను నైన జగతిఁ బరుని
చేతనైనను, నీవె మాతవు జగముల, కే మాత్మజన్ముల మై మువురము
తే. వెలయుచున్నార మోయంబ! విశదకరుణ
నెసఁగు దృష్టుల మాయందుఁ బొసఁగఁ బఱపి
మమ్ము రక్షింపు మోవిశ్వమాత! ప్రీతి
సతత మంబిక! మాకుఁ బ్రసన్నవగుము" ౧౯౯౦

వ. బ్రహ్మదేవుం డిట్లు సన్నుతించె ౧౯౯౧

సీ. "ఓ దేవి! నీస్తుతి యొక్కింతయు నెఱుంగ, నీ దివ్యరూపంబు నే నెఱుంగఁ,
ద్వద్గుణంబులఁగాని తత్త్వశీలంబులఁగాని యొకించుకయేని యెఱుఁగ,
వేదోదితంబయి వెలయు నేదియొ కొంత యెఱుఁగుదు నది యేదా హృదయమందు,
నది కోటివక్త్రసముదయములను బహుయుగములఁ జెప్పిన ముగియ దెపుడు,
తే. నీమహిమ యిట్టి దంచును నేనుబాగఁ-జాల నాదుగుణంబుచే సకలభువన
మాత! యోమంగళాకార! ప్రీతితోడ-సతత మంబిక! నాకుఁ బ్రసన్నవగుము."

తే. ఇట్లు స్తుతివచనములచే నినకులేశ!-వినుతుల నొనర్చి భక్తితో వినయమునను
బ్రణతులను జేసి తమమందిరములఁ గూర్చి-చనిరి బ్రహ్మాదులంబవీడ్కొని ముదమున.

ఉ. ఓ రఘురామ! యీవిషయ మొప్పఁగ మాతయె నాకుఁ జెప్పె వి
స్తారకృపన్, మదిం గనుము, సత్యముసుమ్మిది, రావణుండు తా
నారయ దుష్టచిత్తుఁడు, మహామహిమాఢ్య పరాంబ యాఖలున్
గోరిక బ్రోవ దెప్పుడును, గూరిమిఁ జూపఁగఁ బోదు, నమ్ముమా! ౧౯౯౨

క. కమనీయరూప సీతా-రమణియు మండోదరి యుదరమున జనిఁగనేఁ
గామరితయగు క్షేత్రజనా-నమరారికి రావణునకు, నట్లగుట విభూ! ౧౯౯౫

ఉ. కామముచేత ముగ్ధుఁడయి గాదిలిపుత్త్రి యటంచు నెంచ కు
ద్దామపరాక్రమంబునను దా మది లోభము నూని రామ! నీ
భామిని సీత లంకకును బల్మిడిఁ దెచ్చిననాఁడె లంకయుఁ
క్షేమము వీడి పోయినది వేగ రఘూత్తమ! వాని దుష్కృతిఁ. ౧౯౯౬

ఉ. ప్రాకట ధర్మనిష్ఠులగువారికిఁ బ్రీతి జయంబుగూర్చు , వే
లోకమునందుఁ బాపులగు లోలుర నెల్ల నశింపఁజేయు , ని
త్త్యైకవిభూతితో నెసఁగు నంబిక ; సర్వసుపర్వవంద్య, య
స్తోకగుణాఢ్య, దేవి మదిఁ జూడుము నిత్యము భూరిభక్తితోఁ. ౧౯౯౭

ఉ. నిత్యము పూజచేయుము సునిశ్చలభక్తిని నా మహేశ్వరిఁ,
సత్యము సత్య, మెల్లపుడు శంకరి నీకు జయంబు నిచ్చు, నో
సత్యపరాక్రమా! భువిని స్వర్గమునందు రసాతలంబునం
దత్యధికాదృతిఁ జనని హాని ఘటింప దొకింతయేనియుఁ. ౧౯౯౮

చ. భయమును వీడి, నెమ్మదిని భక్తిని గూర్చి, సమస్తరీతులఁ
జయమును గూర్చు దేవి నుపచారములం దగఁబూజచేయుమా,
జయము రణాంగణంబునను సత్యముగాఁ గనువాఁడ , వార్య! ని
శ్చయముగ శత్రుసంతతుల సంగరమందునఁ జెండు దుష్కృనఁ. ౧౯౯౯

సీ. విధివిధానంబున విశ్వైకవంద్యను బర దేవిఁ బూజింపవలయు రామ!
యరయ నకాలమందైనను భక్తియే పాటింపు మెదలోనఁ బరమనియతి,
చింతింపఁబోకుము చిత్తంబునందు నించుకయేని రఘురామ! ప్రకటితముగ
శత్రుసంతతులను సమరభూతలమున గెలువంగఁగలవు నిశ్చలత నిపుడు ,
తే. ధర్మమే జయమిచ్చు, నెంతయునుభక్తి- దేవిఁ బూజింపఁగోరువయేదిగలదెందు!
నెం దధర్మము కనఁబడు నందె దేవి-యడరుచు విపత్స్వరూపిణి యగుచు రామ!

మ. హితముం జేయుచు సర్వలోకముల కెంతే పూన్కి శ్రీరామ! స
న్నుతసుద్ధప్రకృతిఁ జెలంగు గుణగణ్యుం డన్న విఖ్యాతి నీ
క తగుఁ, న్యాయపథప్రవృత్తుఁడవు నీవే, కావునఁ సర్వ స
మ్మతకార్యాచరణా! జయంబు గలుగుం బూర్ణంబుగా నమ్ముమా! ౨౦౦౧

సీ. శ్రీరామచంద్ర! యా ఘోరాత్ముఁడగు రావణాసురుం డొనరించినట్టి దివ్య
శుభకర్మఫలమును సుంతయు మిగులక యనుభవించినవాఁడు, విను మిఁ కించు
కంతయు లేదు, తా నెంతయు నిప్పుడు చేసిన దుష్కర్మసిద్ధఫలము
గలదు, భుజింపఁగాఁ గడు బెట్టిదంబుగా వచ్చియున్నది, నీదు చిచ్చుఅపిడు

తే. గులనుబోలిన శరజాలములను నిహతుఁ
డగుచు భువిఁ బడఁగలవాఁడు, దిగులువలదు,
దాన శ్రీరామ! సద్భక్తి నూని మదిని
స్థిరుఁడ వయి పరదేవిఁ బూజింపు మిపుడె. ౨౦౦౩

క. సుంతయు నీమదిలోపలఁ-జింత యునుపవలదు, దేవి శీఘ్రము క్రూర
స్వాంతయయి రావణాసురుఁ-బంతంబునఁ జంపు, నిన్నుఁ బాలించు దయన్.

నలువదిమూఁడవ అధ్యాయము

దుర్గాలోక వర్ణనము

క. మునినాథా! రఘురాముఁడు-వనజాసనువలన దేవివరమహిమంబున్
విని విశదమానసుఁడు పెం-పున మరలం బ్రశ్న చేసెఁ బూతాత్ముఁడై. ౨౦౦౪

ఉ. "ఓ మహనీయబుద్ధి! భవదుక్తి యదెంతయు సత్య, మెన్నఁగాఁ
గామితము ల్ఫలింపఁగను గన్గొని దేవి జయంబు నిచ్చు నం
చే మది నెంచినాఁడను, జయేచ్ఛ నెసంగి మహారణంబునం
దామహనీయరూపఁ గడు నాదృతిఁ బూజయొనర్పఁ గోరెదన్. ౨౦౦౫

తే. ఇప్పు డాదేవిజయదుర్గ యెందు ముదము-వెలయ నివసించుచుండుఁ, దద్విశదరూప
మెట్టులో నాకుఁ దెలుప వేహితముమీఱఁ-బద్మసంభవ! సుగుణాఢ్య! బ్రహ్మదేవ!"

చ. అనవుడు బ్రహ్మ యా రఘుకులాంబుధిసోముని రాముఁ గాంచి, యి
ట్లనుచు వచింపఁగాఁ దొడఁగె "నార్య! యదెంతయు నీ వెఱుంగు, దై
నను వచియింతు నిప్డు, భువనంబుల శ్రోతల కెల్లఁ బావనం
బును గడుఁ బుణ్యాదంబు నయి పొల్చును గావున భక్తిపెంపునన్. ౨౦౦౬

సీ. సర్వస్థలంబుల సంచరించుచు నుండు, సర్వప్రదేశసంస్థ యయియుండు,
సర్వప్రపంచప్రశస్తపీఠంబుల నెంతయుఁ దమి వసియించియుండు,
బ్రహ్మాండమధ్యనివాసిని యయి యుండుఁ, దద్బహిర్భాగానఁ దవిలియుండు,
స్వర్గలోకంబున జనలోకమందునఁ గైలాసమున హిమశైలమునను
తే. శివుని సన్నిధియందును జెలఁగియుండు-భగవతీమూర్తి యంతటఁ బరఁగుననుచు
వరుస వచియించును బురాణవరము లెల్ల,-నీవచన మభిమతమగు నెల్లరకును.

సీ. బ్రహ్మాండబాహ్యామహా భాగంబునందున రాజిల్లు నేదేవి రమ్యమూర్తి,
తాంత్రికమని చెప్పఁదగియుండు నయ్యాది పరయగు నన్నింటిపైని రామ!
యాదేవి యగును మహాదుర్గ, యతిగోప్య, మదిని నిత్యానందమయి యనంగఁ
దెలియంగవలయును, ధృతి నాపరాంబికాస్థాన మిట్టిది యని చర్చచేసి,

తే. విశదముగ రచియింపఁగా విశ్వనిచయ
మందు నెవనికిఁ గాని సాధ్యంబు గాదు,
తెలుపుచున్నాఁడ నొక్కింత తెలిసినంత
యవహితుఁడ వయి వినుము మహానుభావ! ౨౦౦౯

తే. క్రమముగా నొక్కటొకటి దూరంబు నగుచుఁ
దనరుఁ బైపయి రామ! పాతాళభూత
లములు సర్వంబు బ్రహ్మలోకమును నిట్టు
లన్నియును లోన నిమిడె బ్రహ్మాండమందు. ౨౧౦

తే. అతిమనోహర మగుచు బ్రహ్మాండబాహ్య
మందు బ్రహ్మలోకమునుండి యవతరిల్లి
లక్షయోజనదూరమం దక్షయమయి
యలరు శివలోక, మద్ది నిరామయంబు. ౨౧౧

క. కమనీయసతతవైభవ-సమితియుతుఁడు వాగతీతశక్త్యాంచితుఁడై
ప్రమథులతోడ మహేశ్వరుఁ-డమితానందంబుఁ బొందు నాలోకమునన్.

క. శివభక్తులయినవా రా-భువనంబు మనోహరంబుఁ బొంది సుఖముగా
నవిరతముగ సుఖయింతురు-ప్రవిశదకరుణాబ్ధియైన పరశివు కరుణన్. ౨౧౩

సీ. ఆలోకమున కూర్ధ్వమందు రమ్యంబయి లక్షయోజనదూరలక్ష్యమునను
విలసిల్లుచుండును విష్ణులోకము, దానియందు విరాజిల్లు ననవరతము
శంఖచక్రంబులు జలజంబు గదయును ధరియించి, కమల సంబరము మీఱ
సేవింపఁగా, విష్ణుదేవుఁ డనిర్వాచ్యవిభవాస్పదుం డయి వెలయు, మఱియు,
తే. వివిధమణిసముదాయసువిశదచిత్రి-తంబు, జ్యోతిర్మయంబు, శుద్ధంబు నగుచు,
సతత మంతట వెలుఁగుచు సత్త్వరూప-మునఁ బ్రకాశించుచుండు నో యినకులేశ!

ఆ. విష్ణుభక్తిరతులు విబుధగంధర్వకి-న్నరులతోడఁ గూడి హరిపదాబ్జ
విజనమహిమచేతఁ బరమపదంబు సా-లోక్య మనుభవింతు రైక్యముగను

క. ఆనగరమున సుఖింతురు-మానసముల సంతసంబు మలయఁగ హరిసే
వానూనచిత్తు, లాపురిఁ-దా నురగాధీశుఁడయిన తార్క్ష్యుడు ప్రోచున్. ౨౧౬

సీ. శంభులోకమునకు సరివామభాగంబునందు గౌరీలోక మతిమనోహ
రంబయి, నానాచిరత్నరత్నసమూహములచేత భాసితము నయి యొప్పు,
నచ్చట వైదికియగు పరాంబికమూర్తి యతసీసుమసమాన, యంచితదశ
భుజ, సింహవాహన ముదమున వసియించుఁ, దన్మందిరంబు సౌందర్యవిలసి

తే. తంబగును రామ! షోడశద్వారయుతము,-వివిధవరమణిసుస్తంభవిలసితంబు,
లలితదివ్యధ్వజోత్తమాలంకృతంబు,-సతతసురమునిసముదయసంస్తుతంబు.

సీ. రఘురామ! యామందిరం బతిశోభనంబయి విరాజిల్లును ననవరతము,
గణియింప సాధ్యంబు గాదు తద్రామణీయక, మనంతసఖిజనాళిభైర
వాభిరక్షితమయి యలరుచుండును, నందు బ్రహ్మాండనిచయసంవాసులయిన
బ్రహ్మాదిసర్వులు పరమేశ్వరుఁడు విష్ణుదేవుండు వైకుంఠదివ్యలోక
తే. ముల వసించువారు పూజింపఁగాఁ గడు-భక్తితోడ వైభవంబు మీఱ
నుండు నంబ గౌరి యురుముదంబున రామ!-వినుము శ్రద్ధ నంతయును వచింతు.

క. విమలజ్యోతిర్మయమై-కమనీయం బగుచు వెలయుఁగద గోలోకం,
బమితముదంబున రాధా-రమణీమణితో రమించు రహిఁ గృష్ణుఁ డటన్.

సీ. అతివిచిత్రములయి యలరు రత్నావళీ సన్నద్ధ మగుచుండు నన్నగరము,
కల్పభూజంబు లనల్పత రాజిల్లు, బ్రహ్మర్షి దేవర్షి వరుల వేద
నాదం బనంతమై మోదదంబుగఁ బ్రతిధ్వను లిచ్చుచుండఁగాఁ బరిఢవిల్లు,
రమ్యమణిస్తంభరాజితంబగు మందిరంబున నివసించి రాధతోడ
తే. ద్విభుజుఁడౌ వాసుదేవుండు ప్రియము మెఱయఁ
దాను స్వేచ్ఛావినోదము ల్దవిలి మిగుల
సంతసంబున విహరించు నెంతయు మఱి
రాధ తన యాత్మ మురమందు రామచంద్ర! ౨౦౨౦

తే. వినుము శ్రీరామ! యాలోకమునకుఁ బైన
నెనసి యేఁబదికోట్ల యోజనసుదూర
మున మహాదేవికి నివాసము నగు లోక
మందు దేవి వసించు గోప్యముగ రామ! ౨౦౨౧

క. రామా! శ్రీకృష్ణప్రియ-యా మానిని రాధ యా మహాదేవి ది
వ్యామేయకళాకోట్యం-శామితశోభాఢ్య యగు నటం చెన్నఁదగున్. ౨౦౨౨

తే. సకలజగముల సృష్టించు స్రష్టకైన-భువనపాలకుఁడగు విష్ణువునకునైన
సర్వసంహర్తయగు మహేశ్వరునకైన-నరయ దుర్లభ యయియుండు నందు దేవి.

సీ. వేదసమూహము ల్వివిధపురాణంబు లాగమనివహంబు లఖిలధర్మ
శాస్త్రసంచయములు షడ్దర్శనంబులు నేకమై పరిపూర్ణమై కనఁబడు
నట్టి వస్తువుఁగూర్చి యత్యంతముగ ననేకప్రమాణములతోఁ గడఁక చర్చ
గావించి కావించి కడకు బ్రహ్మంబని నిర్ణయించిన యది నిశ్చయమని,
తే. యాపరబ్రహ్మ మెయ్యది యనఁగ నిత్య-యై విరాజిల్లు భగవతి దేవి యనుచు
బుద్ధిఁ గననగుఁ బ్రత్యక్షముగను గానఁ-బడు మహామూర్తి శ్రీరామభద్ర!సతము.

సీ. ఆదేవియే నిత్యమైనట్టి సత్సౌఖ్య విహారిణి యయి సర్వవిశ్వశాశ్వ
తంబగు దేహంబు సంబరంబునఁ దాల్చి, యొప్పారుచుండు నిత్యోత్సవమున,
నాదేవియేసుమా యఖిలప్రపంచమునకు నాశ్రయ యనంగఁ బ్రకటిత యగు,
నాదేవియే చూడ నన్నింటికంటెను బర యనంగను దా విభాసితయగు,
తే. నామహామహిమాఢ్యాంఘ్రితామరసన-ఖప్రకాశమునే చూడఁ గాంక్షచేసి
వివిధఘోరతపంబులఁ దవిలి యెల్ల-వారలును జూచుచుందురు భూరిభక్తి.

ఆ. అరయ బ్రహ్మమునకు నాకృతి లేదని-పలుకుచుందు రెపుడు పరమయోగు
లఖిలయోగవంద్య ననిశంబు ధ్యానించు-చున్నవారు రామ! చోద్యముగను.

సీ. ఆదేవి తనదు దివ్యాంశచేఁ బుట్టించినట్టి మహేశ్వరుఁ డాదివిష్ణు
దేవుండు శ్రుతులచేఁ దెలుపంగఁబడునట్టి తత్త్వపరిహితతనువె చూడ,
నామహాదేవి నిజాంశచేఁ బుట్టిన విషయంబె సుమ్ము సువిశదరీతి
భాసిల్లుచున్న ప్రపంచంబు సర్వంబు, రఘురామచంద్ర! పూర్ణంబు గాదు,
తే. దివ్యమహిమాభిశోభిత దేవి యూప
రాంబికాదేవి తాను బ్రత్యక్షముగను
సకలము సృజింపఁగా నేల స్వాంశయె యిటు
లంతటను వెల్గుచుండఁగా నద్భుతముగ. ౨౦౨౭

క. శ్రీరామా! సాగరమునఁ-జేరిన గంగ పరికింపఁ జెందదొ భేదం,
బారీతిని బ్రహ్మాంశజు-లారయ బ్రహ్మమున భేద మందరు వినుమా! ౨౦౨౮

క. ఆదేవియె సృజియించును,-నాదేవియె విశ్వమెల్ల నభిరక్షించున్,
లేదు మఱొక్కటి కారణ,-మాదేవియె సంహరించు నంత మెఱుఁగుచున్.

క. కృతకములౌ హస్త్యాదుల-గతికిఁ బరిస్పందనాదికారణ మెట్లో,
మతి నెన్నఁగఁ గుహకమునకు-గతి ప్రాధాన్యాన దేవి కారణ మగుటన్.

సీ. అత్యంతదుర్గమ్యయై సర్వమునకును నాదికారణమయి యఖిలలోక
ములకు నాయాబ్రహ్మముఖ్యులకెల్లను నధిదైవతంబయి యలరు దేవి
నాత్మ మహామోహ మంది యెవ్వరెఱుంగఁజాలరో వారల జాడఁ జూడ
శ్రీరామ! హేతువు సృష్ట్యాదులకును బ్రాధాన్యమే తగిన నిదాన మనుచు
తే. ఘటమునకును గులాలుండు కాఁడు హేతు
వని తలంచినరీతిగా నగుచునుండు,
కారణము లేక కార్యంబు కలుగుటకును
మార్గ మెచ్చట నున్నది మాన్యహృదయ! ౨౦౩౧

క. తెలియని దోషంబున ము-గ్ధుల కల్పన ఘటముఖములఁ దోఁచినయట్లే
యిల సృష్ట్యాదికహేతుత-యల ప్రాధాన్యంబుకంటె నగు నితరము నాఁ.

క. శ్రీరఘురామా! సృష్టికి-నారయఁ బ్రాధాన్యమాయ యగు హేతువు, సం
సారమున ముగ్ధులకు నీ-కారణ మరయంగ రాదు కనుఁగొని మదిలోఁ.

సీ. ఏదేవి సర్వంబు నెప్పుడు రక్షింప నెదలోనఁ దలఁచుచు నెసఁగుచుండు,
నేదేవి జగములకెల్ల నాధారంబు తానయి సతతంబుఁ దనరుచుండు,
నేదేవి ముక్తిసంపాదిని యయి సకలంబునకంటెఁ బరంబె యగును,
నేదేవి సృష్టియం దెల్లెడ మోహబంధప్రవర్తిని యయి తా వెలుంగు,
తే. నామహాదేవియే సింధువందు మునిఁగి-నట్టి విష్ణువు రక్షింప నాత్మఁదలఁచి
తా మహాబ్ధిని వటపత్రతను వహించి-రామచంద్రా! ధరించె నిస్సీమహిమ.

క. చైతన్యరూపమై జగ-మూతతముగ వెలయఁజేయు నాదేవిసుమా!
యేతత్సర్వము కన దే-వీతరము శరంబుపోల్కి నెనయు నచలతఁ. ౨౦౩౭

క. దేవీసహితంబైనను-నీవిశ్వంబెల్ల నెసఁగు నెంతయుఁ జైత
న్యావహమై తన యంత్రము-వావిరి యాంత్రికునిచేత వశఁ దిరుగుక్రియఁ.

ఉ. ఆ పరదేవి స్వేచ్ఛమెయి నద్భుతరీతి సృజంచి నిత్యుఁడౌ
శ్రీపరమేశ్వరుఁ సతముఁ బ్రీతిఁ జెలంగుచు నుండుఁ, దానె ము
త్పొప్పఁ డాచు నొండొకవిధంబుగ నుండినయట్టి స్వీయస
ద్రూపవికారునిం గలిసి తోరపువేడ్క రమించు రాఘవా! ౨౦౩౮

ఉ. దుర్గతిఁ బొంది యెంతయును దోడ్పడువారలు లేనివారిఁడా
దుర్గతిఁ బాప నెంచి దయతోఁ బరిరక్షణచేయుచుండుటఁ
దుర్గ యటన్న పేరున నుతు ల్గొనుచున్నది, యా పరాంబయే
దుర్గతి నాశకారిణియు, దుష్టవినాశినియుఁ రఘూద్వహా! ౨౦౩౯

ఆ. ఎంత మందభాగ్యుఁడేని యాదేవి నా-మాక్షరోత్తమముల నాత్మఁ దలఁప
భాగ్యమొసఁగుఁ, గానఁ బరమేశ్వరి యటంచుఁ-బ్రథితయయ్యె జగతి రామచంద్ర!

ఉ. వేదవిదు ల్నుతింతురు సువిస్తృతయా పరదేవి నెప్పుడుఁ
మోదము మందభాగ్యులకుఁ బూర్ణముగాఁ గలిగించుచుంట, స
మ్మోదద మంద భాగ్యపరిపూర్ణసురక్షణశీల యంచు ని
త్యోదయ యా పరాంబికయె యుత్తమవిద్యయు నెల్లవారికిఁ. ౨౦౪౦

దేవీనివాస వర్ణనము

క. సకలవిపక్షక్షయకా-రకవర్గచతుష్టయైక రాజితఫలదా
యక యగు దేవినిలయము-నకలంకత సన్నుతిఁ గను నార్యా! వినుమా.

తే. అమృతసాగరసంవృతం బగుచుఁ గల్ప-వృక్షసముదయాకీర్ణమై వివిధరమ్య
హాటకవిరాజితంబయి యలరుచుండు-రామభద్ర! రత్నద్వీపసీమ యొకటి.

చ. కొసరి వసంతకాలమె యకుంఠిత మెప్పుడుఁగాక, యందుఁ బెం
పెసఁగుచు నుండు నేఋతువులేని సతంబుఁ గనుంగొనంగ ను
ల్లసన మొసంగుచుండు, నటఁ దా సుఖశీతయమయాత్మమై ముదం
బొసఁగుఁ ద్రిమార్గగా నది మహోన్నతరీతి ననంతసంపదన్. ౨౦౪౩

చ. వివిధచిరత్నరత్నసమవిశ్రుతకాంతుల నొప్పుచున్నవై
శ్రవణమనోహరంబుగను జారుతరధ్వని చేయుచున్ ముదం
బవిరళరీతి నిచ్చుచు విహంగమసంతతు లెల్లెడన్ రఘు
ప్రవర! యటం జరించుచును భాసిలుఁ జూడ్కికి విందొనర్చుచున్. ౨౦౪౪

క. ఆరత్నద్వీపమునం-గారవ మొప్పార నసురగణములు విబుధో
దారాంశలు కలవారై-కూరిమిఁ బుణ్యాత్ము లగుచుఁ గొల్తురు దేవిన్. ౨౦౪౫

మ. సతతం బాత్మల సంతసంబు వెలయన్ సర్వేశ్వరీసద్గుణ
ప్రతతిం గూర్చి మనోహరంబుగను సంభాషించుచున్ వేడ్క ను
న్నతరీతిన్ సమయానుకూలముగ విన్నాణంపుగీతంబు ల
ద్భుతరాగంబులఁ గూర్చి పాడుదురు సంపూర్ణాత్ములై యెల్లరున్. ౨౦౪౬

క. పరమాహ్లాద మొసంగుచుఁ-బరిమళమిళితమయి మలయపవనము రామా!
నిరతిని మెలమెల్లఁగ నటఁ-జరియించుచు వీచుచుండుఁ జల్లఁదనమునన్. ౨౦౪౭

తే. పరమపుణ్యానుసరణులై నిరతిశయత-దీయసాలోక్యమును బొంది ధృతి వెలుంగు
దివ్యదేహులు వసియింతు రవ్యయమయి-పొలుచు దేవీభువనపదంబునను రామ!

ఆ. నిత్యహర్షమయులు నిత్యవిజ్ఞానవం-తులయి వార లుందు రలఘురీతి,
పురుషు లరయ భైరవునకు సమానులు-స్త్రీలు దేవితోడ దీటగుదురు. ౨౦౪౯

ఉ. వారలకెల్ల మందిరము వైభవయుక్తము దివ్యహాటక
స్ఫారమహార్ఘ్యరత్నచయభాసురమై వరసన్మణివ్రజో
దారసుతోరణాఢ్యమయి తద్దయు రాజిలుచుండు నెంతయున్
గోరిన కోర్కు లిచ్చుచు నకుంఠితరీతి సతంబు రాఘవా! ౨౦౫౦

ఉ. ఎవ్వరు గీతవాద్యముల నృత్యములం బర దేవిఁ గొల్తురో
యవ్వరపుఁ బ్రీతి గల్గునటు మాన్యులు వారు వసింతు రాదృతిన్
నవ్వుచు నాట్యమాడుచు ననారతదివ్యమృదంగవాద్యముల్
నివ్వటిలంగఁ జేయుచును నిచ్చలుఁ జేరి యటన్ రఘూత్తమా! ౨౦౫౧

తే. అనఘ! శ్రీరామ! యిట్టు లత్యనుపమమయి-యతిశయానందకందమై యలరు శ్రీప
రాంబికాదివ్యపదము నీ వవధరింపు,-వాగతీతంబు వినుము తద్వరపురంబు.

సీ. అతివిచిత్రంబు లైనట్టి రత్నంబులఁ గట్టంగఁబడిన ప్రాకారములును,
భాసురమణిగణభ్రాజితంబులు నయి ద్యుతి మించుచున్నట్టి తోరణములు,
చంద్రకాంత్యాదివిస్ఫారకౌస్తుభముఖ్యమణిఖచితంబులౌ మండపములు,
కమనీయసద్రత్నగణవిరాజితములై భాసిల్లుచున్నట్టి ద్వారములును
తే. గలిగి యాదేవిభవనంబు లలితరత్న-దండవరశూలధారు లుద్దండభీమ
నయనులగు భైరవావళి నాల్గుదిశల-నాల్గుద్వారములందుఁ గన్పడఁగ వెలయు.

తే. దండహస్తలుగల్లవాద్యములఁ జేయు-చును జరింతురు ద్వారసీమను, దదీయ
రక్షణాసక్తులైన భైరవులు పెక్కు-వేలు నిటునటుఁ జూచుచు లీలతోడ.

చ. అతివిశదంబులై మిగుల హారితరంగములునైన కేతన
ప్రతతి వెలుంగ, నచ్చట నిరంతరమున్ వివిధప్రభాయుతిన్
వితతముగా రఘూత్తమ! యనేకము లంతటఁ జంచలించుచున్
స్తుతియొనరింప నర్హతను శోభిలి యానడుమన్ విచిత్రతన్. ౨౦౫౫

ఆ. కలవు చత్వరములు పలు తెగలుగఁ, జిత్ర-రీతి నావరణము లాతతముగ
నొప్పు, ద్వారపాలు రురుజాగరూకత-నుందు రెపుడు రఘుకులోత్తమగుణ!

సీ. ఆయావరణమధ్యమందు దేవ్యంతఃపురంబు రాజిల్లు, ద్వారంబునందుఁ
గరిముఖుండైనట్టి గణనాథుఁడును షడాననుఁడును నాదేవి నందను లతి
జాగరూకత ద్వారసంరక్షణము చేయుచును ధ్యానతత్పరతను భగవతి
దర్శనం బొనరింపఁ దఱివేచియుందురు, బ్రహ్మాండకోటుల వఱలు కోటి
తే. కోట్ల బ్రహ్మలు, మఱికోటికోట్లు హలధ-రులును, గోటిసంఖ్యాకులౌ రుద్రసమితి,
కోటివిష్ణువులునునటఁ గొల్వు సేయు-చుందు, రికఁ జెప్పవలయునే యురుగుణాఢ్య!

సీ. అట్టి రమ్యంబగు నంతఃపురమునందుఁ గలదు చిత్రమణీనికాయమండ
పం బుజ్జ్వలద్రత్నవరమయంబులు నగు స్తంభము లొప్పు విశాలమగుచు,
ముక్తాప్రకాశితములగు తోరణములు, రత్నదీపసమూహ రచనములను
నతివిశదంబులైనట్టి దిగంతరములు ప్రకాశింపఁగ లలితరీతి
తే. రత్నసింహాసనంబు వినూత్నకాంతి-వెలయు విద్యుత్ప్రభాపుంజ విలసితంబు,
భాస్వదర్కసమప్రభా భాసురంబు-దివ్యమహిమాఢ్యమయి యందు దినకరకుల!

ఆ. ఆ రత్నసింహపీఠిక-పై రాకాచంద్రకోటి భాసురవదన
శ్రీరమ్యమహాదుర్గ యు-దారత ముల్లోకములకుఁ దల్లి వసించున్. ౨౦౫౬

సీ. భాస్వత్కనకసద్ధపరమశ్యమంతక రత్నసహస్రము ల్రమ్యకౌస్తు
భంబులచేత విభాసితంబగు కిరీటంబును దాలిచి దంగమీఱ,
నత్యల్పమాణిక్యహారావళీకాంతివక్షఃస్థలంబున వన్నెగులుక,
కమనీయసుదశనకలితమగా మందహాసంబు శోభిల్లఁగా సంబరమున,
తే. శ్యామనయనయు, నద్భుత శ్రవణభూష-ణాభిశోభితయును, నాసికాభరణయుఁ,
జంద్రరేఖాతిలావణ్యచారువదన-పద్మ యయి దేవి శ్రీరామభద్ర! వెలయు.

సీ. అత్యచ్ఛరత్నమయానేకవరభూషణములను ధరియించి నవ్యరీతి,
బాహుచతుష్టయపరిదృశ్యమానమై దివ్యసింహాసనస్థిత యయి యతి
రమణీయరక్తవస్త్రములను ధరియించి నిక్వణత్కాంచీవినిహితమధ్య
శోభిత యయి యొప్పఁ జూడఁగా శ్రీరామ! యాదేవి దివ్యపాదాంబుజములు
తే. బ్రహ్మవిష్ణుమహేశ్వరరాజితంబు,
లామహాదేవి ముందఱ నధికభక్తి
యుక్తిఁ బ్రాంజలులయి బ్రహ్మయును, శివుండు,
హరియు స్తుతివాక్యముల సల్ప నలరుచుండు. ౨౦౬౩

క. జయవిజయ లెపుడు విశదం-బయి వెలుఁగు సుచామరద్వయము హస్తములం
గయికొని వీచుచు నుందురు-ప్రియమునఁ దత్పార్శ్వములను వేడుక రామా!
తే. చిత్రమయినట్టి వ్యజనంబుఁ జేతియందుఁ-దాల్చి శ్రీలక్ష్మి దేవికి దక్షిణమున
నిలిచి కుంకుమారుణగంధనిచయసురభి-వస్తువుల నిచ్చుచుండును వైభవమున.

ఉ. వాణియు వామపార్శ్వమున వైభవ మొప్పఁగ నిల్చి ప్రీతితో
వీణ కరంబునన్ వలయ వేదగణాగమసన్నుతంబు వి
న్నాణముగాఁగ నాత్రిభువనస్తుతదివ్యగుణంబుఁ బాడుచున్
బ్రీణనముం బొనర్చుచును విశ్రుతమై వసియించు రాఘవా! ౨౦౬౪

క. భారతిమొదలగువార ల-పారంబగు దేవికరుణ వాంఛించి సుధన్
శ్రీరామ! యొసఁగుచుందురు - దారు విశదరత్నపాత్రతతి నుంచి తమిన్.

ఉ. వేదములందు గోప్యమయి వెల్గుచునుండు పరాంబికాగుణం
బాదర మొప్ప నారదముఖాఖిలమానవరేణ్యు లెల్లరున్
మోదము మీఱ గీతచయమున్ రచియించి, సగద్గదంబుగా
నాదము పాడుచుండుదురు నవ్యవిధంబున దేవిముందటన్. ౨౦౬౬

చ. నిరుపమరత్నసంచయవినిర్మితమై తగు పళ్లెరంబు సం
బరమున హస్తపద్మములఁ బట్టి, ప్రయత్నము మీఱ దేవికిన్
నిరతిని వీటికావళుల నిచ్చులు మోదమునొంద యోగినీ
వరసముదాయ మిచ్చుచును వైభవ మొప్పఁగ నుండు నారదా! ౨౦౬౭

తే. రత్నదండాసిహస్తులై యత్నమునను-భైరవాదులు కోట్లకు వన్నెకెక్కి-
వివిధవైభవములచేత వెలసినట్టి-వారు తన్మందిరద్వారపాలకు లన. ౨౦౬౮

క. రామా! యీవిధమున దే-వీమహనీయవిభవంబు వెలయు ననుపమం
బై, ముఖచతుష్టయంబున-నేమగు వినుతింప నాకు నినవంశవిభూ! ౨౦౬౯

చ. అరయఁగ వేయికోటులు మహాబ్దము లొక్కట సన్నుతింపఁగాఁ
గరము పరాంబికావిభవకాండముఁ బూనినఁ బూర్తిచేయ శం
కరుఁడు సమర్థుఁడౌనె? శ్రుతికాండము వాక్యమయంబుగాఁగఁ ద
ద్వరగుణముం బ్రయత్నమున వర్ణనరీతి రచించె రాఘవా! ౨౦౭౦

క. సావిత్రియు, గాయత్రియు-దేవికిఁ బ్రఖ్యాతిముగను దివ్యస్థానల్
దేవ! రఘురామ! వినుమా!-యావిర్భవ మొందినార లని నమ్ము మెదన్.

తే పాకశాసనముఖ్యదిక్పాలవరులు-వివిధభువననివాసులై వెలయు నెల్ల
వారలును దత్పురోత్తమరాహ్యసీమ-యందు నుందురు తద్దర్శనాభిలాష.

చ. నిరుపమభక్తితత్పరత నిత్యము మానసపద్మమందుఁ ద
చ్చరణములం దమిన్నిలిపి శాస్త్రవిధిం బరిపూజనంబులన్
జరపుచునున్న భక్తులకె సత్వర మబ్బుఁ బరాంబికాపదాం
బురుహసుదర్శనంబు సురపూజితనిర్మలచిత్త! రాఘవా! ౨౦౭౩

చ. శ్రితపరివారసంవృతము సిద్ధగణావళివేష్టితంబు సం
తతము తదీయసన్నిధి యనంతసురావృతమాట రాఘవా!
యతిశయపుణ్యదం బయిన యాపరదేవిసుదర్శనంబు వి
స్తృతమహిమాఢ్యమై వెలయుఁ, జేరి కనుంగొనరా దదేరికిన్. ౨౦౭౪

తే. ఆధిపత్యవిచార మాపంతయేని-వర్ణభేదపుఁ జర్చ రవంతయేని [నిజము."
కలుగ, దెవ్వారు నాయం దకలుషమతులొ?-వారికే సులభనౌదు, నిప్పలుకు

చ. అని పరదేవి తాఁ బలికె, నావరమూర్తినిఁ దాంత్రికంబుగా
మనమున నెంచవయ్య! సురమాన్య! రఘూద్వహ! నీవు కోరిన
ట్లనుపమరీతి రమ్యమయినట్టి పరాంబికదివ్యపత్తనం
బును, బరదేవివైభవము బుద్ధికిఁ దోఁచినభాతిఁ దెల్పితిన్. ౨౦౭౬

చ. వినుము పురాణవర్యముల విశ్రుతమైన పరాంబికాకృతిన్
ఘనమగు భక్తి మృణ్మయినిగా దశబాహుయుతాఢ్య, సింహవా
హనగ నొనర్చి, యర్చనము నాదృతి యుద్ధమునందు నే జయం
బును ఘటియింపఁగోరి పరిపూర్ణతఁ జేయుదు శ్రీరఘూత్తమా! ౨౦౭౭

తే. బిల్వవృక్షమునఁ మహాభీనివారి-ణిని, మహాదేవి భక్తితో నిశ్చలమతిఁ
బూజనొనరించి నవమిని భువనవిజయ-బోధగావింతుఁ ద్వజ్జయంబు నెదఁదలఁచి.

తే. దేవ! దేవ్యర్చనము చేయఁ దివిరి సన్నుఁ-గోరితివి, కృష్ణనవమి నేఁ డోరఘువర!
యార్ద్రయుక్తంబు నగు, నేఁడె యమలనిష్ఠ-తోడ మొదలిడి దేవి సంతుష్టిఁగాంచ.

క. ప్రతిదినముఁ బ్రబోధించుచు-జతనంబున రావణుండు సమరనిహతుఁడై
క్షితి నీచేఁ బడువఱకు సు-మతిఁ బూజింతు జయమెంచి మాన్యా! నీకున్.

తే. రామ! శుచివయి నిశ్చలంబౌ మనమున
దేవిని నుతించి పూజింపు మీవు, యుద్ధ
మొనరుపుము రాక్షసులతోడ నొగి జయంబుఁ
బొందఁగలవాఁడ, వింక లేదు సంశయంబు.'' ౨౦౮౧

వ. అని వెండియు నారదునకు మహాదేవుం డిట్లు చెప్పం దొడంగె. ౨౦౮౨

ఆ. ''ఈవిధమున బ్రహ్మదేవుండు తెలుపఁగా-దేవి మేలుకొల్పు భావమందుఁ
దలఁచి చేరె యుదధితటము నుదగ్దిశ-నున్న బిల్వవృక్షసన్నిధికిని. ౨౦౮౩

చ. సురవరు లెల్ల రాఁ గదలి శుద్ధుఁడు లోకపితామహుండుఁ దాఁ
గరిము ముదంబుతో నరిగె, గాఢభక్తిని రాముఁ డంతి సం
గరజయకాంక్షియై విజయకారిణ నుత్తరదిఙ్ముఖుండునై
స్థిరతరచిత్త మొప్పఁగ భజించుచు సన్నుతి చేసె నంతయున్. ౨౦౮౪

నలువదినాలుగవ అధ్యాయము

శ్రీమహాదుర్గాస్తుతి

తే. ''వందనము నీకుఁ త్రిభువనవందితే! రణ-జయద! కాత్యాయని దేవి! జయమునిమ్ము,
కరుణతోడఁ బ్రసన్నవు కమ్ము నాకు,-మాత! కనుభక్తి నీకు నమస్కరింతు.

తే. సర్వశక్తిస్వరూపిణీ! సకలదుష్ట-శత్రుసంహారకారిణి! సర్వదుష్ట
వైరిజృంభిణీ! పరదేవి! వరకరుణాదు-మాత! జయమిమ్ము, నీకు నమస్కరింతు.

తే. సకలభూతంబులందు నిశ్చలత నుందు,-వీవె దేవీ! పరాశక్త వెంచిచూడ,
సంగరంబున దుష్టుని సంహరించి-మాత! జయమిమ్ము, నీకు నమస్కరింతు.

తే. సంగరప్రియ! రక్తభక్షణరత! పల-లాశనాసక్త! సకలార్తిహరణదక్ష!
సంగరంబున దుష్టుని సంహరించి-మాత! జయమిమ్ము, నీకు నమస్కరింతు.

తే. ముండమాలాస్ఫురద్దివ్యమూర్తి! యెవ్వ-రాత్మఁ దలఁతురో వారి ఖట్వాంగఖడ్గ
హస్తవై యార్తిఁ బాపుదువార్తిశమని!-మాత! జయమిమ్ము,నీకు నమస్కరింతు.

తే. త్వచ్చరణసారసంబుల దైన్యమునను-శరణుఁజొచ్చితి,నాశ్రితవరద వీవు,
సంగరంబున రిపులను జంపి నాకు-మాత! జయమిమ్ము, నీకు నమస్కరింతు.

తే. ఎంచరాని పరాక్రమ మెసఁగు నీ క-చింత్యవరరూపలావణ్యశీల! నీ వ
చింత్యవర్తన వవిచింత్య! స్థిరతరముగ-మాత! జయమిమ్ము, నీకునమస్కరింతు.

తే. దేవి! నిన్నుఁ దలఁతురు దుస్థితి నెవారు-దుర్గసంహారకారిణి! దుర్గతులకు
వారు చిక్కంగఁజాల రెప్పాటనైన-మాత! జయమిమ్ము, నీకు నమస్కరింతు.

తే. మహిషరక్తప్రియా! దేవి! మహిషదుష్ట-దానవునిఁ జంపితివి ప్రవిదారణమున,
శైలపుత్రీ! శరణ్యవు సకలమునకు-మాత! జయమిమ్ము, నీకు నమస్కరింతు.

తే. సుప్రసన్నాననా! చండశూర చండ-దనుజసంహారిణీ! చండి! సంగరమున
శత్రుపుంజంబులను వేడ్క సంహరించి-మాత! జయమిమ్ము దేవి! నమస్కరింతు.

తే రక్తనయనాబ్జ! యతిరక్తరదన! రక్త-చందన విలిప్తవర దేహ! శత్రుభయద!
రక్తబీజాసురనిహంత్రి! రణమునందు-మాత! జయమిమ్ము, నీకు నమస్కరింతు.

తే. విశ్వకర్త్రి సురేశ్వరీ! వితతబలవి-శుంభ శుంభాసురవిహంత్రి! శూరచరిత!
సతత మరులను త్రుంపుము-సంగరమున-మాత! జయమిమ్ము,నీకు నమస్కరింతు.

తే. సతము పాలించుచున్నావు సర్వభువన-సమితి శర్వాణి! యీదుష్టశత్రురాశు
సాళిని వధించి రక్షింపవమ్మ! జగము-మాత!జయమిమ్ము, నీకు నమస్కరింతు.

తే. సకలదుష్టవిమర్దనక్షమవు నీవె,-సర్వగతవగు శక్తివి, జనని యఖిల
భువనతతికిఁ, బ్రసన్నవై భూరికరుణ-మాత!జయమిమ్ము,నీకు నమస్కరింతు.

తే. దుష్ప్రవర్తకులగువారిఁ ద్రుంతు వెపుడు,-సత్ప్రవర్తకులగువారి సతము బ్రోతు
వంబ! రిపుతతిఁద్రుంచి రణాంగణమున-మాత! జయమిమ్ము, నీకునమస్కరింతు.

తే. భువనమాత! కాత్యాయని! శివ! ప్రపన్న
సంతతార్తిప్రశమని! యీ సంగరమున
భయములను దీర్చి నన్నుఁ గాపాడవమ్మ!
మాత! జయమిమ్ము, నీకు నమస్కరింతు." ✓ ౨౧౦౦

శ్రీరామునకు దేవి యభయమొసఁగుట

ఉ. నారద! యీవిధంబున మనంబున దేవిని భక్తి నిల్పి యా
శ్రీరఘుపుంగవుండు నుతిఁజేయుచునుండ నభంబునుండి గం
భీరముగా వినంబడియె విస్మయదంబయి "భీతి వీడుమా
వీరవరేణ్య! యుద్ధమున వేడ్క జయింతువు నీవు రావణున్. ౨౧౦౧

తే. బలపరాక్రమవంతులౌ పరమగర్వ
సహితులగు దానవులఁ జంపి సమరమందు
లంకను జయింపఁగలవు నిశ్శంకగాను
భయము వదలుము నీవు, నా పలుకు వినుము. ౨౧౦౨

చ. సరసిజసంభవుండు విధి స్వాంతములోపల భక్తి నిల్పి నన్
బరినుతి చేసి పూజలను బాగుగఁ దన్పినవాఁడు, బిల్వస
త్తరువరమందు లోకసముదాయవిధాతృకృతిన్ సుతుష్టనై
వరము నొసంగ వచ్చితిని, భ్రాంతిని బొందక కోరు మిప్పుడే." ౨౧౦౩

తే. అనుచు గగనంబునుండి వాక్యనిచయంబు
విని రఘుశ్రేష్ఠుఁ డాత్మలో విశ్వసించెఁ
దనకు రణమున జయ మిఁకఁ దప్ప దనుచు,
సంశయము మానె నప్పు డో తాపసేంద్ర! ౨౧౦౪

చ. తన మది నిట్టు లెంచుచును దా రఘువీరుఁడు సంగరస్థలం
బునఁ దమి నందుచుండుతఱిఁ బూర్ణబలాఢ్యుఁడు భీమవిక్రమం
బునఁ దన వెంట రాక్షససమూహము గొల్వఁగ వచ్చె నద్భుత
స్వన మొనరించుచున్ వడిగ జన్యము రామునితో నొనర్పఁగన్. ౨౧౦౫

క. ఘోరతరసింహనాదం-బారాటము గల్గఁజేసె, నఖిలధరణి వి
స్తారంబుగఁ గదలించెను-భూరితరాద్రివనముల సముద్రముఁ గలఁచెన్. ౨౧౦౬

చ. అతిభయదంబులై చెలఁగునట్టి తదీయరథాశ్వహస్తిసం
తతుల నినాదముల్ పృథివిఁ దల్లడ మందఁగఁజేసె, వాని వి
స్తృతవరవీరసైన్యబలదీప్తి జనించినయట్టి వాయు వా
తతమయి యెల్లభూతలముఁ దా వణఁకించెను దాపసోత్తమా! ౨౧౦౭

ఉ. దిక్కులకెల్లఁ గాఱుచును దీవ్రతరంబగు కుంభకర్ణునిన్
జక్కఁగఁ జూచి యుద్ధతిని శస్త్రధరుల్ బలవంతు లింక మా
దిక్కెది యంచు నుక్కసెడి దిక్కఱి వానరులెల్లఁ బాఱఁగా
నొక్కమొగిన్ మహాభయము నొంది కలంగెడు మానసంబులన్. ౨౧౦౮

ఉ. అంత ననంతభీప్రదు మహాసురతల్లజుఁ గుంభకర్ణు న
త్యంతమహోత్సుకంబున రణావనిఁ జొచ్చెడివానిఁ గాంచి, యే
చింతయుఁ బూన కాత్మజయసిద్ధి నొసంగు పరాంబకున్ నుతుల్
స్వాంతమునం దొనర్చి తన వామకరంబునఁ జాపముం గొనెన్. ౨౧౦౯

ఆ. పాదఘట్టనముల, భయదకరాఘాత-ములను వానరులను ముద్దచేసి
కొందఱను భుజించి కుంభకర్ణుం డంత-రాముఁ జేరవచ్చె రణమొనర్ప. ౨౧౧౦

సీ. దూర్వాదళశ్యాము దోర్వీర్యసంయుతు రఘుకులశ్రేష్ఠుని రామచంద్రు
నుద్యతఘోరాస్త్రు నురుతరబలయుతు రాక్షసకులసంహారణపటిష్ఠు
నీలోత్పలదళాభనేత్రుని ననుజుఁడౌ లక్ష్మణుతోడఁ జెలంగువాని
సమరరంగస్థలచాతుర్యనిరతుని నక్షోభ్యుఁ గుంభకర్ణాసురుండు
తే. చూచి, యుత్సుకతను జొక్కి, ఘోరంబుగా-సింహనాద మట్టె చేసె, నదియుఁ
బ్రళయకాలభీమజలదనిర్ఘోషము-నాఁగ భయదమయ్యె నారదముని! ౨౧౧౧

మత్త. అంత శ్రీరఘురాముఁ డట్టె మహానినాదము చేసె న
త్యంతభీతిదమై జగంబుల కాకులత్వము గల్గు న
ట్లంతయుఁ దితిజు ల్గలంగఁగ నిచ్చ వానరు లుబ్బఁగా,
సంతసంబున యుద్ధ మప్పుడు సాగెఁ దాపససత్తమా! ౨౧౧౨

క. ఒండొరుల గెల్వఁ బూనిక-నిండారఁగ నుభయులును ననిం బోరిరి యు
ద్దండత బ్రహ్మాస్త్రాదు ల-ఖండతఁ బఱపుచును భువనకాండము బెగడన్. ౨౧౧౩

ఉత్సా. రామకుంభకర్ణు లాజిరంగభూమిఁ బోర ను
ద్దామమగుచు దేవదైత్యతతి దురాసదంబునై
భీమమయ్యెఁ గనుఁగొనంగ వీరులైన రాక్షస
స్తోమములకు వానరులకుఁ జూడ నద్భుతంబునై. ౨౧౧౪

ఆ. తుములయుద్ధ మంతఁ దోరపు శక్తితో-నెసఁగె నహమహమిక హెచ్చుచుండ,
జయముఁ బొందు కోర్కె శక్తుల వెలయించి-రుబ్బి యార్చుచును సముత్సుకతను."

నలువదియైదవ అధ్యాయము

బ్రహ్మ పరమేశ్వరిని బూజించుట

వ. వెండియు మహాదేవుండు నారదున కిట్లు చెప్పందొడంగె. ౨౧౧౫

చ. "సకలము సృష్టిచేయు వరశక్తియుతుండగు బ్రహ్మదేవుఁ డం
బికఁ గడు భక్తియుక్తుఁడయి బిల్వతరూత్తమమందుఁ బూజనం
బకలుషచిత్తుఁడై నెఱపి యారఘురాము జయార్థమైన పూ
నిక భువనత్రయైకజననిన్ వినుతించెను మేలుకొల్పుచున్. ౨౧౧౬

చ. సురవరవంద్యపాదుఁడు విశుద్ధచరిత్రుఁడు బ్రహ్మ భక్తిత
త్పరుఁడయి మాటిమాటికిని వందనము ల్పచరించుచున్ సురే
శ్వరిచరణాంబుజంబులకు సంతతవేదవివర్ణితంబునై
పరఁగెడు దేవిసూక్తమున భద్రవిధాయిని నెంచి యాత్మలోన్. ౨౧౧౭

✓

దేవీసూక్తము

వ. "ఓంకారరూపిణీ! నీకు నమస్కరింతును విమలవదనవు, భూర్భువస్స్వఃపరమ కలవును, కేవలానందసందోహస్వరూపవును, లోకత్రయతిమిరాపహారక పరమ జ్యోతిరూపవును, అసదభిలాషయుక్తసందూషితదోషాపసారణపరమామృత రూపవును, మూర్తిమత్కోటిచంద్రవదనవును, సర్వవేదోద్భవనారాయణి వియు, జనశరీరవును, బరమాత్మరూపవును నగు దుర్గాదేవీ! ప్రసన్నవు కమ్ము, నీకు నమస్కరించుచున్నవాఁడ. ప్రణవాత్మికా! కరాళరూపిణీ! ప్రణవస్వరూపా! హ్రీంస్వరూపిణీ! ఓ యంబికా! భగవతీ! యంబా! త్రిగుణప్రసూతా! నీకు వందనములు. శ్రీసిద్ధికరీ! సకారషకారరేఫవక్త్రస్వరాన్వితబిందుసంయుతద్వయ బీజాత్మికస్వాహాస్వరూపిణీ! స్వధారూపా! విమలముఖీ! శర్వాణీ! ప్రసన్నవు కమ్ము.

జగన్మాదకారిణివి, మృగదృశివి తల్లీ! మహేశ్వరీ! నిన్నుఁ గ్రీడాస్థానంబున విజయముచేసినట్టి దానవుగను, భువనేశ్వరీ! శత్రురూపవును, మిత్రరూపవును, దుర్గంబునకు దుర్గవునుగా నెంతు. యోగులలోపల నీ వేకవు,ననేకవు నై సూక్ష్మ రూపవై యవికారవునై కనంబడుదువు. బ్రహ్మాండకోటికోట్ల నుత్పత్తిచేయఁగల శక్తీ! నీకు నమస్కారము. ౨౧౧౯

సీ. ఏను ముఖ్యుఁడనయి యెసఁగియు విష్ణుండు పరమశివుండు నితరసురలును
నవరేని నీదు మహిమముఁ గనుంగొని వినుతింప నేర్తుమే విశ్వజనని!
నీవె స్వాహారూప, వీవె స్వధారూప, వీవె వౌషట్కార, వీవె ప్రణవ,
వీవె లజ్జాదిబీజావళి వన నుందు, వీవె స్త్రీరూపవై యెన్నఁబడుదు,
తే. వీవె పుంరూపమున నుందు, వీవె తల్లి!-యన్నిరూపంబులందుండు వంబ! మేలు
కొల్ప నిను వందనంబు లనల్పరీతి-సల్పుచున్నాఁడ, నాకుఁ బ్రసన్నవగుము.

సీ. నీవె దేవర్షివి, నీవె బృందారకాకాలస్వరూపవై లీల నుందు,
వీవె మాసపితతి, వీవె షడృతుచయం, బీవే యయనయుగం బెంచిచూడ,
నీవె స్వధారూపభావితవై కవ్యమును భుజించుచు నుందు వనయ మెందు,
నీవె స్వాహావు నయి యెసఁగుచు హవ్యంబులనుభవించుచు నుందు వతిముదమున,
తే. దేవి! శుక్లపక్షంబున దేవతలును-కృష్ణపక్షమునందుఁ బితృప్రముఖులుఁ
బూజగావింతు, రంబికా! మ్రొక్కులిడుదుఁ-గరుణతోడఁ బ్రసన్నవు కమ్ము నాకు.

తే. నీవె సత్వంబ వోయంబ! నిర్మలమతి-నిష్కళంబై ప్రకాశించు నీస్వరూప
మునకు వందనములఁ జేసి బోధచేయు-చున్నవాఁడను, గమ్ము ప్రసన్న వీవు.

తే. చంద్రసూర్యాగ్నినయన నీచతరముగను-ద్వత్పదధ్యానయోగతత్పరత మ్రొక్కి-
యున్నతంబైన ముక్తిని నొందుచుందు-రాత్మ యోగులు కడు నిశ్చలాత్ము లగుచు,

క. నీ పాదకమలయుగపూ-జాపరులయి పూజచేసి జగతి నెవఁడు తాఁ
బ్రాపింపకుండు సూక్ష్మం-బై పరఁగుచు నున్న ముక్తి నఖిలాధారా! ౨౧౨౪

సీ. అతిసూక్ష్మమును నతిస్థూలంబుగ నొనర్ప, నీచంబు నుచ్చత నిలుప, నున్న
తత్వంబుఁ గిలదానిఁ దగ్గించి నీచత నొందింప నీవెకా యురుసమర్థ
వోయంబ! కాలంబు నుల్లంబునం దెంచి శక్తిరూపవు నయి జగతి వెలయు
దీవు, భవాని! నిన్భావంబునందున వందనంబులఁ జేసి ప్రార్థనములఁ

తే. జేయుచున్నాఁడ, బోధింప స్థిరమనీష
నిన్ను నుతియించుచున్నాఁడ నిత్యభద్ర
దాయినీ! నన్నుఁ జూడు మమేయకరుణ
జనని! మేల్కొమ్ము, నాకుఁ బ్రసన్న వగుము. ౨౧౨౫

తే. రామరావణులందు రుద్రప్రముఖుల-యందు నిండుఁ బ్రకాశించునట్టి శక్తి!
యమలవామకమునవృద్ధి నలరఁజేయు-జనని! మేల్కొమ్ము, నాకుఁ బ్రసన్న వగుము.'' ౨౧౨౬

వ. ''ఓంతత్సత్ బ్రహ్మణే నమః.'' యను నీ వేదసూక్తంబగు స్తోత్రంబు చేత
నారదా! బ్రహ్మ నుతింపఁగా నా చండిక ప్రబుద్ధయయ్యె. అట్టి పరదేవిం
గాంచి బ్రహ్మ యిట్లని ప్రార్థించె. ౨౧౨౭

చ. ''సురవరవంద్య! దేవి! తటిఁ జూడ నకాలమునం బ్రబుద్ధవౌ
కరణి నొనర్చితిన్, దురితకార్యమె యిద్ది, క్షమింపు, ప్రాణులం
దిరముగ నిల్పఁగా నుపకృతిన్ దగఁ బూని, దురాత్ములౌ నిశా
చరసముదాయమున్ దునుమ స్వాంతమునందుఁ దలంచి యంబికా! ౨౧౨౮

మ. అతిఘోరంబగు సంగరస్థలమునం దర్థించి గెల్పున్ మదిన్
క్షితినాథోత్తముఁడైన రాముసకు దుశ్శీలున్ దశాస్యున్ మహో
ద్ధతునిన్ బాంధవపుత్త్రయుక్తముగ విధ్వస్తంబు చేయంగ నా
తతయత్నంబున మేలుకొల్పితి నినున్ ధ్యానించి లోకేశ్వరీ! ౨౧౨౯

తే. భువనకంటకుఁడైన దానవుఁడు రావ
ణుండు ససుతబాంధవముగ భండనమున
నెపుడు పడు నంత పర్యంత మేను బూజ
చేయుదును రాము జయ మెంచి శ్రీపరాంబ! ౨౧౩౦

చ. జయమును గోరు రాముని నిజప్రియవీక్షణపంక్తిఁ జూచి ని
ర్భయునిఁగఁ జేయుమా జనని! భావమునందుఁ బ్రసన్నవై కదున్
దయఁ గయికొమ్ము పూజలను దల్లి! క్రమంబుగ శత్రుగోత్రమున్
క్షయ మొనరింపుమా దినదినంబు దురంబున శక్తిఁ జూపుచున్.'' ౨౧౩౧

క. వినయమున బ్రహ్మదేవుం-డొనరించిన ప్రార్థనంబు నూహించి మదిన్
ఘనసంతోషము మీఱంగ-ననియె భువనజనని సరసిజాసనుం గనుచున్.

శ్రీదేవీవరదానము

సీ. "అతిఘోరబలశాలి యగు కుంభకర్ణుండు సంగరాంగణమున సమయు నేఁడు
స్వీయమహాబలవీర్యాతిభీమసైనికగణంబులతోడ నిజము ధాత!
యిట్లె క్రమంబునఁ గృష్ణపక్షస్థిత నవమిఁ బ్రారంభించి నాదుశక్తి
దీపింపఁజేయుచు ధృతి శుక్లపక్షంబునందు నవమిదాఁక ననుదినంబు
తే. రాక్షసులఁ జంపుదానను రణమహీత
లమున, సందేహమును బూనకుము మనమున,
విను, మమావాస్యనిశియందు వీరు మేఘ
నాదు మృత్యువు నగుచుఁ దున్మంగఁగలను. ౨౧౩౩

తే. అపుడు ఘోరవరుండగు నాత్మజాతుఁ-డవనిఁ గ్రాల్లుటఁ గని రావణాసురుండు
శోకసంతప్తచిత్తుఁడై లోకనాథుఁ-డయిన శ్రీరాము నెదిరింప నరుగుదెంచు.

క. యుద్ధంబుఁ జేయు కోరిక-నుద్ధతుఁడయి వచ్చు మిగుల నుత్సుకతను దా
యుద్ధక్షోణిక, నంతట-సిద్ధసమర మమరుఁ జూడఁ జెప్పఁగ నసదై. ౨౧౩౪

ఉ. సంగరరంగమందు నతిశౌర్యసమేతులు దానవోత్తముల్
ద్రుంగ సురాంతకప్రభృతిదోర్బలయుక్తులు మానసంబునం
గ్రుంగి యమర్ష పెల్లొదవఁ గ్రూరతరారుణలోచనుండునై
క్రింగఁగ నెంచి శాత్రవుల బృందము నెల్లను నొక్కమొత్తునన్. ౨౧౩౫.

చ. కడువడి నెత్తివచ్చి దశకంఠుఁడు సజ్జనకంటకుండు పె
ల్లడరి రఘుప్రవీరుని రణాంగణమందునఁ దాఁకు, వారికిన్
బెడిదపుఁబోరు శాఁగలదు, వీరులు వారలు, యుద్ధమట్టిదె
ప్పుడు మఱి యెందుఁ జూడఁ గనఁ బోలదు, దానికి సాటి యద్దియే. ౨౧౩౬

త్రిరాత్రవ్రతము

మ. అరవిందాసన! శుక్లసప్తమిని యుద్ధారంభమై వారికి
ద్వారకున్ మిక్కిలి ఘోరరూప మగుచున్ బో రుత్కటంబై కనన్
భరమై యొండొరు మీఱురీతి నవమీపర్యంతముం జెల్లు, ను
ర్వర యత్యంతము సంచలింపఁగ, సుపర్వశ్రేణి భీతిల్లఁగన్. ౨౧౩౭

సీ. ఆ శుక్లసప్తమి యారంభ మొనరించి నవమినాఁటిదనుకఁ బ్రవిమలమతి
మృణ్మయప్రతిమను మొలపున రచియించి యందు యథావిధి ముందుగాను

పూజింపనగు నను నోజలజాసనా! శ్రీరామచంద్రమూర్తికి జయంబుఁ
గాంక్షించు మీరలు గడు సర్వోత్తమములౌ నుపచారములచేత నపరిమితము

తే. లయిన హోమంబులును బలు లాదియయిన
కార్యముల నిగమాగమకలితనుతుల
భక్తిభావంబు వెలయ సంప్రార్థనంబు
సలుపవలయుఁ బితామహ! శ్రద్ధ వినుము. ౨౧౩౯

సీ. మూలతో యోగంబుఁ బొందిన సప్తమినాఁడు పత్రికయందు నను బ్రవిష్టుఁ
గావింపవలయు, యథావిధి శ్రీరామ చాపానుసరణంబు సలుపవలయు,
నష్టమినాఁడు న న్నారాధనము శోభనంబగు ప్రతిమయందుం బరమని
యతితోడఁ జేయంగనగు, నష్టమీనవముల సంధియం దుండుఁ బూన్కి, సంగ

తే. రస్థలంబున దుష్టుని రావణాసు-రుని శిరముమీఁద నుండుదానను విధాత!
మాటిమాటికి నమ్ముఁడు మహితభక్తి-వినుఁడు వచియింతు నిఁక మీఁద విజయపథము.

క. ఆ సంధికాలమందున-నా సక్తిని మాంసశోణితాదుల శాస్త్రో
ద్భాసితవిధి నుపచారము-లో సారసభవ! రచించి యురుతరరీతిన్. ౨౧౪౧

తే. నన్నుఁ బూజింపవలయు భక్త్యున్నతమతి,
నంత నవమిని వివిధంబులయిన బలుల
తోడఁ బూజించి యవల శత్రువును బిష్ట
మయునిగ నొనర్చి బలియియ్య జయము గలుగు. ౨౧౪౨

క. నవమి నపరాహ్ణమున రణ-భువి దశకంఠుని వధింతుఁ బూన్కి, దశమియం
దు విబుధులారా! యుదయం-బె విధిం బూజింపవలయు నెంతయు నన్నున్.

ఉ. ఆవల నుత్సవంబుల మహావిభవంబునఁ జేసి మృణ్మయం
బై వెలుఁగొందు నాకృతిఁ బ్రయత్నముతో నదులందు వేడ్క సం
భావనచే విసర్జనము భక్తి నొనర్పఁదగున్ బితామహ!
యీవిధమెల్లఁ జిత్తమున నెంచి యభీప్సితసిద్ధి నొందఁగా. ౨౧౪౪

చ. సురవరులార! నానుతుల చొప్పను దప్పక యీవిధానమే
యరసి, సమర్చనంబుఁ బదునైదు దినంబు లొనర్పఁ, డాజి దు
శ్చరితుఁడు రావణాసురుఁడు చావఁగలం, డటమీఁద మీకు సం
బరము తిరంబుగాఁ గలుగు, మానసమందున నమ్ముఁ డీ నుడిన్. ౨౧౪౫

నలువదియాఱవ అధ్యాయము

దేవీపూజామహిమము

చ. సరసిజసంభవా! యిటులు సల్పఁగఁబోలు మదీయపూజనం
బురుతరభక్తితోడుత మహోత్సవయుక్తముగా, నకాల మి
క్కరణి సమాగతంబయిన కర్జ మిదౌఁ, బ్రతివత్సరంబునున్
జరుపఁగనౌ విధీ! భువనసంచయవాసులు భక్తియుక్తులై. ౨౧౪౬

సీ. ఆర్ద్రాయుతంబగు నసితపక్షమునందు నవమీదినంబునఁ బ్రవిమలమతి
బిల్వవృక్షంబునఁ బ్రీతి నన్నర్చించి మేల్కొల్పి భక్తితో మిగుల శుక్ల
పక్షనవమినాఁటివఱకును బ్రతిదినం బఖిలోపచారంబు లసదృశముగ
నాకు సమర్పించి ప్రాకటంబగు పూజ నలరింతు రేని, వా రఖిలభువన
తే. ములను బూజ్యులు సురలార! ముదిత నగుచు
వారికిని సుప్రసన్ననై వాంఛితములఁ
గొదువపడకుండునట్లు నేఁ గూర్చుచుందు,
సతత మియ్యది నమ్ముఁడు సత్యమనుచు. ౨౧౪౭

ఉ. ఎవ్వఁడు పూజచేయు నను నెప్పుడు, వానికి శత్రు వుండఁబోఁ
డెవ్విషయంబునందయిన, నెన్నఁడు బంధువియోగమే కనం,
డివ్వచనంబు నిక్కము, హీనత దుఃఖము నొందఁ డెయ్యెడన్,
మవ్వపు నాదుకూర్మి బుధమండనుఁడై తగుఁ బద్మసంభవా! ౨౧౪౮

శా. దారిద్ర్యంబు పొసంగఁబో దెపుడు, సంతాపంబు రాఁబోదు, పెం
పారంగా నిహమందుఁ గోరికలు సర్వైశ్వర్యముల్ చేరఁగా
వా రాముష్మికభాగ్యసంతతులతో భాసిల్లుచున్ గౌరవ
ప్రారంభంబుల మీఱుచుందురుట నిత్యప్రాభవం బొప్పుచున్. ౨౧౪౯

మ నను బూజించు గుణాఢ్యు లందుదురు సన్మానంబు, సత్పుత్రపౌ
త్రనికాయంబుల నాయురున్నతుల నత్యంతంబు ధాన్యాదిశో
భనపుంజంబుల, లక్ష్మి నిశ్చలతమై వారిన్ బ్రియంబొప్పఁ జే
రును జాంచల్యము లేక, స్వాంతములఁ గోర్కుల్ చేకురున్ బూర్ణతన్.

సీ. నను భక్తితోడఁ బూజన మొనరించినవారలఁ జేరవు వ్యాధు లెపుడు,
గ్రహగణంబుల పీడ గలుగదు వారికి, నపమృత్యుభయ మిసుమంతయైన
నుండఁజాలదు, భయం బుండదు రాజులవలననైనను దస్యువారిమునను,
సింహశార్దూలప్రసిద్ధ దుష్టమృగాళివలన నొక్కింతయు భయము రాదు,
తే శత్రువులువశులయి యంత సమసిపోవు-చుందురు, జయంబు రణరంగమందు సంది
యంబు లేకయె కలుగును, సంబరంబు-వారి కెవ్వేళ దృఢమయి వఱలుచుండు.

క. నాపూజ చేయువారికి-లోపించును దుష్కృతంబు లోకస్తుత్యా!
యాపదలు చేరఁజాలవు-నా పూర్ణానుగ్రహంబునన్ సురలారా! ౨౧౫౭

క. నరుఁ డెవ్వఁడు నను బూజా-పరితృప్తి నొనర్చు, వాఁడు వరసౌఖ్యము నా
కరుణం గని యిటఁ, గడపటఁ-బరమంబగు నాదుపదముఁ బడయు నిజముగన్.

క. వినుమీ వార్షికపూజన-మును జేసిన నశ్వమేధముఖయజ్ఞము లె
ల్లను గోటిచేయు సత్ఫల-మును బొందు నిజంబు నరుఁడు భువిఁ బుణ్యుఁడగున్.

ఆ. ఈ మహోత్సవమున నెవఁడు మోహంబున-నైన ద్వేషయుక్తినైన నన్నుఁ
బూజచేయఁ, డట్టి మూఢుండు యోగినీ-పశువు కాఁగలండు బ్రహ్మదేవ!

మ. నను నెవ్వారలు మూఁడులోకములలోనన్ బూజగావింతు, రా
యనఘుల్ చేసిన యర్చనంబునకు నే నత్యంతసంతృప్తనై
యనయం బిచ్చుచునుందు వారల యభీష్టార్థంబులన్ గోరినం
తనె లోపం బిసుమంత యేనియు మదిం దల్పంగ రానట్లుగన్. ౨౧౫౮

త్రి వి ధ పూ జ లు

సీ. సాత్త్వికభావంబు స్వాంతంబునం దెంచి నన్నుఁ బూజింపఁగా నున్న జనులు
బలి సమర్పింపఁగాఁ బనిలేదు, మాంసాన్నసహితంబుగాఁ బూజ సలుపఁదగదు,
మత్ప్రీతి వాంఛించు మానవుల్ సాత్త్వికుల్ పూనికతో మహాపూజ చేయ
వలయును, మాంసవివర్జితనైవేద్యములతోడ వేదాంగముఖభవంబు

తే. లయిన నుతితతితోడను నతివిశాల-జపముఖంబులతోడ హింస్రముఖవర్జి
తంబులగు విప్రభోజన ద్రవ్యసమితి-చే నని యెఱుంగుఁడీ మీరు చిత్తమందు.

ఉ. రాజసభావయుక్తులు నిరంతర మోపరమేష్ఠి! నన్ మహా
పూజ నొనర్చి భక్తిమెయి మోదితఁ జేయఁగ మానసంబునం
దోజఁ దలంచిరేని విను ముత్సుకనై యొఱఁగింతుఁ దద్విధిన్
శ్రీజయవృద్ధికాములకుఁ జెల్లును నీవిధ మాలకింపుమా! ౨౧౫౯

సీ. నానావిధంబులై నవ్యంబులైనట్టి ఛాగమేషమహిషసమితితోడ
మాంసాన్నములతోడ మదిఁ గడుభక్తితో బలులసమర్పింపవలయు, మఱియు,
నీమహాపూజయం దిష్టకామ్యార్థమై జపయజ్ఞహోమసుస్తవముఖముల
నన్ను సంతుష్టఁగా సన్నుతింపందగు, నీకార్యము నొనర్ప సిద్ధవిప్ర

తే. వరుల నర్థించి వారిని వైభవమున-నిష్టమృష్టాన్నకలన సంతృప్తిచేయ
వలయు, నీవిధమునఁ బూజ వఱలు, నిట్లు-చేసిన మనోరథములెల్ల సిద్ధినొందు.

చ. ఖలులగు శత్రుసంచయము గ్రన్నన నాశమునొందు, నెల్లవే
ళల ధనధాన్యవస్తుతతులం దులదూఁగుచు నుంద్రు, యుద్ధభూ

ముల విజయంబు చేకురును, బుత్త్రకళత్రసుఖంబు లబ్బుఁ, బు
ష్కలముగ నైహికంబులను గాంచి సుఖంత్రు నను భజించినన్. ౨౧౬౦

తే. ఆ మహాపూజ రాజసంబైన నగును
గాక! యిహమందు సకలభోగంబు లంది
పరమసౌఖ్యంబులఁ జెలంగు పరమపదముఁ
బొందుదురు భక్తులగువారు ముదితులగుచు. ౨౧౬౧

క. తామసి యగు పూజావిధి-యేమిట నీరెండువిధుల కెనగాదు సుమా!
ధీమంతులు శాంతులు మది-నేమాడ్కిఁ దలంపరాదు హితమని యెపుడున్.

చ. సురవరులార! యర్చనము చొప్ప నెఱింగితి, రింక రావణా
సురుని జయింప రాఘవుఁడు శూరత మించ యజింపుఁడీ వెసన్,
వరమహిషాజబృందముల భక్తి సమర్పణచేసి, నాకు సం
బరము ఘటింపుఁడీ బలుల, వైరివినాశము నెంచి యాత్మలన్. ౨౧౬౩

చ. ప్రతిదిన మిట్లు పూజలను భక్తినొనర్చుచు శుక్లపక్షమం
దతులితమౌ మహానవమియందునఁ జేయుఁడు ఛాగముఖ్య వి
స్తృతబలిదానముల్, మిగులఁ దృప్తియొనర్పుఁడు నాకుఁ జిత్తమం
దతిశయసమ్మదం బొదవునట్లుగ దేవతలార! సద్విధిన్. ౨౧౬౪

మ. అరివిధ్వంసనశీలనైన నను మీ రత్యంతసద్భక్తితో
వరపూజాపరితృప్తిచేసినఁ దమిన్ ద్వాద్వైరియౌ రావణా
సురునిన్ లోకసమూహకంటకు మహాశూరున్ వెసన్ ద్రుంతు సం
గరరంగంబున నిశ్చయంబుగను లోకశ్రాంతి పెంపొందఁగన్. ౨౧౬౫

తే. నాకు బలిదాన మతితృప్తి నవమియందుఁ-జేసినం గల్గుఁగాన మీ రాసఁ గోరు
కోర్కులుఫలింపఁగోరినఁ గొదువపడక-యొసఁగుఁడీ బలి నవమినాఁడసదృశముగ.

ఆ. మదిని దెలిసియేని మఱి తెలియకయేని-భక్తితోడనే నభక్తినేని
నన్ను వార్షికంబునాఁదగు పూజ గా-వింపఁదగును మిగుల విబుధులార!

క. ప్రతిదినముం బలిదానము-నుతితతిపూర్వకముగా ననున్ సంతృప్తిన్
ధృతిఁ గావింపంజను, ని-వ్వితము హితము నాకు నెపుడు విధివిహితమగున్.

తే. శక్తి చాలనివాఁడు నాసక్తి నవమి
యందయిన బలిదానంబు నధికభక్తి
నొసఁగనగు, నష్టమిని బలి యుఱుతరమగు
యజ్ఞఫలముల సమకూర్చు నని తెలియుఁడు. ౨౧౬౯

సీ. సురవరులార! నా కురుమోదమును గూర్పఁగా మహాష్టమినాఁడు గాఢభక్తి
నుపవాసమును జేయ నొప్పును భువనత్రయంబున నివసించునట్టివార,
లాత్మ సత్పుత్రుని నభిలషింతురయేని, యట్టివారికిఁ బుట్టు నతిశయసుగు
ణాఢ్యుండు నందనుం డస్మదీయకృపావిశేషంబునను, నిది సిద్ధము, తన
తే. యులు గలట్టివా రుపవాస మష్టమీ-దినమునందు నుండఁజనదు, తెలియఁ
డిద్ది, సిద్ధయోగ మెంతయు గూఢమై-వెలయుచుండు మిగుల విబుధులార!

తే. అష్టమిని నుపవాసంబు నధికభక్తి-నవమినిఁ బలిదానంబు ప్రవిమలాశ్వ
మేధముఖయాగఫలమునుమించుననుచు-నాత్మఁ దెలియుఁడుసురవరులార! సతము ''

ఉ. నారద! దేవి యిట్లు భువనత్రయమోదదమైన వాక్కు లిం
పారఁగఁ బల్కఁగా, సురగణాఢ్యులు బ్రహ్మయు నాలకించి వి
స్తారపు భక్తి దేవిపదతామరసంబులఁ బూజచేయఁగాఁ
గోరిక మీఱుచుండఁగ నకుంఠితదివ్యవిధి న్మనంబులన్. ౨౧౭౨

ఆ. పాదుకొల్పి వివిధబలిదానములచేత-ననుదినంబుఁ బూజ నాచరించి
రొగిని నవమివఱకుఁ బగలు జయింప, శ్రీ-రామమూర్తి గెలువ నీమమూని

నలువదియేడవ అధ్యాయము

రావణకుంభకర్ణ యుద్ధము

చ. మునివర! నారదా! వినుము పూన్కిఁ బరాంబిక సర్వలోకమా
తను భువనేశ్వరిన్ ద్రిదశధామమునందున, మర్త్యలోకమం
దునఁ గడు నిష్ఠ నింద్రసహితుల్ సురవర్యులు శంకరుండుఁ బెం
పునఁ గడుభక్తితోడుతను బూజయొనర్చుచు నుండి రంతటన్. ౨౧౭౩

క. శ్రీరాముఁడు దేవీకృప-ఘోరాస్త్రంబులను బఱపి కూల్చె సమరమం
దా రావణానుజుని దు-ర్వారుని ఖలుఁ గుంభకర్ణుఁ బటుగర్వాంధున్. ౨౧౭౪

చ. దురమున ఘోరరాక్షసులు తుత్తుమురై బహులక్షకోట్లు వా
నరుల పరాక్రమంబున వినాశమునొందిరి, య ట్లసంఖ్యవా
నరవరులున్ గతాసులయి నాశనమై భువిఁ ద్రెళ్లి రప్పు డా
శరవిభు విక్రమంబునకుఁ జాలక యెంతయుఁ దాపసోత్తమా! ౨౧౭౫

తే. ఘోరరూపంబుగను రణక్షోణిఁ బాఱె-రక్తనదులు విశాలతరంబు లగుచు,
నందు నెచ్చటఁ జూచిన నందులెల్ల-ముండమాలిక లురుభయంబు నొనరించె.

మ. తన తమ్ముండగు కుంభకర్ణుఁ డటు యుద్ధక్షోణి శ్రీరామచం
ద్రుని యస్త్రంబులఁ బ్రాణము ల్దొరఁగుటన్ దుష్టాత్ముఁడౌ రావణుం

జనయుఁ దుఃఖము విన్న యాక్షణమునందే తప్పుడై బిట్టు రో
దనముం జేయుచు మూర్ఛ మున్గెఁ గడుసంతాపంబునన్ నారదా! ౨౧౭౮

క. అంత నతికాయుఁ డనువాఁ-డెంతయు శూరుండు రాక్షసేశ్వరుఁ గని త
చ్చింతను బోఁద్రోలి కడున్-బంతంబున రణముసేయఁ బయనంబయ్యెన్.

ఆ. భీమవిక్రముండు వీరుండు రావణు-నూఱడించి మిగుల నుద్ధతుఁడయి
కృష్ణపక్షదశమి మృధ మొనరింపఁగాఁ-గదలె భూమి యద్రువఁగా మునీంద్ర!

ఉ. రాముఁడు కుంభకర్ణుని దురంబునఁ ద్రుంచి, పితామహుండు దే
వీమహనీయపాదములు విశ్రుతభక్తి యజించు చోటికిన్
నేమము మీఱఁ బోయి విధినిం భువనేశు మహాత్ముఁ గాంచి ని
స్సీమపు భక్తి మ్రొక్కులిడి చెంతను జేరి వచించె నారదా! ౨౧౮౧

తే. "రావణుని తమ్ముఁడైన వీరప్రవరుఁడు-కుంభకర్ణుండు రణమునఁ గూలె"ననిన,
బ్రహ్మయును మును బర దేవి పల్కినట్టి-పల్కులను దెల్పెఁ దాపసప్రవర! మఱియు.

చ. అనుదిన మా పరాంబికను నర్చనచేయు విధానమున్ రణం
బున నరివీరనాశనము మున్ వివరించెనుగాదె పంకజా
సనుఁడు, ముదంబున న్వాని ప్రశస్తము లైతగు వస్తుసంతతు
ల్గాని కపివర్యు లెల్లరును గూడి పరాంబికఁ బూజసల్పఁగన్. ౨౧౮౩

ఆ. బలసి వచ్చుచుండ భగవంతుఁ డగు రాముఁ-డంత దశమి నుదయమందె యచట
విపులబలులతోడ విధివిధానంబున-దేవిఁ బూజచేసి దివ్యభక్తి. ౨౧౮౪

మ. పరదేవీచరణాంబుజంబుల నెదన్ భావించి యష్టాంగము
ల్ధర సోఁకంగ నమస్కరించి తమి యుద్ధక్షోణికిం బూన్కి వా
నరవీరు ల్దను గొల్వరాఁ గదలె జానకీనాథుండు శ్రీరాముఁ డో
వరమానీ! విను మంతమీఁద సమరవ్యాపారపారీణతన్. ౨౧౮౫

మ అతికాయుం డతిదుస్సహుం డగుచు భూమ్యాకాశముల్ మ్రోఁగ, సై
న్యతతిస్యందననేమిఘట్టనలచే నాకంపితం బౌచు ను
ద్ధతి భూభాగము కంప మొందఁగను దుర్ధర్షాసురవ్రాతవి
స్తృతిసంసేవితుఁడై రణక్షితికి నచ్చెన్ గెంపు దీపింపఁగన్. ౨౧౮౬

శా. ఘోరాకారులు గుష్టదైత్యసమితు ల్గొల్వన్ రణోర్వీస్థలిన్
జేరన్, వానరవీరులం గివిసె నిస్సీమప్రతాపంబు పెం
పారంగా నతికాయుఁ, డంతట నిలింపశ్రేణియున్, గీశసం
వారంబున్ భయమందఁ బోరె నతిదుర్వారంబుగా నారదా! ౨౧౮౭

చ. పరిఘులు వృక్షరాజములు బండలు కొండలు పెన్గదల్ వడిన్
గరములఁ బూన్చి వానరనికాయము రాక్షసవీరులన్ భయం
కరగతి నొంచి యుద్ధభువి గాటపు శౌర్య మెసంగఁ దాఁకి దు
ర్భరముగఁ బెక్కువేల నసువారము వీడఁగఁ గూల్చి రేపునన్. ౨౧౮౮

చ. వివిధములైన బాణముల విశ్రుతరీతి ధరించి మించి కీ
శవితతి నల్లి యుద్ధమునఁ జంపిరి శూరతఁ జూపి రాక్షస
ప్రవరులు, క్రూరులై కవిసి బల్విడి లెక్కకు మిక్కుటంబుగా
నవిరళశస్త్రపాతముల నప్పుడు విక్రమ మొప్ప నారదా! ౨౧౮౯

మ. అతికోపంబున రామలక్ష్మణులు ఘోరాకారులై చాపము
ల్వితతప్రక్రియఁ దాల్చి యుద్ధభువి దోర్వీర్యంబు పెంపొంద దు
ర్మతులౌ రాక్షససైనికప్రవరులన్ మ్రందించి రవ్వేళ బా
ణతతుల్ పర్వఁగఁజేసి యొక్కమొగి సైన్యవ్రాతముల్ క్షోభిలన్. ౨౧౯౦

మ. దితివంశాగ్రణి వీరపూజితుఁడు సందీప్తాత్ముఁ డత్యుగ్రుఁ డ
ద్యతికాయుండును సంగరాంగణమునం దత్యుగ్రుఁడై వానర
ప్రతతిం ద్రుంపఁగఁ జొచ్చి ఘోరముగ నిర్బంధించి చంపెన్ మహో
ద్ధతుఁడై పెక్కు సహస్రసంఖ్యల నెదం గాపట్యంబు వే పొంగఁగన్. ౨౧౯౧

ఆ. తుములయుద్ధ మయ్యె దుర్మార్గుఁడౌ నతి-కాయరాక్షసున, కమేయసుగుణ,
కలితులైన యట్టి క్ష్మాపాలవరులగు-రామలక్ష్మణులకు నో మహాత్మ! ౨౧౯౨

మ. అంతఁ బ్రహస్తముఖ్యదనుజాధిపతిప్రముఖు ల్బలాఢ్యు ల
త్యంతరుషన్ జెలంగుచును నట్టె యెదుర్కొని వానరేంద్రులన్
బంతము మీఱఁ దాఁకిరి ప్రధానములన్ వడి నుగ్గడించుచున్
వంతున కెక్కి, భీతిదము వారల పోరు గనంగ నారదా! ౨౧౯౩

మ. అతిఘోరంబుగ వానరుల్ దితిజులున్ హర్షంబు దీపింప వి
స్తృతధైర్యంబున యుద్ధరంగభువి విస్మేరావహప్రక్రియా
శ్రితులై పోరొనరించుచుండిరి, పగల్ రేయిన్ మదిన్ లెక్కయున్
గతి నాలోచన మాచరింపకయె విఖ్యాతిం గడుం గ్రూరులై. ౨౧౯౪

తే. సురగరుడయక్షకిన్నర-వరులు ధరణియందునే నభంబుననే యె
వ్వారవున నీదృగ్విధసం-గర మరయ నశక్తులైరి కడు సుస్థితిలోన్. ౨౧౯౫

ఉ. ఒండొరుమీఁద నస్త్రముల నుత్తమశస్త్రములన్ భుసుండముల్
చండతరత్రిశూలముల శాతమహాపరిఘుంబులన్ వడిన్

చెండుచు మీఁటి హుంకృతులఁ జేయుచుఁ బోరిరి చూడఁగా మహో
ద్దండతరాట్టహాసముల ధారుణి సంకుల మంద నారదా! ౨౧౯౬

ఆ. పగలు రాత్రిగాఁగ భావింపనయ్యె, రా-త్రియును బగలుగాఁగఁ దేజరిల్లె,
నభ్రరహితగగన మతివృష్టి గురిసెను,-భీతిదముగ గాలి వీచె నపుడు. ౨౧౯౭

క. రణరంగంబున భీత్యు-ల్బణదములై పిడుగు లడరి పడసాగెను మా
ర్గణగణముల మించుచు వడి-ధణాధణమని భూమి యద్రువ దశదిశలందున్.

ఆ. మూఁడు దినము లిట్లు భూతభయంకరం-బుగను బోరు సాగె మునివరేణ్య!
సురలు గగనవీథిఁ బరికించి యారణో-ద్వృత్తి కాత్మలందు బెగడువడిరి.

శా. అంత న్మాల్గవనాఁడు లక్ష్మణుఁడు క్రూరాస్త్రంబులం గొట్టి దు
ర్దాంతున్ విక్రమవంతు నుద్ధతుని సంగ్రామోత్సుకున్ శూరు ను
ద్భ్రాంతుం గా నతికాయు నంతకునిఁ జేరంబంపె దేవౌఘ మా
వింతన్ మెచ్చఁ ద్రయోదశీనిశిని గోర్వీర్యంబు రూపింపఁగన్. ౨౨౦౦

క. తక్కిన రాక్షసవీరుల-యుక్కడఁగించె రఘురాముఁ డురుశరనిహతిన్,
జిక్కినవారల వానరు-లొక్కుమ్మడిఁ దునిమి రప్పు డుర్విం బడఁగన్. ౨౨౦౧

క. హనుమంతుండును నంగదుఁ-డును మున్నగు వానరులు గడుం గ్రోధమునన్
మునుమిడి రాక్షసవీరులఁ-దునిమిరి రణభూమియందు దోర్బలశక్తిన్. ౨౨౦౨

క. కొందఱు రాక్షసు లతిభయ-మంది దిశలఁ బాఱి రప్పు డతిత్వర, మోదం
బందెను శ్రీరాముఁడు రణ-మందు విజయ మొంది మిగుల నద్భుతరీతిన్.

క. వానరు లెల్లను విజయ-ధ్వానములను జేయుచును ముదంబుఁ గనిరి, నే
త్రానందంబుగ సురలు ప్ర-సూనంబులు గురిసి రాత్మఁ జొక్కి ప్రియమునన్.

ఉ. రాముఁడు లక్ష్మణు న్నిగుల రంజిలుచున్ దన దోర్యుగంబునన్
బ్రేముడిఁ గౌఁగిలించుకొని పెంపెసలారఁగ నాదరించి సు
స్థేము శిరంబు మూర్కొని మదిం గడుభక్తిని జేరఁబోయె స
త్కామితదాయకుం డయిన కంజజు పాలికిఁ దాపసోత్తమా! ౨౨౦౫

శా. ప్రాతఃకాలమునందె రాఘవుఁడు బిల్వశ్రేష్ఠవృక్షంబునన్
జేతఃప్రీతిద నీశ్వరేశ్వరిని సంసేవించి పూజించి లో
కాతీతం గొనియాడి యుద్ధవిజయం బర్థించి వే కేశసం
ఘాతంబుల్ వడి రా రణస్థలికిఁ జేరంబోయె మానీశ్వరా! ౨౨౦౬

చ. కడు బలవంతుఁడైన యతికాయుఁడుఁ, దద్బలముం, బ్రహస్తుఁడున్
బెడిదముగా రఘూత్తముని బీరముచే రణరంగభూమిపైఁ

బడుటను రావణుండు విని, పల్వగచే క్షితి వ్రాలి, లంకకుం
గొడుకును మేఘనాదుని నకుంఠితవీర్యుని రక్షణార్థమై. ౨౨౦౭

క. విని యోగించి, దురంబును-నొనరింపఁగఁ బోయె నాత్మ నురుతరకోపం
బును బూని, యంత యుద్ధం-బనుపమమై భయద మయ్యె నరయ మునీంద్రా!

క. వానరులకు రావణునకుఁ-బూనికతో జరగెఁ బోరు భూతాద్భుతమై
మౌనీంద్రా! యమరాష్ట్రి-నూనవివృద్ధంబు నగుచు నురుతరరీతిన్. ౨౨౦౮

క. శ్రీరామలక్ష్మణులకును-నా రావణదనుజపతికి నతిఘోరంబై
పో రొదవె, విభీషణుఁ డా-నారసి రావణుఁడు శాత్రవానలిచెంతన్. ౨౨౧౦

శా. క్రోధం బాత్మ నిరస్తమై నిగుడఁగాఁ గ్రూరాత్ముఁడై తమ్మునిన్
బాధింప న్నయదత్తమై భయదమై భాసిల్లుచున్ శాత్రవో
చ్ఛేదంబున్ వడిఁ జేయు శక్తి గల శక్తం బూని వే వైవఁ గో
పాధీనుండయి యుద్యమించె, నపు డాయత్నంబు సౌమిత్రియున్. ౨౨౧౧

చ. కనుఁగొని యావిభీషణునిఁ గావఁగ నెంచి తదీయసమ్ముఖం
బునకును వచ్చి తా నిలిచెఁ బూర్ణదయామయుఁ డౌచు, నాక్షణం
బున వరశక్తి రావణుఁడు పూనిచివైచెను, నద్ది లక్ష్మణున్
సునిశితరీతిఁ జేరి మఱి చొచ్చె రసాతలసీమ కత్తఱిన్. ౨౨౧౨

ఉ. అంతట లక్ష్మణుండు సమరావని మూర్ఛిలె, రావణుండు తా
స్వాంతమునందు లక్ష్మణునిఁ జయ్యనఁ గైకొని పోవు కోర్కితో
నెంతయు స్వీయబాహువుల నించుక తాఁకుచు నుండ వెంటనే
చెంతను జేరి పావని విశిష్టరుషాన్వితుఁడై జవంబునన్. ౨౨౧౩

క. రావణు విపులోరఃస్థలిఁ-జేవ యడఁగ ముష్టిఁ బొడిచెఁ, జేష్ట లుడిగి లం
కావిభుఁడు వ్రాలె నరదము-పై, వడి రక్తంబు గ్రక్కి పరవశుఁ డయ్యెన్.

ఆ. అంతఁ దెలివి నొంది యెంతయుఁ గ్రుద్ధుఁడై
రావణాసురుండు రయము మీఱ,
ధనువుఁ బూని హనుమఁ దునుమఁగా నెదనెంచి
యుఱికె వానిపైకి నుద్ధతుఁడయి. ౨౨౧౫

తే. రామచంద్రుండు చూచి యుద్దామచాప-మూని పావనిమీఁదికిఁ బోవు రావ
ణాసురుని నంతకసమాను నట్టె తాఁకి-పలికె నిట్టులు గంభీరభాషణముల.

శా. "ఓరీ! రాక్షసరాజ! నేఁ డిదె త్వదీయోద్వృత్తి నెంతే వడిన్
క్రూరాస్త్రంబుల పాలు చేసి సమరక్షోణిం బడం ద్రుంతు నీ

వేరీతిఁ రణసీమ వీడక యపో రీవేళఁ గావింపఁగా
నారంభింతువ యేని, చూడుము మదీయామోఘదోర్వీర్యముల్.''	౨౨౧౮

రావణుఁడు రణరంగము విడిచి పురిలోని కరుగుట

క. అని బాణంబుల ధనువున-గొను రఘుపతి కూర్పఁగానె కొదుకుచు మది నూ
నిన భయము పురములోనికిఁ-జనె ద్రుతగతి రణము విడిచి సంయమినాథా!

చ. జనకుఁడు రావణుండు పురిఁ జయ్యనఁ జొచ్చుటఁ గాంచి, యంతఁ ద
త్తనయుఁడు మేఘనాదుఁ డాగిఁ దండ్రిని నూఱట నొందఁజేసి, తా
ననిఁ గ్రుధఁ బోరఁగోరి, సమరాంగణసీమకు వచ్చె, ఘోరమై
తనరె దురంబు లక్ష్మణుఁడు, దైత్యతనూజుఁడు విక్రమింపఁగన్.	౨౨౧౯

చ. భువనభయంకరున్ విబుధపూగవిమోహనహేతుభూతు శూ
రవరుని రావణాత్మజుఁ బరాక్రమవంతుని మేఘనాదునిన్
భువిఁ బడఁ ద్రుంచె లక్ష్మణుఁడు భూరిశరంబుల నేసి యాజియం
దవిరళశక్తిఁ జూపి, సుర లద్భుతమంద నమావసిన్ మునీ!	౨౨౨౦

రావణుఁడు కుమారుఁడుచచ్చెనని తానేయుద్ధమునకువచ్చుట

చ. తన సుతుఁ డీల్గె నంచు విని దారుణశోకము తన్ను ముంపఁగాఁ
బనవుచు రావణాసురుఁడు భావమునం దలఁపంగరాని రీ
తిని మునినాథ! శత్రువుల దిట్టతనంబును నెంచి కోప మా
త్మను మొఱయింప నుగ్రుఁడయి మార్తురఁ ద్రుంపఁదలంచె శూరతన్.	౨౨౨౧

మ. కదలెన్ సంగరభూమి కేత్తెఱ సమగ్రస్థైర్యసంపన్నులై
యెద దేవాంతకముఖ్యరాక్షసమహోద్వృత్తాత్మయోధుల్ మదో
న్మదులై యెంతయు వెంటరా భువనము ల్మార్మ్రోఁగియ, యుద్ధంబు భీ
ప్రదమయ్యెన్ బ్రతిపత్తునుండి నవమీపర్యంత మో నారదా!	౨౨౨౨

తే. రామరావణయుద్ధంబు భీమరూప-మయి నిరుపమానమై చూడ నద్భుతమయి
తుములమయి వాగతీతమై తోఁచె సర్వ-భువనభీకర మగుచు నప్పుడు మునీంద్ర!

క. మునినాథా! రక్షోనా-థుని బల మనుదినము రాము దోర్బలశక్తిన్
మనఁజాలక సంఖ్యయు సమ-సెను షష్ఠీదినముదాఁక సేన క్రమముగన్.	౨౨౨౪

ఆ. షష్ఠినాఁడు భువనసమితి పితామహుఁ-డైన బ్రహ్మ మృణ్మయప్రతిమను
జేసి మిగుల భక్తిచే దేవి ప్రతికృతి-సంజ నావహించి సంయతుఁడయి.	౨౨౨౫

తే. సప్తమీదినమునఁ బత్త్రి సాధురీతిఁ-జేర్చి యావాహనముఁ జేసి శ్రీపరాంబఁ
బూజగావించె నియతుఁడై, భువనవిజయ-పత్త్రిఁ గూర్చినయంత నవార్యశక్తి.

తే. సర్వసంహారకారిణి సర్వశక్తి-రావణునిఁ జంపుటకు నయి రామచంద్రు
ధనువునందుఁ బ్రవేశించి యనుపమమహి-మను వెలింగె మహాష్టమి మునివరేణ్య!

చ. ఉదయమున న్మహాష్టమిని నుల్లమునందుఁ బితామహుండు మో
దదయగు నాపరాంబికను ధ్యానముచేయుచుఁ బూజచేసె న
భ్యుదయము రామభద్రునకుఁ బూర్ణముగా దయచేయునట్లు పెం
పొదవు మహోపచారముల నూర్జితరీతి నొసంగి నారదా! ౨౨౨౮

ఉ. అంతఁ బరాంబ తృప్తి మదినంది జగత్పితకుం బ్రసన్నయై
యెంతయు వేడ్క రాఘవు మహేషువునందునఁ జేరి దుర్మద
స్వాంతుని రావణాసురుఁ బ్రచండత ముట్టి తదీయశీర్షముల్
వింతగ ముక్కలై రణభువిం బడఁ ద్రెంచె ననంతశక్తితోన్. ౨౨౨౯

ఉ. రాముఁడు బాణముం దొడిగి రావణుఁ గూల్పఁగ వేసె నప్పు డు
ద్దామత నప్పు డాదితిజతల్లజుఁడై తగు రావణుండు దే
వీమహనీయ పాదముల విహ్వలమానసుఁడై తలంచె సం
గ్రామభువంబునందున శరణ్య యటం చెద విశ్వసించుచున్. ౨౨౩౦

చ. శరముల భీకరంబుగను సంగరరంగమునందు రాముఁ డు
ద్ధురగతి రావణాసురుని దోర్బలమున్ వడిఁ జూపి కొట్టఁ ద
చ్ఛిరములు తున్గియున్ మరలఁ జేరుచు నుండెఁ దదీయగాత్ర, మ
చ్చెరువుపడంగ నెల్లరును జిత్తములందునఁ దాపసోత్తమా! ౨౨౩౧

ఆ. ఎంత యత్నంబుతో బాణసంతతులను-బఱపి శిరములఁ ద్రుంచిన వడిఁ దెగియును,
మరలఁ జేరును రావణు మహితగాత్ర-మునను, నసువులువీడఁ డాదనుజవరుఁడు.

క. అతిఘోరంబయి సంగర-ము తుములమై యడరె నవమిఁ బూర్వాహ్ణమునం
దతులితముగ రామునకును-దితిసుతవరునకును భీతి దివిజుల కొదవన్. ౨౨౩౩

సీ. ఆ మహానవమినాఁ డఖిలలోకపితామహుఁడు పరమేష్ఠి తా నుల్లమందుఁ
బరదేవిఁ గడునిష్ఠ నిరవుకొనం జేసి, వివిధోపచారము ల్విస్తృతముగ
నర్పించి పూజించె నాబిల్వవృక్షసమీపంబునందున మృణ్మయియగు
విగ్రహంబునను దేవీమూర్తి ధ్యానించి నానావిధంబులైన బలు లొసఁగి

ఆ. రమ్యధూపదీపరాజి నైవేద్యాదు-లను బరాంబ సూక్తులను దలంచి
కొదువలేకయుండఁ గూర్చి సద్భక్తితో-రామజయము నెంచి నీమమునను.

తే. అంత ముక్తిదయైనట్టి యాపరాంబ-దేవి భగవతి చిద్విద్య రావణాసు
రుని నవిద్యాస్వరూపయై యెనసె వాని!-వినుముతన్మహిమంబునువిశదపఱుతు.

క. రావణుఁ డవిద్యచేఁ దన-భావంబున మోహితుఁడయి పరదేవిస
త్సేవ మఱచె దేవిని సం-భావింపక పోయె, నడఁగె భక్తియు మదిలోన్.

క. దేవీమాయామోహితుఁ-డై వెసఁ గోపంబుఁ బూని యసురేంద్రుఁడు దు
ర్భావంబున రామునితోఁ-గావించె రణంబు నపుడు కడు ఘోరముగన్,

రామరావణయుద్ధము

మ. తనకున్ బ్రహ్మముఖాస్త్రజాలబలమే తథ్యంబుగా యుద్ధభూ
మిని శ్రీరాఘవు గెల్వఁజాలు నని బల్మిన్ దర్ప ముప్పొంగ రా
ముని బ్రహ్మాస్త్రము మున్నుగాఁగల శరంబు ల్పూని ఘోరాకృతిం
గొని శ్రీరామునిపై వడిం బఱపె నుగ్రుండై సురల్ భీతిలన్. ౨౨౩౮

మ. దురమం దారఘురాముఁ డాశరములన్ దోర్వీర్య ముప్పొంగ ను
ద్ధురుఁడై బ్రహ్మముఖాస్త్రము ల్బఱపి తోడ్తోఁ ద్రుంచి దుర్ధర్ష భీ
కరు నారావణుఁ గ్రూరబాణసమితిం గాఢంబుగాఁ గొట్టె న
చ్చెరువొందన్ విబుధావళుల్ నభమునం జిత్రక్రియన్ జూడఁగన్. ౨౨౩౯

తే ఒండొరుల గెల్వఁగాఁబూని యుల్లములను
రామరావణు లత్యంతభీమరూపు
లగుచుఁ బోరంగ మధ్యాహ్న మయ్యె నమ్మ
హానవమినాఁడు విను మంత మానినాథ! ౨౨౪౦

తే. అంత నపరాహ్ణమగుటయు నంతరంగ-మందు శ్రీరామచంద్రుఁ డయ్యాదిశక్తి
యైన పరమేశ్వరిని భక్తి నవికలముగ-ధ్యాన మొనరించి ప్రణమిల్లి తత్పదముల.

క. రావణు వధింపఁగా నా-దేవిని నుతిచేసె మిగుల స్థిరుఁడయి యపుడే
పావనచిత్తుఁడు బ్రహ్మయు-దేవీపదములకు మ్రొక్కె దృఢతరభక్తిన్. ౨౨౪౧

క. "రావణు దురాత్ము దుస్సహు-దేవి! దునుమాడు" మని నుతిం జేసెను స
ద్భావమున మాటిమాటికి-శ్రీవిభునకు జయము గలుగఁజేయు మటంచున్.

సీ. సకలలోకంబులఁ జక్కఁగ రక్షించు పరమేశ్వరియుఁ గడుభక్తి రామ
చంద్రుండు బ్రహ్మయు సన్నుతి సమ్మతిఁ గావింపఁగా మెచ్చి కరుణతోడ,
జాజ్వల్యమానకల్పజ్వలనాతిదీప్తంబగు శస్త్ర ముత్తమము నొసఁగెఁ,
దాని దోర్గర్వితు దానవు ఖండింప నయ్యస్త్రవరము నత్యంతతృప్తి
తే. వెలయఁగాఁ బ్రీతి యుప్పొంగ విశ్వకర్త-యైన పరమేష్ఠి శత్రుసంహననశీలుఁ
డైన శ్రీరామునకు నిచ్చె నాక్షణమున-నాలసింపక నారదా! యతిరయమున,

క. కాలాంతకసన్నిభమై-జ్వాలలచే మించి వేగవంతంబయి యా
భీలసకలబలమయమగు-కోలం గొని ముదముఁ గనె రఘుప్రవరుంగున్. ౨౨౪౨

ఉ. అంత మనంబులోపలఁ బరాంబను సుస్థిరభక్తి నిల్పి య
త్యంతమహాప్రభావమున నంతట వెల్గు శరంబు వేగ దు
ర్దాంతుని రావణుం గుఱిచి తా నొగిఁ జాపమునందుఁ గూర్చి క
ర్ణాంతముదాఁక లాగి సుర లచ్చెరువందఁగ వేసె నారదా! ౨౨౮౬

రావణవధ

శా. ఆ యస్త్రం బతిదీప్తమై వెలిఁగి బ్రహ్మాండంబుఁ దా నిండి దు
ర్జేయున్ రావణుఁ ద్రుంచి తద్ధృదయమున్ భేదించి తత్ప్రాణముల్
పాయం జేసి ధరాతలంబునను దుర్వారక్రియం దూఱె, ను
చ్ఛ్రాయాత్మద్యుతి దుర్నిరీక్ష్యమయి విస్మేరప్రదం బౌనటుల్. ౨౨౮౭

ఉ. అంతట నంతరంగములయందు మహాద్భుత మంది దేవతా
సంతతు లెల్లఁ జూడఁగ నిశాచరవర్యుఁడు రావణుండు దు
ర్దాంతుఁడు హేమభూషితరథంబున నుండి రణోర్విమీఁద న
త్యంతమహారవం బడర నప్పుడు ద్రెళ్లెను మానిసత్తమా! ౨౨౮౮

తే. వసుధ యంతయుఁ గంపించె, వార్ధు లెల్లఁ
గలఁత నొందెను, బ్రాణు లాకులత నొందె,
దనుజసముదాయ మతివిషాదమున మునిఁగె
రావణుఁడు ద్రెళ్లఁగా సంగరంబునందు. ౨౨౮౯

మత్త. అంతరంగములందు సంతస మంది వానరు లెల్లరున్
వింతవింతగ నారవంబుల వేడుకల్ వడిఁ జేయఁగాఁ
జింత లెల్లను వీడ నంచును, శ్రేయము ల్గనినార మం
చెంతయున్ భువనాధివాసులు హృష్టులై రపు డోమునీ! ౨౨౯౦

తే. సురలు సురభిళప్రసూనవర్షంబు లత్యంతహర్షసంయుతాత్ము లగుచు
రామచంద్రుమీఁదఁ బ్రేమ ముప్పొంగఁగాఁ గురిసి రపుడు మానికులవరేణ్య!

శా. శ్రీరామాజ్ఞను నిర్జరప్రభుఁడు వర్షించెన్ సుధావృష్టి, నా
ఘోరంబైన రణోర్వియం దసువులం గోల్పోయియున్నట్టి వి
స్ఫారప్రాభవయుక్తులౌ వనచరు ల్ప్రాణంబులం బొంది గం
భీరస్వాంతులు నైరి తొల్లిటి క్రియన్ వృష్టిప్రభావంబునన్. ౨౨౯౨

విభీషణుని దుఃఖము

క. తన యన్న రావణుఁడు దుర మున నసుతతి వదలి యపుడు పుడమిఁ బడఁగఁ దా
మనమున విభీషణుఁడు రోదన మొనరిచె దీనుపగిదిఁ దాపసవర్యా! ౨౨౯౩

రామరావణయుద్ధము

"అంత మనంబులోపలఁ బరాంబను సుస్థిరభక్తి నిల్పి య
త్యంత మహాప్రభావమున నంతట వెల్గు శరంబు వేగ దు
ర్దాంతుని రావణుంగుఱిచి తానొగిఁ జాపమునందుఁ గూర్చి క
ర్ణాంతము దాఁక లాగి సురలచ్చెరువందఁగ వేసె నారదా!" [పుట 296]

తే. అంత భగవంతుఁడైనట్టి యారఘూద్వ-హుండు శ్రీరాముఁ డాదృతి యుల్లసిల్లఁ
గా విభీషణు సాంత్వనకలితవాక్కు-లను సమాశ్వాసన మొనర్చె మునివరేణ్య!

చ. మదిఁ గల దుఃఖముల్ వదలి మాన్యతమం బగు తత్త్వ మెన్ని శ్రీ
ప్రదుఁడగు రామునాజ్ఞను శిరంబునఁ దాల్చి విభీషణుండు న
య్యదనున రావణాసురున కాదృతిఁ జేసెను శాస్త్రలౌకికా
స్పదబహుసంస్కృతుల్ వినుతశాస్త్రవిధిన్ గడు నిశ్చలాత్ముఁడై. ౨౨౫౫

చ. విను మటమీఁద నారద! సువిస్తృతరీతి వచింతు, లక్ష్మణుం
డనుపమభక్తి జానకిని నాదృతిఁ దోడ్కొనివచ్చి రామచం
ద్రుని పదపద్మసన్నిధిని దోరపువేడుక నిల్పె, నంత సీ
తను గని స్వాంతమందునను దా రఘురాముఁడు పొంగె నెంతయున్. ౨౨౫౬

ఉ. జానకితోడ రాఘవుఁడు సంతస మొప్పఁగ నాక్షణంబునన్
వానరసంఘము ల్గొలువ వైభవ ముల్లసిలంగ బ్రహ్మ తాఁ
బూనికతోఁ బరాత్పరను బూజ లొనర్చుచు నున్నచోటికిన్
ధ్యానము చేయుచున్ మదిఁ బరాంబను గొల్వఁగఁబోయె నారదా!" ౨౨౫౭

నలువదియెనిమిదవ అధ్యాయము

శ్రీదేవ్యుద్వాసనము

తే. శ్రీమహాదేవుఁ డీరీతిఁ జెప్పఁదొడఁగె-నారదమహర్షి "కటుమీఁద నారఘుకుల
వీరుఁడగు రామచంద్రుండు విశదభక్తి-నాపరాంబికాసాన్నిధ్యమందుఁ జేరి.

మ. అతిసంతృప్తి నెసంగు చిత్తమున సాష్టాంగంబుగా దండవ
న్నతు లర్పించి యనన్యభక్తియుతుఁడై ధ్యానించి శ్రీదేవిస
న్నుతిఁ గావించెను, తత్ప్రదేశమునకు న్మోదంబుతో వచ్చి స
మ్మతి గీర్వాణవరు ల్నుతించిరి పరాంబన్ సర్వలోకేశ్వరిన్. ౨౨౫౮

తే. సకలలోకమహేశ్వరి సర్వభువన-సర్గసంస్థితిలయహేతుచతుర రామ
చంద్రుఁడును సర్వదేవత ల్సన్నుతింప-దండవన్నతు లొనరింపఁ దగినరీతి.

సీ. భక్తిభావంబున బలుల విస్తృతముగా నర్పించి పూజింప నఖిలసురలు
జగదంబ ప్రీతయై సంతోషమును బొందె, నపుడు లోకత్రయమందు వెలయు
ప్రాణులు సమ్మోదవంతంబు లయ్యెను, స్వర్గంబునందు రసాతలమున
మనుజలోకమునందునను మహోత్సవము చెలంగెను దేవి యుప్పొంగునట్లు,

తే. మునివరా! వానరులు ముదమునను నాట్య-మాడిరి, మనోహరముగను బాడి రెల్ల
వారలును దేవిగీతము ల్గారవమున-నాసమయమందు నారదా! యధికతృప్తి.

క. దేవీప్రసాదమునఁ దా-భావంబునఁ బూర్ణతృప్తి పడని ముదమునన్
దేవీపదపద్మంబుల-సేవించుచు నుండె నపుడు శ్రీరఘువరుఁడున్. ౨౨౬౩

తే. నవమినాఁ డీవిధంబున నారదా! మ-హోత్సవముతోడ నుండిరి యురుతరవిభ
వమున శ్రీరామచంద్రుండుఁ బరమపూజ్యు-లౌ సురలు నెల్లవారలు నతిముదమున.

చ. వినుము పితామహుండు భువి విశ్రుతమౌ దశమీదినంబునం
దునను బ్రభాతకాలమునఁ దోరపుభక్తిఁ బరాంబఁ బూజనం
బునఁ బరితృప్తఁ జేసి జలపూర్ణసముద్రమునం దదీయమూ
ర్తిని గడువేడ్కతో వదలి ప్రీతి స్వగేహముఁ జేరె నంతటన్. ౨౨౬౪

ఉ. శ్రీరఘురామచంద్రుఁడు ప్రసిద్ధగుణాఢ్యు విభీషణుం బ్రియం
బారఁగ లంకకుం బతిగ నప్పుడు పట్టముగట్టి, సీతతోఁ
గూరిమితమ్మునితోఁ గదలి కోర్కి నయోధ్యకుఁ బైనమయ్యె వి
స్తారపుఁ బుష్పకంబుపయి సంతస మొప్పఁగ నెక్కి నారదా! ౨౨౬౫

సీ. సకలవానరచయం బకలంకగతి తనవెంట రా వనచరవిభుఁడు కదలె,
సర్వరాక్షసవరుల్ చనుదేరఁ దనవెంటఁ జయ్యన నావిభీషణుఁడుఁ గదలెఁ,
ద్రిదశవరులతోడ దేవేంద్రుఁడును, ఋషిసంఘము ల్పతకోట్లు సరగఁ గదలె,
నీరీతిఁ బుష్పకం బెల్లరతోడుత శ్రీరామచంద్రుండు శ్రీపరాంబ

తే. నాత్మ ధ్యానించి వందన మాచరించి-పయనమయ్యెను దన పురవరమునకును
నారదమునీంద్ర! విను దేవ్యనుగ్రహమున-బరమపురుషుఁడు తానువైభవమునిట్లు.

సీ. భగవంతుఁడయ్యుఁ దాఁ బరమపూరుషుఁడు పరాత్పరభక్తి నారాధనంబు
గావించెఁగద శరత్కాలంబునను మునీ! తక్కిన దేవతాతతుల యక్ష
రక్షోగణము లమర్త్యవ్రాతముల సిద్ధగంధర్వపన్నగగణముల నీక
వేఱ చెప్పఁగనేల వివరించి పరదేవిఁబూజింపఁ గోర్కులు వొదలు నంచు,

తే. దేవికి సమానమయిన దేదియును లోక-మందుఁ బూజింపఁదగినది యరయ లేదు,
ముగ్ధుఁడై దేవి నెవ్వఁడు పూజచేయఁ-డట్టివాఁడు పాపాత్ముఁడే యగు నిజముగ.

క. దేవీసపర్యలోపం-బేవాఁ డొనరించు వాఁడె యిలఁ బాపి యనన్
భావింపుము వానికి నెం-దావాసము లేదు నిలువ నని కను మనఘా! ౨౨౬౬

శరన్మహోత్సవ మహిమము

క. కావున శాక్తుండైనన్-శైవుఁడు వైష్ణవుఁడు నైన సౌరుండైనన్
దేవిని శరన్మహోత్సవ-సేవారతి భక్తిఁ బూజసేయఁగవలయున్. ౨౨౬౭

సీ. జగదంబ మదిలోన సంతృప్తిఁ బొందంగఁ బూజింపవలయును మునివరేణ్య!
మత్స్యమాంసంబుల మఱియును ఛాగకాసరమేషకంబులఁ బరమభక్తి
బలులను నర్పించి పరమోపచారము ల్బహువిధంబులఁ జేసి భవ్యరీతి,
విత్తశాఠ్యంబు గావింపఁగారా దాదరంబున సర్వవిధంబులఁ బర

తే. దేవి నర్చింపనగుసుమీ దివ్యమాని!
శారదీయమహోత్సవసమయముననుఁ
ననుచు నెఱుఁగంగఁదగుఁజుమ్ము మనమునందు
నారదమునీంద్ర! విను మింక గౌరవమున. ౨౨౭౧

తే. చండిక గ్రహించు ఖలుల నఖండతృప్తి-తోడఁ బశురూపకులనుగాఁ దొడరి దాన
నర్పణముచేయనగు దేవి నర్చచేయు-వారు పశుబలులను గడు భక్తితోడ.

మ. మునినాథా! ప్రతివత్సరంబునను సమ్మోదంబుతో దేవిఁ బూ
జనముంజేయఁగనౌఁ, బరాంబ మదిలో సంతృప్తిపొందంగఁగో
రిన నెవ్వారయినన్ మహాక్రతు లెదం బ్రేమించి, యవ్వారి కే
పున నింద్రాదిసుపర్వులెల్ల వశులై పోషింతు రెల్లప్పుడున్. ౨౨౭౨

ఉ. ఈవచనంబు సత్యము మునీ! బహుభంగులఁ జెప్పనేల? యీ
దేవిని భక్తిఁ బూజల సుతృప్తి వహింపఁగఁజేయ నుద్భవం
బౌ వరపుణ్యముం దెలుపనౌనె జగత్త్రయమందు నేరికిన్
భావనచేయఁగానయిన భావమునందున నేని నారదా! ౨౨౭౩

తే. ఈ యనుత్తమమైనరామాయణంబు-విస్తృతంబౌ పరాంబికావిభవమహిమ,
మెవఁడు సద్భక్తి విను వాఁడు వివిధపాప-ముక్తుఁడగు నిశ్చయంబుగా మునివరేణ్య!

తే. బ్రహ్మ మున్నగువారికిఁ బడయరాని-దివ్యదేవీపదంబును భవ్యరీతిఁ
బొందువాఁడగు, నిజ మిద్ది బుధజననుత!-సద్గుణవిశిష్ట! నారద సంయమీంద్ర!

సీ. భగవంతుఁడౌ హరి పరమపూరుషుఁడు భూతలమున మానుషతనువుఁ దాల్చి
యవతారమును బొందినట్టి చరిత్రంబు సంపూర్ణముగ నీకు సంతసంబు
గలుగంగఁజెప్పితి ఖలుఁడగు శత్రువు సంహరింపఁగఁ దన స్వాంతమందు
నెంచి యకాలమం దీశ్వరిచరణాబ్జముల యథావిధి నాత్మఁ బూజచేసి

తే. జయము చేకొన్నవిధమును సంయమీంద్ర!
నారదా! యింక నెద్దాని గౌరవమున
వినఁగఁదలఁతువో తెలుపుమా విశదముగను
దెలుపనున్నాఁడ" నని మహాదేవుఁ డడిగె. ౨౨౭౪

శ్రితజనపరితోషా! చిన్మయానందభూషా!
వితతసుగుణమూర్తీ! విస్మయావిష్టకీర్తీ!
నతసురవరమౌళీ! న్యాయమార్గైకకేళీ!
శతమఖముఖపూజ్యా! శ్రాంతలోకైకరాజ్యా! ౨౨౭౭

గద్యము

ఇది శ్రీలలితాత్రిపురసుందరీ కరుణాకటాక్షవీక్షణ సమాసాదితోభయభాషాకవితావిభవ, జనమంచి వంశప్రభవ, కాశ్యపసగోత్రోద్భవ, సుబ్బయార్యతనూభవ, కావ్యపురాణతీర్థ విద్వద్బిరుదవైభవ వేంకటసుబ్రహ్మణ్యశర్మ విరచితకృతులయందు శ్రీమహాభాగవతమునందుఁ జతుర్థాంశము

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీ మత్పరదేవతాయై నమః

శ్రీ మహాభాగవతము

పంచమాంశము

నలువదితొమ్మిదవ అధ్యాయము

క. శ్రీనాథప్రముఖాద్యా-దీనావననిపుణలలితధీగుణహృద్యా!
నానాగమవేద్యా! వి-జ్ఞానాభిగమైకవిమలసత్పథవిద్యా! ౨౨౭౮

శ్రీపరాంబ శ్రీకృష్ణావతారమును ధరించుట

సీ. ''దేవదేవ! మహానుభావ! పరాత్పర యగు విద్య కాళి పరాంబ తాన
వసుదేవవసతిఁ దద్వరసతి యగు దేవకీగర్భమందునఁ గృష్ణరూప
మున నిజలీలచేతను జనింపఁగఁగోరి కంసాదిదుష్టసంఘములవలన
జనియించినట్టి విశ్వంభరాభారంబుఁ దొలఁగింప నవతార మిల జగదధి
తే. నాథుఁడనఁగఁ బుంరూపంబునను జెలంగె-ననుచుఁ జెప్పుదు రఖిలతత్త్వార్థవిదులు,
కరుణతోడ మహేశ! యకథను విస్తృ-తముగ నాకును దెలుపవే ధన్యవిభవ!''

క. అని వినయంబున నారద-ముని వేడఁగఁ బలికె నపుడు మునివరుతో న
త్యనుపమవాక్యంబుల నా-య్యన 'విను మిఁక' ననుచు నమ్మహాదేవుండున్.

తే. ''వత్స! తెల్పెద సత్యమై వఱలు నతిర-హస్యమగు తచ్చరిత్రంబు నాదృతి, భువి
దేవకీదేవికిని వసుదేవువలన-నవతరించిన విధము పరాంబకరుణ. ౨౨౮౧

క. అవనిపయి నాపరాంబిక-భవునిచ్ఛన్ గృతకపురుషపరమాకృతితో
నవతారము ద్వాపరమునఁ-జివరం గావించి ఖలులఁ జెండిన విధమున్. ౨౨౮౨

క. పలికెద నవధానంబునఁ-జలనం బించుకయు లేక శ్రద్ధను విను మి
మ్ముల'' ననవుడు నారదుఁ డపు-డలఘుముదంబునను బ్రశ్న మడిగెను మరలన్.

సీ. ''పరమేశ్వరున కిచ్ఛ ప్రభవించె నేరీతి? నేరీతి వసుదేవునింటఁ గాళి
దేవకీదేవియం దావిర్భవించెను శ్రీకృష్ణరూపంబు తీరి ధరించి?
తెలుపు మంతయును విస్తృతముగా మన్మానసమునకు బోధయగా నరణి దేవ!
పరమదయాస్వరూప! మహేశ! సర్వము నెఱిఁగినవాఁడవై యొసఁగు దీవు;''

తే. నావుడు మునీంద్రులతో మహాదేవుఁ డిట్టు-లనియె "నోవత్స! నీకు నే నంతయును వ
చింతు మునినాథ! యిచ్ఛ యాశివున కెట్లు-కలిగె, నదిజన్మ మెట్లయ్యె నిలననుటయు.

తే. తెలుపుచున్నాఁడ వినవయ్య! తృప్తిద్వాప-రాంతమునఁ గాళికాదేవియవతరించెఁ
గృష్ణరూపంబుతోడ నీక్షితితలమున,-భక్తియుక్తుఁడ వీవాదు పరమహాని!

శివపార్వతులు రాధాకృష్ణులుగ నవతరించుట

మ. ఒకనాఁ డిందుధరుండు రమ్యతమమై యొప్పారు కైలాసమం
దకలంకంబగు స్వీయమందిరమునం దత్యంతకౌతూహల
ప్రకటప్రక్రియఁ బార్వతీసహితుఁడై భద్రప్రదుం డాత్మ ను
త్సుకుఁ డౌచున్ విహరించుచుండె, నపు డచ్చో మానిసంపూజితా! ౨౨౮౬

క. మనమునఁ దలంచె హిమగిరి-తనయారూపంబు రుచిరతమముం గని 'స్త్రీ
జని యెంతయు నుత్తమశో-భనయుతమౌ నెందు' ననుచుఁ బరమముదమునన్.

తే. అంత సర్వాంగసుందరి యైన పార్వ
తీమహాదేవి నత్యంతతృప్తి నొందు
నట్లు ప్రియవాక్యములఁ బల్కి యాననంబు
దనకరాంబుజమునఁ దాఁకుచును వచించె. ౨౨౮౮

మ. "పరదేవీ! భవదీయమౌ కరుణ నావాంఛ ల్సుపూర్ణంబులై
పరఁగెన్, లే దవశిష్ట మొక్కఁడయినన్ భావంబునం దెన్న, నా
కరయన్ శాంకరి! యొక్క కోర్కి కల, దీ వాత్మన్ గృపాయుత్తవై
పరమానుగ్రహ మింతు వేని యొగి నాపైఁ బూర్ణతం దీర్పుమా." ౨౨౮౯

క. అనవుడు శాంకరి శంభునిఁ-గని "శంకర! వాంఛ యేదికలిగెనొ చెపు, మి
య్యన నీకుఁ దృప్తిచేయఁగ-నొనరింతును బూర్ణముగఁ బ్రభూ!"యని పలికెన్.

ఉ. "నాయెడ నీ కనుగ్రహ మనంతమ యేని మహేశ్వరీ! మఱిం
కాయఁగ నీక నాదయిన ప్రార్థన మెంతయు నెంచి ప్రేమతో
నేయెడనైనఁ బుట్టుము మహిన్ బురుషత్వముఁ దాల్చి, యేను స్త్రీ
నై యవతార మొందఁగల నార్య! ధరిత్రిఁ బ్రియంబు మీఱఁగన్. ౨౨౯౧

క. పరమేశ్వరి! యే నేక్రియఁ-గరము ప్రియముఁ గూర్చు భర్తగా నైతినొ, నీ
వరయంగ నాకుఁ బ్రాణే-శ్వరివై ప్రాణసమ వయితి పరమప్రీతిన్. ౨౨౯౨

చ. శ్రితులగు భక్తసంతతుల చిత్తములం గల కోర్కులెల్ల నా
దృతిఁ బరిపూర్ణతం గనఁగఁ దీర్చు మహేశ్వరి వీవు, మన్మనో
గతమగు నీయభీష్టమును గాదన కెంతయుఁ బ్రేమఁ దీర్పు, మి
ప్పితమగు కోర్కి నా కొదవె, వే యొనరింపుము దేవి! సమ్మతిన్." ౨౨౯౩

ఉ. నారద! యీవిధంబున మనంబున నుండినయట్టి శ్రేష్ఠమౌ
కోరికఁ దెల్పఁగా హరుఁడు, కూరిమిమీఱఁ బరాంబ యిట్లనెన్·
"ధారుణిఁ ద్వత్ప్రియార్థముగఁ దప్పక యవ్వసుదేవునింటిలోఁ
బూరుషరూపముం దవిలి పుట్టెద నిక్కముగా మహేశ్వరా! ౨౨౯౪

క. నీకోర్కెఁ దీర్పఁ గృష్ణుఁడ-నై కుంభినిఁ బుట్టుదాన, నధిపా! యిఁక నీ
వో కామినివై జనిఁగని-చేకూర్పుము ముదము నాకుఁ జెల్వమరఁగ" నాన్.

మ. "పరదేవీ! విను కృష్ణమూర్తివయి పుంభావంబు నీవొంద న
త్తరుణాంబందున నేను రాధయనఁ గాంతారూపముం బొంది యీ
ధరలోనన్ వృషభానుపుత్త్రినయి తత్సోధంబునం బుట్టుదున్,
నిరతిన్ బ్రాణసమాననై వెలయుదున్ నీ కెంతయుం గూర్చుచున్. ౨౨౯౬

క. నినుఁ గూడియె విహరింతును-విను నామూర్త్యష్టకంబు పృథివిన్ స్త్రీత్వం
బునఁ జెలఁగుచుండు నిం దే-యనుమానము లేదు చూడ నార్యా! దేవీ!

తే. రుక్మిణియు సత్యమున్నగు రుచిరగాత్ర-లష్టభార్యలు నామూర్తు లగుచునుందు"
రనఁ బరాత్పర యిట్లనె "నర్వరీతి-నీదు మూర్తులతోఁ గూడి నే రమింతు.

క. ఎవరుం జేయనియట్టిది-యెవరును విననట్టి దెందు నీయద్భుతమై
భవచర్య, యపూర్వం బయి-భువనంబులఁ గలుష మడఁపఁ బొసఁగు చరితమా.

క. దేవా! యీ మన చరితము-పావనమై వెలయుఁజుమ్ము బహుపుణ్యదమై
భావింపఁబడును సంతత-సేవార్హం బగును భువనసీమలయందున్. ౨౩౦౦

శా. దేవా! నాకును గూర్చునట్టి చెలికత్తె ల్గాడ శ్రీదాముఁడున్
భావింపన్ వసుదాముఁ డంచుఁ బిలువన్ భవ్యాత్ములై పుట్టి తా
రీవిశ్వంభరపై జయావిజయ లెంతే ప్రీతి వర్తించి సం
సేవింపంగలవారు సఖ్యమున మచ్చిత్తంబు పెంపొందఁగన్. ౨౩౦౧

క. పరమేశ్వర! పూర్వము శ్రీ-హరి యొక సమయంబు చేసె, నాహేతువుచే
ధర నా కగ్రజుఁడై యవ-తరించును హలాయుధాఖ్యఁ దాల్చి ప్రియమునన్.

క. రాముఁ డనఁ బ్రథితుఁడై నను-బ్రేముడిఁ గనుగొనుచు సతము విలసిల్లును, సు
స్థేమంబగు బలమున ను-ద్దాముఁడగు నతండు దేవ! ధన్యాత్మ! శివా! ౨౩౦౩

మ. క్షితిపై సంభవమంది నీదయిన కోర్కెన్ దీర్పఁగా, దేవతా
తతికార్యంబును బూర్తిచేయుటకు నాత్మన్ బూని వర్తింతు, ను
ద్ధతకీర్తిన్ జగమెల్ల నింపి పిదపన్ మత్ప్రాణనాథా! సమం
చితరీతిన్ భువినుండి వత్తు నిటకున్ జిత్తప్రమోదంబునన్." ౨౩౦౪

ఉ. నారద! మానినాథ! భువనప్రియకారిణి దేవి యాక్రియన్
గారవ మొప్ప నాత్మవిభు కమ్రమనోరథపూర్తిఁ జేయఁగాఁ
గోరి ప్రతిజ్ఞ చేసి జనిఁ గుంభినిఁ గాంచెను, దానఁ గృష్ణుఁ డిం
పారును నూతనాభ్రసమభాసితుఁ డౌచును శ్యామలాంగుఁడై. ౨౩౦౫

క. మునినాయక! శ్రీకృష్ణుని-ఘనావతారమున కయిన కారణ మిదియే
యని తెలుఁగుము మానసమం-దున, నొండొక కారణంబుఁ దోడ్తో వినుమా!

శ్రీకృష్ణావతార కారణము

చ. దనుజులు మున్ను యుద్ధమునఁ దాఁకి మహేశ్వరి బాణసంచయం
బున హరిచేతఁ జిక్కి యసువుల్ వడి వీడిరి, ద్వాపరాంతమం
దున మనుజాదినాథు లయి తొల్లిటి వైరము నూని పుట్టి రో
మునివర! నారదా! విశదపుణ్యగుణాకర! యాలకింపుమా. ౨౩౦౬

ఉ. వారలలోనఁ గంసుఁ డనువాఁ డతిదుస్సహుఁ, డట్లు నారదా!
గారవులున్ ధరాధిపులుగా బహుదేశములందుఁ బుట్టి పెం
పారుచునున్న క్షత్త్రియులు బాహుబలాఢ్యులు దర్పయుక్తులై
యారయ మర్త్యలోకమున నద్భుతరీతిని నిండి రేపునన్. ౨౩౦౭

క. అతిశయదర్పోద్ధతులగు-క్షితిపతుల భరింపలేక చేడ్పడి ధరణీ
సతి గోరూపముఁ దాలిచి-హితవెఱఁగఁగ బ్రహ్మకడకు నేగ మునీంద్రా!

క. త్రిదశవరు లెల్ల నాక్షితి-కొదవిన గతి కాత్మఁ జింత నొంది తదిచ్ఛన్
మది నెన్ని వెంటఁబోయిరి-సదమలమగు బ్రహ్మదివ్యసదనంబునకున్. ౨౩౧౦

మ. అతిదీనంబగు మోముతోడఁ దనయం దత్యంతసద్భక్తి వి
శ్రుతగోరూపముఁ దాల్చి వచ్చిన క్షితిన్ జోద్యంబుగాఁ గాంచి, "యీ
వితమిచ్చోటికి నేల వచ్చితివి? నీవెవ్వార్త వోయమ్మ! యే
హితముం గోరినదాన"వం చడిగె నాసృష్టిక్రియాధ్యక్షుఁడున్. ౨౩౧౧

సీ. "సకలజగంబులఁ జతురంబుగా సృష్టిగావించు నోధాత! కరుణమీఱ
నావిన్నపము విను, మే వసుధాసతి నగుదును, దొల్లి దేవాసురరణ
రంగంబునందు దర్పంబు నశింపంగఁ జచ్చినయట్టి నిశాచరవరు
లెల్లరు భూమిపై నుల్లాసమునఁ బూర్వవైరంబు మదిలోనఁ బాదుకొల్పి
ఆ. పుట్టియున్నవారు భూరిబలాఢ్యులై-దుష్టచిత్తు లగుచు దుడుకుఁదనము
మీఱ నెదురులేక మేర మీఱుచునున్న-వార లిపుడు దుర్నివారు లగుచు.

ఉ. వారి భరింపఁజాల సురవందిత! లోకశరణ్య! నీ పదాం
భోరుహయుగ్మమున్ శరణముస్ వడిఁ జేరినదాన, నింక దు

ర్వాదుల వారిఁ జంపుట కుపాయముఁ జూడుము వేగ, నాకు నీ
భారము మాన్పవయ్య! భవబంధవిమోచన! పంకజాసనా!" ౨౩౧౩

చ. అని నుతియింపఁగా ధరణి యాత్మ గరంగెడురీతి నారదా!
వనజభవుండు బ్రహ్మ మది బాగుగ భూసతి నూఱడించి, చ
య్యనఁ ద్రిదశోత్తముల్ గొలువ నాదృతితో హిమశైలమందుఁ బెం
పునఁ దగు రాజతాద్రికిని బోయె నటం జగదంబ గొల్వఁగన్. ౨౩౧౪

క. ఆ రజతశైలమం దతి-గారవమున లోకజననిఁ గని తచ్చరణాం
భోరుహములకు నమస్కృతి-వారము లొనరించి బ్రహ్మ భక్తి చెలంగన్.

క. కరములను మోడ్చి "త్రిభువన-వరజననీ! వినుము నాదు ప్రార్థనమును నీ
వురుతరకరుణాభరితాం-తరంగవయి నామొఱన్ నితాంతము దేవీ! ౨౩౧౬

సీ. తల్లి! నీచేతను దామోదరుని చేత సంహరింపఁగఁబడి సంగరమున
దైత్యులు దానవు ల్తనువుల ధరియించి దర్పంబునను మీఱి ధరణియందు
క్షత్రియర్షభులయి సాంప్రతంబు విజృంభణము మీఱియున్న వారమితముగను,
వారి దుశ్చేష్టలు భరియింపరానివై యుండుట భూదేవి యోర్వలేక

తే. బాధపడుచున్నయదిగాన పరమకరుణ-నుల్లమునఁ జూచి భూదేవి నుద్ధరింపఁ
దలఁపుమా, ఖలులగు రాజకులముఁ జంప-నెద్దియుక్తంబొ జగదంబ! యిపుడె త్వరగ.

ఆ. సకలభువనజనని! క్ష్మాభుజుల వధింప-రూప మూని వేడ్క తోఁప వేగ
వారిఁ జంపవమ్మ! వరుసతోఁ దన్మృత్యు-రూప వగుదువీవు శ్రీపరాంబ!" ౨౩౧౭

క. ఈ విధమునఁ బ్రార్థింపఁగ-దేవి కరుణతోడఁ బల్కె ధృతి వెలయంగా
"నో వారిజాసనా! విను-కావరమున మించునట్టి క్ష్మాపతితతులన్. ౨౩౧౯

మ. వనితారూపము నొంది యేను వధియింపన్ సుమ్ము, వారెల్లరున్
ఘనభక్తిన్ భజనం బొనర్చి మదిలోఁ గాంతాస్వరూపంబుతో
డను నున్నట్టి ననున్ శరణ్యయని వేడ్కన్ సంశ్రయం బొంది, యో
వనజాతాసన! తెల్పెదన్ మఱొకటా వార్తన్ జగద్రక్షకై. ౨౩౨౦

తే అభినవఘనాఘనాద్యుతి నలరు భద్ర-కాళికారూప మనఁగఁ బ్రకాశితమయి
నాదు మూర్త్యంతరంబు దానఁ బురుషాకృ-తిని జనింతును భువి వసుదేవునింట.

సీ. సౌమ్యరూపము, ద్విభుజములును వెలయ దేవకిగర్భమందు సంభవము నొందు
దానను, వనమాలఁ దాల్చి శ్రీవత్సలాంఛన మూని సుందరాననకమలము
తో నస్మదీయసంస్తుత్యరూపము ప్రకటితముగానట్టులు హితము మీఱ,
శ్రీవిష్ణులక్షణాస్థిరలక్షితుండును, సర్వాంగసుందరశ్యామమూర్తి

తే. యనఁగ శంఖంబుఁ జక్రంబు హస్తయుగ్మ-ముల విరాజిల్లఁ జెలువున లలితరీతిఁ
దోఁప నుండుదు, మాయినై దుష్టరాజ-మర్దనసమర్థభావంబు మది వహింతు.

క. ఖలులయి దర్పోద్ధతులయి-చెలఁగుచు భువి నుండునట్టి చెనటులఁ గంసా
దుల వివిధాకృతులగు రా-జులఁ జంపుదు నెల్లవారు చోద్యంబందన్. ౨౩౨౩

ఇంద్రాదులు పాండవధార్తరాష్ట్రులుగ నవతరించుట

క. విను మావిధమున హరియును-జనియించు నిజాంశచేత జగతి నతిబలం
బున వెలసి పాండురాజున-కును సుతుఁడై యర్జునుఁ డన గురువిక్రమతన్.

క. ఆ యర్జునునకు నగ్రజుఁ-డై యుదయించును యుధిష్ఠిరాఖ్య వెలయుచున్
ధీయుతధర్ముఁడు తా నె య-మేయంబగు ధర్మనిష్ఠ మేదిని నింపన్.

క. వాయువు నిజాంశ భీమా-ఖ్యాయుతుఁడై యవతరించు నట్లే ధరన
త్యాయతబలవిక్రమము ల-జేయములుగఁ జెలుపుచును బ్రసిద్ధాకృతితోన్.

మ. అతిదోర్వీర్యమునం జెలంగుచు నజేయంబైన తేజంబుతో
క్షితినాథాగ్రణి పాండురాజునకుఁ బూన్కిన్ బుత్త్రులై యుద్భవిం
చి తమిం బెంపుగడింతు రశ్వినులు తచ్చిత్తప్రమోదప్రదా
తతవృత్తిన్ దగు మాద్రియందుఁ గవలై ధన్యాత్ము లన్ ఖ్యాతితోన్.

చ. సతతము సత్యవిక్రములు శాంతిధనాఢ్యులు పాండుసూను లు
న్నతనిజధర్మవర్తనులు నా నుతి సేయఁగ నర్హు, లట్టి స
న్మతులకు నాదునంశమున క్ష్మాస్థలిఁ బుట్టిన కృష్ణ భార్యయై
హితవుగ నుండ, నాసతిని నెంచక లోనఁ బరాభవింపఁగన్. ౨౩౨౮

సీ. దుష్టుండు క్రూరుండు దుర్యోధనుం డాత్మదర్పంబు మీఱ మద్భవ్యతేజ
మున వెలుంగుచునున్న పుణ్యస్వరూపయౌ పాండవపత్నిని బరిభవించుఁ,
గంటకోపముఁ డతికష్టుండు వాఁడు విశ్వంబునఁ గలయట్టివారి కెల్ల,
వినుము మఱొక్క దుర్వినయంబుఁ గావించుఁ దెలిపెదఁ బద్మజా! ధృతిని వాఁడు,

తే. సువిమలాత్మకులైన పాండవుల మదికి-నధికపీడాకరంబయి యఖిల జీవు
లకును దుఃఖప్రదంబయి ప్రకటవిపిన-వాస మజ్ఞాతవాసంబు వెసఘటించు. ౨౩౨౯

ఉ. ఎంతయు దర్ప మొప్పఁగను నీక్రియ బాములఁ బెట్టఁజూచి, యే
నంతటఁ బాండుపుత్త్రుల దయన్ బరిరక్ష యొనర్ప నెంచి, య
త్యంతమహోత్తమం బయిన యాదృతిఁ దోడ్పడఁగాఁ బయత్నము
ల్వింతగ సంఘటింతుఁ, గడు విస్తృతకీర్తి సుయోధనుం డదన్. ౨౩౩౦

మ. కడు దుర్మార్గుఁడుగాన సుద్ధతిని దాఁ గర్ణాది దుర్బుద్ధు లె
ప్పుడు విశ్వాసముతోడ నుండ దురముం బూర్ణప్రయత్నంబునన్
బెడిదంబౌగతిఁ జేయఁగాఁగలఁడు, పృథ్వీనాథసందోహ మే
ర్పడ సాహాయ్యము చేయ వత్తు రటకుం బ్రాబల్యమేపారఁగన్. ౨౩౩౧

శా. నానాదేశనివాసులైన జగతీనాథు ల్విజృంభించి యు
ద్ధానన్ రోడ్పడ నాసుయోధనుఁడు నుద్యద్దర్ప మొప్పంగ వి
జ్ఞానం బింతయు లేక సంగరభువిన్ న్యాయంబు పోనాడి స
న్మానార్హాత్ములఁ బాండుపుత్త్రులను జంపం బూనుఁ బద్మోద్భవా! ౨౩౩౨

ఉ. అప్పుడు సంగరోర్విని మహాత్తరమాయ నెసంగఁజేసి, పె
న్ముప్పులఁ బెట్టి బెట్టిదపు మోహమునందు మునింగి, యొండొరుల్
దెప్పరమైన శౌర్యమునఁ దీవ్రతఁ జంపఁగఁ బూని యుండఁగాఁ
గుప్పలుగాఁగఁ గూల్చెదను గ్రూరసుయోధనవీరముఖ్యులన్. ౨౩౩౩

సీ. ఖలచిత్తులయిన భూకాంతు లెల్లరు నాదుమాయచే మోహితులై యమేయ
సంగరాంగణమున శస్త్రఘాతముల నొండొరులను మించఁగా నూహచేసి
మడియఁగాఁగలరు, భూమండలంబెల్లను బార్థివశూన్యమై బాలవృద్ధ
శిష్టమై యుండును సృష్టివిధాయకా! యతిదారుణంబయినట్టి దురము
తే. వర్తిలంగఁ గురుక్షేత్రవసతియందు-ధర్మతత్పరమతులు భక్తప్రవరులు
పంచపాండవు లత్యంతభవ్యసుకృతు-లె మిగిలియుండువారలు క్షేమముగను.

ఉ. క్షత్రియవంశ్యులన్ ఖలులఁ గౌరవపాండవయుద్ధమ న్మిషన్
జిత్రముగాఁగఁ జంపుదు నశేషముగా ధరణీశులం గురు
క్షేత్రమునందుఁ, దక్కిన విశేషబలాఢ్యులనెల్లఁ ద్రుంతు నీ
ధాత్రిభరంబుఁ బాపుటయె ధర్మమటంచును బూని ప్రీతినై. ౨౩౩౫

ఆ. పుడమియందు నిలిచి భూరికీర్తి గడించి-వెలయఁజేయుదాన విశదరీతి,
ఖలులనెల్లఁ ద్రుంతుఁ,-గారణాం బొకఁడూని-భూభరంబు డించి బుధవరేణ్య!

ఆ. మరల నిటకు వత్తు మాన్య! జగన్నాథ!-యీవిధాన మూని యే భువనహి
తంబుఁ గోరి యాత్మఁ దగురీతి నొనరింతుఁ,-బుడమి బరువుదీర్తుఁ గడు వడిగను.

శ్రీదేవి బ్రహ్మను విష్ణుమూర్తికడకుఁ బంపుట

సీ. ఇప్పుడె సంప్రీతి యెసఁగఁ జిత్తంబున వారిజాసన! నీవు వైళమ చని
శ్రీకాంతు సర్వేశు లోకనాయకుఁ గాంచి 'మానుషాకృతిఁ బూని మహిఁ గరుణను
నవతరింపుము దేవ! యతిపుణ్యాయగు పాండు ధర్మపత్నికిఁ బుత్రతను వహించి,
బలవిక్రమంబుల భాసిల్లుచు' నటంచుఁ బ్రార్థింపఁగాఁ దగు బహుళయత్న

తే. మాని శీఘ్రంబునను జగత్పూజ్య! యాల
సింపఁబోకుము, పొమ్ము నిశ్చింతతోడ,
హరికి వైకుంఠధామంబునందుఁ దెలుపు
మీవిషయ మెల్లఁ, దెలియుము హితవుమీఱ." ౨౩౩౮

ఉ. నారద! యీక్రియన్ దెలిపినన్ జగదంబ, విరించి భక్తి పెం
పారఁ బరాంబికాసువిపులాంఘ్రిసరోరుహసన్నిధిన్ నమ
స్కారము లాచరించి, కడఁకన్ గనులావిభుఁ డున్నచోటికిన్
జేరఁగఁబోయె సత్వరమ చింతితకార్యఫలాభిలాషియై. ౨౩౩౯

సీ. వైకుంఠమును జేరి వాసుదేవునిఁ గాంచి పరమేష్ఠి వినుతించెఁ బరమభక్తి
"దేవలోకహితంబు భావంబునం దెంచి మానుషాకృతిఁ బూని మనుజలోక
మం దవతారంబు నొందుము వైళను పాండుమహీకాంతు పత్నియందుఁ
బుత్రుండవై" యంచుఁ బొగడ, రమాకాంతుఁ డాలించి బ్రహ్మసంప్రార్థనంబు
తే. "నే నవతరింతు భువిమీఁద నింద్రునంశ-మునను పాండుమహీపతి వనితయైన
కుంతికాత్మజుఁడను నయి కోరి లోక-హితము నెదలోన మానుషాకృతి నహించి."

ఆ. అనుచుఁ గరుణతోడ ననుటయు జగదీశుఁ-డైన బ్రహ్మ యాత్మ హర్ష మొంది
విష్ణువునకు మ్రొక్కి వీడ్కొని తన నిల-యంబుఁ జేరఁబోయె నంత మౌని!"

ఏఁబదియవ అధ్యాయము

శ్రీదేవి కృష్ణమూర్తిగా నవతరించుట

తే. శ్రీమహాదేవుఁ డీరీతిఁ జెప్పఁ దొడఁగె-నారదునకును 'విను' మంచు గారవమున
"బ్రహ్మ యీక్రియఁ బ్రార్థింపఁ బరమభక్తి-నామహాదేవి యతితృప్తయైమునీంద్ర!

క. వసుదేవుని ప్రియపుత్రత-నసమానదయన్ నిజాంశ నవతారంబున్
వెసఁ గాంచె దేవకార్యము-వసుమతిఁ దీర్పంగ నెంచి పరమముదమునన్.

చ. హరియును ధారుణీతలమునందు నిజాంశను రెండుభాగముల్
పరఁగఁగఁ జేసి పుట్టె, నొకభాగము రాముఁ డనంగ విక్రమ
స్థిరతరకీర్తితోడ వసుదేవుని సద్మమునన్, మఱొక్కటన్
నరుఁడనఁ బాండురాజునకు నందనుఁడై, విలుకాండ్ర మేటియై. ౨౩౪౪

చ. తెలుపుచునున్నవాఁడ విను దేవముని! కడునిష్ఠ వారి ని
స్తుల జననాది సత్కథలఁ, దొల్దొల్తన్ వచియింతు రామకృ
ష్ణుల యవతారచిత్రకథ, శుద్ధమనీష వినంగనౌ, జగం
బుల నది పాపపుంజములఁ బూర్ణముగా నడఁగించుఁగావునన్. ౨౩౪౫

సీ. పూర్వకాలమున సుపర్వజనకులగు నదితికశ్యపు లనునట్టి లోక
కర్తలు పరదేవిఁ గడుభక్తి సంప్రార్థనము నొనరించుచు విమలచిత్త
ములఁ జాలకాలంబు పూన్కిఁ దపంబును గావించి రెట్లనఁగా మునీంద్ర!
చలికాలమున శీతసలిలంబులను నిల్చి గ్రీష్మ ఋతువున భీతికృజ్జ్వలనము
తే. నడుమ నిల్చి యాహారంబు విడిచి దివ్య-వర్షములు రెండువేలు దుర్భరతపంబు
సలిపి, రెంతయుఁ దత్తపశ్చర్య కాత్మ-నలరి వారికి నంబ ప్రత్యక్షమయ్యె.

క. కరుణాకటాక్షముల న-వ్వరభక్తులఁ గాంచి పలికెఁ బరదేవి "మదిన్
వర మెయ్యది వలయునొ స-త్వరముగఁ గోరుకొనుఁ డిపుడె వరుస" నటన్నన్.

సీ. అదితికశ్యపు లంబ నతిభక్తి వీక్షించి సాష్టాంగముగ నమస్కారములను
గావించి వేఁడిరి "కాత్యాయనీ! దేవి! జగదంబ! నీవు మా సదనమందు
లీల జనింపు, దక్షాలయంబునఁ బ్రసూతికిఁ బుట్టినట్టుగా దివ్యజనని!
నిగుపనుశుభదృష్టి నెఱపుము మాపయి సకలసురాసుర సన్నుతపద!
తే. ద్వాపరంబున శిష్టమై నఱలు తెఱఁగా
మున, భువంబున మా గేహమున జననము
నందుమా! యవతారంబు నందనున్న
దాన వోతల్లి! మాకోర్కెఁ దలఁచి యాత్మ." ౨౩౪౮

సీ. "వినుఁడు దంపతులార! ఘననీలతనుకాంతి మెసఁగఁగాఁ బురుషత నిల జనింతు,
నాతరుణంబున నలరును ముండమాలిక వనమాలయై ప్రకటరీతి,
నీఘోరతరరూప మెంతయు సౌమ్యరూపంబున భాసిల్లు భవ్యమగుచు,
ద్విభుజాన్వితంబును ద్వినయనయుతము నై వెలయు నాయాకృతి విశదసరణి,
తే. పీతవస్త్రము ధరియించి ప్రియముమీఱ-గోపికాచిత్తహారినై కుతుకమునను,
వంశహస్తంబు రాజిల్ల నఱలుచుందు-విష్ణులక్షణలక్షిత విలసనముల." ౨౩౪౯

తే. నారదా! శ్రీమహాదేవి గారవమున-నదితికశ్యపులను గూర్చి యుర్వారీతిఁ
బలికి వరమిచ్చి యంత సంబరముతోడఁ-దాఁ దిరోహిత యయ్యె నంతవిను మౌని!

తే. అదితికశ్యపు లాత్మలో నధికముదము
పొదల దేవీవరంబు, నద్భుతతదీయ
దయను నుతియించుచును దమ ధామములకుఁ
బోయి రెంతయు వేడ్కతో మునివరేణ్య! ౨౩౫౦

క. జననం బందెఁ బ్రజాపతి-యనఘుఁడు కశ్యపుఁడు ధరణి యదుకులమున న
త్యనుపముఁడై వసుదేవుం-డను నాహ్వాయమున నెసంగి యమరమునీంద్రా!

క. అదితియు రూపద్వయమున-నుదయించెను దేవకియన నొగి రోహిణినాఁ
బాదలెడు నాఖ్యలతో డు-ర్వ్యాప్రదయుండగు కంసరాజు ప్రియసోదరియై. ౨౩౫౩

క. శరదిందుసుందరాననఁ-గరగ్రహణ మాచరించెఁ గడుముదమున భూ
వరుఁడు వసుదేవుఁ, డీక్రియ-జరగె యథావిధిని మౌనిసత్తమ! యంతన్.

చ. అతివిభవంబునన్ జరపె నాదృతిఁ గంసుఁడు పెండ్లి దేవకీ
సతి వసుదేవభూపతికి సంతసమొప్పఁగ నిచ్చి యెంతయున్
హితమతి స్నేహభావమున హెచ్చగు వేడుకతోడ మంగళాం
చితమగు తన్మహంబున నశేషవినోదము లుల్లసిల్లఁగన్. ౨౩౫౫

మ. అతిదుష్టుండగు కంసభూపతి వివాహానంతరంబందు ను
న్నతమర్యాదల సల్పి నూత్నవధువున్ బావన్ బ్రయాణంబుచే
సి తమిన్ రమ్యరథోత్తమంబుపయి నాసీనుండునై వారలన్
హితవొప్పన్ రథమున్ వడిన్ నడపె సంహృష్టాత్ముఁడై నారదా! ౨౩౫౬

కంసుఁ డాకాశవాణిని వినుట

క. మునినాథా! యీసమయం-బున వడి వినఁబడియె గగనమునుండి మహా
నినదం బశరీరోద్భవ-మనఁదగునది దేవవాక్య మత్యద్భుతమై. ౨౩౫౭

శా. "కంసా! దేవకియందు నెన్మిదవదౌ గర్భంబునం బుట్టు ది
వ్యాంసుం డాహరియంశతోడఁ బురుషుం, డాతండె నిక్కంబుగా
హింసించున్ నిను, నిందు సందియము లే దెప్పాట నోభూపతీ!
ధ్వంసంబయ్యెదు, దప్ప దియ్యది, మదిం దల్పంగనౌ నిచ్చలున్." ౨౩౫౮

క. వెడిదంబగు నివ్వాక్యముఁ-గడఁక న్విని రథమునుండి కంసుఁడు పుడమిం
బడ దుమికి యడిదముం గొని-కడునడిఁ జెల్లెలిని జంపఁగా నడరె మునీ!

చ. దుడుకుఁదనంబునం జెలఁగి తోడజనించినయట్టిదాని న
ప్పుడె మడియింపఁగా నడిదము న్వడి మీఁదికి నెత్తి వచ్చు న
చ్చెడుగరిఁ గంసుఁ గాంచి తన చిత్తమునన్ వసుదేవుఁ డంత న
ప్పుడఁతుకఁ గావఁగాఁదలఁచి వందనము ల్పచరించి వానికిన్. ౨౩౬౦

శా. "బావా! దేవకిఁ దోడఁబుట్టువును జంప న్మాను, మీతన్విగ
ర్భావిర్భావము నొందు బిడ్డలను నే నర్పింతు నిక్కంబుగా,
భావంబందున సంశయింపవల దోభవ్యాత్మ! నీయిష్ట మే
ర్కేవం బోవునొ, యవ్విధంబునను సంప్రీతిన్ ఘటింపందగున్." ౨౩౬౧

క. అని వినయంబునఁ బ్రార్థన-మును జేయఁగఁ గంసుఁ డపుడు పూనికతో న
య్యనఘులకు రక్షకచయం-బును గావలియుంచి యంత మునిజననాథా!

క. దురితాత్ముం డెదలో సో-దరిని వధించుటను మాని తా రక్షకులం
బరికించి "యీవనిత కే-తరుణంబునఁ బుట్టు సుతుఁడు తప్పక యపుడే.

చ. వడిఁ జనుదెంచి నాకడకు వార్తనెఱుంగఁగఁ జేయనౌను, మీ
రుడుగక యష్టమం బగుచు నొప్పెడు గర్భము కల్గినప్పుడే
తడ విసుమంత లేక త్వరితంబుగ రక్షకులార! వచ్చి య
ప్పుడె తెలుపంగనౌను, నిజమ్మున్ మదిఁ దాఁపక యున్న దున్నటుల్. ౨౩౬౪

చ. తెలిపినవెంటనే దయ మదిం గన కాత్మసహోదరిన్ నిశా
తలసితఖడ్గధార ఛేదితంబుగఁ గొట్టి వధింతుఁ జాలులో
నిలపయిఁ ద్రెళ్ళినట్లు, లిఁక నెవ్వరు నా కగువారు శత్రువుల్!
చలనము లేక నాదయిన శాసన మాదలఁ దాల్చియుండుఁడీ!" ౨౩౬౫

ఉ. ఈవిధి రక్షకావళికి నెంతయు బెట్టిదమైన కట్టడన్
భావమునన్ దయం గనక పాపయుతాత్ముఁడు కంసుఁ డప్పుడ
త్యావిలమానసుండగుచు నాప్తులు మంత్రులు చూడఁ జేయుచున్
దైవము దూరుచున్ జనియెఁ దాఁ గలఁతన్ భవనంబులోనికిన్. ౨౩౬౬

కంసుఁడు దేవకిబిడ్డలం జంపుట

శా. అంతం గంసుని యాజ్ఞ రక్షకసమూహం బంతటన్ దేవకిన్
బంతంబొప్పఁగఁ గాచుచుండఁగను గర్భంబయ్యె నాకాంత వృ
త్తాంతం బప్పుడ పోయి కంసునృపుచెంతన్ నిల్చి బల్వ్యాసక్తమై
నెంతే యాదృతిఁ జెల్పి రొక్కుమొగి మౌనీంద్రోత్తమా! నారదా! ౨౩౬౭

క. దేవకి పుత్త్రునిఁ గాంచఁగ-నావెంటనె భటులు చని దురాత్మకుఁడౌ కం
సావనిపతికిం దెల్పం-గా విని వాఁ డాగ్రహమునఁ గడు దీపితుఁడై. ౨౩౬౮

క. చనుదెంచి యపుడె పుట్టిన-యనదను శిశువును గ్రహించి యతికఠినుండై,
పెనుబండమీఁద మోఁది, య-వినయంబునఁ జంపె నపుడె విబుధమునీంద్రా!

సీ. ఈవిధంబున వసుదేవుని పత్నియా దేవకితనయులఁ జావమోఁదె
నార్గుర వరుసగా నద్దురాత్ముఁడు కంసుఁ, డంతట సప్తమంబయిన గర్భ
మాకాంత ధరియింప నత్యంతమగు శ్రద్ధ రక్షకభటుల నిరీక్షచేయఁ
గట్టడ యొనరించెఁ గఠినాత్ముఁడై వాఁడు, తత్సమయంబున ధాత రజత
ఆ. శైలమునకు నరిగె సకలదేవతలతోఁ-గూడి, యోజనంబు కోరి చేయ
నచట నాపరాంబ, కాదిశంకరునకు-వందనము లొనర్చి భక్తి మీఱ. ౨౩౭౦

శా. దేవీపాద సరోజసన్నిధిని భక్తిన్ జేతుల న్మోడ్చి స
ద్భావుండై వినుతించి విన్నప మొనర్పం బూనె "నోతల్లి! ము

న్నా విజ్ఞప్తిని 'దేవకీతరుణికిన్ జన్మింతు, భూభారమున్
బోవంజేయుదుఁ బూరుషాకృతిని నేఁ బూనికన్ వహింతున్ విధీ!' ౨౩౭౧

చ. అని సెలవిచ్చితమ్మ! నను నాదృతిఁ గాంచి మదీయసేవనం
బునఁ బరితృప్తినొంది, మునిపూజ్యపదాంబుజ! యిప్డు దేవకీ
వనితకుఁ బుట్టునట్టి శిశువారమునెల్లను జంపుచున్నవాఁ
డనయముఁ బూని కంసుఁడు దురాత్ముఁడు బండకు మోఁది యొక్కటన్.

సీ. దేవి! మహేశి! మున్ దేవకి పెండిలిసమయమునఁ గంసుండు స్వాంతమందు
భీతిలునట్లుగా నీతెంచె నాకాశభాషితం బత్యంతభయద మగుచు,
నుచ్చైస్స్వరంబున నొప్పుచు 'దేవకి కష్టమంబయి వెల్గునట్టి గర్భ
మున జనించు సుతుండు తునుమంగఁగలవాఁడు నిన్ను దురాత్మకా! నిక్క మిద్ది'
తే. యనఁగఁ గంసుఁడు సోదరి నపుడె నఱుకఁ-బూనె, వసుదేవుఁ డంత మద్బుద్ధియైన
వానిఁ బ్రార్థించి సమ్మతిపఱచెఁ, బుట్టి-నట్టి వారిని నర్పింతు ననుచుఁ దెలిపి.

తే. దురితచిత్తుండు కంసుండు కరము నిశ్చ-యాత్ముఁడయ్యెను,'నెత్తటి యష్టమమగు
గర్భమును దాల్చు దేవకి, కడువడి శిత-ఖడ్గమునఁ జంపుదునుగాక! కరుణలేక.'

క. అని నిశ్చయించి దేవకి-తనయుల నార్గురను జంపెఁ దల్లీ! వరుసన్
జనియించినవెంటనె దయఁ-గనఁబఱుపక సుంతయునుఁ గఠినుం డగుచున్.

క. జననీ! సప్తమగర్భం-బును దేవకి యిపుడు దాల్చెఁ, బుడమిని జన్మిం
పను దలఁపకున్న నీ వె-య్యానువున దేవకికిఁ బుట్టు దంబా! యింకన్. ౨౩౭౬

క. ఏరీతి భూమిభార మ-పారదయం దీర్తువో కృపానిధి! తెలుపం
గోరుచునున్నాఁడను, నా-కోరిక పూరింపు''మనఁగఁ గూరిమి మీఱన్. ౨౩౭౭

క. మునివర! పరమేశ్వరి బ్ర-హ్మను గని వచియింపఁదొడఁగె నపుడు ''విరించీ!
విను, దేవవచన మెయ్యా-నువనే విఫలంబుగాదు, పూర్ణంబె యగున్.

తే. తప్పక జనింతు దేవకీతరుణియందు-నెన్మిదవ గర్భమందు నీ వించుకైన
సందియమునొందవలదు, నిశ్చయము సరసి-జాసనా! విను మొకమాటనవహితమతి.

ఉ. ఒక్క యుపాయ మున్నది, మహోన్నతమై తగు నద్ది, దాని నీ
వొక్కటఁ దీర్పఁగాఁ దగు, నికొక్కక్షణంబును నాలసింప రా
దెక్కడనేని, వేగ మరమేశునిలోకముఁ జేరఁబొమ్ము, ము
న్నక్కువ శ్రీమనోహరుఁ డొనర్చిన కార్యము విన్ము తెల్పెదన్. ౨౩౮౦

క. ధర వసుదేవగృహంబున-నరరూపముతోడ రామనామంబునఁ దాఁ
బరఁగుచు మదగ్రజుండై-సరసిజభవ! యవతరింప సమయము చేసెన్. ౨౩౮౧

చ. తెలుపుము బాగుగా హరిమదిం దగురీతిని నీవు వైశమే
యిలఁ దన యంశ చేత జనియింపఁగ నవ్వసుదేవపత్నియా
సులలితరూపకాంతిగుణశోభిత దేవకికిన్ దనూజుఁడై,
జలజభవా! యిదంతయును సత్వరమే యెఱిఁగింపనా నగిన్. ౨౩౮౨

సీ. ఏను నాయంశచే నిలయందు జనియింతు ద్వివిధంబుగా విధీ! తెలిపెద విను
మవహితమతివయి యవ్వసుదేవుని పత్ని రోహిణి యను వనితగర్భ
మందు, నందుని సతియగు యశోదాగర్భమందునఁ జేరుదు, నైదవదగు
మాసంబు రా రోహిణీసతీగర్భంబునం దుండి యొయ్యన హరి వసించు
తే దేవకీగర్భమును జొత్తు, శ్రీవిభుఁడును-జేరు నాగి రోహిణీగర్భసీమ, నీ వి
ధమున దేవకి కగు చూలు క్రమముతోడ-నెనిమిదవదయి నాపుట్టుకను జెలంగు.

క. దురితాత్ముఁడైన కంసుం-డరయఁగ లేఁ డనుజకయిన యష్టమగర్భం
బిరవుగఁ గమలాసన! యి-క్కరణి జరుగఁగలదుసుమ్ము కార్యంబెల్లన్. ౨౩౮౪

ఉ. నేరుపుమీఱ నిప్పగిది నే వసుదేవుని పత్నియందు వి
స్తారకృపన్ జనించి వసుధన్ దురితాత్మునిఁ గంసుఁ ద్రుంతు లో
నారసి యుక్తకాలమునయందు సపైనికు, నిశ్చయంబుగా
సారసగర్భ! నమ్ముఁదగు సాధుపథం బని నాదు వాక్యమున్. ౨౩౮౫

ఆ. వాని పుణ్యకర్మ వఱలు నెందాఁక నం-దాఁక నోర్వవలయుఁ దగినరీతి,
వినుము,తగిన యదను వీక్షించి నేఁ జేయు-కార్యముల వచింతుఁ గ్రమముతోడ.

సీ. దేవకీదేవియం దావిర్భవము నొంది పుంరూపమున నేను బొలుచుచుందు,
నయ్యశోదాగర్భమందు నుద్భవమంది స్త్రీరూపమున నేను జెలఁగుచుందు,
నాత్మియలీలచే నైన నాక్షణమందె దేవకి కన్నట్టి దివ్యపుత్ర
మూర్తి యా ననుఁ గొనిపోయి యవ్వసుదేవుఁ డల్లన నందుని యంతిపురముఁ
తే. జొచ్చి పురిటింటిలోన యశోదప్రక్క-నునిచి,స్త్రీరూపమునఁ బుట్టియున్న నన్నుఁ
దెచ్చు, నటనుండి దేవకి కిచ్చుఁ బిదప-వినుము నారద! మునినాథ! విశదమతిని.

క. తన సతి దేవకి తనయం-గనె నంచును, రక్షణంబుఁ గావింపు మటం
చును ఖలమతి యగు కంసా-వనిపతితో వినయమునను బలుకఁగవలయున్.

ఉ. అత్తఱిఁ గంసుఁ డత్యధికమా రుష దేవకి గన్న కన్యకన్
దుత్తుమురౌనటుల్ చఱచి ధూర్తతఁ జంపఁదలంచు, నప్పుడే
యుత్తలపాటు చెందునటు లొయ్యన నాదగు మూర్తి యద్భుతా
యత్తులు గాఁగఁ బ్రేక్షకులు, నాదురితాత్ముఁడుఁ జూచుచుండఁగన్. ౨౩౮౬

క. 'నినుఁ జంపువాఁడు గలఁ'డని-వినునట్లుగఁ బలికి, వాఁడు విస్మయపడఁగాఁ
జను స్వర్గలోకమున కో-వనజభవ! తిరోహితయయి వైభవ మెసఁగన్.

శా. అంతం గంసుని పుణ్యకర్మనిచయం బత్యంత దుష్కృత్యవి
క్రాంతంబై నశియించుచుండ, విబుధవ్రాతంబు చిత్తంబులన్
సంతోషించుచునుండ వచ్చి మథురన్ శాసించుచున్నట్టి దు
శ్చింతుం జంపుదు, నిక్కువం బనుచు నీచిత్తంబునం దెంచుమా.'' ౨౩౯౧

చ. అని దయతోడఁ దెల్పఁగ, మహామతియైన విరించి దేవి నీ
డ్కొని కడుఁ బూన్కితో హరిని గూర్చి వికుంఠభువంబుఁ జేరి యో
య్యనఁ గమలాపతిం గని ప్రియంబున దేవి వచించినట్టి సూ
క్తిని దెలిపెన్ సమస్తము మదిం బరితృప్తిని జేయుకీతిగన్. ౨౩౯౨

చ. హరియును బ్రహ్మవాక్యముల నన్నిటి నాదృతి నాలకించి య
క్కరణి నొనర్పఁగాఁదలఁచి కార్యముకీతిని నెంచి రోహిణీ
తరుణికి నుద్భవింపఁదగు ధర్మ మటంచును నిశ్చయించి యు
ర్వరఁ దగు దేవకీజఠరభాగముఁ జేరఁగఁబోయె నారదా! ౨౩౯౩

శ్రీకృష్ణ జననము

మ. ధరణీభారము డింపఁగాఁదలఁచి స్వాంతంబందు లోకైకమా
త రహిన్ రెండగు మూర్తులం గొని యశోదాగర్భమున్, రోహిణీ
తరుణీగర్భముఁ జేరె లోకహితముం దాఁ గూర్పఁగాఁగోరి యో
వరమానీశ్వర! నారదా! విను జగద్వంద్యప్రభావం బొగిన్ ౨౩౯౪

సీ. ఐదవనెల రాఁగ నాదేవి రోహిణీగర్భంబునందుండి క్రమముతోడ
దేవకీగర్భముఁ దివిరి ప్రవేశించె, నప్పుడె విష్ణుండు నఖిలజనని
యాజ్ఞ రోహిణి గర్భమందుఁ బ్రవేశించె, మార్పు లీరీతి నెమ్మదిగ జరగె,
నత్తఱి దుర్మతియగు కంసభూపాలు భయముచే రోహిణి వనితను వడి

తే. నందు వసతిని గోకులంబందు నునిచె-నందు సర్వాంగసుందరుండైన రాముఁ
డొందె జననంబు గౌరవర్ణోజ్జ్వలుఁడు సు-లక్షణుండయి రోహిణీలలనకుఁ దమి.

సీ. అంత శ్రావణమాసమందునఁ గృష్ణపక్షాష్టమి తిథియందు నర్ధరాత్ర
మున వృషయుతరోహిణిని దేవకీదేవి గర్భంబునుండి యావిర్భవించె
సకలజగద్ధాత్రి సాధుసంరక్షకై పుంరూపమును బొంది మునివరేణ్య!
జలదసంతతు లాకసమునందు వ్యాపించి యారవంబు లొనర్ప నధిక తమము

తే. గగనమునఁ బర్వియుండఁగా, జగమునఁ గల
జనములును రక్షకభటాలి తనువుమఱచి



కృష్ణమూర్తిగా నవతరించిన శ్రీదేవిని దేవకీదేవి నుతించుట [పుట 816]

నిద్రపోవుచు నుండఁగా నియతితోడ
భువనమోహనచతుర సంపూర్ణకరుణ. ౨౩౯౬

సీ. అభినవజలధర శ్యామంబు నగు తను వత్యంతకాంతమై యలరుచుండ
శ్రీవత్సభవ్యలాంఛితవక్షసీమపై వనమాలకాంతులు వఱలుచుండ
దివ్యలక్షణములై తేజరిల్లుచు ద్విభుజంబు లత్యంతంబు దంబుమీఱ
సర్వాంగములు స్వతేజః ప్రభావంబున భాసమానంబయి పరిఢవిల్ల
తే. నయనయుగళంబు లోకసంచయవిమోహ
నంబగుచు భాసిలంగ సుందర మనోహ
రాకృతిఁ జెలంగు నందను నపుడు గాంచి
చింత నేద్చుచు దేవకీ కాంత మదిని. ౨౩౯౭

మ పరిపూర్ణుండగు బ్రహ్మరూపునిగఁ దా భావించి, యా దేవకీ
తరుణీరత్నము పల్కె నిట్లు "జగదంతర్యామివై యున్న యో
పరమాత్మా! శుభవీక్ష! యెవ్వఁడవు? దార్భాగ్యన్ ననుం గాన కే
సరవిఁ బుట్టితి వయ్య! నాకడుపునన్ శాంతాత్మ! భూతేశ్వరా! ౨౩౯౮

సీ. పుట్టినయంతనే మట్టుపెట్టినవాఁడు నానందనుల నెల్ల న్యాయమనక
కంసుండు మాయన్న కరినాత్మఁ డియ్యల కధిపతి, తెలియవే యాత్మయందు!
నీవు బాలకుఁడవై యావిర్భవించుట విని నేఁడె వధియించు భీకరగతి,
శోకవిహ్వలనయి క్షోణి ననుం బడునట్టులఁ జేయు నోయఘువిదూర!"
తే. యనుచుఁ బలవింపఁ దల్లివాక్యములబాలుఁ-డాలకించి సుదుఃఖార్త యయిన దేవ
కీసతిని నూఱడిలునట్లు చేసి తనదు-దివ్యవాక్యామృతములచే దివిజమాని!

క. "విను లోకత్రితయంబున-మనుజులచే సురలచే నమర్త్యులచేతన్
జననీ! భీతిని మానుము,-నను జెందదు హాని జగమునన్ మఱి యెందున్.

సీ. జగదధీశ్వరి లోకసంహారకారిణి యాద్య పరావిద్య యనుచు నన్ను
నెఱుఁగుము జనని! యియ్యల దేవకార్యార్థ మనతరించినదాన నంబ! నీదు
గర్భంబునందు శంకరునాజ్ఞచేత మాయాపురుషాకృతి నతిముదమున,
వసుదేవుఁడును నీవు పరమభక్తిని బూర్వజన్మంబునందు నిశ్చలమనీష
తే. నన్ను మది నిల్పి యెంతయు నున్నతగతి-చేసినట్టి తపంబుచేఁ జెంది తృప్తి
యిట్టులిప్పుడు భయమంద నేల యింక-శాంతచిత్తవై యుండుము సంతసమున."

ఉ. స్వాంతమునందు బాలకుని వాక్యముల న్విని విస్మితాత్మయై
యెంతయు దేవకీసతి మహేశ్వరితో "శుభవీక్షణా! నిజో
దంతము నిశ్చయంబయిన తావకమైన నిజస్వరూప మ
శ్రాంతదయం గనబఱుపు, భ్రాంతిని వీడెద" నంచుఁ బల్కఁగన్. ౨౪౦౨

సీ. అతిభయంకరమైన యాస్యంబుతో మూఁడుకన్నులతోడ భీకరశరీర
మమర బాహుచతుష్టయముతో లలజ్జిహ్వతోడ నీలతనుద్యుతు ల్వెలుంగ
లంబమానసుదీర్ఘలలితకేశసమూహసంఛన్నపృష్ఠదేశంబుతోడ
నవరత్నకాంతులఁ బ్రవిశదరీతిని డంబుమీఱెడు కిరీటంబుతోడ
తే. మునివరా! కృష్ణు వనమాల ముండనికర-రచితమాలికమై యొప్పె రమ్యమగుచు,
దేవకీదేవి కద్భుతం బావహిల్ల-కృష్ణుఁ డప్పుడు పరదేవి కృష్ణయయ్యె.

క. కనుఁగొని బాలుని కాళీ-ఘనరూపుని నతిభయానకప్రదు వేగం
బున భర్తయైన వసుదే-వుని దేవకి యటకుఁ బిలిచె మునిజననాథా! ౨౮౦౪

శ్రీదేవిని వసుదేవుఁడు నుతించుట

చ. నిరతిశయప్రమోదము జనింప మదిన్ వసుదేవుఁ డంత స
త్వరమున వచ్చి యచ్చటికి బాలకుఁ డుద్భవమైన వార్త యా
దరమునఁ జెప్పఁగా విని నితాంతవిచిత్రముగాఁ జెలంగు న
ప్పరమునిఁ జూచి విస్మయము భావమునం దుదయింప నిట్లనెన్. ౨౮౦౫

చ. "జనని! యనేకజన్మశతసంతతులందు నొనర్చినట్టి నా
యనుపమమౌ తపంబున ననంతమునైన మదీయభాగ్యరే
ఖను బురుషాకృతిం గొని యఖండముదంబున నాగృహంబునం
దున నుదయించి తీవు దయతోడుత బాలుఁడవై పరాత్పరా! ౨౮౦౬

క. జనని! యతిదుర్లభం బయి-తనరెడు కాళీస్వరూపతం గనుప ట్లా
య్యనఁ జూపి నాదు జన్మం-బును ధన్యతఁ గాంచఁ జేయఁ బూనితి వంబా!

తే. త్రిభువనేశ్వరి! శశికోటిదివ్యకాంతి
యుతము దశభుజాంచితము నై యొప్పు సౌమ్య
మయిన రూపాంతరంబును నమితకరుణఁ
గనఁబఱుపవమ్మ! కృతకృత్యతను భజింతు." ౨౮౦౮

క. వసుదేవుం డిటు వినయం-బెసఁగంగా వేఁడఁగా మహేశ్వరి యపుడే
యసదృశదశభుజవిలసిత-సుసౌమ్యరూపమును బొందె సురమునివర్యా!

శా. ఆరూపంబును గాంచి నెమ్మనమునం దాశ్చర్యముం బొంది వి
స్తారంబై తగు భక్తిఁ గేల్మోగిచి భక్తవ్రాతవాంఛార్థదో
దారాత్మన్ వసుదేవుఁ డంత నియతిన్ ధ్యానించి యత్యంతగం
భీరార్థప్రవణంబులౌ స్తుతుల నెమ్మిన్ సన్నుతించెన్ మునీ! ౨౮౧౦.

సీ. "నీవె లోకమునకు భావింపఁ దల్లి వనాదివి పరమరూపాభిధాన,
నీవె విద్యారూప, నీ వతిసూక్ష్మాత్మికవు నాఁగ భాసిల్లుదువు మహేశి!

నీవె యనాదిపుంభావుండవును జిన్మయుండవుఁ బూర్ణుండవును జనకుఁడ,
వీవె విశ్వాత్మికవౌ వనితవు విశ్వమవును విశ్వాశ్రయ వవుదు వంబ!
తే. విశ్వసంవ్యాప్త వీవె, నిన్ విడిచి యొక్క-వస్తు వేదియు లేదు భువనమునందు,
దేవి! సర్వవిశ్వేశ్వరీ! దృఢతరమగు-భక్తి నొనరించుచున్నాఁడ వందనములు.

సీ. నీవె సృష్టిక్రియానియతిని జతురాననస్వరూపంబులోనన్ వెలయుదు,
వీవె సుస్థితి నుంచు నేర్పాటునందుఁ బరాత్మయౌ హరిరూప వయి వసింతు,
వీవె సంహృతిలీల నెనసి పినాకధారి యగు రుద్రుఁడ వయి భయము నిత్తు,
వీవె మూర్తిత్రయకృతసృష్టిసంస్థితిసంహారకృతులను గాళిక యన
తే. వెలుఁగుచుందువు నిత్యవై లలితరీతి-బ్రహ్మమయినాఁగ నోకృష్ణ! భవ్యమూర్తి!
లోకవందితసుచరిత్ర! నీకు మ్రొక్కు-లమ్మ! నాకుఁ బ్రసన్నవు గమ్ము కరుణ.

సీ. నీవు సూక్ష్మవు మఱి భావింపఁగా నిరాకృతి వయ్యుఁ బ్రకృతివై ధృతి సమస్త
జగదభివ్యాప్తనా నగణితవిఖ్యాతినందిన నందన వనవరతము,
స్త్రీపున్నపుంసకత్రివిభేదముల నీవు స్త్రీత్వాద్యభావంబుఁ జెందియుందు,
లోకంబునందుఁ ద్రిలోకమాతా! భవత్తత్త్వంబుఁ గొందఱు తఱచి తెలియఁ
తే. గా వలంతులు గారు, నిక్కముగఁ ద్ర్యంబి
కా! పరబ్రహ్మతా నెఱుంగక సతంబు
మూఢమతి యగుచుండ, నేఁ బూని నిన్ను
సంస్తుతింప వలంతినే సకలజనని! ౨౮౧౩

ఆ. వందనములు త్రిదశవందితా! గౌరి! స-మస్తమోహినీ! నమస్కృతు లివె,
మదిని గరుణఁ గొనుము మాయాపురుషరూప-కృష్ణరూపిణీ! ప్రకృష్టచరిత!"

క. ఈవిధమున వసుదేవుఁడు-దేవిని వినుతించుచుండ దివ్యజనని యొం
తే వింత గలుగునట్లుగ-నావసుదేవునకు నపుడె యాదృతి మీఱన్. ౨౮౧౪

క. రమణీయనేత్రతామర-సము లొప్పఁగఁ గృష్ణుఁ డగుచు శాంతాకృతి సొం
పమరఁగ బాలకుఁడై కనఁ-దమి మీఱఁగఁ గానఁబడియె దశభుజ మహానీ!

క. వనమాలికావిరాజిత-ఘననీలద్యుతుని గృష్ణుఁ గని బాలకు నా
య్యాన వసుదేవుఁడు వినయం-బునఁ బ్రాంజలియగుచు మరల ముదమునఁ బలికెన్.

ఉ. "పుట్టినయంతమాత్రమునఁ బూని ఖలాత్ముఁడు కంసుఁ డేచి నా
పట్టుల నెల్లరం జదిపి బండపయిన్ నడిఁ జంపె నిర్దయన్,
బెట్టిదుఁ డౌచు బాల! కడు భీతి జనించుచునున్న దాత్మలో,
నెట్టివిధాన మింకఁ గల, దెయ్యది యాపదఁ బాయు మార్గమో! ౨౮౧౫

ఉ. కావలి గాచుచున్న భటకాండము కంసునిఁ జేరి యింతలో
నీవు జనించినాఁడ వని యిప్పుడె తెల్పఁగఁ గంసుఁ డాత్మ దు
ర్భావముతోడ వచ్చి నిను బట్టి వధించును వత్స! తెల్పు మిం
కేవిధి నిన్ను రక్షణము నిప్ప డొనర్పఁగఁ బోలునో దయన్. ౨౮౧౯

క. ధరణీభారము మాన్పఁగఁ-గరుణ నవతరించినట్టి కరుణానిధి వో
పరమాత్మ! తెలుపు మంతయు-సరిగాఁ జేయఁదగు కార్యజాలము దేవా!"

వసుదేవునకు శ్రీదేవి చేసిన యుపదేశము

చ. అని వసుదేవుఁ డెంతయును బ్రార్థనచేయఁగఁ గృష్ణరూపమున్
గొని జనిగన్న దేవి విని కోరికతోఁ దప మాచరించి నె
మ్మనమునకున్ ముదం బిడిన మాన్యుల నందుని, నయ్యశోదనుం
దన మది నెంచి యిట్లనియెఁ దా వసుదేవునితోడ నారదా! ౨౮౨౧

క. "జనకా! విను వచియింతును-మునుకొని చేయంగఁదగిన ముఖ్యోద్యమ మె
ల్లను, ఖలమతియగు కంసా-వనిపతి భీతిని దొలంగు పద్ధతి నిపుడే. ౨౮౨౨

సీ. అష్టమి గడచినయట్టి వేళను నేఁడె నామూర్తి యొక్కటి నందు గేహ
మందు గోకులమున నవతరించును యశోదాగర్భమున నుండి, తండ్రి! యపుడు
నామాయ ముగ్ధయై యామాని యశోద యెఱుఁగఁజాలదు నిద్ర నెసఁగి మిగులఁ
జారుశరీరయా సరసిజనయన గోరిని గాంచి తాను బుత్రికఁగ మదిని,

తే. నీవు నను(గొని నందుని దేవి ప్రక్క
నునిచి మన్మూర్తిఁ గొని వేగముననె యిటకు
రమ్ము, తర్వాత నిట నెల్లరకును దెలుప
వలయు వరరూప కన్యయే కలిగె ననుచు. ౨౮౨౩

తే. ఆలసింపక యీపని నతిరయమునఁ-జేయవలయుఁ, బ్రవాదంబు స్థిరతరమగు,
నెవ్వ రెఱుఁగరు, గావున నిద్ధచరిత!-కృత్య మిది సుమ్ము, కంసుండు కెరలి వచ్చు.

సీ. తడయక బాలికఁ దాఁ బట్టి మూర్ఖుఁడై బండపైఁ బడునట్లు పైకి నెగుర
వేయ మాతులుఁ డత్యవేయకోపంబున, నపుడు నామూర్తియై యలరు బాల
యట్టి పైకెగసి, యత్యద్భుతాకృతి నిల్చి దేవకార్యంబును దీర్ప నాక
మునకుఁ బోవును దుష్టబుద్ధియా కంసుండు గనుచుండ నిధనకర్తను నెఱుంగఁ

తే. బలికి, యామీఁద నేను గోకులమునందుఁ
గొంతకాలము నివసించి యంత నిటకు
వచ్చి మేనమామను ఖలు వడి వధింతు,
జనక! నిక్కము, నమ్ముము స్వాంతమందు." ౨౮౨౪

క. అని యీవిధమున బాలకుఁ-డనువునఁ దెల్ప వసుదేవుఁ డాలించి వడిన్
మునినాథ! బాలకుం గొని-చనియెం గోకులముఁ జేర సంతోషమునన్.

వసుదేవుఁడు శ్రీకృష్ణుని గోకులమునకుఁ దీసికొనిపోవుట

ఉ. అత్తఱి నారదా! మథురయందలి వారలు వాసుదేవమా
యాత్తశరీరులై యెఱుక యన్నది లేకయె నిద్రఁబోవుచు
ద్వృత్తిఁ దూలంగియుండి, రొకఁడేనియు మేల్కొనకుండె, నోమునీం
ద్రోత్తమ! నిశ్చలాత్ముఁడయి యొయ్యన నవ్వసుదేవుఁ డంతటన్ ౨౮౨౭

చ. పురమును నిర్గమించి తన పుత్త్రుని తేజము వెల్గుచుండఁగా
నరయుచు దుఃఖితుండగుచు 'నక్కట! పుత్త్రక!' యంచు నేడ్చుచున్
"దురితము చేసినట్టి శుభదూరుఁడనైన మదీయగేహమం
దిరవుగ నేల పుట్టితి వహీనమహామహిమాఢ్య! నందనా! ౨౮౨౮

ఉ. నిన్నిటు గోకులంబునను నిల్పి చనం గలవాఁడ రక్షణం
బన్నది చేయఁబూనకయె యాత్మగృహంబున కింక, నిప్పుడో
యన్న!" యటంచు బాష్పజల మాశిశువున్ దడుపంగఁ బల్కె చా
పన్నుని రీతి వేవిధుల నంతట మౌనివరేణ్య! నారదా! ౨౮౨౯

చ. వరయమునానదిన్ హరికృపన్ శివతోడుత నుత్తరించి, యే
యరమర లేక నందుని గృహంబును జొచ్చి, యశోదఁ గాంచె సం
బరమున, నయ్యశోదయును బాలికఁ దాఁ బ్రసవించి, యెంతయున్
బరవశయైన రీతిఁ గనుపట్టుచు నుండెను దాపసోత్తమా! ౨౮౩౦

మ. నిదురంబొందినయట్టి యాత్మసఖు లున్మేషంబు లేకింతనం
త దరిన్ భూస్థలిఁ బండియుండ, వివశత్వం బావరింపంగ, న
య్యదనన్ స్వోదరసంభవన్ దెలియలేకత్యంతమాయన్ యశో
ద దురంతంబగు నప్రబోధయుతయై తా నుండె మౌనీశ్వరా! ౨౮౩౧

క. ఆనకదుందుభి నందుని-మానినిపార్శ్వమున బాలు మహనీయగుణున్
దా నునిచి, బాలికం గొని-యానిలయము వేగ వెడలె నపుడె మునీంద్రా!

సీ. పది భుజంబులతోడఁ బరదేవి వసుదేవుసందిట నతిదీప్తి నొంది వెలసె,
రమణీయతర తేజ మమరఁగా వసుదేవుఁ డతిభక్తి సర్వలోకాదిజనని,
బ్రహ్మరూపిణిఁ గాంచి పరమముదన్వితచిత్తుఁడై నగరంబుఁ జేర నరిగి
తన గృహంబును జొచ్చి వనితామతల్లి యా దేవకీదేవికి దేవి నొసఁగ,

తే. నవలఁ గన్యక యుదయించె ననుచు రక్ష-కులకు నెఱిఁగించె బాగుగఁ గోవిదుండు,
వార లప్పుడె పోయి దుర్భావుఁడైన-కంసుఁ గని పల్కె రీతిఁ గడు వడిగను.

క. "దేవా! దేవకి యష్టమ-గావ వరగర్భమునఁ బుట్టె నాఁడుపడుచు మీ
భావమున కెఱుకపఱుపఁగ-వే వచ్చినవార, మిదియె విన్నప" మనఁగన్.

కంసుఁడు దేవకిపుత్రికను జంపఁబూనుట

మ. విని యమ్మాటకు బాపబుద్ధియుతుఁడై పృథ్వీశుఁ డాకంసుఁ డో
మునినాథా! యిటు పల్కె రక్షకులతోఁ "బొం డిప్పుడే, తెండు, మీ
మనమం దేమియు సంశయింపక, వడిన్ మన్నింపకే, యాశిశున్
ఘనఖడ్గంబునఁ ద్రుంచివైచెద" ననంగా వార లంతేత్వరన్. ౨౪౩౫

క. పురిటింటఁ జొచ్చి కరుణా-విరహితులై దేవకిసుత బిరబిరఁ గొని యా
దురితాత్మునకు నొసంగిరి-వరమానీ! యంత వాఁడు బలగర్వితుఁడై. ౨౪౩౬

చ. అతిదృఢమై శిలాసముదయంబున నిర్మితమైన రీతి న
ద్భుతమును గల్గఁజేయు పటుబాలశరీరముతోడ వెల్గు న
వ్వితతసుగాత్ర సృష్టియును విశ్వచయావనమున్ లయంబు నం
చితగతిఁ జేయు నీశ్వరిగఁ జిత్తమునం దెఱుఁగండు దృప్తుఁడై. ౨౪౩౭

క. ఆ పాపాత్ముఁడు బాలిక-నాపరమేశ్వరి యటంచు నాత్మఁ గనక దు
ర్వ్యాపారుండై చంపఁగ-నోపికఁ గుడి పిడికిటఁ గొని యొగి యోజించెన్.

ఉ. "ఈపసిపాప దిట్టమయి యెంతయు గట్టిగ నున్న త్రాళ్లచే
నోపిక చేసి పెట్టినటు లొప్పుచునున్నది, చంపువాఁడ" నం
చాపరమేశ్వరిన్ వడిగ నట్టె భువిన్ బెనుబండమీఁద న
త్యాపదఁ బొందఁగాఁ బడెడునట్టుల వైచెను బైకి నారదా! ౨౪౩౯

క. పరదేవి యంతఁ బడ కు-ర్వర, నతితేజమున నభముపైకి నెగసి, భీ
కరసింహోపరిసుస్థితిఁ-బరఁగుచు ఖలుఁ గంసుఁ గాంచి పలికె మునీంద్రా! ౨౪౪౦

శా. "ఓరీ! దుష్ట! నినున్ వధించుటకునై యున్నా, నొగిన్ దేవకీ
నారీగర్భమునందుఁ బూరుషుఁడనై నా మాయచేఁ బుట్టి దు
ష్ప్రారంభా! వసుదేవపుత్త్రకుఁడనై భాసిల్లి నందప్రియా
గారంబందున నుండుదాన, నిది నిక్కం బెంచుమా యాత్మలోన్." ౨౪౪౧

చ. భగవతి యీక్రియం బలికి పాపయుతాత్మకుఁడైన కంసుఁ డ
చ్చుగఁ గనుచుండ, నెంతయును శోభిలుచున్ వరసింహవాహయై
యగణితరీతి నిర్జరచయాంచితకార్యముఁ దీర్పఁబోయె ని
మ్ముగ మునినాథ! నారద! ప్రపూర్ణదయన్ సురలోకసీమకున్. ౨౪౪౨

ఏఁబదియొకటవ అధ్యాయము

కంసుఁడు పూతనను వ్రేపల్లెకుఁ బంపుట

క. తనయుండు కలిగె నని విని-మునినాథ! ప్రభాతమందుఁ బుత్రోత్సవ మె
య్యనఁ జేసె నందుఁడు, ముదం-బున నావుల వేల నిచ్చె భూసురతతికిన్.

క. ధనరాసులను, నమూల్యము-లనఁదగు నంబరచయంబు నవనిసురుల కె
ల్లను నిచ్చి, రాజునకుఁ గర-మున నొసఁగంగా మథురకరిగె ముని! త్వరితగతిన్.

ఉ. ఆసమయంబునందు దురితాత్ముఁడు కంసుఁ డమాత్యయుక్తుఁడై
చేసి కుయుక్తులన్, గఠినచిత్తను, బాలవిఘాతనక్రియా
భ్యాసను, బూతనాఖ్యను, భయావహశీలను గోకులంబునన్
మోసముచేత బాలకులనున్ వధియింపఁగఁ బంపె నారదా! ౨౪౪౫

ఉ. పూతన కంసునాజ్ఞఁ గొని పూన్కి మనోహరరూప మొప్ప ను
ద్యోతితయై వ్రజంబునకు నొయ్యనఁ జేరఁగఁబోయి, నంద వి
ఖ్యాతగృహంబుఁ జొచ్చెను, వ్రజాంగన లెల్లరు విస్మితాత్మలై
యాతరుణీమణిం గనిరి యాత్మల మోదము పొంగుచుండఁగన్. ౨౪౪౬

క. "ఈకామిని యెవ్వతె యగు-నో? కడురమణీయరూప మొప్ప వెలిఁగెడున్,
బాకారిపత్నియగు శచి-యో? కాముని యతివ రతియొ? యొగిఁ గనవచ్చెన్.

ఉ. నందకుమారునిం గన ననంగుని భార్య ముదంబుతోడ నీ
మందిరసీమఁ జేరె" నని మాటలఁ బల్కుచు గోపికావధూ
బృందము పొంగుచుండి, రటఁ గృష్ణుఁడు రాక్షసి కామరూపతన్
బొందికఁ బొంది వచ్చెనని బుద్ధి నెఱింగి నిమీలితాక్షుఁడై. ౨౪౪౭

క. కనుఁగొనెఁ బర్యంకంబం-దున శయనించి, యటమీఁద దుష్టవనిత పూ
తన బాలకునిం గనుఁగొనె-ననలముక్రియఁ బడకయందు నలరెడువానిన్.

మ. కడు సౌమ్యంబగు వాక్కులం బలికె నాక్రూరక్రియాదక్ష య
ప్పుడు సంతోషముతో యశోదఁ గని "యోపూఁబోణి! నీభాగ్య మి
య్యెడ వర్ణింపఁ దరంబె? శోభనతనుం డీబాలుఁ డెన్నంగ నీ
కొడుకై పుట్టె సహస్రజన్మముల కోర్కుల్ గూడిన ట్లొక్కటన్. ౨౪౫౦

మ. సుదినం బియ్యది, లోకమోహనుని నీసూనున్ శుభాంగున్ సుఖా
స్పదునిన్ జూడఁగనయ్యె, సంతసము మద్భావంబునం గల్గుచు
న్నది, దీర్ఘాయురుపేతుఁడై వెలయుత న్బాలుండు, సర్వాంగమో
దదుఁడై సంతత మెంతయుం దమి యశోదాదేవి కత్యున్నతిన్." ౨౪౫౧

మ. అని యీరీతిగ స్నేహయుక్తశుభవాక్యంబు ల్దగం బల్కి, య
ద్దనుజస్త్రీ మరలన్ వచించెను యశోదాకాంతనుం గాంచి, "యం
గనరో! బాలకు నిమ్ము, నాతోడపయిన్ గారాబ ముప్పొంగ నె
మ్మనమందుం గడుఁ దృప్తి నొందెదను సమ్మానంబుతో" నావుడున్. ౨౪౫౭

తే. ఆ యశోదయు నాపల్కు లాలకించి-బాలకు నొసంగె, నొడిలోనఁ బరమముదము
మీఱఁగా నుంచుకొని నిర్నిమేషదృష్టి-యగుచుఁ బూతనయంతసంయమివరేణ్య!

క. బాలుని వక్త్రంబున నపు-డాలలన విషప్రపూరితాత్మ స్తనమున్
బాలుం ద్రావు మటంచును-బాలకుఁ దెల్పుచును నుంచెఁ బరమోత్సుకయై.

పూతనవధ

మ. మదిఁ గృష్ణుం "డిది పూతనాహ్వయ యగు, న్మర్యాదతోఁ జూడరా
నిది, దుష్టాత్మ" యటంచు నెంచి వడి నెంతే నిర్దయుండై విష
ప్రదతత్క్షీరముఁ ద్రావె నయ్యదనఁ దత్ప్రాణంబుతో నొక్కటన్
బెదవు ల్చొచ్చొచో యంచుఁ జప్పు డిడుచున్ బెన్మక్కువన్ నారదా!

ఉ. అప్పుడు సౌమ్యరూప మసురాంగన వీడి, భయంకరాకృతిన్
జొప్పడఁ దాల్చి "నాదగు నసువ్రజ మూడుచునున్న, దింక మా
యప్పరో! చాలుఁజాలు, విడు మర్భక! యర్భక! వీడు" మంచు వే
రొప్పుచుఁ బ్రాణము ల్వదలెఁ గ్రూరశరీర జనంబు బెగ్గిలన్. ౨౪౫౮

తే. ధరణి గంపించె నప్పుడు, దనుజకాంత-ఘోరవక్త్రంబులోఁ బెద్ద కొండమాడ్కి
గోకులమునావరించి మిక్కుటముగాఁగ-భయముగలిగించె భూమిపైఁబడినయంత.

సీ. మునినాథ! నారదా! విను క్రూరరాక్షసీవక్షంబుపైఁ గృష్ణుఁ డాక్షణమున
భీకరాననముతో విస్తృతముండమాలికతోడ వెలసి కాళీస్వరూప
మునఁ గ్రీడసల్పి నెమ్మని దదీయశరీరమును వీడి ఘననీలతనువిరాజి
తంబగు కృష్ణరూపంబును ధరియించి బాలకుఁడై యొప్పెఁ బ్రకటరీతి,

తే. నావ్రజంబున నున్నట్టి యఖిలజనులు-విస్మయము నొంది, రాద్యయై వెలయు శక్తి
కాళికయె కృష్ణుఁ డనఁగ విఖ్యాతి నంద-బాలుఁ డీతం డటంచు భావములయందు.

ఉ. అంత యశోద బాలకుని నాదృతిఁ గైకొని కౌఁగిలించి, య
త్యంతభయాకులాత్మ యయి యంకముపై నిడి, పాల నిచ్చి, సం
భ్రాంతిని నోషధీవితతి రాజిలు పావనవారి దోషముల్
శాంతిలఁ గృష్ణదివ్యముఖపద్మముమీఁదను జల్లె నారదా! ౨౪౫౯

శా. ఈరీతిన్ వ్రజమందు నుండఁగను న ద్దేతెంచె నందుం డొగిన్
గ్రూరాత్ముండగు కంసభూపతికిఁ గోర్కు ల్మీఱఁగాఁ గప్పముల్

భూరిప్రక్రియ నిచ్చి, వేగమ వ్రజంబున్ జేర నోనారదా!
సారాచారుఁడు నిర్విచారుఁ డగుచున్ సంతోష ముప్పొంగఁగన్. ౨౮౬౦

ఉ. వచ్చినయంతలోనె తన బాలుని చేష్టల నాలకించి పెం
పచ్చుపడంగ సూనునకు నాయువుఁ బెంపఁగ దేవిఁ గొల్చి వి
ద్వచ్చయసూక్తి నెన్ని బలిదానము లాదృతి నిచ్చి యెంతయున్
సచ్చరితుండు నందుఁడు ప్రశాంతమతిన్ గడు భక్తి మీఱఁగన్. ౨౮౬౧

శా. అంతం గంసుఁడు పూతనానిధన మత్యంతాద్భుతం బొప్పఁగా
నెంతే భీతిని నాలకించి, తనలో నీయర్భకుం డొక్కఁడే
యంతం బొందఁగఁజేయుఁజు మ్మనుచు, సత్యం బియ్యె దిం కంచుఁ డా
భ్రాంతుండయ్యెను గృష్ణ చేష్టితములన్ వర్ణించి రూపించుచున్. ౨౮౬౨

తృణావర్తవధ

క. దురితాత్ముఁడైన కంసుఁడు-పరిమార్పఁగ నెంచి కృష్ణు బలమునఁ గొనిరా
నురుగతిని దృణావర్తా-సురుఁ బంపె వ్రజంబుఁ జేర సూరివరేణ్యా! ౨౮౬౩

ఉ. ఆ యసురుం డనంతజవ మాత్మను బొంగ వ్రజంబుఁ జొచ్చి, య
త్యాయతబాహుదండముల నప్పుడె నిర్జనమైన చోట శో
భాయుతుఁడై తనర్చు పసిబాలకుఁ గృష్ణునిఁ బొంచిపట్టి, పై
పై యెగసెన్ నభంబునకు బల్మిని దర్పమునన్ మహామునీ! ౨౮౬౪

సీ. శ్రీకృష్ణుఁ డప్పుడు చిఱునవ్వు నవ్వుచు నారాక్షసోత్సంగమందు నుండి,
యపుడె భయంకరవ్యాఘ్రాజినధరయై బ్రహ్మరూపిణియైన భద్రకాళి
తారూపమును బొంది ఘోరమేఘధ్వనిఁ గావించె, నపుడు రాక్షసుఁడు బెగడి
యమ్మహాశబ్దంబు నాలించి మోహితుఁడై క్రిందఁ బడెఁ, బర్వతావళియుతి
తే. మైన భూమి వడంకె నత్యద్భుతముగ,-నంతఁ గాళి తృణావర్తు నాదల శిత
ఖడ్గమునఁ గొట్టి వాని వక్షమున మరల-బాలకృష్ణుని రూపంబు లీల నొందె.

చ. గురుతరమైనయట్టి దగు కొండవలెన్ గనుపట్టు వాని డా
శిరము భయంకరం బగుచు ఛిన్నత నొంది యపారరక్తసం
చరణపరిప్లుతంబు నయి క్ష్మాస్థలి నుండ, యశోద గాంచి, య
బ్బురమును నొంది, దానవుని భూరితరాకృతి నెంచి భీతిలెన్. ౨౮౬౫

చ. త్వరితగతిన్ గుమారుఁ గొనఁ బర్విడి, రాక్షసు దేహమందు సుం
దరవరనీలదేహమున నవ్వుచు వేడుక నున్న శ్యామసుం
దరునిఁ బ్రసన్నవక్త్రుఁ గని తాఁ బరమాద్భుతచిత్తయై వడిన్
'వరసుకుమారదేహ! ప్రియబాలక! వత్స!' యటంచుఁ బిల్చుచున్. ౨౮౬౬

క. కడువడిఁ గొడుకును గొని తన-తొడపయి నిడుకొని యశోద తుడుచుచు శిర, మ
ప్పుడు నందుం డచ్చోటున-కెడసేయక వచ్చె భ్రాంతి నిద్ధచరిత్రా!

శా. ఘోరాకారుని రక్తసంప్లుతు నతిక్రూరుం గతప్రాణు వి
స్తారోరస్కుని మేదినీపతితు నుద్దామాసురుం గాంచి "యా
కారా! మత్సుతుఁడైన కృష్ణుఁడె ప్రచండాఖండదోర్దండు నీ
వీరుం జంపెనె" యంచు సంతసమునం బెల్లుబ్బె మునీశ్వరా! ౨౪౬౯

క. ఈవిధమున భగవతియగు-దేవియె పూరుషత నంది దివ్యమునీంద్రా!
తా వేడుక నందయశో-దావరదంపతుల కొసఁగెఁ దపముల ఫలముల్. ౨౪౭౦

శంభుఁడు రాధయగుట

ఉ. గోకులమందు శైశవముఁ గోరిక మీఱఁగఁ దాను బొంది శో
భాకలితాత్మయై యటఁ బ్రభావముఁ జూపుచు నుండె, శంభుఁడున్
బ్రాకటరీతితోడ వృషభానుని గేహమునందు లీలఁ గాం
తాకృతి నొంది రాధ యనఁ దా జనిఁగాంచెను వైభవంబునన్. ౨౪౭౧

ఉ. ఆరాధిక నొక గోపకు-మారుఁడు పెండ్లాడి యపుడె మాన్యా! క్లీబ
త్వారోపితుఁడై శంభుని-కోరికతో నుండె నందగోకులమందున్. ౨౪౭౨

క. ఆరాధ యనుదినంబును-నారయఁ జని కృష్ణుఁ బంకజాక్షునిఁ బ్రేమన్
గోరికలీఱఁగ నంకముఁ-జేరిచి పరమాదరమునఁ జెందు ముదంబున్. ౨౪౭౩

శా. వంతం గంసుఁడు తాను బంపిన తృణావర్తుండు శ్రీకృష్ణుదు
ర్దాంతాత్యద్భుతవీర్యసన్నిహతుగాఁ దర్కించి శీఘ్రంబునన్
స్వాంతంబందున నందనందనుని నేచక్కిన్ మహాయుక్తి న
త్యంతోదగ్రతఁ జేనగున్ మధుర కం చాలోచనల్ సల్పెఁ దాన్. ౨౪౭౪

క. మునినాథ! రోహిణీనం-దనుఁడగు రాముఁడును సంతతము పూర్ణముదం
బున నతిమహిమాన్వితుఁడగు-ఘనుఁ గృష్ణుని గూడి వేడుకం గ్రీడించున్.

క. ప్రేమం గ్రీడింతురు తమ-నేమియు భేదంబు లేక యెంతయు రూపో
ద్దాములు శ్రీదాముఁడు వసు-దాములు రమ్యముఖవిజితతామరసాభుల్.

క. మునివర! శ్రీకృష్ణుఁడు రా-ధను గూడి రమింపఁగోరి తా గోకులమం
దున బాలురతో నాడుచు-ననువున వసియించె మిగుల నాదృతి వెలయన్.

ఏఁబదిరెండవ అధ్యాయము

శ్రీకృష్ణుఁడు యశోదానందులకుఁ బుత్త్రుఁడయిన విధము

సీ. నారదముని పల్కెఁ గౌరీపతినిఁ గాంచి భక్తితోడ "మహానుభావ! దేవ!
దేవకికడుపున దేవి బాలకరూపమున జనించెనుగదా ముదమువిూఱ,
గోకులంబున నందగోపుని గృహమునం దేల వసించెఁ దా హృష్టయగుచు?
నందుండు తొల్లి యేచందంబునను నుండెఁ? దత్సతి యగు యశోద మును నెట్టు

తే. లుండెఁ? నెట్టి తపంబుల నురుతరముగఁ-జేసి దేవిని సంతృప్తచిత్తఁగా నొ
నర్చి రాదంపతులు? కరుణాసముద్ర!- తెలుపు మియ్యది నాకు విస్తృతముగాఁగ.

తే. భువనజనని మహేశ్వరి పూర్ణకాళి-శ్యామసుందరరూపిణి యగుట యేల?
తాఁ బరాత్పర స్వాంశచేతను యశోద-కును జనింపఁగఁ గతమేమొకో? మహేశ!

తే. పుట్టినంత యశోద కాభువనమాత-యేల కానంగరానిదై యెసఁగె దేవ!
నందునకునైనఁ దా దర్శనం బొసంగ-కుండుటకు హేతు వెయ్యది యందు నభవ!

క. పుట్టుక యేకారణమున?-నిట్టిచరితమునకు హేతు వెయ్యది దేవా!
గట్టిగఁ దెలుపుము శంకర!-గుట్టెల్లను విస్తృతముగఁ గోరిక విూఱఁగన్."

క. నా విని శంకరుఁడు మహా-దేవుఁడు నారదునిఁ గాంచి "దివ్యమతీ! వ
త్సా! విను, వినిపింతును దమి-నీ వడిగిన వృత్త మెల్ల నియతి వెలయఁగన్.

క. మునివర! నారద! నెమ్మదిఁ-గని యవధానమున వినుము, ఘనమహిమాశో
భనదాయకమగు చరితం-బును గడు భక్తి వెలయంగ బుధనుతసుగుణా!

సీ. మునినాథ! నారదా! మును బూజ్యుఁడయినట్టి దక్షప్రజాపతి తన యనుంగు
పట్టిని నెడఁబాసి వగఁజెంది మొదలోన నాత్మజను బరాంబ యాద్యయైన
ప్రకృతి యంచు నెఱింగి బహుళదుఃఖార్తిని మునిఁగి తలంచె నెమ్మనమునందు,
"సత్యుగ్రతపమును నాచరించి పరాంబ నాత్మజగాఁ గాంచి యకట! బుద్ధి

తే. నెఱుఁగఁజాలక నిందించి యీశు శివుని
మోసపోయితిఁ బ్రకృతిచే ముగ్ధుఁడనయి,
యింక నెయ్యదికార్యంబొ, యెఱుఁగనగునె?
యెవరు తెలుపంగఁగలవార లివ్విషయము? ౨౮౫౮

చ. మరలఁ దపం బొనర్తు, బుధమాన్యపదాంబుజ దేవి యాత్మ సం
బరమును బొంది నాయెడఁ గృపం గని పుత్త్రికయై జనింపఁగా
నురుతరభక్తి యత్నము మహోన్నతరీతిని జేయువాఁడ ని
బ్బరముగ" నంచు దక్షుఁ డెదఁ బల్మఱు యోజనచేసి నారదా! ౨౮౫౯

క. హిమవత్పర్వతమున ను-త్తమమగు ప్రస్థమును జేరి తప మొనరిచె, డెం
దమును నిలిపి యంబాపద-కమలార్చనయందు భక్తికలితుం డగుచున్.

ఆ. దివ్యవర్ష శతము దృఢనిశ్చయుం డయి-ధ్యాన మాచరించెఁ దాపసేంద్ర!
యధికభక్తిఁ దత్ప్రియాంగనయైన ప్ర-సూతియును బరాంబ శుద్ధమతిని.

క. చిరకాలం బీవిధముగ-గురుతరమగు భక్తి తపము ఘోరంబుగ న
య్యిరువు రొనరించుచుండఁగఁ-బరమేశ్వరి తృప్తినొంది భావంబందున్.

క. వారికిఁ బ్రత్యక్షంబై-"కోరుఁడు, వర మొద్ది మీకుఁ గూర్చు" ననుటయున్
గోరిక లిరిక లెత్తఁగ-నారసి పరదేవి దక్షుఁ డర్థించెఁ దమిన్. ౨౪౮౯

క. "జననీ! నను దయతోడం-గని మత్పుత్రి వయి పుట్టఁగాఁ గోరెద, నా
మనమునఁ గల సద్వాంఛిత-మన నియ్యదియే ప్రియంబు నగు"నని యడిగెన్.

ఉ. అంతఁ బ్రసూతి యిట్లనియె "నంబ! మహేశ్వరి! నిన్నుఁ బుత్రిగా
స్వాంతమునందు నెంచి తమి వత్సలతం గడుఁ బ్రీతిఁ బెంచఁగా
నెంతయు నాకుఁ గోర్కి గల, దియ్యది సిద్ధివహించురీతి న
త్యంతముదంబునన్ వరము నాదర మొప్ప ననుగ్రహింపవే." ౨౪౯౧

ఆ. వరము లిట్లు వేఁడఁ బరదేవి మిక్కిలి-సంతసంబు నొంది స్వాంతమందు
దక్షునిం బ్రసూతి దయతోడఁ గనుఁగొని-పలికె నిట్లు రమ్యభణితి నపుడు.

సీ. "దక్షప్రజాపతీ! ద్వాపరాంతమునందు నవనీతలంబునం దవతరింతు,
నీకుఁ బుత్రికనయి నిక్కంబుగ, నిందు సంశయింపకు మార్య! స్వాంతమందుఁ,
గన్యకారూపసంకలిత నయ్యును నేను నీభవనంబున నిలువఁజాల,
మును శివనిందఁ జేసిన నీదు చరితంబుఁ దలఁచి నామనమునఁ దడయ కపుడె

తే. యరిగెదను దేవకార్యార్థ మనెడు హేతు-వునను స్వర్గపురంబునకును జవమున,
జనకులార! వినుండు నిశ్చలమతులయి-యిద్ది కాఁదగునది యనిమెంచవలయు.

తే. నేను బుట్టిన వార్తయే నీవు వినక
యుందు, వవ్విధమగు కాలమందె నీగృ
హంబు వదలుదు, సత్య మియ్యది యటంచుఁ
దలఁపు మెంతయు నాత్మలో దక్ష! జనక! ౨౪౯౪

క. జననీ! నీవగు ప్రార్థన-మున జన్మము నెత్తుదానఁ బూర్ణప్రీతిన్,
విను, మిపుడే యంతర్హిత-మును బొందుదు, నాత్మ శంకఁ బూనకు మిందున్.

చ. వినుమొకమాట, మున్ను నతివిస్తృతభక్తిని నన్ను నాత్మలో
ఘనతరనిష్ఠతో నదితికశ్యపు లెంతయు నిల్పి పూజలన్

దనిపినవారు; వారల కెదర్ బరితృప్తి యొసంగ వాంఛితం
బును దమిఁ దీర్ప నొక్క వరముఁ గృప నిచ్చినదాన నెంతయున్. ౨౪౯౬

ఆ. ఆ వరంబుఁ దీర్ప నవతరింతుఁ దదీయ-భవనమునను బుత్త్రభావ మూని
ద్వాపరాంతమందు దయ మీఱ, నిమ్మాట-సత్య, మిందు లేదు సంశయంబు.

ఉ. అత్తఱిఁ దావకంబయినయట్టి నికేతనమందుఁ బ్రీతి ద
ళ్కొత్తఁగఁ గొన్నినాళ్లు మది నుత్సుకతన్ వసియింతు, మీకు న
త్యుత్తమమౌ ఫలం బొసఁగు నూహఁ ద్వదీయతపంబు నెంచి యో
యుత్తమచిత్తులార! తమి నుల్లమునందున నమ్ముఁ డీనుడిన్." ౨౪౯౭

చ. మునివర! యీవిధంబునఁ బ్రభూతదయన్ వరమిచ్చి లోకసం
జననముఁ బాలనక్రియయు సంహరణంబు నొనర్చు శక్తితో
నెనసిన యా పరాత్పర, మహేశ్వరి వారలు చూచుచుండ గొ
బ్బున నె తిరోహితత్వమును బొందెను నద్భుతరీతి నారదా! ౨౪౯౮

సీ. ఆ దక్షుఁడే నందుఁడయ్యె, నాతని ప్రియపత్ని ప్రసూతియే యవనియందు
నవతరించెను యశోదాఖ్యతోఁ బెంపారి, వారికిఁ బరదేవి వరము కార
ణంబుగాఁ బుట్టె గర్భంబునందు, యశోద యిట్టులు పరదేవిఁ బట్టిగాఁగ
భాగ్యంబు గాంచె, నాభగవతి పుట్టినయంతమాత్రంబున నవనితలము
తే. వదలి స్వర్గంబునకుఁ బోయెఁ ద్వరితగతిని-దేవకార్యంబుఁ దీర్పఁగా భావమందు
దలఁచి, విను మంత దేవకీతరుణియందు-నవతరించిన పరదేవి యతిముదమున.

తే. శ్యామసుందరరూపిణి యై మనోజ్ఞ
మైన గోకులమందు నందాత్మజుఁడన
నయ్యశోదకు సుతుఁడన నలరుచు వసి
యించెఁ దాఁ గొంతకాలంబు హృష్టయగుచు." ౨౫౦౧

ఏబఁదిమూఁడవ అధ్యాయము

శ్రీకృష్ణలీలలు

ఉ. ఈవిధిఁ దెల్ప, నారదమునీంద్రుఁడు భక్తి యొసంగ నమ్మహా
దేవునిఁ గాంచి యిట్లనియె "దేవ! మహేశ్వర! పార్వతీప్రియా!
దేవి ధరాతలంబునను దేవకియందునఁ గృష్ణుఁడై జగ
త్పావనతం జరించిన విధంబును దెల్పవె సంగ్రహంబుగన్. ౨౫౦౨

సీ. గోకులంబందు రాధాకాంతతోఁ గూడి యేలీల విహరించె హితవృత్తుఁ డయ్యె!
భూభారమును వృద్ధిపొందించు నెక్కు దుష్టాత్ములఁ జంపె నెట్లాజియందు?
నాకురుక్షేత్రంబునందుఁ దానే యుద్ధమొనరించెనే? స్వకులోన్నతులను
బంపి చంపించెనా? పరమదయామయా! యవనియం దేరీతి నఖిలమునుల

ఆ. ఋషులఁ గూడి యెట్లు హృష్టుఁడై యదువంశ-జాతులెల్లఁ బ్రీతి సంచరించి?
రెట్లు స్వర్గమునకు నింపుగా మరల వేం-చేసె నెట్లు? తెలుపవే సుచరిత!"

క. నారదముని ప్రశ్నింప న-పారముదంబున మహానుభావుండగు నా
గారీరమణుఁడు విని వి-స్తారకృపం బలికె "నారదా! గుణధుర్యా! ౨౧౦౪

ఉ. గోకులమందు బాల్యమునఁ గూరిమిమీఱ వసించి కృష్ణుఁ డ
త్యాకులితాత్ములైన యమరారుల ధేనుకముఖ్యులన్ నిజ
ప్రాకటశక్తి నంతకనివాసముఁ జేరఁగఁ బంపి, లీల న
స్తోకమహాప్రభావమును జూపి చలంబును బాపి కాళియున్. ౨౧౦౫

క. మునినాథా! బృందావన-మున రాధాసహితుఁ డగుచు మోదముతో న
త్యనుపమలీలలఁ దేలుచు-ననయము వసియించెఁ గృష్ణుఁ డతితృప్తుండై.

శా. భైరవ్యాంశలఁ బుట్టినట్టి వరగోపస్త్రీసమూహంబుతో
గారాబంబున సంతతంబుఁ దమిఁ దాఁ గాళ్యాత్ముఁ బుంరూపుఁడై
శ్రీరమ్యుం డగుచున్ రమించుచు నిజప్రేమం దదీయాత్మ లిం
పారం బెంపువహింపఁ జేయుచును గ్రీడాసక్తుఁ డయ్యె న్మునీ! ౨౧౦౬

తే. అనుదినంబును గోకులంబందునుండి-వెడలి బృందావనము చేరి వేణుగాన
ములను గోపిక లానందమునఁ దనుఁ గన-రానొనర్చుచుఁ గృష్ణుండు తానహముల.

ఉ. వేడుక గోపికాంగనలు విస్తృతరీతిని నావరింపఁ ద
న్గూడి చరింప వారలకుఁ గోరికదీఱఁ బ్రధానరాజ్ఞిగాఁ
బోడిమి రాధికారమణిఁ బూజ్యతమక్రియ గారవించుచున్
నాడెముమీఱఁ గ్రీడల నొనర్చును గృష్ణుఁడు సద్విలాసియై. ౨౧౦౭

చ. వివిధములైన వన్యసుమబృందములన్ గడువేడ్క మాలికన్
బ్రవిశదరీతిఁ గూరిచి మనఃప్రియుఁ గృష్ణునిఁ గాంచి పొంగుచున్
దవిలి తదీయకంఠమున ధన్యతఁ గాంచినయట్లు లుంచి యు
త్సవమునఁ గాంచుచుందు, రెద సంతసమందుచు గోపికాంగనల్. ౨౧౦౮

చ. సతతముఁ గృష్ణమూర్తియును చక్కని మాలికలన్ రచించి యా
యతివలు తృప్తినొందునటు లర్పణచేయుచు మందహాసరం

జితముఖపద్మ మెంతయును జెన్నలరారఁ బ్రసన్నుఁడౌచు న
ద్భుతసువిలాసయుక్తుఁడయి తోఁచుచు వారలఁ జూచి నారదా! ౨౫౧౧

సీ. ఒక్కొకమారు దా నుత్సుకతను దివ్యసింహాసనంబునఁ జెలువుమీఱ
నుపవిష్టుఁడై ప్రేమ ముప్పొంగ వామాంకమున దివ్యసుందరి యనఁగ వెలయు
రమణీవతంసమా రాధామహాదేవిఁ గూర్చుండఁగాఁ జేసి కోర్కెలూర
శశికోటిసమదీప్తిచతురత మెఱయు నత్తన్వంగి యాననతామరసముఁ
దనదు దివ్యాంబరంబునఁ దుడుచుచుఁ గామచలితమానసుఁడయి శ్యామసుంద
తే. రాంగుఁ డెంతయు సంతోష మావహిల్ల-ముద్దుగొనుచు వినోదించుఁ దద్దయు నెద
రాధికాలోలుఁడై మునిరాజవర్య!-వినుము మఱియును దల్లీలలను వచింతు.

ఉ. ఒక్కొకమారు దివ్యయమునోత్తమసైకతతీరభూములం,
దొక్కొకమారు తత్సువిమలోదకమధ్యమునందుఁ గృష్ణుఁ డిం
పెక్కఁగ గోపికానిచయ మెంతయు నుత్సుకతం జెలంగఁ బె
న్మక్కువ వారితోఁ గలిసి మాటికిమాటికి నాటలాడుచున్. ౨౫౧౩

ఉ. రాత్రులయందు గోపికలు రంజిలఁ గృష్ణుఁడు వేణుగానమున్
శ్రోత్రమనోహరంబుగను జొక్కఁగఁ జేయుచుఁ గానసంబులం
జిత్రముగాఁ జరించుచును జెంతకు గోపికలెల్ల రాఁగ, లో
కత్రయసుందరుండగుచుఁ గాంతలఁ గూడి రమించు నచ్చటన్. ౨౫౧౪

ఉ. ఒక్కొకమారు రాధయు మహోన్నతపంచముఖాబ్జయుక్తి సొం
పెక్కిన శంభుమూర్తి ధరియింపఁగఁ గృష్ణుఁడు తా నుమాకృతిన్
జొక్కుచుఁ దాల్చి యవ్వని సుశోభితదివ్యనికుంజసీమలన్
మిక్కిలివేడ్కతోడుత రమించును సంతస మాత్మఁ బొంగఁగన్. ౨౫౧౫

క. మునినాథా! కృష్ణుం డిటు-లనిశము రాధికను గూడి యలరుచు బృందా
వనమునఁ గ్రీడించుచు నొ-య్యన గోకులమందు నుండె నానందముతోన్.

శరద్రాత్రియందు శ్రీకృష్ణుఁడు వేణుగానముఁ జేయుట

క. అంత శరత్కాలం బ-త్యంతముదావహము రాఁగ నప్పుడు కృష్ణుం
డెంతయు నొక్కమహానిశి-వింతగ బృందావనమున విహరించు తమిన్.

సీ. మల్లికాచంపకమాలతీకుందకుముదదివ్యసుమలతాపుష్పితంబు,
మందమందవిహారమధురశీతలవాతసురభితం బత్యంతసులలితంబు,
మధుపానమత్తసమ్మదమంజుగుంజిత మధుపస్వనాత్యంతమానితంబు,
కామసంచలితచిత్తామితక్రౌంచసుకోకిలాదిపతత్రకూజితంబు

తే. కుసుమితానేకకహ్లారబిసరుహావర—రమ్యసరసీసమూహావిభ్రాజితంబు
నైన బృందావనము చేరనరిగి కృష్ణుఁ—డతిముదంబున నుండె మహామునీంద్ర!

చ. అతివిశదంబులై వెలయు నంశువులన్ వెదఁజల్లి లోకసం
తతులకు సంతసంబును ననంతముగాఁ గలిగించి, కామినీ
వితతిహృదిందుకాంతముల వేడ్క ద్రవింపఁగఁ జేయుచున్ దమః
ప్రతతిని మాన్పఁ జేయుచును భాసిలె నంతటఁ జంద్రుఁ డెంతయున్. ౨౧౯

మ. మునినాథాగ్రణి! యీవిధంబునను బల్మోదంబు దీపించు న
వ్వనమున్, నిర్మలకాంతిసంతతులతో భాసిల్లు రాకామృగాం
కుని శ్రీకృష్ణుఁడు గాంచి మానసమునన్ గోర్కెల్ ప్రవృద్ధంబుగా
ఘనసంతోషము మీఱ వేణురవము న్గావించె సోత్కంఠుఁడై. ౨౨౦

ఉ. ఆ రమణీయవేణురవ మప్పుడు గోకులమందు నుండు నా
భీరనితంబినీమణులు ప్రీతి చెలంగఁగ నాలకించి శృం
గారము మీఱఁ గృష్ణగుణకర్షితమానస లౌచు నాశుభా
కారుని జూడ, వీడి గృహకార్యము లెల్లను వచ్చి రొయ్యనన్. ౨౨౧

క. వారికి నగ్రేసరయై—కోరికమీఱంగ వచ్చెఁ గోమలి రాధా
నారీమణి, పూర్ణంబుగ—స్త్రీరూపముఁ దాల్చినట్టి శివుఁడే మౌనీ! ౨౨౨

మ. సరసీజాక్షుఁడు కృష్ణుఁ డప్పు డెదలో సంతోష ముప్పొంగ న
త్తరుణీరత్నములైన గోపికలు రాధాకాంతతోఁ గూడి సుం
దరబృందావనసీమకున్ దరలిరాఁ దాఁ గాంచి లోనెంచె నో
వరమౌనీంద్ర! మహావిహారమును సల్ప న్యత్న మత్యున్నతిన్. ౨౨౩

ఉ. అంత వ్రజాంగనామణుల నాదృతిమీఱఁగఁ గౌఁగిలించి బా
హ్వాంతరసీమఁ జేర్చి ముదమారఁగఁ గృష్ణుఁడు వేఱువేఱుగాఁ
గంతుని గెల్చుచున్ వివిధకౌతుకమంగళకార్యరీతులన్
స్వాంతములం గరంచుచును సల్పె మహోన్నతరీతిఁ గ్రీడలన్. ౨౨౪

చ. నవజలదప్రకాశుఁడు సనాతనుఁడుం బరిపూర్ణచిత్తుఁడై
భువి వెలుఁగొందు కృష్ణుఁడు ప్రమోదభరాత్ముఁడు నయ్యెఁ గాంతలం
దవిలి రమింపఁ, గామచలితంబగు మానస మొప్ప నారదా!
సువిశదరీతి నొంటెఁ గడుసొంపుగ నెన్మిదిమూర్తులన్ దమిన్. ౨౨౫

క. ఎనిమిదిమూర్తులఁ గృష్ణుఁడు—కనఁబడ రాధయును నిందుకాంతస్మితశో
భన కామవిహ్వలములగు—తనువుల నెన్మిదిని దాల్చెఁ దత్క్షణమందున్.

క. ఆరాధామూర్త్యష్టక-మారసి కృష్ణుండు విహారకాసక్తుండై
వారిని గాని మూర్త్యష్టక-ధారి క్షణంబునఁ దిరోహితత్వము నొందెన్.

శా. అంతర్ధానము నొంది కృష్ణుఁడు నభంబందుం బ్రకాశించు చ
త్యంతాసక్తిని గోపికావితతినిన్ దా వీడి శూలంబుచే
వింతల్మీఱఁగ భూస్థలిన్ వదలి బల్వేడ్కన్ బ్రియన్ రాధనున్
సంతోషంబునఁ గూడి సల్పె నొగి రాసక్రీడ నోనారదా! ౨౫౨౮

సీ. కమలాక్షుఁ డత్యంతకౌతుకాయత్తుఁడై రాధిక నపుడు చేరంగ నరిగి,
బాహువల్లరులచే బాహువుల్ పెనవైచి, మోము మోమునఁ జేర్చి ముద్దులఁగొని,
స్తనములఁ గరములఁ జారుతరంబుగా నల్లనల్లన నొత్తి యధికరక్తి,
నించుక వస్త్రంబు నెలమితోఁ దొలఁగించి మందహాస మొనర్చి సుందరాంగుఁ
తే. డగుచుఁ దాఁ బూర్ణుఁడయ్యు నిచ్ఛానుసార
ముగను లీలావినోదియై మునివరేణ్య!
గగనమునఁ బరమానందకలితుఁ డగుచు
నాత్మఁ బొంగుచుఁ గ్రీడించె నద్భుతముగ. ౨౫౨౯

తే. పుష్పవృష్టి గురిసెఁ బాదలె భేరీదుందు-భిప్రముఖసుతూర్య విశదరవము
లెల్లఁ దుములములయి, యుల్లసిల్లె నభంబు,-నందు సురలు ముదము నంది రెదల.

క. శ్రీరాధాకృష్ణు లిటు-ల్తారాపథసీమఁ గ్రీడలన్ సలుపఁగ నా
భీరాంగన లావనమున-వారలఁ బొడఁగాన లేక వగఁ బొంది రెదన్. ౨౫౩౧

క. మునివర! గోపిక లెంతయుఁ-దనుఁ గానక యేడ్చుచుండఁ దా విని కృష్ణుం
డనువున వారికి దర్శన-మును నొసఁగెను రాధతోడ ముదము చెలంగన్.

మ. అతిరమ్యంబగు నవ్వనంబున నెదన్ హర్షించి గోపాంగనా
తతి కాత్మన్ గల వాంఛితంబులను మోదంబొప్పఁ జేకూర్ప సం
తత మాత్మీయతపఃప్రభావమునఁ జేతఃప్రీతి యుప్పొంగ స
మ్మతితోఁ బెక్కువిధంబులం దవిలి సంభావించి క్రీడించుచున్. ౨౫౩౩

సీ. బృందావనమున నాభీరకాంతలఁ గూడి విహరించుచుండ నవ్విభవ మెల్లఁ
గాంచి దేవతలును గంధర్వవరులును దమ యాత్మలందు సంతసము నొంది,
కుసుమవర్షంబులు గురియించి రెంతయు నారదమునినాథ! గారవమున,
నీవిధంబునఁ గృష్ణుఁ డెలమి రాసక్రీడ బృందావనమునఁ గావించె వేడ్కఁ
తే. బెక్కుదినములు వ్రజసతీవితతితోడ-వరశరత్కాలమందు సంబరము మిగులఁ
గార్తికీపూర్ణిమయె మొదల్గాఁగ రాత్రు-లందు రాధాసహితుఁడయి యధికతృప్తి.

క. వనితారూపముఁ బొందిన-ఘనుఁడగు శంభుఁడు ముదంబు గడలుకొనఁగఁ జే
సిన వస్త్రాద్యపహరణము-మునుగాఁగల క్రీడ లమితములు గలవు మునీ!

క. పరమేశ్వరియును నద్భుత-సరణి మహాక్రీడలెల్ల సలిపెను గాంతా
వరరూపధారియగు న-ప్పరమేశ్వరులోడఁ గూడి పరమముదమునన్. ౨౫౩౬

ఉ. నందుఁడు మున్నుగాఁగ యదునాయకులున్ వ్రజమందు నున్నవా
రందఱుఁ గృష్ణ లీలలను నారసి బ్రహ్మముగాఁ దలంచుచున్
సందియమొంద కాత్మలఁ బ్రశస్తముగాఁ బరదేవిమూర్తి యం
చుం దమిఁ బెంచుచుండి రతిశుద్ధమనంబుల స్నేహయుక్తితోన్ ౨౫౩౭

చ. సతతము రాధయున్ బ్రియము సంధిల లజ్జను వీడి స్నేహసం
యుతయయి కృష్ణుతోడుత సముల్లసితంబగు మానసంబులన్
హితవుగఁ గ్రీడలాడుచును నెంతయు వేడుకమీఱ నుండె న
ద్భుతముగ వృద్ధినొందఁ గడుఁ బూర్ణత నందము సుందరాంగియై. ౨౫౩౮

వృషభాసురవధ

ఉ. అంతట నొక్కనాఁడు వృషభాసురుఁ డన్ బలశాలి కంసుచే
నెంతయుఁ బ్రేరితుం డగుచుఁ గృష్ణుని రామునిఁ జంప నెంచి, దు
ర్దాంతుఁడు గోకులంబునకుఁ దా వడిఁ జేరఁగఁబోయె, నప్డు వి
భ్రాంతిని బొంది రెల్లరును భావములం గడు భీతి నెక్కొనన్. ౨౫౩౯

ఆ. వెండికొండరీతిఁ బృథుదేహ ముప్పొంగ-భీతిఁగొలుపునట్టి వృషభదైత్యుఁ
గాంచి, గోకులమునఁ గల పశువులు ద్రుత-గతిని బరుగులిడె నగతికమునను.

తే. ఆ దురాత్మునిఁ గని లోన నదరిపడుచు-సింహమును గాంచి భీతిని జెంది పఱచు
కుంజరంబులవలె విదిక్కులకు దిక్కు-లకును బాఱిరి సర్వులు వికలులగుచు.

ఉ. గోకులవాసు లెల్లరును గొందలమందుచు భీతిఁ బాఱ, న
య్యాకులపాటుఁ జూచి తన యాత్మను గృష్ణుఁడు వారిఁ బ్రోవఁగా
నాకుటిలాత్ముఁ జంపుటకునై వడి తన్నికటంబుఁ జేరఁగా
భీకరరీతిఁ బోవుటయు, వెంటనె వాఁడును గ్రోధయుక్తుఁడై. ౨౫౪౨

చ. సముఖముఁ జేరు కృష్ణుఁ గని శాతఖురంబుల భూమి గ్రొచ్చుచున్
బ్రమదము మీఱ క్షోభము నవారితుఁడై యొనరించి తాపసో
త్తమ! దిశలెల్ల మ్రోఁగునటు తాను ఖణిల్లని అంకెవైచె, దు
ర్దముఁడయి యావృషాఖ్యబలదానవుఁ డప్పుడు పొంగె నుద్ధతిన్. ౨౫౪౩

ఉ. కొమ్ములఁ బట్టి లాగి, వడిఁ గుంభినిపైఁ బడఁగొట్టి, కృష్ణుఁ డా
త్రిమ్మరి ప్రాణము ల్వదలఁ దేఁకువ మోద నసుద్రవజంబు నొ

క్కుమ్మడి వీడె నావృషభఘోరనిశాచరుఁ డప్డు భీమరూ
పమ్మునఁ గొండవోలెఁ గనువారలు విస్మయ మందుచుండఁగన్. ౨౧౪౪

తే. గోకులమునందు నున్నట్టి గొల్లలెల్ల-నచ్చెరువు నంది ముదమున నాత్మ లలర
నాదరంబునఁ బూజించి రపుడు వివిధ-ముగను నుతియించి శ్రీకృష్ణు మునివరేణ్య!

ఏఁబదినాల్గవ అధ్యాయము

శ్రీకృష్ణుఁడు మధురాపురంబున కరుగుట

తే. అంత నొకనాఁడు మునివరుండైన నార
దుండు మధురాపురికిఁ బోయె నిండువేడ్క-
హరికథామృతమును వీణయందుఁ జేర్చి
వెలయఁ బలికించుచును నభోవీధియందు. ౨౧౪౬

శా. ఏకాంతంబును జేరి యో మునివరా! యెవ్వారికిం గోచరం
బై కానంబడనట్టి వృత్తమును నత్యంతప్రియం బొప్పఁగా
నా కంసక్షితినాథదుష్టమతి కింపారంగ సర్వంబుఁ దాఁ
బ్రాకట్యంబునఁ దెల్పె లోకహితమున్ భావించి చిత్తంబునన్. ౨౧౪౭

సీ. "విను కంసభూపతీ! వివరించుచున్నాఁడ నత్యంతగుప్తమైనట్టి వార్త,
నీకు హితంబయి నెగడును నయ్యది, గోకులంబున నందగోపభూప
సుతుఁడగు నమ్మహాయతబాహువిక్రమశాలియా కృష్ణుండె చలముమీఱఁ
గమనీయవనమాలికావిరాజితుఁ డభినవఘనశ్యామసుందరుఁడు శ్రీశుఁ
తే. డనుచు నమ్ముము, వసుదేవునంగనయగు
దేవకీకాంతగర్భమం దా విభుండె
యెనిమిదవ చూలుగాఁ బుట్టె, నిది నిజమని
మనమునందునఁ దలఁపు మో క్ష్మాతలేంద్ర! ౨౧౪౮

ఉ. ఇంతియ గాదు రోహిణికి నింపెసలారఁగఁ బుట్టినట్టి య
త్యంతబలుండు విష్ణుఁ డని యాత్మ నెఱుంగుము, వారి నిర్వురన్
సంతస మొప్ప నందవరసద్మమునన్ వసుదేవుఁ డుంచినాఁ,
డింతయు వృద్ధినొందుచు నహీనపరాక్రము లుండు రచ్చటన్. ౨౧౪౯

క. చలమున నీవంపిన శూరులను దృణావర్తముఖులఁ గ్రూరబలుల న
బ్బలియురె చంపిరి బలమున్-వెలయించుచు లోకమందు విశ్రుతలీలన్. ౨౧౫౦

చ. ఘనతరవిస్మయం బొదవఁగా గగనంబున కేఁగినట్టి బా
లను మది నందపుత్త్రియని లక్ష్యముసేయుము, నీకుఁ బ్రీతిఁగా

ర్పను వసుదేవుఁ డాద్యతిని బాలికఁ దెచ్చినవాఁడు గోకులం
బునకును నేగి, యందుఁ దన పుత్త్రుని నుంచి యటంచు నమ్ముమా!" ౨౫౧

ఉ. నారదుఁ డిట్లు తెల్పఁగ మనంబున మండుచుఁ గంసుఁ డుగ్రుఁడై
పారము లేని కోపమునఁ బంతమువీఱఁగ ఖడ్గహస్తుఁడై
ధీరతతోడ నట్టె వసుదేవుని దేవకినిన్ వధింపఁగాఁ
గోరి మునీశ్వరా! వెడలె గొబ్బున నార్చుచు దుష్టబుద్ధియై. ౨౫౨

మ. అతికోపంబునఁ బోవు కంసు ఖలు నత్యంతప్రియం బొప్పఁగా
హితసూక్తిప్రతతిం దగంబలికి, మౌనీంద్రుండు శాంతాత్ముఁ డ
ద్భుతరీతిన్ వడిఁ దత్ప్రియత్నమును సంపూర్ణంబుగా మాన్పి, స
మ్మతితోడం జనె స్వాశ్రమంబునకు సంభావించుచున్ గంసునిన్. ౨౫౩

తే. అంతఁ గంసుఁడు సచివుల నర్హరీతిఁ-గూడి యోజించి పంపె, నక్రూరుఁ బిలిచి
యెంతయును గూర్మి వెలయించి హితము నెంచి-పలికె నీరీతి నప్పు డోపరమమౌని!

మ. "విను మక్రూర! మదాజ్ఞఁ బూని వ్రజమున్ వేగంబె చేరంగఁబో
వనగున్, బొందుగ నందు సద్మమున శశ్వత్ప్రీతి వర్ధిల్లు త
త్తనుజాతు ల్బలరామకృష్ణు లనఁగా ధన్యాత్ములౌ బాలురం
గొనిర మ్మేమిషనైన నిమ్మధురకుం గూర్మిం బ్రబోధించుచున్. ౨౫౫

తే. ఇచటఁ జాణూరముష్టికు లెన్నఁజాలు-మల్లవీరులు గలవారు, మల్లయుద్ధ
మందు వారలఁ బురికొల్పి ప్రమందఁ జేయు-వాఁడ, నాశాసనం బిది త్వర ఘటింపు."

శా. క్రూరాత్ముండగు కంసుఁ డీక్రియను నక్రూరున్ నిజాజ్ఞాక్రియా
చారుంగా నియమించి పంప, రథమున్ శాంతాత్ముఁ డక్రూరుఁ డ
ప్పారోహించి చనెన్ వ్రజంబునకు, నందాగారముం జేరి, య
ద్వీరోత్తంసుల వాసుదేవులను బల్వేడ్కం గనెం బ్రీతితోన్. ౨౫౭

తే. రామకృష్ణుల సన్నిధి నామహాత్ముఁ-డపుడు సాష్టాంగవందన మాచరించి
తాను వచ్చిన కార్యంబు తగ వచించె-నిట్టు లోమునినాయక! హితవు మెఱయ.

తే. "ఆర్యవరులార! రామకృష్ణాభిధాను
లార! బలవంతులార! మీ మామ ఖలమతి
యయిన కంసుండు మధురకు నధికయత్న
మునను దోడ్కొనిరా నన్నుఁ బనిచె నిపుడు. ౨౫౯

క. ఖలుఁడగు కంసుఁడు కడుదు-ష్టుల మంత్రులఁ గూడి యుక్తి చొప్పడ మిమ్మున్
బిలిపించి మల్లయుద్ధము- సలిపించి వధింప నెంచె స్వబలాఢ్యులచేన్. ౨౬౦

సీ. సామాన్యమానవజన్మంబు గలవారు గారు మీ రనియును, గంసుఁడాది
గాఁగల్గు దుష్టుల కాయభారము నోర్వఁబోవారల వధియించి కోరికలర
భూభారమును దీర్ప భువి నిజలీలచే నవతారమందిన యట్టి విబుధ
వరపరిపూజితపరమాత్మమూర్తులు పుంప్రకృత్యాత్ములై పొలుతు రనియు
తే. విన్నవాఁడను సన్నుతిఁగన్న యోగి-వరులవలనను నో దేవవర్యులార!
సత్యముగ భీమవిక్రమసహితు లగుచు-వెలయుదురు మీరు భువియందు విశదకీర్తి.

చ. ఖలమతియైన భూమిపతిఁ గంసునిఁ గాంచి భయంబుచేత గో
కులమున నున్నవారలని కోవిదులార! ఛలంబుతోడ, ని
స్తులముగ మున్ను నందుఁడు యశోదయుఁ జేసిన భాగ్యరేఖ ని
ల్యులఁ గని వారి పోష్యమున నీక్రియ నుండుట యేనెఱింగితిన్. ౨౫౬౨

మ. తొలిజన్మంబునఁ జేసినట్టి సుకృతోద్యోగంబు లెల్లన్ మహా
ఫలముం గూర్చెను, నందదంపతులకున్ భాగ్యంబు చేకూఱె, ని
స్తులపుణ్యప్రదవైభవాఢ్యుల మిమ్ముం జూడంగ సంపూర్ణతన్
గలిగించెన్ జని గోకులంబునను సత్కల్యాణులారా! భువిన్. ౨౫౬౩

మ. ఇపు డాకంసుని శాసనంబునను మీ రేతెంచి నాతోడ స
త్కృప మీరున్ మధురాపురంబునకు నుర్వీభారముం గూర్చు భూ
మిపులన్ దుష్టులఁ గంసముఖ్యులను బల్మిన్ బట్టి నిర్జించి యీ
విపులక్షోణిభరంబుఁ దీర్పుఁడు జగద్విఖ్యాతులారా! వెసన్." ౨౫౬౪

క. అని యక్రూరుఁడు వినయం-బునఁ బలుకఁగ, మధుర కరుగఁ బూర్ణోత్సాహం
బునఁ దలఁచి రామకృష్ణులు-ఘనులం గోపకుల నెల్లఁ గని పలికి రిటుల్. ౨౫౬౫

సీ. "గోపకులార! మీ గోపిక మధురంబులైన గవ్యంబుల ననువుమీఱ
సమకూర్చి, మధురకు సన్నాథుఁ గంసునిఁ గని యిచ్చుటకుఁ బేర్మిఁ జనఁగవలయు,
నుదయంబునన నెల్లి యుద్యమంబున నుండుఁ, డేమును నచట మహీశుఁ గాంచ
నెంచియున్నారము, హితవుగ నిమ్మాట నెంచుఁడీ నిజమని హృదయసీమ"
తే నను చుఁ దెలుపఁగ గోపకు లాత్మఁ జకితు
లగుచు శ్రీరామకృష్ణుల యాజ్ఞరీతి
సర్వయత్నంబులను జేసి సంయమీంద్ర!
యుండిరి ప్రయాణమొనరింప నురుముదమున. ౨౫౬౬

ఉ. అంతఁ బ్రభాతకాలమున నద్భుతమై యధికోన్నతంబునై
యొంతయు నొప్పుచున్న రథ మెక్కి తమిన్ బలరామకృష్ణు, లా
వంతయుఁ జింత లేక మదులన్ మధురాపురి కేగుచుండ, శ్రీ
కాంతుని గోపికాంగనలు గన్గొని యేడ్చిరి తాపసోత్తమా! ౨౫౬౭

సీ. గోపికాకాంతల గొబ్బున నోదార్చి రాసేశ్వరుం డంత రథము నెక్కె,
నందాదిగోపకబృందంబు పెరుగులుఁ బాలు నేతులు జున్నుపాలు వెన్న
మున్నగు గవ్యంబు లెన్నంగఁదగురీతిఁ గంసభూనేతకుఁ గానుకెట్టఁ
గావళ్లతోఁ గొని వేవిధంబులఁ దనవెంబడి చనుదేర విదితబలుఁడు

తే. కడువడిగను నక్రూరుఁడు గడుప రథము
వింతవింతల నలరారు విశ్రుతవన
పంక్తులను త్రోవఁ జూచుచుఁ బరమతృప్తి
మీఱఁ బయనంబుచేసె, నామీఁద వినుము. ౧౨౬౮

క. బలవంతులయిన కృష్ణుని-బలరాముని గొనుచు గోపపంక్తులు వెంటన్
బలసి చనుదేర మథురా-స్థల మక్రూరుండు చేరఁజనియె మునీంద్రా! ౧౨౬౯

కువలయాపీడవధ

ఉ. వచ్చిరి రామకృష్ణులని వైళమ కంసుఁడు నాలకించి లో
కోచ్ఛ్రయగర్వశీలుఁడు దురుద్యమయుక్తుఁడు మూఢబుద్ధియై
సచ్చరితాత్ములన్ వడిగఁ జంపుట యెట్లని యెంచి భావమం
దచ్చపలాత్ముఁ డప్డొక యత్న మొనర్చెను విన్ము నారదా! ౧౨౭౦

సీ. అతిభయంకరమయినట్టి యాకృతితోడ వెలసిన కువలయాపీడ మనెడు
మత్తగజంబును మథురాపురద్వారమందు నిల్పెను, లోకసుందరులగు
బలరామకృష్ణుల వధియింపఁ దగు నిది యను నమ్మకము మీఱ నాత్మయందుఁ
గడుదుష్టబుద్ధియై కానక వారల ఘనమహిమంబు నోమునివరేణ్య!

తే. అంత శ్రీకృష్ణుఁ డామదహస్తిహస్త-మాత్మహస్తంబునను ద్రిప్పి యవనిఁబడఁగఁ
ద్రొబ్బి తచ్ఛిరమును రెండు తుండెములుగఁ-జేసె నవలీలఁ బిడికిళ్ల చేతఁ బొడిచి.

తే. అంత నతిబలవంతులైనట్టి రామ
కృష్ణు లక్రూరసహితులై ప్రియముమీఱ
సింహనాదంబుఁ జేయుచుఁ జెలఁగి యాపు
రముఁ బ్రవేశించి రెల్లరుఁ బ్రమద మొంద. ౧౨౭౧

ఉ. నందుఁడు మున్నుగా యదుజనంబులు గోకులవాసు లెల్లరున్
సందడి లేక కంసనృపసన్నిధిఁ జేరఁగఁబోయి, మ్రొక్కి, యిం
పొందఁగ నద్దురాత్మునకడఁ బూనిక నిచ్చిరి, సంభ్రమాత్ములై
గ్రందుకొనంగ భీతి యొడికంబుగ గవ్యములైన కానుకల్. ౧౨౭౩

చాణూరముష్టికుల కథ

ఉ. భీమపరాక్రమాఢ్యు లతివీరులు రాముఁడు కృష్ణుఁడున్ బల
స్తోములు మల్లరంగమును జొచ్చిరి ముష్టికముఖ్యమల్లు రు
ద్దామమహాబలాఢ్యులయి తమ్ము వడిన్ బిలువంగ, మల్లసం
గ్రామ మొనర్ప వేడ్కఁ గొని, కంసధరాధిపు ప్రేరణంబునన్. ౨౫౭౪

చ. అతిబలశాలి రోహిణికి నాత్మజుఁ డున్నతబాహుశోభితుం
డతులితవీర్యసంయుతుఁడు నా బలరాముఁడు మల్లరంగసం
స్థితుఁడగు ముష్టికాసురునిఁ దీర్పరు లచ్చెరువంద ముష్టిచే
నతికఠినంబుగాఁ బొడిచి యంతకు చెంతకుఁ బంపె వింతగన్. ౨౫౭౫

శా. వీరాకారుని దుర్విచారుని జను ల్వీక్షింపఁ గృష్ణుండు చా
ణూరుం బట్టి యపారమా బలమున న్ద్రిప్పించి పైకెత్తి త
త్నారంబంతయుఁ గ్రుంగిపోవ వసుధం దా వైవఁగా, వాఁడు వి
స్తారాసువ్రజముక్తుఁడయ్యె వెసఁ గంసక్షోణిపుం డార్వఁగన్. ౨౫౭౬

ఆ. అంత రామకృష్ణు లచ్చట నుండిన-మల్లసముదయమును గుల్లచేసి
రాజిలోన మెఱసి యర్ధక్షణంబున-నిజపరాక్రమముల నెఱపి వేడ్క. ౨౫౭౭

కంసవధ

చ. విను మటమీఁదఁ గంసుఁ డతిభీమపరాక్రములైన మల్లురన్
దునిమెను కృష్ణుఁ డంచు విని దుస్సహుఁడై భ్రమఁగూర్చి మంచెమీఁ
ద నిలిచి తన్మృథంబు వడిఁ దాఁ గనఁగోరిక తొందఱింప నె
క్కొను, గడు నక్కజంపడుచుఁ గిల్బిషపూరితచిత్తుఁడై మునీ! ౨౫౭౮

శా. ఆ దుష్టాత్ముఁడు రామకృష్ణుల రణవ్యాపార మీక్షించి, శౌ
ర్యాదుల్ నెమ్మది మెచ్చి, భీతిఁగొని, యోధాళిన్ వడిం జీరి "యే
వాదంబూనక రామకృష్ణుల వెసన్ బాఱంగఁ ద్రోలుండు, దు
ర్మాదు ల్వీర, లుపేక్షసేయకుఁ, డెదన్ మానంబుఁ గాపాడుఁడీ! ౨౫౭౯

క. దురితాత్ములైన గోపవి-సరముఁ దండించువాఁడ, సకళత్రుని ము
ష్కరచిత్తు నందుఁ జంపెదఁ,-ద్వరితగతిం జేయుఁ డేను బనిచిన పనులన్."

ఉ. ఈవిధిఁ బల్కు కంసు ఖలు నేత్తఱఁ గృష్ణుఁడు చూచి వ్రేల్మిడిన్
దేవహితంబుఁ దీర్పఁగ మదిం దలపోసి, ప్రపంచభీతిదం
బై విలసిల్లు నాకృతిని నద్భుతరీతినిఁ దాల్చెఁ, గాళికా
దేవి యనంగ లోకములఁ దేజము మించఁగ నంత నారదా! ౨౫౮౦

తే. కాళికాదేవి యప్పుడు ఖలమతియగు-కంసు కేశపాశము వామకరముచేతఁ
బట్టి వడి లాగి ఖడ్గంబుఁ బట్టి సవ్య-హస్తమునఁ దచ్ఛిరంబును నట్టె త్రుంచె.

తే. కాళికారూపమున దుష్టుఁ గంసుఁ జంపి
యపుడె తొల్లింటి కృష్ణదివ్యాకృతి నాగిఁ
దాల్చి వానిని జూడఁగాఁదలఁచి నాట్య
మాడె భువిమీఁద రామునితోడఁ గూడి. ౨౫౧౩

ఉ. నందుఁడు మున్నుగా వ్రజజనంబులు చిత్తములందు నిండి యా
నందము పొంగుచుండఁగ రణస్థలిఁ బిల్లనఁగ్రోవు లూఁదుచున్,
క్రందుగఁ దూర్యనాదముల గారవమొప్పఁగఁ జేయుచున్, గనన్
విందొనరించు కృష్ణుఁ గని వేడుక నాట్యములాడి రోమునీ! ౨౫౧౪

క. సురవరులు సంతసంబునఁ-గురిపించిరి పుష్పవృష్టి, గొబ్బున దిక్కుల్
పరికింపఁగ విశదములై-వరుసన్ శాంతంబు లగుచు భాసిల్లె మునీ! ౨౫౧౫

దేవకీ వసుదేవుల విముక్తి

ఆ. అంత నిగడబద్ధులౌ దేవకీవసు-దేవులకును భక్తి సేవచేసి
బంధమోచనంబు వడిఁ జేసి శ్రీకృష్ణుఁ-డాచరించె వినతు లతిముదమున.

చ. తనయుల రామకృష్ణులను ధన్యుల రమ్యముఖాంబుజన్ములన్
గనుఁగొని హర్షబాష్పములు గన్నుల నిండఁగఁ దల్లిదండ్రు లా
య్యెనఁ దమ యంకసీమలకు నాదృతిమీఱఁగఁ జేరఁదీసి యో
మునివర! సంతసంబునను బొంగిరి యాత్మలయందు నెంతయున్. ౨౫౧౭

సీ. కంసుని భార్యలు ఘనతరభర్తృశోకమున మోహితలయి ధూస్థలిఁ బడి
కరములతోడ వక్షముల శిరమ్ములఁ గడు మోఁదుకొనుచు లోఁ గలఁత పొరయ
నేడ్చుచునుండిరి, కృష్ణుఁడు వారల నతిశయప్రీతిమై హితవచనము
లను నూఱడించి, చయ్యన నుగ్రసేనమహారాజుఁ దద్రాజ్యమందుఁ గరుణ

తే. నరసి యభిషేక మొనరించె, నంత బాష్ప
పూర్ణనయనుని నందునిఁ బొడఁగని వసు
దేవుఁ డాలింగనమొనర్చి తృప్తిపఱచి
ప్రియవచనములఁ బలికె సంప్రీతితోడ. ౨౫౧౮

క. "చెలికాఁడ! నంద! నాతన-యులు త్వన్మందిరమునందు నుల్లాసమునన్
శెలఁగుచు వసియించిరి, నీ-వలదుచుఁ దండ్రివలెఁ బ్రోచి తధిక ప్రీతిన్. ౨౫౧౯

క. నీపత్నియగు యశోదయు-నాపుత్త్రునిఁ దనదు కూర్మినందనురీతిన్
గాపాడినదెంతయు, మీ-గోపిక నాసుతులఁ బెంప నొప్పిరి వేడ్కన్. ౨౫౨౦

క. తలిదండ్రులు మీరలు వా-రలకును నాకును దలంప రమ్యగుణాఢ్యుల్,
లలితాత్మ! బాంధవుఁడ వీ-యిల నీవే నాకు ననుచు నెంతును సతముల్.

చ. విను మొక విన్నపం బిపుడు విశ్రుతసత్కరుణామయాత్మ! నా
తనయులు రామకృష్ణులను దాల్మి వహించి మదీయసద్మమం
దున దయతోడుతన్ విడిచి తొందఱ లేని మనంబు మీఱఁగాఁ
జనుము వ్రజంబుఁ జేరఁగ, వ్రజవ్రజయుక్తుఁడవై ప్రియంబునన్. ౨౫౯౨

క. మది నాప్రియముం గోరుచుఁ-గొదువ యొకించుకయుఁ గొనక కొందలపడ కీ
య్యదనున నిచట యశోదకుఁ-బదిలంబుగఁ దెలుపు నేను పల్కిన పల్కుల్."

సీ. నారదా! విను మంత నందుఁడు వసుదేవుఁ డాడిన పల్కుల నాలకించి,
యశ్రుపూరితనయనాబ్జుఁడై దీర్ఘనిశ్వాసంబు విడుచుచు బలునిఁ గృష్ణుఁ
గనుఁగొనె నప్పుడు మునినాథ! నిశ్చలంబయినట్టి చూపులతో, నంత రామ
కృష్ణులు సాశ్రుపరీతనేత్రులు నయి బాష్పగద్గదమగు వాక్కుతోడ
తే. నందుని గుఱించి పలికిరి డెందమునకు-నెమ్మదిం గూర్చునట్లుగ సమ్మదంబు
మానసంబులఁ బొదలఁగ మమత వెలయ-నచట దుఃఖించువారల యాత్మ లలర.

మ. "జనకా! నంద! కలంతఁ బూనకుము నీ స్వాంతంబునం, దేము మా
జననిన్ నిన్నుఁ గనుంగొనంగఁ దమి మించన్ గోకులంబుం బ్రియం
బునఁ జేరం జనుదెంచువారము, ముదంబుం బొందుమా, వే వ్రజం
బునకుం బొమ్ము, యశోదతోఁ దెలుపు మీపూన్కిన్ గృపన్ ధీరతన్."

చ. తనయులు రామకృష్ణు లిటు తన్ దెలుపంగ నె, నందుఁ డెంతయున్
దన మది క్షోభమందఁ బటుధైర్యము వీడి, వియోగదుఃఖ మా
త్మను గడు ముంప వందురుచుఁ దా వ్రజవాసులఁ గూడి గోకులం
బునకును నారదా! యపుడు పుత్త్రుల మాటికిమాటి కెంచుచున్. ౨౫౯౬

ఉ. నందుఁడు మున్నుగా వ్రజజనంబులు వచ్చుటఁ గాంచి, గోపికా
బృందము రామకృష్ణుల సువేషవిభూషితగాత్రులన్ మహా
నందముఁ గూర్చు రమ్యవదనప్రభులం గన కప్డు డెంతయుం
గొందలమందుచుండి రిదఁ గుందితలై మునినాయకోత్తమా! ౨౫౯౭

చ. ఉరుతరభక్తిసంయుతుని నుద్ధవుఁ గృష్ణుఁడు పంపె గోపికా
తరుణుల నూఱడింపఁగ నెదం దలపోసి, వ్రజంబుఁ జేర స
త్వరమున నాశ్రితావనసుభావుఁడు శ్రీకరుఁ డెంచి యాత్మబం
ధురవిరహాతితప్తలను దొరపుఁ బ్రీతిని నాదరించుచున్. ౨౫౯౮

ఆ. ఉద్ధవుండు మిగుల నుత్సాహమున గోకు-లంబునందు వ్రజనితంబినులకు
సాధురీతిఁ గృష్ణు సందేశమును దెల్పి-యూఱడించె మనము లుల్లసిల్ల. ౨౫౯౯

సీ. అంతట వసుదేవుఁ డార్యసంపూజ్యు గర్గాచార్యు మునివరు నధికభక్తిఁ
బిలిపించి పూజించి విధియుక్తముగ ద్విజసంస్కారముల నాత్మసంభవులగు
బలకృష్ణుల కొనర్పఁ బ్రార్థించె, నాచార్యవరుఁ డొనరించెఁ దద్వాంఛ నెలమి,
నానకదుందుభి యంత వారల ధనుర్వేదాదివిద్యల విశదరీతి

ఆ. నభ్యసింపఁ జేసె, నధిక తేజోవంతు-లయిన రామకృష్ణు లఖిలవేద
ములను శాస్త్రములను బూర్ణంబుగా నేర్చి-మించి రెల్లవారు మెచ్చుకొనఁగ.

క. మునినాథా! నారద! యి-య్యనువున బలరామకృష్ణు లానందంబున్
జెనుపొందఁ జేయుచును బం-ధునికరమున కెల్ల నమ్మథుర నుండి రొగిన్.

ఏఁబదియైదవ అధ్యాయము

శిశుపాలవధ – పాండవపరాజయము

తే. శ్యామసుందరరూపిణియైన యాది-శక్తి భగవతి యీరీతి ఛలముఁ దాల్చి
దుష్టచిత్తులఁ గంసాదిదురితచరితు-లను నవనిభారతనుల వేడ్కను వధించె.

మ. మునినాథా! పరదేవి యావిధమునన్ భూభారముం గూర్చు దు
ష్టనికాయంబు వధింపఁగా సమయముం జక్కన్ నిరీక్షించు చో
య్యన రాముం దమ్ముఁగూడి యమ్మధురలో నత్యంతమోదంబు నె
మ్మనమందుం గనుచున్ వసించెఁ గడు రమ్యంబైన రూపంబునన్. ౨౬౦౩

ఉ. భూతలమందు శంభుఁడును బుట్టెను నెన్మదిరూపులన్
బ్రీతియొసంగఁ గృష్ణతనువిశ్రుతయై వెలుఁగొందు దేవినిన్
ఖ్యాతిఁ బరిగ్రహించుటకు నాత్మఁ దలంచుచు యుక్తకాల మెం
దేతఱి వచ్చునా యనుచు నెంచుచు నుండెను దంఢ్రియింటిలోన్. ౨౬౦౪

క. హరియును నాయనువున ని-ర్జరవరునంశమునఁ బుట్టి జగతిని గుంతీ
తరుణికి, సోదరయుతుఁడై-కరినగరమునన్ వసించెఁ గౌతుకమొప్పన్. ౨౬౦౫

చ. అతిబలవంతులైన తన యన్నలుఁ దమ్ములుఁ బ్రేమఁ జూడ నీ
క్షితిఁ దగి యర్జునాహ్వయముఁ జెంది సమస్తశాస్త్రపూర్ణుఁడై
యతిశయబుద్ధిశాలి యయి యార్యులు మెచ్చఁ బఠించి శాస్త్రసం
తతులను మేటియై వెలసెఁ దా విలువిద్య గడించి నేర్పునన్. ౨౬౦౬

సీ. అర్జును సోదరు లమితబలాఢ్యులై యెసఁగుచు నుంద్రు, మునీంద్ర! వారు
భీమపరాక్రముల్ ప్రియసత్యవచనులు ధర్మపుత్త్రాదులు ధర్మనిరతు
లనఁదగి పాండురాజాగ్రణికిని బుత్త్రులై కడు విఖ్యాతి యౌవనమున
నలరారుచుండిరి యఖిలరాజ్యంబు నా కర్పింపఁ గోరిక గలిగి యపుడు,

తే. ధార్తరాష్ట్రులు బలయుతుల్ ధార్ష్ట్యమునను
బాండవులతోడఁ బగఁబూని పటుతరమగు
యుక్తి రాజ్యంబు హరియింప నూహచేయు
చుండి రోమునినాయకా! యుద్ధతగతి. ౨౬౦౭

తే. శకునికర్ణులతోఁ గూడి సంతతంబు–తాను దుర్యోధనుండు మంతనముచేయుఁ
బాండవుల నెల్ల సమయింప వలనుమగిడిఁ–బూనియత్యంతముష్కరబుద్ధియగుచు.

మ. దురితాత్ముం డవినీతియుక్తుఁ డగు నాదుర్యోధనుం డిచ్చ స
చ్చరితశ్రేష్ఠులఁ బాండురాజసుతులం జంపంగ యత్నించి తా
గరళంబుం దినిపించె, నంతట ననేకక్రూరయత్నంబులన్
జరిపించెన్, విఫలప్రయత్నుఁడగుచున్ శాంతింపఁడో నారదా! ౨౬౦౮

మ. సకలక్షత్రియవంశనాశనము నిచ్చల్ చేయ సంసిద్ధమై
వికలప్రక్రియ నున్న వాని మతమున్ వీక్షించి, శ్రీకృష్ణుఁడో
పిక నక్రూరునిఁ బంపె, నందుఁ గల తద్వృత్తంబు సర్వంబుఁ దీ
ర్చి కడు న్నేర్పున రమ్మటంచు నడి సంప్రీతిం గ్రియాదక్షుఁడై. ౨౬౧౦

క వరగుణుఁ డక్రూరుం డు–త్తరుణమున నె కృష్ణునాజ్ఞఁ దలఁదాలిచి, యా
కరినగరంబునకుం జని–పరికించెను ధార్తరాష్ట్రవైఖరి నెల్లన్. ౨౬౧౧

క. అంతట ధృతరాష్ట్రునితో–నంతయుఁ దెలుపంగఁగోరి యాదృతిని దదీ
యాంతికమునకుం జని ధీ–మంతుం డిట్లనుచుఁ బలికె మాన్యత దోఁపన్.

సీ. "ఓమహారాజ! నిత్యోదయసుగుణవిచిత్రవీర్యాత్మజ! చిత్తగింపు,
నీయాత్మజులఁ బాండునృపతినందనులపై ద్వేషంబు వారింపఁ దెలుపవయ్య!
స్నేహంబుఁ బెంపొంద నియతి యత్నింపుము, పాండవులకుఁ దండ్రి బాల్యముననె
గతియించె, వారికి గతి నీవె కావున వారలఁ బుత్త్రులవైఖరిఁ గని

ఆ. పోషణంబు చేయఁబూనుము, నీయాత్మ–జులను బాండవులను జూడు భేద
బుద్ధి విడిచి, సమత పొలుపొందఁగా ననా–థులగు బాండుపుత్త్రులకును బ్రీతి.

క. పరమప్రీతిని రాజ్యం–బిరనుం దగ ననుభవింపఁ దివురుము రాజా!
సరి యెవ్వా రుండరు నీ–కరయఁగ నీధరణియందు నైశ్వర్యమునన్." ౨౬౧౨

క. అనవుడు ధృతరాష్ట్రుం డి-ట్లను "నక్రూరా! వినాశనావహామగు వై
రనియతి నాసుతులకుఁ గ-ల్గిన పాండవులందు నదియుఁ గీడని యెంతున్.

మ. మది నట్లయ్యును బుత్త్రవత్సలత సమ్మానింపఁగా నన్ను న
భ్యుదయం బెప్డు మదీయనందనులపై యొప్పారఁగా వారిఁ గాం
చెద నక్రూర! ప్రియంబుతోడుత నె నాచిత్తంబునన్ వీడ న
య్యుదనం గోర నిఁకేమి చేయఁగలనో యార్యా! స్వభావం బిదా."

క. నావుడు నక్రూరుఁడు త-ద్భావంబును దెలిసి నారదా! శ్రీకృష్ణున్
సేవించి వృత్తమంతయుఁ-దా వివరించెఁ గడుభక్తి దళుకొత్తంగన్. ౨౬౧౮

సీ. అక్రూరు మాటల నాదృతి నాలించి పద్మపత్త్రాయతభవ్యనయనుఁ
డయిన కృష్ణుండు దా నాలోచన మొనర్చె, "స్థిరముగ నిఁకఁ గురుక్షేత్రమందు
క్షత్త్రియసమితికి సమరంబు గలిగెడు సౌబలుం డయినట్టి శకునియు, మఱి
దుష్టచిత్తుండగు దుర్యోధనుఁడు మున్నుగాఁగల్గువారల కారణమున
తే. నధికమగు వైరమున"నంచు, నంత దివ్య-మయి విధాతృవినిర్మిత మయి వెలుంగు
ద్వారకాపురిఁ జేరె యాదవులతోడఁ-దమి నివాసార్హ మని యెంచి తాపసేంద్ర!

రుక్మిణీ వివాహయత్నము

ఉ. అంత విదర్భరాజు తన యాత్మజగాఁ బరదేవియంశచే
నెంతయుఁ బుట్టినట్టి పరమేశ్వరి రుక్మిణి పెండ్లికై మహీ
కాంతుల నెల్లరం బిలిచె, గారవ మొప్ప స్వయంవరంబు సు
స్వాంతముతో నొనర్పఁగను భావమునందున నెంచి నారదా! ౨౬౧౯

క. నానాదేశనివాసులు-క్ష్మానాథకుమారు లింపుమై వచ్చిరి ని
త్యానూనవైభవంబున-నానగరికి భీష్మకునకు నాదృతి వెలయన్. ౨౬౨౦

తే. భీష్మకసుతుండు రుక్మి దుర్వృత్తియుతుఁడు
గలఁడు, సోదరి రుక్మిణీలలనఁ జైద్యుఁ
డయిన శిశుపాలున కొసంగ నాత్మఁ దలఁచి
యుత్సుకుండయి మఱియుఁ దా నుద్ధతుఁడయి. ౨౬౨౧

తే. పితరుల ననాదరముచేసి పిలువఁడయ్యెఁ-గృష్ణుపై వైరమును గొని ప్రీతిఁ దత్స్వ
యంవరంబున కతిదృప్తుఁడగుచు మౌని-వర్య! విను మంత జరగిన వార్త యెల్ల.

మ. బలవంతుండగు చైద్యుఁ డంతయును దా భావించి రుక్మిక్రియా
దుల నారుక్మిణిఁ బెండ్లియాడఁదగురీతుల్ మానసంబందు ని
స్తులసేనాయుతుఁడై విదర్భపురికిం దోర్వీర్య ముప్పొంగఁ బెం
కులరన్ దివ్యసువేషభూషితతనుండై వచ్చె మౌనీశ్వరా! ౨౬౨౩

చ. మునివరుఁడైన నారదుఁ డమోఘవచస్కుఁడు ద్వారకాపురీ
శుని ఘనుఁ గృష్ణమూర్తిఁ గని శోభనగాత్రికి భీష్మపుత్త్రికిన్
వనరుహపత్రనేత్రకు వివాహము మిక్కుటమైన వైభవం
బున జరుగంగ నున్నదని మోదము మీఱఁగఁ దెల్పెఁ దాపసీ! ౨౬-౨౮

సీ. వివిధంబులయినట్టి భేరీమృదంగపణవదుందుభిప్రముఖవరవాద్య
ములతోడ భీష్మకభూపతిపురమున నమితోత్సవంబుల నలరు రుక్మి
ణీస్వయంవర మని నెమ్మది నెఱఁగి నారదముఖంబున నంతఁ బ్రమదమునను
శ్రీకృష్ణదేవుండు శీఘ్రంబుగా దివ్యరథముపై నెక్కి, తద్రాజధాని
తే. కొగిఁ బ్రయాణంబు గావించె నుత్సుకుఁడయి,
యంతఁ దత్పురమును జేరనరిగి, గగన
మార్గమున నిల్పి యచ్చట క్ష్మాధిపసుత
తతిని గని యందుఁగల్గు సందడి నెఱింగి. ౨౬-౨౯

శ్రీకృష్ణుఁడు రుక్మిణిం గొనిపోవుట

చ. అతిరుచిరంబులై వెలయునట్టి విభూషలఁ దాల్చి, రమ్యవే
షతఁ దనరారుచున్న నృపసంతతులం గని నవ్వి, చారుశిం
జితవరనూపురాంచిత, విశేషవిభూషితఁ, బద్మనేత్ర, న
ద్భుతగుణరూప రుక్మిణిని మోదమునం బొడఁగాంచె నారదా! ౨౬-౨౬

సీ. ఆదరంబున సుందరాంగులవెంట దుర్గాంబ నర్చింపఁగా నరుగుదాని,
నేకాంతమునఁ గృష్ణు నెలమితో ధ్యానించు చాత్మను మఱచుచు నలరుదాని,
మందయానంబుచే నందంబుగుల్కు హంసావళి నిరసించునట్టిదాని,
శ్రీకృష్ణుఁ డెప్పుడు చేరు నిచ్చటి కని యనిశంబు వాంఛించునట్టిదాని
తే. రుక్మిణిఁ గాంచి యెల్లపౌరులుఁ గలంగఁ-గృష్ణదేవుండు మనమున హృష్టుఁడగుచుఁ
జెలఁగుచును జేరి రథముపైఁ జేర్చె నెల్ల-వారు చేయంగ హాహారవంబు లపుడు.

మ. మది సంక్షోభముఁ జెందఁ గ్రుద్ధులగుచున్ క్ష్మానాథు లాకృష్ణు ను
న్మదులై దివ్యశితాస్త్రపాణులయి యుద్యద్బాహువీర్యప్రభా
భ్యుదయం బేర్పడఁ జుట్టుముట్టికొనఁగా, నూహించి, శ్రీకృష్ణుఁ డ
య్యదనన్ వారలఁ గాంచి భీతిలక రోషావిష్టుఁడై పెంపునన్. ౨౬-౨౭

చ. వడి శిశుపాలముఖ్యుల నవారితుఁడై యట నిల్వరించి, యు
ప్పుడ మొగిఁ దచ్ఛరాదులను భూమినిఁ ద్రెళ్ళఁగ నేసి, సిగ్గునన్
మెడలను వంచి వారు పుడమిం గనుగ ట్లొనరించి, యంతఁ దాఁ
బడఁతుకఁ గొంచు నాత్మపురవర్యముఁ జేరె మహేంద్రుచాడ్పునన్. ౨౬-౨౫

తే. ఈవిధంబున శ్రీకృష్ణుఁ డెలమి శంభు-నంశఁ బుట్టిన సప్తకన్యకల జాంబ
వతి మొదలుగాఁ జెలంగెడివారిఁ బెండ్లి-యాడె వైభవయుక్తుఁడై యతిముదమున.

ఉ. ఎంతయు వేడ్కఁ గృష్ణుఁడు మహీతిలకంబగు ద్వారకాపురిన్
సంతసమొప్పఁ బెండ్లియయి చానలఁ బల్వుర నిట్లు తృప్తుఁడై
స్వాంతమునందు సంతతము వారలఁ గూడి వసించె నారదా!
యింతలువింతలై చెలఁగు విశ్రుతలీలల నోలలాడుచున్. ౨౬౩౧

చ. సమరములందు వీరులగు శాత్రవసంతతులం జయించి, దు
ర్గముల నడంచి, ద్వారకను దాఁ బ్రియమొప్పఁగఁ జేరి, గోపికా
సమితిని బత్నులన్ సతము సంతసమందఁగఁ గూడి, క్రీడలన్
సుమధురరీతి సల్పుచు విశుద్ధతనుం డయి యుండె నారదా! ౨౬౩౨

సీ. ఆద్వారకాపురియందు రాజేంద్రత్వమంది సంసారియై యనవరతము
పుత్రపౌత్రాదిసమూహంబుతోఁ గూడి వృష్ణివంశ్యులతోడ విపులసమ్మో
దంబునఁ జెన్నొంది ధ్యానింపఁగా సురల్ వసియించెఁ గృష్ణుండు వైభవమునఁ
బెండిలియయ్యెను బెక్కుర భార్యల, వారలయందు నపారకరుణ

తే. వేలకొలఁదిగఁ బుత్త్రుల వితతమహిమలఁ-బడసె, రణదుర్జయుండగు భౌముఁ జంపి
సుందరాంగుల నత్యంతసుగుణమణుల-వేలకొలఁదిగఁ గన్యలఁ బెండ్లియాడె.

ధర్మజ రాజసూయము

తే. ఇవ్విధంబున నుండఁగా నిభపురమునఁ-బాండవులు దుర్జయంబయి పరఁగు శస్త్ర
విద్య సంపూర్ణముగ నేర్చి పిలువనంపి-రాదిదేవుని శ్రీకృష్ణు నతిప్రియమున.

సీ. సమరంబు నొనరింప స్వాంతంబులం దెంచి యోజింపఁ దను బిల్చి రుత్సుకులయి
యని యెంచి శ్రీకృష్ణుఁ డాక్షణంబునఁ గరిపురమున కరిగి సంబరమువీఱ,
ధర్మరాజును గాంచి తగురీతి మన్నించి రాజసూయమహాధ్వరంబుఁ జేయు
టను విని యుపదేశ మొనరించె, రాజవంశ్యుల నాశనంబును దలఁచి, కౌర

తే. వులకు ద్వేషంబుఁ బెంపఁగా నలఘురీతిఁ-దగు నటంచును యోజించి తానె యజ్ఞ
మునకు నధ్యక్షుఁడై క్రతువును నొనర్పఁ-బూనెను యుధిష్ఠిరునిచే ననూనభక్తి.

ఆ. దిగ్విజయము చేయ దృఢపరాక్రమవంతు-లయిన భీమసేనుఁ డాదిగల్గు
సైన్యయుతులఁ బంపె క్షత్త్రియసందోహ-ములను గెల్చి విత్తముల గ్రహింప.

చ. మనములఁ గృష్ణునాజ్ఞ ననుమానముఁ బూనక తాల్చి యప్పు డే
పునఁ జని భీమసేనముఖభూరిబలాఢ్యులు దిక్కులెల్ల నా
య్యనఁ జరియించి, రాజుల ననర్గళరీతిని గెల్చి, దర్పవం
తు నమితవీర్యు మాగధుని దోర్బలుఁ దత్పురిఁ జూచి రుద్ధతున్. ౨౬౩౩

సీ. మునినాథ! మాగధుం డనుపమబలశాలి భూపతులను గెల్చి భూరిశక్తిఁ
దన పురంబునఁ జేర్చి దయ లేక బాసిల్లు, నట్టి జరాసంధు యదుకులవిభుఁ
డయిన శ్రీకృష్ణుండు భయమించుకయు లేక యుద్ధరంగమున సముద్యతుఁడయి,
భీముని మున్నిడి భీమబలంబున శూలంబు వైచి నిష్ఠురతఁ బడమిఁ

ఆ. బడెడున ట్లొనర్చెఁ బరమాద్భుతక్రియా-దక్షుఁ, డధికనిష్ఠ ధర్మరాజు
పిలువఁబంపి రాజవీరులఁ గ్రతురాజ-మయిన రాజసూయ మాచరించె. ౨౬౩౯

తే. రాజసూయంబునందు ధర్మజుఁడు తమ్ముఁ-డైన సహదేవు బుద్ధిమదగ్రగణ్యు
నధ్వరాహూతమగు సదస్యార్చనంబు-సలుప ను త్తర్వు గావించె సంయమీంద్ర!

చ. నరపతులెల్లఁ జూడఁగ ననంతగుణాఢ్యునిఁ గృష్ణు భక్తిసం
భరితసుచిత్తుఁడై సలిపెఁ బ్రాజ్ఞులు మానులు సమ్మతింప సం
బరమున నగ్రపూజనము పార్థివముఖ్యులు మెచ్చుచుండఁగాఁ
బరమమునీంద్ర! యంత శిశుపాలుఁడు గాంచి తదర్వాకృత్యమున్. ౨౬౪౦

చ. పటుతరకోపయుక్తుఁడయి పల్మఱు ధర్మజుఁ గృష్ణు యజ్ఞమున్
గుటిలత నిందచేసి, బుధకోటి కనుంగొన దుష్టవృత్తియై
చటులతరప్రచారమును జల్పఁగ, భూమికి భారభూతు ను
ద్భటుఁ దలఁదున్మెఁ గృష్ణుఁడు సభన్ నృపులెల్లరుఁ జూచుచుండఁగన్. ౨౬౪౧

సీ. ఆయజ్ఞవైభవం బంతయుఁ గనుఁగొని యత్యంతదుష్టాత్ముఁడయిన ధార్త
రాష్ట్రుండు మఱియుఁ గ్రూరస్వాంతుఁడగు కర్ణుఁ డాత్మల నతితప్తు లయిరి మౌని!
కుటిలప్రవృత్తు శకుని సౌబలుని మేనమామను గనుఁగొని మంతనంబు
సలిపి యత్యధిక తేజస్కుఁడు ధర్మరాజును జేరి పణ మొడ్డి జూదమాడె,

తే. రాజరాజు దుర్యోధనప్రభుఁడు కపట-మున జయించె యుధిష్ఠిరు భూరిరాజ్య
మెల్ల, నెల్లరుఁ గనుచుండ నెసఁగి దాస్య-మునను నవినయశీలుఁడై మునివరేణ్య!

తే. తాను జేసిన శపథంబుఁ బూని, ధర్మ-రాజు రాజ్యంబు సర్వంబు క్రమముతోడ
నిచ్చె దుర్యోధనునకు,దుష్టేచ్ఛ మీఱు-వాఁడు తృప్తిని గనక యవారితుఁడయి.

ధర్మజుఁడు జూదమాడి యోడుట

తే. మరల జూదంబు నాడ ధర్మజునిఁ బిలిచె,-నమ్మహారాజు ధర్మాత్ముఁ డగుటకతన
ధర్మమును దాఁటఁగా నోడి ధర్మబుద్ధి-సమ్మతించెను ద్యూతంబు సంయమీంద్ర!

తే. ధార్తరాష్ట్రుఁడు మరల జూదంబు నాడు-నపుడు దుశ్శీలుఁ డయి సమయంబు చేసె,
దారుణంబయి యెసఁగునద్దాని వినుము,- తెలుపుచున్నాఁడ నారదా! దివ్యమౌని!

క. ''ఓడినవాఁ డోగిఁ బండ్రెం-డేఁడులు వని నుండి, యొక్క-యేఁడు నగరిలో
జాడ యెఱుఁగంగ రానటు-లోడక వసియింపవలయు నురునియమమునన్.''

మ. సమయం బీక్రియఁ జేసి, జూదమును నుత్సాహంబుతో నాడ ను
ద్యమ మొప్పంగ యుధిష్ఠిరుండు మునివర్యా! యోడెఁ దా ధార్తరా
ష్ట్రమహీనాథున, కంత నా కుమతి ధర్మద్రోహి యుప్పొంగి యా
సమయంబందు యుధిష్ఠిరప్రియసతిన్ సభ్యు ల్విలోకింపఁగన్. ౨౬౪౭

తే. ద్యూతసభకు రప్పించి సముద్ధతుఁడయి-భగవతిని ద్రౌపదిని గెల్చి పరిభవంబు
చేసె మదిలోనఁ గనక దుశ్శీలుఁ డంత-నాసుయోధనుఁడలరి యోయార్యవినుత!

చ. అనిమిష వాహినీతనయుఁ డాదిగ నెల్లరుఁ గ్రూరకార్యముం
గనుఁగొని నిశ్చయించి రెదఁ గంటకుఁ డీకురురాజనందనుం
డెనయఁగ క్షత్రియాన్వయుల కెల్లను నాశనకారి యౌనటం
చును, మునివర్య! యీఖలుని చొప్పున కద్భుతమందు చొక్కుటన్. ౨౬౪౮

తే. అంతఁ బాండవదేవి యైనట్టి ద్రౌప-దిని మరలఁ బాండవుల కిచ్చి దృప్తు దుష్ట
చిత్తు దుర్యోధనుని దుష్ప్రవృత్తిఁ దిట్టి-రాయతవ్రతులైన భీష్మాదు లార్య!

చ. మునివర! పాండునందనులు భూమిపతిత్వముఁ బాసి, భ్రష్టులై,
మును పొనరించినట్టి వ్రతమున్ బరిపూర్తియొనర్పఁ గాననం
బున వసియింప బంధుగణముల్ దమవెంటను రాఁగ నేగి బ
ల్వినయము మీఱఁగా సమయవీక్షణతత్పరు లౌదు రాత్మలన్. ౨౬౫౧

ఉ. ద్వారకలోనఁ గృష్ణుఁడు నివాసమొనర్చెను భావమందు భూ
భారము మాన్పఁగా నిదియె పద్ధతి చక్కని దంచు నెంచి, యీ
కారణ మున్నతం బగుటఁ గన్గొని యాశ్రితరక్షణక్రియన్
నారదమౌనిచంద్రమ! యనంతమహామహిమాఢ్యుఁ డెంతయున్. ౨౬౫౨

ఏఁబదియాఱవ అధ్యాయము

పాండవుల యరణ్యవాసము

సీ. కపటజూదంబునఁ గౌరవపాళిచే రాజ్యంబు గోల్పోయి పూజ్యమతులు
పాండుతనూజులు వనములఁ దిరుగుచుఁ జాలకాలంబును జరపి రంత,
నెచ్చోట మున్ను దా నీశ్వరుం డఖిలదేవాధిదైవతసమూహంబు గొలువఁ
దప మాచరించెఁ బ్రత్యక్షఫలం బిచ్చు భగవతిం గూరిచి పరమనిష్ఠ,
తే. యోనిపీఠమునం దుండు యోగమూర్తి-యెచట నచ్చోటు పాండవు లెలమిఁ జేరఁ
బరమభక్తిని గామాఖ్య వఱలు లోక-జననిఁ గాంచంగ వచ్చిరి సంభ్రమమున.

చ. సురుచిరధర్మతత్పరులు సూనృతు లాపరదేవిభక్తిసం
భరితమనస్కులై విశదభద్రవిధాయిని నాగమోక్తమా

సరణిని బూజచేసి మది సల్పిరి ప్రార్థన ''మంబ! రాజ్యమున్
వరముగ నిమ్ము మాకు సురవంద్య!'' యటంచును నిశ్చితాత్ములై. ౨౬౫౪

చ. విను మునినాథ! పాండవులు వేఁడిరి దేవిని ''తల్లి! సంగరం
బున నతిదారుణాత్ములయి పొల్పు విరోధుల దుష్టభావులన్
వినయవిదూరులన్ సచివబృందసమేతముగాఁగఁ జంపఁగా
ననితరవీరలభ్యమయినట్టి బలంబు నొసంగు'' మం చెదన్. ౨౬౫౫

ఆ. పరమభక్తితోడఁ బ్రార్థించు నమ్మహా-త్ములకుఁ బాండవులకు నాదిశక్తి
పరమకరుణ నపుడు ప్రత్యక్షమై యిట్లు-పలుకఁదొడఁగె మధురభాషణముల.

చ. ''కురుకులకీర్తివర్ధన! యకుంఠితవైభవ! ధర్మపుత్త్ర! బం
ధురసుగుణాభివందిత! వినూత్నమహోదయ! దుర్మదాంధులై
పరఁగెడు ధార్తరాష్ట్రుల నవారితరీతిని జంపి యెల్లరన్
దిరముగ రాజ్యమేలుదు వుదీర్ణత గెల్చి ప్రతిజ్ఞ నెంతయున్. ౨౬౫౬

మ. ధృతరాష్ట్రాత్మజులన్ దురాత్ములను గోర్వీర్యాఢ్యులన్ సంగర
క్షితి వీరుల్ భవదీయసోదరు లొగిన్ జెండాడి తత్సైన్యసం
తతితోడన్ భువిఁ గూల్పఁగాఁగలరు, దత్సాహాయ్యముం గోరి పు
ట్టితిఁ బుంరూపున దేవకీసతికి నారేవం గనంజేయుచున్. ౨౬౫౭

తే. సురలు లోకహితార్థమై స్తుతులుచేయ
నవతరించితి, హరియు నీయనుజుఁ డగుచుఁ
బుట్టె నర్జునుఁ డనఁగ నీ భూమిభార
మణఁపఁగా నెంచి భక్తి నా యాజ్ఞఁ బూని. ౨౬౫౮

సీ. కృష్ణరూపంబునఁ గీర్తింపఁబడుచున్న యేను సాహాయ్యంబు నిద్ధరిత్రిఁ
జేయంగ నర్జునుఁ జేరిచి ముందు భీష్మద్రోణముఖ్యుల క్షత్రియగణ
వీరుల, నితరులౌ వివిధదేశాధీశులను గురుజాంగలులను వధింపఁ
గలదాన , మఱియు నిస్తుల పరాక్రముఁడగు వాయునందనుఁడు నీభ్రాత భీముఁ
తే. డడరి ధృతరాష్ట్రసూనుల నందఱను ర-ణాంగణంబునఁ జంపు నోయార్య! నీదు
తమ్ము లితరులు వసుమతీధవుల వేల-కొలఁది భూభారకుల ననిఁ గూల్పఁగలరు.

ఉ. భారతయుద్ధమందు జనపాలకులౌ ధరణీశులెల్ల దో
స్సార మడంగి రూపఱఁ బ్రశస్తతమంబగు రాజ్య మెంతయున్
గోరిక మీఱఁ బొందుదువు, కూడదు సందియ మాత్మ నీకు, వి
స్తారకృతీ! మదీయకృప ధన్యుఁడ వౌదువు పేర్మి నీక్రియన్.'' ౨౬౬౦

తే. వినుము నారద! భగవతీఘనకృప వర-మును యుధిష్ఠిరుఁ డీవిధంబున గ్రహించి
కడుఁ బ్రసన్నాత్ముఁడై భక్తికలితుఁ డగుచు-సకలజననియు త్రి నీరీతి సంస్తుతించె.

దేవీస్తుతి

తే. "బ్రహ్మరూపిణి! పరమేశి! భద్ర! వరద!-వందనము నీకుఁ జేసెదఁ బరమభక్తి,
వరసురాసురలోకైకవంద్య! భువన-జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు.

తే. బ్రహ్మమొదలగు నిర్జరపతులు నీదు-మహిమ నెఱుఁగంగఁజాలరు మాన్యచరిత!
దయఁ బ్రసన్నవు గమ్ము సంతతము లోక-జనని కామేశ్వరీ! నమస్తతి యొనర్తు.

తే. నీ వనాది పరమవునా నెగడుచుందు,-వీవె విద్యవు, దేహుల విసరమునకు
దేహధారిణి వగుదువు దేవి! లోక-జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు.

తే. సర్వభూతంబులకును బీజమగు దీవె,-యీవె బుద్ధివి, చేతన వీవె, ధృతివి
నీవె, చక్రాని మెలుకవు నిద్ర వీవె-జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు.

తే. నిన్ను బూజించి పరమాత్మ నిత్యుఁడౌ మ
హేశ్వరుఁడు కృతకృత్యుఁడై యొసఁగినట్లు
తలఁచుచుండును మదిని సంతతము భువన
జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు. ౨౬౬౭

తే. దుష్టచరితుల వృత్తిని దొలఁగఁ, బాప-పుణ్యముల ఫల మియ్యఁగా, భువననిచయ
తాపము లణంప దక్షవై తనరు నీకు-జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు.

తే. సకలలోకంబులను సృష్టిసలుపఁ బెంప-నణఁపఁగా దేవి! నీవెయై యలరుచుందు,
కాళికా దేవి! తల్లి! కరాళవదన!-జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు. ౨౬౬౯

తే. సుప్రసన్నాననాంభోజశోభితా! ప్ర-పన్నకష్టనివారిణీ! పరమ! పూర్ణ!
కరుణఁ జూడుము నన్ను లోకనిచయైక-జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు.

తే. ఎవరు నిన్నాశ్రయింతురో యొసఁగి వార-లెల్ల లోకంబులకు నాశ్రయింపఁదగిన
వార లగుదురు త్రిభువనవంద్య! లోక-జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు.

తే. ప్రకృతి! పరిపూర్ణ! సర్వప్రపంచసృష్టి-కర్త్రి! శ్రద్ధాస్వరూపిణి! ఘనతరాచ్ఛ
దివ్యవిజ్ఞానరూపిణీ! దేవి! భువన-జనని! కామేశ్వరీ! నమస్తతి యొనర్తు."

చ. అతిశయభక్తి నీక్రియఁ బరాంబిక నెమ్మదిలోన నిల్పి సం
స్తుతు లొనరింప ధర్మగుణశోభితుఁడై తగు ధర్మపుత్త్రుఁ, డా
దృతిఁ బరదేవి యిట్లనియెఁ బ్రీతి చెలంగఁ బ్రసన్నయై "మహీ
పతి! తమిఁ గోరుకొమ్ము వరము భావమునం దెదియైన నిచ్చెదన్." ౨౬౭౩

చ. అనవుడు ధర్మసూనుఁడు మహా_త్తరతృ_ప్తియుతాత్ముఁ డౌచు దే
విని గొనియాడి యిట్లనియె ''విశ్వవిధాయిని! త్వత్కృపఁ వనం
బున నతిదుఃఖదంబయిన భూరినివాసముఁ జేసినార మె
య్యెన మును జేసినట్టి సమయంబును దీర్పఁగ ద్వాదశాబ్దముల్. ౨౬౭౪

చ. మును జూదం బొనరించునాఁడు సమయంబుం జేసిన ట్లేము ప
త్తనమం దెవ్వ రెఱుంగన ట్లిఁక జగద్ధాత్రీ! వసింపంగనౌ,
జననీ! యియ్యది దుష్కరం, బధికకృచ్ఛ్రం, బా_ర్తిసంధాయకం
బు నగుఁ, దీనిఁ దరింపఁజూడుము కృపాపూర్ణాత్మికా! ప్రీతితోన్.'' ౨౬౭౫

చ. వినయము మీఱ ధర్మజుఁడు వేఁడఁగ నీక్రియ దేవి యాదృతిన్
గని ''గుణధుర్య! ధర్మసుత! గాదిలితమ్ములు ద్రౌపదీనితం
బినియును వెంటరాఁ గదలి వేగమ మత్స్యమహీశు ప_త్తనం
బున నివసింపుఁ, డెంతయును బూర్ణతఁ దీఱును మీ ప్రతిజ్ఞయున్. ౨౬౭౬

ఆ. సందియంబు వలదు సద్గుణమణి! ధర్మ-రాజ! మీప్రతిజ్ఞ తేజమెసఁగఁ
దీఱు, మరల సకలదేశాధిపత్యంబు-పొందఁగలరు నాదు భూరికరుణ.'' ౨౬౭౭

పాండవుల యజ్ఞాతవాసము

ఉ. ఆదర మొప్పఁ బల్కి యిటు లప్డు తిరోహిత యయ్యె నారదా!
మోదము మీఱ ధర్మజుఁడు పూన్కిఁ గనుంగొనుచుండ విస్మయా
పాదిని యై నభంబునఁ బ్రభన్ మిఱుమిట్లుగొనంగఁ జేసి, యం
భోదమునన్ దటిల్లతను బోలుచు నాపరదేవి, యంతటన్. ౨౬౭౮

సీ. సకలార్థసంవేది చతురమనీషి ధర్మవిదు_త్తముండు ధర్మసుతుఁ డెలమిఁ
దమ్ములనెల్లరఁ దాఁ బిల్చి యేకాంతమునను యోజనచేసెఁ బూన్కి నెద్ది
యజ్ఞాతవాసంబు సర్వ_రీతిస జేయ ననువగు ననుచు నయ్యవసరమున
నిశ్చయంబు నొనర్చి నియతితోఁ దమతోడ నున్నట్టి యితరుల నుచితగతిని

తే. వీడుకొని, గు_ప్తరూపులై వెడలి మత్స్య-రాజరాజధానియగు విరాటనగర
మునకుఁ, దత్పురపరిసరమునను జేరి,-రంత వినవయ్య! నారదా! యమరహాని!

తే. ధనువులను మౌర్వులను దీసి యనుపమాస్త్ర
శస్త్రనిచయంబులను మోఁపు చతురరీతిఁ
గట్టి యటనున్న యొక జమ్మిచెట్టుపైనఁ
బెట్టి గట్టిగ బంధించి వెడలిరి ముని! ౨౬౮౦

తే. అంత ధర్మాత్మజుఁడు దేవి నాత్మఁ దలఁచి
వందనముల నొనర్చి సువర్ణచిత్రి

తాళములఁ గొని వేగ మత్స్యపతియెదుటఁ
జేరె ద్విజరూపమునఁ బెంపు చెలఁగుచుండ. ౨౬౮౧

క. రాజవిభవు ధర్మజు నతి-తేజోయుతుఁ గొలువునకును ధృతివచ్చిన వి
భ్రాజితశరీరు మత్స్యధ-రాజాని బ్రియంబుతో నరసి యిట్లనియెన్. ౨౬౮౨

క. "నీవెవ్వఁడ? విద్యేదకును-నీవిధి రాఁ గత మదేది? యెటనుండి? మదిన్
భావింప సకలధరణికిఁ-జూవె ప్రభుఁడ వనఁగఁ దగుదు సురుచిరమహిమన్."

చ. అనవుడు ధర్మజుం డనియె "నార్య! ధరాధిపతీ! ద్విజుండ నా
దును, శరణంబుఁ గోరితిని, ద్యూతమునందున నేర్పుఁజూపెదన్,
మునుపు యుధిష్ఠిరుండు నను బోషణచేసె, సమస్తసంపదల్
చనెను వినష్టమై, కరుణ స్వాంతమునందుఁ దలంపఁగావలెన్." ౨౬౮౪

చ. అని వినయంబునం బలుకు నామహనీయుని బ్రార్థనంబుఁ గై
కొని, దయ మత్స్యరాజు తన కొల్వున నెమ్మది నుంచి, రక్షణం
బును నొనరించె నాదృతిని మోదముఁ గూర్చుచు, రాట్సభాంతరం
బున నొకఁడైన ధర్మసుతుఁ బోల్చి కనుంగొనరైరి నారదా! ౨౬౮౫

క. పరదేవీవరమహిమా-భరణుండగు ధర్మరాజువైఖరి నేరన్
బరికింపఁజాల కుండిరి-వరముని! యజ్ఞాతవాసవత్సరమందున్. ౨౬౮౬

సీ. ఈవిధంబున భీముఁ డావిరాటునిచేతఁ బాకశాలాధ్యక్షపదవి నొందె,
నర్జునుండు విరాటుననుమతి స్త్రీరూపమునఁ గన్యలకు నృత్యమునుగఱుపఁగ
నియమితుఁ డయ్యెను నృత్యశాలను, మనోహరరూపయగు ద్రుపదాత్మజాత
సైరంధ్రియన రాజసతి సుదేష్ణాదేవిసన్నిధి సేవలు సలుపుచుండె,

తే. బలియురైన మాద్రీసుతుల్ వరుస మత్స్య-రాజుచేత నియుక్తులై వాజిశాల
యందు గోశాలయందు నధ్యక్షులగుచు-సేవచేయుచు నుండిరి దేవమౌని!

తే. అవ్విరాటుని పురి నున్నయట్టి పాండ-వులను నట నెవ్వఁడేనియుఁ దెలియఁజాలఁ
డయ్యెను ద్రయోదశాబ్దంబునందునఁ బర-దేవిదివ్యప్రసాదంబుచే వరముని!

క. ఈవిధమున మత్స్యపతిన్-సేవించుచుఁ బాండుసుతులు స్థిరగతి నుండం
గా వడిఁ బదునొకఁడవ నెల-భూవిభు సతియగు సుదేష్ణ పూనికఁ బెనుపన్.

కీచకవధ

క. మది నూఱటతో నుండిన-ముదితను సైరంధ్రిఁ గాంచె ముదమున రాజ్ఞీ
సదనమునఁ దదనుజుఁడు బల-మదము గలుగు కీచకుండు మమతాయుతుఁడై.

తే. వృద్ధరాజైన మత్స్యభూవిభున కెపుడు
రాజ్యసంరక్షకుండయి పూజ్యతఁ గను,

వాని మతము నుల్లంఘించి పూనఁ జెదియు
నైనఁ గార్యంబుఁ జేయ నయ్యావనివిభుఁడు. ౨౬౯౧

తే. దివ్యలక్షణాఢ్యై కడుఁ దేజరిల్లు-నంగముల వెల్గు సైరంధ్రి నరసి వాఁడు
సోదరి సుధేష్ణకడఁ జేరి మోదమునను-బల్కె నీరీతి నారదా! పరమమౌని!

సీ. "కమనీయరూపంబు గడు నొప్పు మీఱ సర్వాంగసుందరియయి వఱలు నిద్ది
యమ్మహేంద్రుని సతి యగు శచీదేవియా? యాదివిష్ణుపత్నియయిన లక్ష్మి
యగునా? సహోదరీ! యాదృతిఁ దెల్పవే, యిట్టి సర్వాంగశోభాఢ్య నెందుఁ
జూచియెఱుంగను, సుందరీవిషయంబు విస్తృతంబుగ నాకు విశదపఱుపు"

తే. మనుడు "సోదర! సైరంధ్రి యనఁబడు నిది-వచ్చె నెటనుండియో, సర్వవసుమతీశుఁ
డైన యాధర్మరాజుశుద్ధాంతసీమ-కేను జేరినదాన నం చెఱుకపఱచె." ౨౬౯౩

ఉ. అంతటఁ గీచకుం డనియె "నక్కరో! యాయువతీలలామ య
త్యంతముదంబున న్నను బ్రియంబునఁ జెందెకునట్లు చేయు, మొ
క్కింతయు నాలసింపవల, దిట్లొనరింపకయున్నఁ బోదు నే
నంతకు మందిరంబునకు నాశ దొరంగి, త్యజించి ప్రాణముల్." ౨౬౯౪

క. ఈవిధమునఁ దమ్ముఁడు దు-ర్భావుండయి పలుక నపుడు భ్రాతను గని యా
దేవి సుధేష్ణ వచించెను-దేవర్షీ! వినుము, దానిఁ దెల్పెదఁ బ్రీతిన్. ౨౬౯౫

సీ. "సోదరా! వినుము దుర్వాదంబు చేయక నామాట నొక్కింత నయమునిూఱ,
నత్యద్భుతంబగు నవ్యక్త మగునది బాగుగ యోజించి భావమందుఁ
దెలుపుము నీమదిఁ గల నిశ్చయంబును,నొనరింతు బ్రియము నీకును ముదమునఁ,
జారురూపిణియగు సైరంధ్రి మున్నిట వసియింపఁ దలఁచి తా వచ్చి నన్నుఁ

తే. బ్రార్థనమొనర్పఁగా నేను వరతనురుచి-వెల్గు నాకాంతఁ జూచి "యోవిశదగాత్రి!
నన్ను మించిన రూపమునన్ శతాధి-కతను వెలుఁగొందుచున్నావుగాన నీవు.

క. నను సేవింపందగ విట,-ననుమానము వలదు, నిశ్చయంబుగ, రాజె
య్యానువున నినుఁ గని నెమ్మని-మనఁజాలును, జెట్టఁబట్ట మానును సుదతీ!

క. ఏవిధమునన్నైనను నిను-దా వలచును గాని విడువఁ దలఁపఁడు తరుణీ!
నీ విశదరూపమోహితుఁ-డై వశుఁడగు, యుష్మదాజ్ఞయందే నిలుచున్.

క. నను దౌర్భాగ్యను దలఁపఁడు,-మనమున నాచెంతఁ జేర మానును, దన్వీ!
యననేమున్నది? యిట నీ-మనికియె వల, దింకఁ బొమ్ము మానిని! యెటకేన్."

క. అని పల్కితి, నాసతియును-వినయంబునఁ బల్కె నన్ను వీక్షించి "త్వదీ
యనివాసమున నివాసం-బొనరించుతఱిన్ వసింతుఁ బురుషుం డెవఁడున్. ౨౭౦౦

కం. నను జూడకుండురీతిని-వనితామణి! వినుము, నాకుఁ బతులు గలరు మో
హనరూపవిక్రములు గనుఁ-గొనఁగా గంధర్వు లైదుగురు గడు దక్షుల్.

కం. నను రేయుంబవలును భయ-మును బొందక రక్షణంబుఁ బూనిక చేయం
గను నున్నవార, లన్యులు-ననుఁ జెనఁకఁగఁజాల రేపునన్ ధరణిపయిన్.

ఉ. దేవి! భయంబు నొందకుము, తృప్తి వహింపుము, నీదు సన్నిధిన్
సేవయొనర్ప నానతి యశేషదయం గరుణింపవమ్మ! స
ద్భావముతోడ నన్నుఁ బనిగొమ్ము, వసింపఁగ నిమ్ము!'' నాఁగ నే
నావనితన్ స్వవేశ్మమున నాదృతి నుంచితిఁ బెంపుచేయఁగన్. ౨౭౦౩

ఉ. ఇన్నివిధంబులన్ మదికి నెంతయు నెమ్మది నెంచి, పోషణం
బెన్నఁగఁ జేయుదానను, సుఖేచ్ఛఁ దలంచినదానఁ గావునన్
మన్ననచేసి, నాదు సుఖమార్గవినాశనమున్ ఘటించు నా
యన్నలమిన్న నెట్లు గృహమందున నుంతును దెల్పు సోదరా! ౨౭౦౪

శా. నీ వీతత్త్వము నెంచ కయ్యువిద నెంతే ప్రీతిఁ గామించి, దు
ర్భావం బొప్పఁగఁ బొందఁగోరినను నీప్రాణంబులం బాప స
ద్భావుల్ వేచియయుంద్రు తత్పతులు గంధర్వు, ల్నిజం బింతయున్,
బోవంగాఁగల వింకఁ గాలుపురికిన్, బుద్ధిన్ విచారింపుమా.'' ౨౭౦౫

ఉ. సోదరియా సుదేష్ణ యిటు శుద్ధవచస్సులఁ దెల్పఁ, గీచకుం
డేదియు నెంచ కిట్టులనె నించుకయున్ భయమంద ''కమ్మ! స
మ్మోదము మీఱ నిక్కమని బుద్ధిఁ దలంపుము, వారి నెల్లరన్
మేదినిఁ గూల్తు మద్బలసమృద్ధి నెఱుంగఁగ నోసహోదరీ! ౨౭౦౬

శా. ఆగంధర్వుల నెల్లఁ ద్రుంచెద మదీయాత్యంతబాహాబల
త్యాగంబున్ వడిఁ జూపి, సోదరి! దయన్ దన్వంగి సైరంధ్రి ను
ద్యోగం బెంతయుఁ జేసి, వాక్చతురిమన్ దూర్ణంబ నాశయ్యకున్
లోగం గూర్పుము, భీతి మాను మెద, మేలుం గల్గు, వే పంపుమా.'' ౨౭౦౭

కం. ఈవిధమునఁ గీచకుఁ డెద-భావింపక న్యాయసరణిఁ బలికెను సైరం
ధ్రీవనితఁ బంపుమని దు-ర్భావమున సుదేష్ణతోడఁ బరమమునీంద్రా! ౨౭౦౮

కం. అంత సుదేష్ణ ప్రియంబునఁ-జెంతకు సైరంధ్రిఁ బిలిచి చిఱునగ వొప్పన్
''గాంతామణి! కీచకుని ని-శాంతమునకుఁ బొమ్ము వేగ సంతోషమునన్.

చ. వరతను! కీచకుండు కన వైభవయుక్తుఁడు, రూపసంపదన్
నిరుపముఁడై వెలుంగు, మది నిన్నుఁ బ్రియంబునఁ గోరుచున్నవాఁ,

డరయుము వాని వేడుకల నత్యధికంబగు ప్రీతితోడ, సం
బరమున వానిచెంగట శుభంబులఁ బొందు మసంశయంబుగన్.'' ౨౭౧౦

క. నా విని ''సుధేష్ణ! పూర్వం-బే వచియించితినిగాదె, యేపురుషునినే
భావమునఁ గోర నాపతు-లేవురఁ దక్కంగ ననుచు నెంతయు వినతిన్.

క. అతిపాపి మందబుద్ధి కు-మతి కీచకుఁ డెన్న న న్నమర్యాదఁ గనం
జతనం బొనర్పఁజాలఁడు,-సతి! నీ వెన్నంగఁదగుదు స్వాంతంబందున్. ౨౭౧౨

మ. కనులం గానక దుర్మదాంధుఁ డగుచున్ గామించి నన్ బొందఁగా
మనమం దెంచిన కీచకుం గలిసి సమ్మానార్హులౌ నాపతుల్
ఘనవీర్యాత్ములు దుస్సహాత్మబలు లాగంధర్వు లొక్కుమ్మడిన్
జనితామర్షత మీఱఁ జంపుదు, రెదం జర్చింపుమా యాదృతిన్.'' ౨౭౧౩

క. సైరంధ్రిమాటల న్విని-నారీమణియౌ సుధేష్ణ నయమునఁ దమ్మ్రుం
జేరి వచించెను బ్రియమునఁ-''జేరదు సైరంధ్రి స్వేచ్ఛచే''నని మాని! ౨౭౧౪

చ. అవినయుఁడైన కీచకుఁ డహంకృతి మీఱ సుధేష్ణవాక్యముల్
చెవులను జొన్ప, కంత ఖలచిత్తతఁ జూడక మంచిచెడ్డలన్,
బ్రవిశదాత్మ ద్రౌపదిని బల్మిని బట్టఁగ లోన నెంచుచున్
మిపులఁ బ్రయత్నము ల్సలిపె మృత్యుభయంబును వీడి నారదా! ౨౭౧౫

క. అత్తఱి సైరంధ్రియుఁ దన-చిత్తమునన్ భయము నొంది శ్రీదేవిని లో
కోత్తమ శుభప్రదన్ గడు-దత్తఱమున శరణుఁజొచ్చి సన్నుతిచేసెన్. ౨౭౧౬

ద్రౌపది మహాకాళిని నుతించుట

ఆ. ''సకలలోకజనని! సర్వరక్షణపరా-యణ! జగత్ప్రపూజ్య! యాదిదుర్గ!
నిన్నుఁ గొల్చుదాన నిఖిలప్రపన్నదుః-ఖార్తినాశనీ! ప్రియమునఁ గనుము.

తే. దుష్టులను స్తంభనముచేయు దుర్గ! లోక
నాయిక! మహేశ్వరేశి! కాత్యాయని! నిఖి
లాత్మికా! విశ్వమోహిని! యాదిచిత్స్వ
రూపిణీ! వందనము లొనర్తును బరాంబ! ౨౭౧౭

తే. నీవు మోహస్వరూపవు, నిర్మలతమ-మైన జ్ఞానస్వరూపిణి వగుదువు, నిను
భవభయంబునఁ దలఁచు సద్భక్తులు సక-లాపదలయందు నుత్తీర్ణు లగుదు రంబ!

తే. సతులకెల్లఁ బాతివ్రత్యవితతరూప-నై చెలంగుదు వో జగదంబ! సతము,
శంకరప్రాణనాయికా! చండభయము-నుండి నన్నుద్ధరింపు మఖండకరుణ,

తే. దీనజనముల కెప్పుడు దిక్కు నీవె,-యితర మెద్దియు లేదు, సర్వేశ్వరీ! మ
హార్తి మున్గితి, నీదుపాదాంబుజముల శరణుఁజొచ్చితి, రక్షణ సలుపవమ్మ!''

తే. ఇట్లు పాంచాలి నుతియింప నీశ్వరి, సక-లార్తినాశిని, దుర్గ తా నాత్మ మెచ్చి,
యాకసమునందునిలిచి''భయంబుఁబొంద-వలదుసైరంధ్రి!''యనిదయనపుడుపలికె.

ఉ. ''కాముకుఁడై యెవండు నిను గర్వమునన్ మది లుబ్ధుఁడై వెసం
గామిని! భంగపెట్టి, తమకంబునఁ జెందఁదలంచు, నట్టివాఁ
డీమహి నుండఁజాలఁ డని యెంచుము, చంపెద వాని నొక్కటన్,
నీమదిలో భయంపడకు, నిక్కము నావచనంబు ద్రౌపదీ!'' ౨౭౩

క. ఈరీతి దేవిదయతో-సైరంధ్రి వరంబుఁ బొంది సంతోషమునన్
భీరహితయై సుధేష్ణా-గారంబున నుండె నతిసుఖంబున మానీ! ౨౭౪

తే. అంత నొకనాఁటిరాత్రి పాపాత్ముఁడైన-కీచకుని సద్మమునకు సంకోచపడుచుఁ
బోయెఁ గార్యాంతరమున నోమునివతంస!-సుందరాపాంగి సైరంధ్రి సురుచిరాంగి.

ఉ. అత్తఱిఁ జూపి కీచకుఁ డహంకృతి నాద్రుపదాత్మజాత న
త్యుత్తమరూపఁ గాంచి, కడు నుత్సుకతన్ దనచెంతఁ జేరె నం
చత్తనుమధ్యఁ బట్టుకొన నప్పుడ లేచి కరంబుఁ బట్ట, ను
ద్వృత్తుగఁ ద్రోసి ద్రౌపదియు వేశ్మము దాఁటి చనె న్మునీశ్వరా! ౨౭౫

శా. ఆదుర్మార్గుఁడు కీచకుండు కనఁగా నత్యంతఘూర్ణాక్షుఁడై
తా దౌష్ట్యంబునఁ గోప మేపుగొన నత్తన్వంగివెన్వెంటనే
భేదం బెంచక పట్టవచ్చుటయుఁ, బెన్భీతిన్ వడిం బాఱె,చిం
తాదైన్యంబులు ముంపఁ జొచ్చెఁ గొలువున్ ధాత్రీశు సాన్నిధ్యమున్. ౨౭౬

ఉ. ఆసభయందు వృద్ధుఁడయినట్టి విరాటునితోడ ధర్మజుం
డాసచెలంగఁ జాచికల నాడుచునుండెను, భీముఁ డందె వి
శ్వాసము మీఱ నుండెఁ, గడు సాధ్వసయై చనుదెంచు ద్రౌపదిన్
దోస మటంచు నెంచకయ దుష్టుఁడు కీచకుఁ డంత నోమునీ! ౨౭౭

తే. కేశములఁ గరమునఁ బట్టి కీడుఁదలఁప
కాత్మపాదమునం దన్నె నద్భుతముగ,
నపుడు ద్రుపదుని పుత్త్రి యత్యంతదుఃఖ
మునను నేడ్చుచుఁ దత్సభాముఖమునందు. ౨౭౮

చ. అరుణములైన నేత్రముల నట్టె కనుంగొని దీనచిత్తయై
పరఁగు మహానుభావులను వల్లభులం గడుదైన్య మొప్ప భీ

కరబలు భీము ధర్మజునిఁ గాంచుచు, మత్స్యధరాధినాథుఁడౌ
విరటునిఁ గోపచిత్తయయి వీనులు చిల్లులుపోవఁ దిట్టుచున్. ౨౮౩౦

తే. కన్నులఁ దొరంగు బాష్పము ల్కరకిసలయ
ములను దుడుచుకొనుచుఁ బోయె ముదిత ద్రుపద
పుత్త్రి యంతఃపురమునకు మునివరేణ్య!
మత్స్యభూపతికాలంబు మదిఁ దలఁచుచు. ౨౮౩౧

శా. అంతన్ భీముఁడు కీచకుం దునుమఁగా నాత్మన్ విచారించి యే
కాంతంబందున ద్రౌపదిం గని "మహాకష్టాత్మ దుష్టున్ బ్రియం
బెంతే చూపుచు నృత్యశాలకును నీ వీరాత్రియే చేర్చు, మే
నంతన్ వానిని జంపి నీమదికి నాహ్లాదంబు చేకూర్చెదన్. ౨౮౩౨

క. అకలంకులు గంధర్వుల్-ప్రకటితబలు లిపుడె చంపివైచి చనిరి యి
వ్వికలునిఁ గీచకు ననుచుం-బ్రకటింపుము తన్వి! నివు వడి భయ మొదవన్."

క. అని పతి భీముఁడు తెల్పిన-యనువున ద్రౌపది యొనర్చె నారాత్రియె, దు
ర్వినయుం గీచకుఁ జంపెను-ఘనబలుఁడగు భీముఁ డాత్మఁ గౌతుక మొప్పన్.

మ. ఖలుఁడౌ కీచకుఁ జంపి రాత్మపతులౌ గంధర్వు లత్యుద్ధతిన్
జలనం బించుక లేక యిప్పు డనుచున్ సైరంధ్రి పౌరు ల్వినన్
బలుకంగా నుపకీచకాళి విని నే భ్రాంతాత్ములై కాంచ నా
స్థలముం జేరఁగ వచ్చి రప్పు డెదఁ జంచత్క్రోధసంయుక్తులై. ౨౮౩౫

చ. భవనమునుండి కీచకుని బైటికిఁ దెచ్చి, దహింప యత్నమున్
దవిలి యొనర్చు చెంతయును దారు వగ ల్వెనుపొంద నేడ్చుచున్,
మివులఁ బురంబు దాఁటి, యట మించిన దుఃఖముతోడ యోజనల్
ప్రవితతరీతిఁ జేసి తమ భావమునందున నిశ్చయించుచున్. ౨౮౩౬

తే. కీచకునితోడ సైరంధ్రి నేఁచి పట్టి-దహనముం జేయ నగు నంచుఁ దలఁచి, యంద
ఱొక్కమొగి వచ్చి సాహసయుక్తులగుచుఁ-బట్టుకొనిపోయి రాసాధ్వి బల్మి నంత.

తే. అపుడు సైరంధ్రి యెలుఁగెత్తి యఖిలదిశలు
మ్రోయ నేడ్చెను, భీముఁ డారోదనమును
విని కడంకను బ్రాచీరమును జవమున
దాఁటి వేవేగ వచ్చి యుద్దామశక్తి. ౨౮౩౭

క. క్రూరుల నుపకీచకుల న-వారితబలుఁ డగుచుఁ జంపి, ప్రాణప్రియయౌ
సైరంధ్రిని విడిపించెను-శూరుండగు భీముఁ డంతఁ జోద్యము గలుగన్.

క. పౌరులు భయమును బొందిరి-వీరులు గంధర్వవరులె వెసఁ ద్రుంచిరి దు
ష్ప్రారంభుల నుపకీచక-వారముల నటంచు, మిగుల భ్రమయుచు నెదలన్.

సీ. అంతట మత్స్యభూకాంతుఁడు దన మది భయమంది యీరీతిఁ బల్కె నపుడు
వినయాన్వితుండయి వనితామతల్లియా సైరంధ్రిఁ గనుఁగొని శాంతభంగి
"నీకతంబున యమనిలయంబునకు నేఁగి రుపకీచకులు నాకు నుపకరించు
వారలు, మద్రాజ్యభారంబు రక్షించునట్టి బలాఢ్యులై యలరువారు,

తే. నాపురంబును ద్యజియించి కాపురంబు
సేయ నెందైనఁ బొమ్ము" నాఁ జెలువ విరటుఁ
గాంచి "భూనాథ! యొక్కింత కాలము తగ
నోర్చియుండుము నను దయయుంచి యిచట. ౨౭౪౧

క. త్వరితముగా నరిగెద నీ-పురమును సౌధంబు విడిచి పోలినయెడకున్,
గరుణింపు మింతిమాత్రము-ధరణీవర!" యనుచుఁ బల్కెఁ దాపసివర్యా!

ఉ. ఈవిధిఁ బాండవుల్ గడపి రెంతయుఁ గష్టముతోఁ ద్రయోదశం
బై విలసిల్లు వత్సరము, నాసమయాన సుయోధనుండు దు
ర్భావుఁడు చారులం బనిచి పాండవసుస్థితిఁ గాంచలేక సం
భావనచేసె భీష్మగురువర్యులతో నొగి నిశ్చయార్థమై. ౨౭౪౩

ఉత్తర గోగ్రహణము

మ. తగఁ జర్చించుచు భీష్మముఖ్యులను దాత్పర్యంబు నూహింపఁగాఁ
దగు నంచున్, మది యోజనల్ సలుపుచున్ దాఁ గీచకుల్ మ్రంది రొ
ప్పగు నామత్స్యమహీంద్రు పత్తనమునన్ బాహాబలోపేతు లి
మ్ముగ నొక్కమ్మడి నంచు విన్న చరితంబున్ బాగుగా నెంచుచున్. ౨౭౪౪

ఉ. పాండవు లందె యుందు రని భావమునందుఁ దలంచి సైన్యముల్
మెండుగ వెంటరాఁ గదలి మిక్కుటమై తగు కౌతుకంబునన్
భండనముం బొనర్చుటకుఁ బట్టె విరాటుని గోగణంబు, ను
ద్దండత నాసుయోధనుఁడు దర్పము పొంగఁగ సన్మునీశ్వరా! ౨౭౪౫

ఉ. గోవులఁ బట్టుకొన్నయెడ ఘోరరణం బొనఁగూడె, ధన్వియై
చేవ వెలుంగు నర్జునుఁడు చెండె సుయోధను సైన్యమెల్ల, స
ద్భావులు భీష్మముఖ్యులును బల్మిఁ దాఁకి తలంగి, రోడి దు
ర్భావుఁడు ధార్తరాష్ట్రుఁడును బాఱెను హస్తిపురంబుఁ జేరఁగన్. ౨౭౪౬

ఉ. అంతట మత్స్యభూపతియు నాత్మ నెఱింగెను బాండవుల్ స్వకీ
యాంతికమందు నున్నయటు, లప్పుడె వారలఁ బూజచేసె సు

స్వాంతము మీఱఁగా వినయవంతుఁడు నై తగురీతి నెంచు చ
త్యంతకుతూహలంబునను నాత్మఁ జెలంగుచుఁ దాపసోత్తమా! ౨౭౪౭

సీ. ఆ మత్స్యభూపతి యాత్మలో నుప్పొంగి తన సుతయైన యుత్తరను బ్రీతి
నర్జును సుతుఁడగు నభిమన్యున కొసంగి వైభవంబునను వివాహమంగ
ళోత్సవం బొనరించె నురుముదంబున, నంత పాండుకుమారులు భండనంబు
సలుప నుద్యోగంబు సలుపంగఁ దొడఁగిరి మునినాథ! సంగరమును నొనర్పఁ
తే. గోరి పాంచాలు రెల్లరు గురుతరమగు-సేనతోఁ గూడి వచ్చిరి స్థిరబలులగు
కాశిరాజప్రభృతులుత్సుకతను దోడ్ప-డంగఁ బాండవులకుఁ దమిచెలఁగంగమాని!

కురుపాండవ యుద్ధము

ఉ. మిత్రుల బాంధవావళుల మేటి బలాఢ్యులఁ గూడి యాకురు
క్షేత్రముఁ జేరఁగాఁ జనిరి చెచ్చెరఁ బొంగి రణోత్సుకాత్ములై
యాత్రము మీఱఁగా విరటుఁ డాత్మబలంబును వెంటఁగొంచు రా
క్షత్రియసింహులై వెలయు శౌర్యధనాగ్రణులైన పాండవుల్. ౨౭౪౯

ఏఁబది యేడవ అధ్యాయము

సీ. నారదా! వినుము భూభారంబు హరియింప శ్రీపరమేశ్వరి కృష్ణరూప
మున ధార్తరాష్ట్రులకును సాయమొనరింపఁ దనసేన నియమించి తానె పాండ
వులకు సాయముచేయఁ దలఁచి, సాత్యకితోడ నరుదెంచి సకలదేశాధినాథు
లయిన రాజోత్తము లద్భుతగతిఁ గురుపాండవులకును దోడ్పాటుచూపఁ
తే. జేరి రుత్సాహమునఁ గురుక్షేత్రమునకు,-నిట్టి సంరంభ మెచ్చట నేని కనఁగ
వినఁగ లేనిది యై కడు వేడ్క మీఱు-నేయుగంబున నేని మునీంద్రచంద్ర!

తే. వివిధదేశనివాసులై వెలయు రాజ-వరుల చతురంగబలము లవారితముగఁ
జేరి వ్యాపించె ధర్మసుక్షేత్రమయిన-యాకురుక్షేత్రమునఁ గడు నద్భుతముగ.

తే. సర్వలోకక్షయంకర స్థానమయిన-యాజతన మంతయు నెఱింగి హృదయమందు
నాసుయోధను వారించి రపుడు పూన్కి-భీష్మగురుముఖ్యులైనట్టి పెద్దలెల్ల.

మ. భగవంతుండు సమస్తవిద్వరుఁడు నౌ వ్యాసుండు తా వచ్చి పెం
పగు వాక్యంబులతో సుయోధనుని దద్భ్రాతృవ్రజంబుల్ సుతో
క్తిగతుండై చను నంధభూపతిని బ్రీతిన్ గాంచి యుద్ధక్రియల్
తగ దంచుం బలుమాఱు బోధసలిపెం దాత్పర్య మూహించుచున్. ౨౭౫౩

మ. ధృతరాష్ట్రేంద్రుఁడు గాలపాశవశుఁడై తెల్వి౯ విచారింప కు
ద్ధతి నావ్యాసమునీంద్రు భాషితములం దా నెంచఁడయ్యె౯ మది౯,
హితవుం జూడక పోయెఁ, గర్ణు మతమే హెచ్చించు నూహించి స
మ్మతి సంగ్రామమొనర్పఁగాఁ బనిచె దుర్మార్గంబె చింతించుచు౯. ౨౭౫౪

క. భేరీదుందుభిశంఖా–ద్యారములు, నేమి నిస్వనావళి దిక్కుల్
తారాపథంబు ధరణియు–ఘోరముగఁ జలింపఁజేయఁ గూడిన వేడ్క౯.

తే. మంత్రులును, మిత్రులును, దన మతము ననుస
రించి, వెన్వెంటఁ గదలఁగా నృపతివరస
మేతుఁడై యాసుయోధనుం డాతతగతిఁ
జేరె రణసీమ కాకురుక్షేత్రమునకు. ౨౭౫౫

తే. రణము నొనరింప వచ్చువారలను గాంచి–పాండుసుతపక్షపాతులౌపార్థివులు మ
హారథులుశంఖముల నూఁదిరిపుడు,సింహ–నాదములఁ జేసి యార్చిరోనారదముని!

శా. ఆనాదం బవని౯ నభంబు నొగి నత్యాశ్చర్య ముప్పొంగ నెం
తే నిండించి ప్రతిధ్వనించె మఱియు౯ దీర్ఘవ్యథ౯ ధార్తరా
ష్ట్రానీకంబును ముంచెఁ, దద్బహుళసంరంభంబు తేజంబు వి
జ్ఞానంబు౯ వడిఁ ద్రుంగఁజేసె నిఖిలాశావ్యాప్తమై నారదా! ౨౭౫౬

ఉ. ఒద్దిక నంత ధర్మసుతుఁ డుత్సుకుఁడై రణసీమ నున్న యా
పెద్దల భీష్మముఖ్యులను బ్రీతిని జేరి నమస్కరించుచు౯
దద్దయు వారి సమ్మతిని దాను గ్రహించి, మృధం బొనర్పఁగాఁ
బద్దను బూని యాత్మరథవర్యసమీపముఁ జేరఁగాఁ జనె౯. ౨౭౫౭

✓ పాండవకృత దేవీస్తుతి

తే అంతఁ బాండవు లెల్లరు నరదములను–దిగి రణాంగణమున జయం బగణితముగఁ
గాంచఁగా నెంచి మనముల గాఢభక్తి–సంస్తుతించిరి జగదంబ చరణములను.

సీ. "త్రిదశవందిత దివ్యపదపద్మయుగ్మ! కాత్యాయనీదేవి! విశ్వైకజనని!
విశ్వసృష్టిస్థితి విలయకారణరూప! చండప్రచండసంక్షయవినోద!
త్రిపురవిరోధిపత్ని! దేవి! దుర్గ! లోకార్తినిహంత్రి! మమ్మరయుము దయఁ
బాపదానవవినిపాతకరీ! యంబ! దుష్టమోహనకరి! దుఃఖహన్త్రి

తే. వైన నిన్ను భజించువాఁ డఖిలజనని!–విశ్వమయి! భవదుఃఖంబుఁ బృథివిఁబొందఁ
డెప్పుడేనియు యోజింప నెఱుకపడని–యాకృతిని వెల్గుఁ బర దేవి! యనవరతము.

చ. కమలజవిష్ణుశంకరులు గారవమొప్పఁగ నీకు మ్రొక్కి స
త్యముగనె సృష్టిసంస్థితిలయంబులు చేయుచునున్నవార లా

త్మమహిమఁ జూపి, వారల సృజింపను బెంప లయింప నీ విలా
సమె, మఱి వారికిం గలుగఁజాలదు నాశము తక్కు వారిచేన్. ౨౭౬౨

మ. జననీ! సంగరసీమ నెవ్వరు నినుం జక్కంగ ధ్యానింత్రు, త
త్తనువుల్ జేరఁగలేవు శాత్రవుల యస్త్రంబుల్, వెసన్ వారి య
స్త్రనికాయం బొగి గాఁడి పుంఖముల పర్యంతంబు ప్రాణంబులం
గొను నో దానవనాథహన్త్రి! దయఁగైకొ మ్మంబ! మాసంస్తుతుల్. ౨౭౬౩

మ. జననీ! తావకదివ్యమంత్రజపముల్ శ్రద్ధాయుతిన్ సంగరా
వని నెవ్వాఁ డొనరించు వాని యముగా భావింత్రు విద్వేషు, లా
య్యన నీ వెవ్వరికే జయంబు నిడఁగా నాత్మన్ దలంపూను దా
మనువర్యంబు స్మరింపఁ జేయుదువు సంభావించి యవ్వానిచేన్. ౨౭౬౪

చ. భయములయందు నిన్ను మది భక్తి నెవారు తలంత్రు, వారికిన్
భయ మన నింత నందయిన భావన చేయఁగ లేదు, వారలే
భయమును గూర్చువారలు విపక్షులకుం గడు దవ్వునుండి, యే
మియు ననలేక పాఱుదు రమేయగతిన్ బరమేశ్వరేశ్వరీ! ౨౭౬౫

మ. మును దేవాసురయుద్ధమందు సురసంపూజ్యుండు నిన్గొల్చి తా
దనుజానీకముఁ జెండె, దాశరథి నిన్ ధ్యానించి దైత్యాన్వయం
బును నాశంబొనరించె, నావిధమునన్ బూన్కిన్ నినుం గొల్తు మో
జననీ! మాకు ననుగ్రహింపుము జయశ్రీ స్వాంతమం దెంచుచున్. ౨౭౬౬

ధ్రువకోకిల. హరివిరించిముఖామరాదిసమర్చితా! సకలాశ్రయా!
వరజగద్వినుతా! జయప్రద! భద్రదా! భజియింతు ని
న్గరము, మాకు జయంబు నిమ్ము, రణస్థలిన్ రిపునాశముల్
నిరతి సల్పి జయంబుఁ గొందుము నీ దయన్ బరమేశ్వరీ!" ౨౭౬౭

క. పాండవు లిట్లు నుతింపఁగ-భండనసమయమున దేవి వరద గగనమం
దుండి ప్రసన్నత వర మ-ప్పాండవుల కొసంగి యిట్లు పలికెన్ గరుణన్. ౨౭౬౮

క. "మదనుగ్రహమున రణమునఁ-గొదువ యొకించుకయు లేక గొదగొని రిపులన్
జిదిమి యె నిష్కంటకమై-పొదలెడు రాజ్యంబు మరలఁ బొందుదు రెలమిన్.

క. మీ విజయార్థంబునకై-యీవసుధాభార మడఁప నాత్మఁ దలఁచి నే
నావాసుదేవరూపము-తో వెలసినదాన లీలఁ దోరపువేడ్కన్. ౨౭౭౦

చ. నరుని రథంబుపై మఱి యనంతవిశాలమునై వెలుంగు వా
నరవర కేతనంబున ననారత మే నొగి నిల్చి మీకు సం

బరమును గూర్తు, రక్షణము వారక చేయుదు వాసుదేవసుం
దరతరరూపధారి నయి, తథ్యముగాఁగ నెఱుంగుఁ డీనుడిన్. ౨౭౭౧

క. మీరొనరించిన యీ నుతి-ధారుణి నేనరులు భక్తితత్పరు లగుచున్
గోరిక నుతింతు, రే న-వ్వారికి జయమిత్తు నిక్కువంబుగ నెపుడున్.'' ౨౭౭౨

క. ఈ విధమున వరమును బర-దేవికరుణావలనఁ బడసి ధృతిఁ బాండుసుతుల్
భావమున గెలుతు మిఁక నని-భావించిరి సుప్రసన్నవదనాంబుజులై. ౨౭౭౩

యుద్ధప్రారంభము

శా. అంతం బాండుకుమారశూరులు ముదాయత్తాత్ములై యుద్ధమ
త్యంతోత్సాహముతో నొనర్ప వరహేమాఢ్యంబులౌ తేరులం
దెంతే వేడుక నెక్కి వర్మధరులై యేర్పాటు దీపింప వి
భ్రాంతిం బొంద రిపుల్ స్వశంఖముల మ్రోవం జేసి రొక్కుమ్మడిన్. ౨౭౭౪

చ. నరుని రథంబునన్ సకలనాయకుఁ డద్భుతవీర్యు డిందిరా
వరుఁ డగు వాసుదేవుఁడు ప్రభావము మీఱఁగఁ గూరుచుండి సం
బరమునఁ బాంచజన్యము నవారితరీతిని నూఁదె నంత ని
ష్ఠురతరనాద మొప్పఁగను చోద్యముగాఁగను మాటిమాటికిన్. ౨౭౭౫

శా. ఘోరంబైన తదీయనాదమునకున్ ఘూర్ణిల్లె లోకంబు, లా
యారావం బవనీతలం బద్రువఁగా నాకంపముం బొందె, వి
స్తారప్రక్రియ ధార్తరాష్ట్రు లొకటన్ సైన్యంబులోఁగూడ నా
హారావంబు లొనర్చుచున్ నగచి రత్యంతంబు మౌనీశ్వరా! ౨౭౭౬

క. కౌరవసైన్యంబునకు న-పారబలుఁడు సకలలోకవరబలశౌర్యో
దారమహారథుఁ డద్భుత-ధీరగుణుఁడు భీష్ముఁ డధిపతిత్వముఁ బూనెన్.

ఆ. భీష్ముమీఁదఁ దాను ద్వేషంబుతోఁ గర్ణుఁ-డపుడు న్యస్తశస్త్రుఁ డగుచు సమర
సీమఁ జేరరాక నీమంబు పూనెను-మూర్ఖచిత్త మొప్ప మునివరేణ్య! ౨౭౭౮

క. నాగాయుతబలుఁ డధిక-త్యాగి వృకోదరుఁడు పాండవానీకశో
ద్యోగమునఁ జెలఁగె విక్రమ-యోగంబున యముని బోలి యొప్పుచుఁ బెలుచన్.

క. పదిరాత్రులు భీష్ముఁడు బెం-పొదవఁగ యుద్ధం బొనర్చి పొలియించెను న
త్యదయతఁ బాండుబలము న-ర్బుదసంఖ్య నవారితుఁడయి రోషం బొప్పన్.

చ. కురుబలమందు సైనికులు కుంఠితులై పడిపోయి రుర్వి దు
ర్భరశరవర్షము ల్గురియఁ బల్మఱుఁ బాండవవీరు, లప్పు డ
చ్చెరువుగ విక్రమించి కురుసేనల నెల్లను జుట్టుముట్టి సం
గరమునఁ గ్రీడసల్పి రెదఁ గ్రౌర్యము తాండవమాడుచుండఁగన్. ౨౭౮౧

చ. పదియవనాఁడు భీష్ముఁడు దివాకరుఁ డించుక వెల్గుచుండున
య్యుదనునఁ బల్వురం దునిమి యద్భుతకీర్తిఁ జెలంగుచుండ స
మ్మదమున నర్జునుండు వరమార్గణ మేదితి వింటఁగూర్చి భీ
ష్మదుని శిఖండిఁ గూడి ధర వ్రాలఁగ నేసె బలంబు లార్వఁగన్. ౨౭౮౨

మ. మతిమంతుండు మహారథుండు జనసమ్మాన్యుండు భీష్ముండు వి
స్తృతశాస్త్రాంచితుఁ డుత్తరాయణ మెదన్ వీక్షించుచున్ ధర్మప
ద్ధతితోడన్ శరతల్పమందు సుఖమై తా నుండె, సంప్రీతి స
న్మతితోఁ దండ్రివరప్రభావము నిలన్ బ్రఖ్యాతిగావించుచున్. ౨౭౮౩

తే. అంతఁ గర్ణుండు మొదలుగా నచటి యోధు
లెల్ల ద్రోణునిఁ గురుసేన కీశ్వరునిగ
నిలిపి సమరంబు సల్పిరి నిస్తులగతి
నైదుదినములు మరల నత్యద్భుతముగ. ౨౭౮౪

క. ఆ త్తతి సుభద్రకొడుకు మ-హోత్తముఁడు మహారథుండు నురుబలయుతుఁ డు
ద్వృత్తుగఁ గౌరవయోధుల-యొత్తిడిఁ గూలెను నధర్మయుద్ధక్రియచేన్. ౨౭౮౫

ఉ. పాండవమధ్యముండు పటుబాహుబలాఢ్యుఁడు ఫల్గునుండు "నేఁ
ఖండెద సైంధవున్ బ్రతినచేసి దినాంతములోన" నంచు ను
ద్దండతరాస్త్రజాలములఁ దాఁకి ధరం బడఁగూల్చెఁ, గౌరవుల్
బెండువడంగ శౌర్యమున భీతిలి తాపసనాయకోత్తమా! ౨౭౮౬

తే. ఈవిధంబున ఘోరమై యెసఁగు భండ
నస్థలంబున నుభయసైన్యంబులందు
హతులయిరి పెక్కు, రయిదవదగు దినమున
ద్రోణుఁ డిలఁగూలె ద్రుపదపుత్త్రుని శరమున. ౨౭౮౭

క. అంతటఁ గర్ణుఁడు సేనకు-నెంతయు నధిపతిగ నుండి యేదితి రణమున్
వింతగ నొనరించెను నా-వంతయు వెనుబడక శూరుఁడై మునివర్యా! ౨౭౮౮

క. భండనము రెండుదినము ల-ఖండగతిం గర్ణుఁ డలుకఁ గావించి నిజో
ద్దండత నెఱపి ఘటోత్క-చుఁ-దండిబలుని సంహరించె దానవవర్యున్. ౨౭౮౯

క. బలవంతుఁడైన కర్ణునిఁ-జలమునఁ బోనీక పట్టి శాతశరముచే
నిలపైఁ గూలిచె నర్జునుఁ-డలపుగొనక భండనమున నరితతి తలఁకన్. ౨౭౯౦

తే. ఉభయసైన్యంబులందున నుక్కుమిగిలి-నట్టి యోధులు యుద్ధజయార్థు లగుచుఁ
గూలిరి, పరస్పరముఁ గడుఁ గ్రూరరణము-సలిపి బలమతి భూమిపై సంయమీంద్ర!

ఆ. సమరరంగమందు శల్యుని నతిరథుఁ-గూల్చె నిశితబాణకోటిఁ బఱపి,
క్రుద్ధుఁడయి యుధిష్ఠిరుండు ధర్మసుతుండు-కురుబలంబు లెల్లఁ గూడి యార్వ.

ఉ. ఒండొరు మీఱఁగాఁ దలఁచి యుక్కు-చెలంగఁగ భీమసేనుఁ డు
ద్దండత వెల్గునట్టి గదఁ దాల్చి సుయోధనుఁ దాకె, నంత నా
ఖండనసీమ తేజమున భాసిలు నాత్మగదన్ ధరించి బ్ర
హ్మాండము సంచలింపఁగను నాతఁడు భీమునిఁ దాకె నుగ్రుఁడై. ౨౭౯౩

క. కడువడి నదరి సుయోధనుఁ-బుడమిం బడఁగొట్టె వాయుపుత్త్రుం డలుకన్,
దడములు గెడసె ననేకము,-లడఁగిరి దుశ్శాసనాదు లసువు లెడలఁగన్.

సీ. ధార్తరాష్ట్రులు రణస్థలమున నీక్రియఁ బడిపోవఁగా నంతఁ బటుబలుఁడగు
ద్రోణపుత్త్రుండు శూరుఁడు కడు కోపంబు దీపింప రాత్రి నిద్రితులఁ బాండ
వుల శిబిరంబునఁ జెలఁగువారల నుపపాండవులను బల్మిఁ బట్టి యైదు
గురను వధించె, దెప్పరముగ ద్రుపదపుత్త్రకుని ధృష్టద్యుమ్ను ధరణిఁ గూల్చె,
ఆ. నిట్లు పెక్కుగతుల నెంతయు యోధవీ-రులను బిలుకుమార్చెఁ జలము మెఱయ,
నంత నర్జునుండు పంతంబు మదిఁ బొంగ-నదరి విశిఖవితతు లార్చి యేసి.

క. ఘనబలులను నశ్వత్థా-మను గృపునిన్ దివిజసదృశమహిమాఢ్యుల ని
ల్పెను సమరయత్నవిముఖుల-నొనరించి మునీంద్ర! విబుధు లుప్పొంగంగన్.

క. పదునెనిమిది దినములు భీ-తిదముగ సమరంబు నడచెఁ, ద్రెళ్లెను భూమిన్
బదునెనిమిది యక్షౌహిణు-లదరి యుభయసైన్యముల మహామునిచంద్రా!

తే. వాసుదేవునితోఁ గూడఁ బాండవులు మ-హారథులు సల్పి రాజినిహతులగు ధర
ణీశులకు నెల్ల శాస్త్రవిహితసరణిని-నౌర్ధ్వదైహికకార్యంబు లార్యవర్య!

తే. అంత మాఘసితాష్టమియందు భీష్ముఁ-డసువులన్ వీడి వసువుల వసతిఁ జేరె,
పాండవులు సర్వరాజ్యంబు భగవతిదయఁ-బొంది పాలించి రత్యంతభోగయుక్తి.

ఏఁబది యెనిమిదవ అధ్యాయము

శ్రీకృష్ణావతార సమాప్తి కథ

క. ఈవిధి ఛలమున వసుధకు-వావిరి భారంబుఁ బాపి వసుదేవసుతుం
డీవసుధ విడిచి పోవఁగ-భావంబున నెంచె స్వీయభవనంబునకున్. ౨౮౦౦

ఆ. ఇంతలోన బ్రహ్మ యేతెంచి ద్వారవ-తీపురంబునకును దివ్యరూపుఁ
గృష్ణుఁ గాంచి మిగులఁ గీర్తించి భక్తితోఁ-బలికె నివ్విధమునఁ బరమపావని!

సీ. "శ్రీకృష్ణపరమాత్మ! చిత్తగింపుము మున్ను భూభారమును దీర్పఁ బొగడుటయును,
బరదేవి మా విన్నపమును బాలింప నెమ్మది నెంచి, మేదినీమహితభార
మును దొలఁగింప శంభుని యనుమతితోడ మానుషాకృతిఁ దాల్చి మహిమ వెలయ
మాయాపురుషరూప మీయనువున నుండె, నారూప మీవె కా యాదిదేవ!
తే. సకలధరణీభరంబు నిస్సంశయముగఁ-బాపితివి, శంభుమానసవాంఛఁ బూర్ణ
మగు విధంబున నెఱపి మా కతిముదంబుఁ-గలుగఁ జేసితి, విఁక నొందు కలదు మనవి.

ఉ. పూరుషరూపమున్ విడిచి భూతలమందుననుండి వేడ్క ని
చ్చారతి స్వీయధామమును సంతసమొప్పఁగఁ జేరి మమ్ములన్
గూరిమి మీఱఁ బాలనము గొబ్బునఁ జేయఁగ రమ్ము, దేవతా
వారములం దయం దలఁచి యర్వా విధంబున నెల్లవేళలన్." ౨౪౦౩

క. వినయంబున నీవిధి పలి-కిన సరసిజభవునిఁ గాంచి "కృతమతి! నే నీ
మనవి నెదఁ దలఁచితిని, న-య్యనువెంచితి నామనంబునం దోయార్యా! ౨౪౦౪

క. కడువడి నరుదెంచెద నిం-డెడ సేయక స్వభవనమున కే జలజభవా!
ఎడఁదఁ గడుముదము నొందుము,-తడయక చను నీదు దివ్యధామముఁ జేరన్."

క. అని యివ్విధమునఁ గృష్ణుని-తనువున నున్నట్టి దేవి ధాతను బ్రేమం
బున నూఱడించె, నవ్వల-విను మాపరదేవిదివ్యవిధ మాదృతితోన్. ౨౪౦౬

తే. శ్యామసుందరరూప యాశక్తి ద్వార-కాపురము కాపురము వీడఁగాఁ దలంచి
స్వర్గయాత్ర నొనర్ప నిశ్చయమొనర్చి-మంత్రులను జీరి పలికె "నమాత్యులార!

మ. యదువంశంబున జన్మముం గనిన ధర్మాత్ముల్ ధరన్ వీడి యిం
పొదవన్ స్వర్గముఁ జేర నేఁగిరి గదా! యొక్కొమ్మడిన్ జంచలా
స్పదవృత్తి న్విహరించి మంత్రియగు నష్టావక్రు శాపోక్తి దు
ర్మదులై యెల్లరు, గొంద ఱుందురు గదా! మాద్యత్ప్రతాపుల్ ధరన్. ౨౪౦౮

క. ఈవంశమునఁ బరాక్రమ-లా వృద్ధులు మిగిలియుండి రని యెఱుఁగుదు, వా
రీవసుధేశత్వము సం-భావింపరు, తలఁప రిలను వసియింప నెదన్. ౨౪౦౯

క. కావున నే స్వర్గమునకుఁ-బోవం గోరెదను నిక్కముగ, మీరలు దూ
తావళిఁ గరినగరమునకు-వేవే పనుపుఁడు వచింతు వృత్తాంతంబున్. ౨౪౧౦

ఉ. ధర్మజుఁ గాంచి విన్నపముఁ దప్పక చేయుఁడు, శత్రుసూదనుం
డర్మిలి నెయ్యుఁడై పరఁగు నర్జును భీముని మాద్రిపుత్త్రులన్
బేర్మిని జూచి తెల్పుఁడు సువిస్తృతరీతిని బ్రహ్మయానతిన్
ధర్మముగాఁ దలంచి చనెదన్ దివిఁ గూర్చి ప్రయాణమం చొగిన్." ౨౪౧౧

చ. మునివర! కృష్ణుఁ డిట్లు తన పూనికఁ దెల్పఁగ మంత్రు లెల్లరున్
మనముల దైన్య మొప్ప గుణమాన్యుల దూతల వేగవంతులన్
బనిచిరి యాలసింపక యె, వారలు హస్తిపురంబుఁ జేరి యె
య్యన నరనాథు ధర్మజు మహాత్ము యుధిష్ఠిరు భీము నర్జునున్. ౨౮౧౨

తే. నకులసహదేవులను గాంచి ప్రకటితముగఁ-దెలియఁజెప్పిరి శ్రీకృష్ణ త్రిదివయాన
యత్నమును, బాండవులు విని యంతరంగ-ములను దుఃఖితులయిరి సన్మునివరేణ్య!

ఆ. కృష్ణు ననుగమింప హృదయంబున వినిశ్చ-యంబు చేసి యరిగి రపుడు ద్వార
కాపురంబుఁ జేరఁగా ద్రౌపదీప్రభృ-తులగు స్త్రీలతోడఁ దారగఁదరలి.

ఉ. మానివరేణ్య! కృష్ణుఁడు సమస్తజగత్పతి భూమి వీడి స్వ
ర్యానము చేయు నంచు విని యాదృతి నాపరమాత్మతోడుతన్
బూనికఁ బోవఁగాఁ దలఁచి పూర్ణమనోరథయుక్తిఁ గృష్ణునిన్
మానవలోకవాసులగు మాన్యులు పెక్కురు చేరి రాపురిన్. ౨౮౧౫

ఉ. వచ్చినవారి నెల్లరఁ బ్రభావయుతాత్ముఁడు పద్మలోచనుం
డచ్చుగ శాస్త్రరీతిని సమాదృతిఁ బూజయొనర్చి బాష్పముల్
హెచ్చుగ నేత్రపద్మముల నెంతయు నింప గభీరవాక్కుల
త్యుచ్చయభావముం దెలుప నొప్పుగఁ బల్కె మునీంద్రసత్తమా! ౨౮౧౬

సీ. "ఓసార్వభౌమ! యత్యున్నతిగుణ! యుధిష్ఠిర! మిత్ర! యర్జున! స్థిరభుజబల!
భీమసేనా! మీకు ప్రియమున నీపౌరజానపదుల నెల్ల సంతతంబుఁ
బాలింపవలయును భావించి మీయాత్మజన్ముల పోలిక సాధులార!
స్వర్గంబునకు నేను జనను న్నవాఁడ నిప్పుడె భూతలంబును విడిచి" యనుచుఁ

తే. బలుకఁగాఁ బాండవులు దుఃఖకలితచిత్తు-లగుచు, వినికృష్ణువాక్యంబు, లంత నశ్రు
పూర్ణనేత్రాబ్జులై కడుఁ బూన్కి వేఱు-వేఱ నిట్లని పల్కిరి విబుధమాని!

వ. ధర్మరా జిట్లనియె ౨౮౧౮

క. "భువనాధిప! శ్రీకృష్ణా!-భవదనుగమనం బొనర్ప భావించితి, నీ
భువి నీవు లేకయుండినఁ-దవిలి వసింపంగఁజాలఁ దథ్యము నేనున్." ౨౮౧౯

వ. భీమసేనుం డిట్లనియె ౨౮౨౦

క. "ఏ ననుగమింతుఁ గృష్ణా!-పూనిక నివసింపఁజాల భూతలమున నో
దీనశరణ్యా! యిట నీ-యాన సుమీ నీవు లేకయ క్షణమైనన్." ౨౮౨౧

వ. అర్జునుం డిట్లనియె ౨౮౨౨

తే. ''నీవె నాప్రాణ మగుదువు, నీవె యాత్మ,-వీవె గతి, నాకు మతివి నీవే యగుదువు,
దేవ! శ్రీకృష్ణ! భూమిపై నీవు లేక-యొక్కక్షణమైన నుండఁగా నోప సుమ్ము.''

వ. నకులుం డిట్లనియె ౨౮-౨౪

ఆ. ''జగదధీశ! మేను జను దెంతు నీతోడ,-నుండఁజాల నిందు నొక్కనిముస
మైన నీవు లేని యవనీతలంబున,-నిజము, నిజము నాదు నిశ్చయంబు.''

వ. సహదేవుం డిట్లనియె ౨౮-౨౬

క. ''దేవా! రక్షకుఁడవు, నా-కీవే ప్రాణంబులన్న, నీవె గతివిగా,
యీవసుధ నుండఁజాలను,-నీవెంట న్వత్తు, నాదు నిశ్చయ మిదియే.'' ౨౮-౨౭

ఆ. ఆమహానుభావు లగు పాండవులు వేఱు-వేఱ నిట్లు పలుక విని ముకుందుఁ
డంత స్వాంశఁ బుట్టినట్టి ద్రౌపదిఁ గాంచి-పలికె మందహాసకలితుఁ డగుచు.

ఉ. ''భూతలమందు నుండుటకు బుద్ధిఁ దలంతువె? స్వర్గలోకముఀ
ఖ్యాతి వెలుంగఁ జేరుటకు నాత్మఁ దలంతువె! కృష్ణ! తెల్పుమా!
యీతతి నాలసింపక, త్వదీప్సిత మెట్టిదొ? యాలకింప సం
ప్రీతిని నున్నవాఁడ'' నన వేగమ ద్రౌపది యిట్లనెఀ మునీ! ౨౮-౨౯

తే. ''నేను నీయంశభూతనై నెగడుదాన,-నాపరాత్పర కాళిక వాద్య వీవు,
జలమున జలంబు చేరుటవలె నిను నిపు-డనుగమించుచునున్నదానను మహాత్మ!''

క. సురలోకమునకుఁ బయనం-బిరవుగఁ గావించు త్రిజగదీశ్వరుఁ గృష్ణుఀ
దరిసించి బలుఁడు వగచుచు-నరముని! గద్గదిక నిట్లు పలికె నయమునఀ

చ. ''ధరణిని వీడి స్వర్గపురి ధన్యతఁ గూర్పఁగ నెంచితేని, యో
వరద! త్వదీయసేవకుల భవ్యుల వృష్ణికులంబునందుఁ బెం
పరయఁగ జన్మమెత్తిన మహామతిమంతులఁ గొంచు వెంట, నీ
తరుణమునందె వెళ్లఁదగు ధర్మము కృష్ణ! యనుగ్రహంబునఀ. ౨౮-౩౨

తే. వృష్ణివంశజు లైన క్షత్రియవరేణ్యు-లీమహాభుజు లెల్లరు నీవు పుడమి
యందు నుండకపోయిన నధివసింపఁ-జాల రొక్కనిముసంబేని జలజనాభ!''

సీ. అంతఁ బీతాంబరుం డరవిందలోచనుఁ డయిన శ్రీకృష్ణుఁ డత్యధికభక్తి
భూసురులను బిల్చి భూరిదక్షిణ లిచ్చి స్వపురంబు వీడి నిర్జరనివాస
మునకుఁ బయనమయ్యె, వెనువెంట బలరాముఁ, డామహాశయువెంట నంటి వృష్ణి
వంశ్యులెల్లరుఁ బంచపాండవుల్ సామాత్యులై నడచిరి వనితానివహము

తే. సంతసంబున వెంటరా, సర్వులు జల-నిధితటంబును జేరిరి, నిఖిలజాన
పదు లనేక దేశీయులై వఱలువార-లెల్ల ననుగమించిరి కడు హృష్టులగుచు.

సీ. అంతలో నంది యత్యమలరత్నవినిర్మితంబైన దివ్యరథంబు సింహ
ములఁ బూన్చి యాకాశముననుండి యచటికిఁగొనివచ్చె,మఱియును మునివరేణ్య!
పద్మసంభవుఁడగు బ్రహ్మదేవుఁడు దివ్యరథముల వేనవేల్ ప్రథితరీతి
సమకూర్చి యంతరిక్షంబున దేవతానివహంబుతోఁ గూడి నిలిచియుండె,
తే. సాగరతటంబునందు నచంచలమతిఁ
జేరియున్న శ్రీకృష్ణుని శిరమువీఁద
సురవరుల్ పుష్పవర్షముల్ గురిసి రెంతొ
సంతసము నొందుచును మది సంయమీంద్ర! ౨౭౩౫

చ. వివిధములౌ మృదంగములు భేరులు బోరుకలంగ వేడ్కతో
నవిరళరీతిఁ జేసిరి, యనంతముదంబునఁ బెక్కుఘంటలన్
బ్రవితతనాద ముప్పతిలఁ బల్మఱు సల్పిరి, యచ్చరల్ దమిన్
దవిలి విచిత్రనృత్యములఁ దాపసివర్య! యొనర్చి రత్తఱిన్. ౨౭౩౬

క. ఈవిధముల నుత్సాహము-తో విబుధులు చెలఁగుచుండఁ దోయజనయనుం
డై వెలయు కృష్ణుఁ డెల్లరు-సేవింపఁగఁ గాళియయ్యెఁ జిత్రముగ మునీ!

చ. పటుతరసింహవాహమగు భవ్యరథంబునఁ గూరుచుండి యు
ద్భటమగు తేజ మొప్పఁగ విభాసితుఁడై పరదేవిరూపమున్
దటుకునఁ బొంది దేవతలుఁ దాపసవర్యులు సన్నుతింపఁగాఁ
జటులగతిన్ జనెన్ శివుని సద్మముఁ జేరఁగ, నంత నెల్లరున్. ౨౭౩౭

ద్రౌపది మొదలగువారు తమ దేహములఁ ద్యజించుట

తే. కమలసంభవుఁడాదిగాఁగలుగు సురలు
మునులుఁ గనుచుండ ద్రౌపదియును సముద్ర
జలమును స్పృశించి, కాళికావిలసితతను
వందు లయమయ్యె మునినాథ! యద్భుతముగ. ౨౭౩౮

తే. అంతఁ బ్రత్యక్షధర్మమయప్రభుండు-శాంతుఁడు, యుధిష్ఠిరుఁడు వరస్యందనంబు
నెక్కి యతిశీఘ్రగామియై యెలమి శుభద-మైన స్వర్గలోకముఁ జేరనరిగె మౌని!

క. బలరాముఁడు నర్జునుఁడును-జలనిధిజలమును స్పృశించి చయ్యన రూపం
బుల వదలి నూత్నజలదం-బుల పోలిక దేహకాంతి పొలుపొంద మునీ!

తే. పద్మశంఖచక్రగదలు భాసిలంగ–నాల్గుహస్తంబులందు విన్నాణముగను,
గరుడవాహనారూఢులై సరభసగతిఁ–జనిరి వైకుంఠదివ్యభువనమునకును.

క. భీమాదులెల్ల నంబుధి–సీమ నిలిచి గాత్రములఁ ద్యజించి జలనిధిఁ
దా మరిగిరి స్వర్గమునకు,–నీమాడ్కి౯ యె వృష్ణివరులు హిత మెఱఁగి మునీ!

తే. ఈవిధంబుల నెల్ల రీయిలను వదలి–స్వర్గమున కేగ రుక్మిణీప్రముఖసతులు
శాంభవశరీరధర లయి స్వపదమునకు–నుత్సుకత్వంబు మదులందు నొప్పచుండ.

క. చనఁగా శ్రీకృష్ణప్రియ–వనితలు తమ దేహములను వదలి ముదము నె
క్కొనఁ బూర్వక్రియ భైరవ–తనువులతో నపుడె చనిరి తమ పదములకు౯.

తే. అచట శ్రీదామవసుదాము లాలకించి
కృష్ణదేవుండు స్వర్గపురిం బ్రవేశ
మాచరించె నటంచుఁ, దా రరిగిరి జయ
యును, విజయయును నను రూపులను ధరించి. ౩౮౪౬

సీ. ఈవిధంబునఁ బరదేవి భూభారంబుఁ బాపఁగా నెంచి యప్పరమశివుని
కోరికఁ బూర్తిగఁ గొనసాగఁజేయఁగా శ్యామసుందరరూప మీమహి నవ
తారంబు నొంది యిచ్ఛారతిఁ బుంరూపమున సర్వలోకజనని యమేయ
మహిమంబు నెఱపి సమ్మతి మేదినీభారకుల నెల్లను హరించి ఛలముతోడ,
తే. మరలఁ దన దివ్యరూపంబు మహితరీతి
జగముల వెలుంగ ధరియించి సకలజనని
యాత్మదివ్యధామముఁ జేరె నతిముదమున
నాదిభగవతి యోగిజనావతంస! ౩౮౪౭

చ. హరియు జగత్ప్రభుండు తన యంశను బూర్ణముగా ధరించి యి
ద్ధరణి జనించుఁ గృష్ణుఁ డనఁ దద్దయు సన్నుతిసేయ, శంభు స
ద్వరమున భూమిభారకుల వారక సంహరణంబు చేయఁగా
నిరవుగ ద్వాపరాంతమున నెంతయు నొండొక కల్పమందున౯. ౩౮౪౮

చ. ధరఁ బరదేవి కృష్ణతనుధారిణియై జనియించినట్టి స
చ్చరితము భక్తియుక్తులయి సంతతముం బఠియింతు రేరు, వా
రరయఁగ సర్వసౌఖ్యముల నంది యిటం బరమందుఁ గాంత్రు ని
ర్జరులకు దుర్లభంబయిన శాంకరిసత్పదమందు భద్రముల్." ౩౮౪౯

వ, అని యానతిచ్చి, మఱియును. ౩౮౫౦

క. విజ్ఞానలసితభావా!-ప్రజ్ఞానఘనప్రభావభావితవిభవా!
యజ్ఞక్రియానుభావా!-యజ్ఞఫలావాప్తిహేత్వనంత విభావా! ౩౮౭౧

గద్యము

ఇది శ్రీలలితాత్రిపురసుందరీ కరుణాకటాక్షవీక్షణ సమాసాదితోభయభాషాకవితావిభవ, జనమంచి వంశప్రభవ, కాశ్యపసగోత్రోద్భవ, సుబ్బయార్యతనూభవ, కావ్యపురాణతీర్థ విద్యద్బిరుదవైభవ వేంకటసుబ్రహ్మణ్యశర్మ విరచితకృతులయందు శ్రీమహాభాగవత పురాణమునఁ బంచమాంశము

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీ మహాభాగవతము

షష్ఠాంశము

ఏఁబదితొమ్మిదవ అధ్యాయము

క. శ్రీకరసుగుణ విలాసా! – లోకైకశరణ్యచరిత! లోకవికాసా!
నాకైశ్వర్య విభాసా–భీకరదనుజాంతకృత్ప్రవృద్ధోల్లాసా! ౨౮౫.౧

బ్రహ్మమయీ మహాకాళీస్థానవర్ణనము

తే. శ్రీమహాదేవుఁ డీరీతిఁ బ్రీతివెలయ–నారదమునీంద్రునకుఁ దెల్పఁ గోరికమెయి
నారదుఁడు దేవదేవుని గారవమునఁ–గాంచి యిట్లని పల్కె సమంచితముగ.

సీ. "ఓ జగన్నాయక! యురుకృపామయచిత్త! సకలసన్నుతపాదజలజయుగ్మ!
యుత్తమోత్తమమయి యొప్పెడు పరదేవిచరితంబు వినఁగ నాశ్రవణములకు
వేడుక యయ్యెడు, విందొనరింపవే భగవతీమూర్తిప్రాభవము మీఱఁ
గైలాససీమ శంకరు సన్నిధానంబునను వెలుంగుచునుండునట్టి విధము
తే. నాపరాదుర్గవరసూక్ష్మరూపమును, త–దీయదివ్యధామంబు నమేయమయిన
శారదీయ మహాపూజ సల్పువిధము–నో మహాదేవ! తెల్పవే యర్హరీతి.

తే. కాళికాదేవి విశదసూక్ష్మమగురూప–మెట్టిది? తదీయసుస్థాన మెట్టిదగునొ?
నాపయి ననుగ్రహం బుంచి యోపరశివ!–దేవదేవ! మహాదేవ! దివిజవినుత!"

క. ఈవిధిఁ బ్రశ్నింప మహా–దేవుఁడు నారదునితోడఁ దెల్పఁగఁ బూనెన్
"దేవీచరితము విను, మతి–పావనము వచింతు"ననుచు భవ్యమనీషన్.

ఉ. "నారద! మున్ను తెల్పితి ననంతమహామహిమాఢ్యమై మహా
దారత వెల్గు దేవివరధామమహావిభవంబు, నద్ది యే
వారికినే నగమ్యమయి భాసిలుచుండును, దేవదానవుల్
కోరి కనంగఁజాల, రతిగోప్యమునై తగు నెంచిచూచినన్ ౨౮౫.౨

సీ. పరమేశ్వరీదివ్యభవనపార్శ్వంబునఁ గల దొక్క ధామంబు లలితమగుచు,
బ్రహ్మాదినిర్జరవరులకునైన సుదుర్గమ్యమై, గుప్తమార్గము నయి,
యత్యంతకమనీయమై శోభనాకృతి నెసఁగుచు నుండు మునీంద్రవంద్య!
రమ్యసుధాసముద్రపరివేష్టితమయి యెల్లదిక్కులయందు నింపుగులుకు
తే. జ్వలనకాంతిని భాసిల్లు భవ్యరత్న–నికరసంఘటితంబగుఁ బ్రకటితగతి,
దానిమధ్యభాగంబునఁ దనరు నొకపు–రంబు మణిమయావరణతోరణయుతంబు,

క. నాలుగు ద్వారంబులు సువి-శాలములయి నాల్గుదిశల స్వచ్ఛములగు ము
క్తాలలితజాలవల్లిక-లోలి వెలయ నందమగుచు నొప్పు మునీంద్రా! ౨౮౫౯

క. ఆపుర మతిశోభితమై-దీపించు విచిత్రచిత్రదివ్యపతాకా
స్థాపితమయి యత్యంతసు-ఖాపాదక మగుచు ధ్వజసమాలంకృతమై. ౨౮౬౦

తే. అరుణనేత్రులు చిత్రఖట్వాంగధరులు-భైరవులు పెక్కువేలు శశ్వదభిరక్ష
చేయుచుందురు తద్దుర్గసీమయందు-వెలుఁగు ద్వారగణంబుల నిలిచి యెపుడు.

చ. శతధృతిముఖ్యులైన సురసత్తములైనను భైరవాజ్ఞ స
మ్మతిఁ గన కచ్చటం దిరుగ మానసమందుఁ దలంపఁజాల రే
వితమున నేని యెల్లరకు భీతిని గల్గఁగఁజేయు దైత్యసం
తతికిని నద్భుతంబగుచుఁ దా నలరుం బుర సుద్ది నారదా! ౨౮౬౨

సీ. ఆపురవరమధ్యమందు నానారత్ననిర్మితంబును, మణినిచయదివ్య
చిత్రిత స్తంభసంశ్రితము, సువర్ణభూషణభూషితంబగు సద్మ మొప్పు,
నామందిరము మధ్యమందు సహస్రసింహోర్ధ్వమై రత్నసింహాసనంబు
వెలుఁగొందు, దానిపై వెలయు శవోపరిభాగమునను దేవి యోగవిద్య
తే. సకలమానసపద్మసంచరణశీల-యౌనా మహావిద్య శ్రీకాళికాంబ వెలయు,
నాపరాంబయె సర్వలోకైకజనని-భద్రదాయి మహామాయ వరమునీంద్ర!

సీ. ఆపర దేవి బ్రహ్మాండకోటుల సృష్టిపాలనలయములఁ బ్రథితరీతిఁ
జేయంగ దక్షమై చెలఁగును స్వేచ్ఛచే, బ్రహ్మరూపిణియయి పరఁగుచుండు,
విజయాదియోగినుల్ వేఁచి చతుష్షష్టిసంఖ్యకులగువారు చతురమతులు
పురకార్యములనెల్లఁ బూనిక చేయుచునుంద్రు తదాజ్ఞచే నురుతరగతి,
తే. వరమునీ! దేవి దక్షిణభాగమందుఁ-గడుముదముతోడ నుతఁడు మహాకాలుఁ డన స
దాశివుం డుండుఁ దృప్తితోఁ దా రమింప-నమ్మహాకాళి సంప్రీతి ననవరతము.

తే. భైరవులు పరివేష్టింప బాహ్యసీమఁ-జెలఁగుచుండు పరాంబికాసిద్ధమంది
రంబు సౌమ్యంబు గడు నద్భుతంబు దుర్ల-భంబు బ్రహ్మాదులకునైనఁ బరమమౌని!

చ. కమలజవిష్ణుశంకరుల గారిప మొప్పఁగఁ గూడి శ్రద్ధతో
నమరవరేణ్యుఁ డింద్రుఁడు మహామతి యా పర దేవిఁ జూడ నా
సమయమునందె ఘోరతరసాధ్వసదంబగు బ్రహ్మహత్య పా
పమునను ముక్తుఁడయ్యె సురవారసమర్చిత! సన్మునీశ్వరా! ౨౮౬౬

తే. అపుడు బ్రహ్మయు విష్ణుండు నమరనేత-యయిన యింద్రుండు దేవదేవాతిశయమ
హాప్రసాదంబునను గాంచి యాపరాంబఁ-గాళికాదేవి సంతోషకలితు లయిరి.

క. విను మోహవత్యా! దేవీ-ఘనమందిరబాహ్యసీమఁ గడు విస్తృతి నొ
య్యనఁ జెప్పెద, నవహితమతి-మునివంద్యా! యిపుడు నీకు ముద మొదవంగన్.

సీ. ఆ దివ్యసౌధంబు నన్నిదిక్కుల రత్నవరణావేష్టితమయి వఱలుచుండు
బహిరంగణము చతుర్ద్వారశోభితమయి రత్నతోరణముల నూత్నరీతి
శోభిల్లుచుండును సురముని! యవ్వాని రక్షించుచుంద్రు నిరతి సతంబు
నద్దానిలోపల నలరుచుఁ గామాద్య లుపయోగినులసంఖ్య నొప్పుచుంద్రు

తే. తద్బహిస్సీమను వసింత్రు దర్శనార్థ
లగుచు బ్రహ్మలు కోటికోట్లట్లె విష్ణు
మూర్తులును, దర్శనోత్సుకుల్ మునివరేణ్య!
యెన్నఁగ నసంఖ్యులగుచు మహోన్నతగతి ౨౮౯

సీ. ధ్యానపరాయణు లై నిల్చియుంద్రు బ్రహ్మాండకోటులయందు నలరువారు
తద్బహిర్భాగానఁ దాపసివర్య! వివిధరత్ననిర్మితవిశదమగుచు
వెలయుఁ జతుర్ద్వారవిలసితభాగంబు, సంతత మచ్చటఁ జతురులయిన
గణములు కోటిసంఖ్యలు పరిరక్షణ మాచరించుచు నుందు రర్హరీతి,

తే. నాచతుర్ద్వారములకంటె నవలఁ గోటి
సంఖ్యలగు త్రిదశేశ్వరుల్ సరవి నింద్ర
ముఖ్యు లాదేవిదర్శనమును మనమునఁ
గోర్కెఁ గోరుచు ధ్యానయుక్తు లయి చిరము. ౨౯౦

క. నానారత్నపుష్పవ్రతతి-మై నెగడును ద్వారిసముదయం, బీక్రియ ని
త్యానూనశోభ నంబిక-యానతి రక్షింత్రు సేవకాళి సతంబున్. ౨౯౧

చ. పురమున కుత్తరంపుదిశఁ బుష్పితదివ్యసుమాప్తిచిత్రబం
భరరవసంకులం బగుచు భాసిలు నోమునినాథ! దివ్యమై
వరరుచిఁ బారిజాతవనవర్య మొకం, డట సర్వకాలము
స్థిరత వసంత మొప్పుచును జెల్వగుచుండును నేత్రపర్వమై. ౨౯౨

చ. పవనము మందమందముగఁ బర్వుచునుండును, బ్రహ్మవిష్ణుము
ఖ్యవిబుధవర్గ మెల్లపుడుఁ గాంక్ష చెలంగఁగఁ బక్షిరూపముల్
దవిలి యటన్ వసించుచు నుదారత నప్పరదేవికీర్తివై
భవము మనోహరంబుగను బాడుచు నుంద్రు ప్రభాతవేళలన్. ౨౯౩

మ. వరమౌనీశ్వర! యా పురంబునకుఁ బ్రాగ్భాగంబునందున్ మనో
హరమై దివ్యసరోవరంబు గల, దం దత్యద్భుతస్వర్ణపం
కరుహంబు ల్కుముదంబులున్ గనుఁగొనం గాంతింబులై భృంగని
ర్భరఝంకారయుతంబులై సతతమున్ రాజిల్లెడున్ వేడుకన్. ౨౯౪

క. సరసీతటమునఁ జంపక-కురవకము లశోకములును గుసుమవితతులన్
బరిమళము నెఱపఁగ మనో-హరమయి భాసిల్లుచుండు నతికాంతంబై. ౫౮౭౫

తే. నారదా! చిత్రవివిధరత్నములచేత-విరచితంబయి సోపానవితతి తత్స
రోవరమునకు నంతట రీవిమెఱయు-చుండు, నాపుర మీరీతి నొప్పుమిగులు.

శా. దేవీరమ్యనివాస మీవిధమునన్ దీపించు, నూత్నంబులౌ
భావంబు ల్పొసఁగింగ గళల్ చెలువుగా భాసిల్ల వేర్వేఱ నెం
తేవింత ల్పచరించు విద్య లవి యెన్నే నూర్జితప్రక్రియన్
సేవించున్ మునినాథ! యచ్చట జయశ్రీదేవి నిత్యాదృతిన్. ౫౮౭౭

శా. నానారూపములన్ సదాశివుఁడు విన్నాణంబుగాఁ దాల్చి యో
మానీంద్రోత్తమ! దాని దక్షిణమునన్ మాహాత్మ్యముం జూపుచున్
దా నుండుం బ్రియమారఁ గ్రీడలను నిత్యం బున్నతిన్ దేవి య
త్యానందంబునఁ దేల్చుచుండఁ గనుచున్ హర్షించుచున్ నెమ్మదిన్. ౫౮౭౮

ఆఱువదియవ అధ్యాయము

ఇంద్రునకు బ్రహ్మహత్యాప్రాప్తి

సీ. అంత నారదమౌని యంతఁకువ వెలయ మహాదేవుఁ బ్రార్థించి యడిగె నిట్లు
"దేవదేవా! మహాదేవ! నాపయి ననుగ్రహ ముంచి పూర్ణంబుగాఁగఁ దెలుపు,
మేరీతి యింద్రున కేర్పడె బ్రహ్మహత్యాదోష? మాపురందరుఁడు బ్రహ్మ
మున్నగువారలు పూన్కి మహాకాళి దర్శింప నేరీతి తరలివచ్చి?

తే. రామహాదేవు కరుణచే నఖిలసురవ-రులును, బ్రహ్మాదులును జేరి సలలితగతి
సర్వలోకములను దాఁటి సాటిలేని-కాళికాలోకమును జేరఁగలిగి రెట్లు? ౫౮౭౯

క. ఏవిధమున భైరవగణ-సేవితమై రక్షితమయి చెలఁగెడు పరదే
వీవరపురంపు ద్వారము-దేవా! చేరి? రని యెల్లఁ దెలుపుము కరుణన్. ౫౮౮౦

మ. పరమేష్ఠిప్రముఖామరప్రకర మేపక్కిన్ జగన్మాత సు
స్థిరమై యంతిపురంబునందు వెలయన్ సేవింపఁగాఁ బోయి త
ద్వరపాదాంబుజదర్శనంబు సలుపన్ భాగ్యంబులం జేసి? రే
కరణిన్ దేవి చెలంగె నప్పు? డెదలోఁ గాంక్షింతు, వే తెల్పుమా." ౫౮౮౧

క. వినయమున నిట్టు లడుగఁగ-మునినాథుఁడు నారదుండు ముదమున దేవీ
ఘనమహిమఁ దెల్పఁగా నొ-య్యన నారదుఁ గాంచి యమ్మహాదేవుఁ డనెన్.

సీ. ''నారదా! విను తొల్లి సారసభవదత్తవరగర్వమున మహాసురుఁడు వృత్రుఁ
డను దనుజాధీశుఁ డధికబలంబున సురలనెల్లను గెల్చి గరిమ మీఱి
యింద్రాధిపత్యంబు నేర్పడఁ దాఁ బొంది చంద్రసూర్యానలశ్వసనధనద
దండధరాదుల దండించి వారల యాధిపత్యంబుల నపహరించి

తే. యధికబలవిక్రమాన్వితుఁ డయి జగముల
నెల్లఁ దానయి యేలుచు నెంతయు మహి
మంబుతోడ నేకాధిపత్యంబు దర్ప
మొప్పఁగా వెల్గుచుండె నిత్యోదయమున. ౨౮౮౩

ఇంద్రుఁడు దధీచిని యాచించుట

ఉ. ధీనిధివై వెలింగెడు దధీచిమహాస్థివినిర్మితాస్త్రమే
వానిని జంపఁగాఁదగిన శాణము, దానిని బట్టి యింద్రుఁడే
పూనికఁ గొట్టనౌననుచు భూరివచంబుఁ బితామహుండు ము
న్నే నియమించె నెంతయు మునీశ్వర! నారద! యద్భుతంబుగన్. ౨౮౮౪

చ. సురగురుఁడౌ బృహస్పతి విశుద్ధతపోవిభవానుభావుఁ డా
దరమున బోధచేయ బలదైత్యవిభేది వినీతుఁడై వెసన్
సరసిజగర్భుఁడైన విధిసన్నిధికిం జని, భక్తి వేఁడి, త
ద్వరవిధ మెల్ల విస్తరత బ్రహ్మకృప న్విని, యంత నారదా! ౨౮౮౫

చ. జగదభిరక్షణార్థమయి సంయమివర్యు దధీచిఁ గాంచి య
త్యగణితశక్తితో వెలుఁగునట్టి తపస్వి వేఁడనెంచి దే
వగణమహాప్రభుం డయిన వాసవుఁ డాదృతిఁ జేరఁబోయె నా
ప్పగను దదాశ్రమంబు మునిముఖ్యసమాశ్రితదివ్యసీమకున్. ౨౮౮౬

క. మునిసత్తముఁడైన దధీచిని గని వందనమొనర్చి చేతులు జోడిం
చి నిలిచె నప్పురుహూతుఁడు,-మునియును స్వాగతము నడిగె మునిజనవంద్యా!

సీ. అంతరంగంబున నమరనాథుఁడు తన యాశ్రమంబునకును నరుగుదెంచె
నని యెంచి యప్పుడు మునివరుండు దధీచి తా లేచి యాసనం బొలి నొసఁగి,
కుశలాదికంబులఁ గూర్మితో నడిగి ''యో దేవరాజా! యిట నీవు ప్రీతి
రాఁ గతం బేమొకో? వేగ దెలుపు'' మంచుఁ బ్రశ్నించె, నంతట వాసవుండు

తే. తృప్తుఁడై మునివర్యు దధీచిఁ గాంచి
వినయమునఁ బల్కె ''మునినాథ! యనయము భవ
దీయచిత్తంబునకు నేది తెలియరాక
యుండు మా వృత్తమంతయు నొక్కరీతి ? ౨౮౮౮

చ. మునివర! వృత్రనామకుఁడు భూరిబలాఢ్యుఁడు రాక్షసేశ్వరుం
డనుపమమైన బ్రహ్మవర మాదృతి నొంది యహంకృతాత్ముఁడై
యనయము లోకపాలకుల నందఱ గెల్చి త్రిలోకనాథుఁడై
తన కెదు రెవ్వరుంగనక తాఁ బరిపాలన మాచరించెడున్. ౨౮౫

ఆ. వాని భయమువలన స్వర్గంబు వదలి మే-మెల్లసురల మిట్టు లుల్లములను
గలఁత నొంది మానవులను బోలుచు మర్త్య-భూమిఁ జేరినార మోమునివర!

తే. యజ్ఞభాగంబులా సున్న, యర్చనంబు-సలుపువారలు లేరైరి జగతియందు,
నిట్టి దుర్గతి నొంగితి, మెట్టు లింక? -నేమి తెలుపుకు నాగతి యిట్టులనుచు?

క. దేవతలం గష్టాంబుధి-లో బడి మునుఁగంగనీక లోకంబుల సం
భావింప నుద్ధరింపఁగ-భావంబున నీవు తలఁపవలయు మునీంద్రా! ౨౮౫-౧

క. నీవే మాదుఃఖంబుల-నేవేళం దీర్ప, నెవ్వ రింకను లేరో
దేవా! నిష్కృతి నీవే-భావింపుము, నీవె మాకుఁ బ్రాపు మునీంద్రా!"

చ. గివిజనరేణ్యు పల్కుల దధీచి ప్రియంబున నాలకించి, "వా
సవ! గనినాఁడ యోగయుతచక్షువుచేఁ గడచన్న వార్తలన్
బ్రవిశదరీతిఁ గాఁదగిన వార్తల నెల్లను నామనంబునన్
మివులఁగఁ దెల్పు మిప్పు డెద మీరలు గోరెడు కోర్కె యంతయున్."

సీ. నావుడు నిర్జరనాథుండు మునినాథుఁడైన దధీచితో నతిశయముగు
వినయంబుతోఁ బల్కె "వినుము తాపసనాథ! కరుణతో డుతినన్నుఁ గనుము తండ్రి!
భవదీయమైనట్టి భవ్యసన్నిధికి నే నరుదెంచినట్టి యప్పరమకార్య
మును దెల్పుచున్నాఁడ, వ మునఁ గడుభయం బావరించుచునున్న, దైన నిపుడు

తే. మనవి చేయుచున్నాఁడ, మట్టుమీఱి-సంచరించుచునున్న రాక్షసవరేణ్యుఁ
డయిన వృత్రాసురునకు బ్రహ్మ యొకరీతిఁ-జేసియున్నాఁడు మృత్యువు సిద్ధమౌని!

ఉ. ఆవిధముం గృపన్ వినుమ మహాశయపూజిత! తావకాస్థిచేఁ
జేవ వెలుంగ నెంతయును సిద్ధముచేసిన యస్త్రసంచయం
బే వడి వానిఁ జంపఁగల, దెద్దియు వ్యర్థమె యంచు, దానికై
సేవయొనర్చి పొందుటకుఁ జెచ్చెర నీ శరణంబుఁ జొచ్చితిన్. ౨౮౬

చ. మునివర! సర్వలోకహితమున్ భవదీయవశంబు నైన యీ
యనుపమకార్య మంతయును నాదృతిఁ దెల్పినవాఁడ, నీదు నె
మ్మనమున కెట్లు తోఁచునొ సమంజస మంచును, నవ్విధంబునన్
వినయము మీఱఁ జేయుదును, వేఁడెద, యుక్త మదేదొ యెంచుఁడీ." ౨౮౭

దధీచిప్రత్యుత్తరము

సీ. ఈవిధంబునను మహేంద్రుండు సురపతి యా దధీచికిఁ దెల్ప నమరమౌని!
విను మంతట దధీచి మనమున యోజించె, "నేమి చేయఁగ నగు నిపుడు? విముఖు
గా నింద్రుఁ బంపుట కార్యమా? యటుగాక కాయంబు వదలుట కార్యమగునె?"
యంచు నించుక సేపు చంచలుం డగుచును ద్వైధభావంబును బడసి, తుదకుఁ
తే. బలికె "రాజ్యంబుఁ గోల్పోయి భ్రష్టులయిన
వారలై మామకాస్థిచేఁ బదవు నొగి
నందఁగలిగిన, నాదు దేహంబు యోగి
మునఁ ద్యజింతు లోకహితార్థముగ, నిజంబు. ౨౮౯౮

చ. ఎవని శరీర మెన్నఁగఁ బరేప్సితహేతువులన్ నశించు, నా
ప్రవిమలదేహమే మిగులఁ బ్రస్తుతికెక్కును, ధన్యమైన దా,
భువిని ననిత్య మౌఁ దనువు, పూజ్యతరంబగు ధర్మమే సతం
బు వెలయుఁ, గాన దేహమును బూనికఁ ద్యజించెదఁ గాక యిప్పుడే." ౨౮౯౯

చ. సురపతిసమ్ముఖంబున విశుద్ధత నిట్లు దధీచి పల్కి యు
ద్ధురనిజతేజ మెంతయును దోపఁగ వెల్గుచు యోగమౌని తె
ద్వరతనువుం ద్యజించి, కడుభద్రమునై విలసిల్లుచున్న య
ప్పరమపదంబు మోక్షమును భాసురకీర్తిని నొందె నారదా! ౨౯౦౦

ఉ. అత్తఱి నింద్రుఁ డంతయును నారసి, నాటకమౌట కుస్సురిం
చుత్తలపాటు నొందుచును, నూర్పులఁ బుచ్చుచు, లోకసౌఖ్యసం
పత్తిని గోరు నీచుల మభవ్యుల మంచని దూరుచున్ వగన్
దత్తఱ మంద యుండె నటఁ దా నొకయించుక సేపు సన్మునీ! ౨౯౦౧

ఉ. అంత మహేంద్రుఁ డామునిమహాస్థుల సాదరుఁడై గ్రహించి, యు
ల్పంతముతోడ వృత్రునిఁ బ్రభావము మీఱ వధించు కోరికన్
స్వాంతము పొంగుచుండ బహుశస్త్రసమూహములన్ రచించి, తాఁ
జెంతకుఁ బిల్చి దేవతలఁ జెచ్చెర యోజన సల్పె నొప్పుగన్. ౨౯౦౨

సీ. సురవీరు లెంతయు శూరులై వెనువెంటఁ జనుదెంచుచుండఁగా శతముఖుండు
దేవదురాసదు దితిజవర్యుని నెదిరింపఁగాఁ బయనించె ధృతిని మించి,
కడుభయంకరమైన కార్ముకవరమును గరమునఁ దాల్చి యాశరవరేణ్యు
యుద్ధరంగమునకు నుద్ధతితోఁ బిల్చె, నపుడు వృత్రాసురుం డతిబలాఢ్యుఁ
తే. డాలమున నొనర్పఁగా వచ్చె, నంత నింద్రుఁ
డధికశౌర్యమునన్ దధీచ్యస్థినిర్మి

తాస్త్రముల వజ్రమునను జక్రాయుధమునఁ
గొట్టి వృత్రాసురుని ధరఁ గూల్చె ననఘ! ౨౯౦౩

ఉ. నారద! యీవిధిన్ సురగణప్రభుఁడైన శతక్రతుండు పెం
పారఁగ వృత్రుఁ జంపి కలుషాత్మకుఁ డయ్యెను బ్రహ్మహత్యచే,
గారవ మొప్పఁగా వినుము కాళిక నాజగదేకమాత నే
తీరునఁ జూడవచ్చె ననఁ, దెల్పెద దానిని నింక నారదా!" ౨౯౦౪

అఱువదియొకటవ అధ్యాయము

ఇంద్రుఁడు బ్రహ్మహత్యను బోఁగొట్టుకొనుటకుఁ గావించిన యత్నము

వ. శ్రీమహాదేవుండు నారదమునీంద్రున కిట్లనియె. ౨౯౦౫

సీ. "సంగరస్థలమున సమరదుర్జయుఁడైన వృత్రాసురునిఁ జంపి పృథులశక్తి,
నైరావతముమీఁద నాసీనుఁడయి యింద్రుఁ డఖిలదేవగణంబు లాదిమునులుఁ
దను బరివేష్టించి చనుదేరఁ గడువైభవంబునఁ బొంగుచుఁ బరమమైన
యమరావతిం జేరి యానందమున సుధర్మాహ్వాసనంబున నధివసించి

తే. వినయవినమితగాత్రుఁడై విబుధవరుల-దేవమునులను గాంచి సద్భావమునను
వినుతి యొనరించి పల్కె గంభీరమధుర-వాక్యముల నిట్లు నారదవరమునీంద్ర!

చ. "మునిజనమాన్యుఁడున్ వితతపుణ్యతనుండు దధీచి నేను గో
రినయటు నాదుపల్కులను బ్రీతిని నెమ్మది గారవించి యొ
య్యనఁ దన యస్థిపుంజముల నర్పణచేయ స్వకీయకాయ మే
పునను బరిత్యజించి చనె మోక్షపదంబును జేర వెల్గుచున్. ౨౯౦౬

ఉ. దానను బ్రహ్మహత్య యతిదారుణపాపము నాకుఁ గల్గె, నో
మౌనివరేణ్యులార! యది మాన్పఁగ శక్యము గాదుగా! కృపన్
మానసమందుఁ బూని నను మాన్యునిగా నొనరింప నిప్డె దే
పూనికతోడఁ గల్మషము పోవు నుపాయము తెల్పుఁడీ త్వరన్." ౨౯౦౭

చ. అనవుడు దేవమౌనులు మహాశయు "లో విబుధేంద్ర! స్వేచ్ఛచే
తనె తన దేహమున్ వదలి ధన్యత బ్రహ్మపదంబు బొందఁగాఁ
జనెను దధీచి, దానను నెసంగఁగఁజాలదు బ్రహ్మహత్య నీ
కు, నియతి నంతయున్ వినుము, కొద్దిగఁ గిల్బిష మబ్బు వాసవా! ౨౯౦౮

ఉ. ఆ దురితంబు వాయుటకు నత్యధికంబగు భక్తితోడ సీ
వాదృతి నశ్వమేధము మహాఘునికృంతన మాచరింపు, మిం
కేదియు భీతిలే'' దనఁగ నింద్రగురుండును నాలకించి స
మ్మోదముతోడ 'నౌ, సదిదె పోలు' నటంచును బల్కె నత్తఱిన్. ౨౯౧౦

క. సురవరు లెల్లరుఁ గడుసం-బరమున 'హయమేధ మొనరుపందగు' ననుచున్
సురనాథుతోడఁ బల్కిరి,-హరియును శాంతాత్ముఁ డగుచు నలరె మునీంద్రా!

క. అంతిపురములోనికిఁ గడు-సంతసమున దేవవిభుఁడు చనె, విబుధవరుల్
స్వాంతముల మోదమున స్వని-శాంతంబుల కరిగి రంత సంయమినాథా! ౨౯౧౨

తే. ధర్మశాస్త్రోక్తరీతి సుధర్మవిభుఁడు
వాసవుఁ డొనర్చె నప్పుడు వాజిమేధ
మంత బహుసద్వ్యయంబుతో నఖిలపాప
భంజనముగాఁగ నెంతయుఁ బరమనియతి ౨౯౧౩

సీ. అంతట నొక్కనాఁ డమరిమహాసీంద్రుండు నారదుం డింద్రునిఁ జేరవచ్చి
యర్ఘ్యసత్కారంబు లంది నిర్జరసభయందు దేవేంద్రున కనియె "ముజ్జ
గముల నేలెడు హరీ! కావించితివి హయమేధంబుఁ బూన్కితో, మిక్కుటమగు
బ్రహ్మహత్యాపాపపంకంబు శేషించియున్నది, కనవు మహోన్నతముగ,

తే. నట్టి కల్మషంబు యత్నంబునను శుద్ధి-కార్యమునను బాపఁగా ననువగు
రీతి నరయవైతి, ఖ్యాతి నశించు సు-మ్మిట్టులున్న నిర్జరేంద్ర! నీకు.'' ౨౯౧౪

క. సురమునిపల్కుల విని ని-ర్జరపతి ''హయమేధ మేను సల్పితిఁ బాపో
త్కరముం బాయఁగ, నది యే-సరణిని శేషించె దేవసంయమి! మఱియున్.

తే. బ్రహ్మహత్యాదురిత మెట్లు పాయఁగలదు?
తగిన వెరవును యోజించి దయఁ దెలుపుము
నాకు'' ననవుడు సురమునినాథుఁ డాద
రంబునను దెల్పెఁ ద్రిభువనరాజ్యపతికి ౨౯౧౬

క. ''సురనాథ! భక్తి గౌతము,-గురువర్యునిఁ జేరనరిగి కోరు ముపాయం,
బురుతరసకలార్థవిదుం-డిరవగు వెరవును వచించు నెంతయుఁ గరుణన్. ౨౯౧౭

క. గురువాక్యమె వరశాస్త్రము,-గురువాక్యమె వరతపంబు కోర్కులఁ దీర్పన్,
గురు వెద సంతోషించినఁ-బరమార్థదుఁ డగుఁ, గొఱంత వఱలదు దేనన్.

తే. గురువరోక్తి ప్రాయశ్చిత్తసరణి వెలయు-నంచు సకలవేదంబుల యాశయంబు,
గురువరాజ్ఞను గార్యంబు జరపి పాప-పంక్తినుండి విశుద్ధిని బడయఁగలవు.''

ఇంద్రుఁడు గౌతమాశ్రమమున కరుగుట

ఆ. దేవమౌని యిట్లు తెలిపి స్వస్థానంబుఁ-జేరఁబోయె, నంత శీఘ్రముగను
గౌతమాశ్రమమున కాతతభక్తి హా-సవుఁడు చేరఁబోయె సంయమీంద్ర!

సీ. మధ్యాహ్నకాలార్కమహితప్రభ ల్మీఱు దివ్యకాయోన్నతు దీప్తకనక
కాంతివిభాసితు ఘనజటాజూటుని సంతతజ్ఞాననిష్ఠాగరిష్ఠు
సకలజగన్నుతు శాంతగుణోపేతు మహనీయయూపుని మౌనినాథు
గౌతమమునివర్యు ఘనుని సాక్షాన్మహాదేవుని రీతిని దేజరిల్లు

తే. స్వగురువరుఁ గాంచి సద్భక్తిసహితుఁడయి ప్ర-దక్షిణం బాచరించి వృత్రప్రహర్త
ధరణిపై మునిపతిసన్నిధానమందు-సాగిలంబడి మ్రొక్కె నిశ్చలమనీష. ౨౯-౨౧

క. మునిపతి గౌతముఁడు సమా-ధిని వీడిన యవసరమున దేవాధీశున్
దన సన్నిధానమునఁ జే-రినవానినిగా నెఱింగి ప్రీతిం బలికెన్. ౨౯-౨౨

తే. "త్రిభువనాధిప! యోవత్స! దివిజవరుల-తోడఁ గుశలంబుగా నున్నవాఁడ వనుచు
నెంచుచున్నాఁడ, వచియింపు మిద్ధచరిత!-నీదు రాకకుఁ గారణం బేది యిపుడు?"

చ. అనుటయు నింద్రుఁ డిట్లనియె "నార్య! గురుప్రవరా! త్వదీయ ద
ర్శనమున నెంతయుం గుశల సంపద, మీరలు లోకమందు నె
వ్వనికి గురుత్వసత్పదవిభాసితు లౌదురొ వాని కెయ్యెడన్
గన నశుభంబు లేదనుచు గట్టిగ నే వచియింతు నెప్పుడున్. ౨౯-౨౪

చ. వినుఁడు కృపాంతరంగ! కడుఁ బ్రేమను నాదగు విన్నపంబు, నే
నొనరిచినాఁడఁ గిల్బిష మదొక్కటి, నెందును గోచరింప దో
యనఘ! తదీయనిష్కృతి, సమాదృతిఁ జేయ సమర్థులైన మీ
యనుపమ సన్నిధానమున కర్థిని జేరితి నోగురూత్తమా! ౨౯-౨౫

చ. ఖలుఁడగు వృత్రుఁ జంపుటకుఁగాఁ గయికొంటి దధీచిమౌని యె
మ్ములనొగి వేఁడి, దాన ననుఁ బొందె గురూత్తమ! బ్రహ్మహత్య నాఁ
గలుషము దుర్నివారమయి కాంచ నశక్యము నౌచు, దాని నే
వలను దలంచి నిష్కృతిని బాగుగ నందుదుఁ జెప్పుఁడీ దయన్. ౨౯-౨౬

ఉ. చేసితిఁ దన్మహాఘము నశించు నటంచును నశ్వమేధమున్
దోసము లెల్లఁ దీర్చుటకుఁ దూర్ణముగాఁ దగు నంచు నెంచి, యా
యాసమె కాని పాప మది యట్టులె యున్నది, పోద, దింక నేఁ
జేసి తరింపఁగాఁ దగిన శ్రీకర కార్యముఁ దెల్పుఁడీ దయన్. ౨౯-౨౭

తే. బ్రహ్మహత్యామహాపాప పంకమగ్నుఁ
డ నగు నే నెట్టులు తరింతు? దీనచిత్తు

నన్నుఁ జూచి యుపాయంబు నెన్ని తెలిపి
దయను రక్షింపఁబూనుఁడీ భయము దీర్చి. ౨౯-౨౮

తే. పరమధర్మవిదుండవై గురుఁడవయిన-నీవు రక్షణచేయ నత్యావిలమగు
పాపముండుట కూడ నాభావమందుఁ-గరము దుఃఖంబు గల్గెడు పరమమౌని!''

క. ఈవిధమున విన్నపముం-గావింపఁగ విబుధవరుఁడు కరుణవినయమునన్,
ధీవిభవుఁడు గౌతమముని-యా వాసవుతోడఁ బల్కె నాదృతిమీఱన్. ౨౯-౩౧

సీ. ''ఓవత్స! సురపతీ! యుల్లంబునందు ఖేదంబును వదలుము, సంబరంబు
నొందుము, పాపంబు పొందికఁ జిరకాల మట్టులె నిలువదు పట్టుగలిగి,
తగిన యుపాయంబుఁ దడవి త్వత్పూర్వశాపప్రశాంతికిఁ దెల్పువాఁడ నిపుడె,
వినుము దర్శించిన మనమున సామాన్య విప్రునిగాఁ గంటివే సురేంద్ర!

తే. ఆ ముని ద్వితీయవిశ్వేశుఁ డనుచు నమ్ము,
మంచితముగ నీ వన్మహాత్ముఁ డగు మహాత్ముఁ,
డామునీంద్రుని హత్యచే నడరినట్టి
పాప మతిఘోరతరమయి పట్టె నిన్ను. ౨౯-౩౧

క. సురనాథా! యప్పాపము-తురగమఖం బాచరింపఁ దొలఁగి శాంతిం
బొరయునె? కరుఁ దీవ్రంబయి-పరఁగుట సామాన్యమగునె పాయఁగఁ జేయన్?

క. దురితంబుం బూర్ణంబుగఁ-బరిత్యజింపంగఁ దలఁపు భావంబున నీ
విరవుగఁ గోరుదువేనిన్-సురనాయక! వినుము నాగు సూక్తిని భక్తిన్.

తే. సకలపాపవినాశిని, సకలసన్నుతి-లోకపావననిరతి, సుశ్లోకచరిత
నమ్మహాకాళికాదేవి నధికభక్తి-దర్శనముఁ జేసికొనఁబొమ్ము తడయ కిపుడె.''

చ. అనవుడు నింద్రుఁ డిట్లనియె నమ్మునినాథునితోడ ''సద్గురూ!
ప్రణుతిసమేతుఁ బూర్ణదయఁ బాపవినాశిని కాళికాంబ యె
య్యనువున నుండు? రూప మెట్టు? లామహనీయగుణాఢ్య యెందుఁ బ్రీ
తిని వసియించుఁ? దెల్పు, పరదేవిని జూడఁగఁబోగు నిప్పుడే.'' ౨౯-౩౪

గౌతముఁడు పురుహూతున కుపాయముఁ దెల్పుట

సీ. నావుడు మునిజననాథుఁడు గౌతముఁ డాయింద్రుఁ గాంచి యిట్లనియెఁ గరుణ
''సర్వసురాధిప! సకలవేదములందు నిఖిలశాస్త్రములందు నిపుణముగను
గాంచినరీతి నే నెంచి వచించుచు నున్నవాఁడనుగాని యెన్నఁడేని
యామహాకాళిఁ బరాంబికఁ జూచినవాఁడను గాను నో వాసవ! విను,

తే. మమ్మహాకాళి దర్శింప నాక్షణమున-బ్రహ్మహత్యాదిపాపనివహము లెల్లఁ
బంచబంగాళ మగునంచుఁ బలికెనెల్ల-వేదములు, ధర్మశాస్త్రము లీశదరీతి.''

ఉ. గౌతముఁ డిట్లు తెల్పుటయుఁ గ్రమ్మఱఁ బ్రశ్న మొనర్చె నింద్రుఁ డ
త్యాతతభక్తి "నో గురువరా! యెటు లీమరితంబునుండి వి
ఖ్యాతిఁ దరింతు, లోకమున నాపరదేవినివాససీమ నా
చేతమునం దెఱుంగకయ సిద్ధినిఁ బొందుదుఁ? దెల్పవే దయన్." ౨౯౩౭

సీ. అంత నాగౌతముఁ డతని భక్తికి మెచ్చి పలికెఁ "బురందర! భవ్యచరిత!
తత్త్వదర్శనులైన ధన్యులు యోగులు భక్తితో మిగులఁ దపంబొనర్చి,
కల్పాంతకాలదీక్షులఁ బూని యా మహాకాళికాదేవిని గాంచుచుందు,
రా దేవి యత్యంతమోదంబు మీఱంగ భక్త్యతిశయముచేఁ బరిఢవిల్లు,

తే. నట్టి నిశ్చలతపమును నాచరించు-వానికిం బ్రీతి జగదంబయైన యోగ
గమ్య పరదేవి కాళిక కరుణ వెలయ-సుప్రసన్నాత్మయై తోఁచు సురవరేణ్య! ౨౯౩౮

శా. నీవన్నన్ సురలోకనాయకుఁడవై నిత్యంబు రాష్ట్రంబు సం
భావింపంగ నఖండభద్రదుఁడవై పాలించుచున్నాఁడ, వ
ట్టి విఖ్యాతినిగన్న రాజ్యమును నెంతేత్పృప్తిఁ బోఁద్రోసి, శ్రీ
దేవిం జూడఁ దపం బొనర్తువు? మదిన్ దృష్టిన్ విచారింపుమా. ౨౯౩౯

క. కనఁబడ దిఁక నేయుక్తియు-ననుపమము, సురేంద్ర! కాళికాలయసముఖం
బునకుం బోవుట తక్కఁగ-మనమున యోజించిచూడ మహితవిచారా! ౨౯౪౦

మ. సురనాథా! భవదీయచిత్తమున సంశోధించి యీయర్థ మా
కరుణావారిధి లోకమాతను మహాకాళిన్ సయంబొప్పఁ ద
త్పురికిం బోయి కనం బ్రయత్నములఁ దోడ్తో సల్పఁగా నర్హమా
పరమేష్ఠ్యాదిసుదుర్లభన్ దురితము ల్వాయంగ భక్త్యున్నతిన్. ౨౯౪౧

తే. ఆమహాకాళి దర్శింప ననువు వినుము,-మొదలు లోకపితామహు నుదితభక్తిఁ
జూచి ప్రార్థింపు, మా దేవిఁ జూచుటకును-నామహాత్ముఁడు తెలుపు నీకర్హరీతి. ౨౯౪౨

ఆ. ఆమహామహుఁడు మహాకాళిఁ జూపింప-యత్న మాచరింప ననువెఱుంగు,
నంత నిన్ను నామహాకాళికాపురం-బునకుఁ దోడుకొనుచుఁ బోవఁగలఁడు. ౨౯౪౩

క. పరమేష్ఠియె కూర్పరియై-పరఁగిన నోయింద్ర! కార్యభాగంబెల్లన్
సరియగుఁ, గొంతంతలే దిటఁ,-బరదేవీకరుణ గలుగు, భయ మిఁక నేలా!" ౨౯౪౪

ఉ. గౌతమమౌనివాక్యములు గాఢతరంబగు భక్తి నింద్రుఁ డీ
రీతిని నాలకించి, మదిఁ బ్రీతి చెలంగఁగఁ బల్కె "సద్గురూ!
ఖ్యాతి వెలుంగునట్టి భవదాజ్ఞ యెటన్ వృథగాదు దేవ! యే
నీతఱి బ్రహ్మసన్నిధికి నేగి, యెఱుంగుదు యుక్తి నచ్చటన్. ౨౯౪౫

చ. అనుమతి యిమ్ము దేవ!'' యని యత్యధికంబగు భక్తితోడ న
మ్మునికిఁ బ్రదక్షిణత్రయము పూజ్యతఁ జేసి, తదీయసమ్ముఖం
బున నిల సాగిలంబడి ప్రమోదము మీఱఁ, దదాజ్ఞఁ బొంది చ
య్యనఁ జనె బ్రహ్మలోకమున కంతట స్వర్గవిభుండు నారదా! ౨౯౮౬

క. సురపతి మంత్రులతోడన్-వరపుష్పక మెక్కి, పద్మభవసన్నిధి నా
దరమునఁ జేరి, సమస్తము-జరగిన వృత్తంబుఁ దెల్పె సంయమిసూక్తిన్.

సీ. దివిజేంద్రుఁ డప్పుడు తెల్పిన వాక్యంబు లెల్లను విని వేడ్క సృష్టికర్త
బ్రహ్మ యిట్లనియె ''నో పాకశాసన! మహాకాళీపురంబు నేఁ గాంచలేదు,
మును దేవకార్యార్థముగఁ దా మహాకాళి యావిర్భవించె, నే నపుడు దేవి
బ్రహ్మరూపిణిఁ బరాత్పరను సనాతనిఁ జూచినవాఁడను శోద్యముగను,
తే. గాంచుచుండ నదృశ్యయై కాళి యెటకొఁ
జనెనొ తెలియంగఁజాల, నేఁ గనినదెల్ల
నింతయేగాని, తత్పురం బే నెఱుంగ''
ననఁగ నింద్రుండు పరమేష్ఠిఁ గని వచించె. ౨౯౮౭

మ. ''పరమేష్ఠీ! యెఱుఁగు లేరువాఁడ నిఁక, నాపాపం బపారంబుగాఁ
బరఁగెన్, దానికి నిష్కృతిన్ దెలుపవే, భవ్యాత్మ యా కాళికా
పురముం గాన నటంచు బల్కెదవు, సంపూర్ణానుభావుండవై
కరుణం బొందగు, దీని నాకు గని, యిక్కార్యంబు సంధింపవే''. ౨౯౮౯

తే. అని పురందరుఁ డతిభక్తినవనతుఁడయి-వేఁడఁగా బ్రహ్మదేవుండు ప్రీతుఁడగుచు
నూఱడించుచుఁ గరుణ సమూత్సుకతను-బల్కె నీక్రియ నారదా! పరమశాని!

చ. ''సురపతివైన నీ వొకటఁ జొప్పడియుండినఁ బాతకంబు ని
ర్జరనగరంబునం దొదవు శాంతివిఘాతములౌ నిమిత్తముల్
వరుస నటంచు నెప్పుడును భావమునం దలపోయుచుందు, నీ
దురితము నిర్జరావళికి దుఃఖదమౌ నని యెంచుచుండెదన్. ౨౯౯౧

క. నీ పాపముఁ బాపుటకై-యోపిక యత్నంబు సలుపుచున్నాఁడను, నే
నేపున గుప్తంబౌ దే-వీపురమును జేర్తు, భయము నీడు మహేంద్రా! ౨౯౯౨

తే. నీదు కార్యానుసారము నిన్నుఁ గూడి
యామహాకాళిఁ గనుఁగొన్నయపుడె ముక్తిఁ
డనుచునున్నాఁడ, నింక నేపని గలుగదు,
సకలమును బరిపూర్ణమై జరుగుసుమ్ము.'' ౨౯౯౩

క. ఈవిధమున నింద్రుని స-ద్భావంబున నూఱడించి పరమేష్ఠి వడిం
దా వైకుంఠమునకుఁ జనె-వేవే దివ్యరథ మెక్కి, ప్రియమున నానీ! ౨౯౫౭

బ్రహ్మేంద్రులు వైకుంఠమున కరుగుట

ఉ. అంతఁ బురందరుండును మహామహిమన్ వెలుఁగొందు పుష్పకం
బెంతయు వేడ్క నెక్కి, వడి నేఁగెఁ బితామహు వెంట నంత, శ్రీ
కాంతుని చేత గుప్తమయి కాంతుల నెల్లు వికుంఠపట్టణ
ప్రాంతముఁ జేరఁబోయె, నటఁ బద్మజుఁ డింద్రుని తోడ నిట్లనున్. ౨౯౫౮

సీ. "సురనాయకా! నీవు కరము ముదంబున నామాట వినవయ్య! ప్రేమమీఱ
పురము బహిర్భాగమున నుండు మించుక యోపికతోఁ, బురుషోత్తముఁడగు
హరియంతిపురమున కరిగెదఁ దొలుత, నవ్వల నీవు రాఁదగు వరుస" ననుచు
నుత్తర్వుఁ గావించె, నత్తఱి నింద్రుఁ డయ్యాజ్ఞావశుండయి యప్పురవరి
ఆ. బాహ్యసీమ నుండెఁ బరమేష్ఠి యుష్టాను-సారముగను, నంత సారసభవుఁ
డాదిదేవుఁడైన హరి జగన్నాథుఁ గాం-చుండె నచటి కేగ నుత్సుకుఁడయి.

క. కనుఁగొనె వికుంఠధామం-బున నంతిపురంబులోన ముదమున లక్ష్మీ
వనితాసరస్వతులు త-న్ననయము సేవింపఁ జెలఁగునట్టి ముకుందున్. ౨౯౫౯

తే. అభినవాంబుదనీలదేహప్రకాశు-శంఖచక్రగదాధారిఁ జారుకౌస్తు
భనవరత్నప్రదీపితవక్షు హరిని-గాంచె నపుడు విరించి తాఁ గడుఁ బ్రియమున.

క. మురహరుఁడు విష్ణు నవ్వాడు సరసిజభవు
స్వాగతంబును బ్రశ్నించె సాదరముగ,
బ్రహ్మయును "దేవ! మీదయ వఱలుచుండ
స్వాగతం" బని పలికె సంభ్రమము మీఱ. ౨౯౬౦

తే "ఓ జగన్నాథ! త్వద్దర్శనోత్సుకుఁడయి-దేవదేవుఁడు పురుహూతుఁ డీవికుంఠ
పురబహిర్ద్వారసీమ మీకరుణఁ బడయ-వేఁచియున్నాఁ" డటంచును విన్నవించె.

చ. హరియు విరించివిన్నపము నాదృతితో విని, "వైనతేయ! నీ
వరిగి సురాధినాథు ఖలభంజను వేగమె తోడి తెమ్ము లో
నరమర లేక యంతిపురి" కంచును నాజ్ఞ యొసర్ప, వెంటనే
గరుడుఁడు తోడి తెచ్చె సురకాంతుని లోపలికిం బ్రియంబునన్. ౨౯౬౧

తే. పురబహిర్ద్వారమున నుండి గరుడుఁ డధిక-గౌరవంబున నత్యంతకాంతి వెలయు
నంతిపురమును జేర్చినయట్టి యింద్రుఁ-డధికభక్తియుతాత్ముఁడై యమరమాని!

మ. హరిపాదాంబుజసన్నిధానమున సాష్టాంగంబుగా వందనో
త్కరము ల్సల్పి కరంబుల న్మోడ్చి "నే ధన్యుండ నైతిన్ భవ
ద్వరసందర్శనభాగ్య మబ్బుట జగద్భద్రానుసంధాయకా!
శరణంబొచ్చినవాఁడఁ బ్రోవఁగదవే చంచత్కృపావారిధీ! ౨౯౬౩

సీ. నీపదాబ్జమున జనించిన సురబృందవంద్య మందాకిని వైభవమున
సకలలోకంబుల నకలంకముగఁ బావనంబు చేయుచును ధన్యతను నెలయు,
నట్టి మహామహిమాఢ్యుఁడ, వఖిలసురైకపూజ్యుఁడవు ని న్ప్రకటముగ
దర్శించి సేవింపఁదగిన భాగ్యంబును బ్రాగ్జన్మమందు నవారిగాఁగఁ
తే. జేసియుంటినిగాఁబోలు శ్రీముకుంద! - యోగిమానససంచార! భోగిశయన!
యాశ్రితావనతత్పరా! యార్యవినుత! - కరుణఁ బ్రోవుము శ్రీకరా! దురితదూర!"

సీ. ఈవిధంబున భక్తి దేవవరేణ్యుఁడౌ పాకశాసనుఁడు శుభప్రదాత
యగు మహావిష్ణుపాదాబ్జసన్నిధి నిల్చి వినుతించి, బ్రహ్మచే ననుమతిఁగొని,
గౌతమమౌనివాక్యము లెల్ల విన్నపంబును జేసె నారాయణుని సమీప
మున వినయంబుతోడను, నంత నిందిరాపతియును సురపతివాక్యసమితి
తే. కరుణమీఱఁగ నాలించి పరమవిస్మి-తాత్ముఁడయి మాఱుపలుకక యఖిలలోక
భర్త యాసీనుఁడయియుండెఁ బద్మభవుఁడు - వజ్రియును నబ్బురంపడ వరమునీంద్ర!

అఱువదిరెండవ అధ్యాయము

ఇంద్రాదులు భగవతీస్థానమున కరుగుట

క. నారదమునీంద్ర! యీరీతి వారిజాక్షుఁ
డాదినారాయణుం డించుకంత తడవు
మౌనమున నుండి సురపతి మమతఁ జూచి
పలికె మృదువాక్యములతోడ సలలితముగ. ౨౯౬౬

సీ. "దేవనాయక! మహాదేవి మహాకాళి బ్రహ్మరూపిణి పరాత్పరి సమస్త
రూప సనాతని యేపున నివసించు దివ్యస్థలంబు నేఁ దెలియఁజాల,
నామహేశ్వరుఁడు తా నాత్మ నెఱుంగును బరదేవివసతి నిబ్బరముతోడ,
శంకరపదపద్మసన్నిధానంబున కరిగి వృత్తంబెల్ల ననువుమీఱ
తే. విన్నవింపుము, వత్తు దేవీపురంబుఁ-జూచువేడుక నిప్పుడే, చూడ్కులలరఁ
గాంచువాఁడను, నింక నే కార్యము గల-దంతకంటెను నుత్తమ మైన దింద్ర!"

మత్త. ఈవిధంబున విష్ణుమూర్తి మహేంద్రుఁగూర్చి వచించి తా
వే విహంగపవాహనుండయి విశ్వనాథుని సన్నిధిన్

భావికార్యము నెంచి చేరఁగ బ్రహ్మాదేవుఁడు వెంటరాఁ
గా వడిఁ బయనంబొనర్చెను గాంక్షతోడుత నారదా! ౨౯౬౯

తే. సురవరుండగు నింద్రుండు హరిహిరణ్య-గర్భులను ననుసరించుచుఁ గదలె నాత్మ
దివ్యరథ మెక్కి, మదిని సంతృప్తి తనరఁ-జేరి రంతటఁ గైలాసశివపురంబు.

ఉ. వచ్చిన యా మహాత్ములఁ బ్రభావసమేతుల విష్ణుముఖ్యులన్
మెచ్చుగఁ జూచి ద్వారమున మెల్లన శంకరసన్నిధానమున్
జెచ్చెరఁ జేరఁబోయి సువిశిష్టవరేణ్యుఁడు నంది యెంతయున్
హెచ్చయినట్టి నమ్రత మహేశ్వరుతోడ వచించె సంయమీ! ౨౯౭౦

శా. "స్వామీ! శంకర! లోకనాయకుఁడు శ్రీవత్సాంకుఁడౌ కేశవుం
డే మీదర్శన మాచరింపఁగ సురజ్యేష్ఠున్ సురాధీశునిన్
బ్రేమంబొప్పఁగ వెంటఁబెట్టుకొని తా విచ్చేసియున్నాఁడు స
ర్వామోదప్రద! ద్వారసీమ భవదీయాజ్ఞం బ్రతీక్షించుచున్." ౨౯౭౧

క. నందీశ్వరు వాక్యము లా-నందమునన్ విని శివుండు "నందీ! వారిన్
సందేహ మేల యిటకున్-ముందుఁ బ్రవేశింపఁ జేయఁ బూను"మనంగన్.

తే. అమ్మహాదేవు నానతి నంది నంది-హరివిధిసురేంద్రులను వడి నంతిపురము
లోఁ బ్రవేశింపఁ జేసె, మెల్లనను వారు-శివుని సన్నిధానంబునఁ జేరి రెలమి.

చ. అమరమునీశ్వరా! హరియు నబ్జభవుండుఁ బురందరుండు సం
భ్రమమున శంభు సన్నిధిని బ్రాంజలులై తమి దండవత్ప్రణా
మములను జేసి దుర్వ్యపయి మాటికిమాటికి భక్తితోడ న
య్యుమయుఁ బినాకపాణియును నుల్లములం బరితృప్తిపొందఁగన్. ౨౯౭౨

ఉ. అప్పుడు వారిఁ గాంచి శివుఁ డాదృతిమీఱఁగఁ బల్కె "మీర లి
ట్లొప్పుగఁ గూడి యిచ్చటికి నుద్యతులై వడి రాఁగతంబు వే
చెప్పుఁడు, కార్య మెయ్యదియొ, శ్రీపతిధాతృసురేంద్రులార! యే
మిప్పుడు చేయఁగాఁదగు నభీష్టముఁ దెల్పుఁ డసంశయాత్ములై." ౨౯౭౩

క. పరమేశ్వరుఁ డీకరణిన్-గరుణం బ్రశ్నించిన౦బొనర్పఁగాఁ గేశవుఁ డా
పరశివునిఁ గాంచి కడుసం-బరమునఁ దెలుపందొడంగె స్వచరిత మెల్లన్.

సీ. "పరమేశ! 'యీపురందరుఁడు కావించిన బ్రహ్మహత్యామహాపాతకంబు
పోవఁ బ్రాయశ్చిత్తమును దెల్పు'మని శాస్త్రవిదుని సంయమివర్యు సదమలమతి
గౌతము నడుగఁగా నా తాపసియు 'మహాకాళీపురంబును గడఁకఁ జేరి
యాదేవి దర్శింపు' మని పల్క 'నప్పుర మెట నున్నదో యేను నెఱుఁగ'ననియె,

తే. నంత సురనాయకుండు బ్రహ్మంతికంబుఁ
జేరి, 'దేవీపురం బెందుఁ జెలఁగుఁ, జెప్పు
మా'యటంచును వేఁడ, బ్రహ్మయును 'నాకుఁ
దెలియ'దని పల్కెఁ బరదేవిదివ్యవసతి. ౨౯౭౯

తే. శంకరా! యంతఁ బరమేష్ఠి శక్రు వెంటఁ-గొనుకొని వచ్చినాఁడు న న్నాడఁగోరి
నాదుసన్నిధి, కింద్రుండు నళినగర్భు-నాజ్ఞఁగొని ప్రశ్న చేసె నయ్యర్థమె శివ!

మ. మది నాశ్చర్యము పొంగ నాభగవతీమాన్యాశ్రయంబౌ పురం
బెది యంచు న్గనలేక యప్పు డిట కే నేతెంచితిన్ శంకరా!
త్రిదుదారంబగు సమ్ముఖంబునకు దేవా! నీవె కాళీపురం
బుదితప్రజ్ఞ నెఱుంగువాఁడ వని వే యూహించి నిక్కంబుగన్. ౨౯౮౧

ఆ. ఓ దయామయాత్మ! కాదని చెప్పక-సర్వవిదుఁడ వౌటఁ జయ్యన మముఁ
గరుణాలోడఁ జూచి కాళీపురంబును-జేర్చి దేవిఁ జూపు శ్రితసుఫలద! ౨౯౮౨

తే. మూఁడులోకములను నేలు పుణ్యమూర్తి
యగు మహాభుజుఁ డింద్రుఁ డీ యమరవిభుఁడు
పాపయుక్తుండయిన నెట్టు లోపు మూఁడు
లోకములు సుస్థిరములయి ప్రాకటముగ?'' ౨౯౮౩

చ. అనవుడు శంభుఁ డిట్లనియె''నత్యధికంబగు భక్తి నిల్పి దే
విని మది లక్షవర్షములు విస్తృతయోగముతోఁ దపంబు చే
సి నియతిఁ దన్మహావసతి చిత్తమునం గన నోపినాఁడ, నో
ఘనగుణులార! మీకుఁ గల కాంక్షలఁ దీర్తు నసంశయంబుగన్ ౨౯౮౪

మ. కర మానందముఁ బొందుఁడీ మది మహాకాళీపురం బెంతయున్
ద్వర దర్శింపఁగఁ జేయువాఁడ నొగి మీ వాంఛానుసారంబు, త
త్పురి నా దేవిని జూపుదున్, నియతి నాతోఁ గూడి గోవింద! యి
ద్దరు వేంచేయుఁడు భక్తి నిప్ప''డని ప్రీతిన్ బల్కె యో నారదా! ౨౯౮౫

క. ''నందీ! వృషమును బూన్పు మ-సుందరగతిన్,రత్ననిచయమండితమై యిం
పొందు మహాకాళీపురి-కిం దఱలఁగవలయు నిపుడె కృతమతి!'' యనఁగన్.

తే. పరమభక్తియుతుండు సత్వరగతి వృష-వాహనము సిద్ధపఱచి విశ్వవిభు సన్ని
ధానమునని ల్పెనారదా! తాపసవర!-శంకరుఁడుసమ్మదముఁబొందస్వాంతమందు.

చ. హరుఁడు వృషంబుపై, హరియు నత్యధికానిలవేగవంతుఁడౌ
గరుడునిపై, విరించియును గ్రమమణివ్రజనిర్మితంబునై

పరఁగు విమానవర్యమున, వాసవుఁ డున్నతపుష్పకంబుపై
సరగున నెక్కి దేవివరసద్మముఁ గాంచఁగఁ బోయి రోమునీ! ౨౯౮౮

సీ. గగనమార్గంబునఁ గడువడిఁ బయనంబుఁ గావించు శంకరకమలగర్భ
కమలజవాసవుల్ కడుముదంబునఁ బరస్పరము భాషించిరి వరమునీంద్ర!
"శ్రీమహాకాళికయే మహేశ్వరి పరాత్పర యగు శాంభవి తలఁచిచూడ,
నా దేవికి సమాన లగువార లెవ్వరుఁ గనుఁగొన లేరు భువనములందు,
తే. నెల్లలోకంబులకు మఱి యెల్ల దేవ-గణములకు భూతకోటిక గుణములకును
నందరాకయె వెలుఁగొందు, నవల నధికు-లైన దేవతలే లేరు పూని వెదుక.

సీ. ఆ పరదేవియే యఖిలంబును సృజించు, నాజగన్మాతయే యనవరతము
సకలకష్టంబులఁ జక్కఁ దీఱిచి పాలనముఁ జేయు సర్వభూతములఁ బ్రీతి,
నా మహాకాళియే నేమంబుతోఁ దుది సర్వశరీరుల సంహరించు,
నాత్మ వినోదించు, నంతియెకాని యే యధికారమును మన కరియలేదు,
ఆ. ముగురు మూర్తులమును బూర్ణంబుగా నస్వ
తంత్రులము, నిజంబు, తలఁపఁగా ని
మిత్త మాత్రులమయి మెలఁగుచునున్నార,
మహహా! దేవిమహిమ యద్భుతంబు." ౨౯౯౦

క. ఈవిధమునఁ గొనియాడుచు-దేవీవిభవంబు నెమ్మదిం గల భక్తిన్
భావించి, వివిధవిధములఁ-బ్రోవంబొగడుచును జనిరి త్రోవన్ వారల్. ౨౯౯౧

తే. కనిరి మునినాథ! శ్రీమహాకాళికాపు-రంబు, మణిగణసుపరిష్కృతంబుఁ, గనక
చిత్రితంబు, నత్యద్భుతశిల్పకౌశ-లాభశోభిత, ముత్తమం, బతిరుచిరము.

సీ. ఆ దివ్యపట్టణం బటునిటు వీక్షించి హరివాసవవిరించు లాత్మలందు
నతివిస్మయముఁ బొంది యస్మదీయములైన పట్టణంబులు వ్యర్థపరికరములు
గాఁగ నిర్మితములై కనఁబడుచున్నవి యహహా! యీపట్టణం బనుపమమగు
నని యెంచుచును జగదంబికాపురవరరామణీయకము నిస్సీమ మనుచు
తే. బ్రహ్మవిష్ణుశివామరపతులు వర్ణ-నంబు చేయుచుఁ దిరుగుచు నంబమహిమ
నిజమనోరథవిభ్రమనిరతి నుండి-రాపురిము వెల్పలను జాలసేపు మౌని!

క. వారు తలంచిరి "మనల నె-వారుం గనుఁగొన, రదేల వచ్చితి రన, రే
తీరునను జూడ, రీపురి-కారయ మన రాక యేల"యని మదులందున్. ౨౯౯౨

అఱువదిమూఁడవ అధ్యాయము

యోగినులు ఇంద్రాదులకు శ్రీదేవిని దర్శించు నుపాయ మెఱింగించుట

వ. అట్లు కొంతసమయ మరుగంగ యోగినుల్ పుష్పములను గొంచుఁ బోవువారు వచ్చి యచ్చోటికి "నవారు మీరెవరు? ఏటికిల వచ్చినారు? తెలుపుఁ డిచ్చ" ననిరి.

ఉ. వారల పల్కులన్ విని స్వవాంఛితము ల్మది సంస్మరించుచున్
వారిజగర్భముఖ్యు లొగి వారిని గాంచి వచించి "రీశ్వరీన్
గోరికతోడఁ జూడ నిటకున్ గడు భక్తిని వచ్చినార, మే
తీరున దర్శనం బగునొ తెల్పుఁ" డటంచు ననుగ్రహార్థులై. ౨౯౯౬

సీ. "వాసవముఖ్యులారా! సముత్సుకత మహాకాళి దర్శనార్థులగుచు
వచ్చితిరే మీ రిందు వసియింపఁగా నెంతకాలంబు కావలెనొ గల్గుఁబోలు
శ్రీమహాకాళి దర్శింపఁగ భాగ్యంబు, వినుఁడు, జగన్మాత స్వీయమాయ
సకలజగంబు సముత్సుకత మోహితముగఁ గావించుచుండు సద్భావులార!
తే. యా మహాకాళిచే మోహితాత్ములగుచు
మఱిని బ్రహ్మాదికుల నిప్పు డెఱచియున్న
వార లని నమ్ముచున్నాము భావమందు"
యనుచు లోపలి కేగి, రయ్యవసరమున. ౨౯౯౭

తే. బ్రహ్మ విష్ణు పురందర భవులు సంయ
మీంద్ర! యొండొరులను జూచి యిట్టులని "రిటఁ
జేరి బహుకాలమయ్యెను, జేయఁదగిన
కార్య మెయ్యది? యిట్లుండఁ గార్యమగునె?" ౨౯౯౮

చ. హరి హరుఁ గాంచి "దేవ! యిటు లాత్మ విముగ్ధతఁ బాసియుండఁగా
సరియగునే? సముత్సుకత సర్వశరీరులఁ బ్రోచునట్టి శ్రీ
కరఁ బరదేవిఁ జూచుటకుఁగా నరుదెంచియుఁ జాలకాల మీ
పురము సమీపభాగమునఁ బుచ్చితి మీక్రియఁ, గాని యింతకున్. ౨౯౯౯

క. పరదేవి మహాకాళిన్-గరము ముదంబునను జూడఁగా భాగ్యము నే
వరుసను జేయఁగనైతిమి,-పరమేశా! దేవి మనలఁ బరికింపదొకో?" ౩౦౦౦

చ. అనవుడు శంభుఁ డిట్లనియె "నార్యగుణాకరులార! యిప్పుడే
చని వరరత్ననిర్మితము శస్తము నైతగు దేవి యుండు ప
త్తనమునఁ జొచ్చి యందఱము ధన్యత నొందుచు లోకమాత పా
వనచరణాంబుజంబుల నవారితభక్తిని గాంత మాదృతిన్." ౩౦౦౧

సీ. ఈరీతిఁ బల్క మహేశ్వరుం డప్పుడే యింద్రాదులగు భువనేశ్వరు లొగిఁ
గదలిరి వేడ్క శంకరునిఁ గూడి, మనంబులందు మహాకాళి నధికభక్తి
నిలిపి ధ్యానించుచు నలలితంబైన తదంతఃపురముఁ జేర, నపుడు శంభుఁ
డింద్రుఁ జతుర్ముఖు శ్రీశునిఁ గని గోపురప్రదేశమునఁ బరమముదమునఁ

తే. చెలఁగు చుత్ఫుల్లనేత్రుఁడై "చింతితార్థ
సిద్ధిఁ గాంక్షించుచున్న యో బుద్ధిమంతు
లార! నిల్వుఁడు, నామాట లాలకింపుఁ"
డనుచుఁ దెలుపఁగఁ దొడఁగె నో మునివరేణ్య! ౩౦౦౨

ఉ. "హేమవిచిత్రితాంశుకము హెచ్చుగ నాకసమందు మారుతో
ద్భ్రామితమై తటిత్ప్రభల భాసిలుచుండఁగ సింహకేతనం
బామహనీయమూర్తి యగు నంబిక సంతసిలంగఁ దత్పురో
ద్దామనికేతనంబుపయిఁ దాండవమాడుచుఁ గాననయ్యెడిన్. ౩౦౦౩

చ. వరుస విమానయానముల వైళమ వీడి, మనంబులందు ని
బ్బరమగు భక్తి నెల్లరును వందనము ల్దమి నిల్పి చేయుఁడీ
శ్వరి కఖిలైకవంద్యకు, నివారణచేయును విఘ్నవారముల్,
కరము పరాంబికాపురముఁ గాంచఁగ నో సుకరంబుగా నికన్" ౩౦౦౪

తే. వారు శంకరవాక్యముల్ వరుసను విని-భక్తి మీఱంగ వాహనవరములు డిగి
ధ్వజముఁ గనుఁగొని మ్రొక్కిరి తత్పురప్ర-వేశము నివారితము చేయ విఘ్నతతుల.

తే. బ్రహ్మవిష్ణుపురందరు ల్పరమశివుని-వెంట నా పరమేశ్వరీ విశదనగర
మును బ్రవేశించి రెంతయుఁ బూన్కి-భైర-వీగణ సురక్షితంబు నిర్విఘ్నముగను.

క. దేవీపురంబునం గల-యా విభవముఁ గాంచి విష్ణుఁ డాత్మన్ స్వపుర
ప్రాశస్త్యము నిందించుచు-దా విస్మితుఁడయ్యె నపుడు తాపసచంద్రా! ౩౦౦౫

మ. నగరద్వారమునన్ జతుర్ముఖముఖు ల్నవ్యోత్సుకుల్ స్థూలకా
యు గణాధీశుఁ జతుర్భుజున్ వితతబాహున్ భవ్య హేరంబు శి
ష్టుగ రక్షాధృతి నున్న దివ్యుఁ గని రచ్చో వార లత్యద్భుతం
బుగ, నంతన్ గజవక్త్రుతోఁ బలికె శంభుం డెంతయుం బ్రీతితోన్. ౩౦౦౬

మ. "విను మోవత్స! గణాధిపా! ద్రుతగతిన్ విశ్వేశ్వరీసమ్ముఖం
బునకుం బోయి, 'త్వదీయదర్శనఫలంబుం బొందఁగాఁగోరి యో
య్యన బ్రహ్మచ్యుత నిర్జరేశ్వరులు భక్త్యావిష్టులై శంభుఁ గో
ల్కొని ద్వారంబున నున్నవా, రనుమతిం గోర్కిన్ నిరీక్షించుచున్. ౩౦౦౭

తే. పురహరుఁడు వారలను గూడి పురము వెలుప
లను నిలిచియున్నవాఁడు, త్వదనుమతిఁ గొని
రాఁదలఁచియున్నవాఁడు వారలను గొంచు
కొని మహాదేవి!' యని నాదు మనవిఁ దెలుపు.'' ౩౦౧౦

గణపతి శ్రీదేవియనుజ్ఞను త్రిమూర్తులకుఁ దెల్పుట

సీ. శంభుని పల్కులఁ జక్కఁగ నాలించి గణపతి తూర్ణంబ కదలివెడలి,
శ్రీదేవియంతఃపురిం జేరి శివుని భాషణములఁ దెల్పఁగా సమ్మతించి,
నందనం బొనరించి పరమేశ్వరీపాదపద్మంబులకు నంతిఁ బ్రాంజలియయి,
పరమేశ్వరుఁ డొనర్పు ప్రార్థనంబును బూర్ణముగ నివేదించె నోమునివరేణ్య!
తే. యంతయును విని జగదంబ యపుడె విఘ్న
పతిని గనుఁగొని ''వత్స! శీఘ్రము సురేంద్ర
బృందమును జేరఁబోయి సంప్రీతి నగుచు
మస్మదాజ్ఞల నెల్ల ని ట్లనువుపోయ ౩౦౧౧

సీ. 'బ్రహ్మాండములు పెక్కు వెలయుచున్నవి యందు బ్రహ్మాదులున్నారు బహువిధులను,
బ్రహ్మాండ మెయ్యది నసతియగా మీకు? నయ్యది తెల్పుఁ'డని, వారి యర్థసూక్తు
లను విని శీఘ్రంబు నను నాకుఁ దెల్పుము'' నావుడు గజపతి దేవగణము
చెంతకు నరుదెంచి చెప్పెర శ్రీదేవి యానతిఁ దెలుపఁగా నజుఁడు మున్ను
తే. గాఁగలుగ వారు విస్మయకలితచిత్తు
లగుచుఁ బలికిరి ''యెఱుఁగము జగము లితర
ము, లవి యెందున్నవో? యఁట ముఖ్యు లెవరొ?''
యనఁగ గజపతి వెంటనే యచటఁ గదలి. ౩౦౧౨

క. పరమేశ్వరి సముఖంబున-కరిగి పలికె వార లాడినట్టి వచనముల్,
కరుణాంతరంగ విని యా-కరివక్త్రునిఁ గాంచి పలికెఁ గ్రమమ్మృదూక్తిన్.

క. ''త్వరితముగ నరిగి హరిహర
విరించులకు నంతిపురిఁ బ్రవేశింపఁగ ను
త్తరు వనుచుఁ దెలిపి, తోడ్కొని
యరుదెమ్ము కుమార!'' యనఁగ నతిమోదమునన్. ౩౦౧౪

క. హరిహరవిరించులకు శ్రీ-పరదేవీయాజ్ఞఁ దెలిపి త్వరతో నంతః
పురమును జేర్చె గణేశుఁడు,-సురపతి పురిబయటఁ జింతఁ జొక్కుచునుండెన్.

క. ''పరమేశ్వరి జగదంబిక-నరయంగానైతి నకట! యాద్యప్రకృతిన్
దురితబలంబున'' నని మదిఁ-బరితాపము చెందుచుండెఁ బరమమునీంద్రా!

త్రిమూర్తులు శ్రీదేవిపురముఁ బ్రవేశించుట

సీ. అంత శంకరుఁ డాదియగువార లత్యున్నతద్వారమునను మోదమునఁ జొచ్చి,
మణిగణనికరసంపద్విరాజితమగు సింహాసనమున నసించి యరుణ
భీమనేత్రత్రయయై ముక్తకేశియై ప్రావాసనయుఁ గోటిభాస్కరసమ
దీప్తయు నతిఘోరదృశ్యమానయుఁ జతుర్భుజయునై వెలుఁగొందు భువనమాతఁ
తే. గనుఁగొనిరి రత్ననిర్మితకర్ణభూష-ణోజ్జ్వల ననర్ఘమణిభూషితోరుదేహ
జలదసమనీల దేహ విశ్వవిమోహన-భీమదంష్ట్ర గిరిగంభీరి నో మునీంద్ర! ౩౧౧౭

ఆ. సకలవిశ్వవంద్య సంస్తుతసర్వాంగి-హారతోరంగసంస్థ వరగుణాఢ్య
మహితదివ్యముక్తాహారవిరాజిత-యయి వెలుంగుచుండె నమ్మహాత్మ!

సీ. రత్నదండములచే రాజిల్లు చామరవిసరంబులఁ గొని సఖులు వీవుచుండఁ
గాలానలసమానఘనదీప్తి నెసఁగుచు దుర్నిరీక్ష్యాకృతితో వెలుంగు
నా మహాకాళి, దివ్యమునీంద్ర! యా దేవి దక్షిణాంగమునను సదాశివుండు
నెలయు మహాకాళి విలసితసంస్థుఁడై భీమనేత్రాస్యుఁడై స్ఫుటజటాము
తే. కుటవిభూషితుఁడగు మదాఘూర్ణనేత్రుఁ-డగుచు శశాంక కాంతశిరుండు ఘనకపాల
ధారి ఖట్వాంగికరుఁడు సంహారకర్త-భిన్నకాలాంజనసనిభుండు విపులతనుఁడు.

సీ. అనూహ్యాది దేవు ననాదిపూరుషుఁ గాంక్షా జగదంతకుని లోకగురుమూర్తిఁ
గోటిసూర్యసమాభుఁ గుంజరచర్మాంబరధరు నాగేంద్రహారసువిభూషు
బ్రహ్మవిష్ణ్వీశులు పరమాముదంబునఁ గనుఁగొని తన్ముఖమున భక్తి
సాష్టాంగముగ మ్రొక్కి జగదంబికకు మహాకాళికి నమ్మహాకాళునకును
ఆ. ప్రాంజలులుగ నిల్చి పరుస శ్రుతిరత-వాక్యసముదయములఁ బ్రస్తుతించు
చుండి రాత్మపరవశులుగ దేవ స్తోత్రముల్-వివిధగతుల,నంత విను మునీంద్ర!

తే. అంతలోన మహాకాళునంగుఁ గలసి
శంభుఁ డంతర్హితుం డయ్యె సత్వరగతి,
బ్రహ్మవిష్ణువు లటఁ జూచి భవునిఁ గాన
కెందుఁ బోయెనో యని చింత నొందిరపుడు. ౩౧౧౮

చ. "మన గతి యెట్లు? శంకరుఁడు మాయము నొంది మఱెందుఁ బోయెనో?
ఘనుఁడగు సురేంద్రుఁ డేవిధిని గాలికిఁ జూడ సమర్థుఁడౌ?" నటం
చును మది చింతచేయఁగను జోద్యముగా జగదంబ తత్క్షణం
బున నె యదృశ్యయయ్యె మునిపుంగవ! యీశునితోడ నచ్చటన్. ౩౧౧౯

తే. విను మహాకాళసహితయై విశదరీతి-దేవి యచ్చటనే యుండె, దివ్యమాన స్వ
కీయమాయను ముగ్ధులఁ జేయ బ్రహ్మ-విష్ణులకుఁ గానఁబడదయ్యె విమలచిత్త!

బ్రహ్మవిష్ణులు శ్రీదేవిని వినుతించుట

ఆ. అంత బ్రహ్మవిష్ణు లా దేవిఁ గనక సం-భ్రమము మీఱ నపుడు ప్రాంజలులయి
భక్తియుక్తి వేదసూక్తుల వినుతించి-రాపరాంబ నిట్లు లమరవరాని! ౩౧-౩౮

సీ. "శ్రీసత్యవిజ్ఞానచిత్స్వరూపిణి! యాద్య! విశ్వకర్త్రి! పరేశి! విశ్వవంద్య!
అతిసూక్ష్మ! నిర్గుణ! యమలవిజ్ఞానగమ్య! వాగతీత! యత్యంతముగను
వందనంబు లొనర్చువారము పూర్ణ! సురూప! శుద్ధా! విశ్వరూప! విశ్వ
వంద్యైకవంద్య! సర్వప్రాణిసముదయాంతస్థ! యత్యుత్తమస్థానసంస్థ!
తే. సకలలోకైకపాలనశక్తియుక్త!-భగవతీ! కాళి! త్వత్పాదపంకజముల
కనవరతమును భక్తితో వినతితతుల-సల్పుచున్నార మంబ! ప్రసన్నవగుము

సీ. మాయిని! మాయ! భీమా! భీమనేత్ర! మాయాతీత! శ్రీదేవి! శ్యామ! నిర్జ
రేశ్వరీ! సర్వభూతేశ్వరీ! సర్వభూతాశయస్థా! కాళి! యాద్యవిద్య!
సిద్ధాంబ! సకలసృష్టిక్రియాసంహారకర్త్రి! చేతుము నమస్కారములను,
ద్వద్రూపశీలముల్ ధామంబు ధ్యానంబు మంత్రంబు నెఱుఁగ మోమాత! వేము,
తే. సకలలోకైకకారణశక్తి! విశ్వ-పూజ్య! సర్వశరణ్య! విభుత్వసంస్థ!
త్వత్పదాబ్జంబులను గొల్చువార మంబ!-శరణు శరణు సత్త్వరూప! శరణు జనని!

సీ. భవదీయశీర్షమే పరఁగు స్వర్గంబయి, నాభిదేశమె తల్లి! నభ మనంగ,
చంద్రసూర్యాగ్నులు చక్షుస్సులగుచుండు, దివమును రాత్రియుఁ దేజరిల్లుఁ
దావకదివ్యనేత్రనిమేషములునాఁగ, నున్మేషబోధంబు నొనరు జనని!
వాక్యంబు, నిర్జరవరసముదాయంబు తెలివితెంబమును బదంబులు మఱి
తే. జానుజంఘలు గుల్ఫము ల్సరవి భూమి-యగును బ్రీతియె ధర్మంబు, నాగ్రహంబ
ధర్మకార్యంబు, మొలఁకెత్తగును సృష్టి,-నీదు నిద్రయె సంహృతి నెగడు సతిము.

సీ. నీజిహ్వయే యగ్ని, నీముఖాబ్జము బ్రహ్మ లంబ! నీభ్రూయుగం బగును సంధ్య,
లోవిశ్వమూర్తి! నీ యుచ్ఛ్వాసమే వాయువగును, నీ బాహువు లష్టదిక్ప
తులు నాఁగ నెగడువారలు, నీదు క్రీడయే సృష్టిస్థితిలయప్రసిద్ధిఁ జెందు,
నిట్టి విశ్వాత్మిక వెట్టివేళలనైన భక్తుల రక్షింపఁ బ్రబలియుందు,
తే. వీశ్వరీ! లోకమాత మాయెడఁ బ్రసన్న
వగుము బ్రహ్మవిద్యారూప! యఖిలసార
బ్రహ్మవిజ్ఞానగమ్య! పూర్ణ! పరమేశి!
కాళి! దుర్గా! ప్రసన్నవు గమ్ము మాకు." ౩౦-౩౭

తే. ఈవిధంబున వినుతింప నెద ముదంబు-నొంది హరికిని బ్రహ్మకు నురుకరుణను
దర్శనంబిచ్చె నప్పు డోతాపసేంద్ర!-కాళికాదేవి యమ్మహాకాళుతోడ.

తే. ఆ మహాకాళి దేహంబునందునుండి-రజతపర్వతకాంతి విభ్రాజితుండు
శంకరుఁడు మహాబాహుండు సత్వరగతి- వెడలివచ్చె మునీ! హరివిధుల కడకు.

ఈశ్వరుఁడు తమరాకను శ్రీదేవికిఁ జెల్పుట

ఉ. అంత హరుండు దేవిఁ గని యాదృతి "నింద్రుఁడు వచ్చి యున్నవాఁ
డెంతయు ద్వారసీమ వసియించి త్వదాజ్ఞ భవత్పదాబ్జముల్
సంతసమొప్పఁ జూచుటకు స్వాంతమునందున వాంఛమీఱ న
త్యంతము భక్తితోడ జగదంబరో! పట్టణబాహ్యవర్తియై. ౩౦౩౧

తే. దివ్యలక్షణములతోడఁ దేజరిల్లు-నీపరామూర్తి గనునట్లు చూపువాఁడ,
నన్నుఁ బంపుము కరుణ నాపన్ను నింద్రు-నీదుసన్నిధిఁ జేర్తు నోనిగమవినుత!"

క. అనుటయు నా జగదంబిక-విని శంకరు వేఁడికోలు విశ్వేశ్వరునిం
గని కనికరమున నప్పుడు-మునినాథా! పలికె వినుము ముదమొప్పంగన్.

సీ. "ఓమహాదేవా! సురోత్తమసంపూజ్య! నిర్జరనాథు మన్నిలయమునకుఁ
గొనిరాఁదలంపు నీకును గల్గియున్నచోఁ గావింపు మట్టులే కార్యమెల్ల,
నాయింద్రునకు దధీచ్యస్థిసంగ్రహమున మును గల్గెఁ బాపంబు భూరిరీతి,
నదియును గ్రమముగాఁ దుదముట్టె మత్పురబాహ్యసీమను జేరవచ్చుట, నిపు
తే. డింక నించుక కిల్బిషంబేని యున్నఁ-దదుపశమనార్థమై యిమ్ము తత్క్షణంబె
దేవ! మామకాంతఃపురదివ్యపాద-ధూళిఁ గొంచెము కొనిపోయి దురితహరము.

తే. అంత నిర్ధూతపాపుఁడై యమరభర్త
మానివరదుర్లభంబైన మత్సభాంత
రంగమున నాదు సన్నిధి రమణ నిలిచి
యుండఁగల భాగ్యమెంతయు నొందఁగలఁడు." ౩౦౩౨

శంకరుఁ డింద్రుని శ్రీదేవీసాన్నిధ్యమునకుఁ దోడ్కొనివచ్చుట

తే. సకలజగదేకమాత కాళిక మహేశ్వ-రునకు నాజ్ఞయొనర్పఁగా మునివరేణ్య!
యంతిపురి నుండు పాంసువు నమరపతికి-నిచ్చి లోనికిఁ దోడ్తెచ్చె నీశ్వరుండు.

సీ. అంత నిర్జరనాథుఁ డడుగడుగునను దేవికి వందనములఁ గావించుచును బ్ర
వేశించె నాత్మ సంప్రీతుఁడై యంతర్గృహంబు మహాదేవు ననుసరించి,
మహనీయమైన తన్మందిరద్వారంబునందు దేవతల కత్యంతదుర్ల
భంబైన లోకైకపాలనచతురజగన్మాతృదర్శనగరిమ నొందె,
తే. నపుడు సద్భక్తితోడ సాష్టాంగదండ-వత్ప్రణామము లొనరించి వరుస వేద
నిచయకథితంబులగు స్తుతిప్రచయముల ను-తించె నాజగదేకవందితను మిగుల.

తే. మరల సాష్టాంగముగ మ్రొక్కి పరమభక్తి-లోకజననియైకిని మునీ! ప్రాకటముగ
బ్రహ్మ మున్నగు త్రిదశాధిపతులు వేడ్క-స్వస్థలంబుల కరిగిరి సంతసమున.

మ. మునినాథా! యెఱుఁగంగఁ దెల్పితిఁగదా పుణ్యప్రదంబైన యీ
ఘనచారిత్రము నీదుకోరిక యొసంగన్, శ్రీమహాకాళి నా
ద్యను బ్రహ్మాదులు గాంచఁబోవుటయు దేవాధీశపాపాపనో
దనయత్నంబు నొనర్చినట్టి కథయున్ దాత్పర్య మేపారఁగన్. ౩౦౩౯

క. ఎవఁ డీచరితము భక్తి-ప్రవణుండయి వినుఁ, బఠించు, వానికి నెందున్
దవులదు బ్రహ్మవధాదిక-మవుపాపసముదయభయముపరమమునీంద్రా! ౩౦౪౦

సీ. అశ్వమేధశతాదు లాచరించిన మహాపుణ్యాస్పదుండయి పొలుచుచుండు,
నపరిమితంబగు నారోగ్యవంతుఁడౌఁ, బుత్త్రపౌత్త్రాదిసంపూర్ణ విభవ
సముపేతుఁడయి యొప్పు, సర్వసంపదలచేఁదులఁదూగుచుండు నత్యలఘురీతి,
దేవీప్రసాదంబుచే విరాజితుఁడయి తత్పదంబును జెంది ధన్యుఁడగును,

తే. నారదా! యెవ్వ రతిభక్తి నవమియందుఁ-గాని సాయంసమయమునఁగాని యష్ట
మీచతుర్దశితిథులందు మిగులశ్రద్ధ-గాఁ బఠనమాచరించు నిక్కముగ మౌని!

తే. తాపసేంద్ర! యమానిశీథమునఁ, బూర్ణి-మాదినమునందు నెవ్వఁ డీమాన్యచరిత
మును బఠించుగవాయుతమును నొసంగి-నట్టి పుణ్యఫలం బొందు నతఁడు నిజము.

సీ. మునివరా! యాపద మొనసిన సమయంబునం దీచరిత్రంబు నధికభక్తిఁ
జదివినఁ బాయు నాపదలెల్ల నప్పుడే, సంపద ల్గామించి చదువువారి
కఖిలసంపదలును నాక్షణంబునఁ గల్గు, శత్రుభయంబులు సమసిపోవు,
సంగ్రామరంగానఁ జదువఁగా దేవీప్రసాదంబునను గల్గు జయము నిజము,

తే. శ్రద్ధతో నీచరిత్రము శ్రాద్ధదినము-నందుఁ బఠియింప సంతృప్తి నంది వాని
పితరు లెల్లను గవ్యంబుఁ బ్రీతితోడఁ-గైకొని భుజింతు రపుడె నిక్కముగ ననఘ!

తే. వినుము నారద! యన్యాయమునను సేక-రించిన ధనంబుతోఁ బితృక్రియ యొనర్చి
నను బితరులకు సంతృప్తి ఘనత నిచ్చు-నీచరిత్రంబుఁ జదువ మునీంద్రచంద్ర!"

అఱువది నాల్గవ అధ్యాయము

గంగావతారకథ

తే. నారదుండు మహాదేవు గారవమునఁ
గాంచి పలుకంగఁదొడఁగె "శంకర! మహాను
భావ! దయతోడ నాదగు వాంఛ మిగుల
నాదృతిని దీర్చితివి దేవ! యలరె మనము. ౩౦౪౧

50

సీ. అతిపుణ్యదంబు మహాపాతకవినాశనంబు దివ్యంబు ధన్యంబు నగుచు
వెలయు దేవీదివ్యవిభవవిస్తృతమహాఖ్యానంబుఁ దెల్పి నా యభిమతంబు
నెఱవేర్చితివి దేవ! నియతి నవ్యక్తమై యద్భుతంబౌ జగదంబికాచ
రిత్రంబు జన్మంబుఁ గృత్యంబు లెల్లను బరదేవి వేడుక జరపినట్టి
తే. యద్భుతములగు కార్యంబు లనువుమీఱ-దేవదేవ! మహాదేవ! దివ్యరూప!
శ్రితజనార్థప్రదా! యింకఁ జిత్తమందు-వాంఛ గలదొక్కటది వినవలతుఁ బ్రీతి.

సీ. హిమవద్గృహమునందు నెంతయుఁ బ్రీతితోఁ బ్రకృతి స్వకీయాంశఁ బ్రభవమొంది,
గంగాస్వరూపంబునం గడుమహిమతో నేరీతి ద్రవరూప మిల ధరించె?
సచరాచరంబగు జగతీత్రయంబున విహరించి దుష్కృత విసరములను
బోఁగొట్టి యేక్రియఁ బూతనరిత్రయై విలసిల్లె? నా దేవి విశ్వరక్ష
తే. ణార్థమయి ధర నవతార మంది యేవి-ధమున వర్తిల్లె? నా చరిత్రమును, దన్మ
హిమము విశదముగఁ దెల్పవే నరకృప''-ననుచు నేఁడు మహాదేవుఁ డాత్మ నలరి.

గంగ ద్రవరూపముఁ బొందుట

మ. ''విను మో నారద! సావధానముగ దేవీదివ్యమాహాత్మ్యమె
ల్లను వాంఛించినరీతి నేఁ దెలిపెదన్, లక్షించి యేపాపి యీ
ఘనపుణ్యంబులకెల్లఁ బుణ్యదమునౌ గాథన్ వినున్, ముక్తుఁడై
చను వే, సంసృతిబంధనావలనన్ జన్మింపఁ డెప్పట్టునన్. ౩౦౮౮

సీ. మను శంకరుండు గంగను బరిగాయమయ్యెనని విని విష్ణుండు ఘనముదమునఁ
జని శంకరునిఁ గాంచి వినయంబునను వేఁడి గంగాసహితుఁడైన గరళకంఠుఁ
దనదు వైకుంఠభవనమునకుం దోడుకొనివచ్చెఁ బ్రియముతోడను మునీంద్ర!
నాహారిహరుల నత్యాదృతిఁ జూడంగ బ్రహ్మాదులైన దేవతలు దివ్య
తే. మునులగు మరీచిముఖ్యు లప్పురవరమును-జేర నరిగిరి, హరియు విచిత్రరీతి
సభను నిర్మింపఁ జేసి యా సభ విచిత్ర-రమ్యమణిమయపీఠవరంబు నునిచి.

క. అందు మహేశ్వరు మది నిం-పొందఁగఁ గూర్చుండఁ జేసి యుదుతరమోదం
బొంది మరి పల్కె ''శ్రుతికా-నందంబుగ గాన మీ వొనర్పుము దేవా!

మ. చిరకాలంబు సతీవియోగము నెదం జింతించుచున్ దుఃఖివై
పరమేశా! కడు విహ్వలత్వమున విభ్రాంతాత్మయు క్షితి నసుం
ధర సంచారము చేసినాఁడ, విపుడో ధన్యాత్మ! స్వీయాంశ సం
బరముం గూర్చుచుఁ జేరె నీసతి శుభప్రాశస్త్య ముప్పొంగఁగన్. ౩౦౯౧

చ. సురవరపూజితా! యిపుడు సుందరి గంగను గూడి క్రీడలన్
సరవిని దేలుచుం గడుఁ బ్రసన్నముఖాబ్జుఁడవైన నిన్ను మే

మెఱయుచు మామనంబుల ననంతముదంబును బొందినార, మో
పరమశివా! త్వదీయమగు భాగ్యమె మాకును భాగ్యదం బగుఁ. ౩౦౫౨

మ. పరమాత్మాహ్వయుఁడవైన నీ విపుడు సంభావించి మద్వాంఛఫల
న్గరుణానీరధి! శంకరా! లలితమౌ గానంబుఁ గావింపు, మె
ల్లరకుఁ శాశ్వతమైన సంతసము గల్గంజేయు, సంగీతముఁ
నిరతిం గోరుచునున్నవాఁడను విభూ! నే భక్తితో నీశ్వరా!'' ౩౦౫౩

క. నిరుపమతేజోధికుఁడగు-హరి చేసిన ప్రార్థనంబు నాలించి దయన్
హరుఁ డాదృతి నద్భుతముగ-వరగానము చేసె లలితభణితి మునీంద్రా!

క. సురవరులగు బ్రహ్మాదులు-హరుని ప్రథమగానము విని యందఱు మౌనీ!
పరవశులై యుండిరి చి-త్తరువున బ్రతిమలట్లు తత్సమయమునన్. ౩౦౫౪

క. హరియును రెండవగీతము-సరవి న్విని పులకితుఁడయి స్వశరీరమునన్
బరతంత్రుఁడయి సభాస్థలి-నొరగె న్విశ్రేష్ఠుఁ డగుచు నో మునివర్యా!

క. అంతం దృతీయగానం-బెంతయు నాలించి హరి మహేశునికడ బ
ల్వింతగ ద్రవరూపంబున-నంతట భాసిల్లె గానమాహాత్మ్యమునన్. ౩౦౫౬

తే. ఈవిధంబున ద్రవరూపమై విభుండు-హరి వెలయ విష్ణుపురమునం దంతటను జ
లంబు వ్యాపించె నెడలేక, యంబుపూర్ణ-మైన వైకుంఠమున నప్పుడద్భుతముగ.

తే. బ్రహ్మ మొదలగు త్రిదశాధిపతులు మూర్ఛ
దేఱి హరిమందిరం బెల్లదిశల జలమ
యంబుగా నెంచి రతివిస్మయాత్ములగుచు
విష్ణుమూర్తిని నంతట వెదకి రపుడు. ౩౦౫౯

తే. ఆపురము జలపూర్ణమై హరియు జలము
యుండయి కనంబడఁగఁ గాంచి యుల్లమందు
బ్రహ్మదేవుండు శంకర భవ్యగాన
మున ద్రవత్వము హరి బొందె ననుచుఁ దలఁచె. ౩౦౬౦

సీ. తన కమండలువునఁ దత్సలిలం బెల్ల నింపి యాపరమేష్ఠి నియతితోడ
వైకుంఠపురముఁ బూర్వపురీతిఁ గావించె, బ్రహ్మకరస్థమై పరఁగుచున్న
తత్కమండలుగతద్రవరూపమే గంగ కరియ మూర్త్యంతరం బగుచు వెలసె,
నీరమయంబయి నెగడు గంగను గమండలువునఁ గొని యంత జలజభవుఁడు

తే. లక్ష్మిని సరస్వతిని గాంచి లలితవచన
ములను నూరార్చి తన పురంబునకు నరిగె,

హరుఁడు గంగాసమేతుఁడై యాత్మధామ
మైన కైలాసపురిఁ జేరె నమరవాహ! ౩౦౬౧

క. వచ్చిన సురవరు లెల్లరుఁ-జెచ్చెర స్వస్థానములకుఁ జేరఁగ నరిగి, రి
ట్లచ్చెరువుగ ద్రవరూపము-వచ్చెను గంగకును లోకపావనికి మునీ! ౩౦౬౨

క. పరమేష్ఠి కమండలువున-నిరవుగ గంగ నివసించె నెలమిని, గరుణా
వరయై త్రిలోకపావని-పరఁగెన్ మునిలోకవంద్య! భద్రద యగుచున్. ౩౦౬౩

చ. విను మిఁక దేవి యీవరుస విష్ణుపదంబున నుద్భవించి లో
కనిచయమందు విష్ణుపదకంజభవాఖ్యను బొందె, దిక్కులం
దున భువనాళి వ్యాప్తిగని తోరపుభక్తిని వేడ్క భూమి యే
యనువునఁ జేరి లోకముల నాదృతిఁ బ్రోచెనొ తెల్పుదున్ దయన్. ౩౦౬౪

అఱువదియైదవ అధ్యాయము

వామన చరిత్రము

క. మును దైత్యగణాధీశుం-డనుపమబలశాలి బలి మహాధార్మికుఁ డే
పున నింద్రుని లోకత్రయ-మును బల్మిని నపహరించె మునిగణవంద్యా!

శా. ఆ వైరోచని యిట్లు దేవవిభు రాజ్యంబెల్ల నొక్కుమ్మడిన్
దా వాంఛం గొని యాక్రమింపఁగ వెసన్ దాపంబు దీపింపఁగా
శ్రీవిష్ణున్ జగదీశు నయ్యదితియుం జిత్తంబునం జేర్చి, సా
ఖ్యావిఖ్యాతిని గోరి యింద్రునకు సంప్రార్థించె నోనారదా! ౩౦౬౬

సీ. అంత నారాయణుం డదితిప్రార్థనమును విని, సుప్రసన్నుఁడై "విబుధమాత!
కోర్కె యెయ్యది నీకుఁ? గోరుము సంప్రీతి, నొనఁగూర్తుఁ, దావకాత్యుగ్రతపము
పరితృప్తిఁ గావించె, భద్రంబగును నీకు" నని పల్క నదితియు నపుడు "దేవ!
నారాయణా! నీవు నాయందుఁ గరుణింతువేని ప్రియంబున నిద్ధతేజ!

తే. విబుధనాథుని రాజ్యంబు విభవ మొప్ప
బలి యపహరించి యున్నాఁడు ప్రాభవమున,
దానిఁ గైకొని మరల సంతసము చెలఁగ
నింద్రునకు నిమ్ము, వర మిది యే మహాత్మ!" ౩౦౬౭

క. "జననీ! వైరోచనుఁ డె-య్యనువున వధ్యుఁడగు? నా మహాధర్మయుతుం
డనఘుఁడు, యశస్వి, ప్రహ్లా-దుని మనుమఁడు, భక్తుఁ డతఁడు; స్తుతికర్తుఁ డగున్.

ఉ. తావకవాంఛితార్థ మతిధన్యత నొందఁగ వామనాకృతిన్
నీ వరగర్భమందున జనింతును గశ్యపనందనుండనై,
వావిరి ముద్దుగంబుల నవారితరీతిని వేఁడి యాబలిన్
దేవగణాధినేతకును దెచ్చి యొసంగెదఁ దల్లి! నమ్ముమా! ౩౦౬౯

క. మదిఁ గల చింతను వీడుము,-కొదువ నిలుపవలదు, నీదు కొడుకును మరలం
బదిలముగఁ ద్రిలోకేశ్వర-పదమున నుంతును, నిజంబు పల్కితి'' ననుచున్.

క. హరి భగవంతుఁడు శ్రీశుఁడు-పురుషోత్తముఁ డదితి కిట్లు భూరికరుణాకో
వర మొసఁగి, యప్పుడే తాఁ-దిరోహితత్వంబు నొందె దివిజమునీంద్రా!

క. దితిజాధినాథుఁ డగు బలి-వితతైశ్వర్యంబుఁ గొనెడు వేడుకతో నీ
క్షితి నదితిగర్భమును స-మ్మతిఁ జేరెను, నవతరింప మది నెంచి మునీ! ౩౦౭౦

తే. సర్వలక్షణ సంపూర్ణుఁ జారువదన
పంకజుని దివ్యరూపునిఁ బరమపురుషు
వామనునిఁ గాంచెఁ బుత్త్రిగా వరమునీంద్ర!
యదితిభాగ్యంబె భాగ్యమై యలరె నపుడు. ౩౦౭౩

క. ఒకనాఁడు వామనుఁడు దాఁ-బ్రకట ద్విజరూపుఁ డగుచు వరధర్మాత్మున్
సకలైశ్వర్యయుతున్ బలి-నకలంకతఁ జేరఁబోయె నర్థిత్వమునన్. ౩౦౭౪

క. దనుజేశ్వరుఁ డగు బలిఁ గని-''యనఘా! మూఁడడుగు లవని యాచించెద, ని''
మ్మని యడిగె వామనుం, డో-య్యన నాద్విజుఁ గాంచి పలికె నతఁ డబ్రముతో.

సీ. ''బ్రాహ్మణశ్రేష్ఠ! స్వల్పముగఁ గోరఁగనేల? యడుగుము ద్వీపంబునైన, వర్ష
మైన, గ్రామంబైన, నర్థమైనను, దాన సంశయింపకుము నీ స్వాంతమందు,
కాదన కిచ్చెదఁ గాంక్షించునది యెల్ల, వడుగ! యల్పంబయి వటులు దాన
మరయ దాతకుఁ గీర్తి నణఁగించు, నటుగాన స్వల్పతరంబగు భవదభీష్ట

తే. మడ్డుచెప్పక యిచ్చుట కాత్మ నాకు
సంతసంబును గూర్పఁగాఁజాలదయ్యె,
వేఁడు మెదియైన ఘనమయి విస్తృతమగు
కోర్కెఁ, దప్పక తీర్తు నిక్కువముగాఁగ.'' ౩౦౭౫

సీ. బలిచక్రవర్తి సంభావించి పల్కిన పల్కుల నాలించి బ్రాహ్మణవటుఁ
''డోమహారాజ! నీ వుల్లంబునం దన్యచింతలు మాని యాశ్రితమనోర
థంబుఁ దీర్పుము, కడు సంబరమున నేను గోరిన యర్థంబుఁ గూర్పు, మదియె
నాకుఁ బ్రియంబగు, నీ కపకీర్తి యద్దాన రా దించుకయైన నెపుడు,

తే. పుడమి మూఁడడుగుల నిమ్ము, భూరిసుకృత
మధికకీర్తియుఁ గల్గు నత్యద్భుతముగ,
నట్టి యశ మింతదనుక నీ వనుభవింప
లేదు, పొందంగఁగల వింక మోదముననుు.'' ౩౦౭౭

క. వామనుని మాటల న్విని-యామహనీయసభయందు నలరు మహాత్మ్యల్
ధీమహితులు సభ్యులు బలి-భూమీపతి ధర్మరతుని బోధించి మునీ! ౩౦౭౮

క. పలికిరి హితముం గోరుచు-''బలిరాజేంద్రా! వటుండు వాంఛించిన య
ట్లిల దాన మిమ్ము, కాదని-పలుకకు మోసార్వభౌమ! భావింపు మెదన్.

క. ఫలదంబయి లోకంబున-నలఘుయశముఁ గూర్చు నీకు నవనీనాథా!
యిలలో గ్రహీత కెయ్యది-గలిగించు సుతృప్తి, యదియె కా యొసఁగఁదగున్.''

చ. సదమలబుద్ధులై యొసఁగు సభ్యులు పల్కిన వాక్యసంచయం
బెద నెలకొల్పి, వామనున కెంతయు భక్తిఁ బదత్రయంబు నే
కొదువయు లేక చిత్తమునకుం జరితార్థతఁ గూర్ప నిచ్చి, స
మ్మదమున నూపులన్ గుశలఁ బూనికఁ జేఁ గొనె, నంత నారదా! ౩౦౮౧

తే. దైత్యగురుఁడగు శుక్రుండు దానవపతి
యయిన బలిచక్రవర్తితో ననియె ''నో మ
హాప్రభూ! క్షణ ముండుమా, యాదరించి
వినుము నామాట నిప్పుడో యనఘచరిత! ౩౦౮౨

ఆ. ద్విజసుతుండు గాఁడు దితిజాధినాయకా!-యితఁడు, నిక్కముగను నెంచిచూడు,
ద్విజుని రూపుతోడ వెలుఁగు జనార్దనుం-డనుచుఁ దెలియు మాత్మయందు ననఘ!

సీ. కపటవామనరూపకలితుఁడై విష్ణుండు నయంతికమునకు నియతి మెఱయ
నరుదెంచి పలుమాఱు లడుగు మనున్నాఁడు మూఁడడుగుల మేఱ పుడమి నింద్రు
కార్యార్థముగ, నమ్మకం బిది యని యెంచవలయును బలిచక్రవర్తి! యిపుడు
యోజింపకయ త్రిపాదోర్వి నొసంగితివేని ధ్రువంబుగా నీవటుండు

తే. మూఁడులోకంబులను నిజముగ సమాశ్ర
యించి, దేవేంద్రునకుఁ బ్రీతి నిచ్చుఁజుమ్ము,
నమ్ము నావాక్యములను సత్యమ్ము లంచు
దైత్యరాజేంద్ర! నిత్యసత్యవ్రతాత్మ!'' ౩౧౮౪

క. అని హితవు తెల్పఁగా శు-క్రునిఁ గని బలి పల్కెఁ ''గులగురూ! నా రాజ్యం
బును భువనత్రయమును ఛల-మున నేక్రియ విష్ణుఁడొసఁగుఁ బురుహూతునకున్?''

చ. అనవుడు శుక్రుఁ డిట్లనియె "నాకమలాక్షుఁడు దేవకార్య మే
యనువుననైనఁ దీర్పవలె నంచును దీక్షను బట్టియుండు, నా
ఘనునకసాధ్య మెయ్యదియుఁ గల్గదు, దారుణమైన కార్య మే
పున జరుగంగనున్న దిటఁ బోలిచిచూచిన రాజశేఖరా! ౩౦౮౬

సీ. అదితిగర్భంబున నవతరించిన భగవంతుఁడే యని నమ్ము వామనుండు,
మాయామయశరీరుఁడై యిట నిన్ను భూతలమును యాచింపఁ దరలివచ్చి
యడుగుచున్నాఁడు, పుడమి నీవలదు వామనునకు, వినుము నామాట యిపుడు,
భువనత్రయోపేతభూరిసామ్రాజ్యంబు పాలింపఁగా నాసపడుదు వేని
తే. నీకు గురుఁడను హితమును నేను గోరు-చున్న వాఁడ నటం చెద నెన్ను "మనుచుఁ
బలుక బలిచక్రవర్తి యాబ్రాహ్మణోత్త-మునిఁ గనుంగొని పల్కె "నోమునివరేణ్య!

క. చెప్పితి నిచ్చెద ననుచును,-దప్పుట గురువర! యెట్లు? తాఁ గపటముచే
నిప్పాటుండు గ్రహింపం-జొప్పడు నే, నిచ్చు టెట్లు సూచింపు మొగిన్."

క. బలిచక్రవర్తి యీక్రియఁ-బలుకఁగ, దైత్యార్చితుండు భార్గవుఁడు హితో
క్తుల భూదానోద్యతు ని-మ్ముల నిల్వఁగఁ జూచెఁ దా నపుడు మునినాథా!

క. కడు ధర్మాత్ముఁడు బలి య-య్యెడ గురువాక్యముల నెంచి యెద, నారద! యే
ర్పడ నేమి చేయఁ దోఁపక-కడు మానముతోడ మారకయ యుండె నొగిన్

ఉ. దానము చేయఁగాఁ గలఁచి తా గురువర్యునిఁ గాంచి "దేవ! మా
శ్రీనిధి విష్ణుఁడే యిటులు కృత్రిమవామనరూపధారియై
తా నడుగంగవచ్చి నను ధన్యునిఁ జేయఁగ మూఁడులోకముల్
పూనికఁ గోరునేని యిఁకఁ బోల్పఁగ భాగ్యము వేఱ యున్నదే? ౩౦౮౭

క. మానవుఁ డేదేవుని మది-దా నుద్దేశించి చేసి దానం బెదియోఁ
బూనిక ఫలంబుఁ గాంచు న-నూనంబుగఁ దత్ఫలంబె యుత్తమచరితా.

సీ. అట్టి దేవుండు ద్విజాకృతి వెలుఁగొందు వామనరూపుఁడౌ వాసుదేవు
నకు భువనత్రయం బకుటిలమతి నిత్తు, నంతికంటెను భాగ్య మనఁగఁ గలదె?
విష్ణుసంప్రీతికై విశదకర్మంబు గావింపఁడుగద యవివేకి యెపుడు,
సత్కృతి గావించి సజ్జనుండు భవంబునందు మునుంగఁడో యార్యపూజ్య!
తే. యట్లు గావున ద్విజరూపుఁడైన విష్ణు-దేవునకు, వామనునకుఁ గొల్చుఁ ద్రిపదసమ్మి
తంబయిన భూమిఁ దత్ప్రీతి దనర నిపుడు-విష్ణుప్రును గూర్చి గురువరా! విస్రుతముగ."

చ. గురువరుతోడఁ బల్కి యిటు గూరిమి మీఱఁగ విష్ణుమూర్తికిన్
నిరుపమరీతితోడ బలి నిశ్చలుఁడౌచుఁ బదత్రయంబు ని

బ్బరమున దానమిచ్చె భువి; వామనమూర్తియు స్వస్తియంచు సం
బరమునఁ జేయి యొగ్గికొనె వాసవు వాంఛను దీర్ప నారదా! ౩౦౯౮

బలిపాతాళయాత్ర

సీ. అంత వామనమూర్తి యంఘ్రిత్రయంబున వెలయుచుఁ గనఁబడె విశ్వరూప
ధారియై, యొక్కపదంబున బ్రహ్మాండమెల్లను భేదించి యేపుమీఱి
యూర్ధ్వంబునకుఁ బోవ నురుగతి తత్పదాంబుజమునందు విధాత భూరిభక్తిఁ
దన కమండలుజలంబునఁ బాద్య మిచ్చె, నత్తఱి నీరమయి గంగ తా హరిపద
ఆ. మందుఁ బొంది యందె యావాస మొనరించి,-సకలదురితదళనశక్తియుక్త
యగుచు నిరుపమానమగు రూపమున ముని-నాథ! నారదా! యనంతమహిమ

తే. సకలధర్మపరాయణుం డకుటిలమతి
యయిన బలిచక్రవర్తిని సాపరాధు
కరణిఁ గని యొక పదమున శిరముఁ దాఁకు
చును బలికె నారదమునీంద్ర! చోద్యమంద. ౩౦౯౯

ఆ. ఓకుమార! నీకు లోకత్రయం బుంచి-నాఁడ, నిపుడు దేవనాధునకును
నొసఁగుచున్నవాఁడ, నసురులతోడఁ బా-తాళమునకుఁ జనుము తరలి వేగ.

క ఎనిమిదవ మనువువేళను-దనుజేశ్వర! నీవు మరలఁ దప్పక సురనా
థుని దివ్యపదము నొందుదు-వనుపమభువనత్రయమున కధిపతి వగుచున్.

ఆ. సందియంబు వలదు, సకలలోకత్రయ-భాగ్య మబ్బు నీకుఁ బ్రాభవమున''
ననుచు విష్ణుమూర్తి యానతి యొసఁగఁగా-బలియు నపుడె యసురవరులతోడ.

తే. హరికి వందన మొనరించి యపుడె కదలి
యరిగెఁ బాతాళమునకు, శ్రియఃపతి భువ
నాధినాయకుఁ డంత నోనారదా! వి
కుంఠధామంబునకుఁ బోయెఁ గుతుకమునను. ౩౧౦౦

తే లోకపావని యగు గంగ ప్రాకటముగ
నాదివిష్ణువుదివ్యపాదాబ్జసీమ
వెలయుచుండెను నత్యంతవిభవమునను
సాధుసంస్తుత్య యగుచు నోసంయమీంద్ర!'' ౩౧౦౧

అఱువది యాఱవ అధ్యాయము

భగీరథుఁడు గంగను దేఁ బ్రయత్నించుట

వ. వెండియు మహాదేవుండు నారదమునీంద్రున కిట్లు చెప్పందొడంగె. ౩౧౦౨

చ. "మునివర! గంగ యాక్రియ సమున్నతి శ్రీహరిదేహ మొంది, చె
ల్వున విలసిల్లుచుండఁగను బూజ్యుఁడు సారససంభవుండు లో
కనికరసృష్టికర్త కడఁకన్ గడు శూన్యత నుండునట్టి యా
త్మనియమపూరణాస్పదకమండలువుం గని యంత నారదా! ౩౧౦౩

మ. ఒక్క నిమేష మాత్రఁ ద్రిదశోన్నతుఁడౌ పరమేష్ఠి యోజనల్
పెక్కు లొనర్చి, గంగయనఁ బేర్మిఁ ద్రిలోకములన్ లభింపరా
దక్కట! చూడఁగా ద్రవము నాత్మికమై చెలఁగొందుచుండెఁ, బెం
పెక్కుచు నాకమండలువు నెంతయు ధన్యత నొందఁ జేయుచున్. ౩౧౦౪

సీ. పుణ్యంబులకు నెల్లఁ బుణ్యతమస్వరూపిణి యయి భారతి విశదచరిత
యిపుడు శ్రీహరిపాదవిపులపద్మంబును జేరి నిర్మలయయి చెలఁగు మిగులఁ,
ద్రిభువనంబులను నదీరూపమునఁ బావనముచేసి సిద్ధసంగమును బొందఁ
గలదు, గావున నేను గాఢతపోనిష్ఠచే సురేశ్వరిని విశిష్టరీతి

తే. విష్ణుపదకమలమునుండి వితతకరుణ-వెలయ ప్రవహింపయయి వేగ వెడలివచ్చు
నట్లొనర్చెద, నిది నిశ్చయం బటంచు-నెంచి వైకుంఠమున కేగె సృష్టికర్త.

క. మునినాథ! నారదా! యవ్వనజాసనుఁ డధికభక్తిఁ బ్రార్థించెను గం
గను విష్ణుదేహసంస్థిత-ననఘగుణ ననేకనుతుల నలరఁగ, నంతన్. ౩౧౦౬

క. చిరకాలము ప్రార్థింపఁగ-వరభువనత్రయవిశేషపావని గంగా
సురనది ప్రత్యక్షంబయి-పరమేష్ఠిని గాంచి పల్కె భవ్యమృదూక్తిన్. ౩౧౦౭

సీ. "ఓ విరించీ! విను మొక్కింతకాలంబు శ్రీవిష్ణుతనువునఁ జెలఁగుచుందు,
నంతట ద్రవమయి నై విష్ణుదేవుని పాదాంబుజమునుండి ప్రభవమంది,
ప్రవహించుచును గ్రమక్రమముగ మల్లోకములఁ బవిత్రములుగ సలుపుదాన,
నమితతేజంబున నలరు భగీరథభూనాథుఁడు నుతింప భూతలమును

తే. చెంది, భాగీరథీనామ మొంది నెలయు-దాంచి దగ్ధసగరుల నెల్లఁ దగ సముద్ధ
రించి సిద్ధసంఘము చేరి మించి భువన-పంక్తి కెక్కుఁ బాతాళరమ్యవసతి."

క. అని గంగ పల్క వనజా-సనుఁ డిట్లనె "దేవపూజ్య! సక్కఁగ స్వాంతం
బున జ్ఞానదృష్టిఁ దెలియుదు, - వినుము భగీరథుని భక్తి వెలయింతు విలన్.

క. భువనత్రయంబు మరలన్-శివసుందరి! పావనంబు చేయఁగ నీ వీ
భువనంబు వదలి ప్రియమున-నవిరళగతి రమ్మటంచు నర్థింతు నదన్." ౩౧౧౦

క. ఈవిధమునఁ బ్రార్థింపఁగ-దేవమునీ! గంగ సమ్మతిఁ దిరోహితయై
వే వెడలె, బ్రహ్మయును మది-భావించుచు స్వపురి కరిగె వైభవ మెసఁగన్.

సీ. అధికప్రభావాత్ముఁ డై వెల్గు కపిలమునీంద్రుని కోపాగ్ని నిలను బూది
యైనట్టి సగరుని యాత్మజులను దగ పితరుల సుకృతసంయుతులఁ జేసి
పుణ్యలోకములను బొందింపఁగా గురునాజ్ఞ భగీరథుఁ డనెడు రాజు
విష్ణుదేహంబున వెలయు గంగను ద్రవమయిని భూమికిఁ జేర నియతిఁ బూని,
తే. విష్ణుఁ బరమాత్ము లోకేశు విభునిఁ గూర్చి-తపము గావించె మౌనిసత్తమ! యనంత
భక్తి నారాధనముల నాసక్తితోడ-సుచిరకాలంబు నాత్మ విశుద్ధుఁడగుచు.

ఉ. అంతఁ బ్రసన్నుఁ డయ్యెఁ బరమాత్ముఁడు శ్రీపురుషోత్తముండు సు
స్వాంతునకున్ విశిష్టగుణసత్తముఁడౌ సగరాన్వవాయభూ
కాంతునకున్ బ్రియంబున నఖండతపంబున కిచ్చ మెచ్చి య
త్యంతశుభం బొసంగుటకునై సుమౌనివరేణ్యా! నారదా! ౩౧౧౩

సీ. సకలజగన్నాథు శంఖచక్రగదాధరుని దివ్యపీతాంబరుని ఘనతను
దివ్యసువర్ణసంస్థితు వనమాలావిరాజితు నాదినారాయణుఁ గని
యా భగీరథుఁ డాత్మ నలరుచు, సాష్టాంగముగ వసుంధరపయి నగణితగతి
దండవత్ప్రణతిసంతతులను గావించి స్తుతియించె నిట్లు విశుద్ధుఁడగుచు,
తే. నారదమునీంద్ర! భక్తివిశారద! విను
మవహితుఁడవయి వచియింతుఁ బ్రవితతముగ
విష్ణుదేవుని నుతియెల్ల విపులదురిత
దమనదక్షంబు వాంఛితదంబు సతము. ౩౧౧౪

భగీరథకృత విష్ణుస్తుతి

సీ. "విశ్వేశ! విశ్వప! వితతమహాపురుషప్రధానా! హరీ! సకలవిభవ!
త్రైలోక్యపావన! తతజగత్పరివంద్యపదపద్మ! మధుకైటభపరిపంథి!
నారాయణా! నమస్కారము ల్గావింతుఁ, గరుణఁ బ్రసన్నతఁ గనుము దేవ!
విశ్వైకకారణ! విభు! పురాణజగన్నిధాన! వామన! జనార్దన! పరేశ!
తే. వరద! గోవింద! శ్రీశ! శ్రీవత్సలాంఛ-నా! మహాప్రభు! శ్రీవిష్ణు! నాథ! విశ్వ
మూర్తి! నీకు నమస్కారముల నొనర్తుఁ,-గరుణతోడఁ బ్రసన్నతఁ గనుము దేవ!

సీ. వాసుదేవ! జగన్నివాస! జగన్మయ! దైత్యాధిపాంతక! ధన్యమూర్తి!
యత్యంతవిక్రమ! హరి! భయాంతక! శాంతపరిపూర్ణ వైకుంఠ! భద్రవరద!
రమణీయరూప! ధరాధర! మాధవ! వందనంబు లొనర్తు వారిజాక్ష!
కరుణఁ బ్రసన్నతఁ గనుము లక్ష్మీపతీ! మాయాశ్రయైక! రమాసనాథ!

తే. యీశ! కేశవ! యఖిలలోకైకనాథ!-దేవ! యానందసాంద్ర! విస్తృతదయాస్వ
రూప! కమలాక్ష! విష్ణు! రమాపతీ! స-తంబు వినతుఁడ నఖిలేశ! ధర్మబోధ!

తే. విశ్వరూప! నమస్కారవితతి నీకు-సచ్చిదానందరూప! విజ్ఞానమయ! వి
శుద్ధ! దివ్యప్రకాశ! నిస్తులవిభావ!-వందనంబు లొనర్చెద వారిజాక్ష! ౩౧౧౭

తే. నేఁడు నాజన్మ సఫలత నెగడె, నేఁడు-తపము ఫలవంతమయ్యెఁ బ్రత్యక్షముగ మ
హానుభావ! దుర్లభుఁడవై యలరు నిన్నుఁ-గాంచఁగల్గుటచేత నో కమలనేత్ర!''

తే. ఇట్టి స్తుతివాక్యముల జగదీశ్వరుండు
సంతసంబును బొంది యా క్ష్మాధినాథ
పుంగవు భగీరథునిఁ గాంచి పొంగుచు దయఁ
బలికె మునినాథ! నారదా! లలితభణితి. ౩౧౧౯

ఉ. ''భూవర! యెట్టి వాంఛితము బుద్ధిఁ దలంచి తపం బొనర్చితో,
నీ వది వేఁడుమా యిపుడు నిశ్చయ మొప్ప ననుగ్రహింతుఁ, ద్వ
ద్ధ్యానము డాపఁగావలసు, భక్తికి మెచ్చితిఁ, బ్రీతి గల్గె, నీ
సేవ యనంతతృప్తి నిడె, శీఘ్రము కోరుము'' నాఁగ నారదా! ౩౧౨౦

సీ. వినయము మీఱ శ్రీవిష్ణుమూర్తిని గాంచి వందనంబు లొనర్చి పల్కె రాజు
''దేవ! నాపితరు లుద్రిక్తులై బ్రహ్మశాపంబున బూదియై పాపులగుచు
నరకంబుఁ బొందిరి నారాయణా! వారి నిష్కృతికోఱకునై నియతిఁ బరమ
పావని యగు గంగ వసుమతి ద్రవరూపమునఁ గొనిపోవఁగా మనమునందుఁ

తే. గోరుచున్నవాఁడను, గంగ భూరిమహిమ-బ్రహ్మదివ్యకమండలువసతినుండి
యిపుడు నీమూర్తిఁ జేరి యింపెసఁగుచున్న-దా సకలలోకపావని యతిముదమున.

సీ. నీదివ్యదేహమే నెలవుగా భావించి కడుముదంబున నుంట గంగ నిపుడు
దయతో నొసంగిన ద్రవరూపయగు గంగ మత్పితరులమీఁద మహిమ వెలయఁ
బ్రవహించు, నద్దానఁ బరమపదంబు వారలు పొందఁగాఁగలవారు దేవ!
యిది నాదు వాంఛితం బీశ్వర! యోజగన్నాయకా! నీవు ప్రణతులగు నిజ

తే. భక్తులకు నెల్లవేళలఁ బ్రార్థితార్థ-సిద్ధి యొనరించి, కరుణించి స్థిరశుభము ల
వారిగాఁ గూర్తు''వంచు భగీరథుండు-వరము వేఁడెను భక్తిసంభరితుఁడగుచు.

సీ. అంత నారాయణుం డాభగీరథుఁ గాంచి పలికె ''నోవత్స! నీ వాంఛితంబు
సమకూర్తు,గంగ యెస్వయముగ ద్రవరూపమును బూని నా దేహమునను బొడమి
భూతలంబును జేరి పుణ్యవంతులు గాఁగనుద్ధరింపఁగఁగల దొప్పుమీఱ
నీపితరులనెల్ల, నిశ్చయం బీమాట, సురలకు దుర్లభసరణి వెలయు

తే. చున్న యప్పరమారాధ్య సన్నుతింపు,
భువననాయకుఁడైన శంభు నతిభక్తిఁ
బ్రార్థనముచేయు మట్లైతె, యఖిలవాంఛి
తములు సంపూర్ణతను బొందు ధర్మహృదయ!'' ౩౧౨౩

మ. అని నారాయణుఁ డానతిచ్చి దయతో నంతర్థి నొందెన్ మునీ!
జననాథుండు భగీరథుండు గనఁ దత్సామీప్యమందుండి యొ
య్యన, నంతన్ దుహినాచలోత్తరశిరంబందున్ క్షితీశుండు చే
రెను నేమంబున గంగనుం గొలిచి సంతృప్తిన్ దపశ్చర్యకై. ౩౧౨౪

భగీరథుఁడు గంగనుగూర్చి తపంబు గావించుట

ఆ. అధికనిష్ఠతోడ నా భగీరథుండు తపంబు బహుసహస్రవత్సరములు
చేసె, స్మితముఖాబ్జ శివశక్తియగు గంగ-సంతసమునఁ దాఁ బ్రసన్న యగుచు.

చ. నియమము మీఱఁగాఁ దపము నిష్ఠలుఁడై యొనరించు భూపతిన్
బ్రియమునఁ జూచి, డగ్గఱిన పేర్మి 'భగీరథ!' యంచుఁ బల్కి, ని
ల్చి ''యహహా! నీతపంబునకుఁ జిత్తమునందున మెచ్చు వచ్చె, సం
దియమును వీడి వేఁడు మని తృప్తిని గూర్చు వరంబొ''నావుడున్. ౩౧౨౫

తే. ''తల్లి! శివసుందరీ! నాదు తపము పేర్మి-సుప్రసన్నత నొందినచో హరిపద
సరసిజమునుండి వెడలి సంబరమునిండు-రమ్ము భూతలమును జేర రయముతోడ.

చ. ధరణిఁ బునీతఁ జేసి వితతంబగు ప్రతి బిలస్థలంబు సం
బరమునఁ జొచ్చి వేగ మునినాథుని శాపముచేత బూదియై
నరకము నొందు మత్పితృగణంబును భూరికృపాయుతిన్ సము
ద్ధరణము చేయుమా జనని! ధన్యత నొందుదు లోకపావని! ౩౧౨౬

తే. త్రిదశవందితే! కరుణ మత్పితరుల సుకృ
తాత్ములను జేసితేని నే నపుడు జనని!
యందుమును గృతకృత్యత నార్యపూజ్య!
యిదియె గంగా! మదీయమహానీప్సితంబు.'' ౩౧౨౭

గంగ భగీరథునితో శివుని నారాధింపుమనుట

సీ. అంత గంగాదేవి యా భగీరథునితో ''నార్య! నీదయిన సంప్రార్థనంబు
పూర్ణంబుగాఁ దీర్తుఁ, బూర్వుఁడౌ విష్ణుపాదారవిందంబున నవతరిల్లి,
త్వత్పూర్వపితరులఁ దడయక సుకృతులఁ జేసి సముద్ధరించెదను, నిజము;
భవదీయమైన దివ్యప్రార్థనం జేసి వాసుదేవుని పదాబ్జంబునుండి

తే. యవనిపై నీకు మీఁదట నవతరింపఁ-గలవు గావున నిన్నైకకు విభవము
వెలయ భాగీరథి యనంగ విశదనామ-ములరు లోకంబునను నాకు నమలకీర్తి!

ఉ. ఇత్తఱి లోకనాథుఁడగు నీశ్వరుఁ శంకరు సన్నుతించి, త
చ్చిత్తము సుప్రసన్నముగఁ జేసి, యనుజ్ఞను బొంది యమ్మ, నే
నత్తరుణేందుశేఖరుని యాజ్ఞకు లోఁబడియుండుదాన నా
యుత్తముఁడే ప్రియుండు విభుఁ డోజననాథ! భగీరథా! సుధీ! ౩౧౩౧

ఆ. ఆమహాదేవునాజ్ఞ తే కడుగు పెట్ట-నోపుహును గాన శంకరునుల్లమునకుఁ
బ్రియము సంధిల్లఁ బ్రార్థించి స్పష్టఁ జేయు,-నాలసింప కివలను రాజ! గుణాఢ్య!

ఆ. పరమశివుఁడు నీదు ప్రార్థనంబున సంతో-సించి నన్ను మేరుశైలశృంగ
మందు నిలిచి శంఖ మాధృతి జలదసి-స్వనమురీతి నొసఁగ ద్వారిగ నపుడె.

సీ. విష్ణుదేవుని పదవిమలపద్మమునుండి యావిర్భవించి నే నమిత్రసుతగతి
బ్రహ్మాండమును వేడ్క బ్రద్దలుగావించి యనుసరించుచు నిన్ను నవనిమీఁద
జలరూపధారినై చనుదెంతు, నీ వంత నేల నాతోఁ దోడ నాపనామ్మ
లనుగాఁగ సాగరించెదను, సద్ధరించెద, ఖ్యాతిఁ ఏవరంబును జేరి వేగ

తే. నీయశంబును నభివృద్ధి నెఱపుచు భావ-పత్రయము లెఁ గాక్షాంబునను నరుగుమ,
దివ్యభాగీరథీనామదీప్త నగుదు"-నని భగీరథునకుఁ దెల్పె, నంతె వినుము.

క. భవగేహిని గంగానది-యవనిపతి భగీరథుఁడు మనకారుణ్యము లె
దవిలి కనుచుండ సుణము-నవి నంబుధా మొందె నీము సీంద్రా! ౩౧౩౫

క. పితృకీర్తివర్ధనుఁడు భూ-పతి సుకృతి భగీరథుండు ధ్యావించెను దాఁ
గృతకృత్యాలి నందినయటు-హితవుగ గంగాస్వరూప మీక్షించుటచేన్.

భగీరథుఁడు శివునిగూర్చి తపంబు సలుపుట

తే. అంత గంగాజ్ఞఁ బూని ధర్మాత్ముఁ డాభ
గీరథుండు మహేశుఁ దద్గిరివరమున
యందు నియతినిఁ బూని తా నెందమంతుఁ
బ్రార్థనము చేయుచుండె నారదమునీంద్ర! ౩౧౩౬

సీ. యతచిత్తుఁడై నిరాహారియై తుహినాద్రియందు శతాబ్దంబు లధికతపము
గావింపఁ బ్రభుఁడు శంకరుఁ డవ్యయుండు పంచాస్యుండు వృషభవాహనుఁడు ప్రీతిఁ
బ్రత్యక్షమయ్యె నా పార్థివునకు భగీరథునకు, నంత నారాజమూర్తి
మానసంబున మోద మూని యెంతయుఁ దనయెదుటఁ గన్గొనియె మహేశ్వరునాగి

తే. వ్యాఘ్రచర్మపరీధానుఁ బంచముఖుని-భూతిలిప్తసర్వాంగుని భుజగభూషు
నీలకంఠు స్మితాననుఁ నిగమవినుతు-నరజటాజూటభూషితశిరుని హరుని. ౩౧౩౭

తే. సకలసురనాథుఁ బూర్ణుని శంకరు విభు-దేవదేవునిఁ గాంచి యా భూవిభుండు
దండవత్ప్రణతిని జేసి స్తవమొనర్చె-నతుల నష్టోత్తరసహస్రనామములను

అఱువదియేడవ అధ్యాయము

భగీరథకృత శివసహస్రనామ స్తోత్రము

తే. ''పార్వతీనాథ! దేవదేవా! ప్రభూ! ప-రాత్పరా! యచ్యుతా! రుచిరవదనాబ్జ!
పంచవక్త్ర! భయంకరవక్త్ర! నీకు-భక్తితోడుతఁ గావింతు వందనములు. ౩౧౪౦

తే. వ్యాఘ్రచర్మాంబరధర! పంచాననా! మ-హాబలా! జ్ఞానమయరూప! యఖిలనాథ!
వరద! దేవ! పారావారవర్జితగుణ!-భక్తితో నీకుఁ గావింతు వందనములు.

తే. విశ్వభూతేశ! పరమేశ! విశ్వనాథ!-విశ్వసంశ్రయ! యజిత! శ్రీవిశ్వపాల!
యమితదుర్ధర్ష! దేవదేవా! సతంబు-భక్తితో నీకుఁ గావింతు వందనములు.

తే. విశ్వనాథ! సదానంద! విశ్వమూర్తి!-సర్వవిశ్వాశ్రయాశ్రయ! సకలవిశ్వ
సముపకారి! విశ్వైకధామ! దురితారి!-భక్తి నిడుదు విశ్వానంద! వందనములు.

తే. శర్వ! సర్వజ్ఞ! సురవంద్య! సర్వరూప!-సురవరోత్తమ! యజ్ఞానవిరహిత! సక
లామరస్తుత్య! సురరాజ! యనవరతము-భక్తితో నీకుఁ గావింతు వందనములు.

తే. సురసమారాధ్య! సురవరస్తుత్య! సర్వ-సురరిపువిమర్ది! సురనాథ! సురరిపు! సక
లామరవరోత్తమా! నీకు ననవరతము-భక్తితోడుతఁ గావింతు వందనములు.

తే శుద్ధుఁడవు, శుద్ధబోధుఁడ విద్ధచరిత!
యుగ్రకర్మ! యత్యుగ్రుఁడ వుగ్రనయనుఁ
డవు విశుద్ధాత్ముఁడవు శంభుఁడవు స్వయంభు
వుఁడవు లోకేశ! దండంబు లిడుదు నీకు. ౩౧౪౬

వ. ఉగ్రప్రభావుండును, అత్యుగ్రమర్దకుఁడును, అత్యుగ్రరూపవంతుఁడును, ఉగ్రకంఠుఁడును, శివుఁడును, శాంతుఁడును, సర్వశాంతివిధాయకుఁడును, సర్వార్థదుఁడును, శివాధారుఁడును, శివాయ నిరమిత్రజితుఁడును, శివదుఁడును, శివకర్తయు, శివహంతయు, శివేశ్వరుఁడును, శిశుశైశవయుక్తుఁడును, పింగకేశుఁడును, జటాధరుఁడును, గంగాధరుఁడును, కపర్దియు, జటాజూటవిరాజితుఁడును, జటిలుఁడును, జటిలారాధ్యుఁడును, సర్వదోన్మత్తమానసుఁడును,

---

1 ఓం నమస్తే పార్వతీనాథ! దేవదేవ పరాత్పర! అచ్యుతానఘ పంచాస్య భీమాస్యరుచిరాననః ॥ ౧ ॥ వ్యాఘ్రాజిన ధరానంత పారావార వివర్జిత! పంచానన మహాసత్త్వ మహాజ్ఞాన

ఉన్మత్తకేశుఁడును, ఉన్మత్తుఁడును, ఉన్మత్తానామధీశ్వరుఁడును, ఉన్మత్తలోచనుఁడును, భీముఁడును, త్రినేత్రుండును, భీమలోచనుఁడును, బహునేత్రుఁడును, ద్వినేత్రియు, రక్తనేత్రుఁడును, సునేత్రకుఁడును, దీర్ఘనేత్రుఁడును, పింగాక్షుఁడును, సుప్రభాక్షుఁడును, సులోచనుఁగను, సోమనేత్రుఁడును, అగ్నినేత్రాఖ్యుఁడును, సూర్యనేత్రుఁడును, సువీర్యవంతుఁడును, పద్మాక్షుఁడును, కమలాక్షుఁడును, నీలోత్పలదళేక్షణుఁడును, సులక్షణుఁడును, శూలపాణియును, కపాలియు, కపిలేక్షణుఁడును, వ్యాఘూర్ణనయనుఁడును, ధూర్తుఁడును, వ్యాఘ్రచర్మాంబరావృతుఁడును, శ్రీకంఠుఁడును, నీలకంఠాఖ్యుఁడును, సుకంఠకుఁడును, చంద్రచూడుఁడను, చంద్రధరుఁడును, చంద్రమౌళియు, శశాంకభృత్తును, శశికాంతుఁడును, శశాంకాభుఁడును, శశాంకాంకితమూర్ధజుఁడును, శశాంకవదనుఁడును, వీరుఁడను, వరదుఁడును, వరలోచనుఁనును, శరచ్చంద్రసమాభాసుఁడును, శరదిందుసమప్రభుఁడును, కోటిసూర్యప్రతీకాశుఁడును, చంద్రాస్యుఁడును, చంద్రశేఖరుఁడును, అష్టమూర్తియు, మహామూర్తియు, భీమమూర్తియు, భయానకుఁడును, భయదాతయు, భయత్రాతయు, భయహర్తయు, భయోజ్ఝితుఁడును, నిర్భూతుఁడును, భూతవంద్యుఁడును, భూతాత్మయు, భూతభావనుఁడును, కౌపీనవాసుఁడను, దుర్వాసుఁడును, వివాసుఁడును, కామినీపతియును, కరాళుఁడును, కీర్తిదుఁడును, వైద్యుఁడును,

---

మయప్రభో ॥ ౨ ॥ అజితామిత దుర్ధర్ష విశ్వేశ పరమేశ్వర । విశ్వాత్మన్ విశ్వభూతేశ విశ్వాశ్రయ జగత్పతే ॥ ౩ ॥ విశ్వోపకారి న్విశ్వైకధామ విశ్వాశ్రయాశ్రయ । విశ్వాధార సదానంద విశ్వానంద నమోస్తుతే ॥ ౪ ॥ శర్వసర్వవిదజ్ఞాన వివర్జిత సురోత్తమ । సురవంద్య సురస్తుత్య సురరాజ సురోత్తమ ॥ ౫ ॥ సురపూజ్య సురధ్యేయ సురేశ్వర సురాంతక । సురారి మర్దక సురశ్రేష్ఠ తేస్తు నమోనమః ॥౬ ॥ త్వం శుద్ధః శుద్ధబోధశ్చ శుద్ధాత్మా జగతాంపతిః। శంభుః స్వయంభూ రత్యుగ్రః ఉగ్రకర్మోగ్రలోచనః ॥౭॥ ఉగ్రప్రభావశ్చాత్యుగ్ర మర్దకోఽత్యుగ్రరూపవాన్। ఉగ్రకంఠః శివఃశాంతః సర్వశాంతి విధాయకః ॥ ౮ ॥ సర్వార్థదః శివాధారః శివాయ నిరమిత్రజిత్ । శివదః శివకర్తాచ శివహన్తా శివేశ్వరః ॥ ౯ ॥ శిశుశైశవయుక్తశ్చ పింగకేశో జటాధరః । గంగాధరకపర్దీచ జటాజూట విరాజితః ॥ ౧౦ ॥ జటిలో జటిలారాధ్యః సర్వగోన్మత్తమానసః । ఉన్మత్తకేశ ఉన్మత్త ఉన్మత్తానా మధీశ్వరః ॥ ౧౧ ॥ ఉన్మత్త లోచనో భీమ స్త్రినేత్రో భీమలోచనః। బహునేత్రో ద్వినేత్రీచ రక్తనేత్రః సునేత్రకః ॥ ౧౨ ॥ దీర్ఘనేత్రశ్చ పింగాక్షః సుప్రభాక్షః సులోచనః। సోమనేత్రోఽగ్నినేత్రాఖ్యః సూర్యనేత్రస్సువీర్యవాన్ ॥ ౧౩ ॥ పద్మాక్షః కమలాక్షశ్చ నీలోత్పల దళేక్షణః। సులక్షణః శూలపాణిః కపాలీ కపిలేక్షణః ॥౧౪॥ వ్యాఘూర్ణనయనో ధూర్తో వ్యాఘ్ర చర్మాంబరావృతః । శ్రీకంఠో నీలకంఠాఖ్యః శితికంఠః సుకంఠకః ॥ ౧౫ ॥ చంద్రచూడశ్చంద్రధర శ్చంద్రమౌళి శ్శశాంకభృత్। శశికాంతః శశాంకాభః శశాంకాంకిత మూర్ధజః ॥ ౧౬ ॥ శశాంకవదనో వీరో వరదో వరలోచనః । శరచ్చంద్ర సమాభాసః శరదిందు సమప్రభః ॥ ౧౭ ॥ కోటి సూర్యప్రతీకాశ శ్చంద్రాస్య శ్చంద్రశేఖరః । అష్టమూర్తి ర్మహామూర్తి ర్భీమమూర్తిర్భయానకః ॥ ౧౮ ॥ భయదాతా భయత్రాతా భయహర్తా భయోజ్ఝితః । నిర్భూతోభూత వంద్యశ్చ భూతాత్మా భూతభావనః॥౧౯॥కౌపీనవాసా దుర్వాసా వివాసా కామినీ

కిశోరుఁడును, కామనాశనుఁడును, కీర్తిరూపుఁడును, కుంతధారియు, కాలకూట కృతాశనుఁడును, కాలకూటరూపియు, కులమంత్రప్రదీపకుఁడును, కలాకాష్ఠాత్మకుఁడును, కాశీవిహారియు, కుటిలాననుఁడును, మహాకాననసంవాసియు, కాళీప్రీతివివర్ధనుండును, కాళీధరుఁడును, కామచారియు, కులకీర్తివివర్ధనుఁడును, కామాద్రియు, కాముకవరుఁడును, కార్ముకియు, కామమోహితుఁడును, కటాక్షుఁడును, కనకాభాసుఁడును, కనకోజ్జ్వలగాత్రకుఁడును, కామాతురుఁడును, క్వణత్పాదుఁడును, కుటిలభ్రుకుటీధరుఁడును, కార్తికేయపితయు, కోకనదభూషణభూషితుఁడును, ఖట్వాంగయోద్ధయు, ఖడ్గియు, గిరీశుఁడును, గగనేశ్వరుఁడును, గణాధ్యక్షుఁడును, ఖేటకధృక్కును, ఖర్వుఁడును, ఖర్వతరుఁడును, ఖగుఁడును, ఖగారూఢుఁడును, ఖగారాధ్యుఁడును, ఖేచరుఁడును, ఖేచరేశ్వరుఁడును, ఖేచరత్వప్రదుఁడును, క్షోణీపతియును, ఖేచరమర్దకుఁడును, గణేశ్వరుఁడును, గణపితయు, గరిష్ఠుఁడును, గణభూపతియును, గురువును, గురుతరుఁడును, జ్ఞేయుఁడును, గంగాపతియును, అమర్షణుఁడును, గతిప్రియుఁడును, గతిరతుఁడును, సుగోప్యుఁడును, గోప్యబృందపుఁడును, గవారూఢుఁడును, జగద్భర్తయు, గోస్వామియు, గోస్వరూపకుఁడును, గోప్రదుఁడును, గోధరుఁడును, గృధ్రుఁడును, గురుత్మంతుఁడును, గోకృతాసనుఁడును, గోపీశుఁడును, గురుతాతయు, గుహావాసియు, సుగోపితుఁడును, గజారూఢుఁడును, గజాస్యుఁడును, గజాజినధరుఁడును, అగ్రజుఁడును, గ్రహాధ్యక్షుఁడును, గ్రహగణుండును, దుష్టగ్రహవిమర్దకుండును, గానరూపియు, గానరతుఁడును, ప్రచండుఁడును, గానవిహ్వలుఁడును, గానమత్తుఁడును, గుణియు, గుహ్యుఁడును, గుణగ్రామాశనియు, గణుఁడును, గూఢబుద్ధియు, గూఢమూర్తియు, గూఢపాదవిభూషితుఁడును,

---

పతిః। కరాళః కీర్తిదో వైద్యః కిశోరః కామనాశనః ॥ ౨౦ ॥ కీర్తిరూపః కుంతధారీ కాలకూట కృతాశనః। కాలకూట సురూపీచ కులమంత్ర ప్రదీపకః ॥ ౨౧ ॥ కలాకాష్ఠాత్మకః కాశీవిహారీ కుటిలాననః। మహాకాననసంవాసీ కాళీప్రీతి వివర్ధనః ॥ ౨౨ ॥ కాళీధరః కామచారీ కులకీర్తి వివర్ధనః। కామాద్రిః కాముకవరః కార్ముకీ కామమోహితః ॥ ౨౩ ॥ కటాక్షః కనకాభాసః కనకోజ్జ్వల గాత్రకః। కామాతురః క్వణత్పాద కుటిలభ్రుకుటీ ధరః ॥ ౨౪ ॥ కార్తికేయపితా కోకనద భూషణభూషిత। ఖట్వాంగయోద్ధా ఖడ్గీచ గిరీశో గగనేశ్వరః ॥ ౨౫ ॥ గణాధ్యక్షః ఖేటక ధృక్ ఖర్వః ఖర్వతరః ఖగః। ఖగారూఢః ఖగారాధ్యః ఖేచరః ఖేచరేశ్వరః ॥ ౨౬ ॥ ఖేచరత్వ ప్రదః క్షోణీపతిః ఖేచరమర్దకః। గణేశ్వరో గణపితా గరిష్ఠో గణభూపతిః ॥ ౨౭ ॥ గురుర్గురుతరో జ్ఞేయో గంగాపతి రమర్షణః। గతిప్రియో గతిరతః సుగోప్యో గోప్యబృందపః ॥ ౨౮ ॥ గవారూఢో జగద్భర్తా గోస్వామీ గోస్వరూపక। గోప్రదో గోధరో గృధ్రో గురుత్మాన్ గోకృతాసనః ॥ ౨౯ ॥ గోపీశో గురుతాతశ్చ గుహావాసీ సుగోపితః। గజారూఢో గజాస్యశ్చ గజాజిన ధరోఽగ్రజః ॥ ౩౦ ॥ గ్రహాధ్యక్షో గ్రహగణో దుష్టగ్రహ విమర్దకః। గానరూపీ గానరతః ప్రచండో గాన విహ్వలః ॥ ౩౧ ॥ గానమత్తో గుణీ గుహ్యో గుణగ్రామాశయో గుణః। గూఢబుద్ధి ర్గూఢమూర్తి ర్గూఢపాద విభూషితః ॥ ౩౨ ॥ గోప్తా గోలోకవాసీచ గుణవాన్ గుణినాంవరః।

గోప్తయు, గోలోకవాసియు, గుణావంతుఁడును, గుణినాంవరుఁడును, హరుఁడును, హరితవర్ణాక్షుఁడును, మృత్యువును, మృత్యుంజయుండును, హరియు, హవ్యభుక్కును, హరిసంపూజ్యుఁడును, హవిస్సును, హవిర్భుజాంవరుఁడును, అనాదియు, ఆదియు, సర్వాద్యుఁడును, ఆదితేయవరప్రదుఁడును, అనంతవిక్రముఁడును, లోకేలోకానాంపాపహారకుండును, గీష్పతియు, సద్గుణోపేతుఁడును, సగుణుఁడును, నిర్గుణుఁడును, గుణియు, గుణప్రీతుఁడును, గుణవరుఁడును, గిరిజానాయకుఁడును, గిరియు, గౌరీభర్తయు, గుణాఢ్యుఁడును, గోశ్రేష్ఠాసనసంస్థితుఁడును, పద్మాసనుఁడును, పద్మనేత్రుఁడును, పద్మతుష్టుఁడును, సుపద్మకుఁడును, పద్మవక్త్రుఁడును, పద్మకరుఁడును, పద్మారూఢపదాంబుజుఁడును, పద్మప్రియతముఁడును, పద్మాలయుఁడును, పద్మప్రకాశకుఁడును, పద్మకానన సంవాసుండును, పద్మకాననభుంజకుఁడును, పద్మకాననసంవాసియు, పద్మారణ్యాకృతాలయుఁడును, ప్రఫుల్లవదనుఁడును, ఉత్ఫుల్లకమలాక్షుఁడును, ప్రఫుల్లకృత్తును, ఫుల్లేందీవరసంతుష్టుఁడును, ప్రఫుల్లకమలాసనుఁడును, ఫుల్లాంభోజకరుఁడును, ఉత్ఫుల్లమానసుఁడును, పాపహారకుఁడును, పాపాపహారియు, పుణ్యాత్ముఁడును, పుణ్యకీర్తియు, సుపుణ్యావంతుఁడును, పుణ్యుఁడును, పుణ్యతముఁడును, ధన్యుఁడును, సుపూతాత్ముఁడును, పరమాత్మకుఁడును, పుణ్యేశుఁడును, పుణ్యదుఁడును, పుణ్యనిరతుఁడును, పుణ్యభాజనుఁడును, పరోపకారియు, పాపిఘ్ననాశకుఁడును, పాపహారకుఁడును, పురాతనుఁడును, పూర్వహీనుఁడును, పరద్రోహవివర్జితుఁడును, పీవరుఁడును, పీవరముఖుఁడును, పీనకాయుఁడును, పురాంతకుఁడును, పాశియు, పశుపతియు, పాశహస్తుఁడును, పాషాణవిట్పతియును, పలాత్మకుఁడును, పరావేత్త్రుఁడును, పాశబద్ధవిమోచకుఁడును, పశూనామధిపుఁడును, పాశచ్ఛేత్తయు, పాశవిభేదకుఁడును, పాషాణ

హరో హరితవర్ణాక్షో మృత్యోర్మృత్యుంజయోహరిః॥ ౩౩ ॥ హవ్యభుగ్ఘరి సంపూజ్యోహవిర్హవిర్భుజాంవరః। అనాదిరాదిస్సర్వాద్య ఆదితేయ వరప్రదః ॥ ౩౪ ॥ అనన్త విక్రమోలోకే లోకానాం పాపహారకః। గీష్పతిః సద్గుణోపేతః సగుణో నిర్గుణో గుణీ ॥ ౩౫ ॥ గుణప్రీతో గుణవరో గిరిజానాయకో గిరిః। గౌరీభర్తా గుణాఢ్యశ్చ గోశ్రేష్ఠాసన సంస్థితః ॥ ౩౬ ॥ పద్మాసనః పద్మనేత్రః పద్మతుష్టః సుపద్మకః। పద్మవక్త్రః పద్మకరః పద్మారూఢ పదాంబుజః ॥ ౩౭ ॥ పద్మప్రియతమః పద్మాలయః పద్మప్రకాశకః। పద్మకానన సంవాసః పద్మకానన భుంజకః ॥ ౩౮ ॥ పద్మకానన సంవాసీ పద్మారణ్యా కృతాలయః। ప్రఫుల్లవదనోత్ఫుల్ల కమలాక్షః ప్రఫుల్లకృత్ ॥ ౩౯ ॥ ఫుల్లేందీవరసంతుష్టః ప్రఫుల్లకమలాసనః। ఫుల్లాంభోజకరోత్ఫుల్ల మానసః పాపహారకః ॥ ౪౦ ॥ పాపాపహారీ పుణ్యాత్మా పుణ్యకీర్తిః సుపుణ్యవాన్ । పుణ్యః పుణ్యతమో ధన్యః సుపూతాత్మా పరాత్మకః ॥ ౪౧ ॥ పుణ్యేశః పుణ్యదః పుణ్యనిరతః పుణ్యభాజనః। పరోపకారీ పాపిఘ్న నాశకః పాపహారకః ॥ ౪౨ ॥ పురాతనః పూర్వహీనః పరద్రోహ వివర్జితః। పీవరః పీవరముఖః పీనకాయః పురాంతకః ॥ ౪౩ ॥ పాశీ పశుపతిః పాశహస్తః పాషాణ విట్పతిః। పలాత్మకః పరావేత్తా పాశబద్ధ విమోచకః ॥ ౪౪ ॥ పశూనా మధిపః పాశచ్ఛేత్తా పాశవిభేదకః।

ధారియు, పాషాణశయానుఁడును, పాశిపూజితుఁడును, పశ్వారూఢుఁడును, పుష్పధనువును, పుష్పబృందసుపూజితుఁడును, పుండరీకుఁడును, పీతవాససుం డును, పుండరీకాక్షవల్లభుఁడును, పానపాత్రకరుఁడును, పానమత్తుఁడును, పానాతి భూతకుఁడును, పోష్టయు, పోష్టవరుఁడును, పూతుఁడును, పరిత్రాతయు, అఖి లేశ్వరుఁడును, పుండరీకాక్షకర్తయు, పుండరీకాక్షసేవితుఁడును, పల్లవస్థుఁడును, ప్రపీరస్థుఁడును, పీరభూమినివాసకుఁడును, పితయు, పితామహుఁడును, పార్థుఁడును, ప్రసన్నాభీష్టదాయకుఁడును, పితౄణాంప్రీతికర్తయు, ప్రీతిదుఁడును, ప్రీతిభాజనుఁ డును, ప్రీత్యాత్మకుఁడును, ప్రీతవశియు, సుప్రీతుఁడును, ప్రీతికారకుఁడును, ప్రీతి హృత్తును, ప్రీతిరూపాత్ముఁడును, ప్రీతియుక్తుఁడును, ప్రణతార్తిహరుఁడును, ప్రాణ వల్లభుఁడును, ప్రాణదాయకుఁడును, ప్రాణియు, ప్రాణస్వరూపుఁడును, ప్రాణ గ్రాహియు, సునిర్దయుఁడును, ప్రాణనాథుఁడును, ప్రీతమనసుఁడును, సర్వేషాంప్ర పితామహుఁడును, వృద్ధుఁడును, ప్రవృద్ధరూపుఁడును, ప్రేతుఁడును, ప్రణయినాం వరుఁడును, పరాధీశుండును, పరంజ్యోతియు, పరనేత్రుఁడును, పరాత్మకుఁడును, పారుష్యరహితుఁడును, పుత్త్రియు, పుత్త్రదుఁడును, పుత్త్రరక్షకుఁడును, పుత్త్రప్రియుం డును, పుత్త్రవశ్యుండును, పుత్త్రవత్పరిపాలకుఁడును, పరిత్రాతయు, పరావాసుఁ డును, పరచేతసుఁడును, పరేశ్వరుఁడును, పతియు, సర్వసంపాల్యుఁడును, పవమా నుఁడును, పరాంతకుఁడును, పురఘ్నుఁడును, పురుహూతుఁడును, త్రిపురారియు, పురాంతకుఁడును, పురందరాతి సంపూజ్యుండును, ప్రధర్షుఁడును, దుష్ప్రధర్షుఁడును, పటువును, పటుతరుఁడును, ప్రౌఢుఁడును, ప్రపూజ్యుఁడును, పర్వతాలయుఁడును, పులినస్థుఁడును, పులస్త్యాఖ్యుఁడును, పింగచక్షువును, ప్రపన్నగుఁడును, అభీరువును, అసితాంగుఁడును, చండరూపుఁడును, సితాంగకుఁడును, సర్వవిద్యావినోదుఁడును,

---

పాషాణధారీ పాషాణశయానః పాశిపూజితః ॥ ౪౫ ॥ పాశారూఢః పుష్పధనుః పుష్పబృందసు పూజితః । పుండరీకః పీతవాసాః పుండరీకాక్షవల్లభః ॥ ౪౬ ॥ పానపాత్రధరః పానమత్తః పానాతిభూతకః । పోష్టాపోష్టవరః పూతః పరిత్రాతాఽఖిలేశ్వరః ॥ ౪౭ ॥ పుండరీకాక్షకర్తాచ పుండరీకాక్షసేవితః । పల్లవస్థః ప్రపీరస్థః పీరభూమినివాసకః ॥ ౪౮ ॥ పితా పితామహః పార్థః ప్రసన్నాభీష్టదాయకః । పితౄణాం ప్రీతికర్తాచ ప్రీతిదః ప్రీతిభాజనః ॥ ౪౯ ॥ ప్రీత్యాత్మకః ప్రీతవశీ సుప్రీతః ప్రీతికారకః । ప్రీతిహృత్ప్రీతిరూపాత్మా ప్రీతియుక్తస్త్వమేవహి ॥ ౫౦ ॥ ప్రణతార్తిహరః ప్రాణవల్లభః ప్రాణదాయకః। ప్రాణీప్రాణస్వరూపశ్చ ప్రాణగ్రాహీసునిర్దయః॥ ౫౧ ॥ ప్రాణనాథః ప్రీతమనాః సర్వేషాం ప్రపితామహః । వృద్ధః ప్రవృద్ధరూపశ్చప్రేతః ప్రణ యినాంవరః ॥ ౫౨ ॥ పరాధీశః పరంజ్యోతిః పరనేత్రః పరాత్మకః । పారుష్యరహితః పుత్త్రీ పుత్త్రదః పుత్త్రరక్షకః ॥ ౫౩ ॥ పుత్త్రప్రియః పుత్త్రవశ్యః పుత్త్రవత్పరిపాలకః । పరిత్రాతా పరా వాసః పరచేతాః పరేశ్వరః ॥ ౫౪ ॥ పతిః సర్వస్యసంపాల్యః పవమానః పరాంతకః । పురహా పురుహూతశ్చ త్రిపురారిః పురాంతకః ॥ ౫౫ ॥ పురందరాతిసంపూజ్యః ప్రధర్షోదుష్ప్రధర్షణః । పటుః పటుతరః ప్రౌఢః ప్రపూజ్యః పర్వతాలయః ॥ ౫౬ ॥ పులినస్థః పులస్త్యాఖ్యః పింగచక్షుః ప్రపన్నగః । అభీరురసితాంగశ్చ చండరూపః సితాంగకః ॥ ౫౭ ॥ సర్వవిద్యావినోదశ్చ సర్వ

సదాసర్వసౌఖ్యయుతుఁడును, సుఖహర్తయు, సర్వసుఖియు, సర్వలోకైకపావనుఁడును, సదావనుఁడును, నారదుఁడును, సుసిద్ధుఁడును, శుద్ధరూపకుఁడును, సారుఁడును, సారతరుఁడును, సూర్యుఁడును, సోముఁడును, సర్వప్రకాశకుఁడును, సోమమండలధారియు, సముద్రుఁడును, సింధురూపవంతుఁడును, సురజ్యేష్ఠుఁడును, సురశ్రేష్ఠుఁడును సురాసురనిషేవితుఁడును, సర్వధర్మవినిర్ముక్తుఁడును, సర్వలోకనమస్కృతుఁడును, సర్వాచారస్తుతుఁడును, సౌరుండును, శాక్తుఁడును, పరమవైష్ణవుఁడును, సర్వధర్మవిధానజ్ఞుఁడును, సర్వాచారపరాయణుఁడును, సర్వరోగప్రశమనుఁడును, సర్వరోగాపహారకుఁడును, ప్రకృష్టాత్ముఁడును, మహాత్ముఁడును, సర్వధర్మప్రదర్శకుఁడును, సర్వసంపద్యుతుఁడును, సర్వసంపద్దానమోక్షుఁడును, సహాస్యవదనుఁడును, హాస్యయుక్తుఁడును, ప్రహసితాననుఁడును, సాక్షియు, సమక్షవక్తయు, సర్వదర్శియు, సమస్తవిదుండును, సకలజ్ఞుఁడును, సమర్థజ్ఞుఁడును, సుమనసుఁడును, శైవపూజితుఁడును, శోకప్రశమనుండును, శోకహంతయు, అశోచ్యుఁడును, శుభాన్వితుఁడును, శైలజ్ఞుఁడును, శైలజానాథుఁడును, శైలనాథుఁడును, శనైశ్చరుఁడును, శశాంకసదృశజ్యోతియు, శశాంకార్ధవిరాజితుఁడును, సాధుప్రియుఁడును, సాధుతముఁడును, సాధ్వీపతియు, అలౌకికుఁడును, శూన్యరూపుఁడును, శూన్యదేహుఁడును, శూన్యస్థుఁడును, శూన్యభావనుఁడును, శూన్యగామియు, శ్మశానస్థుఁడును, శ్మశానాధిపతియు, సువాక్కును, శతసూర్యప్రభుఁడును, సూర్యుఁడును, సూర్యదీప్తుఁడును, సురారిహుఁడును, శుభాన్వితుఁడును, శుభతనుఁడును, శుభబుద్ధియు, శుభాత్మకుఁడును, శుభాన్వితతనుఁడును, శుక్లతనుఁడును, శుక్లప్రభాన్వితుఁడును, సుశౌక్లుఁడును, శుక్లదశనుఁడును, శుక్లాభుఁడును, శుక్లమాల్యధృక్కును, శుక్లపుష్పప్రియుఁడును, శుక్లవసనుఁడును, శుక్ల

సౌఖ్యయుతస్సదా । సుఖహర్తా సర్వసుఖీ సర్వలోకైకపావనః ॥ ౫౮ ॥ సదావనో నారదశ్చ సుసిద్ధః శుద్ధరూపకః। సారః సారతరస్సూర్యః సోమస్సర్వప్రకాశకః ॥౫౯॥ సోమమండలధారీచ సముద్రః సింధురూపవాన్ । సురజ్యేష్ఠః సురశ్రేష్ఠః సురాసురనిషేవితః ॥౬౦॥ సర్వధర్మవినిర్ముక్తః సర్వలోకనమస్కృతః । సర్వాచారస్తుతః సౌరః శాక్తః పరమవైష్ణవః ॥ ౬౧ ॥ సర్వధర్మవిధానజ్ఞః సర్వాచారపరాయణః । సర్వరోగప్రశమనః సర్వరోగాపహారకః ॥ ౬౨ ॥ ప్రకృష్టాత్మా మహాత్మాచ సర్వధర్మప్రదర్శకః । సర్వసంపద్యుతః సర్వసంపద్దాన సమేక్షుణః ॥ ౬౩ ॥ సహాస్యవదనో హాస్యయుక్తః ప్రహసితాననః । సాక్షీసమక్షవక్తాచ సర్వదర్శీసమస్తవిత్ ॥ ౬౪ ॥ సకలజ్ఞః సమర్థజ్ఞః సుమనాః శైవపూజితః । శోకప్రశమనః శోకహన్తాఽశోచ్యః శుభాన్వితః ॥ ౬౫॥ శైలజ్ఞః శైలజానాథః శైలనాథః శనైశ్చరః। శశాంకసదృశజ్యోతిః శశాంకార్ధ విరాజితః ॥౬౬॥ సాధుప్రియః సాధుతమః సాధ్వీపతిరలౌకికః। శూన్యరూపః శూన్యదేహః శూన్యస్థః శూన్యభావనః ॥ ౬౭ ॥ శూన్యగామీ శ్మశానస్థః శ్మశానాధిపతిస్సువాక్ । శతసూర్యప్రభః సూర్యః సూర్యదీప్తః సురారిహా ॥ ౬౮ ॥ శుభాన్వితః శుభతనుః శుభబుద్ధిః శుభాత్మకః । శుభాన్వితతనుః శుక్లతనుః శుక్లప్రభాన్వితః । సుశౌక్లః శుక్లదశనః శుక్లాభః శుక్లమాల్యధృక్ ॥ ౬౯ ॥ శుక్లపుష్పప్రియః శుక్లవసనః శుక్లకేతనః। శేషాలంకరణః శేషరహితః శేషవేష్టితః ॥ ౭౦ ॥ శేషారూఢః

కేతనుఁడును, శేషాలంకరణుఁడును, శేషరహితుఁడును, శేషవేష్టితుఁడును, శేషారూఢుఁడును, శేషశాయియు, శేషాంగదవిరాజితుఁడును, సతీప్రియుఁడును, సశకుఁడును, సమదర్శియు, సమాధిమంతుఁడును, సత్సంగియు, సత్ప్రియుఁడును, సంగియు, నిస్సంగియు, సంగవర్జితుఁడును, సహిష్ణువును, శాశ్వతైశ్వర్యుఁడును, సదాసామగానరతుఁడును, సామవేత్తయు, సామ్యతరుఁడును, శ్యామాపరిశేష భుక్కును, తారిణీపతియు, ఆతామ్రనయనుఁడును, త్వరితప్రియుఁడును, తారాత్మకుఁడును, త్వగ్వసనుఁడును, తరుణీరమణరతుఁడును, తృప్తిరూపుఁడును, తృప్తికర్తయు, తారకారినిషేవితుఁడును, వాయుకేశుఁడును, భైరవేశుఁడును, భవానీశుఁడును, భవాంతకుఁడును, భవబంధుఁడును, భవహరుఁడును, భవబంధనమోచకుఁడును, అభిభూతుఁడును, అభిభూతాత్ముఁడును, సర్వభూత ప్రమోహకుఁడును, భువనేశుఁడును, భూతపూజ్యుఁడును, భోగమోక్షఫలప్రదుఁడును, దయాళువును, దీననాథుఁడును, దుస్సహుఁడును, దైత్యమర్దకుఁడును, దక్షకన్యాపతియు, దుఃఖనాశకుఁడును, ధనధాన్యదుఁడును, దయావంతుఁడును, దైవతశ్రేష్ఠుఁడును, దేవగంధర్వ సేవితుఁడును, నానాయుధ ధరుఁడును, నానాపుష్పగుచ్ఛ విరాజితుఁడును, నానాసుఖప్రదుఁడును, నానామూర్తిధారియు, నర్తకుఁడును, నిత్యవిజ్ఞాన సంయుక్తుఁడును, నిత్యరూపుఁడును, అనిలుఁడును, అనలుఁడును, లబ్ధవర్ణుఁడును, లఘుతరుఁడును, లఘుత్వ పరివర్జితుఁడును, లోలాక్షుఁడును, లోకసంపూజ్యుఁడును, లావణ్య పరిసంయుతుఁడును, నపురీన్యాససంస్థుఁడును, నాకేశుఁడును, నగపూజితుఁడును, నారాయణుఁడును, నారదుఁడును, నానాభరణభూషితుఁడును, నగభూతుఁడును, నగ్నదేశుఁడును, నగ్నుఁడును, సానందమానసుఁడును, నమస్యుఁడును, నతనాభియు, నమ్రమూర్ధాభివందితుఁడును, నందికేశుఁడును, నంది

శేషశాయీ శేషాంగదవిరాజితః । సతీప్రియశ్చ సశకః సమదర్శీ సమాధిమాన్ ॥ ౪౧ ॥ సత్సంగీ సత్ప్రియస్సంగీ నిస్సంగీ సంగవర్జితః । సహిష్ణుః శాశ్వతైశ్వర్యః సామగానరతః సదా ॥ ౪౨ ॥ సామవేత్తా సామ్యతరః శ్యామాపతిరశేషభుక్ । తారిణీపతి రాతామ్రనయన స్త్వరితప్రియః ॥ ౪౩ ॥ తారాత్మక స్త్వగ్వసన స్తరుణీరమణేరతః । తృప్తిరూప స్తృప్తికర్తా తారకారి నిషేవితః ॥ ౪౪ ॥ వాయుకేశో భైరవేశో భవానీశో భవాంతకః । భవబంధు ర్భవహరో భవబంధన మోచకః ॥ ౪౫ ॥ అభిభూతోఽభి భూతాత్మా సర్వభూతప్రమోహకః । భువనేశో భూతపూజ్యో భోగమోక్షఫలప్రదః ॥ ౪౬ ॥ దయాళు ర్దీననాథశ్చ దుస్సహో దైత్యమర్దకః । దక్షకన్యాపతి ర్దుఃఖనాశకో ధనధాన్యదః ॥౪౭॥ దయావాన్ దైవతశ్రేష్ఠో దేవగంధర్వసేవితః। నానాయుధధరో నానాపుష్పగుచ్ఛవిరాజితః ॥౪౮॥ నానాసుఖప్రదో నానామూర్తిధారీచ నర్తకః। నిత్యవిజ్ఞాన సంయుక్తో నిత్యరూపోఽనిలోఽనలః ॥ ౪౯॥ లబ్ధవర్ణో లఘుతరో లఘుత్వపరివర్జితః । లోలాక్షో లోకసంపూజ్యో లావణ్యపరిసంయుతః ॥౫౦॥ నపురీన్యాససంస్థశ్చ నాకేశో నగపూజితః। నారాయణో నారదశ్చ నానాభరణభూషితః ॥ ౫౧ ॥ నగభూతో నగ్నదేశో నగ్నః సానందమానసః । నమస్యో నతనాభిశ్చ నమ్రమూర్ధాభివందితః ॥ ౫౨ ॥ నందికేశో నందిపూజ్యో నానా

పూజ్యుఁడును, నానానీరజమధ్యగుఁడును, నవీనబిల్వపత్రౌఘతుష్టుఁడును, నవఘనద్యుతియు, నందుఁడును, సానందుఁడును, ఆనందమయుఁడును, ఆనంద విహ్వలుఁడును, నాలసంస్థుఁడును, శోభనస్థుఁడును, సుస్థుఁడును, సుస్థమతియు, స్వల్పాసనుఁడును, భీమరుచియు, భువనాంతకరాంబుదుఁడును, ఆసన్నుఁడును, సికతాలీనుఁడును, వృషాసీనుఁడును, వృషాసనుఁడును, వైరస్యరహితుఁడును, వార్యుఁడును, వ్రతియు, వ్రతపరాయణుఁడును, బ్రాహ్మ్యుఁడును, విద్యామయుఁడును, విద్యాభ్యాసియు, విద్యాపతియును, ఘంటాకారుఁడును, ఘోటకస్థుఁడును, ఘోరరావఘనస్వనుఁడును, ఘూర్ణచక్షువును, ఘూర్ణాత్ముఁడును, ఘోరహాసుఁడును, గభీరధీయును, చండీపతియును, చండమూర్తియు, చండముండియు, ప్రచండవాక్కును, చితాసంస్థుఁడును, చితావాసుఁడును, సదాచితిదండకరుఁడును, చితాభస్మాభిసంలిప్తుఁడును, చితానృత్యపరాయణుఁడును, చితాప్రమోదియు, చితాసాక్షియు, చింతామణియు, అచింతకుఁడును, చతుర్వేదమయుఁడును, చక్షువును, చతురానన పూజితుఁడును, చిరవాసుఁడును, చకోరాక్షుఁడును, చలన్మూర్తియు, చలేక్షణుఁడును, చలత్కుండలభూషణాఢ్యుఁడును, చలద్భూషణభూషితుఁడును, చలన్నేత్రుఁడును, చలత్పాదుఁడును, చలన్నూపురరాజితుఁడును, స్థావరుఁడును, స్థిరమూర్తియు, స్థావరేశుఁడును, స్థిరాసనుఁడును, స్థాపకుఁడును, స్థైర్యనిరతుఁడును, స్థూలరూపియు, స్థలాలయుఁడును, స్థైర్యాతిపుఁడును, స్థితిపరుఁడును, స్థాణురూపియు, స్థలాధిపుఁడును, ఐహికుఁడును, మదమత్తుఁడును, మహీమండల పూజితుఁడును, మహీప్రియుఁడును, మత్తరవుఁడును, మీనకేతువిమర్దకుఁడును, మీనరూపుఁడును, మీనసంస్థుఁడును, మృగహస్తుఁడును, మృగాసనుఁడును, మార్గస్థుఁ

నీరజమధ్యగః । నవీనబిల్వపత్రౌఘతుష్టో నవఘనద్యుతిః ॥ ౭౩ ॥ నందః సానంద ఆనంద
మయశ్చానంద విహ్వలః । నాలసంస్థః శోభనస్థః సుస్థః సుస్థమతి స్తథా ॥ ౭౪ ॥ స్వల్పాసనో
భీమరుచి ర్భువనాంత కరాంబుదః । ఆసన్నః సికతాలీనో వృషాసీనో వృషాసనః ॥ ౭౫ ॥
వైరస్య రహితో వార్యో వ్రతీ వ్రతపరాయణః । బ్రాహ్మో బ్రహ్మ విద్యామయో విద్యాభ్యాసీ విద్యా
పతి స్తథా ॥ ౭౬ ॥ ఘంటాకారో ఘోటకస్థో ఘోరరావఘనస్వనః । ఘూర్ణచక్షు రఘూర్ణాత్మా
ఘోరహాసో గభీరధీః ॥ ౭౭ ॥ చండీపతిశ్చండమూర్తి శ్చండముండ ప్రచండవాక్ । చితాసంస్థ
శ్చితావాస శ్చితిదండకరస్సదా ॥ ౭౮ ॥ చితాభస్మాభిసంలిప్త శ్చితానృత్య పరాయణః । చితా
ప్రమోదీ చితాసాక్షీ చింతామణి రచింతకః ॥ ౭౯ ॥ చతుర్వేదమయశ్చక్షు శ్చతురానన పూజితః ।
చిరవాసా శ్చకోరాక్షః చలన్మూర్తి శ్చలేక్షణః ॥ ౮౦ ॥ చలత్కుండల భూషాఢ్య శ్చలద్భూషణ
భూషితః । చలన్నేత్ర శ్చలత్పాద శ్చలన్నూపురరాజితః ॥ ౮౧ ॥ స్థావరః స్థిరమూర్తిశ్చ స్థావ
రేశః స్థిరాసనః । స్థాపక స్థైర్య నిరత స్థూలరూపీ స్థలాలయః ॥ ౮౨ ॥ స్థైర్యాతిపః స్థితిపరః స్థాణు
రూపీ స్థలాధిపః । ఐహికో మదమత్తశ్చ మహీమండల పూజితః ॥ ౮౩ ॥ మహీప్రియో మత్తరవో
మీనకేతువిమర్దకః । మీనరూపో మీనసంస్థో మృగరూపో మృగాసనః ॥ ౮౪ ॥ మార్గస్థో

డును, మేఖలాయుక్తుఁడును, మైథిలీశ్వరపూజితుఁడును, మిథ్యాహీనుఁడును, మంగళదుఁడును, మాంగల్యుఁడును, మకరాసనుఁడును, మత్స్యప్రియుఁడును, మధురగిరుఁడును, మధుపానపరాయణుఁడును, మృదువాక్యపరుఁడును, సారప్రియుఁడును, మోదాన్వితుఁడును, ముండాలియు, భూషణుఁడును, దండియు, ఉద్దండోజ్జ్వలలోచనుఁడును, అసాధ్యసాధకుఁడును, శూరసేవ్యుఁడును, శోకాపనోదనుఁడును, శ్రీపతియు, శ్రీసుసేవ్యుఁడును, శ్రీధరుఁడును, శ్రీనికేతనుఁడును, శ్రీమతాంశ్రీస్వరూపుఁడును, శ్రీమంతుఁడును, శ్రీనిలయుఁడును, శ్రమాదిక్లేశరహితుఁడును, శ్రీనివాసుఁడును, శ్రియాన్వితుఁడును, శ్రద్ధాళువును, శ్రాద్ధదేవుఁడును, శ్రాద్ధుఁడును మధురవాక్కును, ప్రళయాగ్న్యర్కసంకాశుఁడును, ప్రమత్తనయనోజ్జ్వలుఁడును, అసాధ్యసాధకుఁడును, శూరసేవ్యుఁడును, శోకాపనోదనుఁడును విశ్వభూతమయుఁడును, వైశ్వానరనేత్రుఁడును, అధిమోహకృత్తును, లోకత్రాణపరుఁడును, అపారగుణుఁడును, పారవివర్జితుఁడును, అగ్నిజిహ్వుఁడును, ద్విజాస్యుఁడును, విశ్వాస్యుఁడును, సర్వభూతధృక్కును, ఖేచరుఁడును, ఖేచరాధీశుఁడును, సర్వగుఁడును, సర్వలౌకికుఁడును, సేనానీజనకుఁడును, క్షుద్బాధివారిక్షోభనాశకుఁడును, కపాలవిలసద్ధస్తుఁడును, కమండలుభృద్ధృతుఁడును, కేవలాత్మస్వరూపుఁడును, కేవలజ్ఞానరూపకుఁడును, వ్యోమాలయనివాసియు, బృహద్వ్యోమస్వరూపకుఁడును, అంభోజనయనుఁడును, అమ్భోజాధిశయానుఁడును, పురుషాతిగుఁడును, నిరాలంబావలంబుఁడును, సంభోగానందరూపకుఁడును, యోగనిద్రామయుఁడును, లోకప్రమోహాపహరాత్మకుఁడును, బృహద్వక్త్రుఁడును, బృహన్నేత్రుఁడును, బృహద్బాహువును, బృహద్బలుఁడును, బృహత్సర్వాంగదుఁ

మేఖలాయుక్తో మైథిలీశ్వర పూజితః । మిథ్యాహీనో మంగళదో మాంగల్యో మకరాసనః ॥
౯౫ ॥ మత్స్యప్రియో మధురగీర్మధుపాన పరాయణః । మృదువాక్యపరః సారప్రియో మోదా
న్వితస్తథా ॥ ౯౬ ॥ ముండాలిర్భూషణో దండీ ఉద్దండోజ్జ్వల లోచనః । అసాధ్య సాధకః
శూరసేవ్యః శోకాపనోదనః ॥ ౯౭ ॥ శ్రీపతిః శ్రీసుసేవ్యశ్చ శ్రీధరః శ్రీనికేతనః । శ్రీమతాం
శ్రీస్వరూపశ్చ శ్రీమాన్ శ్రీనిలయస్తథా ॥ ౯౮ ॥ శ్రమాదిక్లేశ రహితః శ్రీనివాసః శ్రియాన్వితః ।
శ్రద్ధాళుః శ్రాద్ధదేవశ్చ శ్రాద్ధో మధురవాక్తథా ॥ ౯౯ ॥ ప్రళయాగ్న్యర్క సంకాశః ప్రమత్త
నయనోజ్జ్వలః । అసాధ్యసాధకః శూరసేవ్యః శోకాపనోదనః ॥ ౧౦౦ ॥ విశ్వభూతమయో వైశ్వా
నరనేత్రోఽధిమోహకృత్ । లోకత్రాణపరోఽపారగుణః పారవివర్జితః ॥ ౧౦౧ ॥ అగ్ని
జిహ్వో ద్విజాస్యశ్చ విశ్వాస్యః సర్వభూతధృక్ । ఖేచరః ఖేచరాధీశో సర్వగస్సర్వలౌకికః ॥
౧౦౨ ॥ సేనానీ జనకః క్షుద్బాధివారి క్షోభ నాశకః । కపాలి విలసద్ధస్తః కమండలు భృద
ధృతః ॥ ౧౦౩ ॥ కేవలాత్మ స్వరూపశ్చ కేవల జ్ఞానరూపకః । వ్యోమాలయ నివాసీచ బృహ
ద్వ్యోమ స్వరూపకః ॥ ౧౦౪ ॥ అంభోజనయనామ్భోధిశయానః పురుషాతిగః । నిరాలంబావలం
బశ్చ సంభోగానంద రూపకః ॥ ౧౦౫ ॥ యోగనిద్రామయో లోకప్రమోహాపహరాత్మకః ।
బృహద్వక్త్రో బృహన్నేత్రో బృహద్బాహు ర్బృహద్బలః ॥ ౧౦౬ ॥ బృహత్సర్వాంగదో దుష్ట
బృహద్బల విమర్దకః । బృహద్భుజబలోన్మత్తో బృహత్తుండో బృహత్తనుః ॥ ౧౦౭ ॥ బృహ

డును, దుష్టబృహద్బలవిమర్దకుఁడును, బృహద్భుజబలోన్నతుఁడును, బృహత్తుంగుఁడును, బృహద్వపుఁడును, బృహదైశ్వర్యయుక్తుండును, స్వయంబృహదైశ్వర్యదుఁడును, బృహత్సంభోగసంతుష్టుండును, బృహదానందదాయకుఁడును, బృహజ్జటాజూటధరుఁడును, బృహన్మాలియు, బృహద్ధనుఁడును, ఇంద్రియాధిష్ఠితుఁడును, సర్వలోకేంద్రియవిమోహకృత్తును, సర్వేంద్రియప్రవృత్తికృత్తును, ప్రవృత్తినాయకుఁడును సర్వవిపత్తిపరినాశకుఁడును, ప్రవృత్తిమార్గనేతయు, స్వయంస్వతంత్రేచ్ఛామయుఁడును, సత్ప్రవృత్తిరతుఁడును, నిత్యందయానందుఁడును, శివాధరుఁడును, క్షితిరూపుఁడును, తోయరూపియు, విశ్వతృప్తికరుఁడును, తర్పుఁడును, తర్పణసంప్రీతుఁడును, తర్పకుఁడును, తర్పణాత్మకుఁడును, తృప్తికారణభూతుఁడును, సర్వతృప్తిప్రసాధకుఁడును, అభేదాభేదకుఁడును, ఉచ్ఛిద్యచ్ఛేదకుఁడును, అచ్ఛేద్యుఁడును, అచ్ఛిన్నధన్వుఁడును అచ్ఛిన్నేషువును, అచ్ఛిన్నధ్వజవాహనుఁడును, అధృష్టుఁడును, సమధృష్టాస్త్రుఁడును, సమధృష్యబలోన్నతుఁడును, చిత్రయోధియు, చిత్రకర్ముఁడును, స్వయంవిశ్వసంకర్షకుఁడును, భక్తానామీప్సితకరుఁడును, సర్వేప్సితఫలప్రదుఁడును, వాంఛితాభీష్టఫలదుఁడును, భిన్నజ్ఞానప్రవర్తకుఁడును, బోధనాత్ముఁడును, బోధనారాతిగుఁడును, సర్వబోధకృత్తును, త్రిజటుఁడును, ఏకజటిలుఁడును, చలజ్జటభయానకుఁడును, జటాటీనుఁడును, స్వయంజటాజూటస్పృష్టావరవచుండును, షాణ్మాతురజనకుఁడును, శక్తిప్రహరతాంవరుఁడును, అనర్ఘాస్త్రప్రహారియు, అనర్ఘధన్వుఁడును, మహార్ఘ్యపాదుఁడును, యోనిమండలమధ్యస్థుఁడును, ముఖయోనియు, అజృంభనుఁడును, మహాద్రిసదృశుఁడును, శ్వేతుఁడును, శ్వేతపుష్పస్రగన్వితుఁడును, మకరందప్రియుఁడును, నిత్యంమా

దైశ్వర్య యుక్తశ్చ బృహదైశ్వర్యదః స్వయమ్ । బృహత్సంభోగ సంతుష్టో బృహదానంద
దాయకః ॥ ౧౦౮ ॥ బృహజ్జటాజూటధరో బృహన్మాలీ బృహద్ధనుః । ఇంద్రియాధిష్ఠితః సర్వ
లోకేంద్రియ విమోహకృత్ ॥ ౧౦౯ ॥ సర్వేంద్రియ ప్రవృత్తి కృత్సర్వేంద్రియ నివృత్తికృత్ ।
ప్రవృత్తినాయక స్సర్వవిపత్తి పరినాశకః ॥ ౧౧౦ ॥ ప్రవృత్తిమార్గనేతాత్వం స్వతంత్రేచ్ఛా
మయః స్వయమ్ । సత్ప్రవృత్తిరతో నిత్యం దయానందః శివాధరః ॥ ౧౧౧ ॥ క్షితిరూపస్తోయరూపీ
విశ్వతృప్తికర స్తథా । తర్ప స్తర్పణసంప్రీత స్తర్పక స్తర్పణాత్మకః ॥ ౧౧౨ ॥ తృప్తికారణ
భూతశ్చ సర్వతృప్తి ప్రసాధకః । అభేదాభేదకోచ్ఛిద్య చ్ఛేదకోఽచ్ఛేద్య ఏవహి ॥ ౧౧౩ ॥
అచ్ఛిన్నధన్వాచ్ఛిన్నేషు రచ్ఛిన్న ధ్వజవాహనః । అధృష్ట స్సమధృష్టాస్త్రః సమధృష్య బలో
న్నతః ॥౧౧౪॥ చిత్రయోధీ చిత్రకర్మా విశ్వసంకర్షకః స్వయమ్। భక్తానా మీప్సితకరః సర్వేప్సిత
ఫలప్రదః ॥ ౧౧౫ ॥ వాంఛితాభీష్ట ఫలదో భిన్నజ్ఞానప్రవర్తకః । బోధనాత్మా బోధనారాతిగః
సర్వప్రబోధకృత్ ॥౧౧౬॥ త్రిజటశ్చైకజటిలశ్చలజ్జటభయానకః। జటాటీనో జటాజూట స్పృష్టా
వరవచః స్వయమ్॥౧౧౭॥ షాణ్మాతురస్యజనకః శక్తిప్రహరతాంవరః। అనర్ఘాస్త్రప్రహారీ చానర్ఘ
ధన్వామహార్ఘ్యపాత్ ॥ ౧౧౮ ॥ యోనిమండలమధ్యస్థః ముఖయోని రజృంభనః । మహాద్రి
సదృశః శ్వేతః శ్వేత పుష్ప స్రగన్వితః ॥ ౧౧౯ ॥ మకరందప్రియో నిత్యం మాసత్తుహాయ

సత్త్వహోయనాత్మకుఁడును, నానాపుష్పప్రసువును, నానాపుష్పార్చితగాత్రుఁడును, షడంగయోగనిరతుఁడును, సదాయోగార్ద్రమానసుఁడును, సురాసురనిషేవ్యాంఘ్రియు, విలసత్పాదపంకజుఁడును, సుప్రకాశితవక్త్రాబ్జుఁడును, సితేతరగళోజ్జ్వలుఁడును, వైనతేయసమారూఢుఁడును, శరదిందుసహస్రవంతుఁడును, జాజ్వాల్యమానుఁడును, జ్వాలాపుంజుఁడును, స్వయంయముఁడును, ప్రజ్వలద్విద్యుదాభుఁడును, సాట్టహాసభయంకరుఁడును, ప్రళయానలరూపియు, స్వయంప్రళయాగ్నిరుచియు, జగతామేకపురుషుఁడును, జగతాంప్రళయాత్మకుఁడును నను నామంబులఁ బ్రకాశించుచుందువు నీ వో జగన్నాథా! జగత్కారణా! నీకు నమోవాకంబులఁ గావించుచున్నాను.” ౩౧౪౮

తే. ఈవిధమున భగీరథుం డీశ్వరుని స-హస్రనామముల నుతింప నలరి హరుఁడు
సుప్రసన్నముఖాబ్జుఁడై క్షోణిపతికి-నాక్షణంబునయందె ప్రత్యక్షమయ్యె.

చ. క్షితిపతిపూజ్యుఁడై తగు భగీరథుఁ డప్పుడు లోకనాయకున్
సితరుచిఁ బంచవక్త్రు శ్రితసిద్ధిదు సర్వవిభూషణున్ మహో
న్నతు వృషభాధిరూఢు గణనాథుఁ గనుంగొని, మానసంబునం
దతిశయహర్ష మొప్పఁగ మహాద్భుతనృత్య మొనర్చె నారదా! ౩౧౪౯

చ. “హర! పరమేశ్వరా! కడుఁ గృతార్థత నొందెను నాతపంబు, ను
ద్ధురవిధిచోదితంబయిన ఘోరపు వేలిమియున్, మదీయమా
నరజననంబునున్, వరగుణప్రకరాన్వితసర్వకార్యముల్
వరదుఁ బరేశు నిన్నుఁ గను భాగ్యము గల్గుటఁ జేసి యుత్తమా. ౩౧౫౦

ఉ. భూతపతీ! నిరామయ! ప్రపూర్ణమయా! హర! దేవదానవ
వ్రాతసుదుర్లభుండ వయి భాసిలు ని న్గనుఁగొన్నవాఁడ, నీ
భూతలమందు స్వర్గమునఁ బోలఁగ నెవ్వరు నాకుఁ దుల్యులై
యీతఱిఁ గానరా రనుచు నెంతయు సంతసమందుదున్ విభూ!” ౩౧౫౧

శివుఁడు భగీరథునకు వరంబిచ్చుట

చ. అనితరబుద్ధి నిట్టులు మహాశయుఁడై వినుతించు భూపతిన్
గని పరమేశ్వరుం డజుఁడు కష్టజనార్తిహరుండు ప్రీతి “నో

నాత్మకః। నానాపుష్పప్రసూర్నానాపుష్పైరర్చితగాత్రకః ॥ ౧౨౦ ॥ షడంగయోగనిరతః సదాయోగార్ద్రమానసః। సురాసుర నిషేవ్యాంఘ్రిర్విలసత్పాదపంకజః ॥ ౧౨౧ ॥ సుప్రకాశితవక్త్రాబ్జః సితేతరగళోజ్జ్వలః। వైనతేయసమారూఢః శరదిందుసహస్రవత్ ॥ ౧౨౨ ॥ జాజ్వల్యమానో నేత్రాభిర్జ్వాలాపుంజో యమః స్వయమ్। ప్రజ్వల ద్విద్యుదాభశ్చ సాట్టహాసభయంకరః ॥ ౧౨౩ ॥ ప్రళయానలరూపీచ ప్రళయాగ్నిరుచిఃస్వయమ్। జగతామేకపురుషోజగతాం ప్రళయాత్మకః ॥ ౧౨౪ ॥ ప్రసీద త్వం జగన్నాథ! జగద్యోనే నమోస్తుతే॥

తనయ! త్వదీప్సితం బెది? నితాంతముదంబునఁ గోరు, మిత్తు, న
మ్మనమున సంతసించితిని మాన్యతమంబగు నీదు భక్తికిన్." ౩౧౫౨

క. కరుణాంతరంగుఁ డయి శం-కరుఁ డీవిధమునను బలుకఁగా నెంతయు సం
బరమున భగీరథుఁడు మది-వరభక్తియుతాత్ముఁడగుచుఁ బ్రార్థించి హరున్.

మ. "మును మావంశమునందుఁ బుట్టిన ఘను లుర్వారుల్ మహావీర్యశో
భను లాఢ్యుల్ సగరాత్మజన్ములు సురప్రఖ్యాతసద్విక్రముల్
ఘను లత్యంతమదంబునం గపిలుదా గాఢోగ్రశాపాగ్ని గా
ల్ప నిమేషంబునఁ గాలి భస్మమయి రాపాతాళరంధ్రస్థలిన్. ౩౧౫౪

ఉ. వారల నుద్ధరించుటకు భవ్యఁ ద్రిలోకపవిత్ర గంగ నీ
ధారుణిఁ జేర్పఁ గోరితిని, దావకదివ్యమహోచ్చశక్తిమై
భూరితరప్రభావమునఁ బొల్చును గంగ, మహానుభావ! యిం
పారఁ ద్వదాజ్ఞ లేక భువి కాదృతిఁ జేరఁగరాదు శంకరా! ౩౧౫౫

ఉ. కావున భూరివేగవతి గంగ మహానది రూపు దాల్చి పెం
పావహిలంగ భూస్థలికి నాదృతి వచ్చి, మదీయపూర్వులన్
భూవివరప్రదేశమున బూడిదమై పడియున్నవారలన్
బావనులౌనటు ల్సలుపఁ బ్రార్థనసేసెద భక్తి శంకరా!" ౩౧౫౬

సీ. ఈవిధంబున వరం బెంతయుఁ గోరు నాభూపతిపుంగవు భూరివాంఛ
నాదృతి నాలించి యఖిలేశుఁడగు పరేశ్వరుఁడు "భగీరథా! సంతసంబు
గలిగె, నీకోరిక గావింతు, నచిరకాలంబున మత్ప్రసాదంబు గలుగుఁ
బూర్ణంబుగా నీకు, భువి నెవ రీస్తోత్రమును భక్తితోడుత నను మతింతు,
తే. రట్టివారికిఁ బూర్ణంబు లయి మనోర-థంబు లెల్లను ఫలియించు సంబరమున,
సత్య మిమ్మాటనమ్ముముస్వాంతమందు"-ననుచువరమిచ్చెశంకరుం డమరమౌని!

ఉ. అంత భగీరథుండు వర మాదృతి నొంది, ముదంబు మీఱఁగా
స్వాంతమునందు నీశునకు సాగిలి మ్రొక్కి, "మహానుభావ! నే
నెంతయు ధన్యుఁడన్, శివ! మహేశ్వర! త్వత్కృపచేత"నంచు న
త్యంతవినమ్రుఁడై పలికె నప్పుడు పొంగుచుఁ గోర్కి నిండఁగన్. ౩౧౫౭

తే. సురమునీంద్ర! మహామతీ! హరుఁడు తత్ క్ష
ణంబునందుఁ దిరోహితత్వంబు నొందె,
నాభగీరథభూపతి యధికనిర్వృ
తిని గృతార్థత నొందె నెమ్మనమునందు. ౩౧౫౮

శివసహస్రనామఫలస్తుతి

క. ఏనరుఁడు భగీరథకృత-మౌ నామసహస్రసంజ్ఞ నలరెడు స్తోత్రం
బూనిన భక్తిఁ బఠించునొ-యానరునకుఁ గలుగు మోక్ష మమరమునీంద్రా!

ఆ. ఈ సహస్రనామ మొలమిఁ బఠించిన-వాఁ డిహమునఁ గనఁడు బాధ నెందు,
నీశు కరుణచేత నెసఁగు మహైశ్వర్య-యుక్తుఁ డగుచు మిగుల నున్నతుఁడగు.

తే. ఆపదలయందు ఘోరమైనట్టి భయము-గలిగినపుడు సమస్తమంగళము లొసఁగు
నీశివసహస్రనామంబు నిద్ధభక్తి-బఠన మొనరింపఁగాఁ దగుఁ బరమమౌని!

తే. ఘోరభీతిహరంబు, నపారసుఖద,
మధికసంపత్ప్రదంబు నై యలరు నీ స
హస్రనామంబుఁ బఠియించునతఁడు శివుని
దయ విమోచితుఁడగు మహాభయమువలన. ३०౬३

సీ. క్షామంబు తొడరిన సమయంబునందు లోకోపద్రవంబు దేశోపహతియుఁ
గలిగిన సమయానఁ గడుభక్తి ధూపదీపాదుల నర్చించి యాదిదేవుఁ
డయిన శంకరుని సమంచితంబుగను నీనామసహస్రంబు నేమమునను
బఠియించు నెవ్వండు వాని దేశంబునఁ గఱవును మఱియు లోకప్రపీడ

తే. మున్నుగాఁగల్గు బాధలు పొడవడంగు,
శాంతి నెలకొను, నదనున సస్యవృద్ధి
యొసఁగు, వర్షంబు పర్జన్యుఁ డిచ్చు, సంశ
యంబు లేదు, త్రిసత్యమౌ నసఘచరిత! ३०౬४

తే. సకలపాపప్రణాశనచతురమయిన-యీసహస్రనామస్తుతి నెందుఁ బఠన
మాచరింతురొ యాదేశమందు నఖల-సస్యసంపూర్ణ యగుచును జగతి వెలయు.

తే. శ్రీమహాదేవు కరుణ దుశ్చింతనంబ
కాలమరణంబు గలుగ, నక్కడ వసించు
జనములకు ఘాతుకమ్ముగ సంజనితభయము
కలలయందైన నెప్పుడుఁ గలుగఁబోదు. ३०౬౬

తే. భక్తిఁ బార్థివలింగంబుఁ బరమనిష్ఠఁ
బూజన మొనర్చి యీస్తోత్రమును బఠించు
దేశములు ధన్యములు నాఁగ దిక్కులందు
నెగడుఁ, బ్రజ లందు ధన్యులై నెగడుచుంద్రు. ३०౬౭

సీ. ఫాల్గునంబునఁ గృష్ణపక్షచతుర్దశి నాఁ డీశివసహస్రనామములను
భక్తిసంయుక్తుఁడై పఠియించు నెవ్వాఁడు, పరమేశ్వరుని కృపవలన వాఁడు

మరల జన్మంబు నుర్విఁ బొందఁ డెన్నఁడు, వాయుతుల్యుఁడయి బలమునందు
విహరించు, భూమిపై విత్తవంతుఁడగు ధనదునితో సాటి యనుచుఁ బొగడ,

తే. నందమున మన్మథున కెనయగుచు వెలయు,
నిగ్రహానుగ్రహంబుల నెఱపు దేవ
విభునికై వడి, నెందు సత్ప్రభుత మించు,
సత్యముగ నమ్ము మీమాట సంయమీంద్ర! ౩౧౬౮

తే. ఎవఁడు గంగాతటంబున నేఁ, బ్రయాగ-యందు నేని, కురుక్షేత్రమందు నేని,
శంకరునిఁ బూజచేసి యీ స్తవము పఠన-మాచరించును, కైవల్య మందు వాఁడు.

తే. పరమమంగళప్రదమగు హరిసహస్ర-నామసంస్తుతిఁ గాశిలో నేమనుజుఁడు
చేయుఁ దాఁ పుణ్య మెన్న నమేయమనుచుఁ-జెప్పఁగాఁ బాల నారదా! సిద్ధవినుత!

తే. అట్టివాఁ డీ స్తవప్రసాదార్హుఁ డగుచుఁ
బుడమి జీవించియుండి గో మృతుని దివ్య
రూపమున వెలుఁగొందు సద్రుచులతోడ,
నంతమున వానికిని ముక్తి హ స్తగతము ౩౧౭౧

తే. ప్రతిదినంబును నెవఁడు సద్భక్తి బిల్వ
వృక్షమూలమునను వసియించి యీ స
హస్రనామంబును బఠించు నతఁడు శివుని
కరుణ సాలోక్యమును బొందఁగలఁడు మౌని! ౩౧౭౨

తే. సకలపాపహరంబగు స్తవము, దీని
నెవఁడు పఠియింపఁ జేయుఁ దా నిద్ధభక్తి,
ఘోరపాపంబువలన ముక్తుఁడగు వాఁడు,
సత్యముగఁ బల్కుచున్నాఁడ సంయమీంద్ర! ౩౧౭౩

తే. హృదయమున నీశ్వరుని నిల్పి యెవ్వఁ డీ స
హస్రనామంబును బఠించు, నఖిలమృత్యు
భయములును గ్రహపీడలు బాధ లంట
వతని నెపుడును, ద్వేషింప రవనిపతులు. ౩౧౭౪

సీ. దేవదేవుని సర్వదేవస్వరూపుని రజతాద్రినిభరుచి నజునిఁ బూర్ణ
నుత్ఫుల్లపంకజాస్యునిఁ జారురూపుని వృషభధ్వజుని శాంతు ద్వీపిచర్మ
ధారు జటాజూటుఁ ద్రైలోక్యమోహనుఁ గాలకూటప్రభాకలితతనుని,
దక్షిణంబున వామపక్షంబునందుఁ ద్రిశూలము డమరుకు లీలఁ దాల్చి,

తే. వెలుఁగునట్టి దేవు విభుని ధ్యానించుచు
నీ స్తవంబుఁ జదువు నేనరుండు,

కొఱఁత లేక యెప్పుడుఁ గుదిరిక నిహపరం
బుల సుఖించు నతఁడు మునివరేణ్య! ౩౧౭౫

తే. ఈ మహాస్తోత్రమహిమంబు నిట్టి దనుచుఁ
దెలుప నలవియె? విను, మాదిదేవు దివ్య
భవ్యసారూప్యమును బొంది ప్రథితరీతి
వెలయుఁ బఠియించు పురుషుఁడు విబుధమాని! ౩౧౭౬

చ. మునివర! యీ స్తవంబు కడు మోదము నాకు ఘటించుఁగాన దీ
నిని గడుభక్తితోడ ధరణిం బఠియించును బిల్వమూలమం
దున మనుజుం డెవండయినఁ దోరపువేడుక, నీజగంబు నం
తను నరకంబునుండి నడిఁ దాను బవిత్రముఁ జేయు నారదా! ౩౧౭౭

అఱువదియెనిమిదవ అధ్యాయము

గంగానిర్గమనము

సీ. వినుము భగీరథవిశ్వంభరేశుండు స్వేష్టసంసిద్ధికై జ్యేష్ఠమాస
శుక్లపక్షమునందు శుభదినంబున హస్తయను తార వెలయ దివ్యరథ మెక్కి
యతివినదం బీనునట్టి శంఖంబును బూరించె, నప్పు డాభూమిభర్త
మధ్యాహ్నకాలార్కమహితదీప్తిసమేతుకరణిని రాజిల్లె నరదముపయి
తే. నధివసించి మహాబాహువయిన సగర
భూరివంశపావనుఁడు భగీరథుండు
సకలభూషణధారిసచ్ఛవిసముజ్జ్వ
లంబగు కిరీటమును దాల్చి డంబు వెలయ. ౩౧౭౮

సీ. తేజస్వి, రాజర్షి, ధృతియుతుండు, సువస్త్రరాజితుఁ, డత్యంతరక్తనేత్రుఁ,
డతిసుప్రసన్నముఖాబ్జుఁడు, క్షత్త్రియవర్యుండు, నత్యంతబలయుతుండు,
కాకపక్షధరుండు, కమనీయతనుఁడు, నానారత్నభూషితాహీనకాంతి
యుతదివ్యరథసమంచితుఁడు, సుమేరుశృంగసమానరమణీయకాంతియుతుఁడు,
తే. కనకభూషణమండితఘనవిచిత్ర-రమ్యకేతనయుతహయరత్నభాస
మానమగు నరదంబు ద్యుమణిరథంబు-క్రియ వెలుంగఁ జెన్నొందె భగీరథుండు.

తే. అంత భూకాంత యా సగరాన్వవాయ-జలధిచంద్రు భగీరథుఁ దెలిసి దివ్య
మైన రూపంబు దాల్చి గంగావతార-కారణుండైన యారాజుఁ జేరవచ్చె.

క. మునినాథా! ధర్మాత్ముని-ననఘు భగీరథునిఁ గాంచి యభివందన మొ
య్యన నాచరించి, ధరణీ-వనితామణి రమ్యఫణితిఁ బలికెఁ వినుమా. ౩౧౮౧

సీ. ''భూపాలకా! మహాత్ముఁడవు సాక్షాద్ధర్మమూర్తి వీక్షోణిపై పుణ్యచరిత!
భవదీయపితరులై భాసిల్లు సగరవంశ్యుల నెల్లఁ బూనితి వుద్ధరింప
నని యెఱింగినదాన, వనజనాభుని శరీరాశ్రయయును ధన్యయయిన గంగఁ
బూతచరిత్రను బూడిదైయె పడియున్న సగరులఁ జేర్పంగఁ దగిన యత్న

తే. మాచరింపఁగనున్నాఁడ వార్యచరిత!-నాదు సంప్రార్థనంబు వినంగఁగోరు
చున్నదానను,వినుముమహోన్నతగుణ!-కరుణతోడఁబాలింపునావరమువేడ్క.

ఉ. నాలుగు దిక్కులన్ బుడమి నాలుగు ధారలుగాఁ బ్రవాహముల్
శ్రీలసితంబులై వెలయఁజేయుచు నంబుధిఁ జేరుదాఁకఁ బు
ణ్యాలయమైన గంగ నను నాదృతిఁ బూతశరీరఁ జేయు నే
లీల మహోత్తమంబుగ ఫలింప మదీప్సిత మట్లొనర్పుమా.'' ౩౧౬౩

వ. అంత భగీరథభూకాంతుండు క్షితికాంత కిట్లనియె ౩౧౬౪

సీ. ''హరిపదకమలంబునందుండి ద్రవరూప మొంది, శాంభవి దేవి యుగుమహేశ
శక్తి సుమేర్వాఖ్య శైలశృంగమునకు రాఁగల, దప్పు డారాధనంబు
కావింపుమా ధరాదేవీ! భవత్ప్రాప్తికై యేను నర్థింతు గంగ భక్తి,
నంతట నీకోర్కె యెంతయుఁ దీర్చును శ్రితఫలదాయిని యతిముదమున

తే. స్వర్గపురమున కరిగెద, స్వామిలమున-కాదృతిని గంగఁ గొనిరాఁగ, నంబ! నీవు
రమ్ము గంగను ప్రార్థింప శ్రద్ధతోడ-భూతధాత్రీ'' యటన్న నుపొంగి వసుధ.

తే. సుప్రసన్నముఖాంబుజశోభిత యయి-రాజుతోఁగూడ స్వర్గపురప్రయాణ
మాచరింపఁగ నుత్సుకయై స్థిరతగ-మతి నెసఁగె మునినాయకా! హితవు నెంచి.

ఉ. అంత భగీరథుండు రథికాగ్రణి సారథిఁ గాంచి ''ధీరసు
స్వాంతమహాబలాఢ్య! యిఁక స్వర్గపురంబును జేరఁగా రథం
బెంతయు సత్వరంబున నహీనజవంబున నశ్వరత్నముల్
వింతగతిం గమింప నదలింపుము'' నా నతికౌతుకంబునన్. ౩౧౬౫

క. తురగోత్తమముల సారథి-త్వరితగతిని నడుచునట్టి వైఖరి నడపెన్,
సురముని! సమీరవేగ-స్ఫురణన్ క్షణమునను జేరె సురలోకంబున్. ౩౧౬౬

ఆ. అంత మేరుశృంగ మరదం బతిద్రుత-గతిని జేరఁబోవఁగా భగీర
థుండు ప్రళయకాలతోయదధ్వానసం-కాశశంఖ మొత్తెఁ గడిమి మెఱయ.

సీ. వైకుంఠపురి మహాధ్వానంబు వినఁబడినంతనే విష్ణుపాదాబ్జసీమ
వెలువడి, గంగ తాఁ గలకలధ్వనితోడ ద్రవరూపమును బొంది ప్రవిలతమగు
వేగంబు మెఱయంగ విబుధు లచ్చెరువంద మేరుశృంగమున నపారమహిమ
వెలయుంగఁ బడుటయు విశ్వంభరానేత నీరరూపిణిఁ గాంచి నెమ్మనమున

తే. నలిముదంబున నుప్పొంగి యపుడు శంఖ
శబ్దమును నిల్పి నృత్యంబు సలుపఁ దొడఁగెఁ,
బరవశుండయి గంగ సంబరముతోడ
వచ్చెనని, కృతకృత్యత నలరె ననుచు. ౩౧౯౦

క. అవనీనాథుని శంఖా-రవము నిలువఁగానె గంగ రయము నిలిపి యా
గిరిజాద్రిశిఖరమున వై-భవమున నొక్కింతసేపు వసియించె మునీ! ౩౧౯౧

భూదేవీకృత గంగాస్తుతి

తే. అపుడు భూదేవి సకలలోకైకపావ-నాత్మికను గంగ డాయంగ నరిగి, మిగుల
భక్తి మీఱంగ వినుతించెఁ బరమపావని!-శ్రద్ధతో విను తెల్పెద సలలితముగ.

తే. "బ్రహ్మరూపా! మహేశ్వరీ! భద్రసంవి-ధాయినీ! లోకమాత! విస్తారకరుణ
నఖిలభువనసముద్ధరణార్థముగ ద్ర-వస్వరూపిణి వగు నిన్నుఁ బ్రస్తుతింతు. ౩౧౯౩

తే. ఎవఁడు భక్తి నభక్తినేఁ దవిలి తావ-కంబయిన దివ్యసలిలకణంబుఁ దాఁకు,
వాఁడు గంగామహాదేవి! పరమపదము-నొందుఁ, గావింతు నీకు నే వందనములు.

తే. ఎంత పాపాత్ములైన నీచెంతఁ జేరి-దర్శనము చేయ దుష్కృతతతులు తొలఁగి,
యముని శిక్షను వారొందరమ్మ! పరమ-భక్తిఁ గావింతు నీకు నే వందనములు.

తే. గంగ యను పరమాక్షర కలితయుష్మ-దీయనామము నొకమాఱు అమేయభక్తిఁ
దలఁచువారల కెన దేవతలు మనుష్యు-లెవరుఁ జాలరు, నిజముగా భువనవితతి.

సీ. ద్రవరూపమున నుండు ధన్యాత్మవగు నిన్నుఁ బ్రకృతిని మదిని సద్భక్తితోడ
వందనంబు లొనర్చువారికి దుర్గతులొందవు, యమభీతి యొదవ దెపుడు,
తుదిని మోక్షము నొందుదురు, తల్లి! వందనంబు లొనర్తు నీకు నో భువనవినుత!
సకలభూతాశయాశ్రయవగు శక్తివి నీవె కా కెవ్వరో దేవి! కలరు?

తే విద్య వీవె యవిద్యాతి మహితశక్తిఁ-బాపఁగలయట్టి దక్షత పరఁగు నీకె,
యంబ! నీకెన యెవ్వరీ యఖిలజగతి?-వందనంబు లొనర్తును భక్తి నీకు.

తే. విష్ణుదేహకృతావాస! విద్య! విష్ణు-పాదకమలోద్భవా! తమోభేదదక్ష!
దేవి! గంగా! పరాశక్తి! దివ్యరూప!-భక్తి నొనరింతు నీకు నే వందనములు.

తే. సర్వవిశ్వస్వరూపిణి! శంకరపద-చింతనాసక్త! గిరిసుతా! శ్రితసమస్త
కామితప్రద! దేవి! గంగా! త్రిభువన-వంద్య! నీ కొనరింతు నే వందనములు.

ఉ. నీయెడ భక్తియుం మఱియు నీయెడఁ బ్రీతియు శ్రద్ధయుం మదిం
బాయక యుండు నెవ్వరికి, వారల మృత్యువు చేరఁజాల, దెం

దేయెడ దుర్దశ ల్గలుగ, వించుకయైన భయంబు దుఃఖముఁ
జాయకు రావు నీదగు ప్రసాదముచేతనె, గంగ! మ్రొక్కెదన్. ౩౧౦౦

తే. శుద్ధ విజ్ఞానరూపిణి! శుభవిధాత్రి!-సర్వలోకచైతన్య విశదశరీర!
పాపముల సంహరింపు విశ్వపరిపాల!-గంగ! కావింతుఁ గాను నమస్కారవితతి.''

క. ఈవిధమున నుతియింపఁగ-భూవనితను గాంచి సకల భువనాంబిక యా
దేవేశి గంగ నారద!-దేవమునీ! యిట్లు పలికె దివ్యమృదూక్తిన్ ౩౧౦౨

మ. ''ద్రవరూపంబున నున్న నన్నుఁ గని యో ధాత్రీ! క్షితీ! సన్నుతిన్
మిపులం జేయఁగఁ గారణం బెదియొ నెమ్మిం గాంక్షితం బాత్మలోఁ
దవిలెం దెల్పు మదేదియో, కడువడిం దాత్పర్యయుక్తిన్ ఘటిం
ప వరం బిచ్చెద'' నన్న భూవనితయున్ భద్రాప్తికై యిట్లనెన్ ౩౧౦౩

సీ. ''తల్లి! భాగీరథీ! ద్రవరూపమున భగీరథభూమిపతి ననుగ్రహము మీఱఁ
గనుఁగొని, సగరమఖంబునఁ గపిలమహాముని శాపంబు నంది బూది
యైన తత్పితరులఁ బూనిక సుగతికిఁ జేర్ప నుత్సాహివై క్షితివివరము
వఱకుఁ బోనున్న వైభవయుత! నా కోర్కి నవధరింపుము సుంత యాదరమున,

తే. సాగరముదాఁక నాలుగు జాడ లొప్ప
గా ధరించి నాపయిఁ గడుఁ గ్రమముగ వి
హారమును సల్పి నన్నుఁ బుణ్యాత్మగాఁగఁ
జేయుమా దివ్యతటిని! యమేయకరుణ.'' ౩౧౦౪

గంగ నాలుగు ధారలుగాఁ బ్రవహించుట

క. అని యవని కోర వినయం-బున గంగ వచించె నపుడు భూసతితోడన్
''వినుము, భగీరథభూపతి-ననుఁ బ్రార్థింపఁగ మనంబునం గడు భక్తిన్. ౩౧౦౫

చ. మనమున మెచ్చి యాసుజన మాన్యుని భక్తికి విష్ణుదేహ మొ
య్యన వడి వీడి, యీకరణి నాదృతి వచ్చినదానఁ, గాన న
మ్మనుజవరేణ్యునిచ్చకుఁ బ్రమాదము పుట్టకయుండ వర్తిలం
జనును, దదన్య మొక్కటియు సమ్మతిఁ జేయఁగరాదు'' నావుడున్. ౩౧౦౬

ఉ. అంత భగీరథుండు తన యాత్మ ధరాసతివాంఛఁ గూర్పఁగా
నెంతయుఁ బ్రీతి నెంచి, కడు నిద్ధపుభక్తి నమస్కరించి శ్రీ
కాంతపదాబ్జ జాతయగు గంగ మహేశ్వరమూలశక్తి య
త్యంతముదంబునం బొదలునట్లుగఁ బల్కె మునీంద్ర! నారదా! ౩౧౦౭

క. ''అతిసుకృతోన్నత చరితా!-వితత సుకృతరూప! గంగ! విశ్వజనని! యీ
క్షితికోర్కెఁ దీర్పఁదగు స-మ్మతితోఁ ద్రిదశాభివంద్య మహనీయగుణా!''

సీ. ఈవిధంబున మహాధీవిభవుండగు భూవిభు మతమును బుద్ధి నెఱిఁగి,
పశ్చిమోత్తర పూర్వభాగంబులను మూఁడు ధారలుగాఁ బొల్చి భూరివిశ్వ
జనని త్రిలోకపావని స్వర్గముననుండి కడువేగమున బయల్వెడలె, నొక్క
మహనీయధార యా క్ష్మాపాలుని భగీరథుని వెనువెంట వేడ్కను గమించె,
తే. నదియె దక్షిణదిగ్ధార యగును వేగ-వతి యనఁగ విలసిల్లుచు స్వర్గసీమఁ
బ్లావితము చేసి దక్షిణభాగమునకుఁ-దిరిగి యొక కొంత దవ్వు సత్వరగతిఁ జనె.

తే. అరద మెక్కి మధ్యాహ్నకా లార్కకాంతి
వెలయుచు భగీరథుఁడు ముందు వేడ్క శంఖ
నినదమును జేయుచుఁ జనంగ ననుపమాన
వేగమున గంగ యారాజువెంటఁ జనియె. ౩౨౧౦

తే. ప్లావితంబగు త్రిదివంబు భక్తి నరసి-దేవతలు కిన్నరాదులు దివిజగణము
సురతరంగిణి గంగను జూచి చేరి-పూజలను జేసి రెంతయు ముదముతోడ.

ఇంద్రుఁడు భగీరథునితో మాటలాడుట

క. రవివంశజుని భగీరథు-దివిజవరేణ్యుండు సకల దేవతలను గూ
డి వినయమునఁ బిల్చి యనే-కవిధంబులఁ బొగడి పలికె గంభీరోక్తిన్ ౩౨౧౨

క. "ఓ పుణ్యకీర్తి! సుచరిత!-భూపతి శార్దూల! సగర భూర్యన్వయ! నీ
వేపునఁ ద్రిలోక దుర్లభ - శ్రీపతిపదజనిత గంగ స్థిరతరభక్తిన్. ౩౨౧౩

గీ. భూతలంబును జేర్పఁగాఁ బోవుచున్న
వాఁడ వొక్కింత నిలుము, నా వాక్య మొకటి
యున్న, దద్దాని వినవయ్య! యుల్లమం ద
పారదయ మీఱ" ననుడు భగీరథుండు. ౩౨౧౪

చ. సురపతివాక్యము ల్విని విశుద్ధమనంబున నిల్చి యప్పురం
దరుఁ గని పల్కె నిట్లు "భువనత్రయనాయక! యేమికార్య మి
త్తరుణమునందుఁ గల్గెఁ? బ్రభుతన్ సెలవిమ్ము, త్వదాజ్ఞఁ బూని యే
వెరవుననైనఁ జేయుదు, నభీష్టముఁ దెల్పుఁడు, భృత్యుఁడన్ విభూ!" ౩౨౧౫

చ. అనవుడు నింద్రుఁ డిట్లనియె "నార్య! భగీరథ! బ్రహ్మముఖ్యదే
వనికరదుర్లభన్ గరుడవాహన దివ్యపదాబ్జ సంభవన్
మునిజనవంద్య గంగ నిటు పూర్ణముగాఁగను దెచ్చి, భూమికిన్
గొనిచనుచున్నవాఁడ విటు గొబ్బునఁ, బోలునె? విన్ము నానుడిన్. ౩౨౧౬

తే. ఒక్క సులలిత ధార యీ యుత్తమమగు-స్వర్గలోకంబునందు నెసంగుఁగాక!
మర్త్య భువమునఁ బోలి నీ మహితకీర్తి-యిచ్చుటను వెల్గుఁగావుత మిద్ధచరిత!"

గంగ మందాకిని నా స్వర్గమునఁ బ్రవహించుట

క. దేవేంద్రు వాక్యముల విని-భూవిభుఁ డాగంగఁ గాంచి మ్రొక్కి యతిశయం
బౌ వినయంబున సన్నుతిఁ-గావించెను నచట భక్తికలితుం డగుచున్. ౩౨౧౮

క. "జననీ! గంగా! స్వర్గం-బున నిర్జరపావనార్థముగ నొకధారన్
ఘనకరుణ నిల్పుమా పెం-పున" ననుచు భగీరథుండు పొగడఁగ నియతిన్.

క ద్రవరూప గంగ నిర్జర-భువమును బావనము చేయఁబూని తదిచ్ఛన్
దవిలి యొక మహాధారగఁ-బ్రవితతముగ నుత్తరదిశఁ బ్రవహింపఁజనెన్.

తే. పావనాత్మిక యయిన యా బహుళసుకృత
యుత మహాధార స్వప్నమం దున్నతగతి
వెలసె మందాకినీనామకలిత యగుచు
నారదా! విను మత్యంతగౌరవమున. ౩౨౨౧

క. ఆమందాకిని దివిజ-స్తోమంబులు దేవమునులు తోరపువేడ్కన్
నేమమున మజ్జనాదుల-నేమఱక యొనర్చుచుందు రెప్పుడు మౌనీ! ౩౨౨౨

ఉ. అంత భగీరథుండు కడు హర్షముతో రథమెక్కి శంఖ మ
త్యంతరవంబు మించఁగ మహాద్భుతరీతిని నూఁదుచున్, బ్రియం
బెంతయుఁ దీర్ప గంగ తన యిచ్చను వెన్కొని వచ్చుచుండ బ
ల్వింతగ దక్షిణాభిముఖవిశ్రుతయానము మీఱ నత్తఱిన్. ౩౨౨౩

తే. పదపడి సుమేరుదక్షిణభాగశిఖర
మా భగీరథభూపతి యరసి చేరి
దాని యున్నతి నెంచి యత్యంతభక్తిఁ
గరములను మోడ్చి యిటు పల్కె గంగతోడ ౩౨౨౪

క. "జననీ! యీ శిఖరోత్తమ-మును నెటు భేదించి నిన్ను భువికిం గడఁకన్
గొనిపోవఁగలను? దెల్పుమ-యను వొక్కటి" యనఁగ గంగ యనె భూపతితోన్.

సీ. "ఏ నిందె యుండెద భూనాథ! యీగిరి శృంగంబు నెక్కి యేచింత లేక,
యవ్వలి భాగంబునందుఁ జేరుము దక్షిణంబున నీ వరదంబుతోడ,
నప్పుడు శంఖంబు నత్యంతమగు వేడ్కఁ బూరింపుమా కడు ఘోరరీతి,
నంతఁ బర్వతశృంగ మెంతయు భేదించి పరమవేగంబున నిరుపమగతి
తే. నరద మరిగిన త్రోవనె యనుసరించి-వత్తు నిశ్చయముగ" నని పల్క సగర
వంశదీపకుఁ డా దేవివచనసరణి-రథము నడపి మహాద్భుతరయముతోడ.

క. గిరిశృంగము నెక్కి మహోద్ధురగతి దక్షిణపు దెసకుఁ దోరపువేడ్కన్
సరగునఁ జేరి, నిజాగమ-సరణిన్ గంగకును దెలుప శంఖం బొత్తెన్. ౩౨౨౭

ఆ. ప్రళయకాలజలదభయదధ్వనిం బోలి-శంఖరవము మించి జ్ఞానభోంత
రాళసీమ నెఱసి ప్రబలభీతిని గొల్పె,-గంగ యాలకించి కడుముదమున. ౩౨౨౮

క. త్వరితగతి మేరు దక్షిణ-గురుశిఖరవిభేదనంబు ఘోరంబుగఁ దా
జరపి మహాధ్వని మీఱఁగ-నఱుచెంచె భగీరథునకు హర్షము పొంగన్. ౩౨౨౯

అఱువదితొమ్మిదవ అధ్యాయము

గంగ పుడమిమీఁదఁ బ్రవహించినవిధము

సీ. జ్యేష్ఠమాసంబున సితపక్షమున లోకమున మహాపాతకులను బునీతు
లను గాఁగ నొనరించి యనువున లోకంబులను రక్షణముచేయఁగను దలంచి,
గంగ శ్రీహరిపాదకమలంబునుండి తా నిర్గమించెను, గాన నియతితోడ
నాదినంబున గంగయందు స్నానము తపోదానంబు లతిఫలదంబు లగును,
తే. పాపములఁ బోనణంచును, వరుసగఁ బది
పుట్టువులనుండి వచ్చినయట్టి దురిత
మణఁచుఁ, గావున దశహర యనఁగ దశమి
విపులయశమున వెలసె నీ విశ్వమందు. ౩౨౩౦

తే. హస్తమంగళయోగమై యాదశమియె-వెలసినట్టైన దశజన్మకలితవిపుల
దశవిధములగు పాపముల్ వెస హరించు-సురమునీంద్ర! భాగీరథి నిరుపమకృప.

తే. ఆకతంబున యత్నంబుఁ బ్రాకటముగఁ
జేసి స్నానావగాహనస్థితుల నరులు
పాపముక్తులు గాఁగోరి భక్తిసలుపఁ
దగును మునినాథ! గంగలో దశమియందు. ౩౨౩౨

సీ. అంత స్వర్గమునుండి యాభగీరథదివ్యరథమార్గమున నతిరయముతోడ
గంగామహానది కడుముదమున దక్షిణాభిముఖంబుగా నఱుగఁదొడఁగె,
నతిశయంబగు భక్తి నఖిలదేవర్షిగంధర్వులు మనుజులు తత్పరులయి
చిత్రసుమంబులచే బిల్వపత్రాక్షతాదులచేత నత్యంతరమ్య
తే. ములగు దూర్వాదళంబులఁ బూజచేసి,-రాసుమాదులచేఁ జిత్రితాకృతిఁ గని
నిర్మలస్ఫటికాభమై నెగడె ఫేన-తతులచే వేగవతి గంగ తాపసేంద్ర! ౩౨౩౩

మ. అతిభీమంబగు నారవంబున నభేద్యాకారముల్ దుర్గమ
స్థితులన్ మించిన పర్వతంబుల వెసన్ జిత్రంబుగా దాఁటి, యు
ద్ధతి సింహంబుల నేన్గులన్ బరువులెత్తం జేయుచున్, హేమకూ
టతటిన్ జొచ్చి గమించి శీతగిరి వేత్కం జేరవచ్చె న్మునీ! ౩౨౩౪

క. హిమగిరిసాన్నిధ్యంబున-నమితంబగు ఫేనరాశి నత్యంతవిచి
త్రముగా భాసిల్లెను నం-దమునఁ శంకరుని మౌళిఁ దాఁ జేరుటకై. ౩౨౩౫

చ. హిమగిరిసన్నిధానమున నెంతయు నద్భుతరీతి గంగ మో
దము చెలఁగంగ ఫేనతతిఁ దాల్చి విచిత్రితభూషణాఢ్యనా
నమరుచు శంభు శీర్షమున నందముఁగూర్పఁగఁ జేరు కోర్కెతో
నమితరుచిన్ వెలింగె సుర లచ్చెరువందఁగఁ దాపసోత్తమా! ౩౨౩౬

శంకరుఁడు గంగను దనశిరంబున నిలుపుట

క. అంత మహాదేవుఁడు కను-జెంతకు వడి దుముకు గంగ స్థిరుఁడయి మౌళిన్
వింతగ విస్తృతజటచేఁ-బంతిముతోఁ గట్టఁగట్టి బంధించి మునీ! ౩౨౩౭

క. ఇటు నటు కదలక హిమగిరి-పాటలతరశిఖరంబునందు బలిమి మెఱయ, ను
ద్భటుఁడయి గంగను దలపైఁ-దాల్చిన ధరియించి మించెఁ దాపసవర్యా!

సీ. నిజశీర్షమున గంగ నిలుకడగా నున్న దనుచు నెఱింగి యయ్యాదిదేవుఁ
డానందపరవశుండై జగదీశుండు పూర్ణుండు మదిలోనఁ బొంగి నాట్య
మొనరించె నారదమునిచంద్ర! యామహాదేవుని నృత్యంబుఁ దృప్తితోడఁ
గాంచి యుప్పొంగి తద్గణములు కోట్యర్బుదముల సంఖ్యల నొప్పు ప్రమథులపుడు

తే. పార్శ్వభాగంబునను జేరి బహువిధముల
నృత్యమును జేయుచుండిరి హృదయములను
మఱచి యతిసంభ్రమంబున మహిమ నెలయ
నారదమునీంద్ర! తాపసవారవర్య! ౩౨౩౯

క. గంగయు శంభు శిరంబునఁ-బొంగుచు నానందయుక్తిఁ బూర్ణాత్మికయై
సంగతవిచిత్రఫేనత-రంగిణియై పొలిచెఁ బుష్పరాజిప్రభతోన్. ౩౨౪౦

తే అత్తఱి భగీరథుఁడు గంగ యరుగుదెంచు
చున్నదో లేదో యని వెన్కఁ జూడఁగానె
గంగ గన్పడదయ్యె, శంకరుని తాండ
వంబు గాంచెను, జింతించె స్వాంతమందు. ౩౨౪౧

క. హరశీర్షమున మహాధ్వని-నరయుచుఁ దనమీఁద గంగ యాగ్రహవతియై
పరమేశ్వరు మూర్ధంబున-నిరవుకొనె నటంచు మదిని నెంచుచుఁ గడఁకన్.

సీ. అంత శంఖంబు మహాధ్వని మొసఁగంగఁబూరించె దిక్కులు బూరటిల్ల,
నామహారావంబు నాలించి గంగ యత్యంతవేగంబున హరుని శిరము
నందుండి వెడల మార్గాన్వేషణ మొనర్చు చాభగీరథవశ యగుచు నెందు
సందు గానక యె తచ్ఛంఖస్వనాకర్షితాత్మయై యొక వర్ష మందుఁ గడపె,

తే. అపుడు భీతిల్లి, ధర్మాత్ముఁడా భగీర-థావనీశుఁడు నృత్యంబు నాచరించు
శంకరుని దేవదేవుని సంశ్రితార్తి-హరునిఁ బ్రాంజలియయి చేసెఁ బ్రార్థనంబు.

తే. "దేవదేవ! జగద్వంద్య! దీనభక్త-వరద! కరుణాకరా! భవచ్ఛిరమునందు
వెలయు గంగఁ బ్రసాదింపవే మదీయ-పితృసముద్ధరణార్థమై విశ్వనాథ!

మ. మనమం దెంచి మదీయవాంఛితము సంభావింపఁగా నెంతయున్
మును నీవే దయతోడ గంగఁ గడుసమ్మోదంబుతోఁ దానె మే
దినిఁ ద్వత్పూర్వులు బూదిరై పడిన యాదేశంబునుం జేరనం
చును నాకున్ వరమిచ్చినాఁడవుగదా స్తుత్యప్రభావాంచితా! ౩౨౮౫

ఉ. ఆమహనీయవైభవను నాత్మను విష్ణుపదాంబుబోద్భవన్
నేమము మీఱఁగాఁ గొలిచి నే నిటు తోడ్కొనిరాఁగ, నీవు మ
త్కామితదాతవయ్యు దయఁ గన్గొన కిట్లు హరింపఁజెల్లునే?
యేమిట నిష్కృతిం గలుగు నింక మదీయపితృప్రశస్తికిన్? ౩౨౮౬

క. పరమదయాకర! శంకర!-కరుణన్ దత్కారణంబుగా గంగను ద్వ
ద్వరము ఫలోపేతంబయి-పరఁగన్ వెడలింపు దేవ! ప్రార్థింతు నినున్."

శంకరుఁడు గంగను భగీరథుని కోర్కెఁ దీర్ప వదలుట

క. అనుచు నుతింపఁగ నీశుం - డనియె భగీరథునిఁ గాంచి "యవనీశా! నీ
మనమున సందేహింపకు-మును నిచ్చిన వరముఁ గూర్తుఁ బూర్ణఫలముగాన్.

ఉ. సందియ మేల? నీదు పితృసంఘవిముక్తికి నిత్తుఁ, గొమ్ము, పెం
పొందఁగ హస్తమంగళసుయోగము వచ్చును, జ్యేష్ఠశుక్లమం
దుం దశమీదినంబునను దోయవినిస్సరణం బొనర్తు, నీ
వుం దుహినాద్రికూటమునఁ బూనిక నుండు భగీరథాహ్వయా!" ౩౨౮౭

క. ఈవిధమునఁ దెలుపఁగ నా-భూవిభుఁడు భగీరథుండు పూనికతోఁ ద
త్పావన సమయముఁ జూచుచు-నా వరశిఖరమున నుండెఁ బరమమునీంద్రా!

తే. హస్తమంగళయోగమై యలరు జ్యేష్ఠ
శుక్లదశమి భగీరథక్షోణిభర్త
దివ్యహిమరుచి వెలుఁగొందు భవ్యశంఖ
నాదమును జేసె దిక్కులు భేదమొంద. ౩౨౯౧

చ. స్వన మది గంగ గంగ యని చక్కఁగ మ్రోయఁగసాగె; నాధ్వనిన్
విని కడు సంభ్రమంబునను వేగయుతాత్మిక యాచు గంగ ని
స్వన మొనరించుచున్ గదలఁజొచ్చె కపర్ది కపర్దమధ్యమం
దునను బరిభ్రమించెఁ, జనఁ ద్రోవఁ గనుంగొన నెంచి నారదా! ౩౨౯౨

మ. అవనీనాథుని శంఖనిస్వనముచే నాకృష్టయై యెంతయున్
శివమూర్ధంబునఁ ద్రోవఁ గానక, కడుం జింతించి, యాదేవి లో
కవిభున్ జిత్తసరోజపీఠమున వేడ్కన్ జేర్చి, ధ్యానించి, భూ
ధవకార్యార్థము నెంచుచున్ వినతయై తాఁ గొల్చె లోకేశ్వరిన్. ౩౨౫౩

శా. "లోకేశా! శరణంబు గోరితిని నాలోకింపవే ప్రీతి, నా
భూకాంతప్రవరున్ భగీరథుని సంపూర్ణాత్ముఁ గావింపవే,
ప్రాకట్యంబగు త్రోవఁ జూపవె మహాభాగా! చనంగా వడిన్,
నీకున్ మ్రొక్కెద దేవదేవ! కనుమా! నిత్యప్రభావాంచితా! ౩౨౫౪

చ. ధరణి సమస్తభూతసముదాయము వేడ్క సముద్ధరింపఁగాఁ
బరమశివా! మనంబు కడు బాధిత మయ్యెడిఁ, ద్రోవఁ జూపవే
కరుణ, భగీరథుండు కడఁకన్ వరశంఖము నూఁదుచున్నవాఁ,
డరయుము లాగుచుండెను మదాత్మను దధ్వని మిక్కుటంబుగన్." ౩౨౫౫

క. కరుణాముగా గంగానది-వరుసం గావించినట్టి ప్రార్థనమును శం
కరుఁ డాలకించి, వామే-తరకరమున జడల నెమకి తత్క్షణమె మునీ! ౩౨౫౬

క. దక్షిణదిగ్భాగంబున-నక్షీణకపర్దిబంధ మవకాశముగాఁ
జక్షుఃశ్రవభూషణుఁ డిడ-నక్షయముద్రై నదాని, గంగ సంతస మొందన్. ౩౨౫౭

ఉ. అంత మహాస్వనం బెసఁగ, నచ్చెరువొందఁగ నిర్జరావళుల్,
స్వాంతము పొంగ, గంగ వడి శంభుజటావళిమార్గసీమ న
త్యంత రయంబుతోఁ గదలి యార్యభగీరథమార్గవర్తియై
యెంతయు నిర్గమించె ధరణీశుఁడు సంతసమంద నారదా! ౩౨౫౮

క. హేమపరిష్కృత రథమును-భూమీశుఁడు నడపుచుండెఁ బూరించుచు న
త్యామోదంబున శంఖము-భీమస్వన మొలయ నధికవేగయుతుండై. ౩౨౫౯

ఉ. అంత గిరీంద్రు సన్నిధి విహారము సల్పుచునున్న గంగ య
త్యంతభయంబు గొల్పి మదహస్తిమృగేంద్ర చయంబు నెల్ల వి
భ్రాంతిని దిక్కులందు వడిఁ బాఱెడున ట్లొనరించుచుండఁగా
నంతయు నాలకించి, తుహినాచల దంపతులుత్సుకాత్ములై. ౩౨౬౦

క. గంగం గనుఁగొనుకోరిక-పొంగఁగఁ దన్నికటమునకుఁ బోయిరి ప్రీతిన్,
గంగానది పితరులు చెలఁ-గంగ నమస్కారములను గావించె మునీ! ౩౨౬౧

క. వారలు సంభావింప న-వారితయై త్వరితగతిని వసుధకు డిగ్గెన్,
బోరున సుమవర్షంబు ల-పారముగాఁ గురిసె దిశల వైభవ మెసఁగన్. ౩౨౬౨

క. అప్పుడు జయజయ శబ్దము-లుప్పతిలెఁ సర్వదిశల నురుతర మోదం
బొప్పఁగ, ధరణీతలమునఁ-జెప్పఁగ నత్యద్భుతముగ సిద్ధమునీంద్రా! ౩౨౬౩

తే. తప్త కనకద్యుతిఁ మించు దీప్తితోడ-వెలుఁగుచుండెఁ భాగీరథి విశదరీతి
భూతసంధాత్రి యయినట్టి భూతలమునఁ-జేరి యత్యంతసంతృప్తి సంయమీంద్ర!

చ. అతిశయమైన వేగమున నద్భుతరీతిఁ జతుర్గుణంబుగా
వితతమహాస్వనంబు కడు భీతిదమై విలసిల్ల, నద్భుతా
కృతిఁ జెలరేగుచుఁ భువిని స్వేచ్ఛఁ జరించుచు నున్న గంగ హ
ర్షిత యగుచుఁ ధరారమణి ప్రీతి నహించె లభించె నం చెదఁ. ౩౨౬౪

సీ. నారదా! వినుము భగీరథ రథనేమి ననుసరించుచు గంగ యద్భుతగతి
నతివేగమున మార్గ మన్వేషణ మొనర్చుచును గిలనిస్వనంబునను దక్షి
ణాభిముఖంబుగా నరుగుచు సాలప్రియాళుద్రుమాదుల నవని ద్రోణ
పుష్పాదివనముల భూరిపురగ్రామ సదనాదులను జొచ్చి ముదముమీఱఁ

తే. ప్లావన మొనర్చుచును భువిఁ బరమభక్తి
తోడ దేవర్షు లెల్లరు స్తుతు లొనర్ప
నాశ్రితమనోరథప్రద యగుచు నా భ
గీరథుని రథవశయయ్యెఁ గృత్య మెంచి. ౩౨౬౬

డెబ్బదియవ అధ్యాయము

గంగామార్గ వర్ణనము

తే. ఈవిధంబున గంగ దా నెలమిఁ బెక్కు-యోజనంబులు నడచుచు నుత్సుకయయి
ధరణిపతి వెంబడిని హరి ద్వారసీమఁ-జేరె, నతివేగవతియయి నారదముని!

క. దేవర్షి సుదుర్లభయగు-నా వరశైవలినిఁ గాంచి యానందముతో
సేవించిరి సప్తర్షులు-కావించిరి పూజ లపుడు క్రమముగ మహాసీ! ౩౨౬౮

తే. ఆత్మ లుప్పొంగ సప్తర్షు లంత శంఖ-ములను బూరించి రొగి దిశల్ బూరటిల్ల,
నేడుదిక్కుల గంగయు నెలమిఁగాంచి-సప్తధారలఁ బ్రవహించె సంయమీంద్ర!

ఉ. అంత ననంతవేగమున నద్భుతరీతిని బాఱఁజొచ్చి భూ
కాంతుని వెంట నంటి సురగంగ పరాత్పర భూరిశైలముల్
వ్రంతలుగాఁగ; నగ్నిదిశఁ బాఱుచు నెల్లతరంగిణుల్ దమిఁ
సంతసమంది తన్గవియఁ జయ్యనఁ జేరెఁ బ్రయాగ దేశముఁ. ౩౨౭౦

ఆ. యమునతోడఁ గూడి యా ప్రయాగ పవిత్ర-భూమిఁ జేరి యందుఁ బొగడ నెల్ల
మునులు దేవతలును మోదంబుతో సర-స్వతిని గలిసె నచట సంయమీంద్ర !

క. దేవతలకైన దుర్లభ-మై వెలయును గంగ యా ప్రయాగను మౌనీ!
భావింప స్నానదానము-లా వరతీర్థమునఁ జేయ నతిపుణ్యదముల్. ౩౨౭౨

క. అచ్చట బ్రహ్మాదిసురల్-నిచ్చలు స్నానం బొనర్చి నియతాత్మకులై
యిచ్చఁ బునీతుల మంచుమ-హోచ్చగతిం దలఁతు, రేల యొరులను దెలుపన్ ?

తే. ఆ ప్రయాగసుక్షేత్రంబు ననుగమించి
గంగ పూర్వాభిముఖ యయి కదలి కొంత
దవ్వు చని, కాశికాపురి దరిసి, విశ్వ
నాథుఁ గననెంచి, యుత్తరానకును దిరిగె. ౩౨౭౪

సీ. ఆక్షేత్రవరమున నతిపుణ్యతమ యగు గంగామహానది కలుషచయము
లపహరించును, మోక్ష మలవరించును, దేవమౌని! కాశీపురీమహిమఁ దెలుప
నలవియే? వినుము, మహాపగయం దందు నెఱిఁగియే నెఱుఁగకయేని దేహ
మును త్యజించినయట్టి జనులకుఁ గైవల్య మొసఁగూర్చు గంగ సురోత్తమగుణ!
తే. యచటఁ బాపాత్ములగు జీవు లపఘనంబు
దొఱఁగకుండినయేని ముక్తులుగ నాట
కాస్పదంబుండు నిజముగ నంచుఁ దెలియ
వయ్య! నారదమునిచంద్ర! యాత్మలోన. ౩౨౭౫

తే. గంగ లోకాన సులభమేగాని, విను ప్ర
యాగయందు హరిద్వారమందు సాగ
రంబుఁ గూడినయెడను దుర్లభ యనంగ
వెలయుచుండును నీ మూఁడు స్థలములందు. ౩౨౭౬

గంగను గాలభైరవుఁడు సమ్మానించుట

మ. అతివేగంబునఁ గాశికాపురిని డాయన్ వచ్చు నాగంగ ను
ద్ధతితోఁ గాంచి పురాభిరక్షకుఁడు క్రుద్ధస్వాంతుఁడై దండ మా
త్తశక్తిం గొని కాలభైరవుఁడు క్షేత్రప్రీతిపాత్రుండు వి
స్తృతధైర్యంబున నడ్డగించి పలికెన్ దివ్యాపగావర్యమున్. ౩౨౭౭

ఉ. "ఎవ్వతె వీవు నీరమయి! యాక్రియఁ గాశిని ముంపఁ బాఱఁగా
నెవ్విధి నీకుఁ బాడియగు? నీశ్వరు పట్టణమం చెఱుంగవే!
దవ్వుగ నేగు, మీపురి సతం బభిరక్షణ మాచరించు నన్
గ్రొవ్వునఁ గానవే!" యనుచుఁ గ్రూరతఁ బల్కెఁగ గంగ యత్తఱిన్.

తే. భైరవుని భీమలోచను భయదదండ-హస్తు నతిఘోరరూపుఁ గల్పాంతసమయ
శమనసదృశుని నుద్దండచరితుఁ గాంచి-పలికె నత్యంతమధురసంభాషణముల.

సీ. "భైరవా! విశ్వేశపట్టణసంరక్షణాభితత్పర! వినవయ్య! యేను
ద్రవరూపమున నుండు భవపత్ని గంగామహాదేవి యనుదాన, నతిముదమున
ధరణీతలముఁ జేరి హరుని జటాజూటమందు సుస్థితి నుండి యంతఁ బ్రీతిఁ
గాశీపురంబునఁ గడు సంతసంబున వసియించు విశ్వేశు వాంఛితార్థ

తే! దాయకునిఁ గాంచ వచ్చినదానఁ గాని-కాశికాపురి ముంపఁగాఁ గదలివచ్చి
నట్టిదానను గా నని యాత్మఁ దెలియు,-మింక నిలువుము, నుద్ధతి యేల నీకు?"

తే. అపుడు కాలభైరవుఁడు మహాభుజుండు-దండ ముపసంహరించి యఖండభక్తి
శంభుగేహిని యగు గంగ సంతసింపఁ-గా నొనర్చెను బహునమస్కారములను.

గంగ కామరూపమునకుఁ దరలి జహ్నువుచే నాకర్షింపఁబడుట

తే. అచట నిట్లు మహాత్ముఁడై నట్టి భైర
వుండు సమ్మాన మొనరింపఁ బొంగి గంగ
యంతఁ గామాఖ్యఁ గానంగ నాత్మ నెంచి
ప్రాఙ్ముఖంబునఁ జనుచుండెఁ బరమహాని! ౩-౨౮-౨

చ. మదిని దలంచి యీవిధము క్ష్మాపతియైన భగీరథుండు న
య్యదనున సారథిన్ రథము నాపఁగ నానతినిచ్చి, శంఖమున్
వదలి, నినాద మేదియు నొనర్పక యుండఁగ, నంత జహ్నువున్
విదితయశుండు శంఖము నవారితుఁడై యొనరించె నత్తఱిన్. ౩-౨౮-౩

మ. అతిగంభీరత నున్న తత్స్వనముఁ దా నాలించి యాదిక్కు న
ద్భుతవేగంబున గంగ పోవఁ గని యా భూనాయకుం డాత్మ వి
స్మితుఁడై భూరితరాంబుదస్వనయుతిం జెన్నొందు శంఖంబు ను
ద్ధతిఁ బూరించెను నారదా! మరల యత్నం బొప్పఁ జింతించుచున్. ౩-౨౮-౪

సీ. ఆ శబ్ద మాలించి హరిపదకమలసంభవ గంగ పూర్వశబ్దంబు నెంచి
పరమతేజంబునఁ బరఁగు జహ్నుమునీంద్రుచేత నాకర్షిత నైతి ననుచుఁ
దలపోసి భగవతి తత్సమయంబున నాగ్రహం బొంది జహ్న్వాశ్రమంబు
ముంపఁగా యత్నించి పొంగుచు నత్యంతరయమునఁ బఱతేర బ్రహ్మతేజుఁ

తే. డైన జహ్నువు తెలిసి, తా నంత నాత్మ
మహిమచే నాప్రవాహంబు మహి నడంగు
నట్లు లంతయుఁ బుక్కిటఁ బట్టి త్రావె
నద్భుతంబుగ నారదా! యమరహాని! ౩-౨౮-౫

తే. ఆకసంబున మించె హాహారవములు,
భూమి మనుజాదులైనట్టి భూతతతులు
చింత నాక్రోశ మొనరింప జీలియు దుఃఖ
మొందె, నాభగీరథుఁడు లోఁ గుంది యేడ్చె. ౩౭౬

క. కలఁకం బొందెను దిక్కులు,-జలజాప్తుఁడు దినకరుండు శమితద్యుతియై
లలిఁ గనఁబడకుండెను, నా-కులమయ్యె జగంబు గంగ శోషింప మునీ!

మ. గతధైర్యుండయి యేడ్చుచున్న ధరణీకాంతుఁ విలోకించి యా
శ్రితవాత్సల్యమునఁ సురాపగ మదిం జింతించి "యోరాజ! నీ
మతి యోజింపకు, మేత్తెఱఁ మరల సమ్యగ్రీతి శంఖంబు ను
ద్ధతిఁ బూరింపుము, నీమనోరథము నిత్యప్రీతిఁ గావించెదఁ. ౩౭౮

తే. నీదు శంఖస్వనాకృష్టనిరుతి నున్న-నా రయంబును ద్రిప్పఁగా నేరుపుగల
వార లెవ్వరు? నను గాచువార లెవ్వ?-రెందు లేరని యెఱుఁగు మూర్వీశ! భువిని."

తే. ఈవిధంబునఁ గరుణతో భూవిభు మది
నూఱడిలఁజేసి, యనుమతి నొసఁగ, నా భ
గీరథుఁడు శంఖమొత్తె నపారనినద
మాకసంబున వ్యాపింప నద్భుతముగ. ౩౮౦

గంగ జహ్నుజానువునుండి నిర్గమించుట-జహ్నుకృత గంగాస్తోత్రము

ఉ. ఆ నినదంబు వీనులకు హర్షము నింపఁగ నాలకించి, గం
గానది పొంగి యద్భుతముగాఁ గడువేగముతోడ నుద్ధతిం
బూనిక జహ్నుజానువును బొల్పుగ భేదమొనర్చి, వేడుకఁ
మానస మొప్ప నెంతయు నినాదము మీఱఁగఁ బాఱె నారదా! ౩౮౧

క. తన జంఘనుండి వేగం-బున గంగ వినిర్గమించి ముదమునఁ బాఱం
గని జహ్నువు తద్విభవం-బనుపమ మని యెంచి పొగడె నతిశయభక్తిఁ.

సీ. "తల్లి! గంగానదీ! యెల్లదేవతలందు నత్యుత్తమత్వంబు నంది తీవు,
నిస్తులం బయి వెల్గు నీశక్తి జగదంబ! సర్వాశ్రయవు నీవు, సకలభువన
పావని వగుదువు దేవి! లోకంబులకెల్ల మోక్షసుఖంబు లిత్తు వెపుడు,
త్వత్పదాంబుజములు తతభక్తి సకలభువనవందనీయముల్, జనని! నిన్ను

తే. బ్రహ్మవిష్ణుమహేశ్వరుల్ వరుస నెఱుఁగఁ
జాలకున్నారు, పరశివా! శంభుమూర్తి
శిరమునం దుండఁ గాంచితి నిరుపమాన
మహిమ వెలయుదు వీ వని మది నలంబు. ౩౮౩

సీ. నీరూపచరితంబు నిరుపమానంబగు, మానసాగమ్యంబు, పూని తెలియఁ
గా నపారంబయి ఘనమయి రాజిల్లు, దేవతరంగిణీ! దివ్యజనని!
బ్రహ్మాదిపూజితపాదారవింద! యే వినుతింప నేర్తునే విశ్వమాత!
స్వీయగుణంబులచే నన్ను గరుణను విస్తరింపఁగఁ జేసి విశదదృష్టిఁ

తే. గనుము, శరణంబుఁ జొచ్చితి, ననుపమాన
దోషము నొనర్చినాఁడ, నా దోస మెంచ
కనవరతము క్షమింపుము, నిను భజింతుఁ,
బుణ్యుఁ గావింపవమ్మ! యగణ్యచరిత! ౩౨౯౪

ఉ. ధన్యుఁడ నైతి, నాజనియు ధన్యత నొందె, మదీయ కర్మముల్
ధన్యము లయ్యె, నాతపము ధన్యతఁ గాంచె, సమస్తలోక స
మ్మాన్యవు శంకరస్తుతవు మాత! ద్రవాత్మకమౌ స్వరూపముఁ
ధన్యతఁ గూర్పఁగా భువికిఁ దాల్చిన నిన్గనుటన్ మహేశ్వరీ! ౩౨౯౫

ఉ. ధన్యము లయ్యె నంబ! విశదక్రియ నాకరముల్, త్వదీయస
త్పుణ్యదవారి సోకుటను బూజ్యుఁడ నైతి ధరిత్రి, సర్వస
మ్మాన్యపదారవింద! కడు మాన్యత నొందె మదీయకాయముం
గన్యతకెక్కు నిన్ను వడిఁ గాంచి ధరించుటచే మహేశ్వరీ! ౩౨౯౬

తే. సకలకలుషసంహారణశక్తియుక్త!-శంభుమాళివిభూషితా! సకలభువన
హిత! ధరిత్రీగతా! భక్తి హృదయపూర్వ-కముగఁ గావింతు నే నమస్కారవితతి.

తే. దేవి! స్వర్గాపవర్గదా! దివ్యగంగ!
పతితపావని! త్వత్పాదపద్మములను
శరణుఁ జొచ్చితి, దయ సుప్రసన్నవయి స
ముద్ధరింపుము జగదంబ! యురుముదమున." ౩౨౯౭

తే. ఈవిధంబున వినుతింప నిచ్చ మెచ్చి-దివ్యరూపమును ధరించి దివిజగంగ
సుప్రసన్నముఖాబ్జసుశోభితయయి-జహ్నుమునిఁ గాంచి భాషించె సంతసమున.

క. "మునివర! భవదీయంబగు-తనునిర్గత నగుట నీకుఁ దనయను, స్థిరతన్
గనుమా మది, నపరాధం-బనఘా! లే దెద్దియేని యని నమ్ము మెదన్.

క. జనకా! జాహ్నవియను పే-రెనయు సుమీ నేఁటినుండి ఋషివర! నాకున్,
ఘనకీర్తి సుస్థిరత్వం-బున నెగడును నీకు నిక్కముగ లోకములన్. ౩౩౦౧

క. న న్నెవరు లోకమున వి-ద్వన్నుత! జాహ్నవి యటంచు భావంబున స
త్సన్నుతిఁ దలఁతురు, దురితము-లన్నియుఁ గడచనును వారి, కగును శుభంబుల్.

తే. పరమభక్తుండ వన నీవు పరఁగుచుండు-వార్య! నీచరితంబు భక్త్యతిశయమున
నెవ్వరు స్మరింతురో, వారి నెపుడు హృష్ట-చిత్తనయి పోషణ మొనర్తు సిద్ధవంద్య!''

తే. జహ్నుమునితోడ నీరీతి సాంత్వనోక్తు
లను నెఱపి గంగ భక్తి నమ్ముని యొనర్చు
నట్టిపూజలఁ గైకొని, యవలఁ బయన
మొనరుపం గోర్కి నొదవఁగా మనమునందు. ౩౩౦౪

వ. కృతమతియైన భూవిభు భగీరథునిం గని పల్కె ''వత్స! నీ
నతిశయమైన భక్తి నను ప్రార్థనచేయఁగ విష్ణుదేహ మం
చితగతి వీడివచ్చితిని, జేరితి భూమిని, త్వద్వశాత్మనై
హితవున సంచరింపఁ దమి నెంచితి, నానుడి నాలకింపుమా. ౩౩౦౫

తే. మున్ను కామాఖ్య దర్శింపఁ బూని, తూర్పు
దిశ బయలుదేఱితిని, గాని తివిరి మొట్ట
మొదట మునిచేత వైరస్యమును బడసితి,
నెఱిఁగియున్నావు నీవు మహీశవర్య! ౩౩౦౬

చ. తెలుపుము నీకు నెయ్యది మదిం గల కోరిక, యాచరింతు సం
చలనము లేక యిప్పు డాఁగి క్ష్మాపతివర్య! భగీరథా! తపః
ఫలము సుపూర్ణమై యొసఁగఁ బల్కెము వైళము, నీదు వాంఛ ని
స్తులముగఁ దీర్తు'' నా నపుడు క్షోణిభుజుండు సుహృష్టచిత్తుఁడై. ౩౩౦౭

సీ. ''తల్లి! మత్పూర్వపితామహుల్కపిలమునీంద్రశాపంబున నెల్లవారు
దక్షిణాదిక్కున ధరణిపై వివరంబునందు బూడిదయగు యఘముఁ బొంది,
యున్నవారలు, వారి నుద్ధరింపఁగఁ బూని ప్రార్థించి నిన్నతిభక్తి వెంటఁ
గొని వచ్చుచున్నాఁడ, జనని! ముందుగ వారి నుద్ధరింపుము వేగ యురుతరకరు
తే. ణాంతరంగ!'' యటంచు నయ్యవనివిభుఁడు
పల్కి శంఖంబుఁ బూరించెఁ బటునినాద
ముద్భవిల్లఁగ, గంగయు నుత్సుకయయి
చనియె దక్షిణదిశకు నోసంయమీంద్ర! ౩౩౦౮

తే. అరద మతివేగమునఁ బోవ నాభగీర-థావనీశుండు కొంత దవ్వరిగి, శ్రాంతుఁ
డై రథముమీఁద విశ్రాంతి నందె శ్రమము-కలుగ, సారథి రథమును నిలిపె నంత.

తే. అంతలో జహ్నుమునివరునాత్మజాత-పద్మ సోదరిఁ జూడఁగా వాంఛఁ దవిలి,
నారదా! శంఖ మొత్తె, నపారనినద-మడరి భూనభోంతరములయందు నిండ.

క. చలితాత్మ గంగ యాధ్వని-యలఘుగతిఁ మానసంబు నాకర్షింపన్
లలి నాగ్నేయముఖంబుగ-వెలయుచుఁ బ్రవహించె మిగుల వేగముతోడన్.

ఆ. కొంతదవ్వు చనఁగ క్షోణీశ్వరుఁడు భగీ-రథుఁడు గాంచి యాత్మఁ బ్రబలు చింతఁ
దక్షిణమున సూతుఁ దఱుమనౌఁ దురగంబు-లను నటంచుఁ జెప్పె మునివరేణ్య!

మ. అతివేగంబున శంఖనిస్వనము తా నాలించి గంగాకుమ
ద్వతి వేఁగొక్కెడన్ ద్రుతంబగు గతిన్ వత్సధ్వనిం బ్రీతి న
ద్భుతరీతిం జను గోవుచందమున సంబుద్ధాత్మయై గానగున్
వితతప్రక్రియ స్యందనంబు నడువన్ వే వాజులన్ ద్రోలనౌ. ౩౩౧౩

ఉ. సారథి నుత్సహించి యిటు చయ్యన శంఖము నొత్తె భూవిభుం,
డారవ మద్భుతంబుగ దిశావళి మ్రోసెఁ బ్రతిధ్వనించుచున్,
సారథి వాజులం దఱిమె స్యందనవర్యము శీఘ్రగామిగా,
నారద! గంగ యా వరనినాదము వీనుల కింపుఁ బెంపఁగన్. ౩౩౧౪

క. అవనీశరథానుగయై-మివుల వడిన్ బోవఁదిరిగె మెలపున నంతన్
ద్రవరూప యయ్యెఁ బద్మా-ధవళాయతనేత్ర కోపతత్పరమతియై. ౩౩౧౫

క. తతసలిలాన్వితయై యం-చితవేగంబున గమించి చెలఁగుచుఁ బుణ్యా
న్విత ప్రాగ్దిశఁ బాఱుచు సం-గత యయ్యెను సింధురాజకాంతునితోడన్.

తే. సకలకలుషనివారిణి సర్వదేవ-వంద్య గంగానదియు నంత వైభవమున
దక్షిణాభిముఖంబుగాఁ దడయ కమిత-వేగమునఁ బ్రవహించె నిర్విఘ్నయగుచు.

గంగాసాగర సంగమము

సీ. సగరాన్వవాయసంజాతులై కపిలకోపాగ్నిభస్మీభూతు లయినవారి
నరయుచు నంతట గురుతరవేగంబునను బోయి యబ్ధిచెంతను ముదమున
ధారాసహస్రసంతతులు ఘోషిల్లఁగా విలసిల్లుచుండఁ దద్విపులమధుర
రవము నాలించి సంభ్రమమున సింధురా జత్యంతభక్తిఁ బూజార్హవస్తు

తే. వులను గొని యెదురుగఁ బోయి పుష్పధూప
దీపములఁ బూజఁగావించెఁ, దృప్తిపఱచి
సంగతిని గోరి వచ్చిన సకలనిర్జ
రాభివంద్యను గంగ నో యమరమౌని! ౩౩౧౭

తొంబదియొకటవ అధ్యాయము

కపిలమునీంద్ర దర్శనము

తే. అంత గంగ మిగుల హర్షంబునను సింధు-సంగమంబుఁ బొందె సరభసగతి
భూబిలంబుఁ జొచ్చి, పూన్కిఁ బాతాళలో-కంబుఁ జేరి కాంచెఁ గపిలమునిని.

క. కపిలుఁడు నిర్జరదుర్లభ-విపులగతిన్ భువనభాగ్యవిభవద గంగన్
గృపమీఱఁ గాంచి ముదమున-నపు డర్ఘ్యాదికము లిచ్చి యర్చించె మునీ!

క. ఈవిధిఁ బూజలఁ గొని తే-జోవిశదుం గపిలు నడిగె సురధుని "సగర
క్ష్మావిభు సుతు లెట భస్మం-బై పడిఁ బడిరో వచింపు" మని మునివర్యున్.

సీ. అంతట మునినాథుఁ డత్యాదృతిని సగరాన్వవాయులు బూదియైన చోటుఁ
గనఁబఱచెను, గంగ కనుఁగొని యాభస్మరాసులపైకి సంభ్రమము మీఱఁ
బ్రవహించి ముంచెఁ దద్భస్మస్వరూపుల సగరజులను బ్రీతి సకలభూత
పావని, దివ్యరూపములతో వార లాక్షణమందె నారదా! సరభసగతి

తే. నతివిచిత్రతమంబులై యలరు రథము-లెక్కి బ్రహ్మలోకమునకు హృష్టులగుచుఁ
బోయి రెల్లరు మునినాథ! భూమినాథుఁ-డగు భగీరథుఁ డరయఁగా నద్భుతముగ.

క. పితరులు సుకృతాత్ములై-యతిముదమున బ్రహ్మపదవి కరుగుటఁ గని యా
క్షితిపతి భగీరథుం డ-ద్భుతమతి రథమందె నాట్యమును జేసె మునీ! ౩౩౨౩

ఉ. గంగను సంస్తుతించుచు, స్వకామిత మెంతయు నిండె నంచు లోఁ
బొంగుచు రోమహర్షమును బొంది ముదంబున శంఖ మూఁదె ను
త్తుంగమహాస్వనం బెసఁగ నుద్ధతతేజముతోడ మించుచున్
రంగదభంగరోచుల విరాజిలు సూర్యుని గ్రేణిసేయుచున్. ౩౩౨౪

ఉ. ఆ రవ మాలకించి, తమి నా భువనైకపవిత్ర గంగ వి
స్తారరయంబునం గదలి తత్సగరాన్వయజాతభూతిఁ బెం
పారఁగ మర్త్యలోకము నపారముదంబును రాజు పొందఁగాఁ
జేరిచె భూబిలంబునను సిద్ధమునీశ్వర! యద్భుతంబుగన్. ౩౩౨౫

తే. వినుతికెక్క గంగాదేవి యనుపమమగు-తతవిశదధార నొకటి పాతాళమందు
నిలిపి నారదముని! యది నిఖిలభువన-ఫలద భోగవతీనామకలిత యంద్రు.

తే. గంగ యీరీతిఁ గ్రమముగాఁ గరుణతోడఁ
బోయి, శతసహస్రములుగా భువనము లెట
వెలయు నజ్జలనిధిఁ జేరి నిలిచెఁ దనదు
మహిమ పొగడఁగ నెల్ల రాత్మలను భక్తి. ౩౩౨౬

ఉ. అంత భగీరథుండు ముద మంది మనంబున "స్వీయకాంక్షితం
బెంతయు నిండె, ధన్యత మహిం గనినాఁడ" నటంచు నానదీ
కాంతునిఁ గూడి చెన్నెసఁగు గంగను భక్తిని బూజచేసి, త
త్స్వాంతము పొంగ, వీడుకొని స్వావసథంబును జేరె నారదా! ౩౩౨౯

తే. ఈవిధంబున భగవతి యిందిరేశ-దేహసంవాసి యగు గంగ దివ్యజనని
కరుణ లోకహితార్థమై కదలి పుడమి-యందు విలసిల్లె మునినాథ! యద్భుతముగ.

గంగావతారకథాఫలము

సీ. పరమపుణ్యదమగు హరిపాదజలజసంజాతయౌ గంగ యుద్భూతిని జేరి
నట్టి యీచరితంబు నతిభక్తి నేవాఁడు చదువును, జదివించు, నొదవు ముక్తి,
వృద్ధియౌ నాయువు, శ్రేయస్సు విలసిల్లు, సకలమంగళములు సంభవించు,
శుభసంతతులతోడ శోభిల్లుచుండు నేతరుణంబునందు నతండు మౌని!

తే. శ్రాద్ధదినమున విప్రుల సన్నిధాన-మందు దీనిఁ బఠించిన నధికపాపు
లయిన పితరులు సంతృప్తి నంది పుణ్య-పదవులను జేరుదురు సుమ్ము పరమమౌని!

తే. దేశకాలంబులను జూడఁ గివురక మది-దంభయుక్తి లీచరితంబుఁ దగఁ బఠించి
పితృగణంబులకెల్లఁ దృప్తిని ఘటింపఁ-గాఁగలరు దేవమౌని! నిక్కముగ నెపుడు.

సీ. ఎవ్వఁ డేకాదశి నీచరిత్రంబును భక్తితోడఁ బఠించుఁ బరమనియతి,
వాఁడు గంగాదేవివరకటాక్షంబున సర్వసిద్ధుల నొందు సంతతంబు,
పుత్రదారాదిసంపూర్ణుఁడై నెలయును, సుఖమును బొందు నిస్తులముగాఁగ,
సకలసంపదలఁ దత్సౌధంబు భాసిల్లు, నారదా! యెవ్వఁడు వారణాసి

తే. యందుఁ బుణ్యదమయిన గంగావతరణ
కథను జదువును, వాఁడు లోకతతి ముక్తి
దాత యగు విశ్వనాథుఁడై యాతతఫల
దాయకుఁడుగాఁ బ్రకాశించుఁ, దథ్య మిద్ది. ౩౩౩౨

తే. వాని దర్శింపఁ బాపికి వదలు ఘోర
పాపపంక్తులు నప్పుడే, భయము లుండఁ
జాల వెందయినను, నీదు స్వాంతమందు
సత్యముగ నమ్ము మిది దివ్యసంయమీంద్ర! ౩౩౩౩

క. మునివర! పూర్ణిమ, సంక్రాం-తిని నీపుణ్యకథఁ జదువ దేవీకరుణం
గను నశ్వమేధఫలమున-కును నధికముగా ఫలంబుఁ గోరిక మీఱన్. ౩౩౩౪

క. గంగాతీరంబున నీ-గంగావతరణచరితము కడునియతిని లోఁ
బొంగుచుఁ గ్రుంకుల నిడి స-త్సంగతి వినినను, బఠింప ధర నిస్తులుఁడౌ.

సీ. ఎవ్వాని గృహమున నీదివ్యగంగా చరిత్రపుస్తక ముండు సిద్ధమౌని!
వానికి నెపుడు దౌర్భాగ్యంబు గలుగదు, శత్రువు లుండ రేసమయమునను,
వ్యాధిబాధయు శత్రుభయము నేసమయాన నైనను గలుగవు మౌనివర్య!
గ్రహపీడ లుండవు, గంగానిమజ్జన మాజన్మముగఁ జేసినట్టి ఫలము
తే. గలుగు, బంధువియోగంబు గలుగ దెపుడు,
సంయమీశ్వర! గంగకు సమమగు వర
తీర్థ మెందును లేదు పృథ్వి, నటులగుటఁ
దచ్చరిత్రంబె యతిపుణ్యదాయకంబు. ౩౩౩౬

డెబ్బదిరెండవ అధ్యాయము

గంగామహిమము

తే. మునివర! సురధునిసుకృతము-గని ఘోరకలుషము లడఁపఁ గారణమగు స్ప
ర్శనమున దర్శనమున ము-క్తిని నెంతయు నిచ్చు భువనకీర్తిద యెందున్.

సీ. ఉదయంబునను లేచి యుర్వి నెవ్వఁడు వేడ్క స్మరియించు గంగ, నానరున కెపుడు
భువనత్రయంబున ముదము గల్గును, నశుభభయంబు లేదు, సంపదలు పెరుగు,
నాపద లాక్షణంబందె నశించును, బూర్వజన్మార్జితభూరిపాప
పుంజంబు లెల్లను బొడవడంగును, సుపుణ్యంబు లక్షయములై యలరుచుండు,
తే. సంతతంబు దుఃస్వప్న దర్శనమునందు-దుర్గమాపత్సమయమునఁ దొడరి గంగ
నొక్కమాఱు తలంచిన నక్కజముగ - దోషనివహంబు లెల్లను దొలఁగిచనును.

తే. త్రిభువనపవిత్రదను గంగఁ దివిరి కార్య
ములను సలుపుటకును ముందుఁ దలఁచిన సఫ
లంబులై శ్రుతిస్మృతివిహితంబు లగుచుఁ
గార్యము లవిఘ్నములుగాఁగ గణనకెక్కు. ౩౩౩౭

క. జపహోమాద్యాసక్తుం - డెపుడే ప్రాకృతముఁ బల్క వృజినం బది గం
గపవిత్రనామసంస్మృతి-నపుడు తొలఁచి మరలఁ జేయనగుఁ దద్విధులన్.

తే. భువి ముముక్షువు గంగ నెప్పుడు తలంచు-నెట్టిచోనైన వానికి నెసఁగ ముక్తి
నొసఁగుటకు వాని సంప్రీతి నురుకరుణఁ ద-దీయసాన్నిధ్యవసతిఁ దృప్తి గలిగించు.

సీ. సర్వార్థసాధని సర్వఘోరాఘవిమోచని సర్వసమ్మోదవరద
సర్వాశుభనిహంత్రి సర్వసంపత్ప్రదాయిని స్వర్గమోక్షద యనుపమాన
విభవాఢ్య యయి యొప్పు విశ్వస్వరూపయౌ ప్రకృతియే గంగయౌఁ బరమమౌని!
యెవఁడు స్మరింపఁడో భువి వాని జీవనం బగు విఫలంబయి యనవరతము,

తే. సకలతీర్థకృతస్నానసకలదేవ
పూజనములును, యజ్ఞముల్ భూరిదాన
తపములును గురువందనాధ్యయనములును
గంగఁ దలఁచిన ఫలముతోఁ గావు సాటి. ౩౩౪౧

క. మునివర! సహస్రనామము-లను భగవతి యయిన గంగ లలితాఖ్యయె మిం
చును ఫలదంబయి యెందును-నను త్తమంబయి, త్రిసత్య మార్యవరేణ్యా!

తే. మదిని గంగను దలఁచిన మాన్యుఁడగును-నీచుఁడైనను నారదా! నిక్కముగను,
గంగను స్మరింపనియతండు గారవంబు-లేని నీచుండగును శ్రేష్ఠుఁడేని నిజము.

తే. ఏదినము గంగను స్మరింప రాదినంబు-తలఁప దుర్దిన మని యెంచఁదగునుగాని,
యంబుదసమూహసంఛన్నమైన దినము-నారదా! చూడఁగా దుర్దినంబు గాదు.

క. పరదారాగమనజమగు-దురిత, మసత్యంబుఁ బలుక దొరకొను కలుషం,
బురుహింసాజనితాఘము-సురముని! నశియించు మదిని సురనదిఁ దలఁపన్.

క. సురఁ ద్రావఁ గలుగు పాప, మి-తరవిధదురితములు నణఁగుఁ దతగుణ! ని
ర్జరమునినాథా! గంగా-స్మరణంబున నిక్కముగను జగములయందున్. ౩౩౪౬

క. నరుఁ డెవఁడు నియతుఁడయి తా-నరుగుం గంగను గుఱించి యాత్రాప్రియుఁడై,
ధర వాజపేయశతమున్-దురగక్రతుఫలము గలుగు, స్తుతిఁ గను నెందున్.

తే. గంగనుగుఱించి యెవఁడు సంకల్పమాత్ర-నిరతితోఁ జేసి పోవు, నానరుని ప్రతిప
దంబునను వాజపేయశతంబు నశ్వ-మేధములు చేసిన ఫలంబు మిగులఁ గలుగు.

సీ. గంగానదినిగూర్చి కడఁకఁ బ్రయాణంబుఁ గావించువారలఁ గాంచి వారి
పితరులు నృత్యంబుఁ బ్రీతితోఁ గావింత్రు, గర్హణీయాఘముల్ గడువడిఁ జను,
గంగానదీయాత్ర గావించునట్టి మహాత్ముని నరుఁ గాంచి భూరిభయము
నొంది, కాలుని దూత లొయ్యన దూరంబు తొలఁగుదు రోమునీ! యిల నతండు

తే. మరణ మెచ్చటఁ బొందిన నిరుపమాన-ముక్తి గలుగును, గంగ నాసక్తిఁ జేరి
మరణ మొందినచో వానిమహిమ మెన్న-నగునె? దేవర్షి! నారదా! యనఘచిత్త!

సీ. గంగానదీయాత్ర గావించువారు స్వభాగ్యంబ నను మార్గవశముచేతఁ
గనుఁగొన్న యాతఁడు ణంబున గృహంబునకు సంప్రీతిఁ దోడ్కొనిపోయి యాతిథేయ
సత్కారము లొనర్చి సంతోషచిత్తులఁ గావించువారికిఁ గల్గు యాత్రి
కులు సమార్జించు నిస్తులసుకృతంబునందర్ధభాగంబు సత్యముగ మౌని!

తే. గంగ సేవింపఁబోవువారిం గని విన-యమున వందనములు చేసి యర్హభాష
ణములఁ దృప్తిని గల్గించు నరులు సకల-పాపనిర్ముక్తు లగుదురు తాపసేంద్ర!

తే. ఎవఁడు మోహంబుచేత తా నెఱుక లేక
గంగ సేవించువారిని గలుషచిత్తుఁ
డయి తిరస్కార మొనరించు నతిభయంక
రాఘములఁ గుందుఁ గల్పాంత మట్టివాఁడు. ౩౩౫౭

తే. తప్పు చేసినవాఁడైనఁ దాను గంగ-కరుగఁబూనినచో వాని నవనినాథుఁ
డెట్టి శిక్షయుఁ గావింప నెంచ కపుడె-వదలవలయును, ధర్మ మియ్యది మునీంద్ర!

సీ. గంగానదీయాత్ర గావించువాఁడు మార్గాయాసమున జలం బానునేని,
వాఁడు త్రావిన కూపవాపీతటాకాదు లెవ్వాని స్వత్వత నెసఁగు, నతని
భాగ్యంబె భాగ్యంబు, పరమపుణ్యుండయి భాసిల్లు నతఁడు భువనములందు,
నెవఁడు గంగాయాత్ర నిచ్చఁ గావించు చశక్తుఁడౌ, వాని కాసక్తి యాన
ఆ. ములను నొసఁగి యాత్రఁ బూర్ణతఁ గావించు-నట్టివాని పితరు లనవరతము
తృప్తి నొంది, ముక్తి దీపింతు, రతఁడు పా-పాళినుండి తొలఁగు నాక్షణమున.

సీ. వినుము నారద! యట్టి మనుజుండు గంగాతటమున నొందును మరణము ధ్రువముగఁ,
బుత్త్రపౌత్త్రాదికభూరిసంతతులచే విలసిల్లు, భూమిపై విపులకీర్తి
వ్యాపింప భాసిల్లు, నంతకాలంబున స్థిరముగా గంగ సంస్మృతి గలుగును,
బ్రహ్మఘ్నుఁ డయినట్టి పరమపాపియు గంగఁ గనుఁగొన ముక్తుఁడౌ క్షణమునందె,
తే. ఘోరతరపాపసంతతు ల్గూడ గంగఁ-గాంచినంతనె యడఁగు నిక్కముగ, సంశ
యింపఁగాఁ బనిలేదు మునీంద్రచంద్ర!-నారదా! విశ్వసింపు మపారభక్తి.

సీ. గంగామహాదేవిఁ గాంచి సద్భక్తియుక్తాంతరంగుం డయి యవని నెవఁడు
వందనంబు లొనర్చు వాని దేహమె సార్థకము, వాని జని సార్థకంబు, మఱియుఁ
దత్పితరులు చూడ ధన్యులు, వాఁడె ధన్యతముఁడౌ మునినాథ! యఘభయంబు,
మృత్యుభయంబును నించుకేనియు వాని కరయఁగా లేవు, సౌఖ్యంబు మిగులఁ
తే. గలుగుఁ బరలోకమునను, నిక్కముగ వాఁడు
గంగను స్మరించుచును మదిఁ బొంగుచు మృతి
కాలమునను గంగాతీరగతుఁడయి, సుకృ
తాత్ముఁడై ముక్తిఁ బొందు సత్యముగ నపుడె. ౩౩౫౮

తే. గంగ దర్శనమును జేయఁగానె సురలు
మునులుఁ గృతకృత్యు లగుచుండ మనుజవితతిఁ
గూర్చి వేఱుగఁ జెప్పఁగాఁ గోరవలెనె!
దివ్యతేజోమయాత్మకా! దివిజమాని! ౩౩౫౯

తే. ఓ మహామతి! భువిలోన నేమనుజుఁడు
దుష్కృతిసహస్రములఁ జేసి దుష్టుఁడయిన
గంగఁ గనుఁగొననేని సంగతిని వాఁడు
పొందఁజాలఁడు యమదండమును మునీంద్ర! ౩౩౫౯

గంగాదర్శన మహిమము

క. విను మతిరహస్యమయి శో-భనమగు నితిహాస మిపుడు వాక్రుచ్చెద నో
మునివర! యుత్తమమగు గం-గనుగూర్చిన మహిమ తెలియఁగానగు వరుసన్.

క. కలఁ డొక క్రూరుఁడు వసుధా-స్థలి శబరాన్వయభవుండు సర్వాంతకుఁడన్
బలవంతుఁడు వ్యాధుఁడు ని-స్తులపాపాత్మకుఁడు కుమతి సురమౌనీంద్రా!

చ. బలమునఁ బ్రాణికోటుల నపారముగాఁగ వధించి వాని ని
మ్ములఁగొని మాంసమమ్మి కడుఁబూనికతోడ లభించినట్టి రూ
కల సతతంబుఁ జేర్చి తన కాంతలఁ బుత్త్రుల భృత్యముఖ్యులన్
జలనము లేక ప్రోచును, విశంకటవృత్తిఁ జరించు నారదా! ౩౩౬౧

క. పరభార్యాగమనంబును-బరధనహరణంబు వాని పను లగుసు, మ్మె
య్యరవున వెరవున ధర్మా-కరకర్మము చేయఁ డొకటి, ఖలుఁ డతఁడు మునీ!

క. ఒకనాఁడు వివిధమృగములఁ-బ్రకటగతి వధించు చడవి భ్రాంతుండయి యో
పక నదిని జేరి యందు ము-నుకల నిడెన్ వాఁడు మిగుల నొగులుచు,నంతన్.

క. అత్తఱి నయ్యటవిని రా-జోత్తముఁడగు చిత్రసేనుఁ డూర్జితబలుఁ డా
యత్తుఁడయి వేఁటలాడఁగఁ-జొత్తెంచి చరించుచుండె సురమునిచంద్రా! ౩౩౬౪

తే. ఆమహారాజు వ్యాధు దుష్టాత్ము మాంస-భారయుక్తుని స్వపురసంప్రస్థితోద్య
తుని ఖలుని గనె సర్వాంతకునిఁ గఠోరు,-నంత విను నారదా! యొక్క వింత జరగె.

సీ. ధరణీశుఁ డొక మృగోత్తమమును గనుఁగొని కోదండమున నొక్క కోలఁ గూర్చి,
గురిపెట్టి, దానిని గొట్టనుండఁగ మహారాజసుని రాజును గాంచి సరభసగతిఁ
బరుగెత్తె నది, యంతఁ బార్థివుం డతితీక్ష్ణమగు బాణమును వైచె, నాక్షణమున
గాటంపుదెబ్బచేఁ గాయంబు రక్తప్రపూర్ణంబుగాఁ దన పోడిమి చన

తే. నామృగంబు రయంబున నరుగుదెంచి
వ్యాధు సన్నిధి సంభ్రాంతి నంది పడఁగ
రాజు, మృగమును గాంచి యావ్యాధుఁ డొక్క-
పాశమున దాని బంధించి పట్టుకొనియె. ౩౩౬౬

క. ధరణీపతి యాకార్యం-బరసి వడిగ వాని డాసి యతిక్రుద్ధుండై
దురితాత్ముని, వివిధములగు-వరపాశంబులను గట్టె బలిమి మెఱయఁగన్.

ఉ. అంతటఁ జిత్రసేననృపుఁ డశ్వము నెక్కి ప్రయాణమయ్యె దు
ర్దాంతుఁ గిరాతునిన్ మృగముఁ దద్భటు లుద్ధతిఁ గొంచు వెంటరా
నెంతయు వేడ్క నోడపయి నెక్కి రయంబున గంగ దాఁటి ని
శ్చింతఁ బురంబుఁ జేరె మునిశేఖర! నాగద! సిద్ధవందితా! ౩౩౬౯

ఆ. గంగ దాఁటునపుడు కనుఁగొనె వ్యాధుఁ డా-పరమపూజ్యమైన భవుని రాణి
సంయమీంద్ర! యట్టి సంపర్కమును గాంచె-విశదపఱతు గంగ విభవమెల్ల.

ఆ. అంతఁ గొంతకాల మరుగంగ సర్వాంత-కాఖ్య వెలయు వ్యాధుఁ డంతమొందె,
యముని దూత లప్పు డట్టహాసములతో-వానిఁ బట్టి పాశబద్ధుఁ జేయ. ౩౩౭౦

క. శివునాజ్ఞ శిరములం దిడి-శివదూతలు వచ్చి యముని సేవకుల వడిన్
దవులం బోఁద్రోలి సదా-శివలోకంబునకు వ్యాధుఁ జేర్చిరి మానీ! ౩౩౭౧

క. అంతట యమదూతలు మదిఁ-జింతించుచు నొచ్చి యముని చెంత నిలిచి వృ
త్తాంతం బంతయుఁ దెల్పిరి-పంతంబునఁ బ్రమథవరుల బలిమిని వరుసన్.

క. దూతలు చెప్పిన దంతయు-నాతతమతి నాలకించి యముఁ డంత గనో
పేతుఁడగు చిత్రగుప్తుఁ "గి-రాతుం డెటు పొందు శంకరప్రియవసతిన్! ౩౩౭౩

క. తెలుపుము పుణ్యముఁ బాపం-బిలలో నొనరించినట్టి దెల్ల నమాత్యా!
తలఁప బాపంబే యి-మ్ముల నొనరిచె, వీఁడు సుకృతమును జేయఁ"డనన్.

సీ. పరమధర్మాధర్మభవ్యవిమర్శకుఁడగు చిత్రగుప్తుఁ డయ్యమునిఁ గాంచి
"సమవర్తి! యాతండు జగతిఁ బాపంబులే పచరించెఁ,గాని సంపర్కమునను
గలుషసంహారిణి గంగానదిని గాంచె, నాదర్శనంబెసు మ్మధికఫలద
మగుచు భాసిల్లె మహాభాగ!"యని నివేదింపఁగా శమనుండు తెలిసి, విస్మి

తే. యాన్వితుండయి మదిలోన నధికభక్తి-సకలపాతకసంహర్త్రి సర్వదేవ
వంద్యయగు గంగకు ననేకవందనముల-నాచరించుచు దూతల నరసి పలికె.

యముఁడు దూతలకు గంగాప్రభావంబుఁ దెలుపుట

తే. "పరమపావని యగు గంగ నరు లెవారు-పరమపాతకులయ్యు సంపర్కమునను
గాంతు, రవ్వారు పుణ్యులై మింతు రెందు,-వారి నేను శిక్షింపంగ వలనుపడదు.

తే. పతితపావని యగు గంగ నరు లెవారు
తలఁతు రేకమాఱు మదియందుఁ, దలఁప వారు
పాపశతయుక్తులయ్యును పరమకృతులు,
వారి నేను శిక్షింపంగ వలనుపడదు. ౩౩౭౭

తే. మనమునన్ ద్రవరూపిణి మహితభక్తి-సతము ధ్యానించువారు దుష్కృతశతములఁ
జేసియును బుణ్యమూర్తులై వాసిఁగాంత్రు,-వారి నేను శిక్షింపంగ వలనుపడదు.

తే. ఇతర మహాపాతకంబులఁ జేసినట్టి-వారలైనను గంగలో భక్తి మునిఁగి
పూజగావింతురే వారు పుణ్యతనులు,-వారి నేను దండింపంగ వలనుపడదు.

తే. గంగలో దేహముఁ ద్యజించు కలుషమతుల
కే నశింపదుఁడను నయి యెరఁగు లోక
మింతయే? వారలు సతంబు విబుధపతుల
కెల్లరకు వందనార్హులై యెసఁగుచుంద్రు.'' ౩౩౮౧

క. మునివర! గంగావిభవం-బును నీక్రియ ధర్మరాజు పొగడుచుఁ దెలుపన్
విని యమదూతలు మానస-మున విస్మయ మొంది సదనముల కరిగి రొగిన్.

క. తత్తరము లేక యధ్యా-యోత్తమ మియ్యది పఠించు నుర్వి నెవఁడు, వాఁ
డెత్తఱి నురుపాపంబుల-హత్తిన యమదూతభీతి నందఁగు నౌనీ! ౩౩౮౨

డెబ్బదిమూఁడవ అధ్యాయము

గంగామాహాత్మ్యము

సీ. బ్రహ్మహత్యామహాపాతకుండైనను, గోఘ్నుండు గురుతల్పగుండు నైన,
సురను ద్రావినయట్టి నరుఁడైన, మఱి ఘోరపాపము ల్గావించు పతితుఁడైన,
గంగామహానదిఁ గాంచి స్నానంబును గావించినట్లైనఁ గలుషరాశి
నశియించు వానికి నారదా! గంగాప్రసాదంబునను, మంత్రసంతతులను

తే. నెఱుఁగకున్నను, సద్భక్తి హృదయమందు
లేకయున్నను ముక్తుఁ డౌఁ బ్రాకటముగ,
సత్య మియ్యది యనుచు నీ స్వాంతమందు
విశ్వసింపుము నిత్యంబు విబుధమౌని! ౩౩౮౩

సీ. మానవుం డెవ్వాఁడు మనమున నెఱిఁగియే నెఱుఁగకయే నొక్కయెడ నిమజ్జ
న మొనర్ప గంగ మోక్షముఁ బొందు,సప్తజన్మార్జితంబగు పుణ్య మక్షయమయి
యంతంబు లేనిదై యలరారు, విత్తంబుఁ బరమసౌఖ్యం బెందుఁ బరఁగుచుండు,
జాహ్నవీతటమున సద్భక్తి శాస్త్రోక్తసరణి స్నానంబును సలుపునతఁడు

ఆ. సకలపాపచయము సమసిపోవఁగఁ బుణ్య-వంతులందు మిగుల వాసిఁగాంచి
పరమపదము నొందు నిరుపమవైభవ-సహితుఁ డగుచు దివ్య సంయమీంద్ర!

క. స్నానసమయంబునం దె-వ్వానయినం గంగఁ దలఁచుచుఁ జేసిన యా
స్నానము గంగాస్నానస-మానఫలద మగుచు వెలయు సంయమినాథా!

సీ. ప్రతిదినంబును భక్తిఁ బ్రాతస్సమయమందు జాహ్నవీజలమున స్నానమాడు
నరుఁడు పుణ్యాత్ముఁ డరయ సాక్షాచ్ఛంకరునివలె వెల్గు నో మునివరేణ్య!
పాపుల పాపము ల్పంచబంగాళంబులయిపోవు నాతని నరయఁగానె,
వినుము ప్రాతఃస్నానమును తులామకరమేషములందు శాస్త్రోక్తసరణి జాహ్న
తే. వీజలములందుఁ గ్రుంకిన వితతపుణ్యుఁ
డగు, నుభయవంశ్యపితరుల నర్బుదముల
నుద్ధరించును, దా దేహ మూడ్చి శంక
రత్వమును బొందు, నిజము నారదమునీంద్ర! ౩౩౮౬

తే. వేలకొలఁది మహాయజ్ఞవితతులు వ్రత
పూజలు శతంబులును నెందుఁ బోలవు ముని
వర్య! గంగానదీస్నానవైభవమున
కొక్క కలభాగమయిన మహోన్నతముగ. ౩౩౮౭

తే. మాఘశుక్లసప్తమిని నెమ్మనమునందు-భక్తితో నరుణోదయభవ్యవేళ
గంగ నవగాహన మొనర్పఁగా భవపటు-బంధములనుండి ముక్తిని బడయు నరుఁడు.

క. మునినాథ! మాఘశుక్లం-బౌన సప్తమి గంగదరిని బూర్ణశ్రద్ధన్
దిననాథునిఁ బూజించిన-ఘనరోగము లెల్లఁ బాయుఁ, గను సుఖ మొదవున్.

తే. మాఘపూర్ణిమ గంగలో మహితభక్త-మజ్జనంబు యథావిధి మనుజుఁ డెవ్వఁ
డాచరించును, వాఁడు పాపాళిఁ దొలఁగి-యంతమున శివసాయుజ్య మందఁగలఁడు.

ఆ. గంగఁ గాంచి భక్తిఁ గార్తికపూర్ణిమ-మజ్జనం బొనర్చు మానవుండు
సంశయంబు లేక సకలమహాపాత-కములవలన ముక్తిఁ గను నిజముగ. ౩౩౯౧

తే. శాస్త్రవిధి జాహ్నవీవారిఁ జైత్రకృష్ణ
పక్షమందుఁ ద్రయోదశి భక్తిఁ గ్రుంకు
లిడినవాఁ డఖిలాఘంబు లెడలఁ బరమ
పదము నొందును, సత్య మియ్యది మునీంద్ర! ౩౩౯౨

తే. అంచితారోగ్య మనుపమంబైన విభవ
మబ్బుటయు గాదు, మదిఁగల యఖిలవాంఛి
తములు సమకూఱు, గంగలోఁ దానమాడు
వారికిని దత్ప్రసాదంబువలన సతము. ౩౩౯౩

తే. ఆదినం బీదినం బని యనక యెట్టి-వాసరంబున నైన గంగాసరిత్తు
నందు మునిఁగినవారు పాపౌఘముక్తిఁ-బడసి పొందుదు రీశ్వరపరమపదము.

క. క్షితి నెవరు శ్రద్ధతోఁ దమ-పితరులకును దర్పణంబు విధి జాహ్నవి స
మ్మతి నొనరింతురొ, వారల-పితరులు బ్రహ్మపద మొంది వెలయుదు రెపుడున్.

తే. గాంగజలమును గొని పితృగణముఁ గూర్చి
తర్పణంబు మఱొక్కచోఁ దగదు చేయ.
మది నెఱుంగక చేసిన మనుజుఁ డపుడె
యగును బాతకి, నిజ మిది యమరమౌని! ౩౩౯౬

తే. పితృగణంబును గూర్చి తృప్తిని ఘటింపఁ
దర్పణము గాంగవారి నుద్యద్విధాన
మున నొనర్చినవాఁడె యోగ్యపుత్రుఁ డనఁగ,
బుత్రులెల్లను బుత్రులే! మునివరేణ్య! ౩౩౯౭

తే. గాంగతీర్థంబు గొని పితృగణముఁ దృప్తి
పఱుప శ్రాద్ధంబు మఱియుఁ దర్పణము చేయ
నగును మనుజుండు, వేఱొకఁడైన కార్య
మాచరించిన నరకంబులందుఁ బడును. ౩౩౯౮

సీ. గంగానదిం గూర్చి కదలి ప్రయాణంబు గావించువానిని గాంచి, మదిని
దత్పితృగణము శ్రాద్ధమునందు సంపూర్ణభుక్తిఁ గాంక్షించుచు మోదమునను
నాట్యంబు గావింత్రు, నవ్వుచునుందురు, శ్రాద్ధ మచ్చోటను సలుపఁడేని
యాశావిహీనులై యరుగుదు రోముని! శ్రాద్ధంబు చేయని జనుఁడు నరక

తే. మునకు నరుగు నిక్కముగ, గాంగసలిలప
క్వాన్న మన లభింప ననువుపడదు
సురలకైన, నట్టి సురుచిరాన్నశ్రాద్ధ
సరణి నిర్వృతిని బితరుల కొసఁగు. ౩౩౯౯

తే. ఎవని పితరులు సంతృప్తి నెనయుచుందు
రట్టి నరజన్మ సార్థకం బగునుగాక!
యెవని పితరులు కుపితులై యేడ్చుచుందు
రట్టి నరజన్మ విఫలంబె యగు మునీంద్ర! ౩౪౦౦

క. పితరులు కోపించిన సం-తతము నరుల కణఁగిపోవు ధర్మక్రియ; లీ
హిత వెఱిఁగి ధర్మకార్యము-పితృగణసంతృప్తి చేసి పిదప సలుపనా. ౩౪౦౧

సీ. గంగాతటమున భాగ్యముచేతఁ జంద్రసూర్యగ్రహసమయంబు లబ్బెనేని
స్నానంబు గావించి శాస్త్రోక్తరీతిగా శ్రాద్ధంబుఁ బితరుల స్వాంతములకు
సంతృప్తియొసఁగంగ సలుపనౌ మునినాథ! యాశ్రాద్ధ మక్షయ్యమగు ఫలంబు
నిచ్చు,సంతోషంబు హెచ్చుగాఁ గలిగించుఁ,బితృసమూహమునకుఁ బెంపు నింపు,

తే. ముక్తిదాయక మగుచుండుఁ, బూర్ణభక్తి
శ్రాద్ధశతమును గావింప శాస్త్రవిహిత
సరణి నే భూరిఫల మొందు జగతి, నట్టి
ఫలముఁ దాఁ గాను నరుఁడు తాపసవరేణ్య! ౩౪౦౫

తే. జాహ్నవీతీరభూమిని సాధకుండు-చేసెనేని పురశ్చర్య సిద్ధమంత్రి
యగు,నసాధ్యంబు సాధింప నర్హుఁ డగును,-దాను శంకరనిభుఁడయి తనరుచుండు.

క. ఎందయిన నట్టిఁ డొనరిం-పందగు శ్రాద్ధంబు ముగ్ధభావుం డయి వే
డ్కం దవిలి శ్రాద్ధహీనత-నొందు పురశ్చరణ మొసఁగ దొగి ఫలదంబై.

క. ఉరుపుణ్యాస్పద యగు ని-ర్జరసింధువునందుఁ గ్రుంకి శ్రద్ధ యుగాదిన్
సురముని! పితృతర్పణ మా-చరించి దానంబొనర్ప జన్మరహితుఁ డౌ.

సీ. గంగాజలంబునఁ గడుభక్తి సాధకోత్తముఁడు పురశ్చర్యఁ దవిలిచేయు
నేని, పాపవిముక్తుఁడై నిక్క-ముగ మంత్రసిద్ధిని బొంది విశేష శేము
షీమహిమాఢ్యుఁ డౌ, నేమనుజుఁడు గంగ దానంబు స్నానంబు ధ్యాననియతి
శ్రాద్ధతర్పణములు జపహోమపూజలు గావించు, బహుపుణ్యాకరము లగుచు

తే. నట్టి కార్యము లెల్లయు, మోహమున గాంగ
సలిలమున మలమూత్రవిసర్జనంబు
సలుపఁగూడదు, సలిపిన జనుఁడు నరక
మునను నాచంద్రతారకమును వెతఁ గను. ౩౪౦౬

తే. పలికి బొంకుట, లోభంబు, పైశునంబు
పరుల వంచించుటయు నను పాతకములఁ
జేయఁగారాదు, ముగ్ధుఁడై చేసెనేని
నరకమును బొందు నిజముగా నారదముని! ౩౪౦౭

క. నిరుపమ భక్త్యన్వితుఁడై-సురధునిఁ గ్రుంకులిడి మ్రొక్కుఁ జోద్యంబుగఁ ద
ద్దురితము లన్నియుఁ దొలఁగును,-బరమపవిత్రుఁ డగు వాఁడు పరమమునీంద్రా!

సీ. నీరరూపిణియై యపారమహిమ వెల్గు ప్రకృతి మహాదేవి పరమపురుష
పదకమలోద్భవ నెద నెఱుంగక మోహమున నది యని యెంచు జనుఁడు పాప

సముదాయముల కేగు, జగముల రక్షింప ద్రవరూపమునఁ బూర్ణతను దెలంగు
బ్రహ్మమయిని మది భావింపఁదగు నాదిశక్తి యీయాపత్తి సక్తి ననుచు,

తే. గంగ యంతట సులభయౌఁ గాని, కడలిఁ
గలియుచోట హరిద్వారనిలయమునఁ బ్ర
యాగయందును దుర్లభంబై గుణాఢ్య
మై వెలయుఁ జుమ్ము నారదా! యనవరతము. ౩౮౦౯

సీ. మునినాథ! పున్నెంపుభూము లీమూఁడును, గంగ యిచ్చోటులఁ గడు ఫలప్ర
దాయిని యగుఁ, గాన తడయక స్నానదానాదులఁ జేయంగ నగు నరుండు,
కాశీపురముఁ జేరి గంగామహానదియందు యథావిధి నాత్మభక్తి
యుక్తుఁడై స్నానంబు నుత్తరవాహిని లోనఁ గావించిన మానవుండు

తే. దేవపూజ్యుండు, నమ్మహాదేవుఁడ యగు
ననుచు బుధు లంద్రు, పితరుల కందుఁ దర్ప
ణంబు భావింప నిర్వాణదం బటంచుఁ
బల్కుదురు విజ్ఞు లెల్లరుఁ బరమహాని! ౩౮౧౦

సీ. సర్వతీర్థములకు సతతనివాసమై శ్రీవిశ్వనాథు సుక్షేత్ర మగుచు
భాసిల్లు కాశికాపట్టణం బీవసుధాతలంబందునఁ దా వెలుఁగుచుఁ,
బ్రాభవంబున దుర్లభంబయి వసుధకు వెలుపల నున్నట్లు వెలయుచుండు,
నందు జాహ్నవిజలం బగును సేవార్హమై సతతంబు నారద! సంయమీంద్ర!

తే. తజ్జలంబును సేవింప ధరణిజనుల
హస్తముల ముక్తి యెప్పుడు నలరుచుండు,
విశ్వనాథుని మహిమచే విబుధతటిని
మిగుల వెలయుఁ బ్రభావంబు మించ నెపుడు. ౩౮౧౧

సీ. దేహధారులకు సందేహంబు లేక యెం దన్నపూర్ణయె తల్లి యగుచు నుండు,
తతజలజ్ఞానంబు లతులితగతి నెందు గంగాసరస్వతు లరుణ నిత్తు,
రపవర్గమార్గంబు ననిశంబు బోధించు నెందుఁ దండ్రిగను విశ్వేశ్వరుండు,
బ్రహ్మకులకు మునీ! పరమపదం బగు నెందు మృత్యువు మది నెంచిచూడ,

తే. నట్టి శ్రీకాశి సేవింపనట్టివాఁడు
నిశ్చయంబుగ దౌర్భాగ్యనిహతుఁడగుట
వంచితుండగు విధిచేత బహువిధముగ
ననుచు నెఱుఁగంగవలయు నోయమరమౌని! ౩౮౧౨

క. స్నానంబుఁ మణికర్ణిక-లో నియతి నొనర్చి సకల లోకప్రభు బి
ల్వానూన పత్రనిచయము-చే నర్చించునతఁ డొందు శివలోకంబుఁ. ౩౮౧౩

క. తిలకంబు గాంగమృత్తిక-నలవఱచి, మునీంద్ర! నారదా! కార్యము లి
య్యిల నొనరించిన యల్పం-బలఘు వయి సుపూర్ణఫలము లందించు నొగిన్.

సీ. గంగాజలంబును గడుభక్తిఁ గైకొని యెచ్చోటనైనను నీశు పూజ
శ్రాద్ధాభిషేకముల్ సలిపిన మానవోత్తముఁ డున్నతుండయి తా వెలయును,
దెలిసియైనను మఱి తెలియకయైన నసమయంబునందైన శ్రాద్ధవిహిత
సరణిఁ జూడకయేని శాస్త్రాదిపరివర్జితవిషయంబున నేని దాంభికగుణ
తే. మూనియే విత్తవర్జితముగ నొనర్చి
నను నశుద్ధపదార్థసంతతులనైనఁ
బాపచిత్తుండు చేయు సర్వంబు ఫలద
మగుచు భాసిల్లు శాస్త్ర మోయమరమౌని! ౩౪౧౫

దెబ్బదినాల్గవ అధ్యాయము

గంగామాహాత్మ్యము - ధనాధిపముక్తి

చ. తనువును జ్ఞానవంతుఁడయి ధన్యుఁ డెవండు త్యజించు గంగయం
దున వృజినాళిఁ బోనడఁచి తోడనె ముక్తిని గాంచుఁ, దెల్వి లోఁ
గనక శరీరమున్ విడువఁ గల్మషియౌ నరుఁడైన వెంటనే
కను సుపదంబు దద్దయును గంగప్రసాదముచేత నెంతయున్ ౩౪౧౬

క. నారద! నరుఁ డెటఁ దనదు శ-రీరము వదలినను సరియె, ప్రీతిఁ దదస్థిన్
జేరిచిన గంగ నానరుఁ-డారయ స్వర్గసుఖ మొందు నమరమునీంద్రా! ౩౪౧౭

ఉ. ఆరయ బ్రహ్మహత్య మొదలౌ దురితంబులు వేలు చేసి యీ
ధారుణి నింద్యుఁడై జనుఁడు తాఁ దన మాంసము నస్థినైన భా
గీరథినీరసంగతిఁ బ్రకృష్టత దేహము వీడు, వాఁడు సం
సారవిముక్తుఁడై వితత సౌఖ్యము స్వర్గముఁ జేరు నారదా! ౩౪౧౮

తే. జలమునన్ గంగలో ముక్తి సంభవించు,-స్థలజలంబుల ముక్తి యొసంగు వార
ణావతంబున, స్థలజలనభములందు-ముక్తి సాగరసంగమమున లభించు. ౩౪౧౯

క. విను మీయర్థము వివరిం-చును నొక యితిహాస, మద్ది శ్రోత్రసుఖదమై
యొనయున్ విస్మయదంబై,-యనుపమ మగుఁ, దెలుపువాఁడ నవహితమతివై.

సీ. పరమపాపాత్ముఁడౌ వైశ్యుఁ డొక్కఁడు ధనాధిపనామధేయుండు దృప్తచరితుఁ
డనవరతంబు చౌర్యమె వృత్తిగా నుండుఁ, బరదారలను బట్టి భంగపఱచు,

నిది యది యననేల యెల్లపాపంబులఁ గావించుచుండు, నా కలుషచిత్తుఁ
డడవిలో నొకనాఁ డహంకృతిఁ దిరుగుచుఁ గాలధర్మము నొందెఁ, గాలకింక

ఆ. రాళి యేఁగుదెంచి యమసన్నిధికి వడి-నీడ్చుకొనుచుఁ బోయి యెఱుకపఱుప
యముఁడు వాని నపుడె యసిపత్రనరకంబు-నందుఁ ద్రోయఁబంచె నమరమౌని!

తే. ఆ దురితచిత్తు దేహ మయ్యడవినడుమ-ననలదగ్ధంబు గాకుండె, నంత దాని
నారగించుచునుండెఁ బెల్లౌఁకలిఁ గొని-యొక్క జంబుక మప్డు దత్యుగ్రగతిని.

క. చనుదెంచి గృధ్రరాజం-బనుపమవిహరణముచేత నదలింపఁగ భీ
తిని వంచకంబు పర్వె-త్తెను మాంసశకలము వీడి ధృతి యెడలి మదిన్.

క. ఆ పలలఖండమును దా-నేపున ముక్కునను గఱచి యెగసి నభమునన్
దీపించుచు ద్రుతగతితో-నేపారుచుఁ బాఱి యలసి యెంతయు వంతన్. ౩౪౨౪

తే. దప్పిగొని గంగదరిఁ జేరి తమకమున జ
లంబుఁ గ్రోలుచు నుండ నయ్యంబుసంగ
తంబగుచుఁ జేరె నాదురితక్రియాత్ము
మాంస మంతట దాని సంబంధమునను. ౩౪౨౫

క. దురితాత్ముండు ధనాధిపుఁ-డురుతరపాపంబు లెల్ల నుక్కడఁగా ను
ద్ధురగతి స్వర్గమునకు శం-కరరూపముతోడ నరిగెఁ గడుఁ జిత్రముగన్. ౩౪౨౬

తే. నిష్ఠురంబగు నసిపత్రనిరయము వడి-దాఁటి యేగెడు పాపాత్ము ధర్మరాజ
భటులు గని యచ్చెరువు నొంది భావమందుఁ-బ్రభుని సన్నిధి భక్తితోఁ బలికి రిట్లు

సీ. "సమవర్తి! పాపప్రశమన! ప్రభూ! తావకాజ్ఞానువర్తుల మయి దురంత
కలుషాత్ము నొక్కనిఁ గడుశ్రద్ధతో నసిపత్రనారకమున వైచి రక్ష
ణము చేయుచుండ నేమమున, సాక్షాచ్ఛంకరాకృతిఁ బూని వాఁ డద్భుతముగ
నటనుండి వెలువడి యపవర్గమున కేగె, నెయ్యది కారణం? బిపుడు కరుణఁ

తే. దెలుపు" మని విన్నప మొనర్ప దివ్యదృష్టిఁ
గాంచి మది విస్మయముఁ బొంది కారణంబుఁ
దన భటులతోడ నిట్లని తగినరీతిఁ
దెలిపె వినవయ్య శ్రద్ధతో దివ్యమౌని! ౩౪౨౭

చ. "వినుఁ డొకగ్రి వీని మాంసము భువిన్ గడు నాఁకలి జంబుకంబు నో
రను గబళింప డేఁగ గొని ప్రాభవ మొప్పఁగ నాకసంబునన్
గనుకని పాఱి దప్పిగొని గంగజలంబును ద్రావె, దాన ము
క్తిని గనె నీచుఁడయ్యును మదిం గనుఁ డీతఁడు తత్క్షణంబునన్. ౩౪౨౮

క. గంగాజలమున మాంసము-సంగతమయి పీఁగు పాపసంచయములఁ ద్రుం
చెం గడునచ్చెరువుగఁ, ద-త్సంగతి నెట్లైనఁ గలుగు స్వర్గము విధిగాఁ!''

క. శమనుఁడు తెల్పిన గంగా-విమలాద్భుతమహిమ లెల్ల విని, యమదూతల్
తమతమ గృహముల కరిగి-యనురాగవిభవ మెన్ను చాత్మలయందున్.

క. దేవతలు సన్నుతింప మ-హావైభవయుక్తుఁడయి ధనాధిపుఁడు ముదం
బావహిల స్వర్గమున శివ-దేవుని సాయుజ్య మొందె స్థిరముగ మౌనీ! ౩౪౩౨

ఆ. సకలపాతకముల శమనంబుఁ బొందించు-సంయమీంద్ర! గంగ స్పర్శనమున,
దర్శనమున మోక్షదాయినియగు శీవృ-లకు ననాగతంబుఁ బ్రకటితగతి. ౩౪౩౩

చ. మనుజుఁడు భక్తి గంగ నెద మానక యెంచి సమాశ్రయింపనౌ
మునివర! యెప్పుడైనను బ్రముగ్ధుఁడు కాక శతాబ్దిలోన మృ
త్యునియతివర్జితుం డగుచు నున్నతి మోక్షముఁ గోరి మున్నె నౌ
కొన్నఁగ భవాబ్ధి దాఁటుటకు గొబ్బున దేవమునీంద్ర! నారదా! ౩౪౩౪

ఆ. సందియంబు మాని చనుదెంచి శమనుండు-జుట్టుపట్టి లాగి నెట్టుఁగాన
ముందుగానె తగ్గ మును జేయ కతిభక్తి-గంగ నాశ్రయింపఁ గడఁగవలయు.

తే. బాంధవులు పుత్త్రమిత్త్రసంబంధు లనుచుఁ
బలుక రెవ్వారు సకలభువనములందుఁ,
బరమబంధువు గంగయే భయదపాప
హారిణి యటన్నఁ బ్రథితయా నాఖ్య వెలయు. ౩౪౩౬

చ. తనుఁగొనినన్ స్పృశించినను గంగను ధ్యాన మొనర్పఁ గీర్తనం
బును నొనరించినన్ సుఖము మోక్షము నిచ్చును నాదృతిన్ జగం
బునఁ గలవారి కెల్లరకుఁ బూర్ణముదంబున నారదా! జగ
జ్జనని ద్రవస్వరూపిణి నిజంబుగ బంధు వటంద్రు దేవతల్. ౩౪౩౭

సీ. అతిఘోరతరమగు యామ్యభయంబున నభయదాయిని యయి యనవరతము
రక్షించుఁగాన సంరక్షణశీలయౌ గంగను సేవింపకయె జను లెవ
రుందు, రవ్వారల నుర్వి నాత్మవిఘాతులని వచింతురు బుధు లమలచిత్త!
పుత్త్రాదు లెల్లరు మోహబంధప్రవర్తకులు, వ్యర్థులు, గంగ యనఁగ శాశ్వ

తే. తియును ముక్తిదాయిని యని తెలిసి మనము
నందు విశ్వాసమును బూని యధికభక్తి
నాశ్రయింపఁగఁదగు లోకమందుఁ బ్రాణి
సముదయంబెల్ల సతతంబు సంయమీంద్ర! ౩౪౩౮

క. మరణంబుఁ బొందనుండిన-నరునిన్ నిర్వాణపదమునం జేర్చు సరి
ద్వరయగు గంగను జేర్చిన-నరవిం గైవల్య మొదవు శాంభవి కృపతోన్.

తే. గంగయే పరమబంధువు, గంగయే య
నంతసుఖమన, గంగయే యఖిలధనము,
గంగయే గతియగుఁజుమ్ము, కడమదిక్కు
లేవియును లేవు, నరుఁ డది యెఱుఁగనగును. ౩౪౪౦

సీ. భువనంబులందు సంపూజ్య గంగానది, పరమముక్తియు గంగ భవ్యచరిత!
వరసారతరవస్తు వరయఁగ గంగయే యని తలంచినవార లందఱకును
దగ్గఱనే యుండుఁ దాపసేంద్రా! గంగయని పల్కువారల వెనుకఁ బ్రీతిఁ
బ్రవహించుచుండును దవిలి భగీరథ శంఖస్వనము విని చనినరీతి,

తే. నెవఁడు గంగాతటనివాస మీసడించి
యొండుచో నివసించు, నాతండు చూడ
హస్తగతముక్తిఁ ద్రోసి యత్యఘవిశిష్ట
మార్గ మన్వేషణముచేయు మానవుఁ డగు. ౩౪౪౧

క. భువనత్రయపావనయయి-ప్రవిమలయగు గంగ యెందు భాసిల్లు, నదే
భువి ధన్యమయిన దేశము-సువిశదచిత్తారవింద! సురవరానివరా! ౩౪౪౨

తే. గంగ లేనట్టి దేశంబు ఘనులు దేశ
మనుచుఁ బిలువరు, తత్తీరమందు భైక్ష
మేని యుత్తమ మగు, ప్రాణమేని యందు
వదలినను నాత్మహత్య గా దది యటండ్రు. ౩౪౪౩

క. ఇతరస్థలములఁ బృథ్వీ-పతిత్వమును గాంగతటిని బడి బిచ్చము స
మ్మతిఁ గొనుటకంటె నతిహీ-నత యని గోర రెపుడైన నరులును దివిజుల్.

సీ. ఏదేశమున నరుం డెసఁగ గంగాభక్తిపరుఁడయి యొక్కఁడే యిరవుగాఁగ
వసియించు, సత్పుణ్యవంతుఁడు వాఁడె యూ, నాదేశమే సుకృతార్హదేశ
మనఁబడు, దానాదు లందె మహాఫలమిచ్చు, శ్రాద్ధాదులు తృప్తికరము
లయి విలసిల్లు, నత్యంతతృప్తిం గూర్చుఁ, బితరులకెల్లను బ్రియము నొసఁగు,

తే. నందుఁ జేసిన జపము హోమాదినిఖిల-కర్మము లనంతఫలములై కడు వెలుంగు,
నట్లుగావున గంగామహానదీస-మీపమును వీడఁగారాదు తాపసేంద్ర! ౩౪౪౪

క. పరసౌఖ్యము గంగాఖ్యయె,-పరమతపము గంగయనెడు భవ్యాభిధయే,
నిరతిని గంగ యటంచున్-స్మరింప యమభయము లేదు జనముల కెపుడున్."

డెబ్బదియైదవ అధ్యాయము

గంగాష్టోత్తరశతనామములు - గంగామహిమము

క. ఈవిధమున గంగానది-పావనమహిమంబుఁ దెల్ప భద్రదుఁడు మహా
దేవుఁడు నారదునకు, సం-భావించుచు నారదుండు పలికెను భక్తిన్. ౩౪౪౭

క. "దేవా! గంగానామము-సేవించినఁ బరమపుణ్యసిద్ధికరమునా
నీవు దయం దెలిపితి, వం-దేవి ప్రశస్తంబు లగునా మెఱిఁగింపు" మనన్.

తే. శ్రీమహాదేవుఁ డంతఁ దాఁ జెలఁగి యాత్మ-"నారదా! విను తెల్పెద గారవమున
జాహ్నవీదేవినామాష్టశతమె యుత్త-మంబు నామసహస్రంబులన్ బుధేంద్ర!

తే. వినుము వచియింతు శ్రద్ధతో విశదరీతి-నిపుడు నామశతాష్టక మపరిమితకృ
పాంతరంగుండనై నీవు భక్తవరుఁడ-వగుట గంగాప్రభావంబు నతిముదమున.

వ. గంగయుఁ, త్రిపథగయు, దేవియు, శంభుమౌళివిహారిణియు, జాహ్నవియుఁ, బాపహంత్రియు, మహాపాతకనాశనియుఁ, బతితోద్ధారిణియు, స్రోతస్వతియుఁ, బరమవేగినియు, విష్ణుపాదాబ్జసంభూతయు, విష్ణుదేహకృతాలయయు, స్వర్గాబ్ధినిలయయు, సాధ్వియు, స్వర్ణదియు, సురనిమ్నగయు, మందాకినియు, మహావేగయు, స్వర్ణశృంగప్రభేదినియు, దేవపూజ్యతమయు, దివ్యయు, దివ్యస్థాననివాసినియు, సుచారునీరరుచిరయు, మహాపర్వతభేదినియు, భాగీరథియు, భగవతియు, మహామోక్షప్రదాయినియు, సింధుసంగగతయు, శుద్ధయు, రసాతలనివాసినియు, మహాభోగయు, భోగవతియు, సుభగానందదాయినియు, మహాపాపహరయు, పుణ్యయు, పరమాహ్లాదదాయినియు, పార్వతియు, శివపత్నియు, శివశీర్షగతాలయయు, శంభుజటామధ్యగతయు, నిర్మలయు, నిర్మలాననయు, మహాకలుషహంత్రియు, జహ్నుపుత్రియు, జగత్ప్రియయు, త్రైలోక్యపావనియు, పూర్ణయు, పూర్ణబ్రహ్మస్వరూపిణియు, జగత్పూజ్యతమయు,

✓ శ్రీనారద ఉవాచ. గంగానామ పరంపుణ్యం కథితం పరమేశ్వర। నామాని కతి శస్తాని గంగాయాః ప్రణిశంస మే ॥ ౧ ॥ శ్రీమహాదేవ ఉవాచ ॥ నామ్నాం సహస్రమధ్యేతు నామాష్టశతముత్తమమ్। జాహ్నవ్యా మునిశార్దూల తాని మేశృణుతత్త్వతః ॥ ౨ ॥ ఓం గంగా త్రిపథగా దేవీ శంభుమౌళి విహారిణీ। జాహ్నవీ పాపహంత్రీచ మహాపాతక నాశినీ ॥ ౩ ॥ పతితోద్ధారిణీ స్రోతస్వతీ పరమవేగినీ। విష్ణుపాదాబ్జ సంభూతా విష్ణుదేహకృతాలయా ॥ ౪ ॥ స్వర్గాబ్ధినిలయా సాధ్వీ స్వర్ణదీసురనిమ్నగా। మందాకినీ మహావేగా స్వర్ణశృంగ ప్రభేదినీ ॥ ౫ ॥ దేవపూజ్యతమా దివ్యా దివ్యస్థాన నివాసినీ। సుచారు నీరరుచిరా మహాపర్వతభేదినీ ॥ ౬ ॥ భాగీరథీ భగవతీ మహామోక్ష ప్రదాయినీ। సింధుసంగగతా శుద్ధా రసాతల నివాసినీ ॥ ౭ ॥ మహాభోగా భోగవతీ సుభగానందదాయినీ। మహాపాపహరా పుణ్యా పరమాహ్లాదదాయినీ ॥ ౮ ॥ పార్వతీ శివపత్నీచ శివశీర్షగతాలయా। శంభోర్జటామధ్యగతా నిర్మలా నిర్మలాననా ॥ ౯ ॥ మహాకలుషహంత్రీచ జహ్నుపుత్రీ జగత్ప్రియా। త్రైలోక్య పావనీ పూర్ణా పూర్ణబ్రహ్మస్వరూపిణీ ॥ ౧౦ ॥

చారురూపిణియు, జగదంబికయు, లోకానుగ్రహకర్త్రియు, సర్వలోకదయాపరయు, యామ్యభీతిహరయు, తారయు, పారయు, సంసారతారిణియు, బ్రహ్మాండభేదినియు, బ్రహ్మకమండలుకృతాలయయు, సౌభాగ్యదాయినియు, పుంసాంనిర్వాణపద దాయినియు, అచిన్త్యచరితయు, చారురుచిరాతిమనోహరయు, మర్త్యస్థయు, మృత్యుభయఘ్నయు, స్వర్గమోక్షప్రదాయినియు, పాపాపహారిణియు, దూర చారిణియు, వీచిధారిణియు, కారుణ్యపూర్ణయు, కరుణామయియు, దురితనాశినియు, గిరిరాజసుతయు, గౌరియు, భగినియు, గిరిశప్రియయు, మేనకాగర్భసంభూతయు, మైనాకభగినీప్రియయు, ఆద్యయు, త్రిలోకజననియు, త్రైలోక్యపరిపాలినియు, తీర్థశ్రేష్ఠతమయు, శ్రేష్ఠయు, సర్వతీర్థమయియు, శుభయు, చతుర్వేదమయియు, సర్వయు, పితృసంతృప్తిదాయినియు, శివదయు, శివసాయుజ్యదాయినియు, శివవల్లభయు, తేజస్వినియు, త్రినయనయు, త్రిలోచనమనోరమయు, సప్త ధారయు, శతముఖయు, సగరాన్వయతారిణియు, మునిసేవ్యయు, మునినుతయు, జహ్నుజానుప్రభేదినియు, మకరస్థయు, సర్వగతయు, సర్వాశుభనివారిణియు, సుదృశ్యయు, చాక్షుషీతృప్తిదాయినియు, మకరాలయయు, సదానందమయియు, నిత్యానందదయు, నగపూజితయు, సర్వదేవాధిదేవ పరిపూజ్య పదాంబుజయు నను నామంబు లష్టోత్తరశతంబులు. ౩౪౫౧

క. ఉదయమున లేచి నిశ్చల-హృదయత నామాష్టశతము నెవఁడు పఠించున్,
సదమలపుణ్యాం బబ్బును,-గాదునయనం గనఁడు నాఁడు కోవిదవర్యా! ౩౪౫౨

తే. బ్రహ్మహత్యాదిఘోరపాపములు సైత
మణఁగు నీ స్తవము పఠింప నెవనికైన,

జగత్ప్రాజ్యతమా చారురూపిణీ జగదంబికా। లోకానుగ్రహకర్త్రీచ సర్వలోకదయాపరా॥౧౧॥ యామ్యభీతిహరా తారా పారా సంసారతారిణీ। బ్రహ్మాండభేదినీ బ్రహ్మకమండలుకృతాలయా ॥ ౧౨ ॥ సౌభాగ్యదాయినీ పుంసాం నిర్వాణపదదాయినీ। అచింత్యచరితా చారురుచిరాతి మనోహరా ॥ ౧౩ ॥ మర్త్యస్థా మృత్యుభయహా స్వర్గమోక్షప్రదాయినీ । పాపాపహారిణీ దూర చారిణీ వీచిధారిణీ ॥ ౧౪ ॥ కారుణ్యా పూర్ణా కరుణామయీ దురితనాశినీ। గిరిరాజసుతా గౌరీభగినీ గిరిశప్రియా ॥౧౫॥ మేనకాగర్భసంభూతా మైనాకి భగినీ ప్రియా। ఆద్యా త్రిలోకజననీ త్రైలోక్య పరిపాలినీ ॥ ౧౬ ॥ తీర్థశ్రేష్ఠతమా శ్రేష్ఠా సర్వతీర్థమయీ శుభా । చతుర్వేదమయీ సర్వా పితృ సంతృప్తిదాయినీ ॥ ౧౭ ॥ శివదా శివ సాయుజ్యదాయినీ శివవల్లభా । తేజస్వినీ త్రినయనా త్రిలోచన మనోరమా ॥ ౧౮ ॥ సప్తధారా శతముఖీ సగరాన్వయతారిణీ ॥ మునిసేవ్యా ముని నుతా జహ్నుజాను ప్రభేదినీ ॥ ౧౯ ॥ మకరస్థా సర్వగతా సర్వాశుభనివారిణీ । సుదృశ్యా చాక్షుషీ తృప్తిదాయినీ మకరాలయా ॥ ౨౦ ॥ సదానందమయీ నిత్యానందదా నగపూజితా । సర్వదేవాధిదేవైశ్చ పరిపూజ్య పదాంబుజా ॥ ౨౧ ॥ ఏతానిమునిశార్దూల నామానికథితానితే । శస్తాని జాహ్నవీదేవ్యాః సర్వపాప హరాణిచ ॥ ౨౨ ॥ ✓

నను పమంబగు నారోగ్య మబ్బు , సుఖము
గలుగు , దీన సందియ మించుకయును లేదు. ౩౪౫౩

క. నరుఁ డెందుఁ దానమాడిన-సరవిం గంగాష్టశతము సమ్యగ్భక్తిన్
బరమర్షీ! పఠియించిన-సరిగంగాస్నానఫలము సమకూఱు మునీ! ౩౪౫౪

తే. ప్రతిదినంబు గంగానామవరశతాష్ట-కముఁ బఠించినవాఁడు నిక్కముగ నంత
కాలమున గంగదరిఁ జేరఁగలఁడు,తుదిని-బరమపదమున కరుగునో సురమునీంద్ర!

సీ. గంగానదీస్నానకాలమందున భక్తియుక్తుఁడై యెవ్వఁ డీయురుఫలయుత
మగు శతాష్టకము సమ్యగ్రీతిని బఠించు నశ్వమేధసహస్ర మాచరించి
నట్టి ఫలం బొందు, నయుతగోదానఫలము నొందు నెవఁడు పంచమిఁ బఠించుఁ,
గార్తికపూర్ణిమఁ గడుజతనంబున సాగరసంగమస్థలమునందు

తే. స్నానమును చేసి నామాష్టశతము నియతిఁ-బఠనమును జేసినట్టియాపరమపుణ్యుఁ
డద్భుతముగ మహేశత్వ మంది వెలయు-సత్యముగ నారదా! యిందు శంక లేదు.

తే. తీర్థరాజమై వెలయు నబ్ధిని సమస్త-తీర్థమయి గంగ స్వయముగా ధృతి గలిసిన
యట్టి సాగరసంగమ మనెడి తీర్థ-మునకు సరిలేదు జగముల మునివరేణ్య!

తే. జాహ్నవీతీర్థమున మృతి జలమునందు-సంభవించిన ముక్తి నిస్సంశయముగఁ
గలుగు, వారాణసిని ముక్తిస్థలమునందుఁ-గాని జలమున నే మృతిఁ గనినఁ గలుగు.

ఉ. జ్ఞానముచేతఁగాని, మది జ్ఞానములేక యెకాని, జ్ఞాన సూ
మౌనివరేణ్య! కల్పితము మాధవపాదసరోజసంభవా
నూనజలాన దేహము మహోన్నతరీతిఁ ద్యజించినట్టి వి
జ్ఞానికి ముక్తి నిక్కముగఁ గల్గును, నమ్ము మహర్షి! నారదా! ౩౪౫౯

సీ. మునినాథ! నారదా! భుక్తిముక్తిప్రద, సర్వార్థసాధని, సర్వతీర్థ
సమధిక, లోకనిస్తారకారిణి, నీరమయి, యాదిశక్తి, శుంభత్ప్రభావ,
బ్రహ్మవిద్యాప్రద, పరమేశ్వరి, సమస్తజీవనాధార, సంభావనాఢ్య,
మూలప్రకృతి, యవిద్యాలయకారిణి యగు గంగ నరులకు ననవరతము,

ఆ. మదిఁ దలంచి భక్తి మనుజుండు సత్వర-మున సమాశ్రయింపఁబోలు, మృత్యు
దేవతాగృహీతజీవితుఁడుగ దేహ-మరయఁ జంచలం బటంచు నమ్మి. ౩౪౬౦

ఆ. అతిరహస్యమయి మహాపాతకవినాశ-కంబు నయి సుపావనంబు నైన
గంగమహిమ నీకుఁ గడుఁబూన్కిఁ దెలిపిన-వాఁడ మౌనివంద్య! భవ్యచరిత!

క. మునివర! యెవఁ డీగంగా-ఘనచరితముఁ జదువు భక్తికలితుఁడగుచు నా
మనుజుఁడు దేవీస్థానం-బునఁ గడుమహిమాన్వితుఁడయి పొందు సుఖంబుల్.

క. ఉత్తమమగు గంగావిభ-వాత్తచరిత్రంబు నెవ్వఁ డవనిఁ జదువు నం
దత్తతి సమస్తతీర్థో-దాత్త యగుచు గంగ యుండుఁ దా నాసక్తిన్. ౩౮౬౩

తే. ఈచరిత్రంబును బఠింతు రెచట, నందుఁ
జేయు కావ్యంబు లెల్ల నమేయమహిమ
నక్షయములయి దీపించు నఖిలభువన
సముదయంబుల నిజముగా సంయమీంద్ర! ౩౮౬౪

క. నరుఁ డెవఁడు భక్తి గంగా-చరితము భావించు మరణసమయమునందున్
బరమగతి కరుగు, మృత్యువు-పరికింపఁగ లేదు వాని భయమున నెపుడున్.

సీ. ఏకాదశిని భక్తి నెద నిల్పి స్నానంబుఁ గావించి బిల్వవృక్షముసమీప
మందైనఁ దులసీమహావృక్షసాన్నిధ్యమందైనఁ గూర్చుండి యథ్వారీతి
నుపవాసమును జేసి యురుమహిమాస్పదంబైన యీ గంగామహాచరిత్ర
మును బఠించినవాఁడు మోక్షంబు నొందును, సత్యంబు సత్యంబు సంయమీంద్ర!

తే. శ్రాద్ధదినమందు విప్రుల సన్నిధి నెవఁ-డీచరిత్రంబును బఠించు, హృష్టులగుచు
వాని పితరులు శాశ్వతభద్రలోక-ముల వసింతురు సుఖులయి మునివరేణ్య!

ఆ. అవని నేవాఁడు మహాష్టమి గంగాచ-రిత్ర మిద్ది చదువుఁ, జిత్రముగను
వాఁడు దేవికరుణ వైభవంబులఁ బొందు-చుండు సంతతము మహోన్నతముగ.

ఉ. నారద! యీచరిత్రము ఘనంబగు సత్ఫల మిచ్చు విన్నచో
నేరికినైన, నిట్టికృతి యెయ్యది లోకమునందు సాటిలే,
దారయఁ బుణ్యదంబు, వితతాఘనికృంతన మౌను, ముక్తి చే
కూరును విన్నవారికి నకుంఠితమై చరితం బిదెంతయున్ ౩౮౬౮

తొంబదియాఱవ అధ్యాయము

కామరూపతీర్థమాహాత్మ్యము

సీ. శ్రీమహాదేవుని స్థిరభక్తియుక్తుఁడై కనుఁగొని నారదమునివరుండు
పలికె "నో దేవదేవా! జగన్నాయక! త్వత్కృపచేత నత్యంతపావ
నాత్మక నిరుపమానాకృతి యైన గంగానదీమాహాత్మ్య కలితచరిత
మంతయు విన్నాఁడ, నతిపవిత్రుఁడ నైతి, సందేహములు తీఱె, జని ఫలించె,

తే. కామరూపాఖ్యతీర్థంబు గల, దది కడు
మహిమ వెలయు నటంచు నిమ్మహి వచించి
నాఁడ, వద్దాని దయయుంచి వర్ణనంబు
చేయుమా! ప్రార్థనంబును జేయువాఁడ." ౩౮౬౯

చ. వినయము మీఱ నారదుఁడు విన్నప మీక్రియ నాచరింపఁగా,
మనమున మోదమొందుచు నుమాపతి యమ్మునితోడ నిట్లు ప
ల్కెను "విను నారదా! వితతకీర్తి వెలింగెడు కామరూపస
ద్వినుతసుతీర్థవైభవము వీనుల వింటుగ శ్రద్ధ మీఱఁగన్. ౩౮౭౦

క. పరమేష్ఠిప్రముఖామర-వరులును గంధర్వవరులుఁ బ్రతిదినము తగన్
నిరుపమభక్త్యతిశయులై-వరుసన్ సేవింతు రెం దపారాసక్తిన్. ౩౮౭౧

తే. యోనిరూపయై నిజలీలచే నవని హి
తార్థమై పరమేశ్వరి యాద్య పూర్ణ
యా మహామాయ యెచ్చోట నతిముదమున
వాసమును జేయుచుండుఁ బ్రభావయుక్తి ౩౮౭౨

తే. బ్రహ్మవిష్ణుమహేశ్వరు ల్పరమభక్తి
యుక్తులయి వాంఛలను బొంద నూహచేసి,
యెందుఁ దపమును గావించి రీశ్వరికృప
నుల్లముల నెంచి భావించి యుత్సుకులయి. ౩౮౭౩

తే. మును వసిష్ఠమునీంద్రుం డు పూర్ణభక్తి-నెందు మంత్రపురశ్చర్య నిద్ధరీతిఁ
జేసి తా సిద్ధమంత్రుఁడై సృష్టికర్త-యయ్యె నద్భుతముగ లోకమందు వేడ్క.

సీ. అవ్యాహతాజ్ఞల నలగుచుండెడు సిద్ధదేవర్షితతు లెందు భావములను
భక్తిసంయుక్తులై ప్రార్థించి కామాఖ్య వెలుఁగొందునట్టి దేవీప్రసాద
మున మహామంత్రంబులను జపంబొనరించి మంత్రసిద్ధిని బొంది మహిమ మీఱి
ఖేచరత్వంబును గీర్తనీయంబగు దేవాధిపూజ్యత్వదివ్యపదవి
తే. యును నెసంగఁగఁ గొని రెందు, యోనిరూప
మున సుగుప్తాకృతిని దేవి పొదలుచుండు ,
మనుజుఁ డెవఁ డందు దేవిని గని స్పృశించి
యర్చఁ గావించు, ముక్తుఁడౌ నమరమాని! ౩౮౭౪

సీ. కామాఖ్యఁ బూజించు ఘనుఁడుతత్స్థలమందు శ్రీకంఠసదృశుఁడై చెలఁగుచుండు,
నేమంబు మీఱంగ నిగ్రహానుగ్రహముల నొనరించు విబుధులకైన
నింద్రాదులును వాని యిచ్చఁ జరింతురు, మునినాథ! వానికి భువనతతుల
నరయ నసాధ్య మెయ్యదియును గలుగదు, యోనిమండలమున కుద్యతుఁడయి
ఆ. యరిగి, పరమభక్తి నందున్న త్రిపురభై-రవికి మ్రొక్కు నెవఁడు సువిశదాత్ముఁ
డగుచు, వాని జనిమె యగు సఫలంబునా-సకలలోకములను సంయమీంద్ర!

క. ఓనారద! బ్రహ్మఘ్నుం-డేని నియతి నచటి కేగు నెంతయు నపుడే
పూనికఁ గామాఖ్యాది-వ్యానూనకృపన్ విముక్తుఁ డగు నిక్కముగన్. ౩౪౭౭

క. కామాఖ్యాతీర్థదర్శన-మోమునీ! దుర్లభము సురవరోత్తములకునే,
నీమహి దర్శించినవాఁ-డాముఖ్యస్థలము దేవతార్చార్హుఁ డగున్. ౩౪౭౮

తే. వేయిజన్మాలనుండి తాఁ జేయఁ బెరిగి
నట్టి యఘపుంజమెల్లను నపుడె భస్మ
మగును వసుమతిఁ గామాఖ్య యనఁగ వెలయు
నట్టి క్షేత్రంబు దర్శింప నమరమౌని! ౩౪౭౯

సీ. ఓవత్స! యీక్షేత్రపావనమహిమంబు గోపనీయముసుమ్ము, కువలయమునఁ
బ్రకటింపఁగారాదు, సకలతీర్థములుఁ గామాఖ్యాతీర్థమునకు నర్వామైన
యవి గా వనుచుఁ జెప్పనగు, నారదా! యంగపాతము ప్రత్యంగపాతమునను
నైన నచ్చోటఁ బుణ్యంబు సంప్రాప్తించు భరతఖండంబున నరులకెల్ల;
తే. నరయఁ గామాఖ్యతీర్థంబె యఘహరంబు,
భగవతికి నంగముల యోని యగును శ్రేష్ఠ,
మక్కతంబున దేవి యోన్యాకృతి యయి
సకలవనితలఁ జెలువొందు సంయమీంద్ర! ౩౪౮౦

తే. ఎచట నాయోని పడినదో యచట దేవి-తాను బరమేశ్వరి వసించుఁ బూని ప్రీతి,
దానికి సమానమైనట్టి తావు లేదు,-ధరణి వెదకినఁ గడుఁ బుణ్యదమగు నెలవు.

క. కాశీక్షేత్రంబున వి-శ్వేశుఁడు మనుజులకు ముక్తి నిచ్చుచునుండున్,
బ్రాశస్త్యంబున సిద్ధగ-ణేశవిబుధరాజుసాదు తెలిమి భజింపన్. ౩౪౮౧

తే. ముక్తిదాయకుఁ డైనట్టి భూతనాథుఁ-డీశ్వరుఁడు ముక్తిఁ గోరుచు నెదఁ బ్రతిదిన
మచటి కరుదెంచి యీశ్వరి నర్చ సేయు,-నరయ నాక్షేత్రమునకంటె నధిక మేది?

తే. ఎవఁడు శ్రీయోనిమండల మిద్ధభక్తిఁ
జేయును బ్రదక్షిణము, వాఁ డమేయమహిమఁ
బూర్ణముగ మూఁడులోకము ల్వాన్కిఁ దాఁ బ్ర
దక్షిణమొనర్చినట్టి డౌఁ దాపసేంద్ర! ౩౪౮౨

క. కామాఖ్యానిర్మాల్యము-నేమనుజుఁడు దాల్చుఁ దల, మహేశ్వరతుల్యుం
డై మన్ననఁ గను దివిజ-స్తోమముచే సతత మతఁడు సురమునినాథా! ౩౪౮౩

తే. వానిఁ గాంచినవెంటనే భయముఁ బొంది
భయదములు పాఱిపోవు, నిశ్చయము, దేవ!

మానినాయక! వానికి క్ష్మాతలమున
భీతి యనునది యుండ దేరీతిఁ గనిన. ౩౪౮౬

సీ. దేవీప్రసాదంబు నేవాఁ డొసంగిన ననుభవింపఁగ నగు నాత్మయందు;
నేవిచారము చేయ కేవేళనైనను మునినాథ! యయ్యది పూజ్యమనుచు
నుత్తమవర్ణుఁడై యొప్పినవాఁడేని న్యూనవర్ణుఁడు తెచ్చి యొసఁగినట్టి
దేవీప్రసాదంబు భావించి కడుభక్తి శిరమును వంచి విశిష్టవినయ
తే. వంతుఁడై కొని భక్షింప వాఁడు భూత
లమునఁ గడు భాగ్యవంతుఁడై యమితభోగ
ముల ననుభవించి, తత్కృపాపూర్ణమహిమ
నొందు శాశ్వతకైవల్య మొగి మునీంద్ర! ౩౪౮౭

క. పితరుల ముక్తిం గోరుచు-క్షితిఁ గామాఖ్య విలసిల్లు క్షేత్రంబున స
మ్మతి శ్రాద్ధం బొనరించిన-నతులగయాశ్రాద్ధఫలము నందు నిజముగన్.

సీ. ప్రయతుఁడై లౌహిత్యపరమతీర్థంబున స్నానంబు గావించి సాధకోత్త
ముఁడు పురశ్చర్యను బూనికతోఁ జేయ సిద్ధమంత్రుండయి చెలఁగు, నిక్క,
మవ్యాహతాజ్ఞుఁడై యాదిశంభుం డీతఁ డనఁగా మహిమ మీఱు ననవరతము,
భూచరుండయ్యును ఖేచరత్వముఁ బొందుఁ దత్ప్రసాదంబునఁ దాపసేంద్ర!
తే. యాస్థలంబున సమయాదు లాత్మ నెన్నఁ
జనదు, ముగ్ధాత్ముఁడై పురశ్చర్యఁ గొఱకు
మంత్రవిత్తముఁ డట్లైన్ని మానినాథ!
నిరయ మొందును, నిందు సందియము లేదు. ౩౪౮౯

ఉ. ఈమహనీయతీర్థమున నెవ్వఁడు భైరవిమంత్ర మాత్మలో
నేమముతో జపించును మునిప్రవరా! విబుధత్వమేని, సు
త్రామపదత్వమేనియు, విధాతృపదత్వము, శంకరత్వమే
నామధుసూదనత్వమును నచ్చెరువొందఁగఁ బొందు లీలతోన్. ౩౪౯౦

తే. వాఁడు తలఁచిన కార్యనివహము లెల్ల-నశ్రమంబుగ సఫలంబు లయి వెలుంగు,
నెట్టివేళల వానికి నెందుఁగాని-యసులభంబగు నదియె లే దార్యచరిత!

తే. పరశురాముఁడు జమదగ్నివరసుతుండు-కార్తవీర్యునిఁ జంపఁగాఁ గాంక్ష చేసి
యిందుఁ జేసి పురశ్చర్య సిద్ధరీతి-నొందెఁ బ్రత్యక్షవిష్ణుత్వ మోమునీంద్ర! ౩౪౯౧

క. ఈవిధమున నెందఱో భువి-నీవరపుణ్యస్థలమున నిష్ఠాపరులన్
భావించి పురశ్చర్యను-గావించి యఖండసిద్ధిఁ గాంచిరి మౌనీ! ౩౪౯౩

తే. ఇచ్చఁ గోరిన కోరిక లెల్ల నిచట
సిద్ధిఁ బొందుటయే కాదు క్షితిసుఖముల
నధికముగఁ బొంది తుది మోక్ష మంది యందు
విభవములఁ బొంగుచుందురు వేడ్క లెసఁగ. ౩౮౯౮

సీ. కామాఖ్యయే చూడ ఘనమగు తీర్థంబు, కామాఖ్యయే యెందు ఘనతపంబు,
కామాఖ్యతీర్థమే ఘనమగు ధర్మంబు, కామాఖ్యతీర్థమే ఘనమగు గతి,
కామాఖ్యతీర్థమే ఘనమగు విత్తంబు, కామాఖ్యతీర్థమే ఘనపదంబు,
కామాఖ్యతీర్థమే కడు నుత్తమోత్తమంబని యెంచువారి కియ్యవనియందు

తే. మరల జన్మంబు గలుగదు మౌనివర్య!-బహుసహస్రజన్మాంతరపరమసుకృత
సంచితమహత్త్వమున నె యీసకలఫలద-మయిన క్షేత్రంబు దర్శింప నర్హతగను.

తే. దేవలోకంబు దర్శింపఁగా వశమగు-నేరికైనను సులభత నెంచిచూడ,
దేవతోత్తములకునైన దివ్యదృష్టిఁ-గామరూపతీర్థము గనంగా నలవియె?''

తెబ్బదియేడవ అధ్యాయము

విద్యాదశకము - శ్రీ విద్యోపాసనము

తే. ఈవిధమున మహాదేవుఁ డిద్ధచరితుఁ-డధికవాత్సల్యమునఁ దెల్ప నపుడు నార
దమునిచంద్రుండు ప్రశ్నించె దైవవినుతు-నమ్మహాదేవుఁ గాంచి ''మహానుభావ!

తే. దేవదేవా! యెఱింగితిఁ దావకీన-వరకరుణఁ గామరూపవైభవము నెల్ల,
నామహాక్షేత్రమునకు విద్యాదశకము-నందు నేవిద్యయీశ్వరి యగుఁ దెలుపవె.''

క. వినయమున నారదుం డి-ట్లనుపమభక్తియుతుఁ డగుచు నడుగ మహేశుం
డనువున నావృత్తాంతం-బును దెల్పం దొడఁగె మోదమున నతితృప్తిన్.

క. ''మునినాథా! దశవిద్యలు-మనుసాధకహితము గోరి మనుజపపూజా
వినుతఫలప్రదములుగాఁ-గను క్షేత్రమునందె యుండుఁ గన సతతంబున్.

క. కామాఖ్యయైన కాళిక-యే ముఖ్యముగా వసించు నెలవి నచటఁ; ద
ద్ధామమునకుఁ బార్శ్వంబుల-నో మునీ! నవవిద్య లుండు నురుసంతృప్తిన్.

తే. సర్వవిద్యాత్మికాకాళి సంయమీంద్ర!
వినుము కామాఖ్య యన నుంగు విశ్రుతముగ,
దానఁ గాళీమహాదేవి ధ్యానపూజ
నముల కధిదైవతముగ నొసర్పవలయు. ౩౯౦౭

క. తన కిష్టమైన మంత్రం-బును భక్తిని జపముచేయఁబోలును, గాళీ
ఘనకరుణఁ గామరూపా-ఖ్యనివాసమునందు మంత్రి గాంచును సిద్ధిన్. ౩౫౦౩

వ. పరమేశ్వరియుఁ బరాత్పరయుఁ గామాఖ్యయు నగు కాళికాదేవిని ధ్యానింపఁ దగిన క్రమంబుఁ జెప్పెద, నవహితమతివై యాలకింపుము. రక్తవస్త్రపరీధానయు, భీమనేత్రత్రయోద్దీప్తయుఁ, జతుర్భుజయు, భీమదంష్ట్రాకరాళయు, నతిఘోరకల్పాంతకాలాంబుదద్యుతియు, రత్నసింహాసనోపరిసింహప్రేతాంబుజస్థితయునుగా భావింపవలయు. హరి సింహంబును, శవము శంభుండును, కమలరూపధారి బ్రహ్మయునుగా నెఱుంగుము. మఱియు లలజ్జిహ్వాయు, మహాఘోరాకృతియుఁ, గనకకిరీటోజ్జ్వలయు, మహార్ఘరత్నమాణిక్యవిరచితభూషణశ్రేష్ఠయు, స్వలంకృతయు, జగద్ధాత్రియు, సృష్టిస్థిత్యంతకారిణియుఁగా ధ్యానింపవలయు. సాధకుఁడు మహాపీఠస్థానంబునకు వామభాగంబునఁ దారాభగవతియు, దక్షిణంబున భువనేశ్వరియు, నాగ్నేయంబున షోడశీవిద్యయు, నైరృతిభాగంబున భైరవియు, వాయవ్యంబున ఛిన్నమస్తయుఁ, బృష్ఠభాగంబున బగళాముఖియు, నీశాన్యంబున సుందరీవిద్యయు, నూర్ధ్వభాగంబున మాతంగనాయికయు, యామ్యంబున ధూమావతీ విద్యయుఁగా నవవిద్యలను బరమభక్తి ధ్యానింపవలయు. ౩౫౦౪

క. మునినాథ! యధోభాగం-బున భస్మాచలమయుండు భూతేశుఁడు స
న్మునిజనవంద్యుఁడు శంకరు-ననుపము ధ్యానింపవలయు నమరమునీంద్రా!

తే. సకలశక్త్యన్వితు లయి నిచ్చలుఁ బితామ
హుండు విష్ణుండు మున్నుగా నొగిఁ జెలంగు
దేవతలు లోకదుర్లభమై వెలుంగు
పీఠపరిసరమున నుంద్రు వితతభక్తి. ౩౫౦౬

సీ. అట్టి మహాస్థలంబందు దేవిని బరివారాన్వితను గడు భక్తితోడ
విభవానుసారము వివిధోపచారపూజనముల నర్చింపఁజను మునీంద్ర!
యాత్మదేవీతృప్తి నభిలషించుచు నియమంబునఁ బూజించు మానవునకు
సంయమీంద్రా! పునర్జన్మసందేహంబుగలుగదు నిక్కంబుగను వసుమతి,
తే. భక్తిభావంబునను బిల్వపత్ర మెవఁడు-దేవి కర్పించు, నాతండు దేవమాని!
సకలలోకేశ్వరుండైన శంకరుండె-యనుచు నెఱుఁగంగవలయు సత్యముగ మదిని.

సీ. స్థావరజంగమాత్మకమగు జగమెల్ల నగు బ్రహ్మవిష్ణుశివాత్మకంబు,
మూర్తిత్రయాత్మకముగ బిల్వపత్రంబు త్రిదళయుతంబయి తేజరిల్లు
ననుచు నెఱుంగనౌ నంతరంగంబున, నట్టి మహామహిమాఢ్యమయిన
బిల్వపత్రంబును బ్రీతితోఁ బూర్ణయా దేవికి నర్పించు ధీయుతుండు

తే. సకలభువనంబు దానముసలిపినట్టి
ఫలము నొందును, వాంఛ లీవసుధ నిండు,
ముదముఁ బొందును, జన్మంబు పూర్ణతగను,
మరల జన్మింపఁ డెందు నీక్షేత్రస్థలమున. ౩౫౦౮

ఉ. ఎవ్వఁడు బిల్వపత్రముల నీశ్వరు భస్మశిలోచ్చయాత్మకున్
మవ్వపుభక్తి మీఱఁగ సమర్చనముంబొనరించు, వాఁడు లో
నెవ్వగలం దొలంగి భువి నిచ్చలు భోగము లంది, యంతమం
దవ్వరముక్తిఁ గైకొను మహామతి! నారద! దేవపూజ్యుఁడై. ౩౫౦౯

తే. శైవుఁడైన వైష్ణవుఁడైన శాక్తుఁడయిన
సతము రుద్రాక్షధారియై సలుప జపము
కర్మపుంజంబు లెల్ల నిక్కముగఁ బుణ్య
తమము లయి కీర్తి కెక్కు నోతాపసేంద్ర! ౩౫౧౦

క. రుద్రాక్షధారియై యట-రుద్రుని సంహారకరు విరూపాక్షుని ను
న్నిద్రుఁడయి పూజచేసిన-రుద్రత్వము నొందు వాఁడు ద్రువమె నిజముగన్.

సీ. అమవసయందైన నష్టమియందైన నవమీచతుర్దశీప్రవిమలతిథు
లందైన నీక్షేత్రమందుఁ బ్రదోషమునను భక్తియుక్తుఁడై యనువుమీఱ
సాహసవంతుఁడై సాధ్వసంబును వీడి భైరవీమంత్రంబు భక్తితోడ
జపియించువానికి సాక్షాత్కరించును సంతృప్తినొంది, నిశ్శంకతోడ

తే. నాత్మసంరక్షణార్థమై యభిమత మను
సిద్ధికై మది దేవీప్రసిద్ధకవచ
మును బఠింపఁగ నగు, దాన మునివరేణ్య!
యించుకయు భీతి గలుగదు హృదయమందు.'' ౩౫౧౨

మహాకామాఖ్యాకవచము

చ. అనుటయు నారదుండు వినయంబున మ్రొక్కుచు భక్తి దేవదే
వునిఁ గని ''దేవ! యెట్టిదయి పొల్చును దత్కవచంబు? నన్నుఁ బా
వనునిగఁ జేయఁ దెల్పుము ప్రభావయుతంబుగ నంతయున్ శ్రితా
వన!'' యని వేఁడ నప్డు తెలుపందొడఁగెన్ శివుఁ డంతఁ బ్రీతుఁడై. ౩౫౧౩

తే. ''వినుము సురమునివర! నీకు విశదముగను
దెలుపుచున్నాఁడఁ గామాఖ్య వెలయు నాది
భగవతీదివ్యకవచంబు పరమమంగ
ళాస్పదం బవహితమతి వయి సుఖముగ. ౩౫౧౪

క. ఈవరకవచస్మరణము-చే విఘ్నము లుప్పతిల్లఁజేయు సకలదు
ర్భావాసురగణములు భీ-త్యావిలమానసము లగుచు నపుడె తొలంగున్.

తే. యోగినీడాకినీగణపూగ మెల్ల-దూరముగఁ బాఱు మునినాథ! స్తుత్యమయిన
యీకవచసంస్మరణమాత్రమే భయాకు-లితచలితహృదయంబుగా నతిద్రుతగతి.

క. కవచప్రసాదమున నీ-భువి విఘ్నము లడఁగు, మఱియు భూరిక్షుధయున్
దవులదు, నిద్రయు డప్పియు-నవలంబాఱును స్మరించు నార్యునిఁ గన్నన్.

ఉ. ఈకవచంబు నేమనుజుఁడేని పఠించిన భక్తియుక్తుఁడై
ప్రాకటసిద్ధిఁ బొందు, మనువర్యము లెవ్వి జపించినన్, నిజా
స్తోకమహానుభావమున శోభితుఁడౌ, నొగి హోమతంత్రముల్
చేకుఱు సంయమీంద్ర! ఫలసిద్ధుల నెంతయు మీఱి నిచ్చలున్. ౩౫౧౮

కవచప్రారంభము

సీ. ప్రాగ్దిక్కునందుఁ దారాదేవి శ్రీకామరూపనివాసిని ప్రోచుఁగాక!
యాగ్నేయభాగంబునందు షోడశి గాచు, యామ్యభాగంబున నరయుచుండు
ధూమావతీదేవి, నేమంబునను నైరృతిని భైరవీదేవి మనుచుఁగాక!
పడమటిదిక్కునఁ బాలించు భువనేశ్వరియు, వాయుదిశయందుఁ బ్రీతి ఛిన్న
తే. మస్త చూచు, నుత్తరమున మహితచరిత
యైన బగళాముఖీదేవి యనిశ మవన
మొనరుచును, నీశు భాగమం దుత్సుకత్వ
మున మహాత్రిపురాంబిక మనుచుఁగాక! ౩౫౧౯

తే. ఊర్ధ్వభాగంబునందు విశ్వోత్తమయగు-పీఠవాసిని మాతంగి పెంచుఁగాక!
సతత మంతటఁ గామాఖ్య జగతి వెలయు-కాళికాదేవి ప్రోచును గరుణతోడ.

సీ. సర్వవిద్యామయి సప్తరూపిణి మహావిద్య శిరంబున వెలసి ప్రోచు,
ఫాలభాగంబున భవగేహిని యనంగఁ బ్రథితయౌ దుర్గ సంరక్ష సేయు,
భ్రూయుగంబునను ద్రిపురరక్షణ మొనర్చు, నాసిక శర్వాణి యాసఁ జూచుఁ,
జక్షువులను గాచుఁ జండిక, చెవులను నీలసరస్వతి లీలఁ బెంచు,
తే. ముఖము సౌమ్యముఖీదేవి ముదముతోడ
నరయుఁ, గంఠంబుఁ బార్వతి నిరతిఁ బెనుచు,
జిహ్వ జిహ్వాలలన భీషణాహ్వయ తమి
నందిఁ గాపాడుఁగావుత మనవరతము! ౩౫౨౧

తే. వదనమును బ్రోచు వాగ్దేవి ముదముతోడ,-నెనసి వక్షంబు రక్షించు నెప్పు డామ
హేశ్వరీదేవి, బాహువు లేపుమీఱ-శ్రీమహాభుజ సతము రక్షించుఁగాక!

క. కరములఁ గల ౘ్రేళ్ళ మహే-శ్వరి ప్రోచునుగాక! పృష్ఠభాగము భీమా
స్య రహిం గాపాడు, దిగం-బరి కటి రక్షించుఁగాక! పరమప్రీతిన్. ౩౫౨౩

క. ఉదరము సతము మహోదరి-సదయత రక్షించుఁగాక! జంఘోరువులన్
మది నుగ్రతార యనఁగాఁ-బొదలు మహాదేవి ప్రీతిఁ బ్రోచునుగాతన్! ౩౫౨౪

క. గుదముష్క-మేఢ్రనాభులఁ-బదిలముగాఁ బ్రోచుఁగాక! పావనవినయతిన్
గుదురుగ సురసుందరి యా-పద లెల్లను దొలఁగఁద్రోచి వడి సతతంబున్.

తే. వదుసఁ బాదాంగుళులను భవాని త్రిదశ-నాయిక సతంబుఁ గాచు నమేయకరుణ,
రక్తమాంసాస్థిమజ్జాదిప్రథితధాతు-వుల శవాసన ప్రోచు నత్యలఘురీతి. ౩౫౨౬

సీ. అత్యంతఘోరంబులైన భయంబుల నమ్మహామాయ కామాఖ్యపీఠ
వాస్తవ్య క్రూర సమస్తమహాభయవారిణి వారించు భూరికరుణ,
భస్మాద్రిగతదివ్యవరమహాసింహాసనాలయ యగు మహాకాళికాంబ
యురుదయతో సమస్తోపద్రవంబులఁ బోఁగొట్టి సతతంబుఁ బ్రోచుఁగాక!

తే. రక్షణాం బేడియును లేక యీక్షితి నెటఁ-గవచపరివర్జితంబగుఁ గడక నచట
సర్వరక్షణకారిణి సర్వరూప-ములను రక్షించుఁగాక! నిస్తులమనీష. ౩౫౨౭

క. ఇది కామాఖ్యాకవచము-కుదురు సకలరక్షణములఁ గూర్పఁగ, గోప్యం
బెద నెఱుఁగవలయు, నీకో-సదమలమతి! తెల్పినాఁడ సాధుమనీషన్. ౩౫౨౮

క. ఈ వరకవచంబున ర-క్షావిధి గావించెనేని సాధకుఁ, డతిభీ
త్యావహమంత్రవిరోధము-లా వివిధోపద్రవంబు లంటఁగ నోడున్. ౩౫౨౯

ఉ. ఈమహనీయమా కవచ మెవ్వఁడు కంఠమునందుఁగాని తా
నేమముతోడ బాహువున నిచ్చలుఁ దాల్చును భక్తి, వానికిన్
గామితము ల్ఫలించు నొడికంబుగ, విఘ్నములెల్లఁ బాయు, ని
స్సీమమహాప్రభావమునఁ జెందును సిద్ధి యసంశయంబుగన్. ౩౫౩౦

సీ. ఈమహాకవచంబు నెవ్వాఁడు నియతితోఁ బఠియించు సతము సద్భక్తియుక్తి,
నవ్యాహతాజ్ఞుఁడై యన్ని విద్యలయందు సంపూర్ణపాండితీచతురుఁ డగును,
సకలదేశములందు సకలకాలంబుల సౌఖ్యంబు శుభము నిశ్శంకతఁ గను,
ననుదినంబును వాని కగు శోభనంబు లీయద్భుతకవచంబు నంతరంగ

తే. మందు నిశ్చలుఁడై దేవి ననువుమీఱ-నిలిపి చదివినఁ గాళికానిలయమునకుఁ
జనును, సత్యంబు సత్యంబు సత్యమనుచు-విశ్వసింపుము నారదా! విబుధమాని!

దెబ్బదియెనిమిదవ అధ్యాయము

యోనిపీఠమాహాత్మ్యము

సీ. మునినాథ! వైశాఖమునఁ దృతీయాతిథిఁ గామాఖ్య నెసఁగు నీశాళికాని
వాసస్థలంబున భక్తితోఁ జండికఁ బూజించి మనుజపంబును నొనర్పఁ
గాఁ గోటిగుణితమై ఘనఫలం బొసఁగును, నమితపుణ్యం బబ్బు, నవని మరల
జన్మంబు లేకుండు, సంయమీంద్రా! శివరాత్రి చతుర్దశి ప్రథితభక్తి
తే. సర్వతీర్థస్వరూపమై సర్వదేవ
తాతిదుర్లభమైన యీ స్థలమునందు
నుపవసించి శంకరు పూజ నొనరుపఁ బ్రతి
యామమందుఁ బునర్జన్మ మందఁ డెవఁడు. ౩౫౩౨

తే. పరమభక్తితోడ నరుఁ డెవ్వఁ డందున్న-నన్ను నియతిఁ బూజనం బొనర్చ,
వాజియజ్ఞశతము వరుసఁ గావించిన-దివ్యపుణ్య మొందు దేవమౌని! ౩౫౩౩

క. వారాణసి స్నానాదు ల-పారముగ నొనర్పఁ గలుగు వరపుణ్యముఁ దా
గారవమునఁ బొందు నిటఁ-జేరి యొకదినంబు పూజచేసిన నన్నున్. ౩౫౩౪

తే. వినుము గోకోటిశతశతంబును విధియుత
ముగఁ గురుక్షేత్రమున దానమును ద్విజులకు
నిచ్చినట్టి పుణ్యముకంటె నెక్కుడయిన
ఫలము గల్గు నిటఁ దను భక్తిఁ గొలువ. ౩౫౩౫

సీ. భక్తితో నొక బిల్వపత్రంబు నాకు నొసంగిన ముక్తుఁడౌ సత్యముగను,
శంకింపఁ బనిలేదు సంయమీంద్రా! స్వర్ణపుష్పసహస్రముల్ భూరిమణివి
రచితసుమములు వజ్రవినిర్మితప్రసూనములు ననర్ఘ్యరత్నకుసుమములు
బిల్వపత్రముకీతిఁ బ్రీతి నొసంగవు, బిల్వపత్రమె నాకుఁ బ్రియము సుమ్ము!
తే. భువనశంకరు శంకరు పూజనమ్ము-బిల్వమూలమునం జేయ విబుధనాథ
పదవి గల్గును,విచ్యుతిఁ బడయఁబోదు-నారదా! ధ్రువ మిది యని నమ్ము మాత్మ.

క. నివసించును సర్వోత్తమ-మవు తీర్థము బిల్వమూలమందు సతంబున్,
శివు నటఁ బూజించినఁ బా-పవిసరము లడంగుఁ దత్త్వభావనచతురా!

తే. సకలలోకేశ్వరేశుండు శంకరుండు-తానె లోకహితం బెదఁ దలఁచి బ్రహ్మ
రూపమున విలసిల్లును రుద్రమూర్తి-యవని బిల్వమూలంబున నతిముదమున.

క. ఈవిధమునఁ బుణ్యంబై-పావనమై బిల్వతరువు వసుమతి వెలసెన్
దేవమునీ! పాతకహర-ణావశ్యక మగుచు మిగుల నద్భుతరీతిన్. ౩౫౩౭

సీ. పరమమునీంద్ర! బిల్వద్రుమమూలంబు సర్వతీర్థోత్తమస్థాన మగును;
గాశియు గంగయు గయయుఁ బ్రయాగయు శ్రీసరస్వతి కురుక్షేత్రవసతి
యమునాసరస్వతు ల్విమలగోదావరి నర్మదయును మఱి శర్మదంబు
లయినట్టి తీర్థంబు లఖిలంబులును సంతతము సన్నిహితములై యమరమాని!
తే. బిల్వమూలంబునం దుండుఁ బ్రీతితోడ,
నందు దైవపైతృకకర్మ లాగమోక్త
సరణిఁ గావింప నవ్వి యక్షయ్యము లగుఁ
గోటిజన్మంబులందు నిక్కువము సుమ్ము. ౩౫౪౦

క. నరుఁ డెవ్వఁడు బిల్వద్రుమ-వరమూలంబునఁ ద్యజించు వడి దేహము, న
ప్పరమేష్ఠ్యాదులు పొందని-పరమపదము సౌఖ్య మొందు భద్రాన్వితుఁడై.

సీ. ఈవిధంబున సుకృతేడ్యమై బిల్వవృక్షంబు శస్తములం బ్రశస్తి కెక్కు,
శంభునకుం బ్రీతి సంధిల్లఁగాఁ జేయుఁ, గావునఁ దత్పత్రకముల మూఁట
నీశాను నర్చించు నెవ్వఁడు, బంధనములనుండి యెంతయు ముక్తుఁ డగును,
శ్రీఫలంబు మహేశచిత్తప్రమోదకరంబయి వెలయు నారదమునీంద్ర!
తే. మనుజుఁ డీశ్వరునకు బిల్వఘనఫలంబు
నొసఁగి యపుడె మహాపుణ్య మొందు, శివున
కెందునే బిల్వపత్రాదు లిచ్చుఁ బ్రీతి,
నధికసంప్రీతి నొసఁగుఁ గామాఖ్యయందు. ౩౫౪౧

క. కామాఖ్యతీర్థరాజం-బీమహి నత్యుత్తమంబు ఋషివర! తెలుపం
గా మఱియొక తీర్థం బెట-నేమంబునఁ దలఁప లేదు నిజముగ నరయన్. ౩౫౪౩

క. అతిశయపుణ్యఫలప్రద-మతులిత మగు నీసుతీర్థ మఖిలభువనసం
తతులందు నని తలంపుము-మతి సురగణవినుతచరిత! మహనీయగుణా!

సీ. చైత్రంబునసితపక్షమున మునీ! యష్టమిని సర్వతీర్థాకృతిని వెలుంగు
కామాఖ్యతీర్థమం దేమానవుఁడు భక్తియుక్తుఁడై విశదశాస్త్రోక్తరీతి
స్నానంబు లౌహిత్యసత్పదంబునఁ జేసి యాజలంబుల జగదంబికాప
దాబ్జంబు లర్చించు, నాపుణ్యుఁ డెంతయు భవబంధనంబులవలనఁ దొలఁగు,
తే. సర్వతీర్థమయంబు సుస్థానవరము-సకలవిబుధసుదుర్లభం బకలుషంబు
తీర్థ మిద్ది మహాదేవి దివ్యయోని-పీఠ మనుపేర వెలయును బృథివియందు.

సీ. ఈచోటఁ బరిపూర్ణ యీశ్వరి సర్వదేవాత్మిక సంపూజనార్హ తాను
వెలయు, లౌహిత్యమ న్విమలంబు విబుధదుర్లభము తీర్థవరంబు ప్రాజ్యపుణ్య
దాయకం బలరు నమేయఫలాభ్యుదయాన్వితం బగుచు నోయమరమాని!
పరమపుణ్యము మది నరయఁగా నష్టమీతిథి యలభ్యంబయి తేజరిల్లు;

తే. నధికసుకృతంబుచే నివి యన్నియును ల-భించు నరునకు, దీన నీపృథ్వియందుఁ
గలుగఁబోదు పునర్జని కనుఁగొనంగ-నట్టి పుణ్యాత్మునకు నెప్పుడైన మౌని!

తే. ఎవ్వఁ డతిశయభక్తి తాహిత్యవారిఁ
బితరులకుఁ దర్పణముచేయు విధియుతముగ,
వాని పితరు లనామయరాబైన బ్రహ్మ
లోకమును చెందువారలు ప్రాకటముగ. ౩౫౪౭

తే. తపము దానంబు మఱియు సద్ధర్మకార్య-మెద్దియైన మహాపుణ్య మిచ్చుచుండు,
నితరతీర్థసహస్రము లెంచి చూడ-దీనికంటెను నధిక మెద్దియును లేదు.

సీ. భువనంబులందు సంపూజ్యయౌ దేవి భవానియే నారదా! వరమునీంద్ర!
పూజ్యపత్రములందుఁ బొగడొందు బిల్వపత్రము తులసీపత్ర మమరవినుతి,
మాయావులందు సమ్మానింపఁగా గదాధరుఁడె శ్రేష్ఠుండయి పరఁగు జగతి,
సకలతీర్థములందుఁ జర్చింప శ్రీయోనిపీఠతీర్థమె వరతీర్థ మగును,

తే. గాన నెవ్వాఁడు వినును శ్రీయోనిపీఠ
దివ్యమాహాత్మ్యమును భక్తి నవ్యయమయి
నట్టి శ్రీదేవిపదవిని నతివిభవము
తోడ నందును మునినాథ! వాఁడు నిజము. ౩౫౪౯

తే. తీర్థరాజమై వెలయు శ్రీదేవియోని
పీఠమాహాత్మ్య మెల్లను విస్తృతముగఁ
దెలిపినాఁడ, రహస్య మిద్ది మునిచంద్ర!
యేది వినఁగోరుదువొ తెల్పు మింక మదిని.'' ౩౫౫౦

డెబ్బదితొమ్మిదవ అధ్యాయము

శ్రీతులసీ, బిల్వపత్ర ప్రభావము

చ. అనవుడు నారదుండు జగదాద్యు మహేశ్వరుఁ గాంచి పల్కె నౌ
య్యన ''హర! తావకంబగు దయన్ వినినాఁడను ద్వన్ముఖాంబుజం
బున నొగి యోనిపీఠవరముఖ్యమహామహిమంబు పాపనా
శనకరమైన యాచరిత స్వాంతము పొంగఁగ విస్తృతంబుగన్. ౩౫౫౧

సీ. శ్రీమహాదేవ! తత్క్షేత్రమాహాత్మ్యంబునందు సందర్భంబు ననుసరించి
బిల్వపత్రముఁ గూర్చి ప్రేమతో సంగ్రహంబుగఁ దెల్పినాఁడవు పూజ్యచరిత!
యతిపుణ్యతమమయి యత్యంతమహిమచే వెలయుచుండినయట్టి బిల్వపత్ర
మహిమంబు వినినాఁడ, మదియందు నిప్పు డత్యంతాద్భుతంబయి యధికఫలద

తే. మైన తులసీప్రభావంబు, నదియుఁగాక-శివుని పూజయు రుద్రాక్షసువిశదవిభ
వంబు సంగ్రహముగ బోధపఱుపఁ గోరు-చున్నవాఁడ''నటంచును విన్నవించె.

వ. మహాదేవుండు నారదున కిట్లు చెప్పందొడంగె ౩౫౫౩

మ. ''కమలాక్షుండు సమస్తలోకపరిరక్షాదీక్షితుం డెల్లలో
కములం బాలనసేయు శ్రీశుఁడు జగత్కల్యాణముం గోరి చి
త్తమునందుం దులసీద్రుమాకృతిని దాఁ దాల్చెన్ మునీంద్రోత్తమో
త్తమ! నిక్కం బని యెంచుమీ మనమునం దాత్పర్య మేపారఁగన్. ౩౫౫౪

ఉ. శ్రీపురుషోత్తమాకృతిగఁ జెల్వగు నీతులసీద్రుమంబు నో
తాపసివర్య! చూచినను దాల్చినఁ దాఁకిన నామకీర్తనం
బేపునఁ జేసినన్ మఱియు నిచ్చినఁ బాపములెల్లఁ బాపుఁ దా
నీపుడమిం జనింగనిన యెట్టి మనుష్యులకేని నారదా! ౩౫౫౫

చ. ఉదయమె లేచి మజ్జనము నుక్తవిధానముతో నొనర్చి య
భ్యుదయదమైన శ్రీతులసి నూర్జితభక్తిని జూచువాఁడు శ్రీ
ప్రదమగు సర్వతీర్థసమవాయమునందునఁ గ్రుంకినట్టు నా
రద! ఫలమందు నిక్కముగ భ్రాంతి యొకించుక లేక నిచ్చలున్. ౩౫౫౬

క. ధరణిన్ శ్రీపురుషోత్తమ-వరతీర్థమునందు భక్తివరదాత గదా
ధరు దర్శించిన పుణ్యం-బిరవొందఁగఁ గల్గుఁ దులసి నీక్షింప మునీ! ౩౫౫౭

సీ. తులసిని సద్భక్తితోఁ గాంచిన దినంబె శుభదినంబనఁగ సంస్తుతికి నెక్కుఁ,
దులసియుండినచోటు తులలేని శోభనస్థానంబు నాఁగఁ బ్రశస్తిఁ గనును,
దులసియుండినయెడఁ గలుగ దుపద్రవం బని విబుధుల వాక్య మలరుచుండుఁ,
దులసిని దర్శింపఁ దోడనె జన్మాంతరార్జితపాపంబు లడఁగిపోవు,

తే. నశుచియైనను శుచియైన నవని నరుఁడు
తులసిదళమును దాఁకినలోనె యఖిల
పాపములనుండి ముక్తినిఁ బడయు, శుద్ధుఁ
డగును నారదమునిచంద్ర! యద్భుతముగ. ౩౫౫౮

క. తులసీస్పర్శన మగు వ్రత,-మిలఁ దులసీస్పర్శనంబె యెన్నఁగ మోక్షం,
బలఘుక్రియ నంతంబునఁ-గలిగించు సుదుర్లభ మగు కైవల్యంబున్. ౩౫౫౯

సీ. తులసీప్రదక్షిణం బిలను సాక్షాద్విష్ణుమూర్తిప్రదక్షిణముగను వెలయుఁ,
దులసీప్రణామంబె తులలేని విష్ణుసాయుజ్యదమహిమలోఁ జెలఁగుచుండుఁ;
దులసీనమస్కృతి సలిపినవానికిఁ దొలఁగుఁ బునర్జన్మవలని భయము,
తులసీవనంబున నిలిచి శ్రీవాణీసహితుఁడయి తా హరి యెలమి నుండు,

తే. సకలదేవమయుండగు సరసిజాక్షుఁ
డెందు వసియించు నందు నే సందియంబు
లేక రుద్రాక్షసమితితోఁ బ్రాకటముగ
నుండు, సావిత్రితో బ్రహ్మ యుండు నందె. ౩౫౬౦

క. కావున నాస్థానంబే-దేవాదిసుదుర్లభంబు దేవమునీ! యం
దేవాఁడు చేరు నాతం-డావిష్ణుపదంబుఁ జేరు నతిమోదమునన్. ౩౫౬౧

ఉ. స్నానము చేసి భక్తిమెయి క్ష్మాస్థలి శ్రీతులసీస్థలంబు సు
జ్ఞానద మెవ్వఁడేని కడుశ్రద్ధఁ బ్రమార్జన మాచరించు, న
వ్వానికి సర్వపాపములు పాయును, స్వర్గనివాససౌఖ్యముల్
మానిజనోత్తమా! కలుగు మానసమందుఁ బ్రమోద మందఁగన్. ౩౫౬౨

సీ. నారదమహామునీంద్ర! భూరిభక్త్యన్వితుండయి నరుం డెవ్వఁ డీయవనియందు
శ్రీతులసీమూలసీమ నుండిన మట్టిఁ గొని తిలకంబుగాఁగను కపాల
మందునఁ గంఠంబునందుఁ గర్ణంబులఁ గరములఁ గుచముల నురమునందు
బ్రహ్మరంధ్రంబునఁ బార్శ్వభాగంబుల వీఁపున నాభియం దోపికమెయిఁ

ఆ. దాల్చు, నట్టివాఁడు ధన్యుండు పుణ్యాత్ముఁ
డయిన వైష్ణవోత్తమాహ్వయుఁ డగు,
నఖిలలోకములను నర్చనార్హుం డయి,
విబుధవరుల వినుతి వెలయు నెపుడు. ౩౫౬౩

క. శ్రీతులసీసువృంతముఁ-బ్రీతిం గొని విష్ణుపూజ విధివిహితముగా
భూతలమునఁ జేయు నరుం-డే తగు వైష్ణవవరాఖ్య నెసఁగు మునీంద్రా!

సీ. ఎవఁడు భక్తిశ్రద్ధ లెనయ వైశాఖకార్తికమాఘముల శ్రుతిస్మృతివిహితముగ
స్నానంబుఁ గావించి సర్వసురేశ్వరు పరమాత్ము శ్రీవిష్ణుపదములందుఁ
దులసీదళం బుంచుఁ, దులలేని పుణ్యంపుఫలము వానికిఁ గల్గు మునినాథ!
కార్తికంబున హరిఁ గడుభక్తిఁ దులసీదళావళిఁ బూజించునట్టివాఁడు

తే. వాజపేయశతంబు లవారిగాఁగఁ
జేసిన ఫలంబు నయుతప్రసిద్ధధేను
దాన మొనరించిన ఫలం బనూనరీతిఁ
బొందు, ధ్రువ మిది, విబుధసంపూజ్యుఁ డగును. ౩౫౬౫

తే. ఎవఁడు తులసీదళంబున నిందిరేశుఁ
బూజనము సల్పు, నవ్వాఁడు పుణ్యతీర్థ
మున హరిం బూజచేసిన భూరిసుకృత
మును గనును మునినాయకా! ముదము మీఱ. ౩౫౬౬

క. తులసీవిరహితముగ ని-య్యిల విద్వాంసుండు కార్య మెది యేని నెసం
జలుపంగరాదు జపతప-జలిపిన సత్ఫలము కలుగఁజాలదు దానన్. ౩౫౬౭

క. తులసీవిరహితసంధ్యా-విలసితకర్మం బదెల్ల విబుధమునీ! ని
ష్ఫలమగు నకాలకృతమై-పొలిసినగతిఁ జూడఁగా నపుణ్యాస్పదమై. ౩౫౬౮

చ. క్షితి నెవఁ డాత్మభక్తిఁ దులసీవనమధ్యమునందు నిష్టక
ల్పితతిఁ దృణంబునన్ హరికిఁ రమ్యగృహంబును గట్టి యందు శ్రీ
పతిని బ్రతిష్ఠచేసి బుధవర్యసమాదృతశాస్త్రరీతి న
ర్చితు హరిఁ జేయు, వాఁ డగును శ్రీపతితుల్యుఁడుగాఁగ నారదా! ౩౫౬౯

తే. ఎవఁడు శ్రీతులసీవృక్ష మెద సతంబు-విష్ణురూపంబుగా నెంచి వినుతిచేసి
త్రివిధవందనములఁ జేయు, భువిని వాఁడు-విష్ణుతుల్యప్రభావుఁడై వెలయు నెపుడు.

తే. శ్రీశ! సకలసురాసురాధీశ! లోక
నాయకా! దేవదేవేశ! నన్ను ఘోర
భవజలధినుండి దాఁటించి పరమకరుణ
రక్షణ మొనర్పవే నీకుఁ బ్రణతు లిడుదు. ౩౫౭౧

ఉ. ఈ వరమంత్రమున్ మదిని నెవ్వఁడు శ్రీతులసీద్రుమస్థలిన్
భావనసేసి వందనము భక్తి నొనర్చి ప్రదక్షిణత్రయం
బో వరమౌని! చేయు నిటు లొప్పుగ నేడు ప్రదక్షిణంబులే
వావిరిచేయు నానరుఁడు బల్మిఁ దరించును సంకటావళుల్. ౩౫౭౨

తే. ఆపగోత్తమ యగు గంగ యరయఁ ద్రిభువ-నాభిరక్షణతత్పర యయ్యె నెట్లు,
లట్లు త్రిభువనపావని యగుచు ద్రుమము-లందుఁ దులసీస్వరూపిణి వయితి వంబ!

తే. మును సురోత్తములగు బ్రహ్మముఖ్యు లెల్ల
రును యజింప జగంబుఁ బావన మొనర్ప
నిల నవతరించితివి జగదేకవంద్య!
భక్తి మ్రొక్కెదఁ దులసీ! కృప న్మనుపుము. ౩౫౭౪

క. ఈవిధమునఁ బ్రత్యహమును-సేవించి నుతించుఁ దులసి క్షితి నెవఁడు మునీం
ద్రా! వాఁ డదెందు నుండిన-దేవి సకలవాంఛితములఁ దృప్తిగ నొసఁగున్.

మ. పరమప్రీతి నెసంగఁ జేయుఁ దులసీపత్రంబు దేవాళికిన్,
దిరమై శ్రీతులసీవనం బలరు నాదేశంబునన్ సర్వని
ర్జరసందోహము నిల్చియుండుఁ బితరు ల్సంతోష ముప్పొంగ నో
వరమౌనీ! తులసీవనస్థలమునన్ వాసంబు గావించుచున్. ౩౫౭౬

చ. పితరులఁ బూజచేయునెడఁ బ్రీతిని శ్రీతులసీదళంబులన్
శ్రుతివిహితంబుగా నొసఁగి శుద్ధమతిన్ భజియింపనో మునీ!
క్షితిఁ దులసీదళం బిడక చేసిన కర్మము వ్యర్థమై ఫలా
న్వితముగ నుండ దెప్పుడు మునిప్రవరోత్తమ! మర్త్యకోటికిన్. ౩౫౭౭

సీ. త్రిభువనాధిపతియా శ్రీవిష్ణుమూర్తికిఁ బితృసమూహమునకు విబుధులకును
సకలదేవీమూర్తి సంచయంబునకును శ్రీతులసీదేవి ప్రీతి నొసఁగు;
లోకముక్తిప్రద లోకైకసమ్మాన్య తులసీమహాదేవి వెలయు నెందు
హవ్యకవ్యంబులం దన్నిట శ్రీతులసీదళంబుల భక్తిచే నొసంగ
తే. వలయుఁ, దులసీద్రుమం బెందు వఱలు, నందు
సంతతంబు భాగీరథి సకలతీర్థ
గణములను గూడి సంతోషకలితచిత్త
యగుచు నివసించు మునినాథ! యమితతృప్తి. ౩౫౭౮

క. కావున శ్రీతులసీద్రుమ-పావనవసతిని నెవండు ప్రాణము వదలున్,
భావింప వాఁడు గంగన్-జీవము విడిచిన ఫలంబుఁ జెందు ధ్రువముగన్.

క. తులసీద్రుమవరమూల-స్థలి నెఱుఁగకయే నెవండు తనువు వదలు న
త్యలఘుగతి ముక్తిఁ జెందును-దులసీవరకరుణ నిజము ధ్రువముగ మానీ!

ఆ. తులసియుండునట్టి స్థలమున నుసిరిక-పుణ్యఎశత నున్న భూరిసుకృత
మిచ్చునట్టి తీర్థమే యగు నచ్చోటు,-దాని మించునట్టి తావు లేదు. ౩౫౮౧

క. తులసియు నుసిరికయును గల-నెలవున బిల్వద్రుమంబు నెలకొనియున్నన్
దులలేని తీర్థవరమై-చెలఁగున్ శ్రీకాశిరీతి సిద్ధిప్రదమై. ౩౫౮౨

మ. అతిపుణ్యప్రదమైన యాస్థలమునం దర్చించు నెవ్వండు స
మ్మతి శంభున్, హరి, నాదిశక్తిని, జగన్నాథున్, సురానీకమున్,
క్షితిఁ బాపంబు లడంచు, నిత్యమును సుశ్రీయుక్తుఁడౌఁ, బుణ్యసం
తతులన్ మోదము నొందువాఁ డగుఁ గసన్ ధన్యాత్ముఁడై నారదా!

క. ఒక బిల్వపత్రమును నెవఁ-డకలంకత శంకరునకు నర్పించు నటన్
సుకృతియయి వాఁడు ముదమునఁ-బ్రకటితశివపదము నొంది భాసిలు మానీ!

క. తులసీధాత్రీదళముల-జలజనయను నర్చనంబు సలిపిన నచటన్
దులలేని విష్ణుపదవికి-నలఘుగతిం జేరు మనుజుఁ డధికసుకృతియై. ౩౫౮౫

తే. ఆస్థలంబున శంభునకైన విష్ణు-దేవునకునైన శ్రీపరదేవికైన
భక్తితో నెవ్వఁ డొక బిల్వపత్రమైన-నొసఁగుఁ, బాపంబుల విముక్తి నొందువాఁడు.

ఉ. ఆ వరపుణ్యదాయకమహాస్థలమందున నెవ్వఁడేని తా
వావిరి దేహము న్వదలు, వాఁడు తలంప నగణ్యపుణ్యుఁడై
సేవలు దేవత ల్సలుపఁ జెచ్చెర మోక్షము నొందు, భూమిపై
దేవమునీ! జనింపఁడు, మదిం బరికింపుము, నమ్మకం బిదా. ౩౫౮౭

క. తులసీధాత్రీబిల్వా-దుల మహిమముఁ జెప్పినాఁడ, స్తుత్యం బిది, యి
య్యుల నెవఁడు దీని విను, ని-య్యుల స్వర్గము నొఁదు వాఁడు పుణ్యుఁడు మునీ!

ఎనుబదియవ అధ్యాయము

రుద్రాక్షప్రభావము

మ. మునినాథా! విను మింకఁ జెప్పెదను సంపూర్ణంబుగా నీకు నే
య్యాన రుద్రాక్షచరిత్ర, మయ్యది రహస్యంబౌఁ, గడుఁ బుణ్యదం
బును నౌఁ, దన్మహిమం బనంతసుకృతంబుం గూర్చు, లోకంబులం
దునఁ దత్తుల్యమహార్హ వస్తు వదియుఁ జోధింప లే దెత్తఱిన్. ౩౫౮౯

క. మునివర! శతజన్మార్జిత-ఘనపాపములైన నడఁగుఁ గడు భక్తియుతిన్
దనువున రుద్రాక్షలఁ దా-ల్చినయట్టి జనాళి కెంతొ చిత్రక్రియతోన్. ౩౫౯౦

సీ. గురువునకును సురవరులకు మఱియు మహాత్ములకును మ్రొక్కనట్టి యఘము
బ్రాహ్మణప్రవరులఁ బరికింప కెదలోన నవలేపమున మ్రొక్కనట్టి యఘము
జన్మకోటులయందు సంతరించిన మించి యంతంబుగాననియట్టి యఘము
ఘనులను బొడఁగన్న వినయంబు చూపక యలసతఁ జేసినయట్టి యఘము

తే. ధరణి నెవ్వఁడు భక్తితోఁ దల ధరించుఁ-దాపసోత్తమ! రుద్రాక్షతతుల నెపుడు,
వాఁడు పొందఁగఁజాలఁ డేపాపమేని,-సత్యమని నమ్మవలయును స్వాంతమందు.

మ. మతి లుబ్ధుండయి యెంగిలిం దినుటచే మర్యాద పోనాడి సూ
నృతముం బల్కక బద్ధభాషణముచేఁ దృప్తిన్ సురాసేవచే
క్షితి జన్మాయుతకోటిసంచితములై చేడ్పాటు గావించు దు
ష్కృతముల్ పోవును గంఠమందున ధరింపన్ భక్తి రుద్రాక్షలన్. ౩౫౯౧

సీ. పరధనహారణంబు పరదేహసంతాడనంబు నింద్యపరిగ్రహంబు మఱియు
నస్పృశ్యవస్తువు లంటుట యనునట్టివానిచేఁ గల్గిన పాపసమితి
జన్మకోటులనుండి సమయక యుండినదైనను రుద్రాక్ష లధికభక్తిఁ
గరమున ధరియింపఁ గడువడిఁ బంచబంగాళమై చనును నిక్కముగ మౌని!

తే. యనృతసంభాషణంబును నాలకించి
సంతరించిన పాపంబు సమసిపోవుఁ
జెవుల రుద్రాక్షలను ధరించిన నిముసము
నందు మునినాథ! లే దిందు సందియంబు. ౩౫౯౩

మ. పరభార్యాగమనంబుచేతను, శ్రుతిప్రాశ స్త్యకర్మంబు లు
ద్ధురతన్ వీడుటచేత, బ్రహ్మవధమున్ దుష్టాత్ముఁడై చేయుటన్
వరుసం గూడిన పాప మెల్ల నడఁగున్ గాయంబు రుద్రాక్ష లె
వ్వరుసన్ సోకఁ ధరించినట్టిఁడున శోభద్రాత్మ! నిక్కంబుగన్. ౩౫౯౪

క. రుద్రాక్షలను ధరించిన-భద్రదునకు మ్రొక్కు నెవఁడు, పాపశతము లు
న్నిద్రత నొనరించిన నా-క్షుద్రత నశియింప ముక్తిఁ జొప్పడఁ గాంచున్.

క. రుద్రాక్షధారి సాక్షా-ద్రుద్రునివలె క్షోణిఁ దిరుగుఁ దోరపువేడ్కన్,
భద్రుండై నిర్భయత ను-పద్రవములు లేక దేవవరపూజ్యుఁ డగున్. ౩౫౯౬

తే. ఒక్క రుద్రాక్షను ధరించి యుర్వి నెవఁడు-శంకరుని నాదిశక్తినే శార్ఙ్గినేని
భక్తిఁ బూజ నొనర్చిన వాఁడు పొందు-భవ్యశంకరసాయుజ్యవరపదంబు.

క. మునినాథా! రుద్రాక్షలఁ-దనువునఁ దాల్పక యెవండు దైవముఁ బిత్ర్యం
బును నైన కర్మ మెది చే-సిన నక్షతనేని లేదు సిద్ధి జగములన్. ౩౫౯౭

తే. ఎవఁడు రుద్రాక్షమాలిక నిద్ధభక్తి-జప మొనర్చును పార్వతీశంకరవర
మంత్రముల, శ్రీమహాదేవు మహితకరుణా-స్వర్గపదవిని బొందు నాజనుఁడు మౌని!

సీ. కాశీపురమునందుఁగాని, జాహ్నవియందు నన్యపుణ్యస్థలులందుఁగాని
రుద్రాక్షరహితుఁడై భద్రదంబగు కార్య మెదియేని గావింప హితవు గాదు,
మహి నేకవక్త్రమై మహిమ కెక్కినయట్టి భవ్యరుద్రాక్ష మెవ్వాని గృహమున
వెలయుచుండునో, వాని వేశ్మంబునందు శ్రీసతి నివసించును సంతతంబు,

తే. వాని కపమృత్యువేని, నిప్పచ్చరంబు
గాని యెపుడైనఁ గలుగ దో మౌనినాథ!
సత్య మియ్యది, నమ్ముము స్వాంతమందు,
సందియం బిసుమంతయుఁ జన దొనర్ప. ౩౬౦౦

తే. ఏకముఖ మగు రుద్రాక్ష మెవఁడు కంఠ
మందయిన భుజముననైన నధికభక్తిఁ
దాల్చు, వానికి శంభుఁడు తాఁ బ్రసన్నుఁ
డగు సుదుర్లభుఁ డయ్యు నో యమరమౌని! ౩౬౦౧

తే. ఏకముఖయుతరుద్రాక్ష నిల ధరించు-నెవఁడు, వాఁడు కావించిన ప్రవిశదవర
ధర్మకర్మము లెల్లను దప్పక సుఫ-లప్రదము లయి యుండు సులలితచిత్త!

సీ. రుద్రాక్షధారి యేత్సుద్రస్థలంబునఁ గాయంబు వదలినఁ గనును ముక్తి,
సందియం బిద్దానఁ బొందఁగఁబోలదు నారదా! రుద్రాక్షధారణంబు
గంగాసరిత్తునఁ గడు ఫలదం బగు, నంతకంటెను గాశియందు నధిక
ఫలవంత మగును, దత్ఫల మింకఁ దెలుపంగవలయునే వేఱుగాఁ బరమమౌని!
తే. సకలపాపనాశకమయి జగతి వెలుఁగు
నట్టి రుద్రాక్షమహిమంబు నఖిలము ముని!
సంగ్రహముగాఁగఁ దెలిపితి, సాధురీతి
నాత్మయందున నిలుపుమా యనవరతము. ౩౬౦౩

సీ. భక్తితో నెవ్వఁ డీభవ్యరుద్రాక్షమహామహిమంబును నాలకించు,
సురదుర్లభంబయి పరఁగు శ్రీశంభుని సత్పదంబును బొందు శాశ్వతముగ,
బిల్వమూలంబునఁ బ్రీతిఁ జతుర్దశి నుపవాసమును జేసి యొగిఁ బఠించు
వాఁడు మహాపాపవారంబులను జన్మశతసంచితంబుల నతులితగతి
తే. ముక్తిఁ బొందుఁ, గురుక్షేత్రమునను గాశిఁ-గడఁక గంగాసముద్రసంగమమునందు
సేతుబంధస్థలంబున స్థిరమనీషఁ-బఠన మొనరింప నఖిలపాపములు దొలఁగు.

క. శివసన్నిధి శివరాత్రిని-బ్రవిమలరుద్రాక్షమహిమ భక్తిఁ బఠింపన్
శివలోక మబ్బు నరునకుఁ,-దవులవు పాపంబు లెవియుఁ దాపసవర్యా!

ఎనుఁబదియొకటవ అధ్యాయము

పార్థివపూజావిధానము - ప్రభావము

మ. వినుమా నారద! భక్తిసంయుతుఁడవై విశ్వేశపూజావిధిన్
వినిపింతుం గ్రమ మొప్ప సంగ్రహముగా విద్వద్వరా! యీ భువిన్
మనుజు ల్ధర్మము లెల్ల వీడి కలిలో మర్యాద పోనాడి నె
మ్మనముం గిల్బిషకార్యము ల్సలుప సంభావింతు రెల్లప్పుడున్. ౩౬౦౬

సీ. పరదారరతులయి నిరతిఁ బరద్రోహచింతనాత్ములు లయి స్థిరత వదలి,
సత్యధర్మంబుల సంపూర్ణముగఁ ద్రోచి పరులను నిందింపఁ బట్టుపట్టి,
పరవిత్తములనెల్ల వంచనతోడ హరింపఁగాఁ బూనిక పెంపుఁ దవిలి,
గురుభక్తిహీనులై గురువరనిందాపరాయణులై స్వకార్యముల వీడి

తే. ధనములం దాశ మించఁగా ననయము మది
సంభ్రమింపఁగ నిట్టటు సంచరించు
చుందు రెల్లరు మనుజులు, సందియంబు
వలదు మునినాథ! నిక్కంబు కలియుగమున. ౩౬౦౭

ఆ. ధరణిసురులు శూద్రధర్మంబులందు ని-త్యమును దవిలియుందు, రదియుఁగాక
శ్రుతితపోవిహీను లతులిత యోగని-ష్ఠావివర్జితు లయి సంచరింత్రు. ౩౬౦౮

తే. నరులు శిశ్నోదరపరాయణక్రియాంచి-తాత్ము లగుదురు కలివేళ, నంగనలు స్వ
భర్తృభక్తివిహీనలై స్వైరవృత్తి-నుందు రోనారదమునీంద్ర! యుక్కు మిగిలి.

క. వనితలు శ్వశ్రూద్రోహమె-మనమునఁ గొని భ్రష్టలగుచు మలయుదు రెపుడున్,
విను మల్పసస్య యగుచు న-వనియును బండకయయుండు బాగుగఁ గలిలోన్.

క. నరు లన్నవివర్జితులై-పరఁగుదు రనిశంబు, భూమిపతు లెల్లను సం
బరమునఁ గరగ్రహమె యా-దరువుగఁ గైకొంద్రు నీచకనుధరు లగుచున్.

చ. కలియుగమందు నీచులకుఁ గల్గును నున్నతి, సజ్జనాళికిన్
గలుగును హాని, యీవిధముగాఁ గలుషాత్ములు మర్త్య లౌదు, ర
త్యలఘుభయంకరంబయిన యీసమయంబున ముక్తిఁ బొందఁ దా
వలమయి పొల్చు శంకరుని పాదయుగార్చనమే మహామునీ! ౩౬౧౨

క. విను మవధానముతో డుత-ననఘా! శివశక్తిరూప మగు లింగము మృ
త్తున నొనరిచి పూజించిన-నెనయదు కలిబాధ వాని కెత్తఱినైనన్. ౩౬౧౩

క. మునినాథా! యీ పార్థివ-ఘనలింగార్చనముకంటెఁ గలుగదు వేఱొం
డనువయిన స్వల్పసాధన-మనఘము కలిభీతి నణఁప నర్హం బెందున్. ౩౬౧౪

తే. మూర్తి మృత్తికచేతను, బూజ బిల్వ
దళములను, వాద్యమునయత్నికలితవదన
మున, ఫలంబు సాయుజ్యదము నయి వెలయు
విశ్వనాథుఁడె దేవుండు బీద కరయ. ౩౬౧౫

ఉ. శైవుఁడు వైష్ణవుండు మఱి శాక్తుఁడె యైనను ముందు శంకరున్
భావమునందు నిల్పి దృఢభక్తిని బూజల నంత నిష్టమౌ
దైవముఁ బూజసేయనగుఁ దాపసవర్య! తలంపఁగా మహా
దేవుని యర్చనక్రియకు దీటగు కార్యము లేదు నారదా! ౩౬౧౬

సీ. ముందుఁ బార్థివలింగమును బిల్వపత్రాళి నర్చింపవలయును నధికభక్తి,
నట్లు గావింపక యాచరించిన పూజ లెల్లను వేదవిహీను లాచ

రించిన కర్మలరీతి నిష్ఫలములై చను, నారదా! దర్పమునను మోహా
కలితుఁడై యెవ్వాఁడు గావించును విరుద్ధముగ, వాఁడు దుర్గతిఁ బొందు నిజము,
తే. వాని సత్కర్మ లెల్లను వ్యర్థము లగు,-ఘోరనరకంబులందునఁ గూలు, నెందు
నిష్కృతియె లేదు వానికి నెమకిచూడ,-భక్తులందునఁ జేర్పంగఁబడఁడు వాఁడు.

తే. సకలలోకేశ్వరుండైన శంభుమూర్తి
నెవఁడు ధ్యానించు నియతితోఁ బ్రవిమలమతి,
వాఁడు తత్సామ్యమును బొంది వసుధ మరలఁ
బుట్టుకను గాంచఁ డెన్నఁడు మునివరేణ్య! ౩౬౧౮

తే. సర్వదేవస్వరూపుని శంకరు శివు-నెవఁడు పూజించు సద్భక్తిఁ దవిలి మదిని
వాఁడు సకలదురితముక్తిఁ బడసి పరమ-శివపదంబున మోదించు దివిజవినుత!

క. పాద్యంబు శివునకును భ-క్త్యుద్యతుఁడై యొసఁగినట్టి యురుగుణుఁ డుర్వీ
వేద్యుండయి దురితౌఘవి-భేద్యుండయి స్వర్గ మొందు విబుధమునీంద్రా!

సీ. అర్ఘ్యంబు మున్నగునట్టి వెయ్యదియైన శివునకు నర్పింపఁ జిత్తమందుఁ
దలఁచిన మనుజుఁడు తా సర్వమును లింగమున కూర్ధ్వభాగంబునను సభక్తి
కముగ నల్పాల్పముగా నప్పనము చేయఁదగు నోమహామతీ! తత్ప్రసాద
మును గ్రహింపఁగరాదు, పూన్కి భుజింపఁగా నర్హత లేదు మర్త్యాళి కరయ,
తే. విష్ణుమూర్తిప్రసాదంబు ప్రీతితో గ్ర
హింపనగు, నన్యులు గ్రహింప హితవుగాదు,
తెలియ కొనరింప శ్రీవిష్ణుదేవరోష
పాత్రుఁ డగు, నిజ మిద్ది తాపసవరేణ్య! ౩౬౨౧

సీ. సకలవస్తువులును జను గ్రాహ్యములుగ సాలగ్రామదివ్యశిలను స్పృశింప
శంకరత్వముఁ బొందు, శ్రద్ధ ననాది లింగార్పితనిర్మాల్య మనుభవింపఁ
దాఁ బరమేశ్వరతను బొందు మర్త్యుఁడు, శివుని ప్రసాదంబు స్వీకరింప
యమశిక్షఁ బొందఁడు హరుని నభక్తినే భక్తినే జనుఁడు సపర్యసలుప,
తే. సత్య మిమ్మాట, యారోగ్యసౌఖ్యభాగ్య
సంతతులు వృద్ధియగు, భువి జనుఁ డెవండు
భక్తి లింగార్చనము సల్పు, భద్ర మొదవు,
మానవులలోన నుత్తమమహిమ గలుగు. ౩౬౨౨

తే. శివుని సన్నిధి నృత్యంబు చేయు నెవఁడు
భక్తిసంయుక్తుఁ డగుచు, శాంభవపదంబు

నొందు నారద! చిరకాల మున్నతసుఖ
ములను బొందుచు వాఁడు సమ్మోద మొందు. ౩౬౨౩

క. మనుజుం డెవ్వఁడు గీతం-బును వాద్యము శంభుసముఖమునఁ గావించున్,
విను, ప్రమథేశ్వరుఁడై వాఁ-డనయుఁ దదీయాంతికంబుఁ గృతసుకృతయుతిన్.

చ. హరపదపద్మపూజనము నత్యధికంబగు భక్తిఁ జేయు నె
వ్వారుషుఁడు, వాఁడు నిచ్చలును బూని వసించు ప్రదేశ మెంతయున్
సురనది లేని భాగముగఁ జొప్పడి హీనత నొందియుండినన్
వరసుకృతంబుచే నెసఁగి భాసిలు దేశములందుఁ బూజ్యమై. ౩౬౨౪

ఆ. అవని బిల్వమూలమందు మహాదేవు-నర్చనంబు భక్తి నాచరించు
నట్టి నరుఁడు పొందు నశ్వమేధసహస్ర-ముల నొనర్చినట్టి ఫలము నిజము.

చ. సురనదితీరమం దెవఁడు శుద్ధమనంబునఁ జేరి శ్రీమహే
శ్వరు వరబిల్వపత్రముల భక్తి సమర్చన మాచరించు, న
ప్పురుషుఁడు పాపపంక్తులను బూని యొనర్చినయట్టిఁడైన, న
త్తరుణమునందె ముక్తిఁ గని తా శివసన్నిధి కేగు నారదా! ౩౬౨౫

సీ. కాశీపురంబునఁ గడులీల శంకరుఁ బూజించువానికి ముక్తి నొసఁగు
నామహాదేవుఁడే యోమునిశ్రేష్ఠ! యీభరతఖండంబునఁ బరఁగు నధిక
పుణ్యప్రదంబగు భూరిస్థలం బెందు నందు విశ్వేశ్వరు నర్చనంబు
సలిపినవాఁ బునర్జన్మంబు గలుగదు, గంగాధునివార్ధిసంగమం బ
తే. నంగ హిమగిరికిని దక్షిణంబునందుఁ-జెలఁగు సకలార్థఫలదమై క్షేత్రవర్య
మంతదనుకను నుండు నియ్యవని యధిక-పుణ్యవంతంబు నిర్జరమునివరేణ్య!

ఉ. ఈ వరదేశమందున మహేశ్వరపూజకు సాటిచేయఁగా
నేవియుఁ బుణ్యకర్మము లవెయ్యెడనేనియుఁ గానరావు పా
పావళినెల్లఁ బాపుటకు, భాగ్య మొసంగ, విపన్నివృత్తికిన్,
దావలమాను నీశపదతామరసార్చన మొక్కఁడే ముని! ౩౬౨౯

తే. పుణ్యదములైన కర్మము లొప్పదలు లెక్క
కెక్కుడయి పాపహరములై యెసఁగి శాస్త్ర
వితతిసూక్తుల, వానిలో వెలయు నుత్త
మోత్తమంబయి శివపూజ యున్నతముగ. ౩౬౩౦

సీ. సురమునీ! పార్వతీపరమేశ్వరుల దివ్యనామసంకీర్తనమే మహాఫ
లావహంబయి వెల్గు నాదిదుర్గాపూజనంబును శ్రీరామనామకీర్త

నంబు, దదీయగుణశ్రవణంబును, బుణ్యతీర్థాటనంబును సమస్త
పాతకపంక్తులఁ బాఱంగఁదోలును, గలియుగంబున వీనికంటె నుత్త

తే. మంబులగు కార్యములు లేవు, మర్త్యుఁ డెవఁడు
శంకరుని నామముల నెద సంస్మరించి
యెట్టికార్యంబు బొనర్చినయేని శ్రుతివి
హితము, నక్షయ్యతమము నై యొసఁగుచుండు. ౩౬౩౧

క. హర! విశ్వనాథ! విశ్వే-శ్వర! గౌరీవల్లభా! శివా! సంతృప్తిన్
గరుణింపు మనుచు నెవఁ డు-ర్వర శంకరు నొక్కమాఱు ప్రార్థించు మదిన్.

తే. వాని సంరక్షణముచేయఁ బ్రమథగణస-మేతుఁడై శూలధారియై ప్రీతితోడ
వచ్చు శంకరుఁ డాపన్నివారకుండు-త్వరితగమనంబునను నారదమునిచంద్ర!

క. శివనామమును స్మరించుచు-నెవఁడు శరీరంబు విడుచు నిలపై సాక్షా
చ్ఛివతత్త్వ మొందుఁ బాప-ప్రవితతి గావించినట్టివాఁడేని మునీ! ౩౬౩౨

క. డెందంబునఁ బరమేశ్వరుఁ-బొందికతో నిలిపి తలఁప మునిచంద్రా! యా
కందువఁ దీర్థములెల్లను-సందియ మొందక వసించు సంయమివర్యా! ౩౬౩౩

క. అడిగిన యర్థం బంతయు-నుడుగక వచియించినాఁడ నురుపుణ్యదమై
యెడతెగక భద్రముల నిడు-మృడుపూజావిధము సకలవృజినహరంబున్.

క. ఎవఁ డీమహిమము శ్రద్ధం-దవిలి వినును, జదువు, వాఁడు తథ్యముగాఁ బా
పవిముక్తుండై పరమం-బవు పదముం బొందు నారదా! మునినాథా!" ౩౬౩౪

గ్రంథఫలస్తుతి

వ. వ్యాసుండు జైమినిమునీంద్రున కిట్లనియె. ౩౬౩౫

చ. "మునివరుఁడైన నారదుఁడు పూనికఁ బ్రశ్న మొనర్ప నిట్టు లా
య్యనఁ బరమేశ్వరుండు తన యాత్మను సంతసమంది నిత్యశో
భనమును బుణ్యమై యొసఁగు వాక్యముగాఁగను జెప్పె జైమినీ!
యనఘ! వచింతు నింక విను మాదృతి దీని మహత్త్వ మెంతయున్. ౩౬౩౬

సీ. భక్తితో నీమహాభాగవతంబును వినినన్ బఠించిన మనుజునకును
నిహలోకమున సకలేప్సితభోగభాగ్యంబులు సిద్ధించు నతిశయముగఁ,
బరలోకమున నిత్యభద్రంబు లెల్లను బొందుఁ గైవల్యము నొందు నిజము,
పరమగోప్యము మహాభాగవతము దీనిఁ బరమేశ్వరుఁడు నిజపాదపద్మ

తే. భక్తుఁడౌ నారదమహర్షి వర్యునకును
దెలిపెఁ గరుణించి, జైమినీ! యిలను నెవని

భవనమున నుండు నీమహాభాగవతము,
వాని నాపద లంటఁగాఁబూన వెపుడు. ౩౬౪౦

తే. ఎవఁడు శ్రీహరిసన్నిధి నీపురాణ
వరము సద్భక్తి వినిపించు, వాఁడు సకల
పాపములనుండి ముక్తుఁడై వఱలు నపుడె
జైమినిమునీంద్ర! సత్యంబు సత్య మనఘ! ౩౬౪౧

చ. సరవి ననేకకోటిశతజన్మములందునఁ జేసినట్టి యా
దురితసమూహమంతయును దోరపుభక్తి మహాపురాణమై
పరఁగిన దీనినిఁ వినినవాఁడు విముక్తిని బొంది యప్పుడే
పరమపదంబు నొందు మునివర్య! త్రిసత్యముగాఁగ జైమినీ! ౩౬౪౨

శ్రితజనగణవాంఛాసిద్ధి సంపత్ప్రధర్త్రీ
నతసుర సముదాయానంత సమ్మోదకర్త్రీ
తతమునిజనచిత్తధ్యాన గమ్యైకమూర్తీ
శతమఖముఖ నిత్యస్థైర్యవిఖ్యాతకీర్తీ. ౩౬౪౩

గద్యము

ఇది శ్రీలలితాత్రిపురసుందరీ కరుణాకటాక్షవీక్షణ సమాసాదితోభయభాషాకవితావిభవ, జనమంచి వంశప్రభవ, కాశ్యపసగోత్రోద్భవ, సుబ్బయార్యతనూభవ, కావ్యపురాణతీర్థ విద్వద్బిరుదవైభవ వేంకటసుబ్రహ్మణ్యశర్మ విరచితకృతులయందు శ్రీమహాభాగవత పురాణమునందు షష్ఠాంశము.

శ్రీ మహాత్రిపురసుందరీమాణిక్యమహాపాదుకార్పణమస్తు.

శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ

PRINTED AT THE LIBERTY PRESS, MADRAS-1